ఈనాడు
అల్లూరి సీతారామరాజు
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

ఆగమేఘాలపై అనుమతులు.. ఆదిలోనే ఆటంకాలు

ఎలుగురాతిబంద రహదారి పనులకు బ్రేక్

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

అల్లూరి జిల్లాలోని గిరి పల్లెలు కొండల మధ్య ఎక్కడో దూరాన విసిరిపడేసినట్లు ఉంటాయి. అటువంటి గిరిపల్లే ఎలుగురాతిబంద. గూడెంకొత్తవీధి మండలం దేవరాపల్లి పంచాయతీలోని మారుమూలన ఉంది. ఇక్కడ ఉన్న ఇళ్లు కేవలం ఏడు. పిల్లా పెద్దా అంతా కలపి ఉన్న జనాభా కేవలం 30 మంది. అతితక్కువ జనాభా, ఆవాసాలు ఉన్న ఈ గిరి పల్లెకు కూటమి ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులతో తారురోడ్డు మంజూరు చేసింది. అటవీ శాఖ అనుమతులు లభించాయి. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కూటమి నాయకులతో కలసి ఇటీవల రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. తీరా పనులను ప్రారంభించేందుకు గుత్తేదారులు సిద్ధం కాగా.. గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి కూటమి ప్రభుత్వం రూ. రెండు కోట్లతో రహదారిని మంజూరు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని.. అయితే తాము సూచించిన మార్గంలో కాకుండా మరో మార్గం ద్వారా రహదారిని నిర్మించడం వల్ల తాము అడ్డుకుంటున్నట్లు ఇక్కడి గిరిజనులు చెబుతున్నారు. ఇదే విషయంపై గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ అభిప్రాయాన్ని తెలిపారు.

■ ఈ గ్రామానికి చెందిన గిరి యువకుడు లకే బాబూరావు ఇటీవల సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో బాబూరావును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆ సమయంలో బాబూరావు తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలంటూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే విషయాన్ని అక్కడే ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు చెప్పడంతో ఆయన తక్షణమే స్పందించారు. సభా వేదికపై నుంచే ఎలుగురాతిబంద గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి అనుమతులను గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు మంజూరు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు ఆగమేఘాలమీద ఈ గ్రామానికి రూ. 2 కోట్ల ఉపాధి నిధులతో 2.4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు. అటవీ శాఖతోసహా అన్ని అనుమతులూ వచ్చాయి. తీరా పనులు ప్రారంభించాలనుకునే సరికి ఈ మార్గంలో రోడ్డు నిర్మాణం వద్దంటూ ఎలుగురాతిబంద గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పనులకు బ్రేక్ పడింది.

రహదారిని పరిశీలిస్తున్న ఈఈ డేవిడ్‌రాజ్, డీఈ రఘునందనరావు నాయుడు

■ ఎలుగురాతిబంద గిరిజనుల విజ్ఞాపన, అభ్యంతరాల మేరకు గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు గ్రామాన్ని సందర్శించి. . రహదారి నిర్మాణానికి సూచించిన ప్రదేశాలను పరిశీలించారు. పాడేరు ఈఈ డేవిడ్‌రాజ్, చింతపల్లి డీఈ రఘునందనరావునాయుడు గురువారం సాయంత్రం గ్రామానికి వెళ్లారు. ప్రణాళికలు, అంచనాలు, సాంకేతిక ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో పరిస్థితిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచి సిరిబాల బుజ్జిబాబు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ సిబ్బంది పరమేశ్ పాల్గొన్నారు.

■ **అదనంగా నిధులు అవసరం:** ఎలుగురాతిబంద గ్రామానికి తీములబంద గ్రామం మీదుగా రహదారిని నిర్మించాలని గిరిజనులు సూచిస్తున్నారు. ఆ మార్గంలో రైతుల పంటభూములు, కొండచరియలు ఉన్నాయి. ఇందుకు భూములు సేకరించాలి. అటవీ, పోలీసు శాఖ అనుమతులు ఉండాలి. వీటన్నింటికీ మళ్లీ సర్వే చేసి అనుమతులు రావాలంటే సమయం పడుతుంది. మార్చిలోగా అనుమతులు రావడం కష్టం. దీనికి తోడు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. రెండు కోట్లు చాలవు. అదనంగా మరో రూ.నాలుగైదు కోట్లు ఖర్చవుతాయి. ఎలుగురాతిబంద గిరిజనుల కోరిక మేరకు అక్కడ వాస్తవ పరిస్థితిపై మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం.

– రఘునందనరావునాయుడు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ డీఈ

ఆపదలో కొండంత ‘శక్తి’

అనంతగిరి, న్యూస్‌టుడే: మహిళలు, యువతులు ఆపదలో చిక్కుకున్నప్పుడు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గత ఏడాది మార్చిలో ఈసేవలు ప్రారంభమయ్యాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ యాప్‌ను ఎప్పటికప్పుడు నవీకరిస్తుండటంతో నిమిషాల వ్యవధిలోనే బాధితులకు న్యాయం జరిగేందుకు అవకాశం ఉంది. చిన్నారులు, పురుషులు సైతం ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

డౌన్‌లోడ్ ఇలా...: గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి శక్తి యాప్ అని టైప్ చేయగానే కనిపిస్తుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకుని పేరు, చరవాణి నంబరు, జెండర్, వయస్సు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు, చిరునామా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మనకు కావాల్సిన భాషను ఎంచుకోవచ్చు. లొకేషన్‌తోపాటు వివిధ రకాల ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.

కదిపితే చాలు..: యాప్‌ను తెరవగానే నాలుగు విభాగాలు కనిపిస్తాయి. ఎస్‌ఓఎస్‌ను తాకగానే పది సెకండ్ల ఆడియో, వీడియో రికార్డు అయ్యి కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అంతేకాకుండా హ్యాండ్ షేక్ ఆప్షన్ ఆన్ చేసి పెట్టుకుంటే ఆపద సమయంలో చరవాణిని షేక్ చేస్తే ఆడియో, వీడియో వెళ్తాయి. లొకేషన్ ఆధారంగా సత్వరం పోలీసులు అక్కడకు చేరుకుంటారు.

అందుబాటులోని సేవలివీ...: ★ వ్యక్తిగతంగా, సమాజం, కుటుంబపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా చెప్పొచ్చు. ★ అసాంఘిక కార్యకలాపాలు, జూదం, గంజాయి రవాణా, తదితర వాటిని గురించి తెలియజేయవచ్చు. ★ అదృశ్యం, దాడులు, వేధింపులు, గృహ హింస, ఆర్థిక మోసం, ప్రేమ వ్యవహారాలపై వివరాలు నమోదు చేయొచ్చు. ★ ఒంటరిగా ఉంటే భోజనం, వసతి, ఇతరత్రా సేవల కోసం ఆశ్రయించొచ్చు. ★ దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సహాయం అవసరమని భావిస్తే సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఆన్ చేసుకుంటే గమ్యస్థానం చేరేవరకు నిరంతరం పర్యవేక్షిస్తారు.

సెలవులో ఇన్‌ఛార్జి జేసీ

పాడేరు, న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ ఈనెల 21 నుంచి 28 వరకు సెలవుపై వెళ్లనున్నారు. మేఘాలయ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఆదిత్యవర్మ, శ్రీపూజల వివాహ రిజిస్ట్రేషన్ విశాఖలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల జరిగింది. ఈనెల 24న ఉత్తరప్రదేశ్‌లో సంప్రదాయబద్ధంగా వివాహ వేడుక జరగనుంది. ఈ నేపథ్యంలో ఆమె సెలవుపై వెళ్తున్నారు. ఇన్‌ఛార్జి పీఓగా కలెక్టర్ వ్యవహరించనున్నట్లు ఐటీడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: శుక్రవారం సాయంత్రం 6:10 గం॥లకు
సహరి: శనివారం తెల్లవారుజాము 5:02 గం॥లకు

కళ్ల ముందు శౌర్యం.. ఇదీ దేశ ధైర్యం!!

● మిలన్ విన్యాసాల్లో అబ్బురపరిచిన సాహసాలు
● ఆకట్టుకున్న అంతర్జాతీయ సిటీ పరేడ్

ఈనాడు–విశాఖపట్నం: విశాఖ సాగర తీరం ‘ఓ సైనికా’ అంటూ దేశభక్తితో మార్మోగింది. భారత నావికాదళం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మిలన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. సముద్ర రక్షణలో నావికుల శౌర్యాన్ని ప్రతిబింబిస్తూ చేపట్టిన విన్యాసాలు, కవాతులు ప్రతి ఒక్కరిని కట్టిపడేశాయి. ఆర్కేబీచ్‌లో ప్రతిధ్వనించిన బ్యాండ్‌లు, గర్వాన్ని నింపుతున్న నావికుల అడుగుల మోతలు తీర ప్రాంత వాతావరణానికి మరింత ఉత్సవ కళను అద్దాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తీరంలో యుద్ధ ట్యాంకులు

పైలెట్‌ల శిక్షణకు, దాడులకు ఉపయోగించే ఫాంటమ్స్ అని పిలిచే హాక్- ఏజేటీ.. ఫైటర్ జెట్ విమానాల నుంచి బాంబులు వదిలిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా సాగాయి.

నేవీ సిబ్బంది విన్యాసాలను తిలకిస్తున్న ప్రజలు

★ నిశ్శబ్దంగా సముద్ర లోతుల్లో దాక్కొని శత్రు నౌకలు, జలాంతర్గాములపై దాడులకు ఉపయోగించే నేవీ సబ్‌మెరైన్ల రహస్య, విధ్వంసక శక్తిని తెలియజేసేలా ‘సబ్‌మెరైన్ సెయిల్ పాస్ట్’ పేరుతో నిర్వహించిన ప్రదర్శన కనువిందుగా సాగింది.

★ దేశంలోని అత్యున్నత మెరైన్ కమాండోలు (మార్కోస్) ధ్రువ్ హెలికాప్టర్ల నుంచి ప్రదర్శించిన ధైర్య సాహసాలు మాటల్లో వర్ణించలేనివి.

★ ఆయిల్ రిగ్ భారీ పేలుడు, ఆ వెంటనే మార్కోస్ దాడి.. పడవలపై ఆరెంజ్ పొగను వదులుతూ మిషన్ విజయవంతమంటూ ప్రదర్శించిన తీరు చూసి తీరాల్సిందే అన్నట్లు సాగింది.

● యాంటీ సబ్‌మెరైన్ రాకెట్లను శత్రు జలాంతర్గాములు, నౌకలపైకి ఎలా ఫైర్ చేస్తారనే డెమో ఆకట్టుకుంది.

సిటీ పరేడ్‌లో ఆకట్టుకున్న కవాతు

★ కమాండోలు తమ పారాచూట్‌ల సాయంతో శత్రు భూభాగంలో కచ్చితంగా ఎలా నైపుణ్యంతో దిగుతారో ప్రదర్శించారు.

★ నేవీ కార్యకలాపాల్లో అంతర్భాగమైన హెలికాప్టర్లు సముద్రంలో కీలక పాత్ర పోషిస్తాయి. యుద్ధ, నావికా నౌకలపై అవి ఎలా దిగుతాయి.. ఎలా నౌకలపై నుంచి ఎగురుతాయి అనే పైలెట్‌ల నైపుణ్యాలను ‘హెలో ల్యాండింగ్ డెమో’ పేరుతో నిర్వహించారు.

డ్రోన్‌షోలో..

★ ఓడలో నావికుల జీవితాన్ని, విధులను ప్రతిబింబించేలా శారీరకంగా, ఆరోగ్యంగా ఉండటానికి ‘హార్న్ పైప్’ నృత్యం ఎంతో వినోదం కలిగిస్తుంది. సీ క్యాడెట్ కార్ప్స్ ప్రదర్శించిన ఈ నృత్యం అలరించింది.

★ చేతక్ హెలికాప్టర్లను ఏంజెల్స్ అని పిలుస్తారు. నాలుగు చేతక్‌లు సామర్థ్యాలను సమన్వయంగా ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది.

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు 24న

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 24వ తేదీన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అండర్-18 కేటగిరిలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జిల్లావాసులై ఉండాలి. సైకిల్, ఆధార్ కార్డు నకలుతో హాజరుకావాలన్నారు. ఎంపికైనవారు రాష్ట్రస్థాయి శాప్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90002 74225, 63031 93400 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

WALK-IN-INTERVIEW

పేరం గ్రూప్
Peram Group

PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

❖ADVOCATES	6 No's (2-3 yrs. exp)
❖OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
❖ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
❖ADMINS	8 No's (1-5 yrs. exp)
❖DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
❖STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
❖MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
❖DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
❖MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
❖VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
❖FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
❖EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
❖VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
❖DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
❖PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
❖PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
❖JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
❖SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
❖SURVEYORS	2 No's (2-3 yrs. exp)
❖LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
❖LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
❖CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
❖BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
❖MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
❖ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
❖CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)

D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969

మురిపిస్తున్న మిరియాలు

హుకుంపేట, న్యూస్‌టుడే: గిరిజనుల జీవితాలను మార్చేసిన పంటల్లో ప్రధానమైనది మిరియాలు. మిరియాలను సేకరించి వాటిని ఎండబెట్టి సంతల్లో విక్రయించేందుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. కాఫీ తోటల్లో అంతర పంటగా వేసే ఈ మిరియాల పంట గిరి రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. గత మూడు సంవత్సరాలుగా కేజీ సుమారు రూ.450 నుంచి రూ.550 వరకు ధర పలికింది. ఈ సీజన్ ప్రారంభంలోనే కేజీ దాదాపు రూ.550 నుంచి రూ.650 వరకు సంతల్లో విక్రయిస్తున్నారు. ధరలు అధికంగా ఉండటంతో గ్రామాల్లో పంట సేకరణ ముమ్మరంగా సాగుతోంది. ఎంతో కష్టపడి సేకరించి.. వాటిని బాగు చేసి సంతలకు తీసుకొస్తే దళారులు, వ్యాపారులు కాటాల ద్వారా మోసం చేసి రైతులకు డబ్బులు రాకుండా దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 100 కేజీల కొనుగోలులో దళారులు సుమారు 5 కేజీల వరకు మోసం చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా పంట కొనుగోలు చేసి తమకు నష్టం రాకుండా చూడాలని పలువురు విన్నవిస్తున్నారు.

గిరిజనులు సేకరించిన మిరియాల గుత్తులు

మన్యం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మన్యం ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు నీతి ఆయోగ్ చొరవతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) సహకారంతో గంభీరం ఐఐఎంవీలో గురువారం కార్యశాల నిర్వహించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ ప్రారంభించిన సంపూర్ణత అభియాన్ 2.0 కింద ఆకాంక్షిత జిల్లాల ఎంపికలో అల్లూరి ఉందన్నారు. ఈ మేరకు ఆరు నెలల ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో 213 కీలక అంశాల ఆధారంగా 627 గృహాల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించడం జరిగిందన్నారు. వీటిపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ సంపూర్ణత అభియాన్ 2.0 ప్రాజెక్టు అధ్యాపకులు, జిల్లా ఉన్నతాధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక, పర్యాటకపరంగా అల్లూరి జిల్లా సమృద్ధి వనరులతో కలిగి ఉందన్నారు. ఐదు ఇతివృత్తాలు, 46 అంశాల్లో పని తీరు మెరుగుపరచడానికి సంపూర్ణత అభియాన్ కింద ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 మేరకు ఇక్కడ లభిస్తున్న కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఉత్పత్తులపై దృష్టి సారించినట్లు తెలిపారు. అనంతరం ఐఐఎంవీ పరిశోధన బృందాన్ని ప్రశంసించారు. ఐఐఎంవీ అధ్యాపక బృందం అంబేడ్కర్, విజయ మారిశెట్టి, అభినాష్ సింగ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ అధ్యాపకులు, జిల్లా అధికారులు

చేతి రాతలో గిరి విద్యార్థినుల ప్రతిభ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: చేతిరాత, కలరింగ్ విభాగాల్లో అరకులోయ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులు రాణించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన స్టూడెంట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత ఏడాది నవంబరు 28న జరిగిన జాతీయ కలరింగ్, హ్యాండ్‌రైటింగ్-2025 పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభచాటిన విద్యార్థినులు, ఉపాధ్యాయులకు గురువారం పాఠశాలలో సహాయ గిరిజన సంక్షేమాధికారి రమణమూర్తి, మండల విద్యాశాఖాధికారులు భారతీరత్నం, త్రినాథరావు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ పోటీల్లో పాఠశాల నుంచి 190 మంది విద్యార్థులు పాల్గొనగా.. నలుగురు బాలికలు నేషనల్ కళాగౌరవ్ అవార్డుకు, మరో నలుగురు విద్యార్థినులు నేషనల్ కళాభూషణ్ అవార్డు సాధించినట్లు తెలిపారు. పాఠశాల నుంచి ఐడియల్ టీచర్‌గా ఆంగ్ల ఉపాధ్యాయిని సుమలత, ఐడియల్ ప్రిన్సిపల్‌గా ముమ్మన నాగరత్నంను ఎంపిక చేశారన్నారు. గురుకులం సమన్వయకర్త సత్యనారాయణమూర్తి, అరకు, అనంతగిరి ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపల్స్ భాస్కరరావు, సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఏటీడబ్ల్యూవో, ఎంఈఓ, బాలికల పాఠశాల ఉపాధ్యాయులు

Authorised Main Dealers: OLIVE TVS: VISHAKAPATNAM, Cell: 8142299966, DHARMANA TVS: GAJUWAKA, Cell: 7989851681, OLIVE TVS: N.A.D, Cell: 9182472619, OLIVE TVS: MVP COLONY, Cell: 8142299923, OLIVE TVS: MURALINAGAR, Cell: 8142299924, OLIVE TVS: PENDURTHY, Cell: 8142299970, OLIVE TVS: MADHURAWADA, Cell: 8142299972, DHARMANA TVS: MALKAPURAM, Cell: 9398656775, DHARMANA TVS: ANAKAPALLE, Cell: 8341546429, Authorised Dealer: JHANVI TVS: PADERU, Cell: 8341123619.

(c) eenadu

ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి చేరుకోండి

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మీరు సంతకం చేసే స్థాయి నుంచి ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి చేరుకోవాలని న్యాయమూర్తులు విద్యార్థినులకు సూచించారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటైంది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, స్థానిక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షియాజ్‌ఖాన్ మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకుంటే ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు మీ చుట్టూ ఉన్న వారు పోటీపడతారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చేవన్నీ నిజం కాదని గుర్తించుకోవాలన్నారు. సీఐ గపూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు న్యాయమూర్తి సన్యాసినాయుడు స్థానిక ఉప కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలతో సమావేశమై ఉచిత న్యాయ సహాయం పొందడం తదితర విషయాలపై సూచనలు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు సమస్యలపై వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

'ఐదు'లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: లింగరాజుపాలెంలోని జ్యోతిరావు పులే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మి గురువారం తెలిపారు. మార్చి 4 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చన్నారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

రగ్బీ కోచ్‌గా వెంకట్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రగ్బీ ఖేలో ఇండియా ఏపీ కోచ్‌గా కూండ్రపు నాగ వెంకటరావు అలియాస్ నియమితులయ్యారు. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20 నుంచి 23 వరకు రగ్బీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఏపీ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరించనున్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు నుంచి గురువారం నియామక పత్రం అందుకున్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కూండ్రపు వెంకటనాయుడు, కార్యదర్శులు జగదీశ్, సుధీర్, వెంకట్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోర్ల వివరాలు సేకరించండి

స్పందనకు వందనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా వేసిన బోర్ల వివరాలు సేకరించాలని అధికారులు ఆదేశాలిచ్చారు. '20 మీటర్లకో బోరు - ఎవరూ అడ్డుకోరు' శీర్షికన ఈనెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దారు మహేశ్వరరావు సిబ్బందికి సూచనలిచ్చారు. ఆర్.ఐ., వీఆర్వోలు రొయ్యల చెరువులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బోర్ల తొలగింపునకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పొదుపు మహిళలకు ఆర్థిక తోడు

మార్చిలో విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాల అమలు

నక్కపల్లి, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం స్వల్ప వడ్డీకే రుణాలిచ్చేలా మూడు నెలల క్రితం ప్రకటించిన ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలను ఈ మార్చి నుంచి అమలు చేసేందుకు నిర్ణయించింది. అల్లూరి జిల్లాలో డ్వాక్రా గ్రూపులు 3710 ఉండగా, 44,096 మంది సభ్యులున్నారు. వీరందరికీ ఆర్థిక తోడు లభించనుంది. డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా స్త్రీ సాధికారికత చాటిచెప్పిన సీఎం చంద్రబాబునాయుడు తర్వాత కాలంలో అనుసంధానంగా అనేక పథకాలు అమలుచేసి తోడుగా నిలిచారు. తాజాగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు. వీటిని ప్రపంచ మహిళా దినోత్సవమైన మార్చి ఎనిమిది నుంచి అమలులోకి తేనున్నారు. ఇదే సమయానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు కావస్తుండటం విశేషం. దీని పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారానే ఈ రుణాలు ఇవ్వనున్నారు. జిల్లాలోని డ్వాక్రా సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కొందరు మహిళలు బాగా ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో వీరికి కుటుంబ వ్యక్తిగత అవసరాలు నిమిత్తం ప్రైవేటు రుణాలను అధిక వడ్డీలకు తీసుకుంటున్నారు. ఇది భారంగా మారింది. ఇక స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణంపై దాదాపు రూపాయి వడ్డీ ఉంటుంది. దీంతో కేవలం పావలా వడ్డీకే విద్య, కల్యాణ లక్ష్మీ పథకాల ద్వారా గరిష్ఠంగా రూ. లక్ష రుణం ఇవ్వనున్నారు. దీన్ని తీర్చడానికి నాలుగేళ్ల కాల పరిమితి ఇవ్వనున్నారు.

రుణాలు పొందేది ఇలా...

★ సభ్యురాలి కుటుంబంలో ఇద్దరు పిల్లలు పాఠశాల/కళాశాలల్లో చదివితే వారి చదువు నిమిత్తం నగదు అవసరమైతే రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు ఇవ్వనున్నారు. ఇందుకోసం సంబంధిత పాఠశాల/కళాశాలలో చేర్పించిన ప్రవేశ పత్రం, ఫీజు వివరాల రసీదు చూపించాలి.

★ కుటుంబంలో వివాహం చేయాల్సిన కుమార్తె ఉంటే పెళ్లి ఖర్చుల నిమిత్తం ఇదే తరహాలో గరిష్ఠంగా రూ. లక్ష వరకు రుణం ఇస్తారు. దీనికి పెళ్లి శుభలేఖ, వివాహ ఖర్చు అంచనా వివరాలను సమర్పించాలి. దీన్ని పరిశీలించిన అధికారులు అర్హత ఉంటే రెండు రోజుల్లోనే వారి ఖాతాలకు కేటాయించిన రుణ నగదు జమచేస్తారు. ★ సభ్యురాలు సంఘంలో చేరి కనీసం ఆరునెలలై ఉండాలి. బ్యాంకు, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు తీసుకుని ఉన్నా, వాటిని సక్రమంగా చెల్లిస్తూ ఉంటేనే అర్హత పొందుతారు. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం మొత్తం మాఫీ అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

వ్యక్తిగత రుణాలను తక్కువ వడ్డీకి ఇవ్వడం అనేది చాలా మంచి నిర్ణయం. వేలాదిమందికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. దీనికి సంబంధించి విధివిధానాలను ఉన్నతాధికారులు వెల్లడిస్తారు. లబ్ధి పొందే వారంతా రుణాలు సద్వినియోగం చేసుకోవాలి. – కె.శ్రీనివాసరావు, ఏపీఎం

అనకాపల్లి జిల్లాలో..	మొత్తం సంఘాలు:	సభ్యులు:	బ్యాంకు లింకేజీ రుణం:	స్త్రీనిధి రుణం:	ఉన్నతి రుణం:
	39,553	4,09,467	రూ. 1317 కోట్లు - 95,531 మంది సభ్యులు	రూ. 220 కోట్లు - 39,131 మంది సభ్యులు	రూ. 9 కోట్లు - 1,704 మంది సభ్యులు

చోరీ నెపం మోపారనే ఆవేదనతో ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చేయని నేరం తనపై మోపారనే ఆవేదనతో పదో తరగతి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో పొలంలో పాక దగ్గరకి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు స్నేహితుడికి ఫోన్ చేసి తన ఆవేదన వెళ్లబోసుకున్నాడు. ఆ మాటలు ఫోన్‌లో రికార్డు అయ్యాయి. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కొండెంపూడి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి (17) వడ్డాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల గ్రామంలోని ఓ ఇంట్లో జరిగిన వెండిపట్టీల చోరీపై సదరు వ్యక్తులు ఆ విద్యార్థిని నిలదీశారు. దీంతో తనకి సంబంధం లేదంటూ అతడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం పశువుల పాక దగ్గరకు వెళ్లి నిద్రపోతానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి స్నేహితుడికి ఫోన్ చేసి తన చావుకు నేరం మోపినవారే కారణమంటూ ముగ్గురి పేర్లు తెలిపాడు. అవతలి వ్యక్తి ఇదేంటని.. ఎక్కడికి వెళుతున్నావని ప్రశ్నించినా... తాను చెప్పినట్లు చేయమని కోరి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడి సంద్రంలో బోటు ఆగిపోతే...

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నడి సముద్రంలో బోటు ఆగిపోతే చేయాల్సిన అత్యవసర మరమ్మతులపై మత్స్యకారులకు శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. పూడిమడకలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా మత్స్యఅభివృద్ధి అధికారిణి విజయ ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది హాజరై మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. పీఎంఎంఎస్‌వై పథకం, ఎన్‌డీబీ నిధులతో మత్స్యకారులకు ఇంజిన్లు అందిస్తామన్నారు. సాంకేతిక బృందం హరినాథ్, అర్జున్, ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మత్స్య అధికారులు

పోలీస్ స్టేషన్లకు ఇంటర్ ప్రశ్నపత్రాలు

అనకాపల్లి పట్టణం, నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షల ప్రశ్న పత్రాలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లకు చేరుకున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు సంబంధించి వీటిని జిల్లాలోని 16 పోలీస్‌స్టేషన్లకు గురువారం పంపారు. ముందుగా ఒకసెట్ వచ్చాయి. మరో రెండుసెట్లు శుక్రవారం రానున్నాయి. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష పత్రాలను జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల వద్ద భద్రపరిచి ఎంపిక చేసిన సెట్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ బోర్డు అధికారి వినోద్‌బాబు తెలిపారు.

వాహనం నుంచి ప్రశ్నపత్రాల కట్టలు దించుతున్న సిబ్బంది

ఎవరెస్ట్ పర్వతారోహణకు జోగుంపేట విద్యార్థి

విద్యార్థి హరిశ్రీదుర్గాప్రసాదును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గొలుగొండ, న్యూస్‌టుడే: ఎవరెస్ట్ పర్వతారోహణకు జోగుంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి అర్హత సాధించడని ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు. మూగవాడైన ఎల్.హరిశ్రీదుర్గాప్రసాద్‌ను జోనల్ స్థాయిలో అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్వాహకులు నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో గతేడాది డిసెంబరు 6న ఎంపిక చేసి కడప జిల్లా గండికోటలో నెల రోజుల శిక్షణకు పంపినట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ అనంతరం ఎవరెస్ట్ అధిరోహణకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ప్రస్తుతం లద్దాఖ్ హై ఆల్టిట్యూడ్ కేంద్రంలో ఇందుకు అవసరమైన శిక్షణ పొందుతున్నాడని పేర్కొన్నారు. మనోధైర్యం ఉంటే వైకల్యం అడ్డుకాదని నిరూపించడం గర్వకారణమని పేర్కొంటూ దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయ ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపన నేపథ్యంలో గురువారం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకులు వెలవలపల్లి వెంకట రమణమూర్తి శర్మ, వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. వాస్తుపూజ, హోమం నిర్వహించారు. ఈవో జె. వెంకటరావు పూజల్లో పాల్గొన్నారు. తొలుత పాత ధ్వజస్తంభానికి కళా విసర్జన నిర్వహించి తొలగిస్తారు. అనంతరం ఈ నెల 23 నుంచి పునః ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమవుతాయి. 27న ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగుతుంది. ఏఈవో తిరుమలేశ్వరరావు, ఈఈ రాంబాబు, డీఈఈ రామరాజు, ఏఈ రవిరాజు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో డీఆర్‌డీవో ఛైర్మన్ : భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ గురువారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ప్రొటోకాల్ పర్యవేక్షకుడు త్రిమూర్తులు, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

క్రికెట్ పోటీల్లో ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు ఆంధ్ర విశ్వ విద్యాలయం సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ క్రికెట్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గల్లా జయబాబు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష, కరస్పాండెంట్లు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, పెంటకోట వెంకట రామారావు, వైస్ ప్రిన్సిపల్ నిరంజన్‌కుమార్ అభినందించారు. ★ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు విశాఖలో జరుగుతున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో పాలుపంచుకున్నారని ప్రిన్సిపల్ జయబాబు తెలిపారు. విద్యార్థులు దుర్గాప్రసాద్, హేమంత్ కుమార్, శృతి, తనూజ, యోగిత, శ్రావణి ప్రియ, నీలిమ, సోమేశ్వరిలను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్, రమణ

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. అధ్యక్షుడిగా పెనుమాక రాజు (ఏఏవో, డీజీపీ కార్యాలయం, మంగళగిరి) ఎన్నిక కాగా, సహాధ్యక్షుడిగా పి.శంకర్ (ఏటీవో, అనకాపల్లి) ఎన్నికయ్యారు.

పెతకంశెట్టి జీవితం నేటితరానికి ఆదర్శం

మునగపాక, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనర్సింహం జీవితం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందని గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. మునగపాక మండలం నాగులాపల్లిలో మాజీ ఎంపీ అప్పలనర్సింహం 90వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి సురేంద్రతోపాటు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 600 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సురేంద్ర మాట్లాడుతూ అప్పలనర్సింహం గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేసి అన్న ఎన్టీఆర్ మన్ననలు పొందారన్నారు. మౌర్య మాట్లాడుతూ అప్పలనర్సింహం ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. పెతకంశెట్టి రాజునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, సహకారం సంఘం మాజీ ఛైర్మన్ మళ్ల ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు ఆడారి మంజు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట విజయ్, మళ్ల కాళేశ్వరరావు, దొడ్డి శ్రీను, గోసాల గోవింద, మురళి, దాడి ముసిలినాయుడు, వేగి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మౌర్య, సురేంద్ర

నేడు ఐసీఏఐ అధ్యక్షుడి రాక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షులు డి.ప్రసన్నకుమార్ శుక్రవారం నగరానికి రానున్నారు. ఇటీవల దిల్లీలో బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా విశాఖ నగరానికి విచ్చేస్తున్నారు. ఇంత వరకు ఆయన ఐసీఏఐ ఉపాధ్యక్షునిగా వ్యవహరించగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవి దక్కింది. రాష్ట్రం నుంచి సంబంధిత పదవి దక్కించుకున్న తొలి వ్యక్తి ఈయనే కావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు సంబంధిత సంస్థ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సహకార ఉద్యోగుల సమ్మెలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో పీఏసీఎస్ ఉద్యోగులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), ఎలమంచిలి, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం పీఏసీఎస్ ఉద్యోగులు నిరహార దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణరావు, రమణ, అనకాపల్లి, ఎలమంచిలి, అచ్యుతాపురం బ్రాంచ్‌లకు చెందిన ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శివరామకృష్ణ కోరారు. డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 24 ఎలమంచిలి బ్రాంచి వద్ద సమ్మె చేస్తామన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: డాక్టర్ వి.ఎస్.కృష్ణా పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ యోజన ద్వారా కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ శిక్షణలో కంప్యూటర్ కోర్సు అప్లికేషన్ డెవలపర్ వెబ్ - అండ్ మొబైల్, బీఎస్సీ కంప్యూటర్స్, బీటెక్, గణితం చేసిన వారు అర్హులన్నారు. వయసు 18-35 ఏళ్లు ఉండాలన్నారు. మూడున్నర నెలలు శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 90147 66143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లైఫ్ సేవింగ్ శిక్షకుల ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు తీర ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్‌ఎల్‌ఎస్‌ఎస్) ఆంధ్రప్రదేశ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించిందని వాటర్ స్పోర్ట్స్, సీకేఏపీ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మార్చి ఒకటి నుంచి 6వ తేదీ వరకు శిర్డీలో జరగనున్న జాతీయస్థాయి శిక్షకులకు శిక్షణ (ట్రైనర్స్ ఆఫ్ ట్రైనర్స్) ఇచ్చే కార్యక్రమానికి రాష్ట్రం నుంచి పది మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి ప్రథమ చికిత్స, అధునాతన ప్రాణరక్షణ వంటి విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈతలో ప్రావీణ్యం, సమాజసేవ పట్ల ఆసక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యం గలవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రాణ రక్షకుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే ముఖ్య లక్ష్యమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 97037 84560 వాట్సాప్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం
విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ : ఫోన్ నెం. 0891-2764949
Website: www.simhachalamdevasthanam.net
Email: endow-eosvlnsd@gov.in, jc_eo_simhachalam@yahoo.co.in
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ మరియు సీల్డ్ కొటేషన్స్ షార్ట్ టెండర్ ప్రకటన
ఆర్.సి.నెం.Engg/01/2026 తేది: 19-02-2026
శ్రీ స్వామి వారి కొండపైన మరియు కొండ దిగువ వార్షిక ఉత్సవ పనులు మరియు అభివృద్ధి పనులు సివిల్ మరియు ఎలక్ట్రికల్ (11 Nos) పనులకు గాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ పిలుచుటకు (7 రోజులు) మరియు సివిల్, ఎలక్ట్రికల్ సీల్డ్ కొటేషన్స్ పనులు (6 Nos) గాను సీల్డ్ కొటేషన్స్ కోరడమైనది. (7రోజులు).
షెడ్యూల్ జారీ చేయు తేది : 20.02.2026 నుండి తేది.27.02.2026 వరకు
షెడ్యూల్ దాఖలు చేయు ఆఖరి తేది : 28.02.2026 సాయంత్రం 04.00 వరకు
సీల్డ్ కొటేషన్లు తెరుచు తేది : 28.02.2026 సాయంత్రం 04.30 గం.లకు
పై పనులకు www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు పిలువడమైనది. Website: www.simhachalamdevasthanam.net
Contact No: +91 9618072527, +91 8519807173 +91 7659990664, +91 9177444441
సం/- జె.వెంకటరావు కార్యనిర్వాహణాధికారి.

ధర్మ పరిరక్షణకు ఛత్రపతి శివాజీ కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ధర్మాన్ని కాపాడేందుకు అవిశ్రాంతంగా పోరాడిన ధీరుడు ఛత్రపతి శివాజీ అని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ అన్నారు. శివాజీ మహరాజ్ జయంతిని కళాశాలలో నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు విజయలక్ష్మి, నాగబాబు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు, చింతపల్లి: ధారకొండలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధారకొండ ఆర్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పాత సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీర్ల రమేష్, గొర్లె బర్నే, తిరుమలేష్, గిరి, శెట్టి రాజు, ఉమామహేశ్వరరావు, దేవేంద్ర, పండు తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ చరిత్రను ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయ భారతి, చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులు అర్పిస్తున్న అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు

బాలిక మృతి కేసులో ఇద్దరి అరెస్టు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మాకవరం సమీపంలోని డుడుమ మార్గంలో ఈనెల 9న రాత్రి అనుమానాస్పదంగా బాలిక (16) మృతి చెందిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై నాని తెలిపారు. బరడ పంచాయతీలోని అడర్ల డిముకిపుట్టు గ్రామానికి చెందిన బాలికను, ఒలయబీరు గ్రామానికి చెందిన రఘునాథ్, లబడపుట్టుకు చెందిన జగన్ ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లారు. వాహనం నడుపుతున్నపుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలిక పడిపోయింది. బాలిక తలకు తీవ్రగాయమై ఘటన ప్రదేశంలో మృతి చెందిందని ఎస్సై చెప్పారు. బాలికను వాహనంపై తరలించి.. మృతికి కారణమైన ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

కాఫీ, మిరియాల తోటలు దగ్ధం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ పరిధిలోని గన్నేరుపుట్టులో కాఫీ, మిరియాలు తోటల్లో గురువారం మంటలు చెలరేగాయి. గ్రామంలోని మఠం రాంబాబు, పాంగి సీతన్న, పాంగి చిన్నమ్మి, పాంగి భీమన్నకు చెందిన రెండు ఎకరాల కాఫీ, మిరియాలు తోటలు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చీటీల పేరుతో మోసం.. దంపతుల అరెస్టు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చీటీల పేరుతో పలువురికి టోపీ పెట్టిన దంపతులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖరరావు కథనం ప్రకారం... హరిపాలెంలో నివాసం ఉండే దంపతులు కలగర్ల లత (సౌజన్యలత), శ్రీనివాసరావు 20 ఏళ్లపాటు చీటీలు, గోల్డ్, సిల్వర్ స్కీమ్‌ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. మొదట్లో నమ్మకంగా అందరికీ డబ్బులు తిరిగిచ్చేవారు. ప్రజలకు వీరిపై నమ్మకం పెరగడంతో చిన్న మొత్తాల నుంచి అధిక మొత్తాల్లో డబ్బులు చీటీలు కట్టడం, డిపాజిట్లు చేయడం చేశారు. గడువు తీరినా తిరిగి డబ్బులు చెల్లించలేదు. డబ్బులు అడిగినా స్పందించకపోవడం, కొద్దిరోజులుగా పరారీలో ఉండడంతో ఈనెల 9న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిపాలెంలోనే రూ. 42 లక్షల వరకు వీరు వసూలు చేసినట్లు తెలిపారు. లాభాల ఆశ చూపించి మరో 50 మందిని మోసం చేసి రూ.1.5 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అచ్యుతాపురం పోలీసులు గురువారం దంపతులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

రూ.ఆరు వేల జరిమానా

రాంబిల్లి, న్యూస్‌టుడే: మోసం కేసులో నేరం రుజువుకావడంతో రాంబిల్లి మండలానికి చెందిన జోగా రమణమ్మకు ఎలమంచిలి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.రమేష్ రూ. ఆరు వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సీఐ నరసింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో రమణమ్మపై మోసం కేసు నమోదైందన్నారు. కోర్టు వాయిదాలు, వాదోపవాదాల అనంతరం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం రమణమ్మను దోషిగా తేల్చి జరిమానా విధించిందన్నారు. ప్రభుత్వం తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాస్మిన్ సుల్తానా వాదనలు వినిపించారు.

పోలీసులపై దాడికేసులో నలుగురి అరెస్ట్

రోలుగుంట, న్యూస్‌టుడే: విధి నిర్వాహణలో పోలీసులపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు కొత్తకోట సి.ఐ.కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 15న మహాశివరాత్రి సందర్భంగా బుచ్చెంపేటలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించడంపై అందిన సమాచారం మేరకు రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీనిపై ఎలాంటి అనుమతులు లేవని తక్షణమే నిలిపివేయాలని కోరగా.. నిర్వాహకులు బత్తి రవి, గొల్లు కృష్ణ, ప్రసాద్, ఇసంశెట్టి రాజునాయుడుతోపాటు మరికొందరు ఎస్సై, కానిస్టేబుల్‌పై తిరగబడి దాడి చేశారు. అడ్డుకున్న కొందరు గ్రామస్థులపైనా వీరు దాడిచేసి పోలీసులకు చెందిన మోటారు వాహనాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ వివరించారు. నిందితులను బుధవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఆర్టీసీ బస్సు ఢీ

దెబ్బతిన్న బస్సు ముందుభాగం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అడ్డూరు గ్రామ సమీపంలో గురువారం ఇసుక ట్రాక్టర్‌ను విశాఖ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 15 మందికి గాయాలయ్యాయి. చోడవరం నుంచి విశాఖ వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. ఎస్సై నాగ కార్తిక్ సిబ్బందితో చేరుకొని గాయపడిన ప్రయాణికులను చోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు, ముఖంభాగంలో చంద్రబోస్, దేవి, వెంకట సత్యనారాయణ, భవానీ, బాలరాజు తదితరులకు గాయాలయ్యాయి. వారికి వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	110
లైవ్	147	130
డ్రెస్‌డ్	213	230
స్కిన్‌లెస్	243	240

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570

అరకులోయ: 63034 86346

చింతపల్లి: 94404 07658

పెదబయలు, న్యూస్‌టుడే పెదబయలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. తక్షణమే దీన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. - **అశోక్, పెదబయలు,** ✔: అసంపూర్తిగా ఉన్న కేంద్రాలను పూర్తిచేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పూర్తిచేస్తాం. - **శ్యాంసుందర్‌రావు, ఎంపీడీవో, పెదబయలు**

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం రేకులు పగిలిపోయి కొద్దిపాటి వర్షానికి కారిపోతోంది. గోడలు బీటలు వారాయి. భవనానికి మరమ్మతులు చేపట్టాలి. - **కె.లక్ష్మణ్, బాలరేవుల,** ✔: ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీ డీంగుడ కూడలి నుంచి కోడాపుట్టు గ్రామానికి రహదారి నిర్మాణానికి రెండేళ్ల క్రితం కంకర రాళ్లు పోసి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి. - **బాబూరావు, స్థానికుడు,** ✔: నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే పనులు పూర్తిచేస్తాం. - **రాముడు, ఏఈ, గి.సం.శాఖ, ముంచంగిపుట్టు**

ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఇక్కట్లు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: చిన్నారుల మానసిక, శారీరక, సాంఘిక వికాసానికి ఏర్పాటు చేసిన సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు కార్యాలయాల్లో వసతులు కరవయ్యాయి. సంస్థ ఏర్పాటు చేసి దశాబ్దాలు గడుస్తున్నా వసతులు లేక పరాయి పంచన సభలు, సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి ప్రాజెక్టు పరిధిలో 150 నుంచి 250 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు.

ముంచంగిపుట్టులో నేలపైనే కూర్చొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

▼ కార్యకర్తలకు ప్రతి నెలా ప్రాజెక్టు, సెక్టారు స్థాయి రెండు సమావేశాలు, శిక్షణ తరగతులు, ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు సమావేశాలు నిర్వహించుకునేందుకు కనీసం సమావేశ మందిరం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ముంచంగిపుట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 237 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 232 మంది కార్యకర్తలు, మరో 237 మంది ఆయాలు సేవలు అందిస్తున్నారు. భవనాలు లేక వెలుగు, మండల పరిషత్ కార్యాలయ భవనాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కుర్చీలు కూడా లేకపోవడంతో మహిళలు నేలపైనే కూర్చోవాల్సి వస్తోంది.

▼ మొత్తం 237 కేంద్రాలను పది సెక్టార్లుగా విభజించారు. ప్రతి సెక్టారులో 20 నుంచి 30 కేంద్రాలు ఉంటాయి. ముంచంగిపుట్టు, బరడ, బుంగాపుట్టు, కరిముఖిపుట్టు, కిలగాడ, కుమడ, మాకవరం, పెదగుడ, వనబసింగి, వనుగుమ్మ గ్రామాలను సెక్టార్లుగా ఏర్పాటు చేశారు. ఆ సెక్టార్లలో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు భవనాలు లేక కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. రచ్చబండ వద్ద, అద్దె ఇళ్లల్లో సెక్టారు స్థాయిలో సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది.

పదేళ్లుగా నిర్మాణంలోనే.. : ముంచంగిపుట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో సమావేశ మందిరం నిర్మాణానికి పదేళ్ల క్రితం చర్యలు చేపట్టారు. పిల్లర్లు వేసి పునాదుల దశలోనే వదిలేశారు. ఆ భవన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో పరాయి పంచన కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇతర కార్యాలయ భవనాలు ఖాళీ లేనప్పుడు ఐసీడీఎస్ కార్యాలయం బయట కూర్చొని ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల సదుపాయం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిల గదుల్లో సరకుల నిల్వ..: ప్రభుత్వం సరఫరా చేస్తున్న బాలామృతం, ఆటపాటల కిట్ల నిల్వకు వసతి కరవైంది. ముంచంగిపుట్టులో శిథిలమైన భవనంలో సరకులు నిల్వ ఉంచటంతో బాలమృత ప్యాకెట్లు ఎలుకలకు ఆహారమవుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న గోదాముకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం.. ముంచంగిపుట్టు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహించేందుకు సమావేశ మందిరం నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతాం. - **విమలాకుమారి, సీడీపీఓ, ముంచంగిపుట్టు**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు, చింతవానిపాలెం, రాజేంద్రపాలెం, సింగవరం, ఐటీడీఏ కాలనీ, కాకరపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్తు సంస్థ ఈఈ పి.వేణుగోపాల్ తెలిపారు. విద్యుత్తు లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

రహదారుల నిర్మాణాలకు రూ.5.97 కోట్లు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండలంలోని మారుమూల రెండు గ్రామాలకు మెటల్ రోడ్డు నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5.97 కోట్లు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసింది. మంప పంచాయతీ మంప నుంచి గొడుగులమ్మబంద గ్రామానికి రూ.4.47 కోట్లు, మఠంభీమవరం పంచాయతీ చీడికోట నుంచి దబ్బకోటకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దశాబ్దాల తరబడిగా రహదారి సౌకర్యం లేక ఆయా గ్రామాల్లోని గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డోలీమోతలే దిక్కయ్యేవి. రోడ్డు నిర్మించాలని అక్కడి ప్రజలు అధికారుల చుట్టూ అనేకసార్లు ప్రదక్షిణలు చేశారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

ఉత్తమ పనితీరుకు ప్రశంస

ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ ధనుంజయ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన గూడెంకొత్తవీధి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ టి. ధనుంజయను ఎస్పీ అమిత్ బర్దార్ గురువారం ప్రశంసించారు. ఈయన కంప్యూటర్ ఆపరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2025లో ఉత్తమ పనితీరు ప్రదర్శించినందుకు గుడ్ సర్వీస్ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతిని ఎస్పీ అందజేశారు. కానిస్టేబుల్‌ను గూడెంకొత్తవీధి సీఐ సుధాకర్, ఎస్సై సురేష్ అభినందించారు.

వినియోగదారులకు నీడ కరవాయే!

కొత్త పాడేరులోని విద్యుత్తు సంస్థ జిల్లా కార్యాలయంలో బిల్లులు చెల్లించేందుకు ప్రతిరోజూ దాదాపు వంద మంది వరకు వినియోగదారులు వస్తుంటారు. వీరికి ఇక్కడ కనీసం నిలువ నీడ కరవైంది. ఎండ, వానలో బయట నిల్చుని బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. వినియోగదారులకు నీడ కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన షెడ్డులో కార్యాలయ సిబ్బంది వాహనాలు వరుసగా నిలిపేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నీడ కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వినియోగదారులు పాంగి సోములు తదితరులు హెచ్చరించారు. - పాడేరు, న్యూస్‌టుడే

చేరువవ్వని సేవలు

పెదబయలు మండలం పర్రెడ పంచాయతీలో రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. రైతులకు చేరువలో విత్తనాలు, ఎరువులు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో రైతులు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని పూర్తి చేయాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు. - పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

అసంపూర్తి పనులతో అవస్థలు

కుజభంగి నుంచి సంపంగిపుట్టు వరకు రూ.కోట్లాది నిధులతో చేపట్టిన కల్వర్టు పనులు అసంపూర్తిగా వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో సంపంగిపుట్టు నుంచి కుజభంగి వరకు రోడ్డు నిర్మించారు. సంపంగి, తమరాడ, అడుగులపుట్టు, కుజభంగి సమీపంలో కల్వర్టు పనులు చేపట్టకుండా విడిచిపెట్టారు. నిత్యం ఈ రహదారిలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టులు నిర్మించాల్సిన ప్రదేశంలో గోతులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. - పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే

బస్ షెల్టర్ నిర్మించరూ..

ఎం.మాకవరం పంచాయతీ నడింపాలెంలో జాతీయ రహదారిపై బస్ షెల్టర్ లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ, వానల్లో పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. - కొయ్యూరు, న్యూస్‌టుడే

మూణ్నాళ్ల ముచ్చటేనా?

పెదబయలు గురుకుల కళాశాలలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన తాగునీటి ట్యాంకు మూణ్నాళ్ల ముచ్చటగా దర్శనమిస్తోంది. మూడేళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు ఏడాది తిరగకుండానే లీకవుతూ నాణ్యతా లోపాల్ని ఎత్తి చూపుతోంది. పదికాలాలపాటు ఉండాల్సిన ట్యాంకు ఇలా నిత్యం కారిపోతుండడంతో నీటి వృథాతోపాటు విద్యుత్తు వ్యయం పెరుగుతోంది. అధికారులు కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - పెదబయలు, న్యూస్‌టుడే

శివాలయానికి వితరణ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నంలోని ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన పంచాది దేముడు 20 ట్యూబ్‌లైట్లును గురువారం కమిటీసభ్యులు అప్పాజీ, రవికి అందజేశారు. తన తల్లిదండ్రులు పైడిరాజు, గంగమ్మల జ్ఞాపకార్థం లైట్లు అందజేశానని దేముడు తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

అనంతగిరి, న్యూస్‌టుడే: కాశీపట్నం పంచాయతీ పందిరిమామిడివలస గ్రామానికి చెందిన తామరపల్లి అప్పారావు ఇళ్లు ప్రమాదవశాత్తు కాలిపోయింది. నిరాశ్రయులైన కుటుంబానికి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సింగులు తదితరులు పాల్గొన్నారు.

పీడీ మృతికి సంతాపం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల గురుకుల పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న జర్సింగి పొట్టన్న మృతి బాధాకరమని ఏటీడబ్ల్యూవో నాగశిరీష, ఎంఈవో నాగభూషణం పేర్కొన్నారు. ఈనెల 18న పాఠశాల అసెంబ్లీ సమయంలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కింద పడిపోయారు. వెంటనే పాడేరు జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో అర్ధరాత్రి మృతి చెందారు. పీడీ మృతికి ప్రిన్సిపల్ వేణు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలిపారు.

వినియోగదారులపై ఒత్తిడి తగదు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులు బిల్లులు చెల్లించాలని సిబ్బంది ఒత్తిడి చేయడం తగదని జిల్లా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడు సీతారాం గురువారం అన్నారు. గిరిజనులకు 200 యూనిట్ల విద్యుత్తును ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. 200 యూనిట్లు లోపు వినియోగించిన లబ్ధిదారులు బిల్లులు చెల్లించాలని సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

దేవరాపల్లి: దేవరాపల్లి నాలుగురోడ్ల ప్రధాన కూడలిలో అభయాంజనేయ స్వామి భారీవిగ్రహం ఏర్పాటుకు దాతలు విరాళాన్ని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకి అందజేశారు. సర్పంచి సబ్బవరపు పెంటమ్మ, మాలిబాబు దంపతులు రూ.60 వేలు అందజేయగా, కొల్లి సురేష్, జ్యోతి దంపతులు రూ.50 వేలు ఇచ్చారు.

ఆధార్ శిబిరం నేడు

చీడికాడ: జేబీపురం సచివాలయం వద్ద శుక్రవారం ఆధార్‌శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. కొత్త ఆధార్, బయోమెట్రిక్ నమోదు, కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు.

పునాదులు గట్టిగా.. భవిత మెరుగ్గా!

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. అయిదో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసింది. అయిదో తరగతి పిల్లలు సైతం చక్కగా చదవలేకపోవడం, గణితంలో తడబాటు, అక్షరాలను గుర్తించలేకపోవడంతో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ(జీఎఫ్ఎల్ఎన్) బోధనకు శ్రీకారం చుట్టింది.

75 రోజుల కార్యాచరణ

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గతేడాది డిసెంబరు 8 నుంచి 75 రోజుల ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోంది. మార్చి 23కల్లా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పూర్తిస్థాయిలో మెరుగుపరుచుకునేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఒకటి నుంచి అయిదో తరగతి పిల్లలకు అక్షర పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించేలా శిక్షణ ఇస్తోంది. విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించారు. వీరికి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3:30 గంటల వరకు ప్రత్యేక పాఠ్యాంశాలు ఉంటాయి. ఆటలు, పాటలతోపాటు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణితాన్ని అవగాహన చేసుకోవడంతోపాటు.. ఆయా అంశాల్లో నైపుణ్యాన్ని సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. డుంబ్రిగుడ మండల వ్యాప్తంగా ఒకటి నుంచి ఐదో తరగతి పాఠశాలలు 152 ఉండగా.. సుమారు 6,900 మంది విద్యార్థులు చదువుతున్నారు.

రోజు వారీ ఇలా..

మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1:10 వరకు మానసిక ప్రశాంతత, 1:10 నుంచి 1:40 వరకు తెలుగు అక్షరాలు, పదాలు చదివించడం, అంకెలు గుర్తించడం, కృత్యధార బోధన, చతుర్విధ ప్రక్రియ నేర్పుతారు. 1:40 నుంచి 1:50 వరకు వాటర్ బెల్, 1:50 నుంచి 2:30 వరకు గణితం, 2:30- 2:40 విరామం, 2:40 నుంచి 3:20 వరకు పరీక్షలు, 3:20 నుంచి 3:30 వరకు పునశ్చరణ, హోంవర్క్ ఉంటుంది. 1, 2 తరగతులకు ఓ విధంగా, 3, 4, 5 తరగతులకు మరో విధంగా బోధన ఉంటుంది. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించారు. అన్ని పాఠశాలలకు వెళ్లి చిన్నారుల సామర్థ్యాలతోపాటు పురోగతిని అంచనా వేసి సూచనలు ఇస్తున్నామని, 75 రోజుల కార్యాచరణ పూర్తయిన తరువాత పిల్లలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను తెలిపారు.

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మహిళలు, పిల్లలు సమాజానికి మూలస్తంభాలు

పాడేరు, న్యూస్‌టుడే: మహిళలు, పిల్లలపై దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పాడేరు డీఎస్పీ అభిషేక్ పేర్కొన్నారు. పాడేరులో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలపై దాడులు జరుగుతున్నాయి. వాటితోపాటు సైబర్ నేరాలు అధికమయ్యాయని తెలిపారు. సమాజం అభివృద్ధి చెందాలంటే అక్కడ మహిళలు, బాలికలు సురక్షితంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారు.. సోషల్ మీడియాను ఎలా వాడుతున్నారు.. అనేది గమనించాలని చెప్పారు. ఏదైనా అన్యాయం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరామ్‌పడాల్, సైకియాట్రిస్ట్ డాక్టర్ రాజు, ఐసీడీఎస్ సీడీపీఓ శారద, ఎన్ఐసీఈ ఎన్‌డీఓ పూజ, కౌన్సిలర్ శాంతి, పాడేరు సీఐ దీనబంధు, ఎస్సై పాపినాయుడు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ అభిషేక్

గంజాయి తాగుతున్న నలుగురిపై కేసు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గంజాయికి బానిసై.. బహిరంగ ప్రదేశంలో తాగుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. బోందుగుడ కూడలిలో నలుగురు గంజాయి తాగుతున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని పాడేరులోని మత్తు విముక్తి కేంద్రానికి తరలించామని తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సచివాలయ సేవలు

అరకులోయ, న్యూస్‌టుడే: సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు అన్నారు. అరకులోయలోని తహసీల్దార్ కార్యాలయంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల సచివాలయ ఉద్యోగులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అన్ని సేవలు ఉచితంగా అందించాలన్నారు. డబ్బులు వసూలు చేసే ఉద్యోగులపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల మ్యాపింగ్‌ని గడువులోగా పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. రెవెన్యూ సేవలను త్వరితగతిన అందించాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు కుమారస్వామి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో లోకేశ్వరరావు

సైబర్ నేరాలపై అప్రమత్తం

డుంబ్రిగుడలో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని అరకు సీఐ హిమగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సే నో టు డ్రగ్స్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి.. ప్రమాదాల నివారణకు తోడ్పాటునివ్వాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో సుందర్‌రావు, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం ఏర్పాటుచేయరూ..

హుకుంపేట, న్యూస్‌టుడే: గత్తుం గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఇక్కడ పశువైద్య సేవలు సక్రమంగా అందటం లేదని, మూగజీవులు అనారోగ్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా పశువులు నడవలేక.. కాళ్ల డెక్కల వద్ద కుళ్లినట్లు కనిపిస్తున్నాయని గ్రామస్థులు దేవన్నదొర తదితరులు చెప్పారు. పశువైద్యాధికారులు స్పందించాలని విన్నవించారు.

ప్రార్థనా మందిరాలు కిటకిట

సీలేరు చర్చిలో ప్రార్థనలు

సీలేరు, న్యూస్‌టుడే: రంజాన్, ఈస్టర్ ఉపవాస ప్రార్థనలు గురువారం నుంచి ప్రారంభం కావడంతో సీలేరులో సందడి నెలకొంది. స్థానిక మసీదులో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ ఉపవాస ప్రార్థనలూ ప్రారంభం కావడంతో చర్చిలు కిటకిటలాడాయి.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని లక్కవరపుపేట పంచాయతీ సర్పంచి వీరేంద్రప్రసాద్ అన్నారు. పంచాయతీలోని కుప్పరాయివీధి గ్రామంలో తాగునీటి కుళాయి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, నారాయణ, ఉపసర్పంచి గంగాధర్, కూటమి నాయకులు గోపాలరావు, వీరభద్రరావు, బొజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత జలంతో ఆరోగ్యానికి మేలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజనులు రక్షిత తాగునీటిని వినియోగిస్తే ఆరోగ్యానికి మంచిదని టాటా ట్రస్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీదుర్గ అన్నారు. చింతపల్లి పంచాయతీ కందులగాదె, మల్లవరం గ్రామాల్లో సర్పంచి పుష్పలతతో కలిసి గిరిజనులకు గురువారం అవగాహన కల్పించారు. అధికారులు గ్రామాల్లో తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉషా, తెదేపా చింతపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, నాగభూషణం, అర్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి పనులు ప్రారంభిస్తున్న సర్పంచి వీరేంద్రప్రసాద్

24 యూనిట్ల రక్తం సేకరణ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 24 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు శంకరరావు మాట్లాడుతూ.. యువత అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చన్నారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంఈవో ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, రామారావు, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ గంగరాజు, ప్రసాదనాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చింతపల్లిలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

అథ్లెటిక్స్ విజేతకు సత్కారం

అనూరాధను అభినందిస్తున్న జడ్పీ పాఠశాల ఉపాధ్యాయ బృందం

నాతవరం, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి విజేతలగా నిలిచిన పీడీ అనూరాధను ఉపాధ్యాయ బృందం గురువారం సత్కరించింది. వ్యాయామ ఉపాధ్యాయలతో నిర్వహించిన ఈ పోటీల్లో అనూరాధ 400 మీటర్ల పరుగులో పసిడి, హ్యామర్ త్రోలో వెండి, 5000 మీటర్ల వాకింగ్‌లో రజతం, 400 మీటర్ల రిలే పరుగులో వెండి పతకాలు సాధించారని హెచ్‌ఎం సత్యనారాయణ చెప్పారు. ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం కాశపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు సహకరించండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కూర్మారావు హెచ్చరించారు. దండకారణ్య విమోచన సమితి సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం జలగెలగెడ్డ, కొర్రుబయలు గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. 800 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం లంబసింగి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నాటుసారా నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు రాంబాబు, గణేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లంబసింగి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కూర్మారావు

కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

కోడికి వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జయరాజు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం కప్పాడలో కోళ్లకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జయరామ్ మాట్లాడుతూ.. కోళ్ల పెంపకంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటివరకు పెదబయలు మండలంలో 11,200, ముంచంగిపుట్టు మండలంలో 9,750 కోళ్లకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అనంతరం కప్పాడ, అడుగులపుట్టు గ్రామాల్లో ఫారం పరిశీలించారు. సహాయ సంచాలకులు డాక్టర్ కిషోర్, పశువైద్యాధికారి డాక్టర్ మోక్షరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు జలవిద్యుత్కేంద్రంలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన గంగిరి గణేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్య ఇంజినీరు కె.వి. రాజారావు అన్నారు. బాధిత కుటుంబాన్ని సీఈ గురువారం పరామర్శించారు. జెన్‌కోపరంగా అన్ని ప్రయోజనాలు, ఎక్స్‌గ్రేషియా సాధ్యమైనంత త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్ఈలు జాకీర్ హుస్సేన్, హనుమా, ఈఈలు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ▮సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు సుభాన్ ఆధ్వర్యంలో గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి కార్మికులు మౌనం పాటించారు. నాయకులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో గణేష్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి

సమన్వయంతో భూవివాదాల పరిష్కారం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: భూ వివాదాలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని తహసీల్దారు అన్నాజీరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం భూవివాదాలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ధారకొండ, గూడెంకొత్తవీధిలో భూవివాదాలు, ఫిర్యాదులపై ఇరువర్గాలను పిలిపించి విచారణ జరిపారు. ఎంపీడీఓ రమణబాబు, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న తహసీల్దారు అన్నాజీరావు, సురేష్

అపరిచితులపై ప్రత్యేక దృష్టి

సీలేరు, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా యువత చొరవ తీసుకోవాలని గూడెంకొత్తవీధి సీఐ బి.సుధాకర్ అన్నారు. గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్త, దుప్పిలవాడ పంచాయతీ వలసగెడ్డలో గురువారం ఆయన పర్యటించారు. ఇటీవల గ్రామాల్లో ద్విచక్రవాహనాలు దొంగతనాలకు గురవుతున్నాయని, అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కదలికలను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. గంజాయి సాగు, రవాణాతో వ్యాపారులు లాభపడుతున్నారని, గిరిజనులు జైలు జీవితం గడపాల్సి వస్తోందని పేర్కొన్నారు. గిరిజనులంతా ఐక్యంగా గంజాయిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీలేరు ఎస్సై యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వలసగెడ్డలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

(c) eenadu

22న నగరానికి ముఖ్యమంత్రి రాక

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 22న గుంటూరు నగరానికి రానున్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి తపాలాశాఖ ఉద్యోగుల సత్కార కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈమేరకు నగరశివారు బొమ్మిడాలనగర్ సత్య సాయి ఆధ్యాత్మిక సొసైటీ ట్రస్టు ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్‌అశోక్ గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మంది తపాలా శాఖ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఆమేరకు అన్ని సౌకర్యాలు పక్కాగా ఉండాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డీఎస్పీ భానోదయ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు, ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో శ్రీనివాసరాజు, డీపీవో బి.వి.నాగసాయికుమార్, తహసీల్దార్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా.. సీఎం చంద్రబాబు సాయంత్రం 4 గంటలకు రోడ్డు మార్గాన గుంటూరు నగరశివారు బొమ్మిడాలనగర్ సత్యసాయి ఆధ్యాత్మిక సొసైటీ ట్రస్టు ప్రాంగణానికి చేరుకుంటారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి భారత్ నెట్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయనున్నారు. అనంతరం 7.45 గంటలకు రోడ్డుమార్గాన తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

ఈనాడు - అమరావతి

8 రోజులే గడువు

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

జిల్లాలో వ్యవసాయ భూములున్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా పొందాల్సి ఉంది. ఇక నుంచి పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్‌కార్డు, పంటల బీమా, పంట నష్టపరిహారం, సూక్ష్మ పోషకాల పంపిణీ, భూసార పరీక్షలు వంటి పథకాలకు రైతు విశిష్ట సంఖ్య కచ్చితంగా ఉండాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది.. రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకుని నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో లేని రైతులు ఎక్కడి నుంచైనా వారి చరవాణిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇందుకు ఫిబ్రవరి 28 వరకు గడువు ఉంది. సాగుకు సంబంధించిన ప్రతి అంశాన్ని రైతు విశిష్ట సంఖ్యతో అనుసంధానం చేస్తున్నందున తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి సూచించారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయాధికారిని సంప్రదించవచ్చన్నారు.

ఇప్పటిదాకా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు: 1,14,205 మంది

నమోదు చేయించుకోవాల్సిన వారు: 22,908 మంది

ఇలా పొందొచ్చు..

- https//apfr.agristak.gov.in వెబ్‌సైట్‌లో ఫార్మర్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.
- తొలుత పేరు, ఆధార్ నంబరు, ఆధార్ అనుసంధానిత చరవాణి నంబరు నమోదు చేయాలి.
- చరవాణి నంబరుకు వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి రైతు వివరాలు రిజిస్టర్ చేసుకుని పాస్‌వర్డ్ నమోదు చేసుకోవాలి.
- యూజర్ ఐడీగా చరవాణి నంబరు రిజిస్టర్ చేసి అంతకుముందు నమోదు చేసిన పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి.
- అనంతరం ఓటీపీ వచ్చాక ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి.
- తర్వాత రైతులకు వారి భూమికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. అవి సరిగా ఉన్నాయో లేదో చూసుకుని చరవాణికి వచ్చే ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి.
- ఆధార్‌లో ఉన్న పేరు, అడంగల్‌లో ఉన్న పేరు సరిపోతే రైతు విశిష్ట సంఖ్య సంబంధిత రైతుకు వస్తుంది.
- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్లను సరిచూసుకోవాల్సి ఉంటుంది.

మిర్చియార్డు పాలకవర్గం ప్రమాణస్వీకారం నేడు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కుర్రా అప్పారావు వెల్లడించారు. ఉదయం 12.06 గంటలకు మిర్చియార్డులో పదవీ బాధ్యతలు స్వీకరిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ర్యాలీ, ప్రమాణ స్వీకారసభ జరుగుతాయన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రింగ్‌రోడ్డులోని సాయిబాబా రోడ్డు జంక్షన్‌లో తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడ నుంచి కొరిటెపాడు, లక్ష్మీపురం మదర్‌థెరెసా విగ్రహం వైపు నుంచి ప్రధాన రహదారిలోకి చేరుకుని ఎన్టీఆర్ స్టేడియం మీదుగా చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సభకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారన్నారు. తనతో పాటు వైస్‌ఛైర్మన్ బిట్రగుంట మల్లిక, డైరెక్టర్లు అందరితో వారు ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు.

వ్యర్థాలను వేరు చేసి సంపద సృష్టి

- రూ.6 కోట్లతో మంగళగిరి-తాడేపల్లిలో నాలుగు మెటీరియల్ రికవరీ కేంద్రాలు

ప్రకాష్‌నగర్‌లో ఎంఆర్ఎఫ్ సెంటర్

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడంలో అధికారులు సఫలీకృతులయ్యారు. వచ్చిన చెత్త నుంచి తడి, పొడి వేరు చేసి అందులోని పొడి చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం తాడేపల్లి పరిధిలోని ప్రకాష్‌నగర్, మంగళగిరి పరిధిలోని ఎర్రబాలెం, నవులూరులో రూ.6 కోట్లతో కేంద్రాలు నిర్మించాలని సంకల్పించారు. ఇప్పటికే ప్రకాష్‌నగర్‌లో రూ.96 లక్షలతో కేంద్రం నిర్మించారు. ఇందులో పొడి చెత్త నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వ్యర్థ వస్త్రాలు, ఇతర పొడి వ్యర్థాలను సేకరించి వాటి ద్వారా సంపద సృష్టించేందుకు ప్రతిపాదించారు. ప్లాస్టిక్‌ను చిప్పింగ్ మిషన్ ద్వారా రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించారు. చిప్పింగ్ చేసిన అనంతరం వాటికి టెండర్ పిలిచి విక్రయించాలని సంకల్పించారు. ముందుగానే ప్లాస్టిక్ వ్యర్థాల విక్రయానికి టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు. ఇప్పటికే మంగళగిరిలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాన్ని(ఎంఆర్ఎఫ్ సెంటర్) నిర్వహిస్తున్నారు. చెత్త నుంచి ఎరువు తయారీతో పాటు ప్లాస్టిక్ నుంచి వచ్చిన చిప్స్‌ను విక్రయించనున్నారు. నగరంలో 91,728 హౌస్ హోల్డర్లు ఉండగా.. రోజుకు సగటున 146 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేసి సంపద కేంద్రాల ద్వారా నగరానికి ఆదాయం సమకూరేలా అధికారులు చర్యలను చేపట్టారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నియోజకవర్గంలో రహదారులకు నిధులివ్వండి

తాడికొండ, న్యూస్‌టుడే: రాజధాని నియోజకవర్గంలో రహదారులను పూర్తి అధ్వానంగా మారి ప్రయాణానికి ప్రమాదకరంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రసంగం రహదారులు, కొండవీటి వాగు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా తాడికొండ, పెదపరిమి నుంచి తుళ్లూరు, నేషనల్ హైవే నుంచి కంతేరు, తాడికొండ గ్రామానికి వెళ్లే రహదారులు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా పేరేచర్ల నుంచి భారీ టిప్పర్లు కంకర, మట్టితో బండారుపల్లి, పొన్నెకల్లు, తాడికొండ గ్రామాల మీదుగా వెళుతున్నాయని, నిర్దేశిత లోడ్‌కు మించి బరువులు తీసుకువెళుతున్నారని తెలిపారు. దీనివల్ల రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. హైకోర్టు, సీఆర్‌డీఏ, సచివాలయ అధికారులకు సైతం తిప్పలు తప్పడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం రాష్ట్రానికి ఎంతో అవసరమైనప్పటికీ నిర్మాణంలో భాగంగా రహదారులు అధ్వానంగా మారి రాజధాని ప్రజలు, అధికారులు చేరుకోలేని స్థితిలో ఉన్నాయని వివరించారు. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా టిప్పర్ల తాకిడికి నాశనమైపోతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

కొండవీటి వాగు సమస్యపై దృష్టి సారించాలి

గుంటూరు నుంచి రాజధానికి వచ్చే ప్రయాణికులు, ఉద్యోగులు, హైకోర్టు న్యాయమూర్తులకు కొండవీటి వాగు తీరని సమస్యగా మారిందని గుర్తుచేశారు. ఏటా వర్షాకాలంలో వరదలకు కొండవీటి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోందన్నారు. లాం గ్రామ శివారు వంతెనపై రోజుల తరబడి రహదారులపై నీళ్లు నిలిచి అమరావతికి రాకపోకలు నిలిచిపోతున్నాయని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. వరదలో పడి ప్రాణాలు సైతం కోల్పోతున్నారని పేర్కొన్నారు. లాం వంతెన నిర్మాణానికి 2014 గత తెదేపా హయాంలో 13.60 లక్షలతో ప్రతిపాదనలు చేశారన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొండవీటి వాగు అభివృద్ధి పనులు అటకెక్కించడంతో నిధులు వెనక్కి వెళ్లాయని తెలిపారు. శాఖ స్పందించి కొండవీటి వాగు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు.

21న విద్యుత్తు వినియోగదారుల న్యాయ సదస్సు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పేరేచర్లలో ఈ నెల 21వ తేదీన విద్యుత్తు వినియోగదారుల న్యాయ సదస్సు జరుగుతుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని సాయి కృష్ణ కల్యాణ వేదికలో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు. చిలకలూరిపేట డివిజన్ పరిధిలోని గుంటూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట పట్టణం, రూరల్, గణపవరం, యడ్లపాడు మండలాల ప్రజలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పగలు కన్నేసి.. రాత్రి కన్నమేసి

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

తాడికొండ, న్యూస్‌టుడే

తాడికొండ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న వరుస చోరీలపై ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఓ పక్క పోలీసులు తీరిక లేకుండా బందోబస్తుల్లో ఉండటం... ఇదే అదనుగా భావించిన దొంగలు వివిధ ప్రాంతాల్లో చోరీలకు తెగబడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, ఆలయాలు, ఇంటి బయట వాహనాలు, మోటార్లు ఇలా దొరికిన వస్తువులను మాయం చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

బండారుపల్లి ఆలయంలో హుండీ పగలగొడుతున్న దొంగలు (పాత చిత్రం)

ఇవిగో ఘటనలు

■ ఇటీవల పొన్నెకల్లు గ్రామంలో ఫిబ్రవరి 9న తాళాలు వేసి ఉన్న కె.శౌరిరెడ్డి ఇంటి తలుపులు పగులగొట్టి సుమారు 450 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి దొంగతనం చేశారు. వాటి విలువ రూ.90 లక్షల వరకు ఉంటుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుట్టూ ఇళ్లు ఉన్నప్పటికీ దొంగలు గుట్టుచప్పుడు కాకుండా వస్తువులను దోచేశారు.

■ అదే గ్రామంలో ముప్పాళ్ల పూర్ణచంద్రరావుకు చెందిన ఓ గేదె, పి.పిచ్చయ్య, గుడిసె శ్రీనివాసరావులకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఆయా కేసుల్లో చోరులు ఇప్పటి వరకు దొరకలేదు.

■ తాడికొండ గ్రామంలో జనవరి 29న ద్విచక్ర వాహనాలు వరుసగా చోరీకి గురయ్యాయి. ఇంటి బయట హ్యాండిల్ లాక్ వేసి ఉన్నా వీటిని చోరీ చేశారు.

■ గత ఏడాది డిసెంబర్ 2వ తేదీన బండారుపల్లిలోని ఓ ఆలయంలో ముగ్గురు వ్యక్తులు ముసుగులు వేసుకుని హుండీని పగలగొట్టి నగదు దోచేశారు.

సీసీ కెమెరాలు లేని ప్రాంతాలే లక్ష్యంగా...

గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు దొంగతనానికి అనువుగా ఉండే ప్రాంతాలను పగటి వేళ పరిశీలించి రాత్రి ఆయా చోట్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఏదో ఒక చిరువ్యాపారం చేసే సాకుతో వస్తూ చోరీలకు పాల్పడుతూ అనంతరం కనుమరుగవుతున్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు లేని ప్రాంతాలనే లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. అర్ధరాత్రి ఇంటి బయట పార్క్ చేసి ఉంచే ద్విచక్ర వాహనాలు, ఇంటి ఆవరణలో ఉండే నీటి మోటార్లను మాయం చేస్తున్నారు.

పోలీసులు ఏం చేస్తున్నట్లు?

రాజధాని ప్రాంతం కావడంతో పోలీసులు ఎక్కువగా బందోబస్తు విధులకు వెళుతుంటారు. ఆ సమయంలో తాడికొండ పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐలు అతితక్కువ సమయమే అందుబాటులో ఉంటున్నారు. దీనికితోడు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కొంతమందికి పోస్టింగ్ తాడికొండలో ఇచ్చినా విధులు మాత్రం వేరే ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఉన్న కొద్ది సిబ్బంది బందోబస్తు, ప్రభుత్వ కార్యక్రమాలకు వెళుతుండటంతో స్టేషన్‌లో సిబ్బంది కొరత ఏర్పడింది. దీనివల్ల బాధితులకు తిప్పలు తప్పడం లేదు. రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు ప్రాధాన్యం దృష్ట్యా ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

డేటా అనలిటిక్స్‌పై సెమినార్

గుంటూరు రూరల్: ఆధునిక యుగంలో డేటా అనలిటిక్స్ రంగం వేగంగా మారుతుందని చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కేశవ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో డేటా అనలిటిక్స్‌పై సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశాలు పొందేవారు ఫిబ్రవరి 20 నుంచి మార్చి 10 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈవోలు సత్యనారాయణ మూర్తి, నిర్మల తెలిపారు. ఐదేళ్లు నిండిన విద్యార్థులు ఇందుకు అర్హులు. వారు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించవచ్చని చెప్పారు.

ఇంటర్ ప్రశ్నపత్రాలొచ్చాయ్..

పెదనందిపాడు: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి గురువారం అధికారులు ప్రశ్నపత్రాలు కస్టోడియన్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. ఆ పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రధాన పర్యవేక్షకులు హైమావతి, శాఖ అధికారి దుర్గానాగేంద్రప్రసాద్ సీలు వేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 110 మంది, ద్వితీయ ఏడాది 97 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని ప్రిన్సిపల్ వీర రాఘవయ్య తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

పెదనందిపాడు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వారి ఆరోగ్యాన్ని రక్షించాలని వాటర్ ఎయిడ్ ఇండియా జిల్లా సమన్వయకర్త శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ సహాయకులు, యానిమేటర్లకు, నీటి నాణ్యతపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నీటి పరీక్షలు చేసే విధానాన్ని వివరించారు. మండలంలో పంచాయతీలకు నీటి నాణ్యత పరీక్ష కిట్లను (రూ. 25వేల విలువగల) ఉచితంగా అందజేశారు.

పరిశుభ్రతపై అవగాహన

మంగళగిరి గ్రామీణం: కాజలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ టెక్నాలజీ విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పీవోలు డాక్టర్ సునీత, డాక్టర్ రాధిక, డాక్టర్ సుమలతలు హాజరయ్యారు.

ప్రచార గోడపత్రులు ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తాడేపల్లి: మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రి నారా లోకేశ్‌ను ఆలయ పాలకవర్గం గురువారం ఆహ్వానించింది. ఈ మేరకు ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రిక అందజేసింది. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రచార గోడపత్రులను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 5 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పాలకవర్గం ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల వివరాలను తెలుసుకున్న ఆలయ అధికారులు బ్యానర్‌కోట్ విడుదల చేశారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఆలయ పాలకవర్గంతో పాటు అర్చకులు, అధికారులు ఉన్నారు.

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు భరోసా

తాడికొండ, న్యూస్‌టుడే: గుంటూరు జేకేసీ రోడ్డులోని తాడికొండ నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో రూ.71.25 లక్షల చెక్కులను ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌తో ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి వారోత్సవాలు ప్రారంభం

గారపాడు (వట్టిచెరుకూరు): కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గారపాడులో ప్రపంచ క్షయవ్యాధి వారోత్సవాలను వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గురువారం నిర్వహించారు. సీహెచ్‌వో విజయ సుశీల మాట్లాడుతూ.. ప్రారంభ దశలోనే వైద్యం అందించాలని సూచించారు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నెలకు రూ.1000 అందజేస్తుందని చెప్పారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

మేడికొండూరు: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ లీమినేని వందనాదేవి పేర్కొన్నారు. మేడికొండూరు గ్రంథాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, దాతల సాకారంతో పాడైపోయిన భవనాలు బాగు చేయడం, కొత్తవి కట్టించడం వంటి చర్యలు చేపట్టామన్నారు. వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

నేటి నుంచి ఉద్ఘోష్- 2026

ఫ్లెక్సీ ఆవిష్కరణలో కళాశాల ఛైర్మన్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ నాగశ్రీనివాసరావు

తాడికొండ, న్యూస్‌టుడే: స్థానిక మోతడక చలపతి కళాశాలలో జాతీయ స్థాయి ఉద్ఘోష్-2026 కార్యక్రమం శుక్రవారం ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ కొల్లా నాగశ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సాంకేతిక, క్రీడ, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపాలని కోరారు. తమ విద్యార్థులు కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌ల ద్వారా నూతన ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. కళాశాల ఛైర్మన్ వై.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా ఉద్ఘోష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. టెక్నికల్, స్పోర్ట్స్, కల్చరల్ విభాగాల్లో ప్రత్యేక ఈవెంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో విజేతలకు రూ.5 లక్షల బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల డీన్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ముగింపు రోజున ముఖ్యఅతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాల ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలియజేశారు. అనంతరం కళాశాల అడ్మినిస్ట్రేషన్ భవనంపై 50 అడుగుల ఉద్ఘోష్-2026 ఫ్లెక్సీని ఆంజనేయులు ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మంగళగిరి, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని మంగళగిరిలో శోభాయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటుచేసి నగర వీధుల్లో ఊరేగించారు. వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు భాజపా నాయకులు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు పంచుమర్తి ప్రసాద్, బిట్రా రామాంజనేయులు, కొత్తపల్లి దనుంజయరావు, శీలం నారాయణతో పాటు భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివన్నారాయణ, రామకృష్ణ, మహేష్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: శోభాయాత్రలో భాజపా నాయకులు తదితరులు

కాకుమాను: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న...

కాకుమాను, న్యూస్‌టుడే: కాకుమానులో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం భాజపా నేత శ్రీధర్, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు శివాజీ వేషధారణ ధరించి వీర చరిత్రపై ప్రదర్శన చేశారు.



కోవాబన్ విక్రేత వలీకి సీపీఎం సంఘీభావం

తాడేపల్లి, న్యూస్‌టుడే: మత సామరస్యాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి కూడలిలో ఆ పార్టీ నాయకులతో కలిసి కోవాబన్ విక్రేత వలీకి సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు రవి, ప్రజాసంఘాల నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, రాఘవయ్య, విజయ బాస్కర్‌రెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు దరఖాస్తులు

దుగ్గిరాల: కొత్తగా పింఛను కావాలనుకునే వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. గురువారం దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో ప్రజలు బారులు తీరారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో అందజేస్తున్నారు.

రాజధాని నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలి

తాడేపల్లి: రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చే నిధులే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో కూడా అదనంగా కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. గురువారం తాడేపల్లి మండలం ఉండవల్లిలో ఆ పార్టీ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాజధానిలోని వివిధ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. రైతులకు కేటాయించిన ప్లాట్లు, వాటికి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని కోరారు. రాజధాని డివిజన్ పార్టీ కార్యదర్శి రవి, నాయకులు ఇమానియేల్‌రాజు, నవీన్‌ప్రకాష్, ఎర్రపీరు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఫిరంగిపురం న్యూస్‌టుడే: ఇమ్మి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు డా.పూలగూర రంజన్ బాబు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఫిరంగిపురంలోని ఇమ్మి నర్సింగ్ కళాశాల, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు డా.ఇమాన్యుయేల్ ప్రకాష్ తెలిపారు. తొలుత రంజన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 81 మంది రక్తదానం చేశారు.

కార్యక్రమంలో భాష్యం రామకృష్ణ

నిత్యావసర సరకుల అందజేత

మంగళగిరి గ్రామీణం: పెదవడ్లపూడి ఏటీపీఎం హైస్కూల్‌లో విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన నిత్యావసర సరకులను లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి నూతలపాటి రవిప్రకాష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా భాష్యం రామకృష్ణ, ఏఎస్ రామకృష్ణలు పాల్గొని ప్రసంగించారు లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీరాధా, కర్రా హనాక్‌బెంజిమెన్, శ్రీశాంతి, ఉషాకుమారి, గౌరీశంకర్, భాష్యం బాలస్వామి, కరస్పాండెంట్ మరియదాసు పాల్గొన్నారు.

రూ.కోటితో రోడ్డు పనులు

మండలంలోని కొర్నెపాడు, గుంటూరు నగర పాలకసంస్థలోని జోనం చుండూరు మధ్య పంచాయతీరాజ్ శాఖ పరిధిలో తారురోడ్డు నిర్మాణ పనులను జేఈఈ వెంకటరత్నం గురువారం ప్రారంభించారు. రూ.కోటి వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం 2.5 కి.మీ దూరం తారుతో నిర్మిస్తున్నారు. ఈ పనులు నిర్వహణలో కీలకపాత్ర వహించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్లరామాంజనేయులు రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చారు. దశాబ్దాల నుంచి గుంతలతో నిండిన రహదారిని కూటమి ప్రభుత్వం తారు రోడ్డుగా మార్చిందని స్థానికులు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, కొర్నెపాడు (వట్టిచెరుకూరు)

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

మంగళగిరి బ్రాంచ్, నెం.5-470 & 5-470ఎ, తెనాలి రోడ్డు, మంగళగిరి.
ఫోన్: 08645-234208, E-mail: iob3798@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (నెం.54 ఆఫ్ 2002) క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: కొర్రపాటి గౌరి శంకర్ (మేనేజింగ్ డైరెక్టర్ : ఎస్‌డిఎన్ టెలికామ్ ప్రైవేట్ లిమిటెడ్) & హామీదారు, తండ్రి: నరసింహారావు, 10-1064-జడ్-28, బిఎస్ఆర్ నగర్, మార్కాపురం, ప్రకాశం జిల్లా - 523316. సీతా మహేష్ (డైరెక్టర్ : ఎస్‌డిఎన్ టెలికామ్ ప్రైవేట్ లిమిటెడ్) & హామీదారు, తండ్రి : సీతా శ్రీనివాసులు, 2-88, రామాయణపు వీధి, పోరుమామిళ్ళ గ్రామం, కడప - 516193. నితిన్ కనగరాజ్ (హామీదారు & తనఖాదారు), తండ్రి : కనగరాజ్ వేలుసామి, 125/2, ఎఆర్ నగర్, మెంగ్లెస్ రోడ్డు, డిండిగల్, తమిళనాడు - 624001.

బకాయి మొత్తం : తేది.21.01.2026 నాటికి రూ.59,75,390/-, NPA తేది. 31.12.2020, డిమాండ్ నోటీసు తేది : 03.07.2021

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.03-07-2021 నాటికి రూ.35,71,449/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 09.03.2022

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.09-03-2022 నాటికి రూ.38,20,710/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం, లింగాయపాలెం గ్రామం మరియు పంచాయితీ, డోర్ నెం. 2-40-1, బ్లాక్ నెం.2, డి.నెం.178 వద్ద 185.1/2 చ॥గ॥లు లేదా 155.09 చ॥మీ॥ల నివాస స్థల ఏరియా విస్తీర్ణంలో నిర్మాణంతో గల యావత్తు ఆస్తి రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.133/2017, తేది.18.08.2017 ప్రకారం శ్రీ నితిన్ కనగరాజ్, తండ్రి : కనగరాజ్ వేలుసామి గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు: తూర్పు: ఉమ్మడి నడవ - 22.3 అ॥లు, దక్షిణం : వెంపరాల అప్పయ్య గారు ఇతరులకు అమ్మిన ఆస్తి - 75 అ॥లు, పడమర : అనుమోలు లలితమ్మ మరియు ఇతరులకు చెందిన స్థలం - 22.3 అ॥లు, ఉత్తరం : మాదల శివనారాయణ గారికి చెందిన ఈప్స్ నీరు పడే స్థలం - 75 అ॥లు.,

రిజర్వుధర: రూ.17,63,000/- ధరావత్తు ధర : రూ.1,76,300/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.25,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: తేది.23-03-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 10 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 23-03-2026, మధ్యాహ్నం 1.00 గంటలోపు బదిలీ చేయవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి ఋణభారములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.20-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:20-02-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.23-03-2026, మ॥ 1.00 గం॥ వరకు

* (ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in, మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచ్, ఎమ్ పి కళ్యాణ మండపం ప్రక్కన, తెనాలి రోడ్డు, మంగళగిరి - 522503. ఫోన్: 8925953798 లేదా సర్వీస్ ప్రొవైడర్ :M/s. Bank Asset Auction Network (BAANKNET), రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: psba@psballiance.com (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 18-02-2026, ప్రదేశం : మంగళగిరి సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

'ఆదివారం సెలవు రద్దు తగదు'

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు రద్దు చేయడం పట్ల మంగళగిరిలోని నగరపాలక కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ మంగళగిరి కమిటీ ఆధ్వర్యాన గురువారం సాయంత్రం కార్యాలయం గేటు వద్ద బైఠాయించారు. కార్మికులకు ఆదివారం సెలవు పునరుద్ధరించి ఎంబుక్ కార్మికులకు గురువారం సెలవు ఇవ్వాలని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య కోరారు. అనంతరం అధికారులు సెలవు దినం కొనసాగిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు నగరపాలక అడిషినల్ కమిషనర్ శకుంతలను కలిసి తమ డిమాండ్ల వినతి పత్రం అందజేశారు. నాయకులు చిన్ని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పాస్ పుస్తకం నకిలీదే'

వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ హేనాప్రియ

పెదనందిపాడు: పెదనందిపాడుకు చెందిన కొలసాని కోటయ్య భూమి 2.15 ఎకరాలు వేర్వేరు సర్వే నంబర్లు గల వివరాలతో నకిలీ పాస్‌పుస్తకం సృష్టించి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బండారుపల్లి సుబ్బయ్య 2012లో రూ. 90వేలు రుణం తీసుకున్నారని అది ఇప్పుడు వడ్డీతో సహా రూ. 3.50 లక్షలయ్యిందని కోటయ్య సోదరులు తెలిపారు. ఈ విషయమై సోదరులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు గురువారం తహసీల్దార్ హేనాప్రియకు ఫిర్యాదు చేసి ఆ వివరాలను అందజేశారు. ఆమె దస్త్రాలను పరిశీలించి బండారుపల్లి సుబ్బయ్య పేరుతో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకం నకిలీ దేనని తేల్చి చెప్పారు. తమ వద్దనున్న పూర్తి వివరాలు గల దస్త్రాలను అందిస్తామని తెలిపారు.

దుగ్గిరాలలో చోరీ కేసులో పురోగతి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక బ్రాహ్మణ బజారులో చోటుచేసుకున్న చోరీ కేసుకు సంబంధించి పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. పోలీసుల లెక్క ప్రకారంగానే 2025 సెప్టెంబర్ 22న స్థానికుడు కొల్లిపర చంద్రశేఖర్ ఇంట్లో 98 గ్రాముల బంగారు నగలు అపహరించారు. రూ. 10 లక్షల వరకు ఉంది. దొంగతనాల్లో ఆరితేరిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి ఈ దొంగతనం చేసినట్లు చెబుతున్నారు. పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రంజాన్ నెల మొదలు కావడంతో స్థానిక అలీనగర్ మసీదును విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు సిటి, శ్రీనగర్ 8వ లైను, డోరు నెం.7-16-178బి రు కాపురస్తులు పోచిరాజు శివప్రసాద్‌రావు గారి కుమారుడు **పోచిరాజు కొండారావు** గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది-

నా క్లయింటు పేరిట గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా యిలాకా చౌడవరం గ్రామ డి.నెం.359 నందు య.0-54 శెంట్లు భూమి తన తండ్రిగారి నుండి దఖలు దస్తావేజు నెం. 601/2019 రుగా ప్రత్తిపాడు ఎస్ఆర్ఓ. నందు రిజిష్టరు కాబడినది. కాగా నా క్లయింటు పేరటకు రిజిష్టరైన దఖలు దస్తావేజు నెం. 601/2019 మరియు మొదటి లింకు దస్తావేజు అనగా నా క్లయింటు తండ్రి పేరటకు డి.31-08-2017న ప్రత్తిపాడు ఎస్ఆర్ఓలో రిజిష్టరైన దఖలు దస్తావేజు నెం. 3644/2017 ఒరిజినల్స్ నా క్లయింటు వద్దే కలవు.

కాగా, అంతకుముసుపటి రెండు లింకు దస్తావేజులు నెం. 84/1972 మరియు ద.నెం.119/1990 ఒరిజినల్స్‌ను ది.12-02-2026న నా క్లయింటు పుల్లడిగుంట వద్ద ఫొటోస్టాట్ తీయించుకునేందుకు వెళ్లుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేసి తగిన పారితోషికము పొందగలరు. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ 7 రోజులలోగా తెలియజేయగలరు.

పులివర్తి శ్రీనివాస్,
అడ్వకేట్ & నోటరీ, 6/4 అరండల్‌పేట,
గుంటూరు, సెల్: 9885652296

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరురూరల్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు అడవి తక్కెళ్లపాడుకు చెందిన తమ్మిశెట్టి సురేష్ (36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించగా కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. ఈ క్రమంలో మద్యానికి దూరంగా ఉండమని వైద్యులు సూచించారు. కానీ కొంతకాలంగా మళ్లీ తాగుతుండటంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. బాధ భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని భార్య రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోతవరం వాసి..

తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన ఆవుల తిరుమలకొండ(45) గుంటూరు జిల్లా తాడేపల్లి బోటు యార్డు వద్ద డెల్టా కాలువ పక్కన చెట్టుకు గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. అతడి మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు శవపంచనామా నిమిత్తం తరలించినట్లు తెలిపారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే తిరుమలకొండకు ఇద్దరు సంతానం. ఒకరు వడ్డేశ్వరంలోని కేఎల్ యూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు 8వ తరగతి గుంటూరు భాష్యం పాఠశాల వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తిరుమలకొండ.. పెద్దకుమారుని వద్దకు వెళుతున్నానని చిన్నకుమారునికి చెప్పి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పాఠశాల బస్సు డ్రైవర్‌పై దాడి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి మత్తులో ఉన్న ఆటోడ్రైవర్ కటారి సాయి అనే యువకుడు.. ప్రైవేటు స్కూల్ బస్సు నడుపుతున్న నరేంద్రర్‌రెడ్డిపై దాడి చేసిన సంఘటన గురువారం చినకాకానిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్కూల్ పిల్లల్ని వదిలిపెట్టడానికి నరేంద్రరెడ్డి బస్సులో చినకాకాని గ్రామానికి వెళ్తుండగా.. గంజాయి, మద్యం మత్తులో ఉన్న ఆటోడ్రైవర్ కటారి సాయి తన ఆటోను బస్సుకు అడ్డుగా నిలిపాడు. ఈ విషయంలో ప్రశ్నించిన బస్సు డ్రైవర్‌ను కొట్టి భయాందోళనకు గురిచేశాడు. స్కూల్ బస్సుపై రాయితో దాడి చేయగా నరేంద్రర్‌రెడ్డికి గాయాలైనట్లు సమాచారం. ఆటో డ్రైవర్ గతంలో కూడా పలుమార్లు ఇలాంటి సంఘటనలు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

గుంటూరురూరల్: లారీ ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .కోయవారిపాలెంకు చెందిన నాగం శ్రీనివాసరావు గురువారం సెంట్రింగ్ సామగ్రిని తీసుకుని తక్కెళ్లపాడు వెళుతుండగా ఏటుకూరు సమీపంలో లారీ ఢీకొట్టింది. గాయపడిన శ్రీనివాసరావును జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుని భార్య బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

తెనాలి
•తెనాలి • పొన్నూరు

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: శాసనసభ విరామ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి, అసంపూర్తిగా మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వివిధ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు.

ఎల్‌ఎల్‌బీ.. ఆర్కిటెక్చర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని న్యాయ విభాగం, ఆర్కిటెక్చర్ కళాశాలలో గతేడాది నవంబరులో నిర్వహించిన పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ గురువారం విడుదల చేశారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో ఐదో సెమిస్టర్, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీలో 9వ సెమిస్టర్ పరీక్షలో 760 మంది పరీక్ష రాయగా 543 మంది, ఆర్కిటెక్చర్ ఐదో ఏడాది రెండో సెమిస్టర్‌లో 9 మంది పరీక్ష రాయగా ఆరుగురు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

తెనాలి మార్కెట్ యార్డులో..
నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 8300
అత్యల్పం: 7000
సగటు: 7500
- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు 2వ వార్డులో వంతెన అడుగు భాగం పగుళ్లిచ్చింది. మరమ్మతులు చేసే విధంగా చూడాలి. - పి.కాశీనాథ్, 2వ వార్డు.
✔ వంతెనకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - షేక్ హసీనా, సహాయ ఇంజినీరు
? పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు పార్కు, రోడ్లలో చెత్త పేరుకుంది. - కె.రాఘవరావు, నిడుబ్రోలు
✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి
✦ పట్టణ పరిధి 7వ వార్డులోని మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి. ✦ 23వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగుచేశారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

భళా.. విద్యార్థినుల కళ

11 ఏళ్లుగా వివిధ నృత్యాంశాల్లో శిక్షణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

కూచిపూడి నృత్య శిక్షణలో బాలికలు

తెనాలిలోని దొడ్డపనేని ఇందిర పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు కళల్లోనూ రాణిస్తున్నారు. కూచిపూడి, జానపద నృత్యాల్లో పాటు దేశ భక్తి గీతాలు, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఆ చట్టాన్ని వివరించే స్కిట్లు వంటి వాటిల్లో తర్ఫీదు పొందుతున్నారు. కూచిపూడి నృత్యంలో ఎంఏ చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నృత్య గురువు చల్లా బాలాత్రిపురసుందరి విద్యార్థినులకు వాటిని నేర్పుతున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. రోజూ ఎంపిక చేసిన సమయాల్లో తరగతులు కొనసాగుతున్నాయి. 2015 నుంచి ఈ పాఠశాలలో విద్యార్థినులకు నృత్యాంశాల్లో తర్ఫీదు కొనసాగుతుందని గురువు బాలాత్రిపురసుందరి చెప్పారు.

చక్కగా సాధన..

తెనాలిలో ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ లేని విధంగా మా స్కూల్లో ఇలా సంప్రదాయ నృత్యాల్లో శిక్షణ పొందే అవకాశం విద్యార్థినులకు దక్కడం సంతోషంగా ఉంది. విద్యార్థులు చక్కగా సాధన చేస్తున్నారు. వేదికలపై నృత్య ప్రదర్శనలతో అబ్బురపరుస్తున్నారు. అందరికీ సాధన చేసే అవకాశం ఉండేలా సమయాలను కేటాయిస్తున్నాం. - టి.రాఘవయ్య, ప్రధానోపాధ్యాయుడు

వేదిక భయం పోయింది - వెన్నెల, బేబి విద్యాశ్రీమయి - 9వ తరగతి

కూచిపూడి, జానపద నృత్యాల సాధన వల్ల ఉత్సాహం, ఆనందంగా ఉంటుంది. వేదిక భయం పోయింది. ఒత్తిడి దూరమైంది. పదో తరగతి తర్వాత కూచిపూడి డిప్లొమా కోర్సు చేస్తాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో నృత్యాంశాలను ప్రదర్శించి ప్రముఖుల అభినందనలు అందుకోవడం సంతోషంగా ఉంది.

భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం - సాయిలక్ష్మి, అభిలాష - 9వ తరగతి

తెలుగు, హిందీ భాషా దినోత్సవాల సందర్భంలో ఆయా భాషల విశిష్టతను నృత్యంతో జోడించి ప్రదర్శించడం ద్వారా వాటి గురించి సమగ్రంగా తెలిసింది. కన్యాశుల్కం వంటి నాటికలు, చదువు ప్రాధాన్యం వివరించే స్కిట్లు ప్రదర్శించడం వల్ల బిడియం పోయింది. రానున్న రోజుల్లోనూ సాధన కొనసాగిస్తాం.

'నరేగా రద్దుతో పనిదినాల కోత'

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక భాజపా రద్దు చేసిన నరేగా చట్టాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పేర్కొన్నారు. ఆయన గురువారం తెనాలిలో మాట్లాడారు. నరేగా రద్దుతో స్థానిక సంస్థల నిధులు, కార్మికుల పనిదినాలకు కోత పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం పరిరక్షణ యాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర శుక్రవారం తెనాలి వస్తున్న సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పూలదేవి వద్ద రద్దుకు గల పూర్వాపరాల గురించి చెబుతారని తెలిపారు.

ఘనంగా శివాజీ జయంతి

శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హైందవ సంఘ నాయకులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసిన గొప్ప రాజు ఛత్రపతి శివాజీ అని యోగా గురువు పులి సీతారామయ్య అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని చేబ్రోలులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాదరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ల ఊసేది..?

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపు సభ్యులు తెనాలి పురపాలిక కార్యాలయం వద్ద ప్రభుత్వం చూపించిన రోడ్డులో పెట్టుకున్న అర్బన్ మార్కెట్‌లో తమ ఉత్పత్తులు విక్రయిస్తూ మెరుగైన జీవనం గడుపుతున్నారు. గత కొన్ని నెలలుగా కమిషనర్లు అర్బన్ మార్కెట్ ఊసే తేవడం లేదు. వీరికి ఇచ్చిన కొద్దిపాటి అవకాశం కూడా స్తంభించిపోయిన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్బన్ మార్కెట్లను పునరుద్ధరించాలని మహిళలు కోరుతున్నారు.

✦ జిల్లాలో ఎస్‌హెచ్‌జీ మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో చిన్నపాటి వ్యాపారాలు నడుపుతున్నారు. ఈ క్రమంలో వారు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయానికి జిల్లా అధికారులు ఒక వేదికను చూపారు. అప్పటి నుంచి నెలకు 2 రెండు సార్లు అమ్మకాలు చేసేలా అవకాశం కల్పించారు. ఇది బాగున్నా ఉందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో అప్పటి వరకు కొనసాగుతున్న మెప్మా బజార్ అందుబాటులో ఉండేది. దీనికి అర్బన్ మార్కెట్‌గా నామకరణం చేశారు. తెనాలిలో కనీసం 40 మంది మహిళలు ఉత్పత్తులు అమ్మేవారు.

పట్టణ మహిళల ఎదురుచూపు..

గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లిలోని అర్బన్ మార్కెట్లకు మంచి ప్రజాదరణ లభించింది. ఆ తరువాత నుంచి వీటి అమ్మకాలకు ఊసేలేదు. వీటి అమ్మకాలకు పచ్చజెండా ఊపుతారేమోనని పట్టణ పేదలు ఎదురు చూస్తున్నారు.

సమన్వయలోపం.. ట్రేడ్ లైసెన్సుదారులకు శాపం

రుసుములు చెల్లించడానికి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వ్యాపారులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయలోపం పట్టణ ట్రేడ్ లైసెన్సుదారులకు శాపంగా మారింది. ట్రేడ్ లైసెన్స్ చెల్లిద్దామని కొందరు వ్యాపారులు గురువారం మున్సిపల్ కార్యాలయ పాత భవనంలోని హెల్త్ సెక్షన్ వద్దకు వచ్చారు. సంబంధిత ఉద్యోగి కమిషనర్ వద్దకు వెళ్లారని, వస్తారని సిబ్బంది కూర్చోబెట్టారు. ఎన్ని గంటలు కూర్చున్నా రాలేదు. ప్రత్యామ్నాయంగా వేరే వాళ్లను నియమించలేదు. కనీసం ఆస్తిపన్ను కట్టించుకునే పుర సేవా కేంద్రంలో చెల్లిద్దామంటే కుదరదని చెప్పారని వారు వాపోయారు. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. మంత్రి నాదెండ్ల మనోహర్ శిథిల మున్సిపల్ భవనంలో నుంచి కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లోకి మార్పు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కానీ ఆ హెల్త్ సెక్షన్ వారు ఇప్పటికీ ఆ భవనంలోకి మారలేదు.

ఫ్లెక్స్ రెజ్యూమ్ గోడపత్రిక ఆవిష్కరణ

ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ తదితరులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: అమెరికాకు చెందిన ఫ్లెక్స్ రెజ్యూమ్ సంస్థ రూపొందించిన గోడపత్రికను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ గంగాధర్ మాట్లాడుతూ.. ఈ అప్లికేషన్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంస్థ సీఈవో గిరిధర్ మాట్లాడుతూ.. అప్లికేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌తో పని చేస్తోందన్నారు. రెజ్యూమ్ షార్ట్‌లిస్ట్ అయ్యేందుకు దోహదం చేస్తుందని చెప్పారు. ఉద్యోగానికి సరిపోయేలా రెజ్యూమ్‌లో మార్పులు చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు రాబోయే ఆరు నెలలు ఉచితంగా ఈ అప్లికేషన్‌ను వినియోగించుకోవచ్చన్నారు. సీడీఈ సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, పరిశోధన విభాగం సమన్వయకర్త ఆచార్య సుధాకర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చుందూరుపల్లిలో విఫలమై.. చింతలపూడిలో చోరీ చేసి

బాపట్ల, న్యూస్‌టుడే: పొన్నూరు మండలం చింతలపూడిలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు చోరీ ఘటనలో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజేష్ దొంగల ముఠా ఒంగోలులో చోరీకి పాల్పడి నగదుతో కారులో సూర్యలంక బీచ్‌కు వచ్చి గడిపింది. సోమవారం అర్ధరాత్రి గుంటూరు వెళ్లే మార్గమధ్యలో తొలుత బాపట్ల మండలం చుందూరుపల్లిలో మన్నె ప్రసాద్ ఇంట్లో చోరీకి యత్నించారు. ప్రసాద్ కుమారుడికి శస్త్రచికిత్స చేయించడానికి కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి పొన్నూరులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న రాజేష్ ముఠా తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. మొదట బీరువా తాళం పగులగొట్టి తెరిచారు. అందులో కేవలం పట్టుచీరలు మాత్రమే ఉండటంతో బంగారు ఆభరణాలు, నగదు ఉన్న రెండో బీరువా తెరవడానికి ప్రయత్నిస్తుండగా శబ్దం రావటంతో పొరుగింటి వారు నిద్ర లేచి కేకలు వేయటంతో దొంగల ముఠా పరారైంది. అనంతరం చింతలపూడి వెళ్లి పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో చోరీకి పాల్పడింది. చుందూరుపల్లిలో చోరీ యత్నం చేసిన దొంగల ముఠాపై యజమాని ప్రసాద్ ఫిర్యాదు మేరకు బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేడుకగా ఇఫ్తార్ విందు

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో తొలి రోజైన గురువారం ఉపవాస రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలిలోని మసీదుల్లో ఉపవాసుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెనాలి జామియా మసీదులో తొలి ఇఫ్తార్‌కు పెద్ద సంఖ్యలో ఉప వాసులు హాజరయ్యారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

'శాంతి భద్రతలకు భంగం కలగనివ్వం'

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి జిల్లా ఆసుపత్రిలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు పట్టణ త్రీ టౌన్ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. ఆయన గురువారం ఆసుపత్రిలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వార్డులో చికిత్స పొందుతున్న కొందరు రోగులు బయట మద్యం తాగుతున్నారని.. కొందరు సహాయకులు మద్యం తెచ్చి వారికి ఇస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ

దొడ్డపనేని ఇందిర పురపాలక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 151 మంది విద్యార్థినులకు గురువారం సమత (ఫ్రెండ్స్) అధ్యక్షుడు జి.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని బహూకరించారు. సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

బెదిరింపులకు దిగితే చర్యలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: యాచన పేరుతో ప్రజలను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవని హిజ్రాలను తెనాలి త్రీ టౌన్ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభోత్సవాలు, ఇతర వేడుకల సందర్భంగా ఆయా చోట్లకు గుంపులుగా వెళ్లి హడావుడి చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని.. తీరు మార్చుకోవాలని సూచించారు.

మురుగు కాలువ నిర్వహణ పట్టదా..?

తెనాలి పట్టణ మారీసుపేటలో దుర్గంధంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన మార్గంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల మొదలు రైల్వేగేటు వరకు ఉన్న పెద్ద కాలువలో మురుగు తెట్టుకట్టింది. రోజుల తరబడి ముందుకు సాగకపోవడంతో దోమలు, దుర్వాసనతో స్థానికులే కాకుండా రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తాగునీరు వృథా.. తప్పని వ్యథ

పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తాగునీరు వృథాగా పోతున్నాయి. గురువారం మసీదు వెనుక ఉన్న వాటర్ ట్యాంకు నిండి గంటకు పైగా నీరు వృథాగా పోయాయి. పరిశీలనకు వచ్చిన ఏఈ శ్రీనివాసరావు పంచాయతీ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. అయినప్పటికీ సిబ్బంది అక్కడికి చేరుకోలేదు. కొద్ది సేపటికి ట్యాంకు పక్క ఇంటి మహిళ వచ్చి గృహాలకు నీటిని విడుదల చేసే వాల్వును తిప్పి తాగునీటి వృథాను అరికట్టారు. - న్యూస్‌టుడే, చేబ్రోలు

విద్యుత్తు ఆదా కలేనా..?

పట్టణ కంపోస్టుయార్డు ఆవరణలో రూ.లక్షల ప్రజాధనంతో గతంలో బయోగ్యాస్ ప్లాంటు నిర్మించారు. దీని ద్వారా లభించే గ్యాస్‌ను వాడుకుని విద్యుత్తు ఆదా చేయొచ్చని చెప్పారు అధికారులు. ఆరంభం నుంచి అదెలాగో ఎన్నడూ చూపింది లేదు. పట్టణంలో సేకరించిన కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ప్రారంభోత్సవం తరువాత నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

కార్యాలయాల పక్కనే ఇలానా..

మున్సిపల్ కార్యాలయ పాత భవనంలోని హెల్త్ సెక్షన్ వద్ద మెప్మా షెడ్డులో వాడేసిన కుర్చీలు మూలన పడేసి వదిలేశారు. ఇవి దుమ్ము ధూళితో నిండి అపరిశుభ్రంగా ఉన్నాయి. వీటిని శుభ్రం చేయించే వారే లేరు. పక్కనే వార్డు సచివాలయం.. ఆస్తి పన్నులు చెల్లించు పుర సేవా కేంద్రం ఉంది. అయినా అధికారులు పట్టనట్టు ఉండడం గమనార్హం. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

పడిపోతే ప్రమాదమే..!

కొత్తపేటలోని పురపాలక బాలికోన్నత పాఠశాల వద్ద రోడ్డు వెంబడి ఉన్న భారీ చెట్టు కొమ్మలు పాఠశాలపైకి వాలిపోయాయి. గోడ దెబ్బతీయడంతో పాటు ఆ కొమ్మల నుంచి పలుమార్లు పాములు పాఠశాలలోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మరో వంక విద్యుత్తుకు అంతరాయం కలుగుతుంది. అధికారులు స్పందించి కొమ్మలను తొలగింపజేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కొలకలూరులో గురువారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్థానికులు ఆవిష్కరించారు. అయితే రోడ్డు వెంబడి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని రోడ్లు భవనాల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిర్వాహకులకు సూచించారు. సొంత స్థలంలోకి మార్చుకుంటామని నిర్వాహకులు తెలిపినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వివరించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
చేబ్రోలు (జి) బ్రాంచి, చేబ్రోలు గ్రామం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 9390478358.

ఋణగ్రహీతకు అమ్మకము గురించిన నోటీసు (30 దినముల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూలు 6(2)/8(6)) ప్రకారం

To: ఋణగ్రహీతలు : 1) శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం.1-128, గుండవరం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522212, పసుపులేటి శ్రీనివాసరావు యొక్క చట్టబద్ధమైన వారసులు: 1(ఎ). పసుపులేటి రవి, తండ్రి: శ్రీనివాసరావు, 1-128, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212, 1(బి) చిక్కం నాగలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, 1-120-బి2, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212, 2. పసుపులేటి శివకుమారి, భర్త: శ్రీనివాసరావు, డి.నెం.1-128, గుండవరం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522212, పసుపులేటి శివకుమారి యొక్క చట్టబద్ధమైన వారసులు: 2(ఎ). పసుపులేటి రవి, తండ్రి: శ్రీనివాసరావు, 1-128, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212, 2(బి). చిక్కం నాగలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, 1-120-బి2, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212, హామీదారు: యలవర్తి శ్రీనివాసరావు, తండ్రి: అంజయ్య, 1-83బి, బ్రాహ్మణకోడూరు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522212. తనఖాదారు/లు:1) శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం.1-128, గుండవరం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522212, పసుపులేటి శ్రీనివాసరావు యొక్క చట్టబద్ధమైన వారసులు: 1(ఎ). పసుపులేటి రవి, తండ్రి: శ్రీనివాసరావు, 1-128, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212, 1(బి) చిక్కం నాగలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, 1-120-బి2, గుండవరం, చేబ్రోలు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522212.

విషయము: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చేబ్రోలు(జి) బ్రాంచి వారికి శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు (అకౌంట్ నెం.705830033086064 క్రింద) ఋణపడిన సైకము వసూలు చేసుకొను నిమిత్తమై వారికి చెందిన ఆస్తి విక్రయము గురించి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చేబ్రోలు(జి) బ్రాంచి వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(2) క్రింద ది.24-09-2025న డిమాండ్ నోటీసు ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని ది.29-11-2025న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు 6 /8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చేబ్రోలు(జి) బ్రాంచి కు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది.

ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడు అమ్మకపు నోటీసు ద్వారా తెలియజేయబడును. మరియు ఆస్తి అత్యధిక ధరను అందించే వ్యక్తికి విక్రయించబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు సదరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

స్థిరాస్తి వివరములు

ఆస్థి వివరములు: గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, గుండవరం గ్రామం, సమీప డోర్ నెం.2-90, డి.నెం.297, సందలి శ్రీ పసుపులేటి శ్రీనివాసరావుకు చెందిన 218 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము మరియు అందులోని గ్రౌండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: 4చ॥గ॥ల వెడల్పు గల ఉమ్మడి బజారు; దక్షిణం: సి.హెచ్ రామారావు మరియు ఇతరుల యొక్క ఆస్తి; పడమర: పరప, ఉత్తరం: ఆర్&బి రోడ్డు.

తేది : 16-02-2026 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
స్థలము : చేబ్రోలు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చేబ్రోలు(జి) బ్రాంచ్.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల కుటుంబాలకు భరోసా

లబ్ధిదారుకు మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, తెదేపా నాయకులు

పెదకాకాని, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల కుటుంబాలకు భరోసా అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. తక్కెళ్లపాడు, వెనిగండ్ల, వెంకటకృష్ణాపురం, రామచంద్రపాలెం, కొప్పురావూరుకు చెందిన 8 మందికి రూ. 6,03,835 విలువైన చెక్కులను గురువారం ఆయన అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన పలువురికి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గురువారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురికి రూ. 4,12,354 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అర్హత ఉన్న వారందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చేయూత అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తెనాలి తెదేపా కార్యాలయంలో గురువారం 14 మంది లబ్ధిదారులకు రూ. 11.15 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. నాయకులు ఖుద్దూస్, మహేష్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్ల మార్గం శుభ్రం

స్పందన

పట్టణంలోని తెనాలి-గుంటూరు ప్రధాన వంతెనకు అనుసంధానంగా ఉన్న కాలినడక మార్గం నిర్వహణ సరిగ్గా లేదని ఈ నెల 6న 'మెట్లదారి నిర్వహణపై నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు వంతెనల మెట్లపై ఉన్న వ్యర్థాలను తొలగింపజేసి సున్నం చల్లించారు. రోజూ పర్యవేక్షించాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పెదకాకాని, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన ఘటన గుంటూరు జిల్లా తక్కెళ్లపాడు శివారులోని జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఎస్సై మిరాజ్ కథనం ప్రకారం.. భద్రాచలం చోరపాడుకు చెందిన నాగవెంకటరెడ్డి(18) వడ్లమూడి విజ్ఞాన్ లారాలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్నేహితుడు లక్ష్మినరసింహతో కలిసి విజయవాడ వైపునకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తక్కెళ్లపాడు శివారులోని ఎన్టీఆర్ మానస సరోవరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక కూర్చొన్న నాగవెంకటరెడ్డి రోడ్డుపై పడిపోగా.. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందారు. ద్విచక్రవాహనం నడుపుతున్న స్నేహితుడికి తేలికపాటి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు వాహనాలు ఢీ: నలుగురికి గాయాలు

యడ్లపాడు: యడ్లపాడు వద్ద నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని రెండు వాహనాలు అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు. . కోంద్రుపాడుకు చెందిన బాలరాజు (24) ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళుతూ మార్గంమధ్యలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు యడ్లపాడు ఉప్పువాగు వద్ద రోడ్డు పక్కన వాహనం నిలిపాడు. ఇంతలో వెనుక నుంచి వస్తున్న కారును దాని వెనుక వస్తున్న ఆటో ఢీకొంది. అదే క్రమంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు కింద భాగంలోకి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో బాలరాజు తలకు గాయం కాగా యడ్లపాడుకు చెందిన ఆటోడ్రైవర్ ఆరుమళ్ల రాంబాబు కాలు విరిగింది. కారులో ప్రయాణిస్తున్న తెనాలికి చెందిన గనిపిశెట్టి నాగేశ్వరరావుతో పాటు అతడి పదేళ్ల కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టాలివ్వక.. పట్టించుకోక..!

ఇళ్ల స్థలాల కోసం ప్రజల ఎదురుచూపు

పెదకాకాని, న్యూస్‌టుడే

పెదకాకానిలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో దశాబ్దాల కిందట పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడంతో పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు గృహ నిర్మాణశాఖ రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పాటు కాలనీల్లో అరకొర వసతులు మాత్రమే ఉన్నాయి. పెదకాకానిలోని సుందరయ్య కాలనీ, స్వర్ణపురికాలనీలో వందల సంఖ్యలో పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. కాలనీలకు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడల్లా పట్టాలు ఇవ్వాలని వారిని కోరడం పరిపాటిగా మారిందని చెప్పి వాపోతున్నారు. స్పందన లేకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఆయా కాలనీ వాసులు పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలుమార్లు ధర్నాలు చేశారు. ఆ సమయాల్లో పట్టాలను సిద్ధం చేస్తున్నామని త్వరలో అందిస్తామని అధికారులు హామీ ఇచ్చి పంపించిన ఘటనలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పేదల చేతికి పట్టాలు అందలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు రెవెన్యూ అధికారులు సిద్ధం చేసిన పట్టాలు కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. కానీ పేదల చేతికి చేరడం లేదు. కూటమి ప్రభుత్వంలో చేతికి పట్టాలు చేరుతాయని వారు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పెదకాకాని సుందరయ్య కాలనీలో పేదల గృహాలు

ప్రభుత్వం అండగా నిలవాలి - నన్నపనేని శివాజీ, సీపీఎం మండల కార్యదర్శి

గూడులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వాలు అండగా నిలవాలి. దశాబ్దాలు గడుస్తున్నా వారికి పట్టాలు ఇవ్వడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో తెలియడం లేదు. ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేదు. అధికారులు స్పందించి పేదలు అండగా ఉండాలి.

వైద్య ప్రదర్శనకు విశేష స్పందన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల వైద్య విజ్ఞానికి ప్రదర్శనకు విద్యార్థులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి చెప్పారు. శనివారం వచ్చిన సందర్శకులతో ఆయన మాట్లాడారు. మూడ దశాబ్దాల తర్వాత ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఇప్పటివరకు 42,951 మంది సందర్శించారని చెప్పారు. ఇక మూడు రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని, సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి నమూనా సందర్శకులను ఆకట్టుకుంది. దోమతెరల సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

పెదనందిపాడు: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించి వారి ఆరోగ్యాన్ని రక్షించాలని వాటర్ ఎయిడ్ ఇండియా జిల్లా సమన్వయకర్త శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ సహాయకులు, యానిమేటర్లకు, నీటి నాణ్యతపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నీటి పరీక్షలు చేసే విధానాన్ని వివరించారు. మండలంలో పంచాయతీలకు నీటి నాణ్యత పరీక్షా కిట్లను(రూ. 25వేల విలువగల) ఉచితంగా అందజేశారు. ఎంపీడీవో లక్ష్మీదేవి, వాటర్‌ఎయిడ్ ఇండియా ప్రతినిధులు సాయి, లక్ష్మి, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

దరఖాస్తు చేశారా?

- బ్యాంక్ ఆఫ్ బరోడాలో 419 మేనేజర్ ఉద్యోగాలు
  చివరి తేదీ: 26.02.2026
- ఐఆర్ఈఎల్‌లో అప్రెంటిస్ ఖాళీలు (89)
  చివరి తేదీ: 24.02.2026

కరెంట్ అఫైర్స్



◆ అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) ఛైర్మన్‌గా 2026, జనవరిలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామక కమిటీ ఎవరిని నియమించింది?
జ: ఏకే బాలసుబ్రహ్మణ్యన్ (మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.)

◆ భారత దేశంలో మొదటి బయో

మాదిరి ప్రశ్నలు

హ్యాపీ జిల్లాగా ఏ రాష్ట్రంలోని కేయీ పన్యోర్ జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు? (జీవవైవిధ్య పరిరక్షణను మానవ శ్రేయస్సుతో అనుసంధానించడం, పర్యావరణం, జీవనోపాధి, ప్రజారోగ్యాన్ని సమతుల్యం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ఎంఎస్ స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ అమలు చేస్తోంది.)
జ: అరుణాచల్ ప్రదేశ్

◆ ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ (ఏఐటీఈ)-2026ను ఏ రాష్ట్రంలోని తంథాయ్ పెరియార్ వన్యప్రాణుల అభయారణ్యంలో ఇటీవల అధికారికంగా ప్రారంభించారు? (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ప్రతి నాలుగేళ్లకు ఒకసారి అఖిల భారత పులుల అంచనాను నిర్వహిస్తారు.)
జ: తమిళనాడు

మరింత సమాచారం

◆ సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌ను 2026, జనవరి 8 నుంచి 11 వరకు ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
జ: గుజరాత్ (1026 సంవత్సరం, జనవరిలో సోమనాథ్ ఆలయంపై మొదటి దాడి జరిగిన ఘటనకు వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌ను నిర్వహించారు. గజనీ మహమ్మద్ ఈ దాడి చేశాడు.)

ఈనాడు ప్రతిభ
https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ఆధునిక ప్రగతి మార్గాలు!

జనరల్ స్టడీస్ — ఇండియన్ జాగ్రఫీ

ముడిపదార్థాలను విలువ ఆధారిత వినియోగ వస్తువులుగా, సంప్రదాయ సమాజాలను ఆధునిక సమాజాలుగా మార్చేవే పరిశ్రమలు. ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధితో దేశ నిర్మాణంలో కీలకంగా మారాయి. అందుకే ప్రభుత్వాలు ఎప్పుడూ పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంటాయి. భారత్‌లో పారిశ్రామిక రంగం ప్రస్థానం, వలస పాలనలో ఎదుర్కొన్న సవాళ్లు, స్వాతంత్ర్యానంతర పురోగతి గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. పంచవర్ష ప్రణాళికల్లో ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానాల నుంచి ఇటీవలి 'మేక్ ఇన్ ఇండియా' వరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిన పరిశ్రమలు, తద్వారా అందుకున్న ఫలితాలను గుర్తుంచుకోవాలి.

పరిశ్రమలు

ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమలు ద్వితీయ రంగం లోకి వస్తాయి. పరిశ్రమల పెరుగుదల ఒక దేశ ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమైన సూచిక. పరిశ్రమల వృద్ధి ఆ ప్రాంత ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌లా పనిచేస్తుంది. స్థానిక ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ పేదరికాన్ని తగ్గించడంలో సహకరిస్తుంది. స్వాతంత్ర్యానంతరం దేశం ప్రాథమిక వస్తువులు, ప్రధాన వస్తువుల ఉత్పత్తిలో స్వయంప్రతిపత్తి సాధించింది. పరిశ్రమల అభివృద్ధి ద్వారా ద్వితీయ, తృతీయ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పునాది ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదునీకరించింది. ఆదునిక పరిశ్రమల ఆవిర్భావానికి ముందు దేశం కుటీర, గృహ, గ్రామీణ పరిశ్రమలకు ప్రసిద్ధి. భారతీయ మస్లిన్, పట్టువస్త్రాలు, కళాత్మక కుండలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండేది. బ్రిటిష్ పాలనలో ఇక్కడి సంప్రదాయ వృత్తులు, ఉత్పత్తులు క్షీణించాయి. ఈస్టిండియా కంపెనీ భారత్ నుంచి బ్రిటన్‌కు ముడిపదార్థాలను ఎగుమతి చేసి, తయారైన వస్తువులను దిగుమతి చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఫలితంగా 1854వరకు దేశంలో ఎలాంటి పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. 1854లో బొంబాయిలో మొదటి నూలు వస్త్రమిల్లు, 1855లో కోల్‌కతా సమీపంలోని రిష్రాలో జనపనార పరిశ్రమ ప్రారంభమయ్యాయి. 1870లో అమెరికాలో అంతర్యుద్ధం సమయంలో భారత్‌లో వస్త్రపరిశ్రమ విస్తరించింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే దేశంలో నూలువస్త్ర పరిశ్రమల సంఖ్య 275కి చేరింది. దేశంలో ఇనుము-ఉక్కు పరిశ్రమ తొలిసారిగా 1870లో బెంగాల్ ఐరన్ వర్క్స్ లిమిటెడ్ పేరుతో 'కుల్టి'లో స్థాపించగా విఫలమైంది. 1908లో జంషెడ్‌పూర్‌లో ఉక్కు కర్మాగారం స్థాపనతో దేశంలో అసలైన ఉత్పత్తి మొదలైంది. పేపరు మిల్లు మొదటగా 1870లో కోల్‌కతాలోని బల్లీగంజ్ సర్క్యులర్ రోడ్‌లో ప్రారంభమైంది. ఆ తర్వాత లఖ్‌నవూ, బెంగళూరు, ధరివాల్ (పంజాబ్), కాన్పుర్‌లో ప్రారంభమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో భారత దేశం నూలు, ఉన్ని, వస్త్రాలు, మద్యం లాంటి ఉత్పత్తులకు ప్రధాన సరఫరాదారుగా మారడంతో ఇక్కడి పరిశ్రమలకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని పరిశ్రమలకు రక్షణ కల్పించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడంతో ఉత్పత్తి పడిపోయింది. స్వాతంత్ర్యం తర్వాత ముడిపదార్థాల కొరతతో నూలు, సిమెంట్, కాగితం, ఇనుము-ఉక్కు పరిశ్రమ ఉత్పత్తి కనిష్ఠ స్థాయి పడిపోయింది. దీంతో భారత ప్రభుత్వ పారిశ్రామిక విధానం ప్రాముఖ్యతను గుర్తించింది. పంచవర్ష ప్రణాళికల్లో ప్రాముఖ్యత ఇచ్చి ప్రోత్సహించింది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ భావనతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.



ఉక్కు కర్మాగారం (జంషెడ్‌పూర్)

> 1951 తర్వాత భారత పురోగతికి పారిశ్రామికీకరణ దోహదపడింది. 1948, 1956 పారిశ్రామిక విధానాల ప్రకారం భారీ కేటాయింపులతో కొత్త పరిశ్రమల నిర్మాణం జరిగింది. 1991లో తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానంలోని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ప్రక్రియల ఫలితంగా అభివృద్ధి వేగవంతమైంది.

పంచవర్ష ప్రణాళికల కాలంలో పరిశ్రమల అభివృద్ధి

మొదటి పంచవర్ష ప్రణాళిక: వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అప్పటికే నెలకొల్పిన పరిశ్రమలకు చేయూతనిచ్చారు. వాటిలో నూలు, ఉన్ని, సిమెంట్, కాగితం, న్యూస్‌ప్రింట్ మొదలైనవి ఉన్నాయి.

రెండో పంచవర్ష ప్రణాళిక భారీ పరిశ్రమలను స్థాపించారు. 1956లో రెండో పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. ప్రధానంగా భారీ ఇంజినీరింగ్, లిగ్నైట్, ఎరువుల పరిశ్రమలు; బిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా ఇనుము-ఉక్కు కర్మాగారాలను స్థాపించారు.

మూడో పంచవర్ష ప్రణాళిక: రెండో పంచవర్ష ప్రణాళిక నాటి ప్రధాన పరిశ్రమలను విస్తరించడంతోపాటు రాంచి మిషన్ టూల్స్, మరో రెండు హిందుస్థాన్ మిషన్ టూల్స్ ప్రారంభించారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక: వ్యవసాయాధారిత పరిశ్రమలపై ప్రత్యేక శ్రద్ధ, అల్యూమినియం, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ట్రాక్టర్ల తయారీలో వృద్ధి, పారిశ్రామికీకరణ వేగవంతం.

అయిదో పంచవర్ష ప్రణాళిక: ఉక్కు పరిశ్రమల వృద్ధి, వినియోగ, ఎగుమతి ఆధారిత వస్తు ఉత్పత్తి, 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఏర్పాటు.

ఆరో పంచవర్ష ప్రణాళిక: దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఎక్కువ భాగాన్ని వస్తు ఉత్పత్తితో ఆక్రమించడం; అల్యూమినియం, ఆటోమొబైల్స్, విద్యుత్తు పరికరాలు, థర్మోస్టాటిక్స్ లాంటి పరిశ్రమలకు ప్రాధాన్యం.

ఏడో పంచవర్ష ప్రణాళిక: హైటెక్, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి. స్థానిక వనరులను పెద్ద ఎత్తున వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక విస్తరణ, స్థానికులకు నైపుణ్య శిక్షణ.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక: నూతన పారిశ్రామిక సరళీకరణ విధానాలు, ప్రాంతీయ అసమానతలు తొలగించడం, చిన్న పరిశ్రమల రంగాల్లో ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడం.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక: సిమెంట్, బొగ్గు, శిలాజ ఇంధనం, ఎలక్ట్రికల్, మౌలిక వసతుల కల్పన, రిఫైనరీలు, నాణ్యమైన ఉక్కు పరిశ్రమలపై దృష్టి.

పదో పంచవర్ష ప్రణాళిక: ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి, దిగుమతులు తగ్గించి ఎగుమతులు పెంచడం, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధించడం. వీటి సాధనకు ప్రత్యేక ఆర్థిక మండళ్లు స్థాపించడం. పారిశ్రామికీకరణ అంతగా నోచుకోని హిమాచల్‌ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, ఉత్తరాఖండ్‌లకు ప్రత్యేక ప్యాకేజీలు.

> 2014లో ప్రారంభమైన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా వచ్చే పదేళ్లలో భారతీయ పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ప్రస్తుతం అనేక భారతీయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది.

పదకొండో పంచవర్ష ప్రణాళిక: పేదరికాన్ని తగ్గించడానికి వేగవంతమైన వృద్ధి ప్రాముఖ్యత కావాలని గుర్తించారు. అందరికీ ఉపాధి కల్పన, ప్రతి ఒక్కరికి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు.

పన్నెండో పంచవర్ష ప్రణాళిక: మేకిన్ ఇండియా, స్టార్టప్స్, స్కిల్ ఇండియా పథకాల ద్వారా భారతీయ ఉత్పత్తుల పెంపు, అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆత్మనిర్భర్ భారత్, స్కిల్ ఇండియా ఇనిషియేటివ్ ప్రారంభమయ్యాయి.

రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

SENIOR INTER Physics — Charges and Fields



1. State and explain Coulomb's law in electricity?

A: Statement: Force between two charges is directly proportional to the product of two charges and inversely proportional to square of the distance between them.

Explanation: If two charges q_1 and q_2 are separated at a distance "r" in air then force between them.

$F \propto q_1, q_2 \ldots (1)$

$F \propto \frac{1}{r^2} \ldots (2)$



4 Marks

From 1, 2 equations

$$F \propto \frac{q_1 q_2}{r^2} = F = K\frac{q_1 q_2}{r^2};\ K = \frac{1}{4\pi\varepsilon_0} \quad F = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q_1 q_2}{r^2}$$

2. Define Intensity of electric field at a point. Derive an expression for the Intensity due to a point charge?

A: Intensity of Electric field (E): It is defined as force per unit test charge placed at a point

$$E = \frac{F}{q_0}$$

Intensity due to point charge: Let us consider "P" is a point at a distance r from a point charge q_0 at P is



$$F = \frac{1}{4\pi\varepsilon_0}\frac{qq_0}{r^2}$$

from the definition of electric field intensity

$$E = \frac{F}{q_0} = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q}{r^2} \quad \therefore E = \frac{1}{4\pi\varepsilon_0}\frac{q}{r^2}$$

3. State Gauss's Law in Electrostatics and explain it's importance.

A: Gauss Law: The total Electrical flux over any closed surface is equal to $\frac{1}{E_0}$ times charge enclosed by the closed surface.

$$\phi_E = \frac{q}{E_0}$$

Final Exams-2026 IMPORTANT Q & A

Importance:

1. Gauss Law is true for any closed surface.
2. Gauss Law gives the relation between the electric field and charge.
3. Gauss Law is valid for stationary charges.

More Imp Q & Ans

Writer: Allu Rambabu

అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీవద్దు

తాడేపల్లి, మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ.. కాజలో చేపట్టిన డాగ్స్ ఏబీసీ సెంటర్, పార్క్, చినకాకాని వద్ద వైట్‌ఫీల్డ్ పార్క్, కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్, టిడ్కో గృహసముదాయం వద్ద నిర్మిస్తున్న మెగా పార్క్, ఎయిమ్స్ వైద్యశాలకు వెళ్లే మార్గాన్ని నులకపేటలోని చెరువు అభివృద్ధి పనులను, ఉండవల్లి కూడలి జంక్షన్ అభివృద్ధి, వడ్డేశ్వరంలోని ఇనామ్ భూములను రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. అనంతరం మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. దాదాపు రూ.6 కోట్లతో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. నిషేధిత భూముల జాబితాల నుంచి స్థలాలను తొలగించాలని ఆదేశించారు. భూసమస్యలు పరిష్కరించేందుకు మార్గదర్శకాల ప్రకారం నివేదికలను తన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ పనులు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డెల్టా కాలువ కట్టపై రేవేంద్రపాడు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గంలో వచ్చే వేసవిలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారని అందుకు అనుగుణంగా తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిడమర్రు రైల్వేగేటు వద్ద నిర్మించే పైవంతెనకు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని వచ్చిన వినతులు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించనున్నట్లు చెప్పారు. మంగళగిరి, తాడేపల్లిలో స్మార్ట్‌సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో 40 దుకాణాల వరకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి, నగరపాలక కమిషనర్ అలీంబాషా, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, తహసీల్దార్లు సీతారామయ్య, సునీత, దినేష్ రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొలనుకొండ వద్ద ఇనాం భూముల పటాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

'సమాచారం ఇవ్వకుండా రికార్డులు పరిశీలిస్తారా'

పంచాయతీ కార్యదర్శి సమాధానానికి కంగుతిన్న డీఎల్‌పీవో

కొల్లిపర, న్యూస్‌టుడే: పంచాయతీ రికార్డులు, నిధుల పరిశీలన చేపట్టేందుకు వెళ్లిన డీఎల్‌పీవో స్వరూపరాణికి చేదు అనుభవం ఎదురైంది. మండల పరిధిలోని దంతలూరులో రికార్డులు పరిశీలనకు గురువారం ఆమె వెళ్లారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో చరవాణిలో సంభాషించారు. గ్రామానికి రావాలని, రికార్డులు అందుబాటులో ఉండాలని సూచించారు. రికార్డులు అందుబాటులో లేవని, సమీపంలోని మున్నంగి గ్రామంలో ఉన్నాయని, అక్కడికి రావాలని కార్యదర్శి పేర్కొనడంతో ఆమె మున్నంగి వెళ్లారు. అయినా రికార్డులు చూపేందుకు కార్యదర్శి ఆసక్తి చూపలేదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పంచాయతీ రికార్డులు పరిశీలిస్తారా? అని డీఎల్‌పీవోను కార్యదర్శి ప్రశ్నించడంతో ఆమె కంగుతిన్నారు. నోటీసు జారీచేసినా తీసుకునేందుకు ఆమె నిరాకరించారని డీఎల్‌పీవో మీడియాకు వివరించారు. సంబంధిత నోటీసును పంచాయతీ కార్యాలయం ముందు ప్రదర్శన బోర్డులో ఉంచామని, నకలు ప్రతులను ఎంపీడీవో చరవాణికి వాట్సాప్ చేశామని ఆమె పేర్కొన్నారు.

ముగిసిన శివరాత్రి మహోత్సవాలు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఉదయం సుప్రభాత సేవ, పంచహారతులు, పుష్పశయనోత్సవం, పవళింపు సేవ నిర్వహించారు. పుష్పశయ్య అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చతుర్వేద పారాయణ వేద సదస్యము నిర్వహించారు. మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆలయ ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ఈవో గోగినేని లీలాకుమార్, పాలక మండలి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పుష్పశయ్య అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారులు పారదర్శక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు, సహాధ్యక్షుడిగా పి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ఫణీంద్రరాజు, కోశాధికారిగా ఎం.మంజునాథ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.వల్లీదేవి, ఎం.రెడ్డప్ప రెడ్డి, కె.శ్రీనివాసరావు, వి.రఘురాములు, ఈసీ సభ్యులుగా డి.ఎన్.వి.సవిత, ఎస్.సునీత, బి.నాసారెడ్డి వి.షకీలా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అమెరికా ఐటీ సంస్థతో ఏఎన్‌యూ ఒప్పందం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: అమెరికాకు చెందిన కనెక్టెక్ కన్సల్ట్ ఐటీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గురువారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా దూరవిద్యా కేంద్రంలో నూతనంగా ప్రారంభించబోయే ఐదు కోర్సులకు ఈ సంస్థ పాఠ్యాంశాలు, ఉద్యోగ అవకాశాలు, ఇతర సాంకేతిక సహాయం అందించనుంది. డిప్లొమో ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ డాటా ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ ఏఐ ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ మెషీన్ లెర్నింగ్ అండ్ ఏఐ, డిప్లొమో ఇన్ క్లౌడ్ అండ్ డెవలప్‌మెంట్ ఆపరేషన్ ఇంజినీరింగ్ కోర్సులకు కనెక్టెక్ సంస్థ సహకారం అందించనుంది. ఏడాది కాలం నిర్వహించే ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు బోధనతో పాటు ఉపాధి కల్పించనుంది. ఇంటర్‌లో గణితం పూర్తి చేసి ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న విద్యార్థులెవరైనా ఈ కోర్సులో చేరవచ్చు. ఒప్పంద పత్రాలపై ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, కనెక్టెక్ సంస్థ సీఈవో సుకుమార్ సంతకాలు చేశారు. అనంతరం దూరవిద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఐటీ అవసరాలకు అనుగుణంగా ఈ కోర్సులను ఏర్పాటుచేశామన్నారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ఇతర అధికారులు ప్రభాకర్, డీవీఎస్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కనెక్టెక్ కన్సల్ట్ ఐటీ ప్రైవేటు లిమిటెడ్‌తో ఎంవోయూ చేసుకుంటున్న ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్

(c) eenadu

గుంటూరు తూర్పు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 14, వంగ 20, బెండ 26, పచ్చిమిర్చి 46, కాకర 42, క్యారెట్ 24, క్యాబేజీ 18, బీర 40, దొండ 45, బంగాళ దుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 35, దోస 34, పొట్ల 25, చామ 23, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 15, మెంతి కూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 42, క్యాప్సికం 65, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 60, సొర 10, అరటి 8.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

సామాజిక న్యాయ దినోత్సవంపై రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

నెహ్రూనగర్: అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న కొత్తపేటలోని మల్లయ్యలింగంభవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.



నల్లచెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పట్టదా?

న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ

వాకింగ్‌ట్రాక్ పక్కగా పడిపోయిన గోడ

నగరంలో పలు ప్రాంతాల్లో చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లను జీఎంసీ అభివృద్ధి చేయడంతో స్థానిక కమిటీలు వాటి నిర్వహణ చూస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌ల వద్ద సమస్యలేమైనా వస్తే కమిటీలు వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాయి. కొంతమంది వాకర్లు, దాతల సహకారంతో వాటి నిర్వహణ, కూర్చోడానికి బల్లల ఏర్పాటు వంటివి చేస్తున్నారు. నల్లచెరువు వాకింగ్‌ట్రాక్ పరిస్థితి వీటికి భిన్నంగా ఉంది. గత పదేళ్ల కాలంలో రూ.కోటికి పైగా వెచ్చించి చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్‌లను నిర్మించారు. ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిర్వహణ సక్రమంగా లేక ప్రహరీ, ఫెన్సింగ్ కొన్నిచోట్ల పడిపోయాయి. ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోవడంతో పూర్తిగా తొలగించారు. ఇటీవల కమిషనర్ మయూర్ అశోక్ నల్లచెరువు ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానికులు అక్కడి సమస్యలు వివరించారు.

వెంటనే చక్కదిద్దితే..

- నిత్యం సాయంత్రం వేళల్లో ఆకతాయిలు ఇక్కడకు చేరుతున్నారు. నడక కోసం వస్తున్నవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలాంటివారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- నల్లచెరువు ట్రాక్‌ను అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల ఉన్న కార్మికుల కాలనీ, గాంధీనగర్, డీఎస్‌నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాలవాసులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- ట్రాక్‌లో గోతులు సరిచేసి నడకకు వీలుగా మార్చాలి.
- చెరువులో మురుగు నీరు కలవకుండా చూడాలి.
- ఓపెన్‌జిమ్ అందుబాటులోకి తీసుకురావాలి.
- వాకింగ్ ట్రాక్ చుట్టూ పచ్చదనం అభివృద్ధి చేయాలి.
- స్థానికంగా ఉన్న ప్రముఖులు, చురుగ్గా ఉండేవారితో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి.

ఈ-వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కార్యాచరణ

నగరపాలక సంస్థ: నగరంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పేరుకుపోయిన ఈ-వ్యర్థాలను బాధ్యతాయుతంగా అందించాలని, శుక్రవారం వాటి సేకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపడం వల్ల భూగర్భ జలాలు, పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. జీఎంసీ వీటిని శాస్త్రీయంగా, పర్యావరణ హితంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అన్ని డివిజన్లలో ఈ- వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, నిరుపయోగంగా ఉన్న సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, ఛార్జర్లు, కంప్యూటర్ విడిభాగాల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అక్కడ ఇవ్వాలని సూచించారు. ఫ్రిజ్‌లు, టీవీలు వంటి వాటిని జీఎంసీ కాల్‌సెంటర్ (0863- 2345103, 95053 78036) నంబర్లకు తెలియజేస్తే ఇంటి వద్దకే వచ్చి సేకరిస్తారని చెప్పారు. స్వచ్ఛ గుంటూరు నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.

శాస్త్రవేత్త బ్రూనో జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

సమాజ ఉన్నతికి శాస్త్ర పరిశోధనలు కీలకం

గుంటూరు విద్య, గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సమాజ ఉన్నతికి శాస్త్ర పరిశోధనలు ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం కన్నా ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఫిబ్రవరి నెల సైన్స్ మాసోత్సవం సందర్భంగా జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నికోలస్ కోపర్నికస్ జయంతి నిర్వహించారు. సభకు పాఠశాల డైరెక్టర్ కన్నా మాస్టారు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ బ్రూనో వంటి ఎందరో శాస్త్రవేత్తలు సైన్స్ కోసం జీవితాలను త్యాగం చేశారన్నారు. జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల నుంచి దూరంగా ఉంచడానికి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలన్నారు. అనంతరం 'సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు, విశ్రాంత లైబ్రేరియన్ సుభాని, కార్యకర్త ప్రవీణ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కమిటీ కన్వీనర్ టి.ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లతో మహిళలకు ఇబ్బంది

మాట్లాడుతున్న ధనలక్ష్మి, పక్కన లక్ష్మీనారాయణ, రమణ, లక్ష్మణరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లు మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉన్నాయని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె. ధనలక్ష్మి అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టపగలే మహిళలకు రక్షణ లేని పరిస్థితులు ఉంటే.. ప్రభుత్వాలు రాత్రి షిఫ్టుల్లో మహిళలను పనిచేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. శ్రామిక మహిళా సమస్యలపై చర్చించటానికి గుంటూరులో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, జి. రమణ, వై. నేతాజీ, లక్ష్మణరావు, ముత్యాలరావు, కుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టుక్లాస్ (మొబైల్) కోర్టు, గుంటూరు
ఓ.యస్.నెం.1618/2022

బిట్వీన్:
వేజెండ్ల హనుమంతరావు .. వాది
ఎదిరి
మద్దిరాల సాంబశివరావు .. ప్రతివాది

టు:
మద్దిరాల సాంబశివరావు, తండ్రి: అంకమ్మ, ఫ్లాటు నెం.403, సత్య యామిని అపార్టుమెంట్, 3/12, బ్రాడీపేట, గుంటూరు

వాది ప్రామిసరీ నోటు బకాయి వసూలు నిమిత్తమై మీపై పై తెల్పిన నెంబరు దావా దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను నోటీసులు తీసుకొనకుండా జాప్యము చేయుచున్న కారణంగా కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసివున్నారు. వాయిదా తేది:23-02-2026 ఉదయం 10.30 గంటలకు పై పేర్కొన్న కోర్టువారి ఎదుట మీరు స్వయముగా కాని, వకీలుగారి ద్వారా గాని హాజరై దావా పరిహారముల పట్ల మీకు వున్న అభ్యంతరములను తెలియజేసుకొనవలసినది. పైన ఉదహరించిన తారీఖున మీరు కోర్టుకు హాజరు కానిఎడల వాది కోరినట్లు దావా పరిహారములు మంజూరు చేయుటకు మీకు ఎట్టి అభ్యంతరములు లేవని కోర్టువారు భావించి డిక్రీ మంజూరు చేయించగలరు.

వాయిదా తేది: 23-02-2026

వట్టికూటి లీలాప్రసాద్
అడ్వకేట్, పొన్నూరు. సెల్: 9177443303

చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు అధ్యక్షుడిగా భరద్వాజ్

భరద్వాజ్, మృత్యుంజయరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు బ్రాంచి నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా రుద్రవరపు భరద్వాజ్, వైస్ ఛైర్మన్‌గా వనిమిరెడ్డి వెంకటనరేష్, సెక్రటరీగా కన్నెగంటి మృత్యుంజయరావు, కోశాధికారిగా నాగబీరు రాజశేఖర్, సి.కా.సా ఛైర్మన్‌గా షేక్ బాజీ, కమిటీ సభ్యులుగా దేసు సంపత్, చింతా రఘునందన్ ఎన్నికయ్యారు. భరద్వాజ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవంతిని పూర్తి చేసి సభ్యులు, సీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. అసోసియేషన్ ఉన్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్.ఐ.ఆర్.సి. ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు సీఏ విద్యపై అవగాహన పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు పలువురు వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

కుల జనగణన కమిటీ నియామకంపై హర్షం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల జనగణన కోసం కూటమి ప్రభుత్వం డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. కుల జన గణన కోసం ఏపీ బీసీ సంక్షేమ సంఘం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఫలితంగా ప్రభుత్వం స్పందించడం హర్షనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కూటమి పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కమిటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని శంకరరావు కోరారు.

రిటైరైన రోజే పెన్షన్ ప్రయోజనాలు అందించాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగులు రిటైరైన రోజునే పెన్షన్ ప్రయోజనాలన్నీ అందించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. చాలా శాఖల్లో అధికారులు సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయలేదనో, వివిధ రకాల దర్యాప్తులు పెండింగ్ ఉన్నాయనో పెన్షన్ ప్రయోజనాలు అందించటంలో విఫలమవుతున్నారని తెలిపారు. శాఖల్లోని పరిపాలనా విభాగాలను ప్రక్షాళన చేసైనా ఉద్యోగులు రిటైరైన రోజునే జీపీఎఫ్, ఫ్యామిలీ బెనిఫిట్స్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ తదితర ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు.

వైద్య ప్రదర్శనకు విశేష స్పందన

గుంటూరు నగరం: గుంటూరు వైద్య కళాశాల వైద్య విజ్ఞానికి ప్రదర్శనకు విద్యార్థులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి చెప్పారు. శనివారం వచ్చిన సందర్శకులతో ఆయన మాట్లాడారు. మూడ దశాబ్దాల తర్వాత ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఇప్పటివరకు 42,951 మంది సందర్శించారని చెప్పారు. ఇక మూడు రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని, సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి నమూనా సందర్శకులను ఆకట్టుకుంది. దోమతెరల సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థినుల ప్రతిభ

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 38 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

నగరంలో శివాజీమహారాజ్ శోభాయాత్ర

గోరంట్ల: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో గురువారం సాయంత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని శోభాయాత్ర చేపట్టారు. ఈ శోభాయాత్ర పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న సారిక మైదానం నుంచి ప్రారంభమై నగరంపాలెం, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, లక్ష్మీపురం, వాజపేయి సర్కిల్, కొరిటెపాడు పార్కు వరకు కొనసాగింది. అనంతరం పార్కులోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శోభాయాత్రలో భాజపా నాయకులు వల్లూరు జయప్రకాష్‌నారాయణ, కన్నెగంటి నాగార్జున, హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వంగా నవీన్‌రెడ్డి, శివాజీ మహారాజ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





సాంబశివరావు సేవలు మరువలేనివి

నివాళులు అర్పిస్తున్న నరసింహారావు, అంకమ్మరావు తదితరులు

పట్నంబజారు: పేద వర్గాల అభ్యున్నతికి ఉప్పుమావులూరి సాంబశివరావు కృషి చేశారని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అన్నారు. సాంబశివరావు జయంతి సందర్భంగా గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కె.అంకమ్మరావు, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మహిళ అదృశ్యం

గుంటూరు నేరవార్తలు: రైల్వేస్టేషన్‌లో మహిళ అదృశ్యంపై గురువారం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. నంద్యాల జిల్లాకు చెందిన రఫీ అతని భార్య అఫ్రీన్ టైల్స్ పనిచేస్తుంటారు. వివిధ ప్రాంతాల్లో పనులకు వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్లడానికి ఈ నెల 16న గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడ తన భార్య అదృశ్యమైందని, ఆమెకు మతిస్థిమితం సరిగాలేదని రఫీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అంజిబాబు తెలిపారు.

లాడ్జి సెంటర్లో....

పట్టాభిపురం: బాలుడు అదృశ్యమైనట్లు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మిన్నెకల్లుకు చెందిన బాలుడు తుర్లపాటి వెంకట సాయి రమేష్ నరసరావుపేటలో ఎనిమిదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఎండ్రాయి గ్రామంలోని వేద పాఠశాలలో చదువుకుంటున్నాడు. రెండు రోజుల కిందట శ్రీనగర్‌లోని అమ్మమ్మ వారి ఇంటికి వచ్చి 18వ తేదీన ఎండ్రాయికి వెళ్లేందుకు లాడ్జి సెంటర్‌లో ఆటో ఎక్కాడు. ఇప్పటివరకు వేద పాఠశాలకు, ఇంటికి రాలేదు. దీంతో బాలుడు తల్లి పద్మప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుంటూరు తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: మారుతీనగర్ 3 లైన్‌లు సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడి దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు ప్రసాద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో సిబ్బందిని పంపి కాలువల్లో పూడికలు తీయించారు.

☛ అలీనగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు అలాగే ఉండటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు జలీల్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్టర్ పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

నేటి నుంచి ఉద్ఘోష్-2026

ఫ్లెక్సీ ఆవిష్కరణలో కళాశాల ఛైర్మన్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ నాగశ్రీనివాసరావు

తాడికొండ, న్యూస్‌టుడే: స్థానిక మోతడక చలపతి కళాశాలలో జాతీయ స్థాయిలో ఉద్ఘోష్-2026 కార్యక్రమం శుక్రవారం ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ కొల్లా నాగశ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపాలని కోరారు. తమ విద్యార్థులు కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌లపై నూతన ఆవిష్కరణలు సిద్ధం చేశారని తెలిపారు. కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరిలో ఉద్ఘోష్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. టెక్నికల్, స్పోర్ట్స్, కల్చరల్ విభాగాల్లో ప్రత్యేక ఈవెంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో విజేతలకు రూ.5 లక్షల బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల డీన్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ముగింపు రోజున ముఖ్యఅతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాల ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలియజేశారు. అనంతరం కళాశాల అడ్మినిస్ట్రేషన్ భవనంపై 50 అడుగుల ఉద్ఘోష్-2026 ఫ్లెక్సీని ఆంజనేయులు ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించాలి

మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: పిల్లల్లో ఎదుగుదల లోపాలను ముందుగానే గుర్తిస్తే వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు వీలుంటుందని డీఈవో సలీం బాషా చెప్పారు. ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో గురువారం నిర్వహించిన షార్ట్ స్టేచర్ గ్రోత్ చార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మానవతా మెడికల్ క్యాంప్ ఛైర్మన్ టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. డీఈవో సలీంబాషా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం మానవత స్వచ్ఛంద సంస్థ, ఐరావత సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సంయుక్తంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాజావలి, సత్యనారాయణమూర్తి, టీవీ సాయిరాం, కల్పన, రామారావు పాల్గొన్నారు.

22న సీఎం పర్యటనకు ఏర్పాట్లు

సూచనలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 22న జీఎంసీ పరిధిలోని సత్యసాయి ఆధ్యాత్మిక సొసైటీ ప్రాంగణంలో పోస్టల్ శాఖ కార్యక్రమానికి హాజరవుతున్నందున.. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కమిషనర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఏటుకూరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సత్యసాయి సొసైటీ ట్రస్ట్ ప్రాంగణం వరకు పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆ మార్గంలో ప్రత్యేక ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని సూచించారు. రహదారి పక్కన మొక్కలకు ట్రీగార్డ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట మొక్కలు నాటాలన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ఎన్టీఆర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ సొసైటీ పాలక వర్గం ఎన్నికకు సంబంధించి గురువారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. దాఖలైన నామపత్రాలన్నీ చెల్లుబాటయ్యాయని డీసీ, ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి పదవికి 8, కోశాధికారికి 5, ఉపాధ్యక్ష పదవికి 5, కార్యనిర్వాహక సభ్యులకు 18, సహ కార్యదర్శికి 7 నామినేషన్లు వచ్చాయని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు.

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

గుంటూరు తూర్పు

సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

నాయుడుపేట వద్ద డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ మయూర్ అశోక్ చెప్పారు. గురువారం ఆయన నాయుడుపేట డంపింగ్‌యార్డు, జిందాల్ ప్లాంటు చుట్టుపక్కల ప్రాంతాలు పరిశీలించారు. తడి వ్యర్థాలతో విండ్రో కంపోస్ట్ యూనిట్, నిర్మాణ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కోసం సీఅండ్‌డీ ట్రీట్మెంట్ ప్లాంటు, వ్యర్థాల నుంచి ఇంధనాన్ని తయారు చేసే బయోగ్యాస్ ప్లాంటులను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రాంతాల్లో స్థలాలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నాయుడుపేటలో గుర్తించిన ప్రాంతాన్ని ప్లాంట్ల ఏర్పాటుకు వీలుగా తక్షణమే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్రమైన, మ్యాప్‌ను రూపొందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ ఉండాలని, ఈ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగర పారిశుద్ధ్యంలో మంచి మార్పులు వస్తాయన్నారు. పర్యటనలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, డీసీపీ సూరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణుల పేరెత్తే అర్హత వైకాపాకు లేదు'

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ వర్గాల సంక్షేమాన్ని జీర్ణించుకోలేని వైకాపా నాయకులకు వారి పేరెత్తే అర్హత లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. వైకాపా నేత సతీష్ చేసి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు మేలు జరిగిందో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. వైకాపా పాలనలో కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు.

25న అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

నెహ్రూనగర్: కొత్తపేట శివాలయంలో ఈ నెల 21 నుంచి అమ్మవారి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభవుతాయని ఆలయ ఈవో వీరారెడ్డి, ప్రధానార్చకుడు వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఆలయంలో ఉన్న పాత అమ్మవారి విగ్రహం, నందీశ్వరుడికి అర్చకులు కళాపకర్షణం నిర్వహించి తొలగించారు. గోపూజ చేశారు. ధర్మకర్తలమండలి ఛైర్మన్ శేషతల్పసాయి, సభ్యులు పాల్గొన్నారు. ఈవో వీరారెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ 25న ఉదయం 10 గంటలకు యంత్ర స్థాపనం, విగ్రహాల పునఃప్రతిష్ఠ, 11 గంటలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12 గంటలకు బాలాత్రిపురసుందరీదేవి సమేత ఉమామహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.



(c) eenadu

గుంటూరు తూర్పు

ఆసుపత్రిలో ఆక్సిజన్ పైపుల చోరీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఓ చిన్న పిల్లల ఆసుపత్రిలో ఆక్సిజన్ పైపుల చోరీపై గురువారం కొత్త పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న రామిరెడ్డితోటకు చెందిన యాకోబు పైపులను కట్ చేస్తుండగా సిబ్బంది గమనించి పట్టుకోవటానికి ప్రయత్నిస్తే పారిపోయాడు. మళ్లీ ఈ నెల 19న తెల్లవారుజామున ఆక్సిజన్ సరఫరా చేసే పైపులను కట్ చేసి తీసుకెళ్లిపోయాడు. ఐసీయూలో ఉన్న చిన్నపిల్లలకు ఆక్సిజన్ అందకపోవడంతో సిబ్బంది తనిఖీ చేయగా పైపుల చోరీ విషయం బయట పడింది. యాకోబుపై ఆసుపత్రి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ వీరయ్య చౌదరి తెలిపారు.

పదిలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి సాధన చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా ఆదేశించారు. గురువారం ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాజా వలి తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న చిన్న ఆంజనేయులు, సురేష్‌బాబు, అంజిబాబు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ముఠా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హమాలీ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు అన్నారు. గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగరంలోని ట్రాన్స్‌పోర్టు విభాగంలో పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలీరేట్లు పదిశాతం పెంపుదలకు యాజమాన్యంతో జరిగిన చర్చలు ఫలించాయని తెలిపారు. సమావేశంలో సురేష్‌బాబు, అంజిబాబు, లక్ష్మయ్య, సాంబయ్య, శ్రీనివాసరావు, మరియదాసు, రామారావు పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

విద్యుత్తు బస్సుల్ని ప్రైవేటుకు ఇవ్వొద్దు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రవేశపెడుతున్న విద్యుత్తు బస్సులను ప్రైవేటు సంస్థకు అప్పగించొద్దని జేఏసీ నాయకుడు త్రిలోచన దత్ కోరారు. గుంటూరు-2 డిపో గ్యారేజీని ప్రైవేటు సంస్థకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వివిధ యూనియన్లు చేపట్టిన రిలే నిరాహారదీక్ష మూడో రోజుకు చేరింది. త్రిలోచన దత్ మాట్లాడుతూ విద్యుత్తు బస్సుల బాధ్యత ఆర్టీసీ సిబ్బందికే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

23న కలెక్టరేట్ వద్ద ధర్నా

మాట్లాడుతున్న రామారావు. పక్కన ఈమని అప్పారావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వ్యవసాయరంగ సమస్యలపై ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మసీదుల వద్ద సదుపాయాలు కల్పించండి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: మసీదుల వద్ద సదుపాయాలు మెరుగుపరచాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సూచించారు. రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గురువారం మసీదులో ప్రార్థనల అనంతరం పేదలకు ఆయన గంజి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మసీదుల వద్ద విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. మంచినీటి సరఫరాపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అసంపూర్తి పనులతో అగచాట్లు

అసంపూర్తి పనులతో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. డొంకరోడ్డు ఐదోలైన్‌లోని అంతర్గత వీధిలో కాలువలు, రోడ్డును పగలగొట్టారు. మూడు నెలల క్రితం మురుగు కాలువల పనులు పూర్తి చేసిన గుత్తేదారుడు ఇంతవరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. కంకర పోసి వదిలేయటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని అందరినీ వేడుకున్నా.. ఇంతవరకు స్పందన లేదు. తాగునీటి సరఫరా పైపులైన్‌కు మరమ్మతులు చేసి.. గుంతలు పూర్తిగా పూడ్చలేదు. దీంతో స్థానికులు సిమెంట్ వర అడ్డుగా పెట్టారు.

– న్యూస్‌టుడే, గుంటూరు నగరం

(c) eenadu

గుంటూరు పశ్చిమ

పనులు జాప్యం.. అవస్థలు నిత్యం..

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని కమిషనర్ పర్యటనల్లో ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో సమస్యలు వస్తున్నాయి. స్థానిక కృష్ణనగర్ ఒకటోలైన్‌లో సైడు కాలువల నిర్మాణాలు చేపట్టారు. రెండు నెలల క్రితమే పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. నిర్మాణ వ్యర్థాలను రహదార్లపైనే వదిలేయడంతో వాహనాలను ఇళ్లలోకి తీసుకెళ్లలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. సైడుకాలువల నిర్మాణం కూడా అడ్డదిడ్డంగా ఒక ప్రణాళిక లేకుండా చేస్తున్నారు. పలుచోట్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడంతో మురుగునీరు రోజుల పాటు నిలిచి పారిశుద్ధ్యం దిగజారుతుందని స్థానికులు వాపోతున్నారు. కృష్ణనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ పెంచి వేగంగా పూర్తి చేసేలా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణనగర్‌లో రహదారిపై వదిలేసిన నిర్మాణ వ్యర్థాలు

వైద్య ప్రదర్శనకు విశేష స్పందన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల వైద్య విజ్ఞానికి ప్రదర్శనకు విద్యార్థులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి చెప్పారు. శనివారం వచ్చిన సందర్శకులతో ఆయన మాట్లాడారు. మూడ దశాబ్దాల తర్వాత ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఇప్పటివరకు 42,951 మంది సందర్శించారని చెప్పారు. ఇక మూడు రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని, సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి నమూనా సందర్శకులను ఆకట్టుకుంది. దోమతెరల సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ఎన్టీఆర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ సొసైటీ పాలకవర్గం ఎన్నికకు సంబంధించి గురువారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. దాఖలైన నామపత్రాలన్నీ చెల్లుబాటయ్యాయని డీసీ, ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి పదవికి 8, కోశాధికారికి 5, ఉపాధ్యక్ష పదవికి 5, కార్యనిర్వాహక సభ్యులకు 18, సహ కార్యదర్శికి 7 నామినేషన్లు వచ్చాయని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు.

నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

కుల జనగణన కమిటీ నియామకంపై హర్షం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల జనగణన కోసం కూటమి ప్రభుత్వం డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. కుల జన గణన కోసం ఏపీ బీసీ సంక్షేమ సంఘం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఫలితంగా ప్రభుత్వం స్పందించడం హర్షనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కూటమి పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కమిటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఒక ప్రకటనలో శంకరరావు కోరారు.

రిటైరైన రోజే పెన్షన్ ప్రయోజనాలు అందించాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగులు రిటైరైన రోజునే పెన్షన్ ప్రయోజనాలన్నీ అందించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. చాలా శాఖల్లో అధికారులు సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయలేదనో, వివిధ రకాల దర్యాప్తులు పెండింగ్ ఉన్నాయనో పెన్షన్ ప్రయోజనాలు అందించటంలో విఫలమవుతున్నారని తెలిపారు. శాఖల్లోని పరిపాలనా విభాగాలను ప్రక్షాళన చేసైనా ఉద్యోగులు రిటైరైన రోజునే జీపీఎఫ్, ఫ్యామిలీ బెనిఫిట్స్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ తదితర ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు.

(c) eenadu

23న కలెక్టరేట్ వద్ద ధర్నా

గుంటూరు నేరవార్తలు: వ్యవసాయరంగ సమస్యలపై ఈనెల 23న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ

ఇవేం పనులు..!

మురుగునీటితో మూడు నెలలుగా అవస్థలు

నిర్మాణ లోపాలతో రోడ్డు మీదకు చేరుతున్న మురుగునీరు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ముందుచూపు లేకపోవడం... ప్రణాళిక కొరవడడం.. ఇష్టం వచ్చినట్లు పనులు చేయడంతో విద్యానగర్ వాసులు మురుగునీటితో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. డ్రెయిన్ నిర్మాణంలో తగిన వాటం పెట్టి వెనుక నుంచి వచ్చే నీరు ముందుకు పోయేలా చేస్తుంటారు. విద్యానగర్ రెండో లైనులో మాత్రం గుత్తేదారు ముందు వైపు ఎత్తుగా సైడ కాల్వలు నిర్మించడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. ఫలితంగా ప్రజలు మూడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అస్తవ్యస్త పనులతోనే.. ఏదైనా ఒక అభివృద్ధి పని చేపట్టే ముందు అంచనాలు రూపొందించి టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు చేపట్టడం పద్ధతి. ఇక్కడ మాత్రం అలా జరగలేదు. గుత్తేదారు అంతకు ముందు నిర్వహించిన పనుల్లో నిధులు మిగిలాయని ఇక్కడ అస్తవ్యస్తంగా హడావుడిగా పనులు చేపట్టారు. విద్యానగర్ రెండో లైను చివర నుంచి నిబంధనల మేరకు డ్రెయిన్ నిర్మిస్తే ఏ సమస్య ఉండేది కాదు. ఉద్యానం నుంచి 100 మీటర్లు ముందుకు అడ్డరోడ్డు వరకు డ్రెయిన్ నిర్మించారు. ముందు వైపు సైడు కాల్వలు నిర్మించి వెనుక వైపు 200 మీటర్ల వరకు పనులు చేయకుండా వదిలేశారు. ఫలితంగా మురుగునీరు గోడల పక్కన నిలిచిపోయి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. దోమలు ప్రబలి ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి దాపురిస్తుందని స్థానికులు వాపోయారు. మొక్కలు పెట్టుకున్న స్థలంలోకి మురుగునీరు చేరడంతో అవి పాడైపోతున్నాయని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి వెనుక వైపు కూడా డ్రెయిన్ నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ఉద్ఘోష్-2026

కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ నాగశ్రీనివాసరావు తదితరులు

తాడికొండ, న్యూస్‌టుడే: స్థానిక మోతడక చలపతి కళాశాలలో జాతీయ స్థాయిలో ఉద్ఘోష్-2026 కార్యక్రమం శుక్రవారం ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ కొల్లా నాగశ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపాలని కోరారు. తమ విద్యార్థులు కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌లపై నూతన ఆవిష్కరణలు సిద్ధం చేశారని తెలిపారు. కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరిలో ఉద్ఘోష్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. టెక్నికల్, స్పోర్ట్స్, కల్చరల్ విభాగాల్లో ప్రత్యేక ఈవెంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో విజేతలకు రూ.5 లక్షల బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల డీన్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ముగింపు రోజున ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాల ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలియజేశారు. అనంతరం కళాశాల అడ్మినిస్ట్రేషన్ భవనంపై 50 అడుగుల ఉద్ఘోష్-2026 ఫ్లెక్సీని ఆంజనేయులు ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

నాయుడుపేట వద్ద డంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతోపాటు ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ మయూర్ అశోక్ చెప్పారు. గురువారం ఆయన నాయుడుపేట డంపింగ్‌యార్డు, జిందాల్ ప్లాంటు చుట్టుపక్కల ప్రాంతాలు పరిశీలించారు. తడి వ్యర్థాలతో విండ్రో కంపోస్టు యూనిట్, నిర్మాణ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కోసం సీఅండ్‌డీ ట్రీట్మెంట్ ప్లాంటు, వ్యర్థాల నుంచి ఇంధనాన్ని తయారు చేసే బయోగ్యాస్ ప్లాంటులను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రాంతాల్లో స్థలాలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నాయుడుపేటలో గుర్తించిన ప్రాంతాన్ని ప్లాంట్ల ఏర్పాటుకు వీలుగా తక్షణమే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్రమైన, మ్యాప్‌ను రూపొందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ ఉండాలని, ఈ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగర పారిశుద్ధ్యంలో మంచి మార్పులు వస్తాయన్నారు. పర్యటనలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, డీసీపీ సూరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కార్యాచరణ

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పేరుకుపోయిన ఈ-వ్యర్థాలను బాధ్యతాయుతంగా అందించాలని, శుక్రవారం వాటి సేకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపడం వల్ల భూగర్భ జలాలు, పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. జీఎంసీ వీటిని శాస్త్రీయంగా, పర్యావరణ హితంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అన్ని డివిజన్‌లలో ఈ- వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, నిరుపయోగంగా ఉన్న సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, ఛార్జర్లు, కంప్యూటర్ విడిభాగాల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అక్కడ ఇవ్వాలని సూచించారు. ఫ్రిజ్‌లు, టీవీలు వంటి వాటిని జీఎంసీ కాల్‌సెంటర్ (0863- 2345103, 95053 78036) నంబర్లకు తెలియజేస్తే ఇంటి వద్దకే వచ్చి సేకరిస్తారని చెప్పారు. స్వచ్ఛ గుంటూరు నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.



(c) eenadu

గుంటూరు పశ్చిమ

నగరంలో శివాజీమహారాజ్ శోభాయాత్ర

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ చైతన్య వేదిక నాయకులు

గోరంట్ల: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో గురువారం సాయంత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని శోభాయాత్ర చేపట్టారు. ఈ శోభాయాత్ర పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న సారిక మైదానం నుంచి ప్రారంభమై నగరంపాలెం, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, లక్ష్మీపురం, వాజపేయి సర్కిల్, కొరిటెపాడు పార్కు వరకు కొనసాగింది. అనంతరం పార్కులోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శోభాయాత్రలో భాజపా నాయకులు వల్లూరు జయప్రకాష్‌నారాయణ, కన్నెగంటి నాగార్జున, హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు నవీన్‌రెడ్డి, శివాజీ మహారాజ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

22న సీఎం పర్యటనకు ఏర్పాట్లు

సూచనలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 22న జీఎంసీ పరిధిలోని సత్యసాయి ఆధ్యాత్మిక సొసైటీ ప్రాంగణంలో పోస్టల్ శాఖ కార్యక్రమానికి హాజరవుతున్నందున.. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కమిషనర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఏటుకూరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సత్యసాయి సొసైటీ ట్రస్ట్ ప్రాంగణం వరకు పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆ మార్గంలో ప్రత్యేక ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని సూచించారు. రహదారి పక్కన మొక్కలకు ట్రీగార్డ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట మొక్కలు నాటాలన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు అధ్యక్షుడిగా భరద్వాజ్

భరద్వాజ్, మృత్యుంజయరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు బ్రాంచి నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా రుద్రవరపు భరద్వాజ్, వైస్ ఛైర్మన్‌గా వనిమిరెడ్డి వెంకటనరేష్, సెక్రటరీగా కన్నెగంటి మృత్యుంజయరావు, కోశాధికారిగా నాగబీరు రాజశేఖర్, సి.కా.సా ఛైర్మన్‌గా షేక్ బాజీ, కమిటీ సభ్యులుగా దేసు సంపత్, చింతా రఘునందన్ ఎన్నికయ్యారు. భరద్వాజ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవంతిని పూర్తి చేసి సభ్యులు, సీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. అసోసియేషన్ ఉన్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్.ఐ.ఆర్.సి. ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు సీఏ విద్యపై అవగాహన పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు పలువురు వ్యాపారులు, ప్రముఖులు, చార్టెడ్ అకౌంటెంట్లు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపి సత్కరించారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో ధరలు(కిలో ఒక్కింటికీ రూ.ల్లో)టమాట 14, వంగ 24, బెండ 26, పచ్చిమిర్చి 47, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 26, క్యాబేజీ 18, క్యారెట్ 27, దొండ 42, బంగాళాదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు 34, దోస 29, సొర 15, పొట్లకాయ 25, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 43, చామదుంప 22, బీట్‌రూట్ 28, మునగ 15, కీరదోసకాయ 40, బీన్స్ 65, క్యాప్సికం 60, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 75, వెల్లుల్లి 155, పండుమిర్చి 60. - **పట్టాభిపురం, న్యూస్‌టుడే**

బీసీల సంక్షేమం తెదేపా కూటమితోనే సాధ్యం

పట్టాభిపురం: బీసీల సంక్షేమం, అభివృద్ధి తెదేపా కూటమితోనే సాధ్యమని జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి మంచి కేటాయింపులు హర్షణీయమన్నారు. ఈ ఏడాది రూ.3665 కోట్లు అదనంగా కేటాయించారన్నారు. సీఎం చంద్రబాబు బీసీ వర్గాలపై చూపుతున్న నిబద్ధతకు ఇది నిదర్శనం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను బడ్జెట్ కేటాయింపుల రూపంలో నెరవేర్చుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నేడు ప్రమాణ స్వీకారం చేయుచున్న శ్రీ కుర్రా అప్పారావు గారికి మరియు పాలకవర్గ సభ్యులకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు
THE GUNTUR Dist. COLD STORAGE OWNER'S WELFARE ASSOCIATION

మిర్చియార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారం విజయవంతం చేయాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావు, డైరెక్టర్ల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నియమితులైన డైరెక్టర్లతో కలిసి మధ్యాహ్నం 3 గంటలకు శ్రీనివాసరావుపేటలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి, చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్స్‌కు చేరుకుంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'జైలుకెళ్లినా అంబటిలో మార్పు రాలేదు'

పట్టాభిపురం: జైలుకు వెళ్లినా మాజీమంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబులో మార్పు రాలేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాస్టారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా పోలీసులపై దౌర్జన్యం చేయడం, నోరు పారేసుకోవడం సిగ్గుచేటు. వైకాపాలో ఉనికిని కాపాడుకునేందుకు అంబటి పడరాని పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు.

నల్లచెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పట్టదా?

న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ

వాకింగ్‌ట్రాక్ పక్కన పడిపోయిన గోడ

నగరంలో పలు ప్రాంతాల్లో చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లను జీఎంసీ అభివృద్ధి చేయడంతో స్థానిక కమిటీలు వాటి నిర్వహణ చూస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌ల వద్ద సమస్యలేమైనా వస్తే కమిటీలు వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాయి. కొంతమంది వాకర్లు, దాతల సహకారంతో వాటి నిర్వహణ, కూర్చోడానికి బల్లల ఏర్పాటు వంటివి చేస్తున్నారు. నల్లచెరువు వాకింగ్‌ట్రాక్ పరిస్థితి వీటికి భిన్నంగా ఉంది. గత పదేళ్ల కాలంలో రూ.కోటికి పైగా వెచ్చించి చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్‌లను నిర్మించారు. ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిర్వహణ సక్రమంగా లేక ప్రహరీ, ఫెన్సింగ్ కొన్నిచోట్ల పడిపోయాయి. ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోవడంతో పూర్తిగా తొలగించారు. ఇటీవల కమిషనర్ మయూర్ అశోక్ నల్లచెరువు ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానికులు అక్కడి సమస్యలు వివరించారు.

వెంటనే చక్కదిద్దితే..

- నిత్యం సాయంత్రం వేళల్లో ఆకతాయిలు ఇక్కడకు చేరుతున్నారు. నడక కోసం వస్తున్నవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలాంటివారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- నల్లచెరువు ట్రాక్‌ను అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల ఉన్న కార్మికుల కాలనీ, గాంధీనగర్, డీఎస్‌నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాలవాసులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- ట్రాక్‌లో గోతులు సరిచేసి నడకకు వీలుగా మార్చాలి.
- చెరువులో మురుగు నీరు కలవకుండా చూడాలి.
- ఓపెన్‌జిమ్ అందుబాటులోకి తీసుకురావాలి.
- వాకింగ్ ట్రాక్ చుట్టూ పచ్చదనం అభివృద్ధి చేయాలి.
- స్థానికంగా ఉన్న ప్రముఖులు, చురుగ్గా ఉండేవారితో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి.

అంబేడ్కర్ భవన్ పనుల పూర్తికి వినతి

మంత్రి బాలవీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న రాజసుందరబాబు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని ఇద్వా వ్యవస్థాపకులు రాజసుందర్‌బాబు కోరారు. ఈమేరకు గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. పది సంవత్సరాలుగా అంబేడ్కర్ భవన పనులు ఆగిపోయాయన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు నల్లప నీలాంబరం, స్టాలిన్, డేవిడ్ విలియమ్స్ తదితరులు ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థినుల ప్రతిభ

గోరంట్ల: గోరంట్ల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 38 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

'సమాచారం ఇవ్వకుండా రికార్డుల పరిశీలనేంటి?'

కొల్లిపర: పంచాయతీ రికార్డులు, నిధుల పరిశీలన చేసేందుకు వెళ్లిన డీఎల్‌పీవో స్వరూపారాణికి చేదు అనుభవం ఎదురైంది. మండల పరిధిలోని దంతులూరులో రికార్డుల పరిశీలనకు గురువారం ఆమె వెళ్లారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో చరవాణిలో సంభాషించారు. గ్రామానికి రావాలని, రికార్డులు అందుబాటులో ఉండాలని సూచించారు. రికార్డులు అందుబాటులో లేవని, సమీపంలోని మున్నంగి గ్రామంలో ఉన్నామని, అక్కడికి రావాలని కార్యదర్శి పేర్కొనడంతో ఆమె మున్నంగి వెళ్లారు. అయినా రికార్డులు చూపేందుకు కార్యదర్శి ఆసక్తి చూపలేదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పంచాయతీ రికార్డులు పరిశీలిస్తారా అని డీఎల్‌పీవోను కార్యదర్శి ప్రశ్నించడంతో ఆమె కంగుతిన్నారు. నోటీసు జారీచేసినా తీసుకునేందుకు ఆమె నిరాకరించారని డీఎల్‌పీవో వివరించారు. సంబంధిత నోటీసును పంచాయతీ కార్యాలయం ముందు ప్రదర్శన బోర్డులో ఉంచామని, నకలు ప్రతులను ఎంపీడీవో చరవాణికి వాట్సాప్ చేశామన్నారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టుక్లాస్ (మొబైల్) కోర్టు, గుంటూరు
ఓ.యస్.నెం.1618/2022

బిట్వీన్:
వేజెండ్ల హనుమంతరావు .. వాది
ఎదిరి
మద్దిరాల సాంబశివరావు .. ప్రతివాది

టు:
మద్దిరాల సాంబశివరావు, తండ్రి: అంకమ్మ, ప్లాటు నెం.403, సత్య యామిని అపార్టుమెంట్, 3/12, బ్రాడీపేట, గుంటూరు

వాది ప్రామిసరీ నోటు బకాయి వసూలు నిమిత్తమై మీపై పై తెల్పిన నెంబరు దావా దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినసూ నోటీసులు తీసుకొనకుండా జాప్యము చేయుచున్న కారణంగా కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసివున్నారు. వాయిదా తేది:23-02-2026 ఉదయం 10.30 గంటలకు పై పేర్కొన్న కోర్టువారి ఎదుట మీరు స్వయముగా కాని, వకీలుగారి ద్వారా గాని హాజరై దావా పరిహారముల పట్ల మీకు వున్న అభ్యంతరములను తెలియజేసుకొనవలసినది. పైన ఉదహరించిన తారీఖున మీరు కోర్టుకు హాజరు కానిఎడల వాది కోరినట్లు దావా పరిహారములు మంజూరు చేయుటకు మీకు ఎట్టి అభ్యంతరములు లేవని కోర్టువారు భావించి డిక్రీ మంజూరు చేయించగలరు.

వాయిదా తేది: 23-02-2026
వట్టికూటి లీలాప్రసాద్
అడ్వకేట్, పొన్నూరు. సెల్: 9177443303

ముగిసిన సుందరకాండ పారాయణ ప్రవచనం

సన్మానం అందుకుంటున్న దీక్షితులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే : స్థానిక శ్యామలనగర్ మూడో లైన్ గణేష్ గాయత్రి సంతోషిమాత దేవస్థానంలో శ్రీరామ పట్టాభిషేకంతో సుందరకాండ పారాయణ, ప్రవచన మహాయజ్ఞం గురువారం రాత్రి ముగిసింది. ఆడిటర్ లక్కరాజు శ్యామప్రసాద్ అనూరాధ దంపతుల ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముగింపు సభలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ దీవి నారసింహ దీక్షితులు రామాయణంలోని ముఖ్య ఘట్టాలతో ప్రవచనం ప్రారంభించి సుందరకాండలోని శ్లోకాలను వివరించిన తీరు భక్తులను ఆనందపరిచిందన్నారు. అనంతరం డాక్టర్ దీవి నారసింహ దీక్షితులు, భువనేశ్వరి బృందాన్ని ఆలయ కమిటీ కార్యదర్శి అన్నాప్రగడ రవిశ్రీనివాస్, సభ్యులు సత్కరించారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం తోడ్పాటు

పట్టాభిపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్లో మైనార్టీలకు రూ.6090 కోట్లు కేటాయించడం వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ చినబాజీ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారన్న విషయం మరోసారి బడ్జెట్ ద్వారా స్పష్టమైందన్నారు.

నేటి పరాజయాలే రేపటి విజయానికి పునాదులు

లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే : నేటి పరాజయాలే రేపటి విజయానికి పునాదులని, పట్టుదలతో విద్యార్థులు విజయాలను సాధించాలని కేంద్ర జీఎస్‌టీ గుంటూరు అదనపు కమిషనర్ బి.లక్ష్మీ నారాయణ సూచించారు. స్థానిక టీజేపీఎస్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కామర్స్ కాంక్లేవ్ -2026 పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కామర్స్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతర కళాశాలల క్విజ్ కార్యక్రమంలో వివిధ కళాశాలల డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీజేపీఎస్ కళాశాలకు చెందిన పి.సుశాంత్, డి.ఫణి, షేక్ ఖాసీంలకు ప్రథమ బహుమతి, జేకేసీ కళాశాలకు చెందిన బి.జె.గాయత్రి, డి.వినోద్, ఎస్ వెంకట పద్మజ బృందం ద్వితీయ బహుమతి, జేకేసీ కళాశాలకు చెందిన ఆర్.రాజరాజేశ్వరి, ఆర్ గీతాంజలి, షేక్ నస్రీన్ బృందం తృతీయ బహుమతిని సాధించింది. విజేతలకు కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపల్ కామేశ్వరశాస్త్రి, పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితా దేవి అభినందనలు తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కార్యక్రమంలో గంభీరానంద స్వామి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో ఆలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు, లక్ష మోదక హోమ సహిత లక్ష్మీ గణపతి స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గంభీరానంద స్వామి మీదుగా కార్యక్రమాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపనలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిమథనం చేసి మోదక హోమం ప్రారంభించారు. సిద్ధిబుద్ధి సమేత గణపతిస్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాలలో పాలకమండలి సభ్యులు రామారావు దంపతులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారులు పారదర్శక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నిక ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు, సహాధ్యక్షుడిగా పి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ఫణీంద్రరాజు, కోశాధికారిగా ఎం.మంజునాథ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.వల్లీదేవి, ఎం.రెడ్డప్పరెడ్డి, కె.శ్రీనివాసరావు, వి.రఘురాములు, ఈసీ సభ్యులుగా డి.ఎన్.వి.సవిత, సునీత, నాసారెడ్డి వి.షకీలా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాలుడి అదృశ్యం

పట్టాభిపురం: బాలుడు అదృశ్యమైనట్లు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మిన్నెకల్లుకు చెందిన బాలుడు తుర్లపాటి వెంకట సాయి రమేష్ నరసరావుపేటలో ఎనిమిదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఎండ్రాయి గ్రామంలోని వేద పాఠశాలలో చదువుకుంటున్నాడు. రెండు రోజుల కిందట శ్రీనగర్‌లోని అమ్మమ్మ వారి ఇంటికి వచ్చి 18వ తేదీన ఎండ్రాయికి వెళ్లేందుకు లాడ్జి సెంటర్‌లో ఆటో ఎక్కాడు. ఇప్పటివరకు వేద పాఠశాలకు, ఇంటికి రాలేదు. దీంతో బాలుడు తల్లి పద్మప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలు గుర్తించాలి

ఏటీ అగ్రహారం: పిల్లల్లో ఎదుగుదల లోపాలను ముందుగానే గుర్తిస్తే వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు వీలుంటుందని డీఈవో సలీం బాషా చెప్పారు. ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో గురువారం నిర్వహించిన షార్ట్ స్టేచర్ గ్రోత్ చార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మానవతా మెడికల్ క్యాంప్ ఛైర్మన్ టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. హెచ్‌ఎం ఖాజావలి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ గా నేడు ప్రమాణ స్వీకారం చేయుచున్న శ్రీ కుర్రా అప్పారావు గారికి మరియు పాలకవర్గ సభ్యులకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు
THE EXPORT MERCHANTS ASSOCIATION (CHILLIES)
B.P.L. EXPORT, Gantalamma Chettu, Guntur.
TULASI MIRCH TRADERS, Chowtra, Guntur.
SATYANARAYAN RAMESH KUMAR & CO., Cloth Bazar, Guntur.
MAYUR ENTERPRISES, R.Agraharam, Guntur.
GANAPATI CHILLIES TRADERS, R.Agraharam, Guntur.
SIVA NARENDRA KUMAR TRADERS, R.Agraharam, Guntur.
K.P. ENTERPRISES, R.Agraharam, Guntur.
JUGRAJ DINESH KUMAR, Cloth Bazar, Guntur.
SAPTAGIRI SPICES EXPORTS, Lalapet, Guntur.
KRISHNA SPICES PVT. LTD., G.T.Road, Guntur.
VINAY SPICES, Lalpuram Link Road, Guntur.
TIRUPATHI TRADING CORPORATION, Nagarampalem, Guntur.
S.V. TRADERS, Lalapet, Guntur.
SRI LAKSHMI SRINIVASA TRADERS, Patnam Bazar, Guntur.
SRI HANUMAN TRADERS, Opp.Mastan Darga, Guntur.
V.M. SPICE COMPANY PRIVATE LIMITED, R.Agraharam, Guntur.
VASUNDHARA CHILLIES TRADING COMPANY, Kothapet, Guntur.
LALIT MOHAN SPICES PVT. LTD., R.Agraharam, Guntur.
INDIAN CHILLIES COMPANY, Lalapet, Guntur.
EAST COAST SPICES COMPANY, G.T.Road, Guntur.
SRI SAI DURGA EXPORTS, 3/4, Arundelpet, Guntur.
SRI VEL MURUGAN & CO., G.T.Road, Guntur.
SRI LEELA KRISHNA TRADERS, G.T.Road, Guntur.
VIJAYA ADISAKTHI TRADERS, G.T.Road, Guntur.
SRI VARSHINI TRADERS (SVS), G.T.Road, Guntur.
SRI VARALAKSHMI SPICES (SVS), G.T.Road, Guntur.
STAR EXPORTS, Ankireddypalem, Guntur.

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
రైతు సోదరులకు, మిర్చి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎర్ర బంగారపు నిధుల భాండాగారమైన గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్‌గా నేడు ప్రమాణ స్వీకారం చేయుచున్న శ్రీ కుర్రా అప్పారావు గారికి మరియు పాలకవర్గ సభ్యులకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ కుర్రా అప్పారావు గారు, చైర్మన్: వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు
దాది నరేంద్రబాబు, ప్రెసిడెంట్
జంగా నర్సిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్
ముక్కాల విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరి
అన్నపురెడ్డి రవికుమార్, జాయింట్ సెక్రటరి
కర్పూరపు కోటేశ్వరరావు, ట్రెజరర్
మరియు సభ్యులు
THE GUNTUR CHILLIES COMMISSION AGENT'S ASSOCIATION
Koneti Road, R.Agraharam, GUNTUR.

హార్దిక శుభాకాంక్షలు
ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చియార్డ్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మా మిత్రుడు కొనకళ్ళ సత్యం గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు...
సానికొమ్ము వెంకట్‌రెడ్డి
సూర్య పాలిమర్స్, ఆటోనగర్, గుంటూరు

శ్రీ కొనకళ్ళ సత్యం గారు, మిర్చియార్డ్ డైరెక్టర్
మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషి, శ్రీ కొనకళ్ళ సత్యం గారు నేడు గుంటూరు మిర్చియార్డ్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శిఖాకొల్లి అభినేష్

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చియార్డ్ డైరెక్టర్‌గా నేడు ప్రమాణం స్వీకారం చేయుచున్న మా మిత్రులు శ్రీ కొనకళ్ళ సత్యం గారికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.
శ్రీ కొనకళ్ళ సత్యం గారు, మిర్చియార్డ్ డైరెక్టర్
ఈరంటి వరప్రసాద్ (సిటిబస్ బాబు), 35వ డివిజన్ కార్పొరేటర్
కాకుమాను శ్రీనివాసరావు, ప్రెసిడెంట్, ది ఫెర్టిలైజర్స్ అసోసియేషన్, గుంటూరు
జుజ్జూరు శ్రీనివాసరావు, ఛైర్మన్, గీతామందిరం, గుంటూరు
కోట శేషగిరి, 2025 ఉత్సవ కమిటీ ఛైర్మన్, SKPT గుంటూరు
టంగుటూరు అర్జునరావు, వైస్‌ఛైర్మన్, గీతామందిరం, గుంటూరు
బెల్లి రాంబాబు, మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్
కొల్లిపర శ్రీనివాసరావు, రంగన్న & కో, గుంటూరు
వేదాంతం శ్రీనివాసశర్మ, ఛైర్మన్, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, రైలుపేట
శిఖాకొల్లి అభినేష్, ఈస్ట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు, గుంటూరు
తల్లం సత్యనారాయణ (కన్నా), ACPS రాష్ట్ర అధ్యక్షులు
కొనకళ్ళ వెంకటసుబ్బారావు
కొనగళ్ళ భాస్కరరావు
బచ్చు యశ్వంత్, మేనేజింగ్ డైరెక్టర్, జ్యోతి గ్రూప్ ఆఫ్ కంపెనీస్
అర్వపల్లి శ్రీను, 5వ డివిజన్ TDP పార్టీ జనరల్ సెక్రటరీ
బచ్చు యోగేంద్రనాథ్, VVS Media
అన్నవరపు చక్రధర్, TDP నాయకులు

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

అబార్షన్ అయ్యాక విశ్రాంతి ఎలా?

ఇటీవలే బిడ్డ ఎదుగుదల సరిగా లేదని అయిదో నెలలో అబార్షన్ జరిగింది. చాలా నీరసంగా ఉంది. హీమోగ్లోబిన్ శాతం 8.2 ఉంది. తిరిగి కోలుకోవడానికి ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి? నేనో ఉద్యోగస్థురాలిని. ప్రస్తుతం సెలవులో ఉన్నా. ఎన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలి? ఆహార జాగ్రత్తలు పాటించాలా? – ఓ సోదరి

డియర్ వసుంధర

డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

మీకు ఇటీవలే అబార్షన్ అయ్యింది కాబట్టి, రక్తస్రావం, నొప్పి, పాలు పడటం... వీటికి తోడు మానసికంగా ఒత్తిడి వంటివి ఉంటాయి. అందుకని, కోలుకోవడానికి 2-3 వారాలైనా విశ్రాంతి తీసుకోవాలి. గర్భం దాల్చడానికి మాత్రం ఆరు నెలలైనా గ్యాప్ తీసుకోవాలి. ఈ సమయంలో పాలు, గుడ్డు, చేప, కొవ్వు తక్కువగా ఉండే మాంసం, మొలకలు, ఆకుకూరలు, పనీర్ వంటివాటితోపాటు బెల్లంతో చేసిన ఆహారపదార్థాలను ఎక్కువగా తినాలి. మీ ఎత్తు, బరువుకు తగ్గట్టుగా వీటిని తీసుకోవాలి. మీకు హీమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంది. బేబీ ఎదుగుదల సరిగా లేకపోవడానికి ఇది కూడా కారణమై ఉండొచ్చు. కాబట్టి, ఐరన్, కాల్షియం వంటి మాత్రలు తీసుకోవడం కొనసాగించండి. నీరసం తగ్గి పర్లేదు అనిపించాక ఉద్యోగంపై దృష్టిపెట్టండి. ఇప్పుడు మీరు కోలుకుంటేనే ఈసారి బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేలా శరీరం సిద్ధమవుతుంది. కాబట్టి, నిర్లక్ష్యం వద్దు. అలాగే ఈసారి ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవడానికి 3 నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ తీసుకోండి. రక్తం, న్యూట్రిషనల్ స్టేటస్ వంటివీ చెక్ చేయించుకుంటే మేలు. మానసికంగానూ దృఢంగా ఉండండి. అబార్షన్‌కి చాలా కారణాలు ఉంటాయి. కోలుకున్నాక కారణాలేంటో వెతకండి. తిరిగి ఆ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలూ తీసుకోండి.

చామంతి తేనీరు!

చామంతి పూలను తల్లో పెట్టుకోవడం, అలంకరణకు ఉపయోగించడం, పూజకు వాడటం వంటివన్నీ తెలుసు... కానీ, వీటితో టీని కూడా తయారుచేసుకోవచ్చని తెలుసా? ఓసారి తాగి చూడండి. ఎన్నెన్ని ప్రయోజనాలున్నాయో మీకే అర్థమవుతుంది. చామంతుల్లో ఎన్నో రకాలున్నాయి. కానీ, క్రిసాంతిమమ్ మోరిఫోలియం, సి.ఇండికమ్... పువ్వుల నుంచి తయారైన, కెఫీన్ లేని కషాయమే ఇది. ఈ పూలను ప్రత్యేక పద్ధతుల్లో డ్రై చేసి అమ్ముతారు. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో ఈ టీ చాలా పాపులర్. సాధారణంగా దీన్ని వేడి తగ్గించడానికీ, రోగ నిరోధకతను పెంచడానికీ ఎంచుకుంటారు. ఓ గ్లాసు మరిగిన నీళ్లల్లో నాలుగైదు పువ్వులను వేసి 3-4 నిమిషాలు ఉంచితే సరి. కాస్త ముడి చక్కెర లేదా తేనె కలుపుకొని తాగితే చాలు. విటమిన్ ఎ, సి, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలన్నీ లభిస్తాయి. ఇందులో అధికంగా ఉండే ఫ్లేవనాయిడ్లు... ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపుల్ని తగ్గిస్తాయి. అంతేకాదు, ఈ టీ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. జుట్టునీ నిగనిగలాడేలా చేయగలదట. అయితే, గర్భిణులు, పాలిచ్చే తల్లులు వైద్యుల సలహాలేనిదే తీసుకోకూడదనే విషయం మరిచిపోవద్దు.

బంగారం - వెండి

19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,58,070	1,43,850	2,48,889
విజయవాడ	1,54,910	1,43,450	2,60,000
ప్రొద్దుటూరు	1,54,500	1,42,140	2,54,000
రాజమహేంద్రవరం	1,56,490	1,43,450	2,70,000
విశాఖపట్నం	1,57,260	1,44,500	2,57,000
తమిళనాడు	-----	1,45,000	2,70,000

మీకు తెలుసా!

అప్పుడే పుట్టిన శిశువు ఒంటిపై మైనపు పూత లాంటి తెల్లని పొర కనిపిస్తుంది. దాన్నే వర్నిక్స్ కేసీయోసా అంటారు. ఇది గర్భధారణ సమయంలోనూ, శిశువు జన్మించిన కొన్ని గంటల వరకూ చిన్నారి చర్మానికి రక్షణ కల్పిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

అమ్మా... కంగారు పడకు!

ఇంటర్ పరీక్షలు దగ్గరపడ్డాయి. ఫిబ్రవరి కాస్తా అయిపోయిందంటే... స్కూలు, కాలేజీలన్న తేడా లేకుండా అందరికీ ఇక ఎగ్జామ్ ఫీవరే! పిల్లల సంగతేమో కానీ... అమ్మలకు మొదలవుతుంది కంగారు! వాళ్లు ఒత్తిడికి గురవుతారు. తెలియకుండానే పిల్లలనీ కంగారు పెడుతుంటారు. ఈ సమయంలో ఇది సరైనదేనా?

అమ్మను బట్టే పిల్లలు ధైర్యంగా తయారవుతారు అంటారు. అలాంటిది పరీక్షలు దగ్గరికి వచ్చేసరికి వాళ్లే రాస్తున్నట్టు కంగారుపడతారు తల్లులు. ఇందుకు కారణం లేకపోలేదు. పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారో... సరిగా రాయకపోతే వాళ్ల భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న భయం. చదివించడం తల్లుల బాధ్యత అనే చాలామంది భావన. అందుకే సరిగానే చదివిస్తున్నామా? అన్న కంగారు. ఎక్కడ విఫలమవుతారో, మిగతావారితో పోలిస్తే వెనకబడతారేమో అన్న అనుమానం... ఇలా ప్రేమ, బాధ్యత, అంచనాలు అన్నీ వెరసి వాళ్ల పరీక్షల్ని భూతంలా చూస్తుంటారు. పిల్లలకీ చూపిస్తుంటారు. ఇదేమో పిల్లలని ఇంకా ఒత్తిడికి గురిచేస్తుంది. కాబట్టి, ముందు మీరు స్థిమితపడండి.

చిరునవ్వు ముఖ్యం

ఇంటి వాతావరణాన్ని మార్చగలిగేది మీరే. కాబట్టి, ముందు మీరు గాబరా పక్కనపెట్టండి. చక్కగా నవ్వుతూ ఉండండి. ఏమాత్రం ఒత్తిడి అనిపించినా శ్వాస వ్యాయామాలు చేస్తూ ప్రశాంతంగా ఉండండి. ఇది పిల్లలపైనా సానుకూల ప్రభావం చూపుతుంది.

చెక్ చేసుకోండి

ఆరోగ్యకరమైన ఆహారం నుంచి అవసరమైన సలహాల వరకూ ఇస్తున్నారా? పిల్లలూ చక్కగా చదువుకుంటున్నారా? చాలు. అలాగే కొనసాగనీయండి. ఏమవుతోందో, పేపర్ కష్టంగా వస్తుందేమో, సరిగా రాయరేమో అన్న నెగెటివ్ ఆలోచనల్ని పక్కకు తోసేయండి. 'నా పిల్లలు వాళ్ల శక్తిమేరకు కష్టపడుతున్నారు. తరవాత సంగతి అప్పుడే చూసుకుందాం' అనుకోండి. ఒత్తిడి మాయం అవుతుంది.

అవే వద్దు

పిల్లల మూడ్ ఆధారపడేది మనమీదే! చిరాకు, కోపం ఇలా ఏం ఆవరిస్తున్నా ప్రశాంతంగా ఉండటానికే ప్రయత్నించండి. టీవీ, ఫోన్ వగైరాలను పిల్లలముందు వాడొద్దు. లేదా వాటి శబ్దాలు వాళ్లని ఇబ్బంది పెట్టకుండా అయినా చూడండి. పిల్లలకు ధ్యాస మళ్లదు. మీకూ, పిల్లలకీ మధ్య అనవసర టెన్షన్ కూడా ఉండదు.

బ్రేక్ తీసుకోండి

పిల్లలను లేపాలంటూ తెల్లవారుజామునే లేవడం... అన్నీ అమర్చాలంటూ పనుల్లో మునిగిపోవడం... ఇవీ ఒత్తిడిని పెంచేవే. కాబట్టి, చిన్నచిన్న బ్రేక్‌లు ప్లాన్ చేసుకోండి. ఆరుబయట నడవడం, ప్రశాంతమైనచోట టీ తాగడం, వ్యాయామాలు, మొక్కల మధ్య గడపడం వంటివి చేయండి. పిల్లలకు ఆరోగ్యకరమైనవి పెడితే చాలదు. మీరూ సమయానికి తీసుకోండి. నిద్రవేళలు పాటించండి. అప్పుడే ఒత్తిడి దూరంగా ఉంటుంది. ఓపికా నశించదు.

ఆ మాటలొద్దు

'సరిగా చదువు. లేదంటే ఎందుకూ పనికిరావు' లాంటి మాటలొద్దు. వాళ్లు చదువుతున్నారో లేదోనని అనుమానంతో చెక్ చేయొద్దు. దీనివల్ల వాళ్లపై మీకు నమ్మకం లేదు అనుకోవచ్చు. చదువుకోమని చెప్పండి చాలు... అదీ మృదువుగా! వీలైతే మీరూ ఓ పుస్తకం తీసుకుని వాళ్లతో కూర్చోండి. నిజానికి ఎంతమంది టాపర్లు కాకుండా జీవితంలో విజయం సాధించలేదు చెప్పండి. కాబట్టి, మార్కులు, ర్యాంకుల కోసం పోరొద్దు. కంగారుపడకుండా, వేళలు పాటిస్తూ చదువుకోమని ప్రోత్సహించండి.

పరీక్షలు జీవితంలో ఓ భాగం. ఇవే జీవితం కాదు. మార్కులు తగ్గితే ఇంకోసారి సాధించొచ్చు. అదే ఆత్మవిశ్వాసం తగ్గితే కష్టం. కాబట్టి, మీరు ధైర్యంగా, స్థిమితంగా ఉండండి. మిమ్మల్ని చూసి పిల్లలూ అలాగే ఉంటారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయగలుగుతారు. మరి దాన్ని ఈ సమయంలో మీ పిల్లలకు బహుమతిగా ఇస్తారుగా?

ఒంటరిగా వద్దు...!

బరువు పెరిగిపోతున్నామన్న భయం, అనారోగ్యాలను తగ్గించుకోవాలనే ఆలోచన... వంటి వాటితో ఎన్నో సార్లు వ్యాయామం చేయాలని అనుకుంటాం. కానీ, అడుగు మాత్రం ముందుకు పడదు. ఎక్కడ మొదలుపెట్టాలో తెలియదు, బయటికి వెళ్లడం కుదరదు. మరేం చేయాలంటే...

- వ్యాయామం ఒంటరిగా కాకుండా మరికొంతమందిని తోడు చేసుకుని మొదలుపెట్టండి. అందరూ కలిసి సరదాగా వీధి చివరి వరకూ వెళ్లి రండి. తిరిగి వచ్చేటప్పుడు లిఫ్ట్ వాడకుండా మెట్లెక్కండి. ఇలా రోజూ ఒకే సమయానికి చేయండి. ఓ నెల రోజుల పాటు చేస్తే... శరీరం వర్కవుట్స్‌కి వీలుగా మారుతుంది. దీనికి ఓ ఇరవై నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టదు.
- పొద్దున్నే బయటకి వెళ్లి రావడం కష్టం అనుకుంటే... నేలపై నిటారుగా సుఖాసనంలో అరగంట కూర్చోండి. మధ్యలో ఒకటీ రెండు సార్లు పైకి లేవండి. ఇలా రోజూ సాధన చేస్తే జీర్ణక్రియలు సక్రమంగా జరుగుతాయి. శరీరమూ కాస్త మీ నియంత్రణలోకి వస్తుంది.
- ఉదయమే కసరత్తులు చేయడానికి కుదరడం లేదంటే... రోజులో ఏదో ఒక సమయాన్ని కేటాయించుకోండి. టీవీలో నచ్చిన పాట పెట్టుకుని, చిన్న చిన్న మూమెంట్స్‌ని ప్రయత్నించండి. రోజులు గడిచేకొద్దీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారుతుంది. మీరూ వ్యాయామం చేయడానికి బద్ధకించకుండా ఉంటారు. ఇలా ఓ నెలైనా చేశాక అప్పుడు మీ సమస్యకు అనుగుణంగా ఏ రకమైన కసరత్తులు ఎంచుకోవాలో ఆలోచించండి. అనుకున్నది సాధిస్తారు.

ప్రకృతిని పలకరించాల్సిందే!

ప్రకృతిలో గడిపితే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత... వంటి ప్రయోజనాలెన్నో! కానీ నగరాల్లో ఇది సాధ్యమవుతుందా? అంటే, అవుతుందనే చెబుతున్నారు ప్రకృతి ప్రేమికురాలు రామలక్ష్మి పేరి. మహిళల కోసం నేచర్ వాక్స్ నిర్వహిస్తోన్న ఆమె వసుంధరతో మాట్లాడారిలా...

తెలుగువాళ్లమే అయినా నాన్న ఉద్యోగరీత్యా గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో పెరిగాను. స్థానికంగా ఉండే అడవులూ, కొండకోనల్నీ ఎక్కువగా చూస్తూ ఎన్నో రకాల మొక్కలూ, జంతువుల్నీ గమనించాను. పెళ్లి తర్వాత దిల్లీలో స్థిరపడ్డాం. మావారు మహేశ్వర్‌తో కలిసి కెరియర్స్ 360 మ్యాగజీన్‌ను ప్రారంభించాను. వారాంతాల్లో బర్డ్, ట్రీ వాక్‌లకు హాజరయ్యేదాన్ని. అప్పుడే నిధి బాత్రా పరిచయం అయ్యారు. తను ఆర్కిటెక్ట్. నగరాభివృద్ధి ప్రాజెక్టుల్ని డిజైన్ చేస్తారు. తనకూ చిన్నప్పట్నుంచీ మొక్కలంటే ఇష్టం. ఇద్దరం కలిసి వాక్‌లు నిర్వహించాలనుకున్నాం. 'విమెన్ అండ్ వైల్డర్‌నెస్' పేరుతో 2023 నుంచి వీటిని చేపడుతున్నాం. నగర జీవితంలో ఉండే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందడం, పర్యావరణం గురించి అవగాహన కలిగించడం ఈ వాక్‌ల ప్రధాన ఉద్దేశం. బాధ్యతలతో ఇళ్లకే పరిమితమయ్యే మహిళలు ప్రకృతికి దూరం కావడం గమనించి వాళ్లకి ప్రత్యేకంగా వాక్‌లు నిర్వహిస్తున్నాం. 13 ఏళ్లలోపు పిల్లలూ ఈ నడకలో భాగం కావొచ్చు. ఏడాదికోసారి అన్నివర్గాలూ పాల్గొనే వాక్ నిర్వహిస్తాం. స్కూళ్ల పిల్లలకూ వీటిని నిర్వహిస్తుంటాం.

దిల్లీ ఎంతో ప్రత్యేకం...

దేశ రాజధాని దిల్లీ అంటే మార్కెట్లు, ట్రాఫిక్, కట్టడాలూ, కాలుష్యం... ఇవే గుర్తొస్తాయి. కానీ ఇక్కడ పచ్చదనమూ ఎక్కువే. నగరం పరిధిలో ఆరావళి పర్వతాలు విస్తరించి ఉన్నాయి. సెంట్రల్ రిడ్జ్ రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఉద్యానవనాలూ, సరస్సులూ దర్శనమిస్తాయి. ఆరావళికే ప్రత్యేకమైన ఎన్నో మొక్కలు, చెట్లు ఉన్నాయి. కానీ, నగరీకరణ కారణంగా పచ్చదనం కనుమరుగవుతోంది. అందుకే జీవవైవిధ్యంపైన అవగాహన పెంచుతున్నాం. నగరవాసులు తిరిగి ప్రకృతిలో భాగమయ్యేందుకు ఈ వాక్‌లు ఉపయోగపడతాయి. ప్రతి నగరంలోనూ ఇలాంటివి చేపట్టాలి.

సులువుగానే పోతాయి... కానీ!

దుస్తులపై మరకలు పడినప్పుడు మొండిగా మారకముందే సులువుగా వదిలించండిలా...

హెయిర్‌స్ప్రే: దుస్తులమీద పెన్ను గీతలు పడితే వెంటనే కాస్త హెయిర్‌స్ప్రే చేసి టిష్యూతో అద్దండి. మరక పోయేవరకూ... ఇలా మూడు నాలుగు సార్లు చేస్తే సరి.

నిమ్మరసం: పసుపు రంగుని తొలగించడానికి ఆ ప్రదేశంలో నిమ్మరసం, ఉప్పుని చల్లి అరగంట తర్వాత బ్రష్‌తో రుద్ది చల్లటి నీటితో ఉతకాలి. ఇలా నాలుగైదు సార్లు ప్రయత్నించాలి.

వైట్ వినెగర్: పట్టు చీరలు, లేత రంగు దుస్తులపై చెమట, డియోడరెంట్ మరకలు పడ్డాయా? వైట్ వినెగర్, బేకింగ్ సోడా రాసి... ఓ పదినిమిషాలు వదిలేయాలి. తర్వాత మృదువుగా రుద్దితే వదిలిపోతాయి.



(c) eenadu

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(ప్రభుత్వ భాగస్వామ్య షెడ్యూల్డ్ బ్యాంక్)
హెడ్ ఆఫీస్: 27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002, ఫోన్ : 0866-2429044
APCOB

ప్రాంగణం లీజుకు ఆహ్వానిస్తూ నోటీసు

విజయవాడ, ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు జిల్లాలోని తాడేపల్లి మరియు యన్‌టీఆర్ జిల్లాలోని పోరంకిలలో కొత్త శాఖలను ప్రారంభించడానికి లీజు ప్రాతిపదికన వాణిజ్య/కార్యాలయ ప్రాంగణానికి యజమానులు/పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి ప్రతిపాదనలను ఆహ్వానిస్తోంది.
దరఖాస్తులు స్వీకరణ చివరి తేది. : 25-02-2025న సాయంత్రం గం.04.00 ల వరకు లేదా ఆ ముందు వరకు.
మరిన్ని వివరములకు బ్యాంక్ వెబ్‌సైట్ www.apcob.bank.in ను సందర్శించగలరు.
సం/-
జనరల్ మేనేజర్ (GAD)

మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: నెం.302బి, జైన్ సద్గురు ఇమేజ్'స్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, విఐపి హిల్స్, మాధాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500081
టెలి: 040-49951666, ఇ-మెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ (M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్)కు తనఖా పెట్టబడిన/ ఛార్జీచేయబడిన మరియు M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువతెలిపిన స్థిరాస్తి, M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు 31-01-2026 నాటికి ఉన్న మొత్తం బకాయి రూ.18,85,13,321/- (పద్దెనిమిది కోట్ల ఎనభై ఐదు లక్షల పదమూడు వేల మూడు వందల ఇరవై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలను (సదరు బకాయి 08.08.2023 తేదీ నాటి అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు అప్పగించబడింది) 1) మెసర్స్ శ్రీ గౌరంగ ఎంటర్‌ప్రైజెస్ మరియు 2) డా. కోడె శశి కిరణ్ & డా.ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ (రుణగ్రహీతలు) మరియు గ్యారంటర్లు అనగా i) డా।। కోడె శశి కిరణ్, ii) డా।। ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ మరియు iii) శ్రీ కోడె సత్య ప్రసాద్ నుండి రాబట్టుకునేందుకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన 26-03-2026న విక్రయించబడును.
రిజర్వు ధర: రూ.2,500 లక్షలు. ధరావతు: 250 లక్షలు

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర. సం.	ఆస్తి వివరణ
లాట్-1	1. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర గల డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం. 12, వార్డ్ నెం.5, T.S.నెం.37లో 380 చ.గజాలు లేదా 317.71 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: అలపర్తి ప్రియనందన భూమి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: అలపర్తి లక్ష్మీకుమారి యొక్క భూమి, ఉత్తరం: మేకపాటి సురేష్ భూమి.
	2. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం.12, వార్డ్ నెం.5, T.S.నెం.37లో 379 చ.గజాలు లేదా 316.8 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: దేచిరాజు వెంకటరావుకు చెందిన భూమి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: శ్రీమతి అలపర్తి లలిత సుధకు చెందిన భూమి, ఉత్తరం: మేకపాటి సురేష్‌కు చెందిన భూమి.
	3. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం. 2, ప్రస్తుత బ్లాక్ నెం.12, T.S.నెం. 37లో 1000 చ.గజాలు లేదా 836.11 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: లలిత సుధకు చెందిన ఆస్తి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: మున్సిపల్ డొంక, ఉత్తరం: కోడే శశికిరణ్ & కోడే లలిత సుధకి చెందిన భూమి.
	4. శ్రీ కోడె శశికిరణ్ & ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం.12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం.12, వార్డ్ నెం.5, T.S.నెం. 37లో 1550 చ.గజాలు లేదా 1295.95 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: దేచిరాజు వెంకటరావు స్థలం, దక్షిణం: అలపర్తి లలిత సుధ, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్.
	పైన తెలిపిన ఆస్తులు మొత్తం 60325 (సుమారు) చ.అడుగుల నిర్మిత విస్తీర్ణంతో 3 సెల్లార్లు మరియు గ్రౌండ్ ఫ్లోర్ కలిగి నిర్మించబడిన అసంపూర్తి కట్టడాలపై 3309 చ.గజాల విస్తీర్ణపు పట్టణ వాణిజ్య భూమి ఒకదానికి ఒకటి కలిసి ఏకమొత్తంగా ఉన్నది.
	రిజర్వు ధర: రూ.2,500 లక్షలు, ధరావతు: రూ.250 లక్షలు

తెలిసిన ఏవేని ఎన్‌కంబ్రెన్స్‌లు: లేవు
ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: 02-03-2026న ఉ. 11.00 గం. నుండి సా. 4.00 గం.వరకు
వేలం విధానం: https://www.auctionbazaar.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం.
అన్ని లాట్లకు ధరావతు చెల్లింపునకు మరియు బిడ్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 25-03-2026న సా. 5.00 గం.లోపు
ఇ-వేలం తేది: 26-03-2026, ఉ. 11.00 గం. నుండి మ. 12.00 గం. మధ్య.
బిడ్ పెంపుదల: రూ.10,00,000/-
అమ్మకానికి సంబంధించిన వివరమైన నియమ నిబంధనలకు, మాక్సిమస్ ARC లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారి వెబ్‌సైట్ అనగా www.maximusarc.com/tenders నందు ఇవ్వబడిన లింకును చూడండి.
ఔత్సాహిక కొనుగోలుదార్లు ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 29ఎ క్రింద వారు అనర్హులవ్వలేదని నిర్ధారిస్తూ "నోటరైజ్డ్ అఫిడవిట్" దాఖలు చేయవల్సి ఉంటుంది.
తేది: 19-02-2026 సం/- (కె.హరికృష్ణ) అధీకృత అధికారి
స్థలం: హైదరాబాద్ మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ - +91 9666488000

పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

** విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి అవకాశం

** 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ రేపు

విద్యార్థి భవిష్యత్తుకు తొలిమెట్టు పదో తరగతి. తొలిసారి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఒకింత ఆందోళన సహజం. అనుకున్నస్థాయిలో మార్కులొస్తాయా? అన్న ఒత్తిడికి గురవుతుంటారు. ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది? ఏయే పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులొస్తాయి? ఎలాంటి ప్రణాళికతో చదవాలి? ఏ యూనిట్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి? సిలబస్ బయట నుంచి కూడా ఇస్తారా? ఇలా అనేక సందేహాలు. వీటన్నింటికీ నివృత్తి చేసేందుకు 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ' అవకాశం కల్పిస్తున్నాయి. ఫిబ్రవరి 21 శనివారం సబ్జెక్ట్ నిపుణులతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. తెలుగు, ఆంగ్ల మాధ్యమ విద్యార్థులు ఫోన్ చేసి సందేహాలను తీర్చుకోవచ్చు. - న్యూస్‌టుడే, గుంటూరు విద్య

ఉపాధ్యాయులు	పాఠ్యాంశం	చరవాణి నంబరు
బి.ధర్మారెడ్డి	తెలుగు	99497 94001
షేక్ జలాలీబాషా	హిందీ	94403 07545
జీవీఎల్ నరసింహారావు	ఆంగ్లం	94402 26931
టి.సాంబశివరావు	గణితం	94934 42223
కె.నాగేశ్వరరావు	భౌతికశాస్త్రం	84999 74064
డి.శివశంకరరావు	జీవశాస్త్రం	96189 54546
ఎన్.కేశవరెడ్డి	సాంఘికశాస్త్రం	85009 88743

ఫోన్ చేయాల్సిన సమయం
ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు
తేదీ: ఫిబ్రవరి 21, శనివారం

సవాలక్ష సవాళ్లు..!

నేడు మిర్చియార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారం

మిర్చియార్డు, న్యూస్‌టుడే

సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం గుంటూరు మిర్చియార్డుకు పాలకవర్గాన్ని నియమించింది. నూతన పాలకవర్గానికి మిర్చియార్డులో సమస్యలు స్వాగతం చెబుతున్నాయి.

ప్రస్తుతం మిర్చి సీజన్.. ఈ తరుణంలో రోజుకు సగటున రెండు వేలమంది వరకు రైతులు సరకు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతుంటారు. ఏడాది మొత్తంమీద రూ.10 వేల కోట్లకు పైగానే లావాదేవీలు జరుగుతుంటాయి. క్రయవిక్రయల ద్వారా మిర్చియార్డుకు ఏటా అటు ఇటుగా రూ.100 కోట్లు ఆదాయం సమకూరుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి పైగా జీవనోపాధి కల్పిస్తుంది. మిర్చియార్డు నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేయబోతుంది.

ధరలు తగ్గకుండా చూడాలి... ఈ ఏడాది మిర్చి సీజన్ ప్రారంభంలో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఒక్క రకం ధర తప్ప అన్ని రకాల ధరలు రూ.20,000 పైగానే ఉన్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. మిర్చి పంట చేతికి అంది వచ్చే సమయంలో వ్యాపారులు కుమ్మక్కై ధరల్లో కోత పెడుతుంటారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సమీక్ష నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడుకు రైతులు ఫిర్యాదు చేశారు. వ్యాపారులు సిండికేటై ధరలు తగ్గించకుండా పాలకవర్గం చర్యలు చేపట్టాలి.

అధిక కమీషన్ వసూళ్లు.. మిర్చియార్డులో అన్నదాతలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఏజెంట్లు కమీషన్ వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారు. రూ.100 విలువపై రూ.2 మాత్రమే కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా. రూ.4, రూ.5 వరకు వసూలు చేస్తున్నారు.

నిఘా లేనట్లే.. యార్డులో జరిగే దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి కొన్ని పాయింట్లలోనే ఉన్నాయి. ఉన్న వాటిలో కొన్ని పనిచేయడం లేదు. కమీషన్ ఏజెంట్ల దుకాణాలు, ప్రధాన రహదార్లలో కెమెరాలు ఏర్పాటు చేస్తే రైతుల మిర్చిబస్తాలు అపహరణకు గురికాకుండా ఉంటాయి.

మచ్చుతో మస్కా.. కమీషన్ దుకాణం వద్దకు రైతులు మిర్చిని అమ్మకం నిమిత్తం తీసుకొచ్చాక శాంపిల్స్ కోసం మచ్చు పేరిట ఒక్కో లాటుకు వచ్చి అయిదు నుంచి పది కిలోల వరకు దళారులు స్వాహా చేస్తున్నారు. సరకు ఎలా ఉందో పరిశీలించేందుకు కేవలం రూ.250 గ్రాములు మాత్రమే మచ్చు తీసుకోవాలి. అయితే కిలోల కొద్దీ మిర్చి పట్టుకెళుతున్నారు. ఇలా తీసుకెళ్లిన మచ్చు కాయలను నాలుగైదు రోజుల తర్వాత క్వింటాళ్ల వంతున విక్రయిస్తున్నారు.

ఖర్చుల పేరిట భారం.. ఖర్చుల పేరిట భారం తడిసి మోపెడై రైతుల మీద చెప్పలేనంత భారం పడుతోంది. ఖర్చులు కింద అధికారకంగా రూ.31.22 వసూలు చేయాల్సి ఉండగా... అనధికారకంగా రూ.40, రూ.45 వరకు వసూలు చేస్తున్నారు. అయితే రైతులకు గోతం ఖర్చు కింద కేవలం రూ.25 ఇస్తున్నారు. వాస్తవంగా రైతులకు రూ.50 వరకు అవుతోంది. మధ్యస్తంగా రూ.45లకు పెంచాలనుకున్నారు. ఆచరణలోకి రాలేదు.

సౌకర్యాలు మెరుగు పర్చాలి.. యార్డులోని విశ్రాంతి భవనంలో సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలి. డైనింగ్ హాలులో వసతులు సక్రమంగా లేవు. ఇప్పటివరకు రైతులకు ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం ప్రారంభం కాలేదు. వీటిపై తక్షణమే పాలకవర్గం దృష్టి పెట్టాల్సి ఉంది.

టవర్స్ పనులు పూర్తి చేయాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే: నిర్దేశించిన లక్ష్యం మేరకు జీఏడీ, హెచ్‌వోడీ టవర్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఏజీఐఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీఆర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న జీఏడీ, హెచ్‌వోడీ ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏజీఐఎస్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీఆర్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో నిర్మిస్తున్న సచివాలయ ఐకానిక్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులు ఎండీకి వివరించారు. ప్రణాళికాబద్ధంగా నిర్మాణం.. ప్రజా రాజధాని అమరావతిలో ప్రభుత్వ పరిపాలన కోసం అత్యాధునిక కార్యాలయ సముదాయాలను అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో సర్కారు నిర్మిస్తోంది. సంపూర్ణ నగర ప్రణాళిక, విస్తృత స్థల వినియోగం, ఆధునిక నిర్మాణ ప్రమాణాలతో ఈ టవర్స్ రూపుదిద్దుకుంటున్నాయి.

ఐకానిక్ టవర్స్ పనులు పరిశీలిస్తున్న ఏజీఐఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది అధికారులు

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

మెటీరియల్స్ జీనోమ్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

తుళ్లూరు, న్యూస్‌టుడే: మానవాళి అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న మెటీరియల్స్ జీనోమ్‌పై విస్తృత పరిశోధనలు జరగాలని ప్రముఖ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం మెటీరియల్స్ జీనోమ్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. 3 రోజులు జరగనున్న ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి వంద మందికి పైగా శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగం ఈ సదస్సు ఏర్పాటు చేసింది. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్‌కుమార్, యూనివర్సిటీ రిసెర్చ్ డీన్ ఆచార్య రంజిత్‌థాపా సదస్సు నిర్వహణను పర్యవేక్షించారు. కోల్‌కతా నుంచి వచ్చిన ప్రఖ్యాత శాస్త్రవేత్త జీపీ దాస్, బెంగళూరు ఐఐఎస్సీ శాస్త్రవేత్త, సీఎస్ఐఆర్ భట్నాగర్ అవార్డు గ్రహీత ఆచార్య డీడీ శర్మ, ప్రొ. స్టెఫాన్ సార్బీన్(ఐర్లాండ్)లు హాజరై పరిశోధనల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వక్తలు మెటీరియల్స్ జీనోమ్ సదస్సు ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. కృత్రిమ మేధ ఆధారిత ఆవిష్కరణ పద్ధతుల ద్వారా అధునాతన కంప్యూటేషనల్ మెటీరియల్ డిజైన్‌లో పురోగతి, శక్తి అనువర్తనాలు సహా పలు కీలక అంశాలపై పలువురు శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. జపాన్, రష్యా, స్పెయిన్, డెన్మార్క్, సింగపూర్, యూకే, యూఎస్ఏ తదితర 13 వర్ధమాన దేశాల నుంచి పరిశోధకులు, శాస్త్రవేత్తలు సదస్సుకు హాజరయ్యారు.

★ డీన్ రంజిత్ థాపా మాట్లాడుతూ 2020 నుంచి రెండేళ్లకోసారి ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఆర్ఎం ఏపీ ఉపకులపతి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎమర్జింగ్, క్వాంటమ్, ఏఐ టెక్నాలజీ అభివృద్ధితో పాటు విద్యార్థుల ఆవిష్కరణ దృష్టి పెరిగిందని తెలిపారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వంటి ప్రముఖ సంస్థలు ఈ సదస్సు నిర్వహణకు సహకారం అందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన డా.మహేష్ రవ్వా, డా. అనిత హల్దర్‌లు సదస్సుకు కో-కన్వీనర్లుగా వ్యవహరించారు.


సదస్సు ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రతినిధులు

రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: బ్యాంకు నుంచి ఇచ్చిన రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆప్కాబ్ తనిఖీ బృందం సహకార బ్యాంకు అధికారులకు సూచించింది. బ్రాడీపేటలోని సహకార బ్యాంకు పరిపాలనా కార్యాలయంలో గురువారం ఆప్కాబ్ తనిఖీ బృందంతో ర్యాప్ అప్ సమావేశం జరిగింది. బ్యాంకులో రుణాలకు సంబంధించి ఆప్కాబ్ తనిఖీ బృందం బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ రుణాల వసూళ్లకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బ్యాంకు వ్యాపార లావాదేవీలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఈనెల 27న జరగనున్న బ్యాంకు జనరల్ బాడీ సమావేశంపై పాలకవర్గంతో ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సమావేశమయ్యారు. వినుకొండ 51 విచారణ నివేదికను సహకార శాఖ అధికారులు సమర్పించిన నేపథ్యంలో దానిపై సమావేశంలో చర్చించేందుకు బోర్డు నిర్ణయించింది. సమావేశంలో బ్యాంకు సీఈవో వి.వి.ఎస్.ఫణికుమార్, జీఎం మాధవి, నాబార్డ్ డీడీఎం శరత్, ఆప్కాబ్ డీజీఎం ఆర్.సి.ఎస్. బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షునిగా నరసింహారావు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షునిగా డాక్టర్ వీవీఎల్ నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొనసాగిన అధ్యక్షురాలిని హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించారు. అప్పటినుంచి ఇన్‌ఛార్జిగా సభ్యురాలిగా ఉన్న విజయలక్ష్మి కొనసాగుతున్నారు. ఇటీవల హైకోర్టు వీవీఎల్ నరసింహారావును జిల్లా కమిషన్ అధ్యక్షునిగా నియమించాలని తీర్పు చెప్పింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

BUILDING CONSTRUCTION

తాడేపల్లిలోని ఒక అపార్టుమెంట్ భవనములపై పెయింటింగ్ నిమిత్తము ముందుగా వాల్స్, భీములు మొదలగువాటి రిపేరు చేయుటకు అనుభవంగల నిపుణులైన వారినుండి అంచనా వ్యయాలను ఆహ్వానించటమైనది. 92477 27555.

PERSONAL CLASSIFIEDS

MISSING
ది. 12-02-2026 నుండి కనబడుటలేదు

పేరు: అమరా వెంకటరత్నం గారు
పొన్నూరు, గుంటూరు జిల్లా
వయస్సు: 81 సం।।
రంగు: చామన ఛాయ
ఎత్తు: 5'.11 అంగుళాలు
దుస్తులు: చొక్కా, లుంగీ
ఆచూకీ తెలిసినవారు క్రింది నెంబరుకు తెలుపగలరు
కుమారుడు
అమరా నారాయణరావు
సెల్: 95533 32166

EENADU Classifieds

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యనాడి జ్యోతిష్యాలయం మీచేతిబొటనవేలుముద్రతో మీభవిష్యత్తు పూర్తిగాచెప్పబడును. అన్నిసమస్యలకు పరిష్కారంచెప్పబడును. 8978215913.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

మార్కాపురం (కుంట) దగ్గరలో 133 గజాలు కేవలం 2 లక్షలు మాత్రమే. దొనకొండ దగ్గరలో 133 గజాలు 1 లక్ష మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 9398621767.

JOBS

WANTED Experienced Accountant in a Company at Auto Nagar, Guntur. Salary Package follows Experience. Ph.90631 83834.

SARIPUDI Suzuki, Guntur - Hiring Managers, Cashier, CRM, CREs and Service Advisors. Both Freshers and experienced Candidates can apply. Attractive Salary + Incentives. Interview on 23-02-2026. ✆ 7799960199, 149.

విజయవాడ సిటీ, తాడేపల్లి ఏరియాలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్. జీతం: 35,000/-, PF & ESI. ✆ 79933 22229.

ఆఫీసు మేనేజర్ కావలెను. డిగ్రీ, పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 10 సం।।ల అనుభవం, కంప్యూటర్‌పై అవగాహన, 40 సం।।లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పని చేయుటకు Male/Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. ✆ 63022 43437.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర।। 78420 31133.

ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, టీమ్‌లీడర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 87126 18882. గుంటూరు.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు Senior Civil Engineersగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరాల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సం।।ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

గుంటూరు పరిధిలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో పనిచేయుటకు 10th/Inter చదివిన ఫుల్‌టైం లేడీవార్డెన్ కావలెను. Ph.93944 47117, 92477 45046.

MNY హాలిడేస్ & ప్రాజెక్ట్స్ కోసం గుంటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + Inc. ఇవ్వబడును. వయస్సుతో పనిలేదు. సంప్ర: 10am-6pm. ✆ 0863-4616071.

ASHOK Lalyland Dost Auto మరియు కారుకు లైసెన్స్, అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. అడ్రస్: వెంకట సీతావరలక్ష్మి ట్రేడర్స్, స్టాల్‌గర్ల్స్ హైస్కూల్ ఎదురు, నగరంపాలెం, గుంటూరు. జీతం:18500/-.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు స్టోర్‌కీపర్‌గా పనిచేయుటకు డిగ్రీ వుండి కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న పురుషులు కావలెను. జీతం: 15000/-, వర్కుచేయు ప్లేస్: గుంటూరు, పెదపలకలూరు. ఫోన్: 89784 80429.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

జడ్పీ సీఈవో జ్యోతిబసుకు ఉద్యోగోన్నతి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖలో డీపీవో, డీడీవోలకు సీఈవోలుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. దీంతో జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు ఉద్యోగోన్నతి పొందారు. ఆయన ఇప్పటి వరకు డీఎల్‌డీవో క్యాడర్‌లో ఉంటూ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి లభించడంతో రెగ్యులర్ సీఈవోగా కొనసాగనున్నారు. ఉద్యోగోన్నతి పొందిన అధికారులను ప్రస్తుతం వారు పనిచేస్తున్న పోస్టుల్లోనే కొనసాగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సీఈవో జ్యోతిబసును జడ్పీ ఉద్యోగులు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

జ్యోతిబసును అభినందిస్తున్న ఉద్యోగులు

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్.గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు ఛైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి రోహిత్ రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ.44,999 నుంచి ప్రారంభం అవుతోందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కి డైమండ్స్‌పై తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తోపాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

మిర్చి యార్డు సమాచారం
(నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు: 1,03,290
అమ్మకాలు: 1,01,211
నిల్వలు: 26,671

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)	
334	13,500-20,000
నంబర్ 5	13,500-22,000
273	14,000-23,000
341	14,000-23,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	13,000-17,500
బాడిగ	14,000-24,000
దేవనూరు డీలక్స్	15,500- 24,500
ఆర్మూర్	13,000-16,500

ఏసీ కామన్ వెరైటీ	
334	13,00-19,500
నెంబర్5	13,000-20,500
341	14,000- 22,500
సూపర్10	13,500-22,500

ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	13,000-17,000
బాడిగ	14,000-23,000
తాలు	7500-11,500

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

విద్యార్థులకు ఆర్థిక చేయూత

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఎన్నారై ఎడ్యుకేషనల్ సొసైటీ అంతర్భాగమైన సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులను ఆదుకున్నామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 60 మంది విద్యార్థులకు గుంటూరులో గురువారం రూ.12 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ ఇప్పటివరకు 5000 మంది విద్యార్థులకు రూ.35 కోట్లు ఆర్థిక సహాయం చేశామన్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్, నర్సింగ్, డిగ్రీ విద్యార్థులకు సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఆర్ఎస్ సీఏవో మన్నవ రవిప్రసాద్ పాల్గొన్నారు.

చింతలపూడిలో భారీ చోరీ

20 సవర్ల బంగారం మాయం

చింతలపూడి(దుగ్గిరాల): దుగ్గిరాల మండలం చింతలపూడిలో భారీ చోరీ జరిగింది. కష్టపడి కూలి పనులు చేసుకుంటూ కొద్దికొద్దిగా కూడబెట్టుకున్న బంగారం, వెండిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన చాయ లక్ష్మణరావు తాపీ కార్మికుడు కాగా.. ఆయన భార్య పప్పు మిల్లులో పనిచేస్తారు. గురువారం ఉదయం 8 గంటలకు ఇద్దరూ పనికి వెళ్లిపోయారు. పిల్లలు బడికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూస్తే తలుపు తాళం పగలగొట్టి ఉంది. లోపల బీరువాను పైభాగంలో పగలగొట్టారు. బంగారు తాడు, నల్లపూసల గొలుసు, బంగారు గొలుసు, రెండు జతల బుట్టలు, మూడు జతలు పోగులు, ఒక జత మ్యాటీలు, పాపిడిబిళ్ల, రెండు ఉంగరాలు వెరసి సుమారు 20 సవర్ల బంగారంతో పాటు ఐదు జతల వెండి పట్టీలు అపహరించారని బాధితులు చెప్పారు. ఎస్సై వెంకటరవి సంఘటనా స్థలానికి వచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు పగలగొట్టిన బీరువా

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: కళాశాల అధ్యాపకుల కోసం జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న 29వ చందూస్ సిల్వర్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరుగుతోంది. ☛జేకేసీ మైదానంలో జరిగిన పోటీల్లో ఎస్ఆర్‌కెఆర్-బీ జట్టుపై కేఎల్‌యూ, ఎన్ఆర్ఐటీ మీద ఎస్ఆర్‌కెఆర్-ఏ జట్టు విజయాలను నమోదు చేసుకున్నాయి. ☛ఆర్వీఆర్‌జేసీ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో చిప్స్ జట్టు మీద విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విజయాన్ని సాధించగా, ఆర్వీఆర్‌జేసీ జట్టు మీద ఎస్ఆర్ఎం-ఏ జట్టు గెలుపొందింది. ☛ పేరేచర్లలో జేఎన్ఎన్ మైదానంలో మలినేని జట్టు మీద విట్(ఏపీ) గెలుపొందగా, ఈశ్వర్ కళాశాల(నరసరావుపేట)పై చలపతి(మోతడక) జట్టు విజయాన్ని సాధించింది. ☛వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయ గ్రౌండ్‌లో జరిగిన పోటీలో నరసరావుపేట ఇంజినీరింగ్ జట్టు మీద ఆర్‌కె కళాశాల(విజయవాడ), బాపట్ల ఇంజనీరింగ్ జట్టు మీద కిట్స్ కళాశాల జట్టు గెలుపొందాయి.

జేకేసీ కళాశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపల్ గోపీచంద్

సమ్మె ఉద్ధృతం చేస్తాం

కలెక్టరేట్(గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెను మరింత ఉద్ధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మొవ్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నా..ఉద్యోగ సంఘ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించకపోగా..ఉద్యోగ సంఘాలను హేళన చేస్తూ జీవో 112ను విడుదల చేసిందన్నారు. ఈ జీవోలో ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే అంశాలున్నాయన్నారు. మా సమస్యలకు పరిష్కారం చూపని జీవోను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు సంఘ కార్యాలయాలను మూసేసి, సమ్మెలో పాల్గొనాలని సహకార సంఘ ఉద్యోగులను కోరారు.

ఇంట్లో మందలించారని బాలిక ఆత్మహత్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: సరిగా చదవటం లేదని కుటుంబ సభ్యులు మందలించారన్న మనస్తాపంతో ఇజ్రాయెల్‌పేటకు చెందిన పదో తరగతి బాలిక (15) ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ఇది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి బాలికను కుటుంబసభ్యులు మందలించారు. తీవ్ర మనస్తాపంతో ఆమె గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నేడు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులు సైతం మత్తును అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటపడలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ మాయ చేతుల్లోనూ విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదకద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చితికిపోతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారనే దానిపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో' ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాతినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప
20.02.26 (శుక్రవారం)
ఉదయం 10.30 గంటలకు

అధునాతన సాంకేతికతతో భవనాల అభివృద్ధి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతికతతో అన్నప్రసాదం, లడ్డు పోటు భవనాల అభివృద్ధి చేయాలని ఈవో శీనానాయక్ దిశానిర్దేశం చేశారు. మల్లికార్జున మహా మండపంలో గురువారం నిర్మాణంలోని ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో ఈవో మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందంతో కలిసి అన్నదాన భవనం, లడ్డు ప్రసాదాల పోటు భవనాన్ని పరిశీలించిన తర్వాత ఆధునిక సాంకేతికతతో కూడిన వంటగది, అత్యాధునిక బాయిలర్ పరికరాల ఏర్పాటు చేయాలని సూచించారు. తితిదే బూందీ పోటు, అన్నదానం బాయిలర్లకు విజయవంతంగా పరికరాలను ఏర్పాటు చేసిన టెక్నాలజిక్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఇప్పటికే నివేదికను సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ప్రతినిధులు రఘునాథన్, డిజైన్ మేనేజర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యాంజలి-2.0 సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: పాఠశాలల బలోపేతం కోసం విద్యాంజలి 2.0 కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. నోబుల్ కళాశాలలో గురువారం నిర్వహించిన విద్యాంజలి 2.0 పై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాలంటీర్లుగా సేవలు అందించాలనుకున్న వారు విద్యాంజలి వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గ్యారెంటీ ఎస్‌ఓపీఎస్‌ను బలోపేతం చేసే దిశగా ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల పరిధిలో విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులను సమీకరించి వారి ద్వారా వెనుకబడిన విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు మాట్లాడుతూ.. పాఠశాలల్లో ముఖ్య అవసరాలను గుర్తించి వాటిని విద్యాంజలి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుముదినిసింగ్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలలు విద్యాంజలి 2.0లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఎంఈవోలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ ఛైర్మన్లు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు శ్యామ్ సుందర్, రమేష్, రామకృష్ణ, శ్రీలత శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు విద్యాంజలి కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

అవగాహనే.. వృద్ధ జంటను కాపాడింది

ఉయ్యూరు, న్యూస్‌టుడే: సైబర్‌క్రైం నేరాల పట్ల ఉన్న అవగాహనతో ఓ వృద్ధ జంట చాకచక్యంగా బయటపడింది. పట్టణ పోలీసులు కల్పిస్తున్న అవగాహనతో సైబర్ నేరస్థులకు చెక్ పెట్టారు. ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పీజీఎస్‌జీఎస్ కాలనీ సమీపంలో నివాసముంటున్న విశ్రాంత ఉద్యోగి దంపతులకు బుధవారం రాత్రి ముంబయి క్రైం బ్రాంచి నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్ నంబరుపై రూ.25 లక్షల మనీలాండరింగ్ జరిగిందని.. అందుకు సంబంధించిన సుప్రీంకోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని ఓ వ్యక్తి ముంబయి క్రైం బ్రాంచ్ ఎస్సైగా పరిచయం చేసుకున్నాడు.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాట్లాడతారని వీడియోకాల్‌లో మాట్లాడారు. బ్యాంకు ఖాతా, స్థిర, చరాస్తుల వివరాలు అందించాలని బెదిరించారు. ఈ విషయం బయటకు చెబితే స్థానిక పోలీసులు మిమ్మల్ని అదుపులోకి తీసుకొని ముంబయి తరలిస్తారని భయపెట్టారు. కానీ ఇప్పటికే పలుమార్లు స్థానిక పోలీసులు సైబర్ నేరాలపై కల్పిస్తున్న అవగాహనతో ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఆయా వృద్ధులు అందించారు. వెంటనే సీఐ రామారావు సమాచారం ఉన్నతాధికారులకు వివరించి ఆ వృద్ధుల ఇంటికెళ్లి వీడియోకాల్ పరిశీలించారు. అది తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు కాల్ కట్ చేసేశారు. దీంతో ఆయా వృద్ధులు సైబర్ నేరం నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. ఇటువంటి ఫోన్‌కాల్స్ వస్తే వెంటనే రహస్యంగా తమకు సమాచారం అందించాలని, ఇలాంటి నేరాలపై అవగాహనతో ఉండాలని సీఐ కోరారు.

వృథా వ్యధ.. కథ ఇనుము!

తుక్కుగా మారుతున్న ఉక్కు నిల్వలు

వైకాపా పాలన వైఫల్యానికి నిదర్శనం

ఈ ఇనుమును.. 2021-22 వైకాపా పాలనలో కొని.. పెనుగంచిప్రోలు మండల హౌసింగ్ కార్యాలయం ఆవరణలో ఇలా పడేశారు. తుప్పు పట్టి, చుట్టూ ముళ్లపొదలు ఏర్పడి క్రమంగా మట్టిలో కలిసిపోతోంది.

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

"వైకాపా పాలనలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఆది నుంచి అక్రమాలే రాజ్యమేలాయి. మెరక పనులు మొదలు.. ఇంటి నిర్మాణం వరకు నాయకులు, అధికారులు అడ్డగోలుగా దోచేశారు. అవసరానికి మించి ఇనుము కొని సొమ్ము చేసుకోవడంతో ఆ ఇనుము ఉమ్మడి జిల్లాలో ఎందుకూ కొరగాకుండా పోతోంది."

లబ్ధిదారుల ప్రమేయం లేకనే...

✪ ఉమ్మడి కృష్ణాలో వైకాపా పాలనలో ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే (ఆప్షన్-3) గృహ యూనిట్లు 31,000 వరకు మంజూరయ్యాయి. వీటి నిర్మాణంపై అసలు లబ్ధిదారులకు సమాచారం లేకుండానే స్టీల్, ఇతర మెటీరియల్ అవసరానికి మించి మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి కొనేశారు. ✪ భారీగా కమీషన్ తీసుకుని ఆయా కంపెనీలకు ఇంటి నిర్మాణం చేపట్టక ముందే మొత్తం బిల్లు చెల్లించేశారు. తీరా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మొత్తమ్మీద 6 వేలు కూడా పూర్తవలేదు. దీంతో అడ్డగోలుగా తెచ్చిన ఇనుము, ఇతర మెటీరియల్ మిగిలిపోయాయి.

✪ జగ్గయ్యపేట, నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల... ఇలా ప్రతి మండలంలోనూ 50-100 టన్నుల వరకు ఇనుము వృథాగా ఉంది. చాలాచోట్ల బయటపడేయగా ఏళ్లుగా ఎండ, వానలకు తుప్పు పట్టిపోతోంది. ✪ ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల విలువైన ఇనుము వృథాగా ఉంది. ఇళ్లు కడుతున్న గుత్తేదారులకు చాలాకాలంగా బిల్లులు ఇవ్వక పనులు నిలిచిపోయాయి. ✪ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీలు వెంకట్రావ్, రజనీకుమారిలు మాట్లాడుతూ.. చాలా ప్రాంతాల్లో ఇనుము తుప్పు పట్టకుండా భద్రపరిచాం.. లబ్ధిదారులు వస్తే వారికి ఇస్తాం.. లేదంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చేస్తామన్నారు.

50-100 టన్నులు

ఒక్కో టన్నుకు రూ.వేలల్లో దోపిడీ

✪ ఉమ్మడి జిల్లాలో 3 వేల టన్నుల మేర ఇనుము నిరుపయోగంగా మిగిలింది. ఆయా మండల కేంద్రాల్లో కొన్నిచోట్ల గిడ్డంగుల్లో పెట్టగా మరికొన్నిచోట్ల ఆరుబయటే వదిలేశారు. ఏళ్లు గడిచిపోవడం.. గృహ నిర్మాణం పడకేయడంతో ఉక్కు తుప్పు పట్టి తుక్కులా మారిపోతోంది. ✪ 2021-22లోనే టన్ను ఇనుము రూ.67-74 వేలకు కొన్నట్లు చూపించగా ఇప్పటికీ బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ.60 వేలకు కూడా చేరకపోవడం గమనార్హం.

సరిహద్దులూ..చూపలేరా?

గ్రౌండింగ్‌కు మట్టి దొరకక మల్లవల్లిలో అగచాట్లు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

మల్లవల్లి పారిశ్రామికవాడలో నిర్మాణంలో ఉన్న చిన్న యూనిట్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మల్లవల్లిలో 347 మంది పారిశ్రామికవేత్తలు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు 2025 మార్చిలో లాటరీ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఆరు నెలల్లో గ్రౌండింగ్ పూర్తిచేసి, రెండేళ్లలో పరిశ్రమలను నెలకొల్పాలి. ఏడాది కావస్తున్నా సగం మందైనా గ్రౌండింగ్ పూర్తిచేయలేదు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియకుంది. జాగా కేటాయించినంత వేగంగా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు.

ప్రత్యేకంగా అధికారులతో కూడిన ఓ బృందాన్ని పర్యవేక్షణకు కేటాయించినా.. అనుకున్న లక్ష్యానికి చేరుకోలేక చతికిలపడ్డారు. సర్వే చేసి.. ఎవరి స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సరిహద్దు రాళ్లు పాతే ప్రక్రియ తీవ్ర జాప్యమైంది. మరో వైపు గ్రౌండింగ్‌కు అవసరమైన మట్టి కొరత వేధిస్తున్నా.. పట్టించుకునే వారే లేరని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

మల్లవల్లిలో 2, 3 నెలల కిందట నుంచి.. ఎవరి స్థలాలు ఎవరివో సర్వే ఆరంభించి.. సగం చేపట్టాక.. మిగతావి చేయకుండా వదిలేశారు. దీంతో కేటాయించిన వారిలో కొందరే.. గ్రౌండింగ్ చేశారు. మిగతా వాళ్లు.. అందరికీ కేటాయించాక చూద్దామనే ధోరణిలో ఉన్నారు. కారణం.. తీవ్ర మట్టి కొరత. పారిశ్రామికవాడలో 500 చదరపు మీటర్ల నుంచి 1, 2 ఎకరాల వరకూ ఒక్కొక్కరికి ప్లాట్లను కేటాయించారు. వీరిలో అర ఎకరా లోపు స్థలాలు కేటాయించిన 40-50 చిన్న యూనిట్లు గ్రౌండింగ్ పూర్తిచేసి.. నిర్మాణంలో ఉన్నాయి. వీరితోపాటు మరి కొందరు కూడా గ్రౌండింగ్‌కు సిద్ధంగానే ఉన్నా.. మట్టి దొరకడం కష్టంగా మారి చేతులెత్తేశారు.

అక్రమంగా తరలిస్తున్నా..

మల్లవల్లి సమీప ప్రాంతాల్లో విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వీరి దగ్గరే టిప్పర్‌కు రూ.8-10 వేలకు కొనడం భారమైంది. గతంలో రూ.5 వేలకు దొరికేది.. ఇప్పుడు రెట్టింపు వెచ్చించాల్సిందే. ఇదేమంటే.. అధికారిక తవ్వకాలకు గన్నవరం పరిధిలో అనుమతులు లేకపోవడంతో.. ఎక్కడెక్కడి నుంచో తెస్తున్నారు. వాళ్లు చెప్పిన ధరకు కొనాల్సిందే అని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

ఎవరికీ పట్టదంతే..

సమస్యను ప్రజాప్రతినిధులు, కృష్ణా జిల్లా కలెక్టర్ సహా అధికారులు అందరికీ చెప్పినా.. పరిష్కారం దొరకలేదు. రెండెకరాల స్థలాన్ని గ్రౌండింగ్ చేయాలంటే.. రూ.30-35 లక్షలు పెట్టాల్సి రావడంతో.. ఇప్పుడు తొందరేముందని ఎక్కువ మంది వేచిచూస్తున్నారు. ప్రభుత్వం ఎకరం రూ.16.50 లక్షలకు కేటాయిస్తే.. మట్టి కోసం అంతకంటే ఎక్కువ కావాల్సివస్తోందని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

కాలువ గట్టు... కనబడితే ఒట్టు

సూరంపల్లిలో దెబ్బతిన్న పోలవరం కాలువగట్టు

సిమెంటు రక్షణ లైనింగ్ దెబ్బతిందిలా.

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి దగ్గర పోలవరం కాలువ పరిస్థితి ఇది. కాలువ వెంబడి ఉన్న మట్టికట్ట కోసుకుపోవడమే కాక.. సైడ్ వాల్ సైతం దెబ్బతిని సిమెంట్ లైనింగ్ ముక్కలై ఇలా తయారైంది. ప్రస్తుతం కాలువ వెంబడి రహదారిని చాలామంది చెత్తతో డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. రాబోయేది వేసవి కాలం కావడంతో ఇప్పుడే దీనికి మరమ్మతులు చేయించి తక్షణమే బాగుచేయించాల్సిన అవసరం ఉంది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం కాలువ వెంట మట్టిని దోచుకుపోవడం, నిర్మాణాలపై నిర్లక్ష్యం కారణంగా చాలా ప్రాంతాల్లో కాలువ దెబ్బతింది. పట్టిసీమ నుంచి కృష్ణానదికి గోదావరి జలాలను తీసుకువచ్చే ప్రధాన కాలువ కావడంతో వర్షాకాలం రాకుండానే దీనికి మరమ్మతులు చేయించి పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. - **ఈనాడు, అమరావతి**

కళ్లెదుటే కలవరం.. కదలాలి కనికరం

✪ కట్టలు తెగక ముందే చక్కదిద్దాలి ✪ తీర గ్రామాల్లో కరకట్టలు శిథిలం

ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం

జిల్లాలో సముద్ర తీర ప్రాంత ప్రజల భద్రతకు పెద్ద ముప్పే పొంచి ఉంది. అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని సముద్ర కరకట్టలు చాలాచోట్ల కుంగిపోయాయి. ప్రకృతి వైపరీత్యాలతో గ్రామాల్లోకి నీరు చొచ్చుకురాకుండా నిర్మించిన అడ్డుకట్టలు ధ్వంసమయ్యాయి.

సముద్ర ఆటుపోట్లు పెరిగినా.. అధిక వర్షాలు, వరదలు వచ్చినా.. కుంగిన కరకట్టలు కొట్టుకుపోయే వీలుంది. ఇదే జరిగితే తీరాన వేల ఎకరాల పొలాలు, గ్రామాల సముద్ర కోతలతో ప్రజలకు మిగిలేది వేదనే. వైకాపా పాలనలో గాలికొదిలేశారనీ... కూటమి ఏలుబడిలోనైనా చక్కదిద్దాలని కోరుతున్నారు.

కృత్తివెన్ను: పీతలావ వద్ద కరకట్టపై భారీగా పడిన గుంత

నడవాలన్నా యాతనే... దివిసీమ అనగానే 1977లో పెను ఉప్పెన సృష్టించిన బీభత్సం గుర్తుకొస్తుంది. ఊళ్లకు ఊళ్లకొట్టుకుపోయి.. భారీగా ప్రాణ, ఆస్తి నష్టంతో కొన్నితరాలు నేటికీ కోలుకోలేదు. ఇలాంటి విపత్తుల నుంచి రక్షణగా దివిసీమ చుట్టూ గుల్లలమోద నుంచి ఉల్లిపాలెం వరకు 40 కి.మీ. పొడవు.. 20 అడుగుల ఎత్తులో కరకట్ట కట్టారు. ఇది దెబ్బతినగా 1990లో పునఃనిర్మించారు. నాటి నుంచి కనీస మరమ్మతులు లేవు. మట్టి కరిగిపోయి... కోడూరు, ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, ఊటగుండం, రామకృష్ణాపురం, బసవవానిపాలెం, సంగమేశ్వరం, నాలి, సోర్లగొంది, గుల్లలమోద పరిధిలో కరకట్ట శిథిలమైంది. నడిచేందుకూ వీలు కావట్లేదు.

కొన్నేళ్లకే భారీగుంతలు.. బందరు మండలంలో కోన, పల్లెతుమ్మలపాలెం, చిన్నాపురం, వాడపాలెం, వాడగొయ్య, పాలేరు.. తీర గ్రామాల రక్షణకు 18 కిమీ పొడవు, 15 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించారు. జాతీయ తుపాను విపత్తు నివారణ పథకం కింద రూ.34 కోట్లు ఖర్చు చేయగా 2019 వరకు నిర్మాణం సాగింది. కొన్నేళ్లకే భారీ గుంతలు పడుతున్నాయి.

20 అడుగుల్లోతు గుంతలు...

కృత్తివెన్ను పరిధిలో పెదలంక డ్రెయిన్-ఇంతేరు మధ్య 4 మీటర్ల ఎత్తు.. 13 కిమీ పొడవుతో రూ.33 కోట్లతో కట్టిన కరకట్టపై పీతలావ సమీపంలో 5 చోట్ల 20 అడుగులకు పైగా భారీ గుంతలు పడ్డాయి. నిర్మాణ లోపాలు.. కాలవల ద్వారా నీరు కడలిలోకి వెళ్లేచోట కల్వర్టులకు బదులు తూములు వేశారు. ఇవి కుంగి ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో మరమ్మతుల పేరుతో చేయని పనులకు రూ.15 లక్షలు దోచేశారు.

ప్రభుత్వానికి మరోసారి విన్నవిస్తాం

- బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు

కరకట్టలకు మరమ్మతులు, పునఃనిర్మాణానికి అంచనాలు తయారు చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతుల మంజూరు, పనులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకెళ్తాం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: (శుక్రవారం) సాయంత్రం: 6.16

సహరి: (శనివారం) ఉదయం: 5.10

22న తెదేపా జిల్లా కార్యాలయానికి భూమిపూజ

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో తెదేపా జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి ఈనెల 22న ఉదయం భూమి పూజ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి తెలిపారు. జిల్లా తెదేపా కార్యాలయ భవన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు తదితరులు పాల్గొంటారన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మోటమర్రి బాబాప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. విజన్ 2047 లక్ష్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాలను బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పాత ఎడ్లంక దీవి కోత సమస్యను పరిష్కరించాలి

అసెంబ్లీలో ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం – న్యూస్‌టుడే: పాత ఎడ్లంక గ్రామం (దీవి) కోత సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం దీవి పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపై ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన ఇసుక తవ్వకాలు, కృష్ణానది ప్రవాహ గతిలో మార్పు రావటంతో ఆ గ్రామంలో కోత తీవ్రత పెరిగిందన్నారు. 2023-24లో వచ్చిన వరదలకు 15 ఇళ్లు, 300 ఎకరాలు భూమి నదిలో కలసిపోయాయన్నారు. తాజాగా మరో 48 గృహాలు నదిలో కలిసిపోయేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో పరిరక్షించవలసి అవసరం ఉందన్నారు. ❖ ఈ సమస్యపై జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ కృష్ణానది ప్రవాహ మార్గం దిశ మార్చుకొని డైరెక్టుగా పాత ఎడ్లంక భూభాగంపై ఒత్తిడి పడుతున్న నేపథ్యంలో కోత ప్రభావం పెరిగిందన్నారు. అక్కడి కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకి తరలించి పక్కా గృహాలు నిర్మించే ప్రతిపాదనను నివాసితులు తిరస్కరించారన్నారు. ఎడ్లంకలో అప్రూవ్డ్ లే-అవుట్‌లో నివేశన స్థలాలు గృహాలు మంజూరుచేసే ఆలోచన ఉందన్నారు. ఈ రెండు ప్రతిపాదనలు కాని పక్షంలో రూ.50 కోట్లతో చుట్టూ గ్యాబింగ్ వాల్ నిర్మించి రక్షణ కల్పించేందుకు ప్రతిపాదన మేరకు అంచనాలు రూపొందించామని చెప్పారు. ఇది ప్రస్తుతం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ వద్ద పెండింగులో ఉందన్నారు. ఆర్థిక శాఖ ఆమోదం రావాల్సి ఉందన్నారు.

అడ్డాడలో ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ

పనులు జరుగుతున్న ప్రాంతం

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: పామర్రు మండలం అడ్డాడలో ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ సంస్థ అన్వేషణ మొదలెట్టింది. ఈ క్రమంలో అవసరమైన ప్లాట్‌ఫామ్‌ని టెండరు ప్రక్రియ ద్వారా ఏర్పాటు చేయగా, బుసక, ఎర్రరబ్బీషు, 40 ఎంఎం నల్లకంకరుతో మూడు లేయర్లతో ప్లాట్‌ఫామ్ తయారీ పనుల్లో గుత్తేదారులు ఉన్నారు. ఇప్పటివరకు 30 శాతం పనులు పూర్తయ్యాయి. జులై నుంచి సంస్థ ఆయిల్ నిక్షేపాలకు సంబంధించిన పనులు ప్రారంభించనుండగా రెండేళ్లపాటు ఈ ప్రాంతంలో పనులు జరగనున్నాయి. ఇప్పటికే నాగాయలంకలో క్రూడ్ ఆయిల్ వెలికి తీస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి బంటుమిల్లి, పాండురేక గ్రామాల మీదుగా బందరు సముద్రంలోకి ఆయిల్ కాలువ ప్రవహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వత్సవాయి ఠాణాలో తిరకాసు బాగోతం

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన సీపీ...✪ ఎస్సై పాత్రపై కొనసాగుతున్న విచారణ

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

ఓ కేసులో నిందితులుగా పేర్లు చేర్చకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో వత్సవాయి స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సస్పెండయ్యాడు. ఎస్సై ఉమామహేశ్వరరావుపై శాఖాపరమైన విచారణకు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశించారు. ఈ ఉదంతంలో ఏసీబీ ట్రాప్ నుంచి వీరు త్రుటిలో తప్పించుకున్నారు. వివరాలివీ...

పేర్లు చేర్చకుండా ఉండేందుకు..

వత్సవాయి పోలీస్‌స్టేషన్ పరిధి గోపినేనిపాలెంలో ఇటీవల ఓ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాలతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయితే నిందితుడి సోదరుడు, అతని స్నేహితులను ఎస్సై నిత్యం స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఎస్సైకి రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకరించి, సమాచారాన్ని ఏసీబీకి అందించారు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు అనిశా అధికారులు ప్లాన్ వేశారు. ఈ మేరకు లంచం ఇచ్చేందుకు బుధవారం.. నిందితుడి తండ్రి ఎస్సై వద్దకు వెళ్లాడు. ఇప్పుడే వస్తానని ఎస్సై బయటకు వచ్చారు. ఇదే క్రమంలో కానిస్టేబుల్ బయట ఉన్న తన బ్యాచ్‌కు చెందిన ఏసీబీ కానిస్టేబుల్‌ను గుర్తుపట్టాడు. అనుమానంతో వెంటనే ఎస్సైకి సమాచారం ఇవ్వగా.. ఎస్సై ఉమామహేశ్వరరావు స్టేషన్ నుంచి హుటాహుటిన వెళ్లిపోయారని తెలిసింది.

సీపీ రాజశేఖరబాబు సీరియస్....

లంచం డిమాండ్ చేసి.. ఏసీబీ ట్రాప్ నుంచి తప్పించుకున్న ఉదంతంపై విజయవాడ సీపీ రాజశేఖరబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేసి, ఎస్సై ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ కొండలరావులపై నివేదిక ఇవ్వాలని గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణను ఆదేశించారు. డీసీపీ గురువారం నందిగామ ఏసీపీ కార్యాలయానికొచ్చి సమగ్ర విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ప్రాథమికంగా కానిస్టేబుల్ పాత్ర నిర్ధారణ అయింది. ఎస్సైకి డబ్బులు ఇస్తే.. పేర్లు చేర్చరని చెప్పినట్లు తెలిసింది. దీంతో డీసీపీ సిఫార్సు మేరకు కమిషనర్ కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేశారు. ఎస్సై పాత్రపై విచారణ సాగుతోంది. స్టేషన్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

నా పేరు బాబు.. నేను ఆర్టీసీలో పనిచేస్తాను.. మా పిల్లలు చేసిన పనికి నన్ను, వాళ్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జనవరి 4న ఘటన జరగ్గా.. ఆ రోజే నా చరవాణి తీసుకున్నారు. అప్పటి నుంచి ఇవ్వలేదు. మా పిల్లలు దొరికిన తర్వాత కూడా నన్ను రెండుసార్లు కొట్టారు. మా పిల్లలతోపాటు మరో ముగ్గురు ఉన్నారు.. రూ.40 వేలు సెటిల్‌మెంట్ చేసుకుని ముగ్గురిని వదిలేశారు. మేం డబ్బులు ఇవ్వడం ఆలస్యం కావడంతో నెల రోజులు తిప్పారు. కేసు లేకుండా చేయడానికి నన్ను రూ.లక్ష అడిగారు.. అంత ఇవ్వలేనంటే రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. వయసులో పెద్దవాడినీ.. ఆర్టీసీ ఉద్యోగిని అని కూడా చూడకుండా ఎస్సై కొట్టారు. ఈ పరిణామాలపై పోలీసులు అధికారులు విచారణ చేపట్టి నాకు న్యాయం చేయాలి. - **నిందితుడి తండ్రి ఆవేదన**

చదివింది న్యాయం.. చేసేది నేరం

మ్యూల్ ఎకౌంట్స్ కేసు సూత్రధారి రాజా తీరిది

చెన్నై నగరం తిరువొత్తియూర్‌లో వెంకట్ ఉంటున్న ఇల్లు

ఈనాడు, అమరావతి: అతను చదివింది న్యాయశాస్త్రం.. చేసేది మాత్రం చట్టవిరుద్ధ లావాదేవీలు. డిజిటల్ మార్కెటింగ్ పేరుతో తిరుగుతుంటాడు. కొంత సమయం సీనియర్ లాయర్ వద్ద ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఇటీవల యనమలకుదురులో వెలుగు చూసిన అద్దె ఖాతాల కేసులో సూత్రధారి సుబ్రమణి రాజా వెంకట్ భిన్న శైలి ఇది. చెన్నైతోపాటు పలు ప్రాంతాల్లో తన గ్యాంగ్‌తో మ్యూల్ ఖాతాలు తెరిపించి. చట్టవ్యతిరేక లావాదేవీలు చేయిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చెన్నై వెళ్లిన బెజవాడ పోలీసులకు నిరాశే ఎదురైంది. రెండు రోజులున్నా.. ఆచూకీ దొరకలేదు. అతని కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చి బయలుదేరారు.

డబ్బు సంపాదించాలనే ఆశతో.. చెన్నై నగరం తిరివొత్తియూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న వెంకట్‌ది పేద కుటుంబం. తండ్రి తాగుడుకు బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఇంటికి పరిమితమయ్యేవాడు. దీంతో వెంకట్.. త్వరగా డబ్బు సంపాదించాలన్న ఆశతో అడ్డదారి తొక్కాడు. చెన్నైలో కొందరితో కలిసి అద్దె ఖాతాల లావాదేవీలు చేయడం ప్రారంభించాడు. తనకు సమీప బంధువులైన రవికుమార్, స్టీవెన్ సాయంతో విజయవాడలో కథ నడిపించేవాడు. వీరు ఇక్కడ సైబర్ పోలీసులకు పట్టుబడటంతో.. అప్రమత్తమైన రాజా వెంకట్.. ఈ నెల 9 నుంచి అదృశ్యమయ్యాడు. నిందితుడి ఇంటికి పోలీసులు వెళ్లినా ఉపయోగం లేకపోయింది. కుటుంబ సభ్యులు... న్యాయవాదులతో కలిసి పోలీసుల వద్దకు వచ్చారు. వారం రోజుల సమయం ఇస్తే.. వెంకట్‌ను తీసుకొచ్చి అప్పగిస్తామన్నారు.

ఖాతాల వడపోత: లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాల వివరాలు బ్యాంకుల నుంచి వచ్చాయి. ఈ స్టేట్‌మెంట్లను పోలీసులు వడపోస్తున్నారు. వాటిల్లో పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరగలేదని తెలిసింది. ఓ ఖాతాలో గరిష్ఠంగా రూ. 16 లక్షలు మాత్రమే జరిగినట్లు గుర్తించారు. నిందితుడు ఈ వ్యవహారాల్లో రెండో అంచెలో ఉన్నట్లు తేలింది. ఇతని వెనుక ఇంకా కొందరు ఉన్నట్లు భావిస్తున్నారు. ఇతను దొరికితేనే పూర్తి వివరాలు వచ్చే అవకాశం ఉంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్, రమణ

విజయవాడ(గాంధీనగర్): ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారులు పారదర్శక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు (ఏఏవో, డీజీపీ కార్యాలయం, మంగళగిరి), సహాధ్యక్షుడిగా పి.శంకర్ (ఏటీవో, అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్ (జేఏవో, సీఎఫ్ఎంఎస్, మంగళగిరి), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ఫణీంద్రరాజు (ఏటీవో, గుంటూరు), కోశాధికారిగా ఎం.మంజునాథ్ (జేఏవో, మంగళగిరి) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.వల్లీదేవి (ఏఏవో, విజయవాడ), ఎం.రెడ్డప్పరెడ్డి (జేఏవో, మంగళగిరి), కె.శ్రీనివాసరావు (ఏఏవో, విజయనగరం), వి.రఘురాములు (జేఏవో, విజయవాడ), ఈసీ సభ్యులుగా డి.ఎన్.వి.సవిత (ఏఏఫ్‌వో, కర్నూలు), ఎస్.సునీత (ఏఏవో, అమరావతి), బి.నాసారెడ్డి (జేఏవో, విజయవాడ), వి.షకీలా (ఏఏవో, గుంటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పెనుమాక రాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఆర్థిక శాఖ అధికారులతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కె.ఉదయ్ మాట్లాడుతూ.. శాఖాపరమైన అభివృద్ధి కోసం కృషి చేస్తామని, ఏటీవోలు-ఏడీ, ఏడీ-డీడీ, డీడీ-జేడీ పదోన్నతుల విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి 26 జిల్లాల నుంచి గెజిటెడ్ అధికారులు హాజరయ్యారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.రమణ.. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సహాయ ఎన్నికల అధికారిగా టి.సత్యనారాయణ, పరిశీలకుడిగా సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

లంచం తీసుకుని.. బిల్లులు చేయక..

పురపాలక ఉద్యోగి వ్యవహారంపై కార్మికుల ఆందోళన

ఉద్యోగి కామేష్‌బాబు ఎదుట మహిళా కార్మికులు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో గత 20 ఏళ్లుగా రావాల్సిన ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇక్రిమెంట్ల బిల్లులు చేయడానికి నాటి ఎఫ్1 సెక్షన్ ఉద్యోగి కామేష్ బాబు అక్రమంగా సుమారు 12 లక్షల రూపాయల లంచం వసూలు చేశాడని, నేటికీ తమ బిల్లులు రాలేదని పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఆందోళనకు దిగారు. సుమారు 20 మంది కార్మికులు రెండు గంటల పాటు కార్యాలయంలో అతని ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు ఈ గొడవను గూర్చి విన్న కమిషనర్ సింహాద్రి మనోహర్ ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వివరాలు పరిశీలిస్తే..

గుడివాడ పురపాలక సంఘంలో 87 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతీ కార్మికునికి 12, 18 సంవత్సరాలకు స్పెషల్ గ్రేడు ఇంక్రిమెంట వస్తుంది. అయితే కార్మికులు మధ్యలో గైర్హాజరు అవుతుండటం లాంటివి నిత్యం జరుగుతుంటాయి. వీటిని ఆసరాగా తీసుకుని విధులకు గైర్హాజరు కావడం వలన ఇంక్రిమెంట్లు చేయలేమని గతంలో ఎఫ్1గా పనిచేసిన కామేష్ బాబు కార్మికులను బెదిరించి వారినుంచి భారీగా లంచాలు తీసుకున్నట్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై జనవరి 7వ తేదీన ఈనాడులో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో కమిషనర్ మనోహర్ విచారణ చేసి కామేష్ బాబును జీ1 సీటులోకి మార్చారు.

గతంలో ఈనాడులో ప్రచురితమైన కథనం

➡ నేను త్వరలో పదవీ విరమణ చేస్తున్నానని, జీతం బాగా పెరుగుతుందని చెప్పడంతో బకాయిల బిల్లుల కోసం రూ.50 వేలు వడ్డీకి తెచ్చి లంచమిచ్చా. నేటికీ బిల్లు రాలేదు. - కంచర్ల నాగమణి

➡ వారం రోజులలో మీ బిల్లు చేస్తానని నమ్మబలికి దొంగబిల్లులు చూపాడు. రూ.30 వేలు వడ్డీకి తీసుకుని వచ్చి అతడికి ఇచ్చాను. మా సంగతేమిటని అడిగితే రేపు.. మాపు అంటూ కాలం దాటేస్తున్నాడు. -కోన మణెమ్మ

క్రమశిక్షణ చర్యలకు సిఫారసు

గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల బకాయిల బిల్లులు చేయడానికి కామేష్ బాబు లంచాలు తీసుకున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీకి సిఫారసు చేశా. ఇప్పటికే 70 మంది కార్మికుల బిల్లులను చేయడం జరిగిందన్నారు. లంచం ఇచ్చినా, తీసుకున్నా తప్పే. సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలి. - కమిషనర్ సింహాద్రి మనోహర్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీని అభివృద్ధి చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. ది ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ కృష్ణా రీజియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం మచిలీపట్నంలోని ఏపీఎన్‌జీవోస్ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ రీజియన్ ఛైర్మన్‌గా కె.నాగేశ్వరరావు, అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎల్.రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సత్యనారాయణ, కార్యదర్శి పీవీ నారాయణరావు, సంయుక్త కార్యదర్శులు ఎం.బాలాప్రసాద్, టీకేవీ రామారావు, సహాయ కార్యదర్శులు ఎంవీ ఆంజనేయులు, బి.రామారావు, కోశాధికారి ఎం.కుషిబాబుతోపాటు మొత్తం 18 మందితో నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూరపనేని శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి యడ్ల శ్రీనివాసరావు, కోశాధికారి కోసూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. తొలుత నాయకులు, ఉద్యోగులు ఆర్టీసీ డిపో నుంచి ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని ఆయా డిపోల నాయకులు పాల్గొనగా మచిలీపట్నం డిపో అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, వై.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నూతన కమిటీ సభ్యులతో గురుమూర్తి తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

సమన్యాయ సూత్రం ఆధారంగానే ఉరిశిక్ష విధించాలి

మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

కానూరు, న్యూస్‌టుడే : 'సమన్యాయ సూత్రంపై ఆధారపడి ఉరిశిక్ష ఉండాలి. ఇందులో రాజ్యాంగ స్ఫూర్తి మాత్రమే కనిపించాలి. ప్రజాభిప్రాయం కాదు. ప్రాథమిక హక్కులు సామాన్య మానవులతో పాటు ఖైదీలకు కూడా ఉంటాయి. కేవలం భావాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు. చట్టపరమైన నిబంధనల ప్రకారమే ఉరిశిక్ష విధించాలి.' అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాలలో గురువారం జరిగిన లావు వెంకటేశ్వర్లు 8వ స్మారకోపన్యాసం కార్యక్రమానికి హాజరయ్యారు. 'భారతదేశ న్యాయ వ్యవస్థలో మరణ శిక్ష.. అనేక రాజ్యాంగ ప్రశ్నలు' అన్న అంశంపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారత దేశంలో చాలా మంది న్యాయవాదులు, మేధావులు ఉరిశిక్ష రద్దు అవసరం అంశాన్ని లేవనెత్తుతున్నారన్నారని.. ఉరిశిక్ష విషయంలో పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

అరుదైన కేసుల్లోనే.. హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ అనూప్ సురేంద్రనాథ్ మాట్లాడుతూ.. 'మన దేశంలో 150 నేరాలకు ఉరిశిక్షను విధిస్తున్నారు. రాజ్యాంగంలోని నిబంధనలు కూడా పరోక్షంగా ఉరిశిక్ష విధానాన్ని అంగీకరిస్తున్నాయి. రాజ్యాంగంలో ఉరిశిక్ష విధించేందుకు అవకాశం ఉంది. కానీ.. దీనిని జీవిత ఖైదు శిక్ష సరిపోదని భావించిన కేసుల్లోనే విధించాలి. భారత్‌లో ఉరి శిక్షలు ఎక్కువ పేద, మధ్య తరగతి వారికి మాత్రమే పడుతోందని గణాంకాలు చెబుతున్నాయి. దిగువ కోర్టులు ఖరారు చేసిన దాదాపు 90 శాతం ఉరి శిక్షలను అత్యున్నత న్యాయస్థానాలు జీవిత శిక్షగా మార్చుతున్నాయని చెప్పారు. ఉరిశిక్ష విధించడానికి పాటించే న్యాయసూత్రాలను దిగువ కోర్టులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు సంకేతాన్ని తెలియజేస్తోందని అన్నారు. సిద్ధార్థ న్యాయకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివాకర్‌బాబు మాట్లాడుతూ.. కేవలం సుమారు 50 దేశాల్లో మాత్రమే ఉరిశిక్ష అమలు చేస్తున్నాయని, అందులో భారతదేశం కూడా ఒకటి అని వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అకృత్యం.. పదేళ్ల జైలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ యువకుడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు వెల్లడించినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు గురువారం తెలిపారు. వించిపేట ప్రాంతంలో పెద్ది శుభాకర్ అలియాస్ సుబ్బు నివాసం ఉంటున్నాడు. అతడు చిట్టినగర్ ప్రాంతానికి చెందిన అప్పట్లో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను ప్రేమిస్తూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ మురళీకృష్ణ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి 10 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

సాగర్ నీటి వాటా వచ్చేలా చూడరూ..

ఎస్ఈ రామచంద్రరావును సత్కరిస్తున్న వీరబాబు, గోపాలకృష్ణ, డీసీ ఛైర్మన్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నాగార్జున సాగర్ (ఎన్.ఎస్.పి.) ఎడమ కాల్వ పరిధిలోని రెండు, మూడు జోన్లలో తెలంగాణ నుంచి ఆంధ్రాకు రావాల్సిన సాగునీటి వాటా సక్రమంగా వచ్చేలా చూడాలని ఎన్.ఎస్.పి. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ ఛైర్మన్లు విన్నవించారు. ఈమేరకు విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని విడిది కార్యాలయంలో పులిచింతల ప్రాజెక్టు ఎస్.ఈ. పి.రామచంద్రరావుకు గురువారం వినతి పత్రం సమర్పించారు. నూజివీడు డివిజనులో 159, జగ్గయ్యపేట డివిజనులో 72 లస్కరు (కళాసుల) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేలా చూడాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేసే పనులకు జీఎస్టీ కలిగి ఉండాలనే నిబంధనలను తొలగించాలని విన్నవించారు. ఇటీవల ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును సత్కరించారు. పీసీ పరిధిలోని డీసీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

మినుము పైరుకు తెగుళ్లు.. రైతుల్లో ఆందోళన

అవనిగడ్డ, న్యూస్‌టుడే

మినుము పైరుకు బూడిద తెగులు, కుంకుమ తెగులు సోకి, ఆకులపై తుప్పు మచ్చలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల బంగారు తీగ కూడా ఇప్పుడే పెరుగుతూ పైరును చుట్టేస్తోందని భయపడుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు, మందుల ఖర్చులు పెరిగిపోయి తెగుళ్లు సోకడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన చెందుతున్నారు. పల్లాకు తెగులు అక్కడక్కడ ఉన్నప్పటికీ దాని గురించి భయపడటం లేదు. మినప కాయలు పెరిగే సమయంలో ఈ తెగుళ్లు సోకడంతో కౌలు రైతులు మరింత భయపడుతున్నారు. తెగుళ్లు నివారించడానికి అధికారులు క్షేత్ర పరిశీలన చేసి సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. అవనిగడ్డ మండల వ్యవసాయాధికారి శుభహారికను వివరణ కోరగా తెగుళ్లను నివారించడానికి మందులు ఉన్నాయని చెప్పారు. క్షేత్ర పరిశీలన చేసి సూచనలు చేస్తామన్నారు.

బూడిద తెగులు సోకి రంగు మారిన మినప పైరు

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్.గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు ఛైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరెడ్డి రోహిత్ చరణ్‌రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ.44,999 నుంచి ప్రారంభం అవుతోందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కీ డైమండ్స్‌పై తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తోపాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

ఖాళీపోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న ఇంగ్లీష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్ పీజీటీ పోస్టులకు, 24న కంప్యూటర్ ఆపరేటర్, ఒకేషనల్ టీచర్, క్రీడల కోచ్, కౌన్సిలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, నర్సు పోస్టులకు నేరుగా ఇంటర్వ్యూలు జరుగుతాయని, అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విద్యాలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరణ నేడు

పటమట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, మండలి వెంకట కృష్ణారావు శత జయంతి మహోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బెంజ్‌సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రముఖ సాహితీవేత్త జి.వి.పూర్ణచందు రచించిన 'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఈ నెల 21, 22 తేదీల్లో పూర్ణచందు రూపొందించిన వంద 'గాథలు', స్వీయ ఆంగ్లానువాదం, వర్ణచిత్రాలతో కవితా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. గురువారం ఈ పిటిషన్.. విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. కౌంటరు దాఖలుకు సిట్ సమయం కోరింది. దీంతో న్యాయాధికారి ఈనెల 21కి వాయిదా వేశారు.

'సీఎంఆర్ మిల్లింగ్‌కు ధాన్యం సరఫరా'

గాంధీనగర్: రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి.. సీఎంఆర్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తుందని ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు పంపిణీ చేసే సీఎంఆర్ బియ్యాన్ని ఫోర్టిఫికేషన్ చేసి.. సకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడం రైస్ మిల్లింగ్ పరిశ్రమ బాధ్యతని చెప్పారు. దీనికోసం మిల్లింగ్ ఛార్జీలు క్వింటాకు రూ.10, మిల్లింగ్‌లో వచ్చే బైప్రొడెక్ట్స్‌కు ప్రతిఫలంగా కేంద్రం ద్వారా రీఎంబర్స్‌మెంట్ జరుగుతుందన్నారు. ఈ పాలసీ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని చెప్పారు.

కవచ్‌తో రైలు ప్రమాదాలకు చెక్..

త్వరలో విజయవాడ డివిజన్‌లో ఏర్పాటు

రైలు ప్రమాదాల నివారణకు కవచ్‌తో చెక్ పడనుంది. భారతీయ రైల్వే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ద్వారా రైలు ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు. ఈ నూతన వ్యవస్థ సహాయంతో రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా, సిగ్నల్స్ జంప్ చేయకుండా, వేగ పరిమితులను సైతం నియంత్రిస్తుంది. ప్రమాదాలను నివారించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ సాంకేతికత రేడియో కమ్యూనికేషన్స్ ఉపయోగించి రైలు స్థానాన్ని, వేగాన్ని పర్యవేక్షిస్తుంది.

✪ **ప్రమాదాన్ని పసిగట్టి సడెన్ బ్రేక్..** ప్రమాదం ముంచుకొస్తే ఆటోమేటిక్ బ్రేకులు వేస్తుంది. ఈ సమయంలో ఎలాంటి కుదుపు లేకుండా రైలును సురక్షితంగా బయట పడేలా చేయడం కవచ్ ముఖ్య ఉద్దేశం. ఇటీవల దేశంలో జరుగుతున్న వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో కవచ్ వ్యవస్థ ప్రాధాన్యత పెరిగింది, దేశవ్యాప్తంగా దీనిని విస్తరించడానికి రైల్వే శాఖ ప్రయత్నిస్తోంది.

✪ విజయవాడ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ఈ కవచ్ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఈ నూతన అత్యాధునిక వ్యవస్థ అందుబాటులోకి వస్తే రైలు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చు. - **రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే**

రైల్వే ఉద్యోగాల పేరిట మోసంపై విచారణ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: రైల్వేలో ఉద్యోగాల పేరిట పలువురిని మోసం చేసిన సంఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. రైల్వేలో పని చేస్తున్న మచిలీపట్నానికి చెందిన కిషోర్ నకిలీ ఉద్యోగ నియామక పత్రాలతో తమను మోసం చేసి రూ.లక్షల్లో నగదు తీసుకున్నారని బాధితులు నాగపద్మ, గంగాభవానీ అతని ఇంటి వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. గురువారం రైల్వే ఇంటిలిజెన్స్ విభాగానికి చెందిన అధికారులు మచిలీపట్నం వచ్చి బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న ఆధారాలతో పాటు ఇతర బాధితుల వివరాలు సేకరించారు. వారికి ఇచ్చిన నకిలీ నియామక పత్రాలు పరిశీలించారు. మరింత విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. నిందితులకు విధించిన రిమాండ్ గడువు.. గురువారంతో ముగియనుండడంతో వారిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. బెయిల్‌పై ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము హాజరుకాలేదు. వారి తరపున న్యాయవాది గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ఆరుగురు, మదనపల్లి జైలు నుంచి ఒకరు, విజయవాడ కారాగారం నుంచి ముగ్గురు వీసీ ద్వారా హాజరుపరిచారు. వీరికి వచ్చే నెల 5 వరకు న్యాయాధికారి రిమాండ్ పొడిగించారు. ❖ నిందితుడు సెంథిల్ (ఏ22) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై ఎక్సైజ్ అధికారులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కుట్ర గురించి లోతుగా విచారించాల్సి ఉందనీ.. ఈ దశలో బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని అందులో పేర్కొన్నారు. వాదనల నిమిత్తం కేసును 24కు వాయిదా వేశారు. సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై అతని తరపు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై విచారణ 24కు న్యాయాధికారి వాయిదా వేశారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ

(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ LXIII OF 1951 క్రింద ఏర్పాటు చేయబడింది.

విశాఖపట్నం బ్రాంచ్, # 52-14-77/1, కొత్త రేసపువానిపాలెం, బుల్లయ్య కాలేజ్ దగ్గర, విశాఖపట్నం-530013. ఫోన్ : 0891-2747661 & 94908 24955, ఇ-మెయిల్ : vizag@apsfc.com

ఇంటి సామాన్లు & చరాస్తి ఐటమ్స్ వగైరా తొలగించుట కొరకు బహిరంగ ప్రకటన

1. శ్రీమతి కుక్కల కృష్ణ కుమారి, భర్త : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా-521150.
2. శ్రీ కుక్కల వెంకట రామ విద్యాసాగర్, తండ్రి : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, # 194, రోడ్ నెం.10C, MLA & MP కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
3. శ్రీ కుక్కల మోహన్ నాగేశ్వర్, తండ్రి : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, # 401, పద్మజ మాన్షన్ 11, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట్, హైదరాబాద్-500033.

డియర్ సర్/మేడమ్,

SFC యాక్ట్ 1951లోని సెక్షన్ 32G క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, AP Revenue Recovery Act 1864లోని r/w నిబంధనల ప్రకారం, కార్పొరేషన్, శ్రీమతి కుక్కల కృష్ణ కుమారి గారికి చెందిన షెడ్యూల్డ్ ఆస్తిని తేది.20.01.2022 న భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది.

కార్పొరేషన్ తేది.11.12.2025 న బహిరంగ వేలం ద్వారా షెడ్యూల్ ఆస్తిని విక్రయించింది మరియు వేలం కొనుగోలుదారుకు అనుకూలంగా అమ్మకపు నిర్ధారణ లేఖను జారీ చేయడమైనది.

కార్పొరేషన్ ఇప్పటికే తేది.15.12.2025 న లేఖను జారీ చేయడమైనది. దీనిలో మీరు షెడ్యూల్ చేయబడిన ఆస్తిలో ఉన్న మీ హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ మరియు చరాస్తి ఐటమ్స్‌ను ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపు ఖాళీ చేయాలని ఆదేశించడమైనది. కొరియర్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా రసీదు బకాయితో పంపబడిన లేఖను డెలివరీ చేయకుండా తిరిగి వచ్చినందున ఈ క్రింది వ్యాఖ్యలతో, ఈ చిరునామా/చిరునామాదారుడు ఎవరూ సూచనలు లేకుండా వదిలివేయబడినది.

పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని, శ్రీమతి కె. కృష్ణ కుమారి/ఆమె అధీకృత వ్యక్తులు ఈ ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపు షెడ్యూల్ ప్రాంగణంలో ఉన్న హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ మరియు ఇతర చరాస్తి ఐటమ్స్‌ను ఖాళీ చేయాలని ఇందుమూలంగా కోరడమైనది. లేని యెడల కార్పొరేషన్ వారు ఆస్తిని వేలం కొనుగోలుదారునికి అప్పగించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఖర్చు మరియు పరిణామాలకు సంబంధించి మీ బాధ్యత మేరకు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించవలెను.

షెడ్యూల్ ఆస్తి

విశాఖపట్నం, వాల్తేర్ వార్డు, సిరిపురం, బాలాజీ నగర్, T.S.నెం.68/2, ప్లాట్ నెం.17 భాగం నందు విస్తీర్ణం 338.5 చ॥గ॥లులోని భూమితో పాటు గోకుల్ నివాస్, డి నెంలు. 9-29-10A & 10/2, G+2 అంతస్తులతో రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: ఉత్తరం: 30 అ॥ల రోడ్డు, దక్షిణం: మిగిలిన ప్లాట్ నెం.17లోని డి నెం.9-29-10, తూర్పు: 30 అ॥ల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.16 లోని H.M. సూరత్‌వాలా భవనం డి నెం.9-29-24.

తేది : 20.02.2026
ప్రదేశం : విశాఖపట్నం

సం/- సీనియర్ బ్రాంచ్ మేనేజర్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ
APRR యాక్ట్ 1864 ప్రకారం నియమించబడిన కలెక్టర్

కెనరా బ్యాంక్ Canara Bank భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ, ఎపి-520008. ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

M/s. వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క స్విస్ ఛాలెంజ్ ప్రక్రియ కొరకు అనుమతి పొందిన సంస్థలకు (అనుమతి పొందిన ARCS/NBFCs/ Banks/FIs) ఇ-వేలం ద్వారా బదిలీ చేయడానికి సంబంధించిన ప్రకటన

M/s వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా యొక్క తేది.31.12.2025 నాటికి ఫండ్ బేస్డ్ పరిమితిలలో బకాయి రూ. 210.78 కోట్లు (అక్షరాల రెండు వందల పది కోట్ల డెబ్బై ఎనిమిది లక్షలు మాత్రమే) ప్లస్ తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో ఇ-వేలం ద్వారా "ఆల్ క్యాష్" ప్రాతిపదికన కనీస రిజర్వ్ ధర రూ.20.25 కోట్లు (రూపాయలు ఇరవై కోట్ల ఇరవై ఐదు లక్షలు మాత్రమే) స్ట్రెస్డ్ లోన్ రుణ బకాయిలసు ("RBI MD") కెనరా బ్యాంక్ ఋణ ఎక్స్‌పోజర్‌లను బదిలీ చేయడానికి, కాలానుగుణంగా సవరించబడిన మరియు బ్యాంక్ అంతర్గత బోర్డు ఆమోదించిన విధానం ప్రకారం బదిలీ చేయడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) నుండి ఉన్న మార్గదర్శకాల ప్రకారం, అర్హత కలిగిన ARCలు/NBFCలు/బ్యాంకులు/ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఉమ్మడిగా అనుమతి పొందిన సంస్థలు లేదా బిడ్డర్లు) నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ను ఆహ్వానిస్తుంది. "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు రికోర్స్ ప్రాతిపదికన లేకుండా ఇ-వేలం ద్వారా నిర్వహించబడును.

కెనరా బ్యాంక్ రుణ బహిర్గతమునకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ, చట్టపరమైన లేదా మరే ఇతర రకాల నష్టాలను భరించదు మరియు M/s వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కొరకు ఎటువంటి ప్రాతినిధ్యాలు లేదా వారంటీలను అందించదు. ఆసక్తిగల అర్హత కలిగిన పాల్గొనే వారందరూ ఇ-వేలంలో పాల్గొనడానికి తమ సంసిద్ధతను EOI ద్వారా సమర్పించవలెను మరియు ముందుగా అమలు చేయకపోతే నాన్-డిస్‌క్లోజర్ ఒప్పందాన్ని అమలు చేయాలని అభ్యర్థించవలెను. EOI సమర్పించడానికి ఆఖరి తేది.24.02.2026. ఆసక్తిగల బిడ్డర్లు వెబ్ నోటీసు కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయవచ్చు మరియు మరిన్ని వివరాలకు www.canarabank.com నందు టెండర్స్‌పై క్లిక్ చేయడం ద్వారా పొందవచ్చు.

ఆసక్తి గల పార్టీలు దిగువ తెలిపిన వ్యక్తులను సంప్రదించవచ్చును.

సంప్రదించు వ్యక్తి	సంప్రదించు ఫోన్ నెం.	ఇ-మెయిల్ ఐడి
శ్రీ. నాగరాజ్ సి మీషి	98455 29105	armvij@canarabank.com
శ్రీ. నాగేశ్వర రావు జి	91108 84565	

ఈ ప్రకటనలో తెలిపిన ఇ-వేలం ప్రక్రియ కాంపిటెంట్ అధికారి తుది ఆమోదానికి లోబడి ఉంటుందని దయచేసి గమనించండి. అంతేకాకుండా, ఈ ప్రకటనలోని ఏవైనా నిబంధనలను రద్దు చేయడానికి, మార్చుటకు, సవరించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి మరియు ఏ దశలోనైనా డాక్యుమెంట్‌ను ప్రాసెస్ చేయడానికి మరియు/లేదా అర్హత ఉన్న పార్టీని అనర్హులుగా ప్రకటించడానికి, ఎటువంటి కారణం పేర్కొనకుండా మరియు ఎటువంటి బాధ్యత లేకుండా వెబ్‌సైట్‌లో కొరిజెండమ్‌ను అప్‌లోడ్ చేయడానికి కెనరా బ్యాంక్ హక్కును కలిగి ఉంది మరియు ఈ విషయంలో కెనరా బ్యాంక్ నిర్ణయమే అంతిమమైనది & కట్టుబడి ఉండవలసినది. ఇది ఆఫర్ పత్రం కాదు మరియు ఎటువంటి హామీ లేకుండా జారీ చేయబడుతోంది.

తేది : 19.02.2026
ప్రదేశం : విజయవాడ

జారీ చేసినవారు
కెనరా బ్యాంక్, ARM బ్రాంచ్, విజయవాడ

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. ✆81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు. అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

బందరురోడ్డు, పప్పుల మిల్లు సెంటర్ కాస TVS ప్రక్కన నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. సంప్ర ✆ 94940 51157

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం- 75 వేలు. సంప్ర: 81064 03490

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PLOT FOR SALE

గజం11,999/- బందర్‌రోడ్‌లో 80ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్ పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరల్లో ✆ 99495 05050

TO LET

సెంటిని హాస్పిటల్ ప్రక్క వీధి నియర్ లయోలా కాలేజ్ దగ్గర N/E ఫేసింగ్ 500 Yardsలో ఇండివిడ్యూవల్ 3BR ఆఫీస్/హౌస్‌కు అద్దెకు కలదు. సంప్ర ✆ 99499 86667.

JOBS

Engineering EEE /Diploma (Boys) ★ Computer Operator Female ★ Office Administrators. Switch Gears, Enikepadu. ✆ 99081 78777

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted– Sr. Manager (Business Development) Reputed Tyre Retreading Materials Distributor requires experienced Sr. Manager to develop dealer & customer network in Andhra Pradesh. Experience in Tyres, Lubricants, Automobile field essential. Attractive Salary + Incentives. Ph: 9000 009122

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్స్. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

మార్నింగ్ టైమ్‌లో 2 hours బ్రోచర్స్ పంచుటకు స్త్రీ అభ్యర్థి కావలెను 30 yrs లోపు జీతం 6000/ మరియు కమీషన్ ఇవ్వబడును. ✆ 9908166858

ప్రతాప్ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జరీ ఇనిస్టిట్యూట్‌కి విజయవాడకు ★ నర్సింగ్ స్టాఫ్, వీడియో ఎడిటర్, రిసెప్షనిస్ట్, సోషల్ మీడియా మేనేజర్ పోస్ట్‌లకు అర్హులైన అనుభవం ఉన్న అభ్యర్థులు కావాలి ✆ 77998 80139.

WANTED

- **MANAGER** (Male) Qlf : Any Degree 5 yrs. Exp. in Pharma C&F Salary : 20 K
- **OPERATOR** (M/F) Qlf : Any Degree 3 yrs. Exp. in Pharma C&F Salary Basing on Exp., & Qlf
- **PERSONAL ASSISTANT** (Female) Qlf : Any Degree 5 yrs. Exp. in any Field Salary Basing on Exp., & Qlf.

Gollapudi, Nearer location Candidates are Preferable

PHARMACY C&F D.No.: 6-128, 3rd Floor, Gollapudi, NTR Dist., ✆ 77804 00453

MEDICAL

Wanted Packing boys for Medical Agencies Srinivasa Drugs, Bhavanipuram, Vijayawada. Ph: 97040 71271.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

● మచిలీపట్నం ● పెడన

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ

కలెక్టరేట్(మచిలీపట్నం): సంక్షేమ, నివాస వసతి గృహాల్లో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం అంతర్‌శాఖల ఉమ్మడి తనిఖీ కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సంక్షేమ, నివాస వసతి గృహాల్లో అకస్మాత్తుగా వ్యాపించే అంటు వ్యాధులను నివారించేందుకు ఉద్దేశించిన ఉమ్మడి తనిఖీ కమిటీతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా అధికారులు పరిశీలన చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వాటిని క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వ్యాధుల వ్యాప్తి సందర్భాల్లో కమిటీ ప్రతిస్పందన బృందాలు అవసరమైన సూచనలు జారీ చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.యుగంధర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ధర వరలు

టమాట 15, వంగ 20, బెండ 24, పచ్చిమిర్చి 48, కాకర 32, క్యాబేజీ 16, క్యారెట్ 30, దొండ 39, బంగాళదుంప 22, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 28, దోస 27, సొర 10,08, అరటికాయ 7,6, చిక్కుళ్లు 28, బీర 30, చామదుంప 24, మునగ 08/10, కంద 40, బీట్‌రూట్ 28, కీరదోస 40, బీన్స్ 60, క్యాప్సికం 66, అలసందలు 28, చిలకడదుంప 30, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలే వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని ఫోన్ 91823 61295లో సంప్రదించవచ్చు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

సినిమాలు

రేవతి: నవాబ్ కేఫ్
మినీ రేవతి: బూకీ
సిరికృష్ణ: మన శంకర వరప్రసాద్ గారు
సిరివెంకట్: హే బల్వంత్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? ఆశీర్వాదపురంలో దోమల బెడద విపరీతంగా ఉంది. **- వెంకటేశ్వరరావు.** ✔ నివారణకు చర్యలు తీసుకుంటాం. **- స్వర్ణతేజ, అడ్మిన్, 11వ సచివాలయం**
– న్యూస్‌టుడే, భాస్కరపురం(మచిలీపట్నం)

? పెడనలోని బీజీకే జడ్పీ ఉన్నత పాఠశాలలో మైక్రో వాటర్ ఫిల్టర్ పని చేయడం లేదు. **- విద్యార్థుల తల్లిదండ్రులు** ✔ సంబంధిత ఏజెన్సీకి ఫోన్ చేసినా స్పందించడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- వైవీ.హరనాథ్, ఎంఈవో- 2, పెడన** – న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

స్పందన: మండలంలోని అర్తమూరు జడ్పీ ఉన్నత పాఠశాల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురించడంతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు గోడ నిర్మాణం ప్రారంభమైంది. గతంలో సరిహద్దు విషయమై న్యాయస్థానంలో వివాదం ఉండగా నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం చేయలేదు. కోర్టు వివాదం పరిష్కారం కావడంతో గోడను నిర్మిస్తున్నారు. **- న్యూస్‌టుడే, బంటుమిల్లి**

ప్రారంభమైన రోడ్డు పనులు

గూడూరు, న్యూస్‌టుడే : బందరు మండలంలోని సుల్తానగరం నుంచి గూడూరు మండలంలోని ముక్కొల్లు మీదుగా డొకిపర్రు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ప్రధానంగా ముక్కొల్లు నుంచి గుంతలమయంగా మారడంతో ఆయా ప్రాంతాల ప్రజలు, డొకిపర్రు వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ప్రజలు పడుతున్న అవస్థలపై ఇటీవల 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

భవనాలు లేక.. అవస్థలు తప్పక

న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

ఒక కార్యాలయం శిథిలావస్థకు చేరింది.. మరో భవనం ఇరుకు గదుల్లో కొనసాగుతుంది. దీంతో ఆయా కార్యాలయాల్లోని ఉద్యోగులతో పాటు వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బందరు మండలాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజించి ఏళ్లు గడిచిపోయినా భవనాలు నిర్మించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మించేనా.. అంతేనా?

ఇద్దరు తహసీల్దార్లు, ఉద్యోగులు, సిబ్బందిని కూడా నియమించారు. ఎప్పటి నుంచో ఉన్న తహసీల్దారు కార్యాలయ భవనంలో చాలాకాలం రెండు మండలాల అధికారులు, ఉద్యోగులు సర్దుకుంటూ వచ్చారు. సమస్య తీవ్రంగా ఉండటంతో పాటు ఆయా కార్యాలయ ఉద్యోగులు, వచ్చే ప్రజలతో ఇరుకుగా ఉండడంతో నీటిపారుదలశాఖ కార్యాలయ ప్రాంగణంలోని ఓ గదిలోకి దక్షిణ మండల కార్యాలయాన్ని మార్చారు. ఇది జరిగి కూడా రెండేళ్లు అవుతుంది. ఇప్పటి వరకు భవనాల నిర్మాణంపై ఎలాంటి చర్యలు లేవు. తాత్కాలిక ఏర్పాటు చేసినా సమస్య మాత్రం అలాగే ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇవి కూడా చాలకపోవడంతో రెండు, మండలాల ఆర్ఐలు, కొందరు సిబ్బంది పాత తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఓ శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి.

పునాదుల దశలో పనులు

తెదేపా ప్రభుత్వ హయాంలోనే తహసీల్దారు భవన నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించారు. 2018లోనే పనులు ప్రారంభించడంతోపాటు కొంతవరకు పనులు కూడా చేపట్టారు. పనులు సాగుతున్న తరుణంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పునాదుల దశలో ఆగిపోయాయి. మిగిలిన పనులకు నిధులు కేటాయించాలని పలుమార్లు వైకాపా పాలకులకు విజ్ఞప్తి చేసినా స్పందించిన దాఖలాలు లేవు.

నిలిచిన నిర్మాణంలో పెరిగిన మొక్కలు

☛ బంటుమిల్లి మండల తహసీల్దారు కార్యాలయ భవనం కూడా ఏ క్షణాన కూలుతుందో అన్నట్లు తయారయ్యింది. ఈ కార్యాలయానికి కూడా గత తెదేపా హయాంలో నూతన భవన నిర్మాణానికి పనులు చేపట్టగా చివరిదశలో ఆగిపోయాయి. అప్పటి నుంచి శిథిల భవనంలోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు గుర్తించి కూటమి ప్రభుత్వం అయినా చొరవ తీసుకుని భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్సిటీ భూముల ఆక్రమణల తొలగింపు

పర్యవేక్షిస్తున్న తహసీల్దారు రాజ్యలక్ష్మి, ఎస్సై దివ్యప్రకాష్ తదితరులు

గూడూరు, న్యూస్‌టుడే : గూడూరులోని విశ్వవిద్యాలయానికి చెందిన భూములను కొందరు ఆక్రమించారు. ఈ నేపథ్యంలో వర్సిటీ ఉపకులపతి కె.రాంజీ ఇటీవల వాటిని పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం సాయంత్రం తహసీల్దారు రాజ్యలక్ష్మి, ఎస్సై దివ్యప్రకాష్, ఆయా శాఖల ఉద్యోగులు అక్కడకెళ్లి యంత్రాలతో ఆక్రమణలను తొలగించే పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో కొందరు స్థానికులు అక్కడకెళ్లి తొలగింపు పనులు ఆపాలని, కొంత సమయం ఇవ్వాలని కోరడంతో సీఐ నాగేంద్ర ప్రసాద్ ఆపేది లేదని తేల్చి చెప్పారు.

అందరికీ న్యాయం.. సత్వర సాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అందరికీ న్యాయం.. సత్వర సాయం అందించేలా న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య తెలిపారు. ప్రపంచ సామాజిక న్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బందరు మండలంలోని పెదకరగ్రహారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయవాది చీలి ముసలయ్య వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. వివిధ సంస్థల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా ఉండేలా కృషి

మొక్క నాటుతున్న పునీత్‌కుమార్, తదితరులు

మచిలీపట్నం కార్పొరేషన్: ప్రతి ఒక్కరికీ బీమా ఉండేలా కృషి చేయాలని ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన నగరంలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించిన ఏజెంట్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అందుబాటులో ఉన్న బీమా పథకాల గురించి ప్రజలకు వివరించడంతో పాటు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉత్తమ ఏజెంట్లను సత్కరించారు. తొలుత నగరంలోని ఆధునికీకరించిన ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో భవనాలను ప్రారంభించి మొక్కలు నాటారు. సౌత్ సెంట్రల్‌జోన్ చీఫ్ ఇంజినీర్ హిలాలీ, సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్‌బాబు, వివిధ విభాగాల మేనేజర్లు సీహెచ్ వెంకటరమణ, కేడీవీ కృష్ణ, పి.విఠల్‌బాబు, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గా పార్వతి సమేత నాగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఎనిమిరోజైన గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఉభయ దేవేరులతో పల్లకీలో కొలువుదీరిన స్వామికి ద్వాదశ (12 సార్లు) ప్రదక్షిణలు చేశారు. అనంతరం శయ్యాలంకృత పర్యంక సేవ వేడుకగా చేశారు. స్వామి తరవున పాల్గొన్న వారికి శేషవస్త్రాలతో సత్కరించారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి సత్కారం



కలెక్టర్ బాలాజీ నుంచి సత్కారం పొందిన జ్ఞానేశ్వర్, నాగరాజు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థిని కలెక్టర్ డీకే బాలాజీ సత్కరించారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డొక్కా రాజేంద్రప్రసాద్, స్రవంతి దంపతుల కుమారుడు జ్ఞానేశ్వర్ ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్‌లో 99.49 పర్సంటేజ్ సాధించాడు. విషయం తెలుసుకున్న కలెక్టర్ గురువారం జ్ఞానేశ్వర్‌ను కలెక్టరేట్‌లో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుముదినిసింగ్ జ్ఞానేశ్వర్‌ను అభినందించారు.

అంధత్వాన్ని అధిగమించిన నాగరాజుకు..: అంధత్వాన్ని అధిగమించి గ్రూప్-2 పరీక్షల్లో విజేతగా నిలిచిన నందం నాగరాజును కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు సాలిపేటకు చెందిన కంటి చూపు లేని నాగరాజు గ్రూప్-2లో విజయం సాధించి ఏపీపీఎస్సీ హెచ్‌వోడీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం దక్కించుకున్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన్ను కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

← మాట్లాడుతున్న న్యాయవాది శ్యాంబాబు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో వయో వృద్ధుల సంక్షేమ సంఘం, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్తంగా డిజిటల్ లిటరసీ, సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ శ్యామ్ కుమార్, న్యాయవాది శ్యాంబాబు, చండిక గంగాజలరావు, సుజ్ఞానం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పెన్నమ్మ తల్లి ఉత్సవాలు

పూజలందుకున్న అమ్మవారు

మాట్లం- పెన్నమ్మదిబ్బ (కృత్తివెన్ను), న్యూస్‌టుడే : మండలంలోని మాట్లం-పెన్నమ్మదిబ్బలో జరుగుతున్న శ్రీ పెన్నమ్మ అమ్మవారి మహోత్సవాలు గురువారం ముగిశాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

పోతేపల్లి(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: పోతేపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కటికల సుబ్బారావు, అర్జాలక్ష్మి దంపతులకు మైత్రీ ఫౌండేషన్ గురువారం సాయం అందించింది. గ్యాస్ స్టవ్, మిక్సీ, నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేసింది. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కేసాని వేణుకుమార్, ఉపాధ్యక్షుడు రిలాక్స్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు వరప్రసాద్, తెదేపా ఇన్‌ఛార్జి కమ్మిలి మధు తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత.. సమాజ బాధ్యత

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పెడన, న్యూస్‌టుడే : బాలికల భద్రతను.. సమాజ బాధ్యతగా గుర్తించాలని ఎస్సై- 2 షేక్ బషీర్ అన్నారు. బల్లిపర్రు డా.అంబేడ్కర్ బాలికల గురుకులంలో బాలికల భద్రత, బాల్య వివాహాల నియంత్రణ తదితర అంశాలపై ఆమె గురువారం అవగాహన కల్పించారు. పేద విద్యార్థులు జీవిత లక్ష్యాలను సాధించేందుకు గురుకులాలు దోహదం చేస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపల్ ఎన్.రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

చల్లపల్లి: చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు లంకా కొండలు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనంతో ఆందోళన

రుద్రవరంలోని గురుకుల పాఠశాల పాత భవనం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. దీంతో నూతన భవనం నిర్మించి తరగతులను అక్కడ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాత భవనం శిథిలమై, మొక్కలు మొలిచి ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉంది. పాములు కూడా సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు అందులోకి వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాత భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రవరం (మచిలీపట్నం రూరల్)**

ప్రమాదకరంగా డ్రెయిన్లు

నగరంలోని ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డ్రెయిన్లపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఈడేపల్లి శక్తి ఆలయం ప్రాంతంలో ప్రధాన డ్రెయిన్ రిటైన్‌వాల్ అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఆ పక్కనే నిర్మించిన గోడ కూడా కూలిపోయింది. ఎవ్వరూ పట్టించుకోకపోవడం లేదని ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

రోడ్డుకు పగుళ్లు

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి డ్రైవర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కలిపే ప్రాంతంలో రోడ్డు ధ్వంసమైంది. మరమ్మతులు చేయకపోవడంతో క్రమేపీ అధ్వానంగా తయారవుతుంది. దీన్ని వదిలేస్తే రోడ్డు పూర్తిగా కనుమరుగు అవుతుందని స్థానికులతోపాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

డివైడర్ మధ్యలో చెత్త

నగరంలోని కోనేరు సెంటరు కూడలి నుంచి రాజాగారి సెంటరు వరకు డివైడర్ వెంట మొక్కల కోసం ఏర్పాటు చేసిన రక్షణ కంచె మధ్యలో చెత్త, ఇతర వ్యర్థాలు వేస్తున్నారు. రోడ్డు పక్కన దుకాణాల నుంచి వచ్చే చెత్త కూడా వేసి వదిలేస్తున్నారు. కోనేరు సెంటరు సమీపంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ఆ ప్రాంతంలోని మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించడంతో పాటు అక్కడి మొక్కలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

తూడు తొలగించేనా.. అంతేనా?

నగరంలోని రాడార్ కేంద్రం సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న డ్రెయిన్ పొడవునా గుర్రపు డెక్క, తూడు దట్టంగా అల్లుకుపోయింది. దీంతో మురుగు దిగువకు పారే అవకాశం లేదు. ఆ మురుగు అంతా సమీపంలోని వైద్య కళాశాల పక్కన తటాకంలా తయారయ్యింది. అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి తూడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)**

యువతకు క్రీడలు నిర్వహిస్తే మేలు

క్రికెట్ ఆడుతున్న ఎస్సై పైడిబాబు

గరిశపూడి (కృత్తివెన్ను), న్యూస్‌టుడే : యువత క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని కృత్తివెన్ను ఎస్సై ఎ.పైడిబాబు అన్నారు. మండలంలోని గరిశపూడి పంచాయతీలో నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. గ్రామాల్లోని యువత జూదాల వైపు వెళ్లకుండా ఇలాంటి క్రీడలు నిర్వహిస్తే మంచిదని సూచించారు. సర్పంచి నాగార్జున, పిన్నెంటి రాంబాబు, బస్వాని రామచంద్రరావు, వైదాని రమేష్, బస్వాని నరేంద్ర, సీరింగి రవి తదితరులు పాల్గొన్నారు.

అధిక రసాయన వినియోగం.. పంటకు నష్టం

మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : మినుము సాగులో రైతులు అవసరానికి మించి రసాయనాలు వినియోగిస్తున్నారని, తద్వారా పంటకు లాభం కంటే నష్టం అధికంగా జరుగుతోందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.సుధారాణి తెలిపారు. నడుపూరు, లంకలకలవగుంట గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆమె మినుము పంటను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో మొక్కలు నిర్వీర్యమై పంటకు నష్టం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అధికారుల బృందం ఈ పరిస్థితికి కారణాలను అధ్యయనం చేశారు. ఏవో సజ్జా జెన్నీ, పలువురు వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి

భాజపా, వివిధ సంఘాల నాయకుల ర్యాలీ

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేస్తూ భాజపా నాయకులు, నగరవాసులు, హిందూ సంఘాల ప్రతినిధులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా శివాజీ ప్రతిమతో వివిధ ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాజుపేటలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలపాటి లక్ష్మీనారాయణ, పంతం గజేంద్రరావు, మహంకాళీ, గంటా సతీష్, శాయన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెపాలెం(కృత్తివెన్ను): లక్ష్మీపురం పల్లెపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ జయంతి, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సామాజిక సంస్కర్త గోపాలకృష్ణ గోఖలే వర్ధంతి నిర్వహించారు. వీరి చిత్రపటాలకు హెచ్ఎం టీవీ.ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాజీ, గోఖలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెడన, న్యూస్‌టుడే : హిందూ సామ్రాజ్య స్థాపనకు ఛత్రపతి శివాజీ అహర్నిశలు కృషి చేశారని హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు అన్నారు. ఛత్రపతి జయంతి సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పంచుమర్తి రవికుమార్, తోట హరిబాబు, బండారు రంగబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు.

పెడనలో చైతన్య వేదిక ప్రతినిధులు

రాయవరం పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

గూడూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని రాయవరం పీఏసీఎస్ సీఈవో ఆకురాతి వెంకటేశ్వరరావు సస్పెన్షన్ అయ్యారు. సంఘ పరిధిలోని కంచాకోడూరుకు చెందిన ఉడుముల పుల్లయ్య తాను రుణం తీసుకోకపోయినా తీసుకున్నట్లు నమోదు చేశారని వాపోయారు. 2018లో రూ.1.79 లక్షలు దీర్ఘకాలిక రుణం తీసుకున్నట్లు వెంకటేశ్వరావు తప్పుగా నమోదు చేశారని, గతంలో తీసుకున్న రుణానికి చెల్లిస్తున్న వాయిదాల మొత్తాన్ని తీసుకొని రుణానికి జమ చేయడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయగా ప్రాథమికంగా అతను తప్పు చేసినట్లు గుర్తించి సస్పెండ్ చేయడంతో పాటు పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు కేడీసీసీబీ సీఈవో శ్యామ్ మనోహర్ తెలిపారు.

జీతాలు చెల్లించి ఆదుకోవాలి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని హిందూ సంస్థలకు అనుబంధంగా ఉన్న పామర్రు టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్న ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉద్యోగులు కోరారు. ఏడాది కాలంగా జీతాలు చెల్లించకపోవడంతో బోధన, బోధనేతర సిబ్బంది అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యపై ఆందోళన చేయడంతోపాటు వినతిపత్రం కూడా అందించామని, ఇప్పటికీ జీతాలు చెల్లించకపోతే వచ్చేవారం నుంచి విధులకు హాజరు కావడం కుదరదని ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్ మస్తాన్‌రావు, కె.మురళీకృష్ణ, దీపక్ తదితరులు ప్రకటన విడుదల చేసినవారిలో ఉన్నారు.

కాల్వకు ఇరు వైపులా వ్యర్థాలు

పెడన పట్టణంలోని మచిలీపట్నం- గుడివాడ రోడ్డుపై రామరాజులపాలెం పంట కాల్వకు ఇరు పక్కల కొందరు వ్యర్థాలను వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సాగునీటి శాఖ ఏఈ హరీష్ మాట్లాడుతూ పురపాలక అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెడన గ్రామీణం**

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉద్ధృతం

నాయకులు, ఉద్యోగుల నిరసన

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగ యూనియన్ల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వైవీవీ మోహన్‌రావు తెలిపారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా గురువారం మచిలీపట్నంలోని ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయనతోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేపట్టాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. 2019 తర్వాత నియమితులైన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. జీవో 36ను తక్షణం అమలు చేయాలన్నారు. సంఘ నాయకులు జన్యావుల రామాంజనేయులు, అడపా శ్రీనివాసరావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, అనుమకొండ శ్రీనివాసరావు, మెట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మరింత మెరుగైన సేవలు అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: గర్భిణులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని డీఎంహెచ్‌వో యుగంధర్ అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం మాతృ మరణాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల నుంచి వచ్చే రిఫరల్ కేసులను సకాలంలో ఆసుపత్రికి తరలించేలా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలన్నారు. మాతృ మరణాలపై వివిధ అంశాలవారీగా కూలంకుషంగా సమీక్షించి పునరావృతం కాకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

సహకార రంగ అభివృద్ధికి కృషి

గూడూరు, న్యూస్‌టుడే : సహకార రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. గూడూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని గూడూరులో గురువారం నిర్వహించారు. సంఘ ఛైర్మన్‌గా తలుపుల వెంకట కృష్ణారావు, సభ్యులు రెహమాన్, చింతగుంట కృష్ణ ప్రమాణం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు గోపి నాగబాబు, పెడన ఏఎంసీ ఛైర్మన్ అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణ, వేదికపై రామకృష్ణ తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

✤ యనమలకుదురు కచేరీ సెంటర్‌లో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందిని పంపి చెత్తతీయించి సమస్య పరిష్కరించారు..

✤ యనమలకుదురు లాకులసెంటర్లో కొత్త వంతెన కింద ప్రాంతంలో కొన్ని రోజులుగా చెత్తతీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, యనమలకుదురు

✤ పెనమలూరు పల్లెపేట, శ్మశానం రహదారుల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదంటూ స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామకార్యదర్శి అహ్మద్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి గురువారం ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలను తనిఖీ చేయించి 9 కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు.

✤ పెనమలూరు జడ్పీ ఉన్నతపాఠశాల సమీపంలోని డ్రెయిన్లో పూడిక తీయకపోవడంతో మురుగు నిలిచి దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు బుధవారం గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన గురువారం పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, పెనమలూరు

స్పందించి.. చెత్త తొలగించి

ఉయ్యూరులోని ఒకటో వార్డులో ఎగినిపాడు రహదారిపై ఉన్న కంపోస్ట్ యార్డ్ వద్ద నిప్పు పెట్టడంతో పొగ కమ్ముకొని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈనాడులో 'పొగతో వాహనదారుల అవస్థ' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సిబ్బంది మంటలు ఆర్పి రహదారి పక్కన తగలబడే చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పురపాలిక ఇంజినీరింగ్ విభాగం ఏఈ రమ్య పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, ఉయ్యూరు

రహదారి చక్కదిద్దుతున్నారు

మరమ్మతులు నిర్వహిస్తూ..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గత కొన్నేళ్లుగా నిర్వహణ కొరవడడంతో చిన్నఅవుటపల్లి నుంచి హనుమాన్‌జంక్షన్ వరకు పలుచోట్ల రహదారి కుంగిపోయింది. కొన్నిచోట్ల బుర్రగుడిలా మారిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు ప్రమాదభరితంగా తయారయ్యాయి. దీనిపై 'పర్యవేక్షణ మరిచి..ప్రమాదాలకు దారి తెరిచి' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 7న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జాతీయ రహదారుల సంస్థ అధికారులు మరమ్మతులకు ఉపక్రమించారు. గురువారం వీరవల్లి పరిసర ప్రాంతాల్లో రహదారి కుంగిన చోట తారు తొలగించి, కొత్తగా పునర్నిర్మించేలా పనులు ప్రారంభించారు.

మోసానికి పాల్పడ్డాడని ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: యనమలకుదురు పెదపులిపాకకు చెందిన ఇమంది శివ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఏడాది జనవరిలో పరిచయం ఉన్న భవానీపురంలో నివాసం ఉండే యశ్వంత్ కుమార్ అనే వ్యక్తి వద్ద రూ. 15 వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇచ్చే వరకు శివ ద్విచక్ర వాహనాన్ని తన వద్ద ఉంచుతానని యశ్వంత్‌కుమార్ చెప్పడంతో ఆ ప్రకారం ఇచ్చాడు. కొన్ని రోజుల క్రితం తీసుకున్న డబ్బులను శివ తిరిగి ఇచ్చేశాడు. కానీ ద్విచక్ర వాహనాన్ని మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. దీంతో డబ్బులు తీసుకుని తన ద్విచక్రవాహనం తిరిగి ఇవ్వకుండా యశ్వంత్ కుమార్ మోసానికి పాల్పడినట్లు శివ భవానీపురం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పొడవునా.. నానా యాతన

ఫుట్‌పాత్‌లు ఆక్రమించి మరీ వ్యాపారాలు..

కానూరు, పోరంకి, తాడిగడప, న్యూస్‌టుడే: బందరు రోడ్డు విస్తరణ చేయగా.. సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడం చిరువ్యాపారులకు వరంగా.. ప్రజలకు శాపంగా మారింది. చెక్‌పోస్టు సెంటర్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా పళ్లు, కూరగాయలు, మాంసం, ఇతర చిరుతిళ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో అవి కొనేవారు వారి వాహనాలను రోడ్డుపైనే పెట్టడంతో ప్రజలు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. తాడిగడప పురపాలిక పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో విపరీతంగా పెరుగుతున్న ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ప్రాంతాల్లో ఎక్కువ..: చెక్‌పోస్టు సెంటర్‌లో సిరీస్ సంస్థ వెలుపల పదుల సంఖ్యలో మాంసం దుకాణాలు, వస్తువులు, దుస్తులు విక్రయించేవారితో ఓ మినీ బజారులా కనిపిస్తుంది. వీరు రాత్రి సమయాల్లో రోడ్లపైకి వచ్చి మరీ వ్యాపారాలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇంజినీరింగ్ కళాశాల, కేసీపీ కాలనీ వద్ద కూడా పదుల సంఖ్యలో వ్యాపారులు ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తున్నారు. అసలే విద్యార్థులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఈ దుకాణాల వల్ల అవస్థలు వర్ణనాతీతం.

ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఇలా..

పురపాలికలో ఇదీ పరిస్థితి

మొత్తం పొడవు	5 కి.మీ
ఆక్రమణలు	120 దుకాణాలు
రోడ్డు వెడల్పు	120 అడుగులు
సర్వీసు రోడ్డుకు కేటాయింపు	ఇరువైపులా 36 అడుగులు

పోరంకి సెంటర్‌లోనూ..: సాయంత్రం సమయంలో ఆక్రమణల వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉదయం మాంసం దుకాణదారులు వ్యర్థాలను రోడ్లపైనే వేస్తున్నారు. రామప్రియ థియేటర్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు మాంసం, కూరగాయలు, పళ్ల దుకాణాలు ఇరువైపులా కలిపి 35 నుంచి 40 వరకు ఉంటాయి. ఇందులో బొమ్మలు, కుర్చీల, ఇతర సామగ్రి రోడ్లపైనే అమ్మేస్తుంటారు.

చర్యలు తీసుకుంటాం..

సర్వీసు రోడ్లను సైతం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారన్న సంగతి మా దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై దృష్టి సారిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను తొలగింపజేస్తాం. – షేక్ నజీర్, కమిషనర్,తాడిగడప పురపాలక సంఘం

ట్రాఫిక్ ఇబ్బందులా? అధికారి దృష్టికి తీసుకురండి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావుతో ఫోన్‌ఇన్ నేడు

రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయా? మీ ప్రాంతంలో రోడ్లపై ఆక్రమణలు వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్నాయా? యూటర్న్‌ల పరంగా సమస్యలున్నాయా? ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగడం లేదా? రోడ్డుపై భారీ వాహనాలు ఆపి ఇబ్బంది పెడుతున్నారా? ఇంకా ఏ ఇతర ఇబ్బందులున్నా.. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సినదంతా కింద సెల్ నంబర్‌కు ఫోన్ చేయడమే. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

91778 36200 | 20.02.26 శుక్రవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

దాతల చేయూత అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని రేమల్లె మండల పరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెలమర్తి రవిబాబు పేర్కొన్నారు. పాఠశాల భవనానికి, ప్రహరీకి గ్రామానికే చెందిన తుమ్మల పూర్ణచంద్రరావు, దొండపాటి శివకృష్ణ దాదాపు రూ.30 వేల వ్యయంతో రంగులు వేయించారు. ఈ సందర్భంగా గురువారం ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వడ్లమూడి వెంకటకృష్ణారావు దాతల చేయూతని అభినందించారు.

సర్పంచిగా బాధ్యతల స్వీకరణ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పంచాయతీ సర్పంచిగా నిడమర్తి సౌజన్య గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈవోతో కలిసి పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచిని పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ గతంలో ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో సౌజన్య కోర్టును ఆశ్రయించారు. కోర్టు సర్పంచిగా సౌజన్యను కొనసాగించాలని ఆదేశాలివ్వడంతో ఆమె మరోమారు బాధ్యతలు స్వీకరించారు.

బాబూరావుకు నివాళి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రైతు నాయకుడిగా, వేలేరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా అన్నె శేషగిరి రావు(బాబూరావు) విశేష సేవలందించారని పలువురు కొనియాడారు. బాబూరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం మేయర్ నీరజ, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అన్నె సుధారాణి, మాజీ ఎంపీపీ తుమ్మల కోమలి, తదితరులు బాబూరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

27 నుంచి తెన్నేరు తిరుపతమ్మ తిరునాళ్లు

తెన్నేరు (కంకిపాడు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తెన్నేరు లక్ష్మీ తిరుపతమ్మ 105వ వార్షిక తిరునాళ్ల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 27 నుంచి ఆరురోజుల పాటు తిరునాళ్లు జరుగుతాయని ఆలయ ప్రతినిధులు మాగులూరి బ్రహ్మేశ్వరరావు, అనిల్‌కుమార్, మనోజ్‌కుమార్, ఉప్పలపాటి రామకృష్ణప్రసాద్, కొడాలి కృష్ణకిషోర్ తెలిపారు. ఈ మేరకు గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. మొదటి రోజు 27న కళ్యాణం, గ్రామోత్సవం, 28న అభిషేకం, మార్చి 1న కుంకుమ పూజలు, 2న పొంగలి ప్రదర్శనలు, 4న విశేషపూజలు, ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వేకువజాము నుంచి రాత్రి వరకు పాలపొంగళ్లతో మొక్కులు తీర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంచినీటి వసతి, చలువ పందిళ్లు అందుబాటులో ఉంచుతామన్నారు.

తిరుపతమ్మ, గోపయ్య దేవతామూర్తులు

ఆలయ నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయానికి హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కొలకలేటి వీరభద్రరావు జ్ఞాపకార్థం ఆయన భార్య సరోజని, కుమారుడు భోగేశ్వరరావు, జీవన వాణి దంపతులు రూ.1,04,091 విరాళంగా అందజేశారు. గురువారం ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్న, గొట్టిపాటి రాంబాబు, తదితరులకు ఈ మొత్తాన్ని అందించారు.

నగదు అందిస్తున్న భోగేశ్వరరావు

వేగంగా మరమ్మతు పనులు

పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కంకిపాడు లాకురోడ్డు మరమ్మతు పనులను వేగంగా చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండడంతో పనులను రాత్రి సమయంలో చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ చొరవతో సుమారు రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన పనులను అధికారులతో పాటు స్థానిక తెదేపా నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం తదితరులు పరిశీలించారు.

శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

మండలం	ఉంగుటూరు
జనాభా	సుమారు 54 వేలు
మొత్తం గ్రామాలు	27
మొత్తం ట్యాంకులు	38
కుళాయి కనెక్షన్లు	సుమారు 13 వేలు

ఉంగుటూరు మండల కేంద్రంలో తాగునీరు సరిగా అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో 25 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు నుంచే గ్రామం మొత్తానికి నీటిని అందిస్తున్నారు. మూడు ట్యాంకులు ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ట్యాంకుకు అనుసంధానంగానే నీటి కనెక్షన్లు ఉండడంతో దశలవారీగా మంచినీటిని విడుదల చేస్తూ వినియోగించాల్సిన దుస్థితి. ఫలితంగా తాగునీరు అరకొరగా వస్తుందని బీసీ, ఎస్సీ కాలనీలతో పాటు నాయుడుపేట నివాసితులు వాపోతున్నారు.

★ ఇటీవల అందరూ సింగిల్ ఫేజ్ 'హెచ్‌పీ' మోటార్లతో నీటిని తోడడంతో వచ్చే అరకొర నీరు కూడా రాని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ట్యాంకు అడుగు భాగంలో నిత్యం పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలతో కాలం గడుపుతున్నారు.

★ మండలంలోని తరిగొప్పుల, తేలప్రోలు, పెద్దఅవుటపల్లి, నందమూరు, ఇందుపల్లి, ఆత్కూరు, వెల్దిపాడు ఇతర గ్రామాల్లోనూ ఇదే దుస్థితి. ఆయా గ్రామాల్లో శివారు కాలనీలకు నీరు రావడం లేదంటున్నారు. వేసవి సమీపించనున్న నేపథ్యంలో అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉంగుటూరులో తాగునీటి ట్యాంకు దుస్థితి

సగం దారి.. వాహనాలతో సరి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్‌కు బైపాస్ రావడంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లేనని అంతా భావించారు. 2022 నుంచి భారీ వాహనాలు, కార్లు బైపాస్ మీదుగా రాకపోకలు సాగించడంతో స్థానిక రహదార్లపై సాఫీగా ప్రయాణించవచ్చని అంతా భావించారు. కానీ దుకాణదారులు, వాహనదారులు ఇష్టానుసారం నడక మార్గాల(ఫుట్‌పాత్) ఆక్రమించడంతోపాటు సగం వరకు రహదారిని పార్కింగ్‌కు అడ్డాగా మార్చేశారు. దీంతో విజయవాడ రోడ్డులో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. సిబ్బంది కొరత సాకుతో పోలీసులు కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం.

పగలే.. వెలుగులు

ఉయ్యూరు మండలంలోని కాటూరు- రాజుపేట రహదారి పక్కన ఉన్న వీధి దీపాలు మధ్యాహ్నం సమయంలోనూ వెలుగుతున్నాయి. తరచూ ఇలా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే పంచాయతీలకు విద్యుత్తు బిల్లులు ఆర్థిక భారంగా మారుతున్న తరుణంలో ఇలా వెలగడం తగదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఉయ్యూరుగ్రామీణం

108 వాహనంలోనే ప్రసవం

బిడ్డకు వైద్యసేవలందిస్తున్న 108 వైద్యసహాయకులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: బిహార్ నుంచి పనుల కోసం వలస వచ్చిన ఓ మహిళ 108 వాహనంలోనే ప్రసవించింది. వివరాల్లోకెళితే.. గర్భిణి అయిన బయ్యన్న కార్తీక గురువారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఉయ్యూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ప్రసవం చేసేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో తనని పమిడిముక్కల 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా వాహనం గంగూరు వద్దకు వెళ్లగానే తను ఆడబిడ్డను ప్రసవించింది. ప్రసవ సమయంలో 108 వైద్య సిబ్బంది డి.సుజాత, పైలట్ రాధాకృష్ణ వైద్యసేవలందించారు. అనంతరం విజయవాడ పాత ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

అధునాతన సౌకర్యాలతో కారు ఆవిష్కరణ

కానూరు, న్యూస్‌టుడే: కానూరు బందరురోడ్డులోని సంతోష్ నెక్సా మారుతి సుజుకి ఈ-విటారా కారును ఎమ్మెల్యే బోడే ప్రసాద్, సంతోష్ మారుతి మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్ కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ..పర్యావరణ హిత, సాంకేతిక, ఆధునిక డిజైన్, అత్యుత్తమ భద్రత ప్రమాణాలతో ఈ విటారా కారును రూపొందించారన్నారు. సంతోష్ మారుతి సీఈవో జె.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ..వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లో గేమ్ ఛేంజర్‌గా నిలవనుందని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ పి.శ్రీనాథ్ కారు ఫీచర్లు, ప్రారంభ ధర గురించి తెలియజేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కంపెనీ ప్రతినిధులు

కుటుంబ సర్వే వేగవంతమవ్వాలి

బాపులపాడులో సర్వే పరిశీలిస్తున్న డీడీవో

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: యూనిఫైడ్ కుటుంబ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని గుడివాడ డీడీవో సునీతాశర్మ సూచించారు. గురువారం బాపులపాడులో పర్యటించిన ఆమె సర్వే తీరుని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో జోగేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో బాపులపాడు మండలం సర్వే పురోగతిలో కొంత వెనకబడి ఉందని, త్వరితగతిన లక్ష్యం చేరుకునేలా సిబ్బంది శ్రమించాలన్నారు. అనంతరం ఇంటిపన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై, వసూళ్లను వేగవంతం చేయాలన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

ప్రొద్దుటూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పరిధిలో దావులూరు టోల్ ప్లాజా సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా గురువారం నవగ్రహ ఆరాధన, హోమం, శ్రీనారాయణ అష్టాక్షరీ పారాయణ తదితర ధార్మిక కార్యక్రమాలను నిర్మాణకర్త భీమవరపు శేషమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యుద్దీపకాంతుల్లో ఆలయం

క్షౌరశాలలకు ఉచిత విద్యుత్తు అందించండి

పెనమలూరు, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులు నిర్వహించే క్షౌరశాలలకు ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ తెలుగు నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్, విద్యుత్‌శాఖ డీఈ హరిబాబులకు వినతిపత్రాలు అందజేశారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంఘప్రతినిధులు ఎమ్మెల్యే, డీఈలను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదాయ ధ్రువపత్రంతో సంబంధం లేకుండా రేషన్‌కార్డు ప్రాతిపదికగా సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించాలని కోరారు. సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిని ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే బోడే ప్రసాద్, డీఈ హరిబాబులు తెలిపారన్నారు.

వినతిపత్రాలు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

బీసీల సంక్షేమమే ధ్యేయం

రంగారావు

విక్రం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో బీసీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని తెదేపా నియోజకవర్గ అధ్యక్షుడు సంగెపు రంగారావు, ప్రధానకార్యదర్శి వణుకూరు విక్రం పేర్కొన్నారు. ఇటీవల నియోజకవర్గ బీసీసెల్ కమిటీని ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నియోజకవర్గంలో బీసీల సంక్షేమం కోసం పాటుపడాలని అదేవిధంగా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు కమిటీని ఏర్పాటుచేయడంతో అందులో కీలక పదవులను పొందిన వీరిద్దరూ తమ వంతుగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ప్రమాణం చేశారు. వీరిని గురువారం నియోజకవర్గంలోని పలువురు బీసీ నాయకులు అభినందించారు.

చెరకు నుంచి చక్కెరపై అవగాహన

ఉయ్యూరు, న్యూస్‌టుడే: కేవలం పుస్తకాల్లోని విద్యాంశాలే కాకుండా నూతన సాంకేతికతతో కూడా ఎన్నో అంశాలు, రంగాలను విద్యార్థులకు అవగతం చేయడం ఎంతో అవసరమని ఎం.కె.విద్యాసంస్థ డైరక్టర్ ఎం.కె. బాబు అన్నారు. ఆ విద్యాసంస్థ ఫీల్డ్‌ట్రిప్‌లో భాగంగా విద్యార్థులు గురువారం ఉయ్యూరులోని కేసీపీ చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. అక్కడ చెరకు నుంచి చక్కెర వరకు జరిగే ప్రక్రియను, నూతన సాంకేతిక విధానాలను తెలుసుకున్నారు. చక్కెర తయారీ విషయాలను కర్మాగార బాధ్యులు అవగాహన కల్పించారు.. ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉందని పలువురు విద్యార్థులు చెప్పారు.

మై టీడీపీ యాప్ పోస్టర్ల ఆవిష్కరణ

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు, లీడర్ టు క్యాడర్ వరకు ప్రతి సమాచారాన్ని అందించేందుకు మంత్రి లోకేష్ ఆలోచనలతో మై టీడీపీ యాప్ రూపొందించారని తెదేపా నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి గద్దె క్రాంతి కుమార్ మై టీడీపీ యాప్ పోస్టరు, బ్యానర్లు ఆవిష్కరించారు.

ఒకటే మార్గం.. సమస్యల కూపం

రామవరప్పాడు(నెహ్రూనగర్), న్యూస్‌టుడే

రామవరప్పాడులోని నెహ్రూనగర్ నివాసితులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రోడ్డు గతుకులమయంగా మారింది. తాగునీటి ట్యాంకు ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లోనే నీరు వదులుతున్నారు. మంచి నీటి బోర్లు మూలన పడడంతో మిగిలిన సమయాల్లో నీటికి అవస్థలు పడుతున్నారు. నెహ్రూనగర్‌కి ఒక వైపు బుడమేరు కాలువ, మరో వైపు ఏలూరు కాలువ ఉండడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. శివారు ప్రాంతం కావడంతో ఆకతాయిల ఆగడాలకు అదుపు లేకుండా పోతోంది. పోలీసులు నిఘా పెంచి వారికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

చిన్న వంతెనే ఆధారం..: నెహ్రూనగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో సుమారు పదివేల మంది ప్రజలు నివసిస్తుంటారు. వీరు జాతీయ రహదారిపైకి రావాలంటే కేవలం మూడు అడుగుల వెడల్పు ఉండే చిన్న వంతెనే ఆధారం. దానిపై ద్విచక్ర వాహనం మాత్రమే వెళ్లగలదు. ఆటోలు, కార్లు రావాలంటే 2 కి.మీలు వెళ్లి ప్రసాదంపాడు వంతెనపై నుంచి పటేల్ నగర్ మీదుగా రావాలి. దీనికి అదనంగా 3 నుంచి 4 కి.మీలు తిరగాల్సి ఉంటుంది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు సైతం ఇదే మార్గంలో రావాల్సి ఉంటుంది. నెహ్రూనగర్ వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. వంతెన గురించి అసెంబ్లీలో ప్రస్తావించారు. త్వరగా వంతెన నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఏలూరు కాలువపై ఉన్న ఈ చిన్న వంతెన ద్వారానే ప్రజల రాకపోకలు సాగించాలి

పంచాయతీ	రామవరప్పాడు
ప్రాంతం	నెహ్రూనగర్
నివాసాలు	1,000
జనాభా	3,000
వార్డు	20

బహుమతుల అందజేత

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం తేలప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యతోపాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ ఆశయసాధనకు పాటుపడుదాం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో ప్రతిఒక్కరికీ ఆదర్శనీయుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆశయ సాధనకోసం పాటుపడుదామని కంకిపాడు మండల కూటమి నాయకులు పేర్కొన్నారు. గురువారం శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో భాజపా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంకిపాడు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి ఆయన సాధించిన ఘనతను కొనియాడారు. కార్యక్రమంలో గుళ్లపూడి శ్రీనివాసరావు, దీవి రోహిణికుమార్, కరణ్‌కుమార్, మురళి, సురేష్, చిన్నా స్వామి, నాగేశ్వరరావు, రమణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

పటమట, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఆటోనగర్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య తంగెళ్లమూడి వారి వీధి, హైస్కూల్ రోడ్, చిన్నిగారి రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ హరిబాబు తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది
ఉయ్యూరు పట్టణ కాపురస్తులు చీమకుర్తి రవికిరణ్ S/o. శివాజీ పేరుగల అధార్ నెం. 411401077890 గల పాస్‌పోర్ట్ నెం. V0879301 గల పాస్‌పోర్ట్ ఉయ్యూరు ఇంటి నుండి ఫోటోస్టాట్‌కి వెళుతుండగా పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు.
93933 38388

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

అంబులెన్సులో బిడ్డ జననం

శిశువుతో సుజాత

పమిడిముక్కల: ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవం నిమిత్తం గర్భిణిని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చెందిన 108 అంబులెన్సులో తీసుకెళ్తారు. మార్గమధ్యలో ఆమెకు పురిటినొప్పులు రావడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఇఎమ్‌టీ) డి.సుజాత వైద్యం అందించడంతో గర్భిణి ప్రసవించి ఆడశిశువుకు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లి యోమానకళి (ఒడిశా), శిశువు క్షేమంగా ఉన్నట్లు ఆమె అన్నారు.

ఘనంగా కృష్ణారావు శత జయంతి

కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పూతబోయిన కరుణకుమార్, తదితరులు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: దివంగత మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు గురువారం 200వ రోజుకు చేరాయి. పూతబోయిన కరుణకుమార్ ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన కూడలిలో కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు. నేతలు మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కోట సుబ్బారావు, శివనాగేశ్వరరావు, చంద్రశేఖర్‌రావు, సీతారత్నసాయిబాబు, దామోదర్‌రావు, బచ్చు వెంకటేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? అవనిగడ్డ హెడ్ పోస్టాఫీసు వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. వెంటనే చెత్త తొలగించాలి. - కిషోర్‌బాబు, అవనిగడ్డ ✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తను శుక్రవారం డంపింగ్ యార్డుకి తరలిస్తాం. - తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, అవనిగడ్డ. ? అవనిగడ్డ 7వ వార్డు సోషల్ ఫ్లాట్ వద్ద చెత్తగుట్ట పేరుకుపోయి దుర్వాసన కొడుతోంది. - సుబ్బారావు, అవనిగడ్డ. ✓ సిబ్బందిని పంపించి చెత్తను తరలిస్తాం. - తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, అవనిగడ్డ. - న్యూస్‌టుడే, అవనిగడ్డ

ఇంటి పన్ను వసూళ్లలో ప్రగతి

మోపిదేవి-అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ఫలితాలనిస్తోంది. పాత పద్ధతికి పూర్తిగా స్వస్తిపలికి నూతన విధానం అమలు స్ఫూర్తిదాయకంగా ఉంది. గతంలో ఇంటి పన్నులు వసూళ్లు చేసి పంచాయతీలలో జమ చేయటంలో జాప్యం జరిగేది. ఇప్పుడు చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయి. ఇటీవల చేపట్టిన పన్ను వసూళ్లలో కొన్ని పంచాయతీలు ముందంజలో ఉన్నాయి.

❖ మచిలీపట్నం డివిజన్ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి. అందులో 231 పంచాయతీలున్నాయి. 2024-25లో పాత బకాయిలు, 2025-26 డిమాండ్ రూ.15,17,92,019లుగా నిర్ధారించారు. దీనిలో ప్రస్తుతం సగానికి పైగా వసూళ్లయినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 31వ తేదీ ముందే వసూళ్లు ఉద్యోగులకు లక్ష్యాలు ఇచ్చినట్లు డీఎల్‌పీవో రజావుల్లా తెలిపారు.

❖ డివిజన్‌లో 231 పంచాయతీలకు ఈ నెల 12వ తేదీకి 55 పంచాయతీల్లో శతశాతం వసూళ్లయ్యాయి.

❖ 2021లో నేను పదవి బాధ్యతలు చేపట్టినపుడు కొంత మేరకు ఇంటి పన్ను బకాయిలున్నాయి. ప్రత్యేక కసరత్తుతో వరుసగా నాలుగుసార్లు నూరుశాతం వసూళ్లు చేశాం. ఈ స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా శతశాతం వసూళ్లు చేశాం. బకాయిదారులు కూడా ఆన్‌లైన్ విధానానికి అలవాటుపడి చెల్లించారు.

– చింతా శ్రీనివాసరావు, సర్పంచి, ఉత్తర చిరువోల్లంక

పౌల్ట్రీఫామ్‌ను నివాసాలకు దూరంగా తరలించండి..

ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న విజయారావు

రామనగరం (చల్లపల్లి), న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామనగరంలోని పౌల్ట్రీఫామ్ స్థానికుల నివాసాలకు సమీపంలో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తొట్లపూడి పెదబాబు, కోనేరు బలరాం, నిడమానూరి సుబ్బారావు, వీరమాచనేని కృష్ణప్రసాద్, పాలడుగు శ్రీనివాసరావు, మాలెంపాటి నగరాజకుమారి, తదితరులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మచిలీపట్నంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ డి.కె.బాలాజీకి వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ కె.విజయారావు గురువారం ఆ పౌల్ట్రీఫామ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఆరోపణలపై నివేదికను ఉన్నతాధికారులకు తెలియచేస్తామని చెప్పారు. 30 సంవత్సరాలకు పైగా ఈ పౌల్ట్రీఫామ్ సమీపంలో నివాసం ఉంటున్నామని, దీనివలన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు చెప్పారు. ఈ పౌల్ట్రీఫామ్‌లో కోళ్లు విసర్జించే మలం, మేతకోసం ఏర్పాటు చేసిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నుంచి దుమ్ము, ధూళి, దుర్గంధంతో పరిసర ప్రాంతమంతా కాలుష్యమవుతోందని తెలిపారు. నివాసాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరారు.

గుడివాడ రూపురేఖలు మారుస్తాం

కల్వర్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి దాని రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టణంలో రూ.99 లక్షలతో నిర్మాణంలో ఉన్న గౌరీశంకరపురంలోని టాఫ్రీ స్లాండ రోడ్డును, రూ.99 లక్షలతో నిర్మిస్తున్న ఆర్టీఓ కార్యాలయ రోడ్డును రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రయివేటు పనుల నాణ్యతతో చేయాలని అధికారులను సూచించారు. నేతలు లింగం ప్రసాద్, వేణుబాబు, వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సూచనలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్

ఘంటసాల, న్యూస్‌టుడే: రామానగరం-వయా ఘంటసాల-కొడాలి రోడ్డు నిర్మాణ నాణ్యతా పనులను ఆర్అండ్‌బీ డీఈ రమేష్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రామానగరం వయా ఘంటసాల-కొడాలి రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 4 కిలోమీటర్ల రహదారిని 7 మీటర్లు వెడల్పుతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ

మొవ్వ(కూచిపూడి): ఈ నెల 23 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ పరీక్షలకు కళాశాల ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు డాక్టరు డి. సుధాకరరావు చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారన్నారు.

చేనేత గర్జనను జయప్రదం చేయాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి మంగళగిరిలో ఈనెల 22న జరిగే చేనేత గర్జనను జయప్రదం చేయాలని పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంది

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జగదీష్, సూర్యభవాని

జగదీష్ తెలిపారు. గురువారం ఘంటసాలలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. జగదీష్ మాట్లాడుతూ రంగు, రసాయనాలు, నూలు, సిల్క్ ధరలు విపరీతంగా పెరిగాయని పెరిగిన ధరలు తగ్గించి చేనేత కార్మికులకు జీఎస్టీని 18శాతం విధించడంతో మరింత భారం పెరిగిందన్నారు. మాజీ ఎంపీపీ అంది సూర్యభవాని, సంఘం నాయకులు రామమోహనరావు, చిత్తరంజన్ సాయి, అరుణ, కృష్ణవేణి, సావిత్రి, వీరవెంకటేశ్వర్లు, సుబ్బయ్య, లక్ష్మి, కోటేశ్వరమ్మ, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన పథకానికి దాతలు గురువారం విరాళం అందజేశారు. గుడివాడకు చెందిన ఎం.జలంధర్రావు రూ.2 లక్షలు, అదే పట్టణానికి చెందిన ఎం.సత్యనారాయణ, మాధవి దంపతులు రూ.1,55,599 ఉచిత ప్రసాద పంపిణీకి విరాళాలు అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దాతలకు దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ బంధువులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహరాజ్ 396వ జయంతి గురువారం స్థానిక గీతామందిరం ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రాంత సామరస ప్రముఖ్ లింగం బసవ శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సహప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ, కమ్మిలి సుబ్రహ్మణ్యం, గరికిపాటి హరి ప్రసాద్, వర్మ, యుగంధర్, బచ్చు శ్రీహరి, విజయకుమార్, ప్రసాద్, తుంగల గిరి, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని హిందూ బంధువులు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు జై శ్రీరామ్, ఛత్రపతి శివాజీకి జై నినాదాలు చేస్తూ పామర్రు పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

గుడివాడ: భారత్‌లో పరదేశీ మతోన్మాద శక్తులను తరిమికొట్టిన పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ అని గుడివాడ పట్టణ భాజపా 2వ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఆయన కార్యాలయంలో శివాజీ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సూరే లక్ష్మీనారాయణ, అంగడాల సతీష్, కొత్త చలపతి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారి ఆలయ 27వ వార్షి

పూజలు చేస్తున్న భక్తులు

కోత్సవం సందర్భంగా గురువారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు లంకా కొండలు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, రావులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక మూడో వార్డు మార్కెట్ సమీపంలో నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. నూతన విగ్రహాలకు చతుర్థశ కలశస్నపన, పంచగవ్యాధి వాసము, అధివాస హోమం నిర్వహించారు. నిర్మాణ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరులో నిర్మాణంలో ఉన్న శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి భోగిరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు తమ్మన మురళీ, వెంకటప్రభావతి, తమ్మన హేమంత్, లక్ష్మీ అలేఖ్య దంపతులు రూ. 1,01,116లు విరాళాన్ని గురువారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, అన్నం రామమోహన్‌రావు, కోట వెంకటసుబ్బారావు, అన్నం శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఎనిమిరోజైన గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఉభయ దేవేరులతో పల్లకీలో కొలువుదీరిన స్వామికి ద్వాదశ (12 సార్లు) ప్రదక్షిణలు చేశారు. అనంతరం శయ్యాలంకృత పర్యంకసేవ వేడుకగా చేశారు. ముత్తైదువులకు నూతన వస్త్రాలను అందించారు. స్వామి తరుపున పాల్గొన్న వారికి శేషవస్త్రాలతో సత్కరించారు.

జటార్ఝూటం బహూకరణ

కూచిపూడి: కూచిపూడి నాట్యక్షేత్రంలో శ్రీగంగా బాలత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామికి విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపాటి రామకృష్ణ, సావిత్రి దంపతులు ఇత్తడి జటార్ఝూటాన్ని బహూకరించారు. రూ. 40 వేల విలువైన దీనిని అర్చకులు పూర్ణచంద్రశేఖరశర్మ, సతీష్‌కుమార్‌శర్మలకు అందజేశారు.

పాఠశాల దారికి మోక్షమెపుడు?

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లంకమ్మ మాన్యంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి రెండున్నర దశాబ్దాలుగా మట్టి రోడ్డుగానే మిగిలిపోయింది. వర్షాలు పడితే బురదలో పిల్లల్ని ఎత్తుకుని దింపాల్సిన పరిస్థితి ఉంటోందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారిని అభివృద్ధి చేస్తే లంకమ్మమాన్యం, రాజశేఖరపురం కాలనీ వాసులు కొత్త కాలనీ మీదుగా బైపాస్ రహదారికి చేరుకునే అవకాశం కలుగుతుంది.

అధ్వానంగా మురుగు కాలువ వ్యవస్థ

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఆయకట్టు ప్రాంతంలో మురుగు కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉంది. తూటుకాడ, ముళ్ల చెట్ల పొదలు నిండి ఉన్నాయి. నీటి పారుదల ఎలా అని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. మినుము నీటి తడుపుల కోసం రైతులు మురుగు కాలువ నుంచి చమురు యంత్రాలతో రబ్బరు గొట్టాల సాయంతో తరలిస్తున్నారు. తగినంత నీటి సరఫరా లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాల్వ పూడిక తీయించాలని కోరుతున్నారు.

చరవాణికి దూరంగా ఉండండి!

సైబర్ నేరాలను అరికట్టాలంటే విద్యార్థులు చరవాణికి దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల ద్వారానే పలువురు సైబర్ నేరగాళ్ల వల పన్నుతున్నారని గుడివాడ రూరల్ ఎస్.ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మోటూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈమేరకు అవగాహన కల్పించి పది పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వివరించారు. అదే ఈ దృశ్యం. - గుడివాడ, న్యూస్‌టుడే

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

దోకిపర్రు-తురాయిపాలెం మసీదులో దువా చేస్తున్న ముస్లింలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం గురువారం ప్రారంభమైంది. దీంతో ముస్లింలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం మసీదుల్లో దువా ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందుతో విరమించారు. మండలంలోని కౌతవరం 1వ వార్డు, చెక్‌పోస్టు, తూర్పు వైపు చెరువు మసీదు, సుబ్బిచెర్వు, అంగలూరు కొత్తపేట, పెంజెంద్ర, శేరిదగ్గుమిల్లి, కట్టవానిచెర్వు, వడ్లమన్నాడు, ఉలవలపూడి, వేమవరపాలెం, దోకిపర్రు, తురాయిపాలెం, లంకాదొడ్డి మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాటిల్లో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు.

పెదపూడి(కూచిపూడి), న్యూస్‌టుడే: రంజాన్ ఉపవాస దీక్షలను బుధవారం రాత్రి నుంచి ముస్లింలు పెదపూడి మసీదుల్లో ప్రారంభించారు. నెలవంక దర్శనం కావడంతో నమాజులు, ఉపవాస దీక్షా కార్యక్రమాలు ఆరంభించినట్లు తెలిపారు. భట్లపెనుమర్రు, కాజ, నిడుమోలు, మొవ్వ, కోసూరు, తురకపాలెంలలో రంజాన్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని అన్నారు.

ఆహార నాణ్యతను పరిశీలించాలి

చర్చిస్తున్న సీఈవో వంశీధర్

గుడివాడ, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యతను తరచూ పరిశీలించాలని అన్న క్యాంటీన్ల సీఈవో పి.వంశీధర్ పేర్కొన్నారు. స్థానిక పురపాలక కార్యాలయంలో కమిషనర్ సింహాద్రి మనోహర్, పట్టణ అన్న క్యాంటీన్ల నిర్వాహకులతో ఆయన గురువారం సమావేశం అయ్యారు. భోజనం, అల్పాహారం నాణ్యత, పరిశుభ్రత, రుచి, తదితరాలను గూర్చి చర్చించారు. సేవలు మెరుగు పర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గోకవరపు సునీల్, మజ్జాడ నాగరాజు, పురపాలక అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ పాదయాత్ర

మాట్లాడుతున్న తెదేపా నాయకుడు పూర్ణచంద్రరావు, పక్కన నర్సింహులు, నాయకులు

మొవ్వ(కూచిపూడి): దివంగత ముఖ్యమంత్రి, తెదేపా వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ బి.ఎన్.నర్సింహులు పాదయాత్ర చేస్తున్నారని తెదేపా నాయకుడు తాతినేని పూర్ణచంద్రరావు అన్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు నర్సింహులు కృష్ణాజిల్లాలో 41రోజుల మండల దీక్షను మూడురోజుల కిందట నిమ్మకూరులో ప్రారంభించారన్నారు. గురువారం మొవ్వకు చేరుకున్నాక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దీక్షకు మద్దతుగా మొవ్వలో తెదేపా నేతలు శీలం బాబూరావు, నాగేశ్వరరావు, బుజ్జికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొవ్వపాలెం, వేములమడ, కోసూరుల మీదుగా కాజ వరకు పాదయాత్ర కొనసాగింది. ఆయా గ్రామాలలో తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికారు.

రహదారి ఆక్రమణల్ని ఉపేక్షించం

ఆక్రమణల్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్.ఐ నాగరాజు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే రైతు బజారు రహదారిలో ఆక్రమణలు సరికాదని, తక్షణం తొలగించాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్.ఐ పూడి నాగరాజు సూచించారు. స్థానిక మార్కెట్ సెంటర్ నుంచి ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకూ గురువారం ఆక్రమణలు తొలగింపజేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ

విజేతను అభినందిస్తున్న ఏఎన్నార్ కళాశాల పాలక వర్గం

గుడివాడ, న్యూస్‌టుడే: అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సన్నిహిత్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపల్ ఆరిగ రామారావు పేర్కొన్నారు. ఈమేరకు విజేతను గురువారం అభినందించారు. వై. సన్నిహిత్ రెడ్డి 59 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, డెడ్ లిఫ్ట్ కేటగిరిలో 125 కేజీల బరువు ఎత్తి ద్వితీయ స్థానం, బెంచ్ ప్రెస్ కేటగిరీలో తృతీయ స్థానం సాధించడం గర్వకారణం అన్నారు. కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు ఎల్ఆర్‌కె.ప్రసాద్, కోశాధికారి పర్వతనేని కృష్ణ ప్రసాద్, తదితరులు అభినందించారు.

చెరువు కలుషితం

మర్రివాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: గ్రామంలోని ఇళ్ల మధ్యలో ఉన్న చెరువు కలుషిత నీటితో ఉండడంతో ప్రమాదకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. చెరువులోని కలుషిత నీటిని తొలగించి మంచినీరు వచ్చేలా ఏర్పాటు చేయాలని అధి

కలుషిత నీటితో నిండిన చెరువు

కారులను కోరుతున్నారు. 4 ఎకరాల విస్తీర్ణంలోని తటాకం క్రమేణా పూడ్చి భవనాలు నిర్మించడంతో రెండెకరాలకు చేరిందన్నారు. ప్రస్తుతం దీనిలోని నీరు బయటకు పంపేందుకు, కొత్తనీరు పెట్టేందుకు అవకాశం లేక ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉండడం, వ్యర్థాలను చెరువులో వేయడంతో దుర్గంధం వ్యాపిస్తోందని పరిసరవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ నీరు తాగి పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శేరిదగ్గుమిల్లిలో మైక్రో ఫిల్టర్ ఏర్పాటుకు చర్యలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలోని శేరిదగ్గుమిల్లి పంచాయతీ నీటి పథకం వద్ద గ్రామస్థులకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు మైక్రోవాటర్ ఫిల్టర్ నిర్మాణ పనులను గురువారం చేపట్టారు. రూ.3 లక్షల నిధులతో 0.5 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఫిల్టర్ నిర్మాణ పనులకు సంబంధించి చేపట్టిన పిల్లర్ల తవ్వకం పనులను సర్పంచి జన్ను లక్ష్మీరాణి పర్యవేక్షించారు.

మహిళల భద్రతపై అవగాహన సదస్సు

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక అస్సెస్సీ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విద్యార్థులకు మహిళా భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పామర్రు సీఐ సుభాకర్ పాల్గొని మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పోక్సో చట్టం, శక్తి యాప్‌ల గురించి వివరించారు.

మోటారు సైక్లిస్టు మృతికి కారణమైన జేసీబీ డ్రైవర్ అరెస్టు

మాట్లాడుతున్న పామర్రు సీఐ సుభాకర్

పామర్రు, న్యూస్‌టుడే: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై వ్యతిరేక దిశలో వచ్చి మోటారు సైక్లిస్టుని ఢీకొని అతడి మృతికి కారణమైన జేసీబీ డ్రైవర్‌ని అరెస్టు చేశామని పామర్రు సీఐ సుభాకర్ గురువారం తెలిపారు. స్థానిక సీఐ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మచిలీపట్నంకి చెందిన అల్లాబక్షు తన మోటారు సైకిల్‌పై విజయవాడలోని బంధువుల ఇంటి వద్ద జరిగే వేడుకకి వెళ్తుండగా స్థానిక 14వ మైలురాయి వద్ద పామర్రు నుంచి జుఝువరం వైపు అపసవ్యదిశలో జేసీబీ నడుపుతూ అల్లాబక్షును ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడన్నారు. నిందితుడైన ఉరుసు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి గుడివాడ కోర్టుకి తరలించగా రిమాండ్ విధించారన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుడివాడ, న్యూస్‌టుడే: బాలికను ఓ వ్యక్తి ప్రేమ పేరుతో తీసుకుని వెళ్లాడని కుటుంబ సభ్యులు గుడివాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన బాలిక (17) గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఒక యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి తీసుకునిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఎంపీపీ కొడాలి సురేశ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎండీ.ఇమ్రాన్ వెల్లడించారు. అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో సమీక్షకు హాజరు కావాలని తెలిపారు.


11వ వర్ధంతి
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మంచి మనిషి
శ్రీ బొప్పన సీతారామయ్య గారు
మా నుండి దూరమై నేటికి 11 సం॥రాలు గడిచినను వారి మధురస్మృతులు ఎప్పటికీ మరువలేము.
మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య: బొప్పన శేషుకుమారి
కుమారుడు: బొప్పన శ్రీసుధీర్ కోడలు: ప్రశాంతి
అల్లుడు: కానూరి వంశీకృష్ణ కుమార్తె: స్వప్న
మనుమలు: హర్షిద్‌రామ్, ఐష్విన్‌రామ్, అచ్యుత్ రామ్
మనుమరాలు: నిత్యశ్రీవల్లి
మరియు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు
కీ॥శే॥ బొప్పన సీతారామయ్య గారు
రాఘవాపురం గ్రామం, ముదినేపల్లి మండలం
జననం: 12-7-1956 మరణం: 21-2-2015

వార్షికోత్సవ శుభాకాంక్షలు
విజయ ఆప్టికల్స్
ఓల్డ్ మున్సిపల్ ఆఫీసు రోడ్, AGK హైస్కూల్, అన్న క్యాంటీన్ ఎదురుగా, గుడివాడ. సెల్: 73822 82816

✤ మావద్ద అన్నిరకముల కళ్ళజోళ్ళు సరసమైన ధరలకు లభించును
✤ మావద్ద అన్నిరకముల కూలింగ్ గ్లాసెస్ లభించును.
✤ మావద్ద అన్ని బడ్జెట్ కంపెనీల ఫ్రేమ్‌లు మరియు అద్దములు లభించును.
Ray Ban-Vogue Eye Wear | TITAN Eye Wear | Fastrack
Crizal Nova | Zeissneyon | ZOE=MILLER Future is Ours SCOTT

(c) eenadu

మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నేడు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులు సైతం మత్తుకు అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటపడలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ మహమ్మారి బారిన విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదక ద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారనే దానిపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో' ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాడినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప | 20.02.26 (శుక్రవారం) | ఉదయం 10.30 గంటలకు

అధునాతన సాంకేతికతతో భవనాల అభివృద్ధి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతికతతో అన్నప్రసాదం, లడ్డు పోటు భవనాలు అభివృద్ధి చేయాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. మల్లికార్జున మహా మండపంలో గురువారం నిర్వహించిన ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో ఈవో మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందంతో కలిసి అన్నదాన భవనం, లడ్డు ప్రసాదాల పోటు భవనాన్ని పరిశీలించిన తర్వాత ఆధునిక సాంకేతికతతో కూడిన వంటగది, అత్యాధునిక బాయిలర్ పరికరాల ఏర్పాటు చేయాలని సూచించారు. తితిదే బూందీ పోటు, అన్నదానం బాయిలర్లకు విజయవంతంగా పరికరాలను ఏర్పాటు చేసిన టెక్నాలజిక్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఇప్పటికే నివేదికను సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ప్రతినిధులు రఘునాథన్, డిజైన్ మేనేజర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శివాజీ శౌర్యం స్ఫూర్తిదాయకం

ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్. పక్కన ఎమ్మెల్యే బొండా ఉమా, శివస్వామి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: శివాజీ మహారాజ్ శౌర్యం, ధైర్యం, పరిపాలనా దక్షత.. నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ ట్రస్టు కన్వీనర్ నాగలింగం శివాజీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శారదా కళాశాల సమీపంలోని శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. గెరిల్లా యుద్ధంలో శత్రువును ఎదుర్కొని స్వరాజాన్ని స్థాపించిన మహానేతగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లక్ష్య సాధనకు శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ.. శివాజీ పరిపాలన సమసమాజ నిర్మాణానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, విజయకృష్ణా సూపర్‌బజార్ కమిటీ ఛైర్మన్ వెలగా సురేష్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బొడ్డు నాగలక్ష్మి, కోనేరు దుర్గాప్రసాద్, లోకనాథశర్మ, శంకరనారాయణ, దుర్గాప్రసాద్‌రాజు, హనుమంతరావు, సురేష్, లాకా వెంగళరావు యాదవ్ పాల్గొన్నారు.

వృథా వ్యథ.. కథ ఇనుము!

తుక్కుగా మారుతున్న ఉక్కు నిల్వలు | వైకాపా పాలన వైఫల్యానికి నిదర్శనం

ఈ ఇనుమును.. 2021-22 వైకాపా పాలనలో కొని.. పెనుగంచిప్రోలు మండల హౌసింగ్ కార్యాలయం ఆవరణలో ఇలా పడేశారు. తుప్పు పట్టి, చుట్టూ ముళ్లపొదలు ఏర్పడి క్రమంగా మట్టిలో కలిసిపోతోంది.

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

"వైకాపా పాలనలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఆది నుంచి అక్రమాలే రాజ్యమేలాయి. మెరక పనులు మొదలు.. ఇంటి నిర్మాణం వరకు నాయకులు, అధికారులు అడ్డగోలుగా దోచేశారు. అవసరానికి మించి ఇనుము కొని సొమ్ము చేసుకోవడంతో ఆ ఇనుము ఉమ్మడి జిల్లాలో ఎందుకూ కొరగాకుండా పోతోంది."

లబ్ధిదారుల ప్రమేయం లేకనే...

- ఉమ్మడి కృష్ణాలో వైకాపా పాలనలో ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే (ఆప్షన్-3) గృహ యూనిట్లు 31,000 వరకు మంజూరయ్యాయి. వీటి నిర్మాణంపై అసలు లబ్ధిదారులకు సమాచారం లేకుండానే స్టీల్, ఇతర మెటీరియల్ అవసరానికి మించి మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి కొనేశారు.
- భారీగా కమీషన్ తీసుకుని ఆయా కంపెనీలకు ఇంటి నిర్మాణం చేపట్టక ముందే మొత్తం బిల్లు చెల్లించేశారు. తీరా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మొత్తమ్మీద 6 వేలు కూడా పూర్తవలేదు. దీంతో అడ్డగోలుగా తెచ్చిన ఇనుము, ఇతర మెటీరియల్ మిగిలిపోయాయి.

50-100 టన్నులు

- జగ్గయ్యపేట, నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల... ఇలా ప్రతి మండలంలోనూ 50-100 టన్నుల వరకు ఇనుము వృథాగా ఉంది. చాలాచోట్ల బయటపడేయగా ఏళ్లుగా ఎండ, వానలకు తుప్పు పట్టిపోతోంది.
- ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల విలువైన ఇనుము వృథాగా ఉంది. ఇళ్లు కడుతున్న గుత్తేదారులకు చాలాకాలంగా బిల్లులు ఇవ్వక పనులు నిలిచిపోయాయి.
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీలు వెంకట్రావ్, రజనీకుమారిలు మాట్లాడుతూ.. చాలా ప్రాంతాల్లో ఇనుము తుప్పు పట్టకుండా భద్రపరిచాం.. లబ్ధిదారులు వస్తే వారికి ఇస్తాం.. లేదంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చేస్తామన్నారు.

ఒక్కో టన్నుకు రూ.వేలల్లో దోపిడీ

- ఉమ్మడి జిల్లాలో 3 వేల టన్నుల మేర ఇనుము నిరుపయోగంగా మిగిలింది. ఆయా మండల కేంద్రాల్లో కొన్నిచోట్ల గిడ్డంగుల్లో పెట్టగా మరికొన్నిచోట్ల ఆరుబయటే వదిలేశారు. ఏళ్లు గడిచిపోవడం.. గృహ నిర్మాణం పడకేయడంతో ఉక్కు తుప్పు పట్టి తుక్కులా మారిపోతోంది.
- 2021-22లోనే టన్ను ఇనుము రూ.67-74 వేలకు కొన్నట్లు చూపించగా ఇప్పటికీ బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ.60 వేలకు కూడా చేరకపోవడం గమనార్హం.

సరిహద్దులూ..చూపలేరా?

గ్రౌండింగ్‌కు మట్టి దొరకక మల్లవల్లిలో అగచాట్లు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

మల్లవల్లి పారిశ్రామికవాడలో నిర్మాణంలో ఉన్న చిన్న యూనిట్లు

"కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మల్లవల్లిలో 347 మంది పారిశ్రామికవేత్తలు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు 2025 మార్చిలో లాటరీ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఆరు నెలల్లో గ్రౌండింగ్ పూర్తిచేసి, రెండేళ్లలో పరిశ్రమలను నెలకొల్పాలి. ఏడాది కావస్తున్నా సగం మందైనా గ్రౌండింగ్ పూర్తిచేయలేదు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియకుంది. జాగా కేటాయించినంత వేగంగా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు."

"ప్రత్యేకంగా అధికారులతో కూడిన ఓ బృందాన్ని పర్యవేక్షణకు కేటాయించినా.. అనుకున్న లక్ష్యానికి చేరుకోలేక చతికిలపడ్డారు. సర్వే చేసి.. ఎవరి స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సరిహద్దు రాళ్లు పాతే ప్రక్రియ తీవ్ర జాప్యమైంది. మరోవైపు గ్రౌండింగ్‌కు అవసరమైన మట్టి కొరత వేధిస్తున్నా.. పట్టించుకునే వారే లేరని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు."

మల్లవల్లిలో 2, 3 నెలల కిందట నుంచి.. ఎవరి స్థలాలు ఎవరివో సర్వే ఆరంభించి.. సగం చేపట్టాక.. మిగతావి చేయకుండా వదిలేశారు. దీంతో కేటాయించిన వారిలో కొందరే.. గ్రౌండింగ్ చేశారు. మిగతా వాళ్లు.. అందరికీ కేటాయించాక చూద్దామనే ధోరణిలో ఉన్నారు. కారణం.. తీవ్ర మట్టి కొరత. పారిశ్రామికవాడలో 500 చదరపు మీటర్ల నుంచి 1, 2 ఎకరాల వరకూ ఒక్కొక్కరికి ప్లాట్లను కేటాయించారు. వీరిలో అర ఎకరా లోపు స్థలాలు కేటాయించిన 40-50 చిన్న యూనిట్లు గ్రౌండింగ్ పూర్తిచేసి.. నిర్మాణంలో ఉన్నాయి. వీరితోపాటు మరి కొందరు కూడా గ్రౌండింగ్‌కు సిద్ధంగానే ఉన్నా.. మట్టి దొరకడం కష్టంగా మారి చేతులెత్తేశారు.

అక్రమంగా తరలిస్తున్నా..

మల్లవల్లి సమీప ప్రాంతాల్లో విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వీరి దగ్గరే టిప్పర్‌కు రూ.8-10 వేలకు కొనడం భారమైంది. గతంలో రూ.5 వేలకు దొరికేది.. ఇప్పుడు రెట్టింపు వెచ్చించాల్సిందే. ఇదే మంటే.. అధికారిక తవ్వకాలకు గన్నవరం పరిధిలో అనుమతులు లేకపోవడంతో.. ఎక్కడెక్కడి నుంచో తెస్తున్నారు. వాళ్లు చెప్పిన ధరకు కొనాల్సిందే అని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

ఎవరికీ పట్టదంతే..

సమస్యను ప్రజాప్రతినిధులు, కృష్ణా జిల్లా కలెక్టర్ సహా అధికారులు అందరికీ చెప్పినా.. పరిష్కారం దొరకలేదు. రెండెకరాల స్థలాన్ని గ్రౌండింగ్ చేయాలంటే.. రూ.30-35 లక్షలు పెట్టాల్సి రావడంతో.. ఇప్పుడు తొందరేముందని ఎక్కువ మంది వేచిచూస్తున్నారు. ప్రభుత్వం ఎకరం రూ.16.50 లక్షలకు కేటాయిస్తే.. మట్టి కోసం అంతకంటే ఎక్కువ కావాల్సివస్తోందని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు.

పోలవరం.. తప్పేలా లేదు కలవరం

సూరంపల్లిలో దెబ్బతిన్న పోలవరం కాలువగట్టు

సిమెంటు రక్షణ లైనింగ్ దెబ్బతిందిలా.

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి దగ్గర పోలవరం కాలువ పరిస్థితి ఇది. కాలువ వెంబడి ఉన్న మట్టికట్ట కోసుకుపోవడమే కాక.. సైడ్ వాల్ సైతం దెబ్బతిని సిమెంట్ లైనింగ్ ముక్కలై ఇలా తయారైంది. ప్రస్తుతం కాలువ వెంబడి రహదారిని చాలామంది చెత్తతో డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. రాబోయేది వేసవి కాలం కావడంతో ఇప్పుడే దీనికి మరమ్మతులు చేయించి తక్షణమే బాగుచేయించాల్సిన అవసరం ఉంది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం కాలువ వెంట మట్టిని దోచుకుపోవడం, నిర్మాణాలపై నిర్లక్ష్యం కారణంగా చాలా ప్రాంతాల్లో కాలువ దెబ్బతింది. పట్టిసీమ నుంచి కృష్ణానదికి గోదావరి జలాలను తీసుకువచ్చే ప్రధాన కాలువ కావడంతో వర్షాకాలం రాకుండానే దీనికి మరమ్మతులు చేయించి పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. - ఈనాడు, అమరావతి

పురాతన భవనం.. ఆదమరిస్తే ప్రమాదం

పాతబస్తీ శివాలయం వీధిలో ప్రమాదకర స్థితిలో గోదాము

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీలో పురాతన భవనాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వందేళ్ల క్రితం గానుగ సున్నంతో కట్టిన భవనాలు సైతం ఉన్నాయి. వాటిని గోదాములుగా ఉపయోగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే వీధుల్లో ఇవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇరుకు వీధుల్లో జీర్ణావస్థకు చేరిన భవనాలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల నిమిత్తం పాతబస్తీకి వచ్చే ప్రజలు, వ్యాపారాల కోసం నిత్యం ఈ ప్రాంతాల్లో తిరిగే వినియోగదారులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.
– న్యూస్‌టుడే, విద్యాధరపురం(విజయవాడ)

కొత్తగా సిగ్నల్స్.. సజావుగా రాకపోకలు

రూ.6 కోట్ల వ్యయంతో 36 చోట్ల ఏర్పాటు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

విజయవాడ నగరం, శివారు ప్రాంతాల్లో చాలా చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పని చేయడం లేదు. కొన్ని చోట్ల అసలు సిగ్నల్స్ లేవు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ అధికారులు నిర్ణయించారు.

- ప్రస్తుతం నగర పరిధిలో 27 చోట్ల సిగ్నల్స్ ఉన్నాయి. ఇప్పుడు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 36 చోట్ల కొత్తగా ఏర్పాటు చేసేందుకు అధికారులు రూ.6 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తొలి విడత 7 చోట్ల పనులు చేపట్టారు. మరో 29 చోట్ల నెలాఖరులోపు పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

భవానీపురం చర్చి సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్

ఎక్కడెక్కడంటే...

- తొలుత భవానీపురం జోజినగర్ చర్చి సెంటర్, చిట్టినగర్ సెంటర్, స్వాతి జంక్షన్, గవర్నర్‌పేట ఆర్టీసీ వైజంక్షన్, బందరు లాకులు, రాఘవయ్య పార్కు, దాబా కొట్ల జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్నారు.
- **రెండో విడతలో** గవర్నర్‌పేట - ప్రకాశం విగ్రహం జంక్షన్, ప్రకాశం బ్యారేజీ, వీజీ చౌక్, వైవీ రావు ఎస్టేట్ జంక్షన్, కృష్ణలంక స్క్యూబ్రిడ్జి, జ్యోతి మహల్ జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, పటమట - ఆటోనగర్ గేటు, సూర్యారావుపేట పుష్ప హోటల్ సెంటర్, ఆర్టీయే జంక్షన్, అయోధ్యనగర్ ఆర్చి, పైపుల రోడ్డు జంక్షన్, గద్దబొమ్మ సెంటర్, వినాయకుడి గుడి, కనక దుర్గమ్మ వారధి, బిగ్ బజార్, కృష్ణలంక - బస్టాండ్ అవుట్ గేట్, సీతమ్మ వారి పాదాలు, ఎనికేపాడు వంద అడుగుల రోడ్డు, పటమట హైస్కూలు రోడ్డు, పటమట ఎన్టీఆర్ సర్కిల్, పటమట ఈ- సేవ కేంద్రం, పెనమలూరు - కామయ్య తోపు, పెనమలూరు, పోరంకి, అలంకార్, తాడిగడప 100 అడుగుల రోడ్డు కూడళ్లు, గాంధీ బొమ్మ, కంకిపాడు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. నగరపాలక సంస్థ ఎస్ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి మాట్లాడుతూ.. నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కవచ్‌తో రైలు ప్రమాదాలకు చెక్..

త్వరలో విజయవాడ డివిజన్‌లో ఏర్పాటు

రైలు ప్రమాదాల నివారణకు కవచ్‌తో చెక్ పడనుంది. భారతీయ రైల్వే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ద్వారా రైలు ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు. ఈ నూతన వ్యవస్థ సహాయంతో రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా, సిగ్నల్స్ జంప్ చేయకుండా, వేగ పరిమితులను సైతం నియంత్రిస్తుంది. ప్రమాదాలను నివారించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ సాంకేతికత రేడియో కమ్యూనికేషన్స్ ఉపయోగించి రైలు స్థానాన్ని, వేగాన్ని పర్యవేక్షిస్తుంది.

- **ప్రమాదాన్ని పసిగట్టి సడెన్ బ్రేక్..** ప్రమాదం ముంచుకొస్తే ఆటోమేటిక్ బ్రేకులు వేస్తుంది. ఈ సమయంలో ఎలాంటి కుదుపు లేకుండా రైలును సురక్షితంగా బయట పడేలా చేయడం కవచ్ ముఖ్య ఉద్దేశం. ఇటీవల దేశంలో జరుగుతున్న వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో కవచ్ వ్యవస్థ ప్రాధాన్యత పెరిగింది, దేశవ్యాప్తంగా దీనిని విస్తరించడానికి రైల్వే శాఖ ప్రయత్నిస్తోంది.
- విజయవాడ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా ఈ కవచ్ వ్యవస్థను ప్రవేశ పెట్టేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఈ నూతన అత్యాధునిక వ్యవస్థ అందుబాటులోకి వస్తే రైలు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చు. - రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

ఏ బస్సూ.. ఆగదు బాసు..!

రూ.కోటి వెచ్చించినా అక్కరకురాని బస్టాండ్

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట గ్రామీణం– న్యూస్‌టుడే

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై రూ.కోటి వ్యయంతో నిర్మించిన హైవే బస్టాండ్.. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు నిరాశే మిగులుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో హడావుడిగా ప్రారంభించినా సౌకర్యాలు కల్పించకుండా వదిలేశారు. ఫలితంగా విజయవాడ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఇక్కడ ఆపకపోవడంతో జగ్గయ్యపేట ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

వేచి ఉండాల్సిందే..: జగ్గయ్యపేట ఆటోనగర్‌కు సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన హైవే బస్టాండ్‌ను నిర్మించారు. జగ్గయ్యపేట పట్టణ ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఇక్కడ హైవే బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుంచి ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లాలి. ఈ హైవే బస్టాండ్ వద్ద విజయవాడ, ఇతర డిపోల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏ బస్సూ ఆగడంలేదు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

సౌకర్యాలు కరవు.. రూ.కోటి వెచ్చించి హైవే బస్టాండ్ నిర్మించిన అధికారులు ఇక్కడ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించలేదు. బస్సులు ఆగాల్సిన ప్లాట్‌ఫాం సక్రమంగా లేదు. ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలు వంటి వసతులు లేవు. ఎండా, వానకు ఇబ్బంది పడుతూనే జాతీయ రహదారి పక్కన నిలుచుని ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి.

రాజకీయ పరిస్థితులే కారణమా.. హైవే బస్టాండ్ నిరుపయోగంగా ఉండడానికి రాజకీయ పరిస్థితులే కారణమని జగ్గయ్యపేట ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపరిచి బస్సులు ఆగేలా కూటమి ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వత్సవాయి ఠాణాలో తిరకాసు బాగోతం

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన సీపీ... ఎస్సై పాత్రపై కొనసాగుతున్న విచారణ

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ

ఓ కేసులో నిందితులుగా పేర్లు చేర్చకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో వత్సవాయి స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సస్పెండయ్యాడు. ఎస్సై ఉమామహేశ్వరరావుపై శాఖాపరమైన విచారణకు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశించారు. ఈ ఉదంతంలో ఏసీబీ ట్రాప్ నుంచి వీరు త్రుటిలో తప్పించుకున్నారు. వివరాలివీ...

పేర్లు చేర్చకుండా ఉండేందుకు..

వత్సవాయి పోలీస్‌స్టేషన్ పరిధి గోపినేనిపాలెంలో ఇటీవల ఓ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాలతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయితే నిందితుడి సోదరుడు, అతని స్నేహితులను ఎస్సై నిత్యం స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఎస్సైకి రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకరించి, సమాచారాన్ని ఏసీబీకి అందించారు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు అనిశా అధికారులు ప్లాన్ వేశారు. ఈ మేరకు లంచం ఇచ్చేందుకు బుధవారం.. నిందితుడి తండ్రి ఎస్సై వద్దకు వెళ్లాడు. ఇప్పుడే వస్తానని ఎస్సై బయటకు వచ్చారు. ఇదే క్రమంలో కానిస్టేబుల్ బయట ఉన్న తన బ్యాచ్‌కు చెందిన ఏసీబీ కానిస్టేబుల్‌ను గుర్తుపట్టాడు. అనుమానంతో వెంటనే ఎస్సైకి సమాచారం ఇవ్వగా.. ఎస్సై ఉమామహేశ్వరరావు స్టేషన్ నుంచి హుటాహుటిన వెళ్లిపోయారని తెలిసింది.

సీపీ రాజశేఖరబాబు సీరియస్....

లంచం డిమాండ్ చేసి.. ఏసీబీ ట్రాప్ నుంచి తప్పించుకున్న ఉదంతంపై విజయవాడ సీపీ రాజశేఖరబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేసి, ఎస్సై ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ కొండలరావులపై నివేదిక ఇవ్వాలని గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణను ఆదేశించారు. డీసీపీ గురువారం నందిగామ ఏసీపీ కార్యాలయానికొచ్చి సమగ్ర విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ప్రాథమికంగా కానిస్టేబుల్ పాత్ర నిర్ధారణ అయింది. ఎస్సైకి డబ్బులు ఇస్తే.. పేర్లు చేర్చరని చెప్పినట్లు తెలిసింది. దీంతో డీసీపీ సిఫార్సు మేరకు కమిషనర్ కానిస్టేబుల్ కొండలరావును సస్పెండ్ చేశారు. ఎస్సై పాత్రపై విచారణ సాగుతోంది. స్టేషన్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

నా పేరు బాబు.. నేను ఆర్టీసీలో పనిచేస్తాను.. మా పిల్లలు చేసిన పనికి నన్ను, వాళ్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జనవరి 4న ఘటన జరగ్గా.. ఆ రోజే నా చరవాణి తీసుకున్నారు. అప్పటి నుంచి ఇవ్వలేదు. మా పిల్లలు దొరికిన తర్వాత కూడా నన్ను రెండుసార్లు కొట్టారు. మా పిల్లలతోపాటు మరో ముగ్గురు ఉన్నారు.. రూ.40 వేలు సెటిల్‌మెంట్ చేసుకుని ముగ్గురిని వదిలేశారు. మేం డబ్బులు ఇవ్వడం ఆలస్యం కావడంతో నెల రోజులు తిప్పారు. కేసు లేకుండా చేయడానికి నన్ను రూ.లక్ష అడిగారు.. అంత ఇవ్వలేనంటే రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. వయసులో పెద్దవాడినీ.. ఆర్టీసీ ఉద్యోగిని అని కూడా చూడకుండా ఎస్సై కొట్టారు. ఈ పరిణామాలపై పోలీసులు అధికారులు విచారణ చేపట్టి నాకు న్యాయం చేయాలి. - నిందితుడి తండ్రి ఆవేదన

గీత దాటితే మోతే..!

ఈ-చలానా పెండింగ్‌లో ఉందా.. రవాణా శాఖ సేవలకు బ్రేక్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

విజయవాడకు చెందిన రత్నకుమార్ తన ఆటోకు కాలుష్యపత్రం తీసుకుందామని వెళ్లారు. 16 చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. ఇవన్నీ సిగ్నల్ లైటు వద్ద 'స్టాప్ లైన్' దాటినవే. మొదటి చలానాకు రూ.150, మిగిలిన వాటికి ఒక్కోదానికి రూ.300లు చొప్పున రుసుము కట్టాలన్నారు. అవి కడితేనే కాలుష్య పత్రం వస్తుందని చెప్పడంతో కంగుతిన్నారు. ఈ విషయం చాలా మందికి తెలియదు. రవాణాశాఖ పరివాహన్ వెబ్‌సైట్లో మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి.

ప్రత్యేక కెమెరాలు ఉన్నాయ్..

నగరంలోని కొన్ని కూడళ్లలో 2023 సంవత్సరంలో ఏఎన్‌పీఆర్ (ఆటోమెటిక్ నంబరు ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు అమర్చారు. కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు.. స్టాప్ లైన్ దాటి వెళ్లిన వాహనాల నంబరు ప్లేట్లను అవి ఫొటోలు తీస్తాయి. వీటితో ఈ-చలానాలు విధించారు. ఇలా విజయవాడలో వేలాది మందికి చలానాలు వేసేశారు. మూడు నెలల లోపు సొమ్ము చెల్లించాలి. అలా కట్టకపోతే.. ఆ వాహన నంబరును బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. ఏ విధమైన లావాదేవీలు నిర్వహించలేరు. ఈ-చలానా పడినట్లు చరవాణులకు సంక్షిప్త సమాచారం రావడం లేదు. దీంతో చాలా మందికి.. రవాణాశాఖ ఈ-చలానాలు విధిస్తుందన్న విషయమే తెలియదు. కాలుష్య పత్రాలు, వాహన పన్నులు చెల్లించేందుకు వెళ్లినప్పుడో ఇవి బయట పడుతున్నాయి. అదనంగా వేలాది రూపాయలు చెల్లించాల్సి ఉండటంతో వాహన యజమానులు బెంబేలెత్తిపోతున్నారు.

రాజమహేంద్రవరం నుంచి జారీ..

చలానాలను గత ఏడాది రవాణాశాఖ పరివాహన్ సైట్లో అప్‌లోడ్ చేయడంతో.. అవి ఇప్పుడు పరివాహన్ వెబ్‌సైట్లో కనిపిస్తున్నాయి. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే.. చలానాలన్నీ 'డీటీసీ, రాజమండ్రి కార్యాలయం' నుంచి వచ్చినట్లు ఉన్నాయి. ఇది అనేక సందేహాలకు తావిస్తోంది. తాము ఎప్పుడూ రాజమహేంద్రవరం వెళ్లలేదని.. చలానా ఎలా విధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో చలానాలను పర్యవేక్షించిన అధికారి రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఆయన అక్కడి నుంచి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయడంతో ఇలా వచ్చేశాయి.

అది ఉల్లంఘనేనా?

ఏదైనా కూడలిలో రెడ్ సిగ్నల్ పడితే.. చోదకులు ఆగకుండా వెళ్లిపోతే నేరం. కానీ స్టాప్‌లైన్ వద్ద కొంచెం దాటి ఆగినా.. రవాణాశాఖ ఈ-చలానాలు వేస్తోంది. స్టాప్‌లైన్ దాటితే చలానా వేస్తామని ఎప్పుడూ చెప్పలేదని.. ఇది ఉల్లంఘన ఎలా అవుతుందని చోదకులు ప్రశ్నిస్తున్నారు.

ఇలా చూసుకోవచ్చు..

చోదకులు https:///parivahan.gov.in అనే సైట్లోకి వెళ్లి ఇ-చలానా ఎంపిక చేసుకోవాలి. దానిలో వాహన నంబరు నమోదు చేస్తే.. జాబితా వస్తుంది. అక్కడే పేమెంట్ ఆప్షన్ ఉంటుంది. దానిని క్లిక్ చేసి సొమ్ము చెల్లించవచ్చు. ఆ తర్వాతే రవాణాశాఖ సేవలు పొందుతారు.

చదివింది న్యాయం.. చేసేది నేరం

మ్యూల్ ఎకౌంట్స్ కేసు సూత్రధారి రాజా తీరిది

ఈనాడు. అమరావతి

అతను చదివింది న్యాయశాస్త్రం.. చేసేది మాత్రం చట్టవిరుద్ధ లావాదేవీలు. డిజిటల్ మార్కెటింగ్ పేరుతో తిరుగుతుంటాడు. కొంత సమయం సీనియర్ లాయర్ వద్ద ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో సూత్రధారి సుబ్రమణి రాజా వెంకట్ భిన్న శైలి ఇది. చెన్నైతోపాటు పలు ప్రాంతాల్లో తన గ్యాంగ్‌తో మ్యూల్ ఖాతాలు తెరిపించి.. చట్టవ్యతిరేక లావాదేవీలు చేయిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చెన్నై వెళ్లిన బెజవాడ పోలీసులకు నిరాశే ఎదురైంది. రెండు రోజులున్నా.. ఆచూకీ దొరకలేదు. అతని కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చి బయలుదేరారు.

చెన్నై నగరం తిరువొత్తియూర్‌లో వెంకట్ ఉంటున్న ఇల్లు

డబ్బు సంపాదించాలనే ఆశతో.. చెన్నై నగరం తిరివొత్తియూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న వెంకట్‌ది పేద కుటుంబం. తండ్రి తాగుడుకు బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఇంటికి పరిమితమయ్యేవాడు. దీంతో వెంకట్.. త్వరగా డబ్బు సంపాదించాలన్న ఆశతో అడ్డదారి తొక్కాడు. చెన్నైలో కొందరితో కలిసి అద్దె ఖాతాల లావాదేవీలు చేయడం ప్రారంభించాడు. తనకు సమీప బంధువులైన రవి కుమార్, స్టీవెన్ సాయంతో విజయవాడలో కథ నడిపించేవాడు. వీరు ఇక్కడ సైబర్ పోలీసులకు పట్టుబడటంతో.. అప్రమత్తమైన రాజా వెంకట్.. ఈ నెల 9 నుంచి అదృశ్యమయ్యాడు. నిందితుడి ఇంటికి పోలీసులు వెళ్లినా ఉపయోగం లేకపోయింది. కుటుంబ సభ్యులు... న్యాయవాదులతో కలిసి పోలీసుల వద్దకు వచ్చారు. వారం రోజుల సమయం ఇస్తే.. వెంకట్‌ను తీసుకొచ్చి అప్పగిస్తామన్నారు.

ఖాతాల వడపోత: లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాల వివరాలు బ్యాంకుల నుంచి వచ్చాయి. ఈ స్టేట్‌మెంట్లను పోలీసులు వడపోస్తున్నారు. వాటిల్లో పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరగలేదని తెలిసింది. ఓ ఖాతాలో గరిష్ఠంగా రూ.16 లక్షలు మాత్రమే జరిగినట్లు గుర్తించారు. నిందితుడు ఈ వ్యవహారాల్లో రెండో అంచెలో ఉన్నట్లు తేలింది. ఇతని వెనుక ఇంకా కొందరు ఉన్నట్లు భావిస్తున్నారు. ఇతను దొరికితేనే పూర్తి వివరాలు వచ్చే అవకాశం ఉంది.

(c) eenadu

చుక్కేసి.. వాహనం నడిపితే కొలువుకే ఎసరు

కొత్త అస్త్రం ప్రయోగించనున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం (గుంటుపల్లి), న్యూస్‌టుడే

మద్యం మత్తులో వాహనం నడుపుతూ చిక్కిన వారిపై విజయవాడ నగర ట్రాఫిక్ పోలీసులు కొత్త అస్త్రం ప్రయోగించనున్నారు. ఇంత వరకు మద్యం మత్తులో పోలీసులతో గొడవలు, జైలు శిక్షలు పడిన చోదకుల సమాచారం మాత్రమే వారు విధులు నిర్వహించే సంస్థల యజమానులకు తెలిపేవారు. ఈ క్రమంలో పోలీసులు మద్యం తాగిన చోదకులపై కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్, జరిమానాలతో సరిపెట్టేవారు. దాంతో మద్యం చోదకులకు పోలీసులంటే ఉదాసీనత ఏర్పడింది. దీన్ని వదిలించేందుకు నగర పోలీసులు నూతన ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తున్నారు.



బ్రీత్ ఎనలైజర్‌తో వాహన చోదకుడిని పరీక్షిస్తున్న పోలీసు, పక్కన సీఐ చంద్రశేఖర్

పోలీసు స్టేషన్ల పరిధిలో..

ప్రమాదాల కట్టడే లక్ష్యంగా ఇటీవల 'ఎరైవ్‌-ఎలైవ్' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి రోజు విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం, జి.కొండూరు పోలీసు స్టేషన్ల పరిధిలో 10- 15 ప్రాంతాల్లో తనిఖీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అతి వేగం, మద్యం మత్తు కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే మద్యం మత్తులో వాహనాలు నడిపితే కొలువులకు ఎసరు తప్పదనే సంకేతం పంపనున్నారు. ఇందులో భాగంగా విజయవాడ నగర సీపీ రాజశేఖరబాబు, ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం ఆదేశాలతో మార్చి ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు పరిచేందుకు ట్రాఫిక్ పోలీసు విభాగం ఏర్పాట్లు చేస్తోంది. తనిఖీల్లో చిక్కిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగుల వివరాలను, వారు విధులు నిర్వహిస్తున్న సంస్థల నుంచి చిరునామాలు సేకరించనున్నట్లు ట్రాఫిక్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన ఉండదు

చాలా మందిలో తాము ఎంత తాగినా వాహనం నడపగలమనే ధీమా ఉంటోంది. కానీ ఆ మత్తు ప్రభావం మెదడుపై తీవ్రంగా ఉంటుందన్న అవగాహన ఉండదు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వారి వివరాలు ఆయా సంస్థల అధిపతులకు చేరవేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నారు. దీన్ని అమలు చేస్తే ఉద్యోగం, పరువు పోతాయనే భయంతోనైనా మద్యం తాగి వాహనం నడపకుండా ఉంటారు.

- చంద్రశేఖర్, సీఐ, ఇబ్రహీంపట్నం

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాలన్నింటికీ అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారులు పారదర్శక సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘ ప్రతిష్ఠను మరింత ఇనుమడింప జేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు.

నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్, రమణ

రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుమాక రాజు (మంగళగిరి), సహాధ్యక్షుడిగా పి.శంకర్ (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కె.ఉదయ్ (మంగళగిరి), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.వలీంద్ర రాజు (గుంటూరు), కోశాధికారిగా ఎం.అయూబ్ నాథ్ (మంగళగిరి) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.పల్లివేద (విజయవాడ), ఎం.రెడ్డప్ప రెడ్డి (మంగళగిరి), కె.శ్రీనివాసరావు (విజయనగరం), వి.రమణమూలు (విజయవాడ), ఈసీ సభ్యులుగా డి.ఎన్.వి.సవిత (కర్నూలు), ఎస్.సునీత (అమలాపురం), బి.నాసారెడ్డి (విజయవాడ), వి.షకీలా (గుంటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పెనుమాక రాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఆర్థిక శాఖ అధికారులతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కె.ఉదయ్ మాట్లాడుతూ.. శాశ్వతమైన అభివృద్ధి కోసం కృషి చేస్తామని, ఏటీవోలు-పీడీ, ఏడీ-డీడీ, డీడీ-జేడీ పదోన్నతుల విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి 26 జిల్లాల నుంచి గెజిటెడ్ అధికారులు హాజరయ్యారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.రమణ.. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా టి.సత్యనారాయణ, పరిశీలకుడిగా సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

ఎన్టీఆర్ రామచంద్రరావును సత్కరిస్తున్న వీరబాబు, గోపాలకృష్ణ, డీసీ చైర్మన్లు

సాగర్ నీటి వాటా వచ్చేలా చూడరూ..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ (ఎన్.ఎస్.పి.) ఎడమ కాల్వ పరిధిలోని రెండు, మూడు జోన్లలో తెలంగాణ నుంచి ఆంధ్రకు రావాల్సిన సాగునీటి వాటా సక్రమంగా వచ్చేలా చూడాలని ఎన్.ఎస్.పి. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ అక్కల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్లు విన్నవించారు. ఈమేరకు విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని వివిధ కార్యాలయాల్లో ఫలితాంశం ప్రాజెక్టు ఎస్.ఈ. పి.రామచంద్రరావును గురువారం వినతి పత్రం సమర్పించారు. నూజివీడు డివిజన్‌లో 159, జగ్గయ్యపేట డివిజన్‌లో 72 లష్కరు (కాలువల) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేలా చూడాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, సాగునీటి సంఘాల అధ్యక్షులకు పనులను జీవన్న కింద ఉండాలని నిబంధనలను తొలగించాలని విన్నవించారు. ఇటీవల ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును సత్కరించారు. డీసీ పరిధిలోని డీసీ చైర్మన్లు పాల్గొన్నారు.

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్.గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు చైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరెడ్డి రోహిత్ చరణ్ రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ.44,999 నుంచి ప్రారంభం అవుతోందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కి డైమండ్స్‌పై

ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తోపాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో అర్హత ప్రమాణాలున్న పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. తొలి విడత 742 కార్డులు జారీ చేసినట్టు వెల్లడించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఇవి 2027 డిసెంబరు వరకు అమలులో ఉంటాయని చెప్పారు. సమాచార శాఖ డీపీఆర్వో కె.వి.రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్, కార్మిక శాఖ ఉప కమిషనర్ జి.ధనలక్ష్మి, పాత్రికేయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ -213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(ప్రభుత్వ భాగస్వామ్య షెడ్యూల్డ్ బ్యాంక్)
హెడ్ ఆఫీస్: 27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002. ఫోన్ : 0866-2429044
APCOB

ప్రాంగణం లీజుకు ఆహ్వానిస్తూ నోటీసు

విజయవాడ, ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు జిల్లాలోని తాడేపల్లి మరియు యన్‌టిఆర్ జిల్లాలోని పోరంకిలలో కొత్త శాఖలను ప్రారంభించడానికి లీజు ప్రాతిపదికన వాణిజ్య/కార్యాలయ ప్రాంగణానికి యజమానులు/పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి ప్రతిపాదనలను ఆహ్వానిస్తోంది.
దరఖాస్తులు స్వీకరణ చివరి తేది. : 25-02-2025న సాయంత్రం గం.04.00 ల వరకు లేదా ఆ ముందు వరకు.
మరిన్ని వివరములకు బ్యాంక్ వెబ్‌సైట్ www.apcob.bank.in ను సందర్శించగలరు.
సం/-
జనరల్ మేనేజర్ (GAD)

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ — A Government of India Undertaking
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ, ఎపి-520008.
ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

M/s. వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క స్విస్ ఛాలెంజ్ ప్రక్రియ కొరకు అనుమతి పొందిన సంస్థలకు (అనుమతి పొందిన ARCS/NBFCs/ Banks/FIs) ఇ-వేలం ద్వారా బదిలీ చేయడానికి సంబంధించిన ప్రకటన

M/s వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా యొక్క తేది.31.12.2025 నాటికి ఫండ్ బేస్డ్ పరిమితిలలో బకాయి రూ. 210.78 కోట్లు (అక్షరాల రెండు వందల పది కోట్ల డెబ్బై ఎనిమిది లక్షలు మాత్రమే) ప్లస్ తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో ఇ-వేలం ద్వారా "ఆల్ క్యాష్" ప్రాతిపదికన కనీస రిజర్వ్ ధర రూ.20.25 కోట్లు (రూపాయలు ఇరవై కోట్ల ఇరవై ఐదు లక్షలు మాత్రమే) స్ట్రెస్డ్ లోన్ రుణ బకాయిలను ("RBI MD") కెనరా బ్యాంక్ ఋణ ఎక్స్‌పోజర్‌లను బదిలీ చేయడానికి, కాలానుగుణంగా సవరించబడిన మరియు బ్యాంక్ అంతర్గత బోర్డు ఆమోదించిన విధానం ప్రకారం బదిలీ చేయడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) నుండి ఉన్న మార్గదర్శకాల ప్రకారం, అర్హత కలిగిన ARCలు/NBFCలు/బ్యాంకులు/ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఉమ్మడిగా అనుమతి పొందిన సంస్థలు లేదా బిడ్డర్లు) నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ను ఆహ్వానిస్తుంది. "ఎక్కడ ఎలా ఉన్నది", "అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు రికోర్స్ ప్రాతిపదికన లేకుండా ఇ-వేలం ద్వారా నిర్వహించబడును.

కెనరా బ్యాంక్ రుణ బహిర్గతమునకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ, చట్టపరమైన లేదా మరే ఇతర రకాల నష్టాలను భరించదు మరియు M/s వాసవి పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కొరకు ఎటువంటి ప్రాతినిధ్యాలు లేదా వారంటీలను అందించదు. ఆసక్తిగల అర్హత కలిగిన పాల్గొనే వారందరూ ఇ-వేలంలో పాల్గొనడానికి తమ సంసిద్ధతను EOI ద్వారా సమర్పించవలెను మరియు ముందుగా అమలు చేయకపోతే నాన్-డిస్‌క్లోజర్ ఒప్పందాన్ని అమలు చేయాలని అభ్యర్థించవలెను. EOI సమర్పించడానికి ఆఖరి తేది.24.02.2026. ఆసక్తిగల బిడ్డర్లు వెబ్ నోటీసు కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయవచ్చు మరియు మరిన్ని వివరాలకు www.canarabank.com నందు టెండర్స్‌పై క్లిక్ చేయడం ద్వారా పొందవచ్చు.

ఆసక్తి గల పార్టీలు దిగువ తెలిపిన వ్యక్తులను సంప్రదించవచ్చును.

సంప్రదించు వ్యక్తి	సంప్రదించు ఫోన్ నెం.	ఇ-మెయిల్ ఐడి
శ్రీ. నాగరాజ్ సి మీషి	98455 29105	armvij@canarabank.com
శ్రీ. నాగేశ్వర రావు జి	91108 84565	

ఈ ప్రకటనలో తెలిపిన ఇ-వేలం ప్రక్రియ కాంపీటెంట్ అధికారి తుది ఆమోదానికి లోబడి ఉంటుందని దయచేసి గమనించండి. అంతేకాకుండా, ఈ ప్రకటనలోని ఏవైనా నిబంధనలను రద్దు చేయడానికి, మార్చుటకు, సవరించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి మరియు ఏ దశలోనైనా డాక్యుమెంట్‌ను ప్రాసెస్ చేయడానికి మరియు/లేదా అర్హత ఉన్న పార్టీని అనర్హులుగా ప్రకటించడానికి, ఎటువంటి కారణం పేర్కొనకుండా మరియు ఎటువంటి బాధ్యత లేకుండా వెబ్‌సైట్‌లో కొరిజెండమ్‌ను అప్‌లోడ్ చేయడానికి కెనరా బ్యాంక్ హక్కును కలిగి ఉంది మరియు ఈ విషయంలో కెనరా బ్యాంక్ నిర్ణయమే అంతిమమైనది & కట్టుబడి ఉండవలిసినది. ఇది ఆఫర్ పత్రం కాదు మరియు ఎటువంటి హామీ లేకుండా జారీ చేయబడుతోంది.

తేది : 19.02.2026 — జారీ చేసినవారు
ప్రదేశం : విజయవాడ — కెనరా బ్యాంక్, ARM బ్రాంచ్, విజయవాడ

ఇద్దరు విద్యార్థుల అదృశ్యంతో కలకలం

నాలుగు పోలీసు బృందాలతో గాలింపు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యం కావడం కలకలం సృష్టిస్తోంది. భవానీపురం కరరాజ్ వైశ్య బ్యాంకు సమీపంలో దేవాని కాలనీలో నివాసం ఉంటూ.. ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో హార్డ్‌వేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన కుమారుడు ఉమారామ్(14) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. వారి బంధువుల కుమారుడు దేవాని బెహరామ్(13) కూడా అతనితో పాటు చదువుకుంటున్నాడు. ప్రతి రోజూ సాయంత్రం వారిద్దరూ ట్యూషన్‌కు వెళ్లి వస్తుంటారు. ఆ విధంగానే 18వ తేదీ సాయంత్రం కూడా ట్యూషన్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరి వెళ్లారు. రాత్రి 8 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ట్యూషన్ వద్దకు వెళ్లి విచారించారు. ట్యూషన్‌కు రాలేదని చెప్పడంతో కంగారు పడ్డారు. వెంటనే బస్టాండ్, రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలలో రాత్రి 11:30 వరకు తిరిగి వెతికారు. పిల్లల ఆచూకీ తెలియకపోవడంతో భవానీపురం పోలీసులను ఆశ్రయించారు.

ఉమారామ్ బెహరామ్

రాజస్థాన్ రైలు ఎక్కి..: పోలీసులు చిన్నారులు వెళ్లిన మార్గంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. బెహరామ్, ఉమారామ్ ట్యూషన్‌కు వెళ్లకుండా భవానీపురం లోని వీధుల్లో తిరిగినట్లు గుర్తించారు. ఆ తర్వాత బందరు రోడ్డులోని ఓ ఆటోలో ఎక్కినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. పోలీసులు ఆ ఆటో డ్రైవర్‌ను గుర్తించి విచారించగా.. వారిద్దరిని బందరు రోడ్డులోని పీవీపీ మాల్ వద్ద దింపినట్లు తెలిపాడు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించగా మాల్‌తో పాటు సమీపంలోని పలు షోరూంలలోకి వెళ్లి బయటకు రావడాన్ని గమనించారు. అక్కడ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి రాజస్థాన్ వెళ్లే రైలు ఎక్కినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాజస్థాన్‌లో బంధువుల ఇంట్లో వర్కషాప్ ఉందని ఇంట్లో చెప్పేవారని సమాచారం. విద్యార్థుల ఆచూకీ కనుగొనేందుకు నగర సీపీ నాలుగు బృందాలను నియమించారు. స్థానిక పోలీసులు రాజస్థాన్‌లోని బంధువులతో మాట్లాడుతూ ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనంతబాబుపై వేటు వేయండి

పటమట, న్యూస్‌టుడే: దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో సిట్ దర్యాప్తు సంస్థ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గను ఎ2 నిందితురాలిగా చేర్చిన నేపథ్యంలో 24 గంటల్లో అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య వైకాపా అధినేత జగన్‌ను డిమాండ్ చేశారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అనంతబాబును కాపాడేందుకు దర్యాప్తును తప్పు దోవ పట్టించారని, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆదేశాలతో సిట్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తోందన్నారు. సిట్ దర్యాప్తులో అనంతబాబు భార్య పాత్ర తేలిన నేపథ్యంలో ఆయనపై పార్టీ పరంగా చర్యలు తీసుకుని దళితుల పట్ల జగన్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

మాట్లాడుతున్న బాలకోటయ్య, వేదికపై మామిడి సత్యం, పేరం భుజంగరావు

'కేంద్రం జీవోను ఉపసంహరించుకోవాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కేరళ ప్రభుత్వం వరి, గోధుమలకు అదనంగా బోనస్ చెల్లిస్తున్నా.. ఇవ్వవద్దని కేంద్రం ఇచ్చిన జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి(కిసాన్ సభ) డిమాండ్ చేశారు. గురువారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత కొంత కాలం నుంచి కనీస మద్దతు ధరల కోసం కేంద్ర ప్రభుత్వంపై రైతు సంఘాలు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా కేరళ రాష్ట్రం బోనస్ ఇస్తుంటే అడ్డుపడడం సరికాదన్నారు. కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కేరళకు ఇవ్వాల్సిన రూ.1800 కోట్ల రీఎంబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జీఎస్టీ వాటాలో 60శాతం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడి, పౌల్ట్రీరంగం, పశుసంపద, మత్స్య తదితర రంగాల రైతులకు నష్టదాయకమైన భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాన్ని కేంద్రానికి సూచించారు. మన పంటలను అమెరికా సుంకాలు విధించడం, వారి పంటలను ఉచితంగా కొనుగోలు చేయడం ఏపాటి ఒప్పందం అని మండిపడ్డారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు ఎం.యలమందరావు, తోట ఆంజనేయులు, సత్యనారాయణ, కొల్లా రాజమోహన్, ఎం.వెంకటరెడ్డి, జాన కీరాములు, మరీదు ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్ మిల్లింగ్‌కు ధాన్యం సరఫరా'

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి.. సీఎంఆర్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తుందని ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు పంపిణీ చేసే సీఎంఆర్ బియ్యాన్ని ఫోర్టిఫికేషన్ చేసి.. సకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడం రైస్ మిల్లింగ్ పరిశ్రమ బాధ్యతని చెప్పారు. దీనికోసం మిల్లింగ్ ఛార్జీలు క్వింటాకు రూ.10, మిల్లింగ్‌లో వచ్చే బైప్రొడెక్ట్స్‌కు ప్రతిఫలంగా కేంద్రం ద్వారా రీఎంబర్స్‌మెంట్ జరుగుతుందన్నారు. ఈ పాలసీ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడంలో బృహత్తర బాధ్యత వహిస్తామని పేర్కొన్నారు. కొందరు మంత్రులు కమీషన్ల కోసం రైస్ మిల్లర్ల సంఘంపై ఒత్తిడి చేస్తున్నారనే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. సంఘం సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని ఆయన చెప్పారు.

బాలికపై అకృత్యం.. పదేళ్ల జైలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ యువకుడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు వెల్లడించినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు గురువారం తెలిపారు. వించిపేట ప్రాంతంలో పెద్ది శుభాకర్ అలియాస్ సుబ్బు నివాసం ఉంటున్నాడు. అతడు చిట్టినగర్ ప్రాంతానికి చెందిన అప్పట్లో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను ప్రేమిస్తూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ మురళీకృష్ణ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి 10 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

రైతుబజారుల్లో కూరగాయల ధరలు

వంకాయలు-20/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-48, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-30, దొండ-38, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-28, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-28, కీరదోస-40, బీన్స్-60/74, క్యాప్సికమ్-66, చింతకాయలు-65, నిమ్మ (డజను)-38/42, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. – న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు – అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. నిందితులకు విధించిన రిమాండ్ గడువు.. గురువారంతో ముగియనుండడంతో వారిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. బెయిల్‌పై ఉన్న మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము హాజరుకాలేదు. వారి తరఫున న్యాయవాది గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ఆరుగురు, మదనపల్లి జైలు నుంచి ఒకరు, విజయవాడ కారాగారం నుంచి ముగ్గురు వీసీ ద్వారా హాజరుపరిచారు. వీరికి వచ్చే నెల 5 వరకు న్యాయాధికారి రిమాండ్ పొడిగించారు.

❖ నిందితుడు సెంథిల్ (ఏ22) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై ఎక్సైజ్ అధికారులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కుట్ర గురించి లోతుగా విచారించాల్సి ఉందనీ.. ఈ దశలో బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని అందులో పేర్కొన్నారు. వాదనల నిమిత్తం కేసును 24కు వాయిదా వేశారు. సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై అతని తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై విచారణ 24కు న్యాయాధికారి వాయిదా వేశారు.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. గురువారం ఈ పిటిషన్.. విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. కౌంటరు దాఖలుకు సిట్ సమయం కోరింది. దీంతో న్యాయాధికారి ఈనెల 21కి వాయిదా వేశారు.

రైల్వే ఉద్యోగాల పేరిట మోసంపై విచారణ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: రైల్వేలో ఉద్యోగాల పేరిట పలువురిని మోసం చేసిన సంఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. రైల్వేలో పని చేస్తున్న మచిలీపట్నానికి చెందిన కిషోర్ నకిలీ ఉద్యోగ నియామక పత్రాలతో తమను మోసం చేసి రూ.లక్షల్లో నగదు తీసుకున్నారని బాధితులు నాగపద్మ, గంగాభవానీ అతని ఇంటి వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. గురువారం రైల్వే ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన అధికారులు మచిలీపట్నం వచ్చి బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న ఆధారాలతో పాటు ఇతర బాధితుల వివరాలు సేకరించారు. వారికి ఇచ్చిన నకిలీ నియామక పత్రాలు పరిశీలించారు. మరింత విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

91.9FM Vijayawada — 91.9 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరణ నేడు

పటమట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, మండలి వెంకట కృష్ణారావు శత జయంతి మహోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బెంజ్‌సర్కిల్ సమీపంలోని సిద్ధార్థ గ్రంథాలయంలో ప్రముఖ సాహితీవేత్త జి.వి.పూర్ణచంద్ రచించిన 'ఆంధ్రగీతి- తెలుగు భాషాజాగృతి కావ్యం' ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఈ నెల 21, 22 తేదీల్లో పూర్ణచంద్ రూపొందించిన వంద 'గాథలు', స్వీయ ఆంగ్లానువాదం, వర్ణచిత్రాలతో కవితా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కొలువులకు పలువురి ఎంపిక

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సిద్ధార్థ మహిళా కళాశాల, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, వికాస జిల్లా ఉపాధి కల్పన, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 450 మంది యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. వారిలో 380 మంది వివిధ ప్రైవేట్ సంస్థల్లో కొలువులకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులతో అతిథులు

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ అన్నారు. ఈ నెల 21న మండల పరిధిలోని కృష్ణారావుపాలెం నాగేంద్ర స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సేంద్రియ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉండడంతో వారికి సేంద్రియ వ్యవసాయం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడానికి ఈ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు, అధికారులు వస్తున్నారని తెలిపారు. పాడి పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని కృష్ణా మిల్క్ యూనియన్ ముందుకొచ్చిందని, వీరు జిల్లాలో పండిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను సేకరించి 'ఫుడ్ బాస్కెట్' అనే యాప్ ద్వారా విక్రయిస్తారని వెల్లడించారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న దేవదత్, పక్కన కూటమి నాయకులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

బందరురోడ్డు, పప్పుల మిల్లు సెంటర్ కాస TVS ప్రక్కన నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. సంప్ర ✆ 94940 51157

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం- 75 వేలు. సంప్ర: 81064 03490

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PLOT FOR SALE

గజం11,999/- బందర్‌రోడ్‌లో 80ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ స్పోర్ట్స్, స్విమ్మింగ్ పూల్, హౌసింగ్ 46L గవర్నమెంట్ ఆఫీసులకు దగ్గరల్లో ✆ 99495 05050

TO LET

సెంటిని హాస్పిటల్ ప్రక్క వీధి నియర్ లయోలా కాలేజ్ దగ్గర N/E పేసింగ్ 500 Yardsలో ఇండివిడ్యూవల్ 3BR ఆఫీస్/ హౌస్‌కు అద్దెకు కలదు. సంప్ర ✆ 99499 86667.

JOBS

Engineering EEE /Diploma (Boys) ★ Computer Operator Female ★ Office Administrators. Switch Gears, Enikepadu. ✆ 99081 78777

Teaching Staff for Hotel Management College, Vijayawada FO, HK, Service, Kitchen Department, Salary Depend On Experience. Accommodation Available. ✆ 72888 85598.

Wanted– Sr. Manager (Business Development) Reputed Tyre Retreading Materials Distributor requires experienced Sr. Manager to develop dealer & customer network in Andhra Pradesh. Experience in Tyres, Lubricants, Automobile field essential. Attractive Salary + Incentives. Ph: 9000 009122

SSS కంపెనీలో పనిచేయుటకు లేడీస్ & జెంట్స్ కావలెను. మంచి జీతం మరియు అలవెన్సు. టెన్త్ క్లాస్ & above, VJA. ✆ 93985 53721.

మార్నింగ్ టైమ్‌లో 2 hours బ్రోచర్స్ పంచుటకు స్త్రీ అభ్యర్థి కావలెను 30 yrs లోపు జీతం 6000/ మరియు కమీషన్ ఇవ్వబడును. ✆ 9908166858

ప్రతాప్ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జరీ ఇనిస్టిట్యూట్‌కి విజయవాడకు ★ నర్సింగ్ స్టాఫ్, వీడియో ఎడిటర్, రిసెప్షనిస్ట్, సోషల్ మీడియా మేనేజర్ పోస్ట్‌లకు అర్హులైన అనుభవం ఉన్న అభ్యర్థులు కావాలి ✆ 77998 80139.

WANTED
● MANAGER (Male) Qlf : Any Degree 5 yrs. Exp. in Pharma C&F Salary : 20 K
● OPERATOR (M/F) Qlf : Any Degree 3 yrs. Exp. in Pharma C&F Salary Basing on Exp., & Qlf
● PERSONAL ASSISTANT (Female) Qlf : Any Degree 5 yrs. Exp. in any Field Salary Basing on Exp., & Qlf.
Gollapudi, Nearer location Candidates are Preferable
PHARMACY C&F D.No.: 6-128, 3rd Floor, Gollapudi, NTR Dist., ✆ 77804 00453

MEDICAL

Wanted Packing boys for Medical Agencies Srinivasa Drugs, Bhavanipuram, Vijayawada. Ph: 97040 71271.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సీతారామయ్య, లితీష్

ముగిసిన క్రికెట్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే : తెలుగు యువత నియోజకవర్గ నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మైలవరం నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన మైలవరం జట్టుకు తెదేపా నాయకుడు జంపాల సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన ట్రోఫీని అందించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

గంపలగూడెం, న్యూస్‌టుడే : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని ముస్లింలు గురువారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని సాయంత్రం మసీదుల్లో ఇఫ్తార్ విందును సామూహికంగా స్వీకరించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని మసీదులను విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ఊటుకూరు మసీదులో విందు స్వీకరిస్తున్న ముస్లింలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తాగునీటి కుళాయి కనెక్షన్ కోసం కొందరు కొండపల్లి ప్రధాన రహదారిని తవ్వుతున్నారు. అనంతరం దాన్ని అలాగే వదిలేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. - **రాఘవేంద్రరావు, కొండపల్లి** ✔ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. - **పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ** - **న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

స్పందన: విస్సన్నపేటలోని ప్రధాన రహదారుల వెంట చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

సైబర్ నేరాలపై అవగాహన

కొండపల్లి, న్యూస్‌టుడే : సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే బాధితులు స్పందించి ఫిర్యాదు చేయాల్సి ఉందని సైబర్ క్రైమ్ ఎస్సై విజయలక్ష్మి అన్నారు. కొండపల్లి బి.కాలనీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరస్థులు ముఖ్యంగా వృద్ధులను టార్గెట్ చేసుకొని వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి మోసాలపై అవగాహన ఉంటేనే నష్టపోకుండా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటకు తెగుళ్లు.. కాయల్లేవు

నిరాశకు గురవుతున్న అన్నదాతలు

మైలవరం, న్యూస్‌టుడే

మామిడి తోటలను ఆశిస్తున్న తెగుళ్లు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. అసలే పూతల ఆలస్యంతో ఆందోళనలో ఉన్న వారికి మాడిపోతున్న పూతలు భయం పుట్టిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ఆదాయం కళ్లజూడని అన్నదాతలకు ఈ ఏడాది తీవ్ర నిరాశనే మిగుల్చుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత దశలోనే వేలాది రూపాయల పెట్టుబడులు పెడుతున్నా పిందె నిలవడం లేదని వాపోతున్నారు.

కోలుకోలేని దెబ్బతీస్తూ..

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 42 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు సాగవుతున్నాయి. దశాబ్ద కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులను కరోనా సమయం నుంచి కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ఆశించిన దిగుబడులు రాక తీవ్ర ఇబ్బందులు పడగా, రెండేళ్లుగా మిర్చి తోటలను నాశనం చేసిన తెగుళ్లు మామిడిని కబళించడంతో పూత దశలోనే అన్నదాతల కంట కన్నీరొస్తోంది. రెండు నియోజకవర్గాల పరిధిలో రెడ్డిగూడెం మండలంలో మాత్రమే ముందస్తుగా కొన్ని తోటల్లో మామిడి కాయల దిగుబడి వచ్చింది. కొందరు రైతులు కాయలకు కవర్లు కట్టుకొని గిరాకీకి అనుగుణంగా మంచి ధరలతో లాభం పొందుతున్నారు. అయితే అటువంటి రైతులు కేవలం నాలుగైదు శాతం కూడా లేరని పలువురు అంటున్నారు.

నాలుగైదు సార్లు పిచికారీ

పూతల కోసం ఒక పర్యాయం డిసెంబరులోనే రసాయన మందులను పిచికారీ చేసిన రైతులు, పూతల ప్రారంభమైన దగ్గరి నుంచి కనీసం నాలుగు నుంచి అయిదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎకరానికి సుమారు రూ.20 వేలకు పైగా ఖర్చు చేశారు. అయినా చాలా వరకు తోటల్లో కనీసం పూతలో పది శాతం కూడా మిగలేదని కర్షకులు చెబుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే పూతంతా రాలిపోయిందని వాపోతున్నారు. కోడి పేనుగా పిలుచుకునే రెండు రకాల నల్లితో తోటలు నాశనం కావడమే గాక సాయంత్రం తర్వాత రోడ్లపై నడవాలంటేనే వాటితో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

మైలవరం మండలం చంద్రాలలో విరగబూసిన మామిడి చెట్టు

సంచులు కడితేనే..

తెగుళ్ల నుంచి తేరుకునేందుకు మైలవరం నియోజకవర్గంలోని రెడ్డికుంట, సాయన్నపాలెం, ఎదురుబీడెం తదితర గ్రామాల్లో రైతులు పండ్ల కవర్లతో మామిడి కాయలను రక్షించుకున్నారు. అటువంటి ప్రాంతాల్లో దిగుబడులు తొందరగా రావడంతో బంగినపల్లి రకం టన్ను రూ.1.70 లక్షల వరకు ధర పలికింది. దాంతో పూర్తి స్థాయిలో కవర్లు కట్టుకునేలా చర్యలు తీసుకుంటే మేలు కలుగుతుందని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్ల నివారణ సైతం అదే పరిష్కారమని చెబుతున్నారు.

హిందీ భాష ప్రాధాన్యంపై వ్యాసరచన పోటీలు

పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా మాసోత్సవం నిర్వహించారు. జాతీయ భాష హిందీ ప్రాముఖ్యతపై విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయిని ఎంఎఫ్ఎస్ఎస్.రత్న ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బాలబాలికలకు బహుమతులు అందజేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : భాషోత్సవాల్లో భాగంగా గురువారం చెవుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ నిర్వహించారు. ప్రముఖ హిందీ కవులు కబీర్‌దాస్, ప్రేమ్‌చంద్, తులసీదాస్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వాహనాలు సమకూర్చేలా కృషి

డ్రైవింగ్ శిక్షణ పొందే మహిళలతో కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే : మహిళలు తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రైజ్ ఆసరాతో ముందుకెళ్లాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. గుంటుపల్లిలోని రైజ్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలకు కారు డ్రైవింగ్ శిక్షణను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకొని డ్రైవింగ్‌ను వృత్తిగా నేర్చుకోవాలని చెప్పారు. అటువంటి మహిళలకు ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేస్తూ వాహనాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, ఆర్‌టీవో ప్రవీణ్, రైజ్ ఛైర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ రజనీకుమారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రంగాపురం కేజీబీవీని ఏపీసీ రజనీకుమారి గురువారం సందర్శించారు. బుధవారం రాత్రి అధికారులు నిర్వహించిన తనిఖీలో అదనంగా ఉన్న విద్యార్థుల స్థానంలో చేస్తున్నట్లు వివరాలను ఎంఈవో- 2 రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. ఎస్వో శ్యామలపై ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు రిపోర్టు చేస్తామని, అవసరమైతే క్రిమినల్ కేసు కూడా పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో- 1 శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడీఏ రంగారావు ప్రభుత్వానికి సరెండర్

గంపలగూడెం, న్యూస్‌టుడే : గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఏడీఏ ఎ.రంగారావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి డీఏవో ఎం.విజయ కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురి చేసిన ఫిర్యాదు మేరకు ఏడీఏపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారావు ఎ.కొండూరు ఏవో బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఏడీఏగా తిరువూరు ఏవో పి.పద్మ, ఎ.కొండూరు ఇన్‌ఛార్జి ఏవోగా మైలవరం సాంకేతిక ఏవో ఆర్.వాసుదేవ్‌ను నియమిస్తూ డీఏవో ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులో నీరు తొలగించాలి

మైలవరం: మరమ్మతుల పనుల కోసం చెరువులోని నీరు తొలగించి పనులు పూర్తి చేసుకునేందుకు అనుమతించాలని మండలంలోని గణపవరానికి చెందిన తెదేపా నాయకులు, పలువురు రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గణపవరం చెరువు కట్ట తెగిందని, తూము మరమ్మతులకు అధికారులు అంచనాలను ఆమోదించిన నేపథ్యంలో పనులు చేయడానికి నీరు అడ్డంగా ఉందని చెప్పారు. నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్, నాని తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

కొండపల్లి, న్యూస్‌టుడే : ఏళ్ల నుంచి ఆయుర్వేద ఆసుపత్రి కోసం ఎదురుచూస్తున్న కొండపల్లి వాసుల కల త్వరలో తీరనుందని పురపాలక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి బి.కాలనీ వద్ద ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలక వైస్ ఛైర్మన్ శ్రీను, జనసేన నాయకుడు రామ్మోహనరావు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్, కౌన్సిలర్లు

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని వినతి

గోదపత్రులను అవిష్కరిస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలోని కలెక్టరేట్ వద్ద 36 గంటల దీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి జి.సీతారామిరెడ్డి తెలిపారు. మండలంలోని తోటమూలలో గురువారం ఆయన అధ్యక్షతన మండల కౌలు రైతుల సంఘ సమావేశం నిర్వహించారు. దీక్షకు సంబంధించిన గోడ పత్రులు ఆవిష్కరించారు. భూమి లేని కౌలు రైతులను గుర్తించాలని, అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. నాయకులు ఎం.వెంకటరెడ్డి, జి.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పూర్తి చేయండి

గొల్లపూడి : కుటుంబ సర్వేను సచివాలయ ఉద్యోగులు వేగంగా పూర్తి చేయాలని విజయవాడ గ్రామీణ మండలం ఎంపీడీవో విగ్నేష్ తెలిపారు. గొల్లపూడిలోని కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన గురువారం సమావేశమై మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల బాధ్యులు విద్యాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం'

జి.కొండూరులో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక కేడీసీసీబీ ఆవరణలో మైలవరం నియోజకవర్గ పరిధిలోని 24 సహకార సంఘాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన దీక్ష గురువారం కొనసాగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

తిరువూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు తిరువూరులో నిరసన తెలిపారు. సమాఖ్య రాష్ట్ర నాయకుడు బొల్లినేని రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత అవసరం

గొల్లపూడి : విద్యుత్తు మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తెలిపారు. ఏపీ విద్యుత్తు మీటర్ రీడర్ల రాష్ట్ర కమిటీ సమావేశం గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్ట్రాక్ట్ సంస్థనే నమ్ముకొని విద్యుత్తు మీటర్ రీడర్లు పని చేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నాయకులు వెంకటసుబ్బయ్య, బాలాజీ, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ముళ్ల పొదలు తొలగించరూ..

జి.కొండూరు పోలీస్ స్టేషన్ నుంచి మునగపాడు వెళ్లే బైపాస్ రహదారి వరకు ముళ్ల పొదలు పెరిగాయి. ప్రధానంగా జి.కొండూరు శివారు గొల్లగూడెం సమీపంలోని మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

వైద్యానికి దూరం.. వెస్ట్ మాధవరం

మండల పరిధిలోని వెస్ట్ మాధవరంలో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈస్ట్, వెస్ట్ మాధవరంలో మొత్తం 2,900 మంది జనాభా ఉన్నారు. ఇక్కడున్న ప్రాథమిక ఉప కేంద్రంలో ఎంయల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) వీరికి వైద్యం అందించాల్సి ఉండగా ఆమె కొంత కాలంగా అందుబాటులో లేరు. దీనిపై గ్రామస్థులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వేముల స్వాతికి బుధవారం వినతి పత్రం కూడా అందించారు. - **న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

నీటి ఎద్దడితో నివాసితుల గగ్గోలు

మండల పరిధి కొండపర్వలోని కొత్తకుంట చెరువు దగ్గర ఉన్న పంచాయతీ బోరు సరిగా పని చేయడం లేదు. దీనికి తోడు మంచినీరు లీకై వృథా కావడంతో సక్రమంగా నీరందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఏళ్ల కిందట వేసిన పైపులు తుప్పుపట్టి పలుచోట్ల లీకై మురుగు చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

రక్షణ గోడలు లేక.. ప్రమాదాల బాట

విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి నుంచి అట్లప్రగడ వెళ్లే రోడ్డులో ఎరుకుల వాగుపై ఉన్న చప్టాకు ఇరువైపులా రక్షణ గోడలు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది నిర్మించిన నాటి నుంచి పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

కోతకు గురైన రోడ్డు.. అన్నదాతకు వెతలు

కుదుపల్లె పద మర వైపునున్న పోలాలకు వెళ్లే రహదారిలో చప్టా దగ్గర రోడ్డు కోతకు గురై గొయ్యి ఏర్పడింది. నిత్యం రైతులు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల మీద వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు రాకపోకలు సాగిస్తారు. వాహనాలు ఎదురైనప్పుడు తప్పుకోవాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

గ్రూప్స్ విజేతలకు సన్మానం

వైష్ణవిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు, సులోచన తదితరులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో విజేతలుగా నిలిచిన ముదిరాజ్ విద్యార్థులు అంగజాల వైష్ణవి, రొయ్యల సాయికుమార్‌ను రాష్ట్ర ముదిరాజ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సులోచన ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వైష్ణవి నివాసంలో నిర్వహించిన సమావేశంలో పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ముదిరాజ్ విద్యార్థులకు సాయం అందిస్తామన్నారు. నియోజకవర్గ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తొట్టి నిండితేనే.. తీరుతుంది దాహార్తి

పొలాలకు మేతకు వెళ్లే పశువుల దాహార్తిని తీర్చాల్సిన సమయం ఆసన్నమవుతోంది. వేసవిలో పశువులకు ఆసరాగా ఉండేలా గతేడాది ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి తొట్లెలు నిర్మించారు. ఫిబ్రవరి చివరికి చేరుకోవడంతో వాటిల్లో నీరు నింపేందుకు పంచాయతీలు సిద్ధం కావాల్సి ఉంది. మైలవరం పంచాయతీ భవానీనగర్ సమీపంలోని తొట్టెలో ఇప్పటికే ఇలా నీరు నింపారు. - **న్యూస్‌టుడే, మైలవరం**

మరాఠా యోధుడు ఛత్రపతికి నివాళి

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండల పరిధి పెనుగొలనులోని ప్రాథమిక పాఠశాలలో (బీసీ) గురువారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

శివాజీ చిత్రపటం వద్ద చిన్నారులు, ఉపాధ్యాయులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి నిర్వహించారు. దాదాసాహెబ్ పవార్, రాజ్‌కుమార్ పవార్, సంతోష్ తోరత్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో..

వెండి తాపడానికి విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో సహ దేవత అంకమ్మ అమ్మవారికి వెండి తాపడం చేయించడానికి దాతలు విరాళం అందించారు. విజయవాడ కానూరుకు చెందిన లక్ష్మీ ప్రశాంత్ కుమార్, సుష్మ దంపతులు, పెనుగంచిప్రోలుకు చెందిన రేగండ్ల సైదులు దంపతులు, రేగండ్ల రవికుమార్‌ల ద్వారా రూ.10,116 అందజేశారు.

21న హుండీల లెక్కింపు

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. అధికారులు, దేవస్థాన ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు సమక్షంలో లెక్కిస్తున్నట్లు చెప్పారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రజా అవగాహనతోనే ప్రమాదాల నివారణ జరగాలని ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం అన్నారు. ఎన్‌హెచ్ఏఐ(30) ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి ప్రాంతంలోని సెంట్రల్ లైటింగ్ మరమ్మతులను ఆమె గురువారం పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం కూడలికి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సూచనలిస్తున్నడీసీపీ షిరీనా బేగం

జి.కొండూరు, న్యూస్‌టుడే : నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ డీసీపీ షిరీనాబేగం కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున ఆమె గురువారం జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్‌కు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. అదనపు ఎస్సై గిరిజామణి, సిబ్బంది పాల్గొన్నారు.

77 మందికి వైద్య పరీక్షలు

ఎ.కొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పలువురు రోగులను వైద్యుడు విశ్వనాథ్ పరీక్షించి మందులు అందజేశారు. మొత్తం 77 మందిని పరీక్షించగా వారిలో 27 మంది కిడ్నీ సంబంధిత రోగులు ఉన్నారని గుర్తించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వేముల స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న సుబ్బారావు, రాజా, కూటమి శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం బాధితులకు ఆసరాగా నిలుస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో కూటమి శ్రేణులతో కలిసి 11 మంది లబ్ధిదారులకు రూ.4,35,010లు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కవులూరి రాజా, పార్టీ మండల కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, పుట్రేల మారెమ్మ గుడి ఛైర్మన్ కేరళ శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దూడలు సంచరించే ప్రాంతాలను శుభ్రంగా ఉంచండి

మూలపాడు (ఇబ్రహీంపట్నం గ్రామీణం): లేగ దూడల సంరక్షణలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ పెంపకందార్లు వాటిని సంరక్షించాలని పశు సంవర్ధక శాఖ నంది గామ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి అన్నారు. లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మూలపాడులో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దూడలు సంచారం చేసే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటికి సరైన టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, మోహన్ కిషోర్, శైలుమాధురి పాల్గొన్నారు.



లేగ దూడలతో పాడి రైతులు, వైద్యులు

మండల పరిషత్ పరిపాలనాధికారి మృతికి నివాళి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్ పరిపాలనాధికారి సీహెచ్.కమలవిష్ణు(58) మృతి చెందారు. గుండె సంబంధిత వ్యాధికి చికిత్స నిమిత్తం వారం కిందట ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. గురువారం సాయంత్రం శస్త్రచికిత్సకు సిద్ధం చేస్తుండగా ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వస్థలం అవనిగడ్డ కాగా ఉద్యోగరీత్యా గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, తిరువూరు, విస్సన్నపేట, చాట్రాయి మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేశారు. ఆయన మరణ వార్త తెలియగానే స్థానిక కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఎంపీటీసీలు, నాయకులు విచారం వ్యక్తం చేశారు.

కమల విష్ణు (పాత చిత్రం)

అనుమానాస్పద స్థితిలో కాపలాదారు..

కొండపల్లి, న్యూస్‌టుడే: కాపలాదారు మృతి చెందిన సంఘటన కొండపల్లి పారిశ్రామికవాడలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. కొండపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన తమ్మిశెట్టి కోటేశ్వరరావు(54) గురువారం ఉదయం తన విధులకు హాజరయ్యాడు. సాయంత్రానికి పక్కకు ఒరిగి పడిపోయాడు. కంపెనీలోని ఇతర ఉద్యోగులు చూసే సరికి ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నరసాపురం-చాట్రాయి రోడ్డు మరమ్మతులకు నోచుకోక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా చాట్రాయి వైపు నుంచి విస్సన్నపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కొందరు రైతులు, వాహనదారులు గమనించి అతడిని ఆసుపత్రికి తరలించారు.

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ

రాజును సత్కరిస్తున్న రంగబాబు, మూర్తి తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మైలవరం ఇన్‌ఛార్జి ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న బండి రాజు గురువారం జి.కొండూరు మండల విద్యాశాఖాధికారి- 1గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రంగబాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పీటీఎస్ఎన్ మూర్తి, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల విద్యాశాఖాధికారి- 1 కుమ్మరి శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో- 2.పి.రమేష్ బాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ తూర్పు

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణను ఒక ఉద్యమ తరహాలో చేపట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని హెచ్ ఫౌండేషన్ కో ఛైర్‌పర్సన్, మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎలిజిబెత్ రాణి అన్నారు. బెంజ్ సర్కిల్‌లోని ఓ హోటల్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టే చర్యలకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలు తదితర విభాగాలకు సంబంధించి సుమారు 38 వేల పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు పంపిణీ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రెండు పుస్తకాలు తీసుకెళ్లవచ్చని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందన: 3వ డివిజన్ కరెన్సీనగర్, శ్రీరామచంద్ర నగర్, బాయన బాబూజీ రహదారి ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి గజలక్ష్మి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయించి పొగ పెట్టించారు.

★ 5వ డివిజన్ క్రీస్తురాజపురం ప్రధాన రహదారిలో భూగర్భ డ్రైనేజీ పొంగుతోందని స్థానిక నివాసి పాపారావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించారు. ★ 3వ డివిజన్ కామినేని నగర్ 3-10/154 విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి పద్మావతి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. -న్యూస్‌టుడే, కరెన్సీనగర్

మై టీడీపీ యాప్ పోస్టర్ల ఆవిష్కరణ

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు, లీడర్ టు క్యాడర్ వరకు ప్రతి సమాచారాన్ని అందించేందుకు మంత్రి లోకేష్ ఆలోచనలతో మై టీడీపీ యాప్ రూపొందించారని తెదేపా నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి గద్దె క్రాంతి కుమార్ మై టీడీపీ యాప్ పోస్టరు, బ్యానర్లు ఆవిష్కరించారు. నాయకులు గాబ్రియేలు, రమేష్, దేవానంద్, బాబురావు, రమేష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినిపించుకోరు.. కన్నెత్తి చూడరు!

తొమ్మిదేళ్లుగా పునాది దశ దాటని ఈఎన్‌టీ బ్లాక్

న్యూస్‌టుడే; విజయవాడ వైద్యం

విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభమై.. పునాదుల దశలోనే ఉన్న భవనమిది. ఈఎన్‌టీ, ఆప్తమాలజీకి ప్రత్యేక బ్లాక్ ఉండాలన్న తలంపుతో దీని నిర్మాణం ప్రారంభించారు. పునాదుల దశలో ఆగిపోయిన దీని నిర్మాణంపై రోగుల విజ్ఞప్తులు పాలకుల చెవులకు వినిపించడం లేదు.. కనీసం ఈ భవనం ఏస్థాయిలో ఉందో చూడాలని కోరుతున్నా.. కన్నెత్తి చూడటం లేదు.

కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఎక్కువ రోగులు ఈఎన్‌టీ, ఆప్తమాలజీ విభాగాలకు వస్తుంటారు. ఆప్తమాలజీలో ప్రతి రోజు 570కి పైగా రోగులు ఓపీకి వస్తే.. వీరిలో 20 మందికి పైగా ఐపీగా చేరుతుంటారు. ఇక ఈఎన్‌టీ విభాగానికి ప్రతి రోజు 620 మందికి పైగా రోగులు ఓపీకి వస్తుంటే.. వీరిలో 40 మంది ఐపీగా చేరుతుంటారు. ఈ రెండు విభాగాలు ఆసుపత్రిలో కీలకం. ఈ రెండు విభాగాలకు కలిపి ప్రత్యేక బ్లాక్ ఏర్పాటుచేయాలని 2014- 2019 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం యోచించింది.

ఆసుపత్రిలోని సీబ్లాక్ పక్కనే ఈఎన్‌టీ, ఆప్తమాలజీ సేవలకు ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ.5.7 కోట్ల అంచనా వ్యయంతో 2017లో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు హుటాహుటిన పనులు ప్రారంభించారు. పునాదులు లేపారు. అందులో జీ+3 భవనం నిర్మించేలా పనులు చేపట్టారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ప్రస్తుతం చిట్టడివిలా దర్శనమిస్తోంది. ఇక్కడ విష కీటకాలు తిరుగుతున్నాయని వైద్య విద్యార్థులు అంటున్నారు.

☛ 2019 ఎన్నికలకు ముందు వైకాపా నాయకులు ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టాక జగన్‌మోహన్‌రెడ్డి కనీసం ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. 2019 డిసెంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు మరో రూ.3.9 కోట్లు వెచ్చిస్తే భవనం పూర్తవుతుందని అంచనా వేసి డీపీఆర్ పంపారు. కాని వైకాపా దీనిని ఉద్దేశపూర్వకంగా మూలకు చేర్చిందని వైద్యులు, విద్యార్థులు, రోగులు ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు. పూర్తి స్థాయి హంగులతో దీని నిర్మాణం చేపట్టాలంటే మరో రూ.12.8 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులా? అధికారి దృష్టికి తీసుకురండి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావుతో ఫోన్‌ఇన్ నేడు

తూర్పు నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయా? మీ ప్రాంతంలో రోడ్లపై ఆక్రమణలు వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్నాయా? యూటర్న్‌ల పరంగా సమస్యలున్నాయా? ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగడం లేదా? రోడ్డుపై భారీ వాహనాలు ఆపి ఇబ్బంది పెడుతున్నారా? ఇంకా ఏ ఇతర ఇబ్బందులున్నా.. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సినదంతా కింద సెల్ నంబర్‌కు ఫోన్ చేయడమే. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

91778 36200 | 20.02.26 శుక్రవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కృష్ణలంక ప్రాంత సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా బీసీ నేత కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. కనకదుర్గమ్మ వారధికి రెండు వైపులా పెద్ద మొత్తంలో జాతీయ రహదారుల విభాగానికి చెందిన స్థలాలు ఉన్నట్లు చెప్పారు. కృష్ణలంక ప్రాంతంలో కల్యాణ మండపం, డిగ్రీ కళాశాల, మోడల్ పాఠశాలలు లేనందున ఎన్‌హెచ్ వద్ద స్థలాన్ని తీసుకుని ఈప్రాంతానికి న్యాయం చేకూర్చాలని కోరారు. ఈ ప్రాంతంలోని అన్ని పార్టీల నాయకులు, పెద్దలతో చర్చించి ఖాళీ స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని లేని పక్షంలో యువతతో ఉద్యమ బాట పట్టాల్సి ఉంటుందని శివాజీ హెచ్చరించారు.

బిల్ గేట్స్ రాకను తప్పుపడితే ఎలా..

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, న్యూస్‌టుడే: తన కంపెనీల ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించిన బిల్ గేట్స్ వంటి గొప్ప వ్యక్తి రాష్ట్ర సందర్శనకు వస్తే దాన్ని కూడా వైకాపా నేతలు తప్పు పట్టడం దురదృష్టకరమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని రఘు రోడ్డులో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డి సావిత్రికి జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువైన బడ్డీ కొట్టును ఆమెకు అందజేశారు. బిల్‌గేట్స్ మొదటిసారిగా భారత్ వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు వారిని ఒప్పించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీని పెట్టించాకే అది ప్రపంచ స్థాయి నగరంగా మారిందన్నారు. బిల్ గేట్స్ అమరావతికి రావడాన్ని స్వాగతిస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన సహకారం అందించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. జనసేన నాయకుడు గాదిరెడ్డి అమ్ములు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారు మరణిస్తే ఆ మృతదేహాన్ని ఉంచడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, రుద్రభూమిలో మృతదేహాన్ని ఉంచేందుకు ఒక చిన్న గదిని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. నాయకులు సింగంశెట్టి రమేష్, శేషుబాబు, ఈశ్వరరావు, పవన్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

పటమట: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఆటోనగర్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య తంగెళ్లమూడి వారి వీధి, హైస్కూల్ రోడ్, చిన్నిగారి రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ హరిబాబు తెలిపారు.

జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో నగర ఆర్చర్ల సత్తా

బొమ్మదేవర ధీరజ్

కుందేరు వెంకటాద్రి

ధ్రువపత్రం అందుకుంటున్న యుక్తశ్రీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం కొచ్చిలో ఈ నెల 10 నుంచి 19 వరకు జరిగిన 3వ ఎన్టీపీసీ జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో నగరానికి చెందిన పలువురు ఆర్చర్లు సత్తా చాటారు. సీనియర్ పురుషుల రికర్వ్‌లో బొమ్మదేవర ధీరజ్ పసిడి, సీనియర్ పురుషుల కాంపౌండ్‌లో కుందేరు వెంకటాద్రి కాంస్యం, కొండపావులూరి యుక్తశ్రీ జూనియర్ మహిళల రికర్వ్‌లో రజతం, సబ్ జూనియర్ రికర్వ్‌లో కాంస్యం, తాడిబోయిన వైష్ణవి జూనియర్ రికర్వ్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. పతకాలు గెలుపొందిన ఆర్చర్లను రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కార్యదర్శి బెవర వెంకట రమణ, ఇతర కార్యవర్గ సభ్యులు అభినందించారు.

కారు డ్రైవర్‌పై పోక్సో కేసు

చిట్టినగర్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కారు డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు తెలిపారు. సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. ఆమెను హేమంత్ సాగసాయి (23) అనే యువకుడు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కరుణ కేసు నమోదు చేయగా పశ్చిమ ఏసీపీ ఎన్ఎస్‌వీకే దుర్గారావు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్షరాంధ్రలో అతివలు

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

ఏ రాష్ట్రమైనా దేశమైనా అభివృద్ధి చెందాలంటే సంపూర్ణ అక్షరాస్యతతోనే సాధ్యమవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నా కనీసం అక్షర జ్ఞానం అవసరం. వివిధ రూపాల్లో జరిగే మోసాలు వల్ల నిరక్షరాస్యులు నష్టపోతున్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే రీతిలో కుటుంబంలో వెలుగులు కురవాలంటే ముందు వారు అక్షరజ్ఞానులు కావాలని ప్రభుత్వం తలచింది. వారి జీవితాల్లో అక్షరకాంతులు నింపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గతంలో ఉన్న ఉల్లాస్ స్థానంలో 'అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టింది. ముందుగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ తీర్చిదిద్దుతోంది.

నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మెప్మా ఆధ్వర్యంలో నిరక్షరాస్యులైన మహిళలకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండగ సెలవులు తర్వాత నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వాలంటీర్లు ఈ అభ్యసన తరగతులు నిర్వహిస్తున్నారు. చదువు నేర్చుకునేందుకు వచ్చిన వారందరికీ పుస్తకాలు పంపిణీ చేశారు.

తూర్పు నియోజకవర్గంలో ఇలా..	
మొత్తం స్వయం సహాయక సంఘాలు	4702
వీటిలో సభ్యులు	47020
నిరక్షరాస్యులైన సభ్యులు	6223
వాలంటీర్లు	913

అక్షరాలు నేర్పిస్తూ... అవగాహన కల్పిస్తూ

నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాలు, పదాలు రాయడం, పలకడం, అంకెలను గుర్తించడం, డిజిటల్ లావాదేవీలపై వాలంటీర్లు అవగాహన కల్పిస్తున్నారు. బొమ్మలతో కూడిన చిత్రాలను వాటి ఎదురుగా వస్తువులు కన్పించేలా అర్థమయ్యే రీతిలో అక్షర జ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. వారికిచ్చిన పుస్తకంలో కుటుంబం, ఇరుగు పొరుగు వారితో ఎలా వ్యవహరించాలి, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత- ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లలపెంపకం- మన బాధ్యత, చట్టాలు తెలుసుకుందాం, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలు బోధిస్తున్నారు. కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం, కొలతలు, గడియారంలో సమయం తెలుసుకోవడం, బ్యాంకు పత్రాలు, డిజిటల్ సంఖ్యలు గురించి తెలియజేస్తున్నారు. అభ్యసన తరగతులతోపాటు నమూనా పత్రాలను ఇచ్చి సాధన చేయిస్తున్నారు. దృశ్యశ్రవణ విధానాన్ని అనుసరించి శిక్షణ ఇస్తున్నారు.

ఓ కేంద్రంలో నిరక్షరాస్యులు

సంపూర్ణ అక్షరాస్యులుగా మార్చాలనేదే లక్ష్యం

మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. అందుకనుగుణంగా వాలంటీర్లు సాయంత్రం సమయాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. నిర్దేశించిన సమయంలో వారికి అక్షరాలు నేర్పించడంతోపాటు సమాజంపై అవగాహన కల్పిస్తున్నారు. - ఉమామహేశ్వరి, సీడీవో

అసంపూర్తిగా వదిలేసి..

బెంజిసర్కిల్ ఫకీరు గూడెం వైపు ఉన్న సర్వీస్ రహదారిని కొంతమేర అభివృద్ధి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో దారి ఎగుడు దిగుడుగా మారి ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రాణ సంకటంగా మారింది. సర్వీసు రోడ్డును తక్షణం అభివృద్ధి చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ)

వేగం నిరోధించేదెలా?

బృందావన కాలనీలో ప్రధాన రహదారికి అనుసంధానంగా అంతర్గత దారులు కలిసే చోట ప్రమాదాలు జరగకుండా నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన వేగ నిరోధకాలు విరిగిపోయాయి. దీంతో వాహనదారులు వేగంగా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొత్త వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లబ్బీపేట(విజయవాడ సిటీ)

ఎన్నాళ్లకు తొలగిస్తారో...

19వ డివిజన్‌లోని అనంత్ డైమండ్స్ హోమియో హాస్పిటల్ ఎదురుగా ఉన్న రహదారి పక్కన వ్యర్థాలు నెలకొన్నాయి. చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లబ్బీపేట(విజయవాడ సిటీ)

వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు

రాణిగారి తోట 18వ డివిజన్ శ్రీ కోదండరామాలయం పరిసరాల్లో వాహనాల పార్కింగ్ ఇటీవల అధికమైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించాల్సిందిగా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

చెట్ల కొమ్మలు తరలించరూ..

కృష్ణలంక 20వ డివిజన్‌లో విద్యుత్తు విభాగం సిబ్బంది విద్యుత్తు తీగలకు అవరోధం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించారు. కొమ్మలను తొలగించి రోజులు గడుస్తున్నా పారిశుధ్య సిబ్బంది వాటిని తరలించకపోవడంతో ఇబ్బంది తలెత్తుతోంది. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

మురుగు పారక ఇక్కట్లు

కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డులోని కాలువ వ్యర్థాలతో నిండి దుర్గంధం వ్యాపిస్తోంది. హోటల్ వ్యర్థాలు తరచూ డ్రెయిన్‌లోకి రావడంతో దుర్వాసన వస్తోందని పాదచారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు పూడిక తీసినా మరలా వ్యర్థాలు చేరి దోమలు పెరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. తక్షణం మురుగు తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

తాళపత్రాల లిపి ఎంతో కీలకం

విద్యార్థులతో ఇందిర, అధ్యాపకులు

కరెన్సీనగర్: దేశ రాజకీయ, సామాజిక, సాహిత్య, శాస్త్రీయ చరిత్రను పునర్నిర్మించడంలో తాళపత్రాల లిపి కీలకపాత్ర పోషిస్తోందని పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ఎపిగ్రాఫిస్ట్, ఫెలో డాక్టర్ ఇందిర మలపాక అన్నారు. ఆంధ్రా లయోల కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో 'తాళపత్రం- మాన్యుస్క్రిప్ట్‌ల కళ- శాస్త్రం' అంశంపై గురువారం అతిథోపన్యాసం జరిగింది. తాటి ఆకులను తాళపత్రాలుగా మార్చడం, వాటిపై లిఖించడం, సంరక్షించడం వంటి శాస్త్రీయ ప్రక్రియలను ఆమె వివరించారు. తొలుత కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజిలో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాచీన చరిత్ర వివరించడానికి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, విభాగాధిపతి మొవ్వా శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు బి.కల్యాణి పర్యవేక్షించారు.

శాప్ లీగ్ చదరంగం పోటీలకు స్పందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17న అన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీలకు విశేష స్పందన లభించిందని శాప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో అండర్-13, 15, 17, 19 బాలబాలికల విభాగాల్లో 2,445 మంది తలపడగా వీరి నుంచి 360 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీలో వీరంతా తలపడతారన్నారు. 12-20 సంవత్సరాల్లోపు క్రీడాకారుల కోసం రూపొందించిన ఈ లీగ్ పోటీలు 31 క్రీడాంశాల్లో ఏడాది పొడవునా నిర్వహిస్తామన్నారు. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి.. ఈ శాప్ లీగ్ చెస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతం

విద్యార్థినుల పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాలు సొంతమవుతాయని ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియా పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల మైదానంలో రెండు రోజులపాటు నగరంలోని ప్రముఖ పది మహిళా సంస్థల ఆధ్వర్యంలో 'గ్రాండ్ స్ప్రింట్ స్పోర్ట్స్' పేరుతో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థినులకు గెలుపోటములు ముఖ్యం కాదని క్రీడా స్ఫూర్తితో తలపడాలన్నారు. విద్యార్థినులకు ఇంత పెద్ద ఎత్తున ఆటల పోటీలు నిర్వహిస్తున్న మహిళా సంస్థలను ఇలక్కియా అభినందించారు. కళాశాల పూర్వ డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ఎంబీవీకే బాధ్యులు, పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో నగరంలోని సుమారు 26 కళాశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థినులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సేఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు రావూరి సత్యవతి అధ్యక్షత వహించగా.. సేఫ్ సభ్యురాలు ఎం.శేషారత్నం, తరుణి తరంగాలు సభ్యులు ఉషారాజ, ఇన్నర్ వీల్ సన్‌షైన్ అధ్యక్షురాలు భవితా జైన్, వన్ ఎర్త్-వన్ లైఫ్ బాధ్యురాలు లీలా కుమారి, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్ బాధ్యురాలు ఎ.సంధ్య, స్పృహాస్తి బాధ్యులు భారతి, మాధురి, ఎంబీవీకే సభ్యులు పి.విజయలక్ష్మి, రాయల్ క్లబ్ బాధ్యులు శ్యామల, అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

అంతర్‌వర్సిటీ మహిళా చెస్ పోటీలకు 'ఎన్టీఆర్' జట్టు ఇదే

జట్టు సభ్యులతో వర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయి సుధీర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలోని గీతమ్ డీమ్డ్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళా చెస్ పోటీలో తలపడే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి గురువారం వెల్లడించారు. ఈ జట్టుకు ఆర్.గున్నాజీ (పీడీ, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, విశాఖపట్నం) మేనేజరుగా, కె.రామకృష్ణారావు కోచ్‌గా నియమితులయ్యారు. ఎంపికైన జట్టు సభ్యులను వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయి సుధీర్ అభినందించారు. వర్సిటీ జట్టులో ఎం.సాయి దివ్య (సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ), ఎన్.సాత్విక (కాటూరి వైద్య కళాశాల, గుంటూరు), బి.నివేదిత బాయ్ (ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలు), ఎ.శ్రీనిధి (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, చిన్నఅవుటపల్లి), రిన్సీ దీపిక కె. (గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు), డి.అమూల్య (రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ)స్థానం పొందారు.

విద్యుత్తు స్తంభం తొలగింపునకు చర్యలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని రమేష్ ఆస్పత్రి కూడలి వద్ద రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగించాలంటూ 'రాకపోకలకు అడ్డుగా స్తంభం' శీర్షికన ఈనాడులో గురువారం వచ్చిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. దాన్ని తొలగించాలని నిర్ణయించారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మార్కింగ్ చేస్తే ఆ మేరకు స్తంభాన్ని పక్కకు జరుపుతామని ఏఈ ఫణీంద్ర తెలిపారు.

దుర్గగుడి సమాచారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం: 5 గంటల నుంచి భక్తులను క్యూలైన్లో అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, 7 గంటలకు రుద్ర హోమం, 7.30 గంటలకు నవగ్రహ శాంతి హోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30 గంటలకు చండీహోమం నిర్వహిస్తారు. పూజా మండపంలో ఉదయం 7.30 గంటలకు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు. ❖ అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఈ సమయంలో అన్ని క్యూలైన్లు నిలిపి వేస్తారు.

మధ్యాహ్నం: ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు.

సాయంత్రం: 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 గంటల నుంచి 7 గంటల వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు నిర్వహిస్తారు. ఈ సమయంలో అన్ని దర్శనాలు నిలిపి వేస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

❖ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టికెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే అనుమతిస్తారు.

/www.kanakadurgamma.com,https:///www.aptemples.ap.gov.in వెబ్ సైట్లలో ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సాప్ నంబరు 95523 00009లో ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

❖ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

❖ దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం, అర్జున వీధిలో ఆన్‌లైన్ కౌంటర్లలో దర్శనం, ఆర్జిత సేవల టికెట్లు తీసుకునేందుకు వీలుగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

కౌన్సిల్ అజెండాపై సమావేశం

చర్చిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ అజెండాపై వివిధ విభాగాల అధిపతులతో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 21న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలోని ప్రతిపాదనలపై చర్చించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలపై అధికారులు సహకారం అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు, సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఎంహెచ్‌ఓ కె.అర్జునరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి కె.ప్రభుదాస్, ఎస్టేట్ అధికారి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

మాట్లాడుతున్న క్రాంతి కుమార్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ కోరారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్క్యూ బ్రిడ్జి సమీపంలోని ఇస్కాన్ మందిరం వద్ద నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యువత సోషల్ మీడియాకు బానిసలుగా మారకుండా శివాజీ వంటి మహనీయుల చరిత్రను అధ్యయనం చేసి వారి విలువలను ఆచరించాలన్నారు. లాకా తిరుపతయ్య యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి
చలసాని శ్రీధర్ S/o
Ch. రామకోటేశ్వరరావు,
పటమటలంక, విజయవాడ అను పేరు
మీద గల డాక్యుమెంట్స్ No's 4560/2013
SRO నూజివీడు, 4557/2013, SRO
నూజివీడు గల డాక్యుమెంట్స్ ఫైల్
ది. 16-2-26న పటమట సబ్ రిజిస్ట్రార్
ఆఫీస్‌కు వెళ్ళే దారిలో పోయినవి.
దొరికినచో సంప్రదించండి.
✆ 98482 29871

(c) eenadu

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ◆ కంచికచర్ల ప్రణీత కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికుడు రమణయ్య చేసిన ఫిర్యాదుకు విద్యుత్తు శాఖ ఏఈ దిబ్బయ్య స్పందించారు. సిబ్బందితో తీగలను సరి చేయించారు. ◆ కంచికచర్ల పాత ఉషోదయ బజారులో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని స్థానికుడు సూర్య ప్రకాష్ చేసిన ఫిర్యాదుకు స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ సిబ్బందితో వీధి దీపాలను మార్పించారు. ◆ కంచికచర్ల పాత శివాలయం వద్ద మురుగు కాలువలో వ్యర్థాలు నిల్వ ఉండడంతో మురుగు పారక దుర్వాసన వస్తోందని స్థానికుడు గోపాలరావు ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రియాంక సిబ్బందితో కాలువలో వ్యర్థాలు తొలగింపజేశారు. ◆ చందర్లపాడులోని ఎస్సీ కాలనీలో, తుర్లపాడు రోడ్డులో వీధి దీపాలు వెలగడంలేదని మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా స్థానికులు సమస్యను పంచాయతీ కార్యదర్శి సాయిరాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సమస్యను పరిష్కరించారు. ◆ స్థానిక రెడ్డి బజారు, తూర్పు బజారు, బీసీ కాలనీలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు పూడుకుపోయి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కార్యదర్శికి తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, చందర్లపాడు**

అభివృద్ధి.. సంక్షేమానికి ప్రాధాన్యం

నందిగామ, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయకత్వంలో స్వర్ణాంధ్ర సాధనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో ఆమె బడ్జెట్‌పై ప్రసంగించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామ స్వరాజ్యం కోసం పని చేస్తున్నారన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్‌తో అభివృద్ధి, సంక్షేమానికి ఎక్కువ కేటాయింపులు చేశారని తెలిపారు. మహిళా సాధికారతకు రూ.91 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి రూ.34,768 కోట్లు, వ్యవసాయ రంగానికి మంత్రి అచ్చెన్నాయుడు రూ.53,452 కోట్లు కేటాయింపులు జరిపారని పేర్కొన్నారు. అన్నదాత-సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తున్నట్లు చెప్పారు.

భీమవరంలో ఉచిత వైద్య శిబిరం నేడు

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని భీమవరంలో శుక్రవారం జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలని కోరారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రమీల తెలిపారు. డీవీర్‌నగర్, డిపో సెంటర్, డాంగేనగర్, కాకానినగర్, సిద్ధార్థనగర్, టీచర్స్ కాలనీలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాగు దాటిస్తారా.. మాట దాటేస్తారా..!

హామీలతోనే ఆగిపోతున్న వంతెనల నిర్మాణం

కంచికచర్ల, న్యూస్‌టుడే : నందిగామ నియోజకవర్గంలోని పలు వాగులు వర్షాకాలంలో ఆయా ప్రాంతాల ప్రజలకు శాపంలా మారాయి. భారీ వర్షాల సమయంలో వాగులకు వచ్చే వరదలతో వాగు సమీప గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతూ రోజుల తరబడి దైనందిన కార్యకలాపాలకు ఆటంకంగా మారుతున్నాయి. వర్షాకాలంలో అధ్వాన రహదారుల్లో ఉద్ధృతంగా ప్రవహించే వాగులు దాటి వెళ్లి తమ పంటలను చూసుకోవడం..పండించిన ఉత్పత్తులను ఇంటికి తరలించడం రైతులకు కత్తి మీద సాములా మారింది.

ఆ కాసేపే హడావుడి..

★ వీరులపాడు మండలం చెన్నారావుపాలెం వద్ద ఏనుగు గడ్డ వాగుపై వంతెన నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. ఈ వాగులపై వంతెన నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం శంకుస్థాపన చేసినప్పటికీ పనులు జరుగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ★ కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగుకు వరదలు వచ్చిన ప్రతిసారీ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. గతంలో ఇక్కడ వాగు దాటుతూ ఒక వ్యక్తి మృత్యువాత పడిన సందర్భంలో నాటి వైకాపా పాలకులు వంతెన నిర్మిస్తామంటూ హడావుడి చేశారు. తర్వాత దాని ఊసెత్తలేదు. ★ గత ఆగస్టులో కంచికచర్ల సమీపంలో శుద్ధవాగు దాటుతూ ద్విచక్ర వాహనదారుడు వాగులో

గొట్టుముక్కల వద్ద రాకపోకలకు ప్రమాదకరంగా మారిన తోళ్ల వాగు

కొట్టుకుపోయి మరణించాడు. ★ కంచికచర్ల మండలం గొట్టుముక్కల నుంచి దొనబండ వెళ్లే దారిలో గొట్టుముక్కలకు సమీపంలోనే తోళ్ల వాగు, ఏనుగు గడ్డ వాగు ప్రవహిస్తూ ఉంటాయి.

వచ్చే వర్షాకాలానికైనా..: వచ్చే వర్షాకాలంనాటికైనా ప్రభుత్వం వాగులపై వంతెనల నిర్మాణంపై దృష్టి సారించి, తమను వాగుల కష్టాల నుంచి గట్టెక్కించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

వెండి తాపడానికి విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో సహ దేవత అంకమ్మ అమ్మవారికి వెండి తాపడం చేయించడానికి దాతలు విరాళం అందించారు. విజయవాడ కానూరుకు చెందిన లక్ష్మీ ప్రశాంత్ కుమార్, సుష్మ దంపతులు పెనుగంచిప్రోలుకు చెందిన రేగండ్ల సైదులు దంపతులు, రేగండ్ల రవికుమార్‌ల ద్వారా రూ.10,116 అందజేశారు.

21న హుండీల లెక్కింపు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం పరిధి ముక్త్యాలలోని భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. అధికారులు, దేవస్థాన ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరా దత్తు సమక్షంలో లెక్కిస్తున్నట్లు చెప్పారు.

పులిచింతల ప్రాజెక్టు ఎస్ఈకి సత్కారం

నందిగామ, న్యూస్‌టుడే: పులిచింతల ప్రాజెక్టు ఎస్ఈ గా బాధ్యతలు స్వీకరించిన పి.రామచంద్రరావును విజయవాడలోని కార్యాలయంలో గురువారం ఎన్నెస్పీ ఎడమ కాలువ ప్రాజెక్ట్ ఛైర్మన్ కోట వీర బాబు, వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ అధ్యక్షుడు రాఉకొండ చంద్రశేఖరరావు తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు. డీసీ అధ్యక్షులు ఏలూరు గోపాలరావు, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

రామచంద్రరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎన్నెస్పీ ఛైర్మన్ వీరబాబు

పేదలకు అండగా సీఎం సహాయనిధి

నందిగామ: నిరుపేదల వైద్య చికిత్సలు, ఇతర అవసరాలకు సీఎం చంద్రబాబు వెంటనే సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకాని నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం రాత్రి నియోజకవర్గంలోని 32 మందికి రూ.21.22 లక్షల సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా వైద్య చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కోసం వచ్చిన వెంటనే సీఎంకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి వెంటనే అనుమతులు వస్తుండడం వల్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ సౌమ్య

జగ్గయ్యపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: పట్టణంలోని విలియంపేటకు చెందిన మారేపల్లి బాయమ్మకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం అందజేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మంజూరైన రూ.4.32 లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే తన నివాసంలో అందించారు. తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: లబ్ధిదారు కుటుంబ సభ్యునికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య

వేసవిలోనైనా వంతెన నిర్మించాలి

చెన్నారావుపాలెం(వీరులపాడు), న్యూస్‌టుడే : మండల పరిధి చెన్నారావుపాలెం సమీపంలోని ఏనుగు గడ్డ వాగును నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు గురువారం సందర్శించారు. అక్కడ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో కొట్టుకుపోయిన చప్టా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే మట్టి సామర్థ్య పరీక్షలు నిర్వహించారు, డ్రాయింగ్ పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. వర్షాలతో రైతులు, పశుపోషకులు శిథిలావస్థలో ఉన్న చప్టాపై రాకపోకలు సాగించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నందున, రానున్న ఎండాకాలంలో నిర్మాణం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు ఏఈని కోరారు. కార్యక్రమంలో అధికారులు మోహనరావు, గంగయ్య, ఉమా శంకర్, రాజేష్, రైతులు కృష్ణారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన చప్టా వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కబడ్డీ పోటీల విజేత పెనుగంచిప్రోలు జట్టు

విజేత జట్టుకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న నిర్వాహకులు

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: కేతవీరునిపాడులో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. మూడురోజులుగా జరిగిన ఈ పోటీల్లో 28 జట్ల క్రీడాకారులు తలపడగా పెనుగంచిప్రోలు జట్టు విజేతగా నిలిచి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కీసర జట్టు ద్వితీయ, కంచికచర్ల తృతీయ, కేతవీరునిపాడు జట్లు నాలుగో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు దాతల సౌజన్యంతో రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.3,016 చొప్పున నగదు, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. నెలకుదిటి రామారావు, జమ్ముల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మాట్లాడండి

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్సీలు జగన్ మెప్పుకోసం మండలిలో సమావేశాలను అడ్డుకుంటున్నారని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి గురువారం ఆరోపించారు. మాజీ సీఎం జగన్ అవినీతి సమావేశాల్లో బయటపడుతుందని చర్చ జరగకుండా ఎమ్మెల్సీలు ఓ అజెండా ప్రకారం సభను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. వైకాపా ఎమ్మెల్సీలు ప్రజాసమస్యలపై మాట్లాడాలని సూచించారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: రంజాన్ మాస ఉపవాస ప్రార్థనలు గురువారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం నెలవంకను చూసిన ముస్లింలు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. మాగల్లు, రామిరెడ్డిపల్లి, పల్లగిరి, రుద్రవరం గ్రామాల్లోని ముస్లింలు సహరి, ఇఫ్తార్ ప్రార్థనలు చేశారు. మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కంచికచర్ల, న్యూస్‌టుడే : కంచికచర్ల మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షురాలిగా బత్తినపాడు గ్రామానికి చెందిన మాదాసు కాంతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంతమ్మ

స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీగా గోగులగుంట కృష్ణ కుమారి, కోశాధికారిగా బంకా సామేలు ఎన్నికయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను చేరువ చేస్తామని నూతన అధ్యక్షురాలు తెలిపారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సుందరీకరణకు ఆర్అండ్‌బీ, పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణంలోని కోదాడ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. 1.6 కిలోమీటర్లు ఉన్న రోడ్డును మొదటి దశలో 900 మీటర్లకు రూ.3.5 కోట్లు మంజూరు చేశారు. మిగిలిన 700 మీటర్లకు రూ.2.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పదేళ్లుగా ప్రయత్నాలు.. : కోదాడ రోడ్డులో ఎప్పటినుంచో ట్రాఫిక్ సమస్య ఉంది. పట్టణం నుంచి తెలంగాణకు, జాతీయ రహదారికి, నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు ప్రధానంగా ఉంది. రోడ్డును విస్తరించాలని ప్రజలు, వాహనదారులు ఎప్పటినుంచో కోరుతున్నారు. పదేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికి ఫలించాయి. విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

కోదాడ రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు

త్వరలోనే పూర్తి చేస్తాం..

- ఆర్అండ్‌బీ డీఈ పరుశురాముడు

ప్రస్తుతం రోడ్డు విస్తరణకు సర్వే చేస్తున్నాం. అధికారులు సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేసిన వెంటనే రోడ్డుకు శంకుస్థాపన చేసి త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే రూ.3.5 కోట్లకు టెండర్లు పిలిచాం.

పారిశుద్ధ్యం ఇలా.. పట్టించుకోకపోతే ఎలా

కంచికచర్లలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పలు వీధులు, ప్రధాన రహదారుల వెంట ఉన్న చెత్త కుప్పల నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా పలు కాలనీల్లో చెత్త తొలగించడం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త కుప్పల వద్ద పశువులు, వీధి కుక్కలు సంచరిస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కంచికచర్ల**

చెత్త కుప్పల వద్ద పశువుల సంచారం

భవనం శిథిలం.. విధులు భయం

మండలంలోని మాగల్లు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. రెండు దశాబ్దాల కిందట ఈ భవనం నిర్మించారు. అప్పటి నుంచి ఈ పశువైద్యశాల పరిధిలో 16 గ్రామాల్లోని పశువులకు వైద్యం అందిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేయక వర్షాకాలం స్లాబు నుంచి నీరు కారుతోంది. ఇందులోనే వైద్య సిబ్బంది భయపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. పశువులకు వైద్యం చేసే బోనుకు రక్షణగా చుట్టు ప్రహరీ నిర్మించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

గుంతలు పూడ్చేది ఎప్పుడో..?

మండలంలోని గరికపాడు- తక్కెళ్లపాడు రహదారి గుంతలమయంగా మారింది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కెళ్లపాడు, తెలంగాణ నుంచి జాతీయ రహదారికి వెళ్లడానికి ప్రధానంగా ఉన్న ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో చోదకులు ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. సంబంధిత అధికారులు చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం**

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొణకంచిలో గురువారం రాత్రి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గ్రామానికి చెందిన తోట ముక్త్యాల(40) ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుంటారు. తనకు వరుసకు సోదరుడు అయ్యే మద్దెల గోపితో కలిసి రాత్రి 9 గంటల వరకు కల్లు తాగారు. ఈ పరిస్థితుల్లో ముక్త్యాలు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే వెళ్లి ఆటో తీసుకుని వచ్చేలోపు ముక్త్యాలు మృతి చెందాడని గోపి తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై అర్జున్ సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. శరీరంపై గాయాలు ఉండటం వల్ల ఎవరైనా హత్య చేశారా? రోడ్డుపైకి వచ్చిన సమయంలో ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనే కోణంలో విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

విద్యార్థులకు అభినందన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ జోన్ పరిధిలో నిర్వహించిన డా.బీఎస్ రావు మెమోరియల్ జోనల్ క్రీడా మీట్‌లో పెనుగంచిప్రోలు శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు ఛాంపియన్‌గా నిలిచారు. జోనల్ మీట్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో వేర్వేరు క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో పెనుగంచిప్రోలు క్యాంపస్ విద్యార్థులు సమష్టిగా రాణించారు. చైతన్య విద్యా సంస్థల ఏజీఎం మురళీకృష్ణ, జిలానీ విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యాసంస్థల ఆర్ఐటీ వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పాఠశాల వార్షికోత్సవం

కంచికచర్ల, న్యూస్‌టుడే : కంచికచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పి.సుబ్బారెడ్డి పాఠశాల వార్షిక ప్రగతిని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాలను జడ్పీ ఉన్నత పాఠశాల స్థాయి నుంచి ప్లస్ హైస్కూలుగా మార్చిందని తెలిపారు. దీనితో అన్ని వసతులు ఏర్పాటు చేస్తారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జ్ఞాపికలతో విద్యార్థులు

కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బర్రె ఉదయ్ కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్స్ విజేతలకు సన్మానం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో విజేతలుగా నిలిచిన ముదిరాజ్ విద్యార్థులు అంగజాల వైష్ణవి, రొయ్యల సాయికుమార్‌ను రాష్ట్ర ముదిరాజ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సులోచన ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వైష్ణవి నివాసంలో నిర్వహించిన సమావేశంలో పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ముదిరాజ్ విద్యార్థులకు సాయం అందిస్తామన్నారు. నియోజకవర్గ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైష్ణవిని సత్కరిస్తూ...

ధైర్య సాహసాలకు రూపం శివాజీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తొలుత పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, శివాజీ అభిమానులు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఛత్రపతి శివాజీ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఛత్రపతి ధైర్యసాహసాలు, పరిపాలన నైపుణ్యం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూకల కుమార్‌రాజా, సంకా వెంకటరావు, అల్లి రవిచంద్, షేక్ ఇజాజ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

అల్లూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : ఛత్రపతి శివాజీ జయంతిని మండల పరిధి అల్లూరు గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ..ధైర్య సాహసాలకు, పరిపాలనా దక్షతకు మారు రూపం శివాజీ అని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో స్థానిక యువత బైక్ ర్యాలీని నిర్వహించారు.

హిందూ చైతన్య వేదిక సభ్యుల ఆధ్వర్యంలో

వీరులపాడులో...

జీవితంలో విద్య ఎంతో అవసరం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నతస్థాయికి చేరడానికి విద్య ఆయుధంగా పనిచేస్తుందని విజయవాడకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారిణి బాలలత పేర్కొన్నారు. గురువారం నందిగామ కాకతీయ అపోలో ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విజయవాడ ధనిక్ భారత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఎదురైన ఇబ్బందులను చదువు ద్వారా అధిగమించాలని చెప్పారు. లాయిడ్ హెల్త్ కేర్ గ్రూపు ఛైర్మన్ విక్రమ్ అజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు యజ్ఞంలా చదవాలని సూచించారు. ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ పంచ రాంబాబు, షేక్ సలీం, పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్, వైస్ ఛైర్మన్ భారతి, డైరెక్టర్ కార్తికేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలలత

ఘనంగా హిందీ భాషా ఉత్సవం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగాలపాడు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భాషోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులు హిందీ భాష గొప్పదనంపై పాటలు, నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. హిందీ కవుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు, హిందీ ఉపాధ్యాయినులు వై.రజని, కె.లక్ష్మి పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి వినతి

కంచికచర్ల, న్యూస్‌టుడే : తమ డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన బాట చేపట్టిన సహకార సంఘాల ఉద్యోగులు వరుసగా రెండవ రోజూ తమ ఆందోళన కొనసాగించారు. కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు ఎదుట గురువారం నిర్వహించిన ఆందోళనలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో తమ ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధి సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళన

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు ప్రశాంతంగా చదువుకోవాలని ఎంఈవో రవీందర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబురావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబు రావు, ముక్కా సత్యనారాయణ, త్రివేణి, చలిగంటి కొండ నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వేగినేటి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవో రవీందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హెచ్.ఎం బాబురావు

స్వామివారికి పవళింపు సేవ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ముక్త్యాలలో వెలసిన శ్రీభవానీ ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దాంట్లో భాగంగా గురువారం ఆలయ అర్చకులు స్వామివారికి పవళింపు సేవ చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కానూరి సురేష్‌బాబు, కేసీపీ ఏజీఎం రాంప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు.

జగ్గయ్యపేటలో ఇంజినీరింగ్ కాలేజీకు సిబ్బంది కావలెను.
➤ సెక్యూరిటీ పర్సన్
➤ సివిల్ ల్యాబ్ అసిస్టెంట్
➤ స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్
➤ నందిగామ నుండి డ్రైవర్
✆ 91212 14607

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ప్రజలకు అందించే సేవలపై అవగాహన

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: ప్రజలకు అందించే సేవలపై ఆశా కార్యకర్తలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని అవగాహన కల్పించారు. గురువారం నగరంలోని పలు ఆరోగ్య కేంద్రాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల పరిధిలో ప్రజలకు ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. వివిధ కార్యక్రమాల ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందన: ✦ సామారంగంచౌక్ కాకరపర్తి భావనారాయణ వీధిలో జ్యూస్ దుకాణం పక్కన రోడ్డుపై చెత్త తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? నెహ్రూబొమ్మ కూడలి రోడ్డు మార్గంలో వేగనిరోధకాలు లేవు. - సురేష్, స్థానికుడు ✔ పరిశీలించి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, సర్కిల్-1 ఈఈ

? కమ్మంవీధిలో ఐదో డివిజన్‌లో పక్క కాలువలో పూడిక పేరుకుంది. - సుష్మిత, స్థానికురాలు ✔ పూడిక తీయించేందుకు చర్యలు తీసుకుంటాం. - నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు పంపిణీ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రెండు పుస్తకాలు తీసుకెళ్లవచ్చని తెలిపారు.

ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి

భాజపా రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: భారతదేశంలో హిందూ ధర్మాన్ని రక్షించిన గొప్ప వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని భాజపా రాష్ట్ర మీడియా బాధ్యుడు కిలారు దిలీప్ పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధరంగంలో ఆయన అసాధారణమైన ప్రతిభతో గెలిచారని తెలిపారు. దేశ చరిత్రలో గొప్ప పాలకుడిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. భాజపా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ భండారి అన్నారు. శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పాతబస్తీ శివాలయం వీధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ భండారి మాట్లాడుతూ.. మాతృభూమి కోసం ఆయన చేసిన పోరాటం హిందువులకు స్ఫూర్తిని నింపిందన్నారు. కార్యక్రమంలో శివాజీ సేన నాయకులు కె.నాగేశ్వరరావు, ప్రకాష్, నారాయణ, హరి తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో నాగేశ్వరరావు, ప్రకాష్, మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ భండారి

నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్

రాకెట్ ప్రయోగిస్తున్న ఎట్కిన్‌సన్ పాఠశాల విద్యార్థులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీలోని ఎట్కిన్‌సన్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు తయారు చేసిన మోడల్ రాకెట్ ప్రయోగం గురువారం కనువిందు చేసింది. 6, 7, 8 తరగతుల విద్యార్థులు రూపొందించిన రాకెట్లు నింగిలోకి దూసుకెళ్లాయి. రాకెట్లను సైన్సు విభాగ అధిపతి జాకీరా రెహమాన్ పర్యవేక్షణలో ప్రయోగించారు. నిజమైన రాకెట్ తరహాలో నింగిలోకి దూసుకు వెళ్లే క్రమంలో కొంతభాగం విడిపోయి.. 4 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిరింది. దీన్ని చూసిన చిన్నారుల కేరింతలు, ఉత్సాహం నింగిని తాకింది. అనంతరం ఇంటిగ్రిటీ ఏరోస్పేస్ సంస్థ వ్యవస్థాపకులు లాజరస్ సామ్రాట్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ గ్రేసి, ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ రజిత విద్యార్థులకు రాకెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇంటిగ్రిటీ ఏరో స్పోర్ట్స్ సంస్థలు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివేకానంద, ధనశ్రీ, యాంజలీనా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు తొలగిన ఇబ్బందులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

మల్లేశ్వరాలయ మెట్ల మార్గం దిగువన విశాలంగా స్థలం

దుర్గగుడికి నిత్యం వేలాది మంది భక్తులు దుర్గమ్మ దర్శనానికి వస్తారన్న విషయం దేవాలయంలో పనిచేసే ప్రతి అధికారికి విదితమే. భక్తుల సౌకర్యాల కల్పన విషయం ప్రస్తావనకు రాగానే అధికారుల నుంచి వచ్చే తొలి సమాధానం ఇంద్రకీలాద్రిపై స్థలాభావం అని చెబుతారు. ఎంత విశాలమైన స్థలం ఉన్నప్పటికీ వినియోగించుకోవడం రాక కష్టపడం.. కొండపైకి వచ్చే భక్తుల సొమ్మును మంచినీళ్లలా ఖర్చు చేయడంలో దుర్గగుడి అధికారులు అగ్రస్థానంలో నిలుస్తారు. ఈవోగా నియమితులైన సూర్యకుమారి, ఆదాయ పన్ను విభాగం నుంచి దుర్గగుడి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఈవో కోటేశ్వరమ్మ మాత్రమే గత తెదేపా ప్రభుత్వంలో దుర్గగుడిలో భక్తులకు సౌకర్యాలు మెరుగు పరిచారు. గత ఏడాది ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శీనా నాయక్ తనదైన శైలిలో భక్తులకు మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టారు. చిరు మార్పులతో బహుళ ప్రయోజనం భక్తులకు కలిగే విధంగా పలు చర్యలు తీసుకున్నారు.

క్లోక్ రూమ్, పాదరక్షల స్టాండ్ మార్పుతో..: దుర్గగుడికి పాత మెట్ల మార్గంలో ఉన్న పాదరక్షల స్టాండ్, క్లోక్ రూమ్ కనకదుర్గానగర్‌కు మార్చడంతో ఈ మార్గం విశాలంగా మారింది. ఆన్‌లైన్ కౌంటరును ఇక్కడ ఏర్పాటు చేయడంతో క్యూలైన్ల వద్ద వేచి చూడకుండా భక్తులు సెల్‌ఫోను స్కానర్ వినియోగించి దర్శనం, ఆర్జిత సేవలు, విరాళాల టికెట్లు సులభంగా తీసుకుంటున్నారు.

లిఫ్టు మార్గంలో..: లిఫ్టు మార్గంలో వెళ్లే భక్తులు

ప్రసాదాల కౌంటర్ల వద్ద..

మల్లికార్జున మహా మండపంలో ప్రసాదాల కౌంటర్లను కనకదుర్గానగర్‌లోకి మార్చడంతో మల్లేశ్వరాలయం మెట్ల మార్గం దిగువన విశాలమైన స్థలం లభించింది. దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో ఈ నిర్ణయ ప్రభావంతో తొక్కిసలాటకు తావు లేకుండా భక్తులు, భవానీ దీక్షాదారులు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. వీవీఐపీలు వచ్చినప్పుడు వాహనాలను ఇక్కడ నిలిపేందుకు అవకాశమైన స్థలం లభించింది.

గతంలో మల్లికార్జున మహా మండపం ముందు క్యూలైన్ నిండిపోయేవి. ఒకవైపు ప్రసాదాల కోసం వచ్చిన భక్తులు మరోక వైపు దర్శనానికి వచ్చిన వారితో రద్దీగా మారేది. ప్రస్తుతం భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు ఏర్పాటు చేసే నిమిత్తం ప్రసాదం కౌంటర్లను పూర్తిగా తొలగించారు. భక్తులు తొక్కిసలాటలకు తావు లేకుండా నింపాదిగా లిఫ్టు మార్గంలో పంపేందుకు చర్యలు తీసుకుంటామని దేవస్థానం అధికారులు తెలిపారు.

జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో సత్తా చాటిన నగర ఆర్చర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం కొచ్చిలో ఈ నెల 10 నుంచి 19 వరకు జరిగిన 5వ ఎన్టీపీసీ జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో నగరానికి చెందిన పలువురు ఆర్చర్లు సత్తా చాటారు. సీనియర్ పురుషుల రికర్వ్‌లో బొమ్మదేవర ధీరజ్ పసిడి, సీనియర్ పురుషుల కాంపౌండ్‌లో కుందేరు వెంకటాద్రి కాంస్యం, కొండపావులూరి యుక్తశ్రీ జూనియర్ మహిళల రికర్వ్‌లో రజతం, సబ్ జూనియర్ రికర్వ్‌లో కాంస్యం, తాడిబోయిన వైష్ణవి జూనియర్ రికర్వ్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. పతకాలు గెలుపొందిన ఆర్చర్లను రాష్ట్ర ఆర్చరీ సంఘం ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ, కార్యదర్శి వెంకట రమణ, కార్యవర్గ సభ్యులు తదితరులు అభినందించారు.

శాప్ లీగ్ చెస్ పోటీలకు స్పందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 17న అన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీలకు విశేష స్పందన లభించిందని శాప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో అండర్-5-13, 15, 17, 19 బాలబాలికల విభాగాల్లో 2,445 మంది తలపడ్డారు.. వీరి నుంచి 360 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీల్లో వీరంతా తలపడతారన్నారు. 12 సంవత్సరాలు పైబడిన 20 సంవత్సరాల్లోపు క్రీడాకారుల కోసం రూపొందించిన ఈ లీగ్ పోటీలు 31 క్రీడాంశాల్లో ఏడాది పొడవునా నిర్వహిస్తామన్నారు. వీటిలో అయిదు బీచ్ క్రీడలు, మూడు పారా క్రీడలు, మూడు మాస్టర్స్ క్రీడాంశాలు ఉన్నాయన్నారు. రెండు సార్లు మహిళల వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి.. ఈ శాప్ లీగ్ చెస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాతలు జలచంద్రరావు, సత్యనారాయణ, శ్రీనారాయణమ్ రాజేష్‌ల కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఏఈవో వెంకటరెడ్డి తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వ స్వామి వార్ల దేవస్థానం ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన పథకానికి ముగ్గురు దాతలు రూ. 4,56,715 విరాళాన్ని గురువారం అందజేశారు. గుడివాడకు చెందిన ఎం.జలచంద్రరావు రూ.2 లక్షలు, హైదరాబాద్ లింగంపల్లికి చెందిన శ్రీనారాయణమ్ రాజేష్ దంపతులు రూ.1,01,116, గుడివాడ నివాసి ఎం.సత్యనారాయణ, మాధవి దంపతులు రూ.1,55,599 ఉచిత ప్రసాద పంపిణీకి విరాళాలను అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఏఈవో వెంకటరెడ్డి వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

భక్తులకు రక్షిత నీరు అందించేందుకు చర్యలు

కుళాయి వద్ద గ్లాస్ పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భక్తులకు రక్షిత నీటిని అందించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఈవో గురువారం తనిఖీ చేశారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన కుళాయిల్లో రక్షిత నీటిని పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కుళాయి పరిసరాలను, వినియోగించే గ్లాసులు శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. భక్తులు సమర్పించిన చీరలను విక్రయించే దుకాణాన్ని పరిశీలించారు. కొబ్బరికాయల కౌంటరులో గుత్తేదారు సరఫరా చేసిన కొబ్బరి కాయల్లో ఎటువంటి తేడా ఉన్న తిప్పి పంపాలని ఆదేశించారు. కియోస్కో మిషన్ ద్వారా భక్తులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పాదరక్షల స్టాండ్, క్లోక్ రూమ్ వద్ద అధిక రుసుము వసూలు చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు.

కౌన్సిల్ అజెండాపై సమావేశం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ అజెండాపై వివిధ విభాగాల అధిపతులతో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 21న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలోని ప్రతిపాదనలపై చర్చించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలపై అధికారులు సహకారం అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు, సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఎంహెచ్‌ఓ కె.అర్జునరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి కె.ప్రభుదాస్, ఎస్టేట్ అధికారి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రాల అందజేత

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. 56వ డివిజన్‌లో నివాసం ఉండే తాడికొండ మహేష్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. అతడు భవానీపురంలోని సుజనాచౌదరి కార్యాలయంలో సంప్రదించగా చికిత్స నిమిత్తం రూ.4.06 లక్షలు, 40వ డివిజన్‌లో నివసించే ఎన్.మహేంద్ర నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు చికిత్స నిమిత్తం రూ.4 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఆ పత్రాలను భవానీపురంలోని కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు వెంకటసుబ్బయ్య, ఎం.దుర్గారావు తదితరులు గురువారం అందజేశారు.

బాధిత కుటుంబ సభ్యుడికి ధ్రువపత్రం అందిస్తున్న నాయకులు

చుట్టూ చెత్త.. నీళ్లు పట్టుకునేదెట్లా..?

లంబాడీపేట అడ్డ రోడ్డు, తాజోనోత్ రాములవీధిలో బోరు పంపు చుట్టూ చెత్త వేయడంతో వినియోగించుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ పైభాగం నివాసం ఉంటున్న వారు చెట్ల కొమ్మలు తీసుకు వచ్చి పంపు వద్దనే పడేస్తున్నారని, పారిశుద్ధ్యం సిబ్బంది తొలగించినా మళ్లీ అక్కడే వేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. నీటి ఎద్దడి తలెత్తితే చేతి పంపు వినియోగించాల్సి ఉంటుందని, పంపు చుట్టూ చెత్త వేయకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

శిథిల భవనం.. పొంచి ఉన్న ప్రమాదం



మహంతిపురం, రాఘవరెడ్డి రోడ్డులోని శ్రీమరుపిళ్ల చిట్టి నగరపాలక ప్రాథమిక పాఠశాల భవనం పెచ్చులూడి మరమ్మతులకు నోచుకోలేదు. పాఠశాలలోకి వెళ్లే గేటు వద్ద భవనం పై అంచు భాగం దెబ్బతింది. ఏడాది గడుస్తున్నా ఆ భవనానికి మరమ్మతులు చేయలేదు. పెచ్చులూడే పక్కనే వరండాలో విద్యార్థులు కూర్చుంటున్నారు. భోజనం కూడా తింటున్నారు. పాఠశాల లోపలికి, బయటకు వచ్చి పోయే గేటు వద్ద భవనం ధ్వంసమైంది. అధికారులు స్పందించి ఆ భవనానికి మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

భవానీపురం 42వ డివిజన్‌లోని కొన్ని వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. కాలువల్లో వ్యర్థాలు, చెత్త పేరుకుపోతున్నాయి. దీంతో మురుగు నీరు ముందుకు కదలని పరిస్థితి. దీని వల్ల దోమలు విపరీతంగా పెరగడంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. నేతాజీ పాఠశాల సమీపంలోని రోడ్డులో కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భవానీపురం

అక్రమ నిర్మాణాలు నిర్మూలించండి

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలను చేపడుతున్నా నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టని పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనాల్లో వాహనాల పార్కింగ్ చేసేలా నగరపాలక సంస్థ నుంచి అనుమతులు పొందుతున్నారు. భవానీపురం క్రాంబ్వే రోడ్డు వెంట ఆ విధంగా సెల్లార్‌లో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల నిర్మాణం చేపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, భవానీపురం

దుర్గంధం.. సచివాలయ భవనం

నాలుగుస్తంభాల సెంటరు సమీపంలోని 44వ డివిజను సచివాలయ భవనం పైకప్పు అధ్వానంగా ఉంది. భవనం నిర్మాణం చేసి ఐదేళ్లు పూర్తి కాకుండా ఘోరంగా మారింది. పైకప్పుపై ప్లాస్టింగ్ సరిగా చేయకపోవడం, నీళ్ల ట్యాంకు నిండిన తర్వాత మోటారు ఆపకపోవడంతో పైకప్పు మొత్తం నాచు పట్టింది. కాలు వేస్తే జారితుంది. దీంతో వాటర్ ట్యాంక్ శుభ్రం చేసేవారు కరవయ్యారు. అపరిశుభ్ర వాతావరణం, నీరు నిల్వ ఉండటంతో భవనం భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. భవనం రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విద్యాధరపురం

దుర్గగుడి సమాచారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

● **ఉదయం:** 5 గంటల నుంచి భక్తులను క్యూలైన్లో అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, 7 గంటలకు రుద్ర హోమం, 7.30 గంటలకు నవగ్రహ శాంతి హోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30 గంటలకు చండీహోమం నిర్వహిస్తారు. పూజా మండపంలో ఉదయం 7.30 గంటలకు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

✦ అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఈ సమయంలో అన్ని క్యూలైన్లు నిలిపి వేస్తారు.

● **మధ్యాహ్నం:** ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు.

● **సాయంత్రం:** 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 గంటల నుంచి 7 గంటల వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు నిర్వహిస్తారు. ఈ సమయంలో అన్ని దర్శనాలు నిలిపి వేస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

✦ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టికెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే అనుమతిస్తారు.

/www.kanakadurgamma.com,https://www.aptemples.ap.gov.in వెబ్ సైట్లలో ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సాప్ నంబరు 95523 00009లో ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

✦ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తారు.

✦ దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం, అర్జున వీధిలో ఆన్‌లైన్ కౌంటర్లలో దర్శనం, ఆర్జిత సేవల టికెట్లు తీసుకునేందుకు వీలుగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

భవన యాజమానులు, దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: దుకాణదారులు, రోడ్డు ఆక్రమణల ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వన్ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం పాతబస్తీ కేఆర్ మార్కెట్, తారాపేట, సామారంగం చౌకీ, రాజకుమారి తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దుకాణదారులకు, పలువురు భవన యాజమానులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సెక్టార్ ఎస్సైలు ఓంకార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతం

జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న జేసీ ఇలక్కియా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాలు సొంతమవుతాయని ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియా పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నగరంలోని ప్రముఖ పది మహిళా సంస్థల ఆధ్వర్యంలో 'గ్రాండ్ స్ప్రింట్ స్పోర్ట్స్' పేరుతో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థినులకు గెలుపోటములు ముఖ్యం కాదని క్రీడా స్ఫూర్తితో తలపడాలన్నారు. విద్యార్థినులకు ఇంత పెద్ద ఎత్తున ఆటల పోటీలు నిర్వహిస్తున్న మహిళా సంస్థలను ఇలక్కియా అభినందించారు. కళాశాల పూర్వ డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ఎంబీవీకే బాధ్యులు, పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో నగరంలోని సుమారు 26 కళాశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థినులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సేఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు రావూరి సత్యవతి అధ్యక్షత వహించగా.. సేఫ్ సభ్యురాలు ఎం.శేషారత్నం, తరుణి తరంగాలు సభ్యులు ఉషారాజ, ఇన్నర్ వీల్ సన్‌షైన్ అధ్యక్షురాలు భవితా జైన్, వన్ ఎర్త్-వన్ లైఫ్ బాధ్యురాలు లీలా కుమారి, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్ బాధ్యురాలు ఎ.సంధ్య, స్పృహాప్తి బాధ్యులు భారతి, మాధురి, ఎంబీవీకే సభ్యులు పి.విజయలక్ష్మి, రాయల్ క్లబ్ బాధ్యులు శ్యామల, అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: యనమలకుదురు పెదపులిపాకకు చెందిన ఇమంది శివ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఏడాది జనవరిలో పరిచయం ఉన్న భవానీపురంలో నివాసం ఉండే యశ్వంత్ కుమార్ అనే వ్యక్తి వద్ద రూ. 15 వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇచ్చే వరకు శివ ద్విచక్ర వాహనాన్ని తన వద్ద ఉంచుతానని యశ్వంత్‌కుమార్ చెప్పడంతో ఆ ప్రకారం ఇచ్చాడు. కొన్ని రోజుల క్రితం తీసుకున్న డబ్బులను శివ తిరిగి ఇచ్చేశాడు. కానీ ద్విచక్ర వాహనాన్ని మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. దీంతో డబ్బులు తీసుకుని తన ద్విచక్రవాహనం తిరిగి ఇవ్వకుండా యశ్వంత్‌కుమార్ మోసానికి పాల్పడినట్లు శివ భవానీపురం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కారు డ్రైవర్‌పై పోక్సో కేసు

చిట్టినగర్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కారు డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు తెలిపారు. సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతుంది. ఆమెను హేమంత్ సాగసాయి (23) అనే యువకుడు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కరుణ కేసు నమోదు చేయగా పశ్చిమ ఏసీపీ ఎన్ఎస్ వీకే దుర్గారావు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైకాపా వీధి పేర్ల దందా ఆపాలి

ప్రతిపాదన ప్రతి చూపుతున్న సత్యబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కౌన్సిల్లో అధికారం ఉందని వైకాపా వీధి పేర్లు మార్పు చేస్తూ సాగించే దందా ఆపకపోతే ఆందోళన చేస్తామని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఎదురువీధిలోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో మీడియా ప్రతినిధుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50వ డివిజన్‌కు చెందిన సాయిబాబాగుడి వీధి పేరు మార్చాలని వైకాపా ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ ప్రతిపాదన పెట్టారని అన్నారు. ఆ పార్టీకి సంబంధించిన కుటుంబ సభ్యుల పేరు పెట్టేందుకు ప్రతిపాదన 74/569 అంశంగా ఉందన్నారు. ఇప్పటికే ఈ విషయమై వైకాపా ఫ్లోర్‌లీడర్‌ను సంప్రదించి అభ్యంతరాలు చెప్పి, ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని సూచించామన్నారు. నగరపాలక సంస్థలో 2007 కృష్ణాజిల్లా గెజిట్ నోటిఫికేషన్‌లో సాయిబాబాగుడి వీధిగా నామకరణం చేసి ఉందని, 2019 ఎన్నికల్లో నగరపాలక సంస్థ ఇచ్చిన ముఖచిత్రంలో కూడా సాయిబాబాగుడి పేరు పొందుపరిచారని అన్నారు. కనీసం గెజిట్‌లో ఏముందో చూడకుండా కౌన్సిల్లో ఏం చేస్తే అది చలామణి అవుతుందని చేయడం కౌన్సిల్ చట్టాలు తుంగలో తొక్కడమేనని అన్నారు. ఈనెల 21న కౌన్సిల్లో మెజార్టీ ఉందని బరితెగించి నిర్ణయం తీసుకుంటే ఆందోళనతో పాటు న్యాయపరమైన పోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పి.రాజు, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వాహనాల రాజ్యం

కొండ ప్రాంత ప్రజలకు పాట్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే

కొండ ప్రాంతవాసుల సౌలభ్యం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ఇతర వాహనాలు కొండ ప్రాంతానికి వచ్చే విధంగా ర్యాంపులు నిర్మించారు. అడ్డగోలుగా ఆటోలు పార్కింగ్‌తో కొండ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. 2 కోట్లకు పైగా వెచ్చించి ఏ వీధికి ఆ వీధి రాకపోకలకు వీలుగా ర్యాంపులు వేసినా ఫలితం శూన్యమే. అర్ధరాత్రి ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే చేతుల మీద మోసుకుని కిందకు దించాల్సిందే. సమయానికి వైద్యం వెళ్లకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. * కొండ ప్రాంత ప్రజలు సులువుగా అడ్డ రోడ్డు ప్రాంతానికి చేరుకోవడానికి వీలుగా ర్యాంపుల నిర్మించారు. ప్రతి వీధితో పాటు ప్రత్యేకంగా లంబాడీపేట పాత హాస్టల్ వద్ద మెట్ల మార్గాన్ని ర్యాంపుగా నిర్మించేందుకు సుమారు రూ. 50 లక్షలు వెచ్చించి వేశారు. అయితే ర్యాంపులకు, మెట్లకు అడ్డంగా కొందరు ఆటో చోదకులు ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకల సమయంలో ఒక్కొక్కసారి కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి.

★ ఇతర వాహనాల్లో తీసుకు వెళ్లాలంటే అడ్డగోలు పార్కింగ్ వల్ల రాలేని పరిస్థితి. ఇదేమని అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారు. సంబంధిత పోలీసు, నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పాత హాస్టల్ వద్ద పార్కింగ్ ఇలా..

డివిజన్ 46
- జనాభా: సుమారు 15 వేలు
- ఓటర్లు: సుమారు 7 వేలు
- వాహనాలు రాకపోకలు: దాదాపు 2 వేలు
- ఇబ్బందులు: సుమారు 6 వేల మందికి

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

పాయకాపురం, న్యూస్‌టుడే : రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద డ్రెయిన్‌లో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై గురువారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు.. కార్మికులతో పూడిక తీయించారు.

? అజిత్‌సింగ్ డాబాకొట్లు సెంటరులోని పెట్రోల్ బంక్ వెనుక వీధిలో గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – ప్రభుదాస్, స్థానికుడు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.– సతీష్, ఏఈ, సర్కిల్–2

? కొత్తరాజరాజేశ్వరీపేట రైల్వేగేటు సమీపంలో బార్ వద్ద కొందరు యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అటుగా వెళ్లే వారిని ఇబ్బంది పెడుతున్నారు. – ప్రశాంతి, స్థానికురాలు

✔ పరిశీలించి.. పోలీసు నిఘా పెడతాం. – వెంకటేశ్వర్లు, సీఐ, అజిత్‌సింగ్‌నగర్ - పాయకాపురం, న్యూస్‌టుడే

సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షలు తదితర విభాగాలకు సంబంధించి సుమారు 38 వేల పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు పంపిణీ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రెండు పుస్తకాలు తీసుకెళ్లవచ్చని తెలిపారు.

ధీరజ్, వెంకటాద్రి,అతిథి నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న యుక్తశ్రీ

జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం [illegible] ఈ నెల 10 నుంచి 19 వరకు జరిగిన 3వ ఎన్టీపీసీ జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీలో నగరానికి చెందిన పలువురు ఆర్చర్లు సత్తా చాటారు. సీనియర్ పురుషుల రికర్వ్‌లో బొమ్మదేవర ధీరజ్ పసిడి, సీనియర్ పురుషుల కాంపౌండ్‌లో కుందేరు వెంకటాద్రి కాంస్యం, కొండపావులూరి యుక్తశ్రీ జూనియర్ మహిళల రికర్వ్‌లో రజతం, సబ్ జూనియర్ రికర్వ్‌లో కాంస్యం, తాడిబోయిన వైష్ణవి జూనియర్ రికర్వ్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. పతకాలు గెలుపొందిన ఆర్చర్లను రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కార్యదర్శి బెవర వెంకట రమణ, ఇతర కార్యవర్గ సభ్యులు అభినందించారు.

మురుగు పరుగో పరుగు!

రాత్రి వేళ రహదారిపైనే వదిలేస్తున్న వైనం

గవర్నర్‌పేట, మాచవరం, న్యూస్‌టుడే

మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఏలూరు రోడ్డు మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. రాత్రి 10 గంటలు దాటితే చాలు.. ముక్కుపుటాలదిరేలా... దుర్వాసన వెదజల్లుతోంది. అందులోనే ఇబ్బందులు పడుతూ వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. మరమ్మతులు చేయాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొత్త పైపులైను వేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదంటూ చేతులు దులుపుకొంటున్నారు.

రహదారి మొత్తం విస్తరించిన మురుగునీరు

ఫలితంగా కళాశాల పరిసరాల్లోని జనం బెంబేలెత్తిపోతున్నారు.

పల్లపు ప్రాంతాలు మునక

మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఎదురుగా కొండపై నుంచి, కళాశాల పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటిని సీతారాంపురంలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌కు పంపింగ్ చేస్తుంటారు. కళాశాల సమీపంలో పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. దీనివల్ల పంపింగ్ చేసినప్పుడు మురుగు రోడ్డును ముంచెత్తుతోంది. పంపింగ్ చేయకపోతే మురుగు నీరు పైపులైన్ల ద్వారా పల్లపు ప్రాంతాల్లోకి వెనుకకు తన్నుతోంది. దీంతో ఆ ప్రాంతాలన్నీ దారుణంగా మారిపోతున్నాయి. ప్రత్యామ్నాయ పైపులైను వేస్తేనే ఈ సమస్య తీరుతుందని నగరపాలకసంస్థ సిబ్బంది అంటున్నారు. అయితే కొత్తపైపులైను వేసేందుకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

జన సంచారం తక్కువని..

ప్రతి రోజూ మురుగు నీటిని పంపింగ్ చేయాల్సిందే. ఇలా పంపింగ్ చేస్తే. ఒత్తిడికి కళాశాల సమీపంలోని లీకేజీ ద్వారా మురుగునీరు రోడ్డు మీదకు చేరుతోంది. ఈ సమస్యను తీర్చేందుకు అధికారులు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్యలో పంపింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో జన సంచారం తక్కువగా ఉంటుందని.. అందుకే అలా చేయాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు.

దుర్వాసనతో బెంబేలు

పెద్ద మొత్తంలో మురుగునీరు రోడ్డుపైకి వస్తుండగా.. దుర్వాసన ధాటికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు మురుగులోనే తిరుగుతున్నారు. దాదాపు 25 రోజులుగా ఈ సమస్య జనాలను భయపెడుతున్నా.. అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ లైను వేసి.. సమస్యను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ద్విచక్ర వాహన చోదకుడి పాట్లు

ఆధునిక సదుపాయాలతో కర్మల భవనం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : బ్రాహ్మణులు, ఇతర వర్గాల ప్రజల మతాచారాలు, సంప్రదాయ కర్మకాండల కోసం ఆధునిక సదుపాయాలతో కర్మల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. 33వ డివిజన్ జీఎస్ రాజు రోడ్డులో రూ.1.64 కోట్లతో నిర్మించనున్న కర్మల భవనానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంప్రదాయ కర్మకాండల సమయంలో కుటుంబ సభ్యులు ఎక్కువ రోజులు ఇక్కడే నివసించాల్సి వస్తుందన్నారు. వారికి సౌకర్యవంతమైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం తమ లక్ష్యమన్నారు. గతంలో ఈ భవనంపై తీసుకున్న కొన్ని తీర్మానాల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పాత తీర్మానాలను రద్దు చేయించి.. ప్రభుత్వ ఆస్తిగా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విశాలమైన హాళ్లు, గదులు, మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తదితర అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయ్‌కుమార్, అధ్యక్షుడు నాళం కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పొట్లూరి కృష్ణప్రసాద్, చిలువేరు శ్రీనివాస్, చందలూరి నాగయ్య, తమ్మా విజయలక్ష్మి, జి.రామలక్ష్మి, చలం, భానుప్రకాష్, మాధవరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు తదితరులు

రూ.5 లక్షలతో ఫ్లోరింగ్.. స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో రూ.5లక్షలతో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. భక్తుల ఇబ్బందులను దృష్టికి పెట్టుకొని.. దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కల్యాణ మండపాన్ని ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణుల కుటుంబాల సౌకర్యార్థం నామమాత్రపు అద్దె, వినియోగించే విద్యుత్తుకు మాత్రమే ఛార్జీలు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ల మురళి, ఈవో గంగాధరరావు, నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిల్ అజెండాపై సమావేశం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ అజెండాపై వివిధ విభాగాల అధిపతులతో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 21న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలోని ప్రతిపాదనలపై చర్చించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలపై అధికారులు సహకారం అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఎ. రవీంద్రరావు, సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఎంహెచ్‌ఓ కె.అర్జునరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి కె.ప్రభుదాస్, ఎస్టేట్ అధికారి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

అలరించిన నాటకోత్సవాలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో 26వ నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అనగనగా ఓ రాత్రి నాటికను పి.వి.సత్యనారాయణ రచించగా.. మొహమ్మద్ ఖాజా వలి దర్శకత్వం వహించారు. హేలాపురి కల్చరల్ అసోసియేషన్(ఏలూరు) వారిచే మొదటి నాటికగా ప్రదర్శించారు. ఉదయ్ భాగవతుల రచన, దర్శకత్వం వహించిన స్త్రీ మాత్రే నమః నాటికను స్వర్ణ సూర్య డ్రామా లవర్స్(హైదరాబాద్) వారిచే రెండోవ నాటికగా ప్రదర్శించారు. రెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించిన మంచి మనుసులు నాటికను ఉషోదయ కళానికేతన్(కాట్రపాడు) వారు మూడో నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తొలుత సమాచార, పౌర సంబంధాల శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్ కుమార్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ సహ కార్యదర్శి ఎం.అవంతి, అధ్యక్షుడు రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

అనగనగా ఓ రాత్రి నాటికలో ఒక సన్నివేశం

త్వరితగతిన మరమ్మతు పనులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలో గుంతల రహదారులకు త్వరితగతిన మరమ్మతులు చేసేందుకు విజయవాడ నగరపాలకసంస్థ కొనుగోలు చేసిన ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్‌ను సెంట్రల్ నియోజకవర్గంలో గుంతల మరమ్మతులకు గురువారం ఉపయోగించారు. రూ.1.4కోట్ల ఖర్చుతో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. దీని సాయంతో అతి తక్కువ సమయంలో గుంతలను సులువుగా పూడ్చవచ్చు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాలతో స్వరాజ్యమైదానం వద్ద మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి పర్యవేక్షించారు.

యంత్రం పని తీరు గురించి తెలుసుకుంటున్న బాలస్వామి

పోరాట యోధుడు.. శివాజీ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను రామ్మోహన గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతిగా పేరొందిన శివాజీ మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దమ్మాల రామచంద్రరావు, వేములపల్లి కేశవరావు, పావులూరి చిదంబరేశ్వరరావు, కోట కృష్ణభగవాన్, నరేష్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, గ్రంథాలయ సభ్యులు

బాధ్యతల స్వీకరణ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విజయవాడలోని 14వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు (ఫ్యామిలీ కోర్టు) అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వడ్డేశ్వరం ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2008లో బెజవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుని, సీనియర్ న్యాయవాది వై.రత్నం వద్ద జూనియర్‌గా ప్రాక్టీసు ప్రారంభించారు. తాజాగా ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. న్యాయవాదులు పోసాని వెంకటేశ్వర్లు, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, ఏజీపీ శాఖమూరి పూర్ణచంద్రరావు, మోటేపల్లి సత్యనారాయణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అభినందన

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : 7వ అదనపు జిల్లా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించిన మువ్వల జయప్రకాశ్‌ను వేముల ఛారిటీస్ ఛైర్మన్, సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అభినందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చట్టపరిధిలో నిజానిజాలు గుర్తెరిగి వాదనలు వినిపించి.. న్యాయం గెలిచేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.రవికుమార్, పి.రాంబాబు పాల్గొన్నారు.

జయప్రకాశ్‌ను అభినందిస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గంలో దోనెపూడి

గాంధీనగర్, న్యూస్‌టుడే : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన దోనెపూడి శంకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. గురువారం దాసరి భవన్‌లో ట్యాక్సీ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్, యువజన సమాఖ్య, వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.రామాంజనేయులు, లంక దుర్గారావు, బుట్టి రాయప్ప, ఎం.సాంబశివరావు, రాము, రమణారావు, లంక గోవిందరాజులు, మందలపు శ్రీనివాసరావు, పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

'వ్యాపారులను ఒత్తిడి చేయడం తగదు'

గాంధీనగర్, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది వ్యాపారుల దుకాణాలకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ లేని వారికి భారీ జరిమానాలు విధిస్తామని చెప్పడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు.. ఈ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. గత 5ఏళ్లుగా ఆ శాఖ అధికారులు వ్యాపారులకు ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేయలేదని చెప్పారు. వెంటనే చెల్లించాలని వ్యాపారులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కేసులు కట్టడంలో తీవ్ర జాప్యం

నున్న పోలీసుల తీరుపై విమర్శలు

☛ శాసనసభలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న మునిరాజా తనను లైంగికంగా వేధిస్తున్నాడని, నగదు తీసుకుని ఇవ్వడం లేదని ఈ నెల 2వ తేదీన ఎల్బీఎస్ నగర్‌కు చెందిన ఓ మహిళ నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేషన్ చుట్టూ తిరిగినా పోలీసులు కేసు కట్టడంలో జాప్యం చేశారు. దీనిపై ఆమె గట్టిగా నిలదీయడంతో.. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

☛ కొందరు యువకులు గంజాయి తాగి.. తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పాయకాపురం ఎల్బీఎస్‌నగర్‌కు చెందిన మహిళలు గత నెల 20వ తేదీన ఫిర్యాదు చేశారు. కానీ నున్న పోలీసులు పట్టించుకోలేదు. ప్రజలు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించడంతో.. నాయకులు సీపీ కార్యాలయంలో పంచాయితీ పెట్టారు. పోలీసులు వెంటనే ఆకతాయిలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేశారు.

పాయకాపురం, న్యూస్‌టుడే

విజయవాడ నగర శివారులోని నున్న, అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్కువగా పేదలు నివసిస్తున్నారు. వాంబే కాలనీలోని హెచ్ బ్లాక్‌లో 28 భవనాల్లో ప్రజలు ఉంటున్నారు. ఇక్కడ గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సరకు కొని.. తాగుతున్నవారు మత్తులో జోగుతున్నారు. స్థానికులను భయపెడుతున్నారు. దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ విషయాలు పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్టేషన్ చుట్టూ తిరగాల్సిందే..

బాధితులు తమ సమస్యలపై నున్న పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేయడం లేదని ఫిర్యాదిదారులు వాపోతున్నారు. పైగా బాధితులనే స్టేషన్ చుట్టూ తిప్పిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితిలో కేసు నమోదు చేయాల్సి వస్తే.. తేలికపాటి సెక్షన్లు పెడుతున్నారని.. బాధితులకు తెలియకుండానే నామమాత్రపు అపరాధ రుసుముతో కోర్టులో కేసును మూయించేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతోందని బాధితులు మండిపడుతున్నారు.

ఫిర్యాదులకు రసీదులు ఇస్తే బాగు..

2014-2019 మధ్య కాలంలో అప్పటి తెదేపా పరిపాలనలో.. ఎవరైనా స్టేషన్‌లో ఫిర్యాదు పత్రం ఇస్తే వెంటనే రసీదు ఇచ్చే పద్ధతిని అమలు చేశారు. 24 గంటల్లో కేసు కట్టామనో. . లేక విచారించి పిటిషన్ క్లోజ్ చేశామనో సందేశం ఫిర్యాదుదారులకు వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పోలీసులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2025లో నున్న స్టేషన్‌లో మొత్తం 526 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తే.. బాహ్య ప్రపంచానికి తెలిసినవి 60లోపే ఉన్నాయి.

బాధితులు మళ్లీ రావడం లేదు

బాధితులు ఫిర్యాదు చేశాక మళ్లీ తిరిగి రావడం లేదు. కేసు నమోదు చేయాలని కోరడం లేదు. దీంతో కేసుల నమోదులో ఆలస్యం అవుతోంది.

- కృష్ణమోహన్, సీఐ, నున్న

యువకుడిపై పోక్సో కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : బాలిక వెంట పడుతూ అసభ్యంగా మాట్లాడుతున్న యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలిక ముత్యాలంపాడులో 8వ తరగతి చదువుతోంది. రోజూ పాఠశాలకు వెళ్లే సమయంలో.. సుభానీ అనే యువకుడు వెంటాడి అసభ్యంగా మాట్లాడుతున్నాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గురువారం కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో నిందితుడిని బాధిత కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేశారు. ఎందుకు వెంట పడుతున్నావని ప్రశ్నించగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో ఆగ్రహంతో దాడి చేసి కొట్టారు. దీనిపై సుభానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు చేశారు.

న్యాయవాదికి సైబర్ నేరగాళ్ల టోకరా

మధురానగర్, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్లు రామకృష్ణాపురానికి చెందిన ఒక న్యాయవాది నుంచి రూ.1.74 లక్షలు కొట్టేశారు. న్యాయవాది చరవాణికి ట్రేడింగ్ పేరిట లింక్ రాగా.. దాన్ని క్లిక్ చేసి బయోడేటా ఇతర వివరాలు నింపారు. ఆ తర్వాత అతని ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయి. ఆయన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సింహ గర్జన జయప్రదానికి పిలుపు

గాంధీనగర్, న్యూస్‌టుడే : అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించే బీసీ సింహ గర్జనను జయప్రదం చేయాలని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణరావు పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాపరంగా రాష్ట్రంలో అత్యధిక శాతం బీసీలు ఉన్నా ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని.. రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. త్వరలోనే ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో యాదవులకు అవకాశం కల్పించాలని, ప్రతి జిల్లాలో భవనాలు నిర్మించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పి.శ్రీనివాస్ యాదవ్, సూర్య, సింగయ్య, కృష్ణ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : కార్యకర్తలే తెదేపాకు ప్రాణమని, వారి సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతిచెందిన తెదేపా కార్యకర్త ఇప్పిలి రాంబాబు కుటుంబానికి కార్యకర్తల సహాయనిధి ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాంబాబు నిబద్ధతతో సేవలు అందించారని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. బొండా సిద్ధార్థ, ఘంటా కృష్ణమోహన్, లక్కంరాజు శ్రీనివాసరాజు, కరణం వెంకటరమణ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : కేదారేశ్వరపేట 3వ లైనుకు చెందిన గడ్డం సంతోషి ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ భర్త దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ కొద్ది కాలం నుంచి మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 13న ఉదయం 5 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. ఆమె కోసం అన్ని చోట్ల వెతికినా.. ఎక్కడా కనిపించలేదు. బుధవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు భర్త ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, 4 గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

● **ఉదయం:** 5 గంటల నుంచి భక్తులను క్యూలైన్లో అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, 7 గంటలకు రుద్ర హోమం, 7.30 గంటలకు నవగ్రహ శాంతి హోమం, 8 గంటలకు మృత్యుంజయ హోమం, 8.30 గంటలకు చండీహోమం నిర్వహిస్తారు. పూజా మండపంలో ఉదయం 7.30 గంటలకు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

✦ అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచభోగ నివేదన చేస్తారు. ఈ సమయంలో అన్ని క్యూలైన్లు నిలిపి వేస్తారు.

● **మధ్యాహ్నం:** ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు.

● **సాయంత్రం:** 4 గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 గంటల నుంచి 7 గంటల వరకు నివేదన, వేద స్వస్తి, పంచహారతులు నిర్వహిస్తారు. ఈ సమయంలో అన్ని దర్శనాలు నిలిపి వేస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

✦ ప్రతి రోజు రాహుకాలంలో నటరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టికెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే అనుమతిస్తారు. /www.kanakadurgamma.com,https:///www.aptemples.ap.gov.in వెబ్ సైట్లలో ఆర్జిత సేవా టికెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్సాప్ నంబరు 95523 00009లో ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

✦ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మల్లికార్జున మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తారు.

✦ దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గా నగర్ మెట్ల మార్గం, అర్జున వీధిలో ఆన్‌లైన్ కౌంటర్లలో దర్శనం, ఆర్జిత సేవల టికెట్లు తీసుకునేందుకు వీలుగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

శాప్ లీగ్ చదరంగం పోటీలకు స్పందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17న అన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి శాప్ లీగ్ చెస్ పోటీలకు విశేష స్పందన లభించిందని శాప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో అండర్-13, 15, 17, 19 బాలబాలికల విభాగాల్లో 2,445 మంది తలపడగా వీరి నుంచి 360 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

గుంత పూడ్చరూ..!

వాంబేకాలనీ ఎక్స్‌ఎల్ ప్లాంట్ సమీపంలోని రహదారిపై కల్వర్టు వద్ద గుంత ఏర్పడింది. ప్రమాద సంకేతంగా స్థానికులు రాయి ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో దీనిని గుర్తించని పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

ప్రకటన

నా క్లయింట్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్.ఎ.సి.పి.సి. లోన్ సెంటర్ వారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని దైత ఆంజనేయులు గారు వారి ప్రథమ భార్య అయిన దైత మాణిక్యమ్మ గారికి స్థిరాస్తిని దఖలుపరిచి దైత ఆంజనేయులు గారి పేరుతో 02-11-1944వ తేదీన ఒక దఖలు దస్తావేజును రాయించి, సదరు దస్తావేజును, బెజవాడ సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెంబరు 606-1944గా రిజిస్టర్ చేయించి ఇచ్చియున్నారు. [illegible]

య.ఎస్. పవన్‌కుమార్, అడ్వకేట్ [illegible]

ప్రకటన

[illegible]

య.ఎస్. పవన్‌కుమార్, అడ్వకేట్ [illegible]

మృత్యుఘడియలు!

సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్యనే అధిక రోడ్డు ప్రమాదాలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. అధిక వేగం.. వ్యతిరేక మార్గాల్లో ప్రయాణించడంతోపాటు మద్యం మత్తులో వాహనాలు నడపడం అధిక శాతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జిల్లాలో ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది కాలంలో ప్రమాద గణాంకాలను పరిశీలిస్తే మూడోవంతు ఈ సమయాల్లోనే జరిగినట్లు తేటతెల్లమవుతోంది. ఈ ఘడియల్లో పోలీసులు, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు కొంతవరకైనా అరికట్టి విలువైన ప్రాణాలు కాపాడే అవకాశం ఉంది.

త్వరగా చేరుకోవాలని..: జిల్లాలో పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లిలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. వీటిలో పనిచేసే వేలాదిమంది రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగిస్తారు. ఉదయం విధులకు ఆలస్యమైపోతోందనే అధికవేగంతో.. సాయంత్రం త్వరగా ఇంటికి చేరుకోవాలనే ఆరాటంతో అధిక వేగంతో ప్రయాణాలు సాగించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

» పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు సైతం నిత్యం తిరుగుతాయి. దీంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్వారీ లారీలు బండరాళ్లతో రాంబిల్లిలో ప్రత్యామ్నాయ నావికా స్థావరానికి వెళ్తాయి. అనకాపల్లి నుంచి నక్కపల్లి శివారు వరకు జాతీయ రహదారి ఇరుకుగా ఉండటం, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

» **సాయంత్రం 6 నుంచి రాత్రి 9 మధ్య కొందరు మద్యం తాగి ఆ మత్తులో నడపడంతో వాహనాలు అదుపుతప్పి నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.**

» జిల్లా పరిధిలో నాలుగు వరసల జాతీయ రహదారి ఉండటం, పరిశ్రమలకు రాకపోకలు చేసే వాహనాల రద్దీ అధికంగా ఉండటం, ద్విచక్ర వాహనదారులు అధికవేగంతో ప్రయాణాలు చేయడమూ ప్రమాదాలకు కారణమవుతోంది

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిలో ప్రమాదకర కూడళ్లు, సూచికలు, బ్లింకర్లు, లైట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులకు లేఖలు రాశాం. గతంలో పోల్చితే ప్రమాదాల తీవ్రత స్వల్పంగా తగ్గింది. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న సమయాలను గుర్తించాం. ఆయా సమయాల్లో కీలక కూడళ్లలో అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశాలిచ్చాం.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

జిల్లాలో గత ఏడాది ప్రమాదాల జరిగిన సమయాలివీ

	సమయం	మొత్తం ప్రమాదాలు
ఉదయం	06 - 09	67
ఉదయం	09 - 12	114
మధ్యాహ్నం	12 - 03	111
సాయంత్రం	03 - 06	109
రాత్రి	06 - 09	129
రాత్రి	09 - 12	60
అర్ధరాత్రి	12 - 03	22
వేకువజామున	03 - 06	36
మొత్తం		648

రంజాన్ వేళలు

ఇఫ్తార్: శుక్రవారం సాయంత్రం 6:04 గం॥లకు

సహరి: శనివారం తెల్లవారుజాము 5:05 గం॥లకు

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

కశింకోట, న్యూస్‌టుడే: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాస ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. కశింకోట జామియా, నూరీ మసీదుల్లో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందుకు పిల్లలు, పెద్దలు హాజరై ఉపవాస దీక్షను విరమించారు.

నూరీ మసీదులో ఇఫ్తార్ విందు

కళ్ల ముందు శౌర్యం.. ఇదీ దేశ ధైర్యం!!

- మిలన్ విన్యాసాల్లో అబ్బురపరిచిన సాహసాలు
- ఆకట్టుకున్న అంతర్జాతీయ సిటీ పరేడ్

ఈనాడు–విశాఖపట్నం: విశాఖ సాగర తీరం 'ఓ సైనికా' అంటూ దేశభక్తితో మార్మోగింది. భారత నావికాదళం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మిలన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. సముద్ర రక్షణలో నావికుల శౌర్యాన్ని ప్రతిబింబిస్తూ చేపట్టిన విన్యాసాలు, కవాతులు ప్రతి ఒక్కరిని కట్టిపడేశాయి. ఆర్కేబీచ్‌లో ప్రతిధ్వనించిన బ్యాండ్‌లు, గర్వాన్ని నింపుతున్న నావికుల అడుగుల మోతలు తీర ప్రాంత వాతావరణానికి మరింత ఉత్సవ కళను అద్దాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తీరంలో యుద్ధ ట్యాంకులు

పైలెట్‌ల శిక్షణకు, దాడులకు ఉపయోగించే ఫాంటమ్స్ అని పిలిచే హాక్-ఏజేటీ.. ఫైటర్ జెట్ విమానాల నుంచి బాంబులు వదిలిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా సాగాయి.

నేవీ సిబ్బంది విన్యాసాలను తిలకిస్తున్న ప్రజలు

★ నిశ్శబ్దంగా సముద్ర లోతుల్లో దాక్కొని శత్రు నౌకలు, జలాంతర్గాములపై దాడులకు ఉపయోగించే నేవీ సబ్‌మెరైన్ల రహస్య, విధ్వంసక శక్తిని తెలియజేసేలా 'సబ్‌మెరైన్ సెయిల్ పాస్ట్' పేరుతో నిర్వహించిన ప్రదర్శన కనువిందుగా సాగింది.

★ దేశంలోని అత్యున్నత మెరైన్ కమాండోలు (మార్కోస్) ధ్రువ్ హెలికాప్టర్ల నుంచి ప్రదర్శించిన ధైర్య సాహసాలు మాటల్లో వర్ణించలేనివి.

★ ఆయిల్ రిగ్ భారీ పేలుడు, ఆ వెంటనే మార్కోస్ దాడి.. పడవలపై ఆరెంజ్ పొగను వదులుతూ మిషన్ విజయవంతమంటూ ప్రదర్శించిన తీరు చూసి తీరాల్సిందే అన్నట్లు సాగింది.

● యాంటీ సబ్‌మెరైన్ రాకెట్లను శత్రు జలాంతర్గాములు, నౌకలపైకి ఎలా ఫైర్ చేస్తారనే డెమో ఆకట్టుకుంది.



సిటీ పరేడ్‌లో ఆకట్టుకున్న కవాతు

★ కమాండోలు తమ పారాచూట్‌ల సాయంతో శత్రు భూభాగంలో కచ్చితంగా ఎలా నైపుణ్యంతో దిగుతారో ప్రదర్శించారు.

★ నేవీ కార్యకలాపాల్లో అంతర్భాగమైన హెలికాప్టర్లు సముద్రంలో కీలక పాత్ర పోషిస్తాయి. యుద్ధ, నావికా నౌకలపై అవి ఎలా దిగుతాయి.. ఎలా నౌకలపై నుంచి ఎగురుతాయి అనే పైలెట్‌ల నైపుణ్యాలను 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు.

★ ఓడలో నావికుల జీవితాన్ని, విధులను ప్రతిబింబించేలా శారీరకంగా, ఆరోగ్యంగా ఉండటానికి 'హార్న్ పైప్' నృత్యం ఎంతో వినోదం కలిగిస్తుంది. సీ క్యాడెట్ కార్ప్స్ ప్రదర్శించిన ఈ నృత్యం అలరించింది.

★ చేతక్ హెలికాప్టర్లను ఏంజెల్స్ అని పిలుస్తారు. నాలుగు చేతక్‌లు సామర్థ్యాలను సమన్వయంగా ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది.

తీర ప్రాంత భద్రతపై చర్చ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: తీర ప్రాంత భద్రతపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన గురువారం వర్చువల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, ఈఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో విశాఖలో సుమారు 28.81 కి.మీ. తీరప్రాంతం అధిక కోతకు, 46.2 కి.మీ మేర మధ్యస్థ లేదా తక్కువ కోతకు గురయ్యే అవకాశం ఉందని కమిషనర్ వివరించారు. 30 గ్రామాలు, 60 వేల మంది ప్రజలు నేరుగా ప్రభావితం అవుతున్నట్లు పేర్కొన్నారు. ముప్పు పొంచి ఉన్న కీలక ఆస్తుల్లో కురుసురా సబ్‌మెరైన్ మ్యూజియం, గోకుల్ పార్క్, టీయూ-142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం, వివిధ పార్కులు, ప్రీమియం హోటళ్లు, విశాఖ-భీమిలి ప్రధాన రహదారి ఉన్నట్లు కమిషనర్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ. 28 లక్షలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్టీసీకి రూ. 28.03 లక్షల ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి వి ప్రవీణ తెలిపారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తూనే ఈ ఆదాయాన్ని పొందామని ఆమె వివరించారు. కల్యాణపులోవకు 84, పుణ్యగిరికి 10, ధారమఠంకు 10 బస్సులు నడిపామన్నారు. గతేడాది 89 బస్సులను 89 శాతం ప్రయాణికుల శాతంతో (ఓఆర్) నడపగా, ఈ ఏడాది 104 బస్సులను 124 శాతం ఓఆర్‌తో నడిపామని ఆమె వివరించారు. డిపో మేనేజర్ హనుమశ్రీ, సహాయ మేనేజర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

WALK-IN-INTERVIEW

పేరం గ్రూప్ Peram Group

PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

❖ADVOCATES	6 No's (2-3 yrs. exp)
❖OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
❖ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
❖ADMINS	8 No's (1-5 yrs. exp)
❖DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
❖STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
❖MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
❖DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
❖MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
❖VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
❖FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
❖EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
❖VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
❖DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
❖PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
❖PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
❖JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
❖SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
❖SURVEYORS	2 No's (2-3 yrs. exp)
❖LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
❖LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
❖CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
❖BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
❖MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
❖ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
❖CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)

D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969

నర్సీపట్నంలో జాబ్‌మేళా 24న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరగనుంది. టెక్లింక్స్ ఇన్నోవేషన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, టాటా ఎలక్ట్రానిక్స్, అరబిందో ఫార్మా, హానర్ ల్యాబ్ తదితర 15కు పైగా కంపెనీల ప్రతినిధులకు హాజరవుతారని స్కిల్ హబ్ ప్రతినిధి కొర్రా శ్రీనివాస్ చెప్పారు. వివరాలకు 90000 92227 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఈలోగా ఓ పుస్తకం చదవండి!

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మినీ గ్రంథాలయం

చోడవరం, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే మొత్తం పనంతా పూర్తవడానికి సాధారణంగా మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. క్రయవిక్రయాల నిమిత్తం వచ్చిన వారంతా ఫోన్ చూసుకుంటూనో.. పక్కనున్న వారితో మాట్లాడుతూనే సమయం గడిపేస్తుంటారు. చోడవరం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే మాత్రం సమయం ఎలా గడిచిపోతుందో తెలియదు. ఎందుకంటే ఇక్కడ విజ్ఞాన సంపదను పెంపొందించుకునేలా ఓ గ్రంథాలయం కనిపిస్తుంది.

చోడవరం నడిబొడ్డున రిజిస్ట్రారు కార్యాలయం ఉంది. ఇక్కడ నిత్యం వివిధ పనుల కోసం వచ్చేవారితో సందడిగా ఉంటుంది. వచ్చినవారికి ఇబ్బంది కలగకుండా ఎదురుచూడటానికి ఇప్పటికే సిమెంటు బల్లలను ఏర్పాటు చేయించారు. వచ్చిన పని పూర్తయ్యేవరకు ఖాళీగా కూర్చోకుండా పుస్తకాలతో కాలక్షేపం చేయడానికి ఓ మినీ గ్రంథాలయాన్ని సబ్‌రిజిస్ట్రార్ గీతాలక్ష్మి ఏర్పాటు చేయించారు. విజ్ఞానం, వినోదం, పఠనాసక్తి కలిగిన రకరకాల పుస్తకాలతో పాటు కథలు, నవలలు వంటి పుస్తకాలను ఇక్కడ పొందుపరిచారు. కార్యాలయానికి వచ్చినవారంతా వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు.

కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

ఖాళీగా ఉండకూడదని..

సమయం చాలా విలువైనది. దాన్ని వృథా చేయకూడదు. ముఖ్యంగా మా కార్యాలయాలకు వచ్చే వారంతా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆవరణలోనే గడపాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి వారి కోసం మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. అందరూ మినీ గ్రంథాలయంలోని పుస్తకాలు తీసుకొని ప్రశాంతంగా చదువుకునేందుకు రేకుల షెడ్డు ఉంది. దాదాపు 100 పుస్తకాలు అందుబాటులో ఉంచాం.

– బి.గీతాలక్ష్మి, సబ్‌రిజిస్ట్రార్, చోడవరం

అటా.. ఇటా?

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల నడుమ కొత్త విమానాశ్రయం అనువైన స్థలం ఎంపిక అంశం అనకాపల్లి-కాకినాడ జిల్లాల మధ్య దోబూచులాడుతోంది. గతంలో కాకినాడ జిల్లాలోని అన్నవరం, తుని మధ్యలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఇందుకు భూములిచ్చే ప్రసక్తే లేదని అప్పట్లో రైతులు తేల్చిచెప్పారు. దానికితోడు అక్కడ సాంకేతికపరమైన ఇబ్బందులు రావడంతో అప్పట్లోనే పాయకరావుపేట, నక్కపల్లి మధ్య ఉన్న గోపాలపట్నం ఆవ పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. కానీ కాలక్రమంలో ఆ ప్రతిపాదనా తెరమరుగైంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 9 విమానాశ్రయాలు నిర్మించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా తుని, అన్నవరం మధ్య విమానాశ్రయం నిర్మించేందుకు అవసరమైన సవివర ప్రణాళిక నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ స్పష్టం చేసింది.

పాయకరావుపేట, నక్కపల్లి మండలాల మధ్య విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన భూములు

★ కాకినాడ, ఉప్పాడ ప్రాంతాల మధ్య సుమారు రూ. 67 వేల కోట్లతో పలు పరిశ్రమలు కొలువుదీరనున్నాయి. వీటికి సమీపంగా జిల్లాలోని నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కుపరిశ్రమ, పాయకరావుపేట మండల పరిధిలో జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్టీపీసీ) ప్లాంట్ నిర్మితం కానున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో విమానాశ్రయం నిర్మిస్తే పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తునికి రెండువైపులా దాదాపు 100 కి.మీ. దూరంలోని రాజమహేంద్రవరం, విశాఖలో విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తుని దగ్గర భూములు విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా లేవనే ఉద్దేశంతో అప్పట్లో నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అందువల్ల ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాకపోతే సమీప ప్రత్యామ్నాయం పాయకరావుపేటే కావడంతో ఈ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

ఇంటి నుంచే పంపేయొచ్చు!

తపాలాలో ఆన్‌లైన్ బుకింగ్!

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ఆన్‌లైన్ ట్రేడింగ్ ట్రెండ్‌గా మారింది. పాల ప్యాకెట్, కూరగాయలు మొదలు ఇంట్లోకి ఏది కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్ చేసే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ ట్రెండ్‌ను అందిపుచ్చుకుని ప్రభుత్వ సంస్థలు ఈ తరహా సేవలు అందిస్తున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ పార్సిల్ సేవలను అందిస్తోంది. తాజాగా తపాలా శాఖ ఆన్‌లైన్ బాట పట్టింది. 'బుక్ నౌ.. పే లేటర్' విధానంలో ఇంటి ముంగిట్లోనే సేవలు అందించేందుకు ముందుకొచ్చింది.

» జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లిలో తపాలా శాఖ ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో పార్సిల్ సేవలు అందించేందుకు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటయ్యాయి. నర్సీపట్నం హెడ్ పోస్టాఫీసు పరిధిలో 21 సబ్ కార్యాలయాలు, 500 పైగా బ్రాంచిలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు డాక్ సేవ యాప్‌ను సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి వద్దే పార్సిల్ సేవలు పొందవచ్చు. మనకు కావాల్సిన చిరునామాకు పార్సిళ్లను పంపవచ్చు. 'బుక్ నౌ.. పే లేటర్' పద్ధతిలో ముందుగా బుక్ చేసుకుని తర్వాత చెల్లింపులు చేయవచ్చు. పార్సిల్ బరువు కేజీ ఉంటే రూ. 60 చెల్లిస్తే సరిపోతుంది. దూరాన్ని బట్టి చెల్లించాల్సిన మొత్తం పెరుగుతుంది.

» చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారు తమ ఉత్పత్తులపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. ఇందుకు సొంత యాప్‌లు, అంతర్జాలాన్ని వేదిక చేసుకుంటున్నారు. ఇలాంటి వారందరికీ తపాలా శాఖ ప్లాట్‌ఫాం కానుంది. గృహోపకరణాలు, వివిధ రకాల వస్తువులు, నిత్యావసరాలు తదితర వాటిని మనకు కావాల్సిన ప్రాంతానికి చేరవేస్తోంది. డాక్ సేవ యాప్‌లో బుక్ చేయగానే తపాలా సిబ్బంది ఇంటికి వచ్చి పార్సిళ్లను తీసుకువెళ్తారు.

» ఈ సేవలు పొందేందుకు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి. వ్యక్తిగత, వినియోగదారుని చిరునామా, సరకు వివరాలు పక్కాగా పొందుపరచాలి. సెల్‌ఫోన్ నంబరు అందుబాటులో ఉంచాలి. బుకింగ్ అయిన వెంటనే ట్రాకింగ్ ఐడీ వస్తుందని నర్సీపట్నం తపాలా కార్యాలయం **పోస్టుమాస్టర్ హరీష్‌కుమార్** చెప్పారు. పార్సిళ్లు గమ్యస్థానం చేరే వరకు బాధ్యత వహించి ఎటువంటి అవరోధాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

Authorised Main Dealers: OLIVE TVS: VISHAKAPATNAM, Cell: 8142299966, **DHARMANA TVS:** GAJUWAKA, Cell: 7989851681, **OLIVE TVS:** N.A.D, Cell: 9182472619, **OLIVE TVS:** MVP COLONY, Cell: 8142299923, **OLIVE TVS:** MURALINAGAR, Cell: 8142299924, **OLIVE TVS:** PENDURTHY, Cell: 8142299970, **OLIVE TVS:** MADHURAWADA, Cell: 8142299972, **DHARMANA TVS:** MALKAPURAM, Cell: 9398656775, **DHARMANA TVS:** ANAKAPALLE, Cell: 8341546429, **Authorised Dealer: JHANVI TVS:** PADERU, Cell: 8341123619.

(c) eenadu

ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి చేరుకోండి

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మీరు సంతకం చేసే స్థాయి నుంచి ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి చేరుకోవాలని న్యాయమూర్తులు విద్యార్థినులకు సూచించారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటైంది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, స్థానిక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షియాజ్ ఖాన్ మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకుంటే ఆటోగ్రాఫ్ తీసుకునేందుకు మీ చుట్టూ ఉన్న వారు పోటీపడతారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చేవన్నీ నిజం కాదని గుర్తించుకోవాలన్నారు. సీఐ గఫూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు న్యాయమూర్తి సన్యాసినాయుడు స్థానిక ఉపకారాగారాన్ని సందర్శించారు. ఖైదీలతో సమావేశమై ఉచిత న్యాయ సహాయం పొందడం తదితర విషయాలపై సూచనలు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు సమస్యలపై వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

'ఐదు'లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: లింగరాజుపాలెంలోని జ్యోతిరావు పులే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మి గురువారం తెలిపారు. మార్చి 4 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చన్నారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

రగ్బీ కోచ్‌గా వెంకట్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రగ్బీ ఖేలో ఇండియా ఏపీ కోచ్‌గా కాండ్రపు నాగ వెంకటరావు అలియాస్ నియమితులయ్యారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20 నుంచి 23 వరకు రగ్బీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఏపీ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు నుంచి గురువారం నియామక పత్రం అందుకున్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాండ్రపు వెంకునాయుడు, కార్యదర్శులు జగదీశ్, సుధీర్, వెంకట్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోర్ల వివరాలు సేకరించండి

స్పందనకు వందనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రొయ్యల చెరువుల వద్ద అక్రమంగా వేసిన బోర్ల వివరాలు సేకరించాలని అధికారులు ఆదేశాలిచ్చారు. '20 మీటర్లకో బోరు - ఎవరూ అడ్డుకోరు' శీర్షికన ఈనెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దారు మహేశ్వరరావు సిబ్బందికి సూచనలిచ్చారు. ఆర్.ఐ., వీఆర్వోలు రొయ్యల చెరువులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బోర్ల తొలగింపునకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పొదుపు మహిళలకు ఆర్థిక తోడు

మార్చిలో విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాల అమలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం స్వల్ప వడ్డీకే రుణాలిచ్చేలా మూడు నెలల క్రితం ప్రకటించిన ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలను ఈ మార్చి నుంచి అమలు చేసేందుకు నిర్ణయించింది. దీని ద్వారా జిల్లాలో లక్షలాది మంది మహిళలకు ఆర్థిక తోడు కలగనుంది.

డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా స్త్రీ సాధికారికత చాటిచెప్పిన సీఎం చంద్రబాబునాయుడు తర్వాత కాలంలో అనుసంధానంగా అనేక పథకాలు అమలుచేసి తోడుగా నిలిచారు. తాజాగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు. వీటిని ప్రపంచ మహిళా దినోత్సవమైన మార్చి ఎనిమిది నుంచి అమలులోకి తేనున్నారు. ఇదే సమయానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు కావస్తుండటం విశేషం. దీని పరిధిలోని స్త్రీ నిధి బ్యాంకు ద్వారానే ఈ రుణాలు ఇవ్వనున్నారు. జిల్లాలోని డ్వాక్రా సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కొందరు మహిళలు బాగా ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో వీరికి కుటుంబ వ్యక్తిగత అవసరాలు నిమిత్తం ప్రైవేటు రుణాలను అధిక వడ్డీలకు తీసుకుంటున్నారు. ఇది భారంగా మారింది. ఇక స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణంపై దాదాపు రూపాయి వడ్డీ ఉంటుంది. దీంతో కేవలం పావలా వడ్డీకే విద్య, కల్యాణ లక్ష్మీ పథకాల ద్వారా గరిష్ఠంగా రూ. లక్ష రుణం ఇవ్వనున్నారు. దీన్ని తీర్చడానికి నాలుగేళ్ల కాల పరిమితి ఇవ్వనున్నారు.

రుణాలు పొందేది ఇలా...

★ సభ్యురాలి కుటుంబంలో ఇద్దరు పిల్లలు పాఠశాల/కళాశాలల్లో చదివితే వారి చదువు నిమిత్తం నగదు అవసరమైతే రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు ఇవ్వనున్నారు. ఇందుకోసం సంబంధిత పాఠశాల/కళాశాలలో చేర్పించిన ప్రవేశ పత్రం, ఫీజు వివరాల రసీదు చూపించాలి.

★ కుటుంబంలో వివాహం చేయాల్సిన కుమార్తె ఉంటే పెళ్లి ఖర్చుల నిమిత్తం ఇదే తరహాలో గరిష్ఠంగా రూ. లక్ష వరకు రుణం ఇస్తారు. దీనికి పెళ్లి శుభలేఖ, వివాహ ఖర్చు అంచనా వివరాలను సమర్పించాలి. దీన్ని పరిశీలించిన అధికారులు అర్హత ఉంటే రెండు రోజుల్లోనే వారి ఖాతాలకు కేటాయించిన రుణ నగదు జమచేస్తారు. ★ సభ్యురాలు సంఘంలో చేరి కనీసం ఆరునెలలై ఉండాలి. బ్యాంకు, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు తీసుకుని ఉన్నా, వాటిని సక్రమంగా చెల్లిస్తూ ఉంటేనే అర్హత పొందుతారు. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం మొత్తం మాఫీ అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

వ్యక్తిగత రుణాలను తక్కువ వడ్డీకి ఇవ్వడం అనేది చాలా మంచిని ర్ణయం. వేలాదిమందికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. దీనికి సంబంధించి విధివిధానాలను ఉన్నతాధికారులు వెల్లడిస్తారు. లబ్ధి పొందే వారంతా రుణాలు సద్వినియోగం చేసుకోవాలి. - కె.శ్రీనివాసరావు, ఏపీఎం

జిల్లాలో డ్వాక్రా ఇలా	మొత్తం సంఘాలు:	సభ్యులు:	బ్యాంకు లింకేజీ రుణం:	స్త్రీనిధి రుణం:	ఉన్నతి రుణం:
	39,553	4,09,467	రూ. 1317 కోట్లు - 95,531 మంది సభ్యులు	రూ. 220 కోట్లు - 39,131 మంది సభ్యులు	రూ. 9 కోట్లు - 1,704 మంది సభ్యులు

చోరీ నెపం మోపారనే ఆవేదనతో ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చేయని నేరం తనపై మోపారనే ఆవేదనతో పదో తరగతి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో పొలంలో పాక దగ్గరకి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు స్నేహితుడికి ఫోన్ చేసి తన ఆవేదన వెళ్లబోసుకున్నాడు. ఆ మాటలు ఫోన్‌లో రికార్డు అయ్యాయి. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కొండెంపూడి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి (17) వడ్డాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల గ్రామంలోని ఓ ఇంట్లో జరిగిన వెండిపట్టీల చోరీపై సదరు వ్యక్తులు ఆ విద్యార్థిని నిలదీశారు. దీంతో తనకి సంబంధం లేదంటూ అతడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం పశువుల పాక దగ్గరకు వెళ్లి నిద్రపోతానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి స్నేహితుడికి ఫోన్‌చేసి తన చావుకు నేరం మోపినవారే కారణమంటూ ముగ్గురి పేర్లు తెలిపాడు. అవతలి వ్యక్తి ఇదేంటని.. ఎక్కడికి వెళుతున్నావని ప్రశ్నించినా... తాను చెప్పినట్లు చేయమని కోరి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడి సంద్రంలో బోటు ఆగిపోతే...

అవగాహన కల్పిస్తున్న మత్స్య అధికారులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నడి సముద్రంలో బోటు ఆగిపోతే చేయాల్సిన అత్యవసర మరమ్మతులపై మత్స్యకారులకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. పూడిమడకలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా మత్స్యఅభివృద్ధి అధికారిణి విజయ ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది హాజరై మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. పీఎంఎంఎస్‌వై పథకం, ఎన్‌డీబీ నిధులతో మత్స్యకారులకు ఇంజిన్లు అందిస్తామన్నారు. సాంకేతిక బృందం హరినాథ్, అర్జున్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు ఇంటర్ ప్రశ్నపత్రాలు

వాహనం నుంచి ప్రశ్నపత్రాల కట్టలు దించుతున్న సిబ్బంది

అనకాపల్లి పట్టణం, నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షల ప్రశ్న పత్రాలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు సంబంధించి వీటిని జిల్లాలోని 16 పోలీస్‌స్టేషన్‌లకు గురువారం పంపారు. ముందుగా ఒకసెట్ వచ్చాయి. మరో రెండు సెట్లు శుక్రవారం రానున్నాయి. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష పత్రాలను జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల వద్ద భద్రపరిచి ఎంపిక చేసిన సెట్ పత్రాలతో పరీక్షలు రాయిస్తామని జిల్లా ఇంటర్ బోర్డు అధికారి వినోద్‌బాబు తెలిపారు.

ఎవరెస్ట్ పర్వతారోహణకు జోగుంపేట విద్యార్థి

విద్యార్థి హరిశ్రీదుర్గాప్రసాదును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గొలుగొండ, న్యూస్‌టుడే: ఎవరెస్ట్ పర్వతారోహణకు జోగుంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి అర్హత సాధించాడని ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు. మూగవాడైన ఎల్.హరిశ్రీదుర్గాప్రసాద్‌ను జోనల్ స్థాయిలో అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్వాహకులు నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో గతేడాది డిసెంబరు 6న ఎంపిక చేసి కడప జిల్లా గండికోటలో నెల రోజుల శిక్షణకు పంపినట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ అనంతరం ఎవరెస్ట్ అధిరోహణకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ప్రస్తుతం లద్దాఖ్ హై ఆల్టిట్యూడ్ కేంద్రంలో ఇందుకు అవసరమైన శిక్షణ పొందుతున్నాడని పేర్కొన్నారు. మనోధైర్యం ఉంటే వైకల్యం అడ్డుకాదని నిరూపించడం గర్వకారణమని పేర్కొంటూ దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

ఛత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తిదాయకం

అనకాపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు ఛత్రపతి శివాజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఎస్‌డీ సంస్థల ప్రతినిధి కాండ్రేగుల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని గురువారం నిర్వహించారు. సేవా సంస్థ నిధులతో శివాజీ విగ్రహాన్ని నెహ్రూచౌక్ కూడలిలో నెలకొల్పారు. శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి సభ్యులతో కలిసి నివాళులర్పించారు. సంస్థ వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, డీవీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, కుంచా చిన్ను, దాడి ఈశ్వరరావు, మళ్ల శివ, బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెతకంశెట్టి జీవితం నేటితరానికి ఆదర్శం

మునగపాక, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనర్సింహం జీవితం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందని గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. మునగపాక మండలం నాగులాపల్లిలో మాజీ ఎంపీ అప్పలనర్సింహం 90వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి సురేంద్రతోపాటు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 600 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సురేంద్ర మాట్లాడుతూ అప్పలనర్సింహం గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేసి అన్న ఎన్టీఆర్ మన్ననలు పొందారన్నారు. మౌర్య మాట్లాడుతూ అప్పలనర్సింహం ఆశయసాధనకు కృషి చేస్తామన్నారు. పెతకంశెట్టి రాజునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, సహకారం సంఘం మాజీ ఛైర్మన్ మళ్ల ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు ఆడారి మంజు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట విజయ్, మళ్ల కాళేశ్వరరావు, దొడ్డి శ్రీను, గోసాల గోవింద, మురళి, దాడి మునిలినాయుడు, వేగి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మౌర్య, సురేంద్ర

ఇసుక ట్రాక్టర్, ఆర్టీసీ బస్సు ఢీ

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అడ్డూరు గ్రామ సమీపంలో గురువారం ఇసుక ట్రాక్టర్‌ను విశాఖ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 15 మందికి గాయాలయ్యాయి. చోడవరం నుంచి విశాఖ వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. ఎస్సై నాగకార్తిక్ సిబ్బందితో చేరుకొని గాయపడిన ప్రయాణికులను చోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు, ముఖంభాగంలో చంద్రబోస్, దేవి, వెంకటసత్యనారాయణ, భవానీ, బాలరాజు తదితరులకు గాయాలయ్యాయి. వారికి వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

దెబ్బతిన్న బస్సు ముందు భాగం

క్రికెట్ పోటీల్లో ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు ఆంధ్ర విశ్వ విద్యాలయం సెంటినరీ క్రికెట్ టోర్నమెంట్ క్రికెట్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గెల్లా జయబాబు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష, కరస్పాండెంట్లు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, పెంటకోట వెంకట రామారావు, వైస్ ప్రిన్సిపల్ నిరంజన్‌కుమార్ అభినందించారు. ★ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు విశాఖలో జరుగుతున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో పాలుపంచుకున్నారని ప్రిన్సిపల్ జయబాబు తెలిపారు. విద్యార్థులు దుర్గాప్రసాద్, హేమంత్ కుమార్, శృతి, తనూజ, యోగిత, శ్రావణి ప్రియ, నీలిమ, సోమేశ్వరిలను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో పీఏసీఎస్ ఉద్యోగులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), ఎలమంచిలి, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం పీఏసీఎస్ ఉద్యోగులు నిరహార దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణరావు, రమణ, అనకాపల్లి, ఎలమంచిలి, అచ్యుతాపురం బ్రాంచ్‌లకు చెందిన ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శివరామకృష్ణ కోరారు. డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 24 ఎలమంచిలి బ్రాంచి వద్ద సమ్మె చేస్తామన్నారు.

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం

విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ : ఫోన్ నెం. 0891-2764949
Website: www.simhachalamdevasthanam.net
Email: endow-eosvlnsd@gov.in, jc_eo_simhachalam@yahoo.co.in

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ మరియు సీల్డ్ కొటేషన్స్ షార్ట్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం.Engg/01/2026 తేది: 19-02-2026

శ్రీ స్వామి వారి కొండపైన మరియు కొండ దిగువ వార్షిక ఉత్సవ పనులు మరియు అభివృద్ధి పనులు సివిల్ మరియు ఎలక్ట్రికల్ (11 Nos) పనులకు గాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ పిలుచుటకు (7 రోజులు) మరియు సివిల్, ఎలక్ట్రికల్ సీల్డ్ కొటేషన్స్ పనులు (6 Nos) గాను సీల్డ్ కొటేషన్స్ కోరడమైనది. (7రోజులు).

షెడ్యూల్ జారీ చేయు తేది	: 20.02.2026 నుండి తేది.27.02.2026 వరకు
షెడ్యూల్ దాఖలు చేయు ఆఖరి తేది	: 28.02.2026 సాయంత్రం 04.00 వరకు
సీల్డ్ కొటేషన్లు తెరుచు తేది	: 28.02.2026 సాయంత్రం 04.30 గం.లకు

పై పనులకు www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు పిలువబడమైనది. Website: www.simhachalamdevasthanam.net

Contact No: +91 9618072527, +91 8519807173, +91 7659990664, +91 9177444441

సం/- జె.వెంకటరావు, కార్యనిర్వాహణాధికారి.

చీటీల పేరుతో మోసం.. దంపతుల అరెస్టు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చీటీల పేరుతో పలువురికి టోపీ పెట్టిన దంపతులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖరరావు కథనం ప్రకారం... హరిపాలెంలో నివాసం ఉండే దంపతులు కలగర్ల లత (సౌజన్యలత), శ్రీనివాసరావు 20 ఏళ్లపాటు చీటీలు, గోల్డ్, సిల్వర్ స్కీమ్‌ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. మొదట్లో నమ్మకంగా అందరికీ డబ్బులు తిరిగిచ్చేవారు. ప్రజలకు వీరిపై నమ్మకం పెరగడంతో చిన్న మొత్తాల నుంచి అధిక మొత్తాల్లో డబ్బులు చీటీలు కట్టడం, డిపాజిట్లు చేయడం చేశారు. గడువు తీరినా తిరిగి డబ్బులు చెల్లించలేదు. డబ్బులు అడిగినా స్పందించకపోవడం, కొద్దిరోజులుగా పరారీలో ఉండడంతో ఈనెల 9న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిపాలెంలోనే రూ. 42 లక్షల వరకు వీరు వసూలు చేసినట్లు తెలిపారు. లాభాల ఆశ చూపించి మరో 50 మందిని మోసం చేసి రూ.1.5 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అచ్యుతాపురం పోలీసులు గురువారం దంపతులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

రూ.ఆరు వేల జరిమానా

రాంబిల్లి, న్యూస్‌టుడే: మోసం కేసులో నేరం రుజువుకావడంతో రాంబిల్లి మండలానికి చెందిన జోగా రమణమ్మకు ఎలమంచిలి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.రమేష్ రూ. ఆరు వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సీఐ నరసింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో రమణమ్మపై మోసం కేసు నమోదైందన్నారు. కోర్టు వాయిదాలు, వాదోపవాదాల అనంతరం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం రమణమ్మను దోషిగా తేల్చి జరిమానా విధించిందన్నారు. ప్రభుత్వం తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాస్మిన్ సుల్తానా వాదనలు వినిపించారు.

పోలీసులపై దాడికేసులో నలుగురి అరెస్ట్

రోలుగుంట, న్యూస్‌టుడే: విధి నిర్వాహణలో పోలీసులపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు కొత్తకోట సి.ఐ.కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 15న మహాశివరాత్రి సందర్భంగా బుచ్చెంపేటలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించడంపై అందిన సమాచారం మేరకు రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీనిపై ఎలాంటి అనుమతులు లేవని తక్షణమే నిలిపివేయాలని కోరగా.. నిర్వాహకులు బత్తి రవి, గొల్లు కృష్ణ, ప్రసాద్, ఇసంశెట్టి రాజునాయుడుతోపాటు మరికొందరు ఎస్సై, కానిస్టేబుల్‌పై తిరగబడి దాడి చేశారు. అడ్డుకున్న కొందరు గ్రామస్థులపైనా వీరు దాడిచేసి పోలీసులకు చెందిన మోటారు వాహనాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ వివరించారు. నిందితులను బుధవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఖజానా శాఖ ఉద్యోగుల పదోన్నతులకు కృషి



నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్, రమణ

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు గురువారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించారు. ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.జె.యేసుదాసు తెలిపారు. అధ్యక్షుడిగా పెనుమాక రాజు (ఏఏవో, డీజీపీ కార్యాలయం, మంగళగిరి) ఎన్నిక కాగా, సహాధ్యక్షుడిగా పి.శంకర్ (ఏటీవో, అనకాపల్లి) ఎన్నికయ్యారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	110
లైవ్	147	130
డ్రెస్డ్	213	230
స్కిన్‌లెస్	243	240

EENADU Classifieds

BUSINESS SERVICES

FINANCIAL SERVICES

HEALTH & CARE

PILES

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

3BHK, North facing 1300 sft with car parking(USD-33.89)2nd floor, 9th sector, Opp.Samata College, MVP Colony. Cont: 9494576200.

HOUSE FOR SALE

VZM ROAD

VZM JNTU Jn. towards RK township Nr. Crissa Daba, E/F, 222 Sq.Y. (33.3x60) 3B/R individual House for sale. Full residential area & vastu. ✆ 9703116256.

LAND FOR SALE

GENERAL

TO LET

COMMERCIAL

NAD

2000 Sft. First Floor Santhinagar, NAD Jn., Behind Old Spencers for Offices / Schools / Coaching Centers Lease / Rent. Rs: 25,000/ M. ✆ 8522936667.

JOBS

Part time Job, MNC only Retd. Person/ Sr. Citizen/ Housewives, Age: 50 & above, 10th Pass, Fixed Salary, ESI. ✆ 9966385515.

Wanted DTP Operator, MS Office, Photoshop Male or Female. Contact No: 9705929214, 8019929214.

Part Time Job MNC only Retd. Person/ Sr. Citizen/ House wives. Age: 40 above. 10th Pass. Fixed Salary, ESI. Ph: 9009204567.

WANTED ... Srinivasa Rao Madhurawada, Vizag. 9666838334, 8712644055

WANTED BTAH, Gajuwaka, Vizag.
1. OPERATORS for Loaders
2. OPERATORS for Excavators
3. SUPERVISORS Mechanical for dumpers
4. WELDERS
5. ELECTRICIAN For Dumpers
6. MECHANICS for Loaders & Excavators
7. SUPERVISORS (STORE) for Dupers Spares
7799506762

BMS, స్కడా సిస్టమ్ వర్క్‌లో పనిచేయుటకు యువతీ/ యువకులు (M/F) కావలెను. అర్హత: బి.కామ్ కంప్యూటర్స్, బి.టెక్. మంచి జీతం. వాట్సాప్: 9949129054.

WANTED
A Reputed Multi Crore Organisation Requires
DEVELOPMENT OFFICERS
BUSINESS PARTNERS
Qua: 40+ M/F
Prefer: Retd/VRS/Employees, Housewives, LIC Insurance
2 & 3 Years Marketing Experience
Yearly Package 12 Lakhs
M.RAMANI
P & T Colony, Vizag
88972 96440
89780 87956

SECURITY GUARDS

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ
SUBHAGRUHA
ఉద్యోగావకాశాలు
SALARY + INCENTIVES
8106863499
9010988707

గమనిక

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ 25 శాతం సీట్లు పేదలకే

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా అందజేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంఈఓ కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం అనకాపల్లి ఉడ్‌పేటలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న విద్యా సంవత్సరంలో 25 సీట్లు ఉచితంగా అందనున్నాయన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులకు అందేలా తల్లిదండ్రులకు సూచించనున్నామన్నారు.

తెరపై ఈనాడు

అనకాపల్లి పట్టణం: రాజా: హాయ్ బల్వంత్ రామచంద్ర: నిలవే వెంకటేశ్వర: స్వయం, చదువు పద్మ సత్యనారాయణ స్క్రీన్-1: అనగనగా ఒకరాజు, స్క్రీన్-2: అల్లా, షర్మిసాయి: మన శంకర వరప్రసాదగారు షిర్డిసాయి: విత్ఎవ్

అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: కపుల్ ఫ్రెండ్లీ స్క్రీన్-2: ఫంకీ

కరాటేలో శిక్షణతో ఆత్మ రక్షణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: ఆత్మ రక్షణ కోసమే బాలికలకు కరాటేలో శిక్షణ అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు ప్రభాస్ కుమార్ పేర్కొన్నారు. కొడవటిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం కరాటేలో శిక్షణ అందించారు. కరాటే మాస్టర్ అబ్బు ఆత్మరక్షణ కోసం ఉపయోగించే కొన్ని మెలకువలను బాలికలకు నేర్పారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలకు ఆత్మ రక్షణ క్రీడలు అవసరమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే నేర్పుతున్న ఉపాధ్యాయులు

అ వీ ఇ వీ

బొత్స క్షమాపణ చెప్పాలి: బుద్ద

అనకాపల్లి: హెరిటేజ్ సంస్థ బొత్స సత్యనారాయణ క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండు చేశారు. భక్తులను తప్పుదోవ పట్టించేలా వైకాపా నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి

నక్కపల్లి, న్యూస్‌టుడే: వేంపాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 92 మంది విద్యార్థులకు గురువారం ఇదే గ్రామానికి చెందిన పెనుమత్స అప్పలరాజు రాత సామగ్రి అందజేశారు. విజయవాడలో నివాసం ఉంటున్న అనంతలక్ష్మి సేవా సమితి ద్వారా విద్యకు ఆయన సహాయ సహకారాలు అందిస్తున్నారు. దాతకు హెచ్.ఎం. వరలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం: తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని కొనవానిపాలెం, గోకులపాడు గ్రామాల్లో రూ.41.40 లక్షలతో రోడ్ల నిర్మాణానికి గురువారం తెదేపా మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్దం, నాయకులు శంకుస్థాపన చేశారు. కొరుప్రోలు పీఏసీఎస్ ఛైర్మన్ గుర్రం రామకృష్ణ, భాజపా మండల అధ్యక్షుడు జోగినాయుడు, జనసేన నాయకులు శానాపతి బాబూరావు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హరిపాలెం, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగన్నపేట గ్రామాలకు శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు అనకాపల్లి ఈఈపీఎస్‌ఈ ఈఈ రాజశేఖర్, ఏఈ భాస్కరప్రకాశ్ చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు ఉండదన్నారు.

బార్ అనుమతులు రద్దు చేయాలి

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా నెహ్రూచౌక్ కూడలిలో నడుస్తున్న బార్ అండ్ రెస్టారెంట్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొప్పాకలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ వి.సుధీర్‌కు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఫోరం ఫర్ బెటర్ ఇండియా అధ్యక్షుడు గుడాల సత్యనారాయణ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫ్రిజ్ పేలి అగ్నిప్రమాదం

అనకాపల్లి పట్టణం: పట్టణంలోని వేల్పులవీధిలో ఆంజనేయస్వామి గుడి వద్ద జీవన్ 2 భవనంలో ఫ్రిజ్ పేలి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి సమయంలో ఈ ఘటనతో ఇంట్లో సామగ్రి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

గోవిందరావు సేవలు శ్లాఘనీయం

కొత్తూరు (అనకాపల్లి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే కోడుగంటి గోవిందరావు సేవలు శ్లాఘనీయమని సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు, వియ్యపు రాజు తదితరులు పేర్కొన్నారు. గోవిందరావు వర్ధంతి సందర్భంగా గురువారం అనకాపల్లిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఫణీంద్రకుమార్, సత్యనారాయణ, పోతురాజు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ధర్మవరంలో మురుగు కాలువ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ సమస్యపై జనసైనికుడు కొఠారు నగేష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు ఫోనుచేశారు. ఆయన అక్కడి నుంచే స్థానిక మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఇంజినీర్లు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామని తిరిగి ఎమ్మెల్యేకి సమాచారం అందించారు.

తుది దశకు ఉక్కు రైల్వే లైను సర్వే

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో భాగంగా అవసరమైన ఇతర కార్యాచరణ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే తొలివిడత భూముల కేటాయింపు జరగ్గా, తాజాగా రైల్వే లైను నిర్మాణం కోసం నిర్వహించిన సర్వే తుది దశకు చేరుకుంది.

★ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తెచ్చిన పెట్టుబడుల్లో నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న స్టీల్‌ప్లాంటే భారీ పరిశ్రమ. రెండు విడతల్లో దీని ఏర్పాటుకు కంపెనీ రూ. 1.35 లక్షల కోట్లు వెచ్చిస్తుండగా, దాదాపు 5,300 ఎకరాలను తీసుకోనున్నారు. ఇందులో ఇప్పటికే 2020 ఎకరాలు ఇచ్చారు. మిగిలినదాని కోసం భూముల గుర్తింపు సాగుతోంది. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ఎగుమతి, దిగుమతుల నిమిత్తం సొంతంగా క్యాప్టివ్ పోర్టు, ముడి సరకు రవాణా నిమిత్తం ప్రత్యేక రైల్వే లైను చాలా అవసరం. ఇందులో పోర్టును డీఎల్‌పురం వద్ద ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సదరు కంపెనీ నిర్ణయించింది. మరోవైపు అనుసంధాన రైల్వే లైను(సైడింగ్) అవసరం కాగా, దీని నిర్మాణానికి కేంద్రం అనుమతిచ్చింది. ఇందుకోసం అవసరమైన 111 ఎకరాలను కేటాయిస్తూ ఆర్నెల్ల కిందటే ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పనులు వేగం చేయించింది. దీంతో అధికార యంత్రాంగం దీనిపై కసరత్తు చేశారు. రైల్వే లైను ఏర్పాటు ప్రాంతాన్ని నిర్ణయించడంతోపాటు సర్వే చేపట్టారు. ఇంతవరకు పూర్తిచేసిన సర్వే ద్వారా గుర్తించిన భూములు దాదాపు 140 ఎకరాల వరకు ఉంటాయని అంచనా. డిజైనింగ్‌లో మార్పులు చేర్పులు ఉన్న నేపథ్యంలో మరింత భూమి అవసరం కానున్నందున ముందుగానే అదనపు భూమిని గుర్తించారు.

రైల్వే లైనుకోసం చేస్తున్న సర్వే రాళ్లు పాతుతున్న సిబ్బంది

★ ఈ లైను గుల్లిపాడు రైల్వే స్టేషన్ నుంచి మొదలవుతుంది. ఇక్కడి పొలాల నుంచి వేంపాడు, చినదొడ్డిగల్లు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని చినదొడ్డిగల్లు కూడలి వద్ద విశాఖ డెయిరీ బల్క్ కూలింగ్ కేంద్రం సమీపం నుంచి జాతీయ రహదారి దాటనుంది. ఇక్కడినుంచి కాగిత రెవెన్యూ మీదగా పాటిమీద వరకు చేరుకుంటుంది. ఇప్పటికే సర్వే చేపట్టిన ప్రాంతాల్లో అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ సర్వే రాళ్లను పాతారు.

గుల్లిపాడు నుంచి పాటిమీద వరకు భూముల గుర్తింపు

★ ట్రాక్ నిర్మాణంలో భాగంగా చిన దొడ్డిగల్లు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించడానికి వీలుగా ఫ్లై ఓవర్ నిర్మిస్తారని ప్రాథమిక సమాచారం. స్థానికంగా రాకపోకలు సాగించేలా ప్రజలకు ఆటంకం లేకుండా అండర్ పాస్ వంతెన నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు విశ్వసనీయ భోగట్టా.

★ ప్రస్తుతం చేసిన సర్వే పూర్తి కాగానే ఆయా రైతులకు సమాచారం ఇచ్చి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. రైతులకు తగిన పరిహారం చెల్లించి, వారి నుంచి భూములు తీసుకోవడానికి అనుమతి పొందాలని చూస్తున్నారు.

★ ఓ వైపు తమకు ఎలాంటి సమాచారం లేకుండా భూములు గుర్తించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు మెరుగైన పరిహారం, ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారు.

ఊకలారీ వెళితే ఉక్కిరిబిక్కిరే

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి బైపాస్ రోడ్డులో ఊకలారీల వాహన చోదకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇవి రోడ్డుపై వెళితే ముందు వెనుక వస్తున్న వాహనాలు రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బందిగా మారింది. వీటి ముందు వచ్చే వాహనాలు వీటిని దాటి రోడ్డుపక్కకి దిగి ఆగిపోవాల్సి వస్తోంది. వీటి కారణంగా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రాత్రి సమయంలో ఇవి అత్యంత ప్రమాదకరంగా మారాయి. లారీ క్యాబిన్ వెడల్పు కంటే తొట్టె వెడల్పు ఎక్కువగా ఉండటం వల్ల వీటిలో ఊక తొట్టె దాటి బయటకి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఎలమంచిలి-గాజువాక మధ్య ఈ లారీలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి.

బైపాస్ రోడ్డులో వెళ్తున్న ఊకలారీ

ప్రధాని 'మనసులో మాట'పై ప్రచారం

అనకాపల్లి పట్టణం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంస్కరణలు, అభివృద్ధి పనులు విద్యార్థులు, యువత, ప్రజలకు తెలిసేలా 'మనసులో మాట' కార్యక్రమాన్ని ప్రతి నెల ఆఖరి ఆదివారం నిర్వహిస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించి గోడపత్రులను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమ జిల్లా కన్వీనర్ శరీ రామకృష్ణ మాట్లాడుతూ మండలాల వారీగా కమిటీలు ఏర్పాటుచేసి విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగం వినేలా చేస్తామన్నారు.

అగ్రనేతల సందడి

అగ్రనేతలంతా ఒకేచోట సందడి చేసిన ఈ దృశ్యం తుని పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పాయకరావుపేట జనసేన నేత తోట నగేష్ కుమారుడి వివాహం సందర్భంగా నాయకులు హాజరయ్యారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, తోట నరసింహం, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కేఎస్ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, రాజాజశేఖరబాబు, కరణం ధర్మశ్రీ, అవంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, తుని పట్టణం

మట్టిరోడ్డుపై రాకపోకలు ఎన్నాళ్లు...

జిల్లా కేంద్రంలో రోడ్డు ఇలా...

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మట్టిరోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూడిమడక రోడ్డులోని రామాలయం వెనక వీధిలో సువిశాలమైన భవనాలు నిర్మించారు. వీటి నుంచి పన్నులు వసూలు చేస్తున్న జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిలో దుమ్ము రాకపోకలకు అవస్థలు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

చెక్కుచెదరని వందేళ్ల కట్టడం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వందేళ్ల కిందట అద్భుత నైపుణ్యంతో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కు చెదరలేదు. ఇందుకు నిదర్శనం పట్టణంలోని ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన సైనిక అధికారుల నివాస భవనం. ప్రస్తుతం ఇక్కడ జలవనరులశాఖ సబ్‌డివిజన్ కార్యాలయం నడుస్తోంది. సైనిక అధికారులు నివాసం ఉండటానికి 1911లో ఇక్కడ రాతితో భవనాన్ని నిర్మించారు. దీని ఎదురుగా ఆయుధాగారం ఉండేది. 115 సంవత్సరాలు గడిచినా గోడలు ఎక్కడా పగుళ్లు లేవు. కలప చెక్కు చెదరలేదు. ఇక్కడ 2011 డిసెంబరులో జలవనరుల శాఖ అధికారులు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించి కొత్తగా శిలాఫలకం వేశారు. ఈ ఉత్సవాలతో ఇది చారిత్రక కట్టడంగా గుర్తింపు సొంతం చేసుకుంది.

ఎలమంచిలిలో ఆంగ్లేయుల పాలనలో నిర్మించిన భవనం

కాలువ గట్టు బలహీనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: తాండవ, వరాహ నదుల పంట కాల్వల దార్లు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంట పొలాలకు. వరాహ నుంచి కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల్లోని వమ్మవరం, లింగరాజుపాలెం, ఎస్.రాయవరం తదితర గ్రామాలకు నీరందుతోంది. తాండవ నుంచి భీమి, ముర, మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం, అరట్లకోట కాలువలే ప్రధాన ఆధారం. వీటి గట్లన్నీ దాదాపు బలహీన పడ్డాయి. దశాబ్దాలుగా వీటి ఆధునికీకరణకు పాలకులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఎత్తయిన గట్లన్నీ మట్టి జారిపోవడంతో పాటు కోతకు గురయ్యాయి. కాలువల్లోకి పెద్దఎత్తున నీరు చేరితే భూములు ముంపు బారిన పడే ప్రమాదముంది.

నామవరం వద్ద కాలువ గట్టు

రక్షణగోడ శిథిలం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక ప్రధాన రహదారిలో కృష్ణరాజులపాలెం వద్ద ఉన్న వంతెనపై రక్షణ గోడ శిథిలమైంది. అదుపుతప్పి వాహనదారులు కాలువలో పడిపోతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పంచాయతీ పాలకవర్గం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షణగోడను పునర్ నిర్మించి ప్రమాదాలను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జోరుగా వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాల సమయం దగ్గర పడుతుండటంతో ఉత్సవ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. తితిదే ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో రెండు వారాలుగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి, ఆర్చిలకు రంగులు వేశారు. ప్రస్తుతం బంధుర సరస్సు చుట్టూ ఇనుప కంచెకు పెయింట్ వేస్తున్నారు. రంగులు వేయడం పూర్తికావడంతో కొండపైకి వెళ్లే మెట్ల మార్గం శోభాయమానంగా ఉంది. చెరువు వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వీలుగా జల్లు సదుపాయం కల్పించనున్నారు. ఆలయం ఎదుట జర్మన్ షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం అవసరమైన సామగ్రి ఆలయానికి చేరుకుంటుంది. పరిసరాలను శుభ్రం చేయించే పనులు మొదలు పెట్టారు.

రంగులద్దుకున్న కొండపై మెట్ల మార్గం

ఇంకోవైపు ఉత్సవాల నిమిత్తం ప్రచార ఆహ్వానాలు ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు.

తెదేపా నాయకులతో పలు అంశాలపై చర్చించారు. రథం తిరిగే వీధుల్లో విద్యుత్తు లైన్ల ఆటంకం, రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని తితిదే అధికారులను మంత్రి అనిత ఆదేశించినట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో ఉప ఎంపీడీఓ కె.చలపతి రావు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఏఈ ప్రసాద్, ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల సమీక్ష

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలకు సంబంధించి ఎంపీడీఓ బి.చైతన్య గురువారం సమీక్షించారు. ఈ నెల 26 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయం వద్ద ఆలయ అధికారులు,

22న విగ్రహాల ప్రతిష్ఠ

మునగపాక: తోటాడ గవర్ల అనకాపల్లిలో రూ.60 లక్షలతో నిర్మించిన మరిడిమాంబ, సత్తమ్మతల్లి ఆలయాలను ఈ నెల 22న ప్రారంభించనున్నట్లు కమిటీ ఛైర్మన్ దొడ్డి కోటేశ్వరరావు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎరుకువానిపాలెంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళ కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎలమంచిలి: పట్టణంలోని టిడ్కో కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్న సమారాధన, రాత్రికి అధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన పులి పోతురాజు, కాసులమ్మ కుటుంబ సభ్యులు రూ. 2,15,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్మాణ పర్యవేక్షకులు బొలిశెట్టి గోవిందరావు, కొణతాల శ్రీనివాసరావుకు గురువారం కాసులమ్మ కుమారులు సత్తిబాబు, రాంప్రసాద్ నగదు అందజేశారు.

ఎరుకువానిపాలెంలో ఆంజనేయ విగ్రహం

నగదు అందజేస్తున్న కాసులమ్మ కుటుంబ సభ్యులు

నూకాలమ్మను దర్శించుకున్న సరస్వతి స్వామి

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మను గురువారం ఇచ్ఛాపురానికి చెందిన నైమిశారణ్య వారాహి పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో శ్రీదేవి భాగవతతత్వ ప్రవచనాలు చేశారు. దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, కార్యనిర్వహణాధికారి వై.శ్రీధర్ పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకుంటున్న సరస్వతి స్వామి

ప్రతి మహిళకు అక్షరజ్ఞానం

మునగపాక, న్యూస్‌టుడే: మహిళలందరూ అక్షరజ్ఞానం పెంపొందించుకోవాలని, ఇందుకు వయోజన విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ జిల్లా అదనపు డైరెక్టర్ చిన్నికృష్ణ సూచించారు. మునగపాకలో వయోజన విద్యా కేంద్రాన్ని గురువారం సందర్శించారు. మహిళలతో మాట్లాడుతూ.. చదవడం, రాయడం నేర్చుకోవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు, సీసీ వేణు, ఉపాధ్యాయిని రమాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏడీ చిన్నికృష్ణ

జీవనోపాధి పెంపునకు మహిళలకు శిక్షణ

నక్కపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల సభ్యుల జీవనోపాధి పెంపునకు అవసరమైన శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు సంబంధిత జిల్లా విభాగం ప్రాజెక్టు మేనేజరు వెంకటరమణ వెల్లడించారు. దీనిపై చేపట్టిన సర్వేను రాజయ్యపేటలో ఏపీఎం కె.శ్రీనివాసరావుతో కలిసి గురువారం పరిశీలించి సభ్యులతో మాట్లాడారు. అచ్యుతాపురం మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను వెలుగు సిబ్బంది, ఏపీఎం శ్రీనివాసరావు పరిశీలించారు. మహిళల జీవనోపాధికి కావాల్సిన సౌకర్యాలు, రుణాలు, నైపుణ్య శిక్షణలపై ఆరా తీస్తున్నారు. 179మంది ఈ-నారీలు 1803 సంఘాల సభ్యులకు చెందిన 18805 మంది మహిళలను సర్వే నిర్వహిస్తున్నట్లు ఏపీఎం తెలిపారు.

అచ్యుతాపురంలో వెలుగు ఏపీఎం, సిబ్బంది సర్వే

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఎలమంచిలి/ గ్రామీణం న్యూస్‌టుడే: ఏటికొప్పాకలో గురువారం గుండె వైద్య శిబిరం ఏర్పాటైంది. విజయవాడకు చెందిన వైద్యులు 600 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. తెదేపా నాయకులు శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సర్పంచి లక్ష్మి, నాయకులు చిరంజీవి, బాబాజీ, రామకృష్ణ, సరోజ్యారావు పాల్గొన్నారు. ములకలాపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో పులపర్తి, లక్కవరం, గూండ్రుబిల్లి, కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలల్లో 157 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. కంపెనీ యూనిట్ హెడ్ రామస్వామి, సీఎస్ఓ వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్ నేషన్ కార్యక్రమానికి ఎలమంచిలి విద్యార్థులు

ఎలమంచిలి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో జరిగే వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ చెప్పారు. కళాశాల నుంచి 100 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

అనకాపల్లి, న్యూస్‌టుడే: వేగివారి వీధిలో పందుల సంచారంతో ఇబ్బంది పడుతున్నాం. – వేగి రాంబాబు, అనకాపల్లి, ✔: పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తాండవనది వంతెనపై పాదచారులు నడిచే దారి అధ్వానంగా ఉంటోంది. దుర్వాసన వస్తోంది. – రాంబాబు, పాయకరావుపేట ✔: నడక మార్గం సిబ్బందితో శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. – నాగార్జున, శానిటరీ మేస్త్రి

అచ్యుతాపురం: అచ్యుతాపురంలో ఉదయం, రాత్రి తేడా లేకుండా దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. దోమల నివారణ మందు పిచికారీ చేయకపోవడంతో వ్యాప్తి అధికమైంది. – సరోజిని, గృహిణి, అచ్యుతాపురం ✔: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. – శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. దోమలు పెరిగిపోయాయి. – ఎం.రాము ఎలమంచిలి, ✔: కాలువలు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపిస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగస్వామి దేవస్థానం ఎదురుగా చేపలు విక్రయిస్తున్నారు. దీనివల్ల భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. – పి.నాగేశ్వరరావు, స్థానికుడు ✔: చేపలు అమ్మకుండా చర్యలు తీసుకుంటాం. – వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో

ఎలమంచిలి: పట్టణంలోని పాత జాతీయ రహదారికి ఇరువైపులా కాలువలను ఆక్రమించి కాంక్రీట్ వేశారు. వాహనాలు నిలుపుకోవడానికి స్థలం లేక ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. – ఎం.కిషోర్‌కుమార్, ఎలమంచిలి ✔: గతంలో ఇలాంటివన్నీ గుర్తించి తొలగించాం. మరోసారి సర్వే చేయించి ఇలాంటి వన్నీ తొలగిస్తాం. ట్రాఫిక్ సమస్యకు తావులేకుండా చర్యలు తీసుకుంటాం. – బాకూరి ప్రసాదరాజు, ఎలమంచిలి కమిషనర్

అనకాపల్లి పట్టణం: తుమ్మపాల గవరపేటలో కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. వాహనచోదకుల వెంట పడుతున్నాయి. – రామునాయుడు, తుమ్మపాల, ✔: సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

రహదారుల నిర్మాణం వేగవంతం

స్పందనకు వందనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలో నాబార్డు నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ కుమార్‌రాజా పేర్కొన్నారు. 'ఈనాడు'లో ఈనెల 15న 'రోడ్డు తవ్వి.. పనులు మరిచి' శీర్షికన, అదేవిధంగా గత నెల 23న 'నత్తకు పోటీగా.. తాబేలుకు దీటుగా' శీర్షికన ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. సీతారాంపురం, కంది పూడి రోడ్లను గురువారం పరిశీలించారు. సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ శామ్యూల్‌రాజ్, మాజీ సర్పంచి వెంకటరమణ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

అనకాపల్లి పట్టణం: పూడిమడక రోడ్డులో లైటింగ్ మెరుగుపరిచేలా జీవీఎంసీ జోనల్ విద్యుత్తు విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. 'వెలగని దీపాలు.. కమ్మేస్తున్న చీకట్లు' శీర్షికన ఈ నెల 11న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్త జీవీఎంసీ సిబ్బంది ఉద్యాన అధికారులతో కలిసి డివైడర్ మధ్యలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

ఉపాధ్యాయుల సర్వీసు వివరాలు ఆన్‌లైన్

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సర్వీసు వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని ఎంఈఓ కె.నరేశ్ తెలిపారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదును దగ్గరుండి చేయించారు. మండలంలో 380 మంది ఉపాధ్యాయులున్నారన్నారు. ఇప్పటికే సగానికి పైగా నమోదు జరిగిందన్నారు. ఎంఈఓ 2 ఆర్.నాగన్నదొర, కార్యాలయ సిబ్బంది జాన్సీ, శివ, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

22న నందమూరి అభిమానుల సమావేశం

అనకాపల్లి: నందమూరి అభిమానుల ఆత్మీయ సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నారు. గురువారం నిర్వహించిన అభిమానుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పేదల ఆరోగ్యానికి అండ సీఎం సహాయ నిధి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. కోడూరు, గొలగాం, కొండుపాలెం, చేనుల అగ్రహారం, రేబాక, భట్లపూడి, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేపట్టారు. 23 మంది బాధితుల ఇంటికి స్వయంగా వెళ్లి రూ.13 లక్షల మేర చెక్కులు అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

WANTED TEACHERS
SRISHTI WORLD SCHOOL
(CBSE AFFILIATION No - 130520)
(A Leader for Excellence in Education)
SECTOR-XI, UKKUNAGARAM, VISAKHAPATNAM
MOTHER TEACHERS, PRE-PRIMARY, PRIMARY & HIGH SCHOOL
(TRAINED TEACHERS with B.Ed)
❖ FOR ALL SUBJECTS (Eng, Tel, Hin, Math, Sci, Soc, Sanskrit)
❖ For GK & CURRENT AFFAIRS, Computers (Robotics/ Artificial Intelligence/ Coding)
❖ For IIT, Spoken English, Story Tellers and Vocal Music (Classical & Western)
❖ Trained P.E.Ts with B.P.Ed/ M.P.Ed/ NCC ('C' Cert holders)& Admin Co-ordinators
❖ Career Counselor ❖ Psychology Counselor
❖ Soft Skills Trainer ❖ Skill Educator
NOTE: Family Accommodation is available for deserving candidates.
Walk-in-Interview: 21st Feb 2026 onwards (Except Sundays)
❖ Share your resume to mail id: hr.srishtiworldschool@gmail.com or
9391188874 or 8341122949 or 9652947708
(WHATSAPP NUMBERS)

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

అథ్లెటిక్ విజేతకు సత్కారం

అనూరాధను అభినందిస్తున్న జడ్పీ పాఠశాల ఉపాధ్యాయ బృందం

నాతవరం, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటి విజేతలగా నిలిచిన పీడీ అనూరాధను ఉపాధ్యాయ బృందం గురువారం సత్కరించింది. వ్యాయామ ఉపాధ్యాయలతో నిర్వహించిన ఈ పోటీల్లో అనూరాధ 400 మీటర్ల పరుగులో పసిడి, హ్యామర్ త్రోలో వెండి, 5000 మీటర్ల వాకింగ్‌లో రజతం, 400 మీటర్ల పరుగులో వెండి పతకాలు సాధించారని హెచ్‌ఎం సత్యనారాయణ చెప్పారు. ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం కాశవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు రూ.64 లక్షలు మంజూరు

చీడికాడ, దేవరాపల్లి న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మలివిడతలో రెండు గ్రామ పంచాయతీలకు సొంతగూడు సమకూరనుంది. చీడికాడ మండలం ఎల్.బి.పట్నం, దేవరాపల్లి మండలం ఎన్.జి.నగరం గ్రామాల్లో పంచాయతీ భవనాల సమస్యను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి చీడికాడ మండలం ఎల్.బి.పట్నం, దేవరాపల్లి మండలం ఎన్.జి.నగం గ్రామాలకు పంచాయతీ భవనాలకు నిధులు విడుదల చేశారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షల చొప్పున రెండింటికి నిధులను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఎల్.బి.పట్నం, ఎన్.జి.నగరం గ్రామాలకు పంచాయతీ భవనాలు మంజూరు చేయడంపై కూటమి నాయకులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్.బి.పట్నం పంచాయతీ పాత భవనం

చెరువు గట్టు.. పార్కుగా మార్పు

మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల సంరక్షణను ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ సరోవరం పథకం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వరంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు వినోదం, ఆరోగ్యకర వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో చెరువు గట్టును పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు.

పాండవుల చెరువు

- మాడుగులలోని పాండవుల చెరువు గట్టుపై నడక మార్గాలు, పచ్చని చెట్లు, పూల మొక్కలు, కూర్చోడానికి బెంచీల ఏర్పాటు ద్వారా ప్రాంతానికి ప్రత్యేకకళ సంతరించుకోనుంది. గతంలో నిర్లక్ష్యానికి గురైన చెరువు గట్టును సుదందరంగా తీర్చిదిద్దుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఈ పార్కు అభివృద్ధితో ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వచ్చేవారి సంఖ్య పెరగనుంది. పిల్లలకు ఆడుకునేందుకు సురక్షితమైన స్థలం లభించగా వృద్ధులకు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకునే వాతావరణం ఏర్పడనుంది. చెరువు గట్టు అభివృద్ధితో చెత్త వేయడం, ఆక్రమణలు గణనీయంగా తగ్గుతాయి. చెరువు చుట్టూ నాటిన మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భూగర్భ జలాల వృద్ధి చెందడానికి దోహదపడతాయి.

- ప్రభుత్వ శాఖలు, గ్రామపంచాయతీ, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో మాడుగుల మోదమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న పాండవుల చెరువును సుమారుగా రూ.60 లక్షలతో ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టడానికి ఎంపిక చేశారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో చెరువు సంరక్షణపై అవగాహన పెరుగుతోంది. చెరువు గట్టును పార్క్‌గా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం, గ్రామ సౌందర్యం సాధ్యమవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఎరువుల తయారీకి సంపద కేంద్రాలే కీలకం

రోలుగుంట, న్యూస్‌టుడే: విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగంతో మానవుల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపే ప్రమాదముందని ఆర్.డబ్ల్యూ.ఎస్. జిల్లా కన్సల్టెంట్ లోవరాజు తెలిపారు. మండలంలోని కంచుగుమ్మల సంపద కేంద్రంలో సేంద్రీయ ఎరువుల తయారీని పరిశీలించిన క్రమంలో ఈ మేరకు మాట్లాడారు. గ్రామంలో సేకరించిన తడి, పొడిచెత్తలను సేకరించి గ్రామాలను శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కంచుగుమ్మల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

డిప్యూటీ డీఈవోకు సన్మానం

పోతన్నను సత్కరిస్తున్న డీఈవో, ఎంఈవోలు, ఉపాధ్యాయులు

రావికమతం, న్యూస్‌టుడే: జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఉద్యోగానికి ఎంపికైన ఉపాధ్యాయుడు కన్నూరు పోతన్నను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు ఘనంగా సత్కరించారు. మేడివాడ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు పోతన్న డిప్యూటీ డీఈవో ఉద్యోగానికి అర్హత సాధించారు. దీంతో డీఈవో అప్పారావునాయుడు పోతన్నను అభినందించారు. ఎంఈవోలు లింగమూర్తి, బ్రహ్మాజీ, సీఆర్‌పీ రామారావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంతో భద్రత

మాడుగుల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు గురువారం మాడుగుల పట్టణ తెదేపా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రహరీ నిర్మాణంతో భవనానికి భద్రత కలిగిందని ఆయన పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, జొన్నపల్లి రమేష్, కె.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న నాయకులు

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో అభయాంజనేయ స్వామి భారీవిగ్రహం ఏర్పాటుకు దాతలు రూ.1.2లక్షల విరాళాన్ని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకి గురువారం అందజేశారు. సర్పంచి సబ్బవరపు పెంటమ్మ, మాలిబాబు దంపతులు రూ.60 వేలు అందజేయగా, కొల్లి సురేష్, జ్యోతి దంపతులు రూ.50 వేలు, కంచుమల రమణమ్మ కుమారుడు అప్పారావు రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టరు అప్పలరాజు, దీవి శంకర్రావు, అల్లు అబద్దం పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ భాస్కరరావుకి విరాళం అందజేస్తున్న సర్పంచి పెంటమ్మ, మాలిబాబు దంపతులు

ధైర్యశాలి ఛత్రపతి శివాజీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పరమత సహనం, మహిళలను గౌరవించడంలో ఛత్రపతి శివాజీ అందరికీ ఆదర్శంగా నిలిచారని పెదబొడ్డేపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.రవి అన్నారు. శివాజీ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. నిజాయతీ, ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచి మరాఠా మహరాజ్‌గా నిలిచారని పేర్కొన్నారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చోడవరం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం వివిధ సంస్థలు నిర్వహించాయి. చోడవరం పట్టణంలో శివాజీ చిత్రపటానికి పోలీస్ ఎస్సై జోగారావు పూలమాల వేశారు. నిర్వాహకుడు రవి కిరణ్, పోలీసులు పాల్గొన్నారు. గోవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్.ఆర్.సేవా సంఘం సౌజన్యంతో శివాజీ జయంతి సందర్భంగా పూలమాల వేశారు. దుడ్డుపాలెం సర్పంచి మాలి బాబు, వైద్యురాలు నీలం శారద, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ స్వామి పట్నాయక్, ఆర్ సంస్థ సీఈవో డి.ఎస్.ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

గోవాడలో...

శిక్షణకు 69 మంది హాజరు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర పరిశీలకులు నాగరాజు గురువారం రాష్ట్రీయ గ్రామ్‌స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికపై జరుగుతున్న శిక్షణను పరిశీలించారు. మాడుగుల నియోజకవర్గంలోని 69 మంది పంచాయతీ కార్యదర్శులు తరగతులకు హాజరైనందున అందరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణ, సంపద సృష్టిపై వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ రమణి, అప్పలరాజు, జీవన్ పాల్గొన్నారు.

శిక్షణ పొందిన కార్యదర్శులతో పరిశీలకులు నాగరాజు, ఎంపీడీఓ సాంబశివరావు తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743 | చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740 | చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట ప్రధాన రహదారి పక్కనున్న తాగునీటి బోరు వద్ద మురుగు పేరుకుపోయింది. నీరు కలుషితం అవడంతో పాటు దోమల వ్యాప్తి అధికంగా ఉంది. - అప్పలనాయుడు, స్థానికుడు

✓: స్థానికులు సమస్యను సచివాలయం దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ పాలకవర్గంతో చర్చించి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. - సంతోష్, సర్పంచి, లింగంపేట

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి-తెనుగుపూడి రోడ్డులో గురుకుల కళాశాల సమీపంలో ప్రమాదకర మలుపు ఉంది. ఆ మలుపులో కల్వర్టు దాటిన తరువాత తారురోడ్డు అంచుల్లో గోతులు పడ్డాయి. వెంటనే పూడ్చి ప్రయాణికుల ప్రాణాలకు భద్రత కల్పించాలి. - రాముడునాయుడు, దేవరాపల్లి

✓: ఈ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేలోగా ఈ గొయ్యిలు పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - ఏఈఈ, ఆర్అండ్‌బీ, దేవరాపల్లి మండలం

రాచపల్లిలో గౌరీపరమేశ్వర్ల ఊరేగింపు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రాచపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం గురువారం ప్రారంభమైంది. రామాలయం నుంచి స్వామి వార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మూడురోజులపాటు పూజలు నిర్వహించి శనివారం విగ్రహాలను నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. సర్పంచి సీతారాముడు, జోగిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

చోడవరం గ్రామీణం: రామజోగిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎస్.సరళ తల్లి సత్యవతికి బీమా నగదు అందించారు. చోడవరం మహిళా పరస్పర సహకార పొదుపు సంస్థలో సరళ సభ్యురాలిగా ఉన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు చేతుతమీదుగా రూ.10వేలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు సియాద్రి అనురాధ, సీఈఓ కె.రాజు, పోతల అప్పారావు, నందికోళ్ల గణేష్ పాల్గొన్నారు.

క్షేత్రసహాయకుల సంఘం అధ్యక్షుడిగా శ్రీను

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం మాడుగులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్‌కు గాదిరాయి గ్రామానికి చెందిన పడాల శ్రీను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎం.కోడూరుకు చెందిన దొడ్డి సన్యాసిరావు, కోశాధికారిగా ఉగ్గిన వరలక్ష్మిని సభ్యులు ఎన్నుకున్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ భారతశ్రీ గురువారం తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు 247, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 193 మంది పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. ఉదయం 9 గంటల్లోగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

జేబీపురంలో ఆధార్ శిబిరం నేడు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం జేబీపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక ఆధార్‌శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, ఐదు నుంచి 15 ఏళ్లలోపు వారికి బయోమెట్రిక్ నమోదు, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెదమదినలో బోరు ప్రారంభం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పెదమదిన గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును గురువారం ప్రారంభించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా జడ్పీ నిధులతో రైతుల కల్లాల వద్ద బోరు ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు కొబ్బరికాయ కొట్టి ఈ బోరును ప్రారంభించారు.

14 మంది జూదరుల అరెస్టు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: త్రైపురం సిరి వనం లేఅవుట్‌లో జూద శిబిరంపై పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్టు చేశారు. అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కార్లలో వచ్చి గురువారం తెల్లవారుజాము వరకు భారీస్థాయిలో డబ్బులు పెట్టి రమ్మీ ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. ఈ మేరకు ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి దాడిచేశారు. మూడు కార్లు, రెండు బైకులు, 14 మొబైల్ ఫోన్లు, రూ. 5,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడినవారిలో 11 మందిపై ఇదివరకే పలుస్టేషన్లలో కేసులు ఉన్నాయి.

వైభవంగా రామాలయం ప్రారంభోత్సవం

పూజలో పాల్గొన్న భక్తులు

గొలుగొండ, న్యూస్‌టుడే: నాగాపురం శివారు పల్లాపూరులో రామాలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాద్యాల నడుమ ఉదయం 6 గంటలకు ఆలయ తలుపులు తెరుచుకున్నాయి. ప్రత్యేక పూజలు, హోమం అనంతరం ధ్వజస్తంభం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. సర్పంచి రఘురామ్, ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

వందమంది భక్తుల శివమాలధారణ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడిలో శివభక్తుల కోలాహలం నెలకొంది. సుమారు 100 మంది భక్తులు గురువారం శివమాలధారణ చేశారు. గ్రామంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నూతనంగా నిర్మించిన జ్యోతిర్లింగాలు, కోనేరు మధ్యలో శివపార్వతుల విగ్రహాల ఆవిష్కరణ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కోమళ్లపూడితో పాటు గంటికొర్లాం, బుదిరెడ్లపాలెం గ్రామాలకు చెందిన చాలామంది భక్తులు దీక్ష చేపట్టారు. విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ, గురుస్వామి ఎం.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

శివాలయంలో మాలలు ధరించిన భక్తులు

అంతర్గత రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

నాతవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి సభాపతి అయ్యన్నపాత్రుడు నిధులు విడుదల చేయించారు. తాండవ జలాశయ కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి గురువారం ఈ పనులను ప్రారంభించారు. నాతవరంలో రూ.64 లక్షలు, యర్రవరంలో రూ.43 లక్షలతో ఆరు రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు సత్యవతి పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకు 100 రోజుల ప్రణాళిక

రావికమతం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కోసం అన్ని హైస్కూళ్లలోనూ విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు చెప్పారు. గురువారం మండలానికి వచ్చిన ఆయన గర్నికం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు.

గర్నికం పాఠశాల విద్యార్థుల సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

జలాశయంలో ఆక్రమణల గుర్తింపు

ఊటగెడ్డ జలాశయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రామన్నపాలెం శివారులోని ఊటగెడ్డ జలాశయం ఆక్రమణలకు గురైందని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుతో జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించారు. జలాశయాన్ని గురువారం సందర్శించి ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ రామన్నపాత్రుడు చెప్పారు. వీఆర్వో సాంబశివరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పల్లెపోరుకు కసరత్తు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలను మార్చి 9వ తేదీలోగా సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో డిప్యూటీ డీఈవోల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి వచ్చిన అసెంబ్లీ ఓటర్లను జాబితాలను పరిశీలించి 05.02.26 వరకు మార్పులు, చేర్పులు పూర్తి చేసి తుది జాబితాలను రూపొందించనున్నారు. ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నవి, జీరో నంబర్లు ఉన్నవి, నంబర్లు లేని ఇళ్లను చివరల్లో చేర్చనున్నారు.

ఓటరు జాబితాలోని ఫొటోలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ, మెట్టపాలెం పంచాయతీ కార్యదర్శి

ప్రభుత్వ పాఠశాల సందర్శన

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అకడమిక్ బృందం గురువారం సందర్శించింది. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ సత్యనారాయణ, మాకవరపాలెం ఎంఈఓ మూర్తి ఆధ్వర్యంలో సభ్యులు గోపాల్, నాగేశ్వరరావు, వాసు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొని పదోతరగతి విద్యార్థుల పురోగతి పరిశీలించారు. ఎంఈఓలు పాండురంగరావు, సింహాచలం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

దుర్గాదేవి గుడిలో హుండీ చోరీ

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని దొండపూడిలోని గ్రామదేవత దుర్గాదేవి గుడిలోని హుండీ చోరికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి హుండీ కొల్లగొట్టారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. దీనిపై పోలీసులకు అందించిన సమాచారం మేరకు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది.

ఉత్తమ విద్యార్థులకు అభినందన

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఫేర్‌వెల్ పార్టీలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను సర్పంచి చింతల సత్య వెంకటరమణ, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ అప్పలనరసమ్మతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. పదోతరగతి తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు.

బాల్యవివాహ రహిత రాష్ట్రమే ధ్యేయం

రావికమతం, న్యూస్‌టుడే: బాల్య వివాహ రహిత రాష్ట్రసాధనకు అందరూ సహకరించాలని రావికమతం ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, దొండపూడి, కిత్తంపేట, గొంప తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బాల్య వివాహాలపై ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి బాల్యవివాహాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బాలికోన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని సూపర్‌వైజర్ శాంతిప్రియ అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరంలో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

కంటి వైద్య శిబిరానికి స్పందన

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చాకిపల్లి పంచాయతీ శివారు రామజోగిపాలెం గ్రామంలో గురువారం ఉచితకంటి వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు శిబిరాన్ని ప్రారంభించి రోగులకు మందులు పంపిణీ చేశారు. విశాఖ శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో జనసేనపార్టీ నాయకులు పోతల అప్పారావు, నందికోళ్ల సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 95 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15మందిని శస్త్రచికిత్సల ఎంపిక చేశారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: తామరంలో చెక్కల మిల్లు ఎదుట కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్, నేచురోపతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరగనుంది. నాడి చూసి శరీరంలో రుగ్మతలను గుర్తించి చికిత్స చేయడంతోపాటు మందులు ఉచితంగా ఇస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు.

ఉచిత మందులు పంపిణీ చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు

రైతులంతా రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు ఎస్.గోపాల రాజా పేర్కొన్నారు. మండలంలోని వాలాబులో సర్పంచి వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన రీసర్వే గ్రామ సభతో పాటు అవగాహనా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రైతులు తమ దస్త్రాలు సర్వే సిబ్బందికి చూపించి, దగ్గరుండి సర్వే చేయించుకోవాలన్నారు. ఎటువంటి అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపపరిశీలకుడు వెంకన్న, మండల సర్వేయరు జగదీష్, రీసర్వే ఉప తహసీల్దారు సత్యవతి, గ్రామస్థులు జనార్దన్ దొర, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంతో పాల్గొన్న అధికారులు

పార్టీ బలోపేతానికి కృషి

చీడికాడ, న్యూస్‌టుడే: రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ కేవీపీ రామచంద్రరావును గురువారం విశాఖ విమానాశ్రయంలో అనకాపల్లి డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కేవీపీతో కాసేపు సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేవీపీని సన్మానిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

పంజాబీ భాష, సంస్కృతులపై ప్రచారం

రోలుగుంట, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పంజాబ్ రాష్ట్రంతో జత చేసిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే పంజాబీ భాష, సంస్కృతి ఇతర సంప్రదాయాలు, అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పంజాబీ అక్షరాలను నేర్పి పిల్లలకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం.శేషగిరిరావుతో ఆంగ్ల ఉపాధ్యాయిని నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించరూ..!

దేవరాపల్లి, న్యూస్‌టుడే : తమ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలంటూ గరిశింగి శివారు కించుమండకు చెందిన గిరిజనులు గురువారం నిరసన చేపట్టారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రాలను చేత పట్టుకొని టోపీలు ధరించి నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి గ్రామానికి రోడ్డు నిర్మించాలని కించుమండ వాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాన్ షెడ్యూలు ఏరియా ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర పాల్గొన్నారు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1:
హే బలవంత్
స్క్రీన్-2:
ఆల్ఫా

నేడు ఉచిత అంబులెన్స్ ప్రారంభం

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపారు. ఈ మేరకు నగర సీపీ శంఖబ్రత బాగ్చీ సంబంధిత వాహనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతిమ యాత్ర, మోక్ష రథం వాహనాలతో పాటు ఫ్రీజర్ బాక్సు సేవలు సమకూరుస్తున్నామని అన్నారు. ఉచిత అంబులెన్స్ సేవల కోసం 99665 16516, 99665 44888 నంబర్లకు ఫోనులో సంప్రదించాలని కోరారు.

22న సరిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పెందుర్తి, న్యూస్‌టుడే: నగరానికి చెందిన అర్క ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్ఎస్‌కే రేవంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే శిబిరంలో పలువురు నిపుణులు పాల్గొని వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ఆర్ఆర్ వెంకటాపురం కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెంటాడుతోంది. –నాగేశ్వరరావు, వెంకటరావు, స్థానికులు ✓: కాలువలను సిబ్బందితో శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. –ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలి నుంచి సినిమాహాల్ కూడలికి వెళ్లే మార్గంలో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –రవి, పరవాడ ✓: వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. –లలిత, ఏఈ, ఆర్అండ్‌బి

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొర్లెవానిపాలెంలో చెత్త పేరుకుపోయింది. -జీసీహెచ్ దేముడు, గొర్లెవానిపాలెం ✓:వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం మెయిన్ రోడ్డులోని డివైడర్ల మధ్యలో ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. –ఎం.కనకరాజు, సబ్బవరం ✓: వెలగని దీపాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. –డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

పరీక్షల సమయం.. జాగ్రత్తలే ముఖ్యం..

ఇస్లాంపేట కళాశాలలో నిర్వహిస్తున్న అదనపు తరగతులలో చదువుకుంటున్న విద్యార్థులు

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితంలో పది, ఇంటర్మీడియట్ ఎంతో కీలకం. ఈనెల 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఇంటర్, మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల తేదీ సమీపిస్తున్న కొద్దీ కొందరు విద్యార్థులు ఆందోళనకు గురై చదువులో లీనమవుతారు. ఈ క్రమంలో పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతో పాటు ఆరోగ్యం, నిద్ర, మంచి పౌష్టికాహారం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాయుతంగా ఏకాగ్రతతో చదివితే పరీక్షలు నిర్భయంగా రాసేయవచ్చునని చెబుతున్నారు. ఇదే సమయంలో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బ తినకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వీటిని పాటిస్తే మేలు..

పరీక్షల సమయంలో నిద్రకు దూరమై చదవకుండా మధ్యలో కొంత సమయం విరామం ఇవ్వాలి. దీనివల్ల చదివిన అంశాలు చక్కగా గుర్తుండడంతో పాటు మంచి మార్కులు సాధించవచ్చు. ఏకాగ్రత దెబ్బ తినకుండా పాఠ్యాంశాలపై దృష్టి సారించడంతో పాటు ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకుని చదివితే జ్ఞాపకం ఉంటుంది. పునశ్చరణ ద్వారా మరింత పట్టు సాధించే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా చక్కగా రాయవచ్చు. చిరుతిళ్లకు, చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలలు	విద్యార్థులు
★ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల	763
★ రాంపురం ప్లస్2..	12
★ పరవాడ జూనియర్ కళాశాల	300
★ పరవాడ ప్లస్2..	48
★ ఇస్లాంపేట కళాశాల	82
★ తానాం గురుకులం	300
★ సబ్బవరం ప్రభుత్వ కళాశాల	590
★ సబ్బవరం కేజీబీవీ	74
మొత్తం	2169

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పరవాడ	13	793
పెందుర్తి	12	1032
సబ్బవరం	08	472
మొత్తం	33	2297

★ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ రోజుకు ఏడు గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. త్వరగా జీర్ణమయ్యే పోషక విలువలు గల ఆహారం, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుంది. జంక్‌ఫుడ్స్‌కు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. రోజుకు చిన్నపాటి శారీరక వ్యాయామం, యోగా చేయాలి. కాచి చల్లార్చిన నీరు, పాలు, పండ్లు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలి. మధ్యలో కొంత విశ్రాంతి తీసుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్షలు దగ్గర పడడంతో పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి.
–ప్రదీప్‌ప్రసాదురాజా, దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి

కాలుష్యంపై నాలుగుసార్లు ప్రస్తావించినా స్పందన కరవు


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధి పరవాడ మండలంలోని ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల వల్ల ఎదురవుతున్న కాలుష్య సమస్యపై నాలుగు సార్లు శాసనసభలో ప్రస్తావించినా పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభ సమావేశాల శూన్య గంటలో ఆయన గురువారం సంబంధిత సమస్యను ప్రస్తావించారు. పరిశ్రమల వాహనాల ద్వారా లంకెలపాలెం రహదారిని ఆనుకుని ఉన్న ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ పరిశ్రమలు. . రవాణాకు ఉపయోగించే భారీ, ఇతర వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ దిశగా ప్రయత్నించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది సాకారమైతే సుమారు 50శాతం కాలుష్యం తగ్గుతుందన్నారు. కాలుష్య సమస్యలపై ఇప్పటికే సభలో నాలుగుసార్లు ప్రస్తావించినా నేటికీ పరిష్కారం దొరకలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

22 నుంచి పరదేశిమాంబ పండగ

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జగన్నాథరావు, వెంకటరమణ తదితర నాయకులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు పరదేశిమాంబ అమ్మవారి వేడుకలు నిర్వహించనున్నారు. సంబంధిత కార్యక్రమాలకు చెందిన గోడపత్రికలను గురువారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, అనకాపల్లి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచి పైలా రామారావు, వర్రి వసంతరావు తదితరుల చేతులమీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, పెద్దఎత్తున బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. ఈనెల 24వ తేదీన అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం అనుపోత్సవం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

● రేపటి నుంచి క్రికెట్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలోని శ్రీపోలమాంబ పండగ సందర్భంగా ఈనెల 21వ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్లకు ఈనెల 24న నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఇతర వివరాల కోసం 98856 36637 నంబరుకు ఫోనులో సంప్రదించాలని కోరారు.

● విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: విరాట్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఈనెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దీనివల్ల బాలాజీగార్డెన్, శ్రీనివాసనగర్, గొల్లనారాయణపురం, దత్తసాయినగర్, సింహపురికాలనీ, సింహాచలం ఆర్టీసీడిపో, విరాట్‌నగర్, ప్రహ్లాదపురం, దుర్గానగర్ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: 11 కేవీ క్రాంతినగర్ ఫీడర్‌పై మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలోని శారదాపీఠం ప్రాంతం, శ్రమశక్తినగర్ పరిసర ప్రాంతాలు, ఎంఈఎస్ లేఅవుట్, బంగారమ్మ కాలనీ, ఇంద్రగంటి పార్కు ప్రాంతం, పార్వతీనగర్, చలమజీ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నామని తెలియజేశారు.

● బాల కార్మికులతో పని చేయించడం నేరం

సబ్బవరం, న్యూస్‌టుడే: 18 ఏళ్ల వయసు నిండని వారితో పని చేయించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏఎల్‌ఓ) పి.సూర్యనారాయణ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి గురువారం సబ్బవరం మండలంలోని వివిధ దుకాణాలతో పాటు పలు చోట్ల తనిఖీ చేపట్టారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ ఆర్.రామచంద్రరావు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● 22న రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపికను ఈ నెల 22న రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రెండు విభాగాల్లోనూ 65 కేజీల లోపల, 65 కిలోల పైబడి, మాస్టర్స్(పురుషుల) విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్ల వయసు పైబడిన వారికి పోటీలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8885203519 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పులగవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి పులగవానిపాలెంలోని శ్రీకృష్ణాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు గోపాలుడికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయిన సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. మండల జనసేన అధ్యక్షుడు కరుణం రమణనాయుడు, నాయకులు సుధాకర్ రాజు, కరణం కనకరాజు, అనగద్ద అప్పలనాయుడు, గొరపల్లి సత్తిబాబు, పల్లి శివ, తదితరులు ఈ పూజల్లో పాల్గొని అన్నదానం ప్రారంభించారు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు సింహాచలంనాయుడు, ఇతర నాయకులు

సాగర తనయకు వైభవంగా కుంకుమార్చన

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి పాల్గుణ పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు సాగర తనయకు శ్రీసూక్త సహిత కుంకుమార్చన జరిపారు. అష్టలక్ష్మీ స్తోత్ర పారాయణం చేసి విశేష హారతులతో ఆరాధించారు. భక్తులు అధిక సంఖ్యలో జగన్మాతను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు

పోలమాంబ వేడుకలకు ఏర్పాట్లు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు శ్రీపోలమాంబ అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక విద్యుత్తు అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో నృత్యప్రదర్శనలు, బుర్రకథలు, నాటికలు తదితర ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 24న ఉదయం 4గంటల నుంచి దర్శనాలు, ప్రత్యేక పూజలు మొదలవుతాయి. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదం, మజ్జిగ, తాగునీటి వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం అనుపోత్సవం జరిగాక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ప్రజలు ఈ వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రారంభ వేడుకలు గురువారం మొదలయ్యాయి. ముందుగా స్వామివారి శోభాయాత్రను మంగళవాయిద్యాల నడుమ వెంకటసాయినగర్, అప్పలనర్సయ్యకాలనీ, రవినగర్, బంటుకాలనీ, నాయుడుతోట పరిసర ప్రాంతాల్లో చేపట్టారు. అనంతరం వేద మంగళ స్వస్తివాచనం, ఉత్సవ సంకల్పం, అఖండ దీపారాధన, హోమాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతసేవతో పూజలు ప్రారంభం అవుతాయన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారికి శేషవాహన ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

శోభాయాత్రకు బయలుదేరిన అర్చకులు, భక్తులు

సీపీఎస్ ఉద్యోగుల దీక్షను జయప్రదం చేయాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: తమ హక్కుల సాధన కోసం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈనెల 22న చేపట్టనున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగులు కోరారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు సబ్బవరం మండలం రావులమ్మపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘానికి చెందిన సబ్బవరం మండల బాధ్యులు భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, పైల దేముడు, అప్పారావు, గోవింద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

22న లాసెట్‌పై అవగాహన సదస్సు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఈనెల 22న పెందుర్తి సమీప పురుషోత్తపురం శివాలయం వద్ద లాసెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని విశ్రాంత ఆచార్యులు డీకే.రెడ్డి తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని భాజపా దక్షిణ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లాసెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తిలి శంకరరావు, తోట వాసుదేవరావు, రాజుగౌడ్, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఆచార్య డీకే.రెడ్డి, తదితరులు

పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందే

జిల్లా విద్యాశాఖాధికారి

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో తప్పనిసరిగా 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందేనని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం పురుషోత్తపురంలోని బాలాజీ పాఠశాలలో పెందుర్తి, గోపాలపట్నం మండలాల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా సీట్లు పొందిన సంబంధిత విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ప్రవేశాలు కల్పించాలని కోరారు. సీటు పొందిన ఏ ఒక్కరినీ తిరస్కరించరాదని ఆదేశించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పరస్పర సహకారం అవసరమని పాఠశాల యాజమాన్యాలకు తెలిపారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవోలు కె.సువర్ణ, డి.దివాకర్, ప్రయివేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం రావాడ గ్రామంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ తోట రాము తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ చరిత్రతో పాటు ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సామ్రాజ్యాన్ని సంరక్షించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. పరవాడ ఫార్మాసిటీలోని విష్ణు కెమికల్స్ కంపెనీలో గురువారం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ఉన్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లు తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కోటేశ్వరరావు, మూర్తి, సతీష్, పాత్రుడు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు డిగ్రీ విద్యార్థి ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మంగళగిరిలో జరగనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.వెంకటకుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శంకర్ వెల్లడించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 70 మందిలో కుమార్ పేరు ఉండడం గర్వించతగ్గ విషయమన్నారు. ఇందుకోసం నిర్వాహకులు చేపట్టిన వివిధ పోటీ పరీక్షల ఆధారంగా వీరిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారు మంగళగిరిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఇంటెన్సివ్ నైపుణ్య శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటకుమార్‌ను ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శంకర్ తదితరులు

ఎంపీపీ పదవి నుంచి నాగమణి తొలగింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: అవిశ్వాస తీర్మానంలో ఓటమికి గురైన పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షురాలు మధుపాడ నాగమణిని ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి ఎంపీపీపై మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఈ నెల 9న విశాఖ ఆర్డీవో ఆధ్వర్యంలో పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో విశ్వాస పరీక్ష జరిగింది. మండలంలోని తొమ్మిది ప్రాదేశిక స్థానాలకు గాను ఎంపీపీ నాగమణి సహా 8మంది పాల్గొన్నారు. ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని బలపరచడంతో ఎంపీపీ తొలగింపు అనివార్యమైంది. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు నాగమణి ఆ పదవిలో కొనసాగినా.. తాజాగా వెలువడిన ఉత్తర్వుల్లో తక్షణమే ఆమె పదవి నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆదేశించింది.

★ ఈ నేపథ్యంలో నూతన ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. అయితే ఆ ప్రక్రియ జరిగే వరకు ఉప ఎంపీపీ-1కి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు విశాఖ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అదే జరిగితే గొరపల్లి ఎంపీటీసీ సభ్యుడు, ఉప ఎంపీపీ-1 దేముడుకు ఇన్‌ఛార్జి ఎంపీపీగా అవకాశం దక్కుతుంది.

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులు కురిపించే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన చేపట్టారు.

WANTED TEACHERS
SRISHTI WORLD SCHOOL
(CBSE AFFILIATION No - 130520)
(A Leader for Excellence in Education)
SECTOR-XI, UKKUNAGARAM, VISAKHAPATNAM
MOTHER TEACHERS, PRE-PRIMARY, PRIMARY & HIGH SCHOOL
(TRAINED TEACHERS with B.Ed)
❖ FOR ALL SUBJECTS (Eng, Tel, Hin, Math, Sci, Soc, Sanskrit)
❖ For GK & CURRENT AFFAIRS, Computers (Robotics/ Artificial Intelligence/ Coding)
❖ For IIT, Spoken English, Story Tellers and Vocal Music (Classical & Western)
❖ Trained P.E.Ts with B.P.Ed/ M.P.Ed/ NCC ('C' Cert holders)& Admin Co-ordinators
❖ Career Counselor ❖ Psychology Counselor
❖ Soft Skills Trainer ❖ Skill Educator
NOTE: Family Accommodation is available for deserving candidates.
Walk-in-Interview: 21st Feb 2026 onwards (Except Sundays)
❖ Share your resume to mail id: hr.srishtiworldschool@gmail.com or
9391188874 or 8341122949 or 9652947708
(WHATSAPP NUMBERS)

(c) eenadu

పీఏబీఆర్‌లో తాగునీటి పంపింగ్‌కు రూ.3.50 కోట్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఏపీబీఆర్‌లో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ఇంటెక్‌వెల్ వద్ద నీటి పంపింగ్‌తో పాటు మోటార్ల మరమ్మతులకు అత్యవసరంగా రూ.3.50 కోట్లు మంజూరైంది. ఈ వివరాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం విలేకరులకు తెలిపారు.

● జలాశయంలో నీటి పంపింగ్‌కు రెండు మోటార్లు ఉండగా, ఒకటి పూర్తిగా మరమ్మతులకు గురయింది. ఒక దానితోనే ఆ ప్రక్రియ కొనసాగుతోంది. తాగు, సాగునీటికి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్ఎస్ఆర్‌డీడబ్ల్యూఎస్‌పీ అభివృద్ధికి ఆ నిధుల మంజూరుకు పరిపాలన ఉత్తర్వులు వచ్చాయి. ఈ నిధులతో మోటార్‌కు తక్షణం మరమ్మతులు చేయించేలా చొరవ చూపుతాం. నీటి పంపింగ్ అంశంలో తగిన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేలా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిస్తాం. ఉమ్మడి జిల్లాలో అత్యధిక భాగానికి ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. వేసవి దృష్ట్యా నీటి పంపింగ్‌కు ఎలాంటి ఇక్కట్లు లేకుండా ఈ చర్యలు చేపట్టాం.

రేపు జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి పాఠశాలల ప్రతిభా పాటవ పోటీలు ఈనెల 21వ తేదీన జరగనున్నాయి. అనంత నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. గత నాలుగు నెలలుగా అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిరలోని వివిధ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, క్విజ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఒక్కో విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఒక్కో పాఠశాల నుంచి 12 మంది విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారికి జిల్లాస్థాయి పోటీలు శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అనంతపురంలోని పీవీకేకే కళాశాల వద్దకు విద్యార్థులు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

కళ్యాణదుర్గం రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్ రైలు

మొరాయించిన ప్యాసింజర్ రైలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రైలు ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో కదిరిదేవరపల్లి - తిరుపతి ప్యాసింజర్ మొరాయించింది. నాలుగు గంటల పాటు ఆగిపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. గురువారం కదిరిదేవపల్లి నుంచి బయల్దేరిన రైలు. కొద్దిదూరం ప్రయాణించాక ఇంజిన్‌లో సమస్య ఏర్పడింది. కాసేపు మరమ్మతు చేసి కళ్యాణదుర్గం స్టేషన్ వరకు తీసుకొచ్చారు. తరువాత పూర్తిస్థాయిలో మరమ్మతు చేసినా ఫలితం లేకపోవడంతో రాయదుర్గం నుంచి మరో ఇంజిన్ వచ్చినట్లు కళ్యాణదుర్గం స్టేషన్ మేనేజరు ధర్మతేజ తెలిపారు. కళ్యాణదుర్గంలో మధ్యాహ్నం 2.20 గంటలకు వెళ్లాల్సిన రైలు సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరింది. ఫలితంగా గమ్యస్థానాలు చేరుకోవాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పప్పుసెనగ కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ చర్యలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పప్పుసెనగ రైతులకు అండగా నిలిచిందని మార్కెట్‌యార్డు ఛైర్మన్ విజయభాస్కర్, పీఏసీఎస్ ఛైర్మన్ ప్యారం కేశవనంద వెల్లడించారు. గురువారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్ నాలుగు రోజుల క్రితమే చర్యలు చేపట్టిందన్నారు.

మేమే తవ్వుతాం.. అమ్ముతాం

● తాడిపత్రిలో సామాన్యులకు అందని ద్రాక్షలా ఇసుక

● ఉచిత విధానానికి తూట్లు పొడుస్తున్న నాయకులు

ఈనాడు, అనంతపురం: దోపిడీ చేస్తే మేమే చేయాలి. ఇంకొకరు చేస్తే చూస్తూ ఊరుకోం. సామాన్యులు బాగుపడితే సహించలేం... అన్న రీతిలో తాడిపత్రిలో నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. పెన్నాలో ఇసుక మేమే తవ్వాలి.. అమ్ముకోవాలనే ధోరణిలో ఉన్నారు. ఇసుక విషయంలో జనాలను ఇబ్బంది పెట్టొద్దని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నా కొందరు నాయకులు పెడచెవిన పెడుతున్నారు. సామాన్యులను నదిలోకి రాకుండా చేసి ఇసుక మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. నచ్చిన ధరకు అమ్ముకుంటూ జేబులు నింపుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు.

అనుమతులే లేవు

తాడిపత్రి పట్టణం, గ్రామీణం పరిధిలో 18 కిలోమీటర్ల మేర పెన్నానది విస్తరించి ఉంది. పట్టణ సమీపంలో పాత వంతెన, కొత్త వంతెన, నందలపాడు, గ్రామీణ పరిధిలో ఆలూరు, సజ్జలదిన్నె, చుక్కలూరు, ఇగుడూరు, చిన్నపొలమాడ ప్రాంతాల్లో నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఒక్కచోట కూడా అనుమతులు లేకపోవడం గమనార్హం. కొందరు నాయకుల అండతో అక్రమార్కులు సిండికేట్‌గా మారి పెన్నా నుంచి ఇసుక తవ్వి నంద్యాల, బనగానపల్లి, యాడికి, గుత్తి, బళ్లారి ప్రాంతాలకు తరలిస్తున్నారు. తాడిపత్రి ప్రాంతంలో ఎవరికి ఇసుక అవసరమున్నా సిండికేట్‌తో కొనాల్సిందే. అక్రమ రవాణాకు కొందరు పోలీసుల సహకారం అందుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆధిపత్యపోరుతో..

పెద్దపప్పూరు మండలంలో గార్లదిన్నెకు చెందిన ఇద్దరు నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వుతున్నారు. ఇటీవల వారి మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. సొంత ఆస్తిలా నదిని గుప్పిట్లో ఉంచుకోవడం కోసం అధికారుల ద్వారా పావులు కదుపుతున్నారు. మేం మాత్రమే ఇసుక తవ్వాలనే పంతంతో రెండు వారాలుగా ముఖ్య నేతతో మంతనాలు జరుపుతున్నారు. దీంతో రెండు వారాలుగా పెద్దపప్పూరులో తవ్వకాలు నిలిపివేశారు. సామాన్యులను సైతం నదిలోకి వెళ్లకుండా నిలువరిస్తున్నారు. ఫలితంగా చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.

పెద్దపప్పూరు పరిధిలోని పెన్నానదిలో అక్రమ తవ్వకాల ఆనవాళ్లు

అక్రమ రవాణాను అడ్డుకుంటాం

అనుమతులు లేకుండా ఇసుక తవ్వే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. తాడిపత్రి పరిధిలో అక్రమ రవాణాపై ఇప్పటికే పలు ఫిర్యాదులందాయి. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి తవ్వకాలను అడ్డుకుంటాం. సామాన్యులకు ఇసుక అందకుండా చేసే వారిని ఉపేక్షించేది లేదు. అక్రమార్కులకు సహకరించినట్లు తేలితే పోలీసులపైనా చర్యలు తీసుకుంటాం. **- జగదీశ్, ఎస్పీ**

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
అనంతపురం	6.26	5.25
గుంతకల్లు	6.30	5.22

అక్రమ లేఅవుట్ మాట వినిపించొద్దు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని ప్రతి లేఅవుట్ క్రమబద్ధీకరించాలని అహుడా వైస్ ఛైర్మన్, జేసీ విష్ణు చరణ్ స్పష్టం చేశారు. గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో ఎక్కడా అక్రమం అన్న మాటే ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొనే విధంగా అధికారులు అందరికీ తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్లాట్లు, లేఅవుట్‌లో దరఖాస్తు చేసుకోకుండా ఉంటే వాటిని గుర్తించాలన్నారు. అహుడా ఛైర్మన్ వరుణ్, సెక్రటరీ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతు ఇంట చామంతి సిరులు

తాడిపత్రి పట్టణం, శింగనమల, న్యూస్‌టుడే: సాగులో వైవిధ్యం చూపిస్తే ఫలితాలు అదే స్థాయిలో ఉంటాయని నిరూపిస్తున్నారు ఉద్యాన రైతులు. తాడిపత్రి నియోజకవర్గంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే చామంతి పూలసాగును చేపట్టి మంచి లాభాలు గడిస్తున్నారు. పసుపు, తెలుపు రంగుల్లో ఉండే పేపర్, ఐశ్వర్య, సెంట్ రకాల పూల సాగు చేస్తున్నారు.

ఆశాజనకంగా ధర

ప్రస్తుతం ధర కిలో రూ.130 నుంచి రూ. 150 పలుకుతుండటంతో మంచి లాభాలు గడిస్తున్నారు. పెద్దపప్పూరు, షేక్‌పల్లి, చిన్నపప్పూరు, పుట్లూరు మండలంలోని కొండాపురం, అరకటివేముల తదితర గ్రామాల్లో చామంతి పంట దాదాపు 250 ఎకరాల్లో ఉంది. గత పదిహేను రోజుల కిందట కిలో రూ.30 పలికిన ధర ప్రస్తుతం రూ.150 ఉంది.

పెద్దపప్పూరులో చామంతిసాగు

బయట మార్కెట్లలో డిమాండ్

రైతులు నేరుగా నెల్లూరు, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు పంటను తరలిస్తున్నారు. ఎకరాకు దాదాపు 4 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఇదే ధర కొనసాగితే పెట్టుబడులు పోను ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం గడించే అవకాశం ఉంది. రెండు మండలాల పరిధిలో నిత్యం 6 టన్నుల పంట దిగుబడులు మార్కెట్లకు తరలిస్తున్నారు.

మిషన్ శక్తి నిధులు గోల్‌మాల్

అడ్డదారిలో ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ అనుబంధ 'మిషన్ శక్తి' పథకం అమలులో కొను'గోల్‌మాల్' జరిగింది. రూ.లక్షలాది నిధులు అడ్డదారిలో ఖర్చు చేయడమే కాదు.. 'చేతివాటం' ప్రదర్శిస్తున్న వైనంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. మిషన్ శక్తి నిధుల వ్యయానికి సంబంధించి 2025 జులై 16న జారీ చేసిన జీవో, మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా.. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖల్లో (ఐసీడీఎస్) వేర్వేరుగా అమలు చేసిన తీరు ఆశ్చర్యానికి, అనుమానానికి గురి చేస్తోంది. అనంత జిల్లాలో మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత అంశాలపై బాలికలు, మహిళల అవగాహన కోసం నిధులు వ్యయం చేస్తుండగా.. శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం జీవోలను తుంగలో తొక్కారు. ఏ రకమైన వాహనాలను అసలు కొనుగోలు చేయకూడదంటూ 1994లో జీవో 5, 2004లో 162, 2005లో 170 జీవోలను జారీ చేస్తూ ప్రభుత్వం నిషేధం విధించింది. అవసరమైతే అద్దె ప్రాతిపదికపై తీసుకోవచ్చని స్పష్టత ఇచ్చింది.

రూ.15.75 లక్షలు పక్కదారి?

జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ఛైర్మన్‌గా జేసీ ఉంటారు. ఈయనకే కాదు.. కలెక్టర్, రాష్ట్ర డైరెక్టర్లు, కార్యదర్శులకు.. ఇలా ఉన్నతాధికారులు ఎవరైనా సరే ఏమేమీ కొనుగోలు చేయాలన్న దానిపై 2020 అక్టోబరు 21న జీవో 148ను జారీ చేశారు. 43 రకాల వస్తువులు కొనొచ్చు. ఇందులో వాహనాల కొనుగోలు లేదు. కేవలం మరమ్మతు, నిర్వహణకు నిధులు మంజూరు చేసే అధికారం మాత్రమే ఉంది. కానీ.. శ్రీసత్యసాయి ఐసీడీఎస్ పీడీ మాత్రం ఏకంగా రూ.13.51 లక్షలు వెచ్చించి ఒక వాహనాన్ని కొనడం విశేషం. మిషన్ శక్తి కింద రూ.15.75 లక్షలు ఉంటే.. ఇందులో వాహనానికే రూ.13.51 లక్షలు ఇచ్చేశారు. కలెక్టరు, జేసీలనే బురిడి కొట్టించారు.

కొటేషన్‌లో చేతివాటం

ఏదైన కొనాలంటే రూ.5 లక్షల్లోపు అయితే కనీసం 3 కొటేషన్లు స్వీకరించాలి. రూ.5 లక్షలు దాటితే విధిగా టెండరు ఆహ్వానించాలి. ఇక్కడ వాహనం కొనుగోలుకు రూ.13.51 లక్షలు వెచ్చించారు. టెండర్ ఆహ్వానించకుండా నచ్చిన వారితో కొటేషన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. వాహనం కొనుగోలుకు జేసీతో సహా ఎనిమిది మంది జిల్లా అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఏమాత్రం సంబంధం లేని డీఎస్ఓ, సీపీఓ, డీఐసీ.. వంటి అధికారులను నియమించడం అనుమానాలకు దారి తీసింది. డీసీపీఓ ఒప్పంద ఉద్యోగి. ఇతన్ని కూడా ఆ కమిటీలో నియమించడం ప్రస్తావనార్హం. ఆర్టీఏ అధికారే వాహన కొనుగోలు దస్త్రంపై సంతకం పెట్టలేదని విశ్వసనీయ సమాచారం.

కలెక్టర్ ఆదేశాలతో

వాహనం కొనుగోలు వ్యవహారం కలెక్టరు చూస్తున్నారు. ఇందుకు సంబంధించి మాకు పూర్తి సమాచారం లేదు. ఏదైన నిబంధనల ప్రకారమే చేస్తాం. వాహనం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులేవీ మా వద్ద లేవు. **- ప్రమీల, పీడీ, ఐసీడీఎస్**

రెవెన్యూ భూములు.. అనర్హులకు పట్టాలు

✦ సాగులో లేకున్నా పథకాల లబ్ధి

✦ కబ్జాదారుల కోరల్లో వందలాది ఎకరాలు

గుత్తి, న్యూస్‌టుడే : పదేళ్ల కిందట గ్రామ పంచాయతీలకు శాశ్వత ఆదాయం చేకూర్చే పనుల్లో భాగంగా గ్రామాల్లోని పోరంబోకు భూముల్లో చింత మొక్కలు నాటించారు. వాటిల్లో కొన్ని బతికి పెద్దవయ్యాయి. మిగిలినవి దాదాపు ఎండిపోయాయి. మొక్కలు లేని భూములపై వైకాపా కార్యకర్తలు పట్టాలు తీసుకున్నారు. ఆ ప్రభుత్వ చివరి రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో భూపంపిణీ చేపట్టింది. అప్పట్లో ఎమ్మెల్యే సిఫార్సుల మేరకే పట్టాలు మంజూరు చేశారు.

ఒక గ్రామంలోనే వందెకరాలు

గుత్తి మండలంలోని ధర్మాపురం శివారులో వందెకరాల భూమి ఉండగా కొంత వంకలో ఉంది. మరికొంత భూమిలో చింత మొక్కలు నాటారు. మొక్కలు లేకపోవడంతో నలుగురు వైకాపా కార్యకర్తలు ఆభూములను కాజేశారు. 20 ఎకరాల వరకు పట్టాలు పొందారు. మిగిలిన 80 ఎకరాల్లో గుత్తి, గుత్తిఆర్.ఎస్.లకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు సాగు భూముల కింద రెవెన్యూ అధికారులతో పట్టాలు పొందారు.

● వెంగన్నపల్లిలో సుమారు 4 ఎకరాల తోపు భూమి ఉండగా చెట్నేపల్లికి చెందిన ఓ వ్యక్తి తనపేరుతో వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టా పొందారు. ఇలా గుత్తి మండలం మొత్తం మీద సుమారు 200 ఎకరాల భూమిని పేదల పేరుతో పంపిణీ చేశారు.

ఎవరి భూములు ఎక్కడున్నాయో?

వందెకరాల భూమిలో తమది ఎక్కడుందో కూడా నాయకులకు తెలీదు. కేవలం బ్యాంకుల్లో పంట రుణాలు పొందుతున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పలు పథకాలను అప్పణంగా దండుకుంటున్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో వందెకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు తేలింది. అప్పట్లో జారీ చేసిన పట్టాలను రద్దు చేయాలని పలువురు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ధర్మాపురంలో అనర్హులు పొందిన పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దారు తమకు హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచి శ్రీనివాసచౌదరి చెబుతున్నారు.

ధర్మాపురంలో వైకాపా కార్యకర్తలు పట్టాలు పొందిన భూమి

పట్టాలు ఎలా ఇచ్చారో తెలీదు

గతంలో తోపులకు ఎలా పట్టాలు ఇచ్చారో నాకు తెలీదు. అప్పట్లో ఇచ్చిన పట్టాల విషయంలో తానేమీ చేయలేను. ఈవిషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. **- పుణ్యవతి, తహసీల్దారు, గుత్తి**

చెస్ పోటీలకు ఐదుగురి ఎంపిక

అనంతపురం క్రీడలు, ఎస్కేయూ, న్యూస్‌టుడే: దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల చదరంగం పోటీలకు వివిధ కళాశాలల నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. అంతర్ కళాశాలల చదరంగం పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈనెల 21 నుంచి 24 వరకు విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు పి.దీపిక, ఎ.రెబికా (కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల), యు.తేజస్విని, ఎం.లిఖిత (అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాల), ఎం.అర్చన (ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల)లు ఎంపికయ్యారు. ఈ మహిళలను ఎస్కేయూ క్రీడామండలి కార్యదర్శి బి.జెస్సీ అభినందించారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో మెరుపులు మెరిపించి పతకాలతో తిరిగి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఎడమ అరచేతిని కోల్పోయిన స్నేహలత

రాలిన ఆశల అరచేయి

పోలీసుల నిర్లక్ష్యంతో యువతికి వైకల్యం

ఈనాడు, కర్నూలు: ఆ యువతి ఇంటికి వెలుగు. తల్లిదండ్రులకు ఆసరా. చెల్లెలి చదువుకు భరోసా. ఉన్నత విద్య చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. రేపటిపై ఎన్నో కలలు కంది. బస్సు ప్రమాదం తన అరచేయి తెగేలా చేస్తే, పోలీసుల నిర్లక్ష్యం శాశ్వత అంగవైకల్యాన్ని మిగిల్చింది.

బుక్కరాయసముద్రం మండలం గాంధీనగర్‌కు చెందిన దేవరకొండ స్నేహలత బీఫార్మసీ పూర్తి చేసి, హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మీలకు ఆర్థికంగా అండగా ఉంటున్నారు. తల్లికి ఒంట్లో బాగోలేదని స్నేహలత (23) బుధవారం రాత్రి అనంతపురం బయల్దేరారు. తెలంగాణ జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు వద్ద బస్సు బోల్తా కొట్టడంతో ఆమె అరచేయి తెగి, పడిపోయింది. అరచేతిని వదిలేసి పోలీసులు వెంటనే ఆమెను కర్నూలుకు పంపారు. తెగిన చేయిని మరిచిపోయారు. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే చేయి వస్తుందని ఎవరో చెప్పడంతో ఆమె ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అరచేతిని తెచ్చుకుంటే ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పడంతో బాధితురాలు తన బంధువును ఘటనాస్థలికి పంపించారు. వారు అరచేతి భాగాన్ని కర్నూలు తీసుకొచ్చేసరికి సమయం మించిపోయింది. దాన్ని అతికించడానికి అవకాశం లేదని వైద్యులు తేల్చిచెప్పారు. దీంతో బంధువులు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు.

సైబర్‌నేరాల అడ్డుకట్టకు ఒప్పందం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల అడ్డుకట్టకు రాష్ట్ర పోలీసు శాఖతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ మాట్లాడుతూ డిజిటల్ మోసాలు, దర్యాప్తులు, సైబర్ నేరాలు అరికట్టడం, స్మార్ట్ పోలీసింగ్ సాధనాలతో కార్యాచరణ, డేటా ఆధారిత నేర విశ్లేషణ, సాక్ష్య ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి ఈ అవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ, బెస్ట్ ప్రాక్టీస్ నేర్పించడానికి కృషి చేస్తామన్నారు. బీటెక్, ఎంటెక్ చదువుతున్న విద్యార్థులకు పైఅంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సాంకేతికపరంగా సైబర్ నేరాలు అరికట్టడానికి జేఎన్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసు శాఖ రాష్ట్ర ఐజీ సత్యయేసు బాబు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న, డీఏపీ డైరెక్టర్ సత్యనారాయణ, ఆచార్య భానుమూర్తి, నాగప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.



పత్రాలతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, ఐజీ తదితరులు

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు కృషి

ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్.రాజు, సురేంద్రబాబు

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : జిల్లాలో ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీటీ పరిస్థితిని వివరించారు. గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, సురేంద్రబాబు కలిసి వినితిపత్రం అందజేశారు. ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణలో తీవ్రజాప్యం సాగుతోందని, సంస్థ నిర్వహణ కష్టంగా మారిందని, ఆస్తులను విక్రయించే స్థితికి రావడం దురదృష్టకరమని సీఎంకు వివరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలోనే అప్పట్లో పాలకులు స్పందించకపోవడంతో ఆర్డీటీ సంస్థకు ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, త్వరగా ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించేలా చూడాలని ఎమ్మెల్యేలు విన్నవించారు. శుక్రవారం దిల్లీ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని వారు సీఎంను కోరారు. ఇప్పటికే చాలాసార్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లామని సీఎం గుర్తు చేశారు. ఈ విషయంపై దిల్లీ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని సీఎం భరోసా ఇచ్చారని వారు తెలియజేశారు.

సంకల్పం.. సాక్షాత్కారం

● చెరువు, కట్టల పటిష్ఠతకు చర్యలు

● టింబక్టు ఆధ్వర్యం.. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారం

చెరువుకట్టపై ముళ్ల పొదల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న సమాఖ్య మహిళలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెరువులు, నీటి కమతాల బాగు, పటిష్ఠతకు చర్యలు తీసుకుని పంట, నీరు భద్రతకు కృషి చేస్తూ ఇటు రైతులకు, అటు ప్రకృతికి మేలు జరిగేలా టింబక్టు కలెక్టివ్ సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్టు (చెలిమి) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024 ఏప్రిల్ 1న ప్రారంభించిన ఈ పథకానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. గ్రామాల్లో చెరువులు, కట్టలు, కాలువలు, చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు నిర్వహించడం, పూడిక తీసి మట్టిని రైతుల పొలాలకు తరలించడం ముఖ్యోద్దేశం. గ్రామాల్లో నీటి వనరులను గుర్తించి వాటికి మరమ్మతులు నిర్వహించి సుస్థిరంగా వినియోగించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ పని చేస్తోందని ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయం

16 గ్రామాల్లో 7,014 మంది రైతులతో 20,620 ఎకరాల్లో సేంద్రియ సాగు చేపట్టారు. అందులో 178 మంది రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యపు పరికరాలు అందించారు. రైతులకు వేప చెక్క, వేప నూనె, కషాయాలు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టె విత్తనాలు ఉచితంగా అందిస్తున్నారు. రైతులే సొంతంగా తయారు చేసుకునేలా సంస్థ సిబ్బంది కార్యశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

కార్యక్రమం అమలు ఇలా..

ప్రాజెక్టు పేరు చెలిమి

అమలు ఎక్కడ చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం మండలాల్లోని 16 గ్రామాల్లో

క్షేత్రస్థాయిలో 30 మంది లీడర్లతో జన చైతన్య సమాఖ్య ఏర్పాటు చేస్తారు. స్థానికంగా ఉన్న ఉమ్మడి నీటి వనరులు, భూగర్భ జలాల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేసి వాటి కనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తారు.

ఇప్పటివరకు

పోలేపల్లి, పెద్దకోడిపల్లి, శేషంపల్లి, చెరుకూరు, దోడగట్ట, కోగిర చెరువుల కట్టలపై ముళ్ల పొదలు తొలగించారు. ముష్టికోవెల, కనుముక్కలలో రెండు చెరువులు, పెద్దకోడిపల్లి, రామగిరి, కోగిర చెరువుల ఆయకట్టు కాలువలను బాగు చేయించారు. శిథిలావస్థలో ఉన్న 14చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేశారు. 9 నీటి కుంటల్ని బాగు చేశారు. 14 గ్రామాలలో వర్షపాత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆరు చెరువుల్లో పూడిక తీసి 653 మంది రైతుల పొలాలకు 22 వేల ట్రాక్టర్ల మట్టిని తరలించారు.

(c) eenadu

హంస వాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వరుడి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదో రోజు యథావిధిగా సాగాయి. ఉదయం బుగ్గరామ లింగేశ్వరుడిని, రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై ఉంచి పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. ఇందులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కసాపురం ఆలయ సమాచారం

గుంతకల్లు పట్టణం: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నేటి (శుక్రవారం) జరుగు పూజ కార్యక్రమాలు. వేకువ జామున 4.15 నుంచి 5.15 గంటల వరకు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, 5.30 నుంచి 6.గంటల వరకు స్వామి వారి నిజరూప దర్శనం, ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు ఉంటాయి. తరువాత ఆలయ తలుపులు మూసి వేత, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

నిధులు అందక.. లక్ష్యం నెరవేరక

గొర్రెల పెంపకం క్షేత్రం నిర్వహణ భారం

పెనుకొండ, న్యూస్‌టుడే: రాయలసీమలో గొర్రెల పెంపకం దారులకు అధిక లాభాలు చేకూర్చాలి. అందుకు నాణ్యమైన విత్తన పొటేళ్లు సరఫరా చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పెనుకొండ శివారులో 578 ఎకరాల్లో గొర్రెల పెంపకం క్షేత్రాన్ని ప్రారంభించింది. ఈక్షేత్రంలో డీడీతోపాటు ఇద్దరు ఏడీలు, ముగ్గురు వైద్యులు, 30 మంది సిబ్బంది నివాసం ఉండేలా భవనాలు కూడా నిర్మించారు. అయితే కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో క్షేత్రం లక్ష్యానికి దూరమైంది. ప్రస్తుతం డీడీ, ఓ వైద్యుడు, ఓ సీనియర్ సహాయకుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గొర్రెలు, క్షేత్రం సంరక్షణకు 18 మంది కూలీలు పని చేస్తున్నారు. సిబ్బంది కొరత, నిధుల లేమి కారణంగా క్షేత్రం నిర్వహణ భారంగా మారుతోంది.

విత్తన పొటేళ్లు సరఫరా

క్షేత్రంలో ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో గొర్రెల పెంపకందారులకు నాణ్యమైన విత్తన పొటేళ్లను కిలో రూ.450 ప్రకారం లైవ్ వెయిట్‌తో విక్రయిస్తారు. ఏటా 80 మంది రైతులకు సుమారు 100 పొటేళ్లు సరఫరా చేస్తున్నారు. క్షేత్రంలో 14 ఎకరాల్లో గడ్డి, గడ్డిజాతి మొక్కలు పెంపకం చేస్తున్నారు. మరో 25 ఎకరాల్లో వర్షాధారం కింద గడ్డి సాగు చేస్తారు. మిగిలిన భూమిలో గొర్రెలను మేపేందుకు తీసుకెళతారు.

క్షేత్రంలో నెల్లూరు బ్రౌన్ గొర్రె పిల్లలు

ఇతర అవసరాలకు భూ కేటాయింపులు

గొర్రెల పెంపక క్షేత్రం కోసం కేటాయించిన భూమిలో గత ప్రభుత్వం వైద్యకళాశాల నిర్మాణానికి, ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటుకు ఇలా ఇతర అవసరాలకు దాదాపు 100 ఎకరాలకుపైగా భూమి తీసుకుంది. ప్రస్తుతం నెల్లూరుబ్రౌన్ బ్రీడ్‌కు సంబంధించి 595 గొర్రెలను ఇక్కడ సంరక్షిస్తున్నారు. మిగిలిన 470 ఎకరాల భూమికి సైతం కంచె లేకపోవడం వల్ల అన్యాక్రాంతం అవుతుందనే ఆరోపణలున్నాయి. గతంలో పెనుకొండ క్షేత్రానికి రూ.2 కోట్లతో గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వైకాపా ప్రభుత్వ పాలనలో ఈ భవనం నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లిపోవడంతో సరైన భవనం లేకుండా పోయింది.

ప్రభుత్వ తోడ్పాటు అవసరం

రాష్ట్రంలో ఉన్న ఏకైక బ్రీడ్ నెల్లూరుబ్రౌన్ అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు అవసరం. క్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు సమకూరితే పూర్తి స్థాయిలో గొర్రెల పెంపకందారులకు ఉపయోగ కరంగా ఉంటుంది. పెనుకొండలో నేషనల్ రీసర్చ్ సెంటర్ ఆన్ మీట్ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

- కాంతమ్మ, డీడీ, గొర్రెల పెంపక క్షేత్రం

న్యాయవిద్య పరీక్ష తేదీల్లో మార్పు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో న్యాయవిద్య 3, 5 ఏళ్ల కోర్సు ప్రథమ సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ నెల 21న పరీక్షలు మొదలవుతాయన్నారు. 21న జరగాల్సిన పరీక్ష 28న, 23కు సంబంధించి మార్చి 2న నిర్వహిస్తారని ఆయన చెప్పారు.

డిగ్రీ పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. అనంత నగరంలోని ఎస్ఎల్ఎన్, శ్రీవాణి డిగ్రీ కళాశాలల్లో ముగ్గురు చొప్పున, గోరంట్లలోని ఎస్‌వీడీవీ డిగ్రీ కళాశాలలో ఇద్దరిని డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ వెల్లడించారు.

ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనివేళల్లో మార్పు

అనంతపురం విద్య: రంజాన్ మాసం సందర్భంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల పనివేళలు మార్చినట్లు డీఈవో ప్రసాద్‌బాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బడులు ఉంటాయన్నారు. రంజాన్ మాసం ముగిసిన తర్వాత యథావిధిగా సాధారణ వేళల్లోనే పాఠశాలలు నిర్వహిస్తారన్నారు. ఇతర పాఠశాలల్లో చదివే ముస్లిం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పొరుగు సేవల ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగులు సాయంత్రం ఒక గంట ముందుగానే ఇంటికి వెళ్లవచ్చని ఆయన వెల్లడించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ పాదయాత్ర

మొవ్వ(కూచిపూడి): తెదేపా వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ బి.ఎన్.నర్సింహులు పాదయాత్ర చేస్తున్నారని తెదేపా నాయకుడు తాతినేని పూర్ణచంద్రరావు అన్నారు. ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు నర్సింహులు కృష్ణాజిల్లాలో 41రోజుల మండల దీక్షను మూడురోజుల కిందట నిమ్మకూరులో ప్రారంభించారన్నారు. గురువారం మొవ్వకు చేరుకున్నాక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తరువాత పాదయాత్ర కొనసాగింది.

జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ధార్వాడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కోట్రేశ అన్నారు. రెండు రోజుల పాటు స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జీవవైవిధ్య జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. భూమిపై ఉన్న అన్ని రకాల జీవులు, మొక్కలు, జంతువులు, సూక్ష్మ జీవులు, వాటి మధ్య ఉన్న సంబంధాల సమాహారమే జీవవైవిధ్యమన్నారు. దేశంలో 8 వేల రకాలు, ప్రపంచవ్యాప్తంగా 21 వేల రకాల ఔషధ మొక్కలున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధ్యాపకులు కళాశాల ఆవరణలో రకరకాల మొక్కలు నాటారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, అధ్యాపకులు రవిశంకర్‌శర్మ, భీమలింగయ్య, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

సజావుగా అంగన్‌వాడీ పోస్టులకు ముఖాముఖి

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చేపట్టిన ముఖాముఖి (ఇంటర్వ్యూ) సజావుగా సాగింది. మూడు రోజులు సాగే ప్రక్రియలో భాగంగా గురువారం అనంత ఆర్డీఓ కార్యాలయంలో తొలి రోజు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సారథ్యంలో అభ్యర్థులను పలు ప్రశ్నలు అడిగారు. శింగనమల, అనంత అర్బన్, అనంత గ్రామీణం, తాడిపత్రి, నార్పల ప్రాజెక్టుల వారీగా ముఖాముఖి జరిగింది. మొత్తం ఎనిమిది అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 29 మంది దరఖాస్తు చేసుకోగా అందరూ హాజరయ్యారు. 40 ఆయా పోస్టులకు 83 మంది దరఖాస్తు చేసుకోగా, 74 మంది వచ్చారు. మరో వైపు ఈ నెల 20న కళ్యాణదుర్గం, 21న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయాల్లో ఆయా ప్రాజెక్టుల అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించనున్నారు.

ఖాద్రీ క్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయల ఏకవాక్య శాసనం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన సింహాసనంపై ఏకవాక్య శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. విజయనగర సామ్రాజ్య కాలంనాటి ఆలయ నిర్మాణాలు, వాటి విశేషాలు అనే అంశంపై పరిశోధనలో భాగంగా కదిరి ఆలయంలో ఈవో శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. కల్యాణ మండపంలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు ఆదేశంతో రాజప్రతినిధి తిమ్మప్పనాయుడు, శ్రీలక్ష్మీనరసింహ స్వామికి సింహాసనాన్ని నిర్మించాడన్నారు. ఉత్సవ విగ్రహాలను సింహాసనంపై కొలువుదీర్చి కల్యాణోత్సవం జరిపేలా అద్భుత శిల్ప సంపదతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండపాన్ని కూడా శ్రీకృష్ణదేవరాయలే నిర్మించి ఉంటారని అభిప్రాయపడ్డారు.

శిల్పకళ ఆసనం వద్ద మైనాస్వామి, ఈవో శ్రీనివాసరెడ్డి

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని ✆ 7382114647.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో అద్భుతంగా డెవలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204

JOBS

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements : 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill

ప్రముఖ మా సంస్థ యందు పర్క్ చేయుటకు రిసెప్షన్, టెలీకాలర్, ఆఫీస్ అసిస్టెంట్ అర్జెంట్‌గా కావలెను. Q: 10 to డిగ్రీ, జీతం 9 K to 25K 9491555724

వెంకటాద్రి ఇన్‌ఫ్రా, ATPలో పనిచేయుటకు అనుభవం కల Site Supervisor కావలెను. జీతం: 15,000/- (అనుభవాన్ని బట్టి) బయోడేటా Whatsapp చేయగలరు. 7779992688

అనంతపురం టౌన్ గుత్తిరోడ్‌లో మాంటిస్సోరి స్కూల్ పక్కన గల JK Enterprises నందు పనిచేయుటకు Tally Billing ఆపరేటర్ కావలెను. 8008803109

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే సమ్మెలో ఉన్న ఉద్యోగులు జిల్లా, డివిజన్ స్థాయిలో ధర్నాలు చేసి బ్యాంకుల కార్యకలాపాలను స్తంభింపజేయడానికి సిద్ధమయ్యారు. గురువారం ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేశారు. సొసైటీలకు తాళాలు వేసి ధర్నాలో పాల్గొన్నారు.

- జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లరాయుడు, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు దివాకర్ ధర్నాకు మద్దతు ప్రకటించారు. సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, కోశాధికారి హనుమంతరెడ్డి, పలువురు డివిజనల్ కార్యదర్శులు పాల్గొన్నారు.
- సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ విధానం అమలు చేయాలని, పదేళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం కరుణించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం జారీ చేసిన జీఓ నం.36ను తక్షణమే అమలు చేసి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నాకు మద్దతిస్తున్న మల్లరాయుడు, దివాకర్

పోలీసులకు క్రమశిక్షణ తప్పనిసరి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పోలీస్ డీటీసీలో శిక్షణ పొందుతున్న 101 మంది ట్రైనీ కానిస్టేబుళ్లతో ఎస్పీ జగదీశ్ గురువారం సమావేశమయ్యారు. తొలుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శిక్షణలో భాగం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ల్యాబ్‌తో శిక్షణార్థులు సైబర్ నేరాలు, డిజిటల్ రికార్డులు, కొత్త పోలీసింగ్ విధానాలపై ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందుతారన్నారు. శిక్షణార్థుల వసతులపై ఆరా తీశారు. భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి శిక్షణార్థులతో కలిసి భోంచేశారు. శిక్షణతో పాటు సత్ప్రవర్తన, క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాద, చట్టపరమైన అవగాహన అంశాలు చాలా ముఖ్యమన్నారు. ఆయన వెంట డీటీసీ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ యువరాజు, ఆర్‌ఐలు తదితరులున్నారు.

డీటీసీలో భోజనాన్ని రుచి చూస్తున్న అనంత ఎస్పీ జగదీశ్

గ్రామీణ క్రికెట్ పోటీలతో ఉజ్వల భవిత

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రికెట్ పోటీలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్న క్రికెటర్లకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, ఏఎఫ్ ఎకాలజీ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. అనంత క్రీడా గ్రామంలో గురువారం మొదలైన గ్రామీణ క్రికెట్ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరైమాట్లాడారు. ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో క్రికెట్ పోటీలు మళ్లీ మొదలవడంతో ప్రతిభావంతులను గుర్తించి సానబెడతామన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వచ్చే వారంలో లీగ్ పోటీలు ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లలోపు బాలురు, 16 ఏళ్లలోపు బాలికలు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు.

హిందూపురం జట్టు ఘన విజయం: తొలిరోజు జరిగిన బాలికల పోటీలో హిందూపురం జట్టు రాప్తాడుపై 78 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన హిందూపురం 30 ఓవర్లలో 3 వికెట్లకు 244 పరుగుల భారీ స్కోరు చేసింది. బ్యాటరు ఈ.పూర్ణచంద్రిక (120) అద్భుత శతకంతో అజేయంగా నిలిచింది. ఛేదనలో రాప్తాడు జట్టు 166 పరుగులు చేసి ఓటమి పాలైంది. బాలుర విభాగంలో తాడిపత్రి జట్టు 85 పరుగుల తేడాతో ధర్మవరం జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన తాడిపత్రి 40 ఓవర్లలో 7 వికెట్లకు 233 పరుగులు చేయగా, ధర్మవరం 148 పరుగులు మాత్రమే చేసి ఓడింది. పోటీలు శుక్రవారమూ కొనసాగుతాయి.

120 పరుగులు చేసిన పూర్ణచంద్రిక

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
రెవిన్యూ సెక్షన్, తిరుపతి

టెండరు సహిత వేలం ప్రకటన

Roc.No:REV-5/TTD-47022/35/2025-REV SEC తేదీ: 13-02-2026

ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లా, నారాయణపురం గ్రామ పంచాయతీ, 3వ వార్డు, సోమనాథ్ నగర్‌లోని సర్వే నెం. 212/2B, ప్లాట్ నెం. C1లో 168 చ.గజముల (1512 చ.అడుగులు) విస్తీర్ణంతో డోర్ నెం.3/386తో కూడిన తితిదే ఇంటికి ప్రథమముగా ఒక (01) సంవత్సరానికి గాను మరియు, ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తితిదే వారి సంతృప్తి మరియు అభీష్టం మేరకు తదుపరి రెండు (02) సంవత్సరాల పొడిగింపు ప్రాతిపదికన లైసెన్స్ మంజూరు కొరకు తేది: 11-03-2026 నాడు తితిదే కళ్యాణ మండపము, రామచంద్రనగర్, అనంతపూర్ వద్ద టెండరు సహిత వేలం నిర్వహించబడును. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 0877-2264246/8341730057. వివరాల కొరకు లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్: http://www.tirumala.org

TTD-40021/10/2025-PRO SEC (Adv.No:403), Dt: 19-02-2026 కార్యనిర్వహణాధికారి

THE ANANTAPUR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD.,
Subash Road, ANANTAPUR - 515001 (Andhra Pradesh)
Toll free Number: 18004258076. Email: adccbankatp@gmail.com, ceo_atpr@apcob.org, Web: anantapurdccb.bank.in

Ref: ADCCB/Premises/KLDG/2025-26 Date: 19-02-2026

SHORT TENDER NOTICE

Name of the Work: Construction of New Branch Building in Sy.No.351-3C2B1A, Kalyandurg Town, Beside District Cooperative Marketing Society, Govt. Junior College Road, Kalyandurg, from qualified Class-I Contractors. Sealed Tenders are Invited from Eligible and Qualified Class-I Contractors for the above work. The details are as follows: (1).**Total Estimated Cost:** Rs.60,00,000/-, (2) **Cost of Tender Application Fee:** Rs.5,000/-, (3) **EMD:** Rs.1,25,000/- (by way of Demand Draft drawn in favour of the Chief Executive Officer, ADCC Bank Ltd.), (4) **Start Date and Time for Submission of Tenders:** 23-02-2026 10.00 AM, (5) **Last Date and Time for Submission of Tenders:** 02-03-2026 4.00 PM, (6) **Date and Time of Opening of Tedners will be intimated soon.**

For detailed tender documents, rules, and other terms and conditions, Please Contact Premises section: 8977779217 (Chief Manager Premises), ADCC Bank Ltd., Anantapur. For More details visit website anantapurdccb.bank.in available from 21-02-2026

Sd/- K.Surekha Rani, Cheif Executive Officer (FAC)

ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సిరితేజ క్లినిక్
రుమటాలజీ

SIRITHEJA PHARMACY: # 12-3-162, 5th Cross, Sai Nagar, Prathyn Enclave, 2nd Floor, Vesta Scanning Center, Ananthapur.

డా॥ సి.తేజస్విని MBBS, M.D., (General Medicine, SVIMS) FIR
రుమటాలజీ కన్సల్టెంట్
రుమటాలజిస్ట్ & ఫిజీషియన్
Regd. No. APMC/FMR/80053

మా క్లినిక్ నందు అందించు వైద్య సేవలు

మా ప్రత్యేకతలు

రుమటాయిడ్ ఆర్థరైటిస్, స్కిరో డర్మా, సొరియాటిక్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, లూపస్, MCTD, గౌట్, యాంకైలోసింగ్ స్పాండిలైటిస్, షుగర్, బి.పి., థైరాయిడ్, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ & చికెన్‌గునియా, యూరిన్ ఇన్ఫెక్షన్, టి.బి., నిమోనియా, దగ్గు, జలుబు, ఆస్తమా, వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి, తలనొప్పి, కాళ్ల వాపులు, రక్తహీనత (అనీమియా), కామెర్లు (జాండిస్)

Scanning Services Available in our Building

X-Ray | MRI | CT Scan | Ultra Sound

అపాయింట్‌మెంట్ కొరకు: 9071288999, 9704044888

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

కూటమి ప్రభుత్వంలోనే క్రైస్తవుల సంక్షేమం

గుంతకల్లు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ అన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో క్రైస్తవుల కోసం రూ.125 కోట్లను కేటాయించడం చాలా ఆనందించాల్సిన విషయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రైస్తవుల సంక్షేమం గురించి ఆలోచించడం వల్లే పెద్దఎత్తున నిధుల కేటాయింపు జరిగిందన్నారు. ఈసమావేశంలో నారాలోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, తెదేపా నాయకులు హనుమంతు, అంజి, శివన్న, కేశప్ప, ఫజులు, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, నాయకులు

రీవాల్యుయేషన్ తర్వాతే సప్లిమెంటరీకి విజ్ఞప్తి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎల్‌ఎల్‌బీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసిన తర్వాతే సప్లిమెంటరీ పరీక్షలు జరపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వారు గురువారం రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్కేయూ కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో అరెస్ట్ చేసిన వైకాపా కార్యకర్త గోవర్ధన్‌ను గురువారం పెనుకొండ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ కేవీ మహేశ్ తెలిపారు. గురువారం గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆంజినేయులుతో కలిసి డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోవర్ధన్.. 14 సంవత్సరాల బాలికను బలవంతంగా ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడన్నారు. వెంటనే బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో సిబ్బందిని అప్రమత్తం చేసి అతడిని, బాలికను అదుపులోకి తీసుకొన్నామన్నారు. బాలికను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

సర్వజన వైద్యశాల ఏవోగా రమణ

అనంతపురం (వైద్యం): అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలనా అధికారిగా (ఏవో)గా రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కడప డెంటల్ కళాశాలలో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏవోగా పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో ఆయన సర్వజన వైద్యశాలలో వివిధ హోదాల్లో పనిచేసిన విషయం తెలిసిందే.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: పట్టపగలే మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లిన ఘటన గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని గొంచిరెడ్డిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని నంజాపురం గ్రామానికి చెందిన తులసి కళ్యాణదుర్గం నుంచి స్కూటీలో నంజాపురానికి వెళ్తోంది. ఈ క్రమంలో గొంచిరెడ్డిపల్లికి కొంత దూరంలో వెళ్తుండగా వెనక నుంచి మరో స్కూటీలో వచ్చిన ఓ దుండగుడు తులసిని అడ్డగించాడు. ఆమె స్కూటీ ఆపడంతో మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఆమె గట్టిగా అరుపులు, కేకలు వేసినా వదల్లేదు. అనంతరం అటుగా వచ్చిన వాహనదారులు చోరీ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయికుమార్ వెంటనే అక్కడికి చేరుకొని వివరాలను బాధితురాలితో అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జయప్పను సన్మానిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

లేపాక్షి, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ జయప్పను మంత్రి కందుల దుర్గేష్, ఎండీ ఆమ్రపాలి, ఛైర్మన్ బాలాజీ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా లేపాక్షిలో పర్యాటక శాఖ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై పత్యేక ప్రణాళికను మంత్రికి అందించినట్లు ఆయన తెలిపారు.

ఆస్తి వివాదంతోనే జంటహత్యలు

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇల్లు, పొలం తమకు దక్కలేదనే అక్కసే తరిమెల జంట హత్యలకు కారణమని శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఈ నెల 2న శింగనమల మండలం తరిమెలలో జరిగిన తల్లీకొడుకుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులు దండోరా లక్ష్మీదేవి, ఆమె కుమారులు జగజ్జీవన్‌రామ్, ఓంకార్, మిత్రులు శ్రీనివాసులు (ఇల్లూరు), సాయికిరణ్ (వీరేపల్లి)ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం శింగనమల పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. తరిమెలకు చెందిన దండోరా నల్లప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య లక్ష్మీదేవి కుమారులు జగజ్జీవన్‌రామ్, ఓంకార్. రెండో భార్య ఎల్లమ్మకు అంబేడ్కర్ అలియాస్ చిన్నా సంతానం. ఎల్లమ్మ స్థానికంగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. నల్లప్ప కొంతకాలం క్రితం మృతి చెందాడు. అతడికి తరిమెలలో కొంత పొలం, ఇల్లు ఉండగా, మరణానంతరం ఆస్తి పంపకాలు జరగలేదు. ఆ పొలం, ఇంటిని మొదటి భార్య కుమారులకు తెలియకుండా ఎల్లమ్మ తన పేరుపై మార్చుకుంది. ఈ విషయంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2వ తేదీన జగజ్జీవన్‌రామ్, ఓంకార్ ఎల్లమ్మ ఇంటికి వెళ్లారు. వారి మిత్రులు శ్రీనివాసులు, సాయిచరణ్ బయట కాపలాగా ఉన్నారు. తొలుత హాలులో నిద్రిస్తున్న చిన్నాను రాళ్లతో కొట్టి, కొడవళ్లతో నరికి చంపారు. అది చూసిన ఎల్లమ్మ భయంతో పడక గదిలోకి వెళ్లి తలుపులేసుకుంది. కిటికీ నుంచి తలుపు గడియ తీసి బయటకు లాక్కొచ్చిన నిందితులు, ఆమె తలను ఒకరు పట్టుకోగా, మరొకరు కొడవలితో మెడను నరికి మొండెం నుంచి వేరుచేశారు. తలను చేతిలో పట్టుకుని వీధిలోకి వచ్చి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం రెండు మృతదేహాలను ఇంట్లో పడేసి తల్లితో కలిసి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో శింగనమల, నార్పల, గార్లదిన్నె ఎస్సైలు విజయకుమార్, సాగర్, మహమ్మద్‌గౌస్‌లతో కూడిన మూడు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఈక్రమంలో పాత కల్లూరు సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న శింగనమ సీఐ కౌలుట్లయ్య

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న తెదేపా నాయకుడు ధర్మతేజ

కంబదూరు, న్యూస్‌టుడే: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గురువారం తెదేపా నాయకుడు ధర్మతేజ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కల్యాణమండపం, భోజనశాల, వంటగది, ఆర్వో ప్లాంటు, సీసీ రోడ్డును పూర్తి చేయమన్నారు. అలాగే పలు సమస్యల్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం అలాగే స్థానిక చెక్‌పోస్ట్ ఎస్సీ కాలనీలో తేలే పంప్ మరమ్మతుకు గురైంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దానిని మరమ్మతు చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, వెంకటేశులు, రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పథకాలు వర్తింపజేయాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి డిమాండు చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ ఎదుట దీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉరవకొండలో గోడపత్రాలను విడుదల చేశారు. కౌలు రైతులకు పంట రుణాలు, ఇతర ప్రయోజనాలు కల్పించడం లేదన్నారు. వాటన్నింటినీ సాధించడమే లక్ష్యం పోరాడతామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీనప్ప, జ్ఞానమూర్తి, సిద్దప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: గోనబావి గ్రామంలో నూతన కాలనీలో రేషన్ షాపు లేకపోవడంతో దాదాపు కిలోమీటరు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. -పాలారాయుడు, సానికుడు

సమాధానం: సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తాం. -రాజేష్, సర్వంట్ గోనబావి

సమస్య: కేనాపురం గొల్లదొడ్డి సమీపాన ఉన్న ఆర్టీటీ కాలనీలో సిమెంట్ ట్యాంకు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. -భీమన్న, సానికుడు

సమాధానం: క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. -జయరాములు, ఎంపీడీఓ గుమ్మఘట్ట

సమస్య: తాళ్లకెర గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపాన ఉన్న అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పిల్లలంతా ఆ పరిసరాల్లోనే ఉన్నందువల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. -కావలి రామప్ప, తాళ్లకెర

సమాధానం: ఇప్పటికే సమస్య మా దృష్టికి వచ్చింది, అధికారులకు సమస్యను తెలియజేశాం, తగిన చర్యలు తీసుకుంటాం. -జయరాములు, ఎంపీడీఓ గుమ్మఘట్ట

-న్యూస్‌టుడే, గుమ్మఘట్ట

మురుగు కాలువలో చెత్త తొలగింపు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణం సీవీవీ నగర్‌లో ఉత్తరం రహదారి పక్కనున్న ప్రధాన మురుగు కాలువలో పేరుకు పోయిన చెత్త, వ్యర్థాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. గురువారం 'ఈనాడు'లో 'కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు' శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

నత్తనడకన త్రీఫేజ్ విద్యుదీకరణ పనులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం విద్యుత్తు డివిజన్ పరిధిలో త్రీఫేజ్ పనులు గత రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. పల్లెలకు 24 గంటల పాటు విద్యుత్తు వెలుగులు ఉండేలా త్రీఫేజ్ విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం వ్యవసాయానికి మాత్రమే గ్రామాల్లో 9 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. మిగిలిన సమయంలో సింగిల్ ఫేజ్ సరఫరాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్) కింద గ్రామాల్లోనూ ప్రత్యేక విద్యుత్తు లైన్లు వేసి త్రీఫేజ్ విద్యుత్తు అందించే పనులు జరుగుతున్నాయి.

మెచ్చిరి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న స్తంభాలు

సమస్యలు ఎక్కడంటే

● రాయదుర్గం విద్యుత్తు డివిజన్ కింద మొత్తం 122 గ్రామాలు ఉన్నాయి. స్థానికంగా నైపుణ్యం కలిగిన కార్మికులు దొరకడం లేదు. త్రీఫేజ్ పనులు గుత్తేదారులు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకురావాల్సి ఉంది. దశలో విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.

● గుమ్మఘట్ట విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో దాదాపు పూర్తయిన కె.పి.దొడ్డి సబ్‌స్టేషన్ కింద పనులు జరుగుతున్నాయి. పల్లేపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో 15 కిలోమీటర్ల మేర ఒక బ్రేకర్ ఏర్పాటు చేశారు. సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్‌కు మార్చాల్సి ఉంది. ఆవులదట్ల విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. టి.వీరాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 70శాతం పనులు పూర్తయ్యాయి. డి.హీరేహాళ్ మండలం గొడిశెలపల్లి, బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలో కార్మికులను తీసుకురావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టి ఈ పనులపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే పనులు పూర్తి గ్రామాల్లో నిరంతర వెలుగులు ఉంటాయి.

కోతలు తగ్గే అవకాశం

ప్రస్తుతం గ్రామాలకు వేసిన విద్యుత్తు లైన్ల ద్వారానే వ్యవసాయానికి, గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. వ్యవసాయానికి సరఫరా చేసినప్పుడు మాత్రమే గ్రామాల్లో త్రీఫేజ్ ఉంటుంది. సరఫరాలో అంతరాయం తలెత్తితే గ్రామాలతో పాటు వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా ఉండదు.

చర్యలు తీసుకుంటాం

- శ్రీనివాసుల నాయుడు, డీఈ, విద్యుత్తుశాఖ రాయదుర్గం

త్రీఫేజ్ విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వీటి ఏర్పాటుతో సమస్యలు తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయానికి ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నారన్న లెక్కలు తెలుస్తాయి.

ఉరవకొండ: చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆరెకటిక సంక్షేమ సంఘం నాయకులు

రాయదుర్గం: శివాజీ వేషధారణలో విద్యార్థులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొని, హైందవ ధర్మ రక్షకుడిగా ఛత్రపతి శివాజీ చరిత్రలో నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు సంఘాల నాయకులు, రాజకీయ నేతలు శివాజీ జయంతి పురస్కరించుకుని, చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. 16వ ఏళ్ల ప్రాయంలోనే స్వరాజ్య స్థాపనకు పునాది వేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, రాజకీయ నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే బృందం

కళ్యాణదుర్గం: శివాజీ జయంతిని నిర్వహించిన సానికులు

రాయదుర్గం: విగ్రహ ఊరేగింపులో సంఘాల నాయకులు

కనీసం వేతనం అమలు చేయాలి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి నాగమణి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: గత 20ఏళ్లుగా మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వీవోఏ, ఆర్పీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నాగమణి డిమాండ్ చేశారు. గురువారం ఎన్జీవో హోంలో వెలుగు వీవోఏ, మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆర్పీలు, వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. శ్రీనిధి డిపాజిట్లు, అభయహస్తం, హౌసింగ్ నిధులు సత్వరం వెంటనే చెల్లించాలని, రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వీవో, ఆర్పీల సంఘం సభ్యులు శాంతి, లక్ష్మీదేవి, సునీత, రమాదేవి, రాజేశ్వరి, రాధిక పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గోనూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి నూతన విగ్రహ, శిల, ధ్వజస్తంభ శిఖర కలశ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. గ్రామస్థులు చందాలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం ఉదయం గంగ పూజ, గణపతి పూజ, కలశస్థాపన వంటి కార్యక్రమాలు జరగనున్నట్లు వివరించారు. 21న గణపతి, నవగ్రహహోమం, మూలవిరాట్‌కు అభిషేకం, అలాగే 22న విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

కణేకల్లు, న్యూస్‌టుడే: కోనప్పర్తి గ్రామంలోని మారెమ్మ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. 108కలశాలు, 108ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. విగ్రహాలను అలంకరించి మంగళహారతి ఇచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం వేకువన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ఎండు మిర్చి ఎత్తుకెళ్లిన దొంగలు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలంలో మిర్చి దొంగలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పాల్తూరులో బుధవారం రాత్రి అంగడి శివప్ప పొలంలో మిరపను రాశిగా వేశాడు. రాత్రి 7.30 సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లగా నలుగురు దొంగలు నాలుగు సంచుల్లో నింపుకుంటుండగా పక్క పొలం రైతు గమనించి మిగతా రైతులకు సమాచారం ఇచ్చారు. దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నం చేయగా వారు తప్పించుకున్నారు.

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని గోవిందవాడ, దర్గాహొన్నూరు, కలిహాళ్, తారకపురం గ్రామాల్లో ఎండు మిర్చి రైతులు దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నబిరసూల్ రైతులకు గురువారం అవగాహన కల్పించారు. విడపనకల్లు మండలంలో ఎండు మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రాత్రి వేళల్లో పొలాల్లో కాపలా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పాలసీదారుల సేవలకే ప్రాధాన్యం

రాయదుర్గం, రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పాలసీదారుల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అఖిల భారత జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సంఘం హైదరాబాద్ జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని బీమా సంస్థ కార్యాలయంలో గురువారం ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశం ఏర్పాటు చేశారు. కడప డివిజన్ అధ్యక్షుడు జై భారత రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వనరుల సమీకరణలో జీవిత బీమా సంస్థ తిరుగులేదన్నారు. ఇందులో ఏజెంట్లు, ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి, కడప డివిజన్ అధ్యక్షుడు జై భరత్ రెడ్డిలకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న నాయకులు

నిరుపయోగంగా నీటి ట్యాంకు

వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. గతంలో ఈ ట్యాంకు నీటిని ప్రజలు తమ అవసరాలకు వినియోగించుకునేవారు. కొన్నాళ్ల కిందట బోరు మోటారు మరమ్మతుకు గురైంది. దీంతో స్థానికులు ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, వజ్రకరూరు

విద్యుత్తు తీగలు.. కప్పేసిన ముళ్ల చెట్లు

కళ్యాణదుర్గం పట్టణంలో ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే విద్యుత్తు ప్రధాన తీగలను ముళ్ల చెట్లు అలముకొన్నాయి. గాలివీచిన సమయంలో విద్యుత్తు తీగలు ఒకదానికొదానికి తగులుకొని నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయని కాలనీ వాసులు తెలిపారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

రోడ్డుఇలా.. రాకపోకలు ఎలా?

డి.హీరేహాళ్ మండలంలోని పులకుర్తి గ్రామంలోని ప్రధాన రోడ్డులో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇరువైపులా ఉన్న ఇళ్లలోని మురుగు చేరడంతో రహదారి దెబ్బతింది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారిలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరతున్నారు. - న్యూస్‌టుడే, హీరేహాళ్

తప్పని తిప్పలు..

ఉరవకొండ పట్టణం నుంచి ఇంద్రావతికి వెళ్లే ప్రధాన దారిలో పలుచోట్ల ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీనికి తోడు దారి శిథిలం అయ్యింది. దీంతో ఆ దారిలో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలంగా దారి ఇలాగే ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

మురుగు.. వేసేదెలా అడుగు

కణేకల్లు, న్యూస్‌టుడే : రోడ్డుపైనే మురుగు పారుతుండటంతో అడుగు వేయలేరు, ఎవరిని అడగలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని మాల్యాం గ్రామంలో సుంకులమ్మ ఆలయ వీధిలో వ్యర్థ జలాన్ని రోడ్డుపైకి వదులుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఎన్.హనుమాపురం, బీసీ కాలనీ, గరుడచేడు ఎస్సీ, బీసీ కాలనీలు, కళేకుర్తి, గనిగెర, జక్కలవడికి, హులికెర, హనకనహాళ్ గ్రామాల్లోనూ ఇదే దుస్థితి. బ్రహ్మసముద్రం ర.భ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలలో మురుగు ముందుకు కదలక ఇళ్ల ఎదుట నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఈఓఆర్డీ చంద్రమౌళిని వివరణ కోరగా ఆయా గ్రామాలలో పారిశుద్ధ్యం చర్యలు చేపట్టి, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వివరించారు.

సుంకులమ్మ గుడి వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు

ఉచిత పశువైద్య శిబిరం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాల దిగుబడి మెరుగ్గా ఉంటుందని దొడ్లడైరీ ఏరియా మేనేజరు మల్లికార్జున అన్నారు. గురువారం పట్టణంలోని ఒంటిమిద్ది గ్రామంలో దొడ్లడైరీ వారి సౌజన్యంతో మెగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయనతో పాటు డైరీ కళ్యాణదుర్గం మేనేజరు హరినాథ్, పశువైద్యాధికారి సత్యఓంకార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాలానుగుణంగా సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. సుమారు 70 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలరాజు, ఓబులేసు, సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

శ్రీఈశ్వర స్వామి హుండీ లెక్కింపు

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహించిన శ్రీఈశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా రూ.1,29,000 లక్షల హుండీ ఆదాయం సమకూరినట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. వీటిని ఆలయాభివృద్ధికి వినియోగించనున్నట్లు వారు తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని వాహనదారులకు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించిన 14 మందికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపైన కూడా కేసులు నమోదు చేశామన్నారు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువులో చక్కగా రాణించాలంటే కంటి చూపు చాలా ప్రధానమైందని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ అశ్రఫ్ అలీ వెల్లడించారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అప్తామాలజీ సహాయకుడు కిశోర్ విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

22న హ్యాపీ సండే కార్యక్రమం

రాయదుర్గం: పట్టణంలో ఈ నెల 22న హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇకపై ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలకు ఆనందం, వినోదం కోసం సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలు, నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన, సినిమా ప్రదర్శనలు, క్రీడా పోటీలు, ఆహారోత్సవాలు ఉంటాయన్నారు.

స్థానిక సమస్యలపై వినతుల స్వీకరణ

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వార్డుల్లో ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్ పర్యటనలకు శ్రీకారం చుట్టారని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో వారందరూ తిరుగుతూ స్థానిక సమస్యల వినతులను స్వీకరించారు. తెదేపా నాయకులు తలారి సోమశేఖర్, మహేష్, సాయినాథ్, మల్లికార్జున, రమాదేవి, రమేష్, సావిత్రమ్మ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

విడపనకల్లు, న్యూస్‌టుడే: పాల్తూరులో బాల్య వివాహాలను నిర్మూలించాలని సూపర్‌వైజర్ పుష్ప గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గురువారం గ్రామంలో పర్యటించి అందరికి ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వారితో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాలికలు, గ్రామస్థులు, అంగన్వాడీ కార్యకర్తలు దుర్గా, మలేశ్వరి, నాగవేణి పాల్గొన్నారు.

మత్స్య సంపదకు వేలం వాయిదా

బెళుగుప్ప, న్యూస్‌టుడే : మండలంలోని జీడిపల్లి జలాశయంలోని మత్స్య సంపదకు నిర్వహించాల్సిన వేలం వాయిదా పడినట్లు పీఏబీఆర్ మత్స్యక్షేత్రం, మత్స్య అభివృద్ధి అధికారి పెద్ద బాబు నాయక్ తెలిపారు. గురువారం గ్రామంలోని పాఠశాలలో వేలం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా ఆయా గ్రామాల ప్రజలు హాజరు కాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి వేలం జరిపే రోజును ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే తెలియజేస్తామని వివరించారు.

పట్టపగలే చోరీ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: పట్టపగలే ఇంటి తాళాలు పగల గొట్టి చోరీ చేసిన ఘటన వజ్రకరూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వజ్రకరూరులోని రాజీవ్ కాలనీలో హోతూరు లక్ష్మీదేవి, భర్త ఆంజనేయులు ఉదయం గుంతకల్లుకు కూలీ పనులకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి రాగా తాళం పగలగొట్టి, బీరువాలో ఉన్న బంగారు కమ్మలు, అడ్డీగలు, వెండి కడియాలు ఎత్తుకెళ్లారని వాటి విలువ రూ. 1.95 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారన్నారు. గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై నాగస్వామి తెలిపారు.

నూతన కమిటీ ఎంపిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని మూడో వార్డులో ఉన్న ఏఎంజీ777 చర్చిలో గురువారం జీసస్ విజన్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా జాషువా ఆనంద్, ఉపాధ్యక్షుడిగా లేపాక్షి, కార్యదర్శిగా జీవరత్నం, సహాయ కార్యదర్శిగా తిమోతి, కోశాధికారిగా డేనియల్, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, రాజేశ్, హేబెల్ ఎంపికయ్యారు. జిల్లా అధ్యక్షుడు యేసయ్య, ఉపాధ్యక్షుడు అనిల్, కార్యదర్శి వరప్రసాద్, సహాయ కార్యదర్శి డానియల్ పాల్గొన్నారు.

శ్మశానాల ఆక్రమణలు తొలగించాలని డిమాండ్

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలంలోని మాకొడికి, యరబోరేపల్లి, ఐదుకల్లు గ్రామాల్లో ఆక్రమణలకు గురైన శ్మశానాల స్థలాలు వెంటనే ఖాళీ చేయించాలని కోరుతూ తాలూకా ఎస్సీ ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు చెలిమప్ప తహసీల్దారు ఈశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అధికార్లు క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రకటన

వడ్డే పూజారి మాంతేష్ S/o వడ్డే పూజారి ఆంజినేయులు, D.No. 5-12, గోనబావి గ్రా॥, గుమ్మఘట్ట (మం), అనంతపురం జిల్లా. Doct. No. 5161/2022, సర్వే నం: 434-ఎ4బి5లో 41, 42వ ప్లాట్లకు ఒకే చెక్కుబంది. **తూర్పు:** 40వ ప్లాటు, **పడమర:** 43వ ప్లాటు, **ఉత్తరం:** 17, 18వ ప్లాట్లు, **దక్షిణం:** రోడ్డు. పై వివరాలు గల ప్లాటును రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరారులు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల రాయదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేటు, కళ్యాణదుర్గం

ప్రకటన

ఆవులెన్న వరదరాజులు S/o A.నారాయణప్ప, D.No. 10-5-671/186, కణేకల్లు రోడ్డు, రాయదుర్గం టౌన్, అనంతపురం జిల్లా. Doct. No. 425/2024, సర్వే నం: 179-C2 లో 96వ Opensiteకు చెక్కుబంది **తూర్పు:** 49వ ప్లాటు, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** 95వ ప్లాటు, **దక్షిణం:** 97వ ప్లాటు. Doct. No. 426/2024 సర్వే నం: 179-C2 లో 95వ Opensiteకు చెక్కుబంది **తూర్పు:** 50, 51వ ప్లాట్లు, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** 94వ ప్లాటు, **దక్షిణం:** 96వ ప్లాటు. పై వివరాలుగల ప్లాటును రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరారులు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల రాయదుర్గం బ్రాంచ్ మేనేజరును సంప్రదించండి.

కె.మల్లికార్జున, అడ్వకేటు, కళ్యాణదుర్గం

చెత్తసేకరణ బండ్ల పంపిణీ ఎప్పుడో!

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పంచాయతీలకు చెత్తను తరలించే బండ్లు, సైకిళ్లు, బుట్టలు మంజూరు చేసింది. కొన్ని కారణాల వల్ల పంపిణీ చేయకపోవడంతో అవి కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అలాగే పడున్నాయి. ఇటీవలే వచ్చిన చెత్తను తరలించే సైకిళ్లనూ అక్కడే ఉంచారు.

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్తసేకరణ బండ్లు

● రెండు రోజుల క్రితం కళ్యాణదుర్గం మండలంలోని ఏడు పంచాయతీలకు చెత్తను తరలించే సైకిళ్లు వచ్చాయి. డిసెంబరులో కళ్యాణదుర్గానికి 5, శెట్టూరు 3, కుందుర్పి 2, కంబదూరు 9, బ్రహ్మసముద్రం 8 వంతున చెత్త తోపుడు బండ్లు, ఒక్కో బండికి నాలుగు చెత్తబుట్టలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికీ వీటిని పంపిణీ చేయలేదు. దీంతో అవి వృథాగా ఉండి విషపురుగులకు ఆవాసంగా మారుతున్నాయి. ఇప్పటికైనా వాటి పంపిణీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- ధనుంజయనాథ్, ఎంపీడీవో

నియోజకవర్గానికి మంజూరైన చెత్తబండ్లు, సైకిళ్ల పంపిణీ విషయాన్ని ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే వాటిని ఆయా పంచాయతీలకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

సమష్టికృషితోనే అభివృద్ధి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: బోధన, బోధనేతర ఉద్యోగుల సమష్టి కృషితోనే జేఎన్‌యూటీ అభివృద్ధి బాటలో సాగుతోందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ దేవన్న, డైరెక్టర్ల ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్డ్ స్కీం ద్వారా పదోన్నతులు కల్పించామన్నారు. అనంతపురం, పులివెందుల, కలికిరి జేఎన్‌టీయూల్లో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ మృదుస్వభావి, నిగర్వి, నిరాడంబరుడైన ఉపకులపతి నియమితులు కావడం అదృష్టమన్నారు.

అందుబాటులోకి ఆరోగ్య సేవలు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: అందరికీ ఆరోగ్య సేవలు అందాలి.. ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సిబ్బంది ఉండాలి.. అన్నదే ప్రభుత్వ ధ్యేయం. గత వైకాపా ప్రభుత్వంలో ఆగిపోయిన హెల్త్ క్లినిక్‌లను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్‌హెచ్ఎమ్ (నేషనల్ హెల్త్ మిషన్) ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో తిరిగి కూటమి ప్రభుత్వం నిర్మాణాలు మొదలు పెట్టింది.

ఎక్కడెక్కడంటే..

రాయదుర్గం నియోజకవర్గంలోని 5 మండలాల్లో 24 క్లినిక్‌ల నిర్మాణాలు తిరిగి ప్రారంభించారు. ఇప్పటికే కలుగోడు, రంగచేడు గ్రామాల్లో నిర్మాణాలు తుది దశకు చేరి, ప్రారంభానికి సిద్ధమయ్యాయి. బొమ్మనహాళ్ మండలంలో 3, డి.హీరేహాళ్ మండలంలో 1, గుమ్మఘట్టలో 7, కనేకల్‌లో 6, రాయదుర్గం మండలంలో 7 నిర్మాణాలు ఊపందుకున్నాయి. నిర్మాణాలకు మొత్తం నిధులు రూ.3.45 కోట్లు కాగా అందులో ప్రారంభించిన వాటికి రూ.2.85కోట్లతో పనులు జరుగుతున్నాయి.

నిర్మాణ దశలో గొనబావి గ్రామ ఆరోగ్య క్లినిక్

పనులు వేగవంతం చేశాం

ఇప్పటికే ఒకటి, రెండు భవనాలు మినహా అన్ని మండలాల్లో హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు ఊపందుకున్నాయి. వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయించేలా చూస్తామని రాయదుర్గం డీఈ పంచాయతీరాజ్ శాఖ సుధాకర్ నాయక్ తెలిపారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ప్రహరీ నిర్మించరూ!

గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో మున్సిపాలిటీకి చెందిన కరణం మల్లీశ్వరి మహిళల, పిల్లల ఓపెన్ జిమ్‌కు కొత్త ప్రహరీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రెండు నెలల కిందట బాగున్న ప్రహరీని మున్సిపాలిటీ సిబ్బంది పడగొట్టారు. మున్సిపల్ ఏఈ హరిప్రసన్న వివరణ కోరగా తొందరలో కొత్త ప్రహరీని నిర్మిస్తామని పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మాట్లాడుతున్న అల్ఫోన్సా జోస్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యశ్వం తపూర్ డీప్స్ వర్సిటీ ప్రతినిధి అల్ఫోన్సా జోస్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులకు సూచించారు. గురువారం వర్సిటీలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మనం ఉపయోగించే వాహనాలు, పరిశ్రమల కారణంగా పెద్దఎత్తున వ్యర్థాలు, పొగ వాతావరణంలో చేరి కాలుష్యం పెరుగుతోందన్నారు. మొక్కలు విరివిగా పెంచడం, కాలుష్య రహిత వాహనాలు ఉపయోగించడం ద్వారా కొద్దిమేర కాలుష్యం తగ్గించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో వర్సిటీ డీన్ శీలారెడ్డి, ఆచార్యులు సీమంతిని గంగూలీ, ఆకృతి శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

మాట్లాడుతున్న ఆర్బీఐ డైరెక్టర్ విశాల ఫెర్రర్, మహిళలు

పామిడి, న్యూస్‌టుడే : పామిడి మండలంలోని గ్రామీణ దళిత, గిరిజన మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఆర్బీఐ ఆధ్వర్యంలో ధాత్రి మహిళా కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేశామని ఆర్బీఐ డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. గురువారం కల్లూరు గ్రామంలోని ఎస్బీఐ బ్యాంకు సమీపంలో నూతన ధాత్రి మహిళా కో-ఆపరేటివ్ బ్యాంకును ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బ్యాంకు నుంచి మహిళలు వ్యవసాయ, వ్యాపారం, పిల్లల చదువులు, తదితర జీవనోపాధులకు తక్కువ శాతం వడ్డీతో రుణాలు పొందవచ్చన్నారు. 'అందరి కోసం ఒకరు - ఒకరి కోసం అందరూ' అనే నినాదంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. బ్యాంకు నిర్వహణ బాధ్యత మహిళలదే అన్నారు. బ్యాంకు డైరెక్టర్లు పుష్పలత, ప్రీతి, నాగరాణి, లక్ష్మణ రావు, ఏరియా టీం లీడరు సావిత్రి, సీఈ వరలక్ష్మి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

దుస్తులు అందజేస్తున్న ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర, డాక్టర్ శివకార్తిక్ రెడ్డి

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ విద్యార్థులకు గురువారం సమదుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లకు సమాజసేవ, క్రమశిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కొక్క విద్యార్థికి వచ్చిన రెండు జతల సమదుస్తులు, (ట్రాక్‌సూట్, బేడ్జ్‌లు, రెండు జతల బెల్ట్ షూ, ఎన్‌సీసీ క్యాప్, బెల్ట్ తదితర వాటిని 49 మంది విద్యార్థులకు అందజేశామని ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు తెలిపారు. హెచ్‌ఎం. రామ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్, నాగరాజు, ఆర్ బెటాలి యన్ గోపి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సృజనతో విజ్ఞాన వికాసం

ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడంతో వారి మేధోశక్తికి మరింత పదును పెట్టినట్లు ఉంటుందని ప్రిన్సిపల్ అమర్నాథ్ తెలిపారు. తాడిపత్రిలోని బుక్కపట్నం వీధిలో ఉన్న నారాయణ పాఠశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. విద్యార్థులు అనేక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది.

దాతలు స్పందిస్తేనే మెతుకులు!

•నిరాశ్రయులను పట్టించుకోని అధికారులు

దుస్థితిలో వసతి గృహం, దెబ్బతిన్న పైకప్పు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పురపాలికలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల వసతి గృహం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. దీన్ని ఏడేళ్ల కిందట ఏర్పాటు చేయగా, నిర్వాహణ పురపాలిక అధికారులు గాలికొదిలేశారు. గృహంలో ఉండేవారికి అల్పాహారం, భోజనాన్ని అందించాల్సి ఉంది. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి నుంచి వసతి గృహం గురించి అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా నిరాశ్రయులు తిండి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

12 మందికే ఆశ్రయం

గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో వసతిగృహం ఉంది. ఇందులో 20 పడకలు ఏర్పాటు చేశారు. గతంలో 20 మంది ఆశ్రయం కల్పించేవారు. ప్రస్తుతం 12 మంది తలదాచుకుంటున్నారు. ఇక్కడి వారంతా ఎవరైనా దాతలు భోజనాన్ని అందిస్తే భోజనం చేయడం లేకుంటే వీధుల్లోకి అడుక్కోవడం జరుగుతోంది. పట్టణానికి చెందిన స్వచ్ఛ నర్సింగ్ హోంకు చెందిన వారు తరచూ అల్పాహారాన్ని అందిస్తున్నారు. గతంలో నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. వీరికి బిల్లులు చెల్లించక పోవడంతో వారు ముందుకు రాలేదు.

వసతి గృహానికి చెందిన గదుల పైకప్పులు దెబ్బతింటున్నాయి. పైకప్పుకు చెందిన సిమెంటు పెచ్చులూడి కిందపడుతోంది. కొన్ని సార్లు నిరాశ్రయులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. తాగునీటి కుళాయి తొలగించారు. ఇక్కడున్న పరుపులు, దుప్పట్లు అధ్వానంగా ఉన్నాయి.

త్వరలో సౌకర్యాలు కల్పిస్తాం

నిరాశ్రయుల వసతి గృహంలో ఉంటున్న వారికి సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సేవాసంస్థకు అప్పగిస్తాం. గదులకు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ విభాగం వారిని కోరాం. త్వరలో మరమ్మతులు పూర్తవుతాయి.

- మోహన్, పట్టణ ప్రాజెక్టు అధికారి, మెప్మా

పెచ్చులూడిన భవనమే దిక్కు

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072

తాడిపత్రి: 79950 67001

శింగనమల: 8008612342

తాడిపత్రి, న్యూస్‌టుడే:

సమస్య : తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డు ప్రాంతంలో గతేడాది భూగర్భ మురుగునీటి వ్యవస్థకోసం భారీగా సీసీరోడ్డును తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దారి వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. - అనిల్‌కుమార్, వాహనదారుడు

సమాధానం: తాడిపత్రిలో ఉన్న సీసీరోడ్ల ప్యాచ్‌లు వేసేందుకు టెండర్లు పిలిచాం. త్వరలోనే ఆయా ప్రాంతాల్లో రోడ్డు వేసి సమస్యను పరిష్కరిస్తాం.

- నాగేంద్రప్రసాద్, మున్సిపల్ ఏఈ

సమస్య : తాడిపత్రిలోని మాసం మార్కెట్ వద్ద భారీగా చేపల వ్యర్థాలను పడేస్తున్నారు. పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది.

- ప్రవీణ్ కుమార్, వాహనదారుడు

సమాధానం: వెంటనే అక్కడ ఉన్న వ్యర్థాలను తొలగించి, వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం.- నాగేంద్ర ప్రసాద్, మున్సిపల్ ఏఈ

సమస్య: గుంతకల్లులో కసాపురం రోడ్డులో విజయనగర్ కాలనీ క్రాస్ వద్ద పైపులైన్ పనుల్లో భాగంగా తవ్వకాలు చేపట్టి.. తర్వాత గుంతలను వదిలేశారు.

- వన్నూరుస్వామి, కసాపురం రోడ్డు

సమాధానం: గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం.- హరికృష్ణ, ఏఈ

సమస్య: కసాపురం రోడ్డులోని సంజీవ్ నగర్‌లో కుళాయిలకు ఐదు రోజులుగా తాగునీరు రావడం లేదు.- రాజు

సమాధానం: పైపులైన్ సమస్య ఉండటంతో లైన్లను క్లియర్ చేసి నీటిని వదలుతున్నాం.

- హరికృష్ణ, ఏఈ

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

మేలురకం లేగదూడల పోషణతో లాభాలు

పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్న ప్రేమ్‌చంద్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మేలురకం లేగదూడలను పోషించడం వల్ల పాడిపరిశ్రమలో రైతులు ఆశించిన లాభాలు పొందవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రేమ్‌చంద్ తెలిపారు. గురువారం రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 66 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ఆరోగ్యకరమైన దూడలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రధానంగా ముర్ర, సంకరజాతి, దేశవాళీ జాతుల గేదెలను పెంచుకుంటే అధిక పాలదిగుబడి సాధించవచ్చన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులు రమేష్‌రెడ్డి, రత్నకుమార్, గోవిందరాజులు, శ్రీకాంత్, పాడిరైతులు పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

స్వామి ఉత్సవమూర్తి

గుంతకల్లు పట్టణం, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. వేదపండితులు, అర్చకులు ఉత్సవమూర్తికి అలంకరణ చేసి తిరుమంజన స్వపన, హోమం నిర్వహించారు. ఈవో, అర్చకులు పాల్గొన్నారు.

ధర్మాపురం రోడ్డుకు మహర్దశ

గుత్తి గ్రామీణం: ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గుత్తి మండలంలోని ధర్మాపురం రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. ఉపాధి హామీ నిధులు సుమారు రూ.96లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ నుంచి ధర్మాపురం వరకు రెండున్నర కి.మీ.లు, ధర్మాపురం రోడ్డు నుంచి బాచుపల్లికి వెళ్లే మార్గంలో 150 మీటర్ల రోడ్డు పనులు చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్ డీఈఈ మురళీధర్, ఏఈ మల్లేష్ నాయక్ తెలిపారు.

అదుపు తప్పితే అంతే!

రోడ్డు ప్రమాదాలకు చిరునామాగా గుత్తి-తాడిపత్రి 67వ జాతీయ రహదారి నిలుస్తోంది. అంతలా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రధానంగా కొత్తపేట గ్రామ సమీపంలోని రోడ్డు పక్కనే బావి ప్రమాదకరంగా మారింది. కనీసం రోడ్డు భద్రత అధికారులు ప్రమాదాలు జరిగే స్థలం అని హెచ్చరిస్తూ సూచికలు ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

శుద్ధజల కేంద్రం మూత

కె. ఊబిచెర్ల గ్రామంలోని శుద్ధజల కేంద్రం మూతపడింది. గత తెదేపా హయంలో రూ. లక్షలు వెచ్చించి కేంద్రం ప్రారంభించారు. వైకాపా అధికారంలోకి రాగానే మూత పడింది. అధికారులు కూడా పట్టించుకోలేదు. యంత్రాలు తుప్పుపట్టిపోయాయి. అధికారులు స్పందించి ప్రజలకు శుద్ధజలం అందుబాటులోకి తీసుకురావాలని అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

ప్రమాదం జరగకముందే స్పందించండి

నార్పల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ భవనం మెట్లు, గోడలకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఉంది. మెట్లపై చీలికలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రోజు ప్రజలు, లబ్ధిదారులు కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, నార్పల

తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు

తాడిపత్రిలోని టీచర్స్ కాలనీలో తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు దర్శనమిస్తున్నాయి. పింఛనర్ల భవనం వీధిలో తీగలు పాదారులకు తగిలే విధంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఎవరైనా ఆదమరిచి అటువైపు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనిపై ఏఈ రాజారావును వివరణ కోరగా వెంటనే కాలనీలో పరిశీలించి తీగలను ఎత్తులోకి మార్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే,తాడిపత్రి

ట్రాఫిక్ కష్టాలు తప్పేదెన్నడు?

ఇరుకైన మోరీలో అడుగడుగునా ట్రాఫిక్ స్తంభిస్తుంటే వాహన చోదకులే కాకుండా పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు - కర్నూలు రహదారిలో సత్యనారాయణపేట వద్ద ఉన్న ఇరుకైన మోరీ విస్తరణ ఆరేళ్లుగా కాగితాలకే పరిమితమవుతోంది. పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు ఇప్పటికి 20 సార్లు రైల్వే అధికారులను కలిసి సమస్యను వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, గుంతకల్లు

పురపాలిక ఉద్యోగిపై దాడి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలిక జేసీబీ డ్రైవర్ చంద్రపై గురువారం ఉదయం ఆయన సమీప బంధువులు దాడి చేశారు. వ్యక్తిగత కక్షలతో 15 మంది క్రికెట్ బ్యాట్లు, హాకీ స్టిక్కులతో చంద్ర ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి గాయపరిచారు. ఈఘటనలో గుత్తిఆర్.ఎస్.కు చెందిన సురేశ్, అతని కుమారుడు తన మిత్రులతో కలిసి వచ్చి చంద్రపై దాడి చేశారు.

'ప్రభుత్వ ఆస్తులను కాపాడండి'

పామిడి, న్యూస్‌టుడే : పామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని అనంతపురం కలెక్టరేట్ వద్ద ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పామిడిలో రూ. కోట్ల విలువ చేసే భూములను, కాలువ పోరంబోకు కబ్జాదారులకు, రియల్ వ్యాపారులకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు. ఆయన అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

యాడికి, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు భోగిరెడ్డిపల్లె వద్ద ఉన్న అదానీ సిమెంట్ సంస్థ ఉద్యోగి రామ్‌రాజ్ గురువారం క్రికెట్ కిట్లను ఆ పాఠశాల హెచ్‌ఎం. సీతారామాంజనేయులు సమక్షంలో అందజేశారు. క్రీడాస్ఫూర్తి ఉన్న విద్యార్థులకు తగిన క్రీడా సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గతంలో ఏపీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ సిమెంట్ సంస్థ ఉద్యోగి రామ్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన దాతకు శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు రవికుమార్, పీడీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలతో జాగ్రత్తగా ఉందాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఇంధనం డిపోలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలను ఆర్పడంలో సిబ్బంది చొరవ చూపాలని జిల్లా పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, భద్రతాధికారి చరణ్‌తేజ్ అన్నారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలో ఉండే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇంధనం డిపోవద్ద గురువారం మంటలను ఆర్పడంపై అధికారులు, సిబ్బంది మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు.

పన్నులు కట్టి పురప్రగతికి సహకరించండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రజలు ఆస్తి, నీటి పన్నులను చెల్లించి పట్టణంలో అభివృద్ధి పనులు చేయడానికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి అన్నారు. పన్నుల బకాయిలను వసూలు చేయడానికి రెవెన్యూ సిబ్బందితో పాటు కమిషనర్ కూడా గురువారం పట్టణంలో పర్యటించారు. ఎక్కువ మొత్తాల్లో బకాయిలున్న వారిని కలిసి వెంటనే చెల్లించాలని కమిషనర్ కోరారు. రెవెన్యూ అధికారి జయరాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎర్రిస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

పన్ను బకాయి చెల్లించాలని దుకాణ యజమానిని కోరుతున్న కమిషనర్ లక్ష్మీదేవి

పంచాయతీకి రిక్షాల అందజేత

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొన్ని పంచాయతీలకు గార్బేజ్ రిక్షాలు, చెత్త కుండీలను గురువారం పంచాయతీ కార్మికులకు అధికారులు, నాయకులు అందజేశారు. స్థానిక జేసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు దివాకరరెడ్డి, కేశవరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, గంగరాజు, ఈవోఆర్డీ శ్రీదేవి, ఉప ఎంపీడీవో నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పుష్పావతి, మధు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న వెంకటేశ్వరస్వామి భక్తులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : తిరుమల వెంకన్న భక్తులు పాదయాత్రగా దాదాపు రెండు రాష్ట్రాలను దాటుకుంటూ గురువారం గుత్తిమండలానికి చేరుకున్నారు. వీరి పాదయాత్ర ముంబయి నుంచి ప్రారంభమైంది. తిరుమలకు వెంకటేశ్వరస్వామి ప్రతిమను పల్లకిలో ఉంచి పాదయాత్రగా సాగుతున్నారు. వెంకటన్న భక్తుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఐదేళ్లగా ఏటా తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్నామన్నారు. తిరుపతిలోని అలిపిరి మెట్ల వద్దనే పల్లకీని అక్కడి అధికారులు ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందల కి.మీ.ల పాదయాత్ర చేస్తున్న ఉచిత దర్శనం కూడా కల్పించడం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి ఉచిత ప్రత్యేక దర్శనం కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

పంట నమోదు వివరాలు పరిశీలిస్తున్న అల్తాఫ్ అలీఖాన్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రైతులకు వ్యవసాయ శాఖ జారీ చేసే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పీఎం కిసాన్, అన్నదాత నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. గురువారం ఆయన పొడరాళ్ల, రోటరీపురం, అగ్రహారం గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. భూమి ఉన్న ప్రతిరైతుకూ కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తుందన్నారు. ఈ నెల 28వ తేదీ లోపు మండల వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించి గుర్తింపు సంఖ్య పొందాలని సూచించారు. ఏవో శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది గుల్ఫా అరేషా, చౌడేశ్వరి, మధు, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదువుకోవాలి

విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న అధికారులు, నాయకులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి విద్యపై ఆసక్తిని పెంచుకుని ఉన్నత చదువులను చదవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థులకు మండలస్థాయి ప్రేరణ సమావేశం గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. తెదేపా పార్లమెంటరీ నాయకుడు దివాకరరెడ్డి, మండల తెదేపా కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, కేశవరెడ్డి, గంగరాజు, తహసీల్దారు ఉషారాణి, ఎంపీడీవో బారన్‌సాహెబ్, ఎంఈఓ రాముడు, గురుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సుధాకరబాబు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వం పాఠశాలల్లో చదివే 350 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని దాత దివాకరరెడ్డి అందజేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల పెంపకం మంచిది

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల పెంపకం చేపడితే ఎంతో లాభదాయకంగా ఉంటుందని మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. మండలంలోని చింతలచెరువులో గురువారం ఆయన పర్యటించి గొర్రెల కాపరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గొర్రెలను ఎలా పెంచాలి? వాటి ద్వారా ఎలా ఆదాయం పొందాలనే అంశాలను ఆయన తెలియజేశారు. వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకం వంటివి కుటుంబానికి ఎంతో ఆదాయాన్ని ఇస్తాయన్నారు. అనంతరం ఆయన గ్రామంలో ఉన్న గొర్రెల కాపరుల వద్దకు వెళ్లి గొర్రెలను పరిశీలించి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కల్లూరులో ఛత్రపతి శివాజీ చిత్రపటంతో ఊరేగింపు

గుత్తి: గుత్తిలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని హిందువులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా ర్యాలీ ప్రారంభించారు. సాధన పాఠశాల అధినేత కృష్ణయ్య, తెదేపా నాయకులు రామకృష్ణ, నాగరంగప్రసాద్, గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

గుత్తిలో ర్యాలీగా హిందువులు

తాడిపత్రి : తాడిపత్రిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి యల్లనూరు రోడ్డు, పోలీస్‌స్టేషన్ కూడలి వరకు శోభాయాత్ర నిర్వహించారు. హిందూ ఐక్యవేదిక నాయకులు గంగాధర్, నాయకులు రాధాకృష్ణ, నారాయణస్వామి, శివారెడ్డి, రవితేజ, పవన్, నాగేష్ పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రామీణం : కల్లూరు గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం శివాజీ చిత్రపటాన్ని రథంపై ఏర్పాటు చేసి బాలమూరి వినాయక స్వామి ఆలయం వద్ద నుంచి నీలం సంజీవరెడ్డి కూడలి సమీపంలోని పాఠశాల వరకు ఊరేగించారు.

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

తాడిపత్రిలో సాగుతున్న శోభాయాత్ర



శ్రద్ధాంజలి

రైల్వే కాంట్రాక్టర్ చల్లా సురేష్ నాయుడు (M/s Suresh Constructions, Suresh Builders & Developers & Sri Lakshmi Cold Storage) గారి తండ్రి శ్రీ చల్లా రాజారావు గారు 19-2-2026వ తేది రాత్రి 8.15 గం॥లకు పరమపదించారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థిస్తూ బాధాతప్త హృదయాలతో..

మిత్రబృందం

అంత్యక్రియలు:

20-02-2026 శుక్రవారం ఉ॥ 8.30 గం॥లకు గుంతకల్‌లోని రాజేంద్రనగర్ గృహం నుండి బయలుదేరి కమ్మ కొట్టాల గ్రామము నందు మ॥ 12.30కు అంత్యక్రియలు జరుగును.

కీ॥శే॥ శ్రీ చల్లా రాజారావు గారు

17/1094, రాజేంద్రనగర్, గుంతకల్లు - 515801

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

అక్షరాంధ్రలో 'అనంత'కు అగ్ర స్థానమే లక్ష్యం

అక్షరాంధ్ర ఉల్లాస్ రెండో దశ కార్యక్రమంలో అనంతపురం అగ్రస్థానానికి చేరుకునేలా కృషి చేయాలని కమిషనర్ జశ్వంత్‌రావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం నగరపాలక కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపి, కార్యక్రమం అవగాహన రూపొందించిన కరపత్రాలు విడుదల చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేసే ప్రతిఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సునీత, టీపీఆర్‌ఓ సుబ్బరాయుడు, వయోజన విద్య సూపర్‌వైజర్ శ్రీధర్, సీఎంఎంలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, అనంత నగరపాలక

సమష్టి కృషితోనే జేఎన్‌టీయూ అభివృద్ధి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: బోధన, బోధనేతర ఉద్యోగుల సమష్టి కృషితోనే జేఎన్‌టీయూ అభివృద్ధి బాటలో సాగుతోందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న, డైరెక్టర్ల ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్ స్కీం ద్వారా పదోన్నతులు కల్పించామన్నారు. అనంతపురం, పులివెందుల, కలికిరి జేఎన్‌టీయూల్లో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ మృదుస్వభావి, నిగర్వి, నిరాడంబరులైన ఉపకులపతి నియమితులు కావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, బోధన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరి: బూకి, గాయత్రి: నవాబ్ కేఫ్, గౌతమి: వీడ్ లవ్, నీలిమ: ఆల్ఫా, త్రివేణి: సీతా పయనం, తేజశ్రీని: నిలవే, అమరావతి: అపన్నం, ఎస్వీ సినిమాస్: ఫంకీ, శాంతి: హే బల్వంత్, శరంగతి: కపుల్ ఫ్రెండ్లీ ఫంకీ, సుధా: మన శంకర వరప్రసాద్.

నగరంలో నేడు

కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి మూల పాదుకలు శివకోటి మహాలక్ష్మి శ్రీపీఠంలో ప్రదర్శన ఏర్పాట్లు సంబంధించిన నేడు శివకోటి ఆలయంలో నిర్వహణ, భక్తుల సమావేశం. -న్యూస్‌టుడే, కమలానగర్

కొత్తూరు అమ్మవారిశాలలో.. ఉదయం 7 గంటలకు అభిషేకం ● 7.30కు అలంకరణ సేవ ● 8.30 నుంచి వాసవీ భజనలు ● 9.00కు మంగళ హారతులు ● 9.10కు ప్రసాద వితరణ ● 11.30 వరకు అర్చనలు, సర్వదర్శనం ● సా.5.30కు స్వర్ణ పుష్పాలతో పూజోత్సవం ● 6.00 లలితా సహస్ర, వాసవీ పారాయణం ● 7.30కు మహా మంగళ హారతులు ● 8.30కు కుంకుమార్చన

చెరువుకట్ట నిమిషాంబాదేవి ఆలయంలో.. ఉదయం 5 గంటలకు గంగాభిషేకం, పంచామృతాభిషేకం ● 6కు అలంకరణ సేవ ● 6.30కు భక్తి గీతాలు ● 8.00కు అష్టదళ మంగళ హారతులు ● 9.00కు ప్రసాద వితరణ ● సాయంత్రం 7.00కు భక్తుల సహస్రనామాలతో అమ్మవారికి శ్రీచక్రం, కుంకుమార్చన ● 7.30 మహామంగళ హారతులు, తీర్థ ప్రసాద వితరణ

స్వామి సన్నిధిలో..

వేదగాయత్రి ఆలయంలో.. ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం ● 8.00కు మంగళ హారతులు, ప్రసాద వితరణ ● సా.6.30కు శ్రీలలితా సహస్ర, మణిద్వీప వర్ణన పారాయణం 8.00కు మహామంగళ హారతులు తీర్థప్రసాద వితరణ

పాతూరు అమ్మవారిశాలలో.. ఉదయం 5.30 గంటలకు సర్వదర్శనం ప్రారంభం ● 6.00కు పంచామృతాభిషేకం ● 8.00కు భజన సంకీర్తనలు ● 9.00కు అలంకరణ సేవ, మహా మంగళ హారతులు, తీర్థప్రసాద వితరణ సాయంత్రం 5.30కు విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం ● రాత్రి 7.00కు ఊంజల్ సేవ ● 7.30కు పల్లకీ ప్రాకారోత్సవం ● మహా మంగళహారతులు, ప్రసాద వితరణ

గుత్తి రోడ్డు కాశీ విశ్వేశ్వరుడి ఆలయంలో.. ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం ● 6.30కు రుద్రాభిషేకం ● 7.00కు అలంకరణ సేవ ● 8.00కు మహా మంగళ హారతులు ● 10.30 నుంచి రాహు కాల దీపారాధన, నిమ్మ దీపోత్సవం ● సాయంత్రం 6.30కు మహానైవేద్య నివేదన ● రాత్రి 7.00కు మహా మంగళ హారతులు ● 9.00కు సర్వ దర్శనం సమాప్తి -న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

చెన్నకేశవ ఆలయ ధర్మకర్త మృతికి సంతాపం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని పాతూరు లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త వల్లూరు ... గురువారం మృతి చెందారు. ఆమె మూడేళ్లుగా క్యాన్సర్ వ్యాధి చికిత్స పొందుతున్నారు. ఆలయ ఈవో బోయపాటి సుధారాణి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియలకు రూ.15వేలు అందజేశారు.

పేదలకు రంజాన్ తోఫా అందజేత

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న 'గరీబ్ నవాజ్ దర్గా' ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 80 పేద ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ తోఫా' పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు హాజీ జలాన్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫి హాజరై నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా రామకృష్ణ పరమహంస జయంత్యుత్సవం

అనంత సాంస్కృతికం: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక హెచ్ఎల్సీ కాలనీ సమితి ప్రాంగణంలో రామకృష్ణ పరమహంస జయంతి గురువారం వైభవంగా జరిగింది. సుప్రభాతంతో ప్రారంభమైన జయంత్యుత్సవం వేదపఠనం, సామూహిక భజనలు, శారదమాత, రామకృష్ణుల చిత్రపటాలకు విశేష పూజలతో ముగిసింది. ఈ సందర్భంగా రామకృష్ణ సందేశాలను శ్రీనృత్య కళానిలయం నృత్య గురువు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో గీతాలుగా ఆలపించారు. అనంతరం శ్రీకృష్ణశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిన్మయ మిషన్ ఆత్మవిదానంద స్వామి, విశ్రాంత ప్రధాన ఆచార్య రమేశ్‌నారాయణ రామకృష్ణ జీవితాన్ని వివరించారు. చివరల్లో కూడేరు జాగృతి ఆదర్శ పాఠశాల, నృత్య కళానిలయం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాల్సిందే'

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాల్సిందేనని ఐక్య విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఎస్కేయూ ఐక్య విద్యార్థి సంఘం గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అనంత జిల్లాలో ఆర్డీటీ దశాబ్దాలుగా పేదలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ధర్నాలో విద్యార్థి సంఘాల నాయకులు వేమన, జైపాల్‌యాదవ్, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, హేమంత్, శాంతిరాజు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డు..రెట్టింపు ఇక్కట్లు

విస్తరిస్తేనే దారికొచ్చేది...!

అడ్డంకులతో రాకపోకలకు అవస్థలు

గడియార స్తంభం నుంచి సర్వీసు రోడ్డు మీదుగా కోర్టుకు వెళ్లే మార్గం వాణిజ్య కేంద్రంగా మారింది. ఈ దారిలోనే కోర్టుతో పాటు పాఠశాలలు, దేవాలయాలు, పోలీస్ పరేడ్ మైదానంతో పాటు రాంనగర్ వైపునకు రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఈ మధ్య సుభాష్ రోడ్డు నుంచి గడియార స్తంభం వెనుక వైపు మీదుగా ఆర్ట్స్ కళాశాల వైపునకు వెళ్లకుండా విధించిన నిబంధనలు అమలు చేస్తుండడంతో వారు సర్వీసు రోడ్డు నుంచి వంతెన కింద ప్రెస్ క్లబ్ మీదుగా మళ్లీ ఆర్ట్స్ కళాశాల వైపునకు వెళుతుండడంతో గతంతో పోలిస్తే రద్దీ బాగా పెరిగింది. రోడ్డును విస్తరించకపోవడం, ఇరుకు మార్గంలో స్తంభం అడ్డుగా ఉండటంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సాయంత్రం వేళల్లో ప్రత్యక్ష నరకం కనిపిస్తుంది.

అనంతపురం(అశోక్‌నగర్), న్యూస్‌టుడే: అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ఆక్రమణలు, అడ్డంకులతో వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఓవైపు రహదారి విస్తరణ జాప్యం జరుగుతుంటే మరోవైపు రోడ్డుపై అడ్డంకులతో ఆయా మార్గాల్లో వెళ్లాలంటే చోదకులు, పాదచారులకు నరకం కనిపిస్తోంది. ఇటీవల ట్రాఫిక్ మళ్లింపు ఈ సమస్యకు మరింత ఆజ్యం పోస్తోంది. ఇదంతా అనంతపురం నగరంలోని గడియార స్తంభం ఉపరితల వంతెన కింది సర్వీసు రోడ్డు గురించే. విస్తరణ ఎప్పుడు చేపడతారో తెలియదు. కనీసం అడ్డంకులనైనా తొలగించాలని వాహనచోదకులు, స్థానికులు సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

మలుపులో ముప్పతిప్పలే..

కోర్టు రోడ్డుకు వెళ్లే మార్గంలో మలుపు తిరగాలంటే ముప్పుతిప్పలు పడాల్సిందే. స్తంభం ఏర్పాటుకు తెచ్చిన ఇనుప చువ్వలను రోడ్డుకడ్డంగా పాతి వదిలేశారు. ఇక్కడే చిరు వ్యాపారులు పెట్టుకున్న తోపుడు బండ్లు అడ్డుగా మారాయి. పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకొని ఇలాంటి ఇరుకు మార్గాల్లో అడ్డంకులనైనా తొలగించేందుకు కనీస ప్రయత్నం చేయకపోవడంతో ఎవరి తిప్పలు వారివే అన్న పరిస్థితి నెలకొంది.

బాలుడి శస్త్రచికిత్సకు అమ్మ చేయూత

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: దివ్యాంగుడైన కొడుకు శస్త్రచికిత్స కోసం వాయిదా వేసిన తండ్రికి అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చేయూతనిచ్చారు. నగరంలోని రాణినగర్‌కు చెందిన సుమతి, రాంప్రసాద్ దంపతులకు ఒక ఆడ, ఒక మగ సంతానం ఉన్నారు. ఆయన ఆటో నడుపుతూ, సుమతి కుట్టుమిషన్ ద్వారా సంపాదించే సంపాదనతో నెట్టుకొస్తున్నారు. వీరికి బాలలు(8), సాయి (6) అనే పిల్లలున్నారు. బాలాకులకు నెల క్రితం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఓ వైద్యుడికి చూపగా లివర్ జబ్బు ఉందన్నారు. బెంగళూరులో ఆసుపత్రికి తీసుకెళ్లగా శస్త్రచికిత్సకు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. రూ.35వేలు పోగుచేసుకున్న కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. విషయం తెలిసిన వారి సలహాతో అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డిని దంపతులు సంప్రదించారు. స్పందించిన ఆయన రూ.70వేలు, నగరంలోని పద్మజ డెవలప్‌మెంట్ ట్రస్టు నిర్వాహకులు రూ.20వేలు అందజేశారు. బెంగళూరుకు వెళ్లేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేసి రవాణా, మందులకు అదనంగా రూ.10వేలు రమణారెడ్డి అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఆర్థిక సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

'మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలేదీ?'

అనంత నగరపాలక: ఎన్నికలకు ముందు మైనార్టీలకు ఇచ్చిన హామీలను కూటమి పార్టీల నాయకులు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా విస్మరించారని మేయర్ వసీం, వైకాపా మైనార్టీ సెల్ జిల్లాధ్యక్షుడు సైపుల్లాబేగ్ ఆరోపించారు. వారు గురువారం వైకాపా జిల్లా కార్యాలయంలో పలువురు మైనార్టీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధి, వారికి కేటాయించిన నిధులను కాగితాలకే పరిమితం చేశారని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా ఉందన్నారు. మసీదుల మరమ్మతులకు నిధులిస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. దుల్హన్ పథకం ఏమైందని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో మైనార్టీల విద్యాభివృద్ధి కోసం చేపట్టిన భవనాల నిర్మాణాలు ఆగిపోయాయని, వాటిని వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

కొత్త కారు వద్ద జయలక్ష్మి మోటార్స్ ప్రతినిధులు

విపణిలోకి కొత్త సుజుకి విటార వాహనం

కమలానగర్, న్యూస్‌టుడే: అనంతపురంలోని జాతీయ రహదారి సమీపాన ఉన్న జయలక్ష్మి మోటార్స్ షోరూంలో సుజుకి విటార కొత్త వాహనాన్ని నగర మేయర్ మహమ్మద్ వసీం, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు ఆనంద్, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ జగదీశ్ ప్రారంభించారు. వినియోగదారులకు నచ్చేవిధంగా సాంకేతికత, ఆకట్టుకునే విధానంతో వాహనం అందుబాటులో ఉందని యాజమాన్యం ప్రకటించింది.

కొత్త బ్లాకేజీలపై అప్రమత్తత అవసరం

మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్

కమలానగర్, న్యూస్‌టుడే: గుండె సమస్యతో బైపాస్ సర్జరీ చేయించుకున్నవారు ఆ సమస్య పూర్తిగా తొలగిపోయిందని భావించడం ప్రమాదకరమని కాలక్రమేణా కొత్త బ్లాకేజీలు ఏర్పడే ఆస్కారం ఉంటుందని మెడికవర్ హాస్పిటల్స్ గుండెనిపుణులు డాక్టర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. అనంతపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2008లో ట్రిపుల్ వెసెల్ బైపాస్ సర్జరీ చేయించుకున్న 70 ఏళ్ల వృద్ధుడికి 17 ఏళ్ల తర్వాత మళ్లీ గుండెకు సంబంధించిన రక్తనాళాల్లో తీవ్ర బ్లాకేజీలు ఏర్పడ్డాయని వివరించారు. ఇతడికి ఐవీయూ ఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో రెండు స్టంట్లను విజయవంతంగా అమర్చినట్లు వివరించారు. రోగి కోలుకున్నారని తెలిపారు.

ఛత్రపతి శివాజీ త్యాగాలు చిరస్మరణీయం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ గొప్ప వీరుడని, హిందువుల పరిరక్షణకు ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని భాజపా జిల్లా నాయకులు తెలిపారు. గురువారం భాజపా ఆధ్వర్యంలో ఛత్రపతి జయంతిని హౌసింగ్ బోర్డులో ఘనంగా నిర్వహించారు. తొలుత శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మారుతి గోవిందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హౌసింగ్‌బోర్డులో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతపురం గ్రామీణ మండల కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం రోడ్డులో ద్విచక్ర వాహన ప్రదర్శన సాగింది.

తపోవనం: బైకులపై ప్రదర్శనగా వస్తున్న భాజపా నాయకులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మొగల్ పాలకుల దురాగతాలను చరమగీతం పాడి, హిందూ ధర్మ రక్షణకు పాటుపడిన ఛత్రపతి శివాజీని ఎన్నటికి మరువలేమని చంద్రబాబు కొట్టాల యువజన సంఘం అధ్యక్షుడు సూర్య తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో శివాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించి, చంద్రబాబు కొట్టాల నుంచి రుద్రంపేట, టవర్‌క్లాక్, సప్తగిరి కూడలి మీదుగా బైక్ ర్యాలీ చేశారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి జయంతి ఘనంగా జరిగింది. వేదిక జిల్లా ధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నగర వీధుల్లో బైకులపై ప్రదర్శన చేపట్టి అభయాంజనేయ స్వామి ఆలయం చేరుకున్నారు. ఛత్రపతి విగ్రహం వద్ద హిందూ ధర్మ పరిరక్షణకు పోరాటం చేస్తామని నినాదాలు చేశారు.

అనంత సాంస్కృతికం: శివాజీ విగ్రహం ముందు నినాదాలు చేస్తున్న యువకులు

ఉపవాస దీక్ష విరమణలో ముస్లిం సోదరులు

రంజాన్ ఉపవాసాలు ప్రారంభం

అనంత సాంస్కృతికం: రంజాన్ పవిత్ర మాసం గురువారం మొదలైంది. నగరంలోని పలు మసీదుల్లో తెల్లవారుజామున సహరి ఏర్పాట్లు చేశారు. పాతూరు జామియా, రాంనగర్‌లోని మక్కా, సప్తగిరి కూడలిలోని ఈద్గా, డ్రైవర్స్ కాలనీలోని నూరాని, పీటీసీ ఎదురుగా ఉన్న చాందిని, హౌసింగ్ బోర్డులోని హాజీ మహమ్మద్, అశోక్‌నగర్ నూరాని మసీదుల్లో సాయంత్రం దీక్షాపరులు ఉపవాసం విరమించడానికి రావడంతో సందడి నెలకొంది. అనంతరం ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

సుంకం వసూళ్ల వేలం మరోసారి వాయిదా

అనంతనగరపాలక: మార్కెట్ యార్డు సుంకం వసూళ్లకు నిర్వహించే వేలం నాలుగోసారి వాయిదా పడింది. నగరపాలకలో గురువారం వేలంపాటకు సిద్ధమగా, గుత్తేదారులు ఒక్కరూ ముందుకు రాలేదు. మళ్లీ ఈ నెల 25న వేలం జరపాలని నిర్ణయించారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE ANANTAPURAMU

E.P.No. 144/2024 IN DRA. No.174/2022

Between:-
M/s. Kapil Chits Hyderabad Pvt. Ltd., Anantapuramu Rept. by its Legal Officer ...Dhr/Petitioner

And

P.Sreevishnu, & Others ... Jdr/Respondents

To
7. P.Lakshmidevamma, W/o. Not known, M/o. Late Pagadala Geethanjali, Hindu, A/a.70 Years, R/at. Flat No:002, Rajahamsa Palace, RTC Road, Anantapuramu (P&Dt) (Mother.)

NOTICE TO RESPONDENT Jdr.No.7

WHEREAS the Dhr Chit Fund Company, in the above E.P has instituted the above E.P for recovery of money and E.P filed the E.P.144/2024 in DRA.No.174/2022 for Adding of Legal Hairs Jdr.7 and the same is posted for your appearance in the said Court on the 23-02-2026 by 10:30 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

// By the Order of the Court //
Sd/- (D.NARAYANA SWAMY)
Advocate for the Petitioner, Anantapuramu.

In the Court of the Hon'ble Principle Senior Civil Judge :: Ananthapuramu
E.P. No. 14/2022 in O.S. No. 260/2012

Between:
Shaik Julekha Bee, D/o S.Mohammed ...D.Hr
V/s
T.Jaithun Bee, W/o Mohammed, D.No.28-3-728-1, Ananthapuramu ...J.Dr

వేలము ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా ఆర్డీదారుడు E.P. మొత్తమును రాబట్టుటకు J.Dr. కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని పై కోర్టు నందు వేలమును తెచ్చినారు. వేలములో పాల్గొనదలచినవారు 11-03-2026 వ తేది ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

House Property bearing D.No:28-3-728-1, Situated in R.D of Ananthapuramu and S.R.D of Ananthapuramu within the Ananthapuramu Municipal limits.

Ward.	T.S.No.	Extent
old.8	307 Ac	11-30 cents

పైకి, ward-New-21, 0.09½ cents పైకి ward-present-28, Ac 0.05 పై plot on eastern side Asst. No. 1001048851 within the following boundaries : East : H.Ramachandra Rao in the same Plot, South : Plot No. 208, West : House belonging to T.Mohammed, North : Road within the following Measurements : East - West : 15 Feet, North - South: 66 Feet,

Ameena Value : Rs. 35,00,000/-,
Market Value : Rs. 23,48,000/-
D.Hr.Value. Rs. 23,48,000/-,
E.P.Amount : Rs. 14,38,687/-
(By Court Order)
S.BABA FAKRUDDIN, G.PEDDANNA, Advocates, Ananthapur

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అనంత నేరవార్తలు: బాలికకు మాయమాటలు చెప్పి తనతో తీసుకెళ్లిన యువకుడిపై నాలుగో పట్టణ పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు.. ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన బాలిక నగరంలోని ఓ కళాశాలలో చదువుతూ వసతిగృహంలో ఉంటోంది. ఆమెకు ఉదయ్‌కిరణ్ నాయక్ అనే యువకుడు పరిచయమై ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఈక్రమంలో బాలిక ఆరు రోజుల క్రితం వసతిగృహం నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. హాస్టల్ అధికారులు బాలిక తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ఉదయ్‌కిరణ్ నాయక్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

మహిళపై కత్తితో దాడి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తన మానసిక వైకల్యానికి కారణమంటూ ఓ వ్యక్తి మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన గురువారం ఐదో రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు.. ఐదో రోడ్డుకు చెందిన రియాజ్ (52) మానసిక జబ్బుత బాధపడుతున్నాడు. తన దుస్థితికి ఇంటి ఎదురుగా ఉన్న దంపతులు ఫర్జానా, నజీర్ కారణమని నమ్మాడు. పలుమార్లు గొడవపడ్డాడు. గురువారం వారింటికి వెళ్లి ద్విచక్ర వాహనాన్ని కట్టెతో ధ్వంసం చేస్తుండగా, గమనించిన ఫర్జానా అడ్డుకునే ప్రయత్నం చేసింది. వెంటనే కత్తితో ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మూడో పట్టణ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని మానసిక రోగిగా తేల్చారు.

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గంలో రాజహంస అపార్ట్‌మెంటు ఎదురుగా నిర్మించిన వంతెనపై రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రక్షణ గోడ నిర్మించడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, రుద్రంపేట

వేసవి వస్తోంది.. పట్టదా నీటి వృథా?

వేసవి ముంచుకొస్తున్నా నీటి విలువను నగర పాలక తాగునీటి విభాగం గుర్తించడం లేదు. నగరంలోని రాణినగర్, భవానీనగర్, ఎస్కేడీ నగర్, వినాయకనగర్, పాతూరులోని పలు ప్రాంతాలకు పవర్ బోర్లు నుంచి ఇనుప పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పవర్ బోర్లు కావడంతో నీటి ఒత్తిడి అధికమై కుళాయలకు బిరడాలు ఊడిపోయి నీరంతా వృథా అవుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. -న్యూస్‌టుడే, అశోక్‌నగర్

రోడ్డుపై మురుగు పరుగు

అనంతపురం నగరపాలక పరిధి ఆర్ఎఫ్ రోడ్డులో యమహా షోరూం ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువ స్తంభించింది. మురుగు నీరు రోడ్డుపై పరుగులు తీస్తోంది. వారం రోజులుగా ఈ పరిస్థితి నెలకొందని, భరించలేని దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని స్థానికులు, వాహనచోదకులు వాపోతున్నారు. ఇకనైనా నగరపాలక అధికారులు స్పందించి మురుగుకాలువను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రుద్రంపేట

ఆకతాయిల చేష్టలు.. పిల్లలకు ప్రమాదం

పాఠశాల ప్రహరీ ఎప్పుడు నిర్మిస్తారో?

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంత గ్రామీణం పరిధి తపోవనం ప్రాథమిక పాఠశాలలో ఆకతాయిల చేష్టలు మితిమీరాయి. బడి ఆవరణలో మద్యం తాగడం, సీసాలు అక్కడే పడేయడం, సెలవు రోజుల్లో క్రికెట్ ఆడటం, విద్యుత్తు బాక్సులు ధ్వంసం చేయడం నిత్యకృత్యంగా మారింది. దీనివల్ల అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు బోర్డులను పగలగొట్టడంతో తీగలన్నీ కిందికి వేలాడుతున్నాయి. విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంది. గతంలో ఉన్న ప్రహరీని కూల్చివేశారు. కొత్తది నిర్మించకపోవడంతో ఆకతాయిలు లోపలికి వెళ్లి వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఒకే ప్రాంగణంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక బడివైపు ప్రహరీని వైకాపా ప్రభుత్వ హయాంలో కూల్చారు. ద్వారం ఏర్పాటు చేసి గోడను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీనివల్ల ఆదివారాల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయిని సుధారాణి వివరణ కోరగా, నిధులు విడుదలైతే ప్రహరీ, వంట గది నిర్మాణాలు పూర్తి చేయిస్తామన్నారు. రాత్రివేళల్లో పాఠశాల ఆవరణలో కొందరు మద్యం తాగి సీసాలు వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.



స్విచ్ బోర్డు ధ్వంసమై వేలాడుతున్న తీగలు

లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరించండి

మంత్రికి ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: హంద్రీనీవా ప్రాజెక్టు స్టేజ్-2 కింద రాప్తాడు నియోజకవర్గంలో 1,03,362 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఈమేరకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో వివిధ ప్యాకేజీల కింద ప్రతిపాదించిన కొంత ఆయకట్టు స్థిరీకరణ కాకుండా తొలగించారని, దీనివల్ల ఆరుతడి, మెట్ట భూములకు హంద్రీనీవా ప్రాజెక్టు నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాప్తాడు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కూడేరు మండలాల్లోని కర్షకులు వర్షాలు కురవనప్పుడు అవస్థలు పడుతున్నారని వివరించారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాప్తాడు పర్యటనకు వచ్చిన సమయంలో అన్ని ప్రాంతాలకు నీరందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. భూములన్నీ బీడు పడ్డాయని, హంద్రీనీవా కాలువ నుంచి ఉపకాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా డీపీఆర్ తయారీకి నిధులు ఇవ్వాలన్నారు. మొత్తం రూ.17.628 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని, ఆమోదించాలని విన్నవించారు. సీకేపల్లి మండలంలోని వెంకటంపల్లి, ఓబుళంపల్లి, ఒంటికొండ, చిన్నమొగలాయిపల్లి, పెద్దమొగలాయిపల్లి, మేడాపురం, కనముక్కల గ్రామాల రైతులు, ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనముక్కల, ఎర్రచెరువు, మేడాపురం ఎంఐ ట్యాంకులకు నీటి సరఫరా చేస్తే సమస్య తీరుతుందన్నారు. ట్యాంకులకు నీటి సరఫరా కోసం కాలువలు తవ్వడానికి రూ.6.30 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆమె మంత్రిని కోరారు.

మంత్రి రామానాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

త్వరలో ఇంటి పట్టాల పంపిణీ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో అనంతపురం గ్రామీణం కురుగుంట పొలంలోని సర్వే నంబరు 41/1లో 171 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేసి తీరుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఆయన గురువారం అనంతపురం జిల్లా దళిత సంఘాల నాయకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున నిర్వహించాలని, దళిత ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, బండారు శ్రావణిని ఆహ్వానించాలని చెప్పారు. ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి పట్టాల పంపిణీకి తేదీ కనుక్కొని తనకు చెబితే, కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సమస్య పరిష్కరించారని, ఆమెకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసీఆర్ దాస్, అమర్, శ్రీరాములు, పెద్దఓబుళేసు, నరసింహులు, నాగరాజు, శంకర్, రాము, శివ, నాగమ్మ, శాంతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The Prl.Senior Civil Judge, Anantapur
E.P 1/2020 in O.S. No 186/2012

Between:
B.Ramanjaneyulu ...D.Hr
And
1. P.Shekshavali Khan, S/o P.Fakruddin Khan
2. P.Shasha Vali Khan S/o P. Fakruddin Khan
3. P.Mabu Sharif Khan S/o P. Fakruddin Khan
All are R/at D.No 13-3-733, Khaja Nagar, Anantapuramu ... J.Drs

వేలం ప్రకటన

డిక్రీహోల్డర్ తన డిక్రీ మొత్తము రాబట్టుకొను నిమిత్తము ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని పై తెలిపిన కోర్టులో వేలంనకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచిన వారు 10-03-2026వ తేది ఉ॥ 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

Property Situated Within the RD and SRD of Anantapuramu within the Anantapuramu Municipal Corporation Limits within Khaja Nagar.

Ward No	T.S.No	Plot No	D.No	Ass No	HSC No
13	1935-1A1	10	Old-Nil New-Nil Present- 13-3-733	1001035677	28522

Boundaries: East: Vanka, West: Road, North: Plot No.9 in This House No 13-3-732, South: Plot No.11 in this House No 13-3-734 Measurements: East to West: 35 Feet or 10.67 Meters, North to South- 15 feet or 4.57 Meters. in this Plot House Constructed Roof with theeru kadapa Slabs including Upstairs (mahadi) measuring 900 square feet total Extent 58.33 Square yards.
Ameena Value: 16,00,000/- , Market Value: 29,15,910/-
(By Order of the Court)
ఎన్.పి.శ్రీనివాసులు, అడ్వకేటు, అనంతపురము

(c) eenadu

ఈనాడు అన్నమయ్య

శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

రక్త పరీక్షలకు ల్యాబో..దిబో

● ఓపిక ఉంటేనే ఫలితం తెలిసేది

పీలేరు, న్యూస్‌టుడే: వివిధ రకాల రోగాలు నయం చేసుకోవాలని కొండంత ఆశతో పీలేరు వంద పడకల ఆసుపత్రికి వచ్చే రోగులకు ముప్పుతిప్పలు తప్పడం లేదు. రోగ నిర్ధారణకు రక్త పరీక్షలు తప్పనిసరి కాగా ఫలితాల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తోంది. జిల్లాలో వంద పడకల ఆసుపత్రులు మదనపల్లె, పీలేరు, పుంగనూరులో ఉన్నాయి. పీలేరు ఆసుపత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నందున ఆసుపత్రి ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతుంటుంది. వైద్యసేవల్లో ఈ ఆసుపత్రి ఉత్తమ పురస్కారం అందుకుంది.

ఆసుపత్రిలో రక్త పరీక్షలకు నిరీక్షిస్తున్న రోగులు

ఎడతెగని నిరీక్షణ

ఆసుపత్రిలో ఓపీ చీటీలు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తారు. రోగులు ఓపీ చీటీలు తీసుకున్న తరవాత వైద్యుల వద్దకు వెళ్లి పరీక్ష చేసుకుంటారు. వారిలో రక్తపరీక్షలు వారికే తిప్పలు తప్పడం లేదు. రోజుకు ఆసుపత్రికి 700 మంది రోగులు వరకు వస్తుండగా అందులో 200 మంది వరకు రక్తపరీక్షలకు పంపుతుంటారు. ఒక్కో రోగికి ఐదారు రకాల పరీక్షలు చేస్తుండగా వాటి ఫలితాలు ఇవ్వడంలో ఆలస్యం అవుతోంది. రక్తపరీక్షల ల్యాబ్‌లో ఐదుగురు సిబ్బంది ఉండగా ఉదయం ఇచ్చిన నమూనాల ఫలితాలు సాయంత్రం వరకు ఇవ్వడం లేదు. స్లిప్పులు తీసుకుని రోగులు వైద్యుల వద్దకు వెళ్తే మందులు రాసిస్తారు. ఆపై మందులు తీసుకుని వెళ్లాలి.

నివేదిక వచ్చేలా చర్యలు

ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లో సిబ్బంది ఉన్నారు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల కొంత ఆలస్యం అవుతోంది. ల్యాబ్ సిబ్బంది మధ్యాహ్న భోజనాలు త్వరగా ముగించుకుని రక్త పరీక్షల ఫలితాలు ఇస్తారు. ఫలితాలు త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- పి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్, పీలేరు ఆస్పత్రి

సాంకేతికతతో అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నట్లు ప్రకృతి వైపరీత్యాల నివారణ విభాగం అనంతపురం, తిరుపతి జిల్లాల ప్రాజెక్టు అధికారులు పద్మావతి, అనసూయ, మదనపల్లె అటవీ శాఖ సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు తెలిపారు. హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో మంటలు ఆర్పడంపై ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. భారీ మంటలు వ్యాపిస్తే సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తామన్నారు. జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు 80 మంది ఫైర్‌వాచర్లను నియమించామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సహాయ కమాండర్ పవన్‌యాదవ్, మదనపల్లె రేంజ్ అధికారి జయప్రసాదరావు, సెక్షన్ అధికారులు ఎ.శివకుమార్, షబీర్‌తాజ్, సుధాకర్, శివరంజని పాల్గొన్నారు.

జాగ్రత్తలు వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ పవన్‌యాదవ్

వీధికో జులాయి.. తాగేది గంజాయి!

కొన్ని ఉదాహరణలివి

● మదనపల్లె పట్టణంలోని వెంబకూరు రోడ్డులో ఓ ఆటో డ్రైవర్‌పై గంజాయి తాగిన వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు హెచ్చరించినా వినకుండా డ్రైవర్‌పై దాడి చేసి పరారయ్యాడు. తర్వాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

● పీలేరు పట్టణంలో పండగలు, ఊరేగింపుల సమయంలో, పుట్టిన రోజు వేడుకల పేరిట మద్యం, గంజాయి మత్తులో యువత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నడిరోడ్లపై వాహనాలు అడ్డంగా ఉంచి బాణసంచా కాలుస్తూ బెంబేలెత్తిస్తున్నారు.

● మదనపల్లెలో వారం రోజుల ముందు రామారావు కాలనీలో మద్యం తాగిన ఓ యువకుడు వేట కొడవలితో వీరంగం చేశాడు. అందరినీ భయభ్రాంతులకు గురి చేసి పరిగెత్తించాడు. పోలీసులకు సమాచారం రావడంతో అక్కడి నుంచి ఉడాయించాడు.

● ఇలా ఒకటి కాదు.. రెండు కాదు... జిల్లాలో కొందరు గంజాయి మత్తులో జులాయిగా తిరుగుతూ బెదిరింపులు, వేధింపులు, దాడులు, నేరాలకు పాల్పడుతున్నారు. రాయచోటి, మదనపల్లె, పీలేరు పట్టణాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

మదనపల్లెలో ఇటీవల కొడవలితో మహిళను బెదిరిస్తున్న యువకుడు

● పట్టణాల్లోని శివారు వీధుల్లో జులాయిగా తిరిగే వారంతా గ్రూపులు కొనసాగిస్తూ దౌర్జన్యాలకు పాల్పడడం, మాట విననివారిపై దాడులు చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద కాపు కాసి అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

● రాత్రయితే చాలు పట్టణ శివారు ప్రాంతాలు, గ్రామాలకు వెళ్లే మార్గాలపై వాహనాలు ఆపి మద్యం, గంజాయి తాగుతున్నారు. ఆ సమయంలో ఎవరైనా అడ్డు తప్పుకోవాలని కోరితే వారిపై దాడులు చేస్తున్నారు. ● జిల్లాలో చాలా మంది గంజాయికి అలవాటుపడి దాడులు చేయడం, గొడవలకు దిగడం, హత్యలు చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలతో నేరగాళ్లుగా మారుతున్నారు. ఇప్పటికే పలు గంజాయి కేసుల్లో అరెస్టయిన

☛ **జిల్లాలో పెరుగుతున్న నేరాలు**

వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, పోలీసుల ఉదాసీనత వల్ల గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ యువత విచక్షణ కోల్పోతున్నారు. తరచూ గొడవలకు దిగడం, దాడులు చేయడం చేస్తున్నారు. దీంతో పట్టణాల్లో శాంతి భద్రతల సమస్యలు ఎదురవుతున్నాయి.

- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, పీలేరు గ్రామీణ

ఎక్కడెక్కడంటే..

జిల్లాలోని మదనపల్లెలో అమ్మచెరువు మిట్ట, చంద్రాకాలనీ, గొల్లపల్లె, నక్కలదిన్నె, అంగళ్లు, ములకలచెరువు, బి.కొత్తకోట, రాయచోటి, కేవీపల్లె, గుర్రంకొండ, పీలేరు, కలికిరి ప్రాంతాల్లో గంజాయి, మద్యం తాగే యువత ఎక్కువయ్యారు. వీరిలో చాలా మంది పలు కేసుల్లో నేరస్థులుగా ఉంటున్నారు.

ఇలాంటి వారిపై ఎవరికి సమాచారం ఇవ్వాలంటే : 112, 1098

ప్రత్యేక నిఘా వేస్తున్నాం

ఇటీవల కాలంలో గంజాయి, మద్యం తాగి గొడవలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాం. గంజాయి అనుమానిత ప్రాంతాలను మ్యాపింగ్ చేసి నాకాబందీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రోడ్లపై కేకులు కోస్తే కఠినంగా వ్యవహరిస్తాం. శివారు ప్రాంతాల్లో డ్రోన్‌తో పర్యవేక్షణ చేస్తున్నాం. బహిరంగ మద్యపానం, గంజాయిపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. నిందితులపై పీడీ యాక్టు కేసు నమోదు చేస్తాం.

- మహేంద్ర, డీఎస్పీ, మదనపల్లె

ఆర్టీసీకి తిరుణాల ఆదాయం రూ.65.88 లక్షలు

☛ **గతేడాది కన్నా రూ.15.55 లక్షలు అధికం**

పీలేరు, రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో మహా శివరాత్రి జాతరలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడం వల్ల రూ. 65,88,228 ఆదాయం వచ్చింది. ఇది గతేడాది కన్నా రూ. 15,55,898 అధికం. మొత్తం అన్ని బస్సులు కలిపి 81,646 కిలోమీటర్లు ప్రయాణించి 1,73,819 మంది భక్తులు, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. ● మదనపల్లె-1 డిపో బస్సులు తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండకు, మదనపల్లె-2 బస్సులు కలకడ ఝరి, తవళం, పీలేరు బస్సులు యర్రావారిపాళెం మండలం తలకోన, కలకడ ఝరి, పుంగనూరు బస్సులు దుర్గంకొండ, రాయచోటి బస్సులు పొలతల జాతరలకు నడిచాయి. ఆదాయంలో మదనపల్లె-1 డిపో ప్రథమ, పుంగనూరు డిపో చివరి స్థానంలో ఉన్నాయి. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి జాతరలకు బస్సులు నడపడంలో సమన్వయంతో విధులు నిర్వహించారని డీపీటీవో పి.రాము 'న్యూస్‌టుడే'కు తెలిపారు. భక్తులకు సౌకర్యంగా నడపడం వల్ల అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఇందుకు కృషిచేసిన అధికారులు, సిబ్బందిని డీపీటీవో అభినందించారు.

జాతరకు రద్దీగా వెళ్తున్న బస్సు

జిల్లాలో ఇలా..

బస్సులు ప్రయాణించిన దూరం: **81,646** కిమీ

కి.మీ.కి వచ్చిన ఆదాయం: రూ.**80.69**

బసుల్లో నిండిన సీట్ల శాతం: **146**

అత్యధిక ఆదాయం సాధించిన డిపో: మదనపల్లె-**1** డిపో

కదిరి నుంచే రైళ్లు

పీలేరు గ్రామీణ, ములకలచెరువు: రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20 నుంచి 22వ వరకు ధర్మవరం నుంచి నడిచే రైళ్లు.. కదిరి నుంచి నడుస్తాయని రైల్వే అధికారులు గురువారం తెలిపారు. నర్సాపూర్-ధర్మవరం, ధర్మవరం-నర్సాపూర్ మచిలీపట్నం-ధర్మవరం, ధర్మవరం-మచిలీపట్నం, ఎచ్ఎస్ నాందేడ్-ధర్మవరం, ధర్మవరం-నాందేడ్ రైళ్లు కదిరి వరకే వెళ్తాయని, అక్కడి నుంచే మళ్లీ ప్రారంభమవుతాయని తెలిపారు.

పూత భళా.. పిందె ఆగేదెలా!

▶ ఉష్ణోగ్రతల వ్యత్యాసంతో గుబులు ▶ మామిడి రైతులను వెంటాడుతున్న ఆందోళన

రాయచోటిలో నిండుగా పూతతో మామిడి చెట్లు

రాయచోటి గ్రామీణ, రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈసారి మామిడి పూత ఆరంభంలో ఆశించిన విధంగా ఉన్నా... పూతంతా పిందెగా మారుతుందా? అన్న అనుమానం అన్నదాతలను వెంటాడుతోంది. వాస్తవానికి డిసెంబరు 15 నుంచి జనవరి 15 వరకు పూత కాలం అయితే డిసెంబరు, జనవరిలో వాతావరణం అనుకూలించక పూత రాలేదు. ఫిబ్రవరిలో వాతావరణం అనుకూలించడంతో విస్తారంగా పూత వస్తోంది. ఈ నెల 21న అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో ఈ నెల 22 నుంచి 25 వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది.. ఈ దశలో తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

వాతావరణ మార్పులతో ముప్పు

శివరాత్రి దాటినప్పటి నుంచి భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు పగటి పూట ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రిళ్లు చలి ఇంకా తగ్గలేదు. విభిన్న వాతావరణం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుతో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈసారి పూత ఆశాజనకంగా ఉండటంతో కౌలు రైతులు మామిడి తోటల కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. రైతులు మాత్రం మామిడి తోటల విక్రయానికి సుముఖత చూపడం లేదు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా...

మామిడి విస్తీర్ణం : **65** వేల హెక్టార్లు

సాగు చేసిన రకాలు: బేనిషా, తోతాపురి, కాలేపహాడ్, నీలం, ఇమామ్ పసంద్, లాల్‌బాహర్, ఖాదర్

ఎగుమతి: అరబ్ దేశాలు, అమెరికా, మహారాష్ట్ర, ముంబయి, దిల్లీ, చెన్నై

అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన రకం: వీరబల్లి బేనీషా

దిగులు చెందాల్సిన అవసరం లేదు

మామిడి రైతులు దిగుబడిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ సారి పూత రావడం ఆలస్యమైంది. నవంబరు, డిసెంబరు నెలల్లో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడంతో భూగర్భంలో వేడి లేక పూత సకాలంలో రాలేదు. ఆలస్యంగా వస్తున్న పూత వేడిమి ప్రభావంతో తెగుళ్ల నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. తగు మోతాదులోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారిణి

ఆమెదే నిర్ణయాధికారం

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

పుంగనూరు, న్యూస్‌టుడే: నేనొక్కడిని ఓటరుగా నమోదవకుంటే.. ఓటు హక్కు వినియోగించుకోకుంటే ఏమవుతుందిలే అనుకుంటే ఆ ఓటుతోనే మీ తలరాత మారే ప్రమాదం ఉంది. అందుకే ఓటరు చైతన్యంగా లేకపోతే అవినీతిపరులు, అసమర్థులు, అరాచకవాదులు రాజ్యమేలుతారు. ఆశ్రిత పక్షపాతం, అవినీతి పెరిగిపోతుంది. ప్రజాస్వామ్య దేశంలో ఓటరే రారాజు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదవడమే కాకుండా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఓటర్లను కోరుతున్నాయి. ఫలితంగా ఓటర్ల నమోదులో మహిళా ఓటర్లే ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నారు.

● జిల్లాలో పురుషుల కంటే 23,027 మంది మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో 1,334 పోలింగ్ కేంద్రాలుండగా 12,29,837 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 6,26,372 మంది, పురుషులు 6,03,345 మంది, ఇతరులు 120 మంది ఓటర్లుగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం.

స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం

స్థానిక సంస్థల గడువు ముగియనుండడంతో సంస్థాగత ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రతి వార్డు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఆశావహులు ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టారు. అధికారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటర్ల నమోదు చేపట్టడంతో సంఖ్య పెరిగింది.

విజ్ఞాన పాఠం.. విజయ గీతం

అలంకారాల పాట పాడుతున్న విద్యార్థినులు

కలికిరి, న్యూస్‌టుడే: రోజుకు పది గంటలు పాటలు విని పోటీ పరీక్షల్లో విజయం సాధించామని రాబోయే రోజుల్లో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు చెప్పనున్నారు. ఇదేంటి.. సరిగానే విన్నామా..! అన్న సందేహం రాక తప్పదు. అవునండీ ఇది నిజమే.. రోజుకు 8 నుంచి 12 గంటల పాటు కష్టపడి చదివాం అని చెప్పే రోజుల నుంచి పాటలు విన్నాం అనే రోజులొచ్చాయి. ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం కొన్ని ఆడియోలు, వీడియోలు వచ్చాయి. తెలుగు, ఆంగ్లంతో పాటు వివిధ సబ్జెక్టులకు సంబంధించి, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలు అభ్యర్థులకు అర్థం కావడానికి ఈ పద్ధతి పుట్టుకొచ్చింది. సంగీతానికి చలించని శరీరం ఉండదనే నానుడి ఇక్కడ వర్తించినట్లు అవుతోంది. ప్రస్తుతం ఇవి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వరంగా మారాయి. వినే వాటి కన్నా చూసే అంశాలే మెదడులో నిక్షిప్తమై ఉంటాయని నిర్వాహకులు వీటిని రూపొందించారు. అలంకారాలు, వృత్తాలు, సంధులు, తదితరాలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఏపీపీఎస్సీకి సిద్ధమవుతున్న లక్షల మంది అభ్యర్థులు వీటిని చూస్తూ, ఆలకిస్తున్నారు. ఇంటర్ నేషనల్ స్టోన్ బోర్డు యూనివర్సిటీ ఏఐ ఉపయోగంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని ఇప్పటికే ప్రకటించింది.

ఏటీసీ.. కష్టాలు రాజేసి

వాహనాలు రెన్యువల్ చేయించుకోవాలంటే సామర్థ్య పరీక్షలు చేయించి అనుమతులు పొందడం తప్పనిసరి. కొత్తగా ప్రభుత్వం ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాలను (ఏటీసీ) తీసుకొచ్చింది. వీటిని ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించి తద్వారా వాహనాలను పరీక్షిస్తున్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో వీటిని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర రవాణాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో రాయచోటిని దీనికి ఎంపిక చేయగా. తాజాగా జిల్లా కేంద్రం మదనపల్లెకు తరలించడంతో కేంద్రాన్ని ఎప్పుడు తరలిస్తారా అని జనం ఎదురు చూస్తున్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె పట్టణం

80 కి.మీ. దూరంలో కేంద్రం

● తాజాగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేయడంతో ఏటీసీ కేంద్రం కూడా ఇక్కడికి రావాలి. ఆటోలు, లారీలు, బస్సులు సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలంటే వాహనాలను తప్పనిసరిగా రాయచోటికి తీసుకెళ్లాలి. నిబంధనల ప్రకారం ఆటోలు జాతీయ రహదారిపై వెళ్లకూడదు.

ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రం (ఏటీసీ) నిబంధనలు ప్రకారం జిల్లా కేంద్రంలో ఉండాలి. ప్రస్తుతం ఈ కేంద్రం రాయచోటిలో ఉంది. గత ఏడాది వరకు రాయచోటి జిల్లా కేంద్రంగా ఉండటంతో దీన్ని అక్కడ ఏర్పాటు చేయించారు. ప్రభుత్వం దీన్ని ఒక ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చి నిర్వహిస్తోంది.

● మదనపల్లె నుంచి రాయచోటి 80 కి.మీ. దూరంలో ఉంది. రామసముద్రం, పుంగనూరు, చౌడేపల్లె పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు మరీ దూరం. ఈ నేపథ్యంలో వాహనాన్నీ రాయచోటికి వెళ్లి రావాలంటే రోజంతా వృథానే అవుతుంది. పైగా అదే రోజు పని పూర్తవుతుందని నమ్మకం లేదు.

రవాణా శాఖకు సంబంధం లేదు

ఏటీసీ కేంద్రంలో వాహనాలను తనిఖీ చేసి సామర్థ్యపు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. దీనికి రవాణాశాఖ అధికారులకు ఎలాంటి సంబంధం ఉండదు. ఏటీసీ కేంద్రాన్ని మదనపల్లెలో ఏర్పాటు చేయించాలని కార్మికులు రవాణాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
మదనపల్లె	6.27	5.16
రాయచోటి	6.26	5.15

జజ్జనకరి జనారే.. గంగమ్మ జాతర భళారే

రాయలసీమకే తలమానికమైన అనంతపురం గంగమ్మ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గురువారం తెల్లవారుజామున నుంచి చాందినీ బండ్లు, కుంకుమ బండి వద్ద జాతర జనసంద్రంగా మారింది. కళాకారుల భేతాళ నృత్యాలు భక్తులను అబ్బురపరిచాయి. సాయంత్రం చాగలగుట్టపల్లె అమ్మవారు తిరుగు ప్రయాణమయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి

చాందిని బండి ముందు కళాకారుల భేతాళ నృత్యాలు

గుర్తుంచుకో! భద్రతనెంచుకో..

పుంగనూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల్లో రాకపోకలు సాగించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు, సూచికలు, వివిధ రకాల సంకేతాలు కన్పిస్తుంటాయి. వీటిని ఎందుకు ఏర్పాటు చేశారు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలేమిటి అనేది చాలా మందికి తెలియదు. అసలు ఈ సూచికలు ఏం చెబుతున్నాయన్న అంశంపై అవగాహన తప్పనిసరి. రవాణాశాఖ ఈ నెలాఖరు వరకు 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. రహదారి భద్రతపై విస్తృత ప్రచారం చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఆ గుర్తులు ఏం చెబుతున్నాయో తెలుసుకుందాం.

● జిల్లాలో మూడు జాతీయ రహదారులు విస్తరించాయి. తిరుపతి-మదనపల్లె మధ్య ఎన్‌హెచ్-71, రాయచోటి-చిత్తూరు మధ్య ఎన్‌హెచ్-40, ముంబయి-చెన్నై మధ్య ఎన్‌హెచ్-48 రహదారులున్నాయి. పుంగనూరు మండల పరిధిలో సుమారు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది.

● వంతెనలు, కల్వర్టులు, కూడళ్లు, మలుపులు ఎక్కువగా ఉండడంతో వీటిని ఏర్పాటు చేశారు. అయితే వాటిపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతుండడంతో గంగమ్మ గుడి, జే టౌన్, యూఎన్‌ఆర్ సర్కిల్, గూడూరుపల్లె, సుగాలిమిట్ట, పూజగానిపల్లె వద్ద తరచూ ప్రమాదాలు జరగడం, ప్రాణ నష్టం జరుగుతోంది. ఈ సూచికలపై అవగాహన కల్గితే ప్రమాదాలు తక్కువగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

1: వంతెన ఉండే చోటు 2: ఎడమ వైపు చూసుకుని వాహనం నడపాలని 3: మలుపులు ఇలా ఉన్నాయని 4: మలుపులో రోడ్డు చూపడానికి 5: టీ జంక్షన్ ఉందని హెచ్చరిక

వెలిగల్లు.. ఇక జల పరవళ్లు

పందికుంట కొండ చరియల్లో కుడికాలువలో నీటి పరవళ్లు

గాలివీడు, న్యూస్‌టుడే: కరవు పీడిత ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నిర్మించిన వెలిగల్లు జలాశయానికి కూటమి ప్రభుత్వంతో మహర్దశ పట్టనుంది.. బడ్జెట్‌లో కాలువ ఆధునికీకరణ పనులకు రూ. 36.50 కోట్లు కేటాయించింది.. పాపఘ్ని నదిపై జలాశయాన్ని 2008లో నిర్మించారు. గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు నీరివ్వాలని రూపొందించారు.

■ జలాశయంలో మొదట్లో నీటి నిల్వలు పెరగలేదు. ఉప, పిల్ల కాలువలను కొందరు అక్రమార్కులు ధ్వంసం చేశారు. కాలువలను చదును చేసి కలిపేసుకున్నారు. కొండ చరియలున్న ప్రాంతాల్లో రాళ్లు పడి కాలువ దెబ్బతింది.

■ లైనింగ్ లేకపోవడంతో చెరువులు నింపుకొనేందుకు ఎక్కడికక్కడ గండ్లు కొట్టారు. నేరుగా ఎకరం సాగు భూమికి నీటి పారుదుల ఇవ్వలేని దుస్థితికి ప్రధాన కాలువ చేరుకుంది.

రూ.36.50 కోట్లతో పనులు

రూ.36.50 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో కుడి కాలువ కాంక్రీటు గోడ, లైనింగ్, అవసరమైన చోట నీటిని మళ్లించేందుకు కాలువలు, రోడ్లు, జమ్ము, మట్టి పూడిక తొలగించే పనులను చేపట్టేందుకు మార్గం సుగమమైందని జలాశయం డీఈఈ శిరీష్‌కుమార్ తెలిపారు. పనులు పూర్తిచేస్తే 24 వేల ఎకరాలకు సాగు నీటి సరఫరా సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు రాగానే కాలువ ఆధునికీకరణ పనులు చేపడతామన్నారు.

పరోక్షంగా నీటి సరఫరా..

వెలిగల్లు కాలువ మరమ్మతులు చేసి కొన్ని చెరువులను నీటితో నింపారు. గాలివీడు మండల పరిధిలోని దిగువన ఉన్న చెరువులు, కుంటలకు సమృద్ధిగా నీరు సరఫరా చేశారు. లక్కిరెడిపల్లె, రామాపురంలోని చెరువులకు నీటిని మళ్లించేందుకు తాత్కాలిక మరమ్మతులు చేసి కొన్ని చెరువులకు పంపారు. పరోక్షంగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతో ప్రత్యక్షంగా సాగు భూములకు నీటి సరఫరా లక్ష్యం నీరుగారింది. నూతనంగా రూ. 36.5 కోట్లతో అంచనాలతో నివేదించారు. కుడి కాలువ పనులు పూర్తి చేయించి లక్ష్యం సాధించాలని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

(c) eenadu

జాతర భళా.. సేవలు మెచ్చేలా!

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అనంతపురం గంగమ్మ జాతరలో సేవలతో పలు ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రతినిధులు భక్తులకు అండగా నిలిచారు. ఆవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్సై జి.శోభ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తాగునీటి సీసాలు అందజేశారు. ఈవో శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు పనులను పర్యవేక్షించారు. జాతర నుంచి దిగువగుపల్లెకు అమ్మవారిని పల్లకిలో డప్పు వాయిద్యాల నడుమ ఆలయానికి చేర్చారు. భక్తులకు వసతులపై తెదేపా మండల అధ్యక్షుడు మదన్‌మోహన్.. అధికారులతో కలిసి పర్యవేక్షించారు. జాతరలో ఎన్నడూ లేనివిధంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి మండిపల్లి నాగిరెడ్డి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు బాణసంచాకు అందజేశారు. జాతరకు వచ్చే వ్యాపారులకు గేటు వసూలు చేయకూడదని ఉద్దేశంతో రూ.10 లక్షలు చెల్లించారు. రూ.10 లక్షలతో జబర్దస్త్, రేలారేలా, డీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నంది వాహనంపై వీరభద్రుడి విహారం

రాయచోటి, న్యూస్‌టుడే: శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కన్నడ భక్తుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన మాజీ కేంద్ర మంత్రి బసనగౌడ పాటిల్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం భద్రకాళీ సమేతుడైన వీరభద్రస్వామి అశ్వ వాహనంపై పురవీధుల్లో వివహరించారు. రాత్రి నంది వాహనంపై ఆశీనులై మార్కెట్ వీధి, గాంధీబజార్, కంసలవీధి, హరినాథవీధి, బ్రాహ్మణ వీధుల్లో విహరించారు. ఈవో వెంకటరమణారెడ్డి, ఛైర్మన్ మనోజ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీలేరుకు పన్ను నొప్పి.. వసూళ్లకు తలబొప్పి

- నోరు మెదపని కొందరు బిల్ కలెక్టర్లు
- చర్యలకు ఉపక్రమిస్తున్న జిల్లా అధికారులు

పీలేరు పంచాయతీ కార్యాలయం

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పంచాయతీలో ఇళ్ల పన్ను వసూలు చేయడం సిబ్బందికి తలనొప్పిగా తయారైంది. పంచాయతీలో మొత్తం పన్ను రూ.3.36 కోట్లు.. ఇందులో పాత బకాయిలు రూ.1.27 కోట్లు ఉన్నాయి. బకాయిల వసూలు ఉద్యోగులకు భారమవుతోంది. పీలేరు పంచాయతీలో గతంలో పనిచేసిన పలువురు సర్పంచుల హయాంలో రూ.1.50 కోట్లు గోల్‌మాల్ జరిగిన విషయం విదితమే.. అప్పట్లో కొందరు బిల్ కలెక్టర్లు పన్ను వసూలు చేసి పంచాయతీకి చెల్లించక పోవడంతో కార్యదర్శులపై విచారణ సాగుతోంది. ప్రస్తుతం 'స్వర్ణ పంచాయతీ యాప్'లో మాత్రమే పన్నులు చెల్లించాలని స్పష్టం చేసినందున గతంలో చెల్లించి రసీదులున్న వారు పాత బకాయిలు చెల్లించేందుకు అంగీకరించడం లేదు. కారణం అవన్నీ దస్త్రాల్లో కనిపించక పోవడమే. కొందరు బిల్ కలెక్టర్లు ఇళ్ల యజమానులకు బిల్లులు ఇచ్చినా వాటి నగదు పంచాయతీలో జమ చేయలేదు. అందువల్ల ఇది పరిష్కారమయ్యే వరకు కొత్త పన్ను చెల్లించబోమని ఇళ్ల యజమానులు చెబుతున్నారు. జిల్లాలోని 25 మండలాల్లో పీలేరు మండలం పన్నుల వసూలు చేయడంలో చివరి 22వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 25 మండలాల్లో 411 పంచాయతీలు ఉండగా ఆయా పన్నులు.. స్వర్ణ పంచాయతీ యాప్‌లో వసూలు చేస్తున్నారు. జిల్లాలో మదనపల్లె మండలం 23వ ర్యాంకు, పీలేరు మండలం 22వ ర్యాంకులో ఉంది. పీలేరులో పాత బకాయిలు వసూలు చేస్తేనే. . కొత్త పన్నులు వసూలు చేయాల్సి ఉంది. పాత పన్నుల చెల్లింపునకు తమ వద్ద రసీదులు ఉన్నాయని మళ్లీ చెల్లించబోమని యజమానులు తేల్చి చెబుతుండడంతో వసూళ్లలో తీవ్ర జాప్యం నెలకొంది. పాత బకాయిల వసూలు విషయంలో బిల్ కలెక్టర్లు నోరు మెదపడం లేదు. ఈ విషయం జిల్లా పంచాయతీల అధికారి రాధమ్మ దృష్టికి వెళ్లినా.. బిల్ కలెక్టర్లు పాత పన్నులు చెల్లింపునకు గడువు ఇచ్చారు.

- పీలేరు మండలంలో మొత్తం 15 పంచాయతీల్లో పన్నులు చెల్లించే యజమానులు 20,811 మంది ఉండగా ఒక్క పీలేరు పంచాయతీలోనే 10,869 మంది ఉన్నారు. ఇందులో ఇంకా 6,170 మంది ఇళ్ల యజమానులు పన్నులు చెల్లించాల్సి ఉంది. ఇళ్ల యజమానుల వద్ద ఉన్న పాత రసీదు మేరకు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఈ విషయంలో పీలేరు పంచాయతీ అధికారులు మౌనంగా ఉన్నారు.

కఠిన చర్యలు తప్పవు

ఈ ఏడాది నుంచి పన్నుల వసూలు స్వర్ణ పంచాయతీ యాప్‌లో చేయాల్సి ఉన్నందున పీలేరు పంచాయతీ బకాయిలు పేరుకు పోయాయి. పన్నులు గతంలో చెల్లించిన ఇళ్ల యజమానుల వద్ద రసీదులు ఉంటే.. నా దృష్టికి తీసుకువస్తే అవకతవకలపై విచారణ జరిపి పాత బిల్ కలెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.
- రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఇలా.. ◆ పన్ను బకాయిలు రూ.19 కోట్లు ◆ ఇప్పటి వరకు వసూలు: రూ.తొమ్మిది కోట్లు ◆ పీలేరులో బకాయిలు: రూ.2.37 కోట్లు

పత్ర సమర్పణకు మిగిలింది 8 రోజులే

మదనపల్లె (గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ ఫ్యామిలీ పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) సమర్పించేందుకు గడువు సమీపిస్తోంది. జిల్లాలో ఆరు ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో మొత్తం 8,601 మంది పింఛనర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 7,033 మంది ప్రమాణ పత్రాలు సమర్పించారు. ఇంకా 1,571 మంది జీవన ప్రమాణ పత్రాలు ఇవ్వాల్సి ఉంది. ఈ నెల 28వ తేదీ వరకు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో లేదా ఉపఖజానాశాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో సమర్పించినవి చెల్లుబాటుకావు. తాజాగా ఇవ్వకపోతే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి పింఛను నిలిపివేసే పరిస్థితి ఉంది. పింఛన్‌దారులు తమ పత్రాలు సమర్పించేందుకు మదనపల్లె, రాయచోటి, వాల్మీకిపురం, లక్కిరెడ్డిపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు ఉపఖజానా కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఇంకా కొంత మంది లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది.

ప్రాంతం	పింఛనర్లు	పత్రాలిచ్చింది	ఇవ్వాల్సింది
మదనపల్లె	3185	2671	514
రాయచోటి	2176	1556	623
పుంగనూరు	1,386	1,240	146
వాయల్పాడు	1,030	885	145
లక్కిరెడ్డిపల్లె	488	392	96
తంబళ్లపల్లె	336	289	47

ఈ నెల 28 వరకు గడువు

జీవన్ ప్రమాణ పత్రాలు సమర్పించేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉంది. నేరుగా ఆయా ప్రాంతాల పరిధిలోని ఉపఖజానా కార్యాలయాల్లోగానీ మొబైల్‌లో ఆర్డీ సర్వీస్ యాప్‌లో, జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో నమోదుకు వీలుంది. నడవలేనివారు ఆయా ఉప ఖజానా కార్యాలయాలకు వెళ్లి సమాచారం ఇస్తే నేరుగా వారి వద్దకు వెళ్లి ప్రమాణ పత్రాలు స్వీకరిస్తాం. ఆధార్, చరవాణి నంబరుతో లాగిన్ అయి పత్రాలు సమర్పించాలి. - సయ్యద్ మహబూబ్, జిల్లా ఖజానాధికారి

హంద్రీనీవాతో భూగర్భ జలాల పెంపు

అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువను పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకొచ్చి కరవు నేలలో తాగు, సాగునీరు వసతి కల్పించారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడారు. మదనపల్లె నియోజకవర్గంలో 170 చెరువుల్లోకి కృష్ణా జలాలను మళ్లించి నిల్వ చేసినట్లు చెప్పారు. ఒకప్పుడు 900 అడుగుల లోతులో ఉన్న భూగర్భ జలాలు నేడు 250 అడుగులకు చేరాయన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై చర్యలు చేపట్టండి: ఎంపీ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: నీరుగట్టువారిపల్లెలో జరిగిన చిన్నారి హత్య ఘటనలో నిందితుడు గంజాయి మత్తులో ఉన్నాడని పోలీసులు, అధికార పార్టీ నాయకులు చెబుతున్నారని, వాటి విక్రయాలు మాత్రం అరికట్టడం లేదని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విమర్శించారు. గురువారం మదనపల్లెలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ కారణంగా అనేక ఘటనలు జరుగుతున్నాయని, నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీరుగట్టువారిపల్లెలో చిన్నారి హత్యకు నిరసనగా ఆందోళన చేసిన వారిపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. బాలిక కుటుంబానికి రూ.25 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వైకాపా ద్వారా సాయం అందిస్తామన్నారు.

ప్రారంభిస్తున్న నరసింహారెడ్డి, నాయకులు

ఎస్టీయూ జిల్లా కార్యాలయం ప్రారంభం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లెలో ఎస్టీయూ జిల్లా కార్యాలయాన్ని గురువారం ఏఐఎస్టీఎఫ్ వర్కింగ్ అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా భవనం నిర్మించారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక పరమైన డీఏ బకాయిలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, సంపాదిత సెలవుల బకాయిలు, పెండింగ్‌లో ఉన్న ఏపీజీఎల్ఐ సమస్యలపై ఎస్టీయూ నాయకులు పోరాటం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన్, రాష్ట్ర నాయకులు మోహన్, మురళి, ఢిల్లీప్రసాద్, గిరిధర్‌నాయక్, రాజారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐఏఆర్ఐ నుంచి శ్రావణికి డాక్టరేట్

రాయచోటి, న్యూస్‌టుడే: రామాపురం మండలం బండపల్లి గ్రామం వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన శెట్టిపల్లి శ్రావణికి డాక్టరేట్ లభించింది. దిల్లీలోని ప్రఖ్యాతిగాంచిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) నుంచి దక్షిణ భారతదేశ గ్రామీణ కూలీల పోషక స్థితిపై విశ్లేషణాత్మక పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ వచ్చింది. దిల్లీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నుంచి ఈ డాక్టరేట్ అందుకున్నారు.

తెగిన కుంట.. సాగవ్వని పంట

2020 నవంబరులో వచ్చిన నివర్ తుపాను కారణంగా చెరువులకు పుష్కలంగా నీరు చేరి పీలేరు మండలం జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లె వద్ద ఉన్న కుంట తెగిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు లేక వర్షాలకు కుంటకు చేరే నీరంతా వృథాగా దిగువకు వెళ్తున్నాయి. కుంటలో నీరుంటే వ్యవసాయ బోర్లకు పుష్కలంగా భూగర్భ జలాలు అందేవి. వరి విస్తారంగా సాగయ్యేది. నీరు లేక నేడంతా బీళ్లే దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వం జల వనరులను నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వమైనా దెబ్బతిన్న కుంటలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

ప్రేరణతో నైపుణ్యాలు మెరుగు

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపడుతాయని నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ గీత అన్నారు. గురువారం విద్యాలయంలో అనుభవ పూర్వక అభ్యాసం కార్యక్రమం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2,881 మంది బాలబాలికలు నమోదు చేసుకోగా 136 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి, భారతదేశంపై దార్శనికత, వికసిత్ భారత్ అంశాల్లో వ్యాసరచన, కవితా రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 30 మంది విజేతలను ఎంపిక చేశామని, వారు గుజరాత్ రాష్ట్రంలోని పురాతన చారిత్రక పట్టణం వాద్‌నగర్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. నిర్వాహకులు సురేంద్రన్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అనంతపురం గంగమ్మ ఆలయంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో జరిగిన జాతరలో భక్తులు హుండీలో వేసిన కానుకలు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గురువారం లెక్కించామని ఈవో శ్రీనివాసులు తెలిపారు. జాతరకు వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలు, రూ.10, రూ.100, రూ.300 టోకెన్ల ద్వారా రూ.17,96,420 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ ఆదాయం వచ్చిందన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సోడి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యులు →

విజయవాడలో సమావేశమైన రాజంపేట పార్లమెంట్ తెదేపా నేతలు

అమరావతిలో అనుబంధ కమిటీలపై నేతల చర్చ

రాయచోటి, న్యూస్‌టుడే: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తెదేపా అనుబంధ కమిటీల నియామకాలపై గురువారం అమరావతిలో నిర్వహించిన సమావేశంలో నేతలు సమీక్షించారు. జోనల్ సమన్వయకర్త దీపక్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాంబాబు, శాప్ ఛైర్మన్ రవినాయుడు.. జిల్లా నేతలతో చర్చించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు, పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా బాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ నేతలు హాజరయ్యారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలకు అనుబంధ కమిటీల్లో స్థానం కల్పించాలని ఇప్పటికే అధిష్ఠానానికి.. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు పేర్లు ప్రతిపాదించారు. కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మదనపల్లెలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వెళ్లారు. పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ఇతర అపాయింట్‌మెంట్ల కారణంగా సమావేశానికి హాజరు కాలేదు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

పీలేరు గ్రామీణ: నాలుగేళ్ల చిన్నారిపై 16 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడని సీఐ యుగంధర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పీలేరు మండలంలో నాలుగేళ్ల చిన్నారి కూలి పనుల్లో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అక్కడ ఓ బాలుడు ఈ చిన్నారిని నిర్మాణంలో ఉన్న ఒక గదిలోకి తీసుకెళ్లి వికృత చేష్టలకు పాల్పడటాన్ని గమనించిన ఆ చిన్నారి తల్లి కేకలు వేయడంతో పారిపోయాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలుడి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బాధిత తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కోరారు.

సులభంగా డబ్బు సంపాదనకు బాలికల అపహరణ

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

నిందితురాలు గుండ్లూరు శివమ్మ

తిరుమల, న్యూస్‌టుడే: సులభంగా డబ్బు సంపాదించేందుకు ఇద్దరు చిన్నారులను అపహరించిన నిందితురాలిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికలను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎస్ఐలు చలపతి, రమేష్‌బాబు కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన లక్ష్మి, రాంబాబు దంపతులు తమ కుమార్తెలు నవదుర్గ(5), అశ్విని(3)లతో తిరుమల వచ్చారు. ఈ నెల 16న ఉదయం స్థానిక నాదనీరాజనం ప్రాంతంలో బాలికలు ఆడుకుంటుండగా.. అన్నమయ్య జిల్లా కలకడ మండలానికి చెందిన గుండ్లూరు శివమ్మ (42) వారిని అపహరించి తన వెంట తీసుకుపోయింది. బాలికల తల్లి తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారం సేకరించారు. ప్రత్యేక పోలీసు బృందాలతో నిందితురాలిని ఈ నెల 17న కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకుని ఇద్దరు చిన్నారులను రక్షించారు.

జాతీయ రహదారి దిగ్బంధం: పలువురిపై కేసులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారి హత్యాచారం ఘటన నేపథ్యంలో స్థానికులు, పలు పార్టీల నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధించారు. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రశ్నించిన పోలీసులకు వ్యతిరేకంగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుమతి లేకుండా ఆందోళన చేయడం, ప్రజలను రెచ్చగొట్టడం, ప్రజాశాంతికి భంగం కలిగించిన నేరాలపై మదనపల్లె ఒకటి, రెండు ఠాణాల్లో నాలుగు కేసులు నమోదయ్యాయి. వైకాపా నాయకులు నిస్సార్ అహ్మద్, జి.షమీం అస్లాం, కౌన్సిలర్ పి.రమణ, బి.మనోహర్, పుంగనూరు ఎంబీటీ రోడ్డుకు చెందిన శీన, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, పి.రమేష్, కాంట్రాక్టర్ పెంచులయ్య, బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు బి.రాజశేఖర్, వైకాపా నాయకుడు అనిల్, ఉదయ్, కె.రెడ్డెప్ప, నాగశేషు, హెల్పింగ్ మైండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు అబుబకర్ సిద్దిక్, బీఎస్పీ నాయకుడు బాలాజీ, ఉప ఎంపీపీ నందినితాజ్, మేనక, మూర్తి, బహుజన సేన వ్యవస్థాపకుడు శ్రీచందు, భాస్కర్, అహ్మద్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, దివాకర్, నాగమణి, రమణ, భాగ్యమ్మ తదితరులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా మిగిలిన వారిని గుర్తిస్తున్నామన్నారు.

నస్సీర్ నేరాలపై మంగళూరు పోలీసుల ఆరా

పాస్‌పోర్టుల జారీపై సర్వత్రా అనుమానాలు

నస్సీర్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న మంగళూరు పోలీసులు

రాయచోటి, న్యూస్‌టుడే: పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో పట్టుబడిన కరుడుగట్టిన నేరస్థుడు నస్సీర్‌ను మంగళూర్ పోలీసులు విచారిస్తున్నారు. అతడిపై ఉన్న నేరాలన్నీ మంగళూరు ప్రాంతంలోనే నమోదవడంతో అక్కడి కోర్టులలోనే హాజరుపరిచే అవకాశం ఉంది. అతడు ఉంటున్న ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలు జరిగాయి.. వాటితో అతడికి ఎలాంటి సంబంధాలు ఉన్నాయనే విషయాలపై ప్రాథమికంగా చేపట్టిన విచారణలో స్థానికంగా సంబంధాలు కలిగినట్లు వెల్లడి కాలేదు. రాయచోటికి వచ్చిన తర్వాతనే ఇక్కడి చిరునామాతో పాస్‌పోర్టు రావడంపై పోలీసులు దృష్టి సారించారు.

నేరస్థులకు పాస్‌పోర్టులపై ఆరా..?

రాయచోటి కేంద్రంగా వివిధ జాతీయ స్థాయి నేరాలతో సంబంధాలు కలిగి పలువురు పట్టుబడుతున్నారు. ఏకంగా 10-30 ఏళ్ల పాటు ఎవరికీ అనుమానం రాకుండా స్థావరాలు ఏర్పరుచుకోవడం ఎలా సాధ్యమనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇలా పట్టుబడిన వారంతా దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఆయా ప్రాంతాల్లో నేరాలు చేసి రాయచోటికి వచ్చి స్థావరాలు ఏర్పచుకోవడం ఒక ఎత్తైతే ఇక్కడి నుంచే విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టులు తయారు చేయించుకుని పక్కూరికి వెళ్లొచ్చినంత సులువుగా ఇతర దేశాల నుంచి రాకపోకలు సాగించిన ఉదంతాలు గతంలో వెలుగుచూశాయి. గతేడాది రాయచోటిలో పట్టుబడిన తీవ్రవాదులు ఇద్దరు తమిళనాడు వారు. వారిలో ప్రధాన తీవ్రవాదికి నాలుగైదు పాస్‌పోర్టులు ఉండటంతో అధికారులు విస్తుపోయారు. అవన్నీ రాయచోటి చిరునామాతో ఎలా వచ్చాయనేది ప్రశ్నార్థకంగా మారింది. సాధారణ వ్యక్తులు పాస్‌పోర్టు తెచ్చుకోవాలంటే ఎన్నో విచారణల తర్వాత ఓకే చేసే పోలీసులు.. నేరస్తులకు జారీ చేసిన పాస్‌పోర్టుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహించారనే ప్రశ్నలు స్థానికుల నుంచి ఎదురువుతున్నాయి.

యువకుడిని అపహరించి.. నగదు దోపిడీ..!

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిచయం లేని యువకుడిని అపహరించి.. రూ.60 వేలు నగదు దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. 'తిరుపతి ఆటోనగర్‌కు చెందిన అఖిల్.. తాజ్ హోటల్‌లో పనిచేస్తారు. ఈ నెల 11న నగరంలోని తుడా రోడ్డులో మద్యం మత్తులో ఉండగా.. అదే సమయంలో కారులో వచ్చిన నలుగురు అఖిల్‌ను కారులో అపహరించారు. అతన్ని కొట్టి సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్ పిన్ నంబరు తెలుసుకున్నారు. చరవాణి నుంచి గేమింగ్ స్కానర్‌కు రూ.60 వేలు నగదు పంపించుకున్నారు. అఖిల్‌తో బలవంతంగా మత్తు పదార్థాలు తాగించి స్పృహ కోల్పోయాక కారు నుంచి గెంటేశారు. కోలుకున్న అఖిల్ బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించి.. ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చింతలచేను రైల్వే గేటు వద్ద ఉన్న నలుగురిని గురువారం అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఎర్రసానిపల్లి గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ (27) కొంతకాలంగా తిరుపతి కొర్లగుంటలోని సోదరి ఇంట్లో ఉంటూ డ్రైవింగ్ చేస్తుంటారు. అతనికి పుత్తూరు సమీపంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న శ్రీనగర్ కాలనీకి చెందిన యోగేష్ (21), చిన్నగొట్టిగల్లు మండలం నల్లుంట్లవారిపల్లెకు చెందిన గురు ప్రకాష్ (21), బుచ్చినాయుడుకండ్రిగ మండలం తనిగల్లుకు చెందిన చరణ్ (21)తో పరిచయం ఏర్పడింది. అందరూ మద్యం మత్తులో అఖిల్‌ను అపహరించి ఫోన్‌లో నగదు కాజేశారు. నిందితుల నుంచి కారు, రూ.24 వేలు నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

manipalhospitals LIFE'S ON

మణిపాల్ హాస్పిటల్స్, మిల్లర్స్ రోడ్, బెంగుళూరు వారి ప్రముఖ న్యూరో సర్జన్ను ఇప్పుడు మన రాయచోటి పట్టణం నందు సంప్రదించగలరు.

మెదడు మరియు వెన్నముక క్లినిక్

Dr కార్తీక్‌రెడ్డి MNV
Associate Consultant - Neuro Surgery
DrNB-Manipal Hospitals, Bangalore | Fellow in Neuroendoscopy
Fellow in Endoscopic Spine Surgery - S Korea | Fellow in Pain Medicine (FIPM), MBBS - Kurnool Medical College, Kurnool

స్థలం: భరత్ స్పెషాలిటీ హాస్పిటల్ & న్యూరో కేర్
55/59, డా॥ బయ్యారెడ్డి హాస్పిటల్ ఎదురుగా, హరినాథ వీధి, గాలివీడు రోడ్డు, రాయచోటి - 516269
తేదీ: 21-02-2026, శనివారము, సమయం: ఉదయం 11 AM నుండి మధ్యాహ్నం 2 PM వరకు

మీరు క్రింద పేర్కొన్న లక్షణాలతో బాధపడుతున్నారా?
• తీవ్రమైన మెడ మరియు వెన్నునొప్పి • చేతులు మరియు కాళ్ళకు వ్యాపించే నొప్పి
• చేతులు మరియు కాళ్ళలో బలహీనత • చేతులు లేదా కాళ్ళలో తిమ్మిరి
• నడకలో ఇబ్బంది లేదా అసమతుల్యత • తరచుగా మూత్ర విసర్జన • మూర్ఛ
• మెదడులో కణితులు • పక్షవాతం • స్ట్రోక్ • మెదడులో రక్తం గడ్డకట్టడం • మెదడు క్యాన్సర్

అపాయింట్‌మెంట్ కోసం సంప్రదించండి : +91 6282487640
నృసింహ శేఖర్ ఎ.వి. - 9980527425

గమనిక: 22-02-2026 తేదీన ఆదివారం ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, అంధ పాఠశాల ఎదురుగా, శంకరాపురం, కడపలో ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు అందుబాటులో ఉంటారు.

EENADU e Classifieds

EDUCATION

COACHING CENTRES
2 నెల్లో 10th, ఇంటర్ (MPC, Bi.P.C, C.E.C) State Govt బోర్డ్ ద్వారా March 26, పరీక్షలు ... Pass ... All CETS Eligible, Exam Center TPT. ✆ 99851 92105, 94406 50496.

DISTANCE EDUCATION
B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES
✆ 93969 99669.

REAL ESTATE
FLAT FOR SALE
AAVAS Phoenix Tower Smart Homes 3 BHK Flats ... RERA Project. 9505502346.

GENERAL
✆ 93928 46185.

TO LET
APARTMENTS
TIRUPATI POSTAL Colony 3 BHK New Construction East Facing 1st Floor NRR Enclave - Near Pradepty Residency ✆9440847355

JOBS
WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.
Wanted Sales Executive: Job Location Kadapa & Chittoor (Dist.). Qualy: Dip/ B.Tech/ Degree. Exp: Fresher/ 2-3 yrs. Salary: 20-30K + TA & DA. Cont: 83286 75684
WANTED TELECALLER & PRO - 04, Marketing Executive - 50. Same Mandal in Work Cont: 88013 98165.
WANTED IMMEDIATELY PRO's & Higher Biology Teacher for a reputed School in Mangalam & Tirupati. Con: 81794 67247.
✆ 94405 81161.
✆ 80999 80999, 88866 02345.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/-
80085 13290
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

రాయచోటి
• రాయచోటి • పీలేరు

ఘనంగా సిద్ధేశ్వరస్వామి పార్వేట

కలకడ, న్యూస్‌టుడే: శ్రీ సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి పార్వేట ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో సమీపంలోని సత్యవతి నదిలోకి తీసుకెళ్లి సంప్రదాయ బద్ధంగా ఉత్సవాన్ని చేపట్టారు. అర్చకులు సారథిస్వామి, సునీల్‌స్వామి, మహేష్‌స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి పెట్టండి: కలెక్టర్

చెర్లోపల్లెలో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుర్రంకొండ, న్యూస్‌టుడే: ప్రతి రైతు తనకున్న పొలంలో ఆరుతడి పంటలు పండించడానికి కృషి చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఎల్లుట్ల పంచాయతీలో నల్లచెరువులో ఉపాధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ప్రాథమిక స్థాయి నుంచి విద్యా ప్రమాణాలు పెంచాలని సూచించారు. నడిమికండ్రిగలో అంగన్‌వాడీల పనితీరును తనిఖీ చేశారు. గుర్రంకొండలో ఉద్యానతోటల పెంపకంపై తనిఖీ చేసి సూచనలు చేశారు. యూరియా వినియోగం తగ్గించడానికి వ్యవసాయశాఖ కృషి చేయాలన్నారు. సంగసముద్రం పంచాయతీలో తాగునీటి నిల్వ కేంద్రాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ ఏజీకుమార్, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఎంఈవోలు సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, ఏపీఎం రజిని, ఏవో రత్నమ్మ, వైద్య సిబ్బంది, సచివాలయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ✦ మండల పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మండల తెదేపా అధ్యక్షుడు నాయిని జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా బాలికల గురుకుల పాఠశాల అద్దె భవనంలో నడుస్తోందని, భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కంకర వేసి, తారు వేయకుండా వదిలేసిన పసలవాండ్లపల్లె, పేరంపల్లె రహదారులకు తారు వేయాలని, పాఠశాల భవనాలు పూర్తి చేయాలని, దోబీ ఘాట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, రహదారుల్లో గుంతలు పూడ్చాలని, అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలని కోరారు. నాయకులు రెడ్డెప్ప రెడ్డి, సుంకర శేఖర్, మురళీ, రంజిత్, సుధాకర్ పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయండి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులు.. తమ పేర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఏవో రాజకుమారి కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 6,117 మంది రైతు సేవా ప్రక్రియ పూర్తిచేశారని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, కలకడ: సమస్య: స్థానిక రాజావీధిలోని మురుగునీటి కాలువ శుభ్రం చేయాలి. **-రఫీ, కలకడ**

సమాధానం: కాలువలో చెత్త తొలగించి శుభ్రం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తాం. **-శైలజ, పంచాయతీ కార్యదర్శి**

వ్యర్థాల తొలగింపు

ఎంపీడీవో కార్యాలయం గేటు వద్ద కుళ్లిన కూరగాయలు, ఆకుకూరల కుప్పల సమస్యపై కార్యాలయ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులచే వ్యర్థాలు తొలగింపజేశారు.
-న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

ఈనాడు స్పందన

ట్రాఫిక్‌పై పోలీసుల దృష్టి

బస్టాండు రోడ్డులో ట్రాఫిక్ సమస్యపై పోలీసులు స్పందించారు. 'ఈనాడు'లో 19న మా ఇష్టం.. అడిగేదెవరు..? శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు రవాణాకు అడ్డంకులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. **-న్యూస్‌టుడే, గాలివీడు**

✦ పురపాలిక: రాయచోటి ✦ వార్డులు: 34 ✦ జనాభా: 1.3 లక్షలు ✦ సీసీరోడ్ల నిర్మాణ ఖర్చు: రూ.4 కోట్లు ✦ అసంపూర్తి పనులు: సుద్దలోళ్లపల్లి, కె.రామాపురం రోడ్డు

గుత్తేదారులను అడగలేం..!

✦ అసంపూర్తి పనులతో అవస్థ
✦ మట్టి రోడ్లలోనే రాకపోకలు
✦ ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు

మదనపల్లె రోడ్డు నుంచి ఇనాత్‌ఖాన్ చెరువు వంక వరకు వేసిన సిమెంట్ రోడ్డు

సుద్దలోళ్లపల్లి రోడ్డు మధ్య ఇళ్ల వద్ద అధ్వానంగా మట్టి రోడ్డు

న్యూస్‌టుడే, రాయచోటి

రాయచోటి పురపాలికలో అభివృద్ధి పనులు ప్రణాళికా బద్ధంగా సాగడం లేదు.. కొన్నిచోట్ల రహదారులు నిర్మితమవగా మరికొన్నిచోట్ల అస్తవ్యస్తంగా ఉన్నాయి.. ఇంకొన్నిచోట్ల నిలిచిపోయాయి.. పనులు చేపట్టేందుకు ముందుకొచ్చిన గుత్తేదారు తీరా అర్ధాంతరంగా వదిలేయడంతో అసంపూర్తి రహదారులు వెక్కిరిస్తున్నాయి.. పనులు సకాలంలో ఎందుకు చేయలేదని గుత్తేదారులను 'గట్టిగా' అడగక పోవడం వల్లే ఇలా పనులు మధ్యలో నిలిచిపోయాయనే విమర్శలు లేవనెత్తుతున్నాయి.

✦ **అందివచ్చిన నిధులు..**

15వ ఆర్థిక సంఘం నిధులతో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు పురపాలికకు రూ.5 కోట్లతో పనులు చేపట్టింది. చిన్న వీధుల్లో పనులు పూర్తి చేసినా 40 అడుగుల విస్తీర్ణమున్న రోడ్ల నిర్మాణంలో అలసత్వం తప్పడం లేదు. కొద్ది ప్రాంతానికి సిమెంట్ రోడ్లు వేసి మధ్యలో వదిలేస్తూ.. ఆపై చివరి ప్రాంతాల్లో పనులు పూర్తి చేస్తున్నారు. దాంతో రహదారిపై రెండు విధాలుగా ఉన్న రోడ్లపై వాహనదారులు వెళ్లాల్సి వస్తోంది. సిమెంట్ రోడ్లలో వాహనాలు వేగంగా వచ్చి మట్టిరోడ్డుపై వెళ్లడంతో దుమ్ము, ధూళి వేగంగా లేచి ఇళ్లలోకి వస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగు మట్టి రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. పనులు దక్కించుకున్న గుత్తేదారుడు సకాలంలో పూర్తిచేయక పోవడం తోనే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు.

✦ **ఆ రోడ్లపై వెళ్లాలంటే వణుకు..**

మదనపల్లె రోడ్డుకు అనుసంధానంగా ఉన్న సుద్దలోళ్లపల్లి రోడ్డు రెండు కిమీ మేర విస్తరించింది. దీనిపై స్థానికులే కాక పాఠశాలలు, దేవాలయాలకు వాహనాలు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై సీసీ నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. మదనపల్లె రోడ్డు నుంచి కొద్ది భాగం రెండేళ్ల కిందట సీసీ వేసి మార్పు చేశారు. 100 మీటర్ల మేర వేయక అలానే ఆపేశారు. ఇటీవల మట్టి రోడ్డు చివరి నుంచి తాజాగా సిమెంట్ రోడ్డు వేశారు. మధ్యన మిగిలిన మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కె.రామాపురం రోడ్డులోని మంగళకాలనీ మీదుగా రింగ్ రోడ్డుకు వెళ్లే 40 అడుగుల రోడ్డు పరిస్థితీ అంతే. కె.రామాపురంలోని చౌడేశ్వరీ దేవి ఆలయం నుంచి మంగళ కాలనీ వరకు రెండేళ్ల కిందట సిమెంట్ రోడ్డు వేశారు. ఆపై సత్యనారాయణస్వామి ఆలయం వద్ద మదిలేసి పైనుంచి మదనపల్లె రోడ్డు కూడలి వరకు ఇటీవల రూ.40 లక్షలు వెచ్చించి పనులు పూర్తిచేశారు. వర్షం వస్తే రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొత్తపల్లి, మాసాపేట, పాత రాయచోటిలో నెలకొంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పనులు పూర్తిచేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

✦ **సకాలంలో పూర్తిచేస్తాం..**

ప్రధాన రహదారులపై నిధులు ఉన్నంతలో పనులు చేపట్టాం. సుద్దలోళ్లపల్లి రోడ్డులో పనులు దక్కించుకున్న గుత్తేదారుతో చర్చించి పనులు సకాలంలో చేసేలా చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశిస్తాం. **-జి.రవి, కమిషనర్**

కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

వంద శాతం పన్ను వసూలు చేయండి

కలికిరి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో నెలాఖరులోగా వంద శాతం పన్ను వసూలు చేయాలని డీపీవో రాధమ్మ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం పన్నుల వసూలుపై మండలంలోని 14 సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్ను వసూలు చేయాలన్నారు. గ్రామాలో రోజూ చెత్త సేకరించాలని, 15 రోజులకోసారి నీటి ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఆయా డంపుల్లో చేర్చాలని ఆమె సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముందు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఈవో అశోక్, ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవో నవాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలి: జేడీ

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్.పి ఆదేశించారు. గురువారం మండలంలోని సొరకాయలపేట పశువైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. పాడి రైతులు మేలుజాతి పశువులను పెంచేలా అవగాహన కల్పించాలని కోరారు. వచ్చే నెల 15 నుంచి గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్నామని, దీన్ని వంద శాతం పూర్తిచేసి విజయవంతం చేయాలన్నారు. పాడి రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు. పశువైద్య సిబ్బంది శంకర తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో..?

వాల్మీకిపురం- గుండ్లూరు మధ్యనున్న 23 కిమీ మేర సింగిల్ రోడ్డును.. డబుల్ రోడ్డుగా మార్చేందుకు 2014లో ఆర్అండ్‌బీ నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది. వాల్మీకిపురం- నగిరిమడుగు వరకు 10 కిమీ మేర డబుల్ రోడ్డుగా వేసి పనులు నిలిపేశారు. మిగిలిన 13 కిమీ మేర రోడ్డు అలానే మిగిలిపోయి దశాబ్ద కాలమైనా.. అధికారులు పట్టించుకోలేదు. మరోవైపు.. 13 కిమీ మేర సింగిల్ రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలతో పాటు రోడ్డు మొత్తం గుంతలుగా మారింది. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.
-న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

పర్యవేక్షణ లోపం.. యంత్రానికి శాపం

మార్కెట్‌యార్డు ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చే రైతుల కోసం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యంత్రం పర్యవేక్షణ లేక మూలనపడింది. గత ఐదేళ్లుగా దీని పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పట్టించుకుని ఈ యంత్రాన్ని బాగుచేసి వినియోగంలోకి తెస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ విషయమై మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి మాట్లాడుతూ శుద్ధి యంత్రానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నారు.
-న్యూస్‌టుడే, వాల్మీకిపురం

నీరందితేనే.. పంట తడిసేది

మండలంలో వ్యవసాయ బోర్ల కింద వేరుసెనగ సాగులో ఉంది. పలు గ్రామాల్లో విద్యుత్తు కోతలు అప్పుడే మొదలయ్యాయి. అరవీడు ఫీడర్‌లో కోతలతో సకాలంలో నీటి తడులు అందక వేరుసెనగ పంట ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల పేరుతో సరఫరా సమయంలో కరెంట్ సరఫరా నిలిపేస్తున్నారని వాపోతున్నారు. కోతలు లేకుండా సక్రమంగా విద్యుత్తు సరఫరా అందించాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గాలివీడు

ర్యాలీలో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

శివాజీ అడుగు జాడల్లో నడవాలి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని వాల్మీకిపురంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయం వద్ద శివాజీ చిత్రపటానికి.. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యువకులు పూజలు నిర్వహించారు. తదుపరి అక్కడి నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీ ప్రారంభించి గాంధీ సర్కిల్, ఎల్ఆర్ వీధి, ఆర్టీసీ బస్టాండు, తరిగొండ సర్కిల్, తిరుపతి రోడ్డు మీదుగా సాగారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హిందూ సమాజం కోసం శివాజీ చేసిన త్యాగాలు ఎనలేనివన్నారు. సమాజంలో యువత శివాజీ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపై ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. సీఐ రాఘవరెడ్డి, ఎస్సై తిప్పేస్వామి ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాల యువత పాల్గొన్నారు.

కండక్టర్లు, చోదకులకు పవర్‌బ్యాంకుల అందజేత

కండక్టర్‌కు పవర్ బ్యాంకు అందజేస్తున్న డీఎం రోషన్, సీఐ ధనంజయులు

పీలేరు, న్యూస్‌టుడే: ప్రజా రవాణా శాఖలో ఆదాయం తీసుకువచ్చే విషయంలో కండక్టర్లు, చోదకుల పాత్ర ప్రధానమని ఆర్టీసీ డీఎం రోషన్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో కండక్టర్లకు టిమ్‌లు ఛార్జింగు పెట్టుకునేందుకు 'పవర్ బ్యాంకులు' పంపిణీ చేసి మాట్లాడారు. కండక్టర్లు, చోదకుల కృషితోనే మహాశివరాత్రికి భక్తులకు సౌకర్యంగా బస్సులు నడపడం వల్ల తమ డిపో రూ.18.25 లక్షల ఆదాయం వచ్చి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు భవిష్యత్తులోనూ డిపోను ముందంజలో ఉంచాలని కోరారు. డిపోలో 181 మంది కండక్టర్లకు పవర్ బ్యాంకులు అందజేశామన్నారు. సీఐ ధనంజయులు, విజిలెన్స్ కానిస్టేబుల్ సామన్న, బస్టాండ్ మేనేజరు బాబు నాయక్, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'మరణశిక్ష విధించాలి'

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిశేఖర్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ ఎరుకల డెవలప్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పూజా రెడ్డి శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చట్టాల్లో మార్పులు చేసి కఠిన చట్టాలు తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వాహనం వితరణ

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి మండలం మహల్‌కు చెందిన దివ్యాంగుడు, వైకాపా పీహెచ్ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్‌హుస్సేన్‌కు.. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి మూడు చక్రాల వాహనాన్ని వితరణగా అందజేశారు. నడవలేక ఇబ్బందిపడుతున్న షబ్బీర్ హుస్సేన్‌కు తన సొంత ఖర్చుతో త్రిచక్ర వాహనాన్ని గురువారం సదుం మండలం యర్రాతివారిపల్లెలో మైనార్టీ కమీషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో అందించారు. వైకాపా నాయకుడు, మార్కెఫెడ్ మాజీ ఛైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, హనీఫ్ పాల్గొన్నారు.

ఏకీకృత కుటుంబ గణనకు సిగ్నల్ సమస్య

సంబేపల్లె: ఏకీకృత కుటుంబ గణన మండలంలో పెద్ద గ్రామ పంచాయితీ శెట్టిపల్లె పరిధిలో సిగ్నల్ సమస్యలతో గణన నత్తనడకన సాగుతోంది. సదిపిరివాండ్లపల్లె, పెద్దబిడికి, వల్లబండపల్లె, గాండ్లపల్లె, అడబికమ్మపల్లె, బురుజుకాడ హరిజనవాడ, చిన్నబిడికి పరిధిలోని దిగువ, ఎగువ హరిజనవాడల్లో సిగ్నల్ సమస్య ఎక్కువగా ఉందని స్వర్ణగ్రామ అధికారి కిషోర్ కుమార్ తెలిపారు. ఈ నెల 28తో గడువు ముగుస్తుండటంతో 66 శాతం గణన పూర్తయిందన్నారు. ఇంకా రెండు వేల కుటుంబాలకు సిగ్నల్ సమస్యతో నమోదు ఆలస్యమవుతోందని, ఫలితంగా సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారన్నారు.

నేటినుంచి హనుమ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: స్థానికంగా నూతనంగా నిర్మించిన అభయహస్త ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి గణపతి పూజతో ఉత్సవాలు మొదలవుతాయని చెప్పారు. 21న కలశస్థాపన, హోమాలు, 22న తెల్లవారుజామున మూడు గంటల నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

చిన్నమండెం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని నియోజకవర్గ తెదేపా నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ సారథిరెడ్డిని పరామర్శించారు. **రామాపురం:** చిట్లూరు పంచాయతీలోని తెదేపా నాయకులు రామకృష్ణగౌడ్, నరసింహులును లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెదేపా మండల నాయకుడు సురేంద్రరెడ్డి, చెన్నక్రిష్ణరెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీయడమే వైకాపా లక్ష్యం'

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుంటే, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేయడమే వైకాపా లక్ష్యంగా ముందుకెళ్తుందని తెదేపా సీనియర్ నాయకులు, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ అన్నారు. గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రమౌళి, తెదేపా సీనియర్ నాయకుడు మల్లికార్జునరెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైకాపా నాయకులచే మురికి మాటలు మాట్లాడిస్తూ జనసేన శ్రేణులను రెచ్చగొట్టడమే అజెండాగా పెట్టుకుని నీచ రాజకీయాలకు వైకాపా అధినేత జగన్ తెరతీస్తున్నారని ఆరోపించారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి రాణెమ్మ, మాజీ సర్పంచి రాజేంద్రాచారి, నాయకులు నారాయణ, మురళి పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై కేసు

కలకడ : బాటవారిపల్లె పంచాయతీ కాలనీకి చెందిన కృష్ణమాచారిని.. అదే కాలనీకి చెందిన శీనునాయక్, అతడి బంధువులు దాడి చేసి గాయపరచడంతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ ముజీర్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు కృష్ణమాచారికి.. శీనునాయక్‌కు భూ తగాదా నేపథ్యంలో ఈ దాడి జరిగిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న వైద్యుడు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి, చిన్నమండెం, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుందని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ తెలిపారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చిన్నమండెం మండలం మల్లూరులో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉన్నప్పుడే ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల శుభ్రం, పారిశుద్ధ్యం నిర్వహణపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. అనంతరం వైద్యులు.. గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి కె.రెడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

In The Court of The Principal Senior Civil Judge:- Nellore
O.S. No. 39/2025
Gaddam Sreenivasulu Reddy - Plaintiff
Vs
1. M/s. Sri Maruthi Prasanna Enclave, a Regd. Partnership Firm, bearing Regn. No.196/2016, rep.by its Managing Partner
a) Smt. Atluri Suneetha@Suneethamma
b) Sri. Somalaraju Krishnama Raju
2. Smt. A.Suneetha@Suneethamma
3. Sri. Somalaraju Krishnama Raju
-Defendants

NOTICE

To,
D1 (b): Sri Somalaraju Krishnama Raju S/o Nagaraju, residing at D. No. 9/107-66-1, Kothapeta, Rayachoty, Annamaiah District. A.P.
D3: Sri Somalaraju Krishnama Raju, S/o Nagaraju, residing at D.No. 9/107-66-1, Kothapeta, Rayachoty, Annamaiah District. A.P.
పై నెంబరున వాది మీ నుండి తనకు రావలసిన బాకీని రాబట్టుకొనుటకు గాను పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది 19-03-2026**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

G.శ్రీధర్‌రెడ్డి, B.Sc., B.L.,
M.రామమోహన్‌రెడ్డి, M.Com., L.L.B.,
T.శ్రీకాంత్, B.Tech, L.L.B.,
వాదితరపు అడ్వకేట్స్, నెల్లూరు.

వసతి.. సమకూరేదెన్నటికి!

● ఎదురుచూపుల్లో అధికారులు, సిబ్బంది ● గాలివీడు పోలీసుల దయనీయ స్థితి

శిథిలమైన ఎస్సై నివాస భవనం

న్యూస్‌టుడే, గాలివీడు

పోలీసుల సిబ్బంది ఏ సమయంలోనైనా వివిధ పనులపై వచ్చే బాధితులకు సేవలందించాలి.. ఇందుకు స్టేషన్ పరిధిలోనే నివాసం ఉండాలి.. వారు ఉండేందుకు అన్ని సదుపాయాలతో క్వార్టర్స్ నిర్మాణాలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపడతారు.. గాలివీడులో బ్రిటిష్ కాలంలో నిర్మించిన నివాస భవనాలు పాతవి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.. దీంతో ఆ భవనాలను తొలగించి చదును చేశారు.. ఎస్సై క్వార్టర్స్‌ను గుర్తుగా ఉంచడంతో అదికాస్తా నిరుపయోగంగా మారింది.. వాటి స్థానంలో కొత్త వాటిని నేటికీ నిర్మించనేలేదు.. దీనిపై ఇప్పటికే స్థానిక అధికారులు.. పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.. సదరు దస్త్రం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

✦ **సర్కిల్ పరిధిలో ఇలా..**

లక్కిరెడ్డిపల్లె సర్కిల్ పరిధిలోని గాలివీడు స్టేషన్ పాత భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించారు. అందులోనే ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. స్టేషన్ పక్కనే విశాలమైన ప్రాంతంలోని ఎస్సై భవనం మాత్రం శిథిలావస్థకు చేరినా పట్టించుకోవడం లేదు. ఆవరణలోని పోలీసుల నివాస భవనాలు దెబ్బతినడంతో వాటి కట్టడాలు తొలగించారు. ప్రస్తుతం ఎస్సైతో పాటు సిబ్బంది అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. మరికొందరు అద్దె భవనాలు దొరక్క పోవడంతో దూర ప్రాంతాల్లో బాడుగకు ఉంటున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో విధులకు హాజరు కావడం కష్టతరమవుతోందని పోలీసులు వాపోతున్నారు. ఇటీవల ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్థానిక స్టేషన్‌ను తనిఖీ చేశారు. శిథిలావస్థలో ఉన్న ఎస్సై క్వార్టర్, ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. నూతన భవనాలు నిర్మించాలని పోలీసులు ఆశిస్తున్నారు.

వాణిజ్య సముదాయానికి అనుకూలం..

పోలీస్ క్వార్టర్స్ స్థలం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉంది. రాయచోటి-కదిరి ప్రధాన రోడ్డు పక్కనే ఉంది. దీంతో క్వార్టర్స్ నిర్మించగా.. మిగిలిన స్థలంలో వాణిజ్య సముదాయాలకు అవసరమైన గదులు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. తద్వారా ఇటు సిబ్బందికి నివాసాలు.. అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. మొత్తంమీద విధి నిర్వహణలో 24 గంటలూ తలమునకలయ్యే పోలీసులకు నివాసాలు ఎప్పటికి సమకూరతాయనేది వేచిచూడాల్సిందే మరి.

బాల్య వివాహాలు అరికడదాం

సంబేపల్లె, న్యూస్‌టుడే: బాల్య వివాహ దురాచారాన్ని పారద్రోలాలని ఎంపీడీవో సునీల్‌కుమార్ కోరారు. బాల్య వివాహ విముక్తి రథాన్ని గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. బాల్య వివాహాలపై సమాచారం అందించడానికి ఛైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098, పోలీసుశాఖ 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ జేఈ మాబూసాహెబ్, స్వర్ణగ్రామం-స్వర్ణవార్డు అధికారి కిషోర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి మోహన్‌బాబు, సమత సంస్థ ప్రతినిధి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

రామాపురం, న్యూస్‌టుడే: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని బండపల్లె పంచాయతీ గన్‌సీదా సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు పూర్తిగా దెబ్బతింది. బాధితుల వివరాల మేరకు గురువారం ఉదయం కర్నూలు నుంచి రాయచోటిలోని బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో గన్‌సీదా వద్దకు రాగానే రాయచోటి నుంచి కడపకు వెళ్తున్న లారీ.. కారును ఢీకొనడంతో అది.. రాయచోటి నుంచి కడప వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తాపడింది. కారులోని నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు ముందు భాగంలో పాక్షికంగా దెబ్బతింది. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టారు. గురువారం ముస్లిం సోదరులు సహెరీతో ఉపవాసదీక్ష చేపట్టారు. అయిదు వేళల్లో నమాజ్ చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందులో సామూహికంగా పాల్గొని దువా చేసి ఉపవాస దీక్ష విరమించారు. ఇఫ్తార్ దైవ చింతనతో పాటు ఐక్యతను చాటిచెబుతుందని టిప్పు సుల్తాన్ మసీదు ఇమాం హజరత్ మహమ్మద్‌అలీ పేర్కొన్నారు.

← హజరత్ టిప్పుసుల్తాన్ మసీదులో విందు

పన్నుల వసూళ్లకు ఆదేశం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు కోరారు. మండలంలో రూ.63.43 లక్షలకు గాను రూ.45.55 లక్షలు వసూలైనట్లు చెప్పారు. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వసూలైన నగదు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో చెల్లించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ మహేశ్ పాల్గొన్నారు.

21, 22న ఉచిత వైద్య శిబిరాలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 21, 22 తేదీల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు 108 నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. గుండె, కళ్లు, ఎముకల సమస్యలపై పరీక్షలు చేస్తారన్నారు.

అభివృద్ధి పనులకు సహకారం అవసరం

తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టనున్న ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి రైతులు సహకరించాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి సూచించారు. గురువారం తహసీల్దారు శ్రీనివాసులతో కలిసి పార్కు ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు భూ విస్తీర్ణానికి అనుగుణంగా పరిహారం ఇస్తామన్నారు. రైతులు నిర్ణయాన్ని కలెక్టరేట్‌లో తెలియజేయాలన్నారు. ఆర్ఐ ముద్దుకృష్ణ, వీఆర్వో సంజీవ, సిబ్బంది ఉన్నారు.

రక్షక భటులకు.. రక్షణ కరవు

❖ శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

మదనపల్లె నేరవార్తలు, పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. వారు అందుబాటులో ఉంటూ ఏవైనా ఘటనలు జరిగిన వెంటనే స్పందించేందుకు గతంలో ఠాణాల సమీపంలోనే పోలీసు క్వార్టర్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పాడయ్యాయి.

శిథిల స్థితికి చేరిన పుంగనూరు పట్టణంలోని పోలీసు క్వార్టర్స్

పెచ్చులూడుతున్న పైకప్పులు..

జిల్లాలో మదనపల్లె, పుంగనూరు ప్రాంతాల్లో 30 ఏళ్ల క్రితం పోలీసు క్వార్టర్స్ నిర్మించారు. అవి చాలా వరకు పాడయ్యాయి. కొన్ని పైకప్పులు పెచ్చులు ఊడిపోయాయి. మరికొన్ని పాత గోడలు కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మదనపల్లెలో ఒకటో ఠాణా సమీపంలో, డీఎస్పీ కార్యాలయం వెనుక ఉన్నాయి. ఇవి శిథిలం కావడంతో ఇక్కడెవరూ ఉండటం లేదు. పోలీసులు అద్దె భవనాల్లో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఇళ్ల అద్దెలు పెరగడంతో అవస్థలు పడుతున్నారు. డీఎస్పీ కార్యాలయం వెనుక 2, 3 క్వార్టర్స్‌లో కొందరు ఉంటున్నారు. ఇవి ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు.

పుంగనూరులోనూ అదే పరిస్థితి..

పుంగనూరు పట్టణంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. విద్యుత్తు, మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యం లేక శిథిలమయ్యాయి. ఎస్ఐ, సీఐ క్వార్టర్స్ సైతం పాడయ్యాయి. కొత్తవి నిర్మిస్తే పోలీసు సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉంటుందని పోలీసు అధికారులు కోరుతున్నారు. మదనపల్లెలో ఇద్దరు సీఐలకు రెండు భవనాలు కొత్తగా నిర్మించారు.

పాడైనవి కూల్చివేతకు అనుమతులు..

మదనపల్లె పట్టణంలోని డీఎస్పీ బంగ్లాతో పాటు వెనుకనున్న పోలీసు క్వార్టర్స్ కూల్చివేసి కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు వచ్చాయి. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయని డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ప్రస్తుతమున్న డీఎస్పీ కార్యాలయం కూల్చి ఎస్పీ క్యాంప్ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. మదనపల్లె డీఎస్పీ కార్యాలయాన్ని గ్రామీణ ఠాణా సమీపంలో ఏర్పాటు చేయనున్నారు. పుంగనూరు సముదాయాన్ని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

ఛత్రపతి శివాజీ సేవలు ఎనలేనివి

బస్టాండు కూడలిలో శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మరాఠీ సంఘం నాయకులు

మదనపల్లె పట్టణం, నిమ్మనపల్లె, రామసముద్రం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతిని మదనపల్లెలో నిర్వహించారు. చిత్తూరు బస్టాండు కూడలిలో మరాఠీ సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూజలు చేశారు. నాయకులు యోగి, ప్రశాంత్, పురుషోత్తం, వెంకోబ, ప్రభాకర, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారి పాల్గొన్నారు. ● బహుజనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి జరిగింది. ● నిమ్మనపల్లె బస్టాండులో మండల జనసేన అధ్యక్షుడు ప్రదీప్‌సింగ్, సింగిల్ విండో అధ్యక్షుడు పి.వెంకటరమణ, నాయకులు నివాళులర్పించారు. ● రామసముద్రంలో శివాజీ సేవా సమితి సభ్యులు ర్యాలీ చేపట్టి శివాజీకి నివాళులర్పించారు.

కోనేర్ల శుభ్రతపై దృష్టి

మొక్క నాటుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం, పర్యవేక్షకులు, సిబ్బంది

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధి పథకం ద్వారా జిల్లాలోని కోనేర్ల శుభ్రత చర్యలు చేపడతామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరత్నం తెలిపారు. సీటీఎం టౌన్‌లోని అల్లక్కతోపుకు చెందిన కాశీ విశ్వేశ్వర ఆలయ ఆవరణలోని కోనేరును ఇటీవల జీర్ణోద్ధరణ చేపట్టారు. ఆ పనులను అధికారులు పరిశీలించి మొక్కలు నాటారు. ఎంపీడీవో తాజ్‌మన్సూర్, ఏపీవో చెన్నకేశవులు, జేఈ బోయకొండ, టీఏ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై నిఘా

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలో ఏర్పాటుకానున్న జిల్లా పోలీసు కార్యాలయాన్ని డీఐజీ కోయప్రవీణ్ గురువారం పరిశీలించారు. ఏయే విభాగాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారన్నది పటంలో చూపుతూ ఎస్పీ ధీరజ్ వివరించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని డీఐజీ ఆదేశించారు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐలు కళా వెంకటరమణ, మోహన్‌కుమార్ తదితరులున్నారు.

భవనాల మ్యాప్ పరిశీలిస్తున్న డీఐజీ ప్రవీణ్, ఎస్పీ ధీరజ్

ఇది ఏ కార్యాలయమో చెప్పుకోండి!

మదనపల్లె మండలంలో ఆరేళ్ల క్రితం కోళ్లబైలును 1, 2గా విభజించారు. కోళ్లబైలు-1 పంచాయతీ సచివాలయ భవనం పనులు మేకలవారిపల్లె వెళ్లే మార్గంలో గుట్టపై ప్రారంభించి ఆపేశారు. అప్పటి నుంచి బయ్యారెడ్డికాలనీలోని వ్యవసాయ గోదాములో తాత్కాలికంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ ఇక్కడ కనీసం సచివాలయం పేరు లేకపోవడంతో ప్రజలు తికమకపడుతున్నారు. కనీసం బోర్డు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణం

రోడ్డు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రామసముద్రం మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురంలో వీధి రోడ్డు ఆక్రమణపై కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రోడ్డును ఆక్రమించి కొందరు మరుగుదొడ్లు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎడ్లబళ్లు, వాహనాలు వెళ్లలేకపోతున్నాయని చెప్పారు. ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, తహసీల్దార్ అజారుద్దీన్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికే ఆక్రమణదారుకు నోటీసులు ఇచ్చామని, మరోసారి పరిశీలిస్తామని ఎంపీడీవో చెప్పారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

పార్టీకి గ్రామ కమిటీలే కీలకం

మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సదుం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి నుంచి వైకాపా పటిష్ఠానికి గ్రామ కమిటీలే కీలకమని రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో గ్రామ కమిటీలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. నిరాధార ఆరోపణలతో తనను జైల్లో పెట్టినా బాధ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు, గ్రామ కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యే ఎ.అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సీహెచ్.రామచంద్రారెడ్డి, నిస్సార్ అహ్మద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా యువజన శాఖ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు అన్నారు. గురువారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రాఫ్ట్ నేషనల్ యూత్ పాలసీ- 2026పై కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంకుర సంస్థలు ప్రారంభించి వ్యవస్థాపకులుగా ఎదగాలన్నారు. పరిశోధనవైపు వెళ్లే వారికి ప్రత్యేకమైన అవకాశాలు కల్పిస్తామన్నారు. వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు తెలియజేసే సలహాలు, సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు విశ్రాంత జోనల్ మేనేజర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాఘవరెడ్డి, అధ్యాపకుడు శ్రీనివాస్, యూత్ అధికారి ప్రదీప్, క్రీడాధికారి చంద్రశేఖర్, సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అడవినాథునికుంట ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమ తెలిపారు. 6వ తరగతిలో చేరేవారు ఈనెల 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 31లోపు ఓసీ, బీసీలు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.125 పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. ఏప్రిల్ 12న ప్రవేశపరీక్ష, 30న ధ్రువపత్రాల పరిశీలన ఉంటాయన్నారు. www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా శ్రీనివాసులు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా 102ఇ.రామిరెడ్డిగారిపల్లె వీఆర్వో **శ్రీనివాసులు** ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పులిచెర్ల తహసీల్దారు కార్యాలయంలో సంఘ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా డి.మౌనిక, కోశాధికారిగా మహేశ్, సంయుక్త కార్యదర్శిగా సుబ్రహ్మణ్యంతో పాటు 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఠాణాల్లో ఇంటర్ ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న సీఎస్‌లు, డీవోలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రశ్నపత్రాలు గురువారం పోలీస్‌స్టేషన్లకు చేరాయి. మదనపల్లెలోని 11 కేంద్రాలకు సంబంధించిన సెట్-1 ప్రశ్నపత్రాలు రావడంతో కస్టోడియన్లు రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు స్టేషన్ల వద్దకు చేరుకుని భద్రపర్చారు. మరో రెండు రోజులు సెట్ 2, 3 ప్రశ్నపత్రాలు వస్తాయని చెప్పారు. పరీక్షల సమయంలో పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలు సెంటర్లకు తరలిస్తామని కస్టోడియన్లు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ సిబ్బంది ప్రజలకు బాధ్యతగా సేవలు అందించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఒకటో డిపో మేనేజరు ఎం.వి.రమణారెడ్డి అన్నారు. శివరాత్రి రోజున విశిష్ట సేవలు అందించిన 20 మంది సిబ్బంది, పర్యవేక్షకులకు ప్రశంసాపత్రాలు గురువారం అందించారు. అంగళ్లు, తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండకు ఈ ఏడాది 81 బస్సులు నడపగా అన్నీ సురక్షితంగా ఉన్నాయన్నారు. మెకానిక్, ట్రాఫిక్ సిబ్బంది బాగా పనిచేశారని కొనియాడారు. మెకానికల్ ఏఈ రవికుమార్, ఎల్‌హెచ్ నాగరాజు, ఎస్డీఐ రెడ్డిబాషా, భద్రతాధికారి శేఖర్, యూనియన్ నాయకులు కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారంపై దృష్టి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. జిల్లాలో సమస్యలపై ఎస్ఈ ఎ.సోమశేఖర్‌రెడ్డి, ఈఈ గంగాధరంతో కలసి గురువారం సమీక్షించారు. సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. యంత్రాంగం పనితీరు మార్చుకోవాలన్నారు. జిల్లాకు ఏడు ఉప కేంద్రాలు మంజూరు కానున్నాయన్నారు. పీఎం సూర్యఘర్, విద్యుత్తు కనెక్షన్లు, సబ్‌స్టేషన్లలో శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఎస్ఈ కార్యాలయం ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనాలను పరిశీలించారు. సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఏవో బ్రహ్మయ్యచారి, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, గోవిందురెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

బాల్య వివాహాల కట్టడి అందరి బాధ్యత

ములకలచెరువు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ములకలచెరువు ఎస్సై ప్రతాప్ సూచించారు. గురువారం ములకలచెరువు కేజీబీవీలో సోషల్ వెల్ఫేర్ ఎంపవర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా దూరంగా ఉండాలన్నారు. తహసీల్దారు ప్రదీప్, ఎంఈవో వెంకటరమణ తదితరులున్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొర్రెల కాపరి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాట్నగల్లు పంచాయతీ కాకిమారిపల్లెకు చెందిన శ్రీనివాసులు రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.

మామిడి చెట్లు దగ్ధం

సదుం, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధమైన ఘటన సదుం మండలంలో గురువారం చోటు చేసుకుంది. సదుం గ్రామానికి చెందిన ఖలీల్‌సాహెబ్ 2 ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నారు. తోటలో 140 చెట్లు మంటల్లో కాలిపోయినట్లు ఆవేదన చెందారు. ● **సోమల, న్యూస్‌టుడే:** మండలంలోని చింతమాను నల్లగట్టుకు కొందరు నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించి ఇర్లపల్లెలో నాగరజా, వెంకటప్పకు చెందిన 21 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: తంబళ్లపల్లెకు చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త మహబూబ్‌బాషా (52) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక నాయకులు ఆయన ఇంటికి చేరుకొని నివాళులర్పించారు. సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు.

పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం పంచాయతీ జూపల్లెవారిపల్లె, కోటపల్లె గ్రామాల్లో పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి చేసింది. బుధవారం రాత్రి రెండు గ్రామాలకు చెందిన రైతులు హరి, ఈశ్వరయ్య, నాగులయ్య, ఖాదర్‌బాషా పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలు విరిచేసింది. పశుగ్రాసం సాగును తొక్కేసింది. ఏనుగు తీవ్రంగా నష్ట పరుస్తోందని, అధికారులకు చెబుతున్నా దూరంగా తరలించడం లేదని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

మదనపల్లె విద్య (కురబలకోట): మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న 33 మంది విద్యార్థులకు రూ.లక్ష చొప్పున ఇన్ఫోసిస్ స్టార్స్ ఉపకార వేతనం వచ్చినట్లు వీసీ యువరాజ్ తెలిపారు. వారిని ఛాన్స్‌లర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ప్రొఛాన్స్‌లర్ ద్వారకనాథ్ అభినందించారు.

అధ్యాపకులతో ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: పెద్దపంజాణి మండలం ముతుకూరుకు చెందిన రమేష్, బాలసుబ్రహ్మణ్యం కందూరు సమీపంలోని కోళ్లఫారంలో కోళ్లకు వ్యాక్సిన్ వేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పుంగనూరు మండలం ఆరడిగుంటకు చెందిన జయకుమార్ ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మొదుకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ముగ్గురికీ గాయాలవగా 108లో మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. ● పెద్దమండ్యం: పాపేపల్లె క్రాస్‌లో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తురకపల్లెకు చెందిన ముబారక్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పశువుల విషయంలో ఘర్షణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పశువుల విషయంలో జరిగిన ఘర్షణలో ఏడుగురు గాయపడ్డారు. మదనపల్లె మండలంలోని పనసమాకులపల్లెకు చెందిన శంకర్ ఆవులను పొలంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. ఒక ఆవు పక్కనున్న మల్లికార్జున పొలంలోకి వెళ్లడంతో ఆయన కట్టేశాడు. దీనిపై ప్రశ్నించిన శంకర్, భార్య ఆదిలక్ష్మిపై మల్లికార్జున కుటుంబ సభ్యులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న శంకర్ కుటుంబ సభ్యులు రాజేష్, నందీశ్వర్, వెంకటలక్ష్మి, వెంకటరమణ, మమత పొలానికి వెళ్లగా వారినీ కొట్టారు. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలవగా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

తీగలు, స్టార్టర్ల చోరీ

ములకలచెరువు, న్యూస్‌టుడే: మండలంలో తీగల చోరీలు పెరిగిపోయాయి. మూడు నెలల్లో వ్యవసాయ బోర్లే లక్ష్యంగా తీగలు చోరీ చేస్తున్నారు. బుధవారం రాత్రి చౌడసముద్రం బీసీ కాలనీలో గ్రామానికి చెందిన బోరు కేబుల్ తీగలు ఎత్తుకెళ్లినట్లు సర్పంచి రాంబాబు తెలియజేశారు. దేవుళచెరువులో ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల తీగలు, స్టార్టర్లు సైతం చోరీ చేశారన్నారు. ఆయా ప్రాంతాలను ఎస్సై ప్రతాప్ గురువారం పరిశీలించారు.

(c) eenadu

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ భావన తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 20 రైతు సేవా

మార్చి ఒకటి నుంచి శనగల కొనుగోళ్లు

కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 38,840 హెక్టార్లలో పంట సాగు చేశారని.. 73,860 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. క్వింటాకు రూ.5,875 కనీస మద్దతు ధర చెల్లించనున్నట్లు వివరించారు. రైతుల నుంచి 12,116 క్వింటాళ్లు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుచేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. మార్క్‌ఫెడ్ ఏడీ కరుణశ్రీ, జేడీఏ విజయనిర్మల, పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీర మార్గం కల సాకారం!

రూ.ఐదున్నర కోట్లతో తారురోడ్డు నిర్మాణం

బాపట్ల, న్యూస్‌టుడే : జిల్లాలోని తీర ప్రాంతంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రూ.కోట్ల పెట్టుబడులతో రిసార్టుల నిర్మాణం జరుగుతోంది. వారాంతంలో వేల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సూర్యలంక నుంచి ఓడరేవు వరకు బీచ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదన ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. ప్రస్తుతం రెండు దశల్లో పనులు జరుగుతున్నాయి. తొలి దశలో పాండురంగాపురం నుంచి అడవిపల్లెపాలెం వరకు రూ.5.50 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈపూరుపాలెం కాలువపై వంతెన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ

నిర్మాణంలో బీచ్ దారి

పూర్తి చేశారు. త్వరలో పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రహదారి పూర్తయితే బాపట్ల - చీరాల తీర ప్రాంతం అనుసంధానమై పర్యాటక రంగానికి మణిహారంలా నిలవనుంది.

✦ ఓడరేవు నుంచి రామాపురం, కఠారివారిపాలెం మీదుగా పొట్టిసుబ్బయ్యపాలెం వరకు ప్రస్తుతం బీచ్ రహదారి ఉంది. దీనిని రెండు వరుసలుగా విస్తరిస్తారు.

✦ పాండురంగాపురం - అడవిపల్లెపాలెం వరకు బీచ్ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించారు. ప్రస్తుతం నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మార్చి మూడో వారంలోగా పూర్తి చేయనున్నారు.

✦ బాపట్ల- చీరాల తీర ప్రాంతాల్ని కలపడానికి కీలకమైన ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువపై వంతెన నిర్మాణానికి జిల్లా ఖనిజ నిధి నుంచి రూ.11 కోట్లు కేటాయించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించనున్నారు.

✦ రెండో దశ కింద పట్టణ శివారున మరుప్రోలువారిపాలెం 216ఏ ఎన్‌హెచ్ బైపాస్ నుంచి పాండురంగాపురం వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.20 కోట్లు మంజూరు చేసింది. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టనున్నారు.

✦ పాండురంగాపురం నుంచి ఓడరేవు వరకు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి అందుబాటులో ఉంది. వంద అడుగుల లింకు డొంక మార్గం ఇప్పటికే ఉండటంతో భూసేకరణ అవసరం లేకుండానే బీచ్ రోడ్డు నిర్మిస్తున్నారు.

✦ సూర్యలంక నుంచి పాండురంగాపురానికి అటవీ భూముల్లో నుంచి రహదారి నిర్మాణానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సి ఉంది.

బాపట్లలో 100 పల్నాడులో 86

❖ ప్రారంభం కాని అభివృద్ధి పనులు
❖ పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరై ప్రారంభం కాని పనులు పల్నాడు జిల్లాలో 86.. బాపట్ల జిల్లాలో 100 ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు నాడు-నేడు కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాల్ని వైకాపా ప్రభుత్వం చేపట్టి ఆదిలోనే వదిలేసింది. ఆయా భవనాల్ని పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దృష్టిసారించింది. ఈ నెలాఖరులోపు పనుల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు చేసింది. పీఎంశ్రీతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో పూర్తయినవి తక్కువగా ఉండగా.. వివిధ దశల్లో ఉన్నవి ఎక్కువగా ఉన్నాయి. సరిపడా తరగతి గదుల్లేక ఉన్నత పాఠశాలల్లో బోధనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరితగతిన భవనాల నిర్మాణం పూర్తిచేస్తే విద్యార్థుల వెతలు తీరే అవకాశముంది.

జిల్లా	పనులు	నిధుల కేటాయింపు (రూ.లక్షల్లో)	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి	ప్రారంభం కానివి
పల్నాడు	531	6,091	109	336	86
బాపట్ల	437	2,992	137	200	100

మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు సాంబశివరావు, నరేంద్రవర్మ, కొండయ్య, విజయ్‌కుమార్, ఎంపీ కృష్ణప్రసాద్‌తో మంత్రి నారా లోకేశ్

కుశల ప్రశ్నలు.. ఆత్మీయ పలకరింపులు

ఈనాడు అమరావతి, బాపట్ల, న్యూస్‌టుడే: ఆత్మీయ పలకరింపులు.. కుశల ప్రశ్నలతో ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో బాపట్ల పార్లమెంట్ తెదేపా ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులతో మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నిర్వహించిన సమావేశం సందడిగా సాగింది. లోకేశ్ ఇచ్చిన విందుకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మ, ఎం.ఎం.కొండయ్య హాజరయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఆడపడుచులకు మా ఇంటి గౌరవం అంటూ లోకేశ్ మంగళగిరి చేనేత పట్టుచీరలు అందించారు.

చేనేత వస్త్రాలతో ఎంపీ, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు



(c) eenadu

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

నేటి నుంచి ప్రైవేటు పాఠశాలల్లో సీట్లకు దరఖాస్తులు

రామకృష్ణాపురం, ఎంజీసీ కాలనీ, కొత్తపేట (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం- 2009 ప్రకారం పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చేనెల 10వ తేదీ వరకు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్ లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ పాఠశాలలో సీటు వచ్చిందనే విషయమై చరవాణికి సంక్షిప్త సందేశం వస్తుంది. అది వచ్చిన వారం రోజుల్లో ఆ పాఠశాలకు వెళ్లి, పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. గత మూడేళ్లలో బాపట్ల జిల్లాలో 3148 మంది విద్యార్థులు పథకం కింద ప్రవేశాలు పొందాల్సి ఉండగా 2062 మంది మాత్రమే చేరినట్లు అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

వీరు అర్హులు.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల వార్షికాదాయం ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో చేరే విద్యార్థులు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య.. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ సిలబస్ అయితే 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి. రేషన్, ఓటరు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, గ్యాస్‌కనెక్షన్‌కు సంబంధించిన పత్రాలు ధ్రువీకరణ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తు సమయంలో విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయ ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సంవత్సరం	చేరాల్సిన విద్యార్థులు	చేరినవారు
2023–24	1836	1123
2024–25	871	667
2025–26	441	272

214 పాఠశాలలు నమోదు

జిల్లాలో 230 ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 214 పాఠశాలలు నమోదు చేసుకోవడం విశేషం. ఒక్కో బడిలో 25 శాతం సీట్లు ఉంటాయి. 12-1సీ కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు గడిచిన మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది చేరిన విద్యార్థులకు తొలి విడతగా ఆయా పాఠశాలల బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశారు. రెండో విడత త్వరలో వస్తాయని అధికారులు చెబుతున్నారు.

సాధనే ధ్యేయం.. మార్కులతోనే విజయం

పదిలో వెనుకబడిన విద్యార్థులకు 30 రోజుల కార్యక్రమం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), కర్లపాలెం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు కూడా ఉత్తీర్ణత సాధించేలా రైజింగ్ స్టార్స్ కార్యక్రమం మొదలు పెట్టింది. ఇలాంటి విద్యార్థులకు అధికారులు ప్రత్యేకంగా 30 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. వీరు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వసతితో కూడిన కేంద్రాల్లో సాధన చేస్తున్నారు. పాఠ్యాంశాల వారీగా వీరిని నిపుణులైన ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటికి దూరంగా ఉంటూనే విద్యార్థులు తమ భవితను బాగు చేసుకునేందుకు పునాది వంటి పది పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. వసతి కేంద్రంలో ఉండి చదువుతున్న విద్యార్థుల మనోభావాలు తెలుసుకుందాం.

లెక్కలంటే భయం పోయింది

నేను కొల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వచ్చా. నాకు లెక్కలంటే భయం. దీంతోనే ఉత్తీర్ణత సాధించలేననే సందేహం ఏర్పడింది. ఈ రెసిడెన్షియల్ తరగతులకు వచ్చాక ఇక్కడి వాతావరణం ఎంతో నచ్చింది. ఉపాధ్యాయులు లెక్కలను చాలా సులభంగా చేయడం నేర్పించారు. ఇప్పుడు నాకు నమ్మకం ఏర్పడింది నేను పది చివరి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తా.

–డొక్కు లోకేష్‌కృష్ణ, రెసిడెన్షియల్ క్యాంపస్ (బాలురు), జడ్పీహెచ్ఎస్ గుళ్లపల్లి

పట్టు పెరిగింది

నాది దొనేపూడి జడ్పీ ఉన్నత పాఠశాల. భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రం, లెక్కలన్నా చాలా భయం. వీటిలో బలహీనంగా ఉన్నాను. ఇక్కడకు వచ్చాక ఉపాధ్యాయుల బోధనతో సాధన చేయడం వల్ల నాకు ఆయా పాఠ్యాంశాలపై పట్టు వచ్చింది. నేను తప్పక పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అమ్మానాన్నకు మంచి పేరు తీసుకొస్తా. –దావూరి ప్రేమ్‌కుమార్, రెసిడెన్షియల్ క్యాంపస్ (బాలురు), జడ్పీహెచ్ఎస్, గుళ్లపల్లి

అన్నిట్లో టాప్.. ఆ ఒక్కటే వీక్

నేను జడ్పీ ఉన్నత పాఠశాల మత్స్యవాని(?) నుంచి వచ్చాను. నాకు అన్ని పాఠ్యాంశాల్లో 60కి పైగా మార్కులు వస్తాయి. కానీ ఒక్క గణితంలో మాత్రం 40లోపు వస్తున్నాయి. ఒకొక్కసారి 25మార్కులు వస్తున్నాయి. ఇక్కడి వచ్చాక గణితం చేయడం సులభంగా నేర్చుకున్నాను. తప్పక మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తాననే నమ్మకాన్ని ఉపాధ్యాయులు కలిగించారు.

– భాగ్యశృతి, రెసిడెన్షియల్ క్యాంపస్ (బాలికలు), జడ్పీహెచ్ఎస్, యాజలి

450 మార్కులు సాధిస్తా

నేను రేపల్లె పురపాలిక ఉన్నత పాఠశాల నుంచి వచ్చాను. నాకు అన్ని పాఠ్యాంశాల్లో ఎప్పుడూ 80కి పైగా మార్కులు వస్తాయి. సైన్సులో మాత్రమే అత్యంత తక్కువగా 30 నుంచి 40 మార్కుల లోపు వస్తున్నాయి. ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కల్పించడంతో సైన్సులో నాలో భయం పోయింది. తప్పక పదిలో 450కి పైగా మారులను సాధిస్తాను.

–గాయత్రి, రెసిడెన్షియల్ క్యాంపస్ (బాలికలు), జడ్పీహెచ్ఎస్, యాజలి

మిర్చియార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కుర్రా అప్పారావు వెల్లడించారు. ఉదయం 12.06 గంటలకు మిర్చియార్డులో పదవీ బాధ్యతలు స్వీకరిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ర్యాలీ, ప్రమాణ స్వీకారసభ జరుగుతాయన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రింగ్‌రోడ్డులోని సాయిబాబా రోడ్డు జంక్షన్‌లో తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడ నుంచి కొరిటెపాడు, లక్ష్మీపురం మదర్‌థెరెసా విగ్రహం వైపు నుంచి ప్రధాన రహదారిలోకి చేరుకుని ఎన్టీఆర్ స్టేడియం మీదుగా చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సభకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారన్నారు. తనతో పాటు వైస్‌ఛైర్మన్ బిట్రగుంట మల్లిక, డైరెక్టర్లు అందరితో వారు ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అప్పారావు కోరారు.

సూర్యలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజును సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బాపట్ల జిల్లాలోని సూర్యలంక తీరం అత్యంత అనుకూలమని గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు అన్నారు. బాపట్ల తీరాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గోవాలో పర్యాటక నమూనాలు, బీచ్ నిర్వహణ విధానాలు అధ్యయనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం నాలుగు రోజుల గోవా పర్యటనకు వెళ్లింది. లోక్ భవన్‌లో గవర్నర్ అశోక్‌గజపతిరాజును కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని తీర ప్రాంతంలో పర్యాటక ప్రగతికి రూపొందించిన ప్రణాళికలను కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు బాపట్ల జిల్లా తీర ప్రాంతంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. పర్యాటకుల భద్రత, బీచ్‌లలో పరిశుభ్రత, కాలుష్య రహిత పరిసరాలు, పచ్చదనం, మౌలిక వసతులపై అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ దీర్ఘకాలిక సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి అమలుచేయాలని సూచించారు. పర్యాటకాభివృద్ధి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు బాపట్ల కలెక్టర్ నేతృత్వంలోని అధికారుల బృందానికి గోవా పర్యాటక శాఖ అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట బాపట్ల పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు గోపీకృష్ణ, ఎంపీడీవో రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి ఆర్.ఆర్, పర్యాటక శాఖ ప్రాజెక్టు మేనేజరు శివ శరత్, సతీశ్ ఉన్నారు.

బీచ్‌లు సందర్శించిన అధికారుల బృందం

గోవాలో బాగా, కలంగూట్ బీచ్‌లను కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలోని జిల్లా అధికారుల బృందం గురువారం సందర్శించింది. ఆక్కడి బీచ్ షాక్ నిర్వాహకులు, పర్యాటక శాఖ అధికారులతో సమావేశమై షాక్ కేటాయింపు విధానం, నిర్వహణ పద్ధతులు, సీజనల్ కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పర్యాటక పోలీసు వ్యవస్థ, బీచ్‌లో పర్యాటకుల రక్షణకు భద్రతా చర్యలు, సురక్షిత వాతావరణం కల్పించడానికి తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులతో కలెక్టర్ చర్చించారు.

గ్రానైట్ పరిశ్రమకు నాణ్యమైన విద్యుత్తు

గ్రానైట్ యజమానులతో మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు, డీఈ సురేంద్రబాబు

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రానైట్ పరిశ్రమలు నెల కొల్పి వేలాది మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న పారిశ్రామికుల సౌలభ్యాన్ని కాంక్షించిన ప్రభుత్వం నిరంతరం నాణ్యమైన, అంతరాయంలేని విద్యుత్తు సరఫరాకు భారీగా నిధులు వెచ్చించిందని, ఆధునికీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఆ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు (అద్దంకి) తెలిపారు. మార్టూరు గ్రానైట్ యజమానుల సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం విద్యుత్తు వినియోగదారులు, గ్రానైట్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని మార్టూరు, జొన్నతాళి, నాగరాజుపల్లి, రాజుపాలెం ప్రాంతాల్లో వందలాది గ్రానైట్ పలకల ఉత్పత్తి పరిశ్రమలు ఉన్నాయన్నారు. పరిశ్రమలో కరెంటు సరఫరాలో నెలకొన్న ఓల్టేజి హెచ్చు తగ్గులు, అంతరాయం ఇబ్బందులు గుర్తించిన రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆధునికీకరణ పనుల కోసం సీఎం చంద్రబాబు రూ.5.32 కోట్ల నిధులు విడుదల చేసేలా చర్యలు చేపట్టారని ఈఈ మస్తాన్‌రావు వెల్లడించారు. వీటితో ఉపకేంద్రాల్లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, నూతన స్తంభాలు, తీగ (కండక్టర్) మార్చుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా యద్దనపూడి మండలానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. గ్రానైట్ పరిశ్రమలకు ఫీడర్లను చిన్నవిగా విభజిస్తున్నామన్నారు. మొత్తం పనులు రెండు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. పాత స్తంభాలు, తీగలను మార్చివేసి ఆధునికీకరణ చేపట్టినట్లు వెల్లడించారు. మార్టూరు డీఈ సురేంద్రబాబు, ఏఈ ఆంజనేయులు, జూనియర్ ఇంజినీర్ దండా హనుమంతరావు, గ్రానైట్ యజమానులు పత్తిపాటి సురేశ్, సుబ్బరామయ్య, శ్రీనివాసరావు, హర్ష పాల్గొన్నారు.

మొక్కజొన్న మొక్కకు అధిక కండెలతో కర్షకుల వేదన

తాను సాగు చేస్తున్న మొక్కజొన్న తోట వద్ద విత్తనాలు వాడిన కంపెనీ కవరు ప్రదర్శిస్తున్న రైతు కృష్ణమూర్తి

మొక్కజొన్న మొక్కకు ఒకటి కన్నా ఎక్కువ వేసిన కండెలు

బొల్లాపల్లి, ద్రోణాదుల, వలపర్ల (మార్టూరు), న్యూస్‌టుడే: ఆరు గాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో మొక్కకు నాలుగేసి కండెలు వేయడంతో రైతులు డీలా పడిపోయారు. మార్టూరు మండలంలో ఈ ఏడాది విస్తారంగా మొక్కజొన్న సాగుచేశారు. సాగర్ పరివాహకంలో మాగాణి సాగు చేపట్టే భూముల్లోనూ బొల్లాపల్లి, ద్రోణాదుల, వలపర్ల, కోలలపూడి తదితర ప్రాంతాల్లో ఓ కంపెనీ మొక్కజొన్న విత్తనాన్ని ఎనిమిది వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. అధిక దిగుబడులు సాధించే రకమని ఆ కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పడంతో విస్తారంగా వేశారు. కానీ ఆ రకం మొక్కజొన్న మొక్కకు ఒక కండెకు బదులుగా నాలుగు నుంచి అయిదు కండెలు రావడంతో నాటిన విత్తనాలు నాణ్యమైనవి కావని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కౌలు, వ్యవసాయం, ఎరువు, పురుగు మందులకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు పొలంలో 65 శాతం మొక్కలకు అధిక కండెలు రావడంతో బెంబేలెత్తుతున్నారు. పూర్తిగా నష్టపోయామని బొల్లాపల్లికి చెందిన రైతు వీరవల్లి కృష్ణమూర్తి, రైతు సంఘం నేతలతో కలిసి ఏడీఏ సుదర్శనరాజుకు వినతిపత్రం ఇచ్చారు. తమను ఆదుకోవాలని కోరారు.

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్.గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు ఛైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరెడ్డి రోహిత్ చరణ్‌రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ.44,999 నుంచి ప్రారంభం అవుతోందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కి డైమండ్స్‌పై తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తో పాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకు రుణం తీరుస్తానని టోకరా

బాపట్ల: బ్యాంకు ప్రతినిధినంటూ నమ్మబలికి రుణ బకాయిలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తానని నమ్మించి బాపట్లకు చెందిన వ్యక్తి నుంచి రూ.15.50 లక్షల నగదు తీసుకుని ఘరానా మోసం చేసిన ఘటన ఇది. పట్టణంలో శృంగారపురానికి చెందిన ఎం.శ్రీనివాసరావు ఓ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. విజయవాడ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తన ఇంటిని తనఖా పెట్టి రూ.12 లక్షల రుణాన్ని 2014లో తీసుకున్నాడు. అసలు, వడ్డీ కలిపి రూ.22 లక్షలు దాటింది. సుబ్బారావు అనే వ్యక్తి తాను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధిని అంటూ చెప్పి అతడికి ఫోన్ చేసి రుణాన్ని వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తానని నమ్మించాడు. రూ.22 లక్షలకు బదులు రూ.15.50 లక్షలు ఒకేసారి చెల్లిస్తే మాఫీ అవుతుందని, తాకట్టు నుంచి నీ ఇంటిని విడిపిస్తానని చెప్పాడు. సుబ్బారావు చెప్పిన మాటలు నమ్మి సుబ్బారావు అనే వ్యక్తి చెప్పిన బ్యాంకు ఖాతాలో రూ.15.50 లక్షల నగదు డిపాజిట్ చేశాడు. రుణం తీరిందని భావించి బ్యాంకుకు వెళ్లి తన ఇంటి పత్రాలు ఇవ్వమని అడగగా సుబ్బారావు బ్యాంకు ప్రతినిధి కాదని, మోసానికి పాల్పడినట్లు తెలిసి శ్రీనివాసరావు లబోదిబోమంటూ బాపట్ల పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాంబాబు తెలిపారు.

28లోపు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోండి

తుమ్మలపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), చెరుకుపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో రబీలో సాగు చేస్తున్న రైతులు తప్పకుండా రైతు విశిష్ట సంఖ్య కోసం ఈనెల 28 లోపు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల కోరారు. సూపర్ చెక్‌లో భాగంగా గురువారం చెరుకుపల్లి మండలంలో ఆమె పర్యటించారు. తుమ్మలపాలెంలో పచ్చి మిర్చి, కావూరులో అపరాలు, ఆరుంబాక వద్ద వేరుసెనగ, గూడవల్లిలో మొక్కజొన్న పంటలు పరిశీలించారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో తనిఖీ చేశారు.

రాతప్రతుల పరిరక్షణలో సనాతన జీవన్ ట్రస్ట్

మాట్లాడుతున్న డాక్టర్ శశిధర్

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న పురాతన రాతప్రతులను సంరక్షించేందుకు 20 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోగా వాటిలో సనాతన జీవన్ ట్రస్ట్ ఉందని వ్యవస్థాపకుడు, అనువంశిక వైద్యుడు శశిధర్ తెలిపారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొత్తపేటలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పురాతన రాతప్రతుల సంరక్షణ కోసం 'జ్ఞాన భారతం' అనే మిషన్‌ని ప్రారంభించారని, ఈ బృహత్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై సహకరించాలని కోరారు. మీ వద్ద ఉన్న వాటిని శుభ్రపరిచి, డిజిటల్ రూపంలో 'జ్ఞాన భారతం' మిషన్‌లో భద్రపరిచి, భావితరాలకు అందించేందుకు ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలా శుభ్రపరిచిన వాటిని తిరిగి తీసుకునే అవకాశం ఉందన్నారు. పురాతన తాళపత్ర గ్రంథాలను కాపాడేందుకు ట్రస్ట్ తరపున అయిదేళ్ల క్రితమే శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. వీటిని స్కాన్ చేయడానికి జర్మనీ నుంచి అత్యాధునిక ఈ హై-ఎండ్ స్కానర్ తీసుకొచ్చి తొలుత వేటపాలెంలోని సారస్వతనికేతన్ గ్రంథాలయం, ఆ తరువాత తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంతో కలిసి మాన్యుస్క్రిప్ట్స్ శుభ్రపరిచి డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 8 లక్షలకు పైగా తాళపత్ర గ్రంథాలు, రెండు లక్షల కాగితపు ప్రతుల పేజీలను పరిరక్షించినట్లు చెప్పారు. వీటిని ఎన్ఎంఎం (నేషనల్ మిషన్ ఆఫ్ మాన్యుస్క్రిప్ట్స్) డైరెక్టర్, ఆచార్యులు అనిర్బన్‌దాస్, భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన డి.వై.చంద్రచూడ్ స్వయంగా పరిశీలించారని తెలిపారు. త్వరలో వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ట్రస్ట్ కార్యాలయం వద్ద సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు శశిధర్ వివరించారు.

క్షయ రహిత జిల్లాగా బాపట్ల

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు, వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల, న్యూస్‌టుడే: క్షయ, కుష్ఠు వ్యాధుల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైద్యాధికారులు పని చేయాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. టీబీ, కుష్ఠు వ్యాధుల నిర్మూలనపై ఎన్జీవో హోమ్‌లో వైద్యాధికారులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులతో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శిక్షణ తరగతులను డీఎంహెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. రోగులకు మెరుగైన చికిత్స అందించడం ద్వారా వ్యాధులు నివారించాలన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి పరీక్షలు చేయించుకోవటంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి ధీరజ్, పీఎం సతీష్, ప్రాంతీయ వైద్యాధికారి శోభారాణి, డీఐవో రత్న మన్మోహన్, అదనపు డీఎంహెచ్‌వో సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోవాడ శైవక్షేత్రం ఆదాయం రూ.54 లక్షలు

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి అయిదు రోజుల ఉత్సవాలు పూర్తికావడంతో గురువారం హుండీ లెక్కింపు చేశారు. భక్తులు కానుకల రూపం హుండీల్లో వేసిన మొత్తం రూ.16,33,235 సమకూరింది. అభిషేకం, దర్శన టిక్కెట్లు, ఖాళీ స్థలం వేలం పాట, కొబ్బరికాయల అమ్మకం, కొబ్బరి చిప్పల సేకరణ వెరసి రూ.54,04,785 ఆదాయం వచ్చినట్లు ఈవో విఠల్ శ్రీనివాసవర్మ చెప్పారు. పండగ ప్రత్యేక అధికారిణి అనుపమ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ పావులూరి రమేష్, సర్పంచి మండవ విజయలక్ష్మి, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, ఎంపీడీవో శేషమాంబ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా పోటీలకు వేళాయె

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) అంతర్ కళాశాలల సెపక్ తక్రా (పురుషుల) పోటీలకు పట్టణంలోని విద్యాకేంద్రం డిగ్రీ కళాశాల ఆతిథ్యమిస్తోంది. శుక్ర, శనివారాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎనిమిది జట్లు పోటీలో పాల్గొననున్నాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులతో ఏఎన్‌యూ సెపక్ తక్రా జట్టును ఇక్కడే ఎంపిక చేయనున్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. **కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

ఆటో ఢీకొని రెండేళ్ల బాలిక దుర్మరణం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని దండుబాట సమీపంలో ఉన్న కొత్తపాలేనికి చెందిన కొమరగిరి సాయిదుర్గ(2) గురువారం సాయంత్రం ఆటో ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి ఏరియా వైద్యశాలకు వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు.

గంజాయి విక్రయం కేసులో రూ.10 వేల జరిమానా

ఇంకొల్లు, న్యూస్‌టుడే: గంజాయి విక్రయించిన కేసులో నిందితుడికి పర్చూరు కోర్టు జరిమానా విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. 2021లో తిరుపతి నాగేశ్వరరావు గంజాయి విక్రయిస్తూ ఇంకొల్లు పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదుచేసి పర్చూరు కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై గురువారం ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడికి రూ.10 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూటర్ లక్ష్మీరాణి, ఎస్సై సురేష్‌లను అభినందించారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166
బంగారం బ్యాంకులో/ ఏ ఇతర ప్రైవేట్ సంస్థలో తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUSINESS OFFER
Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

BUILDING CONSTRUCTION
తాడేపల్లిలో ఒక అపార్ట్‌మెంట్ భవనములోని పెయింటింగ్ ... 92477 27555.

PERSONAL CLASSIFIEDS
MISSING
తేది 12-02-2026 నుండి కనబడుటలేదు
పేరు: అమరా వెంకటరత్నం గారు, పొన్నూరు, గుంటూరు జిల్లా
వయస్సు: 81 సం॥
రంగు: చామన ఛాయ
ఎత్తు: 5.11 అంగుళాలు
దుస్తులు: చొక్కా, లుంగీ
ఆచూకీ తెలిసినవారు క్రింది నెంబరుకు తెలుపగలరు
కుమారుడు అమరా నారాయణరావు సెల్: 95533 32166

PROFESSIONAL SERVICES
ASTROLOGY
తమిళనాడు వైద్యశ్వరన్ కోయిల్ ... ప్రశ్నాశాస్త్రం. 8978215913.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
మార్కాపురం (కుంట) దగ్గరలో 133 గజాలు ... 9398621767.

JOBS
WANTED Experienced Accountant in a Company at Auto Nagar, Guntur. Salary Package follows Experience. Ph.90631 83834.
SARIPUDI Suzuki, Guntur - Hiring Managers, Cashier, CRM, CREs and Service Advisors. Both Freshers and experienced Candidates can apply. Attractive Salary + Incentives. Interview on 23-02-2026. ✆ 7799960199, 149.
విజయవాడ సిటీ, తాడేపల్లి ప్రాంతంలో పనిచేయుటకు ... 35,000/-, PF & ESI. ✆ 79933 22229.
ఆఫీసు మేనేజర్ కావలెను ... kamathamjob@gmail.com ...
గుంటూరు ఒక్కటేషన్ ... Male/Female ... ✆ 63022 43437.
ప్రముఖ దంత వైద్యశాల ... 78420 31133.
ప్రముఖ విద్యాసంస్థలో ... 87126 18882. గుంటూరు.
గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు Senior Civil Engineers ... 60000/- ... 89784 80429.
గుంటూరు మాస్టర్ మైండ్స్ ... 92487 33340.
గుంటూరు పరిధిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో ... 10th/Inter ... Ph.93944 47117, 92477 45046.
MNY హోలిడే & ప్రాపర్టీస్ ... 0863-4616071.
ASHOK Leyland Dost Auto ... జీతం:18500/-.
గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ ... 15000/- ... ఫోన్: 89784 80429.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవాలని మా పాఠకులకు సూచన చేస్తున్నాం. ప్రకటనదారులు చెబుతున్న దానిపై మరియు వారి సేవల నాణ్యత మీద ఈనాడుకు ఎటువంటి బాధ్యత లేదు. ప్రకటనదారుల సరుకుల నాణ్యతకు సంబంధించి పాఠకులతో జరిగే లావాదేవీలకు ఈనాడు బాధ్యత వహించదు. ... యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? రేపల్లె మండలం పేటేరు అంబేడ్కర్ నగర్‌లో రెండు చేతి పంపులు పని చేయడంలేదు. **-కోటేశ్వరరావు, స్థానికుడు**

✔ వెంటనే చేతిపంపులను బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-బొర్రా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

? పమిడిమర్రులో వీధి దీపాలు పగలు రాత్రి వెలుగుతున్నాయి. పగలు వెలగడం వల్ల విలువైన విద్యుత్తు వృథా అవుతోంది. **- చిలకా సురేష్, పమిడిమర్రు**

✔ పగలు వెలుగుతున్న దీపాలను గుర్తించి వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **-విజయశ్రీ, కార్యదర్శి, పమిడిమర్రు**

- న్యూస్‌టుడే, నగరం

? అద్దేపల్లి మసీదు వెనుక మద్దులవారి వీధిలో మురుగు స్తంభించి దుర్వాసన వెదజల్లుతోంది. **- రెహమాన్, అద్దేపల్లి**

✔ పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి వెంటనే ఆ ప్రాంతంలో మురుగు పూడిక తీయించి శుభ్రం చేయిస్తాం.

- నాయక్, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు –న్యూస్‌టుడే, పెదపులివర్రు (భట్టిప్రోలు)

వీధి దీపాలు ఏర్పాటు

స్పందనకు వందనం: రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం బేతపూడి పంచాయతీ తురకపాలెంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనెల 19న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఉయ్యూరు నాగేశ్వరరావు గురువారం కార్మికులను పంపి 8 స్తంభాలకు వీధిదీపాలు ఏర్పాటు చేయించారు.

పది విద్యార్థులకు ఈ నెలే కీలకం

మంతెనవారిపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల రోజులు కీలకమని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో శివబాబు అన్నారు. గురువారం మంతెనవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల 100 రోజుల ప్రణాళికను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రాజారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి మంజూరు పత్రం అందజేత

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని అక్కివారిపాలేనికి చెందిన బేతాళ శేఖర్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. ఈ మేరకు వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా, రూ.2,45,348 మంజూరయ్యాయి. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం తన క్యాంపు కార్యాలయంలో మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని రైతులంతా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్'ను తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సత్యానంద్ పేర్కొన్నారు. దీనివల్ల వ్యవసాయానికి సంబంధించిన పథకాలు వర్తిస్తాయని అన్నారు. ఫార్మర్ ఐడీ ద్వారా రైతులు వేసిన పంటలు అమ్ముకోవచ్చని ఆయన తెలిపారు.

డొంక రోడ్డు నిర్మాణానికి వినతి

బాపట్ల: వేమూరు మండలం చావలి- పెరవలి గ్రామాల మధ్య డొంక మార్గంలో మెటల్ రోడ్డు నిర్మించాలని డ్వామా పీడీని విశ్రాంత అధికారి సోమశేఖర్ వెంకు సుబ్బారావు కోరారు. ఈ మేరకు డ్వామా పీడీ విజయలక్ష్మికి ఆయన గురువారం లేఖ రాశారు. చావలి డొంక రోడ్డును ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించాలని కలెక్టర్, అధికారులను గత నవంబరు 5న కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు లేవని, 2026-2027 ఉపాధి పనుల జాబితాలో కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. రహదారి నిర్మాణం జరిగితే రైతులు, కూలీలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఇటీవల కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా మార్గంలో చిలకలూరిపేట మండలంలో పొలాల మధ్య వేసిన గ్రానైట్ రోడ్డు గట్టును కనిపించాయన్నారు. వీటిని తరలించి చావలిలో డొంక రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

పశుగ్రాస పథకం.. పాడి రైతుకు వరం

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత నిస్తోంది. పశుగ్రాసం పెంచేందుకు పాడి రైతులకు రాయితీలు అందజేస్తూ మరింత ప్రోత్సహిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచే రైతులకు వంద శాతం రాయితీ ప్రకటించింది. దున్నడం, గ్రాసం, విత్తనాలు, ఎరువులకు అవసరమైన నిధులు ఇవ్వడంతో పాటు పశు సంవర్థకశాఖ రైతులకు అవగాహన కల్పిస్తూ గడ్డి సాగు వైపు దృష్టి సారించేలా చర్యలు చేపట్టింది.

❖ అర్హతలు..

ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఎకరం వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంది. జాబ్ కార్డు కలిగిన పాడి రైతులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులు. మండలంలోని పశువైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తు చేయాలి. అధికారుల పరిశీలించి నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారు. అనుమతి లభించిన వారు అధికారుల పర్యవేక్షణలో పశుగ్రాసం పెంచాల్సి ఉంటుంది.

ఖాజీపాలెంలో పెంచుతున్న పశుగ్రాసం

ఉపాధి హామీతో వంద శాతం రాయితీ

విస్తీర్ణం	సామగ్రి ధర (రూ.ల్లో)	వేతనం (రూ.ల్లో)
50సెంట్లు	23,000	23,000
ఎకరా	31,314	35,684

ఎంతో ఉపయోగకరం..

పాడి పశువులకు తగిన పౌష్టికాహారం సులభంగా లభిస్తుంది. పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుంది. సాగు చేసిన రైతులకు ఒక వ్యవసాయ, విత్తన, ఎరువుల ఖర్చులను ప్రభుత్వం పూర్తి రాయితీ ఇస్తోంది. నీటి వసతి కలిగిన రైతులకు అవకాశం కల్పిస్తాం. పాడి పోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- వజ్ర లక్ష్మీ, పశువైద్యాధికారిణి, ఖాజీపాలెం**

తాగునీటి సమస్య ఉత్పన్నం కానివ్వం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని తెదేపా నేత అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం మోర్తోటలో గురువారం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.2.24 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్, ఇంటింటికీ కొళాయి కనెక్షన్, పోటుమెరక, వైటపాలెం, బందిలాయేమేటు, తుమ్మల, కట్టపాలెం పైపులైన్, కొళాయి కనెక్షన్లు, ఎంపీ ల్యాడ్స్ రూ.12 లక్షలతో విశ్వేశ్వరం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాధ్యమైనంత తొందరగా అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పంతాని రామ్‌కుమార్ తెలిపారు. *రేపల్లె ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలో రూ. 13 లక్షలతో నిర్మిస్తున్న ఆవరణ డయాటిక్ భవన నిర్మాణ పనులకు తెదేపా నేత అనగాని శివప్రసాద్ శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

పొంచి ఉన్న ప్రమాదం

మందూరు నుంచి చినగాదెలవర్రు వెళ్లే మార్గంలో బీసీ కాలనీ వద్ద కల్వర్టు అప్రోచ్ అంచు కోతకు గురైంది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పరిస్థితిని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మరియదాసు మాట్లాడుతూ పరిశీలించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, మందూరు (చుండూరు)

తూటుకాడ తొలగించరూ..

దట్టంగా పెరిగిన ఆకుతోటలా కన్పిస్తున్న ఇది రేపల్లె ప్రధాన మురుగు కాలువ. కొమరోలు నుంచి పాలరేవు వరకు తూటుకాడతో అల్లుకుపోయి చుక్కనీరు ముందుకు కదిలే పరిస్థితి కన్పించటం లేదు. తూటికాడ తొలగింపు ఇబ్బందులు లేకుండా చేయాలని రైతులు కోరుతున్నారు. త్వరలో సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని డ్రైనేజీ అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, నిజాంపట్నం**

మూడు కార్యాలయాలకు ఒకే భవనం

పిట్టలవానిపాలెం పంచాయతీ కార్యాలయ భవనంలో పంచాయతీ, సచివాలయం, రెవెన్యూ శాఖ అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు నాలుగేళ్ల నుంచి మూడు శాఖల అధికారులు ఈ ఇరుకు భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయ భవనం పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయి. గుత్తేదారుడికి బిల్లులు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై ఎంఈడీవో శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిని అధికారులకు తెలియజేశామని తెలిపారు. **-న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

అదుపు తప్పితే గల్లంతే

మండల పరిధిలోని నరసాయపాలెం- చెరుకూరు ఆర్అండ్‌బీ మార్గంలో కొమ్మమూరు కాలువపై నిర్మించిన లాకుల వంతెన శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు విరిగి పడిపోతున్నాయి. వంతెనపై రోజూ ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి కాలువ నీటిలో పడిపోతే వాహనదారుల, ప్రయాణికుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. నూతన లాకుల వంతెన నిర్మించే వరకు రక్షణ గోడలకు కనీస మరమ్మతులు చేయాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, బాపట్ల**

అసంపూర్తి పనులు.. ప్రజలకు అవస్థలు



కొలకానివారిపాలెంలో సుమారు రూ.40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించి రెండుసార్లు బిల్లులు చేశారు. మిగిలిన పనులు పూర్తికాలేదు. అంతేకాకుండా దాని పక్కనే రూ.40 లక్షలతో రైతు సేవా కేంద్రానికి పునాదులు వేశారు. సకాలంలో బిల్లులు మంజూరుకాక గుత్తేదారుడు పనులు నిలిపేశారు. దాతలిచ్చిన విలువైన స్థలంలో తలపెట్టిన నిర్మాణాలను ఇలా వదిలేయడం ఏమిటని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. కూటమి నాయకులు స్పందించి పనులు పూర్తిచేసి సచివాలయ సేవలు అందించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నగరం**

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ) : ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన వెళ్తున్న మహిళను ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గూడవల్లికి చెందిన నాగలక్ష్మి నడింపల్లిలో పని చూసుకుని ఇంటికి రోడ్డు పక్కనే నడుచుకుంటూ వెళుతుండగా చెరుకుపల్లి నుంచి దోనేపూడికి వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి కుడి పక్క వెళ్లిపోయింది. నడిచి వెళుతున్న ఆమెను ఢీకొట్టి పక్కనే ఉన్న పాత భవనంలోకి దూసుకుపోయింది. ఘటనలో నాగలక్ష్మి తలకు తీవ్ర గాయం కావడంతో ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం తొలుత గుళ్లపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. స్వల్ప గాయాలతో ఆటో చోదకుడు, అతని భార్య బయటపడగా వారిని 108 సాయంతో రేపల్లె ఏరియా వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. చెరుకుపల్లి పోలీసులు ఘటన వివరాలు నమోదు చేశారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పులిమి మీనా D/o పులిమి కోటేశ్వరరావు (లేటు) W/o కె.వి సందీప్, డోర్.నెం.13-30 కసగాల గ్రామం చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా ఇది ద్వారా తెలియజేయుచున్నాను. నా పేరు మీద బాపట్ల పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, బాపట్ల (ఎస్.ఆర్.ఓ కోడ్: 720)లో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ నెం: 1332/2021 గల ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్. సర్వేనెం. 386/3లో ఉన్న ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రం బాపట్ల టౌన్‌లో పోగొట్టుకున్నాను. పై పేర్కొన్న పత్రం ఎవరికైనా దొరికినచోగాని, ఆస్తిపై ఎటువంటి హక్కు, అభ్యంతరం లేదా ఆసక్తి ఉన్నచో గాని, ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 15 రోజులలోపు క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరు. లేని పక్షంలో సంబంధిత అధికారుల నుండి సర్టిఫైడ్ కాపీ పొందుటకు నేను చర్యలు తీసుకుంటాను.

పులిమి మీనా, 9951240270

విద్యార్థులు నూతన ఆలోచనలతో ఉండాలి

చర్చల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచి నూతన ఆలోచనలతో ఉండాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి.లక్ష్మి అన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పబ్లిక్ స్కూల్‌లో గురువారం నూతన ఆవిష్కరణలు, వ్యాపార ఆరంభం అనే అంశంపై అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణాత్మక దృక్పథం, వ్యాపారారంభ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో చర్చలు, ప్రత్యక్ష ఉదాహరణల ద్వారా అవగాహన కల్పించారు.

నూరుశాతం పన్ను వసూలు చేసిన కార్యదర్శులకు సత్కారం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఈతేరు, చుందూరుపల్లి, జిల్లెళ్లమూడి గ్రామాల కార్యదర్శులు షణ్ముఖరావు, నాగమల్లేశ్వరరావు, గాయత్రి నూరు శాతం పన్ను వసూలు చేయించారు. గురువారం ఎంపీడీవో బాబురావు స్థానిక కార్యాలయంలో వారిని సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ వీరి ముగ్గురిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన 25 గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రణాళికబద్ధంగా పని చేసి నూరు శాతం పన్ను వసూలు చేయాలన్నారు. ఈతేరులో రూ.1,51,000, జిల్లెళ్లమూడిలో రూ.3,79,000, చుందూరుపల్లిలో రూ.1,32,000 వసూలు చేసినట్లు ఆయన తెలిపారు.

కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీడీవో బాబురావు

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత

పూర్వ విద్యార్థులు నిర్మించిన కళావేదిక

ఉల్లిపాలెం(నగరం), న్యూస్‌టుడే: చదువు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఉల్లిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి రూ.4లక్షలతో కళావేదిక, ఉపాధ్యాయుల విశ్రాంతి భవనం నిర్మించారు. అంతేకాకుండా పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన బాలబాలికలకు ప్రతి సంవత్సరం నగదు బహుమతులు అందిస్తున్నారు. గ్రామస్థుడు మోదుకూరి రవింద్రబాబు సుమారు రూ.6 లక్షలతో విద్యార్థులు భోజనం చేసేందుకు భోజనశాల నిర్మించారు. పాఠశాలలో పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పాఠశాలకు ప్రధాన ముఖద్వారాన్ని నిర్మించారు. మరి కొందరు ఉపాధ్యాయులు టెంట్‌ను సమకూర్చారు. ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో నడుస్తున్న పాఠశాలలో నేడు 500లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

మినుములో పల్లాకు తెగులు.. కర్షకుల్లో గుబులు

చుండూరులో తెగులు సోకిన పైరు

వేమూరు, న్యూస్‌టుడే: మినుములో పల్లాకు తెగులు ప్రభావం రైతులను కలవరపెడుతోంది. ఈ ఏడాది పొగమంచు ఎక్కువగా ఉండడం వల్ల దీని ప్రభావం కాస్త ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం పైరు 70 నుంచి 50రోజుల దశలో ఉందని, ఈ దశలో తెగులు సోకడం వల్ల, దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు అందించిన వివరాల ప్రకారం నియోజకవర్గంలో 94వేల ఎకరాల సాగు భూమి ఉండగా, రబీలో 25వేల ఎకరాల్లో మినుము, పెసర సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పైరు పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో పైరుపై తెల్లదోమ ప్రభావం కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి భరత్‌ను వివరణ కోరగా తెల్లదోమ కారణంగా పల్లాకు తెగులు వస్తుందని, నివారణకు ఎకరాకు ఫిప్రోనిల్ 300 ఎంఎల్, లేదా ఎస్పేట్ 300గ్రాముల మందును తగిన నీటితో కలిపి పైరుపై పిచికారీ చేయాలని తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ రేపల్లె, బాపట్ల Division area లోని ఇసుకపల్లి కాపురస్తులు Shaik Jainullabdin కుమారుడు Shaik Saddam Sharif గారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయడం ఏమనగా..

నా క్లయింట్ Scheduleలో ఉదహరించిన స్థిరాస్తిని క్రయము జేయుటకు బాపట్ల division రేపల్లె కాపురస్తులు యార్లగడ్డ Venkata Krishnaiah Chowdary గారి కుమారుడు యార్లగడ్డ Satya Narayana సుఖవాసి శాంతిశేఖర్ గారి భార్య సుఖవాసి నాగశ్రీ మరియు దేవినేని శివరాంప్రసాద్ గారి కుమారుడు దేవినేని దుర్గకోటి సురేష్ మరియు రేపల్లె వాస్తవ్యులు రాధాకృష్ణగారి కుమారులు కోటపాటి వెంకటేశ్వరరావు నుండి క్రయము చేయుటకు నిర్ణయించుకొని వారలకు బయానాగా కొంత బయానా ఇచ్చి వారల చేత ఒక విక్రయ ఖరారు అగ్రిమెంట్ రాసుకొని ఉన్నారు అని, నా క్లయింట్ యొక్క పై చెప్పబడిన విక్రయదారులు దిగువ షెడ్యూల్లో చూపించిన ఖాళీ నివేశన స్థలమును ది. 2-07-2014న గుంటూరు జిల్లా తెనాలి సబ్-డివిజన్ యిలాక రేపల్లె వాస్తవ్యులు అయిన late సజ్జా వెంకటప్పయ్య గారి కుమారుడు సజ్జా సత్యనారాయణ వరప్రసాద్ గారి నుండి షెడ్యూల్‌లో చూపించిన ఖాళీ నివేశన స్థలము మరియు మేడతో సహా క్రయము చేసి చెరుకుపల్లి Joint-Sub-Registrar కార్యాలయం నుండి విక్రయ దస్తావేజు 853/2014 రిజిష్టి చేయించుకొని తదాది నుండి వారి హక్కుభుక్తములలో ఉన్నదని తెలియజేసి ఉన్నారు.

గతములో దిగువ షెడ్యూలు ఆస్తి అందలి R.C.C. Building గుంటూరు జిల్లా రేపల్లె వాస్తవ్యులు యార్లగడ్డ వెంకటకృష్ణయ్య చౌదరి గారి కుమారుడు సత్యనారాయణ గారిది అని వారి జీవితకాలంలో దిగువ షెడ్యూల్‌లో చూపించిన ఖాళీ స్థలమును ది. 31-5-1958న రేపల్లె వాస్తవ్యులు పుట్టగుంట బుచ్చయ్యగారి వలన క్రయము చేసి వారి నుండి విక్రయ దస్తావేజు 1728/1958గా రేపల్లె Sub-registrar వారి కార్యాలయములో రిజిష్టి చేయించుకొని RCC డాబా నిర్మాణం చేసుకొని వున్నారని ఆ విధముగా యార్లగడ్డ సత్యనారాయణ గారు, రేపల్లె కాపురస్తులు సజ్జా వెంకటప్పయ్య గారి కుమారుడు సజ్జా వెంకటప్రసాద్ గారికి ది. 18-11-2004 విక్రయించి రేపల్లె సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయములో దస్తావేజు 2936/2004 వ్రాయించి ఇచ్చినారని వారలు తిరిగి వారి హక్కు భుక్తములో వుండగా పై విధముగా నాక్లయింట్ యొక్క విక్రయదారులకు విక్రయించినారు అని, ఆ విధమైన ఆస్తి నా క్లయింట్ యొక్క విక్రయదారులు అందలి కట్టడము తొలగించి నా క్లయింట్ విక్రయిస్తున్నారు అని ఆవిధముగా దిగువ షెడ్యూలు సంబంధించిన యార్లగడ్డ సత్యనారాయణ పేరు మీద వున్న 31-05-1958 రిజిస్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజు 1728/1958 వారి దగ్గర గైర్హాజరు అయినది అని అందువలన నా క్లయింటుకు రిజిష్టి కాలమునందు ఇవ్వలేము అని షెడ్యూలు ఆస్తి మీద ఎటువంటి వ్యవహారములు చేసి వుండలేదు అని నా క్లయింటుకు తెలియజేసివున్నారు. ఆ విధమైన ఆస్తిని నా క్లయింట్ దిగుబాటు ప్రతిఫలము చెల్లించి క్రమమైన దస్తావేజు వ్రాయించుకొనుటలో ఎవరికైనా ఏదైనా ఆక్షేపణలు వున్న ఎడల ఈ నోటీసు వెలువడిన 7 - దినములు లోపల ఈ క్రింది అడ్రస్‌కు తిరుగు రశీదుతో తెలియజేయవలెను. అటు పిమ్మట వచ్చు ఆక్షేపణలు నా క్లయింటును బైండు చేయజాలవు ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

షెడ్యూలు:

బాపట్ల డి. రేపల్లె సబ్ డి. యిలాకా రేపల్లె మున్సిపల్ 9వ వార్డు, 35వ బ్లాక్‌లో ఏరియాలో చేరినటువంటి ఆస్తిలోని పై విధముగా మాకు సంక్రమించి ఆ తదాది మా సంపూర్ణ స్వాధీనానుభవములతో గల యిసుకపల్లి గ్రామ D.No. 73/6రు AC. 3.34 Cents రేపల్లె Municipal Door No. 9-35-90/2 రు గల ఆస్తికి హద్దులు:

East: Boundary Municipal Road, South / దక్షిణం: యీ ఆస్తిలోని ప్రహరిగోడ వెలుపల కోపనాతి చంద్రమౌళి గారి స్థలం హద్దు, పడమర: యీ ఆస్తిలోని ప్రహరీ గోడ వెలుపల తలశిల రామకృష్ణ గారి స్థలం హద్దు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు హద్దు.

D.S.V. Prasada Rao
SK. Subhashini, Advocates
Flat No: 502, Datta Sai Towers, Alluri Sita Rama Raju Road, Indiranayak Nagar Colony, Azithsingh Nagar, **Vijayawada-15**

'చలో మంగళగిరి' విజయవంతానికి ప్రచారం

ఐలవరం(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న మంగళగిరిలో నిర్వహించే చేనేత గర్జన విజయవంతం చేయాలని కోరుతూ ఐలవరంలో గురువారం చేనేత నాయకులు ప్రచారం చేశారు. కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘం సహాయక కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా కలిసి పోరాడితేనే పరిశ్రమను రక్షించుకోగలుగుతామని పిలుపునిచ్చారు. చేనేత నాయకులు పాల్గొన్నారు.

ప్రచారంలో చేనేత నాయకులు

సిబ్బంది కొరత.. ప్రజలకు వెత

నిజాంపట్నం, న్యూస్‌టుడే: తీరప్రాంతంలో అతి పెద్ద వైద్యశాల నిజాంపట్నం సామాజిక వైద్యశాల. అక్కడ ఓపీ నిత్యం 200 పైనే ఉంటుంది. వైద్యశాలలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఇక్కడ ఎంబీబీఎస్, దంత, పిల్లల వైద్యనిపుణులు లేరు. జిల్లాలోనే ఇది అతిపెద్ద కాన్పులు జరిగే వైద్యశాలగా గుర్తింపు తెచ్చుకుంది. కాన్పులు జరిగిన వెంటనే చిన్నారుల వైద్యులు లేక సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొంది. ఒక స్టాఫ్ నర్సు, ఆరు జీడీ పోస్టులు ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉన్నారు. రెండు డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో వైద్యశాలకు వచ్చేవారికి సరైన వైద్యసేవలు అందడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వైద్యశాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయంపై సామాజిక వైద్యశాలల జిల్లా సమన్వయకర్త శారద మాట్లాడుతూ వైద్యశాలలో ఖాళీల వివరాలను అందించాలని స్థానిక వైద్యులకు సూచించినట్లు తెలిపారు. వారు నివేదిస్తే వాటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

నిజాంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం

చుండూరుపల్లిలో విఫలమై.. చింతలపూడిలో చోరీ చేసి

బాపట్ల, న్యూస్‌టుడే: పొన్నూరు మండలం చింతలపూడిలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ప్రమీలాదేవి ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు చోరీ ఘటనలో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజేష్ దొంగల ముఠా ఒంగోలులో చోరీకి పాల్పడి నగదుతో కారులో సూర్యలంక బీచ్‌కు వచ్చి గడిపింది. సోమవారం అర్ధరాత్రి గుంటూరు వెళ్తూ మార్గమధ్యలో తొలుత బాపట్ల మండలం చుండూరుపల్లిలో మన్నె ప్రసాద్ ఇంట్లో చోరీకి విఫలయత్నం చేశారు. ప్రసాద్ కుమారుడికి శస్త్ర చికిత్స చేయించడానికి కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి పొన్నూరులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న రాజేష్ ముఠా తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించింది. మొదట ఓ బీరువా తాళం పగులగొట్టి తెరిచింది. అందులో కేవలం పట్టుచీరలు మాత్రమే ఉండటంతో బంగారు ఆభరణాలు, నగదు ఉన్న రెండో బీరువా తెరవటానికి ప్రయత్నిస్తుండగా శబ్దం రావటంతో పొరుగింటి వారు నిద్ర లేచి కేకలు వేయటంతో దొంగల ముఠా పరారైంది. అనంతరం చింతలపూడి వెళ్లి పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో చోరీకి పాల్పడింది. చుండూరుపల్లిలో చోరీ యత్నం చేసిన దొంగల ముఠాపై యజమాని ప్రసాద్ ఫిర్యాదు మేరకు బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను విచారించనున్నట్లు తెలిసింది.

బాధిత కుటుంబాలకు చేయూత

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం గుంటూరువారిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిక్కాల సూరిబాబు, రత్నకుమారి కుటుంబాలకు గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, వాటర్ బాటిల్స్ అందజేశారు. వైద్యుడు వసంతం వీరరాఘవయ్య, సిబ్బంది జయచంద్ర, ఆనంద్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పెదపులివర్రు(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: మండలంలోని పెదపులివర్రులో రేపల్లె రోటరీ క్లబ్, ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాల సహకారంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యశాల టెక్నీషియన్లు 175 మంది కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి కళ్లజోళ్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెదేపా నేత మృతికి నివాళి

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: నడింపల్లికి చెందిన తెదేపా నేత గోగినేని శ్రీనివాసరావు (57) గురువారం ఇంటి వద్ద గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. తెదేపా సీనియర్ నేతలు అనగాని శివప్రసాద్, గోగినేని వసుధ, మల్లాది రామకృష్ణ, మొఖమాట రాధాకృష్ణమూర్తి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

రైతులు వెంటనే పంట నమోదు చేయించుకోండి

కొల్లూరు, న్యూస్‌టుడే: పంటలు సాగుచేసిన రైతులు ఈనెల 20 లోపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వాగోలు బుష్ కోరారు. కొల్లూరులో అధికారులతో కలిసి గురువారం పంట నమోదు చేశారు. ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని, మొక్కజొన్న సాగుచేసిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం నుంచి అందుతుందని తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏకేనగర్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాంబాబు గురువారం రాత్రి తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగు పరచాలి

విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు రమేష్‌బాబు, వనజాక్షి

పెదపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు రమేష్‌బాబు, వనజాక్షి పేర్కొన్నారు. వారు గురువారం పెదపూడి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. దస్త్రాలను పరిశీలించారు.

7వ వర్ధంతి



మీరు భౌతికముగా మా నుండి దూరమై 7 వసంతములు గడిచినను... మీ మధురస్మృతులు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

జననం: 01-07-1952 మరణం: 09-03-2019

కీ॥శే॥ తాడికొండ వెంకాయమ్మ గారు
కుచ్చెళ్ళపాడు - వేమూరు (M.D.)

భర్త: రామకృష్ణారావు

కుమారులు - కోడళ్ళు: రవికిషోర్ - శ్రీలక్ష్మీ, శ్రీనివాసరావు - అనీలారాణి, వెంకట మురళీకృష్ణా - సత్యప్రియ

మనుమళ్ళు: దుర్గా వీరవెంకట సాయికుమార్, నిఖిల్, హేమంత్, జిష్ణుసాయి శశాంక్, శ్రీహాన్

కుమార్తె - అల్లుడు: అంకెం నిర్మల - సుధీర్

మనుమరాళ్ళు: నీహారిక, ప్రియాంక

చీరాల

• చీరాల • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ? గృహాల్లోని వ్యర్థాలను రహదారుల పక్కన పడేస్తున్నారు. వీటిలో ఆహార పదార్థాలు ఉండటంతో వాటికోసం కుక్కలు గుంపులుగా అక్కడికి చేరి, పిల్లలపై దాడిచేస్తున్నాయి. వ్యర్థాలను రహదారుల పక్కన వేయకుండా చూడాలి. **- కె.హరిబాబు, ఇంకొల్లు** ✔ వ్యర్థాలను రాత్రివేళల్లో పడేస్తున్నారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తున్నాం. ప్రత్యేక నిఘాపెట్టి వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- రామసుబ్బారెడ్డి, కార్యదర్శి, ఇంకొల్లు**

చినగంజాం, న్యూస్‌టుడే: ? పల్లెపాలెం పరిధిలోని బాపయ్యనగర్ తూర్పు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. **- సుబ్బారావు, స్థానికుడు,** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తా. **- కొర్రపాటి రాజ్‌మోహన్, గ్రామ కార్యదర్శి, పల్లెపాలెం**

అంకితభావంతో పనిచేయాలి

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని ఆర్డీవో పి.గ్లోరియా సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో మండలంలోని స్వర్ణ గ్రామాల పనితీరుపై సచివాలయాల ఉద్యోగులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు గ్రామాల్లోని సమస్యలపై అవగాహన కల్పించుకుని ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తహసీల్దార్ ప్రశాంతి, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులు, జీఎస్‌డబ్ల్యూ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏవో రాంబాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'చలో మంగళగిరి' విజయవంతానికి ప్రచారం

భట్టిప్రోలు: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న మంగళగిరిలో నిర్వహించే చేనేత గర్జన విజయవంతం చేయాలని కోరుతూ ఐలవరంలో గురువారం చేనేత నాయకులు ప్రచారం చేశారు. కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజలకు పారదర్శక సేవలు

వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రజలకు రెవెన్యూ సిబ్బంది పారదర్శకమైన సేవలందించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రీ-సర్వేలో ఎటువంటి తప్పిదాలకు తావివ్వద్దని, భూయజమానుల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఎక్కడ జరిగితే ఆ ప్రాంత గ్రామ రెవెన్యూ అధికారిని బాధ్యుడ్ని చేస్తామని, రాత్రులు అక్రమ రవాణా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నందున దీన్ని అరికట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ గీతారాణి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు జి.ముసలయ్య, సర్వేయరు శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

28 నాటికి ఏకీకృత కుటుంబ సర్వే పూర్తి చేయాలి

మాట్లాడుతున్న విజయలక్ష్మి, పక్కన కమిషనర్ దానియేల్ జోసఫ్

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఈనెల 28 నాటికి ఏకీకృత కుటుంబ సర్వే పూర్తి చేయాలని డీఎల్‌డీవో, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారిణి విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఏకీకృత కుటుంబ సర్వేపై స్వర్ణ వార్డు కార్యదర్శులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వే కోసం ఇంటింటికి వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తి వివరాలు అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబం ఈ సర్వే చేయించుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. కుటుంబ సభ్యుల వ్యక్తిగత స్థాయి ప్రశ్నలు, సామాజిక, విద్య, నైపుణ్యం, ఉపాధి, ఆదాయ వివరాలు అడిగి నమోదు చేసుకోవాలన్నారు. కమిషనరు దానియేల్ జోసఫ్ మాట్లాడుతూ వివరాలు నమోదు చేసుకోవడంతో ప్రభుత్వ పథకాలు పొందడానికి ఎటువంటి ఆటంకం ఉండదన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిద్దె తోట.. ఆరోగ్య బాట

ఓ ఇంట్లో మొక్కలు పరిశీలిస్తున్న సభ్యులు

ఎంజీసీ కాలనీ, బెస్తపాలెం (చీరాల), న్యూస్‌టుడే: ఆరోగ్యకర జీవనం గడపటానికి మార్గం అనే లక్ష్యంతో కొందరు మహిళలు ఒక బృందంగా ఏర్పడ్డారు.. తమ ఇళ్లలో మేడమీద, కొద్దిపాటి ఖాళీ స్థలంలో మొక్కలు పెంచడంతో పాటు మరికొందరికి వీటిపై అవగాహన కల్పిస్తున్నారు. మిద్దెతోటల పేరుతో ఇంట్లోనే కూరగాయల మొక్కలు పెంచడం ద్వారా రసాయన ఎరువులు లేని మంచి ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఇంటిని చల్లగా ఉంచుకుంటూ.. స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించేలా చూసుకుంటున్నారు.

ఇంట్లో పాత డబ్బాల్లో ఆకుకూరలు

ప్రస్తుతం ఏ ఆహార పదార్థాలు చూసినా కల్తీ అవుతున్నాయి. కూరగాయలు, ఆకుకూరలు పండ్లు అన్నీ కల్తీనే. ఇవి తింటే ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. అదేవిధంగా పట్టణీకరణ నేపథ్యంలో వాతావరణం పూర్తిగా కలుషితమైంది. మంచి గాలి లభించడంలేదు. వాతావరణ సమతౌల్యం లోపించి ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఏసీలతో ఆరోగ్యం పాడవుతుంది. ఇటువంటి వాటిని దూరం చేసేందుకు పట్టణానికి చెందిన మహిళలు చొరవ చూపారు. తొలుత కొంత మంది తమ ఇంట్లో, మేడపై, ఖాళీస్థలంలో కూరగాయలు, పండ్ల మొక్కలు నాటారు. ఇంట్లో వ్యర్థాల నుంచి వర్మీకంపోస్టును తయారు చేసుకున్నారు. దీన్ని వాడి మంచి ఫలితాలు సాధించారు. తరువాత ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో వ్యక్తులతో విశ్రాంత ఉపాధ్యాయిని జెన్నమ్మ, సాఫ్ట్‌వేర్ నిపుణుడు పూర్ణానంద్, గృహిణి సుభాషిణిలు అడ్మిన్‌లుగా వాట్సాప్‌లో ఒక బృందంగా ఏర్పడ్డారు. ఇటువంటి వాటిని ప్రోత్సహించే హైదరాబాద్‌లోని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ వీరికి మార్గం చూపింది. ప్రస్తుతం వీరి వాట్సాప్ గ్రూపులో 200 మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరు తమ ఇళ్లలో మొక్కలు పెంచడంతోపాటు వీటిపై ఇతరులకు అవగాహన కల్పిస్తారు. అభిప్రాయాలు పంచుకుంటారు. తమ ఇంట్లో ఏం మొక్కలు వేసింది, వర్మీకంపోస్టు ఎలా తయారు చేసింది.. తదితర విషయాలు ఫొటోలతో గ్రూపులో పంచుకుంటారు. మరికొందరికి ఈ విషయాలు తెలియజేస్తారు. ఆసక్తి ఉన్న వారు సభ్యులుగా చేరితే వారికి ఇందులో అవగాహన కల్పిస్తారు. తమ వద్ద ఉన్న రకరకాల విత్తనాలు ఇతరులకు పంచుతారు. లేనివి ప్రత్యేకమైన మొక్కలు కావాలంటే అందరు కలిసి సమష్టిగా కొనుగోలు చేస్తారు. ఒక్కొక్కసారి ఒక సభ్యుడి ఇంటి వద్ద కలుస్తారు. అభివృద్ధి చేసిన తోటను పరిశీలిస్తారు. నూతన విధానాల గురించి చర్చించుకుంటూ ముందుకు సాగుతూ.. తద్వారా మిద్దె తోటలతో ఆరోగ్య బాట వేసుకుంటున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

పేరాల, న్యూస్‌టుడే: చీరాల పట్టణంలోని వాడరేవు బస్టాండ్ సమీప ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఇక్కడ ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. ఫలితంగా ఆయా ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతూ అటుగా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాడరేవు బస్టాండ్ వద్ద ఇలా..

నాణ్యతలో రాజీ పడొద్దు

త్వరలో పాత మద్రాసు రహదారి పనులు: ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, న్యూస్‌టుడే

పర్చూరు-ఇంకొల్లు రహదారి దుస్థితి

పర్చూరు-ఇంకొల్లు పాత మద్రాసు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధతో ఎట్టకేలకు పనులు పునఃప్రారంభం కానున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు నిమిత్తం రహదారి వెంబడి మొక్కలు తొలగించి, వదిలేశారు. ఈ రోడ్డు ప్రాధాన్యతను ఎమ్మెల్యే ఏలూరి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి వివరించి రూ.23.88 కోట్ల నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అప్పటి వైకాపా నియోజకవర్గ నాయకుని వ్యవహారంతో పనులు నిలిపివేయడంతో ఆ పార్టీ నేత స్వయానా గళమెత్తి పలువురు అధికారులకు, పార్టీ నేతలకు ఫిర్యాదు చేశారు. దీంతో పనులు దక్కించుకున్న గుత్తేదారుడు ఎక్కడికక్కడ నిలిపివేయడంతో ప్రజలు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు.

ఎమ్మెల్యే ఏలూరి సమీక్ష .. ఈ రహదారిలోని కప్పల వాగుపైగల వంతెనను కొద్దిరోజుల క్రితం ఆర్ అండ్ బీ అధికారులు తొలగించి, రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో గురువారం పూర్తిస్థాయి నిర్మాణ పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన కార్యాలయంలో ఆర్అండ్‌బీ, మైనింగ్, గుత్తేదారుడితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులు ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గుత్తేదారుడు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వారంరోజుల్లో పనులు ప్రారంభించాలని, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా ఉండాలన్నారు. ప్రస్తుతం 5.5 మీటర్లుగా ఉన్న రహదారిని ఏడు మీటర్ల మేర విస్తరించేలా పనులు చేపట్టాలని సూచించారు. పూర్తిస్థాయిలో ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

పందిళ్లపల్లిలో ఇసుక అక్రమ తవ్వకాలు

పందిళ్లపల్లి(వేటపాలెం), న్యూస్‌టుడే: పందిళ్లపల్లి రైల్వేగేటు సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇసుకను పొక్లెయిన్‌తో తవ్వడంతో గుంతల్లోకి నీరు చేరి, ప్రమాదకరంగా మారాయి. అయినా అక్రమార్కులు ఆగలేదు. ఇసుకను తీసి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో తమ పొలాలకు ప్రమాదం పొంచి ఉందని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా రవాణా జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు పదే పదే చెబుతున్నారు... మరోవైపు ఇటువంటి వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా ఆగకపోవడం గమనార్హం. గురువారం ఇసుక తవ్వకాలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేశాయి. ఈవిషయాన్ని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టామని, రవాణా చేసే వాహనాలను గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని వీఆర్వోలను ఆదేశించినట్లు చెప్పారు.

ఇసుక తవ్వి పోసిన గుట్ట

విద్యుత్తు కష్టాలకు తెరపడినట్టే!

ఉపకేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, అధికారులు

చీరాల, న్యూస్‌టుడే: చీరాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న విద్యుత్తు కష్టాలకు తెరపడనుంది. పట్టణంలోని దండుబాట వద్ద నిర్మిస్తున్న నూతన విద్యుత్తు ఉప కేంద్రం పూర్తయితే ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క అరగంట కరెంటు లేపోతే ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి వచ్చిందంటే పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు కోతలు తప్పనిసరి అవుతున్నాయి. ముఖ్యంగా వైకుంఠపురం, వివేక్‌నగర్, జయంతిపేట, విజయలక్ష్మీపురం, పాతచీరాల, జాండ్రపేట ఇలా అనేక ప్రాంతాల్లో వేసవి వచ్చిందంటే కరెంటు కష్టాలు ప్రారంభమవుతాయి. అధికారికంగా కోతలు లేకపోయినా ఈప్రాంతాల్లో మాత్రం విద్యుత్తు సమస్యలే. దీనికి ప్రధాన కారణం డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడం. ప్రస్తుతం ఏసీలు లేని ఇళ్లు ఉండటం లేదు. ఈ పరిస్థితుల్లో వేసవిలో డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. దీంతో తరచూ కోతలు విధిస్తున్నారు. ఫలితంగా కరెంటు ఎపుడు పోతుందో తెలియక ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల విద్యుత్తు కష్టాలు తీర్చడంపై దృష్టి పెట్టింది. ఈక్రమంలో పట్టణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యలకు చరమగీతం పాడేందుకు ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అధికారులతో సమావేశాలు నిర్వహించి, ప్రత్యేక కార్యాచరణ తయారుచేశారు. దీనిపై విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడటం, సానుకూలంగా స్పందించిన ఆయన అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిధులు కేటాయించారు. దీంతో దండుబాట వద్ద సుమారు రూ.5 కోట్లతో 33/11 కేవీ ఉపకేంద్రం నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దీన్ని మూడు నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది పూర్తయితే 15 వేల యూనిట్ల సరఫరా చేయటానికి అవకాశం ఉంటుంది. చీరాల పట్టణంతో పాటు గ్రామాల్లోనూ సమస్యలు ఉండవని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు చీరాల పట్టణ, మండల పరిధిలో రూ.60 లక్షలతో ఆరు నియంత్రికలు ఏర్పాటు చేశారు. వేటపాలెం మండలంలోనూ ఏర్పాటు చేశారు. వీటితోపాటు మరో ఆరు మార్చిలోపు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇవన్నీ పూర్తయితే రాబోయే పదేళ్లపాటు నియోజకవర్గంలో విద్యుత్తు సమస్యలు ఉండవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రోడ్డుపై ఇసుక తొలగించరూ

చినగంజాం రెవెన్యూ కార్యాలయం ఎదురుగా చీరాల-ఒంగోలు ఆర్అండ్‌బీ తారు రోడ్డుపై రెవెన్యూ కార్యాలయానికి దక్షిణం వైపున కొద్ది దూరంలో ఇసుక మేటలు ఉన్నాయి. దీని కారణంగా తాము ఇబ్బంది పడుతున్నామని ద్విచక్ర వాహన చోదకులు శ్రీనివాసరావు, వెంకటరావు, వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇసుక వద్దకు వచ్చేసరికి ఎంత నెమ్మదిగా వాహనాలు నడిపిన జారిపడి, ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. కొత్తగా ఇటుగా వచ్చే వాహన చోదకులు ముఖ్యంగా రాత్రివేళ తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి డి.సుధీర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో పంచాయతీ కార్మికులతో ఇసుకను తొలగించి, చోదకులకు ఇబ్బంది లేకుండా చేస్తానని తెలిపారు. **- చినగంజాం, న్యూస్‌టుడే**

25 ఏళ్ల కృషి.. అభయాంజనేయుడి ఆలయం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా రెండున్నర దశాబ్దాల క్రితం స్వామివారి ఆలయానికి అంకురార్పణ జరిగింది. కొంతవరకు నిర్మించిన తరువాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు సహృదయం కలిగిన దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో ప్రతిష్ఠా మహోత్సవానికి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది.

వేటపాలెం మండల పరిధిలోని చీరాల-వేటపాలెం రోడ్డు వెంట రామన్నపేట పంచాయతీ మండల కార్యాలయం సమీపంలో ఓ భక్తుడు స్వామివారి ఆలయ నిర్మాణానికి 25 ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. బేస్‌మెంట్ వరకు పనులు జరిగాయి. ఆ తరువాత ఆగిపోయాయి. ఇటీవల దీన్ని పూర్తి చేయడానికి కొంతమంది భక్తులు నడుం బిగించారు. దాదాపు రూ.35 లక్షల దాతల విరాళాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 22న అభయాంజనేయస్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా 21వ తేదీ శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు స్వామి వారి విగ్రహం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం వివిధ పూజలు నిర్వహిస్తారు. మరుసటి రోజు ఉదయాన్నే స్వామివారికి సుప్రభాత సేవ, 10 గంటల 18 నిమిషాలకు స్వామివారి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అనంతరం అన్నసంతర్పణ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

దేవాలయం

స్వామి విగ్రహం

రీసర్వేలో తప్పులు సరిదిద్దండి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రీసర్వేలో చోటుచేసుకున్న లోపాలు సరిచేయాలని బాపట్ల సర్వే ఏడీ శేషగిరిరావు సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే సమర్థంగా ఎలా నిర్వహించాలన్న అంశంపై సూచనలు చేశారు. ముందుగా రీసర్వే వివరాలను సర్వేయర్ల నుంచి తెలుసుకున్నారు. తాజా మార్పుల గురించి చర్చించారు. ఇటీవల వెలువడిన జీవోలోని ప్రధాన అంశాలు వివరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ముసలయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, భాగ్యరాజ్, వినోద్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎంఈవో-1గా శ్యాంసన్ బాధ్యతల స్వీకరణ

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడు మండల విద్యాశాఖాధికారి-1గా జి.శ్యాంసన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన్ను ఎంఈవో-2 ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్‌రెడ్డి, సరోజిని, పద్మావతి, మహాలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

శ్యాంసన్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంఈవో-2 వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు

రైతులు నాణ్యమైన విత్తనాలు సాగు చేయాలి

తిమిడితపాడు(కారంచేడు), న్యూస్‌టుడే: రైతులు నాణ్యమైన విత్తనాలు సాగు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పంటల పరీక్షల డైరెక్టర్ జి.శివనారాయణ సూచించారు. గురువారం కారంచేడు మండలం తిమిడితపాడులో అభ్యుదయ రైతు బోడావుల లక్ష్మీనారాయణ వ్యవసాయ క్షేత్రాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.వి.ఎస్ దుర్గాప్రసాద్, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుతరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల, ఏడీఏ జీబీపీ ప్రవీణ, ఏవో నాగరాజులు పరిశీలించారు. రైతు పండిస్తున్న శనగలోని 1469,1267, కాబూలీ, 440, 833,810, 440, జేజీ-11, ఎన్810,833 రకాల విత్తనాల పంటలను పరిశీలించారు. ఈ రకాల పంటలు యాంత్రీకరణకు అనువుగా ఉన్నాయని రైతు లక్ష్మీనారాయణ అధికారులకు వివరించారు.

శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి

చీరాల, న్యూస్‌టుడే: బలవంతంమీదో, ఎవరో చేరారనో కాకుండా మీకు నచ్చిన ఇష్టపడే కోర్సుల్లో చేరాలని అపుడే మంచి ఫలితాలు వస్తాయని విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం శ్రీగౌతమీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు కచ్చితమైన లక్ష్యం ఉండాలని, కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని మర్చిపోవద్దని సూచించారు. విద్యాసంస్థల అధినేత ఎం.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..

కేశవరప్పాడు-తిమిడితపాడు మార్గంలో ఇలా..

తిమిడితపాడు(కారంచేడు), న్యూస్‌టుడే: మండలంలోని కేశవరప్పాడు-తిమిడితపాడు రహదారిలో ఏ మాత్రం ఆదమరిచిన కాలువలోకి దూసుకెళ్లే పరిస్థితి దాపురించింది. రోడ్డుకు రెండువైపులా అంచులు కొట్టుకుపోయి ప్రమాదభరితంగా మారింది. ప్రజలు ఎక్కువగా ఈ మార్గం ద్వారానే ఇంకొల్లు మండలం పూసపాడుతో పాటు మండలంలోని ఆదిపూడి, పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఏ మాత్రం గమనించకపోయినా అదుపుతప్పి, కాలువలోకి జారిపడే ప్రమాదం ఉంది. గతేడాది మొంథా తుపాను ప్రభావంతో ఈ రహదారి అంచులు కోతకు గురయ్యాయని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం

దుద్దుకూరు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా సమర సత సేవా ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ సంస్థ ప్రచారకుడు తులసి రాజేష్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం దుద్దుకూరులో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ హిందూ ధర్మమే మానవాళి మనుగడకు రక్షణ అన్నారు. ధర్మాన్ని కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాదాల శ్రీనివాస్, టి.శివశంకర్, నీలం సదానందరావు, టి.లక్ష్మీనారాయణ, నాగదుర్గయ్య, నాగేశ్వరరావు, సత్యబాబు పాల్గొన్నారు.

మార్టూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీనివాస విద్యాసంస్థల్లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్, శివాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు విశ్రాంతి అధ్యాపకుడు టి.వెంకటనారాయణ వివరించారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఎం.సాంబశివరావు, నాగేశ్వరరావు, జి.రవికుమార్ పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటం దగ్గర నివాళులర్పిస్తున్న రాజేష్ తదితరులు

పోషకాహారంపై శిక్షణ

మార్టూరు, న్యూస్‌టుడే: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పోషకాహారంపై గ్రామ సమాఖ్య ప్రతినిధులకు, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. డీఆర్‌డీఏ, వెలుగు డీపీఎం సనిత పురుగు మందుల అవశేషాలు లేని ఆహారాన్ని తయారు చేసుకునే విధానాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జె.మోహన్ మాట్లాడుతూ అవసరమైన పోషకాహార పదార్థాల ఎంపిక, సేకరణ విధానాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం మాణిక్యరావు, సిబ్బంది శశికళ, సోనియా తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల్లో అపోహలు తొలగించండి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: వినియోగదారుల్లో అపోహలు పోగొట్టి సంతృప్తి నింపాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. 65ఏళ్లు దాటిన వృద్ధులకు నిత్యావసరాలు నేరుగా గృహాల వద్దనే అందించాలన్నారు. 15వ తేదీ వరకు సరకులు అందించాలని, వినియోగదారులతో ఎలా వ్యవహరించాలి అనే విషయాలు తెలియజేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ నిర్ణీత ధరలకు నిత్యావసరాలు అందజేయాలన్నారు. మండల పరిధిలోని డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడు గ్రామంలో ద్విచక్ర వాహనాలు చోరీ జరిగిన కేసుల్లో ఇద్దర్ని గురువారం అరెస్టు చేసి వారి నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. ఈనెల 4న, 10న గ్రామంలోని చెరువుబజారు, పాతమాలపల్లెలో ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు నలుగురు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. డీఎస్పీ మొయిన్, సీఐ రమణయ్య ఆధ్వర్యంలో కేసులను దర్యాప్తు చేశామన్నారు. గురువారం సాయంత్రం గ్రామ పరిధిలోని కప్పలవాగు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా అదే గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలీ, షేక్.రియాజ్‌లను పట్టుకుని విచారించామన్నారు. బైక్‌లను వీరు దొంగలించినట్లు గుర్తించి, నాలుగింటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసులను త్వరితగతిన ఛేదించిన కారంచేడు పోలీసులను జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు.

రైలెక్కిన మిలటరీ వాహనాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫారంపై ఉదయం 11 గంటల సమయంలో మిలటరీ వాహనాలు, యుద్ధ సామగ్రితో కూడిన గూడ్స్ రైలు చెన్నై వైపు నుంచి వచ్చి ఆగింది. దీనిలో సుమారు 30 వరకు పెద్ద టైర్లతో కూడిన లారీలున్నాయి. వాటి పక్కనే ఫిరంగులు వంటివి ఉన్నాయి. వీటిని ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. మిలటరీ వాహనాలను దగ్గరగా చూశామని ఆనందించారు. కొంత సమయం తర్వాత విజయవాడ వైపు రైలు వెళ్లింది. ఇటీవల కాలంలో పగటివేళ ఇటుగా మిలటరీ వాహనాలతో రైలు వెళ్లలేదని ప్రయాణికులు అనుకోవడం కన్పించింది.

చినగంజాం రైల్వేస్టేషన్‌లో..

మినుములో పల్లాకు తెగులు.. కర్షకుల్లో గుబులు

చుండూరులో తెగులు సోకిన పైరు

వేమూరు, న్యూస్‌టుడే: మినుములో పల్లాకు తెగులు ప్రభావం రైతులను కలవరపెడుతోంది. ఈ ఏడాది పొగమంచు ఎక్కువగా ఉండడం వల్ల దీని ప్రభావం కాస్త ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం పైరు 70 నుంచి 50రోజుల దశలో ఉందని, ఈ దశలో తెగులు సోకడం వల్ల, దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు అందించిన వివరాల ప్రకారం నియోజకవర్గంలో 94వేల ఎకరాల సాగు భూమి ఉండగా, రబీలో 25 వేల ఎకరాల్లో మినుము, పెసర సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పైరు పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో పైరుపై తెల్లదోమ ప్రభావం కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి భరత్‌ను వివరణ కోరగా తెల్లదోమ కారణంగా పల్లాకు తెగులు వస్తుందని, నివారణకు ఎకరాకు ఫిప్రోనిల్ 300ఎంఎల్, లేదా ఎస్పేట్ 300గ్రాముల మందును తగిన నీటితో కలిపి పైరుపై పిచికారీ చేయాలని తెలిపారు.

భీమవరంలో నేత్రదానం

రంగనాయకులు (పాతచిత్రం)

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 731వ నేత్రదానం జరిగింది. భీమవరానికి చెందిన నాళం రంగనాయకులు(78) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు స్వామి, రామమోహనరావులు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి మృతుని కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు లక్ష్మీప్రసన్న, సురేంద్ర, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణలను రోటరీ ప్రతినిధులు అభినందించారు.

(c) eenadu

వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్సనీ

వడపళని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ ఛైర్మన్ డాక్టర్ పి.చాయ్ జాన్సనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారు. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన యూరియా

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: రబీ పంటల సాగు అవసరాల నిమిత్తం గురువారం జిల్లాకు 1150 టన్నుల యూరియా చేరిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలు, గోదాముల్లో సుమారు 4,200 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. యూరియా కొరత లేదని..అవసరమైన మండలాల వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపగానే.. నిర్దేశిత రైతు సేవా కేంద్రానికి సరఫరా చేస్తామన్నారు. యూరియా సమస్య తలెత్తరాదని.. ప్రణాళికబద్ధంగా అందజేయాలని చెప్పారు.

జనగణన సమావేశానికి జేసీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జనగణన ప్రక్రియపై శుక్రవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం విజయవాడకు ప్రయాణమయ్యారు.

మహిళా వర్సిటీకి తితిదే వార్షిక గ్రాంటు పెంపు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీకి తితిదే ఏటా అందజేస్తున్న వార్షిక నిర్వహణ గ్రాంటును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ (ఎండోమెంట్స్-3) శాఖ జీవో 129ను గురువారం విడుదల చేసింది. ఇప్పటివరకు వర్సిటీకి తితిదే ద్వారా అందుతున్న గ్రాంటు రూ.కోటి ఉండగా.. దాన్ని రూ.1.50 కోట్లకు పెంచారు. ఈ పెంపు 2024-2025 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుంది. తితిదే బోర్డు తీర్మానం మేరకు కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వాన్ని సంప్రదించగా, పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గ్రాంటు పెంపుతో మహిళా వర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నిర్వహణ పనులకు మరింత ఊతం లభించనుందని వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ అభిప్రాయపడ్డారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

[illegible]

సవరణ

తేది:26.01.2026న ఈనాడు దినపత్రిక నందు ప్రచురితమైన రుణగ్రహీత జి.చంద్రశేఖర్ గారికి చెందిన భౌతిక స్వాధీనతా నోటీసు నందు రుణ ఖాతా నెం.PLMNRTF1810050005గా ప్రచురితమైనది. దీనిని 'PLMNRTF2303160013 అని చదువుకోగలరు. ఇందుకు సంబంధించిన ఇతర నియమ నిబంధనలన్నీ దినపత్రిక ప్రకటనలో ప్రచురించిన విధంగానే చదువుకోగలరు.

తేది: 19.02.2026 సం॥ అధీకృత అధికారి,
ప్రదేశం: పలమనేరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రత్యేకం.. శ్రీకాళహస్తికి సొంతం

చతుర్విధ పురుషార్థాలకు నిదర్శనం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేషతను సంతరించుకున్న స్వర్ణ, రాతి ధ్వజస్తంభాలు ▸ ముప్ఫైయి ఏళ్ల క్రితం కన్పిస్తున్న కట్టడాలు

శ్రీకాళహస్తీశ్వరాలయం అద్భుతమైన శిల్పసంపదకు నిలయమే కాదు.. ఎన్నో ప్రత్యేకతలకు నిదర్శనం కూడా. ఇక్కడి ఆలయాన్ని ఎందరో రాజులు, చక్రవర్తులు, జమిందార్లు ఎంతో అభివృద్ధి పరిచారు. అయితే ఇక్కడున్న ప్రత్యేకతలను పురాతన కాలం నుంచి సంరక్షిస్తూనే వస్తున్నారు.

అవి.. చతుర్విధ పురుషార్థాలు..: ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు చతుర్విధ పురుషార్థాలుగా పిలుస్తారు. అయితే ఇవన్నీ ఒకే దగ్గర ఉండటం విశేషతను సంతరించుకుంటోంది. వాయులింగేశ్వరుని దర్శనార్థం వెళ్లే సమయంలో మహాద్వారం ఎదురుగా ఉన్న నందీశ్వరుడు, బలిపీఠం, రాతిధ్వజస్తంభం, దారుధ్వజస్తంభం వరుస క్రమంలో ఉండటం విశేషం. రెండు ధ్వజస్తంభాలు పక్కపక్కన ఉండటం, అందులో ఒకటి ఏక శిలా ధ్వజస్తంభంగా ఖ్యాతి పొందింది. ఇక్కడి ధ్వజస్తంభంపై ఒక్కో దిక్కున ఒక్కో దేవతా రూపం చెక్కబడి ఉన్నారు. దీనిపై ఉన్న వజ్రేశ్వరీ దేవి ప్రతిమ మరింతగా ఆకట్టుకోవడం విశేషం. శ్రావణ మాసంలో ఇక్కడి అమ్మవారికి విశేష అలంకరణలు చేపడతారు. ఇలాంటి ధ్వజస్తంభం దక్షిణ భారత దేశంలో ఎక్కడా కన్పించదు మరి. మరొకటి దారు ధ్వజస్తంభానికి బంగారు పూత వేయించడంతో మరింత సుందరంగా ఆకట్టుకుంది. ఇలా క్రమ పద్ధతిలో అమరినట్లు దేశంలో మరెక్కడా లేదన్న విషయాన్ని స్థల పురాణంలో విశద పరిచారు.

ఒక్కొక్కటి ఒక్కో ప్రాభవం..: దక్షిణామూర్తిని చూస్తూ నిత్యం ఆయన్ను సేవించుకుంటూ ఉన్న నందీశ్వరుని విగ్రహం ధర్మానికి ప్రతీకగా చెప్తారు. నంది విగ్రహం చిన్నపాటి మండపంలో కొలువుదీరి ఉంటుంది. ఇక వెనుక వైపున బలిపీఠం అర్థమునకు, రాతి ధ్వజ స్తంభం కామమునకు, స్వర్ణ ధ్వజస్తంభం మోక్షానికి ప్రతీకలుగా చెప్తుంటారు. మహాద్వారం ఎదురుగా ఇవన్నీ ఏర్పాటై ఉండటం, అందులోనూ ఎంతో ముచ్చటగా భక్తులను ఆకట్టుకోవడం విశేషం. ఇలా చారిత్రాత్మకంగా, పురాణపరంగా ఇంతటి విషయ సమాచారం ఇక్కడే దాగుండటం విశేషం.

మీకు తెలుసా

టికెట్‌ధర: రూ.216 **ప్రవేశం:** ఒకరికి
నిర్వహణ ప్రదేశం: శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి **సేవా ఫలం:** దక్షిణామూర్తి జ్ఞానప్రదాత. ఆయన చెంతన అక్షరాభ్యాస మహోత్సవం జరుపుతుంటారు. పలక, విద్యా ఉపకరణాలు భక్తులే తీసుకురావాలి. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించవచ్చు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ముక్కంటి ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు

జ్ఞానతత్వం.. మేధా దక్షిణామూర్తి వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయం అక్షరాభ్యాసాలకు ఎంతో మహోన్నతమైందనే చెప్పాలి. ఎందుకంటే రుషులకు వేద విజ్ఞాన తత్వాన్ని బోధించే మేధా దక్షిణామూర్తి కొలువుదీరిన ఆలయం ఇది. మహాద్వారం నుంచి ఆలయంలోనికి అడుగు పెట్టగానే కన్పించే విశేష మహిమాన్విత మూర్తి దక్షిణామూర్తి. అందుకే ప్రతి గురువారం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పాఠశాలలు పునః ప్రారంభించాక ప్రభుత్వం తరపున భారీగా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా వసంత పంచమితో పాటు ఎప్పుడైనా అక్షరాభ్యాసాన్ని జరిపించుకునే విధంగా ఇక్కడి ఆలయంలో ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ విశేష ఆర్జిత సేవ నిర్వహిస్తుంటారు.

హంద్రీ-నీవా.. వరిసాగుకు తోవ

■ వ్యవసాయ బావుల్లోనూ సమకూరిన సాగునీటి వసతి

కూటమి ప్రభుత్వం గతేడాది ఆగస్టులో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చింది. నియోజకవర్గంలో 640 చెరువులుండగా.. మొదటగా 110 చెరువులకు నీటి వసతికి చర్యలు చేపట్టారు. కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లో ఇప్పటివరకు దాదాపు 80 చెరువుల్లో హంద్రీ-నీవా జలాలను నింపారు. అతిపెద్ద విస్తీర్ణం కలిగిన చెరువులతో పాటు కుంటలు, చెక్‌డ్యాంలలో కృష్ణాజలాల నిల్వలతో భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. ఏళ్ల తరబడి ఎండిపోయిన సేద్యపు బావుల్లోనూ నీటి వసతి ఏర్పడింది.

కుప్పం, న్యూస్‌టుడే:

నారసింహేపల్లె వద్ద బావి నీటితో వరిసాగు

బోర్లలో 300 అడుగులకే నీటి వసతి

ఒకప్పుడు కరవుకు నిలయంగా మారిన జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్యేకించి వేసవిలో పంట విరామాన్ని ప్రకటించుకున్న దుర్భర పరిస్థితులు లేకపోలేదు. నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారంగా చేపట్టిన హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం జలవనరుల్లో నీటి వసతి వల్ల బోర్లలో సమృద్ధిగా సాగునీటి వసతి ఏర్పడింది. గతంలో గరిష్ఠంగా 1,200 అడుగుల బోర్లలోనూ నీటి లభ్యత కనీస స్థాయిలో ఉండేది. ప్రస్తుతం కనిష్ఠంగా 300 అడుగులకే బోర్లలో నీరు లభిస్తోందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో తీరిక లేకుండా..

పశ్చిమ మండలాల రైతులు ప్రస్తుతం సేద్యపు పనుల్లో తీరిక లేకుండా గడుపుతున్నారు. సాగునీటి సమస్య వల్ల ఇదివరకు ఆరుతడి ఉద్యాన పంటలకే పరిమితమైన రైతులు ప్రస్తుతం వరి సాగును విస్తారంగా చేపడుతున్నారు. చెరువుల ఆయకట్టు భూములతో పాటు బావులు, బోర్ల నీటి ఆధారంగా వరిసాగుకు శ్రీకారం చుట్టారు. గతంలో బీళ్లుగా బారిన భూములతో పాటు వర్షాధారపు భూముల్లోనూ ప్రస్తుతం సాగునీటి ఆధారంగా పంటల సాగుతో ఎక్కడ చూసినా పచ్చదనం సంతరించుకోవడంతో పొలాలు.. గట్లు రైతులు.. కూలీలతో కళకళలాడుతున్నాయి.

కొన్నేళ్లుగా వ్యవసాయం చేయలేదు..

సేద్యపు బావి ఎండిపోవడంతో కొన్నేళ్లుగా వ్యవసాయం చేయలేదు. ప్రస్తుతం 'హంద్రీ-నీవా' జలాల రాకతో బావిలో పుష్కలంగా నీటి వసతి ఏర్పడింది. రెండున్నర ఎకరాల్లో వరితో పాటు పశుగ్రాసం, ఉద్యాన పంటల సాగు చేపడుతున్నా. కృష్ణా జలాలు కుప్పానికి రాకపోతే మా లాంటి వేలాది మంది రైతులు సేద్యపు పనులు లేక కూలీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది.

- నాగరాజు, నారసింహేపల్లె (శాంతిపురం)

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు అవసరం

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు, కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, అధ్యాపకులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: విద్యార్థి మనసులో పుట్టే చిన్న ఆలోచన సమాజానికి ఉపయోగపడే మహత్తర ఆవిష్కరణలు కావాలని ఎస్వీ విశ్వవిద్యాలయం ఉపకులపతి తాతా నరసింగరావు తెలిపారు. పి.కొత్తకోటలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఏఐసీటీఈ సహకారంతో ఏర్పాటు చేసిన వేము ఐడియా ల్యాబ్ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, స్టార్టప్ ఆలోచనలను పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రిన్సిపల్ నవీన్ కిలారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు

మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్ గౌరినేని

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో విజయవంతంగా వంద రోబోటిక్ మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేయడం తమకు ఎంతో గర్వకారణమని అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని తెలిపారు. గురువారం ఆస్పత్రిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి వరద రాజనగర్‌కు చెందిన 70 ఏళ్ల శంకర్‌నారాయణకు 100వ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యంత సురక్షితమన్నారు. రోగులు వేగంగా కోలుకుని సాధారణ స్థితికి వస్తారని వివరించారు. ఎంతో అనుభవం కలిగిన వైద్యులతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. వైద్యులు రవికుమార్, కృష్ణయ్య, హేమంత్ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులు, కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు దంపతులు

కడా పీడీ వివాహానికి హాజరైన సీఎం దంపతులు

కుప్పం పట్టణ, న్యూస్‌టుడే: జైపుర్‌లో జరిగిన కడా పీడీ వికాస్ మర్మత్ వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

COACHING CENTRES

2 నెల్లో 10th, ఇంటర్ (MPC, Bi.P.C, C.E.C) State Govt బోర్డ్ ద్వారా March 26, పరీక్షలు Passట్ All CETS Eligible, Exam Center TPT. ✆ 99851 92105, 94406 50496.

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681.

FINANCIAL SERVICES

[illegible] Xerox [illegible] 2nd [illegible] 50 [illegible] ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి [illegible] AAVAS Phoenix Tower Smart Homes [illegible] 2 BHK, 3 BHK Flats [illegible] RERA Project. 9505502346.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

80085 13290

B/W: Rs. 600
Colour: Rs. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

TO LET

APARTMENTS

TIRUPATI POSTAL Colony 3 BHK New Construction East Facing 1st Floor NRR Enclave - Near Pradepty Residency ✆9440847355

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 WVPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted Sales Executive: Job Location Kadapa & Chittoor (Dist.). Qualy: Dip/ B.Tech/ Degree. Exp: Fresher/ 2-3 yrs. Salary: 20-30K + TA & DA. Cont: 83286 75684 or mail: jkmedicalsystems@gmail.com

WANTED TELECALLER & PRO -04, Marketing Executive -50. Same Mandal in Work Cont: 88013 98165.

WANTED IMMEDIATELY PRO's & Higher Biology Teacher for a reputed School in Mangalam & Tirupati. Con: 81797 67247.

[illegible] ✆ 93928 46185.

[illegible] 94405 81161.

[illegible] Cont: 80999 80999, 88866 02345.

గమనిక [illegible]

ఏప్రిల్ నుంచి వీబీ జీ రామ్‌జీ

మార్చి నెలాఖరుకు ఉపాధి హామీ పనుల పూర్తికి పరుగులు

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మార్చి నెలాఖరుతో ఉపాధి హామీ పథకం శకం ముగియనుంది. ఆపై వీబీ జీ రామ్‌జీ పేరుతో సరికొత్తగా ప్రారంభం కానుంది. ఈ లోపు పనులు, పద్దులను పూర్తి చేయాలని అధికారులు దృష్టి సారించారు. సమయం తక్కువగా ఉండడంతో నిత్య సమీక్షలతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో హడావుడి నెలకొంది.

ఇప్పటికే స్పష్టతనిచ్చిన కేంద్రం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా గ్రామీణ నిరుపేద కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాలన్న ఉద్దేశంతో 2005లో ప్రారంభమైంది. నరేగాలోనే నిధుల కన్వర్జెన్సీ ద్వారా అనేక భవనాలు, వసతులు సమకూరాయి. ఈ పథకం వచ్చే మార్చి 31తో ముగియబోతోంది. ఏప్రిల్ 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా విషన్ గ్రామీణ(వీబీజీరామ్‌జీ) పేరుతో సరికొత్త నిబంధనలతో ప్రారంభం కానుంది. దీనిపై ఇటీవల రాష్ట్రాలకు కేంద్ర స్పష్టత ఇవ్వగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లోని అన్ని పనులను ముగించాలని స్పష్టం చేయడంతో డ్వామా అధికారులు యుద్ధ ప్రాతిపదికన కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

మొక్కలు నాటడం, రోడ్ల నిర్మాణం, పంట కుంటల తవ్వకం, ఇలా అనేక పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉంటే బిల్లులు యుద్ధ ప్రాతిపదికన చెల్లిస్తున్నారు. గోకులాలు, పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, ఇలా అనేకం నిర్మాణంలో ఉండడంతో మార్చి 31లోగా పూర్తవుతాయా అన్న అనుమానాలున్నాయి. ఈ విషయాన్ని అధికారులు ఉన్నత స్థాయికి నివేదించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో స్పష్టత కోరారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 45 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా, 23 లక్షల పని దినాలు పూర్తయ్యాయి.

మారిన నిబంధనలు

కొత్త విధానంలో లేబర్, మెటీరియల్ బడ్జెట్ నుంచి పరిపాలన ఖర్చుల వరకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలి. ఇందులో కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, గ్రామీణులకు జీవనోపాధి కల్పనపైనా దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. కూలీలకు వివిధ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొత్త విధానంలో ఆధునిక సాంకేతికత, బయోమెట్రిక్ హాజరు, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ(డీబీటీ) అయ్యేలా నిబంధనలు అమలు చేయనున్నారు.

నడుమూరు అడవిలో తమిళనాడు వాసి ఆత్మహత్య

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో తమిళనాడు వాసి మృతి చెంది ఉండటాన్ని గురువారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను ఆరా తీశారు. మృతుడి వద్ద లభించిన ఆధార్.. చరవాణి ఆధారంగా తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కేంద్రంలోని పాతపేటకు చెందిన గుణశేఖర్(37)గా గుర్తించారు. మృతుడు కృష్ణగిరిలోని ఓ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూ అక్కడ కొంత బంగారం మాయమైన వ్యవహారంలో మనస్తాపం చెంది.. ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజులుగా కనిపించడంలేదని కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యువకుడిని అపహరించి.. నగదు దోపిడీ..!

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితులతో తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు, పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిచయం లేని యువకుడిని అపహరించి.. రూ.60 వేలు నగదు దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. 'తిరుపతి ఆటోనగర్‌కు చెందిన అఖిల్.. తాజ్ హోటల్‌లో పనిచేస్తారు. ఈ నెల 11న నగరంలోని తుడా రోడ్డులో మద్యం మత్తులో ఉండగా.. అదే సమయంలో కారులో వచ్చిన నలుగురు అఖిల్‌ను కారులో అపహరించారు. అతన్ని కొట్టి సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్ పిన్ నంబరు తెలుసుకున్నారు. చరవాణి నుంచి గేమింగ్ స్కానర్‌కు రూ.60 వేలు నగదు పంపించుకున్నారు. అఖిల్‌తో బలవంతంగా మత్తు పదార్థాలు తాగించి స్పృహ కోల్పోయాక కారు నుంచి గెంటేశారు. కోలుకున్న అఖిల్ బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించి.. ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చింతలచేను రైల్వే గేటు వద్ద ఉన్న నలుగురిని గురువారం అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఎర్రసానిపల్లి గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ (27) కొంతకాలంగా తిరుపతి కొర్లగుంటలోని సోదరి ఇంట్లో ఉంటూ డ్రైవింగ్ చేస్తుంటారు. అతనికి పుత్తూరు సమీపంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న శ్రీనగర్ కాలనీకి చెందిన యోగేష్ (21), చిన్నగొట్టిగల్లు మండలం నల్లుంట్లవారిపల్లెకు చెందిన గురుప్రకాష్ (21), బుచ్చినాయుడుకండ్రిగ మండలం తనిగల్లుకు చెందిన చరణ్ (21)తో పరిచయం ఏర్పడింది. అందరూ మద్యం మత్తులో అఖిల్‌ను అపహరించి ఫోన్‌లో నగదు కాజేశారు. నిందితుల నుంచి కారు, రూ.24 వేలు నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కళాశాల బస్సులో పొగలు

మదనపల్లె రోడ్డులో పొగలు కమ్ముకున్న కళాశాల బస్సు

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ ప్రైవేటు కళాశాల బస్సు విద్యార్థులతో వెళ్తుండగా ఆకస్మికంగా పొగలు కమ్ముకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గంగవరంలోని ఓ ప్రైవేటు కళాశాల బస్సు.. కళాశాల ముగిసిన తర్వాత సాయంత్రం విద్యార్థులను తమ గ్రామాలకు తరలించడానికి బయలుదేరింది. కొద్ది దూరం రాగానే బస్సులో నుంచి దట్టమైన పొగలు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురై వాహనం నుంచి కిందకు దిగారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలాన్ని సీఐ రాంభూపాల్ పరిశీలించి విద్యార్థులను వేరే బస్సులో తరలించారు.

విద్యుత్తు తీగలు తగిలి వ్యక్తి మృతి

రామ్మూర్తిరెడ్డి (పాతచిత్రం)

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం మారేడుపల్లె గ్రామంలో విద్యుత్తు తీగలకు ఓ వ్యక్తి బలయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులరెడ్డి జంతువుల నుంచి తన వేరుసెనగ పంట రక్షణకు అక్రమంగా విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన రామ్మూర్తిరెడ్డి(35) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. బహిర్భూమికని వాహనాన్ని ఆపాడు. సమీపంలోని శ్రీనివాసులరెడ్డి పొలంలోకి వెళ్లగా విద్యుత్తు తీగలు కాలికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పొలంలోనే ఉన్న రైతు శ్రీనివాసులరెడ్డి.. రామ్మూర్తిరెడ్డి మృతదేహాన్ని చూసి భయాందోళన చెందాడు. మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశాడు. రామ్మూర్తిరెడ్డి రాత్రికి ఇంటికి రాకపోవడంతో భార్య బుజ్జి గ్రామస్థులతో కలిసి వెతికినా ఆచూకీ కనిపించలేదు. రామ్మూర్తిరెడ్డి ద్విచక్రవాహనం శ్రీనివాసులరెడ్డి పొలం సమీపంలో గురువారం ఉదయం కనిపించడంతో శ్రీనివాసులరెడ్డిని నిలదీశారు. దీంతో అతను అసలు విషయం చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెరువులోని రామ్మూర్తిరెడ్డి శవాన్ని వెలికితీసి, శవ పరీక్షల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామ్మూర్తిరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్టియన్ వివాహ ధ్రువీకరణ పత్రాల జారీకి

పాస్టర్ నియామకం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో క్రిస్టియన్ల వివాహ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్చి ఉపాసకులకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి చిట్టూరు శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గుడిపాల మండలం రామాపురం చర్చి పాస్టర్ పి.శామ్యూల్ సెల్వ కుమారన్‌ను నియమించారు. 10 సంవత్సరాల పాటు ఆయనకు వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే అవకాశం కల్పించారు.

రూ.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 2026-27 ఆర్థికానికిగానూ రూ.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌ను ఆమోదించారు. చిత్తూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరిగింది. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ చిత్తూరులో జరుగుతున్న జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణ పనుల్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సెస్సు బకాయిల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, పాఠకుల సౌకర్యార్థం పుస్తక నిక్షిప్త కేంద్రాల సంఖ్యను పెంచాలని, పోటీ పరీక్షల సన్నద్ధమయ్యే యువత కోసం ప్రత్యేక రెఫరెన్స్ విభాగాలు ఏర్పాటుచేయడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, డీఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పంపిణీలో సంతృప్తి శాతం పెంచాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ప్రజల సంతృప్తి శాతాన్ని పెంచకపోతే చర్యలుంటాయని జేసీ రాజేంద్రన్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో గ్యాస్ సిలిండర్ల సరఫరా డీలర్ల నిర్వాహకులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల సంతృప్తి శాతంలో జిల్లా చాలా వెనుకబడిందన్నారు. సంతృప్తి శాతంలో పురోగతి సాధించాలన్నారు. డీఎస్వో శంకరన్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు లక్ష్మి, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ కళాశాలలపై విద్యార్థి సంఘాల ఫిర్యాదు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న నకిలీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వీసీ ఆచార్య నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావులకు పలు విద్యార్థి సంఘాల నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విద్యార్థులను చేర్చుకుంటూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాల నిబంధనలు అతిక్రమించడంతో రూ.10 లక్షలు జరిమానా విధించగా.. సగం మాత్రమే చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని వసూలు చేయాలన్నారు. తిరుపతి ఆటోనగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా కళాశాలలు నడుపుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని సమర్పించారు.

ప్రేరణతో నైపుణ్యాలు మెరుగు

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపడుతాయని నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ గీత అన్నారు. గురువారం విద్యాలయంలో అనుభవ పూర్వక అభ్యాసం కార్యక్రమం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2,881 మంది బాలబాలికలు నమోదు చేసుకోగా 136 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి, భారతదేశంపై దార్శనికత, వికసిత్ భారత్ అంశాల్లో వ్యాసరచన, కవితా రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 30 మంది విజేతలను ఎంపిక చేశామని, వారు గుజరాత్ రాష్ట్రంలోని పురాతన చారిత్రక పట్టణం వాద్‌నగర్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. నిర్వాహకులు సురేంద్రన్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ

వడపళని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ ఛైర్మన్ డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారు. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన యూరియా

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: రబీ పంటల సాగు అవసరాల నిమిత్తం గురువారం జిల్లాకు 1150 టన్నుల యూరియా చేరిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలు, గోదాముల్లో సుమారు 4,200 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. యూరియా కొరత లేదని.. అవసరమైన మండలాల వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపగానే.. నిర్దేశిత రైతు సేవా కేంద్రానికి సరఫరా చేస్తామన్నారు. యూరియా సమస్య తలెత్తరాదని.. ప్రణాళికబద్ధంగా అందజేయాలని చెప్పారు.

జనగణన సమావేశానికి జేసీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జనగణన ప్రక్రియపై శుక్రవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం విజయవాడకు ప్రయాణమయ్యారు.

మహిళా వర్సిటీకి తితిదే వార్షిక గ్రాంటు పెంపు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీకి తితిదే ఏటా అందజేస్తున్న వార్షిక నిర్వహణ గ్రాంటును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ (ఎండోమెంట్స్-3) శాఖ జీవో 129ను గురువారం విడుదల చేసింది. ఇప్పటివరకు వర్సిటీకి తితిదే ద్వారా అందుతున్న గ్రాంటు రూ.కోటి ఉండగా.. దాన్ని రూ.1.50 కోట్లకు పెంచారు. ఈ పెంపు 2024-2025 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుంది. తితిదే బోర్డు తీర్మానం మేరకు కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వాన్ని సంప్రదించగా, పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గ్రాంటు పెంపుతో మహిళా వర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నిర్వహణ పనులకు మరింత ఊతం లభించనుందని వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ అభిప్రాయపడ్డారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై - 600032, బ్రాంచ్ కార్యాలయము: డి.నెం.13-87, 1వ అంతస్తు ఎఎస్ కాంప్లెక్స్, మదనపల్లె రోడ్డు, పలమనేరు, చిత్తూరు జిల్లా -517408
సవరణ
తేదీ:26.01.2026న ఈనాడు దినపత్రిక నందు ప్రచురితమైన రుణగ్రహీత జి.చంద్రశేఖర్ గారికి చెందిన భౌతిక స్వాధీనతా నోటీసు నందు రుణ ఖాతా నెం.PLMNRTF1810050005గా ప్రచురితమైనది. దీనిని 'PLMNRTF2303160013 అని చదువుకో గలరు. ఇందుకు సంబంధించిన ఇతర నియమ నిబంధనలన్నీ దినపత్రిక ప్రకటనలో ప్రచురించిన విధంగానే చదువుకోగలరు.
తేదీ:19.02.2026 ప్రదేశం: పలమనేరు
సం॥ అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రత్యేకం.. శ్రీకాళహస్తికి సొంతం

చతుర్విధ పురుషార్థాలకు నిదర్శనం



▸ శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేషతను సంతరించుకున్న స్వర్ణ, రాతి ధ్వజస్తంభాలు ▸ ముప్పయి ఏళ్ల క్రితం కన్పిస్తున్న కట్టడాలు

శ్రీకాళహస్తీశ్వరాలయం అద్భుతమైన శిల్పసంపదకు నిలయమే కాదు.. ఎన్నో ప్రత్యేకతలకు నిదర్శనం కూడా. ఇక్కడి ఆలయాన్ని ఎందరో రాజులు, చక్రవర్తులు, జమిందార్లు ఎంతో అభివృద్ధి పరిచారు. అయితే ఇక్కడున్న ప్రత్యేకతలను పురాతన కాలం నుంచి సంరక్షిస్తూనే వస్తున్నారు.

అవి.. చతుర్విధ పురుషార్థాలు..: ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు చతుర్విధ పురుషార్థాలుగా పిలుస్తారు. అయితే ఇవన్నీ ఒకే దగ్గర ఉండటం విశేషతను సంతరించుకుంటోంది. వాయులింగేశ్వరుని దర్శనార్థం వెళ్లే సమయంలో మహాద్వారం ఎదురుగా ఉన్న నందీశ్వరుడు, బలిపీఠం, రాతిధ్వజం, దారుధ్వజస్తంభం వరుస క్రమంలో ఉండటం విశేషం. రెండు ధ్వజస్తంభాలు పక్కపక్కన ఉండటం, అందులో ఒకటి ఏక శిలా ధ్వజస్తంభం కావడం [illegible]. ఇక్కడి ధ్వజస్తంభం పై ఒక్కో దిక్కున ఒక్కో దేవత రూపం చెక్కబడి ఉన్నారు. దీనిపై ఉన్న వజ్రేశ్వరి దేవి ప్రతిమ మరింతగా ఆకట్టుకోవడం విశేషం. శ్రావణ మాసంలో ఇక్కడి అమ్మవారికి విశేష అలంకరణలు చేపడతారు. ఇలాంటి ధ్వజస్తంభం దక్షిణ భారత దేశంలో ఎక్కడా కన్పించదు మరి. మరొకటి దారు ధ్వజస్తంభానికి బంగారు పూత వేయించడంతో మరింత సుందరంగా ఆకట్టుకుంది. ఇలా క్రమ పద్ధతిలో అమరినట్లు దేశంలో మరెక్కడా లేదన్న విషయాన్ని స్థల పురాణంలో వివరించారు.

ఒక్కొక్కటి ఒక్కో ప్రాభవం..: దక్షిణామూర్తిని చూస్తూ నిత్యం ఆయన్ను సేవించుకుంటూ ఉన్న నందీశ్వరుని విగ్రహం ధర్మానికి ప్రతీకగా చెప్తారు. నంది విగ్రహం చిన్నపాటి మండపంలో కొలువుదీరి ఉంటుంది. ఆ వెనుక వైపున బలిపీఠం అర్థమునకు, రాతి ధ్వజస్తంభం కామమునకు, స్వర్ణ ధ్వజస్తంభం మోక్షానికి ప్రతీకలుగా చెప్తుంటారు. మహాద్వారం ఎదురుగా ఇవన్నీ ఏర్పాటై ఉండటం, అందులోనూ ఎంతో [illegible] ఆకట్టుకోవడం విశేషం. ఇలా చారిత్రకంగా, పురాణపరంగా ఇంతటి విశేష సమాచారం ఇందులో దాగుండటం ఒక్కో [illegible]

మీకు తెలుసా

టికెట్ ధర: రూ.216 **ప్రవేశం:** ఒకరికి **నిర్వహణ ప్రదేశం:** శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి **సేవా ఫలం:** దక్షిణామూర్తి జ్ఞానప్రదాత. ఆయన చెంతన అక్షరాభ్యాస మహోత్సవం జరుపుతుంటారు. పలక, విద్యా ఉపకరణాలు భక్తులే తీసుకురావాలి. వేదపండితుల మంత్రోచ్చారణలతో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించవచ్చు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ముక్కంటి ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు

జ్ఞానతత్వం.. మేధా దక్షిణామూర్తి వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయం అక్షరాభ్యాసాలకు ఎంతో మహోన్నతమైనదని చెప్తారు. ఎందుకంటే రుషులకు వేద విజ్ఞానతత్వాన్ని బోధించే మేధా దక్షిణామూర్తి కొలువుదీరిన ఆలయం ఇది. మహాద్వారం నుంచి ఆలయంలోనికి అడుగు పెట్టగానే కన్పించే విశేష మహాసన్నిధి మేధా దక్షిణామూర్తి. అందుకే ప్రతి గురువారం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పాఠశాలలు పునః ప్రారంభించాక ప్రభుత్వం తరపున భారీగా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా వసంత పంచమితో పాటు ఎప్పుడైనా అక్షరాభ్యాసాన్ని జరిపించుకునే విధంగా ఇక్కడి ఆలయంలో ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ విశేష ఆర్జిత సేవ నిర్వహిస్తుంటారు.

హంద్రీ-నీవా.. వరిసాగుకు తోవ

▪ వ్యవసాయ బావుల్లోనూ సమకూరిన సాగునీటి వసతి

కూటమి ప్రభుత్వం గతేడాది ఆగస్టులో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చింది. నియోజకవర్గంలో 640 చెరువులుండగా.. మొదటగా 110 చెరువులకు నీటి వసతికి చర్యలు చేపట్టారు. కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లో ఇప్పటివరకు దాదాపు 80 చెరువుల్లో హంద్రీ-నీవా జలాలను నింపారు. అతిపెద్ద విస్తీర్ణం కలిగిన చెరువులతో పాటు కుంటలు, చెక్‌డ్యాంలలో కృష్ణాజలాల నిల్వలతో భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. ఏళ్ల తరబడి ఎండిపోయిన సేద్యపు బావుల్లోనూ నీటి వసతి ఏర్పడింది.

కుప్పం, న్యూస్‌టుడే:

నారసింహేపల్లె వద్ద బావి నీటితో వరిసాగు

బోర్లలో 300 అడుగులకే నీటి వసతి

ఒకప్పుడు కరవుకు నిలయంగా మారిన జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్యేకించి వేసవిలో పంట విరామాన్ని ప్రకటించుకున్న దుర్భర పరిస్థితులు లేకపోలేదు. నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారంగా చేపట్టిన హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం జలవనరుల్లో నీటి వసతి వల్ల బోర్లలో సమృద్ధిగా సాగునీటి వసతి ఏర్పడింది. గతంలో గరిష్ఠంగా 1,200 అడుగుల బోర్లలోనూ నీటి లభ్యత కనీస స్థాయిలో ఉండేది. ప్రస్తుతం కనిష్ఠంగా 300 అడుగులకే బోర్లలో నీరు లభిస్తోందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో తీరిక లేకుండా..

పశ్చిమ మండలాల రైతులు ప్రస్తుతం సేద్యపు పనుల్లో తీరిక లేకుండా గడుపుతున్నారు. సాగునీటి సమస్య వల్ల ఇదివరకు ఆరుతడి ఉద్యాన పంటలకే పరిమితమైన రైతులు ప్రస్తుతం వరి సాగును విస్తారంగా చేపడుతున్నారు. చెరువుల ఆయకట్టు భూములతో పాటు బావులు, బోర్ల నీటి ఆధారంగా వరిసాగుకు శ్రీకారం చుట్టారు. గతంలో బీళ్లుగా బారిన భూములతో పాటు వర్షాధారపు భూముల్లోనూ ప్రస్తుతం సాగునీటి ఆధారంగా పంటల సాగుతో ఎక్కడ చూసినా పచ్చదనం సంతరించుకోవడంతో పొలాలు.. గట్లు రైతులు.. కూలీలతో కళకళలాడుతున్నాయి.

కొన్నేళ్లుగా వ్యవసాయం చేయలేదు..

సేద్యపు బావి ఎండిపోవడంతో కొన్నేళ్లుగా వ్యవసాయం చేయలేదు. ప్రస్తుతం 'హంద్రీ-నీవా' జలాల రాకతో బావిలో పుష్కలంగా నీటి వసతి ఏర్పడింది. రెండున్నర ఎకరాల్లో వరితో పాటు పశుగ్రాసం, ఉద్యాన పంటల సాగు చేపడుతున్నా. కృష్ణా జలాలు కుప్పానికి రాకపోతే మా లాంటి వేలాది మంది రైతులు సేద్యపు పనులు లేక కూలీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది.

- నాగరాజు, నారసింహేపల్లె (శాంతిపురం)

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు అవసరం

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు, కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, అధ్యాపకులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: విద్యార్థి మనసులో పుట్టే చిన్న ఆలోచన సమాజానికి ఉపయోగపడే మహత్తర ఆవిష్కరణలు కావాలని ఎస్వీ విశ్వవిద్యాలయం ఉపకులపతి తాతా నరసింగరావు తెలిపారు. పి.కొత్తకోటలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఏఐసీటీఈ సహకారంతో ఏర్పాటు చేసిన వేము ఐడియా ల్యాబ్ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, స్టార్టప్ ఆలోచనలను పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రిన్సిపల్ నవీన్ కిలారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు

మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్ గౌరినేని

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో విజయవంతంగా వంద రోబోటిక్ మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేయడం తమకు ఎంతో గర్వకారణమని అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని తెలిపారు. గురువారం ఆస్పత్రిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి వరదరాజనగర్‌కు చెందిన 70 ఏళ్ల శంకర్‌నారాయణకు 100వ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యంత సురక్షితమన్నారు. రోగులు వేగంగా కోలుకుని సాధారణ స్థితికి వస్తారని వివరించారు. ఎంతో అనుభవం కలిగిన వైద్యులతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. వైద్యులు రవికుమార్, కృష్ణయ్య, హేమంత్ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులు, కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు దంపతులు

కడా పీడీ వివాహానికి హాజరైన సీఎం దంపతులు

కుప్పం పట్టణ, న్యూస్‌టుడే: జైపుర్‌లో జరిగిన కడా పీడీ వికాస్ మర్మత్ వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

COACHING CENTRES

2 నెల్లో 10th, ఇంటర్ (MPC, Bi.P.C, C.E.C) State Govt బోర్డ్ ద్వారా March 26, పరీక్షలు [illegible] Pass All CETS Eligible, Exam Center TPT. ✆ 99851 92105, 94406 50496.

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES

[illegible] ✆ 93969 99669.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

[illegible] AAVAS Phoenix Tower Smart Homes [illegible] 2 BHK, 3 BHK Flats [illegible] RERA Project. 9505502346.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

80085 13290

B/W: రూ. 600 Colour: రూ. 800

TO LET

APARTMENTS

TIRUPATI POSTAL Colony 3 BHK New Construction East Facing 1st Floor NRR Enclave - Near Pradepty Residency ✆9440847355

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 WPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted Sales Executive: Job Location Kadapa & Chittoor (Dist.). Qual: Dip/ B.Tech/ Degree. Exp: Fresher/ 2-3 yrs. Salary: 20-30K + TA & DA. Cont: 83286 75684 or mail: jkmedicalsystems@gmail.com

WANTED TELECALLER & PRO -04, Marketing Executive -50. Same Mandal in Work Cont: 88013 98165.

WANTED IMMEDIATELY PRO's & Higher Biology Teacher for a reputed School in Mangalam & Tirupati. Con: 81790 67247.

[illegible] ✆ 93928 46185.

[illegible] 94405 81161.

[illegible] Cont: 80999 80999, 88866 02345.

గమనిక [illegible]

ఏప్రిల్ నుంచి వీబీ జీ రామ్‌జీ

మార్చి నెలాఖరుకు ఉపాధి హామీ పనుల పూర్తికి పరుగులు

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మార్చి నెలాఖరుతో ఉపాధి హామీ పథకం శకం ముగియనుంది. ఆపై వీబీ జీ రామ్‌జీ పేరుతో సరికొత్తగా ప్రారంభం కానుంది. ఈ లోపు పనులు, పద్దులను పూర్తి చేయాలని అధికారులు దృష్టి సారించారు. సమయం తక్కువగా ఉండడంతో నిత్య సమీక్షలతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో హడావుడి నెలకొంది.

ఇప్పటికే స్పష్టతనిచ్చిన కేంద్రం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా గ్రామీణ నిరుపేద కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాలన్న ఉద్దేశంతో 2005లో ప్రారంభమైంది. నరేగాలోనే నిధుల కన్వర్జెన్సీ ద్వారా అనేక భవనాలు, వసతులు సమకూరాయి. ఈ పథకం వచ్చే మార్చి 31తో ముగియబోతోంది. ఏప్రిల్ 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ(వీబీజీరామ్‌జీ) పేరుతో సరికొత్త నిబంధనలతో ప్రారంభం కానుంది. దీనిపై ఇటీవల రాష్ట్రాలకు కేంద్ర స్పష్టత ఇవ్వగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లోని అన్ని పనులను ముగించాలని స్పష్టం చేయడంతో డ్వామా అధికారులు యుద్ధ ప్రాతిపదికన కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

మొక్కలు నాటడం, రోడ్ల నిర్మాణం, పంట కుంటల తవ్వకం, ఇలా అనేక పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉంటే బిల్లులు యుద్ధ ప్రాతిపదికన చెల్లిస్తున్నారు. గోకులాలు, పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, ఇలా అనేకం నిర్మాణంలో ఉండడంతో మార్చి 31లోగా పూర్తవుతాయా అన్న అనుమానాలున్నాయి. ఈ విషయాన్ని అధికారులు ఉన్నత స్థాయికి నివేదించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో స్పష్టత కోరారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 45 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా, 23 లక్షల పని దినాలు పూర్తయ్యాయి.

మారిన నిబంధనలు

కొత్త విధానంలో లేబర్, మెటీరియల్ బడ్జెట్ నుంచి పరిపాలన ఖర్చుల వరకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలి. ఇందులో కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, గ్రామీణులకు జీవనోపాధి కల్పనపైనా దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. కూలీలకు వివిధ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొత్త విధానంలో ఆధునిక సాంకేతికత, బయోమెట్రిక్ హాజరు, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ(డీబీటీ) అయ్యేలా నిబంధనలు అమలు చేయనున్నారు.

క్రిస్టియన్ వివాహ ధ్రువీకరణ పత్రాల జారీకి

పాస్టర్ నియామకం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో క్రిస్టియన్ల వివాహ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్చి ఉపాసకులకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి చిట్టూరు శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గుడిపాల మండలం రామాపురం చర్చి పాస్టర్ పి.శామ్యూల్ సెల్వ కుమారన్‌ను నియమించారు. 10 సంవత్సరాల పాటు ఆయనకు వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే అవకాశం కల్పించారు.

రూ.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 2026-27 ఆర్థికానికిగానూ రూ.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌ను ఆమోదించారు. చిత్తూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరిగింది. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ చిత్తూరులో జరుగుతున్న జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణ పనుల్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సెస్సు బకాయిల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, పాఠకుల సౌకర్యార్థం పుస్తక నిక్షిప్త కేంద్రాల సంఖ్యను పెంచాలని, పోటీ పరీక్షల సన్నద్ధమయ్యే యువత కోసం ప్రత్యేక రెఫరెన్స్ విభాగాలు ఏర్పాటుచేయడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, డీఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పంపిణీలో సంతృప్తి శాతం పెంచాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ప్రజల సంతృప్తి శాతాన్ని పెంచకపోతే చర్యలుంటాయని జేసీ రాజేంద్రన్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో గ్యాస్ సిలిండర్ల సరఫరా డీలర్ల నిర్వాహకులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల సంతృప్తి శాతంలో జిల్లా చాలా వెనుకబడిందన్నారు. సంతృప్తి శాతంలో పురోగతి సాధించాలన్నారు. డీఎస్వో శంకరన్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు లక్ష్మి, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ కళాశాలలపై విద్యార్థి సంఘాల ఫిర్యాదు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న నకిలీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వీసీ ఆచార్య నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావులకు పలు విద్యార్థి సంఘాల నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విద్యార్థులను చేర్చుకుంటూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాల నిబంధనలు అతిక్రమించడంతో రూ.10 లక్షలు జరిమానా విధించగా.. సగం మాత్రమే చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని వసూలు చేయాలన్నారు. తిరుపతి ఆటోనగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా కళాశాలలు నడుపుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని సమర్పించారు.

నడుమూరు అడవిలో తమిళనాడు వాసి ఆత్మహత్య

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో తమిళనాడు వాసి మృతి చెంది ఉండటాన్ని గురువారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను ఆరా తీశారు. మృతుడి వద్ద లభించిన ఆధార్.. చరవాణి ఆధారంగా తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కేంద్రంలోని పాతపేటకు చెందిన గుణశేఖర్(37)గా గుర్తించారు. మృతుడు కృష్ణగిరిలోని ఓ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూ అక్కడ కొంత బంగారం మాయమైన వ్యవహారంలో మనస్తాపం చెంది.. ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజులుగా కనిపించడంలేదని కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యువకుడిని అపహరించి.. నగదు దోపిడీ..!

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

నిందితులతో తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు, పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిచయం లేని యువకుడిని అపహరించి.. రూ.60 వేలు నగదు దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. 'తిరుపతి ఆటోనగర్‌కు చెందిన అఖిల్.. తాజ్ హోటల్‌లో పనిచేస్తారు. ఈ నెల 11న నగరంలోని తుడా రోడ్డులో మద్యం మత్తులో ఉండగా.. అదే సమయంలో కారులో వచ్చిన నలుగురు అఖిల్‌ను కారులో అపహరించారు. అతన్ని కొట్టి సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్ పిన్ నంబరు తెలుసుకున్నారు. చరవాణి నుంచి గేమింగ్ స్కానర్‌కు రూ.60 వేలు నగదు పంపించుకున్నారు. అఖిల్‌తో బలవంతంగా మత్తు పదార్థాలు తాగించి స్పృహ కోల్పోయాక కారు నుంచి గెంటేశారు. కోలుకున్న అఖిల్ బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించి.. ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చింతల చేను రైల్వే గేటు వద్ద ఉన్న నలుగురిని గురువారం అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఎర్రసానిపల్లి గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ (27) కొంతకాలంగా తిరుపతి కొర్లగుంటలోని సోదరి ఇంట్లో ఉంటూ డ్రైవింగ్ చేస్తుంటారు. అతనికి పుత్తూరు సమీపంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న శ్రీనగర్ కాలనీకి చెందిన యోగేష్ (21), చిన్నగొట్టిగల్లు మండలం నల్లంట్లవారిపల్లెకు చెందిన గురుప్రకాష్ (21), బుచ్చినాయుడుకండ్రిగ మండలం తనిగల్లుకు చెందిన చరణ్ (21)తో పరిచయం ఏర్పడింది. అందరూ మద్యం మత్తులో అఖిల్‌ను అపహరించి ఫోన్‌లో నగదు కాజేశారు. నిందితుల నుంచి కారు, రూ.24 వేలు నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కళాశాల బస్సులో పొగలు

మదనపల్లె రోడ్డులో పొగలు కమ్ముకున్న కళాశాల బస్సు

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ ప్రైవేటు కళాశాల బస్సు విద్యార్థులతో వెళ్తుండగా ఆకస్మికంగా పొగలు కమ్ముకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గంగవరంలోని ఓ ప్రైవేటు కళాశాల బస్సు.. కళాశాల ముగిసిన తర్వాత సాయంత్రం విద్యార్థులను తమ గ్రామాలకు తరలించడానికి బయలుదేరింది. కొద్ది దూరం రాగానే బస్సులో నుంచి దట్టమైన పొగలు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురై వాహనం నుంచి కిందకు దిగారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలాన్ని సీఐ రాంభూపాల్ పరిశీలించి విద్యార్థులను వేరే బస్సులో తరలించారు.

విద్యుత్తు తీగలు తగిలి వ్యక్తి మృతి

రామ్మూర్తిరెడ్డి (పాతచిత్రం)

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం మారేడుపల్లె గ్రామంలో విద్యుత్తు తీగలకు ఓ వ్యక్తి బలయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులరెడ్డి జంతువుల నుంచి తన వేరుసెనగ పంట రక్షణకు అక్రమంగా విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన రామ్మూర్తిరెడ్డి(35) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. బహిర్భూమికని వాహనాన్ని ఆపాడు. సమీపంలోని శ్రీనివాసులరెడ్డి పొలంలోకి వెళ్లగా విద్యుత్తు తీగలు కాలికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పొలంలోనే ఉన్న రైతు శ్రీనివాసులరెడ్డి.. రామ్మూర్తిరెడ్డి మృతదేహాన్ని చూసి భయాందోళన చెందాడు. మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశాడు. రామ్మూర్తిరెడ్డి రాత్రికి ఇంటికి రాకపోవడంతో భార్య బుజ్జి గ్రామస్థులతో కలిసి వెతికినా ఆచూకీ కనిపించలేదు. రామ్మూర్తిరెడ్డి ద్విచక్రవాహనం శ్రీనివాసులరెడ్డి పొలం సమీపంలో గురువారం ఉదయం కనిపించడంతో శ్రీనివాసులరెడ్డిని నిలదీశారు. దీంతో అతను అసలు విషయం చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెరువులోని రామ్మూర్తిరెడ్డి శవాన్ని వెలికితీసి, శవ పరీక్షల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామ్మూర్తిరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేరణతో నైపుణ్యాలు మెరుగు

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపడుతాయని నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ గీత అన్నారు. గురువారం విద్యాలయంలో అనుభవ పూర్వక అభ్యాసం కార్యక్రమం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2,881 మంది బాలబాలికలు నమోదు చేసుకోగా 136 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి, భారతదేశంపై దార్శనికత, వికసిత్ భారత్ అంశాల్లో వ్యాసరచన, కవితా రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 30 మంది విజేతలను ఎంపిక చేశామని, వారు గుజరాత్ రాష్ట్రంలోని పురాతన చారిత్రక పట్టణం వాద్‌నగర్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. నిర్వాహకులు సురేంద్రన్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

'మై టీడీపీ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: తెదేపా కుటుంబసభ్యులు అందరు విధిగా 'మై టీడీపీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరులో గురువారం లీడర్ టు క్యాడర్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాలాజీ, హేమంత్, తడుకు సింగిల్‌విండో అధ్యక్షుడు కరుణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య, నాయకులు

ఉపయుక్తంగా గ్రంథాలయాలు

పుత్తూరు: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు శాఖా గ్రంథాలయాన్ని గురువారం తనిఖీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దామోదర యాదవ్

తవణంపల్లె, న్యూస్‌టుడే: అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరసింహనపల్లెకు చెందిన దామోదరయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వాసుదేవన్ యాదవ్‌ను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ మండల కమిటీని ధ్రువీకరిస్తూ నియామకపత్రం అందించారు.

రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా మొగిలీశ్వరస్వామి రథోత్సవం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలీశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు మిరియాలు, బొరుగులు రథంపై చల్లి, కర్పూర హారతులు, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ మాడవీధులు కిక్కిరిపోయాయి. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో సీఐ శ్రీనివాసులు, గంగవరం, పలమనేరు, బైరెడ్డిపల్లె సీఐలు, ఎస్సైలు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన రమేష్‌రాజు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి

గజ వాహనంపై పార్వతీపరమేశ్వరులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరులు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. గ్రామస్థులు స్వామి వారికి పూజలు చేసి మంగళ హారతులిచ్చారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మురకంబట్టు సమీపంలోని మైనారిటీ గురుకులంలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నజీరాభాను గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు https://apcfss.in వెబ్‌సైట్ ద్వారా మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24వ తేదీ నిర్వహించనున్నారని, ఇతర వివరాలకు 87126 25058 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్తు కోతలకు చెక్

- అంతరాయం లేని సరఫరాకు చర్యలు
- వేసవి ప్రణాళికలో చిత్తూరు అర్బన్ డివిజన్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: వేసవి ముంచుకొస్తున్న తరుణంలో విద్యుత్తు శాఖ అప్రమత్తమైంది. వేసవిలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ఆ శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కార్యాచరణ ప్రణాళికలకు శ్రీకారం చుట్టారు. వేసవి డిమాండ్‌ను అధిగమించి.. కోతలకు చెక్ పెట్టి.. నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టారు.

గాంధీరోడ్డులోని విద్యుత్తు ఉపకేంద్రం

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఓవర్ లోడు సర్దుబాటు, అంతరాయం లేని సరఫరాకు డివిజన్ పరిధిలోని పొలకల, అనుప్పల్లి ఉప కేంద్రాల్లో ఐదు ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. బంగారుపాళ్యంలో 5-8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన రెండు, కేజీపత్రంలో ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

30 అదనపు నియంత్రికలు

వేసవి దృష్ట్యాలో ఓల్టేజి సమస్యను అధిగమించేందుకు డివిజన్‌లోని ఆరు సెక్షన్లలో ఐదు చొప్పున 30 అదనపు నియంత్రికలు అమర్చనున్నారు. అధిక లోడు ప్రాంతాలను గుర్తించి 100కేవీ, 63కేవీ నియంత్రికల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

కేటగిరీల వారీగా వినియోగదారులు

మొత్తం సర్వీసులు: 2,41,370
గృహ: 1,69,484
వ్యవసాయం: 41.850
వాణిజ్య: 22,289
పరిశ్రమలు: 1,532
ప్రభుత్వ సర్వీసులు: 6,215
ప్రస్తుతం రోజుకు విద్యుత్తు వినియోగం: 71.39 మిలియన్ యూనిట్లు
గతేడాది మార్చి, ఏప్రిల్ నెలలో: 78–80 మిలియన్ యూనిట్లు

కొత్తగా మూడు ఉప కేంద్రాలు

డివిజన్ పరిధిలో కొత్తగా చిత్తూరు రామనగర్‌కాలనీలో, తవణంపల్లె మండలం కామాలూరులో, యాదమరి మండలంలో ఒకటి చొప్పున మూడు 33 కేవీ ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. లో ఓల్టేజి, అంతరాయాల్లేని విద్యుత్తు సరఫరా, విద్యుత్తు నష్ట నివారణకు ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో బంగారుపాళ్యంలో 132కేవీ ఉపకేంద్రాన్ని నిర్మించనున్నారు.

రూ.5 కోట్లతో కొత్త లైన్లు

అధిక లోడు నివారణకు దొడ్డిపల్లి-కట్టమంచి ఉపకేంద్రాల మధ్య 7 కి.మీ పరిధిలో 33కేవీ లైను, ఎంఎస్ఆర్ కూడలిలోని ఇండోర్-గాంధీరోడ్డు ఉపకేంద్రాల మధ్య కి.మీ పొడవున ప్రత్యామ్నాయ లైను, గిరింపేటలో లో ఓల్టేజి సమస్య పరిష్కారానికి అర కి.మీ పొడవున కొత్త లైను ఏర్పాటు చేయనున్నారు. ● గుడిపాల మండలం పాపసముద్రం నుంచి తుమ్మిందపాళ్యం కేంద్రాల మధ్య 4 కి.మీ మేర, బంగారుపాళ్యం మండలం నూనెగుండ్లపల్లె-యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లె కేంద్రాల మధ్య 33కేవీ విద్యుత్తు లైన్ల నిర్మాణానికి కసరత్తు వేగవంతం చేశారు.

నేటి నుంచి నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

చిత్తూరు(నేరవార్తలు): మురకంబట్టులోని చిత్తూరు-పూతలపట్టు రైల్వే మార్గంలో ట్రాక్ మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే లెవల్ క్రాసింగ్ నంబరు 22 పూర్తి ట్రాక్‌ను అప్‌గ్రేడేషన్ చేయనుండటంతో శుక్రవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లించనున్నట్లు చెప్పారు. అటువైపుగా వచ్చే ప్రజలు ప్రత్యామ్నాయంగా చిన్నకొత్తింటి గ్రామం, పూనేపల్లి కాలనీ, పెనుమూరు రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ వితరణ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో గురువారం ఎస్పీ తుషార్‌డూడికి బీవీరెడ్డి పాఠశాల ఛైర్మన్ నచికేత్‌రెడ్డి అత్యాధునిక డ్రోన్ కెమెరాను వితరణగా అందించారు. చిత్తూరు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ కోసం డీజేఐ ఎయిర్-3ఎస్ మాడల్ డ్రోన్ కెమెరాను అందించారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: హిందూ స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్ని విశ్వహిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహ కూడలి వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. నాయకులు రామమూర్తి, కొత్తూరు బాబు, గుత్తా ప్రభాకర్‌నాయుడు, జయకుమార్, వెంకటేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ● **చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** ఛత్రపతి శివాజీ యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఏ విభాగాధిపతి గోపినాయక్ తెలిపారు. శివాజీ జయంతిని ప్రభుత్వ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వైద్య రంగంలో ఏఐతో ఎన్నో మార్పులు

పట్టాలందుకున్న విద్యార్థులతో డాక్టర్ రవిప్రభు తదితరులు

పుత్తూరు, న్యూస్‌టుడే: వైద్య రంగంలో ఏఐతో ఎన్నో మార్పులు రానున్నాయని, తద్వారా రోగులకు సత్వరం మంచి వైద్యం అందించే అవకాశం ఉంటుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు పేర్కొన్నారు. పుత్తూరు కేకేసీ హోమియోపతి వైద్య కళాశాలలో గురువారం మొదటి దీక్షాంత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేకేసీ విద్యాసంస్థల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ ఛైర్మన్లు నరసింహారావు, రవిశేఖర్, మంజుల, వైష్ణవి, ప్రిన్సిపల్ శరవణ, సలహాదారులు దామోదరం, హరినాథ్‌శెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలాలయంలోకి విగ్రహాల మార్పు

గుడిపాల, న్యూస్‌టుడే: మండలంలోని చీలాపల్లె గ్రామంలో గల పురాతనమైన శ్రీపెరుమాళ్‌స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయం నుంచి స్వాముల విగ్రహాలను గురువారం అర్చకులు బాలాలయంలోకి మార్చారు. ఆలయం పురాతనమైనది కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.48 లక్షలు మంజూరు చేసింది. దాతలు మరో రూ.12 లక్షలు అందించారు. ఈ నిధులతో గుడి పునర్ నిర్మించడానికి ఈ నెల 26న శంకుస్థాపన చేయనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక జెండా మాను వీధిలోని డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. –స్థానికులు

సమాధానం: పూడికతీత పనులు చేపడతాం.
–లోకేష్, నగరపాలక ఆరోగ్యాధికారి

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమస్య: సింహరాజుపురం పంచాయతీ మఠవలం గ్రామానికి వెళ్లే రహదారి ముళ్లకంపలతో కమ్ముకుంది. గ్రామానికి వెళ్లాలంటేనే దారి కనిపించక ఇబ్బందులు తప్పడం లేదు. వీధి లైట్లు లేక చీకట్లో నడవలేకపోతున్నాం. –గ్రామస్థుడు

సమస్య: రహదారిలో విపరీతంగా పెరిగిన ముళ్లకంపలను తొలగించి, వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తాం. –సతీష్, ఎంపీడీవో

ఆశా కార్యకర్తల జీతాలు పెంచాలి

నగరి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలకు గత ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య డిమాండ్ చేశారు. నగరిలో గురువారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి చందామెర్సై, నాయకులు విజయలక్ష్మి, ఇందిర, పుష్ప, జయప్రద, లక్ష్మి, రేణుక, జయమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల సీఎం సహాయ నిధి పంపిణీ

నగరి, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 587 పేదలకు నగరి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5,05,00,582 ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా అడగ్గానే సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE OF CHITTOOR (SENIOR DIVISION)
E.P. No. 38 of 2024
O.S. No. 264 of 2017
Between:
Smt.S.Shaihanaz ..Decree Holder
And:
S.Zareena ...Judgment debtor
PUBLIC AUCTION - NOTICE
The schedule mentioned property will be sold in public auction on **09.03.2026 between 10.30 a.m. and 5.00 p.m.** by the Hon'ble Addl. Senior Civil Judge's Court, Chittoor. The intending bidders can participate and bid in the auction as per the Terms and Conditions of proclamation made in the Notice Board.
SCHEDULE
Chittoor District - Chittoor Mandal -Chittoor Town - Mittoor Extension G.D. Reddy colony bearing, D.No. 19/588/2B- Terraced house situated within the following boundaries
East: Jayalakshmi Nilayam house bearing No. 19/588/2
West: House and Vacant place
North: House and vacant place
South House and vacant place
Measuring East to West 35 sq.ft. North to South 20 sq.ft.
Total extent of property 700 sq.ft
D.Hr. Value Rs. 15,00,000/-
Amin Value Rs. 30,00,000/-
Market value: Rs.44,86,000/-
Sd/-**P.DAYASEKAR**
Advocate for Decree Holder

ప్రమాదకరంగా మట్టికుప్పలు

పెనుమూరు-చిత్తూరు మార్గంలో కొందరు తరలించిన మట్టికుప్పలు ప్రమాదకరంగా ఉన్నాయి. పెనుమూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఇళ్లు కూల్చిన వ్యర్థాలను తీసుకువచ్చి చిత్తూరు మార్గంలోని ఈతమాకుల కుంట కట్టపై పడేస్తున్నారు. వీటిని రోడ్డుపైనే వేయడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో పక్కకు వెళితే ప్రమాదాలు తప్పవనే భయం వాహనదారులను వెంటాడుతోంది. ముఖ్యంగా రాత్రిళ్లు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. –న్యూస్‌టుడే, పెనుమూరు

కూలిన ప్రహరీ.. వెనుకనే బావి

తుపాను ప్రభావానికి వెంగళరాజుకుప్పం పోస్టాఫీసు వద్దనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పక్కనే ప్రమాదకర బావి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బావి పక్కన పడిపోయిన ప్రహరీని నిర్మించి ప్రమాదం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో రాజేంద్రప్రసాద్ వివరణ కోరగా రూ.1.49లక్షలు మంజూరైనట్లు, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, పాలసముద్రం

తాగునీరు రోడ్డుపాలు

ప్రజల దాహం తీర్చాల్సిన తాగునీరు వృథాగా రోడ్డుపై మడుగుగా పారుతోంది. తాగునీటి పైపులైను లీకేజీ కావడంతో నగరి పట్టణం పుదుపేట ప్రధాన రోడ్డులో తాగునీరు ఇలా వృథాగా పోతోంది. సమస్య నెల రోజులుగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. వేసవి కాలం మొదలైందని ఇలాంటి పరిస్థితిలో తాగునీరు రోడ్డు పాలైతే ప్రజలకు తాగునీరు అందేదెలా అని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పైపులైను లీకేజీని అరికట్టాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, నగరి

యువకుడిపై పోక్సో కేసు

పుత్తూరు, న్యూస్‌టుడే: బాలికను నమ్మించి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటనపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. పుత్తూరు పట్టణానికి చెందిన బాలికను తిరుపతికి చెందిన యువకుడు యూనస్(23) మూడు రోజుల క్రితం తీసుకెళ్లాడు. గురువారం యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని సీఐ చెప్పారు.

గ్రానైట్ లారీ స్వాధీనం

పెనుమూరు, న్యూస్‌టుడే: గుడ్యానంపల్లె నుంచి చిత్తూరుకు అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టామని అన్నారు. కలవకుంట వద్ద లారీలో గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మైన్స్, జీఎస్టీ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన అవసరం

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. పుత్తూరు రాస్ కార్యాలయంలో పొదుపు సంఘాల సమావేశం జరిగింది. రాస్ సిబ్బంది వేదాచలం, బాలకృష్ణ, ప్రకాష్, మునిపార్థసారథి, మణి, ఉషారాణి, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

పొలం తగాదాలో యువకుడిపై దాడి

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: సమీప బంధువుల మధ్య పొలం విషయమై నెలకొన్న తగాదా ఓ యువకుడిపై దాడికి దారి తీసిన సంఘటన మండల పరిధి కమ్మకండ్రిగలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌కు గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. పక్కనే సమీప బంధువుల పొలం ఉంది. సరిహద్దుల విషయమై ఇరువర్గాల మధ్య తరచూ వాగ్వాదాలు చోటుచేసుకునేవి. గురువారం పొలం వద్ద మరోమారు గొడవ చోటు చేసుకోవడంతో ప్రత్యర్థి వర్గం ప్రేమ్‌కుమార్‌పై దాడికి పాల్పడి గాయపరిచారు. యువకుడిని తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

స్వశక్తితో ముందుకు

● వ్యాపారాల్లో రాణిస్తున్న నగరి మహిళలు

నగరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయం ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే నినాదాన్ని నిజం చేస్తున్నారు నగరికి చెందిన పలువురు మహిళలు. నగరిలో వస్త్ర ఉత్పత్తి ఒక కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది. ఆ కుల వృత్తినే వ్యాపారంగా చేసుకొని మెప్మా ద్వారా అందిన ఆర్థిక ప్రోత్సాహంతో వస్త్ర ఉత్పత్తిలో రాణిస్తూ కుటుంబ పోషణలో ఆదర్శంగా నిలుస్తున్నారు నగరికి చెందిన కొందరు మహిళలు.

వస్త్ర ఉత్పత్తిలో అభిరామి

ఏకాంబరకుప్పం శ్రీమురుగన్ స్వయం సహాయక సంఘం సభ్యురాలు అభిరామి. వస్త్ర ఉత్పత్తిలో సుమారు రూ.కోటి లావాదేవీలు నిర్వహిస్తూ ఏడాదికి రూ.10 లక్షలు ఆదాయం పొందుతున్నారు. తన కుటుంబసభ్యులతో పాటు సంఘ సభ్యులు మరో 12 మందికి ఆమె ఉపాధి కల్పిస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో నూలు ఒడికే ప్రక్రియ నుంచి మరమగ్గంపైకి పావును అందించి, వస్త్రం తయారు చేయడం వరకు సంఘ సభ్యుల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నారు.

ఆరుగురికి ఉపాధి కల్పిస్తూ..

సత్రవాడ శ్రీవారి స్వయం సహాయక సంఘం సభ్యురాలు పరమేశ్వరి. కులవృత్తి మరమగ్గం ద్వారా వస్త్ర ఉత్పత్తి చేసే కుటుంబం కావడంతో భర్త సహకారంతో ప్రతి ఏటా రూ.25 లక్షల వరకు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం పొందడమే కాకుండా తన సంఘ సభ్యులు ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. కుటుంబసభ్యులకు ప్రతి రోజూ పని కల్పిస్తూ, తానూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. భవిష్యత్తులో వస్త్ర ఉత్పత్తిని పెంచడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు ధీమాగా చెబుతున్నారు పరమేశ్వరి.

లిక్విడ్ల దుకాణంతో జయంతి

నగరి పట్టణంలోని రామానాయుడు కాలనీలో శ్రీరామ్ స్వయం సహాయక సంఘం సభ్యురాలు జయంతి. పట్టణ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల లిక్విడ్లు విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నారు. దుస్తుల శుభ్రం, బాత్‌రూం క్లీనింగ్, గృహ అవసరాలకు సంబంధించిన లిక్విడ్లు అందుబాటులో ఉంచుతున్నారు. దీని ద్వారా ఏటా రూ.10 లక్షల లావాదేవీలు నిర్వహిస్తూ ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం పొందుతున్నారు. సంఘ సభ్యులు మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా శ్రీనివాసులు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా 102ఇ.రామిరెడ్డిగారి పల్లె వీఆర్వో **శ్రీనివాసులు** ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. గురువారం పులిచెర్ల తహసీల్దారు కార్యాలయంలో సంఘ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా డి. మౌనిక, కోశాధికారిగా మహేశ్, సంయుక్త కార్యదర్శిగా సుబ్ర హ్మణ్యంతో పాటు 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

పన్నుల వసూలుకు ఆదేశం

చౌడేపల్లె: పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని మదనపల్లె డీఎల్ పీవో నాగరాజు కోరారు. రూ.63.43 లక్షలకు గాను రూ.45.55 లక్షలు వసూలైనట్లు చెప్పారు. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వసూ లైన నగదు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో చెల్లిం చాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ మహేశ్ పాల్గొన్నారు.

21న మాతృభాషా సదస్సు

పలమనేరు, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వ ర్యంలో ఈ నెల 21న పట్టణంలోని కళా మందిరంలో మాతృభాషా పరిరక్షణ దినో త్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు తులసినాథంనాయుడు గురువారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) పలమనేరు: 80085 74580 కుప్పం పట్టణం: 80085 73490 పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని ప్యాలెస్ రోడ్డు కూడలిలో వీధి దీపం ఏర్పాటు చేసేందుకు గుంతను తవ్వారు.. పూడ్చలేదు. రోడ్డు మధ్యలో ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. - చంద్ర, కుప్పం
సమాధానం: వీధి దీపం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, కమిషనర్

సరస్వతి దేవికి నమస్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలి

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నతాశయంతో చదివి, కలలు సాకారం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాసులు సూచించారు. గురువారం రొంపిచెర్ల క్లస్టర్‌లోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహం ఆవిష్కరించారు. పది విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణపై ఉపాధ్యాయులు సూచనలు చేశారు. హెచ్ఎం జాఫర్ బాషా, ఉపాధ్యాయులు ప్రకాశ్, నారాయణ, రాజేంద్ర, కల్యాణ్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి..

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సమాజంలో రేపటి పౌరులుగా ఎదిగే విద్యార్థులు ఉన్నతాశయంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని విశ్రాంత ఎంఈవో సాయి లీల పేర్కొన్నారు. స్థానిక బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా వార్షికోత్సవం, సరస్వతి పూజ నిర్వహించారు.

నిర్మాణం సరే.. నివాసం ఉండేదెలా..?

● మూతపడిన పక్కా గృహాలు
● నిరాశలో లబ్ధిదారులు

రెడ్డివారిపల్లె కాలనీలో నిరుపయోగంగా ఇళ్లు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండలంలోని రాళ్లబూదుగూరు పంచాయతీలో రెడ్డివారిపల్లె వద్ద వైకాపా హయాంలో నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. 80 కుటుంబాలకు స్థలాలను కేటాయించి.. ఇళ్లను మంజూరు చేశారు. సుమారు 50 మంది లబ్ధిదా రులు ఇళ్లను నిర్మించుకున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కాలనీలో ఇళ్లు నిరుపయో గమై.. దుస్థితికి చేరుకొంటున్నాయి.

వైకాపా ప్రభుత్వం ప్రచార్భాటంగా చేపట్టిన కాల నీల నిర్మాణం వల్ల లబ్ధిదారులకు ఆశించిన ప్రయో జనం చేకూరలేదు. చాలా చోట్ల జనావాసాలకు దూరంగా.. రాళ్లు, గుట్టల మధ్యలో నేతల ఇష్టారా జ్యంగా కాలనీ స్థలాలను ఎంపిక చేశారు. లబ్ధిదా రులకు చాలా వరకు ఇష్టం లేకపోయినా.. సొంతింటి కల సాకారం ఆశతో నానా అవస్థలు ఎదుర్కొని.. ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రభుత్వం నుంచి సకా లంలో.. సక్రమంగా బిల్లుల చెల్లింపు లేకున్నా.. అప్పులు చేసి చాలా చోట్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు.

కనీస వసతులు లేక..

కొంగుమదుగు పంచాయతీ రామాపురం వద్ద జగ నన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నారిదొడ్డి పంచాయతీ కేజీపల్లె, రాళ్ల బూదుగూరు సమీపంలోని ఎన్టీఆర్ కాలనీల్లోనూ లబ్ధిదారులు వసతుల కోసం నిరీక్షిస్తున్నారు. రహదా రులు, వీధుల అభివృద్ధితో పాటు తాగునీరు, విద్యుత్తు తదితర కనీస సౌకర్యాలు లేనందున కాల నీల్లో నివసించేందుకు అవస్థలు పడుతున్నారు.

అందని బిల్లులు..

కాలనీల్లో పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా మారాయి. గత ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపు లేనందున చాలా వరకు పునా దులు, గోడల దశలో నిర్మాణాలు ఆగిపోయాయి. పలువురు లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణా లను చేపట్టినా.. పూర్తి చేయలేని పరిస్థితిని ఎదు ర్కొంటున్నారు. అసంపూర్తి నిర్మాణాల మధ్య పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో చిన్నపాటి అడ వులను తలపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూటమి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం పూర్తి కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. సంబం ధిత అధికారులు క్షేత్రస్థాయిలో అసంపూర్తి నిర్మా ణాలను పరిశీలించి ప్రభుత్వం ద్వారా సాయం అందించాల్సిందిగా పేదలు కోరుతున్నారు.

కాలువలు శుభ్రం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ముత్యాలరెడ్డిపాళ్యంలో మురుగు కాలువలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు తొలగించారు.

స్పందించారు.. శుభ్రం చేశారు

రామకుప్పం, న్యూస్‌టుడే: మండల పరిధి లోని మిట్టపల్లెలో 'మురుగు కాలువలో తాగు నీటి పైపు' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో లక్ష్మీ కాంత్, ఈవో సోమశేఖర్ తక్షణమే కార్మికుల చేత తాగునీటి పైపును కాలువ నుంచి వేరు చేసి సమస్యను పరిష్కరించారు. ● అలాగే తాగునీటి ట్యాంకు సమీపంలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో శుభ్రం చేయించారు.

తొట్టెలో నీటి వసతి

శాంతిపురం, న్యూస్‌టుడే: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన తొట్టెల్లో నీటి వసతి లేకపోవడంపై 'నిరుపయోగం' శీర్షికన ఈ నెల 8 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. నడింపల్లె పంచాయతీ రంగేపల్లె వద్ద తొట్టెలో నీటి వసతిని కల్పించారు.

కోతికి చిక్కదు కొబ్బరి చిప్ప..!

కొబ్బరి కాయలకు మార్కెట్‌లో ఆశించిన డిమాండు.. ధరలు లభిస్తున్న నేపథ్యంలో.. కొబ్బరి బొండాలు.. కాయల రక్షణకు రైతులు వినూత్న మార్గాలు ఆచరిస్తున్నారు. కుప్పం ప్రాంతంలో కొబ్బరి తోటలపై వానరాల దాడులు అధికం కావడంతో.. నివారణోపాయంగా చెట్లకు ఇనుప రేకులను ఏర్పాటు చేస్తున్నారు. రేకులు ఏర్పాటు చేయడంతో కోతులు చెట్టు ఎక్కేందుకు యత్నించినా కిందకు జారిపోతాయని అన్నదాతలు అంటున్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

చకచకా అన్న క్యాంటీన్ నిర్మాణం

మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ నిర్మాణాన్ని చకచకా చేపడుతున్నారు. గడిచిన మూడేళ్లుగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం ప్రాంగణంలో క్యాంటీన్‌ను నిర్వహిస్తూ.. ఉచిత భోజన వసతితో పేదల ఆకలిని తీరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా అన్న క్యాంటీన్ నిర్వహణకు సొంత భవన వసతి కోసం నిధులు కేటాయించడంతో. . బస్టాండుకు సమీపంలో నిర్మాణాన్ని చేపడుతున్నారు. వచ్చే నెలలో నూతన భవనం ప్రారంభోత్సవానికి పనులు వేగవంతం చేశారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

సూచిక.. ప్రమాదాల పాచిక

అమృత్ భారత్ పథకంలో భాగంగా కుప్పం రైల్వేస్టే షన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం వెలుపలకు, మరుగుదొడ్లకు దారి చూపుతూ రైల్వే శాఖ బోర్డును ఏర్పాటు చేసింది. స్టేషన్ సమీపంలో ఉన్న బోర్డును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బోర్డు ధ్వంసమైంది. ప్రస్తుతం బోర్డు కూలేందుకు సిద్ధంగా, ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి బోర్డును పక్కకు మార్చడమో.. లేదా బాగు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

ప్రజాధనం.. దుర్వినియోగం

మండలంలోని పెద్దవెలగటూరులో గత ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న పాల వెల్లువ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. రూ.15లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిపివేశారు. భవనాన్ని సగం పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో దాదాపు రెండేళ్లుగా ఇలా అసంపూర్తిగా ఉంది. ప్రజా ధనం వృథా కాకుండా అధికారులు స్పందించి భవన పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

సారూ.. ఇటువైపు చూడరూ..!

మండలంలోని రాయలపేట సమీపంలో సోలిపల్లె వద్ద ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహానికి వెళ్లేదారి సరిగా లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. వస తిగృహానికి వచ్చే దారిలో మురుగునీరు నిలిచిపోతోంది. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు వసతి గృహానికి దారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

'సంజీవని' వైద్య సేవలపై విస్తృత ప్రచారం

సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

శాంతిపురం, న్యూస్‌టుడే: కుప్పం నియోజకవ ర్గంలో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న సంజీవని వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని మండల తెదేపా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల సచివాలయంలో ఏర్పాటు చేసిన సంజీవని ప్రాజెక్టు అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా నాలుగు మండలాల్లో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ 49 రకాల ఉచిత వైద్య పరీక్షలను చేయించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు విజయవంతం ఫలితంగా జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్య పరీక్షలు, మెరుగైన వైద్య సేవలు లక్ష్యంగా కార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెద్దన్న, రెస్కో, ఏఎంసీ డైరెక్టర్లు బసవరాజు, అనసూయ, చలపతి, హరినాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జులు రాజేంద్ర, నాగరాజు, మంజునాథ్‌గౌడు, జీసీ గోవిందరాజులు, ఉయ్యాల జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పూలపల్లకీ ఊరేగింపు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం, కోట్రేపల్లె గ్రామాల మధ్య వెలసిన శ్రీకాళభైరవేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున పుష్పపల్లకీ ఊరేగింపు వైభవంగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి ఆలయం వద్ద సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో గిరిజా సమేత శ్రీకాళభైరవేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త రాజారెడ్డి ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇరుగులమ్మ ఆలయ వార్షికోత్సవాలు..

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి వరదేపల్లెలో నెలకొన్న ప్రసన్న ఇరుగులమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు గురువారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఘనంగా ధ్వజారోహణం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని మిట్టకురపల్లె సమీపంలో వెలసిన శ్రీమేలేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. అర్చకులు శివపార్వతుల విగ్రహాలకు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో పూజలు జరిపారు. గంగపూజ, గణపతి పూజ, వాస్తుపూజ, ధ్వజారోహణం, కలశస్థాపన, శిఖర కలశస్థాపన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఛత్రపతి శివాజీ జయంతి

పలమనేరు, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పలమనేరులో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో పాల్గొన్న వారికి ముస్లిం సోదరులు శీతల పానీయాలు, బిస్కెట్లు అందజేశారు.

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద భజరంగ దళ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూజలు చేసి గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు.

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో ఛత్రపతి శివాజీ జయంతిని హిందూ ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిస్కెట్లు పంపిణీ చేస్తూ..

బైరెడ్డిపల్లెలో..

కుప్పంలో..

పేదలకు అండగా సీఎం సహాయనిధి

రామకుప్పం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని తెదేపా మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రవిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, ఏరియా ఆస్పత్రి డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఆదిల్‌బాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న తెదేపా నాయకులు

క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న బీసీ నాగరాజ్, సాగర్‌రాజ్

క్రీడల్లోనూ పట్టు సాధించాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ పట్టు సాధించాలని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజ్ పేర్కొన్నారు. స్థానిక కుప్పం డిగ్రీ కళాశాలలో గురువారం వార్షిక క్రీడా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభా ఇలాంటి పోటీల ద్వారా బయటపడుతుందని, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

వైకాపా విమర్శలన్నీ అవాస్తవాలు

పలమనేరు: వైకాపా నాయకులు అవాస్తవాలు మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలు చేస్తుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెదేపా నాయకులు మురళి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలు అంటూ వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలు వాస్తవ దూరాలన్నారు. తమ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు నాయుడు, ఆర్బీసీ కుట్టి, మునస్వామి, పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో తెదేపా నాయకులు

మళ్లీ మొదలైన ఒంటరి ఏనుగు దాడులు

రామకుప్పం, న్యూస్‌టుడే: ఒంటరి ఏనుగు దాడులు మళ్లీ మొదలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు మండల పరిధిలోని ననియాల పరిసర ప్రాంతంలోని పంటలను తొక్కి నాశనం చేసింది. అధికారులు చర్యలు తీసుకుని ఏనుగుల నుంచి పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

పులిచెర్ల మండలంలో..

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీ జూపల్లెవారిపల్లె, కోటపల్లె గ్రామాల్లో పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడులు చేసింది. బుధవారం రాత్రి రెండు గ్రామాలకు చెందిన రైతులు హరి, ఈశ్వరయ్య, నాగులయ్య, ఖాదర్‌బాషా పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలు విరిచేశాయి. పశుగ్రాసం సాగును తొక్కేశాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మదనపల్లె-కృష్ణగిరి జాతీయ రహదారిలో కైగల్ వంతెన సమీపంలో గురువారం టాటాఏస్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వి.కోట మండలం గోనుమాకులపల్లెకు చెందిన మంజునాథ్, అతని భార్య అనిత, కుమార్తె చేతన ద్విచక్ర వాహనంలో బైరెడ్డిపల్లెకు వస్తుండగా వి.కోట వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో మంజునాథ్, అనితకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వీరిని స్థానికులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

తల్లిదండ్రులు గర్వపడేలా నడుచుకోవాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: విద్యార్థులు తల్లిదండ్రులు గర్వపడేలా నడుచుకోవాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితిలో దురలవాట్లకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభాకర్

సంపూర్ణ ఆరోగ్యానికి సంజీవని

కుప్పం పట్టణం (గుడుపల్లె), న్యూస్‌టుడే: కుప్పం ప్రాంతంలోని ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న ముఖ్యోద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సంజీవని టాటా నెర్వ్ కేంద్రాన్ని కుప్పంలో ప్రారంభించారని వైద్యాధికారులు పేర్కొన్నారు. గుడుపల్లె మండలం గుండ్లసాగరంలో గురువారం సంజీవని టాటా నెర్వ్ కేంద్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచి నాగరాజు, రెస్కో డైరెక్టర్ అమీర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు.. పగులుతున్న పైపులు

కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో గ్రానైట్, ఇసుక, మట్టి లోడ్లతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ధ్వంసం కావడమే కాకుండా... రోడ్డు కింద ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు సైతం పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో నీటి సరఫరా అవుతున్నంత సేపు రోడ్డు పైకి నీరు వస్తూ నిల్వ ఉంటోంది. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

అటు శునకాలు.. ఇటు వానరాలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పల్లెల్లో జనం ఆరుబయట సంచరించాలంటే వణుకు పుడుతోంది. ఎక్కడ.. ఎప్పుడు ఏ జంతువు దాడి చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఓ వైపు వీధి కుక్కలు.. మరో వైపు వానరాల బెడదతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. వీధిలో పిల్లలను ఒంటరిగా పంపాలన్నా తల్లిదండ్రులు జంకుతున్నారు. శునకాల దాడులు ఎక్కువ కావడంతో ప్రజలకు రక్షణ కరవైంది. వాహనాల్లో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులను సైతం కుక్కలు వదలడం లేదు. వాహనాలను వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు వానరాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నెల్లిపట్ల వీధిలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ఆసక్తి చూపని ప్రజలు

మనుషులే కాకుండా మూగజీవాలపైనా శునకాలు దాడి చేస్తున్నాయి. కోళ్ల పరిశ్రమ యజమానులు.. మృతి చెందిన కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుండటంతో వాటిని తిని అలవాటు పడిన శునకాలు మూగజీవాలపైనా దాడి చేసి చంపేస్తున్నాయి. శెట్టిపల్లెలో రెండు రోజుల కిందట ఇద్దరు రైతులకు చెందిన దూడలను కరచి చంపేశాయి. ఆర్నెళ్ల కిందట పాతపేటలో వీధి కుక్కల దాడిలో నాలుగు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. శునకాల దాడులతో నాటు కోళ్ల పెంపకం పట్ల ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ఆందోళనలో విద్యార్థులు

మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లెలో వానరాలు దుకాణాలు, ఇళ్లలోకి ప్రవేశించి చేతికి చిక్కిన ఆహార పదార్థాలు, తినుబండారాలను ఎత్తుకెళ్లడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకూ తిప్పలు తప్పడం లేదు. కమ్మనపల్లె గురుకుల బాలికల పాఠశాల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల వద్ద వానర సంచారంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

నియంత్రణకు చర్యలు

వీధి కుక్కలు, వానరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతాం.
- ఉపేంద్ర, ఎంపీడీవో, బైరెడ్డిపల్లె

మాట్లాడుతున్న బీట్ అధికారి బాలనరసింహులు

అడవికి నిప్పు.. పర్యావరణానికి ముప్పు

రామకుప్పం, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు అనేక సమస్యలు తలెత్తుతాయని అటవీ బీట్ అధికారి బాలనరసింహులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ననియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. 'వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై' సమావేశం నిర్వహించారు. అడవిలో తేనె తీసేందుకు నిప్పు పెట్టి వదిలేయడం, బీడీ, సిగరెట్లు కాల్చి నిర్లక్ష్యంగా పడేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ననియాల గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

శ్యామలాసెంటర్: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా **'పోలీసు కన్వెన్షన్ హాల్, రిజర్వ్‌పోలీస్ లైన్, ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ మండపం దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం'లో ఫిబ్రవరి 26 తేదీన మెగాసైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

K-10 SCHOOL
SRI GOWTHAMI
Learning for Life
GANDHIPURAM | SRIRAMNAGAR
RAJAMAHENDRAVARAM
93486 55501 | 93486 55503

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 24**

నమోదుకు: 77027 79616
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

28 లోపు జీవన ధ్రువపత్రం అందజేయాలి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ రిటైర్డ్(విశ్రాంత) ఉద్యోగులందరూ వారి జీవన ప్రమాణ సర్టిఫికెట్(లైఫ్ సర్టిఫికెట్) ఈ నెలాఖరు లోపు సమర్పించాలని సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం గురువారం తెలిపారు. కాకినాడ జిల్లాలో సబ్ ట్రెజరీ కార్యాలయంలో, ఏదైనా పెన్షనర్స్ భవనంలో, ఏపీఎస్పీ విశ్రాంత కార్యాలయంలో, ఏదైనా నెట్‌సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని చెప్పారు. ఎవరైనా రాలేని పరిస్థితుల్లో ఉంటే వారి ఇంటికి తమ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్‌ను పంపి సర్టిఫికెట్ చేయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 91820 47819, 94407 10596, 63001 80491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ నిధులతో ప్రైవేటు రహదారి

ఆ భూమి రిజిస్ట్రేషన్‌కు మాజీ ఎమ్మెల్యే నిరాకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నిధుల అడ్డగోలు వినియోగానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండలో వైకాపా నేత, రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ నివాసంలో నిర్మించిన సీసీ రహదారే నిదర్శనం. 2021-22లో రూ.12 లక్షలు ఎంపీ ల్యాండ్స్‌తో ఆయన ఇంటి ప్రహరీ గేటు నుంచి లోపలికి ప్రైవేటు స్థలంలో రహదారి నిర్మించారు. పంచాయతీ అధికారులు అప్పట్లో రాపాకను ప్రశ్నించగా.. తనను కలిసేందుకు వచ్చే ప్రజల కోసమే నిర్మించానని వక్రభాష్యం చెప్పారు. దీనిపై అదే ప్రాంతానికి చెందిన ఎన్‌ఆర్ఐ యెనుమల వెంకటపతి రాజా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. రహదారి నిర్మించిన భూమిని సంబంధిత పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో పంచాయతీ శాఖ అధికారులు మాజీ ఎమ్మెల్యేకు తాఖీదులు ఇవ్వగా.. శాశ్వత రిజిస్ట్రేషన్ విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రహదారికి అడ్డుగా ఏర్పాటు చేసిన గేటు తొలగించి అందరికీ అందుబాటులోకి తేవాలని ఫిర్యాదుదారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై డీఆర్వో కె.మాధవిని వివరణ కోరగా ఇటీవల ఈ రహదారి వినియోగంపై డీపీవో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారన్నారు. దాని ఆధారంగా మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చామన్నారు. ఆయన సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ముంపు ముప్పు.. ముందే పసిగడితే..!

వరదల తీవ్రతపై అధ్యయనం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఏటా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముంపు సమస్య లంక గ్రామాల ప్రజలను గడగడలాడిస్తోంది. ప్రతి సంవత్సరం జులై నెల నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలను వరద భయం వెంటాడుతూనే ఉంటుంది. జలవనరుల శాఖ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. పూర్తి స్థాయిలో వరద నియంత్రణ చేయలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో వరద నియంత్రణకు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) సహాయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పోలవరం పూర్తయితే..

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వరద ప్రభావం చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని ముందస్తుగా పోలవరం వద్ద నిలుపుదల చేసి, మిగులు జలాలను మాత్రమే దిగువకు వదిలే వీలుంటుందన్నారు.

గత వరదల వివరాలు

సంవత్సరం	నీటి మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ ప్రవాహం (టీఎంసీలు)
2019	15.60	15,61,404
2020	19.90	22,58,895
2021	12	10,19,452
2022	21.70	25,80,963
2023	16	16,32,780
2024	15.80	16,14,844
2025	14.30	13,57,199

బృందం పర్యటన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రోజుల పాటు ఇద్దరు ఇస్రో శాస్త్రవేత్తలతో కూడి ప్రత్యేక బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ముందస్తుగా వరద నియంత్రణ చర్యలపై దృష్టి పెట్టనున్నారు.

గత ఏడాది పి.గన్నవరం అక్విడక్టు వద్ద వరద ఉద్ధృతి

తీరం కోతకు గురి

వరదల సమయంలో గోదావరి నదిలో వస్తున్న నీటి ప్రవాహంలో మార్పులు వల్ల గోదావరి పరివాహక ప్రాంతాల్లో కొబ్బరి తోటలు, భూములు కోతకు గురవుతున్నాయి. ఈ మట్టి ప్రవాహంతో పాటుగా ప్రయాణించి కొన్ని ప్రాంతాల్లో పెరుగుడు భూములు ఏర్పడుతున్నాయి. మరికొన్ని చోట్ల గతంలో ఏర్పడిన పెరుగుడు భూములు కోతకు గురై మరో చోట ఏర్పడుతున్నాయి. గోదావరి ప్రవాహంలో వస్తున్న మార్పు పెరుగుడు భూములపై పడుతోంది.

ఏటా తప్పని ముప్పు

15 ఏళ్ల క్రితం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఏటా వరద తీవ్రత అధికంగానే ఉంది. 2022 జులైలో 21.70 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఈ సమయంలో రోజుకు 25లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఇలాంటి సమయాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.

నష్ట నివారణ తగ్గించవచ్చు..

ప్రస్తుతం వరదల సమయంలో భద్రాచలం, ధవళేశ్వరంలో నమోదైన ఇన్‌ఫ్లో ఆధారంగానే తీవ్రతను అంచనా వేస్తున్నారు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న జలాలను ముందస్తుగా అంచనా వేసి నియంత్రణ చేపట్టే వీలు కలుగుతుంది.

మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు

మామిడికుదురు: రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో నగరం, మామిడికుదురు, కొమరాడ, మొగలికుదురు, పెదపట్నం, మగటపల్లిలోని జామియా మసీదుల్లో గురువారం సాయంత్రం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షలు చేసిన వారంతా ఇఫ్తార్ స్వీకరించారు. మత ప్రబోధకుల ఉపదేశాల అనంతరం పవిత్ర ఖురాన్ పఠనంలో పాల్గొన్నారు.

మామిడికుదురు జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

24న సైక్లింగ్ ఎంపిక పోటీలు

అమలాపురం గ్రామీణం: శాప్‌లీగ్-2026లో భాగంగా అమలాపురం జి.ఎం.సి.బాలయోగి స్టేడియంలో ఈ నెల 24న సైక్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రుద్ర వైకుంఠరావు ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-18 బాలురు, బాలికలకు వ్యక్తిగత టైం ట్రయల్, మాస్ ట్రయల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ నెల 23లోగా శాప్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిలిపేస్తారు.. ప్రాణాలు తోడేస్తారు

జాతీయ రహదారిపై ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

● గత జనవరిలో కత్తిపూడి వద్ద రోడ్డుపై నిలిపిన లారీని కారు ఢీకొని నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు.

● 2025 సెప్టెంబరులో తాళ్లూరు దాబా వద్ద నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొట్టడంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంపతులు మృతి చెందారు. ఈ ప్రాంతంలోనే ఆగిన లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తి చనిపోయాడు. ఏప్రిల్‌లో మురారి వద్ద ఇదే తరహాలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

గండేపల్లి మండలం మురారి వద్ద జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో ప్రమాదకరంగా..

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గండేపల్లి, శంఖవరం: పదహారో నంబరు జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ నిలిపేసిన వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దివాన్ చెరువు నుంచి పాయకరావుపేట వరకు దాబాలు, మెకానిక్ షెడ్లు, పంక్చర్ దుకాణాల వద్ద ఈ పరిస్థితి అధికం. బ్లాక్ స్పాట్ల కంటే ఈ వాహనాలే దడ పుట్టిస్తున్నాయి.

ఈనాడు పరిశీలన

ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రమంటే..

● రాజానగరం-ఏడీబీ రహదారి కూడలికి సమీపంలో తూర్పుగోనగూడెం వద్ద ఎన్‌హెచ్ పక్కనే పంక్చర్ దుకాణాలున్నాయి. రోడ్డుకు ఆనుకునే లారీలు, ఆటోలు నిలిపేస్తున్నారు.

● మురారిలోని దాబాల వద్ద రేయింబవళ్లు వాహనాలు ఆపేస్తున్నారు. తాజాగా ఉదయం 10.30 గంటల వేళ 10 లారీలున్నాయి.

● మల్లేపల్లి హైవేపై ఆటోలు తిష్ఠ వేస్తున్నాయి. ఇక్కడే ట్రక్ బే ఉన్నా వినియోగించడంలేదు. వంతెన ఎక్కే చోట వాహనాలు నిలుపుతున్నారు. తాళ్లూరులో 8 దాబాలున్నాయి. స్థానికులు అపసవ్య దిశలో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

రామవరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాలు

● జగ్గంపేటలో పైవంతెన దిగిన వెంటనే డౌన్‌లో డైవర్షన్ పాయింట్ ఉంది. ఇక్కడ రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాలు ఆపేస్తున్నారు. రామవరం కూడలి సమీపంలో ఉన్న దాబాల వద్ద ఉదయమే 10 లారీలు (ట్రాలీ) రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. రాత్రయితే ఇంకా రెట్టింపే.

● యర్రవరం హైవేకి ఆనుకుని నాలుగు రోడ్ల కూడలిలోనూ ఇష్టారీతిన పార్కింగ్ ఉంది.

● కత్తిపూడి వద్ద వెహికల్ బే ఉన్నా నిరుపయోగమే. పైవంతెన ఎక్కేచోట షెడ్లు ఉన్నాయి. వాహనాలు నిత్యం నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన దిగిన వెంటనే కూడలి వద్దా ఇదే పరిస్థితి. పోలీస్ గస్తీ పెంచాల్సి ఉంది.

సమయం వృథా వద్దు.. ఒత్తిడికి గురి కావొద్దు..

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ముఖాముఖి

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి **చంద్రశేఖర్ బాబు** తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

అరగంట ముందుగానే చేరుకోవాలి

విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలి. ఉదయం 8.30 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

హాల్ టికెట్లకు ఇబ్బంది లేదు

హాల్ టికెట్ల విషయంలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు. బీఐఈ వెబ్‌సైట్‌తో పాటు మనమిత్ర పోర్టల్‌లో వాట్సాప్ ద్వారా 95523 00009 నంబరుకు హాయ్ అని సందేశం పంపిస్తే సేవల జాబితా వస్తుంది. అందులో హాల్ టికెట్ పొందవచ్చు. ప్రిన్సిపల్ సంతకం లేక పోయినా చెల్లుబాటు అవుతుంది.

ప్రశాంతంగా రాయాలి..

పరీక్షల్లో విద్యార్థులు ఏడాది పొడవునా చదివింది మూడు గంటల్లో రాయాల్సి ఉంటుంది. జవాబులు రాసేటప్పుడు రంగులు, లైన్లు వంటి అలంకరణ అంశాలకు ఎక్కువ సమయం వృథా కాకుండా చూసుకోవాలి. ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

కంట్రోల్ రూం ఏర్పాటు..: జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశాం. హాల్ టికెట్, పరీక్షా కేంద్రంతో పాటు, ఇతర సందేహాల నివృత్తికి 95503-35191, 18004251531 నంబర్లలో సంప్రదించవచ్చు.

నిఘా.. సాంకేతికత

కేంద్రాల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రం ఆవరణ, ప్రశ్నాపత్రం తీసే గది, విద్యార్థులు పరీక్ష రాసే గదుల్లో సీసీ కెమెరాలు ఉంటాయి. ప్రశ్నాపత్రం లీకేజీకి అవకాశం లేకుండా క్యూఆర్‌కోడ్ ఏర్పాటు చేశారు. దానిని స్కాన్ చేస్తే ఆ ప్రశ్న ఎక్కడిదో తెలిసిపోతుంది.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నాం. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇన్విజిలేటర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి తీసుకు వెళ్లేందుకు అనుమతి లేదు.

విద్యుత్తు వెతలకు చెక్..!

అందుబాటులోకి కొత్త ఉప కేంద్రాలు మంజూరు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

పట్టణాల్లోనే కాదు.. పల్లెల్లోనూ ఇటీవల యంత్ర పరికాలు, ఏసీలు, విద్యుత్తు ఆధారిత ఇతర గృహోపకరణాల వినియోగం పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వీటిని నియంత్రించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

లో ఓల్టేజీ లేకుండా..

జిల్లాలో ప్రస్తుతం 68 విద్యుత్తు ఉపకేంద్రాల ద్వారా జిల్లాకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. వీటి పరిధిలో సర్వీసులు ఎక్కువగా ఉండటం, విద్యుత్తు వినియోగం పెరగడంతో లో ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వీటిని తొలగించేందుకు అధికారులు కొత్తగా 8 విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. వీటిలో ఇప్పటి వరకు 6 కేంద్రాలను పూర్తి చేశారు. ముమ్మిడివరం, కొత్తపేట మండలాల పరిధిలో రెండు కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి.

24 గంటల సరఫరా ధ్యేయం

పల్లెలకు సైతం 24 గంటలు సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 100 నియంత్రికల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పెట్టారు. ఇతర ఉప కేంద్రాల పరిధిలో మిగులు విద్యుత్తును ప్రత్యేక లైన్ల ద్వారా కొరత ఉన్న ఉప కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రతి గ్రామం పరిధిలో 24 గంటలూ సరఫరా అందించేందుకు వెసులుబాటు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

అల్లవరం మండలంలో విద్యుత్తు మరమ్మత్తులు చేస్తున్న సిబ్బంది

విద్యుత్తు సర్వీసుల వివరాలు

కేటగిరీ	గృహ	వాణిజ్య	పరిశ్రమ	వ్యవసాయం	ఇతర
సర్వీసులు	5,43,089	63,704	2,071	15,922	8,139

కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాలు (బ్రాకెట్‌లో మండలాలు)

● గుడిమాల కండ్రిగ (సఖినేటిపల్లి), పల్లంకుర్రు (కాట్రేనికోన), వడ్డిగూడెం (అమలాపురం), టేకి (కపిలేశ్వరపురం), మండపేట (మండపేట), వెల్ల(రామచంద్రపురం).

వేసవికి ప్రత్యేక ప్రణాళిక

ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. ప్రతి ఇంట్లో శీతల యంత్రాలు (ఏసీలు), పంకాల(ఫ్యాన్లు) వినియోగం పెరుగుతుంది. సాధారణ రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 3 నుంచి 3.5 మిలియన్ యూనిట్ల వినియోగం ఉంటుంది. వేసవి రాగానే ఇది 5 నుంచి 6 మిలియన్ యూనిట్లకు చేరుతుంది. దీనికి తగ్గట్టుగా ప్రధాన ఉప కేంద్రాల్లో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 5, 5 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్లు 5 ఏర్పాటు చేశారు.

నిరంతర సరఫరాయే ధ్యేయం

వేసవిలో నిరంతరాయ విద్యుత్తు సరఫరా అందించాలనే ధ్యేయంగా ఉన్నాం. దీని కోసం జిల్లాలో 6 విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు పూర్తి చేశాం. ఆర్డీఎస్ఎస్ (రీవ్యాప్ట్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద జిల్లాలో 300 ట్రాన్స్‌పార్మన్లు ఏర్పాటు చేయనున్నాం. వీటి ఏర్పాటు పూర్తయితే లోడు సమస్యలు రావు.

-రాజేశ్వరి దేవి, ట్రాన్స్‌కో జిల్లా అధికారి

వైభవోపేతం.. వీరేశ్వరస్వామి తెప్పోత్సవం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి, అమ్మవార్లను రథంపై ఉంచి గ్రామోత్సవం అనంతరం వృద్ధ గౌతమి గోదావరి నది వద్దకు తీసుకు వెళ్లారు. గోదావరి మాతకు ఆలయ అర్చక, పురోహిత, వేద పండితులు ప్రత్యేక పూజలు, పంచహారతులు ఇచ్చారు. అనంతరం భద్రకాళీ సమేతుడైన వీరేశ్వరస్వామి హంస వాహనంపై గోదావరిలో నదీలో విహారం చేశారు. విద్యుత్తు కాంతులు, భారీ బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేల సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామి వారి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆశలు జల సమాధి

చెరువులో శవమై తేలిన బాలిక

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం మండలం ముంగండలోని సమగ్ర రక్షిత పథకానికి చెందిన మంచినీటి చెరువు(సమ్మర్ స్టోరేజీ ట్యాంకు)లో గ్రామానికి చెందిన కుడుపూడి కరుణ(15) మృతదేహం తేలింది. బాలిక సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కుడుపూడి శ్రీనివాస్, నాగలక్ష్మి, ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థిని కుటుంబం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల వీధిలో ఉండేది. ఇంటి నిర్మాణం కోసం ఖాళీ చేయాల్సి రావడంతో ఇటీవల ఇక్కడికి సుమారు కిలోమీటరున్నర దూరంలో గల ఇటికలమెరకకు అద్దెకు వెళ్లిపోయారు. విద్యార్థిని పాఠశాలకు వెళ్లి గురువారం సాయంత్రం 5 గంటల తరువాత సైకిల్‌పై ముంగండ శివారు ఇటికలమెరకలోని ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి నానమ్మ వరలక్ష్మి(ఈమె ఎంపీపీ ప్రాథమిక పాఠశాల వీధి) ఉంటున్న ప్రాంతానికి వచ్చింది. కరుణ సైకిల్ ఆ ప్రాంతానికి సమీపంలోని రహదారి చెంతన ఉంది. దానికి అత్యంత సమీపంలోనే చెరువు ఉంది. పాఠశాల నుంచి వచ్చి వెళ్లిన కుమార్తె ఇంటికి చేరుకోపోవడంతో తల్లి అత్త వరలక్ష్మిని ప్రశ్నించింది. తనకు కనిపించలేదని ఆమె బదులిచ్చింది. అనంతరం చెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్సై బి.శివకృష్ణ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశామన్నారు. తమ కుమార్తె మృతిపై ఎవరిపైనా అనుమానాలు లేవని తండ్రి శ్రీనివాస్ చెబుతున్నారు.

కుడుపూడి కరుణ (పాత చిత్రం)

తుదిపోరు ఉత్కంఠభరితం

వాలీబాల్ పోటీల మహిళల విజేతగా సదరన్ రైల్వే

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో జరిగిన అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ జట్ల మధ్య తుది పోరు గురువారం రాత్రి రసవత్తరంగా సాగింది. మూడో స్థానం కోసం పురుషుల జట్లు జీఎస్టీ(ముంబయి), కర్ణాటక పోటీ పడ్డాయి. 3-1 స్కోర్‌తో జీఎస్టీ జట్టు మూడో స్థానం దక్కించుకుంది. మహిళా జట్లు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, సదరన్ రైల్వే(చెన్నై) మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో సదరన్ రైల్వే జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతరం మొదటి, రెండు స్థానాల కోసం పురుషుల జట్లు ఐవోబీ(చెన్నై), ఇండియన్ బ్యాంకు(చెన్నై) తలపడ్డాయి.

సదరన్ రైల్వే, ఎస్ఆర్ఎం మహిళా జట్ల మధ్య పోటీ

ఆదమరిస్తే గోదాట్లోకే..

అసంపూర్తిగా డొక్కా సీతమ్మ అక్విడక్టు టోపాత్

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టుకు సంబంధించిన సాగునీటి ట్రఫ్(తొట్టి) టోపాత్(రహదారి పడవను తాడుతో తీసుకెళ్లేవారు నడిచే దారి)పై రెయిలింగ్ అసంపూర్ణంగా ఉండిపోయింది. 2022లో అప్పటి కలెక్టర్ హిమాన్షుశుక్లా మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో 440 మీటర్ల పొడవునా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రోడ్డు వంతెన మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో దీనిపై దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

ట్రఫ్ టోపాత్‌పై రెయిలింగ్ లేక ప్రమాదకరంగా రాకపోకలు

ప్రస్తుత పనుల నేపథ్యంలో..

డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెనపై ఉన్న సమస్యలను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పందించారు. సమస్యను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఓ.ఎన్.జి.సి. నుంచి రూ.62 లక్షలు మంజూరు చేయించారు. రూ.13 లక్షలతో గతంలో రోడ్డు వంతెనపై సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.49.03 లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నారు. టోపాత్‌పై మిగిలిన 240 మీటర్ల మేర రెయిలింగ్ కూడా పూర్తిచేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని అంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల రాకపోకలతో ప్రమాదం

స్థానికులు కొందరు ఈ టోపాత్ మీద నడిచి వెళుతుంటారు. రెయిలింగ్ అసంపూర్ణంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఒక వైపున సాగునీటి ట్రఫ్, మరో వైపున గోదావరి నది ఉంది. ఏమాత్రం అదుపుతప్పినా వాటిలో పడిపోవడం ఖాయం. అదే జరిగితే ప్రాణనష్టం జరుగుతుంది. 2022లో 680 మీటర్లకు గాను 440 మీటర్ల మేర రెయిలింగ్ ఏర్పాటు చేసి నిధులు సరిపోక పనిని నిలిపేయాల్సి వచ్చింది. మిగిలిన 240 మీటర్ల మేర ఏర్పాటు చేయాలంటే రూ.20 లక్షలు అవసరం ఉంటుందని జలవనరుల శాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు వివరించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

పాస్‌పోర్ట్ మొబైల్ సేవా కేంద్రం, ముక్తేశ్వరంలో

జిల్లా: బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

పాస్‌పోర్ట్ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు మరియు చివరి దశ సేవల అందుబాటును మెరుగుపరచేందుకు విదేశాంగ మంత్రిత్వశాఖ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం (RPO), విశాఖపట్నంవారు **పాస్‌పోర్ట్ మొబైల్ సేవా కేంద్రం (PMSK) ద్వారా ముక్తేశ్వరంలో 21 ఫిబ్రవరి 2026న** పాస్‌పోర్ట్ సేవలను అందించనున్నారు.

దరఖాస్తుదారులు పేర్కొన్న తేదీన అపాయింట్‌మెంట్ పొందడానికి క్రింది వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా కోరడమైనది: **https://www.passportindia.gov.in**

ఆన్‌లైన్ ద్వారా ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకున్న అభ్యర్థులు, సూచించిన తేదీన అవసరమైన అన్ని పత్రాలతో క్రింది పేర్కొన్న మొబైల్ సేవా కేంద్రానికి హాజరుకావలసిందిగా సూచించడమైనది.

పాస్‌పోర్ట్ మొబైల్ సేవా కేంద్రం వివరాలు:

తేది : 21 ఫిబ్రవరి 2026 (శనివారం) స్థలం : బి.ఆర్.ఎం & వై.వి.ఎస్ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాల, ముక్తేశ్వరం, ఐనవిల్లి మండలం, జిల్లా : బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పిన్ : 533211, ఆంధ్రప్రదేశ్.

అభ్యర్థులు, దళారులు/ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి మరియు అపాయింట్‌మెంట్ కోసం పై పేర్కొన్న ప్రభుత్వ అధీకృత పోర్టల్‌ను మాత్రమే సందర్శించాలి. దళారులు/ఏజెంట్లు లేదా వారితో ఏ విధమైన సంబంధం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.

గమనిక: అభ్యర్థులు ఒరిజినల్ పత్రాలతో పాటు స్వయంగా ధృవీకరించిన ఫోటోకాపీలను తప్పనిసరిగా తీసుకురావాలి. చెల్లుబాటు అయ్యే అపాయింట్‌మెంట్ ఉన్నవారిని మాత్రమే అనుమతించబడతారు.

Dr. సుయశ్ చవాన్, IFS
ప్రాంతీయ పాస్‌పోర్ట్ ఆఫీసర్,
విశాఖపట్నం.

వ్యాపారాల నిర్వహణపై మహిళలకు అవగాహన

రావులపాలెం పట్టణం: ప్రతి కుటుంబం లోను ఒక మహిళా పారిశ్రామికవేత్త తయారు కావాలని డీఆర్పీ వీడీ డి.రాంబాబు సూచించారు. కేవీఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న [illegible] రావులపాలెం మండలం మహిళా సమాఖ్య కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈసీ సభ్యులకు వివిధ వ్యాపార నిర్వహణ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ డీపీఎం విజయకుమార్, వివిధ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

ప్రధాన కార్యాలయము: గాంధీ బొమ్మ దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం

స్వాధీనత ప్రకటన (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(1) ప్రకారం)

[illegible]

నోటీసు వివరాలు

క్ర. సం.	ఋణగ్రహీత / హామీదారుల పేర్లు	బ్యాంకు వారికి తనఖా చేసిన స్థిరాస్థి/ల వివరములు	డిమాండ్ నోటీసు తేది, స్వాధీనత తేది & బకాయి వివరములు
	బ్రాంచ్: జాంపేట		
1)	ఋణగ్రహీత: శ్రీ యర్రంశెట్టి గంగా భవాని, D/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, అంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ. హామీదారుడు: శ్రీ యర్రంశెట్టి వెంకన్న, S/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, అంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ.	726 చ.గజాల విస్తీర్ణం గల [illegible]	డిమాండ్ నోటీసు తేది: 12-03-2025 స్వాధీనత తేది: 12-02-2026 బకాయి: ది.28-02-2025 నాటికి రూ.10,55,112/- డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
	బ్రాంచ్: అనపర్తి		
2)	ఋణగ్రహీత: శ్రీ కర్రి రామిరెడ్డి, S/o. వెంకట కృష్ణారెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం. హామీదారులు: శ్రీమతి కర్రి లక్ష్మావతి, W/o. రామిరెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం.	[illegible]	డిమాండ్ నోటీసు తేది: 20-12-2024 స్వాధీనత తేది: 12-02-2026 బకాయి: ది.30-11-2024 నాటికి రూ. 14,30,362/- డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
	బ్రాంచ్: కాకినాడ		
3)	ఋణగ్రహీత: శ్రీ పోతల శ్రీను, S/o. ప్రసాదరావు, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం. హామీదారుడు: శ్రీమతి పోతల మంగ, W/o. శ్రీను, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం.	121 చ.గజాల విస్తీర్ణం గల [illegible]	డిమాండ్ నోటీసు తేది: 29-02-2024 స్వాధీనత తేది: 13-02-2026 బకాయి: ది.29-02-2024 నాటికి రూ.4,26,158/- డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
4)	ఋణగ్రహీత: శ్రీ గుత్తుల సుందరం, [illegible] హామీదారుడు: [illegible]	194 చ.గజాల విస్తీర్ణం గల [illegible]	డిమాండ్ నోటీసు తేది: 29-02-2024 స్వాధీనత తేది: 13-02-2026 బకాయి: ది.29-02-2024 నాటికి రూ.7,18,840/- డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
5)	ఋణగ్రహీత: శ్రీమతి కనపర్తి లక్ష్మి, W/o. వీర్రాజు, డో.నెం.68-4-5, [illegible] అశోక్ నగర్, కాకినాడ. హామీదారుడు: శ్రీ కనపర్తి రాంబాబు, S/o. వీర్రాజు, డో.నెం. 68-4-5, కమల్ వీర్ దగ్గర, అశోక్ నగర్, కాకినాడ.	57.5 చ.గజాల [illegible] 2451/1988 తేదీ: 17-05-1988 మరియు సరిహద్దులు: తూర్పు: పన్నాల రామ సుబ్బమ్మ గారి స్థలం, పడమర: 6 అడుగుల వెడల్పు గల దారి మార్గం, ఉత్తరం: కనపర్తి వెంకటేశ్వర రావు గారి స్థలం, దక్షిణం: నా తాలూకు మిగతా ఇల్లు, స్థలం.	డిమాండ్ నోటీసు తేది: 20-12-2024 స్వాధీనత తేది: 13-02-2026 బకాయి: ది.30-11-2024 నాటికి రూ.2,58,328/- డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)

తేది : 18.02.2026
ప్రదేశం : రాజమహేంద్రవరం
సం/- అధీకృత అధికారి
ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్.,

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98660 27578.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్‌హౌసింగ్, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. వేరొక చిరునామా: మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్ హౌసింగ్, ఆఫీస్ చిరునామా: సంప్రదించవలసిన వారు: మేనేజింగ్ పార్టనర్ : శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డివారి వీధి, శాంతినగర్, కాకినాడ-533004. హామీదారులు: 1) శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 2) శ్రీమతి పద్మావతి జంపాన, భర్త: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 3) శ్రీ సాయిరాజ్ జంపాన, తండ్రి: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 4) శ్రీ సీజన్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్: శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, ప్లాటు నెం.59, అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్-500034.

డిమాండ్ నోటీసు తేది: 01-07-2022 డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.30-06-2022 నాటికి రూ.6,00,06,891/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.31-01-2026 నాటికి రూ.10.42 కోట్లు + తేది.01.02.2026 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు: ఆస్తి ఐడి : SBIN8911995166

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ పట్టణం, సూర్యారావుపేట గ్రామం, విద్యుత్ నగర్, బ్లాకు నెం.68, వార్డు నెం.29, కొత్త సర్వే నెం.180లోని ఎ.14.65 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఉత్తరం వైపున మధ్య భాగంలోని ఎ.3.02 సెంట్లు విస్తీర్ణంలో 1560 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి ఐడియల్ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ సొసైటీ పాలక మండలి వారిచే ఎగ్జిక్యూట్ చేయబడిన తూర్పు గోదావరి జిల్లా, కాకినాడకు చెందిన శ్రీ జంపాన సాయిరాజ్, తండ్రి: బాల గాంధీరాజు గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 3193/2019 తేది:28-03-2019 ప్రకారం) హద్దులు మరియు కొలతలు: తూర్పు: 195.6 అ॥లు - ఐడియల్ కాలేజికి చెందిన స్థలం, ఉత్తరం : 70 అ॥లు - నాన్నీ వీధి (మున్సిపల్ రోడ్డు), దక్షిణం: 70 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం, పడమర : 206 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం. పైన తెలిపిన హద్దులలోని 1560 చ॥గ॥ల ఖాళీ స్థల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులు మరియు ఉమ్మడి దారులు మొ॥ వాటితో కలదు.

రిజర్వు ధర : రూ.5,20,00,000/- ధరావత్తు : రూ.52,00,000/- బిడ్ పెంపుదల : రూ.50,000/-

ఇ-వేలం తేదీ : 25-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 20-02-2026 నుండి 24-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ https://baanknet.com నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:18-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వ్యాఘ్రేశ్వరస్వామికి పుష్పయాగం

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో బాలాత్రిపురసుందరీ సమేత వ్యాఘ్రేశ్వర స్వామి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. గురువారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. - న్యూస్‌టుడే, అంబాజీపేట

చింతలూరు నూకాంబిక జాతరకు అంకురార్పణ

ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రసిద్ధి పొందిన చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతరకు గురువారం అంకురార్పణ జరిగింది. అమ్మవారిని బుట్టగరగ రూపంలో అలంకరించి ఆసాదులు గ్రామోత్సవం నిర్వహించారు. మార్చి 17న జాగరణ, 18న తీర్థం, 19న ఉగాది వేడుకలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 17 వరకు తీర్థం జరగనుంది. జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ వీరి అప్పారావు, వెంకట్రావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఆలమూరు

వస్తోంది.. బాల్య వివాహాల విముక్తి రథం

వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో బాల్య వివాహాల విముక్తి రథాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటికే వన్‌స్టాప్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా గృహ హింస, వరకట్న వేధింపులు, ఇతర ఇబ్బందులకు గురవుతున్న మహిళలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఏర్పాటు చేసిన రథాన్ని ప్రారంభించారు. దీని ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఐసీడీఎస్ పీడీ నాగమణి, రమాదేవి, విజయ, తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గోదావరి వరదలపై క్షేత్రస్థాయి అధ్యయనం

నారాయణలంకలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపేట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు ఎస్.వి.శివప్రసాద్‌శర్మ, అమన్‌ప్రీత్‌సింగ్ బృందం గురువారం కొత్తపేట మండలం నారాయణలంక, వానపల్లి తదితర లంక గ్రామాల్లో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న నీటిమట్టం, 1986, 2022 సంవత్సరాల్లో వచ్చిన ఉద్ధృత గోదావరి వరదల సమయంలో నీటిమట్టాల స్థాయిలను బేరీజు వేశారు. నదిపై మొదటి, రెండు, మూడు, నాలుగో ప్రమాద హెచ్చరికల సమయంలో పరిస్థితి ఏమిటి అనే వివరాలు తెలుసుకున్నారు. వరద ఉద్ధృతి ప్రాంతాలను శాటిలైట్‌కు అనుసంధానం చేసి కేంద్రస్థాయి నుంచి వివరాలు గమనించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రజలు, ప్రభుత్వ ఆస్తులకు ఏవిధమైన నష్టం తలెత్తకుండా భవిష్యత్తు కార్యాచరణపై అధ్యయనం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీవో పి.ఎస్.నరేష్‌కుమార్, నీటిపారుదలశాఖాధికారి శివప్రసాద్, వానపల్లి సర్పంచి పల్లి భీమారావు, గనిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో పుష్కర పనుల పరిశీలన

స్వామివారిని దర్శించుకుంటున్న దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

మామిడికుదురు, న్యూస్‌టుడే: రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం పరిశీలన చేశారు. స్థానికంగా ఉన్న బాలాజీ సదన్‌ను అన్ని సౌకర్యాలతో ఆధునికీకరించేందుకు, అక్కడి గోశాలను సమీపంలోని 3.39 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించారు. భక్తులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలకు సంబంధించి స్థానిక అధికారులతో సమీక్షించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏసీ రాంబాబురెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాల్పనిక ప్రపంచంలో.. అవకాశాల హరివిల్లు

గ్రాఫిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీజీసీ సంయుక్త సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన రెండు రోజుల ఏవీజీసీ-ఎక్స్ఆర్ సమ్మిట్-2026 గురువారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవరచుకోవాలన్నారు. ఉద్యోగాలు ఆశించకుండా, సృష్టించాలన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకంగా నిలుస్తుందన్నారు. జేసీ, హబ్ డైరెక్టర్ వై.మేఘాస్వరూప్ మాట్లాడుతూ యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఇలాంటి వేదికలను వినియోగించుకోవాలన్నారు.

బోలెడు ఉద్యోగాలు..

ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ఉద్యోగావకాశాలు బోలెడున్నాయి. యువతకు ఈ రంగం ఆశాకిరణంగా కనిపిస్తోంది. వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ సాంకేతికత, అందులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. నాలాంటి చాలామందికి ఇలాంటి వాటిపై ఆసక్తి ఉన్నా అవగాహన లేక ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి కార్యక్రమాలతో ఎంతో ప్రయోజనం ఉంటుంది.
- సీహెచ్ లలిత, బీటెక్ తృతీయ సంవత్సరం

ఈ రంగంలోనూ ఏఐ..

గేమింగ్, యానిమేషన్, కామిక్స్ రంగాలకు ఎప్పటినుంచో మంచి ఆదరణ ఉంది. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుంది. వీటిలో కూడా కృత్రిమ మేధ ఎక్కువగా వినియోగిస్తున్నారు. దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నా. వీడియో, స్టోరీ ఎలా రూపొందించాలో నేర్చుకున్నా. చదువుతున్న సమయంలోనే ఇలాంటి వాటిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది.
- ఎం.సాయివర్మ, బీటెక్ తృతీయ సంవత్సరం

గేమ్స్ రూపొందిస్తా..

రెండు రోజుల కార్యక్రమంలో సినిమాల్లోని వీఎఫ్ఎక్స్ ఎలా ఉపయోగిస్తారో తెలుసుకున్నా. నాకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. ఆ ఆసక్తితోనే ఈ కార్యక్రమానికి వచ్చాను. పిల్లల నుంచి పెద్దల వరకు గేమింగ్ యాప్స్ వాడుతున్నారు. వాటికి విపరీతమైన ఆదరణ ఉంది. భవిష్యత్తులో గేమ్స్‌ను రూపొందించి ఉపాధి పొందాలనే ఆలోచన ఉంది.
- కె.జాగృతి, బీసీఏ తృతీయ సంవత్సరం

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: డీటీవో

రాజోలు: రాజోలు మండలం కడలిలో ఈ నెల 18న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదో తరగతి విద్యార్థి యశ్వంత్ దుర్మరణం చెందడం బాధాకరమని జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో శిరస్త్రాణం ధరించాలన్నారు. [illegible] కుటుంబం మొత్తం క్షేమంగా ఉంటుందని హితవు పలికారు. [illegible] మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల [illegible] ప్రమాదం జరిగితే తండ్రిని బాధ్యుడిని చేస్తామని హెచ్చరించారు.

8 మందికి సీఈవోలుగా ఉద్యోగోన్నతి

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ డ్వామా పీడీ వెంకటలక్ష్మి

సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్ ప్రసాద్

డ్వామా ఏపీడీ (కాకినాడ) జగదాంబ

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న 8 మంది అధికారులకు జడ్పీ సీఈవోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ● డీడీవో హోదాలో పనిచేస్తున్న కాకినాడ జడ్పీ సీఈవో వీవీవీ లక్ష్మణరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డ్వామా ఏపీడీ(కాకినాడ) పి.జగదాంబ, సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న కేవీవీ ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్ ఉద్యోగోన్నతి పొందారు. ● డిప్యూటీ సీఈవో హోదాలో ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, అమలాపురం డీడీవో జె. [illegible]

పోస్టింగ్‌లపై తర్జన భర్జన

ఉద్యోగోన్నతులు పొందిన అధికారులను జడ్పీ సీఈవోలుగా, డీఆర్డీఏ, మెప్మా, డ్వామా పీడీలుగా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేసి, బిల్లులు అప్‌లోడ్ చేయాలి. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో డ్వామా పీడీలు, ఏపీడీలు ఉన్న నేపథ్యంలో తక్షణం పోస్టింగులు ఇస్తే పనులకు [illegible] కుంటుపడుతుందని, ఈ నేపథ్యంలో వీరికి మార్చి నెలలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉందని ఈ శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. కొత్త జిల్లాల్లో నూతన పాలకవర్గాలు ఏర్పడితే చాలామందికి సీఈవో పోస్టులు దక్కే అవకాశం ఉంది.

అభ్యంతరాల స్వీకరణకు 23 వరకు గడువు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జోన్-2(ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలు) వైద్యఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం పరిధిలో [illegible] పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ ప్రతిభ జాబితా విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ పద్మశశికళ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 20 నుంచి 23వ తేదీ సాయంత్రం అయిదు గంటల్లోపు రాజమహేంద్రవరంలోని ఆర్డీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించి గతేడాది అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించారు.

డీఆర్డీఏ ఇన్‌ఛార్జి పీడీగా రాంబాబు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జి పీడీగా డి.రాంబాబును నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లాలో డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు డీఆర్డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్న జయచంద్రగాంధీని పలు కారణాల వల్ల కలెక్టర్ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేశారు. తర్వాత ఏపీడీ హోదాలో ఉన్న ఆదియ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పీడీగా బాధ్యతలు చేపట్టిన రాంబాబు గురువారం కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వెబ్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో పీఎంకేవీవై శిక్షణలో భాగంగా వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపీకృష్ణ తెలియజేశారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. వివరాలకు 90107 37998 నెంబరులో సంప్రదించాలన్నారు.

వివిధ కేసుల్లో నిందితుడి అరెస్టు

రాజోలు: చోరీ ఘటనలో నిందితులకు సహకరించిన కేసులో సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన చిలకలపూడి శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజోలు అదనపు ఎస్సై కె.నాగేశ్వరరావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది ఆదాయపు పన్ను అధికారులమంటూ హైదరాబాద్‌లో 2021లో ఓ ఇంటిపై దాడిచేసి పెద్ద మొత్తంలో నగలు, నగదు ఎత్తుకెళ్లిపోయారు. ఆ సమయంలో శ్రీనివాస్ ఎవరూ ఇంట్లోకి రాకుండా కాపలాగా ఉన్నాడు. అప్పట్లో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. జిల్లాలోని అంతర్వేదిపాలెం, శివకోటి గ్రామాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినందున పలు కేసులు నమోదు అయ్యాయి. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు అదనపు ఎస్సై తెలిపారు.

నగదు చోరీ.. అదుపులో బాలుడు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణానికి చెందిన ఓ బాలనేరస్థుడిని అదుపులోకి తీసుకుని రూ.20వేలు సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. అతన్ని రాజమహేంద్రవరం జువైనల్ పీవో(బాల నేరస్థుల ప్రొబేషన్ అధికారి) సమక్షంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల ప్రధాన రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ దుకాణంలో చోరీకి పాల్పడి రూ.22వేల సొత్తును తల్లికి ఇచ్చాడని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి అతని తల్లి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్డ్ కలిగిన N/E 272 చ॥గ॥లు, N/F 272 చ॥గ॥ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

రాజమండ్రి దేవీచౌక్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ M/F కావలెను. Qul: డిగ్రీ. ✆ 99898 76799.

శ్రీలక్ష్మీవెంకటేశ్వర వెహికల్ ఫైనాన్స్ కొరకు ఆఫీస్ బోయ్, కలెక్షన్ బోయ్స్, 30-35 సం॥గల హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96662 19999.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ (Male) కావలెను. Contact Cell: 80991 91919.

రాజమండ్రి విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేయుటకు Asst. అకౌంట్స్ (F) కావలెను. బీకామ్ ఫ్రెషర్, టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి. ✆ 85006 44978.

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ కాకినాడలో కొత్తశాఖ కోసం డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వయస్సు: 35 సం॥రాలు పైబడిన వారు. జీతం: 75,000/- వరకు+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. సంప్రదించండి: 6361185310.

రాజమండ్రిలో ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు వంటమనుషులు, లేడీ వార్డెన్, ఆయా కావలెను. జీతం + వసతి + భోజనం. Cont: 94937 15552

కడియంలో ప్రముఖ నర్సరీలో పనిచేయుటకు అనుభవం గల అకౌంటెంట్ (M/F) కావలెను. Contact Cell: 99488 36667.

FACULTY/ TEACHERS

Wanted Teachers to teach Primary & Higher English & Science Fluency in English is must. GopiKrishna EM High School, Gandhipuram-1, Rajahmundry. 8374208700, 9515542339

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి: డీపీవో

అంబాజీపేట, న్యూస్‌టుడే: పి.గన్నవరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి ఆదేశించారు. మాచవరంలో పన్నుల వసూళ్లను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లక్ష్యాన్ని చేరుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇందుకోసం పంచాయతీల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు నందంపూడి గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కె.వి.వి.సత్యనారాయణ, కె.సురేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత నైపుణ్య శిక్షణ

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుపై 3 నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ కె.పి.రాజు గురువారం తెలిపారు. మార్చి 2 నుంచి కోర్సు ప్రారంభం అవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, బీటెక్ తదితర విద్యార్హతలు ఉండి ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9000831156 చరవాణి నంబరులో సంప్రదించాలని సూచించారు.

దాతల సాయం.. సమకూరిన సౌకర్యం

మామిడికుదురు: నగరం మండల పరిషత్ మోడల్ పాఠశాలకు దాతలు, పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.60 వేలతో భోజనశాల నిర్మితమైంది. సర్పంచి జాలెం రమణకుమారి గురువారం దీనిని ప్రారంభించారు. విద్యార్థులు అందులో కూర్చుని భోజనాలు చేశారు. ఎంఈవో-1 ఓబీఎస్ఎన్ శ్రీనివాసరావు, వర్క్‌షాప్ డైరెక్టర్ ముకరమ్ హుస్సేన్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, విశ్రాంత ఎంఈవో నీలపూడి చంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో నిర్మించిన షెడ్‌లో విద్యార్థుల భోజనాలు

ఏటిగట్టు సమీపంలో మట్టి తరలింపు

మామిడికుదురు: అదుర్రు పరిధి ఏటిగట్టు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారీతిన పొక్లెయినతో తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. స్థానికంగా అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు తరలిస్తున్నట్లు చెబుతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టనట్లు ఉండటంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా అక్కడ మట్టి తరలింపులకు అనుమతులు ఇవ్వలేదన్నారు.

సామూహిక కుంకుమార్చన

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరంలోని లక్ష్మీకనకదుర్గమ్మ ఆలయ 31వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది కన్యలు స్థానిక వైనతేయ గోదావరి నుంచి తీసుకొచ్చిన జలంతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్తాచెదారం తొలగింపు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం కొత్తకాలనీలో రోడ్డు చెంతన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

డ్రెయిన్‌లో పూడికతీత

రావులపాలెం (గ్రామీణం), న్యూస్‌టుడే: లక్ష్మీపోలవరం డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతోంది. ఈ సమస్య పంచాయతీ కార్యదర్శి సబిత దృష్టికి వెళ్లగా సిబ్బందితో తీయించారు.

స్పందనకు వందనం

గుంతకు మరమ్మతులు

మామిడికుదురు: స్థానిక ఎస్‌వీఎం ఎదురుగా ప్రధాన రహదారిలో పడిన గుంత కారణంగా వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల వద్ద ప్రస్తావించగా స్పందించారు. గుంతలో కంకర వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

21న కొత్తపేటలో వైద్యశిబిరం

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.ఎస్.నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన డా. మోహన్స్ డయాబెటిస్, గౌతమి నేత్రాలయం, శ్రీరామ దంత వైద్యుల నిపుణులు ఉచితంగా మధుమేహం, చక్కెర, కంటి, దంత పరీక్షలు చేస్తారన్నారు.

ఏటిగట్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పొదలాడ నుంచి పి.గన్నవరం నియోజకవర్గం మీదుగా గోపాలపురం వరకు ఉన్న వశిష్ఠ ఎడమ ఏటిగట్టును తారురోడ్డుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీని అభివృద్ధి ద్వారా పొదలాడ వద్ద పాత జాతీయ రహదారిని గోపాలపురం వద్ద 216-ఎ రహదారిని కలుపుతుందని ఆయన వివరించారు. కోనసీమలో ప్రాధాన్యం గల వాటిలో ఒకటిగా నిలవనుందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ఆలయ పునర్నిర్మాణంపై మంత్రికి వినతి

లంకలగన్నవరం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం దేవాదాయశాఖ ద్వారా నిధులు మంజూరు చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏసీజే కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రదీప్‌కుమార్ కోరారు. గురువారం ఆలమూరు కోర్టు ఆవరణలో పోలీసులు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్ సేవలు పూర్తి ఉచితంగా అందుతాయని, సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. రాజీ మార్గంలో క్రిమినల్ కాంపౌండబుల్, అన్ని రకాల సివిల్ కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ సన్నిధిరావు, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.విజయశేఖర్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

ఇష్టారీతిన తోడేస్తున్నారు..

◆ ఇంజిన్లతో తోటల్లోకి సాగునీటి మళ్లింపు

న్యూస్‌టుడే, మామిడికుదురు

దాళ్వా వరిసాగుకు ఆరంభంలోనే వంతులవారీ విధానం అమల్లోకి రావడంతో శివారు భూములకు నీటిఎద్దడి నెలకొంది. మరోవైపు పంటకాలువల నుంచి పలువురు ఇంజిన్ల ద్వారా కొబ్బరి తోటలకు యథేచ్ఛగా మళ్లించేస్తుండటంతో మాగాణి రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై నిఘా కొరవడటంతో సాగునీరు సక్రమంగా అందక సతమతమవుతున్నారు. ఇప్పటికే శివారు చేలు పలుచోట్ల నెర్రలు తీశాయి.

మానేపల్లి పంట కాలువ నుంచి ఇలా..

నిబంధనలకు విరుద్ధంగా..

పి.గన్నవరం ప్రధాన పంటకాలువ ఆధారంగా సఖినేటిపల్లి వరకు రాజోలు, తాటిపాక జలవనరుల శాఖ విభాగాల పరిధుల్లో 44 చొప్పున ఉపకాలువలు ఉన్నాయి. రాజోలు వ్యవసాయ ఉపడివిజన్ పరిధిలోని మూడు మండలాలు, మామిడికుదురు మండలం సహా 9,840 ఎకరాల్లో దాళ్వా వరిసాగు చేస్తున్నారు. ఎద్దడి రానీయకుండా ఈ నెల 10 నుంచి మధ్యడెల్టాకు వంతులవారీ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నారు. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఇంజిన్ల ద్వారా తోటలకు, ఇతర అవసరాలకు మళ్లించేస్తున్నారు. దీతో పారుదల మందగించిపోయి ఆయకట్టు రైతులు అల్లాడిపోతున్నారు.

పటిష్ఠ నిఘా కరవు

దాదాపు 5,045 ఎకరాల వరిచేలు ఆధారపడి ఉన్న మానేపల్లి ఛానల్‌పై నాగుల్లంక నుంచి పాశర్లపూడిబాడవ వరకు సుమారు 12 వరకు ఇంజిన్లు కాలువ నీటిని నిరాటంకంగా కొబ్బరి తోటలకు మళ్లించేస్తున్నాయి. వీటిపై సంబంధిత జలవనరులశాఖ అధికారుల పటిష్ఠంగా నిఘా పెట్టకపోవడంతో ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. ఈదరాడ, తాటిపాక, పొన్నమండ, పొదలాడ తదితర ఉప కాలువల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రాజోలు, మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని పలుచోట్ల శివారు చేలకు నీరు అందకపోవడం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తాటిపాక, రాజోలు, మొగలికుదురు, ములికిపల్లి తదితర చోట్ల కాలువల్లోకి గొట్టాల ద్వారా ఇళ్లు, దుకాణాల నుంచి మురుగునీటిని మళ్లించడం, చెత్తకుప్పలు, వ్యర్థాలను నేరుగా కాలువలోనే వేయడంతో జలాలు కలుషితంగా మారుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు

పంట కాలువల్లోంచి ఇంజిన్ల ద్వారా నీటిని తోటలకు ఎక్కడా మళ్లించకుండా పటిష్ఠంగా చర్యలు చేపడతాం. వాటిని గుర్తించి వెంటనే తొలగిస్తాం. ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తాం. వంతులవారీ విధానంలో చేలకు నీరు సజావుగా సరఫరా అయ్యేలా చూస్తున్నాం. వంతులేని ఆయకట్టును కూడా పరిగణనలోకి తీసుకుంటాం.

– బి.రమేశ్‌బాబు, ఏఈఈ, జలవనరులశాఖ

అక్విడక్టు మరమ్మతులు వేగంగా పూర్తిచేయాలి: ఆర్డీవో

పి.గన్నవరం: పి.గన్నవరం వద్ద డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశించారు. గురువారం ఆయన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంతవరకు పూర్తయిన ప్రగతిని జలవనరులశాఖ ఏఈఈ బెహెరా రమేష్‌బాబు ఆయనకు వివరించారు. పనులు పూర్తయ్యేవరకు ప్రజలు సహకరించాలని ఆర్డీవో కోరారు. ట్రాఫిక్ మళ్లింపు, రోజువారీ మార్కెట్, వారపుసంత నిర్వహణ తదితర అంశాలపై ఎవరికీ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎస్సై బి.శివకృష్ణ, ఉప తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్.ఐ. వి.డాంగే పాల్గొన్నారు.

వారపుసంత నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతుల నేపథ్యంలో ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న మంగళవారపు సంత కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రదేశంలో కాకుండా డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డువంతెనకు అనుబంధంగా పి.గన్నవరం వైపున ఉన్న అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా కూరగాయల దుకాణాలు, ఇక్కడ ప్రధాన పంటకాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా మాంసాహార దుకాణాలు ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. దీనిపై ఆయా దుకాణదారులు, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

స్వర్ణ కవచాల అలంకరణ

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాడులోని లక్ష్మీగణపతి, కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పడాల సూర్యచంద్రారెడ్డి దంపతులు, అంబటి వెంకటేశ్వరరావు, మాచరమ్మ దంపతులు, ఎం.వెంకటసుబ్రహ్మణ్య ఈశ్వర్‌కుమార్, రాధ దంపతులు సమర్పించిన స్వర్ణ కవచాలను సంప్రోక్షణ చేసి స్వామివార్లకు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

లక్ష్మీగణపతి

రాజోలు డీసీ ఛైర్మన్‌గా బాజ్జీ

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా సఖినేటిపల్లి మండలం గొంది నీటి సంఘం అధ్యక్షుడు ఆకన బాజ్జీ నియమితులయ్యారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న రాజోలు నీటి సంఘం అధ్యక్షుడు వినతి వెంకటస్వామి(బుజ్జి) ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ముగ్గురు సంతానం కలిగి ఉండటంతో సభ్యత్వం చెల్లదంటూ కోర్టులో కేసు నమోదైంది. దీని అనుసరించి ఆయన్ను తొలగించి డీసీ ఉపాధ్యక్షుడిగా ఉన్న బాజ్జీకి అధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు వచ్చాయి. ఈ విషయాన్ని ఆ శాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు ధ్రువీకరించారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

గుడిమూల ఏటిగట్టు వద్ద వంతెన ఇరుగ్గా ఉండటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. సఖినేటిపల్లిరేవు, మలికిపురం నుంచి అంతర్వేది వచ్చే భక్తులు, పర్యాటకులకు అనువుగా దీన్ని నిర్మించారు. ఇరుగ్గా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ సురేష్‌ను వివరణ కోరగా వంతెన, అంతర్వేది వరకు రోడ్డు వెడల్పునకు రూ.5.5 కోట్లకు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

కాలువ దుర్భరం.. రైతుల అవస్థలు

పొన్నమండ మడుగు నుంచి గోగన్నమఠం వరకు ఉన్న నంబర్-2 మురుగు కాలువ దుర్భరంగా మారింది. వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. మురుగు పారకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. చేల నుంచి నీరు దిగక పంట దెబ్బతింటోందని గగ్గోలు పెడుతున్నారు. దీనిపై డ్రెయిన్స్ ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా కాలువలో పూడిక తీసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

అద్దం లేదు.. అప్రమత్తతే ముఖ్యం

రాజోలు ఆర్టీసీ డిపో బస్సు ఓ పక్క అద్దం లేకుండా ప్రమాదకరంగా ఉంది. నిత్యం విద్యార్థులు, మహిళలు కిక్కిరిసి ప్రయాణిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వీటికి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఎం జేమ్స్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

ప్రహరీకి గేటులేక పాట్లు

తొత్తరమూడి ప్రాథమికోన్నత పాఠశాలకు ఏడాది కిందట ప్రహరీ నిర్మించారు. దీనికి గేటు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆవరణలో రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యంతాగి సీసాలు వదిలేస్తున్నారని వాపోతున్నారు. పరిశీలించి గేటు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

బిందెడు నీటికి పడిగాపులు

రామరాజులంకలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. రోజు విడిచి ఇస్తున్నారని, అదికూడా అంతంతమాత్రంగా వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొళాయిల వద్ద గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందంటున్నారు. సరఫరాను మెరుగుపరచాలని కోరుతున్నారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబును వివరణ కోరగా సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు వితరణ

మామిడికుదురు, న్యూస్‌టుడే: స్థానిక ఆల్‌కోస్ట్ కాలనీలో ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులైన 14 కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు. బాధిత కుటుంబాలకు గురువారం ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. నామన ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే నిత్యావసరాలను అందజేసినట్లు చెప్పారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రోత్సాహంతో ప్రస్తుతం తాత్కాలికంగా రేకు షెడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కూటమి నాయకులు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కొనుగోలులో విచారణకు డిమాండ్

కొత్తపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కొనుగోలు, పట్టాల పంపిణీలో భారీ అవినీతి జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి డిమాండ్ చేశారు. గురువారం కొత్తపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థలాల కొనుగోలులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, మార్కెట్ విలువ కంటే నాలుగు నుంచి అయిదు రెట్ల ఎక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు ఆరోపించారు. వీటితో పాటు మెరక పేరుతో మట్టిని తరలించడంలో కూడా అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. యల్లమిల్లి జగన్‌మోహన్‌రావు, కాశి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వీఆర్వోల ఆందోళన

అంబాజీపేట, న్యూస్‌టుడే: పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నామని అంబాజీపేట మండల వీఆర్వోలు, వీఆర్ఏలు, విలేజ్ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. వీఆర్వోల సంఘ అధ్యక్షుడు గిడ్డి వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు జి.కోమలి, కార్యదర్శి గుత్తుల నాగలక్ష్మి, గౌరవాధ్యక్షుడు వి.రామకృష్ణ పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ఆందోళన

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ మాల మహానాడు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనం ఎదుట గురువారం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు, నాయకులు భూపతి వెంకటపతి, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, బత్తుల జనార్దనరావు, జాలెం సుబ్బారావు, ఉండ్రు శ్రీరామారావు, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ

కొత్తపేట, అంబాజీపేట, అయినవిల్లి, మలికిపురం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ ధర్మ పరిరక్షకుడని భాజపా కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. గురువారం శివాజీ జయంతిని పురస్కరించుకుని కోటిపల్లి రఘురాం వేణుగోపాల్ ఆధ్వర్యంలో బోడిపాలెం వంతెన సెంటర్ వద్ద చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వాడపాలెం పంచాయతీ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. తొగరు సీతారామాంజనేయులు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● అంబాజీపేట నాలుగు రహదారుల కూడలిలో శివాజీ చిత్రపటానికి దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామ్మూర్తి, మహిపాల తాతాజీ, ఆకెళ్ల సూరిబాబు తదితరులు నివాళి అర్పించారు. నేదునూరు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వేమా తదితరులు పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్తు మలికిపురం మండల ప్రఖండ ఆధ్వర్యంలో గూడపల్లి శివాలయం వద్ద వేడుకలు నిర్వహించారు.

నేదునూరులో ర్యాలీ

అంబాజీపేటలో చిత్రపటానికి కూటమి శ్రేణుల నివాళి

ఇరు వర్గాలపై కేసులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల కారణంగా జరిగిన ఘర్షణల్లో ఇరువర్గాలపై గురువారం కేసులు నమోదు చేశామని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. అయినాలవారిపాలెనికి చెందిన పేపకాయల మాణిక్యాలరావుతో పాటు కుటుంబ సభ్యులపై అంబాజీపేటకు చెందిన యర్రంశెట్టి నాగేంద్ర, సిరిపల్లి దుర్గాప్రసాద్ దాడి చేశారు. దీనికి సంబంధించి మాణిక్యాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగేంద్ర, దుర్గాప్రసాద్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేశారు. అయినాలవారిపాలెం వెళుతున్న సమయంలో మాణిక్యాలరావు తనను అడ్డగించి దాడి చేశారని నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాణిక్యాలరావుపై కేసు నమోదు చేశామన్నారు.

అసంపూర్తి భవనం.. అరకొర వైద్యం

– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

తీర గ్రామాల ప్రజలకు ఆధునిక వైద్యం అందించాలనే లక్ష్యంతో సఖినేటిపల్లిలో ప్రారంభించిన పీహెచ్‌సీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న భవనం శిథిలం కావడం, రోజురోజుకు రోగుల సంఖ్య పెరగడంతో పాతది తొలగించి కొత్తగా నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం రూ.1.5 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. గుత్తేదారుకి బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారు. దీంతో వైద్యసిబ్బంది సమీపంలో ఉన్న గృహనిర్మాణశాఖ భవనాన్ని వినియోగించుకుంటున్నారు.

సరైన సేవలు అందక..

ప్రస్తుతం సిబ్బంది వినియోగిస్తున్న భవనంలో రెండే గదులు ఉన్నాయి. ఒకటి డాక్టర్‌కు, రెండోది సిబ్బంది ఉండేందుకు, వైద్య పరికరాలను ఉంచేందుకు వినియోగిస్తున్నారు. ఇక్కడికి వచ్చే రోగులకు పరీక్షలు చేయడానికి అవకాశం ఉండటం లేదు. గతంలో ఈ పీహెచ్‌సీలో రోజుకు 100 వరకు ఓపీ, నెలలో 10 నుంచి 15 వరకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేవారు. ప్రస్తుతం పక్కా భవనం లేకపోవడంతో శస్త్రచికిత్సలు చేయడంలేదు. వీరిని వేరే ఆసుపత్రికి పంపుతుండటంతో అధిక శాతం రోగులు అంతదూరం వెళ్లలేక సమీపంలో ఉండే ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. అధిక వ్యయం అవుతుందని వాపోతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం మూడేళ్ల పైనే కావస్తుండటంతో పాడైపోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణం పూర్తిచేసి ఆధునిక వైద్యం అందించాలని కోరుతున్నారు.

నిలిచిపోయిన పీహెచ్‌సీ నిర్మాణం

అధికారి ఏమన్నారంటే..

దీనిపై ఆర్అండ్‌బీ జేఈ సురేష్‌ను వివరణ కోరగా నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపించామని, వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

'బొబ్బా' సేవలు మరువలేనివి

ఆలమూరు, న్యూస్‌టుడే: గుప్త దాత దివంగత బొబ్బా సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివని ఆలమూరు సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ పేర్కొన్నారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలమూరు సహకార సంఘం, బొబ్బా జయశ్రీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, గ్రంథాలయం, ఆర్టీసీ బస్టాండ్ మొదలైన మౌలిక సదుపాయాలు, జొన్నాడలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఎన్నో గుప్తదానాలు చేశారని కొనియాడారు. సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో పోలీసుల 'పల్లె నిద్ర'

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సై దుర్గాశ్రీనివాస్ గురువారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడొద్దని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, NALLI BABJI RAO (Old Name), C/o Baburao, Resident of 3-150, Jayapeta 2, Sakhinetipalli Mandalam, Sakhinetipalli, Dr. B. R. Ambedkar Konaseema District, AP-533251. have changed my name as NALLI STEPHEN DANIEL. This is authorised by the Gazette of the Govt of A.P., dated 18.02.2026.

పాస్‌పోర్టు పడిపోయినది
డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, అయినవిల్లి గ్రామం, D.No.3-158కి చెందిన ముళ్ళ శేఖర్, S/o వెంకటరావు అను నాయొక్క B3206332 నెంబరుగల ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం మా ఇంటి దగ్గర నుండి అయినవిల్లి సెంటర్‌కి వెళ్ళి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు దయవుంచి ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.
సెల్: 90001 64371

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

అమలాపురం కలెక్టరేట్ : జిల్లాలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మామిడికుదురు, ఉప్పలగుప్తం మండలాల్లో పరిశ్రమల స్థాపనకు 5 ఎకరాల చొప్పున భూ సమీకరణ చేశామన్నారు. వీటిలో కాయర్ ఆధారిత పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప్పలగుప్తం మండలంలో రూ.13.50 కోట్లతో కాయర్ ఉత్పత్తుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔత్సాహికులైన యువ పారిశ్రామిక వేత్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీజనల్ కాయర్ బోర్డు అధికారి పవన్ కుమార్, ఏపీఐఐసీ జిల్లా అధికారి రమణారెడ్డి, రాధామణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వారధి నిర్మించాలని వినతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : కోనసీమ జిల్లా కేంద్రంలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని అనుసంధానం చేసేలా గౌతమి గోదావరి పాయపై రోడ్డువంతెన నిర్మాణం చేపట్టాలని సహకరించాలని కోరుతూ రామచంద్రపురం మండల పరిషత్ అధ్యక్షురాలు అంజలి భవానికి సమితి సభ్యులు గురువారం వినతిపత్రం సమర్పించారు. మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయించాలని ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఆమె సంపూర్ణమద్దతు తెలిపారు. సమితి అధ్యక్షుడు సలాది సతీష్‌నాయుడు, కొట్టువాడ హరిబాబు, కుప్పెల సూర్యనారాయణ, యాండ్ర బుల్లి అబ్బులు, కుపుపాకుల వెంకటరమణ, కండవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని అందరికీ అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి జిల్లా ఈగల్ టీం సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. అమలాపురం సీడీపీవో కార్యాలయంలో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈగల్ టీం సభ్యులు అంగన్‌వాడీ సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం దేశద్రోహంతో సమానమన్నారు.

మత్స్యకార మహిళలకు యంత్రాలను అందజేస్తున్న డీపీసీ కళాశాల యాజమాన్యం

మత్స్యకారులకు డ్రయర్లు పంపిణీ

అల్లవరం, న్యూస్‌టుడే: మత్స్యకారుల చేపలు, ఇతర మత్స్య ఉత్పత్తులను సులభంగా ఎండబెట్టుకునేందుకు గురువారం డ్రయర్లను ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని కేంద్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరి ఆర్థికవ్యవహారాల సంస్థ ఆధ్వర్యంలో బీవీసీ పరిశోధనా విభాగం తయారు చేసింది. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం, బెండమూర్లంక, పల్లం, కాట్రేనికోన, పల్లం తదితర గ్రామాలకు చెందిన 52 మందికి వీటిని అందించారు. ఒక్కొక్క యంత్రం విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. కళాశాల వైస్ ఛైర్మన్ బొంతు కనకదుర్గ, ప్రిన్సిపల్ ప్రవీణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన

యానాం : దరియాలతిప్ప ఆయకట్టుకు సాగు, తాగునీటిని సరఫరా చేసే మైనర్ ఎత్తిపోతల పథకం, పంప్‌హౌస్‌ను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం పరిశీలించారు. వర్షాలు ఎదురుకులు వచ్చిన కీలక సమయంలో పంట దశలో సాగునీరు అందకపోవడంతో ఆందోళనకు గురౌతున్న దరియాలతిప్ప రైతులు నీటిని అందించాలని కోరుతూ ఎమ్మెల్యేను కలిసి వినతి ఇచ్చారు. దీనితో ప్రజాపనులశాఖ కార్యాలయానికి రైతులతో కలిసి వెళ్లి ఈఈ కొత్సా జ్యోతిరాజుతో గొల్లపల్లి చర్చించారు.

'గొల్లపల్లిని గెలవనివ్వను..' సీపీఐ నారాయణ వ్యాఖ్యలు చర్చనీయాంశం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తే గెలవనివ్వబోమని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ చేసిన వ్యాఖ్యలు యానాంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బుధవారం కాకినాడ పర్యటనకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2021 ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా అశోక్ పోటీ చేసినప్పుడు తాను స్వయంగా వచ్చి ప్రచారం చేశానన్నారు. గెలిచిన తర్వాత గొల్లపల్లి భాజపాతో కలవడం ఒక తప్పయితే, అవినీతికి పాల్పడటం రెండో తప్పని.. నారాయణ వ్యాఖ్యానించారు. గొల్లపల్లి ఓటమి కోసం తానే స్వయంగా వచ్చి ప్రచారం చేస్తానన్నారు. కాంగ్రెస్, డీఎంకే కూటమిలో సీపీఐ ఉన్న నేపథ్యంలో ఆ పార్టీల అభ్యర్థులకు అనుకూలంగా తమ ప్రచారం ఉంటుందన్నారు.

ఉత్సాహం ఉరకలు

• సందడిగా జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో జరిగిన శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు గురువారం భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. గ్రామస్థులు క్రీడాభిమానులతో నిండిపోయింది. అర్ధరాత్రి వరకు పోటీలు హోరాహోరీగా సాగాయి. టోర్నీని విజయవంతంగా నడిపించినందుకు అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాగరత్నంవారి దంపతులను గ్రామస్థులు, నాయకులు ఘనంగా సన్మానించారు. డీసీసీ బీసీసెల్ ప్రసాద్, సీఐ వీరబాబు, ప్రసాదకుమార్, డీటీవో శ్రీనివాసరావు, తదితరులు వీక్షించారు.

ప్రథమ బహుమతి సాధించిన జట్టు

నిర్వాహకులు లక్ష్మీనారాయణ దంపతులకు సన్మానం

మెరికలు.. మెరుపులు

• వాలీబాల్‌లో రాణిస్తున్న యువకులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాభ్యాసి జాతీయస్థాయిలో వెలుగుతోంది. నాలుగురోజులుగా గొల్లవిల్లి జట్టు ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ చాటారు. వారిలో కొందరి గురించి.

క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ ప్రసాద్

రెండుసార్లు బంగారు పతకాలు

మాది తూర్పుగోదావరి జిల్లా సీతానగరం. ప్రస్తుతం గొల్లవిల్లిలో జీఎస్టీ జట్టు(ముంబయి) తరఫున ఆడుతున్నా. నేను ఇక్కడ ఆడటం రెండోసారి. గతంలో జరిగిన నేషనల్ మీట్‌లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున నాలుగు సార్లు ఆడా. స్టేట్‌మీట్‌లో మహారాష్ట్ర ముంబయి తరఫున ఆడి మేం రెండుసార్లు బంగారు పతకం సాధించాం. ఆంధ్రప్రదేశ్ జట్టులో చాలాసార్లు ఆడిన అనుభవం ఉంది. ఇక్కడి క్రీడాకారులను సమర్థ

గ్రిన సదుపాయాలు బాగున్నాయి. –చావా సతీష్, జీఎస్టీ ముంబయి జట్టు క్రీడాకారుడు

సీనియర్ నేషనల్ జట్టులో ఆడా..

మా స్వగ్రామం అమలాపురంలోని కామనగరువు. సమనస ఉన్నత పాఠశాలలో చదివా. ప్రస్తుతం బెజవాడలో ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నా. చిన్నప్పటి నుంచి వాలీబాల్ అంటే ప్రాణం. ఇటీవల ఉత్తరప్రదేశ్ వారణాసిలో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో ఏపీ తరఫున ఆడటం నాకు మంచి గుర్తింపు ఇచ్చింది. కడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచాం. చెన్నై ఎస్‌ఆర్‌ఎంలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో ఏపీ జట్టులో ఆడా. గొల్లవిల్లిలో వాలీబాల్ టోర్నీలో ఆడటం చాలా ఆనందంగా ఉంది. క్రీడాకారుల కోసం ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేశారు. –వీరి వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారుడు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పామర్రు, ముమ్మిడివరం: పామర్రు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ కె.రత్నాలరావు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పామర్రు, పాణింగిపల్లి, అముజూరు, యండగండి, కూళ్ల, కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగులచెరువు గ్రామాలవారు గమనించాలన్నారు.

ముమ్మిడివరంలో 21న : ఈ నెల 21 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

విద్యాసామగ్రి అందజేత

అమలాపురం పట్టణం: విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి జ్యోతిలక్ష్మి దేవి కోరారు. అమలాపురం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో ఆధ్వర్యంలో విద్యార్థుల సమావేశం గురువారం నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీర్స్, ఉద్యోగుల తరఫున డీఈఈ అన్యం రాంబాబు 250 మందికి పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

విద్యార్థులకు అల్పాహారం

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ తరపున అల్లవరం గ్రామానికి చెందిన బండిగుప్తాపు పాండురంగ అల్పాహారం అందించారు. నూరు శాతం ఫలితాల కోసం వారికి పాఠశాల ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి సాయం ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు.

సభను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: అమలాపురంలో ఈ నెల 25న నిర్వహించే మాదిగల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ ముమ్మిడివరం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ఖండవల్లి ఏలియా పిలుపునిచ్చారు. ముమ్మిడివరం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు లంక వరప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపట్ల అవగాహన పెంచుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ తెలిపారు. తాళ్లపొలం సామాజిక భవనంలో గురువారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో మమేకమై వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఎం.లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ రఘువీర్

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి

యానాం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ పుదుచ్చేరి అభివృద్ధికి అందించిన నిధులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బూత్ విజయ అభియాన్ ద్వారా గడప గడపకు తెలియజేయాలని భాజపా యానాం ఎన్నికల ఇన్‌ఛార్జి, ఏపీ స్టేట్ భాజపా ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. స్థానిక విష్ణాలయంవీధి కనకాల టవర్స్‌లోని భాజపా కార్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వేటుకూరి ప్రసంగించారు. అనంతరం దుకాణాలు, ఇళ్ల వద్ద భాజపా కరపత్రాల్ని పంపిణీ చేశారు. యానాం మండల ఉపాధ్యక్షుడు మూదే హరిశ్చంద్ర, కనకాల రామదాసు, దంగుడుబియ్యం సత్యనారాయణ, సబ్బతి లోకేశ్వరరావు, నల్లం జ్యోతి, లంక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ప్రభుత్వం స్పందించాలి

నిరసన శిబిరంలో ఉద్యోగులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెకు ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా కోశాధికారి బొబ్బా సుబ్రహ్మణ్య చౌదరిలు డిమాండ్ చేశారు. రామచంద్రపురం జిల్లా సహకార బ్యాంకు ఎదుట ఉద్యోగుల నిరసన శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఫిబ్రవరి 16 నుంచి సహకార సంఘాల ఉభయ యూనియన్లు ఆధ్వర్యంలో 8 వేల మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారన్నారు. సహకార సంఘ జిల్లా నాయకులు వి.రామకృష్ణ, పోలిశెట్టి ఈశ్వరుడు, గొడవర్తి సూర్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, చిక్కం సురేంద్ర, డివిజన్లో గల అధిక సంఖ్యలో సీఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం : సహకార సంఘ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. అమలాపురం కె.అగ్రహారంలోని కళావెంకట్రావు ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ఉద్యోగులు నాలుగోరోజు గురువారం నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, టి.సోమన్న, తోరం దొరాజీ, సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున పిల్లలు!

కాట్రేనికోన మండలం గాజింగతిప్ప ప్రాథమిక పాఠశాల చెంతన ఆక్వా చెరువుతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ 23 మంది పిల్లలు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు మొదటి విడతలో వివిధ పనులు చేపట్టారు. ప్రహరీ నిర్మించ లేదు. పాఠశాల పక్కన ఆక్వాచెరువు ఉంది. విద్యార్థులు ఆడుకునే క్రమంలో ఇటుగా వెళ్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం సంభవించకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

గుంతలో దిగాల్సిందే..

ముమ్మిడివరం మండలం లంక ఆఫ్ ఠాణేలంక ప్రాంతంలో కొంతమందికి కొళాయిలు లేకపోవడంతో తాగునీటికి ఇలా గుంతల్లో దిగి పట్టుకోవాల్సిన పరిస్థితి. లంక ఆఫ్ ఠాణేలంక గ్రామంలో తాగునీటి పైపులైన్‌కు ఏర్పాటు చేసిన సంపులో లీకవుతున్న నీటిని ఓ మహిళ ఇలా గొట్టం ద్వారా పట్టుకుంటున్నారు. కొళాయి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ కొళాయి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

లంక ఆఫ్ ఠాణేలంకలో నీటిని పట్టుకుంటున్న మహిళ

భవనం నిరుపయోగం

అమలాపురం మండలం చిందాడగరువులోని సచివాలయ భవనమిది. రెండేళ్ల క్రితం ఈ భవనాన్ని ప్రారంభించి నిరుపయోగంగా వదిలేశారు. అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు. ప్రస్తుతం సచివాలయాన్ని పంచాయతీ భవనంలోని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

బ్రహ్మపురిలో ఆలయ ప్రతిష్ఠా హోమాలు

భక్తి శ్రద్ధలతో హోమాలు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం బ్రహ్మపురిలో నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 20న విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం ఆలయం వద్ద లక్ష్మీగణపతి, చండీ, సూర్య, నూతన విగ్రహాలకు జల, క్షీర, శయ్యాధి వాసాలు నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.1.40 లక్షలు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రం కోటిపల్లి శివరాత్రి ఆదాయం గత సంవత్సరంతో పోల్చుకుంటే రూ.1,40,179లు అధికంగా వచ్చిందని దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజీ రామప్రసాద్ వెల్లడించారు. గురువారం స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ప్రత్యేక దర్శనం రూ.96,000, శీఘ్రదర్శనం రూ. 92,500, హుండీల ద్వారా- రూ.4,83,710, విరాళాలుగా రూ.35,317, ప్రసాదాల విక్రయించడం ద్వారా రూ.25,000లు మొత్తం 12,32,327ల ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈవో జె.భీమశంకరం, కూటమి నాయకులు, పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

ప్రధాన మంత్రి కేర్ ఫండ్‌తో భరోసా

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ప్రధాన మంత్రి కేర్ ఫండ్‌తో భరోసా కలుగుతుందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గార్డియన్ల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 12 మంది చిన్నారులు ఈ పథకానికి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కార్పస్ డిపాజిట్ అందిస్తుందన్నారు. 2020 మార్చి 11 నుంచి 2021 డిసెంబరు వరకు మృతి చెందిన వారి పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండిన తర్వాత వారికి చెందిన తపాలా ఖాతాలో ఈ నగదు జమ చేస్తారన్నారు. 23 ఏళ్ల వయసు వరకు దీనిపై వచ్చే వడ్డీని స్టైఫండ్‌గా అందిస్తారన్నారు. తర్వాత ఈ మొత్తం వారి ఖాతాకు బదిలీ చేస్తారన్నారు. ఈ చిన్నారులకు నవోదయ వంటి పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారన్నారు. వారికి హెల్త్ కార్డులు, పోస్టల్ బ్యాంకు ఖాతా పుస్తకాలను అందించారు.

గార్డియన్లకు హెల్త్‌కార్డులను అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చలో విజయవాడను విజయవంతం చేయాలి

ఎస్టీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి

అమలాపురం పట్టణం : ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 25న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. అమలాపురం ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు ఆధ్వర్యంలో సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాలో ప్రతి ఉపాధ్యాయుడు హాజరయ్యేలా ఎస్టీయూ మండల నాయకులు పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, చిక్కం మైనర్‌బాబు, ఎం.భవాని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహోత్సవాల ముగింపు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి మహా శివరాత్రి మహోత్సవాలలో భాగంగా చివరి రోజు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను రథంపై భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేరళ వాయిద్యాలు, కథకళి, శివలీలలు, గజ, వృషభ, నెమలి వాహనాలతో ఊరేగింపు నిర్వహించారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం పోలీసులు బందోబస్తు నిర్వహించారు

కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

మురమళ్లలో వాహనాలతో ఊరేగింపు

భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ద్రాక్షారామ, కాట్రేనికోన, అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే : ఛత్రపతి శివాజీ మహరాజ్ 396వ జయంతి వేడుకలను ద్రాక్షారామలో గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఖండ కార్యదర్శి జె.సుధీర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ● శివాజీ జయంతి వేడుకను చెయ్యేరు పంచాయతీ ఆవరణలో సర్పంచి చెల్లి సురేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎస్సై అవినాష్, గ్రంధి నానాజీ పాల్గొన్నారు. ● గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర యువకులు తెలుసుకోవాలని హిందూ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. గడియార స్తంభం కూడలిలో ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఏబీవీపీ హిందూ సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి గురువారం నిర్వహించారు. బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శిరంగు నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

గడియారస్తంభం వద్ద వాహన ర్యాలీ

ముమ్మిడివరం : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ముమ్మిడివరంలో ఛత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విత్తనాల రవితేజ, పుల్లెల శాస్త్రి, తటవర్తి నాగరాజారావు, బసవా శ్రీహరిబాబు, గొలకోటి సాయి, రామ్‌నాథ్ గుప్తా, కంచర్ల సురేష్, మాతంశెట్టి సురేష్ పాల్గొన్నారు. ● శివాజీ జయంతిని ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు వద్ద జై బుద్ధా పార్కులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన అభ్యుదయ సంఘాలతో కలిసి నిర్వహించారు. ● హిందూ ధర్మ రక్షక సేన అధ్యక్షుడు మట్ట శివకుమార్ ఆధ్వర్యంలో జయంతిని గురువారం నిర్వహించారు.

ద్రాక్షారామలో..

ఈఈ సుందరికి పుదుచ్చేరి బదిలీ

యానాం : యానాం ప్రజాపనులశాఖ కార్యనిర్వాహక ఇంజినీరుగా పనిచేస్తున్న ఎన్.సుందరి పుదుచ్చేరి ప్రజాపనులశాఖ ప్రజారోగ్య విభాగానికి బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటేరియట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కారైకాల్ ప్రజాపనుల శాఖలో ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.బాలసుబ్రహ్మణియన్‌కు యానాం ఈఈ బాధ్యతలు అప్పగించారు.

అమలాపురంలో బాలిక అదృశ్యం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం మున్సిపల్ కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలిక గురువారం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె గురువారం సాయంత్రం ఇంటి నుంచి రవణం మల్లయ్యవీధిలో ట్యూషన్ కోసం బయలుదేరింది. ఆమె ట్యూషన్‌కు వెళ్లలేదని కొద్ది సేపటి తర్వాత తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సైలు శ్రీనివాస్, జోషి సీసీటీవీ పుటేజీలను పరిశీలించారు. ఆమె ఇంటి నుంచి 10 మీటర్లు ముందుకు వెళ్లి తరువాత వెనక్కి తిరిగినట్లు గుర్తించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

గుండెపోటుతో పుదుచ్చేరి ఉద్యోగి మృతి

యానాం, న్యూస్‌టుడే: గొలగాబత్తులవారి వీధిలోని పుదుచ్చేరి కోపరేటివ్ బ్యాంకులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.కార్తికేయన్(53) గురువారం ఉదయం తాను అద్దెకుంటున్న ఇంట్లో గుండెపోటుతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బ్యాంకు అధికారి సూర్యనారాయణ అందించిన వివరాలు ప్రకారం.. ఆయన పుదుచ్చేరి నుంచి ఈ నెల 11న యానాం వచ్చి విధుల్లో చేరారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన పుదుచ్చేరి వెళ్లడం కోసం బుధవారం నుంచి ఈ నెల 28 వరకు సెలవు పెట్టారు. బుధవారం ట్రైన్ టికెట్ దొరక్కపోవడంతో గురువారం వెళ్తానని మేనేజర్ ఎస్.సూర్యనారాయణకు చెప్పారు. గురువారం ఉదయం మృతి చెందినట్లు సహచర ఉద్యోగి చూసి కుటుంబసభ్యులకు, అధికారులకు సమాచారం పంపించారు. ఏఎస్సై పంపన మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : కామనగరువు బైపాస్ రహదారిలో జరిగిన ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామనగరువుకు చెందిన ముత్తా మాణిక్యాలరావు (74) గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ స్థానిక ఆటోమొబైల్స్ దుకాణం వద్ద రహదారి దాటుతుండగా.. భట్నవిల్లి వైపు వెళుతున్న కారు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సహాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు.

బడి బస్సుల్లో జాగ్రత్తలపై 25న సమావేశం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యజమానులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా రవాణాశాఖాధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ ఛైర్మన్, కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల ప్రకారం బడి బస్సుల భద్రతా ప్రమాణాల నియమాల ప్రతిని ఆయన ఎస్పీ రాహుల్‌మీనాకు గురువారం అందజేశారు.



ఎస్పీకు ప్రతిని అందిస్తున్న శ్రీనివాసరావు

(c) eenadu

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

శ్యామలాసెంటర్: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా **'పోలీసు కన్వెన్షన్ హాల్, రిజర్వుపోలీస్ లైన్, ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ మండపం దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం'లో ఫిబ్రవరి 26వ తేదీన మెగాసైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

K-10 SCHOOL
SRI GOWTHAMI
Learning for Life
GANDHIPURAM | SRIRAMNAGAR
RAJAMAHENDRAVARAM
93486 55501 | 93486 55503

ఈనాడు



నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం. **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 24**

నమోదుకు: 77027 79616
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

వీరేశ్వరస్వామి తెప్పోత్సవం

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఈనాడు తూర్పుగోదావరి

శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

పంపా జలాశయానికి త్వరలో కొత్త గేట్లు

రూ.3.36 కోట్ల నిధులు మంజూరు

సిద్ధమవుతున్న గేట్లు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామం పంపా రిజర్వాయర్‌కు కొత్త వరద గేట్లు ఈ ఏడాది మార్చిలోగా అమర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న గేట్లు తొలగించి కొత్త గేట్లు అమర్చేందుకు, రోలర్స్, రోప్ రింగ్, కవర్ డ్రైవర్ యూనిట్, కొత్త జనరేటర్, విద్యుత్తు పనులు, సైరన్, విద్యుత్తు ప్యానల్ తదితర పనులకు కూటమి ప్రభుత్వం రూ.3.36 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులన్నీ గత ఏడాది ఖరీఫ్‌కి పూర్తి చేయాల్సి ఉన్నా టెండర్లలో జాప్యం, రిజర్వాయర్‌లో నీటి నిల్వలతో పనులు జరగలేదు. ప్రస్తుతం కొవ్వూరు వద్ద గేట్లు పకడ్బందీగా తయారవుతున్నాయి. త్వరలోనే గేట్లను తెచ్చి రిజర్వాయర్‌కు అమర్చనున్నారు.

పలు సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులు

గత వైకాపా ప్రభుత్వం రిజర్వాయర్ నిర్వహణపై కనీస శ్రద్ధ చూపలేదు. 2023లో మిగ్‌జాం తుపాను సమయంలో గరిష్ఠ స్థాయికి నీరు చేరింది. ఈ సమయంలో 2, 4 గేట్లు అదుపు తప్పాయి. గేట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. పలు తుపాన్ల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకుంది. 2021లోనే గేట్లు పరిస్థితి, ఆధునికీకరణపై నిపుణులు నివేదిక ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసింది.

నిలిపేస్తారు.. ప్రాణాలు తోడేస్తారు

జాతీయ రహదారిపై ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

● గత జనవరిలో కత్తిపూడి వద్ద రోడ్డుపై నిలిపిన లారీని కారు ఢీకొని నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు.

● 2025 సెప్టెంబరులో తాళ్లూరు దాబా వద్ద నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొట్టడంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంపతులు మృతి చెందారు. ఈ ప్రాంతంలోనే ఆగిన లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తి చనిపోయాడు. ఏప్రిల్‌లో మురారి వద్ద ఇదే తరహాలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

గండేపల్లి మండలం మురారి వద్ద జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో ప్రమాదకరంగా..

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గండేపల్లి, శంఖవరం: పదహారో నంబరు జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ నిలిపేసిన వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దివాన్ చెరువు నుంచి పాయకరావుపేట వరకు దాబాలు, మెకానిక్ షెడ్లు, పంక్చర్ దుకాణాల వద్ద ఈ పరిస్థితి అధికం. బ్లాక్ స్పాట్ల కంటే ఈ వాహనాలే దడ పుట్టిస్తున్నాయి.

రామవరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాలు

ఎక్కడెక్కడ పరిస్థితి తీవ్రమంటే..

ఈనాడు పరిశీలన

● రాజానగరం-ఏడీబీ రహదారి కూడలికి సమీపంలో తూర్పుగోనగూడెం వద్ద ఎన్‌హెచ్ పక్కనే పంక్చర్ దుకాణాలున్నాయి. రోడ్డుకు ఆనుకునే లారీలు, ఆటోలు నిలిపేస్తున్నారు.

● మురారిలోని దాబాల వద్ద రేయింబవళ్లు వాహనాలు ఆపేస్తున్నారు. తాజాగా ఉదయం 10.30 గంటల వేళ 10 లారీలున్నాయి.

● మల్లేపల్లి హైవేపై ఆటోలు తిష్ట వేస్తున్నాయి. ఇక్కడే ట్రక్ బే ఉన్నా వినియోగించడంలేదు. వంతెన ఎక్కే చోట వాహనాలు నిలుపుతున్నారు. తాళ్లూరులో 8 దాబాలున్నాయి. స్థానికులు అపసవ్య దిశలో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

● జగ్గంపేటలో పైవంతెన దిగిన వెంటనే డౌన్‌లో డైవర్షన్ పాయింట్ ఉంది. ఇక్కడ రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాలు ఆపేస్తున్నారు. రామవరం కూడలి సమీపంలో ఉన్న దాబాల వద్ద ఉదయమే 10 లారీలు (ట్రాలీ) రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. రాత్రయితే ఇంకా రెట్టింపే.

● యర్రవరం హైవేకి ఆనుకుని నాలుగు రోడ్ల కూడలిలోనూ ఇష్టారీతిన పార్కింగ్ ఉంది.

● కత్తిపూడి వద్ద వెహికల్ బే ఉన్నా నిరుపయోగమే. పైవంతెన ఎక్కేచోట షెడ్లు ఉన్నాయి. వాహనాలు నిత్యం నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన దిగిన వెంటనే కూడలి వద్దా ఇదే పరిస్థితి. పోలీస్ గస్తీ పెంచాల్సి ఉంది.

పుష్కరాల రేవు వద్ద యువకులు, మహిళలు, చిన్నారుల సందడి

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు జై..!

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ప్రదీప్ యాదవ్ ఆధ్వర్యంలో నగరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పుష్కరాల రేవు వద్ద మొదలైన ప్రదర్శన గోకవరం బస్టాండ్, దేవిచౌక్, కంబాల చెరువు, తాడితోట, కోటిపల్లి బస్టాండ్ మీదుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్దకు చేరుకుని, శివాజీ మహారాజ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఛత్రపతి శివాజీ విగ్రహం

కాగితాల్లోనే ఉచిత విద్య..!

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరానికి చెందిన దుర్గా మల్లేశ్వరరావు తమ కుమార్తె (6)కు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య ప్రవేశం కల్పించాలని అన్ని ధ్రువపత్రాలు సమర్పిస్తే.. 'మీరేం ఉద్యోగం చేస్తున్నారు. మీ ఇంటికొచ్చి పరిశీలిస్తాం..మా పాఠశాలలో ఉచితంగా సీట్లు పొందిన వారిని వేరుగా కూర్చోబెట్టి చదివిస్తాం.. బిల్డింగ్ ఫండ్, పుస్తకాలు, దుస్తులు, ఇతర ఖర్చులు మీరే భరించాలి' అంటూ సంబంధిత పాఠశాల సిబ్బంది చెప్పడంతో కంగుతిన్నారు. ముఖ్యంగా ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ పాఠశాలల యాజమాన్యాలు ఉచిత ప్రవేశాలకు పలు సాకులు చూపుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని సర్కారు విడుదల చేసిన జీవో కేవలం కాగితాలకే పరిమితమవుతోంది.

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖాధికారులు ప్రకటనలు ఊదరగొడుతున్నారు.

20 నుంచి దరఖాస్తులు

ఈనెల 20నుంచి దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ విడుదల చేశారు. ఇప్పటివరకు ప్రైవేటు పాఠశాలలు ఆన్‌లైన్‌లో తమ పాఠశాల వివరాలు నమోదు చేయపోవడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా..

ఈ సమస్యపై తల్లిదండ్రులు విద్యాశాఖాధికారులకు నేరుగా ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం ఉండటం లేదు. సీటు వచ్చిన చోటే ఏదోరకంగా యాజమాన్యాన్ని ప్రాధేయపడి, అయినకాడికి ఇస్తామంటూ కొంత మొత్తం సమర్పించుకుని చదివించుకుంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం సర్వశిక్ష, విద్యాశాఖాధికారులకు ప్రైవేటు పాఠశాలలపై పట్టు లేకపోవడమేనన్న విమర్శలు ఉన్నాయి. ఎటువంటి మౌలిక వసతులు లేకపోయినా కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి ముడుపులు తీసుకుని, గుర్తింపు ఇవ్వడం వల్లే వారు సర్కారు జీవోను ఖాతరు చేయడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రవేశాల తీరిలా..

సంవత్సరం	ఉచిత ప్రవేశం పొందింది
2022	132
2023	1034
2024	993
2025	885

మరో అవకాశం..!

● నివాస స్థలాల క్రమబద్ధీకరణకు గడువు పెంపు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం : ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని నివాస స్థలాల క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. స్థలాల క్రమబద్ధీకరణకు అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకునేందుకు ఈ ఏడాది కూడా డిసెంబరు 31 వరకు సమయం ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) టి.సీతారామమూర్తి తెలిపారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు ఏర్పాటు చేసుకుని కొంతమంది పేదలు దీర్ఘకాలికంగా నివాసముంటున్నారు. అభ్యంతరం లేని భూముల్లోని నివాస స్థలాల క్రమబద్ధీకరణ పథకం-2025 అమలు చేస్తూ గతేడాదే జీవో నంబరు 30ని కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీకి ముందు ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల్లోని అభ్యంతరంలేని నివాస స్థలాల క్రమబద్ధీకరించేందుకు మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని గతేడాది జనవరి నుంచి కల్పించింది. జిల్లాలో 797 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 669, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 128 మంది చొప్పున దరఖాస్తులు అందాయి.

ఎందుకంటే..?

గత డిసెంబరు నెలాఖరు వరకు వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో 150 చదరపు గజాల వరకు విస్తీర్ణంలోని స్థలాల క్రమబద్ధీకరణకు 722, 151-300 లోపు 60, 301-450 లోపు ఎనిమిది, 451 చదరపు గజాలు ఆపై విస్తీర్ణంలోని ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణకు ఏడు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడం, విషయం తెలిసే సరికి గడువు ముగిసిపోవడం, దరఖాస్తు చేస్తే ఉన్న గూడు కోల్పోతామనే అపోహలు, ఇతర భయాల వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో ఈ పథకాన్ని ఈ ఏడాది కూడా అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది.

అవ్వతాతల ఆరోగ్యానికి ఓ యాప్

60 ఏళ్లు పైబడిన వారికి.. ఊపిరితిత్తులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు శ్వాస పథకం పేరుతో ఓ యాప్ తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఏఎన్ఎం, ఎల్‌హెచ్‌పీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వృద్ధులను దగ్గమంటారు. ఇతర అంశాలను పరిశీలిస్తారు. ఇబ్బందులుంటే యాప్‌తో గుర్తిస్తారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా రాజానగరం, చాగల్లులో అమలు చేస్తున్నారు. గురువారం రాజానగరం పీహెచ్‌సీ పరిధిలో చేయగా పనితీరును యాప్ తయారీ సంస్థ మేనేజర్ శ్రీరామ్మూర్తి, డైరెక్టర్ నారాయణరావు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.సి.హెచ్.వెంకటలక్ష్మి, మంగతాయారు, ఎన్.వి.వి.రమణ, టీపీఎస్ కుమారి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రాజానగరం

నిఘా నడుమ ఇంటర్ పరీక్షలు

ఇంటర్ పరీక్షలకు వేళయింది. ఈ నెల 23 నుంచి ప్రథమ సంవత్సరం, 24 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్‌లో ప్రభుత్వం సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ప్రశ్నపత్రాలు, మార్కుల్లో మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని **ఇంటర్‌విద్య అధికారిణి (ఆర్ఐవో) ఐ.శారద** తెలిపారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిఘా పెడుతున్నామని చెప్పారు. జిల్లాలో పరీక్షల నిర్వహణపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

– న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

ముఖాముఖి

సిట్టింగ్ స్క్వాడ్‌లు : 3
ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు : 3
ఇన్విజిలేటర్లు: 454
పరీక్షలు జరిగే కేంద్రాలు: 52
హాజరవుతున్న విద్యార్థులు: 22,482 (ప్రథమ), 20,596 (ద్వితీయ)

● జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరం 22,442 మంది, ద్వితీయ సంవత్సరం 20,596 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం.

● ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

● ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే పరీక్షలు జరుగుతాయి. వారికి 24 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు.

● ఈ ఏడాది ఇంటర్‌లో ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కొత్త విధానంలో పరీక్షలు జరగనున్నాయి. తొలిసారి ఒక్క మార్కు ప్రశ్నలకు ప్రవేశపెట్టారు. జవాబులు రాసేందుకు 32 పేజీల బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు.

కేంద్రాల వద్ద సౌకర్యాలు

ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాం. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

అరగంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే హాజరు కావాలి. కేంద్రాల చిరునామాను ముందే ఒకసారి వెళ్లి చూసుకుంటే మంచిది. ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలి. ఏవైనా సందేహాలుంటే ఇన్విజిలేటర్లను మాత్రమే అడగాలి. స్లిప్‌లు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి.

పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

పరీక్షలను పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. 52 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాం. ప్రైవేటు కేంద్రాల్లో సహాయ చీఫ్ సూపరింటెండెంట్లు కూడా ఉంటారు. పరీక్ష కేంద్రాలను ఇంటర్ బోర్డుకు అనుసంధానం చేశారు.

కంట్రోల్ రూం నంబరు: 0883 2473430, 18004251531

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రాథమిక అంశాలు నేర్పించండి : కలెక్టర్

శ్యామలాసెంటర్ : విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆంగ్లం చదవటం, రాయటం, గణితంలో ప్రాథమిక లెక్కలు చేయటం వంటివి తప్పనిసరిగా నేర్పించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. నందంగనిరాజు సెంటర్‌లోని చున్నీలాల్‌జాజూ మున్సిపల్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ప్రాథమిక దశలో విద్యార్థులు పలు అంశాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీని (జీఎఫ్ఎల్ఎన్) ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

ముంపు ముప్పు.. ముందే పసిగడితే..!

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గత వరదల వివరాలు

సంవత్సరం	నీటి మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ ప్రవాహం (టీఎంసీలు)
2022	21.70	25,80,963
2023	16	16,32,780
2024	15.80	16,14,844
2025	14.30	13,57,199

వరదల తీవ్రతపై అధ్యయనం

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఏటా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముంపు సమస్య లంక గ్రామాల ప్రజలను గడగడలాడిస్తోంది. ప్రతి సంవత్సరం జులై నెల నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలను వరద భయం వెంటాడుతూనే ఉంటుంది. జలవనరుల శాఖ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. పూర్తి స్థాయిలో వరద నియంత్రణ చేయలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో వరద నియంత్రణకు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) సహాయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

బృందం పర్యటన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రోజుల పాటు ఇద్దరు ఇస్రో శాస్త్రవేత్తలతో కూడి ప్రత్యేక బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఇస్రో ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికత ద్వారా ముందస్తుగా వరద నియంత్రణకు సహాయక చర్యలపై దృష్టి పెట్టనున్నారు.

ఏటా తప్పని వెతలు

15 ఏళ్ల క్రితం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఏటా వరద తీవ్రత అధికంగానే ఉంది. లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసిన సందర్భాలున్నాయి. ఈ సమయాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.

పోలవరం పూర్తయితే..

పోలవరం ప్రాజెక్టు పూర్తయి వినియోగంలోకి వస్తే వరద ప్రభావం చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని ముందస్తుగా పోలవరం వద్ద నిలుపుదల చేసి, అక్కడి నుంచి మిగులు జలాలను మాత్రమే దిగువకు వదిలే వీలుంటుందన్నారు. దీంతో ధవళేశ్వరం బ్యారేజీకి వరద పోటు తగ్గే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు.

ఏకీకృత సర్వే చకచకా..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

జిల్లాలో కుటుంబాలు	7,29,665
సర్వే పూర్తయినవి	5,22,283
పెండింగ్	2,07,382

జిల్లాలోని ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే(యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే)ను వేగవంతం చేశారు. ఈ నెలాఖరుకల్లా నూరుశాతం పూర్తి చేయాల్సిందేనని అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆయా మండలాల్లో వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దీనిని తెరపైకి తెచ్చింది.

రాజమహేంద్రవరం గ్రామీణంలో సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి వీణాదేవి

సచివాలయ సిబ్బందికి బాధ్యతలు

జిల్లాలో 588 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 4,513 మంది సిబ్బందికి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంబంధించిన 20 రకాల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది చొరవ చూపకపోవడంతో రోజువారీ లక్ష్యం మేరకు కూడా సర్వే జరగని పరిస్థితి ఉంది. అధికారులు దీనిపై దృష్టిసారించి ఈ నెలాఖరుకల్లా సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

ఇదీ పరిస్థితి

● రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోని 391 సచివాలయాల పరిధిలో 4,84,535కు 3,50,059 కుటుంబాల వివరాలు సేకరించారు. ● కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని 197 సచివాలయాల పరిధిలో 70 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ● అత్యధికంగా 90.11 శాతం సర్వే పూర్తి చేసి జిల్లాలోనే గోకవరం మండలం ముందంజలో ఉంది. అన్ని మండలాల్లో ఈ నెలాఖరుకల్లా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వార్డు, గ్రామవార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి వీణాదేవి తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

తుదిపోరు ఉత్కంఠభరితం

వాలీబాల్ పోటీల మహిళల విజేతగా సదరన్ రైల్వే

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో జరిగిన అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ జట్ల మధ్య తుది పోరు రసవత్తరంగా సాగింది. మూడో స్థానం కోసం పురుషుల జట్లు జీఎస్‌టీ(ముంబయి), కర్ణాటక పోటీ పడ్డాయి. జీఎస్‌టీ జట్టు మూడో స్థానం దక్కించుకుంది. మహిళా జట్లు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, సదరన్ రైల్వే(చెన్నై) మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో సదరన్ రైల్వే జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతరం మొదటి, రెండు స్థానాల కోసం పురుషుల జట్లు ఐవోబీ(చెన్నై), ఇండియన్ బ్యాంకు(చెన్నై) తలపడ్డాయి.

సదరన్ రైల్వే, ఎస్ఆర్ఎం మహిళా జట్ల మధ్య పోటీ

ఆ ఇంట 'స్మైలీ' ఇక లేదు..!

● ట్రాక్టర్ ట్రక్కు చక్రాలకింద పడి చిన్నారి దుర్మరణం

స్మైలీ (పాత చిత్రం)

దేవరపల్లి : పొగాకు బంటాలో పనికి వెళ్తూ.. తనతోపాటు తీసుకెళ్లిన కూతురు.. ట్రాక్టర్ ట్రక్కు చక్రాల కిందపడి మృత్యువాత పడడంతో ఆ తండ్రికి అంతులేని శోకమే మిగిలింది. బిడ్డను బాగా చదివించాలని, అందుకు డబ్బులు సంపాదించేందుకు విదేశాలకు పని నిమిత్తం వెళ్లిన తల్లి కడసారి కన్నపేగును చూసుకునేందుకు అక్కడ్నుంచి బయల్దేరారు. పోలీసులు తెలిపిన వివరాలు . . నిడదవోలు మండలం సమిశ్రగూడేనికి చెందిన వేమవరపు రమేష్, లక్ష్మి దంపతులకు స్మైలీ(11) ఏకైక సంతానం. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలే తల్లి లక్ష్మి ఉపాధికోసం కువైట్ వెళ్లడంతో దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పిన్ని ఇంట్లో ఉంటూ స్థానిక పాఠశాలలో అయిదో తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం.. ధుమంతునిగూడెంలో ఉంటున్న తండ్రి వద్దకు వెళ్లింది. గురువారం తనతోపాటు పొగాకు బంటాలో పని ప్రదేశానికి తీసుకువెళ్లారు. ట్రాక్టర్ ఇంజిన్ టైరు పైభాగంలో స్మైలీ, మరో అమ్మాయిని కూర్చోబెట్టారు. గొల్లగూడెం పుంతరోడ్డు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పడంతో స్మైలీ జారిపడింది. ట్రక్కు టైరు ఆ చిన్నారి ఛాతీ మీదుగా వెళ్లింది. గోపాలపురం సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క బిడ్డ కావడంతో స్మైలీని చిన్నప్పటి నుంచీ అల్లారుముద్దుగా పెంచారని, రెక్కల కష్టంతో బాగా చదివించాలనుకున్నారంటూ బంధువులు అన్నారు. ఘటనపై ఎస్సై సుబ్రహ్మణ్యం వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు ● కువైట్‌లో ఉన్న తల్లి లక్ష్మికి విషయం తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. నిన్ను బాగా చదివించాలని నేను విదేశాలకు వెళ్తే మమ్మల్ని వీడి నువ్వు వెళ్లిపోయావా స్మైలీ అంటూ ఆమె విలపించారు. వెంటనే బయల్దేరి వస్తున్నారు.

ఆశలు జల సమాధి

చెరువులో శవమై తేలిన బాలిక

కుడుపూడి కరుణ (పాత చిత్రం)

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం మండలం ముంగండలోని సమగ్ర రక్షిత పథకానికి చెందిన మంచినీటి చెరువు(సమ్మర్ స్టోరేజీ ట్యాంకు)లో గ్రామానికి చెందిన కుడుపూడి కరుణ(15) మృతదేహం తేలింది. బాలిక సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కుడుపూడి శ్రీనివాస్, నాగలక్ష్మి, ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థిని కుటుంబం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల వీధిలో ఉండేది. ఇంటి నిర్మాణం కోసం ఖాళీ చేయాల్సి రావడంతో ఇటీవల ఇక్కడికి సుమారు కిలోమీటరున్నర దూరంలో గల ఇటికల మెరకకు అద్దెకు వెళ్లిపోయారు. విద్యార్థిని పాఠశాలకు వెళ్లి గురువారం సాయంత్రం 5 గంటల తరువాత సైకిల్‌పై ముంగండ శివారు ఇటికలమెరకలోని ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి నానమ్మ వరలక్ష్మి(ఈమె ఎంపీపీ ప్రాథమిక పాఠశాల వీధి) ఉంటున్న ప్రాంతానికి వచ్చింది. కరుణ సైకిల్ ఆ ప్రాంతానికి సమీపంలోని రహదారి చెంతన ఉంది. దానికి అత్యంత సమీపంలోనే చెరువు ఉంది. పాఠశాల నుంచి వచ్చి వెళ్లిన కుమార్తె ఇంటికి చేరుకోపోవడంతో తల్లి అత్త వరలక్ష్మిని ప్రశ్నించింది. తనకు కనిపించలేదని ఆమె బదులిచ్చింది. అనంతరం చెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్సై బి.శివకృష్ణ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశామన్నారు. తమ కుమార్తె మృతిపై ఎవరిపైనా అనుమానాలు లేవని తండ్రి శ్రీనివాస్ చెబుతున్నారు.

(c) eenadu

MUNICIPAL CORPORATION:: RAJAMAHENDRAVARAM
ENGINEERING SECTION

REQUEST FOR PROPOSAL — Dated:-13-02-2026

Request for Proposal are invited for the following work from the eligible contractors only.

Sl.No.	RFP/NIT No.	Name of the work
1	346/MCR/ RFP/2025-26	City Development and Investment Promotion Cell (CDIPC) in Rajamahendravaram Municipal Corporation.

RFP can be downloaded from e-procurement web site www.apeprocurement.gov.in in Service Sector from Dt.13-02-2026 at 10.00 P.M on wards. Last date of time of receipt of RFP on or before Dt.02-03-2026 upto 2.30 PM.

Sd/- **Rahul Meena**, IAS., Commissioner,
Municipal Corporation, Rajamahendravaram.

విగ్రహం గింజంత.. స్ఫూర్తి ఆకాశమంత..

మండపేట, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని మండపేటకు చెందిన కళాకారుడు దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు 18 మిల్లీగ్రాముల బంగారంతో ఛత్రపతి శివాజీ త్రీడీ విగ్రహాన్ని తయారు చేశారు. ధాన్యపు గింజ పరిమాణంలో ఉన్న దీనిని తయారు చేయడానికి రోజుకు 3 గంటల చొప్పున 15 గంటల సమయం పట్టిందని తెలిపారు. గతంలో ఈయన తయారు చేసిన పలు సూక్ష్మవిగ్రహాలకు ప్రపంచ రికార్డు దక్కింది.

కేంద్ర కారాగారంలో వసతుల పరిశీలన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలను గురువారం సాయంత్రం బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం సందర్శించింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలు, వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న భోజన వసతులు, బ్యారక్‌లు, పరిశుభ్రత, జైలు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, బేకరీ విభాగం, జైలు వంటశాల ప్రాంతాలను అధికారుల బృందం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. మహిళా ప్రత్యేక కారాగార పర్యవేక్షణాధికారిణి వసంతకుమారి, జైలు వైద్యాధికారిణి పి. జబీన, జిల్లా స్థాయి అధికారులు టి.దిలీప్‌కుమార్, ఎండీ ముజుఫ్దీన్, కె.రాబర్ట్‌పాల్, డాక్టర్ ఇందిరాభారతీరాయ్, సుభాషిణి, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిషోర్

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ప్రధాన కార్యాలయము : గాంధీ బొమ్మ దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం

స్వాధీనత ప్రకటన (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్ 54/2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు దిగువ తెలిపిన డిమాండ్ నోటీసు జారీ చేసి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మరియు వారి పేర్లకు ఎదురుగా పేర్కొన్న మొత్తము చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత మరియు హామీదారులు విఫలమైనందున సదరు రూల్స్ లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తులను దిగువ సంతకందారు క్రింద తెలిపిన తేదీలలో స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు, హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

దిగువ ఆస్తులతో ఏ విధమైన వ్యవహారములు జరుపరాదనియు మరియు ఈ ఆస్తులకు సంబంధించి ఏ విధమైన వ్యవహారములు జరిపిన ఎడల రుణగ్రహీత మరియు హామీదారుల నుండి **ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్** వారికి బకాయి ఉన్న మొత్తమును మరియు దానిపై తదుపరి వడ్డీకి బద్ధులై ఉంటారని ముఖ్యంగా రుణగ్రహీత మరియు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

నోటీసు వివరాలు

క్ర. నెం.	ఋణగ్రహీత / హామీదారుల పేర్లు	బ్యాంకు వారికి తనఖా చేసిన స్థిరాస్తి/ల వివరములు :	డిమాండ్ నోటీసు తేదీ, స్వాధీనత తేదీ & ఇతర వివరములు
	బ్రాంచ్ : జాంపేట		
1)	**ఋణగ్రహీత:** శ్రీ యల్లమిల్లి గంగా భవాని, D/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, ఆంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ. **హామీదారుడు :** శ్రీ యల్లమిల్లి వెంకన్న, S/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, ఆంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ.	726 చ.గజాల స్థలం, అందులోని శ్రీ యల్లమిల్లి గంగా భవాని కు చెందిన నివాస గృహం, డోర్. నెం.2-79, గొడిలంక, అల్లవరం మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.4627/2014, తేదీ: 01-09-2014 మరియు **సరిహద్దులు : తూర్పు:** యల్లమిల్లి ఆది లక్ష్మి గారి భూమి, **పడమర:** కటారి పాపయ్య గారి కుమారులు తాలూకు బంగాళా పెంకుటి ఇల్లు, **ఉత్తరం:** యార్లగడ్డ వెంకటరెడ్డి గారి స్థలం, **దక్షిణం:** నడింపల్లి రామకృష్ణంరాజు గారి భూమి.	డిమాండ్ నోటీసు తేది: **12-03-2025** స్వాధీనత తేది: **12-02-2026** బకాయి: ది.28-02-2025 నాటికి **రూ.10,55,112/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
	బ్రాంచ్ : అనపర్తి		
2)	**ఋణగ్రహీత:** శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డి, S/o. వెంకట కృష్ణారెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం. **హామీదారుడు:** శ్రీమతి కర్రి బృందావతి, W/o. రాంమూర్తి రెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం.	మొత్తం 236 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 39.1/3 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న 660 చ.అడుగుల విస్తీర్ణం కలిగిన మొదటి ఫ్లోరులో ఫ్లాట్ ఈ క్రింది సరి హద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన ఫ్లాట్, డో.నెం. 3-569/2, సునందనపేట, బాబా నగర్, అనపర్తి, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ: 08-04-2011 మరియు **సరిహద్దులు: 1వ ప్రతి A షెడ్యూల్: తూర్పు** : రాజవీధి, **పడమర:** సత్తి జానకి రెడ్డి గారి భూమి, **ఉత్తరం:** మేడికొండ వేణుబాబు గారి గోడ, **దక్షిణం:** రాజవీధి, **1వ ప్రతి B షెడ్యూల్ : తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఉమ్మడి గోడ కొంత మేర, ఖాళీ ప్రదేశం కొంతమేర, **దక్షిణం:** ఓపెన్ టు స్కై. **2వ ప్రతి :** మొత్తం 71 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 11.83 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న 106.66 చ.అడుగుల విస్తీర్ణం కలిగిన ఆర్.సి.సి. శ్లాబు ఈ క్రింది సరిహద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన సమీప డో.నెం.3-569, సునందనపేట, బాబా నగర్, అనపర్తి, తూర్పు గోదావరి జిల్లా, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ : 08-04-2011 మరియు **సరిహద్దులు: తూర్పు:** రాజవీధి, **పడమర:** రాజవీధి, **ఉత్తరం:** గొలుగూరి ఆనంద రెడ్డి గారి స్థలం, **దక్షిణం:** ఉమ్మడి గోడ కొంతమేర, స్థలం కొంత. **3వ ప్రతి:** మొత్తం 62.2 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 4.15 చ.గజాల విస్తీర్ణం గల స్థలం ఈ క్రింది సరిహద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన సమీప డో.నెం.3-569, సునందనపేట, బాబానగర్, అనపర్తి, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ: 08-04-2011 మరియు **సరిహద్దులు: తూర్పు:** పల్లిడి పద్మావతి గారి స్థలం, **పడమర:** రాజవీధి, **ఉత్తరం:** కర్రి సుధాకర రెడ్డి గారి ఇంటి గోడ, **దక్షిణం:** సత్తి విజయ లక్ష్మి గారి స్థలం.	డిమాండ్ నోటీసు తేది: **20-12-2024** స్వాధీనత తేది: **12-02-2026** బకాయి ది.30-11-2024 నాటికి **రూ. 14,30,362/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
	బ్రాంచ్ : కాకినాడ		
3)	**ఋణగ్రహీత:** శ్రీ పోతల శ్రీను, S/o. ప్రసాదరావు, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం. **హామీదారుడు:** శ్రీమతి పోతల మంగ, W/o. శ్రీను, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం.	121 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీ పోతల శ్రీను కు చెందిన నివాస గృహము, డో.నెం.5-55, వీరవరం, కడియం మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.240/2016 తేదీ : 22-01-2016 మరియు **సరిహద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** వరసాల కాసులు గారి ఇల్లు, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** కుంద యేసురత్నం గారి ఆస్తి.	డిమాండ్ నోటీసు తేది: **29-02-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.29-02-2024 నాటికి **రూ.4,26,158/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
4)	**ఋణగ్రహీత :** శ్రీ గుత్తుర్తి సుందరం, S/o. అప్పారావు అనే దైవదాసు, డో.నెం.3-10, ఎ.కె.మల్లవరం, గొల్లప్రోలు మండలం, **హామీదారుడు:** శ్రీ గుత్తుర్తి ప్రసాద్, S/o. సుందరం, డో.నెం.11-1, ఆవులమంద, పెరుమాళ్ళపురం, తొండంగి మండలం.	194 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీ గుత్తుర్తి సుందరం కు చెందిన నివాస గృహ భవనం, డో.నెం. 6-86, ఎ.కె.మల్లవరం, గొల్లప్రోలు మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 1666/1996 తేదీ: 05-06-1996 మరియు **సరిహద్దులు: తూర్పు:** సుందరపల్లి సత్యనారాయణ గారి ఆస్తి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** చర్చి తాలూకా బిల్డింగ్, **దక్షిణం:** దారి మార్గం.	డిమాండ్ నోటీసు తేది: **29-02-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.29-02-2024 నాటికి **రూ.7,18,840/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
5)	**ఋణగ్రహీత :** శ్రీమతి కనపర్తి లక్ష్మి, W/o. వీర్రాజు, డో.నెం.68-4-5, గోకులం దగ్గర, అశోక్ నగర్, కాకినాడ. **హామీదారుడు:** శ్రీ కనపర్తి రాంబాబు, S/o. వీర్రాజు, డో.నెం.68-4-5, కమల్ వీర్ దగ్గర, అశోక్ నగర్, కాకినాడ.	57.5 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీమతి కనపర్తి లక్ష్మి కు చెందిన నివాస గృహ భవనం, డో. నెం. 68-10ఎ-27/5డి, రాజేశ్వరి నగర్, కాకినాడ, రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 2451/1988 తేదీ: 17-05-1988 మరియు **సరిహద్దులు: తూర్పు:** పన్నాల రాము సుబ్బమ్మ గారి స్థలం, **పడమర:** 6 అడుగుల వెడల్పు గల దారి మార్గం, **ఉత్తరం:** కనపర్తి వెంకటేశ్వర రావు గారి స్థలం, **దక్షిణం:** నా తాలూకు మిగతా ఇల్లు, స్థలం.	డిమాండ్ నోటీసు తేది: **20-12-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.30-11-2024 నాటికి **రూ.2,58,328/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)

తేది : **18.02.2026** — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : రాజమహేంద్రవరం — ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్.,

సత్యసాయి రక్షిత తాగునీరు పునరుద్ధరణ

దేవీపట్నం: సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఉన్న సత్యసాయి తాగునీటి పథకంలో మోటార్లు పాడయ్యాయి. అయిదు మండలాల్లో 84 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయింది. సమస్యను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేయడంతో ఇందుకూరుపేటలో పంపుహౌస్‌కు తాగునీరు సరఫరా కావడంతో గురువారం నుంచి సరఫరా జరుగుతోంది.

అభ్యంతరాల స్వీకరణకు 23 వరకు గడువు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జోన్-2(ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు) వైద్యఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకుని కార్యాలయం పరిధిలో ఫార్మసిస్ట్ అధికారి పోస్టులకు సంబంధించి సవరించిన ప్రొవిజనల్ ప్రతిభ జాబితా విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 20 నుంచి 23వ తేదీ సాయంత్రం అయిదు గంటల్లోపు రాజమహేంద్రవరంలోని ఆర్డీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించి గతేడాది అక్టోబరులో దరఖాస్తులు స్వీకరించారు.

కాల్పనిక ప్రపంచంలో.. అవకాశాల హరివిల్లు

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ(ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏవీజీసీ సంయుక్త సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన రెండు రోజుల ఏవీజీసీ-ఎక్స్ఆర్ సమ్మిట్-2026 గురువారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవరచుకోవాలన్నారు. ఉద్యోగాలు ఆశించకుండా, సృష్టించాలన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకంగా నిలుస్తుందన్నారు. ఏపీ, హబ్ డైరెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఇలాంటి వేదికను వినియోగించుకోవాలన్నారు.

గ్రాఫిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణురాలు

బోలెడు ఉద్యోగాలు..

ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు బాగున్నాయి. యువతకు ఈ రంగం ఆశాకిరణంగా కనిపిస్తోంది. వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, ఎక్స్ఆర్ సాంకేతికత, అందులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. నాలాంటి చాలామందికి ఇలాంటి వాటిపై ఆసక్తి ఉన్నా అవగాహన లేక ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి కార్యక్రమాలతో ఎంతో ప్రయోజనం ఉంటుంది.

– సీహెచ్ లిఖిత, బీటెక్ తృతీయ సంవత్సరం

ఈ రంగంలోనూ ఏఐ..

గేమింగ్, యానిమేషన్, కామిక్స్ రంగాలకు ఎప్పటినుంచో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఏఐ రాకతో మరింత పెరుగుతుంది. వీటిలో కూడా కృత్రిమ మేధను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నా. వీడియో, స్టోరీని ఎలా రూపొందించాలో నేర్చుకున్నాం. చదువుతున్న సమయంలోనే ఇలాంటి వాటిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది.

- ఎం.సాయివర్మ, బీటెక్ తృతీయ సంవత్సరం

గేమ్స్ రూపొందిస్తా..

రెండు రోజుల కార్యక్రమాల్లో సినిమాల్లో వీఎఫ్ఎక్స్ ఎలా ఉపయోగిస్తారో తెలుసుకున్నా. నాకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. ఆ ఆసక్తితోనే ఈ కార్యక్రమానికి వచ్చాను. పిల్లల నుంచి పెద్దల వరకు గేమింగ్ యాప్స్ చాలా ఆడుతున్నారు. వాటికి విపరీతమైన ఆదరణ ఉంది. భవిష్యత్తులో గేమ్స్‌ను రూపొందించి ఉపాధి పొందాలనే ఆలోచన ఉంది.

- కె.జాగృతి, బీఎస్సీ తృతీయ సంవత్సరం

ర్యాలీ వద్దన్నందుకు.. పోలీసులతో అంబటి వాగ్వాదం

కంబాలచెరువు, వీఎల్‌పురం, ఏవీఏరోడ్డు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు బుధవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలైన సమయంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు నగరంలో హల్‌చల్ చేసిన విషయం విదితమే. ఇదే విధంగా మళ్లీ గురువారం ఉదయం రాజమహేంద్రవరం వైకాపా శ్రేణులతో పాటు అంబటి హడావిడి సృష్టించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని వైకాపా నేత జక్కంపూడి గణేశ్ ఇంటి నుంచి గురువారం ఉదయం నుంచి గుంటూరు బయల్దేరారు. ఈ సమయంలో వైకాపా శ్రేణులు కార్లతో ర్యాలీ తీశారు. పోలీసులు సెక్షన్ 30 యాక్టు అమల్లో ఉందని ఆయనకు నోటీసు ఇచ్చారు. దీంతో అంబటి కూటమి సర్కారుపై ఆగ్రహంతో ఊగిపోయి, పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

రాంబాబుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం నగరంలో వైకాపా శ్రేణుల ర్యాలీ

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాల్‌లో)	ధర (రూపాయల్లో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి)	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు కాయ)	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోల టిన్	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

మాటువేసి.. కిరాతకంగా మట్టుబెట్టి

✦ కలహాలతో భార్యను హత్యచేసిన భర్త
✦ ఆపై ఆత్మహత్యాయత్నం.. రంగాపురంలో ఘటన

జ్యోతి (పాతచిత్రం)

భర్త దుర్గయ్య

బిక్కవోలు, న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థలు ఏర్పడి పుట్టింట్లో ఉంటూ ఓ పరిశ్రమలో పనిచేస్తున్న ఆమెను మాటువేసి కత్తితో కిరాతకంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. ఆపై తానూ పురుగులమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన బిక్కవోలు మండలం రంగాపురంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన ధనుకొండ దుర్గయ్యకు సొంత అక్క కుమార్తె జ్యోతితో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు దుర్గేశ్ (9), నాని (7) ఉన్నారు. దుర్గయ్య వ్యవసాయ పనులు చేస్తుండగా జ్యోతి పెద్దాపురంలోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నారు. భార్యపై దుర్గయ్య అనుమానం పెంచుకున్నాడు. గత కొన్నాళ్లుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మూడు నెలలుగా పుట్టింట్లోనే జ్యోతి ఉంటున్నారు. తన భార్య కాపురానికి రావాలని, లేదా విడాకులివ్వాలని దుర్గయ్య డిమాండు నుంచి పట్టుబడుతూ వస్తున్నాడు. జ్యోతి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కక్ష పెంచుకున్నాడు. ఎప్పటిలాగే జ్యోతి విధులకు వెళ్లి బుధవారం రాత్రి 11 గంటల సమయంలో బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా దుర్గయ్య ఓ ఇనుప వస్తువుతో ఆమె తలపై బలంగా కొట్టాడు. తనను కాపాడాలంటూ పరుగులు తీసిన ఆమె ఓ చోట కూలబడిపోగా మరో ఆయుధంతో దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయింది. ఆ వెంటనే దుర్గయ్య పురుగుల మందు తాగి, ఇంటికి వెళ్లి తల్లికి విషయం చెప్పాడు. అంతా మరుసటి స్థలికి చేరుకుని చూడగా జ్యోతి విగత జీవిగా కనిపించింది. దుర్గయ్య ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.

అటు కుమార్తె.. ఇటు సోదరుడు

కుమార్తె హత్యకు గురవడం.. ఇటు సోదరుడు పురుగుల మందు తాగడంతో జ్యోతి తల్లి విలవిల్లాడారు. రక్తసంబంధమని కూడా చూడకుండా తన బిడ్డను పొట్టనపెట్టుకున్నాడని రోదించారు. అమ్మ కావాలంటూ పిల్లలు విలపించడం అందరినీ కలచివేసింది.

92.7 FM Rajamahendravaram — 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్ కలిగిన N/E 272 చ||గ||లు, N/F 272 చ||గ||ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

రాజమండ్రి దేవిచౌక్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ M/F కావలెను. Qul: డిగ్రీ. ✆ 99898 76799.

శ్రీలక్ష్మీవెంకటేశ్వర వెహికల్ ఫైనాన్స్ కొరకు ఆఫీస్ బోయ్, కలెక్షన్ బోయ్స్, 30-35 సం||గల హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96662 19999.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ (Male) కావలెను. Contact Cell: 80991 91919.

రాజమండ్రి విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేయుటకు Asst. అకౌంట్స్ (F) కావలెను. బీకామ్ ఫ్రెషర్, టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి. ✆ 85006 44978.

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ కాకినాడలో కొత్తశాఖ కోసం డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వయస్సు: 35 సం||రాలు పైబడిన వారు. జీతం: 75,000/- వరకు+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. సంప్రదించండి: 6361185310.

రాజమండ్రిలో ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు వంటమనుషులు, లేడీ వార్డెన్, ఆయా కావలెను. జీతం + వసతి + భోజనం. Cont: 94937 15552

కడియంలో ప్రముఖ నర్సరీలో పనిచేయుటకు అనుభవం గల అకౌంటెంట్ (M/F) కావలెను. Contact Cell: 99488 36667.

FACULTY/ TEACHERS

Wanted Teachers to teach Primary & Higher English & Science Fluency in English is must. GopiKrishna EM High School, Gandhipuram-1, Rajahmundry. 8374208700, 9515542339

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month. Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-15** పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.**91609 49910**, ఇ-మెయిల్ ఐడి: **sbi.10077@sbi.co.in**, ఆస్తి తనిఖీ కొరకు : **98660 27578.**

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) **"ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : **మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్‌హౌసింగ్,** 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. వేరొక చిరునామా: మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్ హౌసింగ్, ఆఫీస్ చిరునామా: సంప్రదించవలసిన వారు: మేనేజింగ్ పార్ట్‌నర్ : **శ్రీ బాల గాంధీరాజు జంపాన,** తండ్రి: నరసింహరాజు, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డివారి వీధి, శాంతినగర్, కాకినాడ-533004. హామీదారులు: 1) **శ్రీ బాల గాంధీరాజు జంపాన,** తండ్రి: నరసింహరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 2) **శ్రీమతి పద్మావతి జంపాన,** భర్త: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 3) **శ్రీ సాయిరాజ్ జంపాన,** తండ్రి: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 4) **శ్రీ సీజన్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్: శ్రీ బాల గాంధీరాజు జంపాన,** తండ్రి: నరసింహరాజు, ప్లాటు నెం.59, అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్-500034.

డిమాండ్ నోటీసు తేది: **01-07-2022** డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.**30-06-2022** నాటికి **రూ.6,00,06,891/-** + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.**31-01-2026** నాటికి **రూ.10.42 కోట్లు** + తేది.**01.02.2026** నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు: ఆస్తి ఐడి : SBIN8911995166

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ పట్టణం, సూర్యారావుపేట గ్రామం, విద్యుత్ నగర్, బ్లాకు నెం.68, వార్డు నెం.29, కొత్త సర్వే నెం.180లోని ఎ.14.65 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఉత్తరం వైపున మధ్య భాగంలోని ఎ.3.02 సెంట్లు విస్తీర్ణంలో 1560 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి ఐడియల్ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ సొసైటీ పాలక మండలి వారిచే ఎగ్జిక్యూట్ చేయబడిన తూర్పు గోదావరి జిల్లా, కాకినాడకు చెందిన శ్రీ జంపాన సాయిరాజ్, తండ్రి: బాల గాంధీరాజు గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. **3193/2019** తేది:**28-03-2019** ప్రకారం) హద్దులు మరియు కొలతలు: **తూర్పు:** 195.6 అ॥లు - ఐడియల్ కాలేజికి చెందిన స్థలం, **ఉత్తరం :** 70 అ॥లు - నాన్సీ వీధి (మున్సిపల్ రోడ్డు), **దక్షిణం:** 70 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం, **పడమర :** 206 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం. **పైన తెలిపిన హద్దులలోని 1560 చ॥గ॥ల ఖాళీ స్థల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులు మరియు ఉమ్మడి దారులు మొ॥ వాటితో కలదు.**

రిజర్వు ధర : **రూ.5,20,00,000/-** ధరావత్తు : **రూ.52,00,000/-** బిడ్ పెంపుదల : **రూ.50,000/-**

ఇ-వేలం తేదీ : 25-03-2026 సమయం : ఉ॥ **11.00** గం॥ల నుండి సా॥ **04.00** గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: **20-02-2026** నుండి **24-03-2026** వరకు ఉ॥**10.00** గం॥ల నుండి సా॥ **04.00** గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : **www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices**లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : **https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com** & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: **91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com**ను సంప్రదించండి.

2) **ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.**

గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ **https://baanknet.com** నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ **రూ.50,00,000/-** (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నావో సదరు మొత్తముపై **TDS @ 1%** వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో **1% TDS** ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ **TDS** సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:**18-02-2026**, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ అడ్రస్ : జోనల్ ఆఫీస్, డి.నెం.6-12-5/1, 2వ ఫ్లోర్, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురు, రాజమహేంద్రవరం-533101. మరియు బ్రాంచ్ ఆఫీస్: రాజమండ్రి-1, వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

ఉప్పలపాటి ప్రసన్న కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని రూల్ 9(1) తో కలిపి చదువబడే, స్థిరాస్తుల విక్రయం కొరకు తేదీ **14.10.2025 నాటి ఇంటెండింగ్ సేల్ నోటీసు** యొక్క 30 రోజుల గడువు ముగిసిన తరువాత ఇప్పుడు జారీ చేయబడిన ఈ-వేలం విక్రయ నోటీసు. చట్టం 54/2002 లోని సెక్షన్ 13(8) మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 లోని రూల్ 8(6) ప్రకారం నిర్దేశించిన విధంగా మీ విముక్తి హక్కును వినియోగించుకోవడంలో మీరందరూ విఫలమైనందున, ఈ ఇ-వేలం విక్రయ నోటీసు జారీ చేయబడిందని రుణగ్రహీతలకు / హామీదారులకు / తనఖాదారులకు / కో-అప్లికెంట్స్‌కు / సహ-రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు / కో-అప్లికెంట్స్ / సహ-రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వద్ద తాకట్టు పెట్టబడిన ఈ క్రింద వివరించిన స్థిరాస్తిని, **"ఎక్కడ ఉంటే అక్కడ", "ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలో" మరియు "ఏమి ఉంటే అది" ప్రాతిపదికన 31.03.2026 తేదీన ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు విక్రయించబడును.** SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) వారు రుణగ్రహీత/హామీదారు(ల)కు జారీ చేసిన **30.12.2023 తేదీనాటి డిమాండ్ నోటీసు తేదీ ప్రకారం ఉన్న బాకీ 30.12.2023 తేదీనాటికి రూ.27,66,068/-** మరియు 31.12.2023 నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు ఇతర ఛార్జీలు రాబట్టుకొనుట కొరకు ఈ వేలం నిర్వహించబడుతుంది.

అగ్రిమెంట్ నెం. **RAJA2TF2110300008**

రుణగ్రహీత/హామీదారుల పేర్లు మరియు చిరునామాలు:

1) **ఉప్పలపాటి శ్రీమన్నారాయణ, తండ్రి: కృష్ణారావు,** తిరుమల మెడికల్ & జనరల్ స్టోర్స్ వ్యాపారం, నివాస చిరునామా : డి.నెం.7-125, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, దేవరపల్లి : 534 313. పశ్చిమ గోదావరి జిల్లా.
2) **ఉప్పలపాటి ప్రసన్న, భర్త: శ్రీమన్నారాయణ,** గృహిణి, నివాస చిరునామా: డి.నెం.7-125, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో, దేవరపల్లి-534 313, పశ్చిమ గోదావరి జిల్లా.
3) **బండి హరిహర అయ్యప్ప, తండ్రి: రామారావు,** స్టోన్ క్రషర్ వ్యాపారం, డి.నెం.1-128/2, వాటర్ ప్లాంట్ వీధి సమీపంలో, కురుకూరు-534 305, పశ్చిమ గోదావరి జిల్లా.

స్థిరాస్తి యొక్క వివరములు (ఉప్పలపాటి ప్రసన్న గారికి చెందిన ఆస్తి)
కొవ్వూరు యొక్క సబ్-రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం. 5811/2021 (MOD) ప్రకారం తనఖాపుంచిన ఆస్తి:

పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు సబ్-డిస్ట్రిక్ట్, దేవరపల్లి మండలం, దేవరపల్లి గ్రామ పంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, 7వ వార్డు, అర్.ఎస్.నెం. 1304/2, డి.నెం. 7-125 మరియు అసెస్‌మెంట్ నెం. 954 నందు 484 చ.గ.ల విస్తీర్ణంలో ఉత్తర భాగాన 242 చ.గ.లు లేదా 202.343 చ.మీ. స్థల విస్తీర్ణంలో 687 ½ చ.అ. ప్లింత్ ఏరియా కలిగిన ఆర్.సి.సి భవనంకు సంబంధించిన యావదాస్తి. **హద్దులు: తూర్పు:** క్రాస్ బిట్, **దక్షిణం:** ఈ ఆస్తి మరియు దాత యొక్క ఆస్తి మధ్య ఉన్న ఉమ్మడి గోడ, **పడమర:** దేవరపల్లి నుండి పల్లంట్ల వెళ్లే రోడ్డు, **ఉత్తరం:** అడబాల వెంకటేశ్వర రావు గారి ఇల్లు.
ఆస్తిపై ఉన్న రుణభారాలు: ఏమీ లేవు.

అగ్రిమెంట్ నెం.	ఆస్తి రిజర్వ్‌ధర	EMD మొత్తము:	EMD చెల్లింపు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేదీ	EMD చెల్లించడానికి చివరి తేదీ	ఆస్తి తనిఖీ తేదీ.
RAJA2TF2110300008	**రూ.24,40,000/-** (అక్షరాల ఇరవై నాలుగు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)	**రూ.2,44,000/-** (అక్షరాల రెండు లక్షల నలభై నాలుగు వేల రూపాయలు మాత్రమే)	డిడి రూపంలో "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరిట తీయవలెను	రూ. 10,000/-	31.03.2026	30.03.2026	28.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించుకోవడం, డేటా అప్‌లోడ్ చేయడం, బిడ్ సమర్పించడం, ఈ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటి కోసం **M/s.శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, కాంటాక్ట్ పర్సన్: శ్రీ గౌరవ్ సంబూదిరి ఫోన్: 9833922941,** ఈమెయిల్: శ్రీ గౌరవ్ సంబూదిరి <gaurav.n@samil.in> వారిని సంప్రదించవచ్చు. ఆస్తికి సంబంధించిన సందేహాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆథరైజ్డ్ ఆఫీసర్, **శ్రీ డి.రామమోహన్, ఫోన్: 9849824075** నంబరులో ఆఫీసు వేళల్లో మరియు పని దినాలలో సంప్రదించవచ్చు.

ఎటువంటి కారణం చూపకుండా ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా ఏజెన్సీ అయిన శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వారి వెబ్‌సైట్ **(https://eauctions.Samil.in/home)** లో నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ, బిడ్ ఫారం పొందడం మరియు పూర్తి నిబంధనల కోసం **https://eauctions.Samil.in/home** మరియు విక్రయానికి సంబంధించిన సవివరమైన నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లోని **https://www.shriramfinance.in/auction** లింక్‌ను చూడగలరు.

గమనిక: NCLT, చెన్నై వారి ఆదేశాల మేరకు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది అని దీని ద్వారా తెలియజేయడమైనది. తదుపరి, పేరు మార్పుకు సంబంధించి 30-11-2022 నాడు జారీ అయిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ ప్రకారం, 30.11.2022 తేదీ నుండి అమలులోకి వచ్చేలా శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా మార్చబడింది.

ప్రదేశము: రాజమండ్రి, తేది: **19.02.2026** — సం/-అధీకృత అధికారి

రాజమహేంద్రవరం

ఉచిత కంటి వైద్య శిబిరం

దేవీచౌక్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గౌతమినేత్రాలయం సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, కె. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కోరుకొండ: మండలంలోని గాడాల విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేబీవీ నటరాజన్ తెలిపారు. గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: మూరమిడివారిపేటలోని బారికేడ్ వద్ద వెళ్లే వారు తమ వాహనాలను ఇరువైపులా నిలిపేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. **- చంద్రశేఖర్**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రెండో పట్టణ పోలీసులు**

స్పందనకు వందనం

● నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక పోస్టల్ కాలనీలో రహదారిపై వదిలేసిన చెట్లకొమ్మలను విద్యుత్తు సిబ్బంది తొలగించినట్లు ఫిర్యాదుదారుడు శర్మ తెలిపారు.

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రంజాన్ మాసం.. ఆధ్యాత్మిక శోభితం

ప్రారంభమైన ఉపవాసదీక్షలు

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్: రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభమైంది. దీంతో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. ఏటా రంజాన్ పర్వదినంలో 30 రోజుల పాటు చిన్న, పెద్దతేడా లేకుండా ఉపవాస దీక్ష పాటిస్తారు. సహరీతో మొదలై.. ఇఫ్తార్‌తో ముగిసే ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి రోజు తెల్లవారుజామున సహరీ పేరుతో ఆహారాన్ని స్వీకరిస్తారు. పగలంతా నీటి చుక్క కూడా తీసుకోకుండా కఠినమైన ఉపవాస దీక్ష పాటిస్తారు. సాయంత్రం 6.30గంటల తర్వాత ఇఫ్తార్ విందుతో ఉపవాస దీక్షను విరమిస్తారు. ప్రతి రోజు ఐదు పూటలా నమాజును భక్తిశ్రద్ధలతో చేస్తారు.

నగరంలో హలీం దుకాణాలు

ప్రార్థనల అనంతరం తెల్లగా జీడిపప్పు పోపులను నిండిన పదార్థాలు స్వీకరిస్తారు. వాటిలో మొదటిది హలీం. తర్వాత స్థానంలో డ్రైఫ్రూట్ జ్యూస్ వంటివి ఉంటాయి. ఈ మాసమంతా హలీం దుకాణాల వద్ద పెద్ద ఎత్తున ముస్లిం సోదరులతో పాటు ఇతరులు కూడా వీటిని తినేందుకు ఇష్టపడతారు. దీంతో నగరంలో పలు చోట్ల హలీం దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలతో మసీదులకు కళ

రాజమహేంద్రవరం నగరంలోని మసీదులు విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. ప్రతి రోజుసాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో కళకళలాడుతున్నాయి. రంజాన్ మాసంలోని ఆఖరి పది రోజుల్లో వచ్చే బేసి రాత్రుల్లో జాగారం చేస్తారు.

ఆక్రమణలు తొలగించేదెలా..?

సవాలుగా రహదారుల విస్తరణ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో రోడ్ల విస్తరణపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. దీని కోసం తలపెట్టిన ప్రత్యేక కార్యాచరణ సఫలీకృతం కావడం లేదు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్‌ను దృష్టిలోపెట్టుకొని రోడ్డు వెడల్పు చేయాలంటే ముందుగా ఆక్రమణలను తొలగించాల్సి ఉంది. దీనిపై అధికారులు ఒక అడుగు ముందుకేసి ఆక్రమణలు తొలగించేందుకు ప్రణాళికల సిద్ధం చేసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో పనులు ముందుకు సాగలేదు. పట్టణ పరిధిలో 22 రోడ్లను విస్తరించాలని గుర్తించారు. రోడ్డు విస్తరణకు తలపెట్టిన పనుల్లో అధికార యంత్రాంగానికి చుక్కెదురైంది.

ఆసక్తి చూపకపోవడంతో..

ఇళ్ల ముందు నిర్మాణాలు తొలగించేందుకు కొంత మంది నగరవాసులు ఒప్పుకోవడం లేదు. మరి కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. కొంత మందికి టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. దీంతో యంత్రాంగానికి ఏం చేయాలో తెలియని పరిస్థితి.

అడుగుకో సమస్య

కోరుకొండ రోడ్డు విస్తరణకు కోర్టు సమస్యలు ఎదురవుతున్నాయి. మోరంపూడి రోడ్డు విస్తరణలో టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఇన్నీసుపేటలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మెయిన్ రోడ్డు, గోదావరి గట్టు, నల్లమందు సందు, చుట్టుపక్కల వీధుల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాజకీయ పాత్ర పోషిస్తోంది.

ప్రణాళిక ఇలా..

● మొదటి దశలో తూర్పు రైల్వే స్టేషన్, మోరంపూడి, గుండువారి వీధి, కోరుకొండ, గాదాలమ్మనగర్, మెయిన్ రోడ్ల విస్తరణకు సన్నాహాలు చేశారు. జేసీబీలతో ఆక్రమిత నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని తొలగించారు. అంతలోనే ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు అడ్డంకి ఏర్పడింది.

● రెండో దశలో కోటిలింగాలపేట, జెండాపంజా రోడ్డు, పాత బైపాస్ రోడ్డు, టింబర్ మర్చంట్ రోడ్డు, ఉండవల్లి వారి వీధి, కాతేరు రోడ్డు, స్టేడియం రోడ్డు, సీతంపేట రోడ్డు, మూలగొయ్యి, శేషయ్యమెట్ట ప్రాంతాల్లో వెడల్పు చేయాలని ప్రతిపాదించారు.

గత ఏడాది చేపట్టిన ఆక్రమణల తొలగింపు పనులు

రాజకీయ ఒత్తిళ్లే కారణం

రాజకీయ ఒత్తిళ్లు కారణంగానే పనులు ముందుకు కదలడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నగరపాలక సంస్థకు 2017లో కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేశారు. అప్పటి కమిషనర్ విజయ్‌రామరాజు హయాంలో దీనిని ప్రతిపాదించగా, ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను అనుసరించి కూడా రోడ్లను విస్తరించడం లేదు.

ఇరుకు మార్గాలపై వెతలు

బృహత్తర ప్రణాళిక ప్రకారం 40 అడుగులు ఉన్న రోడ్లను 60, ఆ పైన ఉన్న రోడ్లను 80 లేదా 100 అడుగుల రోడ్లుగా విభజించాల్సి ఉంది. ఈ పనులకు ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. రోడ్లన్నీ నిత్యం రద్దీగా మారుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలో మెయిన్ రోడ్డు, దేవీచౌక్, కంబాలచెరువు, కోటగుమ్మం, పుష్కరఘాట్, గోకవరం బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వెళ్లాలంటే హడలిపోవాల్సిన పరిస్థితి ఉంది.

'బీసీలంతా ఐక్యంగా సాగాలి'

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ అన్నారు. మంగళగిరిలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కేసన శంకర్రావు చేతుల మీదుగా సంఘ జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్నారు. గురువారం స్థానిక కంబాలచెరువు వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో జరిగిన అభినందన సభలో మాట్లాడారు. సమాజంలో వెనుకబడి ఉన్న బీసీలు అన్నిరంగాల్లోనూ రాణించాలని, బీసీ అభ్యున్నతికి సంఘం తరఫున కృషి చేస్తామన్నారు.

హోమం నిర్వహిస్తున్న స్వామీజీలు

పరమహంస జయంతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస జయంతి ఉత్సవం గురువారం నిర్వహించారు. మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి హోమం చేశారు. మంగళ హారతి, సుప్రభాతం, వేద పఠనం, భజనలు చేశారు. స్వామి శశికాంతానందజీ మహారాజ్, స్వామి సేవ్యానందజీ మహారాజ్, స్వామి లోకమయానందజీ మహారాజ్, బ్రహ్మచారి ఇష్టచైతన్య మహారాజ్ పరమహంస జీవిత సందేశాలు బోధించారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టి.నగర్, న్యూస్‌టుడే: అనధికార లే-అవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి, నేరుగా పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఏప్రిల్ 23 వరకూ, బీపీఎస్‌కు మార్చి 11 వరకూ ప్రభుత్వం గడువు కల్పించిందన్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు కొండలరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొలతలు సరిచూస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

ప్రణాళికాబద్ధంగా నగర అభివృద్ధి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు 4వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ మరమ్మతులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో వీటిని సచివాలయాలుగా మార్చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తాజాగా కూటమి అధికారం చేపట్టిన తర్వాత వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. తద్వారా బడుగు బలహీన వర్గాలకు చిన్న చిన్న వేడుకలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : యువతలో ఆవిష్కరణలు, వ్యాపార నైపుణ్యాల అభివృద్ధి, సవాళ్లను ఎదుర్కోవడం అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 20, 21వ తేదీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం తెలిపారు. సదస్సును పీఎం ఉషా పథకంలో భాగంగా నిర్వహిస్తున్నామని, యువతలో కొత్త ఆవిష్కరణలు, దృక్కోణాన్ని పెంపొందించడానికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఆయా రంగాల్లో నిపుణులైన వ్యాపారవేత్తలు, విద్యావంతులు సమావేశంలో పాల్గొని వారి అనుభవాలు పంచుకుంటారన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఎం.ఎస్‌ఎం.ఈ ఇందులో భాగస్వామ్యంగా ఉంటారన్నారు. డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు పాల్గొని జీవితంలో స్వశక్తితో ఎదగడానికి ఉపయోగపడే మెలకువలు తెలుసుకోవలసిందిగా ఆహ్వానించారు.

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి..

దేవీచౌక్, న్యూస్‌టుడే: నేటి యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీఏజీపి సంయుక్త సహకారంతో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమ నిపుణులు వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్‌ఆర్ సాంకేతికతలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నైపుణ్యాలతో అనుసంధానించి ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీవీఏజీపి అధ్యక్షులు బాలబాలాజీ రుద్ర, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి మేఘన తిరుమలశెట్టి, డాక్టర్ జి. సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాజానగరం, న్యూస్‌టుడే: పాలచర్ల పరిధిలో కొలువైన లక్ష్మీ పద్మావతి, గోదా ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకులు బుద్దాల సోదరులు వెంకన్నబాబు, అమ్మిరాజు, ఆలయ అర్చకులు గణేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, హోమాలు జరుగుతాయన్నారు.

నేడు తెలుగు నుడి సభ

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 21న మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు నుడి సభ నిర్వహిస్తున్నామని వీసీ డి.మునిరత్నం నాయుడు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10.30 జరిగే కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు పాల్గొంటారని పేర్కొన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచుల వినియోగం

పర్యావరణ పరిరక్షణకు అధికారులు ఓ వైపు ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దంటూ నిత్యం ప్రచారం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు రావడం లేదు. ఇటీవల నగరంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించి 4 టన్నులకు పైగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మెయిన్‌రోడ్డులోని దుకాణాల ముందు వినియోగించిన పాలిథిన్ కవర్లు పెద్ద ఎత్తున మేట వేశాయి. మెయిన్ రోడ్డు వీధిలో ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. వీటి అడ్డుకట్టకు మరిన్ని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

నీటి వృథా..తప్పని వ్యథ

స్థానిక ఆర్టీసీ డిపో వద్ద పల్లె వెలుగు సర్వీసుల ప్రాంగణం వైపు నుంచి ఆర్టీసీ అతిథి గృహం వైపు ప్రహరీ వెంబడి ఉన్న పైపులైను నుంచి నీరు వృథా అవుతోంది. ఇక్కడ విడిపోయిన పైపు లైనుకు డమ్మీ సక్రమంగా లేకపోవడంతో కర్రపెట్టి వదిలేశారు. కొన్ని రోజులుగా నీరు వృథా అవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. పైపులైను నుంచి నీటి వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, వీఎల్‌పురం**

కుంగుతున్న దిమ్మెపై విద్యుత్తు నియంత్రిక

కోరుకొండ రోడ్డులోని రాజా థియేటర్ సమీపంలో రహదారి మలుపు వద్ద విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేసిన దిమ్మె అడుగు భాగం పూర్తిగా దెబ్బ తింది. దీని పక్కనే ఉన్న కాలువలోకి దిమ్మె కూరుకుపోయే పరిస్థితి నెలకొంది. పాఠశాలలు, బ్యాంకులు ఈ ప్రాంతంలోనే ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. **-న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ మూత

కోటిపల్లి బస్టాండ్ వద్ద బస్సులు బయటకు వచ్చే మార్గంలో మ్యాన్‌హోల్‌కు ఇటీవల మూత ఏర్పాటు చేశారు. కానీ రెండు నెలలు కూడా కాక ముందే మళ్లీ విరిగి ప్రమాదకరంగా తయారైంది. ఎవరైనా ఏమరపాటుగా ఉంటే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని నగరవాసులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

ఆదేశాలు పట్టవా

లారీ నిండుగా మట్టి వేసి, దానిపై ఎటువంటి పరదా లేకుండా వెళ్లటంతో రోడ్లపై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, మట్టి, కంకర తరలించే వాహనాలు పరదాలు కట్టుకొని వెళ్లాలని అధికారులు ఆదేశిస్తున్నా.. వాటిని ఖాతరు చేయడం లేదు. దీంతో ఈ వాహనాల వెనుక వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. **-న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్**

గాయపడిన గుడ్లగూబకు చికిత్స

రాజానగరం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో జాతీయ రహదారిపై పడిపోయిన ఓ గుడ్లగూబకు చికిత్స చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని హైవేపై గురువారం ఓ గుడ్లగూబ పడిపోగా, ముక్కు నుంచి రక్తం కారుతోంది. స్థానికుడు ఒకరు గమనించి పుష్కరవనంలోని వన్యప్రాణి ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చి ఫారెస్ట్ రేంజ్ అధికారికి దావీదురాజుకు అప్పగించారు. అక్కడ రెస్క్యూ సెంటర్‌లోని వన్యప్రాణి వైద్యాధికారితో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స అనంతరం రక్తం కారడం ఆగిందని దావీదురాజు తెలిపారు. ప్రస్తుతం దానికి ఆహారం ఇస్తున్నామని, దాని వయసు సుమారు 8 నెలలు ఉండవచ్చన్నారు. ఏమైనా గాయపడిన ప్రాణులను ఇక్కడకు తీసుకొస్తే వైద్యం చేయిస్తామన్నారు. వివరాల కోసం 6309730519 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఈ యువకులు.. క్రీడా కెరటాలు

రాజానగరం, న్యూస్‌టుడే: సెపక్‌తక్రా ఇప్పుడిపుడే ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రాచుర్యం పొందుతున్న క్రీడ. వాలీబాల్, త్రోబాల్ కంటే భిన్నంగా ఈ ఆట ఉంటుంది. క్రీడాకారులు తమ కాళ్లతో బంతిని కొట్టి, ప్రత్యర్థి కోర్టులోకి నెట్టడం ద్వారా ఆడుతారు. బంతి నేలకు తగలకుండా కాళ్లతో గాని, తలతో గాని అవతలి వైపునకు నెట్టాలి.

సెపక్‌తక్రా లో దేశానికి పతకం సాధించాలి...

సెపక్‌తక్రా క్రీడలో లో దేశానికి పతకం సాధించాలన్నది నా లక్ష్యం. ఇప్పటి వరకు ఈ క్రీడ లో నేను సీనియర్ నేషనల్స్ లో రెడు సార్లు ఆడాను. ఒక బ్రాంజ్ మెడల్ సాధించాను. జూనియర్ నేషనల్స్ లో మూడు సార్లు పోటీ పడ్డానురెండు బ్రాంజ్ బెడల్స్ సాధించాను. ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాను. ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలలో రెండు పర్యాయాలు ఆడాను. - పాటంశెట్టి సాయి, గోపన్నపాలెం కళాశాల

జాతీయస్థాయిలో ఇండియాకు పతకం సాధించాలన్నదే కోరిక..

సీనియర్ నేషనల్స్ రెండు పోటీల్లో పాల్గొన్నాను. అందులో ఒకదాంట్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. జూనియర్ నేషనల్స్ మూడు ఆడాను. అందులో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాను. 2026 లో డయ్యూడామన్ లో ఖేలో ఇండియాలో పాల్గొన్నాను. అందులో సిల్వర్‌మెడల్ సాధించాను. రెండు పర్యాయాలు విశ్వవిద్యాలయం తరపున ఈ పోటీల్లో పాల్గొన్నాను. ఇది మూడోది. సెపక్ తక్రాలో భారతదేశం తరపున ఆడాలన్నది నా కోరిక. - టి.సాయి, ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం

గంజాయి అడ్డాలపై నిఘా..!

విక్రయ, వినియోగ ప్రాంతాల్లో గస్తీ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాత్రి సమయాల్లో విద్యుద్దీపాలు లేని ప్రాంతాల్లో గుంపులుగా ఏర్పడి గంజాయి మత్తులో దాడి చేసే వారిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల చోటు చేసుకొన్న సంఘటన నేపథ్యంలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. పాత భవనంలో ప్రతి రోజూ అల్లరి మూకలు మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. దీనిపై స్థానిక మహిళలు ఇటీవల నేరుగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పోలీసులతో పాత భవనం వద్దకు చేరుకోగా వారంతా అక్కడ నుంచి పరారయ్యారు. జడ్జి బంగ్లా ప్రాంతంలో రాత్రి పూట ఆకతాయిలు అటు వైపు వెళ్తున్న మహిళలపై ర్యాగింగ్ చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు అందింది. ఆకతాయిలను పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి నిరంతరం నిఘా ఏర్పాటు చేసేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

యువతే లక్ష్యంగా..

18 నుంచి 25 ఏళ్ల లోపు యువతను లక్ష్యంగా చేసుకొని వారికి సొమ్ము ఆశ చూపి సులువుగా వీటిని విక్రయిస్తున్నారు. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నిఘా పెంచేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. రాత్రి పూట శివారు ప్రాంతాల్లో విద్యుద్దీపాలు లేకపోవడంతో సమస్య జటిలమవుతోంది. బ్లాక్ స్పాట్ల వద్ద తాజాగా నగరపాలక సంస్థ 1200 విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసింది. గంజాయి మత్తులో ఎవరైనా వేధింపులకు గురి చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

గంజాయి బ్యాచ్‌లతో ఆందోళన

కేవలం రూ 30 నుంచి రూ.50 కే గంజాయి ప్యాకెట్‌లు నగరంలో దొరుకుతున్నాయి. ఏజెన్సీ అనుబంధంగా ఉన్న నగరానికి సులువుగా సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో దీనికి బానిసలైన కొందరు శివారు ప్రాంతాలకు చేరుకుని, హడావిడి చేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో

క్వారీ ప్రాంతం, సంజీవయ్యనగర్, లాలాచెరువు, సుబ్బారావునగర్, ఆదెమ్మదిబ్బ, లింగంపేట, కోటిలింగాల రేవు పరివాహక ప్రాంతాలు, ఆవ ప్రాంతం, ఆల్కాటుగార్డెన్స్, రైల్వే స్టేషన్, పేపరుమిల్లు ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి దొరుకుతుంది.

ఘనంగా ఊరేగింపు

నిడదవోలు, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిడదవోలు మండలం కాటకోటేశ్వరం ఉమాకాటకోటేశ్వర స్వామిని బుధవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. కాళికాదేవి ప్రదర్శన, తీన్‌మార్, కోలాటాలు, బుట్టబొమ్మలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాళికాదేవి వేషధారణలో..

మద్యం దుకాణాలతో ఇబ్బందులు

గోకవరం: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు. వీటిని తొలగించాలంటూ కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీకి గురువారం వీరు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులు, వివిధ వృత్తుల వారు నిత్యం అదే ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు.

నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

నిడదవోలు: నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని నిడదవోలు పట్టణ ఎస్సై జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిద్ర చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. 112 కాల్ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు.

గాంధీపురం మార్గం.. గుంతలతో సతమత

రాజమహేంద్రవరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతమైన గాంధీపురం రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పాఠశాలలు, ఆసుపత్రులు, బ్యాంకులు, సర్కారు కార్యాలయాలు ఉన్నాయి. ప్రకాష్‌నగర్ పార్కుకు వెళ్లే మార్గం కూడా అధ్వానంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

రథం మరమ్మతులు ప్రారంభం

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండలో ఈనెల 28న లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవం జరగనుంది. ఈ మేరకు రథానికి చేపట్టవలసిన మరమ్మతులకు గురువారం శ్రీకారం చుట్టారు. రథ చక్రాలు, ఆయా విభాగాల ఫిట్‌నెస్‌కు రథం నిర్వాహకులు మరమ్మతులు చేపట్టారు. రథం మరమ్మతులు చేపట్టి అలంకరించేందుకు అవసరమైన పనులు సుమారు వారం రోజుల పాటు చేపట్టనున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొవ్వూరు పట్టణం: మాయ పట్ల జాగృతితో ఉండి శ్రద్ధగా జ్ఞానాన్ని పొంది.. ఇతరులకు తెలియజేయడమే శివరాత్రి జాగరణ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు బి.శాంతరాజు అన్నారు. ఆ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం బంగారంపేట, తోగుమ్మి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శివరాత్రి జాగరణ ప్రాముఖ్యం, ధర్మ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

పాఠశాల విద్యార్థులకు ప్రయోగ పాఠాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: ల్యాబ్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి గురువారం తంటికొండ జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు వివిధ ప్రయోగాలను వివరించి వారితో చేయించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కోమల లక్ష్మి, అధ్యాపకులు కె. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె. భార్గవి, కె.సురేష్, వై.రాము, జె. నిరంజనరావు, ఎన్. వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం
తేది: 20-02-2026 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP40BC0537	KUBOTA MU5502	2023
AP39VB-7553	HONDA AMAZE DIESEL-P	2015
AP39Y-9050	AL DOST	2019
AP39UD0864	AL PARTNER-6 WHEEL FBT	2019
AP31TV7007	MARUTI SWIFT DZIRE LDI Diesel	2016

వేలం జరుగు ప్రదేశం
శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.
శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,
D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి.
0883-2465088, 98499 81384

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి
నా క్లయింటు కొత్త పార్వతి, D/o. లక్ష్మినారాయణ, డో.నెం. 78-4-6, శ్యామల నగర్, రైతు బజార్ వీధి, రాజమండ్రి తూ॥గో॥జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం రిజిష్టర్ ఒరిజినల్ దస్తావేజులు నెం. 1) 904/1986, Dt. 4-2-1986, SRO, రాజమండ్రి, 2) 1292/1983, Dt. 2-3-1983, SRO, రాజమండ్రి, 3) 2633/1989, Dt. 29-4-1989, SRO, రాజమండ్రి, 4) 1052/2021, Dt. 28-1-2021, SRO, రాజమండ్రి, నెంబర్లు గల దస్తావేజులు ది. 10-2-2026వ తేదీన నా క్లయింటు రాజమండ్రి ప్రకాష్‌నగర్ సెంటర్ రౌండ్ పార్క్ వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్లి వచ్చుచుండగా పడిపోయినవి. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.
బి.ప్రభాకరరావు
అడ్వకేట్, డో.నెం.17-17/1
అన్నపూర్ణమ్మపేట, రాజమండ్రి
సెల్: 9440916878

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

'బీసీలంతా ఐక్యంగా సాగాలి'

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ అన్నారు. మంగళగిరిలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కేసన శంకర్రావు చేతుల మీదుగా సంఘ జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్నారు. గురువారం స్థానిక కంబాలచెరువు వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో జరిగిన అభినందన సభలో మాట్లాడారు. సమాజంలో వెనుకబడి ఉన్న బీసీలు అన్ని రంగాల్లోనూ రాణించారు. బీసీల అభ్యున్నతికి సంఘం తరఫున కృషి చేస్తామన్నారు.

నరసింహ మాలధారణకు శ్రీకారం

కోరుకొండ : కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి మాలధారణకు శ్రీకారం చుట్టారు. రానున్న స్వామివారి కల్యాణోత్సవాలు పురస్కరించుకుని ఏటా నిర్వహించే స్వామివారి మాలధారణలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. మాలధారణ అనంతరం గిరిప్రదక్షిణ నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మండపంలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తిరిగి ఈ నెల 28న మాల ఉపసంహరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గిరిప్రదక్షిణలో మాలధారులు

ఈ కుర్రాళ్లు.. క్రీడా ఆణిముత్యాలు

రాజానగరం, న్యూస్‌టుడే: సెపక్‌తక్రా ఇప్పుడిప్పుడే ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రాచుర్యం పొందుతున్న క్రీడ. వాలీబాల్, త్రోబాల్ కంటే భిన్నంగా ఈ ఆట ఉంటుంది. క్రీడాకారులు తమ కాళ్లతో బంతిని కొట్టి, ప్రత్యర్థి కోర్టులోకి నెట్టడం ద్వారా ఆడుతారు. బంతి నేలకు తగలకుండా కాళ్లతో గాని, తలతో గాని అవతలి వైపునకు నెట్టాలి.

దేశానికి పతకం సాధించాలి...

సెపక్‌తక్రా క్రీడలో లో దేశానికి పతకం సాధించాలన్నది నా లక్ష్యం. ఇప్పటి వరకు ఈ క్రీడ లో నేను సీనియర్ నేషనల్స్ లో రెండు సార్లు ఆడాను. ఒక కాంస్య పతాకం సాధించాను. జూనియర్ నేషనల్స్ లో మూడు సార్లు పోటీ పడ్డాను. రెండు కాంస్య పతాకం సాధించాను. ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాను. ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలలో రెండు పర్యాయాలు ఆడాను.

- పాటంశెట్టి సాయి, గోపన్నపాలెం కళాశాల

జాతీయస్థాయిలో పతకం సాధించాలన్నదే కోరిక..

సీనియర్ నేషనల్స్ రెండు పోటీల్లో పాల్గొన్నాను. అందులో ఒకదాంట్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. జూనియర్ నేషనల్స్ మూడు ఆడాను. అందులో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాను. 2026 లో దయ్యూడామన్ లో ఖేలో ఇండియాలో పాల్గొన్నాను. అందులో సిల్వర్‌మెడల్ సాధించాను. రెండు పర్యాయాలు విశ్వవిద్యాలయం తరఫున ఈ పోటీల్లో పాల్గొన్నాను. ఇది మూడోది. సెపక్‌తక్రాలో భారతదేశం తరఫున ఆడాలన్నది నా కోరిక.

- బి.సాయి, ఎస్ఎస్ఆర్‌జీసీఐఈ, గోపన్నపాలెం

పల్లెలకు సత్యసాయి తాగునీరు

• మరమ్మతులు పూర్తి.. సరఫరా పునరుద్ధరణ

గోకవరం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు ప్రజల తాగునీటి కష్టాలు తీరాయి. కొన్ని నెలలుగా నిలిచిన సత్యసాయి తాగునీటి పథకం సరఫరాను పునరుద్ధరించారు. ఇప్పటికే ట్యాంకులకు నీరు చేరింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద ఉన్న పంపుహౌస్ ద్వారా సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాలతో పాటు పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో పలు గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుంది. జీఎల్ఆర్ ట్యాంకుల ద్వారా వచ్చే శుద్ధిచేసిన గోదావరి జలాలను పట్టుకొని ప్రజలు వారి దాహార్తిని తీర్చుకుంటారు.

గోకవరంలో సత్యసాయి తాగునీటి పథకం ట్యాంకు

ఎమ్మెల్యే నెహ్రూ చొరవతో..

పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో పడుతున్న ఇబ్బందులు ప్రజలు నేరుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంబంధిత అధికారులు, కార్మికులతో సమావేశమై సమస్యపై చర్చించారు. కార్మికులకు 14 నెలలుగా ఉన్న జీతం బకాయిలను ఒక్కసారిగా చెల్లింపు చేయించారు. అయితే విద్యుత్తు మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు నిర్వహించేందుకు గుత్తేదారుడు ముందుకురాకపోవడంతో ఆయన మరో గుత్తేదారునికి బాధ్యతలను అప్పగించారు. దీంతో రూ.30 లక్షలు ఖర్చుచేసి విద్యుత్తు మోటార్లు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడంతో నీటి సరఫరా పునరుద్ధరణ జరిగింది.

అన్ని ట్యాంకులకు..

సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నాలుగు మండలాల పరిధిలో 76 ఆవాసాలకు తాగునీటి సరఫరా చేయాల్సి ఉంది. పంపుహౌస్ నుంచి బుధవారం సాయంత్రం నీటి సరఫరా మొదలైంది. పైపులైన్ ద్వారా గురువారం సాయంత్రానికి గోకవరం మండలంలోకి నీరు వచ్చి చేరింది. శనివారం నాటికి అన్ని గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుంది.

– రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాజానగరం, న్యూస్‌టుడే: పాలచర్ల పరిధిలో కొలువైన లక్ష్మీ పద్మావతి, గోదా ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకులు బుద్దాల సోదరులు వెంకన్నబాబు, అమ్మిరాజు, ఆలయ అర్చకులు గణేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, హోమాలు జరుగుతాయన్నారు.

నేడు తెలుగు నుడి సభ

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 21న మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు నుడి సభ నిర్వహిస్తున్నామని వీసీ డి.మునిరత్నం నాయుడు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10.30 జరిగే కార్యక్రమంలో సాహితీ వేత్తలు, కవులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని గాదాల విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీ నటరాజన్ తెలిపారు. గాదాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం

రథం మరమ్మతులు ప్రారంభం

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండలో ఈనెల 28న లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవం జరుగనుంది. ఈ మేరకు రథానికి చేపట్టవలసిన మరమ్మతులకు గురువారం శ్రీకారం చుట్టారు. రథ చక్రాలు, ఆయా విభాగాల ఫిటినెస్‌కు రథం నిర్వాహకులు మరమ్మతులు చేపట్టారు. రథం మరమ్మతులు చేపట్టి అలంకరించేందుకు ఆవసరమైన పనులు సుమారు వారం రోజుల పాటు చేపట్టనున్నారు.

గుడ్లగూబకు గాయం.. అందిన వైద్యం

రాజానగరం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో జాతీయ రహదారిపై పడిపోయిన ఓ గుడ్లగూబకు చికిత్స చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని హైవేపై గురువారం ఓ గుడ్లగూబ పడిపోయి, ముక్కు నుంచి రక్తం కారుతోంది. స్థానికుడు ఒకరు గమనించి పుష్కరవనంలోని వన్యప్రాణి ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి దావీదురాజుకు అప్పగించారు. అక్కడ రెస్క్యూ సెంటర్‌లోని వన్యప్రాణి వైద్యాధికారితో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స అనంతరం రక్తం కారడం ఆగిందని దావీదురాజు తెలిపారు. ప్రస్తుతం దానికి ఆహారం ఇస్తున్నామని, దాని వయసు సుమారు 8 నెలలు ఉండవచ్చన్నారు. పూర్తిగా స్వస్థత చేకూరిన తర్వాత తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు. పుష్కరవనంలో వన్యప్రాణి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ఏమైనా గాయపడిన ప్రాణులు ఇక్కడకు తీసుకొస్తే వైద్యం చేయిస్తామన్నారు. వివరాల కోసం 6309730519 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పాఠశాల విద్యార్థులకు ప్రయోగ పాఠాలు

ప్రయోగాలను వివరిస్తున్న కళాశాల విద్యార్థులు

దేవీచౌక్, న్యూస్‌టుడే: ల్యాబ్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి గురువారం తాడితోట జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు వివిధ ప్రయోగాలను వివరించి వారితో చేయించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కోమల లక్ష్మి, అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.భార్గవి, కె.సురేష్, వై.రాము, జె.నిరంజనరావు, ఎన్.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం

రాట మహూర్తం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్, కార్యనిర్వాహణాధికారి, తదితరులు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు సంపర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ ప్రేమ్‌భట్ల నాని, కార్యనిర్వాహణాధికారి శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాట మహూర్తం చేశారు. ఈ నెల 26 నుంచి కల్యాణోత్సవాలు నిర్వహించడానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి తెలిపారు.

ఉత్సాహంగా పరమహంస జయంతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస జయంతి ఉత్సవం గురువారం నిర్వహించారు. మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి హోమం చేశారు. మంగళ హారతి, సుప్రభాతం, వేద పఠనం, భజనలు చేశారు. స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి లోకమయానందజీ మహరాజ్, బ్రహ్మచారి ఇష్టచైతన్య మహరాజ్ పరమహంస జీవిత సందేశాలు బోధించారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రామకృష్ణ పరమహంస విగ్రహం ముందు హోమం నిర్వహిస్తున్న స్వామీజీలు

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

టి.నగర్, న్యూస్‌టుడే: అనధికార లే-అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి, నేరుగా కొలతలు పరిశీలించారు. ఎల్ఆర్ఎస్‌కు ఏప్రిల్ 23 వరకు, బీపీఎస్‌కు మార్చి 11 వరకు ప్రభుత్వం గడువు కల్పించిందన్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు కొండలరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: యువతలో ఆవిష్కరణ, వ్యాపార వ్యవస్థాపన ఆలోచనలను ప్రోత్సహించడానికి వారి ఆవిష్కరణలను ప్రోత్సహించే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 20, 21వ తేదీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం తెలిపారు. సదస్సును పీఎం ఉషా పథకంలో భాగంగా నిర్వహిస్తున్నామని, యువతలో కొత్త ఆవిష్కరణలు, దృక్కోణాన్ని పెంపొందించడానికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఆయా రంగాల్లో నిపుణులైన వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు సమావేశంలో పాల్గొని వారి అనుభవాలు పంచుకుంటారన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఎం.ఎస్.ఎం.ఈ ఇందులో భాగస్వామ్యం ఉంటారన్నారు. డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు పాల్గొని జీవితంలో స్వశక్తితో ఎదగడానికి ఉపయోగపడే మెలకువలు తెలుసుకోవాలని సిందిగా ఆహ్వానించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గౌతమీనేత్రాలయం సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు పొంగి.. రోడ్డు కుంగి

మోరంపూడి జంక్షన్ జాతీయ రహదారి పక్కనే మురుగు నీరు రహదారిపై పారుతోంది. అక్కడ మురుగు పారుదల వ్యవస్థలేక రోడ్డుపైకి డ్రెయినేజీ నీరు చేరి నిల్వ ఉంటోంది. దీంతో భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు కుంగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే రహదారి ఛిద్రమైయ్యే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

వేలాడుతున్నా వదిలేశారు..

మోరంపూడి జంక్షన్ హనుమాన్ నగర్ ప్రధాన రహదారి పక్కనే విద్యుత్తు నియంత్రిక బాక్సు ఒక పక్క జారి ప్రమాదకరంగా వేలాడుతోంది. ఆ బాక్సు చేతికందేంత ఎత్తులో మాత్రం తెరచి ఉంది. మరోపక్క మురుగు కాలువ స్తంభం కింద ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

ప్రమాదమని తెలుసు.. అయినా అలుసు

అసలే జాతీయ రహదారి.. ఆపై ఆటోలో కిక్కిరిసి ప్రయాణం.. జాతీయ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతాయి. కొందరు ప్రయాణికులు త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా ఆటోల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. చోదకులు సైతం నిబంధనలు ఉల్లంఘించి రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, రాజానగరం

ఇళ్ల ముందే దుర్గంధం..

హుకుంపేట శ్యామలనగర్‌లో మురుగు సమస్య స్థానికులను వేధిస్తుంది. సీసీ డ్రెయిన్లు లేక ఇన్నాళ్లు ఖాళీ స్థలంలోకి మురుగు వెళ్లింది. ఇప్పుడు అక్కడ నిర్మాణాలు చేపట్టడం వల్ల అపార్ట్‌మెంట్లు నుంచి వస్తున్న కాలువ ఇళ్ల ముందే తిష్ట వేసుకుంటుందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని వాపోతున్నారు. సమస్యపై కార్యదర్శి శ్రీదేవి స్పందిస్తూ ప్రణాళిక పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు(హుకుంపేట)

యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచుల వినియోగం



పర్యావరణ పరిరక్షణ అధికారులు ఓ వైపు ప్లాస్టిక్ సంచుల వినియోగించవద్దంటూ నిత్యం ప్రచారం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా మార్పు రావడం లేదు. ఇటీవల నగరంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించి 4 టన్నులకు పైగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మెయిన్‌రోడ్డులోని దుకాణాల ముందు వినియోగించిన పాలిథిన్ కవర్లు పెద్ద ఎత్తున మేట వేశాయి. మెయిన్ రోడ్డు వీధిలో ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. వీటి అడ్డుకట్టకు మరిన్ని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రంజాన్ మాసం.. ఆధ్యాత్మిక శోభితం

• ప్రారంభమైన ఉపవాసదీక్షలు

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్: రంజాన్ మాసం గురువారం నుంచే ప్రారంభమైంది. దీంతో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. ఏటా రంజాన్ వచ్చిందంటే 30 రోజుల పాటు చిన్న, పెద్దతేడా లేకుండా ఉపవాస దీక్ష పాటిస్తారు.. సహరీతో మొదలై.. ఇఫ్తార్‌తో ముగిసే ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతిరోజు తెల్లవారుజామున సహరీ పేరుతో ఆహారాన్ని స్వీకరిస్తారు. పగలంతా నీటి చుక్క కూడా తీసుకోకుండా కఠినమైన ఉపవాస దీక్ష పాటిస్తారు. సాయంత్రం 6.30గంటల తర్వాత ఇఫ్తార్ విందుతో ఉపవాస దీక్షను విరమిస్తారు. ప్రతి రోజు ఐదు పూటలా నమాజ్‌ను భక్తిశ్రద్ధలతో చేస్తారు..

ప్రత్యేక ప్రార్థనలతో మసీదులకు కళ

రాజమహేంద్రవరం నగరంలోని మసీదులు విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. ప్రతి రోజుసాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో కళకళలాడుతున్నాయి. రంజాన్ మాసంలోని ఆఖరి పది రోజుల్లో వచ్చే బేసి రాత్రుల్లో జాగారం చేస్తారు.

నగరంలో హలీం దుకాణాలు

ప్రార్థనలు అనంతరం తేలిగ్గా జీర్ణమయ్యే పోషకాలు నిండిన పదార్థాలు స్వీకరిస్తారు. వాటిలో మొదటిది హలీం. తర్వాత స్థానంలో డ్రైఫ్రూట్ జ్యూస్ వంటివి ఉంటాయి. ఈ మాసమంతా హలీం దుకాణాల వద్ద పెద్ద ఎత్తున ముస్లిం సోదరులతో పాటు ఇతరులు కూడా వీటిని తినేందుకు ఇష్టపడతారు. దీంతో నగరంలో పలు చోట్ల హలీం దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

పాఠశాలకు సామగ్రి బహూకరణ

మండపేట గ్రామీణం: వెలగతోడు జడ్పీ ఉన్నత పాఠశాల సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న బీసపు కృష్ణమూర్తి పాఠశాలకు రూ.20 వేల విలువైన వస్తు సామగ్రిని గురువారం అందజేశారు. హెచ్ఎం. ఉపాధ్యాయులు శ్రీహరి, వీరభద్రరావు, రామరాజు, సాయిబాబు, సహదేవుడు, ఆనంద్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి

పరిశీలిస్తున్న జీఎల్‌కే ప్రసాద్, తదితరులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధికి ఐటీసీ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. దేవరపల్లి మండలం రామన్నపాలెంలో గురువారం నిర్వహించిన 'ఐటీసీ - బంగారు భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా మేలు జాతి దూడలను ప్రదర్శనగా ఉంచారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుల ఉపాధి మెరుగుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బైఫ్ సంస్థ రాష్ట్ర అధికారి ఓం దేవ్ సింగ్ మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి 5 వేల కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, లీఫ్ మేనేజర్ కోటరేశ్, పి.ప్రశాంత్ కుమార్‌జోషి, కుమార్ అప్పా, హరిప్రసాద్, మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి..

దేవీచౌక్, న్యూస్‌టుడే: నేటి యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీఏజీపీ సంయుక్త సహకారంతో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమ నిపుణులు వీఎఫ్ఎక్స్, ఫిల్మ్ మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ సాంకేతికతలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నైపుణ్యాలతో అనుసంధానించి ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీవీఏజీపీ అధ్యక్షులు బాలబాలాజీ రుద్ర, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి మేఘన తిరుమలశెట్టి, కళాశాల ఇన్‌క్యుబేషన్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ బేబి నిర్మల, చంద్రప్రకాష్, డాక్టర్ జి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

ఐలాపురం వెంకయ్య మృతి తీరని లోటు

వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

మోరంపూడి, న్యూస్‌టుడే: ఐలాపురం వెంకయ్య మృతి తీరని లోటని రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలపర్తి వేమన అన్నారు. గురువారం మోరంపూడిలో సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులకు ఫెడరేషన్ తీసుకువచ్చింది వెంకయ్య అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మెరుగుమల్లి సత్యనారాయణ, పండూరి రామారావు, మండా నాగేశ్వరరావు, టీవీ రావు, పీవీపీ రావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 14న లోక్ అదాలత్

మండపేట, న్యూస్‌టుడే: మార్చి 14వ తేదీన ఆలమూరు సివిల్‌జడ్జి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జడ్జి వెంకటేశ్వరరావు తెలియజేశారని కోర్టు వర్గాల ద్వారా విషయాన్ని తెలిపారు. కోర్డు పరిధిలో గల మండపేట నియోజకవర్గానికి చెందిన కచ్చిదారులు తమ కేసు రాజీ చేసుకోవాలనుకుంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల పెన్నిధి.. ముఖ్యమంత్రి సహాయనిధి

రాజానగరం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలు చికిత్స కోసం రూ.వేలు నుంచి లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొంతమంది ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో వైద్య ఖర్చుల కోసం వేరే దారి లేక అప్పులు చేస్తున్నారు. వీరికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ఆర్థికంగా చేయూత నిస్తూ అండగా నిలుస్తోంది.



బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు ఇలా...

శస్త్ర, అత్యవసర చికిత్సలతో పాటు వైద్యానికి ఆసుపత్రిలో ఖర్చు చేసి 6 నెలలు పూర్తికాని వాళ్లు కూడా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం పొందవచ్చు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునే వారు చికిత్సానంతరం ఆసుపత్రి బిల్లులతో పాటు రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా నకళ్లను దరఖాస్తుకు జతచేయాలి. వీటిని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అందిస్తే అక్కడి నుంచి అది ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తుంది.

వందలాది కుటుంబాలకు చేయూత..

జనవరి నెలలో నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన 109 మంది అనారోగ్య బాధితుల కుటుంబాలకు సుమారు రూ.84 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బత్తుల అందజేశారు. ఫిబ్రవరిలో 226 బాధిత కుటుంబాలకు రూ.కోటి 16 లక్షల విలువైన 2,406 చెక్కులను ఎమ్మెల్యేతో పాటు జనసేన పార్టీ నా సేవ కోసం నా వంతు రాష్ట్ర కమిటీ సమన్వయకర్త బత్తుల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు.

అర్హులందరికీ సాయం..

అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయ నిధి కింద సాయం కావాలని వచ్చిన వాళ్లందరికీ చెక్కుల రూపంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నియోజకవర్గంలో వందల మంది బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశాం. వారిని అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు. – బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : మతిస్థిమితం కోల్పోయిన మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీ అలెగ్జాండర్ తెలిపిన వివరాల మేరకు.. కొవ్వూరు పట్టణ పరిధి గౌతమినగర్‌కు చెందిన కంపెళ్ల పద్మావతి కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతోంది. ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో భర్త రామ్‌ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పద్మావతి ఇంట్లోంచి వెళ్లిన సమయంలో గచ్చకాయ రంగు చీర ధరించి చేతిలో తెలుపురంగు బ్యాగు ఉంది.

మద్యం దుకాణాలతో ఇబ్బందులు

గోకవరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు. వీటిని తొలగించాలంటూ కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీకి గురువారం వీరు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులు, వివిధ వృత్తుల వారు నిత్యం అదే ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. అటువంటి రద్దీ ప్రాంతాలలో మద్యం దుకాణాలను నిర్వహించడం ద్వారా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

బహిరంగ వేలం

తేది: 20-02-2026 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP40BC0537	KUBOTA MU5502	2023
AP39VB7553	HONDA AMAZE DIESEL-P	2015
AP39Y9050	AL DOST	2019
AP39UD0664	AL PARTNER-6 WHEEL FBT	2019
AP31TV7007	MARUTI SWIFT DZIRE LDI Diesel	2016

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,
D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి,
0883-2465088, 98499 81384

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మతిస్థిమితం కోల్పోయిన మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీ అల్లెగ్జాండర్ తెలిపిన వివరాల మేరకు.. కొవ్వూరు పట్టణ పరిధి గౌతమినగర్‌కు చెందిన కంచెర్ల పద్మావతి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో భర్త రామ్‌ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పద్మావతి ఇంట్లోంచి వెళ్లిన సమయంలో గచ్చకాయ రంగు చీర ధరించి చేతిలో తెలుపురంగు బ్యాగు ఉంది.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మాయ పట్ల జాగ్రత్తతో ఉండి క్షుణ్ణంగా జ్ఞానాన్ని పొంది.. ఇతరులకు తెలియజేయడమే శివరాత్రి జాగరణ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు బి.శాంతరాజు అన్నారు. ఆ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం బంగారం పేట, తోగుమ్మి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శివరాత్రి జాగరణ ప్రాముఖ్యం, ధర్మ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, లోహిత్, భరత్, జయరాం, విజయ్, రాణి, సంధ్యారాణి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

సమస్య: కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి రోడ్డులో వరుసగా మూడు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి అలముకుని ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. - కేఆర్ సాయి

సమాధానం: వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.- సీహెచ్ వెంకటేశ్వర్లు, పురపాలిక కమిషనర్

- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

సమస్య: తాళ్లపూడిలోని బజారు కూడలి నుంచి పుష్కరఘాట్‌కు వెళ్లే రహదారిలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి.. - శ్రీనివాసు

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. - సుభద్ర, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

పనులు ప్రారంభం

దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి, గోపాలపురం వెళ్లే మార్గంలో గుంతలు ఏర్పడి, వాహనదారులు పడుతున్న అవస్థలపై 'ఈనాడు'లో పలు వార్తలు ప్రచురితమవడంతో జాతీయ రహదారి మేనేజర్ కె.సోమేశ్ స్పందించారు. రహదారి మరమ్మతులకు పనులు ప్రారంభించారు. - న్యూస్‌టుడే, దేవరపల్లి

తుప్పలు తొలగించారు

దేవరపల్లి మండలం త్యాజంపూడిలోని పల్లపు వీధి, ఎస్సీకాలనీ, ప్రధాన రహదారి ప్రాంతాల్లో చెత్తచెదారం, తుప్పలు పేరుకుపోయాయి. దోమలు, దుర్వాసనతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించారు. - న్యూస్‌టుడే, దేవరపల్లి

కాలువ శుభ్రం

స్పందనకు వందనం

మండలంలోని మలకపల్లిలోని ఎస్సీ కాలనీలోని ఆరో వార్డులో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు పారక దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడేవారు. విషయాన్ని సర్పంచి రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా వారు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువ శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

దుమ్ము నుంచి విముక్తి

ఈనాడు కథనానికి స్పందన

మండలంలోని వడ్లూరు-తీపర్రు ఆర్ అండ్‌బీ రహదారిలో కాకరపర్రు కాలువ పరిధిలో వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై దుమ్ముతో ప్రజలు పడుతున్న ఇబ్బందిపై ఈ నెల 18 న 'ఈనాడు' లో 'దుమ్ము దుమారం' శీర్షికతో కథనం ప్రచురితమవడంతో ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించారు. బుధవారం రోడ్డు పనులు ప్రారంభించారు. రాకపోకల సమయంలో దుమ్ము సమస్య నుంచి ప్రయాణికులకు విముక్తి లభించింది. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

తోడితేనే నీరు.. చేతికందేను పైరు

• కానూరు కాలువ ఆయకట్టు రైతులకు తప్పని సాగు కష్టాలు

నిడదవోలు, న్యూస్‌టుడే: గోదావరి నీటిమట్టం ప్రస్తుతం 13.63 మీటర్ల ఎత్తు ఉండి ఆశాజనకంగా ఉన్నప్పటికీ కానూరు కాలువ ఆయకట్టుకు మాత్రం సాగు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. చిరుపొట్ట దశలో ఉన్న దాళ్వా వరిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కానూరు ఆయకట్టు ప్రాంతం పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిస్‌కు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో, పశ్చిమడెల్టా ప్రధాన కాలువ చెంతనే ఉంది. అన్ని సదుపాయాలు ఉన్నా ఆయకట్టు రైతులు మాత్రం మోటార్ల మీదే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

అడుగంటిపోయిన కానూరు ప్రధాన కాలువ

సుమారు 2,737 ఎకరాల సాగు

కానూరు కాలువ ఆయకట్టులో నిడదవోలు, పెరవలి మండలాల పరిధిలోని 12 గ్రామాలకు చెందిన 2,737 ఎకరాల పంట సాగవుతోంది. గతంలో కానూరు కాలువకు గోపవరం గుబ్బలమ్మ గుడి వద్ద ఉన్న స్లూయిస్ ద్వారా సాగు నీరు అందించినప్పటికీ నీరు సరిపోక ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగునీటికి ఇబ్బంది పడేవారు. హెడ్‌స్లూయిస్ నుంచి నేరుగా సాగు నీరు అందించే సౌలభ్యం ఉంది కాని.. గోదావరి వరదల కారణంగా అది కూడా పూర్తిగా పూడుకుపోయింది. అయితే తెదేపా అధికారంలో ఉన్నప్పుడు రూ.4.10 కోట్లతో పాత కాలువను అప్పటి స్థానిక ఎమ్మెల్యే కృషితో పునరుద్ధరించారు. గోదావరిలో నీటిమట్టం తగ్గిపోయినా కానూరు కాలువకు గోదావరి నుంచి నేరుగా నీరు అందేది. దీంతో రైతులకు సాగునీటి ఇబ్బంది ఉండేది కాదు.

మోటారుతో తోడుతూ..

మట్టం తగ్గుతుండడంతో...

గోదావరి నీటిమట్టం తగ్గుతూ, పెరుగుతూ ఉండడంతో పాటు కానూరు ప్రధాన కాలువ కూడా లోలెవెల్‌లో ప్రవహిస్తుండడంతో ఆయకట్టు రైతులకు సాగు నీటి కష్టాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం గోదావరి నుంచి వస్తున్న కొద్దిపాటి నీటిని రైతులు మోటార్లు, ఇంజిన్ల సాయంతో తోడుకుంటున్నారు. దీనికి రైతులు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.4,500 వరకు అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది. విద్యుత్తు మోటార్లు ఉన్న పలువురు రైతులు వాటి ద్వారా సాగునీటిని అందించేందుకు ఎకరాకు మూడు బస్తాల వరకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో సాగునీరు అందని పక్షంలో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుంది. జలవనరుల శాఖ అధికారులు స్పందించి రబీ పంట గట్టెక్కుతుందో లేదో ఎలా అంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నెం-1 బ్రాంచి ద్వారా పెండ్యాల కాలువ ద్వారా కానూరు కాలువకు సాగునీరు అందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు డీసీ అధ్యక్షుడు జుజ్జవరపు వెంకట సత్యనారాయణ తెలిపారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో తిరుమల్ల భాగ్యలక్ష్మి అన్నారు. సమిశ్రగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో బాల్య సంరక్షణపై ఐసీడీఎస్ సీడీపీవో ఎం.ఆశాలోహిణి ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సభ్యుడు క్రాంతికుమార్, పర్యవేక్షకులు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న క్రాంతికుమార్

నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

నిడదవోలు, న్యూస్‌టుడే: నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని నిడదవోలు పట్టణ ఎస్సై జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిద్ర చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. 112 కాల్ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిడదవోలు ఎస్సై జగన్ మోహనరావు

ప్రజా పక్షాన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం

• నియోజకవర్గ భాజపా కార్యాలయం ప్రారంభం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా పక్షాన నిలబడి సత్వర ప్రభుత్వ సేవలు, సమస్యల పరిష్కారానికి భాజపా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరు పట్టణ పరిధి జనపేటలోని పాత పోస్టాఫీసు భవనంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జనత వారధి పేరుతో ప్రజలు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా భాజపా ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి మిత్రపక్షాలైన తెదేపా, జనసేనతో సమన్వయంగా పనిచేస్తామన్నారు. సీనియర్ నాయకులు కొమ్మ సుబ్బారావును ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాడిమళ్ల విజయవాణి, జిల్లా అధ్యక్షురాలు మహిళా మోర్చా దగుల శ్రీవిద్య, మద్దిపాటి రజని, కొవ్వూరు పట్టణ కన్వీనర్ తురగా విజయభాస్కర్, కొవ్వూరు మండల, తాళ్లపూడి మండల పార్టీ అధ్యక్షులు దేగల సునీత, ఇందుగుల రామకృష్ణ, గంధి రాంబాబు, కరుటూరి జగన్, చెరుకూరి సాయి రాజు, పడాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం వద్ద సుబ్బారావును సన్మానిస్తున్న నాయకులు

పరమహంస జయంతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస జయంతి ఉత్సవం గురువారం నిర్వహించారు. మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి హోమం చేశారు. మంగళ హారతి, సుప్రభాతం, వేద పఠనం, భజనలు చేశారు. స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి లోకమయానందజీ మహరాజ్, బ్రహ్మచారి ఇష్టచైతన్య మహరాజ్ పరమహంస జీవిత సందేశాలు బోధించారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రైతుల అభ్యున్నతికి కృషి

దేవరపల్లి, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధికి బైఫ్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీవీకే ప్రసాద్ అన్నారు. దేవరపల్లి మండలం రామన్నపాలెంలో గురువారం నిర్వహించిన 'బైఫ్ - బంగారు భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా మేలు జాతి దూడలను ప్రదర్శనగా ఉంచారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుల ఉపాధి మెరుగుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బైఫ్ సంస్థ రాష్ట్ర అధికారి ఓం దేవ్ సింగ్ మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి 5 వేల కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, లీఫ్ మేనేజర్ కోటరేశ్, పి.ప్రశాంత్ కుమార్‌జోషి, కుమార్ అప్పా, హరిప్రసాద్, మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జీవీకే ప్రసాద్, తదితరులు

రక్షణ గోడ నిర్మించరూ..!

మండలంలోని తణుకు, పాలంగి, ఉండ్రాజవరం రహదారిలో పంట కాలువకు నిర్మించిన కల్వర్టు రక్షణ గోడలు విరిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కాలువలోకి పడేపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. అభివృద్ధి పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

కూలితే ప్రమాదమే...!

మండలంలోని వేగేశ్వరపురం నుంచి చిడిపి వెళ్లే ఏటి గట్టు రహదారిలో మేరిమాత ఆలయం సమీపంలో గట్టుపై రెండు చోట్ల ఉన్న విద్యుత్తు స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. ఏ సమయంలో కూలుతాయో తెలియని పరిస్థితి. ఈ మార్గంలో నిత్యం వాహనచోదకులు, రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడే ప్రమాదకర మలుపు ఉండడంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి ఉంటుంది. విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసు మాట్లాడుతూ వాటిని పరిశీలించి సరి చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

అడ్డుకట్ట.. నిరుపయోగం

నిడదవోలు మండలం సమిశ్రగూడెం పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై ఉన్న వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిలువరించేందుకు గడ్డర్‌లు ఏర్పాటు చేసి వాటిపై అడ్డుకట్టలు పెట్టినప్పటికీ వాహనదారులు వాటిని ఢీకొనడంతో చాలా కాలంగా మూలకు చేరాయి. దీనిపై ఈ నెల 9న 'ఈనాడు'లో 'ప్రమాదం అంచున.. ఏళ్లనాటి వంతెన' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ర.భ.శాఖ అధికారులు స్పందించి సమిశ్రగూడెం వైపు అడ్డుకట్టలు ఏర్పాటు చేశారు. అడ్డుకట్టను బాగా పైకి ఉంచడంతో వాటి కింద నుంచి బారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. - న్యూస్‌టుడే, నిడదవోలు

తూడు ఇలా.. సాగు ఎలా..?

పెరవలి మండలం నడుపల్లికోటలలో దొరయ్య, ఉసులుమర్రు, కానూరు డ్రెయిన్‌లలో తూడు ఎక్కువగా ఉండడంతో స్థానిక రైతులు వ్యవసాయానికి ఇబ్బంది పడుతున్నారు. ఆయా డ్రెయిన్‌లలో తూడు పెరిగిపోవడంతో నీరు అందక సాగుకు నానా అవస్థలు పడుతున్నామని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తూడు తొలగించి పొలాలకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెరవలి

మురుగుతో అవస్థలు

మండలంలోని సమిశ్రగూడెం పంచాయతీ పరిధి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి పోస్టాఫీసుకు వెళ్లే మార్గంలో సహకార సంఘ వద్ద రహదారికి ఆనుకొని ఉన్న కాలువ నిండిపోవడంతో రహదారిపైకి మురుగు చేరి కొన్ని స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే మార్గంలో పోస్టాఫీస్, రేషన్‌డిపో, సహకార సంఘం, ఎంపీపీ పాఠశాల ఉండడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. విషయాన్ని 'న్యూస్‌టుడే' గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

తాడిపర్రు సోమేశ్వరస్వామి ఆలయంలో..

వైభవంగా శ్రీ పుష్పయాగోత్సవం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా తాడిపర్రులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ పుష్పయాగోత్సవాన్ని గురువారం వైభవంగా జరిగింది. వేదమంత్రాలతో వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా ఊరేగింపు

నిడదవోలు, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిడదవోలు మండలం కాటకోటేశ్వరం ఉమాకాటకోటేశ్వర స్వామిని బుధవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. కాళికాదేవి ప్రదర్శన, తీన్‌మార్, కోలాటాలు, బుట్ట బొమ్మలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాళికాదేవి వేషధారణలో..

అంబటి రాకతో తలెత్తిన ట్రాఫిక్ సమస్య

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ఉదయం రోడ్ కం రైలు వంతెన మీదుగా కాన్వాయ్‌లో విజయవాడ వైపు వెళ్తున్న సమయంలో ఆయనను కలిసేందుకు వచ్చిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఉదయం 9 గంటలకే వస్తారన్న సమాచారం అందించి గంటన్నరకు పైగా ఆలస్యం కావడంతో వాహనాలు నిలిచిపోయాయి. డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో సీఐ పి.విశ్వం, ఎస్ఐ వంశీ అలెగ్జాండర్, సిబ్బంది రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన పరిస్థితి నెలకొంది.

ధైర్య సాహసాలకు ప్రతీక శివాజీ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : ధైర్య సాహసాలకు ప్రతీకగా.. హైందవ సంస్కృతికి దర్పణంగా శివాజీ మహరాజ్ మహోన్నత స్థానంలో నిలుస్తారని ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ గోవర్ధనం శ్రీనివాసమూర్తి అన్నారు. ఛత్రపతి శివాజీ మహాసేన, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా 1వ వార్డు పరిధి రాజీవ్‌కాలనీలో శివాజీ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణ, బీవీ ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ శివాజీ ధైర్యాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ రక్షణ, ధర్మ సంస్థాపనకు శివాజీ పునాదులు వేశారన్నారు. కార్యక్రమంలో తాడిమళ్ల విజయవాణి, కరుటూరి జగన్, పాతూరి రవిశంకర్, చెరుకూరి సాయిరాజు, డేగల సునీత, పెరుగు పోతురాజు, శివకృష్ణ, ఛత్రపతి సేన ప్రతినిధులు సిరిపిన మురళి, బెనుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ ఛత్రపతి సేన నాయకులు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడిలోని బస్టాండ్ వద్ద శివాజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక పాఠశాల విద్యార్థులు నినాదాలు చేశారు.



కార్యక్రమంలో చిరువూరి శ్రీను, ఇందుగుల రామకృష్ణ జితేంద్రరవి, కె.కిరణ్, నాగులకొండ భద్రం, బోర్రా శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలులో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు భాజపా నాయకులు నివాళులు అర్పించారు. భాజపా పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి శివనాగరాజు, టంగుటూరి శ్రీనివాసు, లక్కోజు సాయిసూర్య, రంగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిషేధం పట్టదు.. అనర్థం తప్పదు

న్యూస్‌టుడే, నల్లజర్ల

• విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచుల వినియోగం

పాలిథీన్ సంచుల వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. 125 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే వాటిని వినియోగించరాదని ప్రభుత్వం ఓ వైపు హెచ్చరిస్తున్నప్పటికీ ఆయా దుకాణాల్లో ఇప్పటికీ 75 మైక్రాన్ల మందం కలిగిన సంచులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ సంకల్పాన్ని నీరు గార్చుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలో ఎక్కడ చూసినా వాడి పడేసిన ప్లాస్టిక్ సంచులు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. పోతవరం, అనంతపల్లి, దూబచర్ల, ప్రకాశరావుపాలెం ఆవపాడు గ్రామాల మధ్య ఉన్న మద్యం దుకాణాల పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో కొంత మంది మద్యం తాగి ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు ఎక్కడికక్కడే పడేస్తున్నారు. ఆయా గ్రామాల శివార్లలో, రోడ్డు పక్కన కుప్పలు కుప్పలుగా ప్లాస్టిక్ సంచులు దర్శనమిస్తున్నాయి. పలువురు వీటికి మంట పెట్టి కాలుస్తుండడంతో విపరీతమైన దుర్వాసన వచ్చి భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా శుభకార్యాలకు వినియోగించే ప్లాస్టిక్ సంచులను ఇష్టానుసారంగా రహదారుల పక్కనే పడేస్తుండడంతో మూగజీవాలు వ్యర్థాలతో పాటు పాలిథీన్ సంచులను తిని మృత్యువాత పడుతున్నాయి. కాలువల్లో వేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది.

నల్లజర్లలో ప్రధాన రహదారి పక్కన ఇలా..

చర్యలు తీసుకుంటాం

పాలిథిన్ వినియోగంతో కలిగే అనర్థాలపై విక్రేతలకు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లోని ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.
- సత్యనారాయణ, ఎంపీడీవో, నల్లజర్ల

సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మృతి

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం మండల సీపీఎం కార్యదర్శి **తూరుగోపు వెంకటేశ్వరరావు**(48) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. చివటం దేవస్థాన భూముల్లో వంద మంది నివాసితులకు ఇళ్ల స్థలాలు, కౌలు రైతుల, కొబ్బరి దింపు, జట్టు, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలు ప్రజా సంఘాల నాయకులు ఉండ్రాజవరంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మార్చి 14న లోక్ అదాలత్

మండపేట : మార్చి 14వ తేదీన ఆలమూరు సివిల్‌జడ్జి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జడ్జి వెంకటేశ్వరరావు తెలియజేశారని కోర్టు వర్గాల ద్వారా విషయాన్ని తెలిపారు. కోర్టు పరిధిలోగల మండపేట నియోజకవర్గానికి చెందిన కచ్చిదారులు తమ కేసు రాజీ చేసుకోవాలనుకుంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : వేములూరు గ్రామంలో నూతన లైన్ల నిర్మాణ పనుల్లో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో (శుక్ర, శనివారాలు) విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. రెండు రోజులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గృహ, వ్యవసాయానికి సరఫరా ఉండదన్నారు. తెల్లవారుజాము 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు వ్యవసాయానికి సరఫరా ఉంటుందన్నారు.

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని కాల్దరి, వేలివెన్ను గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

నేడు

పెరవలి, న్యూస్‌టుడే: ఈ నెల 20వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండలంలోని అజ్జరం, వెంకట్రాయపురం, సీతారామపురం, తీపర్రు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ అప్పారావు తెలిపారు.

(c) eenadu

మండపేట

•మండపేట •అనపర్తి

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాజానగరం: పాలచర్ల పరిధిలో కొలువైన లక్ష్మీ పద్మావతి, గోదా అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకులు బుద్దాల సోదరులు వెంకన్నబాబు, అమ్మిరాజు, ఆలయ అర్చకుడు గణేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ జరుగుతాయన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గౌతమినేత్రాలయం సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం

కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు సంపర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ త్రిపురసెట్టి నాని, కార్యనిర్వహణాధికారి శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాట ముహూర్తం చేశారు. ఈ నెల 26 నుంచి కల్యాణోత్సవాలు నిర్వహించడానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

వ్యర్థాలు తొలగించరూ..

సమస్య: మండపేట మండలం పాలతోడు గ్రామం ఎస్సీపేట చెరువు గట్టు వ్యర్థాలతో నిండి ఉంది. – అనిల్‌కుమార్, పాలతోడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, ద్వారపూడి

100 పడకల ఆసుపత్రికి అనుమతి ఇవ్వాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట, న్యూస్‌టుడే: 3 లక్షల జనాభా ఉన్న మండపేట నియోజకవర్గానికి కేవలం 30 పడకల ఆసుపత్రి మాత్రమే ఉండడంతో ప్రజలకు సరైన వైద్యసేవలు అందటంలేదని ఏపీ ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమీప గ్రామాల నుంచి కూడా చికిత్సకోసం మండపేటకు వస్తున్నారని ఈ మేరకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయడంతో పాటు అందులో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి : ఎమ్మెల్యే నల్లమిల్లి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అంగన్‌వాడీ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశంలో పాల్గొని పలు సమస్యలను లేవనెత్తారు. పేద గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 55వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని అందులో లక్షల మంది పనిచేస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు రూ.250 గౌరవ వేతనం తీసుకున్న పరిస్థితి నుంచి రూ.11వేలు పెరిగిన పరిస్థితి ఉందని.. మరికొంత జీతాన్ని కూడా పెంచాల్సిన అవసరముందన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే అద్దె చెల్లించే చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 21న మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగునుడి సభ నిర్వహిస్తున్నామని వీసీ డి.మునిరత్నం నాయుడు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10.30 జరిగే కార్యక్రమంలో సాహితీ వేత్తలు, కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

వీఎల్‌టీ తగ్గింపుతో నిర్మాణదారులకు ఊరట

మండపేట, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములపై నిర్మాణ సమయంలో విధిస్తున్న వేకెంట్ లాండ్ టాక్స్(వీఎల్‌టీ) సగానికి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో లబ్ధిదారులకు ఊరట లభించనుంది. గతంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలను కునే వారికి దాని మార్కెట్ విలువలో ఒక శాతం పన్నుగా చెల్లించాల్సి వచ్చేది. అదికూడా మూడు సంవత్సరాల పన్ను ఒకే సారి చెల్లిస్తేగాని నిర్మాణం చేపట్టేందుకు అవకాశం లేకుండా ఉండేది. దీంతో ఇల్లు కట్టుకోవాలనుకునే పేద, మధ్యతరగతివారు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బుధవారం నిర్మాణ సమయంలో వీఎల్‌టీ సగానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత విధానం ప్రకారం నిర్మాణం సమయంలో మూడు సంవత్సరాల కాలానికి పన్ను కట్టించుకుంటున్నారు. ఉదాహరణకు : పట్టణంలో బ్యాంకు కాలనీ ప్రాంతంలో గజం మార్కెట్ విలువ రూ.12000 ఉంటే 220 చదరపు గజాల స్థలం విలువ రూ.26.40లక్షలు అవుతుంది. 6 నెలల కాలానికి పన్ను ఆస్తి విలువలో 1 శాతం రూ.2,640 ఎల్‌పీ రూ.211 కలిపి రూ.2,851 అవుతుంది. మూడు సంవత్సరాలకు చెల్లించాల్సిన పన్ను రూ.8,553 అవుతుంది. కాగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.4,276 చెల్లిస్తే సరిపోతుంది.

పన్ను రాయితీ ఇలా: ప్రస్తుతం మండపేట పట్టణంలో ఖాళీ స్థలాలు 2081 ఉండగా వీటి ద్వారా మున్సిపాలిటీకి 1.55 కోట్లు ఆదాయం సమకూరుతోంది.

జీవో రావలసి ఉంది: ప్రభుత్వం ప్రకటించిన విధంగా జీవో రావలసి ఉంది. అందులో ఉన్న నిబంధనల ప్రకారం వీఎల్‌టీ అమలు చేస్తాం. – టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

అర్తమూరులో ఘనంగా పూజలు

మండపేట గ్రామీణం: అర్తమూరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కమిటీ సభ్యులు, మాలధారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో బాబా

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురం శిరిడీ సాయి విగ్రహాన్ని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు హాజరయ్యి మొక్కులు తీర్చుకున్నారని కమిటీ సభ్యులు నల్లమిల్లి గంగారెడ్డి తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ద్వారపూడిలో శివాజీ జయంతి వేడుకల్లో భాజపా నాయకులు, విద్యార్థులు

మండపేట గ్రామీణం, మండపేట, అంగర, రంగంపేట న్యూస్‌టుడే: ద్వారపూడి గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు భాజపా నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండపేటలో భాజపా, భజరంగ్‌దళ్, స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో శోభా యాత్ర నిర్వహించారు. ● కపిలేశ్వరపురం మండలం వల్లూరు మండల పరిషత్తు ఆదర్శ పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు చిట్టూరి వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం చిత్రలేఖన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ● ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని గురువారం రంగంపేటలో సమరసత సేవా సమితి ఆధ్వర్యంలో జరిపించారు.

మండపేటలో రథం సెంటర్‌లో ప్రదర్శన

వల్లూరులో శివాజీ చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

గుడ్లగూబకు గాయం.. అందిన వైద్యం

గుడ్లగూబ

రాజానగరం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో జాతీయ రహదారిపై పడిపోయిన ఓ గుడ్లగూబకు చికిత్స చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని హైవేపై గురువారం ఓ గుడ్లగూబ పడిపోగా, ముక్కు నుంచి రక్తం కారుతోంది. స్థానికుడు పుష్పరవనంలోని వన్యప్రాణి ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చి ఫారెస్ట్ రేంజ్ అధికారి దావీదురాజుకు అప్పగించారు. రెస్క్యూ సెంటర్‌లోని వన్యప్రాణి వైద్యాధికారి చికిత్స చేయించారు. ప్రస్తుతం దానికి ఆహారం ఇస్తున్నామని, దాని వయసు సుమారు 8 నెలలు ఉండవచ్చన్నారు. పూర్తిగా స్వస్థత చేకూరిన తర్వాత తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు.

అందుబాటులో వైద్యులు: పుష్పరవనంలో వన్యప్రాణి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఏమైనా గాయపడిన ప్రాణులను ఇక్కడకు తీసుకొస్తే వైద్యం చేయిస్తామన్నారు. వివరాల కోసం 63097 30519 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: యువతలో ఆవిష్కరణలు, వ్యాపార నైపుణ్యాల అభివృద్ధి, సవాళ్లను ఎదుర్కోవడం అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 20, 21న తేదీల్లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం తెలిపారు. సదస్సును పీఎం ఉషా పథకంలో భాగంగా నిర్వహిస్తున్నామని, యువతలో కొత్త ఆవిష్కరణలు, దృక్పథాన్ని పెంపొందించడానికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఆయా రంగాల్లో నిపుణులైన వ్యాపారవేత్తలు, విద్యావంతులు సమావేశంలో పాల్గొని వారి అనుభవాలు పంచుకుంటారన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఎం.ఎస్ ఎం.ఈ ఇందులో భాగస్వామ్యంగా ఉంటారన్నారు. డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు పాల్గొని జీవితంలో స్వశక్తితో ఎదగడానికి ఉపయోగపడే మెలకువలు తెలుసుకోవలసిందిగా ఆహ్వానించారు.

ప్రమాదమని తెలుసు.. అయినా అలుసు



అనపర్తి జాతీయ రహదారి... ఆపై ఆటోలో కిక్కిరిసి ప్రయాణం.. జాతీయ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతాయి. కొందరు ప్రయాణికులు త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా ఆటోల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. చోదకులు సైతం నిబంధనలు ఉల్లంఘించి రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

వీఆర్వోల నిరసన

కపిలేశ్వరపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

అంగర, రంగంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కపిలేశ్వరపురం మండలంలో వీఆర్వోలు చేపట్టిన నిరసనలు నాలుగోరోజుకు చేరాయి. పని గంటలు తగ్గించాలని కోరుతూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు రాముడు, కార్యదర్శి రాజారత్నం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి నాగమణి, తదితరులు పాల్గొన్నారు. ● పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండు చేస్తూ సంఘం నాయకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం రంగంపేటలో వీఆర్వోలు నిరసన చేపట్టారు. ఈమేరకు వినతి పత్రాన్ని తహసీల్దార్ కె.అనసూయకు అందించారు.

సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అంగర, రాయవరం, మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులంతా సామూహిక నివారణ చర్యలు చేపడితేనే ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం పసలపూడిలో ప్రభుత్వం సరఫరా చేసిన ఎలుకల నివారణ మందును రైతులకు పంపిణీచేసి మాట్లాడారు. ● కోనసీమ జిల్లా రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.రాజశేఖర్‌య ఆధ్వర్యంలో తాతపూడిలో జరిగిన ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. ఆలమూరు వ్యవసాయ సంచాలకులు సీహెచ్‌కేవీ చౌదరి, మండల వ్యవసాయాధికారి రవి, పలు సొసైటీల ఛైర్మన్‌లు పాల్గొన్నారు. ● సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండపేట రైతు సేవాకేంద్రాల్లో గురువారం రైతలకు పంపిణీ చేశారు.

మారేడుబాకలో పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొలతలు సరిచూస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

టి.నగర్, న్యూస్‌టుడే: అనధికార లే-అవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి, నేరుగా పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఏప్రిల్ 23 వరకూ, బీపీఎస్‌కు మార్చి 11 వరకూ ప్రభుత్వం గడువు కల్పించిందన్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు కొండలరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరమహంస జయంతి


హోమం నిర్వహిస్తున్న స్వామీజీలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో రామకృష్ణ పరమహంస జయంతి ఉత్సవం గురువారం నిర్వహించారు. మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞయానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి హోమం చేశారు. మంగళ హారతి, సుప్రభాతం, వేద పఠనం, భజనలు చేశారు. స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి లోకమయానందజీ మహరాజ్, బ్రహ్మచారి ఇష్టచైతన్య మహరాజ్ పరమహంస జీవిత సందేశాలు బోధించారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేడు, రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదపూడి, న్యూస్‌టుడే : పెదపూడి మండలం సంపర ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ విద్యుత్తు శాఖ ఈఈ ఉదయ్ భాస్కర్ తెలిపారు. పరిధిలోని సంపర, పుట్టకొండ, చింతపల్లి, కుమారప్రియం, కైకవోలు, కాండ్రేగుల, శహపురం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం పామర్రు విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగులచెరువు, గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్చి 14న లోక్ అదాలత్

మండపేట: మార్చి 14వ తేదీన ఆలమూరు సివిల్‌జడ్జి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జడ్జి వెంకటేశ్వరరావు తెలియజేశారని కోర్టు వర్గాల ద్వారా విషయాన్ని తెలిపారు. కోర్టు పరిధిలోగల మండపేట నియోజకవర్గానికి చెందిన కక్షిదారులు తమ కేసు రాజీ చేసుకోవాలనుకుంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు సామగ్రి బహూకరణ

మండపేట గ్రామీణం: వెలగతోడు జడ్పీ ఉన్నత పాఠశాల సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న బీసపు కృష్ణమూర్తి పాఠశాలకు రూ.20 వేల విలువైన వస్తు సామగ్రిని గురువారం అందజేశారు. హెచ్ఎం. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలతో ఇబ్బందులు

గోకవరం: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు. వీటిని తొలగించాలంటూ కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీకి గురువారం వీరు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులు, వివిధ వృత్తుల వారు నిత్యం అదే ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు.

ఈ కుర్రాళ్లు.. క్రీడా ఆణిముత్యాలు

రాజానగరం, న్యూస్‌టుడే: సెపక్‌తక్రా ఇప్పుడిపుడే ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రాచుర్యం పొందుతున్న క్రీడ. వాలీబాల్, త్రోబాల్ కంటే భిన్నంగా ఈ ఆట ఉంటుంది. క్రీడాకారులు తమ కాళ్లతో బంతిని కొట్టి, ప్రత్యర్థి కోర్టులోకి నెట్టడం ద్వారా ఆడుతారు. బంతి నేలకు తగలకుండా కాళ్లతో గాని, తలతో గాని అవతలి వైపునకు నెట్టాలి.

దేశానికి పతకం సాధించాలి...

సెపక్‌తక్రా క్రీడలో లో దేశానికి పతకం సాధించాలన్నది నా లక్ష్యం. ఇప్పటి వరకు ఈ క్రీడ లో నేను సీనియర్ నేషనల్స్ లో రెండు సార్లు ఆడాను. ఒక కాంస్య పతాకం సాధించాను. జూనియర్ నేషనల్స్ లో మూడు సార్లు పోటీపడ్డాను. రెండు కాంస్య పతాకం సాధించాను. ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాను. ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలలో రెండు పర్యాయాలు ఆడాను.
– పాటంశెట్టి సాయి, గోపన్నపాలెం కళాశాల

జాతీయస్థాయిలో పతకం సాధించాలన్నదే కోరిక..

సీనియర్ నేషనల్స్ రెండు పోటీల్లో పాల్గొన్నాను. అందులో ఒకదాంట్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. జూనియర్ నేషనల్స్ మూడు ఆడాను. అందులో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాను. 2026 లో డయ్యూడామన్ లో ఖేలో ఇండియాలో పాల్గొన్నాను. అందులో సిల్వర్‌మెడల్ సాధించాను. రెండు పర్యాయాలు విశ్వవిద్యాలయం తరపున ఈ పోటీల్లో పాల్గొన్నాను. ఇది మూడోది. సెపక్‌తక్రాలో భారతదేశం తరపున ఆడాలన్నది నా కోరిక.
– టి.సాయి, ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి..

దేవీచౌక్, న్యూస్‌టుడే: నేటి యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీఏజీపీ సంయుక్త సహకారంతో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమ నిపుణులు వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ సాంకేతికతలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నైపుణ్యాలతో అనుసంధానించి ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీవీఏజీఏ అధ్యక్షులు బాలబాలాజీ రుద్ర, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి మేఘన తిరుమలశెట్టి, కళాశాల ఇన్‌క్యుబేషన్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ బేబి నిర్మల, చంద్రప్రకాష్, డాక్టర్ జి.సౌజన్య పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : మతిస్థిమితం కోల్పోయిన మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీ అలెగ్జాండర్ తెలిపిన వివరాల మేరకు.. కొవ్వూరు పట్టణ పరిధి గౌతమినగర్‌కు చెందిన కంపెళ్ల పద్మావతి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతోంది. ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో భర్త రామ్‌ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పద్మావతి ఇంట్లోంచి వెళ్లిన సమయంలో గచ్చకాయ రంగు చీర దరించి చేతిలో తెలుపురంగు బ్యాగు ఉంది.

అంబటి రాకతో తలెత్తిన ట్రాఫిక్ సమస్య

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కర్మాగారం నుంచి విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ఉదయం రోడ్ కం రైలు వంతెన మీదుగా కాన్వాయిలో విజయవాడ వైపు వెళ్లిన ఆయనను కలిసేందుకు వచ్చిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఉదయం 9 గంటలకే వస్తారన్న సమాచారం అందించి గంటన్నరకు పైగా ఆలస్యం కావడంతో వాహనాలు నిలిచి పోయాయి. డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో సీఐ పి.విశ్వం, ఎస్ఐ వంశీ అలెగ్జాండర్, సిబ్బంది రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన పరిస్థితి నెలకొంది.

బాల్య వివాహాలపై అవగాహన

నిడదవోలు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ తిరునాళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. సమిశ్రగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో బాలల సంరక్షణపై ఐసీడీఎస్ సీడీపీవో ఎం.ఆశారోహిణి ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. అనపర్తి గ్రామానికి చెందిన చిన్నం ఏసు తన కుమారుడు చిన్నం మణిరాజుతో అనపర్తి నుంచి తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని లక్ష్మీనరసాపురం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి అనపర్తి వస్తుండగా అనపర్తి నుంచి లక్ష్మీనరసాపురం వైపు వెళ్తున్న కారు వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఇరువురికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ప్రమాదకరంగా ప్రయాణాలు

బిక్కవోలు కాలువపై శిథిల వంతెన

పెదపూడి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పెదపూడి నుంచి వేట్లపాలెం వెళ్లే వంతెన ప్రమాదకరంగా ఉంది. సుమారు ఎనిమిది దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు సాగించేందుకు ప్రధాన మార్గం కావడంతో ఇటుగా వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి

అనపర్తి, పెద్దాపురం నియోజకవర్గాలను కలిపే ఈ వంతెన పైనుంచి పెదపూడి మండలంలోని సుమారు 12 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దాల కాలం క్రితం అప్పటి రవాణాకు అనుకూలంగా నిర్మించారు. వంతెన ఇరుకుగా ఉండటం, భారీ వాహనాలు వచ్చిన సమయంలో వంతెన అదరడంతో ప్రయాణికులు వంతెన ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రవాణా పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చర్యలు తీసుకోవాలి..

వంతెనకు ఇరువైపులా ఏవిధమైన రక్షణ గోడలు లేకపోవడంతో పక్కనే ఉన్న బిక్కవోలు డ్రైనులో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో నీటిలో కొట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను గుర్తించి దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

ఒరిజినల్ లింక్ దస్తావేజులు పోయినవి

నా క్లయింటు తూమటి వెంకట రామయ్య, S/o. గోవిందయ్య, డో.నెం. 4-19-41/4, రాజరత్న రోడ్డు, మండపేట, తూ॥గో॥జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం నా క్లయింటు యొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు నెం. 1139/1993, Dt. 7-6-1993, SRO, మండపేట, 2) 1114/1993, Dt. 3-6-1993, SRO, మండపేట నెంబర్లు గల దస్తావేజులు ది. 10-2-2026వ తేదీన నా క్లయింటు మండపేట బస్ స్టాండ్ సెంటర్‌లో కలర్ జిరాక్స్ కొరకు వెళ్ళుచుండగా పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.

తుమ్మల వాసులక్ష్మి
అడ్వకేట్, డో.నెం.46-22-13/బి
దానవాయిపేట, రాజమండ్రి
సెల్: 9848253410

(c) eenadu

గ్రామ స్వరాజ్యం.. కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

విద్యుత్తు ఆటోలు ప్రారంభిస్తున్న పట్టాభిరామ్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు తొలివిడతగా ఒక్కో నియోజకవర్గంలోని ఏడేసి పంచాయతీలకు మంజూరు చేసిన విద్యుత్తు ఆటోలను గురువారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు సారథ్యంలో ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో 12 వేల మూడు చక్రాల సైకిళ్లు, 5 వేల తోపుడు బండ్లు అందించామన్నారు. పైలట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ ద్వారా 200 విద్యుత్తు ఆటోలు పంపిణీ చేసినట్లు వివరించారు. రెండో దశలో 3 వేల విద్యుత్తు ఆటోలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 8 ప్రాంతాల్లో ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్ల స్థాపనకు శ్రీకారం చుట్టామన్నారు. ఒక్కో ప్లాంట్‌కు రూ.18 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. విద్యుత్తు వాహనాల వల్ల కాలుష్యంతోపాటు నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిపై గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 45 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మరుగుదొడ్లు, 108 తాగునీటి సరఫరా పనులు నిర్దేశించగా 22 మరుగుదొడ్లు, 44 తాగునీటి సరఫరా పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ గురుకులాలకు మంజూరైన 49 సామాజిక భవనాల్లో 16 పనులను ఇంకా ప్రారంభించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరు మెరుగుపరచుకోకుంటే శాఖాపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేసి మార్చి 15లోగా బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్, జడ్పీ సీఈవో శ్రీహరి తదితర అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీపి కబురు

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 198
ఉగాదికి వెలువడనున్న డీఎస్సీ ప్రకటన

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి సర్కారు తీపి కబురు అందించింది. గత ఏడాది మెగా డీఎస్సీ నిర్వహించిన ప్రభుత్వం.. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది మరో డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఉన్న జిల్లాల నుంచి ఉపాధ్యాయ ఖాళీల వివరాలను సేకరించింది.

వివరాల సేకరణ.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 198 ఉన్నాయి. ఈ వివరాలను జిల్లా విద్యాశాఖ నుంచి ప్రభుత్వానికి నివేదించారు. వాటిలో పాఠశాల సహాయకుల కొలువులు 116, మాధ్యమిక గ్రేడ్ కొలువులు 82 ఉన్నాయి. 2026, మే 31 ప్రాతిపదికగా ఈ వివరాలను సేకరించారు. వాటిని పాఠశాల విద్యాశాఖ ఆమోదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ తర్వాత 70:30 నిష్పత్తిలో ఖాళీలను విభజిస్తారు. 70 శాతం కొలువులను ఉద్యోగోన్నతుల ద్వారా, 30 శాతం నేరుగా నియామకాల విధానంలో భర్తీ చేస్తారు. ఉపాధ్యాయ ఖాళీల ఆమోదం తర్వాత పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని అనుసరించి హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారు. అనంతరం పాఠశాల సహాయకులు, మాధ్యమిక ఉపాధ్యాయుల ఖాళీలను ఆయా సబ్జెక్టుల వారీగా ప్రకటిస్తారు.

1,023.. గతంలో భర్తీ చేసినవి.. గత ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,034 ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించారు. ఇందులో 1,023 ఖాళీలను భర్తీ చేశారు. 11 కొలువులకు అర్హులు లేనందున బ్యాక్‌లాగ్ జాబితాలోకి చేర్చారు. ఉగాదికి ఇచ్చే డీఎస్సీ సిలబస్ మార్పులేమీ ఉండబోవు. గత ఏడాది డీఎస్సీకి ఇచ్చిన సిలబస్ మార్గదర్శకాలనే ఈసారీ అమలు చేయనున్నారు.

పగలు చూస్తారు.. పాగా వేస్తారు!

- రాత్రికిరాత్రే భూ ఆక్రమణలు
- కొమ్ము కాస్తున్న అధికారులు, నాయకులు

మండవల్లి, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, పెదపాడు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సర్కారు స్థలం కనిపిస్తే అక్కడ అక్రమార్కులు వాలిపోతున్నారు. పగలు చూస్తున్నారు.. రాత్రికే అక్కడ పాగా వేస్తున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించడం లేదా నాయకులను అడ్డంపెట్టుకుని అధికారులను బెదిరించి రూ.కోట్లు విలువ చేసే భూములు కొల్లగొడుతున్నారు.

జిల్లాలో గ్రామ కంఠాలు, ప్రభుత్వ భూములు ఏనాడో అక్రమార్కుల చెరలోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం నీటి పారుదలశాఖ, రోడ్లు భవనాలు, దేవాదాయశాఖలకు చెందిన భూములపై కన్ను వేశారు. ఆయా శాఖల అధికారులు ముడుపుల మత్తు, సమన్వయం లోపం, నిర్లక్ష్యంతో ఉన్న కాస్త భూములు కనుమరుగవుతున్నాయి.

మండవల్లి మండలం లోకుమూడి పరిధిలోని 100, 101 సర్వే నంబర్లలోని 3 ఎకరాల ప్రభుత్వ భూమి రూ.కోట్లు విలువ చేస్తుంది. అక్రమార్కులు తప్పుడు ధ్రువ పత్రాలతో దీనిలో భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏలూరు రోడ్డు నుంచి కొవ్వాడలంక వరకు ఉన్న రోడ్లు భవనాల శాఖ, కాలువ పోరంబోకు భూములు ఆక్రమణలోనే ఉన్నాయి.

కైకలూరులోని కోరుకొల్లు రోడ్డు వెంట రెండు కిలోమీటర్ల 100 లింకుల వెడల్పులో ఉన్న కాలువ పోరంబోకులో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కైకలూరు నడిబొడ్డున ఉన్న వార్లకోడు 10 ఎకరాల భూమిని పూర్తిగా ఆక్రమించేశారు. శ్యాంప్, పుల్లవ డ్రెయిన్లతో పాటు పంట కాలువను ఆక్రమించినా పట్టించుకునే నాథులే లేరు.

లోకుమూడిలో ప్రభుత్వ భూమిలో ప్రహరీ

పెదపాడు మండలం కలపర్రు నుంచి వట్లూరు వరకు ఉన్న రోడ్లు భవనాల శాఖ భూమిలో భారీ నిర్మాణాలు, దుకాణాలు నిర్మించారు. పంట బోదెలను వదలడం లేదు. సెంటు రూ.20 లక్షల వంతున అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

కలిదిండి మండలం పెదలంకలో పంచాయతీకి చెందిన 2.52 ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం దీని విలువ రూ.కోటి పైమాటే.

ముదినేపల్లి మండలం సింగరాయపాలెం, ముదినేపల్లి, చేవూరిపాలెం, శ్రీహరిపురంలోని అన్నవరం డ్రెయినేజీ, రోడ్లు భవనాల శాఖ భూముల్లో భారీగా ఆక్రమణలు ఉన్నాయి. ఆ భూమిని సెంటు రూ.7 నుంచి 10 లక్షలకు విక్రయిస్తున్నారు. షెడ్లు ఏర్పాటు చేసి నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అద్దెకిస్తున్నారు.

ఆగిరిపల్లిలోని నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారి వెంబడి ప్రభుత్వ భూములను పెద్ద ఎత్తున ఆక్రమించి రూ.5 నుంచి 10 లక్షల వరకు అమ్ముతున్నారు. అయినా అధికారులు అటువైపు చూడటం లేదు.

ఈ పరిస్థితిపై ఆర్డీవో అంబరీశ్ మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 4 నుంచి ఏలూరు జిల్లాలో కైకలూరు, నూజివీడు ప్రాంతాలు కలిశాయని, అంతకు ముందు నుంచే ఆక్రమణలు ఉన్నాయన్నారు. వాటిపై ఆరా తీసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కృష్ణా... గరళంతో తీర్చుకోవాలా తృష్ణ

ఏలూరు నగరానికి వచ్చే ఏకృష్ణా కాలువ చెత్త, వ్యర్థాలతోపాటు గుర్రపు డెక్కతో పేరుకుపోయింది. వాటిని తొలగించకుండా వదిలేయడంతో డ్రెయిన్ మరింత అధ్వానంగా తయారైంది. రానున్న వేసవిలో నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు వీలుగా ఏలూరు రిజర్వాయర్ పంపుల చెరువులోకి కాలువల ద్వారా నీటిని మళ్లించి నిల్వ చేస్తారు. ఈ తరుణంలో కాలువల నిండా చెత్త పేరుకుపోవడంతో పంపుల చెరువులోకి కలుషిత నీరు చేరనుంది. అధికారులు తక్షణం స్పందించి వేసవికి ముందే కాలువల్లోని చెత్త తొలగించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఏలూరు**

14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, భూవివాదాలు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు రాజీ చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం నిర్వహించి సామరస్యంగా కేసులు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కక్షిదారులు నేరుగా లేదా న్యాయవాది ద్వారా సంప్రదించవచ్చన్నారు.

విహంగ వీక్షణ.. జల వనరులకు రక్షణ!

ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన లైడార్ సర్వే

సర్వేకు వినియోగించే విమానం, పరికరం

నరసాపురం, న్యూస్‌టుడే: జలవనరులపై సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం చేపట్టిన లైడార్ సర్వే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో తాజాగా ప్రారంభమైంది. దాదాపు 125 ఏళ్ల కిందట సర్ ఆర్థర్ కాటన్ హయాంలో ఈ ప్రాంతంలో జలవనరులపై సర్వే నిర్వహించినట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కాలువలు, డ్రెయిన్లు, ఉప్పుటేరులు, ఇతర జలవనరుల సమగ్ర సమాచార సేకరణ కోసం ఈ సర్వే చేపట్టారు. ఈ సర్వే నివేదికల ఆధారంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జల వనరుల స్థిరీకరణకు కాలువలు, డ్రెయిన్లు, చెరువులను పరిరక్షించి ఆధునికీకరించనున్నారు. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు కేంద్రంగా చిన్న విమానంతో అమర్చిన ఆధునిక పరికరాలతో ఈ సర్వే జరుగుతోంది. గురువారం వాసవీ పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో సర్వే జరిగిందని జలవనరులశాఖ నరసాపురం డీఈ వెంకటనారాయణ తెలిపారు. ఈ నెల 20న నరసాపురం, పాలకొల్లు, అత్తిలి, గణపవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెంలలో, 21న పేరుపాలెం, మొగల్తూరు, భీమవరం, వీరవాసరం, ఉంగుటూరు, భీమడోలు ప్రాంతాల్లో సర్వే జరుగుతుందని డీఈ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మహిమాన్విత మాత పెద్దింట్లమ్మ

కైకలూరు, న్యూస్‌టుడే: భక్తుల కష్టాలను తీర్చే మహిమాన్విత మాత పెద్దింట్లమ్మా అంటూ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు చలువ పందిళ్లలో పాల పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీజల దుర్గా సమేత పెద్దింటమ్మ మూల విరాట్టుకు సుగంధ ద్రవ్యాభిషేకం, పుష్పాలంకరణ, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు సమర్పించారు. దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె. శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.07 కోట్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి హుండీల ఆదాయం అధిక మొత్తంలో లభించింది. దేవస్థానం కల్యాణ మండపంలో అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ అధికారులు హుండీలను తెరిచి ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడిచిన 21 రోజులకు నగదు రూ.2,07,22,111, బంగారం 321 గ్రాములు, వెండి 3.047 కిలోలు సమకూరినట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు. పలు దేశాల విదేశీ కరెన్సీతోపాటు చెల్లని పాత నోట్లు కూడా లభించాయని ఆయన పేర్కొన్నారు.

వసతి ఎలాగుంది.. భోజనం బాగుందా..

సంక్షేమ గృహాలపై ఐవీఆర్ఎస్ సర్వే

వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు, తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వసతి గృహాల్లోని సంక్షేమాధికారుల పనితీరు, ఆహార పట్టిక అమలు, మౌలిక వసతులు తదితర అంశాలపై నిఘా పెట్టింది. ఈ మేరకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. వాటి ఆధారంగా సేవలు సంతృప్తికరంగా లేని చోట అవి మెరుగయ్యేలా చూడటంతోపాటు అధికారులు మరింత బాధ్యతగా పని చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గాలికొదిలేసిన గత వైకాపా సర్కారు.. ప్రభుత్వ వసతి గృహాలను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. శిథిల భవనాలు, సదుపాయాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించింది. మరుగుదొడ్ల నిర్మాణం, రక్షిత మంచినీటి యంత్రాలు సరఫరా చేసింది.

ఏయే అంశాలపై అంటే.. వసతి గృహాల్లో ఆహార పట్టిక ప్రకారం భోజనం పెడుతున్నారా, సంక్షేమాధికారుల పనితీరు ఎలా ఉంది, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తీరుకు సంబంధించిన ప్రశ్నలపై ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కచ్చితమైన సమాచారం ఇస్తే వాటి అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఎస్సీ వసతి గృహాల నిర్వహణలో ఏలూరు జిల్లా 23, పశ్చిమ 12 స్థానంలో నిలిచాయి. బీసీ వసతి గృహాల నిర్వహణలో ఏలూరు జిల్లా 6, పశ్చిమ గోదావరి 16 స్థానంలో ఉన్నాయి.

జిల్లాలో	ఎస్సీ		బీసీ	
	అవును	లేదు	అవును	లేదు
ఆహార పట్టిక ప్రకారం భోజనం పెడుతున్నారా	73.6	26.4	82	18
సంక్షేమాధికారుల పనితీరు సంతృప్తికరంగా ఉందా	69.8	30.2	81.4	18.6
తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ సంతృప్తికరంగా ఉందా	60.1	39.9	67.4	32.6

దొంగ బంగారం కొనేస్తున్నారు..!

- ఎస్పీ హెచ్చరించినా మారని తీరు
- తాజాగా పొన్నూరు ఉదంతంలో వెలుగులోకి

ఈనాడు-ఏలూరు: దొంగ బంగారం కొనుగోలుకు ఏలూరు అడ్డాగా మారుతోంది. అచ్చంగా కొందరు వ్యాపారులు చోరీ బంగారమే కొనుగోలు చేస్తూ దొంగలకు సహకరిస్తున్నారు. దీనిలో లాభాలు బాగా ఉంటాయని ఇదే వ్యాపారంగా పెట్టుకున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాతృమూర్తి నివాసంలో పది కిలోల వెండి, మరికొంత బంగారం చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఆ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడు ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన సత్తెనపల్లి రాకేశ్‌గా గుర్తించారు. అతడిని పొన్నూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వైకాపా సర్పంచి ఆధ్వర్యంలో.. నిందితుడి నుంచి పూర్తిస్థాయిలో వెండి, బంగారం రికవరీ కాలేదు. అప్పటికే కొంత బంగారం కరిగించి విక్రయించారు. దాన్ని కరిగించింది ఏలూరుకు చెందిన ఓ వ్యాపారి అని, విక్రయించింది స్థానికంగానే అని పోలీసులు ధ్రువీకరించుకున్నారు. నిందితుడు చోరీ చేసి తీసుకొచ్చిన ఆభరణాలు వైకాపాకు చెందిన ఓ సర్పంచి ఇంట్లో పెట్టగా అతను కరిగించి, విక్రయించారని ఈ కేసులో అతను కూడా నిందితుడే అవుతారని తెలిపారు. కొంత బంగారాన్ని ఏలూరులో విక్రయించినట్లు తమ దృష్టికి వచ్చిందని స్థానిక పోలీసులు తెలిపారు.

గతంలోనూ.. సుమారు ఏడాది కిందట దొంగలు కొట్టుకొచ్చిన రెండు కిలోల బంగారాన్ని ఏలూరులో కొందరు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆ దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు విచారించగా చోరీ చేసిన బంగారాన్ని ఏలూరులో విక్రయించినట్లు చెప్పారు. అప్పట్లో వ్యాపారుల వద్దకు రికవరీకి వెళ్లిన పోలీసులపై నానా యాగీ చేశారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చారు. అయితే బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలిసి విన్నవించారు. ఆయన ఈ వ్యవహారంపై దృష్టిసారించి వ్యాపారుల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేశారు. అప్పట్లోనే ఈ దొంగ బంగారం కొనేవారికి గట్టి హెచ్చరిక చేశారు. అయినా కొందరు అదే ధోరణిలో ఉన్నారు. మూడు నెలల కిందట విజయవాడ పోలీసులు ఓ చోరీ కేసులో బంగారాన్ని ఏలూరులో కొనుగోలు చేసినట్లు ధ్రువీకరించుకుని ఇక్కడకు వచ్చారు. 'నగరంలో కొందరు వ్యాపారులు చోరీ బంగారం కొంటున్నారు. వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పోలీస్ అధికారులు తెలిపారు.

అతివ అభివృద్ధికి.. మరో అడుగు!

కల్యాణలక్ష్మి, విద్యాలక్ష్మి పథకాల అమలుకు చర్యలు

సమావేశంలో మహిళలు

నూజివీడు, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా ఆదుకుని, ప్రతి ఇంట్లో అతివలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వెలుగు ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలతో చేయూత అందిస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీనిధి, కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలను తీసుకురానుంది. వీటికి విధి విధానాలను ఇటీవల విడుదల చేసింది. పిల్లల చదువు (కేజీ నుంచి పీజీ), వివాహాది శుభకార్యాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనుంది.

నాలుగు శాతం వడ్డీకే.. స్త్రీనిధి ద్వారా సంఘాల్లో సభ్యులకు చెందిన పిల్లల చదువుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం తీసుకొస్తున్నారు. ఒక సభ్యురాలికి చెందిన ఇద్దరు పిల్లలు వరకు ఇది వర్తించనుంది. పాఠశాలలో చేరిన ప్రవేశ పత్రం, ఫీజు కట్టిన రసీదు తీసుకురావాల్సి ఉంటుంది. నాలుగు శాతం వడ్డీతో రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం వస్తుంది.

జిల్లాలో ఇలా..	
గ్రామైక్య సంఘాలు	1,353
స్వయం సహాయక	41,533
సభ్యులు	4,06,660
వీవోఏలు	1,353
సీసీలు	102
ఏపీఎంలు	26

రూ.లక్ష వరకు రుణం.. కల్యాణలక్ష్మి ద్వారా ఆడపిల్లల పెళ్లికి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. దీనికి కూడా నాలుగు శాతం మాత్రమే వడ్డీ.. తీసుకున్న రుణం 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నప్పుడు అవసరమైన పెండ్లి పత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం, తదితరాలు ఇవ్వాల్సి ఉంటుంది. సొమ్ము నేరుగా లబ్ధిదారు ఖాతాలోనే జమవుతుంది. బీమా సౌకర్యం ఉంటుంది.

సాంకేతిక దిశగా.. సెర్ప్ ఉద్యోగులకు మరింత సాంకేతికత జోడించనుంది. గతంలో 2014-19లో తెదేపా హయాంలోనే వెలుగు ఉద్యోగులకు చరవాణులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ఏపీఎంలకు ల్యాప్‌టాప్‌లు, సీసీలు, యానిమేటర్ల(వీవోఏ)లకు చరవాణులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడదాం : భోగిరెడ్డి ఆదిలక్ష్మి

కేఎన్‌రోడ్డు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భారతదేశంలో హిందూ ధర్మాన్ని కాపాడిన గొప్ప వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని వక్తలు కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం హౌసింగ్‌బోర్డు కూడలి నుంచి కేఎన్ రోడ్డు వరకు ద్విచక్ర వాహన శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నిట్ డీన్ జీఆర్‌కే శాస్త్రి, నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, ఆర్ఎస్ఎస్ నాయకుడు అశోక్ కుమార్ పాల్గొని మాట్లాడారు. శివాజీ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ భారతీయులంతా ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ సభ్యులు, ఏబీవీపీ, భాజపా నాయకులు, పట్టణ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

చింతలపూడి పట్టణంలో రాత్రి సమయంలో ఇసుక రవాణా

చింతలపూడి, న్యూస్‌టుడే: కొవ్వూరు సమీపంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్ల ద్వారా తెలంగాణకు తరలిస్తున్నారు. కొవ్వూరు నుంచి జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, చింతలపూడి, గురుభట్లగూడెం, యర్రగుంటపల్లి, అల్లిపల్లి, సీతానగరం మీదుగా పదుల సంఖ్యలో టిప్పర్లు ఇసుక రవాణా చేస్తున్నాయి. మైనింగ్ చెక్‌పోస్టులు లేకపోవడంతో వీరికి అడ్డూఅదుపూ ఉండటం లేదు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ఈ ఇసుకను టన్ను రూ.900 నుంచి రూ.వెయ్యికి విక్రయిస్తూ టిప్పర్ యజమానులు రూ.లక్షలు గడిస్తున్నారు. ఇంత భారీగా ఇసుక రవాణా జరుగుతున్నా మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

మిల్లుల్లోనే లక్షల టన్నుల ధాన్యం

ఫోర్టిఫైడ్ రైస్ కొరతే కారణం

ధాన్యం బస్తాలు

చింతలపూడి, న్యూస్‌టుడే: మిల్లర్లను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (పోషక మిశ్రమాల బియ్యం) కొరత వేధిస్తోంది. కొన్నాళ్లుగా వీటి సరఫరా నిలిచి పోవడంతో ఖరీఫ్‌లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మరాడించి పౌరసరఫరాల శాఖకు చేరవేయడంలో జాప్యం జరుగుతోంది. రూ.కోట్లలో వర్కింగ్ ఛార్జీలు ఆగిపోయాయని మిల్లర్లు వాపోతున్నారు. నిత్యం కూలీలను పెట్టి బస్తాలను తిరగేయాల్సి వస్తోందని మిల్లర్లు చెబుతున్నారు.

1500 టన్నులు అవసరం.. గత ఖరీఫ్‌లో జిల్లాలోని రైతుల వద్ద నుంచి 4.10 లక్షల టన్నుల ధాన్యాన్ని 108 మిల్లుల ద్వారా సేకరించారు. ఈ ధాన్యాన్ని మరాడించి 1.50 లక్షల టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు, 1.08 లక్షల టన్నులను ఎఫ్‌సీఐకి సరఫరా చేయాలి. ఇప్పటి వరకు కేవలం 35 వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. మిల్లర్ల వద్ద 2 లక్షల టన్నులకు పైగా ధాన్యం మిగిలిపోయింది.

ప్రతి క్వింటాకు కిలో చొప్పున.. ప్రతి క్వింటా బియ్యానికి కిలో చొప్పున ఫోర్టిఫైడ్ రైస్ కలపాల్సి ఉంటుంది. అంటే జిల్లాకు మొత్తం 1500 టన్నులు అవసరం ఏర్పడింది. పేదలకు పోషకాలు అందాలనే యోచనతో కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యంలో వీటిని కలిపి సరఫరా చేస్తోంది. సాధారణంగా మూడు నెలలకు సరిపడా పోషక మిశ్రమాలు కలిపిన బియ్యాన్ని గిడ్డంగుల్లో నిల్వ చేస్తారు.

త్వరలో వచ్చే అవకాశం.. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 4.10 లక్షల టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాం. ఫోర్టిఫైడ్ రైస్ కొరత కారణంగా మిల్లుల వద్ద చాలా వరకు ధాన్యం ఉండిపోయింది. త్వరలోనే అవి వచ్చే అవకాశం ఉంది. **- శివరామమూర్తి, పౌరసరఫరాలశాఖ డీఎం**

(c) eenadu

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌తో చర్చిస్తున్న అధికారులు

ట్రిపుల్ ఐటీ యాజమాన్యం పన్నులు చెల్లించాల్సిందే

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం నూజివీడు పురపాలక సంఘానికి బాకీపడ్డ మొత్తం చెల్లించాలని నూజివీడు మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి వీరయ్య కోరారు. గురువారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌ను కలిసి నీటి పన్ను రూ.2.40 కోట్లు, ఇంటి పన్నులు రూ.92 లక్షలు చెల్లించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తెలిపారు. నీటి పన్ను రూ.కోటి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే పురపాలక సంఘం అకౌంట్‌కు జమ చేస్తామని తెలిపారు.

పంచ్ కొడితే.. పతకాల పంటే..

జాతీయస్థాయి కుంగ్‌ఫూ టోర్నీలో సత్తాచాటిన విద్యార్థులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వారంతా పేదింటి పిల్లలు. అందరిలాగే పాఠశాలలకు వెళ్తూనే ఏదైనా రంగంలో అదనపు ప్రావీణ్యం సాధించాలనే తపన వారిది. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. దీంతో జంగారెడ్డిగూడేనికి చెందిన ఆ విద్యార్థులు కుంగ్‌ఫూలో చేరి గంధం సురేశ్ వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నారు. ఫిబ్రవరి 8న విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఈ విద్యార్థులతో 'న్యూస్‌టుడే' ముచ్చటించింది.

తండ్రి ప్రోత్సాహంతో..

నా తండ్రి చిన్నతనంలో కుంగ్‌ఫూ నేర్చుకున్నారు. అప్పటి విషయాలు, కుంగ్‌ఫూ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు చెప్పడంతో నాకు ఆసక్తి కలిగింది. తండ్రి ప్రేరణతోనే 2020లో కుంగ్‌ఫూలో చేరా. అప్పటి నుంచి చిలకలూరిపేట, విజయవాడ, ఏలూరు, హనుమాన్‌జంక్షన్‌తోపాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొని ఐదు బంగారు, 2 వెండి పతకాలు సాధించా. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకున్నా. పోలీసు అధికారిని అవుతా.

- సయ్యద్ మోదిన్ బాషా, 7వ తరగతి.

ఐపీఎస్ అవుతా..

ఐదేళ్లుగా కుంగ్‌ఫూ నేర్చుకుంటున్నా. 2022లో చిలకలూరిపేటలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. 2023లో హనుమాన్ జంక్షన్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం గెలుచుకున్నా. విజయవాడలో 2025, 2026 ఫిబ్రవరి 8న జరిగిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు కైవసం చేసుకున్నా. అయిదేళ్లలో 5 బంగారు, 2 వెండి పతకాలు సాధించా. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

- నల్లమిల్లి గ్రీష్మంత్, 6వ తరగతి

ఆత్మవిశ్వాసం పెరిగింది...

కుంగ్‌ఫూతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యంతో పాటు నాలో ఆత్మవిశ్వాసం బాగా పెరిగింది. 2020 నుంచి ఇప్పటి వరకూ విజయవాడ, చాగల్లు, తణుకు, ఏలూరు, చిలకలూరిపేట, హనుమాన్‌జంక్షన్ తదితర చోట్ల జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో సత్తా చాటా. ఆయా పోటీల్లో 4 బంగారు, 3 వెండి పతకాలు సాధించా. ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం.

- కాపకాయల సుదర్శన్, 6వ తరగతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు

కైకలూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీరు సంస్థ లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఏలూరులో జిల్లా స్థాయి హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో కోడింగ్, ఏఐ టూల్స్‌పై నిర్వహించిన శిక్షణలో 15 పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కైకలూరు మండలం జంగంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ్ము నాగసాయి, బొమ్మిడి ఏసురాజు, తిరుమాని శ్రీబాలాజీ, తమ్ము పవన్ తేజ ప్రతిభ కనబరిచారు. వరద ముంపు నష్టాన్ని తగ్గించే అంశాలపై విద్యార్థులు ప్రదర్శించి ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమగ్ర శిక్షా అదనపు కోఆర్డినేటర్ కురేళ్ల పంకజ్‌కుమార్, మానిటరింగ్ అధికారి ఆర్.రామారావు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే హ్యాకథాన్ పోటీలకు జంగంపాడు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు పి.సురేశ్‌కుమార్ వర్మను మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

విత్తన కంపెనీలు విధిగా సమాచారమివ్వాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విత్తన కంపెనీలు తప్పనిసరిగా సంబంధిత అధికారి(ఎంఈవో)కి సమాచారమివ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. ఏలూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మొక్కజొన్న విత్తనం ఉత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. విత్తన కంపెనీ ద్వారా నిర్వాహకులు, రైతుల మధ్య విధిగా ఒప్పందం ఉండాలని సూచించారు. విత్తన ఉత్పత్తి తగ్గినప్పుడు కంపెనీ ఒప్పందం ప్రకారం నష్ట పరిహారం అందించాలని కోరారు.

ఆర్టీసీ డిపోలు ప్రైవేటుపరం చేయొద్దు

ఆందోళన నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపోలను ప్రైవేటుపరం చేయొద్దని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసే 88 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రైవేటు సంస్థకు మొదటి దశలో విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళగిరి డిపోలను అప్పగించడానికి సిద్ధమవడం సరికాదన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న విజయవాడలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డీకే రావు, కార్యదర్శి ఎస్.సురేశ్, సీఐటీయూ నాయకుడు పి.రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో శాసనసభ పనితీరుపై అవగాహన: మంత్రి

నూజివీడు గ్రామీణం, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే చట్టాలు, శాసన సభ పనితీరు, హక్కులపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను విద్యార్థులు గ్యాలరీ నుంచి వీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నూజివీడు, ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు గురువారం అసెంబ్లీ కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వెళ్లారు. అక్కడ అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రులు కొలుసు పార్థసారథి, ఎస్. సవితను విద్యార్థులు కలిసి ముచ్చటించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రులు పార్థసారథి, సవిత

ఉత్తమ ప్రతిభకు ప్రోత్సాహం

పదో తరగతి ఫలితాల్లో తొలి ఐదు స్థానాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు తన తండ్రి కొలుసు పెదరెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సాయం చేస్తానని మంత్రి భరోసా కల్పించారు.

నారా లోకేశ్ విద్యామృతం..

నూజివీడు నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు మూడు నెలలు ముందు నుంచే నారా లోకేశ్ విద్యామృతం పేరుతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంఈవో-2 కె.ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు ఎం.వేణుగోపాలరావు, రామకృష్ణ, పద్మజారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలతో చిన్నారులు

అసెంబ్లీలో ఆరుతెగలపాడు విద్యార్థులు

కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఏపీ అసెంబ్లీలో గురువారం ఆరుతెగలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అడుగు పెట్టారు. సమావేశాల తీరు చూసి పులకించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, హోం మినిస్టర్ అనిత, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పీతాని సత్యనారాయణతో కలిసి ఫొటోలు దిగి ఆ జ్ఞాపకాలను పదిలపరుచుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సమావేశాలను విద్యార్థులు తిలకించారని ఎంఈవో-2 అనిశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఉపాధ్యాయులు లూయిస్, డీవీ నాగేశ్వరరావు, రమేశ్, ముదినేపల్లి ఎంఈవో-2 నరేశ్‌కుమార్, హెచ్ఎంలు ప్రభుదాసు, జంగం సునీత విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
19న రాత్రి 10గంటల సమయానికి	20న	21న
ధర్మప్పారాయ నిలయం	73	39
తితిదే సత్రం	05	13
రాణి చిన్నమ్మారావు సత్రం	28	24
కాటేజీలు	22	00
బాలాజీ	07	07

సంప్రదించాల్సిన నంబర్లు: 90375 69891, 90375 67892
ఆన్‌లైన్ బుకింగ్ కోసం:www.aptemples.ap.gov.in

కొల్లేరు పరిధి సర్వే త్వరగా చేయాలి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాలో కొల్లేరు అభయారణ్య పరిధి సర్వే త్వరగా చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కొల్లేరు పరిధి సరిహద్దుల సర్వే పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొల్లేరు ప్రాంతంలోని 55 గ్రామాల్లో 120 జీవో ప్రకారం సరిహద్దులను రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల సిబ్బంది సర్వే చేసిన తర్వాత ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. ఇప్పటికే 52 గ్రామాల్లో సరిహద్దులు గుర్తించారని, మిగిలిన గ్రామాల్లోనూ సర్వే త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ రెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రికల చోరీ ముఠా అరెస్టు

దెందులూరు, న్యూస్‌టుడే: పొలాల్లో విద్యుత్తు నియంత్రికలు చోరీ చేసి వాటిలోని రాగి తీగను అమ్ముకుంటున్న ముఠాను దెందులూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరులోని సత్రంపాడుకు చెందిన గోడ కార్తీక్, వేల్పుల మణికంఠ అలియాస్ పిట్ల వేల్పుల విష్ణుమోహన్ అలియాస్ చిన్ని, పడమర వీధికి చెందిన కోసూరి మురళీ, తమటం జాన్ మలాకి ముఠాగా ఏర్పడి పొలాల్లోని నియంత్రికలు చోరీ చేసి వాటిల్లోని రాగితీగ వేరు చేసి అమ్ముకుంటున్నారు. ఈ నెల 12న అప్పారావుగూడెం, గాలాయిగూడెం గ్రామాల మధ్య చోరీ చేశారని కేసు నమోదు చేశారు. వారిని గురువారం అరెస్టు చేశారు. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ మణికంఠపై ఇప్పటికే 40 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారంతా కలిసి 47 దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. వారి నుంచి 187 కిలోల రాగి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పురుగుమందుల అధిక వినియోగంతో అనర్థం

సదస్సులో పాల్గొన్న ఇన్‌ఛార్జి వీసీ

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయంలో మామిడి పంట యాజమాన్య పద్ధతులపై మేధోమథన సదస్సు వర్చువల్‌గా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ రాష్ట్ర సంచాలకుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి సాగులో ఎదురయ్యే సమస్యలకు ఉద్యాన వర్సిటీ పరిష్కారం చూపాలన్నారు. శాస్త్రవేత్తల బృందాన్ని సమన్వయం చేసుకొని, క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖను ఆదేశించారు. ఇన్‌ఛార్జి వీసీ ధనుంజయరావు మాట్లాడుతూ మామిడి సాగులో రెండో స్థానం, ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఏపీ ఉందన్నారు. రైతులు పురుగు మందులు అధికంగా వినియోగిస్తుండటంతో తేనెటీగలు తగ్గి ఫలదీకరణం జరగటం లేదన్నారు. దీని వల్ల పూత పిందెగా మారడం లేదన్నారు. మామిడికాయలకు సంచులు తొడగటం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. ఈ సంచులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. విస్తరణ సంచాలకురాలు రుథ్, పరిశోధన సంచాలకుడు రామానందం, సీనియర్ శాస్త్రవేత్తలు వెంకట స్వామి, గోవిందరాజులు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

గర్భస్రావాల పెరుగుదల ఆందోళనకరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాలో పెరుగుతున్న గర్భస్రావాల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల అన్నారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు హైమావతి అధ్యక్షతన గురువారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వసతులు కల్పించక, వైద్యులు సరిపడా ఉండకపోవడంతో పేదలు విధి లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. స్కానింగ్‌ల పేరిట గర్భిణుల నుంచి పెద్ద ఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులకు రూ. లక్షల్లో ఖర్చవుతున్నా అబార్షన్లు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించి, స్కానింగ్, రక్త పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐకాస నాయకులు

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఐకాస అమరావతి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విజయవాడలో వినతి పత్రం అందజేసినట్లు సంఘ నాయకులు రవీంద్రరాజు, మధుబాబు తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, తణుకు

ఆర్.ఓ.సి.నెం. 47/2024-ఎ1 తేదీ: 19-02-2026

2026-2027వ సంవత్సరములో రోడ్డు మార్జిన్లు రోజువారి మార్కెట్టు, ఆదివారం మార్కెట్టులలో ఆశీలు వసూలు చేసుకొను హక్కు బహిరంగ వేలం నోటీసు

తణుకు పురపాలక సంఘ ఏరియాలోని రోడ్డు మార్జిన్లు రోజు వారీ మార్కెట్టు, ఆదివారం మార్కెట్టు మరియు కొత్తగా విలీనమైన పైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురంతో కలిపి 2026-2027 సంవత్సరమునకు అనగా ది. 01-04-2026 నుండి ది. 31-03-2027 ఆశీలు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు గజిట్ నెం. 26 ది. 15-03-2024 లోని షరతులు ప్రకారము **తేది. 02-03-2026, సోమవారం** ఉదయం గం. 11.30 ని.లకు తణుకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీ కమిషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. ఏ కారణము చెప్పకనే పాటను ఆమోదించుట గాని లేక వాయిదా వేయుటకు గాని, లేక తిరస్కరించుటకు గాని, ఈ దిగువ సంతకముదారునికి పూర్తి అధికారము కలదు. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా సాల్వెన్సీ, డిపాజిట్టు మరియు స్టాంపు డ్యూటీ మొత్తము వేలమునకు ముందు అనగా (02-03-2026) ఉదయం గం. 10.00 లలోపు పురపాలక సంఘమునకు డిపాజిట్టు చేయవలెను. పాటలో పాల్గొను వారికి ఎటువంటి బకాయిలు ఉండరాదు. మిగిలిన విషయములు, పాట షరతులు పురపాలక సంఘములో ఆఫీసు పని దినములలో ఎ1 గుమస్తాను అడిగి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	పాట వివరములు	పాట సమయములో చేయవలసిన ధరావతు	పాట సమయములో చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ డిపాజిట్టు	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ మొత్తము
1	రోడ్డు మార్జిన్లు రోజు వారి మార్కెట్టు, ఆదివారం సంత మరియు మార్కెట్టు నందు 2026-27 సంవత్సరమునకు (ది.01-04-2026 నుండి ది. 31-03-2027 వరకు) కాలమునకు ఆశీలు వసూలు చేసుకొనే హక్కు	రూ. 5,00,000/-	రూ. 1,50,000/-	రూ. 5,00,000/-

కేంద్ర ప్రభుత్వ జి.ఎస్.టి. నోటిఫికేషన్ నం. 12/2015 ది.28-05-2027 ప్రకారము మార్కెట్టు పాట విలువపై 18% జి.ఎస్.టి. పాటదారుడే చెల్లించవలెను.

సం/- కమిషనర్, తణుకు పురపాలక సంఘము

కబళించిన ప్రమాదాలు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఇద్దరు వాహన ప్రమాదాల్లో మృత్యువాత పడగా.. ఓ యువకుడు జలపాతంలో మునిగి చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సతీశ్ (పాతచిత్రం)

ముదినేపల్లి, కాళ్ల, న్యూస్‌టుడే: ఉపాధి కోసం ఊరుగాని ఊరు వెళ్లి చెరువులో పని చేస్తుండగా ట్రాక్టరు బోల్తా పడిన ఘటనలో సింగరాయపాలేనికి చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాయపాలేనికి చెందిన తూము జాన్ సతీశ్(25) గురువారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్లలో చెరువులో ట్రాక్టర్‌తో బ్లేడు లాగడానికి వెళ్లారు. పని చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. సతీశ్‌కు ఏడాది క్రితమే వివాహమైంది. అతడి భార్యకు బుధవారం సీమంతం వేడుక నిర్వహించారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరక్టర్ కొడాలి వినోద్, వైకాపా నాయకులు వినయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

పాఠశాల బస్సు ఢీకొని వృద్ధుడు..

సత్యనారాయణ (పాత చిత్రం)

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డుపై నడిచి వెళుతున్న ఓ వృద్ధుడిని పాఠశాల బస్సు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి ఇందిరానగర్‌కాలనీకి చెందిన మారం సత్యనారాయణ (65) తాపీ, పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అతడి భార్య చనిపోవడంతో గత కొన్నేళ్లుగా హైదరాబాదులో ఉంటూ పనులు చేసుకుంటున్నారు. గురువారం ఉదయం జంగారెడ్డిగూడెంలో ఇందిరానగర్ కాలనీలోని మేనల్లుడు వద్దకు వచ్చారు. అతడితో మాట్లాడి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆంజనేయస్వామి విగ్రహం సమీపాన పాఠశాల బస్సు సత్యనారాయణను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వీరప్రసాద్, ఏఎంవీఐ సీహెచ్ ఎస్ఎన్ మూర్తి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బస్సు చోదకుడు పరారీ అవ్వగా.. విద్యార్థులను మరొక బస్సులో విద్యాసంస్థల యాజమాన్యం తరలించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జలపాతంలో స్నానానికి దిగి యువకుడు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం దండిపూడి సమీపాన జలపాతం వద్ద ఒక వ్యక్తి మృతదేహం ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ జి.కృష్ణంరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన బోగోలు సత్యనారాయణ(18) కనిపించడం లేదని తల్లి అంజలి రెండు రోజుల కిందట జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దండిపూడి జలపాతంలో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం తెలిసి తల్లి అక్కడికి వచ్చి చూశారు. మృతుడు తన కుమారుడు సత్యనారాయణగా గుర్తించారు. స్నానానికి దిగి ఈత రాక ప్రమాదవశాత్తు మునిగి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృష్ణంరాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట శివారు మంకెనపల్లి సమీపంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందారు. గురువారం ఉదయం రోడ్డు పక్కన ఉన్న పొలంలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తడికలపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలు కామవరపుకోట పంచాయతీ యానాదుల కాలనీకి చెందిన చేవూరి జ్యోతి (45)గా గుర్తించారు. సీఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతి, భర్త నాగరాజుతో కలిసి కొత్తగూడెం రోడ్డులో ఉన్న కోళ్లఫారంలో పని చేస్తుంటారు. కామవరపుకోట పంచాయతీ యానాదుల కాలనీలో ఉన్న వారి సమీప బంధువుకు అనారోగ్యంగా ఉండటంతో బుధవారం అక్కడికి వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ దారిలో వారిద్దరూ మద్యం తాగారు. జ్యోతి మద్యం మత్తులో చింతలపూడి రోడ్డులోని పశువుల ఆసుపత్రి సమీపంలో రోడ్డు పక్కన పడుకుంది. భర్త ఆమెను వదిలేసి వెళ్లి కొంత సమయం తర్వాత వచ్చి చూడగా కనిపించలేదు. గురువారం ఉదయం మంకెనపల్లి దారిలో మృతి చెంది ఉంది. అతిగా మద్యం తీసుకోవడంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీకొన్న ఆటో.. 8 మందికి గాయాలు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను, పత్తేపురం మధ్య గురువారం రాత్రి చోటుచేసుకున్న ఆటో ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. బాధితులు.. స్థానికుల కథనం ప్రకారం పెదనిండ్రకొలను తూర్పుపేట, ఎస్సీపేటకు చెందిన 15 మంది మహిళా కూలీలు చేబ్రోలు లిక్కర్ పరిశ్రమలో పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా వచ్చిన పామును తప్పించే ప్రయత్నంతో ఆటో డ్రైవరు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో అది ముక్కలైంది. ఈ ప్రమాదంలో 8 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో ముగ్గుర్ని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మిగిలిన ఐదుగురిని పెదనిండ్రకొలను ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేశారు. విషయం తెలిసిన వెంటనే కూలీల కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోగ్యకేంద్రానికి చేరుకున్నారు. క్షతగాత్రుల్లో ఏసమ్మ, మేరీ, పద్మ, పూర్ణ, బంగారమ్మ, పద్మ, సాయి, సంధ్య ఉన్నారు. ఆటో స్తంభాన్ని ఢీకొట్టిన వెంటనే సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధిలో ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్సై జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బాలిక (17) ఇంటర్మీడియట్ చదువుతోంది. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తరువాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు బాలిక ఉరికి వేలాడుతున్నట్లు గుర్తించి కిందకు దించి వెంటనే నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -100, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

92.7 FM Rajamahendravaram
ఈనాడు ఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

భీమవరంలోని శ్రీరాంపురం ఏరియాలో ఇన్‌స్టామార్ట్‌లో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. శాలరీ 18000+ EPFO+ ESI. 9885295999, 9885287999.

FACULTY/ TEACHERS
Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

TO LET

COMMERCIAL

JOBS

గమనిక

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఎపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 10.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 10.03.2026, మ॥ 02.00 గం.ల నుండి సా॥4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 10.03.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 10.03.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

వ. నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	గుడివాకలంక బ్రాంచ్ శ్రీ ఘంటసాల సోసుకుమార్, తండ్రి: వెంకన్న బాబు బకాయి మొత్తం : తేది.18.02.2026 నాటికి రూ.49,80,640.33/- + వడ్డీ + ఇతర ఖర్చులు	1) ఏలూరు జిల్లా, కామవరపు కోట, ఆర్.ఎస్. నెం.798/2, ఎల్.పి. నెం. 48/2013R, "సౌభాగ్య వింటేజ్" లే-అవుట్‌లో ప్లాట్ నెం. 521 లోని 533.33 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం. 2) ఏలూరు జిల్లా, కామవరపు కోట, ఆర్.ఎస్. నెం.798/2, ఎల్.పి. నెం. 48/2013R, "సౌభాగ్య వింటేజ్" లే-అవుట్‌లో ప్లాట్ నెం. 522 లోని 533.33 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 50.00 లక్షలు	రూ. 5.00 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 05.03.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు. అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695. * బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 20,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 18.02.2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించండి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన రైతులకు రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక అన్నే భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం పరిధిలోని కృష్ణా డెల్టా కింద ఉన్న సుంకరివారితోట, వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన పంట కాలువలను బాగు చేయాలని, ఆక్రమణలు తొలగించాలని కోరారు. చిన్ని పోతురాజు, భైరెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులు కాపాడుకోవడం మన బాధ్యత

మాట్లాడుతున్న సీఐ బెన్నయ్య

ఉంగుటూరు, న్యూస్‌టుడే: రైల్వే ఆస్తులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఏలూరు ఆర్పీఎఫ్ సీఐ బెన్నయ్య సూచించారు. నారాయణపురంలోని అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో రైల్వే భద్రతపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌ల వద్ద స్వీయ చిత్రాలు దిగడం ప్రమాదకరమన్నారు. రైలులో ప్రయాణించేటప్పుడు అత్యవసర సమయంలో 139 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కె.వసుధ, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? వంగాయగూడెం నుంచి పెదపాడు వెళ్లే రోడ్డు విస్తరణ పనుల్లో రహదారి నిర్మించినా అంచుల్లో గ్రావెల్ వేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- రంగారావు, ఏలూరు**

✔ పనులు కొనసాగుతున్నాయి. అంచుల్లో గ్రావెల్ వేయిస్తాం **- శేషుకుమార్, ఏఈ, రహదారులు, భవనాల శాఖ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? దెందులూరు నుంచి కొమడవోలు వెళ్లే రోడ్డులో శివారున వీధి లైటు లేక ఇబ్బందులు పడుతున్నాం. **- నారాయణరావు, దెందులూరు**

✔ వీధిలైటు ఏర్పాటు చేయిస్తాం. **- గాయత్రీ, పంచాయతీ కార్యదర్శి**

పెదపాడు, న్యూస్‌టుడే : ? కలపర్రులో కొక్కిరపాడు కాలనీకి వెళ్లే రహదారిలో డ్రెయిన్ పూడుకుపోయి మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. **- కాలనీవాసులు, కలపర్రు**

✔ డ్రెయిన్‌లోని పూడిక తీయిస్తాం. **- పద్మారావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి, కలపర్రు పంచాయతీ**

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? శాంతినగర్ ఏడో రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. **- కె.సత్యనారాయణ, స్థానికుడు**

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- పవన్, నగరపాలక విద్యుత్తు విభాగం ఏఈ**

దుర్గంధపురి

☛ ఏలూరు నగరంలో పారిశుద్ధ్యం పరిహాసం
☛ సర్వేలో చివరి నుంచి రెండో స్థానం

ఈనాడు-ఏలూరు

నగర పాలక సంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉందని ప్రభుత్వం ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్ చేసి సంతృప్తి స్థాయిని తెలుసుకుంది. ఇందులో ఏలూరు నగర పాలక సంస్థకు రాష్ట్రంలో చివరి నుంచి 2వ స్థానం దక్కింది. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని నగర ప్రజలు ఛీ కొట్టారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని 47 శాతానికి పైగా అసంతృప్తి వ్యక్తమైంది. రాష్ట్రంలో 17 నగర పాలక సంస్థలు ఉండగా వాటిల్లో ఏలూరు 16వ స్థానంతో సరిపుచ్చుకుంది. పారిశుద్ధ్యం నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో ఈ ర్యాంకే తెలియజేస్తోంది.

భారీగా సిబ్బంది

పారిశుద్ధ్య విభాగంలో రెగ్యులర్ కార్మికులు 140 మంది, పొరుగు సేవలపై 598 వెరసి 738 మంది పని చేస్తున్నారు. నగరంలో 50 డివిజన్లున్నాయి. డివిజన్‌కు 14 మంది కార్మికులుంటారు. ఇంత మంది కార్మికులున్నప్పటికీ ఏ రహదారి చూసినా, ఏ వీధి చూసినా ముక్కుపుటాలు అదరాల్సిందే. యంత్రాంగం, పాలకవర్గం పర్యవేక్షణ కొరవడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. కార్మికులు మొక్కుబడిగా విధులకు హాజరవుతూ మమ అనిపిస్తున్నారు. ఏ డివిజన్‌లో చూసినా 20-30 వీధులే ఉంటాయి. ఒక్కో కార్మికుడు రెండేసి వీధులు శుభ్రం చేసినా సరిపోతారు. కానీ నగరం ఎందుకు కంపుకొడుతోంది? ర్యాంకింగ్‌లో మరీ ఇంత వెనకబడటానికి కారణం ఏమిటి? లోపం ఎక్కడ ఉందో ఇప్పటికైనా ఉన్నతాధికారులు గుర్తించి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది.

చాటపర్రు రోడ్డులో పేరుకుపోయిన కుప్పలు

ప్రజల నుంచి సేకరించిన సమాచారం ఇలా..

ప్రశ్న	అవును	లేదు
1. మీ నగరంలో మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్నారా?	52.8	47.2
2. పారిశుద్ధ్య కార్మికులు రోజూ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా లేదా?	76.4	23.6
3. మీ ఇంటి పరిసరాల్లో చెత్తను 24 గంటల్లోపు తొలగిస్తున్నారా లేదా?	66.1	33.9
4. మీ ప్రాంతంలోని ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుతున్నారా?	62.2	37.8

☛ అన్ని డివిజన్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 5,515 మందికి కాల్స్ చేశారు.
☛ ఇందులో సానుకూలంగా 64.4 శాతం.. ప్రతికూలంగా 35.6 శాతం మంది అభిప్రాయాలు వ్యక్తపరిచారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కార్యక్రమంలో భాస్కరరావు, సూర్యచంద్రరావు తదితరులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆ బ్యాంకు విజయవాడ జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కరరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో గురువారం వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, రిటైల్ రుణాల మంజూరు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన భాస్కరరావు మాట్లాడుతూ విజయవాడ జోన్ పరిధిలోని 67 యూబీఐ శాఖల ద్వారా ఖాతాదారులకు విస్తృత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఇకపై ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, గృహ, విద్యా రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆర్థిక అవసరాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందేవారు వాటిని సక్రమంగా తిరిగి చెల్లించాలన్నారు. యూబీఐ ఏలూరు రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాస్, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు లక్ష్మీనారాయణ, సత్యనారాయణరెడ్డి, ఎల్‌డీఎం డి.నీలాద్రి పాల్గొన్నారు.

ముగిసిన క్రియా యోగా తరగతులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఈనెల 18, 19 తేదీల్లో సుషుమ్న క్రియా యోగా సిటీ సమన్వయకర్త వి.అనుపమ ఆధ్వర్యంలో క్రియా యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. క్రియా యోగా ప్రాముఖ్యత గురించి ఆమె విద్యార్థినులకు వివరించారు. శ్వాసక్రియల ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతిని క్రియా యోగా కలిగిస్తుందని తెలిపారు. కరస్పాండెంట్ ప్రభాకరరావు, ప్రధానాచార్యులు జి.సరళ తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అప్పలనాయుడు తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. కార్యకర్తకు ఏదైనా ప్రమాదంలో ప్రాణ నష్టం జరిగితే పార్టీ తరఫున రూ.5 లక్షల బీమా పాలసీ అందజేస్తామని తెలిపారు. పార్టీలో సభ్యత్వం కోసం రూ.500 చెల్లించాలన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈనెల 26 నుంచి ప్రారంభమవుతుందన్నారు. 18 ఏళ్ల పైబడిన వారు సభ్యత్వాన్ని స్వీకరించవచ్చన్నారు. నాయకులు కె.సాయి తేజస్విని, కె.వాణిశ్రీ, వి.పండు, ఎస్.కాశీనరేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పత్రాల అందజేత

పవరుపేట (ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బడేటి చంటి పవరుపేటలోని తన విడిది కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 30 మందికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.16.8 లక్షల విలువైన చెక్కులు అందించారు. తెదేపా నాయకులు ఆంజనేయులు, శివప్రసాద్, పార్థసారథి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో 35 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.18,26,446 విలువ చేసే చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు వైద్య ఖర్చులు భారం కాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 682 మంది రూ.5,26,48,741 మేర లబ్ధి పొందారన్నారు. నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల

బాదంపూడి (ఉంగుటూరు), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పేదల కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు విమర్శించారు. బాదంపూడి హౌసింగ్ కాలనీలో వీబీ జీ రామ్ జీ పథకం నిధులు రూ.37 లక్షల అంచనా వ్యయంతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి : చింతమనేని

దుగ్గిరాలలో లబ్ధిదారులకు ఎల్‌వోసీలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే : పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ద్వారా స్వచ్ఛమైన నూనె

గానుగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: డీసీఎంఎస్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నూనె అందిస్తున్నామని డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ తెలిపారు. ఏలూరులోని డీసీఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో గానుగ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను గాయపరిచిన ఇద్దరిపై కేసు

పెదపాడు, న్యూస్‌టుడే : మహిళను గాయపరిచిన ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై గజపతిరావు తెలిపారు. గండికొట్టువారిగూడేనికి చెందిన గంగధర సత్యవతికి చెందిన కోళ్లు ఈ నెల 16న కనిపించకుండాపోయాయి. దీంతో ఎవరో కోళ్లను దొంగిలించారని తిడుతోంది. పక్కనే నివాసం ఉంటున్న శేషపు రాజేశ్వరి, ఆమె కుమారుడు గణేశ్ తమనే తిడుతోందంటూ సత్యవతి ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ముండూరు(పెదవేగి)న్యూస్‌టుడే : పెదవేగి మండలం ముండూరుకు చెందిన బి. సత్యవతి(85) స్థానికంగా భర్తతో కలిసి జీవిస్తోంది. ఈ నెల 17న ఇంటివద్ద ఉదయం దీపారాధన చేసుకుంటుండగా చీరకొంగుకు నిప్పు అంటుకోవడంతో తీవ్రగాయాలపాలైంది. కుటుంబం సభ్యులు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందిందని పెదవేగి పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో ఉపాధ్యాయుడు...

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు ఆనపు అప్పారావు (45) గురువారం మృతి చెందారు.

నియంత్రికకు రక్షణ

దెందులూరు, న్యూస్‌టుడే: ప్రమాదకరంగా మారిన నియంత్రికకు అధికారులు రక్షణ కల్పించారు. 'నియంత్రిక.. రక్షణ కల్పించక' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నియంత్రిక చుట్టూ దట్టంగా అల్లుకున్న పొదలు, చెట్లను తొలగించి రక్షణ పనులు చేపట్టారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఏలూరులో శోభాయాత్ర

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఏలూరు ఒకటో పట్టణంలోని రామకోటి ప్రాంగణం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, హిందూ సంఘాల ప్రతినిధులు, చిన్నారులు శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద బజార్, చందనా బ్రదర్స్ కూడలి వరకు డప్పు వాయిద్యాలు, కర్ర సాము, డీజే ధ్వనుల మధ్య ఛత్రపతి శివాజీ వేషధారులతో ఈ యాత్ర కొనసాగింది. ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు, మహిళల కోలాట నృత్యాలు, కర్ర సాము, డీజే ధ్వనులకు ఆనంద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలులోని భాజపా జెండా స్తూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి భాజపా నాయకులు పూలదండలు వేసి నివాళి అర్పించారు. మిఠాయిలు పంచారు. పార్టీ మండల అధ్యక్షుడు బి.మూర్తి, ప్రవీణ్‌పటేల్‌కుమార్, బాదర్వాడ అనీల్‌రాజు, వర్ధినేడి కపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాకపాడు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఉప్పాకపాడులో హైందవి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నవ అశోక్ కుమార్, ఆర్ఎస్ఎస్ ఖండ్ అధ్యక్షుడు జల్లా రమేష్ శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ సేవా సమితి అధ్యక్షుడు మాకా శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం బాలికల ఉన్నత, నెం-1 ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు శివాజీ వేషధారణలో అలరించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఎమ్మెల్యే తల్లి ఇంట్లో చోరీ చేసిన నిందితుడి అరెస్టు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తల్లి ప్రమీలాదేవి ఇంట్లో చోరీ చేసిన నిందితుడు పెదపాడుకు చెందిన రాజేశ్‌ను పొన్నూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి తీసుకెళ్లారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన చాటపర్రు సర్పంచి గుడిపూడి రఘను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

గణపవరం - చేబ్రోలు మధ్య ఆర్టీసీ బస్సులు నడపాలి

నిడమర్రు, న్యూస్‌టుడే: గణపవరం - చేబ్రోలు వయా పత్తేపురం మధ్య ఆర్టీసీ సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రూటులో బస్సులు లేక ఆరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ సర్వీసులు నడవడం వల్ల పెదనింద్రకొలను, దేవరగోపవరం, పత్తేపురం, ఆముదాలపల్లి, భైనేపల్లి, తోకలపల్లి గ్రామాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. గతంలో సర్వీసులు నడిపేవారని.. అటు భీమవరం, తాడేపల్లిగూడెం వెళ్లడానికి అనుకూలంగా ఉండేదని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి సర్వీసులు నడపాలంటున్నారు.

ప్రకటన

నా క్లయింట్లున్ను, నిడమర్రు మండలం, చిననింద్రకొలను, గ్రామ కాపురస్తులున్నూ అయిన (1) పల్లి వెంకట నరసింహారావు (2) పల్లి సుజాత గార్లు నాకు యిచ్చిన సంజాయిషీపై యీ నోటీసు యివ్వడమైనది.

నా క్లయింట్లుకున్ను, నా క్లయింట్లులో 1వ వారి సోదరియైన కచ్చాల విజయగౌరిలక్ష్మి మరియు సదరు విజయగౌరిలక్ష్మి కుమార్తె శీల ప్రసన్నకున్ను నిడమర్రు మండలం చిననింద్రకొలను గ్రామములో ఉమ్మడి చేపల చెర్వు గలదు. సదరు చేపల చెర్వులో, కచ్చాల విజయగౌరిలక్ష్మి మరియు శీల ప్రసన్నలు వారి తాలూకు చేపల చెర్వు భాగమున్ను యితరులకు క్రియమును చేయు ప్రయత్నములో యున్నట్లుగా నా క్లయింట్లుకు తెలియవచ్చిన కారణంగా సదరు చెర్వు భాగమును నా క్లయింట్లు క్రియమును పొందుటకు ఆసక్తి చూపుచున్నట్లుగా సదరు కచ్చాల విజయగౌరిలక్ష్మి, శీల ప్రసన్నలకు తమ అడ్వకేట్ గారితో రిజిష్టర్డు నోటీసు పంపియున్నారు. సదరు చెర్వు భాగమును క్రియమును పొందుటకు నా క్లయింట్లు చట్టప్రకారం హక్కును కల్గియున్నారు. కావున యితర వ్యక్తులు ఎవరు క్రియమును పొందినను అట్టి క్రియములు అన్యాక్రాంతములు చెల్లవని, నా క్లయింట్లు హక్కులకు భంగము కల్గింపవని యిందుమూలముగా నా క్లయింట్లు సంజాయిషీపై యావన్మందికి తెలియచేయడమైనది.

సం/- కాళ్ళకూరి కుసుమహరనాథ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, సెల్: 99639 54564

అల్లాను భక్తిశ్రద్ధలతో కొలవాలి

పెదబాబుకు సత్కారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక గడియారపు స్తంభం కూడలిలోని సవాయి చౌక్ మస్జీద్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలుండి భక్తిశ్రద్ధలతో అల్లాను కొలుస్తారన్నారు. ఈ సందర్భంగా మస్జీద్ పెద్దలు ఎగ్బాల్, షేక్ సాబీర్, ఆజు, అంజిద్, మస్తాన్ పెదబాబును సత్కరించారు.

'విద్యార్థుల హక్కులను కాలరాయడం తగదు'

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల హక్కులు కాలరాయడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత కొంతకాలంగా ఆర్ఎస్ఎస్ సంబంధిత కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. ఇలాంటి కార్యకలాపాలను అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరినప్పుడు ఏబీవీపీ జెండాలతో వచ్చిన బయటి వ్యక్తులు విద్యార్థి నాయకులపై దాడి చేయడం హేయమన్నారు. సంఘ నాయకులు శివాజీ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

ఐఎస్‌బీ బృందం పర్యటన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) బృంద సభ్యులు గురువారం కైకరం, ఉంగుటూరులో పర్యటించారు. కైకరంలో గీత స్వయం సహాయక సంఘం, ఉంగుటూరులో గాయత్రి స్వయం సహాయక సంఘంలోని మహిళలతో సమావేశమయ్యారు. ఎంత మేర రుణాలు తీసుకున్నారు? ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారు, భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు కావాలి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీపీఎం పార్థసారథి, ఏపీఎం ప్రభావతి పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు మానవత ప్రతినిధుల నివాళి

గణపవరం, న్యూస్‌టుడే: మానవత సంస్థ తరఫున ఉభయ గోదావరి జిల్లాల విద్యా కమిటీ ఛైర్మన్‌గా 12 ఏళ్లు విశేష సేవలు అందించిన నాగేశ్వరరావు మృతి సమాజానికి తీరని లోటని ఆ సంస్థ గణపవరం ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక వర్తక సంఘ భవనంలో నాగేశ్వరరావు చిత్రపటానికి ఆ సంస్థ ప్రతినిధులు గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గంటా అన్నవరం, బుద్ధారపు పుల్లయ్య, కాకర్ల వినాయకం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి సాయం

దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు హైస్కూల్‌లో 1982లో పదో తరగతి చదివిన ఎం.దామోదరం(సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్) పాఠశాలపై మక్కువతో రూ.70 వేలతో గతంలో నాడు నేడులో నిర్మించిన తరగతి గదికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేశారు.

ఆస్పత్రి ప్రాంగణంలో సిమెంటు రోడ్డు నిర్మాణం

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే ఏపీఎంఎస్ఐడీ నిధులు రూ.40 లక్షలతో సిమెంటు రహదారి, వీధి దీపాలు, జనరేటర్, ఇతర నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

వేలం ద్వారా ఆలయానికి ఆదాయం

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఏలూరు మార్కండేయ ఓంకారేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన తంగెళ్లమూడిలోని భూమిని 11 సంవత్సరాల లీజు కోసం దేవాదాయ శాఖ చట్టం ప్రకారం గురువారం వేలం వేయగా ఏడాదికి రూ.1,16,000 ఆదాయంగా ఇచ్చినట్లు ఈవో బి.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చాటపర్రు సెక్షన్ 11 కేవీ కొమడవోలు - సాయినగర్ ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం సరఫరా నిలిపి వేస్తామని ఈఈ కె.ఎం.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమడవోలు, హమాలీకాలనీ, దుర్గాగ్రాండ్ సిటీ, అండాలమ్మతోట, రామానగర్, మారుతీనగర్, మస్తాన్‌మన్యం కాలనీ, నాగేంద్రకాలనీ, చెంచులకాలనీ, కొమడవోలురోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు.

పెదపాడు, న్యూస్‌టుడే : పెదపాడు సెక్షన్ పరిధిలోని పాతముప్పర్రు, పెదపాడు విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు ఉప కేంద్రాల పరిధి గ్రామాల్లోని రైతులు, వ్యాపారులు, విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏపీటీఎఫ్(1938) నూతన కార్యవర్గం ఎన్నిక

భీమడోలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్-1938 భీమడోలు మండల శాఖ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘ భీమడోలు మండలశాఖ అధ్యక్షుడిగా కె.రఘురామరాజు, ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి నాగరాజు, జిల్లా కౌన్సిలర్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి కె.మోహన్, టి.రాహుల్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింటు కొసరాజు దుర్గా ప్రసాదు (ఫోన్ నెం. 95731 40226) గారు యిచ్చిన సంజాయిషీ మేరకు తెలియ చేయునది. వారి తాలూకు అనగా వారి సోదరుడు కొసరాజు శ్రీనివాసు జిపిఎ ద్వారా వారికి హక్కు కల్పించిన కొప్పాక గ్రామంలోని ఆర్.ఎస్.నెం.591/5రు దాఖలా య. 1.17 ట్లు భూమి పారీఖత్తు దస్తావేజు నెం. 988/2011రు దాఖలా ఆస్తిని వారు వట్లూరు నుండి పెదకడిమికి తన మోటారు సైకిలుపై ది. 11-02-2026 తేదీన ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో జారి పడిపోయినవి. కావునా సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవ్వరికైనా దొరికిన ఎడల నా క్లయింటుకు లేదా నాకు అంద చేయవలసినదిగా కోరుచున్నాను.

ఏలూరు,
19-2-2026

సం/- కె.కృష్ణమాచార్యులు
న్యాయవాది, ఏలూరు, ఫోన్: 94401 16456

రథం తయారీకి విరాళం

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలోని సుందర సీతారామ స్వామి కళింగ రామాలయానికి తయారు చేస్తున్న అష్టభుజ రథానికి రూ.1,01,116 విరాళం సమకూరింది. కైకరానికి చెందిన కూన సన్యాసిరావు-ప్రభావతి దంపతుల జ్ఞాపకార్థం వారి మనవడు కిరణ్ మారుతి ఈ విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామదాసు, అధ్యక్షుడు రంగారావుకు గురువారం అందజేశారు.

చెక్కు అందజేస్తున్న కిరణ్ మారుతి

శిరస్త్రాణం భారం కాదు.. బాధ్యత

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదని.. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని చేబ్రోలు ఎస్సై మామిడాల సూర్యభగవాన్ సూచించారు. స్థానిక టోలు గేటు వద్ద గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించకుండా శిరస్త్రాణం కొనుగోలు చేయించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై సూర్యభగవాన్

అదుపు తప్పితే ముప్పే

పెదపాడులో ఇటీవల ర.భ.శాఖ రహదారిలో అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారిని నిర్మించారు. అంచుల్లో మట్టి పోయకుండా వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మలుపులో సీసీ రహదారి అంచులో మట్టి పోయకపోవడంతో పాటు అక్కడ పంటకాలువ ఉండటంతో వాహనదారులు అంచు వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి అంచుల్లో మట్టి పోసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదపాడు**

పనిభారం తగ్గించాలంటూ నిరసన

పెదపాడు, న్యూస్‌టుడే : పని భారం తగ్గించాలంటూ పెదపాడు తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్వోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నాలుగో రోజు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పనిభారం తగ్గించి వీఆర్వోలపై అన్నిరకాల ఒత్తిళ్లు తగ్గించాలని డిమాండ్ చేశారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న వీఆర్వోలు

17 వ వర్ధంతి

మా తండ్రిగారైన
శ్రీ దేవినేని బసవరావు గారు
మా నుండి దూరమై 17 సంవత్సరాల
కాలం అయిననూ
మీరు లేవను వేళ మీ జ్ఞాపకాలన్నీ
చేరి మా మనసులో చింత బాపు..
మీ నోటి పలుకులే ఏ నాటికీ మాకు
కాంతులై మాలోని కలత మాన్పు..
మీరు నడిచిన జాడ మా వెలుగు దివ్వెగా
కారు చీకటిలోన దారి చూపు
వర్షించు మీ ప్రేమ హర్షమై మము తాకి
చిరునవ్వులై మాకు సేదతీర్చు..

కీ॥శే॥ దేవినేని బసవరావు గారు
ఏలూరు
జననం: 6-1-1930, మరణం: 20-2-2009

కుమారుడు: దేవినేని వెంకటేశ్వర కుమార్ - కోడలు: శ్రీమతి మంజులత
మనుమలు: దేవినేని స్రుజన్ చౌదరి, దేవినేని జ్ఞానదీప్
మరియు కుటుంబ సభ్యులు, ఏలూరు, సెల్: 94401 88774

చింతలపూడి

•చింతలపూడి • పోలవరం

గూటాల ఆలయ కార్యనిర్వహణాధికారిగా శర్మ

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఎం.ఎస్. శర్మ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఈవో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతిపై కాకినాడ వెళ్లారు. రాజమహేంద్రవరంలో పనిచేస్తున్న శర్మకు గూటాలతో పాటు పోలవరం సీతారామస్వామి, కడెమ్మ అమ్మవారి ఆలయాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

అన్నసమారాధన

కామవరపుకోట, న్యూస్‌టుడే: తడికలపూడి గాంగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా దేవస్థానం భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట ప్రధాన వీధిలో గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సర్పంచి అనూష, విద్యా కమిటీ ఛైర్మన్ దివాకర్, ఉపాధ్యాయులు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మద్యం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు నాయకులు

జగదాంబ ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

వేలేరుపాడు(జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలో ఈ నెల 23 నుంచి నిర్వహించే జగదాంబ ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి పక్కనున్న అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. మార్చి 2 వరకు వారం రోజుల పాటు నిత్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఉమా సహిత రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణం బైనేరు ఒడ్డున ఉన్న ఉమా సహిత రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని తేలీల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హారతులు పట్టారు.

శ్రీవారి సేవలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు గురువారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో శ్రీవారి చిత్ర పటాన్ని బహూకరించారు.

శ్రీనివాసులుకు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో భద్రాజీ

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

చింతలపూడి పట్టణం, కొయ్యలగూడెం గ్రామీణ, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో చింతలపూడిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచార నాయకుడు విశ్వనాథ్ మాట్లాడుతూ హిందు ధర్మాన్ని కాపాడాలన్నారు. అనంతరం పాత బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ● సనాతన ధర్మ పరిరక్షణలో ఛత్రపతి శివాజీ ఆశయాలు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. బయ్యనగూడెం గ్రామదేవత పతువులమ్మ గుడి వద్ద విశ్వహిందూపరిషత్తు గ్రామకమిటీ ఆధ్వర్యంలో శివాజీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశభక్తిని కొనియాడారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ బాబూరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. ● ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను వేలేరుపాడులో హిందూ బంధువులు అంబేడ్కర్ సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేశారు.

చింతలపూడి: ర్యాలీలో పాల్గొన్న హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు

ఇంకుడు గుంతలు.. కళ్లకు గంతలు!

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా పనులు

పోలవరం, న్యూస్‌టుడే: భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వాలు నిర్దేశించిన ఇంకుడు గుంతల పనులను ఇష్టారాజ్యంగా చేసినా.. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని మిన్నకున్నారు. పోలవరం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద రూ.లక్షలతో నిర్మించిన ఇంకుడు గుంతలు నిరుపయోగంగా మారాయి. పనులు పూర్తికాకపోయినా అధికారులు మాత్రం సంబంధిత గుత్తేదారులకు బిల్లులు చెల్లించడం గమనార్హం.

కుంకాలలో శ్లాబ్ దిగువ వరకు అమర్చిన గొట్టం

30 కేంద్రాల వద్ద.. 2024-25లో పక్కా భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించారు. భవనాల శ్లాబ్‌లపై పడే వర్షపు నీరు వృథాగా పోకుండా దిగువన నిర్మించిన ఇంకుడు గుంతల్లోకి చేరేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూపకల్పన చేశారు. ఒక్కొక్క కేంద్రం వద్ద రూ.30 వేల చొప్పున ఖర్చు చేసి సుమారు 30 అంగన్‌వాడీ భవనాల వద్ద ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాల్లో ఎక్కువగా నిర్మాణాలు చేశారు.

పనులు ఇలా.. ఇంకుడు గుంతలోకి వర్షపు నీరు వెళ్లేలా గొట్టాలను శ్లాబ్ వరకు అమర్చారు. కానీ దానికి రంధ్రం చేయకుండా పనులు ఆపివేశారు. నీరు ఈశాన్యంవైపు వెళ్లేలా శ్లాబ్‌ల నిర్మాణం చేయడం సహజం. ఇంకుడుగుంతలు కూడా అటువైపు నిర్మించి గొట్టాలను అమర్చాల్సి ఉంది. కానీ కొన్నిచోట్ల మెరకగా ఉన్న వైపు గుంతలు తవ్వడంతో నీరు అక్కడికి చేరడం లేదు. దీంతో నీరు అటు గొట్టం ద్వారా ఇంకుడు గుంతకు చేరే మార్గం లేక యథావిధిగా వృథాగా పోతోంది. మండలంలో అన్నిచోట్ల ఇదే పరిస్థితి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజును సంప్రదించగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..	జంగారెడ్డిగూడెం: 80085 74478
	కొయ్యలగూడెం: 80085 74947
	చింతలపూడి: 76759 19086

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ? టి.నరసాపురం నుంచి బంధంచర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తి చేయకుండా వదిలారు. అది ఛిద్రంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-కె.నాగేశ్వరరావు, బంధంచర్ల**

✔ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

- సుందర్రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ, టి.నరసాపురం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం వెలమపేటలో డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం.

-సంతోష్‌కుమార్, స్థానికుడు

✔ త్వరలో పట్టణంలో డ్రెయిన్ల నిర్మాణం చేపడతాం. దోమల మందు పిచికారీ చేస్తాం. **-రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల సమస్యల పరిష్కార సాధనకు ప్రత్యేక కృషి చేస్తానని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి హామీ ఇచ్చారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. అధ్యాపకులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుట్టాయగూడెం శివారున అసంపూర్తిగా నిలిచిన డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయించేందుకు విద్యాశాఖ దృష్టికి తీసుకువెళతానన్నారు. ప్రిన్సిపల్ మణేంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ మద్రి వెంకటేశ్వరరావు, సీనియర్ అధ్యాపకుడు అక్కులన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కేఆర్‌పురం ఐటీడీఏను సందర్శించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీవో రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. భాషా పండితులకు త్వరితగతిన ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

పీవో రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

కర్మకి వచ్చి.. అనంతలోకాలకు

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎండపల్లికి చెందిన బర్రె వంశీ(25) అక్కడికక్కడే మృతి చెందాడు. పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం దశదినకర్మకు మృతుడు హాజరయ్యాడు. మధ్యాహ్నం విందు అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలోని అత్తగారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, సంవత్సరం పాప ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తొరపాటి వేణుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.90,767 మంజూరయ్యాయి. ఈ నగదు చెక్కును వేణు భార్యకు తెదేపా మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ✦ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రాజవరం, పరింపూడి, బయ్యనగూడెం గ్రామాలకు చెందిన ముగ్గురికి వైద్య ఖర్చుల నిమిత్తం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.94 లక్షలు మంజూరైనట్లు తెదేపా కొయ్యలగూడెం మండల అధ్యక్షుడు పారేపల్లి రామారావు తెలిపారు. బయ్యనగూడెంలో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు గురువారం ఆయన చెక్కులను పంపిణీ చేశారు.

చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు, సత్యనారాయణ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వీరభద్రవరంలో ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న ముగ్గురు వ్యక్తులకు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు మంజూరైంది. ఈ మేరకు గంటా వెంకటేశ్వరరావుకు రూ.85 వేలు, ఇందుర్తి సాయికి రూ.78 వేలు, పోశారపు సిద్ధియ్యకు రూ.55 వేల విలువైన చెక్కులను తెదేపా రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ శీలం సాయివినయ్, సర్పంచి జలపాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు తీరిన దాహార్తి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కన్నాపురం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు సత్యసాయి మంచినీటి పథకం నుంచి ఏర్పాటు చేసిన కుళాయిలను ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఇప్పటికే ఉన్న బోరు, చేతి పంపుల నుంచి నీరు వస్తున్నా విద్యార్థులు తాగడానికి పనికిరావడం లేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అభ్యర్థన, సర్పంచి ఉప్పల పద్మావతి చొరవతో సత్యసాయి మంచినీటి పథకం ద్వారా గోదావరి జలాల సరఫరా నిమిత్తం సుమారు 300 మీటర్ల మేర పైపులైను నిర్మించారు. ఎంపీటీసీ సభ్యులు బాజీ, గణపతి, పంచాయతీ కార్యదర్శి చెంచమ్మ, ప్రధానోపాధ్యాయుడు డీఎన్ వీరామారావు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక అమలుపై సమీక్ష.. జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు తీరుపై ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులతో సమీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. భోజన వంటశాలలో ఆహార పదార్థాలను రుచి చూశారు.

బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవడం తగదు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నౌకాదళ ఆయుధ డిపో ఏర్పాటు పేరుతో వెనుకబడిన వర్గాలకు చెందిన భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరాం అన్నారు. మండలంలోని ప్రతిపాదిత ఆయుధ డిపో నిర్మాణ ప్రాంతాల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుల బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. బోడిగూడెం, ఊట్లగూడెం, బర్కిట్ నగరం, మంగపతిదేవిపేట గ్రామాల రైతులు తమ సమస్యలను కమిటీ సభ్యులకు వివరించారు. రెండు పంటలు పండే భూములను కేసులు పెట్టి స్వాధీనం చేసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, శుక్లబోయిన రాంబాబు, మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న బలరాం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బండివారిగూడెం గ్రామానికి చెందిన రాయల శ్రీను (41) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో ఉంటున్నారు. అతను మద్యానికి బానిసై భార్యతో గొడవపడి రెండు నెలల క్రితం సొంతూరు బండివారిగూడెం వచ్చాడు. ఒంటరిగా ఉంటున్నాననే బాధతో ఈనెల 17న పురుగుల మందు తాగాడు. బంధువులు అతన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. మృతుడి భార్య వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పోలవరం, కృష్ణారావుపేట, రామయ్యపేట పరిధిలోని ప్రాంతాలకు కరెంటు ఉండదన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కన్నాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వాసవీక్లబ్‌కు చెందిన వాసవీ ఫ్రెండ్స్ దీపావళి టీమ్ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి చెందిన వైద్యులు పాల్గొని ఎముకల సమస్యలు, కంటి వైద్యం, స్త్రీలు, పిల్లలు, చర్మ సంబంధిత వ్యాధులతోపాటు చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్స అందజేస్తారని చెప్పారు. సాధారణ పరీక్షలతోపాటు అల్ట్రా సౌండ్ స్కానింగ్, క్యాన్సర్‌కు సంబంధించిన పాప్‌స్మియర్, స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

తగలబడుతున్న చెట్లు

పోలవరం, న్యూస్‌టుడే: ఎండలు తీవ్రస్థాయికి చేరకముందే కొండల్లో చెట్లు తగలబడటం ప్రారంభమైంది. పోలవరం సమీపంలో పాండురంగడి ఆలయ పరిసరాల్లో మూల లంక భూములను ఆనుకుని ఉన్న కొండల్లో గురువారం రాత్రి అగ్ని జ్వాలలు పోలవరం గ్రామస్థులకు జ్వాలాతోరణంలా కనువిందు చేస్తూ కనిపించాయి.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

చింతలపూడి, న్యూస్‌టుడే: రెవెన్యూకు సంబంధించిన విధులు మాత్రమే కేటాయించాలని, పని ఒత్తిడి తగ్గించాలని రెవెన్యూ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో కనుమూరి శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీనివాసరావు, ముత్యాలరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యల వలయం.. సరస్వతీ నిలయం!

వసతులు లేక ఇంటర్ విద్యార్థుల అవస్థలు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలకు నిలయంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు సరైన బల్లలు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, రెగ్యులర్ అధ్యాపకులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది.

ఓ పక్క వంట.. మరో పక్క నేలపై చిందరవందరగా పుస్తకాలు

ఒప్పంద అధ్యాపకులే దిక్కు.. వేలేరుపాడులో 24 ఏళ్ల కిందట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 114 మంది చదువుతున్నారు. ఇక్కడ సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ సబ్జెక్టులు ఉండగా, ప్రిన్సిపల్ మినహా మిగిలిన తెలుగు, ఆంగ్లం, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, సివిక్స్, కామర్స్ సబ్జెక్టులు ఒప్పంద అధ్యాపకులు బోధిస్తున్నారు. దీంతో పాటు లైబ్రేరియన్, అటెండరు, నైట్‌వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒప్పంద అధ్యాపకులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు.

పడరాని పాట్లు.. భవనం శ్లాబ్ నుంచి వర్షం కురుస్తుండటంతో వర్షాకాలంలో తడుచుకుంటూ చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి. గ్రంథాలయంలో బీరువాలు ఏర్పాటు చేయకపోవడంతో పుస్తకాలకు భద్రత లేకుండా పోయింది. మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేక విద్యార్థినులు పడరాని పాట్లు పడుతున్నారు. గత కొన్నేళ్ల కిందట ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసినప్పటికీ దాని నుంచి ఎన్నడూ శుద్ధిజలం సరఫరా అయిన దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి సీసాలతో నీటిని తెచ్చుకొని గొంతులు తడుపుకొంటున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా.. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులు ఇక్కడ విందులు చేసుకుంటున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్ల తలుపులు, కిటికీలు, తాగునీటి పైపులు పగలగొడుతున్నారు. సీసీ కెమెరాలు సైతం అపహరించుకు పోయారు. దీంతో అధ్యాపకులు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా..ఫలితం లేకుండా పోయింది. 'అధ్యాపకుల పోస్టుల భర్తీతో పాటు మిగిలిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం' అని డీవీఈవో శేఖర్ బాబు తెలిపారు.

గొంతు తడవాలంటే.. నీరు తెచ్చుకోవాల్సిందే!

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగు నీటి కోసం రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆసుపత్రిలో కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన శుద్ధి జల పరికరం గతేడాది మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి దాని గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు సీసాలతో నీటిని తెచ్చుకొని గొంతులు తడుపుకొంటున్నారు. దీనిపై కేఆర్‌పురం డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

నిరుపయోగంగా శుద్ధి జల పరికరం

పొంచి ఉన్న ప్రమాదం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడు కన్నాపురం మార్గంలో తూర్పుకాలువపై నిర్మించిన వంతెన అప్రోచ్ రెయిలింగ్ దిగువన కోతకు గురైంది. మట్టి దిగువకు కొట్టుకుపోవడంతో అక్కడ ప్రమాదకరంగా పెద్ద రంధ్రం పడింది. రెండోవైపున వంతెన రెయిలింగ్ కొంత మేర దెబ్బతింది. కన్నాపురం మీదుగా పోలవరం వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. కోతకు గురవుతోన్న అప్రోచ్, దెబ్బతిన్న రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ జంగారెడ్డి గూడెం డీఈఈ హరికృష్ణ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

పరవళ్లు తొక్కిన గోదావరి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పనుల కోసం 902 కొండ సమీపంలో మహానందీశ్వర స్వామి ఆలయం ఎదుట భారీ వాహనాల రాకపోకలకు వీలుగా గోదావరికి స్పిల్ ఛానల్ వద్ద అడుగున తూరలు పెట్టి పైన నిర్మించిన రోడ్డుకు బుధవారం సాయంత్రం అధికారులు గండి కొట్టించారు. ఇటీవల పట్టిసీమ వద్ద జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గోదావరిపై భక్తులు కాలినడకన రాకపోకలకు వీలుగా పంటులు ఏర్పాటుకు నీటి ప్రవాహం ఆటంకం కలిగిస్తోందని ఉత్సవ కమిటీ జలవనరులశాఖ అధికారులకు తెలియజేయడంతో స్పిల్‌వే వద్ద నీటిని కట్టడి చేశారు. దాంతో వెనుక భాగంలో నీరు పెరగడం, ఈలోగా ధవళేశ్వరం వద్ద డెల్టా కాలువలకు నీటి ఎద్దడి తలెత్తడంతో పనుల కోసం వేసిన రోడ్డుకు అధికారులు గండి కొట్టించారు. నీరు త్వరగా చేరుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దాంతో గండి ద్వారా గోదారమ్మ దిగువకు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది.

WANTED
మా WHEELS ZONE కంపెనీ కొయ్యలగూడెం బ్రాంచిలో
సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ -03 (MALE)
పని చేయుటకు కావలెను
జీతం: Rs: 15k, విద్యార్హత: ఇంటర్
ONLINE ఇంటర్వ్యూ
Opp:SBI, నల్లజర్ల రోడ్డు.
77990 28444

శ్మశాన వాటికల అభివృద్ధికి సహకరించండి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి స్థానికులందరూ సహకరించాలని టి.నరసాపురం పీఏసీఎస్ ఛైర్మన్ జొనుబోయిన సోంబాబు అన్నారు. గ్రామస్థుల విరాళాలు సుమారు రూ.20 లక్షలతో అభివృద్ధి చేసిన స్థానిక హిందూ శ్మశాన వాటికను గురువారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన శివుడు, హరిశ్చంద్ర విగ్రహాలను, మోటారు, ట్యాంకును పెద్దలు ప్రారంభించారు. గత మూడేళ్లుగా శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేసిన కటకం కొండ, కమ్మిల రమేశ్‌రాజు, సురేశ్‌రాజులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి సునంద, పెద్దలు పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీనివాసపురంలో డా.బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దూ మాదిగ అన్నారు. ఈ మేరకు ఆ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు డి.శ్రీను అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఆక్రమణకు గురైన స్థలంలో జరుగుతున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని సిద్దూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తగరం నాగరాజు, కొండపల్లి రాంబాబు, కలపాల శివాజీ పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

'వసతిగృహ స్థలంలో దుకాణ సముదాయం వద్దు'.. **బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెంలోని గిరిజన కళాశాల బాలుర వసతి గృహానికి సంబంధించిన స్థలంలో దుకాణ సముదాయాన్ని నిర్మించవద్దని పలువురు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నే వినోద్ అధ్యక్షతన బుట్టాయగూడెంలో గురువారం నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఐటీడీఏ నాయకులు ఏకపక్ష నిర్ణయాలు చేయడం సమంజసం కాదన్నారు. సరియం రామ్మోహన్, తగరం బాబూరావు, కాకి నాని, అందుగుల ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో మహాజన సభ సమావేశం.. జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మహాజన సభ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గంధం గోపాలకృష్ణ మాట్లాడుతూ సొసైటీ జమా ఖర్చుల ఆమోదం, 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్, 2023-24లో సంఘం సభ్యులకు షేరుధనంపై డివిడెండ్ చెల్లింపు తదితర అంశాలను సమావేశంలో ఆమోదించామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఎలికే సర్వేశ్వరరావు, మాజీ ఛైర్మన్ పోల్నాటి బుజ్జిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వంటల పరిశీలన.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని నవభారత్ ఆయిల్ పామ్ కర్మాగారంతో నష్టం కలుగుతున్న పంటలను కాపాడాలంటూ రైతు బొప్పన మోహన్‌మురళి కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మోహన్‌మురళి, పలువురు రైతులకు సంబంధించిన పుచ్చ, ఆయిల్‌పామ్ తోటలను మండల ఉద్యానశాఖాధికారి ధీరజ్ గురువారం సందర్శించారు. కర్మాగారం నుంచి వెలువడుతున్న నల్లరంగు బూడిదను పరిశీలించారు. సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.

ఆటో స్టాండ్ ప్రారంభం.. వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: భూదేవిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ఆటో యూనియన్ స్టాండ్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 మంది ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరారని, యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా కమ్మిచ్చు రమేశ్ ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం పెద్దవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్ఐ భుజంగరావుకు వినతిపత్రం అందించారు.

గంగరాజు మృతి ఉపాధ్యాయులకు తీరని లోటు.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొడియం గంగరాజు ఆకస్మిక మృతి ఉపాధ్యాయులకు తీరని లోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. మెట్టగూడెంలో గురువారం నిర్వహించిన గంగరాజు సంతాపసభలో గోపీమూర్తి, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తెల్లం రాములు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరియం నాగేశ్వరరావు, కుంజా రమేశ్ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

శిరస్త్రాణం ధరించడం తప్పనిసరి

వేలేరుపాడు(జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై క్రాంతి కుమార్ సూచించారు. ఈ మేరకు జీలుగుమిల్లిలో గురువారం ద్విచక్ర వాహన చోదకులకు శిరస్త్రాణం ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న పలువురు చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై క్రాంతికుమార్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరించి వాహనాలను నడిపితే ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ప్రాణాలకు రక్షణ ఉంటుందని కొయ్యలగూడెం ఎస్సై వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో సిబ్బందితో కలిసి గురువారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడుపుతున్న 18 మంది ద్విచక్ర వాహన చోదకులను గుర్తించి వారికి హితబోధ చేశారు. వారితో అప్పటికప్పుడు శిరస్త్రాణాలను కొనుగోలు చేయించారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.P.No.109/2021
AC No.240/2021
Between
M/s. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్‌కంపెనీ లిమిటెడ్, జంగారెడ్డిగూడెం
Rep By G.P.A Holder ...DHR
మరియు
1) శ్రీ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ Rep By సింహాద్రి N.V.S.D వంశీకృష్ణమనోజ్ S/o. కిషోర్ కుమార్, డోర్‌నెం.306,1st Floor, Madavi Towers-3, జంగారెడ్డిగూడెం ...JDRs
2) సింహాద్రి వెంకటరామవాణి W/o. కిషోర్ కుమార్, డోర్‌నెం.306.1st Floor, Madavi Towers-3,జంగారెడ్డిగూడెం...JDRs
వేలం తేది :10.03.2026
పై నెంబరుగల E.P.బాకీకిగాను 2వ JDR తాలుకు ఐటమ్ నెం.1 E.P. షెడ్యూలు ఆస్థిని ది.10.03.2026తేదిన ఉదయం10.30 లగాయితు పై కోర్టు వారి ఎదుట వేలం జరుగును. వేలం నందు పాటపాడు కోదలచిన వారు వేలపు షరతులు కోర్టు నజారత్ నందు గాని అడిగి తెలుసు DHR ప్లీడరు గారి ఆఫీసు నందు గాని తెలుసుకోగలరు.
షెడ్యూలు : West Godavari District, Jangareddy gudem Mandalam, Jangareddygudem Sub-D, Jangareddy gudem Grama Panchyat area, Jangareddy gudem Village, zyryothi Land R.S.No.592 an extent of AC.1.52 cents out of total Ac. 15.15 Cents is equal to 0.615 Ht. of land is Bounded by: East : Land of Solasa Venkata sita ramamohan Rao, South : Land of Solasa Venkata Rama Nagendra Krishna Rao, West : Land of Patnala Nagamani, North: Land of Solasa Venkata Govinda Somerswara Rao.
Total extent of Ac.1.52 cents & with all ease mentary rights over the schodule property including way lot out as useal
DHR Value : Rs.30,00000/-
Amin value: Rs.32,00,000/-
J DR value : Nill
M.S.S.Chakrapani Advocate
Kovvur, Cell : 9347626845

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

సైబర్ వలకు చిక్కితే చిత్తే!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాశకు పోయి సైబర్ దొంగల వలకు చిక్కితే జీవితం నాశనమవుతుందని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. శోభనాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్‌టచ్ - బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, లోన్ యాప్స్, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాల్లో గోల్డెన్ అవర్ కీలకం అన్నారు. ర్యాగింగ్ మహమ్మారితో మనోవేదనకు గురవుతారని, ఉజ్వల భవిత చిత్తు అవుతుందని అన్నారు. స్మార్ట్ ఫోన్లలో శక్తి యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని, అత్యవసర సేవలకు-112, సైబర్ నేరాల నివారణకు -1930, బాల్య వివాహాల నివారణకు-1098, ఏలూరు జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్-9550351100ను సంప్రదించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయిని యామినీకుమారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	80085 74698	ఆగిరిపల్లి	9121229090
ముసునూరు	93983 81268	చాట్రాయి	8008574700
కైకలూరు	73060 88555	మండవల్లి	8106099008
కలిదిండి	90594 84862	ముదినేపల్లి	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని రాచపట్నం రామాలయం వీధిలో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీనిపై స్థానికుడు విక్రమ్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్య పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె వెలగని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

నిధులున్నాయి.. అనుమతుల్లేవ్!

ఏడాదిన్నరగా నిలిచిన పనులు

ధ్వంసమైన సూరేపల్లి-గొల్లగూడెం రోడ్డు

చాట్రాయి, న్యూస్‌టుడే: తుమ్మగూడెం వయా సూరేపల్లి, గొల్లగూడెం(3 కి.మీ.) రహదారికి ఏడాదిన్నర క్రితం రూ.2.60 కోట్లు నిధులు మంజూరు కాగా గుత్తేదారుకు పని కేటాయించారు. పనులు చేపట్టిన సమయంలో అటవీ శాఖ అభ్యంతరంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. నాటి నుంచి పురోగతి లేదు.

ఎన్నో గ్రామాలకు మేలు.. మర్లపాలెం, టి.గుడిపాడు, పోలవరం, తుమ్మగూడెం, చిత్తపూరు-కమ్మటూరు, జయపురం ఇతర శివారు గ్రామాల ప్రజలు నూజివీడు వెళ్లేందుకు ఇది దగ్గరి రోడ్డు. చిత్తపూరు మీదుగా వెళ్లే రహదారి ధ్వంసమైంది. ఈ రోడ్డులో చుట్టూ తిరిగి వెళ్లాలి. సూరేపల్లి రోడ్డులో లీలానగర్ మీదుగా నూజివీడు చేరుకోవచ్చు.

అటవీ అభ్యంతరాలే అడ్డంకి..

పనులకు అటవీ శాఖ అభ్యంతరాలే అడ్డంకి అని డీఈ రవికుమార్ తెలిపారు. జిల్లా అధికారులను కలిసి ప్రజల రోడ్డు కష్టాలు తెలిపామన్నారు. అనుమతి లేకుండా పని చేస్తే యంత్రాలు సీజ్ చేస్తామనే హెచ్చరికతో గుత్తేదారు ముందుకు రాలేదన్నారు. స్థానిక నాయకులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై నూజివీడు రేంజర్ సత్యనారాయణను వివరణ కోరగా.. సూరేపల్లి రోడ్డుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు దస్త్రం పంపినట్లు చెప్పారు.

నేతలే దాతలైన నాడు.. తొలగదా తూడు

- ఎమ్మెల్యే కామినేని, రైతుల చొరవ
- రూ.1.5 కోట్ల సొంత నిధుల వినియోగం

పుల్లప డ్రెయిన్ నేడు

కలిదిండి, న్యూస్‌టుడే: కైకలూరు నియోజకవర్గంలోని ముంపు డ్రెయిన్ల మొత్తం కలిదిండి... పొలాలు, లోతట్టు గ్రామాలకు ముంపు భయం తప్పింది. ప్రభుత్వ నిధులకు తోడు ప్రజా ప్రతినిధులు దాతలుగా మారితే ఎంతటి సత్ఫలితాలు సాధించవచ్చో హాయిలొలుకుతూ సాగుతున్న కాలువలు చాటి చెబుతున్నాయి. కామినేని శ్రీనివాస్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ముంపు, పంట కాలువల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వీటి నిర్వహణ బాధ్యతను నీటి సంఘాల ప్రతినిధులకు అప్పగించారు. తూడు, కిక్కిస తొలగింపునకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. అవి సరిపోకపోవడంతో ఎమ్మెల్యే కామినేని రూ.1.20 కోట్లు సొంత డబ్బు వెచ్చించారు. పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు దాతలుగా మారి రూ.30 లక్షలు అందించారు. సమిష్టి శ్రమదానంతో మురుగు కాలువలు ప్రక్షాళన చేశారు.

లబ్ధి ఇలా..

జిల్లాలు	ఏలూరు, కృష్ణా	ఆయకట్టు	2 లక్షల ఎకరాలు
మండలాలు	కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, బంటుమిల్లి, కృత్తివెన్ను	విస్తీర్ణం	135 కిలోమీటర్లు
మండలాలు	కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, బంటుమిల్లి, కృత్తివెన్ను	ఏడీఎమ్ఎఫ్ నిధులు	రూ.2 కోట్లు
గ్రామ పంచాయతీలు	118		
మురుగు డ్రెయిన్లు	పుల్లప, పెదకొమ్ముల్లేరు, చినకొమ్ముల్లేరు, కైకలూరు, మోటూరు, పెదలంక డ్రెయిన్, లాల్వ		

ఎమ్మెల్యే సహకారంతో

ఎమ్మెల్యే కామినేని సొంత నిధులు సమకూర్చడం, నీటి సంఘాల ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సహకారంతో ఎనిమిది మేజర్ మురుగు కాలువలు శుభ్రం చేశాం. మరో నాలుగు పనులు త్వరలోనే పూర్తి చేస్తాం' అని డ్రెయినేజీ శాఖ కైకలూరు సబ్ డివిజన్ డీఈఈ మరడాని రామకృష్ణ తెలిపారు.

ఇదేం ఆహారం.. మీ పిల్లలకు ఇలా పెడతారా!

ఎస్టీ బాలుర వసతి గృహంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్రనాథ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తీవ్ర అసంతృప్తి అసహనాన్ని వ్యక్తం చేశారు. మంత్రి పార్థసారథి ఆదేశాలతో గురువారం ఎస్టీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండి ఉంచిన భోజనం, కూరను పరిశీలించి వంట పని వారిని, వసతి గృహ వార్డెన్ పి.శ్రీనివాస్‌ను నిలదీశారు. మీ పిల్లలకు ఇలాంటి ఆహారమే పెడుతున్నారా అంటూ ప్రశ్నించారు. కేవలం కొద్దిపాటి కూర, అన్నం, అరకొరగా ఉన్న పెరుగును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మెనూ పాటించకపోవడంపై పలు ప్రశ్నలు సంధించారు. విద్యార్థులు ఉండాల్సిన గదుల్లో వంట చేసే వ్యక్తులు మంచం వేసుకుని ఉండటం గమనించారు. పద్ధతి మార్చుకుని విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో వసతి గృహంపై వచ్చిన ఆరోపణలపై వార్డెన్‌కు మెమో జారీ చేసి వివరణ కోరతామని విలేకర్లకు తెలిపారు.

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ సూచించారు. గురువారం ఎంఈవో 2 ఎస్.జమలయ్యతో కలిసి ఎస్ఆర్ఆర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత, రుచి విషయంలో ఏజెన్సీ నిర్వాహకులకు, పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం..!

శంకుస్థాపన చేస్తున్న వేణు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని.. ఆయన మార్గంలోనే తెదేపా నాయకులు పనిచేసి గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు. ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లిలో ఆయన తన సొంత నిధులు రూ.2 లక్షలతో నిర్మిస్తున్న ఎస్సీ సామాజిక భవన నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

రైతు విశిష్ట సంఖ్యతో అన్నదాతకు భరోసా

ఫార్మర్ రిజిస్ట్రీ యాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ భవాని

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రైతులందరికి ప్రభుత్వ పథకాలు వర్తించేందుకు తప్పనిసరిగా 'ఫార్మర్ రిజిస్ట్రీ' చేయించుకోవాలని, భవిష్యత్తులో దీనినే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని ఏడీఏ జి.భవాని తెలిపారు. ఆగిరిపల్లి మండలం మల్లిబోయినపల్లిలో ఆమె ఫార్మర్ రిజిస్ట్రీ యాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ యాప్ ద్వారా పంటల వివరాలు, వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, ముందస్తు బీమా సమాచార వివరాలు, వ్యవసాయ నోటిఫికేషన్లు, పంట నష్టం వివరాలు, ప్రభుత్వ ప్రయోజనాలు, నిపుణుల అభిప్రాయాలు సైతం తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా దర్బార్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ సమాచార శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి పార్థసారథి హాజరవుతారని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఇక్కడ రాతపూర్వకంగా విన్నవించి పరిష్కరించుకోవచ్చన్నారు. వివిధ శాఖల అధికారులు హాజరు అవుతారని చెప్పారు.

108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సీతారామ చంద్ర స్వామి ఆలయం(పెద రామాలయం)లో గురువారం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా ఆంజనేయ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని 108 సార్లు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకులు మారుతీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ చొరవతో రహదారి నిర్మాణం

పనులు పరిశీలిస్తున్న ఎస్సై వెంకటకుమార్

కైకలూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇటీవల పట్టణ పోలీసులు రోడ్డుపై గుంతలు స్వయంగా పూడ్చారు. ఈ క్రమంలోనే కైకలూరు సంత మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారి గుంతలు పడి ప్రమాదాలకు నెలవైంది. చెంతనే బైపాస్ రోడ్డుకు వెళ్లే ప్రమాదకర మలుపులోనూ భారీ గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పట్టణ సీఐ ఏపీవీ రామకృష్ణ సూచనలతో ఎస్సై వెంకటకుమార్ రహదారిని మెరుగు పరిచేందుకు సంకల్పించారు. కొన్ని రోజులుగా రోడ్డు దుస్థితిని ఎన్‌హెచ్ అధికారులకు వివరిస్తూ మరమ్మతులు చేసేలా చొరవ చూపారు. స్పందించిన అధికారులు గురువారం నూతన రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎస్సై వెంకట్‌కుమార్ రోడ్డు పనులు పర్యవేక్షించారు. పోలీసుశాఖ ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పింఛను సమస్యల పరిష్కారానికి కృషి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన వృద్ధులు, వితంతు, దివ్యాంగ పింఛన్లు అందని వారికి కొత్తగా మంజూరయ్యేలా కృషి చేస్తామని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తెలిపారు. పెదగొన్నూరు శివారు విశ్వనాధపాలెంలో 76, 77, 78 బూత్‌ల పరిధిలో పర్యటించి గ్రామస్థుల అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. గ్రామ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. మండల అధ్యక్షుడు సత్యవోలు నాగలక్ష్మి, కొల్లిపర నాగరాజు, పసుపులేటి నరసింహారావు, రెడ్డి నాగలక్ష్మి, వత్తుమిల్లి ప్రసాద్, చిట్టూరి శివప్రసాద్, పాల్గొన్నారు.

చింతలవల్లిలో గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి

ముసునూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పనుల్లో కొత్త ఒరవడి సృష్టిస్తున్నామని తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రాము అన్నారు. గురువారం ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, చింతలవల్లి, చెక్కపల్లి, వలసపల్లి, ముసునూరు గ్రామాల్లో తెదేపా యాప్, గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. మై తెదేపా యాప్ ద్వారా సమాచారం పంచుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పరస్పరం సహకరించుకుంటూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అందరికీ తెలియపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకుడు దీపక్ పాండే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, హారతి, సామూహిక వ్రతాలు జరిగాయి. దీప ధూప నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సర్వీసు వైర్ల చోరీ

చాట్రాయి, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయంలో నిమగ్నమైన రైతులకు కరెంటు మోటార్ల సర్వీసు వైరు చోరీకి గురి కావడంతో కలవరం చెందుతున్నారు. చాట్రాయిలో బుధవారం రాత్రి గడ్డం నాగ వెంకట సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి నరసింహారెడ్డి, నవరం శ్రీను, పాములపాటి శ్రీనివాసరెడ్డితో పాటు 22 మంది రైతులకు చెందిన మోటార్ల వద్ద సర్వీసు వైర్లను కత్తిరించుకు వెళ్లారు. దీనిపై రైతులు చాట్రాయి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ భూముల్లో మోటార్లు, ఇతర కరెంటు ఉపకరణాలకు రక్షణ లేకుండా పోయింది.

ఉపాధ్యాయ సేవలే యూటీఎఫ్ లక్ష్యం

ముసునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సేవ చేయడమే లక్ష్యంగా యూటీఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం మండలాధ్యక్షుడు పద్మకిశోర్, ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు అన్నారు. ముసునూరు మండలం గుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన శేషగిరి సర్వీసును విద్యాశాఖాధికారి చేత క్రమబద్ధీకరణ చేయించి గురువారం సేవ పుస్తకాన్ని, సర్వీసు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు చేతులు మీదుగా అందించారు. హెచ్ఎం నాగబాబు, వరప్రసాద్, బాజీ, దాసు పాల్గొన్నారు.

శ్మశాన రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

కొండంగి (కలిదిండి), న్యూస్‌టుడే: కొండంగి పల్లెపాలెంలో శ్మశానానికి వెళ్లే రహదారి ఆక్రమణకు గురైందని కొండంగి గ్రామస్థులు గురువారం పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మార్గంలోని రోడ్డు ఆరు గజాల వెడల్పు ఉండే విధంగా గతంలో ఏర్పాటు చేసుకున్నామని, దానిలో సుమారు రెండు గజాలు ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పెద్దలు చెప్పినా ఆక్రమణ తొలగించడం లేదని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'హామీల అమలులో విఫలం'

ముసునూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రశాంతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించలేక వారి ఆందోళన పక్కదారి పట్టించడానికి తిరుపతి లడ్డూ కల్తీ, నెయ్యి వ్యవహారం తెర మీదకు తెచ్చారన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల సమస్య పరిష్కరించలేక కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పేదలు సాగు చేస్తున్న అటవీ, రెవెన్యూ బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వేముల బక్కయ్య, ప్రసాద్, రాజీ, సురేశ్ పాల్గొన్నారు.

హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు శివాజీ

కైకలూరులో నివాళులర్పిస్తున్న హిందూ ధర్మపరిరక్షణ నాయకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: భారత దేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన మరాఠా వీరుడిగా పేరు గడించిన రాజు ఛత్రపతి శివాజీ అని, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి చిన్నం శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నూజివీడులోని అద్దంకి బజారులో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఆయన జయంతిని పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు దోసపాటి బాస్కరరావు, మాటూరి మదన్‌మోహన్, పోటిమల్ల కిశోర్, చల్లారి సాంబశివరావు, పొంగుబుల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. స్థానిక వై జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం ముదినేపల్లి, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, కోరుకొల్లు మీదగా ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు పుట్టి కిశోర్, కార్యదర్శి, వడ్లాని ఆంజనేయులు, జనసేన నాయకులు ఏఎన్ బాబు, భాజపా నాయకురాలు రెడ్డి రాధిక, ఎస్సై వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: మహిళలకు గౌరవం కల్పించి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడిన ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. గురువారం శివాజీ జయంతిని పురస్కరించుకుని కైకలూరు, మండవల్లిలో హిందూ ధర్మ పరిరక్షణ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో న్యాయవాదులు పాములు, పవన్‌కాంత్, బాలాజీ, తాతరాజు, ఏసుబాబు, చిరంజీవి, కల్యాణి, శ్యామలరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

భోగేశ్వరాలయ ఆదాయం రూ.31.10 లక్షలు

లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

కలిదిండి, న్యూస్‌టుడే : కలిదిండిలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాల్లో రూ.31,10,123 ఆదాయం వచ్చినట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భోగేశ్వరాలయంలో వివిధ రూపాల్లో వచ్చిన ఆదాయం గురువారం లెక్కించారు. ఈ ఆదాయం గత ఏడాది కంటే రూ.3,71,856 ఎక్కువని తెలిపారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటిక బాగుజేత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెయ్యేరు ఎస్సీ శ్మశాన వాటిక మొత్తం ముళ్ల చెట్లు, జమ్ము పెరిగిపోయి ఖననానికి సైతం చోటు లేక రహదారి పక్కనే పూడుస్తున్నారు. వాటిని తొలగింపు చేసి, మెరక చేయాలని ఆందోళన నిర్వహించి, ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో గురువారం పొక్లెయిన్‌తో ముళ్ల కంపలు తొలగింపు పనులు ప్రారంభించారు. ఎస్సీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వా ఫణీంద్ర సొంత ఖర్చులతో ఈ పనులు నిర్వహించారు.

మాట్లాడుతున్న సుధాకర్, వేదికపై నాయకులు

'వైకాపా దుష్ప్రచారాలను తిప్పికొట్టండి'

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో వైకాపా చేస్తున్న దుష్ప్రచారాలను తెదేపా శ్రేణులు తిప్పికొట్టాలని జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుధాకర్ నూజివీడు మండల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గురువారం మండలంలోని అసెంబ్లీ... గల కారణాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆదే ఒరవడి కొనసాగించాలంటే గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితరాల గురించి చర్చించారు. అదే విధంగా మండలంలోని ఇతర గ్రామాల్లో వీక్‌గా ఉన్న బూత్‌లు తదితరాల గురించి మండల పార్టీ అధ్యక్షుడు యనమదల వాసుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఆలూరి పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచి వీరమాచినేని సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దువ్వూరి వెంకయ్య, ఉప సర్పంచి గోపాలకృష్ణ, గ్రామ పెద్ద యాదాల సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. గురువారం గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.సత్యనారాయణ, ఈఈ రాంజీ నాయక్‌లు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యత ఉండేలా చూడాలని సంబంధిత గుత్తేదారు ప్రతినిధులకు స్పష్టం చేశారు. పనుల్లో ఏవైనా తేడా ఉంటే బిల్లులు నిలిచిపోతాయని హెచ్చరించారు. సిమెంటు, ఐరన్‌లు ఏమి వాడుతున్నారని తెలుసుకున్నారు. ఈఈ, డీఈలను పనులను పర్యవేక్షించాలని సూచించారు.

మార్చి 15లోపు పూర్తి చేయాలి

పట్టణ పరిధిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.సత్యనారాయణ సమావేశమయ్యారు. గృహ నిర్మాణ పనులను మార్చి 15 లోపు పూర్తి చేయాలన్నారు. రూ.16 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని గృహ నిర్మాణదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరుగు దొడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.2 కోట్లు నిధులు ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులు పనులను వేగవంతం చేసుకుని నగదును ఆయా ఖాతాల్లో జమ చేయించుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ గార్డు కొత్త లక్ష్మణరావు పక్షవాతానికి గురయ్యారు. విధి నిర్వహణలో ఉండగా ఈ సంఘటన జరిగింది. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సెక్యూరిటీ గార్డు కుటుంబానికి చేయూత అందించాలని భావించారు. వెంటనే రూ.30 వేలను సిద్ధం చేశారు. గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ చేతుల మీదుగా లక్ష్మణరావుకు నగదు అందించారు.

సద్వినియోగం చేసుకోండి.. మండవల్లి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.ఒ పథకంలో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్ డెవలపర్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ ఉత్తీర్ణులై 21 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీ యువకులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ నిర్వాహకులు 6281119575, 9701357315 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డ్రెయినేజీలు ఆక్రమిస్తే చర్యలు.. కైకలూరు, న్యూస్‌టుడే: డ్రెయినేజీ స్థలాలు ఆక్రమించి వాటిపై అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కైకలూరు పంచాయతీ ఈవో ఫణిరాజకుమారి అన్నారు. స్థానిక మూడో వార్డులో కొందరు నివాసితులు డ్రెయినేజీ స్థలాన్ని ఆక్రమించి నివాసాలకు చేరేందుకు సిమెంటు మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు. సిబ్బందితో కలిసి గురువారం వాటిని ధ్వంసం చేశారు.

సీఎన్‌జీ లీకేజీపై ఆందోళన.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్లలోని మెగా సీఎన్‌జీ గ్యాస్ కేంద్రం సమీపంలో గ్యాస్ లీకైన వాసన వస్తోందని పలువురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో సమీప ప్రాంతాల ప్రజలు, ఆ రహదారిలో వెళ్లే ప్రజలు వచ్చే వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యాల సాధన.. మండవల్లి, న్యూస్‌టుడే: చదువుపై పూర్తిస్థాయి ఏకాగ్రతతోనే లక్ష్యాలు సాధ్యమవుతాయని మండల విద్యాశాఖ అధికారి సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఇంగిలిపాకలంక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు.

బలివేలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు... ముసునూరు, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచి రావు ప్రవీణ పారిశుద్ధ్య పనులు చేయించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగించి ట్రాక్టర్లతో సంపద తయారీ కేంద్రానికి తరలించారు. కార్యదర్శి రాజీ సుల్తానా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో ఎంఈవో శ్రీనివాసరావు

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతో ఉపయోగం.. ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని మండల విద్యాశాఖ అధికారి -2 వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో 32 మందిని ఎంపిక చేసి బాలురకు స్కౌట్స్ బాలికలకు గైడ్స్‌పై శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల్లో సమైక్యత సాధించి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయం చేయడం, ప్రథమ చికిత్స వంటి సామాజిక బాధ్యతలను తెలియజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు టి.వినోద, శిక్షకులు అప్పలస్వామి, లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్ (ఆర్ఏసిపిసి) (64515) 25-165, యస్ వాణి టవర్స్, మొదటి అంతస్థు, భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన, హనుమాన్‌జంక్షన్ రోడ్, నూజివీడు, ఏలూరు జిల్లా-521 201.

(సంక్షిప్త) డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: శ్రీ మోట్రు పాల్ తండ్రి: యం మోక్షానందం, డోర్ నెం: 4-190, దమ్ దమ్ గార్డెన్స్, నూజివీడు, ఏలూరు జిల్లా-521201.

II) లోన్ ఖాతా మరియు హోమ్ లోన్ అకౌంట్ నెంబర్లు: 62506774151, 62506775495, 62507420383

III) చెల్లించవలసిన బాకీ మొత్తము: ది.29-01-2026వ నాటికి రూ.5,32,545/- (అక్షరాల ఐదులక్షల ముప్పైరెండువేల ఐదువందల నలభైఐదు రూపాయిలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, కాస్ట్స్, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి చెల్లించవలెను.

IV) డిమాండ్ నోటీసు తేది: 29-01-2026 NPA తేది: 28-01-2026

V) తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు మునిసిపాలిటీ, ఆర్‌యస్ నెం.450/1 & కొత్త ఆర్‌యస్ నెం.450/1 (పి)8, బ్లాక్ నెం.20, డోర్ నెం.20-175, ద్వారకా రెసిడెన్సి అపార్ట్‌మెంట్, మొదటి అంతస్థు, ఫ్లాట్ నెం.106, 975 చ॥అడుగులు (ప్లింత్ ఏరియా, కామన్ ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్ లోని పార్కింగ్ ఏరియాతో కలిపి) మొత్తం విస్తీర్ణం 812.37 చ॥గ॥ల విస్తీర్ణములోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 35.22 చ॥గ॥లు & (277.78 చ॥గ॥ల ఉమ్మడి దారిలోని 1/54వ అవిభాజ్యపు హక్కు) శ్రీ మోట్రు పాల్, తండ్రి: యం. మోక్షానందం గారికి చెందిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం.6383/2007, తేది:24-11-2007, నూజివీడు జెయస్ఆర్ఒ, ఏలూరు జిల్లా.

స్థలం యొక్క హద్దులు (812.37 చ॥గ॥లు): తూర్పు: మేకా మధు సూదనరావు గారి స్థలం-68.4 అడుగులు, దక్షిణం: శ్రీ సత్యసాయిబాబా స్కూల్ బిల్డింగ్ యొక్క కొంత విస్తీర్ణం & మేకా మధు సూదనరావు బిల్డింగ్ యొక్క కొంత విస్తీర్ణం-107.0 అడుగులు, పడమర: ఆర్‌యస్ మోహన్ యొక్క స్థలం-68.4 అడుగులు, ఉత్తరం: మేకా మధుసూదనరావు యొక్క కొంత విస్తీర్ణంలో ఆస్తి & 2వ ఐటమ్ యొక్క కొంత విస్తీర్ణములోని ఆస్తి-107.0 అడుగులు. ఉమ్మడి దారి యొక్క హద్దులు (277.78 చ॥గ॥లు): తూర్పు: మునిసిపల్ రోడ్డు-20.0 అడుగులు, దక్షిణం: మొదటి ఐటమ్ లోని కొంత విస్తీర్ణములోని ఆస్తి & మేకా మధుసూదనరావు యొక్క కొంత విస్తీర్ణములోని స్థలం-125.0 అడుగులు, పడమర: మేకా మధుసూదనరావు యొక్క స్థలం-20.0 అడుగులు, ఉత్తరం: మేకా [illegible]

[illegible]

తేది : 29-01-2026
ప్రదేశం : నూజివీడు
అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

శ్యామలాసెంటర్: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 'పోలీసు కన్వెన్షన్ హాల్, రిజర్వ్‌పోలీస్ లైన్, ఉమామార్కండేయేశ్వరస్వామి కల్యాణ మండపం దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరంలో' ఫిబ్రవరి 26 తేదీన మెగాసైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

SRI GOWTHAMI K-10 SCHOOL
Learning for Life
GANDHIPURAM | SRIRAMNAGAR
RAJAMAHENDRAVARAM
93486 55501 | 93486 55503

ఈనాడు

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే. ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి. ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి. ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి. ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం. రిజిస్ట్రేషన్ చివరి తేదీ : ఫిబ్రవరి 24

నమోదుకు: 77027 79616
సమయం: ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు జై..!

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. –న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం

ఆదమరిస్తే గోదాట్లోకే..

పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు కు సంబంధించిన సాగునీటి ట్రఫ్(తొట్టి) టోపాత్(రహదారి వడవను దాటి తీసుకెళ్లేవారు సదుపాయం)పై రెయిలింగ్ అసంపూర్తిగా ఉండిపోయింది. 2022లో అప్పటి కలెక్టర్ హిమాన్షుశుక్లా మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో 440 మీటర్ల పొడవునా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. దీంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం అదుపుతప్పినా గోదావరిలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం రూ.49.03 లక్షలతో రోడ్డు వంతెన మరమ్మతులు పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టోపాత్‌పై మిగిలిన 240 మీటర్ల మేర రెయిలింగ్ కూడా పూర్తిచేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం

దందాకో ట్రేడ్ ఉంది!

● లైసెన్స్ ఫీజు నిర్ధారణకు మామూళ్ల వసూలు
● కాకినాడ నగరపాలికలో కొందరు సిబ్బంది తీరిది

'వర్తక సోదరులకు మనవి.. ఈ రోజు నగర పాలక సంస్థ అధికారి, వర్తక సంఘం నాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం జరిగింది. మన దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.1500 ఉంటే రూ.2 వేలు చేయడానికి, వాళ్ల ఫార్మాలిటీ రూ.1000 చెల్లించడానికి నిర్ణయించారు. ఆ ప్రకారం వారు వచ్చినప్పుడు కట్టేయండి. ఎక్కువగా ఎవరికైనా చెల్లించమంటే నాకు ఫోన్‌చేయండి.. నేను సరిచేయిస్తాను. ఆన్‌లైన్‌లో కట్టడమంటే ఇబ్బంది. మున్సిపల్ సిబ్బంది వచ్చినపుడు వారికే కట్టేయండి.'

–కాకినాడకు చెందిన ఓ వర్తక సంఘం నాయకుడు మిగతా వర్తకులకు పంపిన వాయిస్ మెసేజ్ ఇది..

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థలో ట్రేడ్ లైసెన్స్ పెంపు పేరిట జరుగుతున్న దందాకు ఇదో మచ్చుతునక. మామూళ్ల వసూళ్లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి లక్ష్యాలు పెడుతున్నారని సమాచారం. ట్రేడ్ లైసెన్స్‌లు పునరుద్ధరణ చేసుకోవాల్సినవారు 6,700 మంది వరకు ఉన్నారు. అల్పాహారశాలలు, హోటళ్లు, సూపర్‌మార్కెట్లు, కిరాణా, మందుల దుకాణాలు, ఆసుపత్రులు, గోదాములు, చిన్నపరిశ్రమలు ఇలా వ్యాపారాలు చేసుకునేవారంతా విధిగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి. ప్రతి మూడేళ్లకు 25 శాతం పెంచాలి. 2011 తర్వాత ఇప్పటి వరకు లేకపోగా తాజాగా ప్రభుత్వం అనుమతిచ్చింది. 300 శాతం చేయడానికి అవకాశం ఉన్నా.. ఒకేసారి భారమవుతున్నందున, ఇప్పుడున్న ఫీజు రెట్టింపు చేయాలని నిర్ణయించారు. వర్తక సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహించగా రెట్టింపు రుసుములు విధిస్తే చిరు వ్యాపారులకు భారమని, తగ్గించాలని కోరారు. ఈ క్రమంలో కొందరు నగరపాలక సిబ్బంది బేరసారాలు సాగిస్తున్నారు.

కనీసం రూ.50 లక్షలు..

'15 ఏళ్ల తర్వాత ట్రేడ్ లైసెన్స్ ఫీజు పెంచుతున్నారు. మళ్లీ చాలాకాలం పెంచే అవకాశం ఉండదు. వారు చెప్పినట్లు వింటే తక్కువ మొత్తంలో పెంచి మేలు చేస్తారు. దీనికోసమే రూ. వెయ్యి చొప్పున అడుగుతున్నారు' అని వర్తక సంఘాల ప్రతినిధులు వ్యాపారులకు సర్దిచెబుతున్నారు. ఆ ప్రకారం వసూలు చేస్తే 6,700 మంది ట్రేడ్ లైసెన్స్‌దారుల నుంచి రూ.67 లక్షల వరకు మామూళ్ల రూపంలో వస్తుంది. కొంతమంది ఇవ్వకపోయినా కనీసం రూ.50 లక్షలైనా వస్తాయని అంచనా. ఈ మేరకు ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలో నిర్ణయించుకున్నారని తెలుస్తోంది.

అదనంగా రూపాయి కూడా కట్టొద్దు

ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ వద్ద ప్రస్తావించగా 'ట్రేడ్ లైసెన్స్‌ల వసూలుకు వచ్చేవారికి అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు. రుసుముల నిర్ణయం చట్టబద్ధంగా జరుగుతుంది. ఇందులో ఎలాంటి అవకతవకలు లేవు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

రైతులకు గుర్తింపుకార్డు తప్పనిసరి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగు చేసే ప్రతి రైతు విధిగా ఏపీఎఫ్ఆర్ ఫార్మర్ ఐడీ గుర్తింపు కార్డు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. జిల్లాలో 2,07,573 మంది రైతులకు ఇప్పటికి 1,69,268 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మిగతా రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ వంటివి వర్తిస్తాయని పేర్కొన్నారు. రైతులు ఆధార్ సంఖ్యతో www.apfr.agristack.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందవచ్చని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లోనూ నమోదు చేసుకోవచ్చని.. ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ అనుసంధానమైన ఫోను నంబరు తీసుకెళ్లాలని తెలిపారు. భూమి వివరాల్లో సమస్యలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు

నిలిపేస్తారు.. ప్రాణాలు తోడేస్తారు

జాతీయ రహదారిపై ఇష్టారీతిన వాహనాల పార్కింగ్

ఈనాడు పరిశీలన

● గత జనవరిలో కత్తిపూడి వద్ద రోడ్డుపై నిలిపిన లారీని కారు ఢీకొట్టిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు.

● 2025 సెప్టెంబరులో తాళ్లూరు దాబా వద్ద నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొట్టడంతో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంపతులు మృతి చెందారు. ఈ ప్రాంతంలోనే ఆగిన లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తి చనిపోయాడు. ఏప్రిల్‌లో మురారి వద్ద ఇదే తరహాలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

రామవరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గండేపల్లి, శంఖవరం: పదహారో నంబరు జాతీయ రహదారిపై సాఫీగా ప్రయాణం సాగిపోతున్న తరుణంలో అకస్మాత్తుగా నిలిపి ఉంచిన వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దివాన్ చెరువు నుంచి పాయకరావుపేట వరకు దాబాలు, మెకానిక్ షెడ్లు, పంక్చర్ దుకాణాల వద్ద ఈ పరిస్థితి అధికం. బ్లాక్ స్పాట్ల కంటే నిలిపిన వాహనాలే ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయి.

ఏ ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రమంటే..

● రాజానగరం-ఏడీబీ రహదారి కూడలికి సమీపంలో తూర్పుగోన గూడెం వద్ద ఎన్‌హెచ్ పక్కనే పంక్చర్ దుకాణాలున్నాయి. రోడ్డుకు ఆనుకునే లారీలు, ఆటోలు నిత్యం నిలిపేస్తున్నారు.

గండేపల్లి మండలం మురారి వద్ద రాత్రి వేళ రోడ్డుకు అటూ, ఇటూ నిలిపేసిన వాహనాలు

● మల్లేపల్లి వద్ద హైవేపై ఆటోలు నిలిపిఉన్నాయి. ఇక్కడే ట్రక్ బే ఉన్నా వినియోగించడంలేదు. వంతెన ఎక్కే ప్రాంతంలో వాహనాలు నిలుపుతున్నారు. తాళ్లూరు పరిధిలో 8 దాబాలున్నాయి. ఇక్కడ దాబాలకు స్థానికులు అపసవ్య దిశలో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

● జగ్గంపేటలో పైవంతెన దిగిన వెంటనే డౌన్‌లో డైవర్షన్ పాయింట్ ఉంది. ఇక్కడ రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాలు ఆపేస్తున్నారు. రామవరం కూడలి సమీపంలో ఉన్న దాబాల వద్ద ఉదయమే 10 లారీలు (ట్రాలీ) రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. రాత్రయితే ఇంకా రెట్టింపే.

● మురారిలో ఉన్న దాబాల వద్ద రేయింబవళ్లు వాహనాలు నిలిపేస్తున్నారు. తాజాగా ఉదయం 10.30 గంటల సమయంలో 10 లారీలున్నాయి. ● యర్రవరం హైవేకి ఆనుకుని నాలుగు రోడ్ల కూడలి ఉండగా, రోడ్డుపైనే అయిదు లారీలు, కారు పార్కింగ్ చేశారు. ● కత్తిపూడి వద్ద వెహికల్ బే ఉన్నా నిరుపయోగమే. ఇక్కడ పైవంతెన ఎక్కే ప్రాంతంలోనే షెడ్లు వేయడం, వాహనాలు పగలు, రాత్రి నిలుపుదల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన దిగిన వెంటనే ఉన్న కూడలి వద్దా ఇదే పరిస్థితి. పోలీస్ గస్తీతోపాటు, సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేవాల్సి ఉంది. ● అన్నవరం హైవేలోని నమూనా ఆలయం వద్ద రోడ్డుపై కార్లు, వ్యాన్లు, లారీలు పదుల సంఖ్యలో ఇష్టారాజ్యంగా ఆపుతున్నారు.

వైభవోపేతం.. వీరేశ్వరస్వామి తెప్పోత్సవం

విద్యుత్తు వెలుగుల్లో హంస వాహనం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా ఐ.పోలవరం మండలం మురమళ్ల లోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి, అమ్మవార్లను రథంపై ఉంచి గ్రామోత్సవం అనంతరం వృద్ధ గౌతమి గోదావరి నది వద్దకు తీసుకు వెళ్లారు. గోదావరి మాతకు ఆలయ అర్చక, పురోహిత, వేద పండితులు ప్రత్యేక పూజలు, పంచహారతులు ఇచ్చారు. అనంతరం భద్రకాళీ సమేతుడైన వీరేశ్వరస్వామి హంస వాహనంపై గోదావరిలో నదీలో విహారం చేశారు. విద్యుత్తు కాంతులు, భారీ బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేల సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెళ్లికి ప్రోత్సాహం.. చదువుకు చేయూత

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతంలోని డ్వాక్రా మహిళల పిల్లల విద్య, వివాహాలకు కూటమి ప్రభుత్వం చేయూతనివ్వనుంది. పావలా వడ్డీకి రుణ సదుపాయం కల్పించడం ద్వారా వారి పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సంకల్పించింది. ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలకు శ్రీకారం చుట్టింది. సూక్ష్మ రుణ ప్రణాళిక(ఎంసీపీ) ద్వారా ఇప్పటికే బ్యాంకు లింకేజీ రుణాలను పారదర్శకంగా అందిస్తోంది. కుటుంబ అవసరాలు, వైద్యం వంటి వాటికి అనుగుణంగా దీనిని అమలు చేస్తోంది.

డ్వాక్రా మహిళల పిల్లలకు రుణ సదుపాయం

సభ్యుల వివరాలు సేకరిస్తున్న సెర్ప్ సిబ్బంది

వేల మంది నమోదు

రుణ ప్రణాళికలో భాగంగా డ్వాక్రా మహిళల కుటుంబాల్లో చదువుకు, వివాహాలకు ఎంత మేర రుణం అవసరమో గుర్తించారు. దీనిలో భాగంగా జిల్లాలో 22,248 మంది డ్వాక్రా సభ్యులు రూ.178 కోట్ల మేర రుణాలు కావాలని ఎంసీపీలో నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలకు రూ.2 వేల కోట్లు కేటాయించనుంది. జిల్లాలో రూ.80 కోట్ల వరకు రుణం ఇస్తారని అంచనా వేస్తున్నారు.

స్త్రీనిధి నుంచి మంజూరు

డ్వాక్రా సభ్యులు తమ వాటా సొమ్ముతో పాటు ప్రభుత్వం ఇచ్చిన రివాల్వింగ్ ఫండ్‌తో స్త్రీనిధి బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా ఇప్పటికే రుణాలు పొంది, తిరిగి చెల్లిస్తున్నారు. ఇప్పుడు కొత్త పథకాలకు దీని నుంచి పావలా వడ్డీకి రుణాలిచ్చి, 48 వాయిదాల్లో చెల్లించేలా విధి విధానాలు ఖరారు చేశారు.

రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు..

పథకాల్లో భాగంగా పిల్లల చదువుకు అవసరమైన ఫీజుకు, కుమార్తె వివాహానికి సంబంధించి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణ సాయం అందిస్తారు. దరఖాస్తు చేసిన 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు. మార్గదర్శకాలప్రకారం మంజూరు చేస్తారు.

నిఘా నడుమ ఇంటర్ పరీక్షలు

ఇంటర్ పరీక్షలకు వేళయింది. ఈ నెల 23 నుంచి ప్రథమ సంవత్సరం, 24 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్‌లో ప్రభుత్వం సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ప్రశ్నపత్రాలు, మార్కుల్లో మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇంటర్‌విద్య అధికారి (డీవైఈవో) వి.కేశవరావు తెలిపారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిఘా పెడుతున్నామని చెప్పారు. జిల్లాలో పరీక్షల నిర్వహణపై డీవైఈవో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

జిల్లాలో మొత్తం కళాశాలలు: 146

పరీక్షలు జరిగే కేంద్రాలు: 58

హాజరవుతున్న విద్యార్థులు: 22,009 (ప్రథమ) 20,864 (ద్వితీయ)

ముఖాముఖి

● జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరం 22,009 మంది, ద్వితీయ సంవత్సరం 20,864 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం.

● ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం.

● ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే పరీక్షలు జరుగుతాయి. వారికి 24 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు.

● ఈ ఏడాది ఇంటర్‌లో ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కొత్త విధానంలో పరీక్షలు జరగనున్నాయి. తొలిసారి ఒక్క మార్కు ప్రశ్నలు ప్రవేశపెట్టారు. జవాబులు రాసేందుకు 32 పేజీల బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు.

కేంద్రాల వద్ద సౌకర్యాలు

ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాం. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

అరగంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే హాజరు కావాలి. కేంద్రాల చిరునామాను ముందే ఒకసారి వెళ్లి చూసుకుంటే మంచిది. ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలి. ఏదైనా సందేహాలుంటే ఇన్విజిలేటర్లను మాత్రమే అడగాలి. స్లిప్‌లు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి.

పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

పరీక్షలను పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. 58 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాం. ప్రైవేటు కేంద్రాల్లో సహాయ చీఫ్ సూపరింటెండెంట్లు కూడా ఉంటారు. పరీక్ష కేంద్రాలను ఇంటర్ బోర్డుకు అనుసంధానం చేశారు. రాష్ట్ర బృందాలతో పాటు ఐదుగురు సభ్యులు గల జిల్లా పరీక్షల కమిటీ పర్యవేక్షిస్తుంది.

సదరన్ రైల్వే, ఎస్ఆర్ఎం మహిళా జట్ల మధ్య పోటీ

తుదిపోరు ఉత్కంఠభరితం

వాలీబాల్ మహిళల విజేతగా సదరన్ రైల్వే

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో జరిగిన అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్ తుది పోరు గురువారం రాత్రి రసవత్తరంగా సాగింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, సదరన్ రైల్వే(చెన్నై) మహిళా జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో సదరన్ రైల్వే జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించింది. పురుషుల విభాగంలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కర్ణాటకపై 3-1 స్కోర్‌తో జీఎస్‌టీ(ముంబయి) గెలిచింది. పురుషుల ఫైనల్స్‌లో ఐవోబీ(చెన్నై), ఇండియన్ బ్యాంకు(చెన్నై) తలపడ్డాయి.

పంపా జలాశయానికి త్వరలో కొత్త గేట్లు

రూ.3.36 కోట్ల నిధులు మంజూరు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామం పంపా రిజర్వాయర్‌కు కొత్త వరద గేట్లు ఈ ఏడాది మార్చిలోగా అమర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న గేట్లు తొలగించి కొత్త గేట్లు అమర్చేందుకు, రోలర్స్, రోప్ రింగ్, కవర్ డ్రైవర్ యూనిట్, కొత్త జనరేటర్, విద్యుత్తు పనులు, సైరన్, విద్యుత్తు ప్యానల్ తదితర పనులకు కూటమి ప్రభుత్వం రూ.3.36 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులన్నీ గత ఏడాది ఖరీఫ్‌కి పూర్తి చేయాల్సి ఉన్నా టెండర్లలో జాప్యం, రిజర్వాయర్‌లో నీటి నిల్వలతో పనులు జరగలేదు. ప్రస్తుతం కొవ్వూరు వద్ద గేట్లు పకడ్బందీగా తయారవుతున్నాయి. త్వరలోనే గేట్లను తెచ్చి రిజర్వాయర్‌కు అమర్చనున్నారు.

పలు సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులు

గత వైకాపా ప్రభుత్వం రిజర్వాయర్ నిర్వహణపై కనీస శ్రద్ధ చూపలేదు. 2023లో మిగ్‌జాం తుపాను సమయంలో గరిష్ఠ స్థాయికి నీరు చేరింది. ఈ సమయంలో 2, 4 గేట్లు అదుపు తప్పాయి. గేట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. పలు తుపాన్ల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 2021లోనే గేట్లు పరిస్థితి, ఆధునికీకరణపై నిపుణులు నివేదిక ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసింది.

సిద్ధమవుతున్న గేట్లు

ముంపు ముప్పు.. ముందే పసిగడితే..!

వరదల తీవ్రతపై అధ్యయనం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఏటా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముంపు సమస్య లంక గ్రామాల ప్రజలను గడగడలాడిస్తోంది. ప్రతి సంవత్సరం జులై నెల నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలను వరద భయం వెంటాడుతూనే ఉంటుంది. జలవనరుల శాఖ అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. పూర్తి స్థాయిలో వరద నియంత్రణ చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వరద నియంత్రణకు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) సహాయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



వరదల సమయంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

గత వరదల వివరాలు

సంవత్సరం	నీటి మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ ప్రవాహం (టీఎంసీలు)
2019	15.60	15,61,404
2020	19.90	22,58,895
2021	12	10,19,452
2022	21.70	25,80,963
2023	16	16,32,780
2024	15.80	16,14,844
2025	14.30	13,57,199

బృందం పర్యటన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రోజుల పాటు ఇద్దరు ఇస్రో శాస్త్రవేత్తలతో కూడి ప్రత్యేక బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఇస్రో ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికత ద్వారా ముందస్తుగా వరద నియంత్రణకు సహాయక చర్యలపై దృష్టి పెట్టనున్నారు.

ఏటా తప్పని ముప్పు

15 ఏళ్ల క్రితం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఏటా వరద తీవ్రత అధికంగానే ఉంది. లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసిన సందర్భాలున్నాయి. ఈ సమయాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.

పోలవరం పూర్తయితే..

పోలవరం ప్రాజెక్టు పూర్తయి వినియోగంలోకి వస్తే వరద ప్రభావం చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని ముందస్తుగా పోలవరం వద్ద నిలుపుదల చేసి, అక్కడి నుంచి మిగులు జలాలను మాత్రమే దిగువకు వదిలే వీలుంటుందన్నారు. దీంతో ధవళేశ్వరం బ్యారేజీకి వరద పోటు తగ్గే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు.

28 లోపు జీవనపత్రాలు అందజేయాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సభ్యుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ రిటైర్డ్(విశ్రాంత) ఉద్యోగులందరూ వారి జీవన ప్రమాణ సర్టిఫికెట్(లైఫ్ సర్టిఫికెట్) ఈ నెలాఖరు లోపు సమర్పించాలని సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం గురువారం తెలిపారు. కాకినాడ జిల్లాలో సబ్ ట్రెజరీ కార్యాలయంలో, ఏదైనా పెన్షనర్స్ భవనంలో, ఏపీఎస్పీ విశ్రాంత కార్యాలయంలో, ఏదైనా నెట్‌సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని చెప్పారు. ఎవరైనా రాలేని పరిస్థితుల్లో ఉంటే వారి ఇంటికి తమ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్‌ను పంపి సర్టిఫికెట్ చేయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 91820 47819, 94407 10596, 63001 80491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉద్యోగులకు గ్రీవెన్స్‌సెల్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌సెల్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అధికారులు వినతులు స్వీకరిస్తారని చెప్పారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our KAKINADA BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT V	50	1,00,000	50,00,000
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
FT B	40	5,000	2,00,000
TT C	30	30,000	9,00,000
ST VV	25	2,00,000	50,00,000

Please Contact Branch Manager Mr. N.VITHAL KUMAR, for further details.
Mobile Nos: 96187-55599, 9492776760, Land Line: 0884 -2378220.

(c) eenadu

24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం [illegible]లో ఈ నెల 24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభమవుతాయని కళాపరిషత్ ప్రతినిధులు గురువారం తెలిపారు. శ్రీఅపర్ణా సమేత నాగేశ్వరస్వామి దివ్యకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న కాకినాడ సాయి కార్తిక్ క్రియేషన్స్ సభ్యులు మధురస్వరం, 25న హైదరాబాద్ కళాంజలి సభ్యులు యుగం నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ నెల 26న గుంటూరు కళాం సురేష్ మెమోరియల్ థియేటర్స్ సభ్యులు తరమెల్లిపోతున్నదో, 28న ఎడ్లపాడు సభ్యులు అందరూ మంచి వారే కాని.. నాటకాలను ప్రదర్శిస్తారన్నారు. మార్చి 1న గుంటూరు అభినయ ఆర్ట్స్ సభ్యులు సహన నాటకం ప్రదర్శిస్తారని, అదే రోజు రాత్రి విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు.

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ప్రధాన కార్యాలయము : గాంధీ బొమ్మ దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం

స్వాధీనత ప్రకటన (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్ 54/2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు దిగువ తెలిపిన డిమాండ్ నోటీసు జారీ చేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మరియు వారి పేర్లకు ఎదురుగా పేర్కొన్న మొత్తము చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత మరియు హామీదారులు విఫలమైనందున సదరు రూల్స్ లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తులను దిగువ సంతకందారు క్రింద తెలిపిన తేదీలలో స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతలకు, హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

దిగువ ఆస్తులతో ఏ విధమైన వ్యవహారములు జరుపరాదనియు మరియు ఈ ఆస్తులకు సంబంధించిన ఏదైనా వ్యవహారములు జరిపిన ఎడల ఋణగ్రహీత మరియు హామీదారుల నుండి **ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్** వారికి బకాయి ఉన్న మొత్తమును మరియు దానిపై తదుపరి వడ్డీకి బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీత మరియు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

నోటీసు వివరాలు

వ.నెం.	ఋణగ్రహీత / హామీదారుల పేర్లు	బ్యాంకు వారికి తనఖా చేసిన స్థిరాస్తి/ల వివరములు :	డిమాండ్ నోటీసు తేదీ, స్వాధీనత తేదీ & ఇతర వివరములు
		బ్రాంచ్ : జాంపేట	
1)	**ఋణగ్రహీత:** శ్రీ యల్లమిల్లి గంగా భవాని, D/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, ఆంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ. **హామీదారుడు :** శ్రీ యల్లమిల్లి వెంకన్న, S/o. వెంకన్న, డోర్ నెం: 2-345/1, ఆంజనేయ నగర్, రమణయ్య పేట, కాకినాడ.	726 చ.గజాల స్థలం, అందులోని శ్రీ యల్లమిల్లి గంగా భవాని కు చెందిన నివాస గృహం, డోర్. నెం.2-79, గొడిలంక, అల్లవరం మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.4627/2014, తేదీ: 01-09-2014 మరియు సరిహద్దులు : **తూర్పు:** యల్లమిల్లి ఆది లక్ష్మి గారి భూమి, **పడమర:** కటారి పాపయ్య గారి కుమారులు తాలూకు బంగాళా పెంకుటి ఇల్లు, **ఉత్తరం:** యార్లగడ్డ వెంకటరెడ్డి గారి స్థలం, **దక్షిణం:** నడింపల్లి రామకృష్ణంరాజు గారి భూమి.	డిమాండ్ నోటిస్ తేది: **12-03-2025** స్వాధీనత తేది: **12-02-2026** బకాయి: ది.28-02-2025 నాటికి **రూ.10,55,112/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
		బ్రాంచ్ : అనపర్తి	
2)	**ఋణగ్రహీత:** శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డి, S/o. వెంకట కృష్ణారెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం. **హామీదారుడు:** శ్రీమతి కర్రి బృందావతి, W/o. రాంమూర్తి రెడ్డి, డో.నెం.11-14/A, మెయిన్ రోడ్, కొంకుదురు, బిక్కవోలు మండలం.	మొత్తం 236 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 39.1/3 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న 660 చ.అడుగుల విస్తీర్ణం కలిగిన మొదటి ఫ్లోరులో ఫ్లాట్ ఈ క్రింది సరి హద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన ఫ్లాట్, డో.నెం. 3-569/2, సునందనపేట, బాబా నగర్, అనపర్తి, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ: 08-04-2011 మరియు సరిహద్దులు: 1వ ప్రతి A షెడ్యూల్: **తూర్పు:** రాజవీధి, **పడమర:** సత్తి జానకి రెడ్డి గారి భూమి, **ఉత్తరం:** మేడికొండ వేణుబాబు గారి గోడ, **దక్షిణం:** రాజవీధి, 1వ ప్రతి B షెడ్యూల్ : **తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఉమ్మడి గోడ కొంత మేర, ఖాళీ ప్రదేశం కొంతమేర, **దక్షిణం:** ఓపెన్ టు స్కై. 2వ ప్రతి : మొత్తం 71 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 11.83 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న 106.66 చ.అడుగుల విస్తీర్ణం కలిగిన ఆర్.సి.సి. శ్లాబు ఈ క్రింది సరిహద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన సమీప డో.నెం.3-569, సునందనపేట, బాబా నగర్, అనపర్తి, తూర్పు గోదావరి జిల్లా, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ : 08-04-2011 మరియు **సరిహద్దులు: తూర్పు:** రాజవీధి, **పడమర:** రాజవీధి, **ఉత్తరం:** గొలుగూరి ఆనంద రెడ్డి గారి స్థలం, **దక్షిణం:** ఉమ్మడి గోడ కొంతమేర, స్థలం కొంత. 3వ ప్రతి: మొత్తం 62.2 చ.గజాల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు 4.15 చ.గజాల విస్తీర్ణం గల స్థలం ఈ క్రింది సరిహద్దులతో శ్రీ కర్రి రాంమూర్తి రెడ్డికు చెందిన సమీప డో.నెం.3-569, సునందనపేట, బాబానగర్, అనపర్తి, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.824/2011 తేదీ: 08-04-2011 మరియు **సరిహద్దులు: తూర్పు:** మల్లిడి పద్మావతి గారి స్థలం, **పడమర:** రాజవీధి, **ఉత్తరం:** కర్రి సుధాకర రెడ్డి గారి ఇంటి గోడ, **దక్షిణం:** సత్తి విజయ లక్ష్మి గారి స్థలం.	డిమాండ్ నోటిస్ తేది: **20-12-2024** స్వాధీనత తేది: **12-02-2026** బకాయి : ది.30-11-2024 నాటికి **రూ. 14,30,362/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
		బ్రాంచ్ : కాకినాడ	
3)	**ఋణగ్రహీత:** శ్రీ పోతల శ్రీను, S/o. ప్రసాదరావు, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం. **హామీదారుడు:** శ్రీమతి పోతల మంగ, W/o. శ్రీను, డో.నెం.5-55, యస్.సి.కాలనీ, వీరవరం, కడియం మండలం.	121 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీ పోతల శ్రీను కు చెందిన నివాస గృహము, డో.నెం.5-55, వీరవరం, కడియం మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం.240/2016 తేదీ : 22-01-2016 మరియు సరిహద్దులు: **తూర్పు:** రోడ్డు, **పడమర:** వరసాల కాసులు గారి ఇల్లు, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** కుంద యేసురత్నం గారి ఆస్తి.	డిమాండ్ నోటిస్ తేది: **29-02-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.29-02-2024 నాటికి **రూ.4,26,158/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
4)	**ఋణగ్రహీత :** శ్రీ గుత్తుర్తి సుందరం, S/o. అప్పారావు అనే దైవదాసు, డో.నెం.3-10, ఎ.కె.మల్లవరం, గొల్లప్రోలు మండలం. **హామీదారుడు:** శ్రీ గుత్తుర్తి ప్రసాద్, S/o. సుందరం, డో.నెం.11-1, ఆవులమంద, పెరుమాళ్ళపురం, తొండంగి మండలం.	194 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీ గుత్తుర్తి సుందరం కు చెందిన నివాస గృహ భవనం, డో.నెం. 6-86, ఎ.కె.మల్లవరం, గొల్లప్రోలు మండలం, రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 1666/1996 తేదీ: 05-06-1996 మరియు **సరిహద్దులు: తూర్పు:** సుందరపల్లి సత్యనారాయణ గారి ఆస్తి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** చర్చి తాలూకా బిల్డింగ్, **దక్షిణం:** దారి మార్గం.	డిమాండ్ నోటిస్ తేది: **29-02-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.29-02-2024 నాటికి **రూ.7,18,840/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)
5)	**ఋణగ్రహీత :** శ్రీమతి కసపర్తి లక్ష్మి, W/o. వీర్రాజు, డో.నెం.68-4-5, గోకులం దగ్గర, అశోక్ నగర్, కాకినాడ. **హామీదారుడు:** శ్రీ కసపర్తి రాంబాబు, S/o. వీర్రాజు, డో.నెం.68-4-5, కమల్ వీర్ దగ్గర, అశోక్ నగర్, కాకినాడ.	57.5 చ.గజాల విస్తీర్ణం గల స్థలంలో ఈ క్రింది సరిహద్దులతో శ్రీమతి కసపర్తి లక్ష్మి కు చెందిన నివాస గృహ భవనం, డో.నెం. 68-10ఎ-27/5డి, రాజేశ్వరి నగర్, కాకినాడ, రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 2451/1988 తేదీ: 17-05-1988 మరియు **సరిహద్దులు: తూర్పు:** పన్నాల రామ సుబ్బమ్మ గారి స్థలం, **పడమర:** 6 అడుగుల వెడల్పు గల దారి మార్గం, **ఉత్తరం:** కసపర్తి వెంకటేశ్వర రావు గారి స్థలం, **దక్షిణం:** నా తాలూకు మిగతా ఇల్లు, స్థలం.	డిమాండ్ నోటిస్ తేది: **20-12-2024** స్వాధీనత తేది: **13-02-2026** బకాయి: ది.30-11-2024 నాటికి **రూ.2,58,328/-** డిమాండ్ చేసిన మొత్తము (మరియు తదుపరి వడ్డీ)

తేది : 18.02.2026
ప్రదేశం : రాజమహేంద్రవరం

సం/- అధీకృత అధికారి
ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్.,

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98660 27578.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్‌హౌసింగ్, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. వేరొక చిరునామా: మెస్సర్స్ శ్రీ రాఘవేంద్ర వేర్ హౌసింగ్, ఆఫీస్ చిరునామా: సంప్రదించవలసిన వారు: మేనేజింగ్ పార్టనర్ : శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డివారి వీధి, శాంతినగర్, కాకినాడ-533004. హామీదారులు: 1) శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 2) శ్రీమతి పద్మావతి జంపాన, భర్త: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 3) శ్రీ సాయిరాజ్ జంపాన, తండ్రి: బాల గాంధీరాజు, 65-9-1/సి, గర్ల్స్ పాలిటెక్నిక్ ఎదురుగా, మెహర్‌నగర్, కాకినాడ-533003. 4) త్రీ సీజన్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్: శ్రీ బాల గాంధీరాజు జంపాన, తండ్రి: నరసింహరాజు, ప్లాటు నెం.59, అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్-500034.

డిమాండ్ నోటీసు తేది: 01-07-2022 — డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.30-06-2022 నాటికి రూ.6,00,06,891/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.31-01-2026 నాటికి రూ.10.42 కోట్లు + తేది.01.02.2026 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు: ఆస్తి ఐడి : SBIN8911995166

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ పట్టణం, సూర్యారావుపేట గ్రామం, విద్యుత్ నగర్, బ్లాకు నెం.68, వార్డు నెం.29, కొత్త సర్వే నెం.180లోని ఎ.14.65 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఉత్తరం వైపున మధ్య భాగంలోని ఎ.3.02 సెంట్లు విస్తీర్ణంలో 1560 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ సొసైటీ పాలక మండలి వారిచే ఎగ్జిక్యూట్ చేయబడిన తూర్పు గోదావరి జిల్లా, కాకినాడకు చెందిన శ్రీ జంపాన సాయిరాజ్, తండ్రి: బాల గాంధీరాజు గారి పేరున కలదు.(రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 3193/2019 తేది:28-03-2019 ప్రకారం) హద్దులు మరియు కొలతలు: తూర్పు: 195.6 అ॥లు - ఐడియల్ కాలేజికి చెందిన స్థలం, ఉత్తరం : 70 అ॥లు - నాన్సీ వీధి (మున్సిపల్ రోడ్డు), దక్షిణం: 70 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం, పడమర : 206 అ॥లు - ఐడియల్ కాలేజ్ ద్వారా నిర్వహించబడుచున్న స్థలం. పైన తెలిపిన హద్దులలోని 1560 చ॥గ॥ల ఖాళీ స్థల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులు మరియు ఉమ్మడి దారులు మొ॥ వాటితో కలదు.

రిజర్వు ధర : రూ.5,20,00,000/-	ధరావత్తు : రూ.52,00,000/-	బిడ్ పెంపుదల : రూ.50,000/-

ఇ-వేలం తేదీ : 25-03-2026 — సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 20-02-2026 నుండి 24-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ https://baanknet.com నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:18-02-2026, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జలవనరుకీ జాడ్యమేంటో..!

గొల్లప్రోలులోని రంగప్ప చెరువు ఇది. నిర్వహణలేక నిండుగా గుర్రపుడెక్కతో అధ్వానంగా మారింది. దీని నుంచి దోమలు సమీపంలోని జనావాసాలకు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. దుర్వాసన, దోమల ఉద్ధృతితో ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. చెరువు ఆధునికీకరణ తక్షణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామని ఏఈ అలిషా తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

పిల్లంక, కొత్తలంక, గోవలంక, నీలపల్లి ట్రైబల్ లాకుల వద్ద గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను ఇస్రో శాస్త్రవేత్తల బృందం గురువారం అధ్యయనం చేసింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ ఎస్వీవీ శివప్రసాద్‌రెడ్డి, అమర్ ఫ్లోసింగ్ బృందం తాళ్లరేవు మండలం పిల్లంక, గోవలంక, కొత్తలంక, నీలపల్లి ట్రైబల్ లాకుల వద్ద గోదావరి వరదలకు కారణాలను పరిశీలించారు. శాటిలైట్ చిత్రాలు పరిశీలించారు. గంగవరం హెడ్‌వర్క్స్ జేఈ ఎ.ఎం. రెహమాన్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వీరబాబు, పిల్లంక వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

గాంధీనగర్: స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా కె.ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణాజిల్లా [illegible] సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కాకినాడ సబ్ రిజిస్ట్రార్- 1 రాయుడు వెంకట రామారావు, సబ్ రిజిస్ట్రార్-2 పీఎస్ఎస్ వీరభద్రరావు, జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ప్రసాదరావుకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాకినాడ సబ్ రిజిస్ట్రార్-I రామారావు

మార్చి 1 నుంచి గడపగడపకూ సీపీఐ

గాంధీనగర్: పార్టీని బలోపేతం చేసేలా, ప్రజలకు చేరువ చేసేలా మార్చి 1 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ సీపీఐ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈశ్వరయ్య మాట్లాడుతూ [illegible] ద్వారా సామాజిక న్యాయం సాధించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తూ, పేదల ఉపాధి హక్కును కత్తిరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ 20 తేదీ శుక్రవారం సామాజిక న్యాయ దినోత్సవాన్ని సామాజిక, ఆర్థిక న్యాయం నినాదంతో ఘనంగా నిర్వహించాలని కోరారు. [illegible] మహాత్మాగాంధీ [illegible] వారు. తీర్మానాలను [illegible] ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి బోడకొండ, తోకల ప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అన్ని జిల్లాల కార్యదర్శులు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొన్నారు.

ఈశ్వరయ్య చేతుల మీదుగా తీర్మాన ప్రతులు అందుకుంటున్న నాయకులు

తితిదే ఆధీనంలోకి ఏవీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయం

తొండంగి, న్యూస్‌టుడే: ఏవీనగరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తితిదే తన ఆధీనంలోకి తీసుకునే కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు చేతులమీదుగా తితిదే డీఈవో శివప్రసాద్, ఏఈవో బాలాజీ పత్రాలు అందుకున్నారు. ఆలయ ఆస్తులు, కల్యాణ మండపాలు తదితర సామగ్రిని అప్పగించారు. ఈ ఆలయాన్ని యనమల 2016లో నిర్మించారు. తితిదే డీఈవో మాట్లాడుతూ.. ఆలయ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని తీసుకోవడంతో పాటు నిర్వహణ అంతా తితిదే చూసుకుంటుందన్నారు. సుప్రభాత సేవ నుంచి కల్యాణం వరకు అన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గుడి నిర్వహణకు ఏడాదికి రూ. 80 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు అవసరం కానుందన్నారు. భవిష్యత్తులో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. యనమల రాజేష్, యనమల నాగేశ్వరరావు, చింతంనీడి అబ్బాయి, నరహరశెట్టి సూర్యప్రకాష్, కొయ్యా కేశవ, తితిదేకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి యనమల

కాల్పనిక ప్రపంచంలో.. అవకాశాల హరివిల్లు

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ(ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీజీఏ సంయుక్త సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన రెండు రోజుల ఏవీజీసీ-ఎక్స్ఆర్ సమ్మిట్-2026 గురువారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఉద్యోగాలు ఆశించకుండా, సృష్టించాలన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. జేసీ, హబ్ డైరెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఇలాంటి వేదికలను వినియోగించుకోవాలన్నారు.

గ్రాఫిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

బోలెడు ఉద్యోగాలు..

ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ఉద్యోగావకాశాలు బాగున్నాయి. యువతకు ఈ రంగం ఆశాకిరణంగా కనిపిస్తోంది. వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ సాంకేతికత, అందులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. నాలాంటి చాలామందికి ఇలాంటి వాటిపై ఆసక్తి ఉన్నా ఎలా ముందుకు వెళ్లాలో తెలియని పరిస్థితి. ఇలాంటి కార్యక్రమాలతో ఎంతో ప్రయోజనం ఉంటుంది.
– సీహెచ్ లిఖిత, బీటెక్ తృతీయ సంవత్సరం

ఈ రంగంలోనూ ఏఐ..

గేమింగ్, యానిమేషన్, కామిక్స్ రంగాలకు ఎప్పటినుంచో మంచి ఆదరణ ఉంది. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుంది. వీటిలో కూడా కృత్రిమ మేధను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నా. వీడియో, స్టోరీని ఎలా రూపొందించాలో నేర్పించారు. చదువుతున్న సమయంలోనే ఇలాంటి వాటిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది.
– ఎం.సాయివర్మ, బీటెక్ తృతీయ సంవత్సరం

గేమ్స్ రూపొందిస్తా..

రెండు రోజుల కార్యక్రమాల్లో సినిమాల్లోని వీఎఫ్ఎక్స్ ఎలా ఉపయోగిస్తారో తెలుసుకున్నా. నాకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. ఆ ఆసక్తితోనే ఈ కార్యక్రమానికి వచ్చాను. పిల్లల నుంచి పెద్దల వరకు గేమింగ్ యాప్స్ చాలా ఆడుతున్నారు. వాటికి విపరీతమైన ఆదరణ ఉంది. భవిష్యత్తులో గేమ్స్‌ను రూపొందించి ఉపాధి పొందాలనే ఆలోచన ఉంది.
– కె.జాగృతి, బీఎస్సీ తృతీయ సంవత్సరం

వెబ్‌సైట్‌లో ఫార్మసీ పోస్టుల జాబితా

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2 రాజమహేంద్రవరం పరిధిలోని ఫార్మసీ ఆఫీసర్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును జిల్లా వెబ్‌సైట్లలో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో నరసింహనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 20 నుంచి 23వ తేదీ లోపు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

8 మందికి సీఈవోలుగా ఉద్యోగోన్నతి

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ డ్వామా పీడీ వెంకటలక్ష్మి

సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్ ప్రసాద్

డ్వామా ఏపీడీ (కాకినాడ) జగదాంబ

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న 8 మంది అధికారులకు జడ్పీ సీఈవోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ● డీడీవో హోదాలో పనిచేస్తున్న కాకినాడ జడ్పీ సీఈవో వీవీవీ లక్ష్మణరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డ్వామా ఏపీడీ(కాకినాడ) పి.జగదాంబ, సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న కేఎస్‌వీ ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్ సీఈవోలుగా ఉద్యోగోన్నతి పొందారు. ● డిప్యూటీ సీఈవో హోదాలో ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, అమలాపురం డీడీవో జె.వేణుగోపాల్, తూర్పుగోదావరి జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిణి రత్నకుమారిలకు పదోన్నతులు లభించాయి.

పోస్టింగ్‌లపై తర్జన భర్జన

ఉద్యోగోన్నతులు పొందిన అధికారులను జడ్పీ సీఈవోలుగా, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలుగా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, బిల్లులు అప్‌లోడ్ చేయాలి. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో డ్వామా పీడీలు, ఏపీడీలు ఉన్న నేపథ్యంలో తక్షణం పోస్టింగ్‌లు ఇచ్చి, బదిలీ చేస్తే ప్రగతి కుంటుపడుతుందని, ఈ నేపథ్యంలో వీరికి మార్చి నెలలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉందని ఈ శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. కొత్త జిల్లాల్లో నూతన పాలకవర్గాలు ఏర్పడితే చాలామందికి సీఈవో పోస్టులు దక్కే అవకాశం ఉంది.

అగ్రనేతల సందడి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు..చిత్రంలో మాజీ మంత్రి యనమల, కేవీపీ రామచంద్రరావు, కొణతాల

అగ్రనేతలంతా ఒకేచోట సందడి చేసిన ఈ దృశ్యం తునిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, పాయకరావుపేట జనసేన నేత తోట నగేష్ కుమారుడి వివాహం సందర్భంగా నాయకులు హాజరయ్యారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, తోట నరసింహం, దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, రాజాఅశోక్‌బాబు, కరణం ధర్మశ్రీ, అవంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఏపీకి మద్దతు: ఎంపీ సానా

కాకినాడ నగరం: శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఏపీకి కేంద్రం తగిన మద్దతు ఇస్తోందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారని ఎంపీ సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. రాజ్యసభలో గురువారం తాను అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో అంతరిక్ష సాంకేతిక వినియోగం, విపత్తుల నిర్వహణ, స్టార్టప్‌లు, విద్యాసంస్థల్లో భాగస్వామ్యాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ద్వారా కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. మత్స్య రంగంలో నావిక్ ఆధారిత కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా మత్స్యకారులకు అన్ని రకాల సమాచారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వరదలు, తుపానులు, ఇతర విపత్తుల సమాచారాన్ని మత్స్యకారులు, రైతులకు అందించటంలో ఇస్రో తనవంతు పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి తెలిపినట్లు ఎంపీ వివరించారు.

వెబ్ డెవలపర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పీఎంకేవీవై) శిక్షణలో భాగంగా వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపీకృష్ణ తెలియజేశారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులుగా పేర్కొన్నారు. కోర్సు అనంతరం ఉపాధి కల్పిస్తారని, మరిన్ని వివరాలకు 90107 37998 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కుటుంబ సభ్యులు హింసిస్తున్నారని మహిళ ఫిర్యాదు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: తనకు ఇష్టం లేని పెళ్లి చేశారని, తనను హింసిస్తుండటంతో రక్షణ కల్పించాలంటూ లంపకలోవకు చెందిన ఓ వివాహిత ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పెళ్లికి ముందే వేరే వ్యక్తిని ప్రేమించానని చెప్పినా బలవంతంగా ఇంట్లో వారు పెళ్లి చేశారన్నారు. ఇదే విషయాన్ని భర్తకు చెప్పినా హింసించారన్నారు. దీంతో పాడేరు వెళ్లిపోయానన్నారు. విడాకులు ఇప్పిస్తామని పిలిపించి అమ్మ, అన్నయ్య, పెద్దమ్మ వేధించారని, తాళి కట్టిన వ్యక్తి చంపాలని చూశారని ఆరోపించారు. తనకు తానుగానే ఇంట్లోంచి వెలుపలకు వచ్చేశానన్నారు. రక్షణ కల్పించాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. హోంమంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. ఎస్సై లక్ష్మీకాంతంను వివరణ కోరగా ఈమె కనిపించడం లేదని పాయకరావుపేట పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుపై అక్కడ విచారిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల సూచనమేరకు ఆమెకు, ఇరువైపుల కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉందన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్ట్‌గేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్ట్‌గేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్ కలిగిన N/E 272 చ॥గ॥లు, N/F 272 చ॥గ॥ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

రాజమండ్రి దేవిచౌక్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ M/F కావలెను. Qul: డిగ్రీ. ✆ 99898 76799.

శ్రీలక్ష్మీవెంకటేశ్వర వెహికల్ ఫైనాన్స్ కొరకు ఆఫీస్ బోయ్, కలెక్షన్ బోయ్స్, 30-35 సం॥గల హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96662 19999.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ (Male) కావలెను. Contact Cell: 80991 91919.

రాజమండ్రి విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేయుటకు Asst. అకౌంట్స్ (F) కావలెను. బీకామ్ ఫ్రెషర్. టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి. ✆ 85006 44978.

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ కాకినాడలో కొత్తశాఖ కోసం డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వయస్సు 35 సం॥రాలు పైబడిన వారు. జీతం: 75,000/- వరకు+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. సంప్రదించండి: 6361185310.

రాజమండ్రిలో ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు వంటమనుషులు, లేడీ వార్డెన్, ఆయా కావలెను. జీతం + వసతి – భోజనం. Cont: 94937 15552

కడియంలో ప్రముఖ నర్సరీలో పనిచేయుటకు అనుభవం గల అకౌంటెంట్ (M/F) కావలెను. Contact Cell: 99488 36667.

FACULTY/ TEACHERS

Wanted Teachers to teach Primary & Higher English & Science Fluency in English is must. GopiKrishna EM High School, Gandhipuram-1, Rajahmundry. 8374208700, 9515542339

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 10, 13, వంకాయలు- 24, 36, బెండకాయలు- 36, పచ్చిమిర్చి- 55, 65, 70, కాకరకాయ- 50, బీర- 34, 38, క్యాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 32, దొండకాయలు- 40, 46, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 18, 25, దోసకాయలు- 36, చిక్కుళ్లు- 28, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 28, కీరదోస- 40, బీన్సుకాయలు- 80, అల్లం- 70, క్యాప్సికం- 60, బొబ్బర్లు- 28, చిలకడదుంపలు- 40, ఒకటి చొప్పున అనపకాయ- 15, 20, పొట్లకాయ- 20, 25, అరటికాయ- 6, 8, మునగకాడ- 12, 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 30, 42.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4ట్రీన్- బూకి, నవాబ్ కేఫ్, కపుల్ ఫ్రెండ్లీ, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4ట్రీన్- నవాబ్ కేఫ్, బూకి, కపుల్ ఫ్రెండ్లీ, విత్ లవ్, లక్ష్మి- సీతాపయనం, సత్యగౌరి - కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సినీఎస్ 1- పంకీ, సినీఎస్ 2- నారీ నారీ నడుమ మురారి, శ్రీప్రియ - హే బలవంత్, పద్మప్రియ- పంకీ, సూర్య1(వాలపూడి) - పంకీ, సూర్య 2.- అల్ఫా మెన్ లవ్ వెంజియన్స్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ.10 - మ.1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

కాకినాడ నగరం	80085 74157
సాంబమూర్తినగర్	91548 46719
మసీదుసెంటర్	91541 18210
గాంధీనగర్	80085 74159
బాలాజీచెరువు	80085 74154

పట్టపగలు వెలుగులకు అడ్డుకట్ట

స్పందనకు సంతసం

మసీదుసెంటర్: కాకినాడ రేచర్లపేట లోని ఓ వీధిలో పట్టపగలే వీధిదీపం వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతుందని 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేశారు.

రహదారిపై గుంతను పూడ్చారు..

మసీదుసెంటర్: కాకినాడ వల్లంరాజునగర్‌లోని ఓ వీధిలో కుడలి వద్ద రహదారి పగిలిపోయి అధ్వానంగా దర్శనమిస్తోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సమస్య పరిష్కరించారు.

పూడిక తీయడం లేదు

సమస్య: కాకినాడ పోస్టల్ కాలనీలో కాలువలను శుభ్రం చేయడం లేదు. మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసనతోపాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.

-సంజీవరావు, విశ్రాంత ఉద్యోగి, పోస్టల్‌కాలనీ

సమాధానం: సిబ్బందితో ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. మరలా ఒకసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-సుధారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలకసంస్థ

-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అక్కడే లీకులు.. అవే అవస్థలు

తూతూమంత్రంగా మరమ్మతులతో తరచూ అదే పరిస్థితి

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

నగర పరిధిలో తాగునీటి పైపులు పలు చోట్ల పగిలి లీకులు ఏర్పడుతున్నాయి. దీంతో శుద్ధిచేసిన నీరు వృథా కావడమే కాకుండా కలుషితంగా మారుతున్నాయి. లీకేజీలను పూర్తిస్థాయిలో అదుపు చేయడంలో తాగునీటి విభాగం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. మరమ్మతులు చేసిన చోట్లే మరలా లీకేజీ అవ్వటం ఇందుకు నిదర్శనం.

నగరంలో తాగునీటి సరఫరాకు నగరపాలక సంస్థ రూ.కోట్లలో ఖర్చు చేస్తోంది. సామర్లకోట, అరట్లకట్ట నుంచి రా వాటర్‌ను శశికాంత్ నగర్, విక్టోరియా వాటర్ వర్క్స్‌కు పైపులైన్ల ద్వారా రప్పించి శుద్ధి చేస్తున్నారు. అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని పంపి కొళాయిలకు సరఫరా చేస్తున్నారు. నీటి శుద్ధికి, విద్యుత్తు ఛార్జీలు, ఉద్యోగుల జీత భత్యాలకు రూ.కోట్లు వ్యయమవుతోంది. అయితే యంత్రాంగ నిర్లక్ష్యంతో లీకులతో వేలకొద్దీ లీటర్ల తాగునీరు ప్రతి నిత్యం వృథా అవుతోంది. పైగా ఆయాచోట్ల బురద నీరు పైపుల్లోకి వెళ్లి తాగునీరు కలుషితమవుతోంది. ఇటువంటి

బాలాజీచెరువు కోకనాడ క్లబ్ ఎదురుగా ప్రధాన రోడ్డులో లీకు

వాటిని గుర్తించి కట్టుదిట్టంగా నియంత్రించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ప్రతి నిత్యం ఏదో ఒకచోట పైపులైన్లు లీకవుతూనే ఉన్నాయి. సిబ్బంది మరమ్మతులు చేసి ఆపి మమ అనిపిస్తున్నారు. దీంతో అదే చోట మళ్లీ లీకవుతున్నాయి.

ఇలా అయితే వేసవిలో ఇక్కట్లే..

వేసవి వచ్చిందంటే నీటి వినియోగం పెరుగుతుంది. నగరంలో జనాభా వృద్ధి చెందినా ఆ స్థాయిలో తాగునీటి నిల్వల సామర్థ్యం పెరగలేదు. అరట్లకట్ట సమ్మర్ స్టోరేజ్ సామర్థ్యం 1232 ఎంఎల్‌లు కాగా, సామర్లకోట స్టోరేజ్ సామర్థ్యం 821 ఎంఎల్‌లు. నగరంలో 52 వేల వరకు కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజు వారీ నీటి వినియోగం 52 ఎంఎల్‌డీ. వేసవిలో నీటి వినియోగ పరిమితి దాటుతుంది. లీకులతో వేల లీటర్ల తాగునీరు వృథా అవుతోంది. వేసవి నేపథ్యంలో అయినా వీటికి పూర్తి స్థాయిలో కట్టడి చేయకుంటే ప్రజలకు తాగునీటి కొరత ఎదురు కాక తప్పదు.

చర్యలు తీసుకుంటాం..

తాగునీటి లీకులపై చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించి నివారణకు శాశ్వత చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం తాగునీటి విభాగ యంత్రాంగంతో సమావేశాన్ని నిర్వహిస్తాం. లీకేజీలు పునరావృతమయ్యే చోట్ల పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా నీరు వృథా అవుతుంటే సమాచారాన్ని స్థానికులు వెంటనే నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి కమిషనర్, నగరపాలక సంస్థ, కాకినాడ

నేర నియంత్రణే లక్ష్యం

ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ అధ్యక్షతన నేర సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులు, లాంగ్ పెండింగ్ కేసులు, ఫ్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు, వ్యక్తిగత దాడి, మాదకద్రవ్యాలు, ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతిని సమీక్షించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. వాటి నివారణకు సంబంధిత ఎస్సైలు, సీఐలు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి సమయాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, మద్యంతాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపాలన్నారు. నేర నివారణలో, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మసీదుసెంటర్: కుటుంబీకులు లేని శ్రీస్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ మృతదేహానికి భాను అంబేడ్కర్ గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. భానుగుడి సమీపంలో సుమారు 70 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు మృతిచెందాడు. కాకినాడ టూటౌన్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో మృతదేహానికి స్థానిక విష్ణుదేవ్ హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. అనాథ మృతదేహాన్ని గుర్తిస్తే 9347878713 నెంబర్‌కు సమాచారం అందించాలని నిర్వాహకులు సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో జ్యోతి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో జ్యోతి పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు గురువారం కాకినాడ నగరంలోని ప్రతాప్‌నగర్, టూటౌన్, అచ్యుతాపురం ప్రాంతాల్లో సాయిబాబా మందిరాల వద్ద బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కి సమాచారం అందించాలని సూచించారు. ఈసందర్భంగా స్థానికుల చేత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్ గౌరి, ఓఆర్‌డబ్ల్యు దుర్గా భవానీ, పారా లీగల్ వాలంటీర్లు మల్లికార్జున్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను దైవాలుగా పూజించండి

మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను దైవాలుగా పూజించాలని, కని పెంచి పెద్ద చేసిన వారిని వృద్ధాప్యంలో ఆదుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ సూచించారు. గురువారం స్థానిక రాజీవ్ గాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల పోషణ-రక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాల్లో వృద్ధులు, పిల్లలకు మధ్య బంధాలు బలంగా ఉండేవన్నారు. చిన్న కుటుంబాలు ఏర్పడటంతో వారి పట్ల ఆదరణ తగ్గిందన్నారు. కుటుంబ విలువలు పెంపొందించి తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు జి.సుబ్బలక్ష్మి, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు ముందుకు రావాలి

పేదలకు కళ్లజోళ్లు, దుస్తులను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యుడు సుబ్బారావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: పేదలకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు పి.వి.సుబ్బారావు అన్నారు. గురువారం రామారావుపేటలోని లయన్స్‌క్లబ్ హాల్లో బాదం బాలకృష్ణ ఛాత్, ఐ గ్లాస్ ప్రాజెక్టు ద్వారా సుమారు 80 మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు, దుస్తులను ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. ప్రాజెక్టు ఛైర్మన్ జి.వి.జగన్నాథరావు, డి.రామసుబ్రహ్మణ్యం, బాదం కృష్ణారావు, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను డీఈవో పిల్లి రమేష్ కోరారు. స్థానిక డీఈవో కార్యాలయంలో ఆయన విద్యాహక్కు చట్టం 'ఉచిత విద్య' ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లను కేటాయిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అనాథలు, ఓసీల్లోని అల్పాదాయ వర్గాలు ఈ ప్రవేశాలకు అర్హులని చెప్పారు. ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరకాస్తు చేసుకోవాలని రమేష్ సూచించారు. సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తులో వాహనం నడిపిన వారిపై కేసులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఒకటో పట్టణ పీఎస్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 6 మందిపై కేసులు నమోదు చేసినట్లు కాకినాడ ఒకటో పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు గురువారం తెలిపారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా నలుగురికి 2 రోజుల జైలు, ఇద్దరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై విచారణకు డిమాండ్

ఆందోళన చేస్తున్న బాధితులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండలం రమణయ్యపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.పాండురంగారావు అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని రాయుడుపాలెం గ్రామానికి చెందిన బాధితులు పాలిక సత్తియమ్మ, పాలిక రమణ, గుబ్బల సత్యవతి కోరారు. దీనిపై గురువారం కలెక్టరేట్‌లో తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావుతో కలిసి జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. తమ భూమిని కార్యదర్శి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బాధితులు ఆరోపించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జగన్నాథపురం రెల్లిపేటకి చెందిన జె.దుర్గాప్రసాద్(43) జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. వ్యక్తిగత కారణాలతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన అతడిని చికిత్సనిమిత్తం ఈనెల 18న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ● రామచంద్రపురం మండలం, రావిచెరువుకి చెందిన ఆర్.శివకుమారి(19) గడ్డిమందు తాగడంతో ఈనెల 18న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీనిపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్లాబురాయి ధ్వంసం

కాకినాడ వల్లంరాజునగర్‌లోని ఓ వీధిలో కల్వర్టుపై కాలువపై ఉన్న స్లాబురాయి ధ్వంసమై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. గతకొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువపై స్లాబురాయిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, మసీదుసెంటర్

వీధి దీపాలు వెలిగించరూ..

శాంతినగర్ నగరపాలక సంస్థ గ్రీన్‌బెల్ట్ రహదారిలో రెండు చోట్ల గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి చీకట్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

పాఠశాల చెంత చింత..!

నగరంలోని రామారావుపేట, మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులు భయం భయంగా గడుపుతున్నారు. పాఠశాల ప్రహరీ బీటలు వారి ఒరిగిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రధాన ద్వారం బయట మురుగుకాల్వను కొన్ని రోజులుగా శుభ్రం చేయక దోమలు బెడత విద్యార్థులను వెంటాడుతోంది. అధికారులు దృష్టిసారించి పాఠశాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్,

ప్రమాదకరంగా గుంత..

కాకినాడ అయోధ్యనగర్ ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా ఉంది. కళాశాలలు, పాఠశాలలు ఉన్న ప్రాంతం కావడంతో నిత్యం ఈ మార్గంలో వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంత కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని విన్నవిస్తున్నారు. -న్యూస్‌టుడే, మసీదుసెంటర్

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్: నగరంలోని విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంజయ్‌నగర్, పర్లోపేట, రాజీవ్‌గృహకల్ప, పాత పోర్టు రైల్వేస్టేషన్, తిలక్‌వీధి, పాత పోస్టాఫీసు వీధి, పెద్ద మార్కెట్, సినిమారోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

★ అన్నమ్మఘాటీ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నరసింహరోడ్డు, శివాలయంవీధి, తారకరామనగర్, అన్నమ్మఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర్‌నగర్, పప్పులమిల్లు ప్రాంతం, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవీనగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకానారాయణమ్మతోట, మునసబు కూడలి, కొవ్వూరు, తూరంగి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పెంపు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో వివిధ కోర్సుల ప్రవేశాలకు గడువు పొడిగించారని స్థానిక విద్యుత్తు నగర్ ఐడియల్ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, తదితర పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డిగ్రీ కోర్సుల్లో ఎటువంటి ఫీజులుండవని చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, ప్రజలను భాగస్వాములు చేసి, విజయవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాలు, పట్టణాల్లో వ్యర్థాలను సేకరించాలని పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీ త్యాగాలు స్ఫూర్తిదాయకం

పిఠాపురం: హిందూ ధర్మ పరిరక్షణకోసం ఛత్రపతి శివాజీ మహరాజ్ త్యాగాలు స్ఫూర్తిదాయకమని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పాదగయ క్షేత్రం నుంచి పట్టణమంతా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మణికుమార్, సురేంద్ర, లక్ష్మణ్‌శర్మ, కిషోర్, సతీష్, శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరిగమ పదనిస..

సంగీతంలో ప్రతిభ చూపుతున్న బాలబాలికలు

ఒకవైపు చదువుకుంటూనే తమకిష్టమైన సంగీతంలో శిక్షణ పొందుతూ కాకినాడ బాలభవన్ చిన్నారులు సత్తాచాటుతున్నారు. ప్రతిరోజూ సాధనతో ప్రతిభను మెరుగుపరచుకుంటున్నారు. దీంతో చదువులోనూ ఒత్తిడి దూరం చేసుకుంటున్నారు. సంగీతంలో తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

గాయకుడిగా రాణించాలని..

కాకినాడకు చెందిన జి.సాయి సందీప్ ప్రస్తుతం గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి శేఖర్ ఉద్యోగి, తల్లి గాయత్రి గృహిణి. ఆరో తరగతి పూర్తయిన తరువాత వేసవి సెలవుల్లో తల్లి ప్రోత్సాహంతో బాలభవన్‌లో గాత్ర సంగీత సాధన మొదలు పెట్టాడు. అదే సమయంలో కొందరు వయోలిన్‌పై సాధన చేస్తుండటం చూసి గాత్రంతోపాటు, వయోలిన్‌లోనూ శిక్షణ తీసుకోడం ప్రారంభించాడు. మూడేళ్ల కాలంలో మండల, జిల్లా స్థాయి సంగీత పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. కాకినాడ శిల్పారామం, విజయవాడ, అమలాపురం వంటి ప్రాంతాల్లో 25కు పైగా కచేరిల్లో గాత్ర, వయొలిన్ కచేరీలతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని, భవిష్యత్తులో ఆయనలా గొప్ప గాయకుడు కావాలనేది తన లక్ష్యమని పేర్కొన్నాడు.

కచేరీల్లో సత్తా

కాకినాడకు చెందిన బచ్చు శ్రీలక్ష్మి తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి వాసు చిరువ్యాపారి, దేవి గృహిణి. శ్రీలక్ష్మికి చిన్నప్పటి నుంచి సంగీతమంటే ఇష్టం. దీంతో తల్లిదండ్రుల బాలభవన్‌లో చేర్పించారు. ఏడేళ్లుగా గాత్ర సంగీతంలో విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి వద్ద శిక్షణ పొందుతోంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సంగీత పోటీలో పాల్గొని బహుమతులు గెలుచుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించే ప్రతిభా పోటీలతో పాటు, కాకినాడ, చెన్నై, బెంగళూరు, విజయవాడ వంటి ప్రాంతాల్లో జరిగిన సుమారు 30కు పైగా సంగీత కచేరీల్లోనూ పాల్గొని సంగీత ప్రియులను మంత్రముగ్ధుల్ని చేసింది. భవిష్యత్తులో గాత్ర సంగీతంలో తనకంటూ ఒక స్థానం సాధించాలనేది తన లక్ష్యమని శ్రీలక్ష్మి చెబుతోంది.

గాత్రం, వయోలిన్‌లో శశిధరుడు...

కాకినాడకు చెందిన అయ్యగారి శశిధర్ ఇంటర్ చదువుతున్నాడు. తల్లి శారద బాలభవన్ పర్యవేక్షకురాలు కావడంతో చిన్ననాటి నుంచే గాత్రం, వయోలిన్‌లను శ్రీరామమూర్తి వద్ద, వీణను తల్లి వద్ద సాధన చేయడం ప్రారంభించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సంగీత పోటీలకు హాజరై పతకాలు సాధించాడు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ వంటి అనేక నగరాల్లో జరిగిన సంగీత కచేరిల్లో పాల్గొని తన సంగీత ప్రతిభతో అందరినీ మెప్పిస్తున్నాడు. చదువులోనూ ఉత్తమ మార్కులు సాధిస్తున్నాడు. గాత్రం, వయోలిన్ విభాగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తానని శశిధర్ పేర్కొన్నాడు.

బెదిరించి డబ్బులు లాక్కున్న వ్యక్తికి రెండేళ్ల జైలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: చంపేస్తానని బెదిరించి ఇద్దరి వద్ద డబ్బులు లాక్కున్న కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ఉషాలక్ష్మీకుమారి తీర్పు చెప్పినట్లు పోర్టు పోలీసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 డిసెంబర్ 20న కాకినాడ, రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్‌కి చెందిన గుత్తుల రామారావు ఇంటి వద్ద ఉండగా అదే ప్రాంతానికి చెందిన నీలపు వీరకుమార్ వచ్చి చంపేస్తానని బెదిరించి రూ.300 లాక్కొన్నాడు. అక్కడే ఉన్న దుస్తులు అమ్ముకునే మరో వ్యక్తి వద్ద కూడా బెదిరించి డబ్బులు తీసుకున్నాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోర్టు ఎస్సై సతీష్‌బాబు కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రండి..! నారీశక్తిని చాటుదాం

కలెక్టరేట్‌లో ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఏపీజీఈఏ మహిళా ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 7న నిర్వహించే సదస్సుకు హాజరుకావాలని ఏపీజీఈఏ జిల్లా మహిళా విభాగం పిలుపునిచ్చింది. మార్చి 7న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే మహిళా దినోత్సవానికి ఆహ్వానిస్తూ గురువారం నగరంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగినిలకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎంవీఎస్ఎస్ నాగలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బి.ప్రభారాణి, కార్యదర్శి ఎంఎస్ఎస్ ప్రభ, కాకినాడ కార్యదర్శి వై.కల్పన బృందం ప్రభుత్వ కార్యాలయాల్లో కలియతిరిగి, మహిళా ఉద్యోగులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. సదస్సుకు హాజరై నారీ శక్తిని చాటాలని కోరారు.

వాల్వుకు మరమ్మతులు.. సరఫరా పునరుద్ధరణ

పనులను పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ డీఈఈ లక్ష్మీనారాయణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని 43వ డివిజన్, ప్రతాప్‌నగర్‌లోని మున్సిపల్ ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద దెబ్బతిన్న వాల్వుకు మరమ్మతులు పూర్తి చేశారు. బుధవారం రాత్రి ఇక్కడ పైపులైనుకు అనుసంధానం చేసే వాల్వు పగిలిపోవడంతో అక్కడ వీధులన్నీ జలమయం అయ్యాయి. వాటర్‌వర్క్స్ సిబ్బంది రాత్రంతా శ్రమించి, గురువారం ఉదయానికి మరమ్మతులు పూర్తి చేశారు. ఉదయం 6 గంటల నుంచి కొళాయిలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. సాయంత్రం పూట యథావిధిగా సరఫరా కొనసాగించడంతో ప్రతాప్‌నగర్, ట్రెజరీ కాలనీ, ఎస్.అచ్యుతాపురం, మధురానగర్, అశోక్‌నగర్, విద్యుత్తునగర్, నరసన్ననగర్ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అరట్లకట్ట రిజర్వాయరు నుంచి కాకినాడ తీసుకువచ్చే ముడి నీరు పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం, సాయంత్రం పూట ఈ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వాటర్‌వర్క్స్ డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం యథావిధిగా సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి

కమిషనర్ సత్యనారాయణ

శశికాంత్ నగర్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరంలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆయన శశికాంత్‌నగర్, ఆర్ఆర్ నగర్, సురేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల నుంచి ఇంటింటా చెత్తను సకాలంలో సేకరించాలని, డంపర్ బిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే డంపింగ్‌యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. శానిటరీ పర్యవేక్షకులు, ఇన్‌స్పెక్టర్లు ఉదయమే విధులకు హాజరై పర్యవేక్షించాలని సూచించారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న కుటుంబ సమగ్ర సర్వేకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. నరసన్న నగర్‌లో జరుగుతున్న సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ప్రతి కుటుంబంలో ఆర్థిక, సామాజిక, విద్యా సంబంధ విషయాలను సర్వేలో సేకరిస్తున్నారని, ఇంటికొచ్చే సిబ్బంది వివరాలను వెల్లడించాలని సూచించారు. ఉప కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆలయ వార్షికోత్సవ పూజలు

తాళ్లరేవు: స్థానిక ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పూలమాలలతో అయ్యప్ప స్వామిని అలంకరించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సత్యదత్త వ్రతం

పిఠాపురం: పిఠాపురం శ్రీపాద వల్లభ మహా సంస్థానంలో సత్యదత్త వ్రతం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వ్రతంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం శ్రీపాద వల్లభుడిని దర్శించుకున్నారు. ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అపర్ణాదేవి మాలధారణ దీక్షలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి మాలధారణ దీక్షలు చేపట్టే కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 23న అపర్ణాదేవి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులు మాల ధరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 రోజులపాటు దీక్ష కొనసాగిస్తారని ప్రధాన అర్చకులు ప్రభాకరశాస్త్రి తెలిపారు.

సహ విద్యార్థి చికిత్సకు సాయం

సామర్లకోట: పట్టణంలోని బలుసులపేటవీధిలోని శ్రీవిజ్ఞాన్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న హేమంత్ మెదడులో రక్తం గడ్డకట్టింది. చికిత్సకు రూ.4 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పారు. వారికి ఆర్థికంగా అది భారం కావడంతో సహ విద్యార్థులు చేదోడుగా నిలిచారు. తాము దాచుకున్న రూ.20 వేలు కరస్పాండెంట్ సత్యనారాయణకు అందజేశారు. ఆయన ఆ మొత్తానికి రూ.20 వేలు కలిపి రూ.1.20 లక్షలను హేమంత్ తల్లిదండ్రులకు గురువారం అందజేశారు.

నైతిక విలువలతో విద్య అందించాలి: ఎంపీ

పెద్దాపురం: విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. గురువారం పెద్దాపురంలోని జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మీ చదువు, నడవడిక కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కరస్పాండెంట్ ఖండే దినబాబు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

పెద్దాపురం: ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పెద్దాపురం పట్టణంలోని షాహి జామియా, షాహి జుమ్మా, చిన్నమసీదులో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పరిశీలన

బాలలే ఆడాలా.. యువత ఓడాలా..!

సౌకర్యాల్లేక డిగ్రీ విద్యార్థులు క్రీడలకు దూరం

– న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో పాఠశాల విద్యార్థులు మాత్రమే ఆటల్లో రాణిస్తున్నారు. వారు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ టెన్నిస్ క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇక పట్టణ ప్రాంతాల్లో పిల్లలు రగ్బీ, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, కరాటే, తైక్వాండో తదితరాల్లో రాణిస్తున్నారు. వీరంతా పదో తరగతి వరకు మాత్రమే ఆటలపై పట్టు సాధిస్తున్నారు. ఆ తరవాత సాధన చేసేందుకు సరైన మైదానాలు లేకపోవడంతో యువత ఆసక్తి కోల్పోతున్నారు. క్రీడా కోటా అందుకోలేకున్నారు. మానసిక, శారీరక వికాసం వారికి దూరమవుతోంది.

పిఠాపురంలో ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం

• ప్రతి నియోజకవర్గంలో 5 వేల మంది వరకు డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటున్నారు. దాదాపు అందరూ క్రీడలకు దూరంగానే ఉంటున్నారు. జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేయడానికే సమయం కేటాయిస్తున్నారు. కాగా వీరందరికోసం మైదానాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. పిఠాపురంలో రూ.100 కోట్లతో నిర్మిస్తామని ఇటీవల శాప్ ఛైర్మన్ రవినాయుడు కూడా ప్రకటన చేశారు. ప్రతి నియోజకవర్గంలో పనులు ఎప్పటికి మొదలవుతాయో చూడాల్సిన అవసరం ఉంది.

సమస్యలు ఇలా..

• పిఠాపురం పట్టణంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఆటలాడేందుకు సరైన మైదానం లేదు. ఇక్కడ ఎనిమిదేళ్ల క్రితం ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం రూ.2 కోట్లతో నిర్మించ తలపెట్టారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించక ఆ పనులు మధ్యలోనే వదిలేశారు. • కొత్తపల్లి, గొల్లప్రోలుల్లో ఉదయం, సాయంత్రం రన్నింగ్, ఖాళీ జాగా ఉంటే షటిల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేసుకుంటున్నారు. • కాకినాడ గ్రామీణం, కరప మండలాల్లో ఎక్కడా ప్రత్యేకంగా క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఈ రెండు మండలాల వారికి జిల్లా క్రీడా మైదానం మాత్రమే అందుబాటులో ఉంది. • పెద్దాపురం నియోజకవర్గంలో 2018లో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం ఆరంభించగా.. వైకాపా ప్రభుత్వంలో పనులు నిలిపేశారు. ఎంఆర్ కళాశాలలో అక్కడి విద్యార్థులు ఆడుకునేందుకే మైదానం ఉంది. • సామర్లకోటలోని క్రీడా మైదానంలో సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. ఇక్కడ వేలల్లో విద్యార్థులకు ఒకటే మైదానం సరిపోవడం లేదు. ఉదయం, సాయంత్ర వేళల్లో మైదానం నిండిపోతుంది.

ప్రోత్సహిస్తే పతకాలే..

యువత చదువుతోపాటు ఆటల్లో రాణిస్తే మానసిక, శారీరక వికాసం లభిస్తాయి. వారిని ప్రోత్సహిస్తే దేశానికి పతకాలు తెచ్చే క్రీడాకారులుగా తయారవుతారు. 3 శాతం క్రీడా కోటా అందుకుని కొలువుల్లో స్థిరపడతారు.

- ఎం.చక్రరావు, విశ్రాంత బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

క్రీడా కోటా కోల్పోతున్నారు

క్రీడా మైదానాలు కావాలని జిల్లా సంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. ఆటలపై పట్టు సాధించక పోవడం, పతకాలు గెలుచుకోకపోవడంతో క్రీడా కోటాను యువత సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు.

- పి.లక్ష్మణరావు, కోచ్, పిఠాపురం

21న విద్యుత్తుకు అంతరాయం

తాళ్లరేవు: తాళ్లరేవు ఉపకేంద్రం పరిధిలో ఈ నెల 21న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయభాస్కర్ తెలిపారు. • **పిఠాపురం:** పిఠాపురం పట్టణం, కోలంక, జమ్ములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు ఉండదని ఈఈ ప్రభాకర్ తెలిపారు. • **పెదపూడి:** సంపర, పుట్టకొండ, చింతపల్లి, కుమారప్రియం, కైకవోలు, కాండ్రేగుల, శహపురంలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు ఉండదన్నారు.

చేనేత గర్జన విజయవంతానికి పిలుపు

గొల్లప్రోలు: మంగళగిరిలో ఈ నెల 22న జరిగే చేనేత గర్జనకు కార్మికులంతా తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజూరి సుబ్రహ్మణ్య చక్రధరరావు పిలుపునిచ్చారు. గ్రామాల్లో గురువారం పర్యటించి కార్మిక సంఘాల ప్రతినిధులను కలిసి కరపత్రాలు పంచారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు మంగళగిరి తరలిరావాలని కోరారు.

గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

పిఠాపురం: పిఠాపురం పీఎంశ్రీ డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ సుజాత గురువారం తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది కళాశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. 38 మంది పరీక్ష రాయగా శ్రావ్య 95.06, యశోదరరాణి 84.36. శ్రీవల్లి 82.79, స్పందన 80.70, సాష్ణవిరాజ్ 69.56, గాయత్రీప్రసన్న 62.3 పర్సంటైల్ సాధించారన్నారు.

పన్ను కట్టండి.. ప్రగతి కనండి

గొల్లప్రోలు: ప్రజలు చెల్లించే ఇంటి, కుళాయి పన్నుల ఆదాయంతోనే గ్రామాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని ఎంపీడీవో సలాట్‌రాజు అన్నారు. తాటిపర్తిలో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధి పథకం సిబ్బంది నుంచి నగదు వసూలుకు ఆదేశాలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించిన సిబ్బంది, మేట్ల నుంచి రూ.11,339 వసూలు చేయాలని డ్వామా పీడీ వెంకటలక్ష్మి ఆదేశించారు. 2024-25 సంవత్సరంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ గొల్లప్రోలులో గురువారం జరిగింది. పథకం పేరు మారుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తిచేసి మార్చి 15లోగా బిల్లులు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఏపీడీ వసంతమాధవి, హెచ్ఆర్ మేనేజర్ విజయ్‌భాస్కర్, ఎంపీడీవో సలాట్ రాజు, ఈవోపీఆర్డీ కుమార్, ఏపీవోలు గంగాభవానీ, కొండలరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలు సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

నిరసన

కరప: వీఆర్వోల సమస్యలు తక్షణం పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆ సంఘ మండల నాయకుడు మేడిశెట్టి కిషోర్ కోరారు. కరప తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆయన పలువురు వీఆర్వోలతో కలిసి నిరసన తెలిపారు. పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. టేకుమూడి శ్రీనివాస్, కుంపట్ల గణపతి, వెంకటరమణ, చాగంటి వరుణ్ సత్యనారాయణ, భరణికుమార్ తదితరులు పాల్గొన్నారు. • **గొల్లప్రోలు:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు నల్లరిబ్బన్లు ధరించి గురువారం నిరసన తెలిపారు. • **తాళ్లరేవు:** మండల వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజు, శ్రీనివాసరావు నిరసనలో పాల్గొన్నారు. తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో వీఆర్వోలంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు వినతి పత్రం అందించారు. కట్టా శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రభుదాసు, సత్యవతి, చిన్ని పాల్గొన్నారు. • **సర్పవరం:** కాకినాడ గ్రామీణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

కరప తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు

ఆందోళన

కరప: సహకార సంఘ ఉద్యోగులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సిబ్బంది కోరారు. కరపలోని డీసీసీబీ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. పీఏసీఎస్ సీఈవో రాయుడు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు అమలయ్యే ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. అధిక బీమా కల్పించాలన్నారు. కూరాడ పీఏసీఎస్ ఛైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబు, నక్కా వీరభద్రరావు, శ్రీనివాస్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు. • **తాళ్లరేవు:** సీఐటీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ పోరాటంతోనే హక్కులు దక్కుతాయన్నారు. తాళ్లరేవు సహకార ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బొండం రామన్న, బోనం గౌరీశంకర్, పుణ్యమంతుల రాజేష్, టి.జి.సుబ్బిరెడ్డి, కాజులూరి విజయ భాస్కర్ రెడ్డి, కూర్మదాసు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక డీసీసీబీ బ్రాంచి ఎదుట నిరసనలో బాబ్జీ మాట్లాడారు. **సామర్లకోట:** స్థానిక రథం సెంటర్‌లో సామర్లకోట, అచ్చంపేట, వీకేరాయపురం, పెదబ్రహ్మదేవం, ఉండూరు, జి.మేడపాడు సొసైటీ ఉద్యోగులు నిరసన, ధర్నా నిర్వహించారు. మారుతీబాబు, వెంకటేశ్వరరావు, వీరబాబు, సాంబశివరావు, నవీన్‌కుమార్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో నినదిస్తున్న ఉద్యోగులు

కాలువ లేదు.. మురుగు కదలదు..

నడకుదురు ప్రధాన దారిలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి బంటాలతూము వరకు సీసీ డ్రెయినేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహాల్లోని మురుగు నీరు ఇళ్ల వద్దనే నిల్వచేరి అనారోగ్యాల పాలవుతున్నామని వాపోతున్నారు. ఈ సమస్య గురించి ఎంపీడీవో శ్రీనివాస్‌కు చెప్పగా డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

అప్రోచ్ ఛిద్రం.. అటుగా వెళ్లలేం..

పెద్దాపురం పట్టణంలోని పాత ప్రభుత్వాసుపత్రి వీధి నుంచి నువ్వులగుంట వీధికి వెళ్లే ప్రధాన దారి మలుపులో సీసీ రహదారి అప్రోచ్ ఛిద్రమైంది. ఈ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అప్రోచ్ మరమ్మతులకోసం పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

కళింగల శిథిలం.. వృథాగా జలం

గొల్లప్రోలు శివారు పిడిందొడ్డి దగ్గర ఏలేరు కళింగల శిథిలమై సాగునీటి మళ్లింపునకు రైతులు ఇబ్బందిపడుతున్నారు. కళింగల గోడలు బీటలు వారి ఏక్షణాన్నైనా కూలిపోయే దశకు చేరింది. నీటి ప్రవాహాన్ని నిలిపేందుకు కళింగల మధ్యలో ఉండే నిర్మాణం కూలిపోగా రైతులు ఇసుక బస్తాలు వేశారు. ఏఈ ప్రసన్నకుమార్ చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నిర్లక్ష్యం అలా.. నడిచేదెలా..!

పిఠాపురంలోని మాధవనగర్ పార్కులోని వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇసుక వేసి వదిలేయడంతో అందులో వృద్ధులు నడక వ్యాయామం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క పచ్చగడ్డి పెరిగి ఇబ్బందవుతోందని ఆరోపిస్తున్నారు. కమిషనర్ కనకారావు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

వంతెన తీరు.. జనం పడిపోరూ..

ఉప్పంగల లాకుల సమీపంలో కాలువ గట్టు, పంట కాలువకు అనుసంధానంగా కల్వర్టు నిర్మించారు. ఇరువైపులా రక్షణ గోడ లేదు. వాహనం అదుపు తప్పితే కాలువలోకి బోల్తా కొట్టే ప్రమాదం పొంచి ఉంది. ఈ కల్వర్టు పైనుంచే ఆక్వా ఉత్పత్తులను తరలిస్తారు. రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

300 ఏళ్ల నాటి ధ్వజస్తంభం తొలగింపు

తాళ్లరేవు: పోలేకుర్రులో శ్రీరామదాసా హనుమన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 300 ఏళ్ల నాటి ధ్వజస్తంభాన్ని గ్రామస్థులు గురువారం తొలగించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 28న కొత్తది ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

సర్పవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, జిల్లా భాజపా మాజీ అధ్యక్షుడు రామ్‌కుమార్ తెలిపారు. నేమాంలో తెదేపా ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ నాగభూషణం, కూటమి నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడండి

పిఠాపురం: రైతులు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడి, బృంద పర్యటనలు చేయాలని ఏవో గంగాధర్ కోరారు. గురువారం పి.రాయవరంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ॥ 10 - మ॥ 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కరప కొత్తపేటవీధిలో కొత్తగా వేసిన విద్యుత్తు స్తంభానికి వీధి దీపం లేక ఇక్కట్లు పడుతున్నాం. **- వెంకన్న**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణకు చెప్పగా సిబ్బందితో దీపం ఏర్పాటు చేయించారు.– న్యూస్‌టుడే, కరప

సమస్య: గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.- **స్థానికులు**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: స్థానిక సుబ్బయ్యమ్మపేటలో రహదారిపై చెత్తపోగులున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఆనంద్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులను పంపి శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కుంతీమాధవస్వామి ఆలయ సమీపంలోని డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. దోమలతో ఇబ్బందిపడుతున్నాం. **- శర్మ**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా కార్మికులతో కాలువల్లో పూడిక తీయించారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: కాకినాడ ఒకటో డివిజన్ రమణయ్యపేట చాకో గార్డెన్‌లోని మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయడం లేదు. **- ప్రభావతి**

పరిష్కారం: శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే కార్మికులతో శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట

ఛత్రపతి శివాజీ త్యాగాలు స్ఫూర్తిదాయకం

పిఠాపురం: హిందూ ధర్మ పరిరక్షణకోసం ఛత్రపతి శివాజీ మహరాజ్ త్యాగాలు స్ఫూర్తిదాయకమని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పాదగయ క్షేత్రం నుంచి పట్టణమంతా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మణికుమార్, సురేంద్ర, లక్ష్మణ్ శర్మ, కిషోర్, సతీష్, శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో ద్విచక్ర వాహన ర్యాలీలో విశ్వ హైందవ పరిషత్ నాయకులు

తాళ్లరేవు : కేశవపురంలో భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విత్తనాల కరిమిల స్వామి, యనమండ్ర విజయకుమార్, అల్లాడి మరియమ్మ, చెక్కా అజయ్, మేడిశెట్టి పవన్‌కుమార్, జోన్నలగడ్డ శ్రీనివాస్, రేకాడి దుర్గాప్రసాద్, పితాని శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. • **గొల్లప్రోలు:** ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గొల్లప్రోలు పట్టణ భాజపా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశంలో సంస్కృతి, సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు అహర్నిశలు కృషి చేసి ప్రాణాలు అర్పించిన యోధుడని కొనియాడారు. భాజపా పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, కర్రి సత్యనారాయణ, మలిరెడ్డి నారాయణరావు, తంగెళ్ల బాబూరావు, వెంకటరమణ, పోతుల వీరాస్వామి, తొగరు వెంకట్రావు పాల్గొన్నారు.

ఉద్యమంలా జనసేన సభ్యత్వ నమోదు

సర్పవరం: కాకినాడ జిల్లాలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ఉద్యమంలా చేపట్టాలని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ విద్యుత్తునగర్‌లోని ఎంపీ కార్యాలయంలో పిఠాపురం నాయకురాలు డా.దివ్యరాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

సినిమా చిత్రీకరణ ప్రారంభం

తాళ్లరేవు : పి.మల్లవరంలోని శ్రీదేవి భూదేవిసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎస్.రాయ్ క్రియేషన్ ప్రొడక్షన్ నం.2 చిత్ర బృంద సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. షూటింగ్ ముహూర్తం షాట్‌ను తెదేపా మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ ప్రారంభించారు. చిత్ర డైరెక్టర్ రామ్‌ప్రకాశ్ విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా గ్రామీణ వాతావరణంలో సినిమా చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు.

కుండీ.. ఎండి..!

– న్యూస్‌టుడే, కరప

గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీలు వినియోగంలోలేక ప్రభుత్వం ఆయా నిర్మాణాలకు వెచ్చించిన నిధులు వృథా అయ్యాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ గ్రామీణంలో వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపై చాలా మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. వేసవి సమీపిస్తున్న వేళ భూగర్భ జలాలు అడుగంటి చెరువులు, కాలువలు ఎండిపోయి నీటి సమస్యలు తలెత్తుతున్నాయని గతంలో మూగజీవాలకు దాహార్తి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాగునీటి కుళాయిలు, బావులు, చేతిపంపుల వద్ద కుండీలు నిర్మించింది. ఇంతవరకు బాగానేఉన్నా.. ప్రస్తుతం ఆ కుండీల్లో నీరుపోసే నాథుడెవరూ లేకపోవడంతో ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వాటి వద్ద కుళాయి కనెక్షన్లు దెబ్బతిన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడగ్గా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెనుగుదురులో నీళ్లులేకుండా నిరుపయోగంగా నిర్మాణం

కాలువల ఆక్రమణలతో కాలనీల ముంపు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం: కాకినాడ పరిధిలోని కాలువల ఆక్రమణల కారణంగా కాలనీలకు ముంపు సమస్య తప్పడం లేదని ఎమ్మెల్యే నానాజీ గురువారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రస్తావించారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని, మురుగు కాలువ వ్యవస్థ మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. తిమ్మాపురం నుంచి రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, కాకినాడ అర్బన్ ఎస్.అచ్యుతాపురం పరిధిల్లోని గాడేరు, పేటకాలువల ఆక్రమణలతో సమీప కాలనీలు ఏటా వర్షపు నీట మునుగుతున్నాయన్నారు. కాకినాడ అర్బన్‌లో మాజీ శాసనసభ్యుడు 2009లో కాలువపై భవనం నిర్మించారన్నారు. దానికి బదులుగా ఇచ్చిన స్థలంపై నివాస్ కమిటీ ఇచ్చిన నివేదికను బయటపెట్టాలన్నారు.

'కార్యదర్శి అక్రమాలపై విచారణ చేయించాలి'

కాకినాడ కలెక్టరేట్: రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని రాయుడుపాలేనికి చెందిన బాధితులు పాలిక సత్తియమ్మ, రమణ, గుబ్బల సత్యవతి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావుతో కలిసి జేసీ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. రాయుడుపాలెంలో సర్వే నంబరు 33లో పూర్వీకుల ద్వారా సక్రమించిన 1,694 గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు ఆరోపించారు. దీనిని రద్దు చేసి, న్యాయం చేయాలని కోరారు. ఏసీబీ, విజిలెన్స్ విచారణ చేయించాలని బాధితులు జేసీకి విజ్ఞప్తి చేశారు.

వేలం ప్రకటన

మహారాజ శ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.14/2021 in O.S.No.587/2017
Between:
అడపా అప్పలరాజు ... డిక్రీ హోల్డర్
మరియు
బైలపూడి శ్యామలరావు ... జడ్జిమెంట్ డేటార్

పై నెంబరు గల E.P. పిటిషన్ లో జడ్జిమెంట్ డేటార్ నుండి డిక్రీ హోల్డర్ కు రావలసిన డిక్రీ బాకీ నిమిత్తం జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది.02-03-2026 వ తేదీన ఉదయం 10:30 ని॥ల నుండి యిస్తిహారు షరతులకు లోబడి పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవరైనా పాడదలచిన వారు ది. 02-03-2026 వ తేదీన ఉదయం 10:30 ని॥ కు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పిఠాపురం సబ్ రిజిస్ట్రీ, చిత్రాడ గ్రామ పంచాయితీ లో చేరిన, చిత్రాడ గ్రామం, డో.నెం.గ-240, గల 136 1/2 చ॥ గ॥ ల స్థలములో నిర్మించిన జి+1 ఆర్.సి.సి బిల్డింగ్ నకు హద్దులు
తూర్పు: తుంగల సింహాచలం గారి గోడ, దక్షిణం: రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: నిరోగి మరిడయ్య గారి స్థలం.
పై భవనంలోని జడ్జిమెంట్ డేటార్ కు గల 1/2 వ వంతు అనిర్దిష్టపు వాటా 68.25 చ॥గ॥ ల స్థలంతో అన్ని ఈజుమెంటు హక్కులతో సహా వేలం వేయబడును.
విలువ
DHR విలువ:10,00,000/- x 1/2 = 5,00,000/-
అమీనా విలువ:25,00,000/- x 1/2 = 12,50,000/-
MVC విలువ:22,06,500/- x 1/2 = 11,03,250/-
P.V.S.R MURTHY Advocate, Pithapuram, cell: 9848006149

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

జడ్.రాంగపేట సీహెచ్‌సీని పరిశీలించిన అధికారి కె.మహేష్

మెరుగైన వైద్యంతోపాటు ఆసుపత్రి శుభ్రత ముఖ్యమే..

గండేపల్లి, న్యూస్‌టుడే: ఆసుపత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యంతో పాటు, పరిశుభ్రమైన ఆసుపత్రి సేవలను అందించాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల జిల్లా అధికారి కె.మహేష్ అన్నారు. గురువారం గండేపల్లి మండలం జడ్.రాగంపేట సీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఆయన రోగులతో మాట్లాడుతూ సేవల్లో నిర్లక్ష్యం వహించినా, వైద్యులు అందుబాటులో లేకున్నా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. వైద్య అధికారి ప్రణీత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

తుని: క్రమశిక్షణతో విద్యార్థులు మంచి భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలి వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 103 ఎలెక్ట్ గవర్నర్ డీఎస్ మూర్తి అన్నారు. సీతారాంపురం పురపాలక ఉన్నత పాఠశాలలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, అధ్యక్షుడు జూారెడ్డి చిరంజీవి, కుందెం సత్యనారాయణ పాల్గొన్నారు.

తుని గ్రామీణం: డి.పోలవరం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో 'పది' చదువుతున్న 93 మంది విద్యార్థులకు సూర్యోదయ సేవా సమితి సభ్యులు గురువారం పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సూర్యోదయ సేవా సమితి సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుదారిని మూయించిన పోలీసులు

కత్తిపూడిలో రహదారిని మూసివేయిస్తున్న పోలీసులు

శంఖవరం: కత్తిపూడి బంక్ సెంటర్‌లో మృత్యుదారిగా ఉన్న జంక్షన్‌ను గురువారం పోలీసులు మూసి వేయించారు. బుధవారం రాత్రి ఇదే జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ఇక్కడ సుమారు 10 ప్రమాదాలు జరగగా నలుగురు మృత్యువాత పడ్డారని, పలువురు గాయపడ్డారన్నారు. ఇంత ప్రమాదకర దారిని రాకపోకలు జరగకుండా మూసివేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు

తుని పెద్ద మసీదు ఇఫ్తార్‌లో ముస్లింలు

తుని, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభించారు. తెల్లవారు జామున 5 గంటలకు సహరీతో రోజా (ఉపవాసం) ప్రారంభించి సాయంత్రం ఇఫ్తార్‌తో విరమించారు. సమాజంలో అందరూ బాగుండాలని అల్లాహ్, ఆయన ప్రవక్త మహమ్మద్‌ను వేడుకున్నారు. చిన్నపెద్ద ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేసి, ఖురాన్ పఠనం, ఆధ్యాత్మిక చింతనతో మెలుగుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని మసీదుల్లో సందడి వాతావరణం నెలకొంది.

మలుపులు.. కానరావు సూచికలు

ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో ఇలా..

శంఖవరం, తొండంగి, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు, తుని నియోజకవర్గంలోని ఏనిమిది మండలాల్లోని ప్రధాన రహదారులు చాలాచోట్ల భారీ మలుపులతో కూడి ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద పిచ్చి మొక్కలు కమ్మేయడం, సూచికబోర్డులు లేకపోవడం కొన్నిచోట్ల వివిధ నిర్మాణాలు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదు. వేగనిరోధకాలు, ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి పలువురు క్షతగాత్రులు అవుతుండగా మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఎక్కడెక్కడంటే..

కత్తిపూడి నుంచి శంఖవరం మీదుగా రౌతులపూడి, కోటనందూరు వెళ్లే ప్రధాన రహదారిలో శంఖవరం సిద్దావారి చెరువు, బంగారయ్యపేట రౌతులపూడి వద్ద ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. ఈ రహదారిలో భారీ వాహనాలు సైతం నిత్యం తిరగడంతో అటువైపు ప్రయాణించే వారంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ● శంఖవరం మండలం నెల్లిపూడి నుంచి కొంతంగి వెళ్లే రహదారిలో మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ● ప్రత్తిపాడు-పెద్దిపాలెం రహదారిలో నిత్యం పర్యాటకులు వెళుతుంటారు. ఈ రహదారిలో సూచిక బోర్డులు లేక ఒమ్మంగి సమీపంలో మలుపు వద్ద గత సంవత్సరం పర్యాటకులతో వెళుతున్న వ్యాను తిరగబడి సుమారు 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. ● ఉత్తరకంచి-పెదశంకర్లపూడి రహదారి ఎక్కువ మలుపులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ● ఏలేశ్వరం మండలంలోని జాతీయ రహదారి నుంచి పేరవరం, లింగంపర్తి చేరుకునే గ్రామాలకు భారీ మలుపులు ఉన్నాయి.

కృష్ణాపురం-జిల్లెడపాడు రహదారిలో మలుపు

కత్తిపూడి నుంచి కొత్తురు వెళ్లే రహదారిలో..

ఇలాంటి చర్యలతో అడ్డుకట్ట..

మలుపులు ఉన్న చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రేడియం స్టిక్కర్లు అంటించాలి. తుప్పలు తొలగించి వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చు. ● తొండంగి మండలంలో కృష్ణాపురం నుంచి జిల్లెడపాడు, కోదాడ నుంచి గొర్సపాలెం, శృంగవృక్షం నుంచి కోదాడ, ఎ.కొత్తపల్లి నుంచి పీఈచిన్నాయిపాలెం, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

శంఖవరం, న్యూస్‌టుడే: మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై గురువారం సామాజిక తనిఖీ నిర్వహించారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి ఇతర అధికారుల ఆధ్వర్యంలో పనుల వివరాలను వెల్లడించారు. రూ.2.33 లక్షలు రికవరీకి ఆదేశించామని వివిధ పనులకు రూ.6 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. ఎస్.లక్ష్మణరావు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నందనవనంలో శ్రీపుష్పయాగం

రౌతులపూడి, న్యూస్‌టుడే: నందనవనంలోని శ్రీఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి వైభవంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. భక్తులు మిఠాయిలు, పూలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

ఓటర్ల మ్యాపింగ్‌పై అవగాహన

రౌతులపూడి: తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల మ్యాపింగ్‌పై బీఎల్వోలకు ఈఆర్వో శ్రీనివాసరావు గురువారం అవగాహన కల్పించారు. ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ చేసే విధానాన్ని తెలిపారు. నమూనా, తొలగింపు, మార్పులు, చేర్పులు తదితర అంశాలను చర్చించారు.

గుర్తింపు నంబరు తప్పనిసరి

శంఖవరం: పట్టాదారులకు గుర్తింపు నంబరు తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయాధికారి గాంధీ అన్నారు. శంఖవరంలో గురువారం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసి రైతులకు గుర్తింపు నంబరు ఇస్తున్నామన్నారు.

ఏలేశ్వరం డీసీసీబీ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారుల ఆందోళన

సహకార ఉద్యోగుల ఆందోళన

తునిలో సమ్మె చేస్తున్న డీసీసీబీ ఉద్యోగులు

ఏలేశ్వరం, తుని పట్టణం, గండేపల్లి, న్యూస్‌టుడే: ఏలేశ్వరం, తుని పట్టణం, గండేపల్లి డీసీసీబీ శాఖల కార్యాలయాల వద్ద గురువారం సహకార సంఘాల అధికారులు, సిబ్బంది దీక్షలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. 2019-24 కు సంబంధించి వేతన సవరణ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. లింగంపర్తి, ఎర్రవరం, రాజవొమ్మంగి సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు. సహకార సంఘాల కార్యదర్శులు సమ్మెలో పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం ఛత్రపతి శివాజీ

జగ్గంపేట కళాశాలలో శివాజీ చిత్రపటం వద్ద..

జగ్గంపేట గ్రామీణం, ఏలేశ్వరం, తొండంగి, న్యూస్‌టుడే: దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలన దక్షతలో ఛత్రపతి శివాజీ నేటి యువతకు ఆదర్శమని ప్రిన్సిపల్ డా. డి.చెన్నారావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం శివాజీ మహారాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని రక్షించిన మహాపురుషుడని కొనియాడారు. అధ్యాపకులు మల్లికార్జునరావు, సత్యలత, రూప్లీదేవి గోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. ● ఏలేశ్వరంలో ఛత్రపతి శివాజీ జయంతిని గురువారం ఏలేశ్వరంలో నిర్వహించారు. కౌన్సిలర్ ఆలమంద చలమయ్య గుర్రయ్య ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తొండంగిలో ఛత్రపతి శివాజీ జయంతిని యల్లయ్యపేట, పీఈ చిన్నాయిపాలెంలో గురువారం నిర్వహించారు. ఆత్మకమిటీ ఛైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కేడ వెంకటరమణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వీఆర్వోల బాధ్యతపై స్పష్టత ఇవ్వాలి

ఏలేశ్వరం, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎ.కిషోర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపాలని కోరారు. కొంగరి శ్రీను, సత్యారావు, చిట్టిబాబు, వీఆర్వోలు, సర్వేయర్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. ● గండేపల్లి మండలం వీఆర్వోలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలకు వెళ్లి సచివాలయాలకు వెళ్లి మళ్లీ వెనక్కి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, కృష్ణ, అప్పారావు, అబ్బులు తదితరులు పాల్గొన్నారు. వీఆర్వోల బాధ్యతపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతూ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి వీఆర్వోలు నిరసన వ్యక్తం చేశారు. తమ విధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేసి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

ఆన్‌లైన్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలు చూస్తున్న ఏవో

తొండంగి, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు అందాలంటే (ఏపీఎఫ్‌ఆర్) ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని ఏవో ఎం.పద్మశ్రీ అన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఆశాఖ సిబ్బంది చేస్తున్న రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాగుదారు ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు వలె అన్నదాతకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా 11 అంకెల గుర్తింపు సంఖ్య (రైతు ఐడీ) అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ పథకాల అమలుకు ఇది తప్పనిసరి చేస్తారన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే ఈ ఐడీ ఉండాలన్నారు. మండలంలో 10,180 రైతులు ఉండగా 8,795 మంది రిజిస్ట్రీ చేయించుకున్నారని మిగిలిన వారు 28 లోపు చేయించుకోవాలన్నారు. ఏఈవో సతీష్, వీఏ దేవి ఉన్నారు.

తునిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి

శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని నియోజకవర్గంలో యువతకు ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆమె గురువారం మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర చరిత్రలోనే పెద్ద బడ్జెట్‌గా నిలుస్తుందన్నారు. 11.7 శాతం వృద్ధి రేటు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. మత్స్యకార సంక్షేమానికి కేటాయింపులు, వారికి పింఛను పెంచడం వారిపై ప్రభుత్వానికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుందన్నారు. తునిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని ఆశాఖ మంత్రిని కోరారు. ఎమ్మెల్యే దివ్య ప్రసంగాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కితాబు ఇచ్చారు.

మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం

గండేపల్లి మండలం పాతనాయకంపల్లి ప్రాథమిక పాఠశాలలో బాలుర మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నెల తరబడి వీటిని శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు వినియోగిస్తే రోగాలు వచ్చేలా ఉన్నాయి. వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

కాలువ ఎందుకు నిర్మించినట్లో..!

తుని పట్టణంలోని రామకృష్ణాకాలనీ, జ్యోతినగర్‌కు మధ్య ఉన్న చర్చి ఎదురుగా ఇటీవల నిర్మించిన సీసీ డ్రైనేజీ నిరుపయోగంగా మారింది. రూ. లక్షలు పైగా ఖర్చుచేసి నిర్మించిన ఈ కాలువలో మురుగు వెళ్లే దారిలేక దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల నిర్మించిన ఈ కాలువ ఎత్తుపల్లాలు సరిచూడకుండానే నిర్లక్ష్యంగా నిర్మించారని అంటున్నారు. దీంతో పక్కనే ఉన్న పాత కాలువ మురుగంతా తమ ఇళ్ల వైపు వచ్చేస్తోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని

వామ్మో..ఇలాగైతే ప్రమాదాలు జరగవా..?

తుని గ్రామీణ మండలంలోని డి.పోలవరం నుంచి కోటనందూరు రోడ్డుపై రెండుపక్కల అదనపు లోడుతో పరుగులు తీస్తున్న వాహనాన్ని చూసి ఇతర వాహనచోదకులు ఆందోళన చెందారు. ఏదైనా ప్రమాదం జరిగితే వ్యానులోని వారితోపాటు వెనుక వచ్చేవారికి ప్రమాదమే. పోలీసులు నిబంధనలు ఉల్లంఘించి వెళ్తున్న ఇలాంటి వాహనాలపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

సచివాలయ భవనం పూర్తయ్యేనా..?

కిర్లంపూడిలోని రెండు సచివాలయ భవన నిర్మాణాలు సగంలోనే నిలిచాయి. ఒకటి శ్లాబు పూర్తయి కొంత కట్టుబడి జరిగింది. మరొకటి పునాది స్థాయిలోనే నిలిచింది. వీటి నిర్మాణాలకు రూ. లక్షలు ఖర్చుచేశారు. భవనాలు పూర్తికాక సిబ్బంది ఇతర కార్యాలయాల్లో సర్దుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి భవనాలను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

ఆదమరిస్తే పెను ప్రమాదమే..!

జగ్గంపేట గ్రామీణ మండలం రామవరం నుంచి మల్లిపాక వెళ్లే మార్గంలో పోలవరం కాలువ వంతెన ప్రమాదాన్ని తలపిస్తుంది. వంతెనకు ఇరువైపులా ఎటువంటి రక్షణగోడ లేదు. మల్లిపాక నుంచి వచ్చే వాహనదారులు మలుపు దాటుకుని వంతెనపైకి వచ్చే సమయంలో ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట అంధకారంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు దృష్టిసారించి వంతెనకు ఇరువైపులా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

ఉపకారాగారం తనిఖీ

సబ్‌జైలులో జడ్జి గోపీనాథ్, తహసీల్దార్ సూర్యప్రభ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి గోపీనాథ్ నేతృత్వంలోని అధికారుల బృందం ప్రత్తిపాడు ఉపకారాగారాన్ని గురువారం తనిఖీ చేశారు. కుల వివక్ష చూపుతున్నారా అని ఖైదీలను ఆరా తీశారు. అటువంటి పరిస్థితులు ఎదురైతే ఫిర్యాదు చేయాలన్నారు. తహసీల్దారు ఎం.సూర్యప్రభ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం

కోటనందూరు, న్యూస్‌టుడే: కోటనందూరు భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరం గురువారం నిర్వహించినట్లు వైద్యుడు సోమేశ్వరరావు తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆయన చిన్నారులకు వ్యాయామాలు చేయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు తగు జాగ్రత్తలు సూచించారు. ఐఈఆర్‌పీలు గోవింద్, నారాయణరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలో ఎంపీటీసీలకు గౌరవ వేతనం జమ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పదవీ కాలం ముగుస్తున్నందున సర్పంచులను సన్మానించారు. ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశం గురువారం దీనికి వేదికైంది. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఆయన సర్పంచులను సన్మానించారు. అంతకుముందు ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం చెల్లించాలని ఆందోళన చేశారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు వివరణ ఇస్తూ రూ.9.57 లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే చెల్లిస్తామన్నారు.

పారని మురుగుతో కాలనీవాసుల అవస్థలు

జగ్గంపేట గ్రామీణం మండలంలోని రామవరం సగరకాలనీలో మురుగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో పలు వీధుల్లో కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో రోడ్లపైనే తిష్ఠవేస్తున్న పరిస్థితి నెలకొంది. సిమెంటు రోడ్లపై సైతం మురుగు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు దృష్టిసారించి మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు రక్షణ

మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు రక్షణ లభిస్తుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పడాల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలకు కిట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మన్ పడాల సూర్యప్రసాద్, ఉపాధి హామీ అధికారులు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా హిందీభాషా వేడుక

వి.కొత్తూరు కేజీబీవీలో చిన్నారుల ప్రదర్శన

తుని గ్రామీణం: వి.కొత్తూరు పరిధిలో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలలో భాష పండుగల్లో భాగంగా గురువారం హిందీ వేడుకను నిర్వహించారు. విద్యార్థులు హిందీభాషకు సంబంధించిన సూక్తులు చార్టుల్లో రాసి ప్రదర్శించారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల క్షేత్ర పరిశీలన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేరు జలాశయం సమీపంలోని మణిహంస పవర్ ప్రాజెక్టును దివిలి కిట్స్ కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా గురువారం సందర్శించారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగు విద్యార్థులు థర్మల్ శక్తి విద్యుత్‌గా మారడాన్ని పరిశీలించారు. విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ ప్రక్రియలను స్వయంగా చూశారు. బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు వంటి సాంకేతిక వనరుల పనితీరును తెలుసుకున్నారు. విద్యుత్తు పొదుపు, భద్రత చర్యలు, పర్యావరణానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్, సత్యనారాయణ, మణికుమార్, భవానీ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

ఏలేశ్వరంలోని పవర్ ప్రాజెక్టును సందర్శించిన కిట్స్ విద్యార్థులు

గురుకుల పాఠశాలలో కొవ్వొత్తులతో నిరసన

చిన్నారులపై అకృత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ అన్నారు. మదనపల్లెలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అకృత్యానికి నిరసనగా డా.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన చేపట్టి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. నీలపల్లి అప్పారావు, రైతుకూలీ సంఘం నాయకులు రామలింగేశ్వరరావు, బత్తిన శ్రీను, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాగు భూములకు ఈ-నమోదు తప్పనిసరి

జగ్గంపేట గ్రామీణం: మండల పరిధిలోని రైతులు ఏపీఎఫ్‌ఆర్ వెబ్‌సైట్‌లో ఈ నమోదు చేసుకోవాలని ఏడీఏ జి.శ్రీనివాస్ సూచించారు. కాట్రావులపల్లి, జగ్గంపేట, సీతానగరం గ్రామాల్లో గురువారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంటలను నమోదు చేసుకోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే ప్రోత్సాహకాలకు అర్హులవుతారన్నారు. ఏఓ నరసింహం, రైతులు పాల్గొన్నారు.

టమాటా ధర నేలచూపు

రూ.10కి రైతు వద్ద కొని.. రూ.20కు విక్రయిస్తూ..

న్యూస్‌టుడే, తుని గ్రామీణం: కూరగాయల్లో టమాటకో ప్రత్యేక స్థానం ఉంది. ఏ కూరలోనైనా వేసుకొని వండుకునే అవకాశం ఉండటంతో రోజూ మార్కెట్‌లో టమాటాలకు గిరాకీ ఉంటుంది. అయితే స్థానికంగా టమాటాలను రబీ సీజన్‌లో మెట్టప్రాంతంలో విస్తారంగా పండించడం అనవాయితీగా మారింది. ఈ ఏడాది ప్రారంభంలోనే టమాటా ధర రోజురోజుకు దిగజారిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూసే పరిస్థితి. పెరిగిన పురుగు మందులు, ఎరువుల ధరల నేపథ్యంలో పెట్టుబడి ఆకాశాన్ని తాగడం ఉత్పత్తి ధరలు మాత్రం నేలచూపులు చూడటంతో రైతు ఆందోళనతో ఉన్నాడు.

తుని నియోజకవర్గంలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాల పరిధిలోని మెట్టప్రాంత భూముల్లో సుమారు 200 ఎకరాలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 50 ఎకరాలకు పైగా ఈ ఏడాది టమాటను సాగుస్తున్నాట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా. అయితే ఎకరాకు సుమారు రూ.40 వేలకు పైగా పెట్టుబడి. ఈ ఏడాది పంట ప్రారంభంలో వచ్చిన తుపానుతో పెట్టుబడి మరో 20 శాతం వరకు పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రారంభంలో రైతుల పండించిన టమాటలను కిలో రూ. 16 నుంచి రూ. 20 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. వారం రోజులుగా వీటి ధర దిగజారుతూ రూ.10 దిగింది. వ్యాపారులు మాత్రం వినియోగదారులకు మాత్రం కిలో రూ.20 నుంచి రూ.25కు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణలో అధికారులు చొరవచూపి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

చామవరంలో మార్కెట్‌కు టమాటాలను తరలిస్తున్న రైతు

మట్టి నమూనాల సేకరణ

సేకరించిన మట్టి నమూనాలు

కోటనందూరు, న్యూస్‌టుడే: కోటనందూరులోని సేంద్రియ వ్యవసాయం చేస్తున్న గ్రామాల నుంచి సుమారు 518 మట్టి నమూనాలు సేకరించినట్లు ఏడీ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నమూనాలను పరీక్ష నిమిత్తం సామర్లకోటలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపించామన్నారు. పంట సాగుకు తగిన పోషకాలు లేనప్పుడు దిగుబడి తగ్గుతుందన్నారు. పరీక్షల నివేదిక ఆధారంగా భూమిలోని పోషకాలను (నత్రజని, భాస్వరం, పొటాషియం) విశ్లేషించి, పంట దిగుబడి మెరుగుపడేందుకు రైతులకు తగు సూచనలిస్తామన్నారు.

(c) eenadu

పిన్నవయసు న్యాయమూర్తి


మంజునాథ నాయక

కార్వార, న్యూస్‌టుడే : శిరసి తాలూకా హెగడె కట్టాకు చెందిన సుమంత్ మంజునాథ నాయక (25) పిన్నవయసులోనే న్యాయమూర్తి పదవిని అందుకున్నారు. గత ఏడాది జాతీయ స్థాయిలో నిర్వహించిన సంబంధిత పరీక్షల్లో కర్ణాటక నుంచి పరీక్ష రాసి రెండో ర్యాంకు సాధించారు. బెంగళూరు లోకాయుక్త న్యాయస్థానంలో ఆయన తండ్రి మంజునాథ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. తండ్రి మంజునాథ్, తల్లి సుజాతల ప్రోత్సాహంతో పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో తొమ్మిదో ర్యాంకు, శిరసి ఎంఈఎస్ కళాశాలలో పీయూ పూర్తి చేసి, హుబ్బళ్లిలోని కర్ణాటక రాష్ట్ర విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల న్యాయవిద్యను అభ్యసించారు.

పడమటి కొండ వేడెక్కుతోంది..

మంగళూరు, న్యూస్‌టుడే : పశ్చిమ కనుమలు, బేడ్తి, అఘనాశిని నదులను రక్షించాలని కోరుతూ ఐదో తరగతి చదువుతున్న గానవి అనే బాలిక ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయడం సామాజిక మాధ్యమాల్లో చర్చకు ఊతమిచ్చింది. 'నేను దిల్లీకి దూరంగా ఉన్న సుందరమైన పశ్చిమ కనుమల్లోని ఒక కుగ్రామంలో ఉంటాను. నిత్యం పక్షుల కిలకిలారావాలు, ప్రవహిస్తున్న సెలయేళ్ల చప్పుళ్లు, భారీ వృక్షాల నుంచి వీస్తున్న గాలి శబ్దాలను ఆలకిస్తూ నిద్ర లేస్తాను. బేడ్తి, అఘనాశిని నదుల అనుసంధానానికి ప్రయత్నం జరుగుతోందని మా అమ్మా నాన్నలు మాట్లాడుకోవడం విన్నాను. ఆ నదుల అనుసంధానంతో మేము ఉంటున్న ప్రాంతం నీట మునిగే అవకాశం ఉంది. ఈ ప్రాంతాన్ని ఊళ్లను వదిలి చాలా మంది వలస వెళ్లవలసి ఉంటుంది. మేము ఇళ్లను వదిలి వెళ్లినంత సులువుగా 400 ఏళ్ల మహా వృక్షాలను అడవి దాటి వెళ్లలేవు. అవన్నీ నీట మునిగిపోతాయి. పర్యావరణ పరిరక్షణ, సమతుల్యత దెబ్బతింటాయి. పశ్చిమ కనుమలు వేడెక్కుతాయి. ఆ నదుల అనుసంధానాన్ని నిలిపేందుకు సహాయం చేయండి' అని కోరుతూ ఆమె లేఖరాసింది. గానవి లేఖకు ఎలాంటి స్పందన లభిస్తుందో వేచిచూడాలి.

గానవి.. నరేంద్రమోదీ (పాతచిత్రాలు)

కర్ణాటకవాసి ఐర్లాండ్‌లో అనుమానాస్పద మృతి

సాంజో సునీల్

మంగళూరు, న్యూస్‌టుడే : దక్షిణ కన్నడ జిల్లా కడబకు చెందిన సాంజో సునీల్ (31) అనే వ్యక్తి ఐర్లాండ్‌లో అనుమానాస్పదంగా మరణించాడు. డబ్లిన్ నగరంలోని ఫింగ్లాస్ సమీపంలోని చార్లోస్‌లోని ఫ్లాట్‌లో పడి ఉన్న అతని మృతదేహాన్ని గుర్తించారు. ప్రాథమిక విచారణలో అతను ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానిస్తున్నారు. మొదట ఇజ్రాయెల్‌లో ఉద్యోగం చేసిన సునీల్ ఏడాది కిందటే వివాహం చేసుకున్నాడు. భార్య లిప్సా ఫిలిప్ ఐర్లాండ్‌లో నర్సుగా పని చేస్తున్నారు. దాంతో నెల కిందటే ఐర్లాండ్‌కు వెళ్లి అక్కడ ఉద్యోగం సంపాదించుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు అతని కుటుంబ సభ్యులు ప్రయత్నాలు ప్రారంభించారు.

కామాఖ్యమాత సన్నిధిలో శివుడు

ఆలయం ముంగిట డీకే

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీతో కలిసి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం అసోం రాష్ట్రం గువాహటిలో పర్యటించారు. అక్కడి కామాఖ్యమాత ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అసోం రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పార్టీ తరపున డీకే బాధ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఆలయ దర్శనానంతరం కాంగ్రెస్ స్థానిక నేతలతో సమావేశమయ్యారు.

కేసరి సేన రణగర్జన

విధానసభ, జీబీఏ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

భారతమాత, పార్టీ ప్రముఖుల చిత్రాలకు పుష్పార్చన చేసిన భాజపా సీనియర్ నాయకులు యడియూరప్ప, గజేంద్రసింగ్ షెకావత్, ప్రహ్లాద్ జోషి, రాధామోహనదాస్, సోమణ్ణ, విజయేంద్ర, తదితరులు

ఈనాడు, బెంగళూరు : త్వరలో స్థానిక ఎన్నికలు.. ఆపై విధానసభ ఎన్నికలను స్వాగతించేందుకు భాజపా కర్ణాటక కీలక నిర్ణయాలు తీసుకుంది. రానున్న రోజుల్లో సర్కారు అవినీతిని మరింత సమర్థమంతంగా ప్రచారం చేయాలని తీర్మానించింది. పార్టీ జాతీయ కార్యదర్శి సూచనలతో రాష్ట్ర విభాగం గురువారం బెంగళూరులో సమావేశమైంది. సీనియర్లు, జూనియర్లు, కార్యకర్తల సంయుక్త ఆధ్వర్యంలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా క్షేత్ర స్థాయిలో శ్రమించాలని ప్రతినబూనారు. నగరంలోని ప్యాలెస్ మైదానంలో ఏర్పాటైన ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు, పార్టీ రాష్ట్ర బాధ్యులు, విధానసభ, పరిషత్తు సభ్యులతో పాటు కీలక నేతలంతా విచ్చేశారు.

ఇక పూర్వ వైభవం..

భాజపాకు దక్షిణ భారతంలో అధికారాన్ని కట్టబెట్టిన ఏకైక రాష్ట్రం కర్ణాటక. ఇప్పటికే పలుమార్లు అధికారాన్ని ఏర్పాటు చేసినా సాధికారికంగా పాలన చేపట్టింది లేదు. 2008, 2018 ఎన్నికల్లో ఎక్కువ స్థానాలతో ఏకైక పెద్ద పార్టీగా అవతరించినా ఇతర పార్టీల సహకారం అనివార్యమైంది. 2028 ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించగలరని ఈ సమావేశంలో నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ శక్తి యమే ఈ సమావేశంలో తీసుకున్న నాలుగు తీర్మానాల్లో ఒకటి. ఈసారి కేవలం వందకు పైగా స్థానాలతో మాత్రమే కాకుండా సొంతంగా అధికారాన్ని ఏర్పాటు చేయగలిగే స్థానాలు సాధించాలన్నదే లక్ష్యం కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, పార్టీ రాష్ట్ర బాధ్యుడు రాధామోహన్‌దాస్ అగర్వాల్, సహ బాధ్యుడు పొంగులేటి సుధాకర్ ఈ అంశంపై రాష్ట్ర కార్యవర్గానికి దిశా నిర్దేశం చేశారు.

అవినీతి పాలన..

కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన నాటి నుంచి అవినీతిలో కూరుకుపోయిందని గజేంద్ర షెకావత్ ఆరోపించారు. ఈ అవినీతిపై ప్రచారం చేయాలని కేసరి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈసారి సర్కారుపై ప్రత్యక్ష పోరు ప్రకటించాల్సిందేనన్నారు. పార్టీ సిద్ధాంతాలు, వికసిత్ భారత్ ఆశయాలను రాష్ట్రమంతటా ప్రచారం చేయాలన్నారు. దీనికి తర్వాతే వెలుగు తథ్యమని మన నేత ఏబీ వాజపేయీ చెప్పిన వ్యాఖ్యలు స్మరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. గ్యారంటీ పథకాల కోసమే సిద్ధరామయ్య సర్కారు రూ.7లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. ఈ సమయంలో రాధామోహన్‌దాస్ అగర్వాల్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. రోహిత్ వేముల చట్టంలో దళితులతో పాటు ముస్లింలకు కూడా రిజర్వేషన్ కల్పించడం ఈ పార్టీ ఓటు బ్యాంక్ రాజకీయం ఏమిటో మరోసారి బయటపెట్టిందని ఆరోపించారు.

సాధికారిక విజయం..

భాజపాకు కన్నడనాట బలమైన పునాదులు వేసిన మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప ప్రజా జీవితంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను ఇదే వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్ప మాట్లాడుతూ 2028 ఎన్నికల్లో భాజపా అత్యధిక స్థానాలతో స్వతంత్రంగా అధికారాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు. అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. 'ప్రస్తుతం 85 ఏళ్ల వయసున్న నేను మరో ఐదేళ్ల పాటు నడవగలను. విశ్వకవి సమయంలో ఎక్కువ పిలిచినా వస్తా. శికారిపుర పురసభ సభ్యుడి స్థానం నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగేందుకు పార్టీ, కార్యకర్తల సహకారం మరువలేను. అనంతకుమార్, శంకరమూర్తి, వసంతబంగేరా, ఏకే సుబ్బయ్య, రామచంద్ర గౌడ తదితరులు నా రాజకీయ జీవితంలో సహకరించిన నేతలు' అని అప్ప స్మరించుకున్నారు.

● ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గాడితప్పిందని ధ్వజమెత్తారు. ఈ సర్కారు పతనం ఇప్పటికే మొదలైందన్నారు.

● 2028లో సాధికారిక విజయంతో పాటు బ్రాండ్ బెంగళూరును మరికొ కాపాలా మార్చిన సర్కారు తీరుపై నిరసన, సర్కారు వైఫల్యాలపై రాష్ట్రమంతటా ప్రచారం, ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి, దేశానికి స్వాతంత్య్రం వచ్చేందుకు కారణమైన వందేమాతరం గీతానికి జాతీయ గీతం హోదా, వీబీ జీ రామ్ జీ చట్టంపై అభినందన తెలియజేస్తూ ఈ సమావేశంలో తీర్మానాలు చేశారు. సమావేశంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజె, ఎంపీలు బసవరాజ బొమ్మై, గోవింద కారజోళ, మాజీ ఎంపీ సదానందగౌడ, విపక్ష నేత ఆర్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

'స్నేహమయి' కొత్త దుమారం

స్నేహమయి కృష్ణ

శాలిని రజనీశ్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముడా అక్రమాలకు, ఒకప్పటి అధికారి పదోన్నతికి సంబంధించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కి లంచాలు అందాయని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. ముడా మాజీ కమిషనర్ నటేశ్‌కు సన్నిహితులు కేఏ 41సి 6723 నంబరు కారులో ఐదు బ్యాగుల్లో నగదు తీసుకువచ్చి ఆమెకు అందతించారని ఈడీ, ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కారు కర్ణాటక రాష్ట్ర ఖాదీ, గ్రామోద్యోగ శాఖకు చెందినది కాగా, ప్రస్తుతం నటేశ్ అదే శాఖలో పని చేస్తున్నారని కృష్ణ గుర్తు చేశారు. నగదుకు సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, వాటిని ఇప్పటికే ఆ శాఖల అధికారులకు అందించానని స్నేహమయి కృష్ణ పేర్కొన్నారు. ఆయన ఆరోపణలను శాలిని తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆయనపై కఠిన చర్యలు..

తాను లంచాలు తీసుకున్నానని, అక్రమాలకు పాల్పడ్డానని ఆధారరహిత ఆరోపణలు చేస్తున్న సహ కార్యకర్త స్నేహమయి కృష్ణపై కఠిన చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ హెచ్చరించారు. తనపై ఆదాయపన్ను, ఈడీ అధికారులకు చేసిన ఫిర్యాదులపై ఇప్పటికే లేఖ ద్వారా స్పష్టీకరణ చేశానని తెలిపారు. స్నేహమయి కృష్ణ తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఎటువంటి దాఖలాలనూ అందించలేదన్నారు. కేఏఎస్ అధికారి, ముడా మాజీ కమిషనర్ నటేశ్‌కు నియమాలకు అనుగుణంగానే పదోన్నతి కల్పించామని స్పష్టం చేశారు. స్నేహమయి కృష్ణ చేసిన ఆరోపణలకు సంబంధించి దాఖలాలను విడుదల చేయకపోతే పరువునష్టం వేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.

భర్త ఎదుటే భార్య హత్య

శోభ (పాతచిత్రం)

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : నెలమంగల పేటె వీధి నివాసి శోభ (69) అనే వృద్ధురాలు బుధవారం సాయంత్రం హత్యకు గురైంది. స్థానికంగా కిరాణా సరుకులు విక్రయించుకునే శివకుమార్‌ను హంతకుడిగా గుర్తించారు. తాను చేసిన రూ.8 లక్షల అప్పు తీర్చేందుకు హత్య చేశాడని ప్రాథమిక విచారణలో గుర్తించి గురువారం అరెస్టు చేశారు. ఆమె భర్త రంగనాథ్ పక్షవాతంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. సంతానం లేకపోవడంతో భార్యాభర్తలు ఇద్దరే ఇంట్లో ఉండేవారు. భర్త ముందే ఆమెను హత్య చేసి, 100 గ్రాముల ఆభరణాలతో నిందితుడు పరారయ్యాడని బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ చంద్రకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి రంగనాథ్‌కు ఫిజియోథెరపీ చేసేందుకు నిపుణుడు వారి ఇంటికి వచ్చినప్పుడు హత్య విషయం వెలుగులో వచ్చింది. తాగు నీరు కావాలంటూ ఆమెను వెంబడించుకు వచ్చిన నిందితుడు ఆమెపై దాడి చేసి, గొంతు కోసి హత్య చేశాడు. నెలమంగల ఠాణా పోలీసులు విచారణను కొనసాగించారు.

అవినీతి అంతానికే పంతం

సతీశ్ జార్ఖిహోళిని సత్కరిస్తున్న ఆచార్య రవివర్మకుమార్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అభివృద్ధి పనుల వేళ 'కమీషన్ల' వ్యవహారానికి ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్ఖిహోళి కొత్త భాష్యం చెప్పారు. ఈ కమీషన్ల వ్యవహారం గతంలోనూ ఉంది.. ఇప్పుడూ, మున్ముందూ ఉంటుందనేది జగమెరిగిన సత్యమని, దాన్ని నిలువరించడానికి ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని వివరించారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయనకు గురువారం 'వర్షద వ్యక్తి' పురస్కారాన్ని అందించి సత్కరించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అవినీతి అంతానికి అందరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. పూర్వ భాజపా ప్రభుత్వం అప్పటి బడ్జెట్‌కు ముందు నిధులు విడుదల చేయకుండా టెండర్లు ఖరారు చేయడంతో గుత్తేదార్ల బకాయిలు పేరుకుపోయాయని వివరించారు. జలవనరులు, ప్రజాపనుల శాఖలో బకాయిలు ఎక్కువని తెలిపారు. అలాగని నిర్మాణ పనులు నిలిపివేయలేమని స్పష్టం చేశారు. ప్రజాపనుల శాఖలో గుత్తేదార్లకు రూ.12 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికిప్పుడు రూ.3 వేల కోట్లు విడుదల చేశామని వివరించారు. ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్, మాజీ అడ్వకేట్ జనరల్ ఆచార్య రవివర్మకుమార్, శాసనసభ్యుడు రిజ్వాన్ హర్షద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న కొకైన్ దాచిన సంచి

రూ.23.88 కోట్ల కొకైన్ స్వాధీనం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన బ్రెజిల్ జాతీయుడి నుంచి 4.776 కిలోల కొకైన్‌ను పోలీసులు జప్తు చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.23.88 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మహిళలు వినియోగించే నాలుగు వ్యానిటీ బ్యాగుల్లో మాదక ద్రవ్యాలు ఉంచుకుని మంగళవారం రాత్రి దొరికిపోయాడని అధికారులు గురువారం ప్రకటించారు. బ్రెజిల్‌లోని సావోపాలో నుంచి కతార్‌కు వచ్చి, అక్కడి నుంచి ఆ ప్రయాణికుడు బెంగళూరుకు వచ్చి దొరికిపోయాడని తెలిపారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

జయహో శివాజీ

న్యూస్‌టుడే, బెంగళూరు

మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ 394వ జయంతి రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పెద్దఎత్తున నిర్వహించారు. మరాఠాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఉత్తర కర్ణాటకతో పాటు బెంగళూరు నగరంలోనూ శివాజీ భావచిత్రాలు, విగ్రహాలకు పెద్ద సంఖ్యలో నివాళులర్పించారు. బెంగళూరు సదాశివ నగరలోని శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పించిన భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

మహేశ్ జోశికి జరిమానా

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : బెంగళూరు దూరదర్శన కేంద్రంలో అధికారిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టం కింద వచ్చిన ఒక లేఖకు బదులిచ్చేందుకు నిరాకరించిన మహేశ్ జోశికి న్యాయస్థానం రూ.25 వేల జరిమానా విధించింది. కోర్టు ఆదేశాలను ప్రశ్నిస్తూ ఉన్నత న్యాయస్థానంలో ఆయన అప్పీలుకు వెళ్లారు. నిబంధనలకు అనుగుణంగా జరిమానా చెల్లించకుండా అప్పీలుకు రావడాన్ని జస్టిస్ అను శివరామన్, జస్టిస్ విజయకుమార ఎ.పాటిల్ తప్పు పట్టారు. అప్పీలు విచారణ సమయంలో తప్పు మీవైపే ఉన్నట్లు గుర్తిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని ధర్మాసనం హెచ్చరించడంతో ఆయన తన అర్జీని వెనక్కు తీసుకున్నారు.

పోలీసుల నుంచి తప్పించుకోబోయి..

మడికేరి, న్యూస్‌టుడే : నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు తనను నిలుపుతారన్న అనుమానంతో నటేశ్ (31) తన బైకును ఒక్కసారిగా వెనక్కు తిప్పాడు. ఆ వెనుకగా వస్తున్న గూడ్సు వాహనం బైకును ఢీకొట్టడంతో నటేశ్, అతని భార్య దివ్య (30) ఇద్దరూ కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలైన నటేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. చిన్నపాటి గాయాలైన దివ్యను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. బైకుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతోనే నటేశ్ తన వాహనాన్ని వెనక్కు తిప్పాడని గుర్తించారు. కుశాలనగర సమీపంలోని కూడు మంగళూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన సంభవించింది. మరూరు గ్రామానికి చెందిన నటేశ్, దివ్య దంపతులు తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యక్రమానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. కుశాలనగర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగత్ కిలేడీ



● అత్యంత విలాసవంతమైన ఆమె కారు వచ్చి ఆగిందంటే.. ఆ బంగారు దుకాణాల నిర్వాహకుల పంట పండినట్లే! ఆ కారే ఓ బంగారంలా మెరిసిపోతుంటే.. చిన్నారి బాబును ఒడిసిపట్టుకుని ఆమె నయగారాలు ఒలకబోస్తూ నగల దుకాణాల్లో అడుగుపెట్టేది. కావాల్సినంత సేపూ నగలను వీక్షించి, కొన్నింటిని ఫొటోలు తీసుకుని, చివరికి ఏదో ఒకటి కొని వెళ్లేది. అలా వెళ్లిన దుకాణాలకే వరుసగా మళ్లీ మళ్లీ వెళుతున్న ఆమె కోసం దుకాణదారులు ఎదురుచూస్తున్నట్లు కనిపించేవారు. పది నగలు చూసి ఒకటి కొనడం మామూలే కదా.. అని దుకాణదారులు సరిపెట్టుకునేవారు.

● కట్ చేస్తే.. హావేరి జిల్లా రాణిబెన్నూరుకు చెందిన ఆ నగలంటే హొయలుపోయే శ్రీదేవి కట్టెకార (30)ను పోలీసులు కటకటాల వెనక్కి నెడితేగానీ.. వాస్తవమేంటో బోధపడలేదు. 'నిజమే సార్.. ఆ దుకాణాల్లో నగలు నేనే కొట్టేశా. అదెలాగంటే.. ఓసారి వెళ్లి దుకాణంలో ఓ నగను ఎంపిక చేసుకునేదాన్ని. దాన్ని ఫొటో తీసుకుని.. అదే తరహాలో నకిలీ నగను సిద్ధం చేయించి.. దానికి అవసరమైన క్యూఆర్ కోడ్‌లు, ఇతరాలు సమకూర్చుకునేదాన్ని. మరోసారి దుకాణానికి వెళ్లి ఆ నగను మరోసారి చూస్తానని తీసుకుని.. నకిలీతో మార్చేసేదాన్ని. ఎవరూ గుర్తుపట్టనంతగా వ్యవహరించేదాన్ని. దుకాణదారులకు ఈ మార్పు విషయం తెలిసేది కాదు' అంటూ అసలు నిజం వివరించడంతో తెల్లబోవడం పోలీసుల వంతైంది. ఇలా కాజేసిన ఓ గొలుసును సమీప శివమొగ్గ పట్టణంలో విక్రయిస్తుండగా.. దొరికిపోయింది. కొత్త నగ ఎందుకు విక్రయిస్తున్నారనే అనుమానం నేపథ్యంలో ఆమె దొరికిపోవడం ప్రస్తావనార్హం. మరో ఐదు గొలుసులనూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలిశాక.. ఆమె నడయాడిన దుకాణాల్లో అలజడి మొదలైంది. ఏయే నగలను ఆమె మార్చేసిందో. అనే భయంతో సరిచూసుకోవడం మొదలుపెట్టక తప్పలేదు. -న్యూస్‌టుడే, హావేరి

అమ్మవారి సన్నిధిలో ఆ సేవల నిషేధం

శివమొగ్గ: శ్రీరేణుకమ్మ దేవి ఆలయంలో బెత్తల (నగ్న) సేవలపై నిషేధాన్ని విధిస్తూ శివమొగ్గ జిల్లాధికారి ప్రభులింగ కవళికట్టి ఆదేశాలు జారీ చేశారు. సొరబ తాలూకా చంద్రగుత్తి గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో జాతర నిర్వహిస్తారు. దేవుని పేరిట మహిళను వివస్త్రలు చేయించి, అక్కడి నీటి గుండంలో స్నానం చేయించి, ఒంటికి వేపాకులు కట్టి, ఆలయం వరకు ఊరేగించి, పూజలు చేయడం ఇక్కడ ఏళ్ల తరబడి ఆచారంగా వస్తోంది. ఆ సేవలపై పూర్తిగా నిషేధం విధించామని జిల్లాధికారి తెలిపారు. శ్రీ రేణుకమ్మ దేవి రథోత్సవ నిషేధం ఉండదని జిల్లాధికారి తన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

కదలిన రథ చక్రాలు!

ఆర్టీసీ సమ్మె వాయిదా

ధర్నాలో రవాణా సంఘాల ఉద్యోగులు, సిబ్బంది

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : తమ డిమాండ్లను పరిష్కరించాలని వేర్వేరు రవాణా సంస్థల (ఆర్టీసీ) ఉద్యోగులు, సిబ్బంది బెంగళూరు స్వాతంత్య్ర ఉద్యానవనంలో గురువారం ధర్నాకు దిగారు. వేతన పెంపు బకాయిల విడుదల, పదోన్నతులు, కొవిడ్ సమయంలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు పరిహారం తదితరాల విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపించాయి. గతంలో కార్మిక నాయకుడు అనంత సుబ్బారావు హఠాన్మరణంతో సమ్మె వాయిదా పడింది. గురువారం నాటి ధర్నా అనంతరం సమ్మెకు దిగాలని భావించిన కార్మిక సంఘాలు.. నిర్ణయాన్ని మార్చి 2వ తేదీకి వాయిదా వేసుకున్నాయి. తమకు 38 నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరగా.. 26 నెలల బకాయిలను విడుదల చేస్తూ, వేతన పరిష్కరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ నిర్ణయాన్ని కేఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అక్రం పాషా ఆందోళనకారులకు వివరించారు. నాలుగు కార్పొరేషన్ల ఎండీలతో రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి త్వరలో సమావేశం అవుతారని హామీ అనంతరం తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నామని కార్మిక సంఘాల సంయుక్త క్రియా సమితి సంచాలకుడు జయదేవరాజ్ అరస్ ప్రకటించారు.

ధర్నా వేదికపై కార్మిక సంఘాల నేతలు

ఆర్టీసీ అధికారులతో కార్మికుల వాగ్వాదం

నందిని ఉత్పత్తులు ఘనం!

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : నందిని బ్రాండ్ ఉత్పత్తుల్లో హానికారక పదార్థాలు లేవని కర్ణాటక పాల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ బి.శివస్వామి స్పష్టం చేశారు. నందిని బ్రాండ్ ఉత్పత్తులను తింటే క్యాన్సర్ వస్తుందని నగరానికి చెందిన వైద్యురాలు శరణ్య సంతోశ్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తమ ఉత్పత్తులు అన్నింటినీ పలు జాగ్రత్తలు తీసుకుని, రసాయనాలు లేకుండా తయారు చేస్తున్నామని శివస్వామి చెప్పారు. డాక్టర్ శరణ్య సంతోశ్‌తో పాటు తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని చెప్పారు.

సజీవంగా కాలిపోయిన వృద్ధుడు

మైలారప్ప

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : మైలసంద్రలోని తన ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న మైలారప్ప (80) అనే వృద్ధుడు సజీవంగా కాలిపోయారు. మైలారప్పకు నలుగురు కుమారులు ఉండగా, తిమ్మరాయప్ప కూడలిలోని ఒక కుమారుడి ఇంటికి సమీపంలో ప్రత్యేకంగా ఉంటున్నారు. గ్యాంగ్రిన్‌తో ఎడమకాలును ఇప్పటికే తొలగించారు. కోడళ్లు, మనవళ్లు ఇంటికి వచ్చి ఔషధాలు, భోజన సదుపాయాలు కల్పించేవారు. బుధవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు పొగ, మంటల్ని గుర్తించి అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం అందించారు. మంటల్ని ఆర్పేలోగా మైలారప్ప సజీవంగా కాలిపోయారు. కెంగేరి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రగతికి ప్రణాళిక సిద్ధం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్ర నీతి ఆయోగ్ (ప్రణాళిక కమిషన్) అధ్యక్షుడు బీఆర్ పాటిల్ విధానసౌధలో గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ప్రగతి సాధనకు సంబంధించిన ప్రతిపాదనల నివేదిక అందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు అవసరాలపై కమిషన్ అధ్యక్షుడు బీఆర్ పాటిల్ నివేదిక సిద్ధం చేసి అందజేశారు. బడ్జెట్‌కు ముందు ప్రణాళిక కమిషన్ నివేదిక అందించడం ఆనవాయితీ. పాటిల్‌తో పాటు మంత్రి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుకు నివేదిక అందిస్తున్న బీఆర్ పాటిల్, మంత్రి సుధాకర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

పరీక్షలకు సర్వం సిద్ధం

◆ ద్వితీయ పీయూసీలో 15,652 మంది
◆ పదో తరగతిలో 23,271 మంది

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ ఏడాది ద్వితీయ పీయూసీ పరీక్షకు 15,652 మంది విద్యార్థులు, పదో తరగతి పరీక్షలకు 23,271 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నెల 28న ప్రారంభమవుతున్న ద్వితీయ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా పాలనాధికారి కె.నాగేంద్ర ప్రసాద్ వెల్లడించారు. గురువారం నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్, చిత్రంలో జడ్పీ సీఈవో, ఎస్పీ, ఏడీసీ

ద్వితీయ పీయూసీలో..

ద్వితీయ పరీక్షలు ఈ నెల 28న ప్రారంభమై మార్చి 17న ముగుస్తాయన్నారు. జిల్లాలో 15,652 మంది విద్యార్థులు మొదటిసారి పరీక్షలు రాస్తున్నారు. వారిలో బాలురు 5,580 మంది, బాలికలు 7,706 మంది ఉన్నారు. 467 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, రిపీట్ విద్యార్థులు 1,899 మంది ఉన్నారు. బళ్లారి నగరం-12, సిరుగుప్ప-3, సండూరు-2, కంప్లి-2, కురుగోడు-1 మొత్తం 20 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పదో తరగతిలో..

పదో తరగతి పరీక్షలు మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ ముగుస్తాయని డీసీ పేర్కొన్నారు. మొత్తం 326 పదో తరగతి పాఠశాలలు ఉండగా, మొత్తం 23,271 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిలో 19,722 మొదటిసారిగా పరీక్షలు రాస్తున్నారు. 1,328 మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులు, రిపీట్ 2,009 మంది, ప్రైవేట్ రిపీట్ విద్యార్థులు 212 మంది ఉన్నారు. జిల్లాలో 65 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఉచితంగా రవాణా సదుపాయం

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉచితంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డీసీ నాగేంద్ర ప్రసాద్ చెప్పారు. ఉదయం 6 గంటలకే బస్సు సర్వీసులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు హాల్ టికెట్లు చూపిస్తే ఉచితంగా పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తారని తెలిపారు. పదో తరగతి, పీయూసీ పరీక్షలు రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు 40 నిమిషాలు ముందే చేరుకోవాలి. ఆలస్యంగా వస్తే కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంతో పాటు, బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని జిల్లా పంచాయతీ కార్యాలయంలో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, ఆరోగ్య సిబ్బంది, తాగునీటిని అందజేసే డి.గ్రూపు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

పరీక్షలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ డా.డి.సుమర్ పెన్నేకర్ పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్లలోపు ఉన్న కంప్యూటర్, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. గుంపులుగా వెళ్లడం, ఆయుధాలు తీసుకుని వెళ్లడం వంటివి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్, ఏడీసీ మహమ్మద్ ఝుభేర తదితరులు పాల్గొన్నారు.

రూ.7.62 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి ప్రాంతంలో రూ.7.62 కోట్ల అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి గురువారం ప్రారంభించారు. కారటగి కనకదాస కూడలి నుంచి బూదగుంప గ్రామం వరకు, బేవినాళ నుంచి మైలాపుర పాత రోడ్డు వరకు, కక్కరగోళలో సీసీ రోడ్డు, బూదగుంపలో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారటగి కనకదాస కూడలి నుంచి రైల్వే వంతెన వరకు వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మార్గంలో ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. నాయకులు శరణేగౌడ పోలీస్ పాటిల్, రెడ్డి శ్రీనివాస్, నందిహళ్లి రుద్రగౌడ, శివారెడ్డి నాయక్, సిద్ధన గౌడ, శ్రీధర గౌడ పాల్గొన్నారు.

జీత కార్మిక పద్ధతికి స్వస్తి పలకాలి

బళ్లారి, న్యూస్‌టుడే: జీత కార్మిక పద్ధతి, బాలకార్మికుల పద్ధతి నిషేధ చట్టం అమలులో ఉంది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారు శిక్షార్హులవుతారు. వీటిని మూలాల నుంచి నిర్మూలించడానికి అన్ని శాఖల సహకారం అవసరమని జిల్లా న్యాయసేవా ప్రాధికార అథారిటీ సభ్య కార్యదర్శి, న్యాయవాది రాజేష్ ఎన్.హోసమని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, కార్మికశాఖ, న్యాయసేవా ప్రాధికార సమితి, విద్యాశాఖ, జిల్లా బాలకార్మిక పథకం సంయుక్తంగా జీత కార్మిక, బాలకార్మికుల నిర్మూలన వ్యతిరేక దినోత్సవాన్ని న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి కారణంతోనైనా పిల్లలను పనిలో ఉంచకూడదు. వారిని విద్యావంతులను చేయడం అందరి బాధ్యత. జీత కార్మిక, బాల కార్మికుల పద్ధతులు కనిపిస్తే అలాంటి కేసులను వెంటనే జిల్లా న్యాయ ప్రాధికార అథారిటీ దృష్టికి తీసుకొస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుభేర మాట్లాడుతూ 14 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనికి ఉపయోగించడం చట్టవిరుద్ధమన్నారు. పిల్లలకు విద్యను అందించాలి. విద్య ద్వారా మాత్రమే జీత కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కును ఇచ్చింది. ప్రభుత్వం విద్యతో సహా అనేక సౌకర్యాలను అందిస్తోంది. వీటిని సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో కమిటీ అధ్యక్షురాలు త్రివేణి, ఏఎస్పీ నవీన్‌కుమార్, అధికారి మౌనేష్, సిద్ధప్ప ఖైనూరు, వివిధశాఖాధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి రాజేష్ ఎన్.హోసమని, ఏడీసీ మహమ్మద్ ఝుభేర తదితరులు

హాజరైన కార్మికులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది

క్రికెట్ జట్టుకు కప్‌ను అందజేస్తున్న డా.గంగాధరగౌడ, తదితరులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత బీఎంసీఆర్‌సీ సీజన్-2 జట్టు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి బీఎంసీఆర్‌సీ ఆధ్వర్యంలో క్రీడామైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బీఎంసీఆర్‌సీ సీజన్-2 (బీఎంసీఆర్‌సీ హోంగార్డు జట్టు) జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌కు 16 జట్లు పాల్గొన్నాయి. బీఎంసీఆర్‌సీ వైద్యులు, సాంకేతిక సిబ్బంది, హోంగార్డులు, తదితర జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో డా.దత్తా ఇలెవన్స్, హోంగార్డు జట్లు మధ్య జరిగిన పోటీల్లో హోంగార్డుల జట్టు గెలిచింది. గెలుపొందిన జట్టుకు నిర్దేశకులు డా.గంగాధర గౌడ, తదితరులు పాల్గొని కప్ అందజేశారు.

వేసవిలో గొంతెండనీయొద్దు

అధికారులకు డీసీ ఆదేశం

మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్, చిత్రంలో జడ్పీ సీఈవో, ఏసీ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: వేసవి ప్రారంభమవుతోంది.. జిల్లాలో ప్రజలకు తాగునీటి కొరత రానీయొద్దని, పశువులకు తాగునీరు, మేత కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ ఛైర్మన్, జిల్లా పాలనాధికారి నాగేంద్రప్రసాద్ అధికారులకు సూచించారు. నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి డీసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా బళ్లారి తాలూకాలో 21, కంప్లి 16, కురుగోడు 15, సండూరు 3, సిరుగుప్ప 28 గ్రామాలతోపాటు జిల్లాలోని 83 గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తవచ్చని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అంచనా వేసింది. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవసరమైన జాగ్రత్తలు వెంటనే తీసుకోవాలని డీసీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ బోరుబావులు గుర్తించాలి. అవి పాడైతే మరమ్మతులు చేయాలి. ఆ తర్వాత ప్రైవేట్ బోరుబావులను గుర్తించాలి. లేకపోతే కొత్తవి తవ్వడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో 504 తాగునీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 454 పనిచేస్తున్నాయి. మిగిలిన 54 కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారి ఇందుధర్ డీసీకి వివరించారు.

పశుగ్రాసం నిల్వ చేసుకోవాలి

ఈ సారి జిల్లాలో రెండో పంట లేనందున, పశుగ్రాసం సమస్య తీవ్రం కాకుండా అవసరమైన గడ్డిని నిల్వ ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీసీ నాగేంద్రప్రసాద్ పశుసంవర్ధక శాఖాధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజా పనులశాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని పశుగ్రాసం నిల్వలు, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

వేసవి ఉష్ణోగ్రతలపై అవగాహన కల్పించాలి

మార్చి చివరి నుంచి మే చివరి వరకు జిల్లాలో వేడి తరంగాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. వరుసగా మూడు రోజులు ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ ఉంటే దాన్ని వేడి తరంగాలుగా పరిగణించాలని వాతావరణ శాఖ తెలిపిందని డీసీ చెప్పారు. ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్యలు, పశుగ్రాసం కొరత ఏర్పడితే ప్రజలు ఫిర్యాదులు దాఖలు చేయగలిగిలే హెల్ప్ లైన్ ప్రారంభించాలని డీసీ అధికారులకు సూచించారు. జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్, ఏసీ హెచ్.డి.రాజేష్ అధికారులు అబ్దుల్ రెహమాన్, ఇందుధర్, డా.యల్లా రమేష్‌బాబు, వివిధశాఖాకారులు పాల్గొన్నారు.

చిరునామా అడిగి.. తాళితో ఉడాయింపు

24 గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణంలో ఓ మహిళ మెడలోని మంగళసూత్రం లాక్కొని పరారైన వ్యక్తిని పోలీసులు 24 గంటల్లో బంధించారు. వివరాల్లోకి వెళితే... గంగా శివానంద అంగడి అనే ఉపాధ్యాయిని మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి టీచర్స్ కాలనీలోని తమ ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి ఉపాధ్యాయినికి మొబైల్‌లో ఓ వ్యక్తి ఫోటో చూపించి ఈయన మీకు తెలుసా అని అడుగుతూ ఆమె మెడలోని మంగళ సూత్రాన్ని లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. వెంటనే ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఆరోజు రాత్రి పోలీసు ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నవలి కూడలి, ఇరువైపులా ఉన్న మార్గాల్లో వెతికారు. చిన్న క్లూ ఆధారంగా పోలీసులు బుధవారం సాయంత్రం ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి రెండు తులాల మంగళ సూత్రం, మొబైల్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి కనకగిరి తాలూకా ఈచినాళ గ్రామవాసి హనుమేశ్ అని పోలీసులు తెలిపారు. 24 గంటల్లో నిందితుడ్ని పట్టుకున్న విషయం తెలిసి జిల్లా ఎస్పీ డాక్టర్ రామ్.ఎల్. అరసిద్ధి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఏఎస్సై బసయ్య, ఆరుగురు పోలీసు సిబ్బందిని ప్రశంసించి బహుమతి ప్రకటించారు.

టికెట్ యంత్రం ఎత్తుకెళ్లిన ప్రయాణికుడు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి శిరశికి వెళ్లే నాన్-ఏసీ స్లీపర్ బస్సులో టికెట్టు జారీ చేసే మిషన్‌ను ముగ్గురు చోరులు దొంగిలించుకు వెళ్లారు. డ్రైవరు, కండక్టరు బస్సులో ఉంచిన బ్యాగులు, మిషన్‌ను నిందితులు తీసుకువెళ్లారు. దీంతో బుధవారం రాత్రి మూడు గంటల పాటు ఆ బస్సు ప్రయాణం ఆలస్యమైంది. అర్ధరాత్రి అనంతరం మామూలు టికెట్లు జారీ చేసిన అనంతరం ప్రయాణం ప్రారంభమైంది.

పోలీసుల వేషంలో దోపిడీ

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తాము పోలీసులం అంటూ ఇచ్చి ఇంట్లో దోపిడీకి పాల్పడి పరారైన నిందితుల కోసం బ్యాడరహళ్లి ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. బీఈఎల్ లేఅవుట్ నివాసి హొంబాళెగౌడ ఇంట్లోకి పోలీసుల సమవస్త్రాల్లో వచ్చిన నిందితులు రూ.20 లక్షల నగదు, అరకిలో ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. హొంబాళెగౌడ, ఆయన భార్య మంగళమ్మ ఇద్దరినీ కుర్చీకి కట్టేసి నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. తుపాకీ, కత్తులు చూపించి నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ

బళ్లారి గ్రామీణ: పాండురంగాలయంలో శివాజీ జయంతిని ఆచరిస్తున్న మహిళలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కమింగు రోడ్డులోని పాండురంగాలయంలో శివాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం మహారాజ్ చిత్రపటానికి అలంకరించి పుష్పాంజలి ఘటించారు. సత్యనారాయణ పూజ చేపట్టారు. మరాఠ సమాజ బాంధవులు, ప్రముఖులు పాల్గొని పుష్పాలు సమర్పించి శివాజీ దేశభక్తిని వివరించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా చిత్రపటాన్ని ఊరేగించారు.

సింధనూరు: ఛత్రపతి శివాజీ మహారాజ్ భరతమాత ముద్దుబిడ్డ, ఆయన ఖడ్గాన్ని ఎక్కుపెట్టి ధర్మంతో గెలిచిన యోధుడని సింధనూరు కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష కీర్తించారు. శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా ట్రస్ట్, వీహెచ్‌పీ, బజరంగదళ్ సంయుక్తంగా గురువారం ఘనంగా ఆచరించిన శివాజీ జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. స్థానిక గంగావతి మార్గం నుంచి రైల్వే స్టేషను వైపునకు వెళ్లే వంపులో ఉన్న కూడలిని కార్యకర్తలు ఛత్రపతి శివాజీ సర్కిల్‌గా చేశారు. అక్కడ ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. గురువారం ఇదే కూడలిలో జయంతి కార్యక్రమాన్ని ఆచరించారు. శ్రీహర్ష ఛత్రపతి శివాజీ నిలువెత్తు పటానికి, విగ్రహానికి తొలుత పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జీకే.విశ్వనాథ్ చౌదరి, వీహెచ్‌పీ తాలూకా అధ్యక్షుడు దేవరాజ్ పాటిల్, ప్రముఖులు సతీష్ కుమార్, పద్మనాయుడు, నెక్కంటి ప్రసాద్, తమ్మినేని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. తొలుత మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప తదితరులు నివాళులు అర్పించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తాలూకా పాలనా యంత్రాంగం ఆచరించిన కార్యక్రమంలో పంపనగౌడ బాదర్లి, సోమనగౌడ బాదర్లి, అభిషేక్ నాడగౌడ, ఎం.దొడ్డబసవరాజ్, రాజశేఖర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మాన్వి: ఛత్రపతి శివాజీ తల్లి చెప్పిన నీతి, మహనీయుల కథల నుంచి ప్రభావితుడైన యోధుడని, ఆయన జీవనశైలి యువతకు ఆదర్శం కావాలని తహసీల్దార్ భీమరాయ రామసంద్ర పేర్కొన్నారు. మాన్వి, సిరివార తాలూకా అధికార యంత్రాంగాల ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంత్యుత్సవాల్లో అధికారులు, వక్తలు ఛత్రపతి దేశప్రేమ, పోరాట పటిమని కొనియాడారు. మంచి యుద్ధనైపుణ్యం గల వీరుడని, ఆయన జీవనం, సాధనలు యువతకు ప్రేరణ కావాలని పేర్కొన్నారు. సిరివారలో తహసీల్దార్ అశోక్ పవార్ జయంతిని ప్రారంభించారు. తహసీల్దార్ గ్రేడ్2 అబ్దుల్ వాహిద్, ఉప తహసీల్దార్ విరుపణ్ణ, అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఏపీఎంసీ వద్ద ఛత్రపతి శివాజీ యువక సంఘం ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, గిరి తడకల, బసవరాజ్, మహంతేశ్ ఆల్దాళ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న శ్రీహర్ష తదితరులు

కంప్లి: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతిని ఆచరించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు జరిపారు. తహసీల్దార్ మంజునాయక్ మాట్లాడుతూ శివాజీ ధైర్య సాహసాలు, పరాక్రమం గురించి వివరించారు. ఉప తహసీల్దార్ రవీంద్రకుమార్, మరాఠ క్షత్రియ సముదాయ నాయకులు జడేశ్, శ్రీనివాస్, మైలారప్ప, భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాన్విలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఛత్రపతి శివాజీ యువక సంఘం ఆధ్వర్యంలో.

కంప్లి: జయంతిలో పాల్గొన్న అధికారులు, మరాఠ క్షత్రియ సముదాయ నాయకులు

బొమ్మై ఇంటికి ప్రముఖుల రాక

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై కుమార్తె అదితి బొమ్మై- రోషన్ సుధీర్ వివాహ నిశ్చితార్థానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు హాజరయ్యారు. గురువారం నగరంలోని ప్యాలెస్ మైదానంలో వివాహ నిశ్చితార్థ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సిద్ధరామయ్యతో పాటు మంత్రులు డాక్టర్ మహదేవప్ప, జమీర్ అహ్మద్‌ఖాన్, కేంద్ర మంత్రులు కుమారస్వామి, వి.సోమణ్ణ, భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర తదితరులు హాజరై వధువరులను దీవించారు.

బొమ్మై కుమార్తె అదితి బొమ్మై- రోషన్‌సుధీర్ వివాహ వేడుకల్లో సిద్ధరామయ్య తదితరులు

ఎస్సై వేధిస్తున్నాడంటూ నిందితుడి ఫిర్యాదు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : చీటీ లావాదేవీలు నిర్వహించి, మోసానికి పాల్పడిన ఆరోపణలపై అగ్రహార దాసరహళ్లికి చెందిన అవినాశ్, అతని తల్లిదండ్రులపై మాగడి రోడ్డు ఠాణా పోలీసులు గత ఏడాది జనవరిలో కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిలు తీసుకున్న అవినాశ్, క్రమం తప్పకుండా విచారణకు హాజరవుతూ వస్తున్నాడు. ఠాణాలో ఎస్సై కౌశిక్ తనను దూషిస్తున్నారని, రౌడీషీటు తెరుస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారులకు అవినాశ్ ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో మరోసారి న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో మాగడిరోడ్డు ఠాణా పోలీసులు ఎస్సై కౌశిక్‌పై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు బాధ్యతలను గోవిందరాజనగర ఠాణా పోలీసులకు అప్పగించారు.

శ్మశాన వాటిక కబ్జా

వక్ఫ్ భూమికి ఫారం-2 జారీ చేసిన అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పరిధి బెంగళూరు రహదారిలో శ్మశాన వాటిక ఆక్రమణ ఆరోపణలకు సంబంధించి కార్పొరేషన్, జిల్లా వక్ఫ్ అధికారిపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నగర పాలికె జోనల్ కమిషనర్ శ్రీనాథ్‌హోగాడే దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రూస్‌పేటె పోలీస్‌స్టేషన్‌లో రెవెన్యూశాఖాధికారి మనోహర్, నరేష్‌కుమార్, అసిస్టెంట్ రెవెన్యూశాఖాధికారి వెంకటేశ్వర, రెవెన్యూశాఖ అధికారి నారాయణ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ స్నేహపై కేసు నమోదు చేశారు. నకిలీ పత్రాలను సృష్టించి 2025 డిసెంబరు 24న నగర పాలికెకు సంబంధం లేని ఐపీ చిరునామాలను ఉపయోగించి పైన పేర్కొన్న నిందితులు ఈ-ఆస్తి సాఫ్ట్‌వేర్‌లో లాగిన్ అయ్యారు. ఎ.ప్రభావతి అనే మహిళ హక్కులను బదిలీ చేసి ఫారం-2 జారీ చేశారు. ఈ ఫారం-2 నకిలీదని కర్ణాటక సివిల్ చట్టం 1976 లోని సెక్షన్ 114ఏ రద్దు చేయడానికి చర్యలు తీసుకున్నామని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. నిందితురాలు ఎ.ప్రభావతిని తన పేరును మార్చుకునే నెపంతో ఆమె భర్త నుంచి రుసుములుగా మొత్తం రూ.24,06,610 తీసుకుని మోసం చేసినట్లు నగర పాలికె అధికారుల విచారణలో తేలిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నలుగురు మహిళలపై ఫిర్యాదు

జిల్లా వక్ఫ్ అధికారి కౌల్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో నలుగురు మహిళలపై ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రంగమ్మ, కాంద్ర శకుంతల బళ్లారి నగరానికి చెందిన పార్వతి, ప్రభావతిని నిందితులుగా చేర్చారు. 11.94 సెంట్ల శ్మశాన భూమి వక్ఫ్ ఆస్తికి చెందింది. గురప్ప కుటుంబ సభ్యులు రంగమ్మ కాంద్ర శకుంతల, కె.పార్వతి 2022లో నకిలీ పత్రాలను సృష్టించి ఆ భూమిని తమ పేర్లపై బదిలీ చేసుకున్నారు. తరువాత వారు ఆ భూమిని పార్వతికి విక్రయించారు. పార్వతి తన కుమార్తె ఎ.ప్రభావతికి సదరు భూమిని విరాళంగా ఇచ్చింది. ఆమె నగర పాలికె నుంచి ఫారం నంబరు-2 పొందినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.

దీనిపై నివేదికను కోరాం

ఖాతాను రద్దు చేయాలని నగర పాలికె కమిషనర్‌కు ఆదేశించాను. నిందితులపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని చెప్పాను. ఫారం-2 రద్దు చేశాం. ఇది మళ్లీ జరగకుండా నిరోధించడానికి అధికారులతో సమావేశం నిర్వహిస్తాం.

-కె.నాగేంద్ర ప్రసాద్, జిల్లా పాలనాధికారి, బళ్లారి

రౌడీషీటర్ హుసేన్ ఆటకట్టు

మంగళూరు: గత తొమ్మిదేళ్లుగా పరారీలో ఉన్న రౌడీషీటరు సప్వాన్ హుసేన్ (42)ను ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి వద్ద సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ముల్కి ఠాణా పరిధిలో 2008లో ప్రవీణ్ అనే యువకుడ్ని అపహరించి, దోచుకుని, హత్య చేసిన కేసులో 2020 ఫిబ్రవరి 28న అతనికి ఉన్నత న్యాయస్థానం జీవిత ఖైదు శిక్షను విధించింది. సూరత్కల్ ఠాణా పరిధిలో లెక్కి సహ్వాన్ అనే వ్యక్తిని అపహరించి, హత్య చేసి, ఆగుంబె ఘాట్‌లో పడేసిన కేసులో విచారణ కొనసాగుతోంది. మరో 12 కేసులు న్యాయస్థానంలో విచారణ దశలో ఉన్నాయి. నిందితుడు తన పేరును ఉమర్ మహ్మద్ నాసిర్ పేరిట పాస్‌పోర్టును చేయించుకుని 2018లో విదేశాలకు పరారయ్యాడు. విదేశాల్లో ఉంటూనే మంగళూరు ప్రాంతానికి చెందిన వ్యాపారులను బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడేవాడు. రాయచోటికి అతను వచ్చినట్లు గుర్తించిన సీసీబీ పోలీసులు కార్యాచరణ నిర్వహించి అరెస్టు చేసి, మంగళూరుకు తీసుకువచ్చారు.

మాలవి జలాశయంలో విదేశీ విహంగాల సందడి

వినీలాకాశంలో విహంగాల విహారం

హొసపేటె, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షిగా మారక ముందు రత్నాకర అని ఆయన పేరు. ఓ సారి వేటాడే సమయంలో ఓ క్రౌంచ పక్షిపై విల్లు ఎక్కుపెట్టి సంహరిస్తాడు. బాణం దూసుకుపోవడంతో విల్లవిల్లాడుతూ ప్రాణం కోల్పోయిన ఆ దృశ్యాన్ని చూసి పశ్చాత్తాపంతో అప్పటి నుంచి వేట మానేస్తాడని ఓ కథనం ప్రచారంలో ఉంది. క్రౌంచ పక్షులు చాలా అరుదు. మన దేశంలో అంతగా కనిపించవు. అక్టోబరు నుంచి మార్చి వరకూ రాజస్థాన్‌లో అప్పుడప్పుడు కనిపించేవట. మంగోలియా దేశంలో ఎక్కువగా కనిపిస్తాయి. అలాంటి అరుదైన విహంగాలు నేడు విజయనగర జిల్లా హగిరిబొమ్మనహళ్లి తాలూకా మాలవి జలాశయానికి వలసవచ్చాయంటే నమ్మాల్సిందే. సుమారు 4,800 కిలోమీటర్ల మంగోలియా నుంచి ఆహారాన్వేషణ చేస్తూ అవి మాలవి జలాశయంలో వాలాయి. వందలాది క్రౌంచ (డెమోసిల్ క్రేన్ బర్డ్) వచ్చి దిగడంతో మాలవి జలాశయానికి కొత్త అందం వచ్చింది. ఉదయం, సాయంత్రం పూట వాటి హొయలు, ఎగిరే తీరు, ఆహారాన్వేషణ తదితర విన్యాసాలను చూడటం కనులకు పండగ అని ఇట్టగి పక్షి ప్రేమికుడు విజయ్ తెలిపారు. కాని వీటికి వేటగాళ్ల నుంచి ప్రమాదం కూడా ఉంది. అటవీశాఖ వారు జలాశయం వద్ద కాపలా సిబ్బందిని నియమించడం ఉత్తమమని ఆయన పేర్కొన్నారు. మాలవి జలాశయంలో నీటినిల్వలు తగ్గాయి, దీంతో వలస పక్షులు సులువుగా వేటాడి పొట్ట నింపుకొంటున్నాయి. మార్చి వరకూ అవి ఇక్కడే ఉండే అవకాశం ఉందని విజయ్ తెలిపారు.

హగరిబొమ్మనహళ్లి మాలవి జలాశయం వద్ద విదేశీ విహంగాల కువకువలు

‘గృహ నిర్మాణానికి సహకరించండి’

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్‌లో గృహ నిర్మాణ పథకాలకు ఎక్కువ నిధులు కేటాయించే విధంగా ప్రయత్నించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ గురువారం విధానసౌధలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్‌ను కలిసి చర్చించారు. నిర్ణీత సమయం కల్లా పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, అందుకు నిధులు ఎక్కువగా కేటాయించాలని కోరారు. కొత్త పథకాలను కూడా బడ్జెట్‌లో చేర్పించేలా ప్రయత్నించాలని, బకాయిలను త్వరగా విడుదల చేయాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా కర్ణాటక మురికివాడల నిర్మూలన మండలి అధ్యక్షుడు ప్రసాద్ అబ్బయ్య, గృహ నిర్మాణ మండలి అధ్యక్షుడు శివలింగేగౌడ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

డాక్టర్ శాలిని రజనీశ్‌తో చర్చిస్తున్న జమీర్ అహ్మద్‌ఖాన్

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

21న ఎస్‌ఈఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఈనెల 21న పట్టణంలోని ఎస్‌ఈఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ వికాస్ సొసైటీ బెంగళూరు, ఎస్‌ఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో బెంగళూరు, ఇతర ప్రాంతాలకు చెందిన వివిధ కంపెనీల వారు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. విద్యార్హతలు పది, పీయూసీ, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన రెజ్యూమ్, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించే మేళాలో పాల్గొనాలని వివరించారు.

భక్తి శక్తివంతమైంది

శ్రీ గురుకరిబసవేశ్వరస్వామి తిరునాళ్లలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: భక్తికి ఉన్నంత శక్తి మరేదానికీ లేదని ఎమ్మెల్యే టి.రఘుమూర్తి పేర్కొన్నారు. గురువారం బెలగట్టలోని శ్రీ గురుకరిబసవేశ్వరస్వామి తిరునాళ్ళను ప్రారంభించి మాట్లాడారు. భక్తికి నమ్మకం ఆధారమని, భక్తి ద్వారా కళ్లకు కనిపించని భగవంతుని దర్శించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మనశ్శాంతి కోసం దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రార్థనా మందిరాలను సందర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు శివలింగానందస్వామి, కరిబసవ రాజేంద్రస్వామి, మహాదేవస్వామి, నాగేంద్రచార్ పాల్గొన్నారు.

బీఐటీఎంలో స్వయం ప్రేరిత రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న విద్యార్థిని. చిత్రంలో కళాశాల ఛైర్మన్ డా.వెంకట మహిపాల్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి బసవరాజేశ్వరి 18వ వర్ధంతి సందర్భంగా గురువారం బీఐటీఎం కళాశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని కళాశాల అధ్యక్షుడు డా. వెంకట మహిపాల్, భారతీయ రెడ్ క్రాస్ కార్యదర్శి షకీబ్, డా. భరత్, ఉప ఆచార్యులు డా. ఎం.రామచంద్ర పాల్గొని ప్రారంభించారు. రక్తదానంపై అపోహలు వద్దు..ప్రతి ఒక్కరూ ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయాలన్నారు. బసవరాజేశ్వరి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి శ్రమించారు. పలు విద్యా సంస్థలు ప్రారంభించి విద్యాదానం చేయడంలో ముందు వరుసలో ఉన్నట్లు చెప్పారు. విద్యా సంస్థలు చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

లక్ష్యం..పదిలమైన ఫలితం

● ఉత్తీర్ణత శాతం పెంపునకు విద్యాశాఖ కసరత్తు ● మూడు సార్లు ప్రీఫైనల్ పరీక్షలు

ఒత్తిడి నుంచి విముక్తి కోసం యోగా, ధ్యానం చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

పాఠ్యాంశాలను బోధిస్తున్న విద్యాశాఖాధికారి, చిత్రంలో ఉపాధ్యాయులు

బళ్లారి, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. విద్యాశాఖ కంటే జిల్లా పంచాయతీ సీఈవో ప్రత్యేక దృష్టి సారించి మార్గదర్శకాలు చేస్తున్నారు. మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా, మార్చి 17 వరకు విద్యార్థులు పాఠశాలకు రావాలి. సాధన చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కల్యాణ కర్ణాటక వ్యాప్తిలోకి వచ్చే ఏడు జిల్లాలో పోలిస్తే బళ్లారి జిల్లాలో 50 శాతం ఉపాధ్యాయుల కొరత ఉంది. అతిథి ఉపాధ్యాయులను తీసుకుని వారితో విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు.

ముందస్తు సన్నద్ధత

ఏటా పాఠశాల స్థాయి, విద్యాశాఖ ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేవారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులకు ప్రత్యేక దృష్టి పెట్టేవారు. ఈ ఏడాది విద్యాశాఖ మూడు సార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తోంది. జిల్లాలోని ఐదు తాలూకాల్లో మొత్తం 19,722 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటికే ఒకసారి నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల్లో మొత్తం 49.24 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా సిరుగుప్పలో 46.77 శాతం, అత్యధికంగా సండూరు 51.51 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో ప్రీ ఫైనల్ పరీక్షల్లో మొత్తం 62.24 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సారికంటే రెండోసారి ఉత్తీర్ణత కొంత పెరిగింది. రెండు విడతల్లో 1,108 మంది విద్యార్థులు పరీక్షలు తప్పారు. వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణతో పాటు సాధన చేయిస్తున్నారు. మూడో ప్రీఫైనల్ పరీక్షల్లో నూటికి నూరు శాతం సాధిస్తారని అధికారులు తెలియజేస్తున్నారు.

విద్యార్థుల అభ్యసనను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారి ఉమాదేవి,ఉపాధ్యాయులు

పాస్ మార్కుల తగ్గింపు

ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాస్ మార్కులను తగ్గించడంతో విద్యార్థులకు మరింత అనుకూలంగా మారింది. పదో తరగతి వార్షిక పరీక్షలు 35 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు గుర్తించేవారు. ఈ ఏడాది ఉత్తీర్ణత మార్కులు 28 వస్తే సబ్జెక్టు ఉత్తీర్ణత సాధిస్తారు. ఒక్కొక్క సబ్జెక్టుపై 20 మార్కులు ఉపాధ్యాయ చేతిలో ఉంటాయి. మిగిలిన 8 మార్కులు వస్తే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు అవుతుంది. కనీసం 13 మార్కులు రావాలని నిబంధన పెట్టారు. ఈ 13 మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కసరత్తు ప్రారంభించారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం

విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించాలి. కనీసం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. మానసిక ఒత్తిడితో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను మరచిపోయే అవకాశం ఉంది. ఒత్తిడికి గురి కాకుండా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల వారీగా యోగా, ధ్యానం తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పాఠశాలల వారీగా తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులను గుర్తించి సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాత్రి 8 గంటల వరకు పాఠశాలలోనే స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులను పిలిపించి వారిచే విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలకు చేరుకొని గణితం, విజ్ఞాన శాస్త్రం పాఠ్యాంశాలు బోధించడం, నిపుణులను పాఠశాలకు ఆహ్వానించి చదువుకోవడం, పరీక్షలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది సత్తా చాటుతాం

విద్యార్థులను ప్రోత్సహించడానికి మూడు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించాం. మొదటి, రెండో విడత పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. మూడోసారి మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు పరీక్షలు సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ఆయుష్‌శాఖ నుంచి యోగా, ధ్యాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం.

-మహమ్మద్ హ్యారీస్ సుమైర్, జిల్లా పంచాయతీ సీఈవో, బళ్లారి

పాఠశాలను దత్తత తీసుకున్నాం

జిల్లాలో గతేడాది తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను విద్యాశాఖాధికారులు దత్తత తీసుకున్నారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమాధానాలను బోర్డుపై రాయిస్తున్నాం. అనుత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులతో పాటు, కనీసం ఉత్తీర్ణత సాధించడానికి సాధన చేయిస్తున్నాం. రెండు ప్రీ ఫైనల్ పరీక్షల్లో కల్యాణ కర్ణాటకలో బళ్లారి మొదటి స్థానంలో ఉంది.

-ఉమాదేవి, జిల్లా విద్యాశాఖాధికారి, బళ్లారి

సేవలతోనే సమాజంలో కీర్తిప్రతిష్ఠలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పుట్టుకతో ఎవరూ శ్రేష్ఠులు కారని, వారు చేసే పనులతోనే అవుతారని ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు డా.బసవరాజ్ పేర్కొన్నారు. కరూరు గ్రామంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ వసతి పాఠశాలలో గురువారం నైతిక విలువలు, మానవధర్మం, విద్యలో మెలకువలు, తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ రత్నాకర్‌గా ఉన్న ఆదికవి తను చేసే పనులు, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం చేసిన కృషితోనే మహర్షి వాల్మీకిగా మారారన్నారు. సంత్ శిశునాళ షరీఫ్ తత్వ పదాలు, పాటలు ద్వారా భక్తిమార్గం, మానవ విలువలతో కూడిన జీవనం సాగించి ఆదర్శ సమాజం కోసం కృషి చేశారన్నారు. వసతి పాఠశాల ప్రధాన ఆచార్యుడు పి.కాసీం సాహెబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వి.వి.సంఘంలో సభ్యత్వ నమోదుకు చర్యలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాథ, మాధురి చెన్నయ్య శాస్త్రి, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: వీరశైవ విద్యావర్ధక సంఘం నూతన సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభించాలని వీరశైవ విద్యావర్ధక సంఘం సభ్యత్వ అభియాన్ సంచాలకుడు కాశీనాథ్, మాధురి చెన్నయ్య శాస్త్రి కోరారు. గురువారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వీరశైవ విద్యావర్ధక సంఘం నూతన సభ్యత్వ నమోదు 20 ఏళ్ల క్రితం చేసుకున్నారు. నూతన సభ్యత్వ నమోదు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంఘంలో మొత్తం 2500 మంది సభ్యులు ఉండగా, సుమారు 400 నుంచి 500 మందికిపైగా మృతి చెందారు. నూతన సభ్యత్వం చేసుకోవడం లేదని ఆరోపించారు. ప్రతి మూడేళ్లకు ఓ సారి జరిగే ఎన్నికల ముందు నూతన సభ్యత్వం చేస్తామని భరోసా ఇస్తారు. గెలిచిన తర్వాత మరిచి పోతున్నారని ఆరోపించారు. ఉమ్మడి బళ్లారి జిల్లా నుంచి విజయనగర జిల్లా విడిపోయినా...డైరెక్టర్ల కేటాయింపులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. వి.వి. సంఘంలో మొత్తం 46 విద్యా సంస్థలు ఉండగా, వాటిలో నైపుణ్య బోధన తగ్గుముఖం పడుతోందన్నారు. సభ్యులు మదరి చెన్నయ్య శాస్త్రి, రేవణసిద్ధయ్య, రవికాంత్, కిరణ్ శంక్రి, విజయకుమార్, ఓంకారప్ప పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వాముల పట్టాభిషేకోత్సవం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం గురు రాఘవేంద్రస్వాముల 405వ పట్టాభిషేక ఉత్సవం గురువారం సత్యనారాయణ పేట రాఘవేంద్రస్వామి మఠంలో వైభవంగా జరిపారు. స్వామివారి బృందావనానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి అలంకరించి మఠం చుట్టూ ఊరేగించారు. భజనమండలి భక్తులు కీర్తనలు ఆలపించారు. మధ్వసంఘం, రాఘవేంద్రమఠం సంయుక్తాధ్వర్యంలో ప్రవచన, ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు. తేరువీధి రాఘవరాయుడి మఠంలో పట్టాభిషేక ఉత్సవాలు ఘనంగా ఆచరించారు. స్వామివారికి పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో మఠం వ్యవస్థాపకులు ప్రసన్నాచార్, మధ్వసంఘం సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ పేట రాఘవేంద్ర మఠంలో బృందావనానికి విశేష పూజలు

తేరువీధి రాఘవరాయుడికి పుష్పాలంకరణ

ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా

షణ్ముఖప్పకు వినతిపత్రం సమర్పిస్తున్న వాల్మీకి సముదాయ నాయకులు

కంప్లి.. న్యూస్‌టుడే: వాల్మీకి సముదాయ నాయకులు గురువారం కంప్లి ఎమ్మెల్యే గణేశ్ ఇంటి ముందు ధర్నా జరిపారు. ఉత్తర కర్ణాటక ప్రాంత వాల్మీకి నాయక సంఘం అధ్యక్షుడు మారెప్ప నాయక్ మాట్లాడుతూ వెనుకబడిన (బీసీ) వర్గాలకు చెందిన కొందరు ఎస్టీ (గిరిజన) కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. ఫలితంగా నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతోంది. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ప్రభుత్వం ప్రోత్సాహ ధనం అందించాలి. గిరిజన సముదాయ సంక్షేమానికి, మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలికి నిధులు కేటాయించాలన్నారు. తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు షణ్ముఖప్పకు వినతిపత్రం సమర్పించారు. వాల్మీకి నాయక మహాసభ తాలూకా అధ్యక్షుడు నీరగంటి వీరేశ్, నాయకులు శ్రవణ్ కుమార్, బి.వెంకటేశ్, వాల్మీకి ఈరణ్ణ, సుగ్గేనహళ్లి జడెప్ప, సోమసముద్ర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా సాధనకు అభిప్రాయాల సేకరణ

తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న 'సింధనూరు జిల్లా' పోరాట సమితి

సింధనూరు, న్యూస్‌టుడే: అందరి పోరుతో 'సింధనూరు నూతన జిల్లా' దస్త్రం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక్క అడుగు కదిలింది. ఇదే పోరాటానికి తొలిమెట్టు.. సింధనూరును జిల్లా చేయాలంటే ఏమేం కావాలి అనే విషయంపై ప్రభుత్వ ఉన్నత వర్గాలు రీజినల్ కమిషనర్, జిల్లాధికారి, తహసీల్దారులను కోరారు. ఈ విషయంలో అధికారులు తమ పోరాటానికి ఫలితం దక్కించే ప్రయత్నం చేయాలని సింధనూరు జిల్లా పోరాట సమితి ప్రతినిధులు గురువారం తహసీల్దారును కోరారు. ఈ మేరకు తహసీల్దారు అరుణ్ దేశాయ్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి ఇతర ప్రముఖులు ఉన్నారు. తహసీల్దారు రూపొందించే నివేదిక కీలకం కావడంతో దీనిని అంకితభావంతో చేయాలని ప్రతినిధులు అభ్యర్థించారు. సింధనూరు తాలూకావ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల నుంచి దీనిపై అభిప్రాయాలు సేకరించి అంతిమ నివేదిక ప్రభుత్వానికి పంపాలని కోరారు.

జేఈఈలో శ్రీకృష్ణదేవరాయ విద్యార్థుల ఘనత

సింధనూరు, న్యూస్‌టుడే: ఈజే.హొసళ్లిక్యాంపులోని శ్రీకృష్ణదేవరాయ పీయూ సైన్స్ కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ సెషన్-1 పరీక్షా ఫలితాల్లో సత్తాచాటారు. అయిదుగురు విద్యార్థులు చక్కని పర్సంటైల్ తెచ్చుకుని మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత పొందారు. ఈ కళాశాలకు చెందిన విఘ్నేశ్ అనే విద్యార్థి 88.0 శాతం పర్సంటైల్‌తో టాపర్‌గా నిలవగా ఆర్.సచిన్‌పాటిల్, ఫాతిమా జొహరా, ఎస్.కిరణ్‌కుమార్, కె.వరుణ్‌తేజ్ తదుపరి స్థానాలను దక్కించుకున్నారు. విద్యాసంస్థల సీఈవో డా.మహ్మద్ అస్లాం ఖాన్ విద్యార్థులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మైలారలింగేశ్వరస్వామి రథోత్సవం

సిబారలోని మైలారలింగేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: సిబార వద్ద ఉన్న శ్రీ మైలారలింగేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సాయంత్రం వందలాది మంది భక్తులు దేవాలయం వద్ద చేరి తిరునాళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. దేవాలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, మంగళవాద్యాలు వెంటరాగా పూలపల్లకిలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు రథాన్ని లాగి తమ మొక్కులను తీర్చుకొన్నారు. రథంపై పలువురు అరటిపళ్లు, మిరియాలు వెదజల్లారు.

రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దొరబాబు

తూము దొరబాబు

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని అమరేశ్వ క్యాంపునకు చెందిన ప్రముఖ తెలుగు రైతు తూము దొరబాబు రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. క్యాంపులో బాజపాకు ఆదరణ అంతంత మాత్రమే ఉంది. పార్టీని బలోపేతం చేసే క్రమంలో పార్టీ తూము దొరబాబుని అధ్యక్షుడిగా నియమించింది. భాజపా బలోపేతానికి, రైతు పోరాటానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచించారు. దొరబాబు నియామకంపై క్యాంపు మద్దతుదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

నేడు ఎంపీ కుమార్‌నాయక్ పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం లింగసుగూరు చేరుకుంటారు. జిల్లా అధికారులతో కలిసి తాలూకాలోని చిత్తాపూర్ గ్రామంలో జలధార పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం తాలూకాలోని నవలి, సజ్జలగుడ్డ గ్రామాల్లో జల జీవన్ మిషన్, జలధార పనులను వీక్షిస్తారు. ముద్గల్, కన్నాపూర్ హట్టిల్లో ఎంబీఆర్1, ఎల్ఎన్ఆర్7, డీబీఓటీ పనులను తిలకిస్తారు. మాన్వి తాలూకా హిరేకొట్నేకల్ చేరుకుంటారు. రైల్వే అధికారులతో కలిసి రైల్వేట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. కరేగుడ్డలోని మహంతేశ్వర మఠాన్ని సందర్శించి భూమిపూజలో పాల్గొంటారు. సాయంత్రం మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌లతో కలిసి మాన్వి పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సాహిత్య సమ్మేళన నిర్ణయాల అమలుకు వినతి

ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న విమర్శకులు, రచయిత బంజగెర జయప్రకాశ్

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: కన్నడ సాహిత్య సమ్మేళనాల్లో తీసుకొనే నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుకు తెచ్చి రాష్ట్రంలో కన్నడ భాష, సంస్కృతిని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని విమర్శకుడు, రచయిత డా. బంజగెర జయప్రకాశ్ పేర్కొన్నారు. ఇక్కడ జి.జి. సముదాయ భవనంలో నిర్వహించిన 18వ జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళనం ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వ్యాపార వాణిజ్య నామఫలకాల్లో కన్నడ భాషకు ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మేళనం అధ్యక్షురాలు డా. సంధ్యారెడ్డి, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శివస్వామి, తాలూకా అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురలో గాలిలో కాల్పులు

రాయచూరు, న్యూస్‌టుడే : సార్వజనిక స్థలంలో లైసెన్సు తుపాకీని వినియోగించడం కలకలం సృష్టించింది. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హోసూరు సిద్ధాపుర గ్రామంలో యల్లమ్మదేవి ఉత్సవం ఊరేగింపు వేళ బస్టాండ్ దగ్గర్లో గాలిలో కాల్పులు జరిపారు. ఈ ఘటన జనవరి 27న జరిగినట్లు సమాచారం. సంబరాలు చేసుకునేందుకు కాల్పులు జరిపినట్లు భావిస్తున్నారు. తాజాగా వీడియో వైరల్ అయ్యింది. ఇందుకు సంబంధించి ఇద్దరి యువకులపై జాలహళ్లి పోలీస్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొన్న సొప్ప తిని గొర్రెల మృతి

మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యులు, పోలీసులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విషాహారం తిని 23 గొర్రెలు మృతి చెందిన సంఘటన హచ్చొళ్లి పోలీసుఠాణా పరిధి రావిహాళ్ గ్రామ పంచాయతీ గుబ్బళ్లి గ్రామంలో జరిగిందని పోలీసులు చెప్పారు. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా కట్టిపుర గ్రామం నుంచి సుమారు 400 గొర్రెలను తీసుకొచ్చి ఇక్కడ మేపుకొంటున్నారు. బుధవారం రాత్రి తమ మందలోని అనేక గొర్రెలు రంగుమారి అస్వస్థతకు గురవగా అందులో 23 మృతి చెందాయి. స్థానిక పశువైద్యుడు కుబేరను తీసుకొచ్చి మిగిలిన గొర్రెలకు చికిత్స అందించారు. రసాయన మందు పిచికారీ చేసిన జొన్న సొప్పను మేయడంతోనే విష ప్రభావం సోకి మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బాధితులు యంకప్ప, లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హచ్చొళ్లి పోలీసుఠాణాలో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు విద్యుత్తు వినియోగదారులతో సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర ఉపవిభాగం-1, 2 వ్యాప్తిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 21న ఉదయం 11.30 గంటలకు ఉప విభాగం కార్యాలయం విద్యుత్తు వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జెస్కాం అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గౌతమ బుద్ధుడు, అల్లమ ప్రభు మార్గాలు అనుసరణీయం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజశేఖరప్ప, తదితరులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: గౌతమ బుద్ధుడు, అల్లమప్రభు తమ వ్యక్తిత్వాలతో ప్రజలను ఎంతో ప్రభావితులను చేశారని చరిత్ర పరిశోధకులు, శిలాశాసనాల అధ్యయన నిపుణుడు రాజశేఖరప్ప పేర్కొన్నారు. గురువారం పిల్లేకరనహళ్లి బాపూజీ కళాశాలలో విశ్రాంత ప్రిన్సిపల్ హెచ్.లింగప్ప రచించిన 'బుద్ధనిలా ఆలోచించిన అల్లమప్రభు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బుద్ధుడు, అల్లమప్రభుల తత్వ సిద్ధాంతాలతో అన్నితరాల వారు ఆచరణయోగ్యమయ్యారన్నారు. వారు చూపిన మార్గంలో నడవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత లింగప్ప, ఆధ్యాత్మిక గురువు బసవప్రభుస్వామి, జానపద నిపుణులు పి.బి.శివణ్ణ, రంగస్వామి, జిల్లా శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు వీరేశ్ పాల్గొన్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

సునీత

స్వాతిక్

సమర్థ్

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా అంకమ్మనహాళ్ గ్రామానికి చెందిన సునీత (28), కుమారులు సమర్థ్ (9), సాత్విక్ (5) అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు చోరునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకుమారులు తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. సునీత (28) వయస్సు, 5.2 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖం, గోధుమ రంగు, సాధారణ శరీరాకృతి, కన్నడ, తెలుగులో మాట్లాడతారన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బళ్లారి: బళ్లారి నగరం బ్రూస్‌పేటె పోలీస్‌స్టేషన్ వ్యాప్తికి చెందిన మారెణ్ణ(50) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


మారెణ్ణ

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.99	1611.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	401	9,115
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.198	39.697

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

స్వాగత కమాను పడి వ్యక్తి మృతి

షేక్షా (పాతచిత్రం)

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లికోటె తుంగభద్ర నది వంతెన వద్ద స్వాగత కమాను పడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్వాగత కమానును గురువారం మధ్యాహ్నం క్రేన్ ద్వారా అమరుస్తుండగా అది కింద పడి ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానిక నాలుగో వార్డు నివాసి వెల్డింగ్ కార్మికుడు షేక్షా (35) తలకు తీవ్ర గాయాలవగా కంప్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం గంగావతి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి ఇనాయత్ (32), కరీం (21) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ వాసుకుమార్, పీఎస్సై అవినాశ్ కంబ్లె ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విగ్రహా ప్రతిష్ఠ ఆహ్వానం



శ్రీ కోదండరామాలయం నుగుడోణి హోసూరు క్యాంపు నూతన దేవస్థానంలో శ్రీమహాగణపతి, శ్రీమహాలక్ష్మీ సమేత కోదండరామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరవుతున్న రాష్ట్ర చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి శ్రీ ఎన్. ఎస్. బోసురాజు గారికి , రాయచూరు లోక్‌సభ సభ్యులు శ్రీ జి.కుమార్‌నాయక్ గారికి, మాన్వి అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ జి.హంపయ్యనాయక్ గారికి, మాజీ ఎమ్మెల్యే శ్రీ గంగాధర్‌నాయక్ గారికి, ఇవే మా హృదయపూర్వక స్వాగత సుమాంజలి. 20.2.2026, ఉదయం 10.45 గంటలకి నిర్వహించే పుణ్యకార్యక్రమానికి హాజరై విగ్రహప్రతిష్ఠాపనని విజయవంతం చేయాల్సిందిగా భక్తమహాశయులకి విజ్ఞప్తి.
అందరికీ ఆదర స్వాగతం.
ఆహ్వానించువారు: శ్రీరామ సేవా సమితి నుగుడోణి హోసూరు క్యాంపు మరియు సమస్త భక్తజనం

TUNGABHADRA BOARD : TB DAM

e-Procurement Short term tender Notice
IFB No.24 to 34/2025-26 Dt: 19-02-2026
(in respect of LLC Division, TB Board, Ballari costing upto Rs 20.00 lakhs)

Bid Document downloading Start Date & Time	: 20.02.2026 at 11.00 AM
Bid Document downloading End Date & Time	: 26.02.2026 upto 1.00 PM
Last Date & Time for submission of Bids	: 26.02.2026 upto 3.00 PM
Date of opening of Price Bids	: 26.02.2026 at 4.00 PM

Further details can be seen @ https://tender.apeprocurement.gov.in
Ph: 08392 - 242415, 242519
Sd/- S.Narayana Naik
Executive Engineer, LLC Division, TB Board, Ballari

(c) eenadu

సారా గోవిందు ఫోన్‌లో వంచకుల సందేశాలు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : ప్రముఖ నిర్మాత, డాక్టర్ రాజ్ కుమార్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సారా గోవిందు ఫోన్ నంబరు హ్యాక్ అయింది. ఆయన కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారందరికీ వంచకులు సందేశాలను పంపించారు. 'అత్యవసరం.. నాకు రూ.45 వేలు పంపించండి' అనే సందేశాన్ని చూసి, ఆప్తులు కొందరు గోవిందు దృష్టికి తీసుకువెళ్లగా తన నంబరు హ్యాకయినట్లు గుర్తించారు. తన నంబరు నుంచి నగదు కోసం వచ్చే సందేశాలకు స్పందించవద్దని ఆయన గురువారం విన్నవించారు. ఆయన ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో జీవిత ఖైదు

కార్వార, న్యూస్‌టుడే : సిద్ధాపురలోని వినాయక సౌహార్ద క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పిగ్మీ కలెక్టర్ గీతా ప్రభాకర్ హుండేకర్‌ను 2024 డిసెంబరు 23న హత్య చేసిన ఆరోపణలు రుజువు కావడంతో అభిజిత్ గణపతి అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.32 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సిద్ధాపుర ఠాణా పోలీసులు శిరసిలోని ఒకటో అదనపు జిల్లా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఇవ్వాలని జిల్లా న్యాయ ప్రాధికార అధికారులకు న్యాయమూర్తి కిరణ్ కిణి సూచించారు. ఆమె వద్ద ఉన్న పిగ్మీ కలెక్షన్, ఒంటిపై ఆభరణాల కోసమే నిందితుడు హత్య చేశాడని విచారణలో పోలీసులు గుర్తించారు.

నాజూకు నగరికి నిలువుటద్దాలు

ఆదర్శ వార్డుల అభివృద్ధికి చర్యలు

భారతీయుల సిలికాన్ వ్యాలీ.. బెంగళూరంటే ఇలా ఉండాలని చెప్పుకోవాలి! అంత సుందరంగా ఉద్యాననగరి వీధులను మార్చేయడానికి అధికారులు ముందడుగు వేశారు. అద్దంలా మెరిసిపోయే దారులు, చక్కని విలాసవంత నడకమార్గాలు, వాననీటి కాలువలు, ఆహ్లాదకర వాతావరణాన్ని విస్తరింప చేసే లక్ష్యంతో పథకరచనకు పూనుకున్నారు.

రహదారులపై వాననీరు ప్రవహించకుండా జాగ్రత్తలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కన్నడిగుల రాజధాని నగరిని అందంగా తీర్చిదిద్దడానికి దారులు ఏర్పడ్డాయి. చక్కని రహదారులు, పాదచారి మార్గాలు, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధీకరణ, చెరువుల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణ, పాఠశాలల స్థాయి పెంపు, ఉపాధి కల్పన పథకాలు, ఇంటి వద్దకే వైద్యం.. తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఐదు వార్డులను ఎంపిక చేసింది. ఐదు నగర పాలికెల పరిధిలోని తలా ఒకటి వార్డు చొప్పున ఎంపిక చేసి ఆదర్శ (మోడల్) వార్డులుగా అభివృద్ధి చేస్తామని పాలికె చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. ఆయా విభాగాల నుంచి జక్కూరు, శాంతల, బేగూరు, దక్షిణాన ఉల్లాళ్, తూర్పున పులకేశినగర వార్డులను ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇటీవల వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో చీఫ్‌కమిషనర్ సమావేశమై ఐదు వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. విజయవంతమైతే మిగతా వార్డులను ఎంపిక చేసుకుని అభివృద్ధి చేస్తారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ వర్గాల ప్రతినిధులతో వార్డు సమితులను ఏర్పాటు చేస్తారు. సమితులు సమావేశమై చర్చించి అభివృద్ధి పనులను చేపట్టాలని తీర్మానిస్తారు. అందుకోసం ప్రత్యేక కార్యాచరణ పథకాలను సిద్ధం చేసి అమలులోకి తెస్తారు.

పర్యావరణ రక్షణకు చక్కని రహదారులే ఊతం

అందమైన పాదచారి మార్గాలకూ నగరం ఆలవాలం

వాననీటి కాలువల మరమ్మతులూ కీలకమే

కేంద్ర మాజీ మంత్రిపై ఫిర్యాదు

బీదర్, న్యూస్‌టుడే : అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రేను అనుచిత పదజాలంలో దూషించిన ఆరోపణలపై కేంద్ర మాజీ మంత్రి భగవంత్ ఖూబాపై భాల్కి నగర ఠాణాలో కేసు నమోదైంది. కాంగ్రెస్ కార్యకర్త సురేశ్ బిరాదర ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మొదట కేసు నమోదుకు పోలీసులు నిరాకరించడంతో సురేశ్ బిరాదర సివిల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు సూచనలతో పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఖూబాకు తాఖీదులు జారీ చేశారు. ఫిబ్రవరి 7న పాపనాశ దేవాలయం అభివృద్ధి పనులను ప్రారంభించే సమయంలో ఖూబా, భాజపా నాయకులు ధర్నాకు దిగారు. వారిని పోలీసులు అదుపులోనికి తీసుకున్న సమయంలో ఫేస్‌బుక్ లైవ్‌లో ఖండ్రేను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని సురేశ్ బిరాదర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలీసుల వేషంలో దోపిడీ

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తాము పోలీసులం అంటూ ఇచ్చి ఇంట్లో దోపిడీకి పాల్పడి పరారైన నిందితుల కోసం బ్యాడరహళ్లి ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. బీఈఎల్ లేఅవుట్ నివాసి హొంబాళెగౌడ ఇంట్లోకి పోలీసుల సమవస్త్రాల్లో వచ్చిన నిందితులు రూ.20 లక్షల నగదు, అరకిలో ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. హొంబాళెగౌడ, ఆయన భార్య మంగళమ్మ ఇద్దరినీ కుర్చీకి కట్టేసి నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. తుపాకీ, కత్తులు చూపించి నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

బొమ్మై ఇంట ప్రముఖుల సందడి

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై కుమార్తె ఆదితి బొమ్మై-రోషన్ సుధీర్ వివాహ నిశ్చితార్థానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు హాజరయ్యారు. గురువారం నగరంలోని ప్యాలెస్ మైదానంలో వివాహ నిశ్చితార్థ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సిద్ధరామయ్యతో పాటు మంత్రులు డాక్టర్ మహదేవప్ప, జమీర్ అహ్మద్‌ఖాన్, కేంద్ర మంత్రులు కుమారస్వామి, వి.సోమణ్ణ, భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర తదితరులు హాజరై వధువరులను దీవించారు.

బొమ్మై కుమార్తె ఆదితి బొమ్మై- రోషన్‌సుధీర్ వివాహ వేడుకల్లో సిద్ధరామయ్య తదితరులు

'దాఖలాల పరిశీలన వారి పనికాదు'

కలబురగి, న్యూస్‌టుడే : వివాహాన్ని చేసుకునేందుకు వచ్చే వధూవరుల వయస్సు ధ్రువీకరణ పత్రాలను కల్యాణ మండపాల యజమానులు, నిర్వాహకులు పరిశీలించాలన్న నియమం లేదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ధార్వాడలోని ఒక కల్యాణ మండపంలో వివాహమైన బాలికకు 17 ఏళ్ల ఎనిమిది నెలల వయసులో ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివాహం జరిగిన కల్యాణ మండపం యాజమాన్య ప్రతినిధులపైనా కేసు పెట్టారు. దీన్ని ప్రశ్నిస్తూ వారు వేసుకున్న అర్జీపై విచారణ పూర్తి చేసిన జస్టిస్ కె.రాజేశ్ రై కేసును కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'గృహ నిర్మాణానికి సహకరించండి'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్ర బడ్జెట్‌లో గృహ నిర్మాణ పథకాలకు ఎక్కువ నిధులు కేటాయించే విధంగా ప్రయత్నించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ గురువారం విధానసౌధలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్‌ను కలిసి చర్చించారు. నిర్ణీత సమయం కల్లా పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, అందుకు నిధులు ఎక్కువగా కేటాయించాలని కోరారు. కొత్త పథకాలను కూడా బడ్జెట్‌లో చేర్పించేలా ప్రయత్నించాలని, బకాయిలను త్వరగా విడుదల చేయాలని ప్రతిపాదించారు. కర్ణాటక మురికివాడల నిర్మూలన మండలి అధ్యక్షుడు ప్రసాద్ అబ్బయ్య, గృహ నిర్మాణ మండలి అధ్యక్షుడు శివలింగేగౌడ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

డాక్టర్ శాలిని రజనీశ్‌తో చర్చిస్తున్న జమీర్ అహ్మద్‌ఖాన్

అన్న ఇంట్లోనే దొంగతనం

హావేరి, న్యూస్‌టుడే : తన అన్న ఇంట్లో గత శనివారం దొంగతనానికి పాల్పడిన మహ్మద్ అలి హంచినమని (36) అనే వ్యక్తిని హానగల్ ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హేరూరు గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ హంచిమని నివాసం పైకప్పు పెంకులు తొలగించి ఇంట్లోకి దిగిన నిందితుడు రూ.15.42 లక్షల ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు దొంగిలించుకుని పరారయ్యాడు. బాధితుని ఫిర్యాదుతో శ్వానదళ సిబ్బంది, వేలిముద్రల నిపుణుల సహకారంతో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు.

ఎస్సై వేధిస్తున్నాడంటూ నిందితుడి ఫిర్యాదు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : చీటీ లావాదేవీలు నిర్వహించి, మోసానికి పాల్పడిన ఆరోపణలపై అగ్రహార దాసరహళ్లికి చెందిన అవినాశ్, అతని తల్లిదండ్రులపై మాగడి రోడ్డు ఠాణా పోలీసులు గత ఏడాది జనవరిలో కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిలు తీసుకున్న అవినాశ్, క్రమం తప్పకుండా విచారణకు హాజరవుతూ వస్తున్నాడు. ఠాణాలో ఎస్సై కౌశిక్ తనను దూషిస్తున్నారని, రౌడీషీటు తెరుస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారులకు అవినాశ్ ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో మరోసారి న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో మాగడిరోడ్డు ఠాణా పోలీసులు ఎస్సై కౌశిక్‌పై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు బాధ్యతలను గోవిందరాజనగర ఠాణా పోలీసులకు అప్పగించారు.

దోపిడీ దొంగల అరెస్టు

విజయపుర, న్యూస్‌టుడే : చడచణ తాలూకా హలసంగిలోని భూమికా జ్యువెలరీ దుకాణంలో తుపాకీ చూపించి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పుణెలో అరెస్టు చేశారు. గత జనవరి 26న తుపాకీ చూపించి, దోపిడీకి పాల్పడిన నిందితులను హణమంత వాగోలి, శివరాజ్ నావిగా గుర్తించారు. వీరి నుంచి మూడు నాటు తుపాకులు, ఒక ఎయిర్‌గన్, 205 గ్రాముల ఆభరణాలు, కిలో వెండి వస్తువులు జప్తు చేసుకున్నారు.

టికెట్ యంత్రం ఎత్తుకెళ్లిన ప్రయాణికుడు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి శిరశికి వెళ్లే నాన్-ఏసీ స్లీపర్ బస్సులో టికెట్లు జారీ చేసే మిషన్‌ను ముగ్గురు చోరులు దొంగిలించుకు వెళ్లారు. డ్రైవరు, కండక్టరు బస్సులో ఉంచిన బ్యాగులు, మిషన్‌ను నిందితులు తీసుకువెళ్లారు. దీంతో బుధవారం రాత్రి మూడు గంటల పాటు ఆ బస్సు ప్రయాణం ఆలస్యమైంది. అర్ధరాత్రి అనంతరం మామూలు టికెట్లు జారీ చేసిన అనంతరం ప్రయాణం ప్రారంభమైంది.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

మైసూరు : నరసీపుర తాలూకా తలకాడు సమీపంలోని పరిణామిపుర గ్రామంలో అడవి ఏనుగు దాడిలో గురుమల్లప్ప (70) అనే వృద్ధుడు రాత్రి మరణించాడు. చెరకు తోటకు నీటిని వదలేందుకు వెళ్లిన సమయంలో ఏనుగు దాడి చేసింది. శివనసముద్రం, సత్యమంగలం ప్రాంతాల నుంచి ఏనుగు వచ్చి ఉంటుందని అనుమానించారు. డ్రోన్ కెమెరా సాయంతో ఏనుగును గుర్తించేందుకు కార్యాచరణను చేపట్టారు. తమకు పరిహారం ఇవ్వాలని గురుమల్లప్ప కుటుంబ సభ్యులు అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశారు.

'రశ్మికా పెళ్లికి మేమెందుకు?'

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : నటి రశ్మికా మందణ్ణ, నటుడు విజయ్ దేవరకొండల వివాహానికి తమను ఆహ్వానిస్తారని వేచి చూడడం లేదని నటుడు ప్రమోద్‌శెట్టి వ్యాఖ్యానించారు. నటుడు రక్షిత్ శెట్టిని, తనను ఆమె వివాహానికి ఆహ్వానిస్తారని భావించడం లేదని స్పష్టం చేశారు. రక్షిత్‌తో మొదట రశ్మికకు ఎంగేజ్‌మెంట్ జరిగింది. వివాహం చేసుకోకుండానే వారిద్దరూ విడిపోయారు. ఇప్పుడు రక్షిత్ పూర్తిగా సినిమాల చిత్రీకరణలు, స్క్రిప్ట్ పనిలో బిజీగా ఉన్నాడని ప్రమోద్ తెలిపారు. రశ్మికతో వివాహం కానందుకు రక్షిత్ బాధపడడం లేదని ఆయన ఆత్మీయులు అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

మాలవి జలాశయంలో విదేశీ విహంగాల సందడి

వినీలాకాశంలో విహంగాల విహారం

హొసపేటె, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షిగా మారక ముందు రత్నాకర అని ఆయన పేరు. ఓ సారి వేటాడే సమయంలో ఓ క్రౌంచ పక్షిపై విల్లు ఎక్కుపట్టి సంహరిస్తాడు. బాణం దూసుకుపోవడంతో విల్లవిల్లాడుతూ ప్రాణం కోల్పోయిన ఆ దృశ్యాన్ని చూసి పశ్చాత్తాపంతో అప్పటి నుంచి వేట మానేస్తాడని ఓ కథనం ప్రచారంలో ఉంది. క్రౌంచ పక్షులు చాలా అరదు. మన దేశంలో అంతగా కనిపించవు. అక్టోబరు నుంచి మార్చి వరకూ రాజస్థాన్‌లో అప్పుడప్పుడు కనిపించేవట. మంగోలియా దేశంలో ఎక్కువగా కనిపిస్తాయి. అలాంటి అరుదైన విహంగాలు నేడు విజయనగర జిల్లా హగిరిబొమ్మనహళ్లి తాలూకా మాలవి జలాశయానికి వలసవచ్చాయంటే నమ్మాల్సిందే. సుమారు 4,800 కిలోమీటర్ల మంగోలియా నుంచి ఆహారాన్వేషణ చేస్తూ అవి మాలవి జలాశయంలో వాలాయి వందలాది క్రౌంచ (డెమోసిల్ క్రేన్ బర్డ్) వచ్చి దిగడంతో మాలవి జలాశయానికి కొత్త అందం వచ్చింది. ఉదయం, సాయంత్రం పూట వాటి హొయలు, ఎగిరే తీరు, ఆహారాన్వేషణ తదితర విన్యాసాలను చూడటం కనులకు పండగ అని ఇట్టగి పక్షి ప్రేమికుడు విజయ్ తెలిపారు. కాని వీటికి వేటగాళ్ల నుంచి ప్రమాదం కూడా ఉంది. అటవీశాఖ వారు జలాశయం వద్ద కాపలా సిబ్బందిని నియమించడం ఉత్తమమని ఆయన పేర్కొన్నారు. మాలవి జలాశయంలో నీటినిల్వలు తగ్గాయి, దీంతో వలస పక్షులు సులువుగా వేటాడి పొట్ట నింపుకొంటున్నాయి. మార్చి వరకూ అవి ఇక్కడే ఉండే అవకాశం ఉందని విజయ్ తెలిపారు.

హగరిబొమ్మనహళ్లి మాలవి జలాశయం వద్ద విదేశీ విహంగాల కువకువలు

'సిద్ధు తప్పుకోవడమే ఉత్తమం'

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉగాది అనంతరం తానంతట తానే సిద్ధరామయ్య ముఖ్యమంత్రి స్థానం నుంచి తప్పుకొంటేనే కొత్త నాయకునికి ముఖ్యమంత్రి యోగం ఉంటుందని కోడిమఠం మఠాధిపతి శివానంద శివయోగి రాజేంద్రస్వామి జోస్యం చెప్పారు. శివరాత్రిని పురస్కరించుకుని కాశీ, ప్రయాగరాజ్ యాత్రలను ముగించుకుని కెంపేగౌడ విమానాశ్రయానికి గురువారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు డీకే శివకుమార్, పరమేశ్వర్ కూడా ఆప్తులేనని చెప్పారు. అందరికీ మంచి జరగాలని కోరుకుంటానని, వారి భవిష్యత్తు నా చేతుల్లో లేదని స్పష్టం చేశారు. కర్ణాటకలో ఈసారి చక్కని వర్షాలు కురిసి పంటలు పండుతాయని చెప్పారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	65
క్యారెట్-	55
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	210

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	45
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

చాక్లెట్ల ఆశ చూపి మోసాలు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : అపరిచితులు ఇచ్చే చాక్లెట్లు, ఆహార పదార్థాలను తీసుకోవద్దని బనశంకరిలోని నేషనల్ పబ్లిక్ స్కూల్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కోరింది. పాఠశాల వ్యాను వెనుక వచ్చిన ఒక వ్యక్తి తమ కుమారుడికి చాక్లెట్ ఇచ్చి అపహరించేందుకు ప్రయత్నించాడని ఒక గృహిణి ఫిర్యాదు చేసింది. దీంతో పిల్లలను పాఠశాల వద్ద వదిలి వెళ్లే సమయంలో, ఆ తరువాత అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం సూచించింది. ఆ పాఠశాల వద్ద జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇదే తరహా సర్క్యులర్లను విడుదల చేశారు.

బస్టాప్‌లో బాణామతి భయం

గదగ, న్యూస్‌టుడే : గదగ నగరంలోని హుడ్కో కాలనీ బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు బాణామతి పూజలు చేశారు. 'గత ఏడాది నేను కోరుకున్నది దొరకలేదు. ఈ ఏడాది నేను అనుకున్నది పొందకుండా ఆగను' అని ముగ్గుతో రాసిన ఆగంతకుడు ముగ్గులో నల్లని రంగు బొమ్మ, నిమ్మ కాయలు, అరటి పండ్లు, గుడ్లు, తమలపాకులు, వక్క పెట్టాడు. కర్ణాటకలో మూఢనమ్మకాల నిషేధ చట్టం ప్రకారం, బాణామతి, చేతబడి తదితరాలను చేయడం నేరం. స్థానికుల ఫిర్యాదుతో నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'హీలియం గ్యాసు'పై నిషేధం

మైసూరు, న్యూస్‌టుడే : హీలియం గ్యాసు వినియోగంపై నిషేధాన్ని విధిస్తూ మైసూరు నగర కొత్వాలు సీమా లాట్కర్ ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలల కిందట ప్యాలెస్ సమీపంలో బెలూన్లలో గ్యాసు నింపుతున్న సమయంలో సిలిండర్ పేలి ఐదుగురు మరణించారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక వినియోగాన్ని మినహాయించి.. ఇతరులు ఎవరూ ఈ వాయువును వినియోగించకూడదని ఆమె ఆదేశాలు జారీ చేశారు.

కర్కశ ధ్వనులకు అడ్డుకట్ట

మైసూరు, న్యూస్‌టుడే : కర్కశ ధ్వని వెలువరించే 378 సైలెన్సర్లను నగరంలోని వివిధ ట్రాఫిక్ ఠాణాల పోలీసులు జప్తు చేసుకుని ధ్వంసం చేశారు. జాతీయ రహదారి సురక్ష మాసోత్సవాలను పురస్కరించుకుని నగర వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. పోలీసులు జప్తు చేసుకున్న వాహనాల నుంచి తీసిన సైలెన్సర్లను సిద్ధార్థ నగర పాత ఠాణా ఆవరణలో ఉంచి దానిపై నుంచి బుల్‌డోజర్‌ను నడిపి ధ్వంసం చేశారు.

ఎత్తినహొళె.. కొత్త రికార్డు!

ప్రపంచంలో పొడవైన నీటి ఉపరితల వంతెన కాలువ.. ఎత్తినహొళె ఎత్తిపోతల పథకం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర ప్రజల దాహం తీర్చేందుకు పడమటి కనుమల నుంచి నీటి మళ్లించడానికి ప్రత్యేకించిన ఎత్తినహొళె నీటి ఎత్తిపోతల పథకం ఘన రికార్డులను సొంతం చేసుకుంటోంది. దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన పథకాన్ని పదేళ్లగా పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే 85 శాతం నిర్మాణాలు పూర్తి చేశారు. పథకం ద్వారా తిప్పగుండనహళ్లి (టీజీహళ్లి) రిజర్వాయరుకు 2.5 టీఎంసీల నీరు సరఫరా చేస్తారు. రాజధాని నగరం పూర్తిగా కావేరి నీటిపై ఆధారపడకుండా ఎత్తినహొళె నీటి పారుదల ద్వారా సరఫరా చేస్తారు. కావేరి నుంచి ఏడాదికి కేవలం 19 టీఎంసీల నీరు బెంగళూరు నగరానికి సరఫరా చేయాలి. పెరుగుతున్న నగరం, కొత్తగా ఏర్పడుతున్న ఉపనగరాలు, పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయాల్లో భాగంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఎత్తినహొళె నీటిని బెంగళూరు పడమటి ప్రాంతాలకు సరఫరా చేస్తారు. ఇందులో భాగంగా హాసన, తుమకూరు జిల్లాల్లో అతి ఎత్తైన కాలువలను నిర్మించారు. ఓచోట ఉపరితల వంతెనను 40 మీటర్ల ఎత్తులో 10.47 కిలోమీటర్ల పొడవునా పూర్తి చేశారు. మొత్తం నిర్మాణాలు అందుబాటులోకి వస్తే 75.6 లక్షల మంది ప్రజల దాహం తీరనుంది. ఆరు జిల్లాల పరిధిలోని 6,657 గ్రామాలు, 38 నగరాలు, 29 తాలూకాలను పథకం ఉపయోగకరంగా మారుతోంది. ప్రస్తుతం 164.5 కిలోమీటర్ల మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేశారు. 2027 కల్లా ముగిస్తామని అధికారులు ప్రకటించారు. చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాలకు తాగునీరు సరఫరా చేస్తారు. మార్గం మధ్యలో ఎనిమిది సబ్‌స్టేషన్లను దీనికోసమే నిర్మిస్తారు.

పొడవైన కాలువ ఘనత ఇదీ

సకలేశపుర తాలూకా బైకెరె గ్రామంలో నీటి ఎత్తిపోత

కోలారు జిల్లాలో అత్యంత పొడవైన నీటి కాలువ

రౌడీషీటర్ హుసేన్ ఆటకట్టు

మంగళూరు, న్యూస్‌టుడే : గత తొమ్మిదేళ్లుగా పరారీలో ఉన్న రౌడీషీటరు సఫ్వాన్ హుసేన్ (42)ను ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి వద్ద సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ముల్కి ఠాణా పరిధిలో 2008లో ప్రవీణ్ అనే యువకుడ్ని అపహరించి, దోచుకుని, హత్య చేసిన కేసులో 2020 ఫిబ్రవరి 28న అతనికి ఉన్నత న్యాయస్థానం జీవిత ఖైదు శిక్షను విధించింది. సూరత్కల్ ఠాణా పరిధిలో లెక్కి సఫ్వాన్ అనే వ్యక్తిని అపహరించి, హత్య చేసి, ఆగుంబె ఘాట్‌లో పడేసిన కేసులో విచారణ కొనసాగుతోంది. మరో 12 కేసులు న్యాయస్థానంలో విచారణ దశలో ఉన్నాయి. నిందితుడు తన పేరును ఉమర్ మహ్మద్ నాసిర్ పేరిట పాస్‌పోర్టును చేయించుకుని 2018లో విదేశాలకు పరారయ్యాడు. విదేశాల్లో ఉంటూనే మంగళూరు ప్రాంతానికి చెందిన వ్యాపారులను బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడేవాడు. రాయచోటికి అతను వచ్చినట్లు గుర్తించిన సీసీబీ పోలీసులు కార్యాచరణ నిర్వహించి అరెస్టు చేసి, మంగళూరుకు తీసుకువచ్చారు.

వింజో సంస్థకు ఎదురుదెబ్బ

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : ఆన్‌లైన్ గేమింగ్ వంచనకు సంబంధించి వింజో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అమెరికా, సింగపూర్ విదేశీ బ్యాంకుల ఖాతాల్లో డిపాజిట్ చేసిన రూ.505 కోట్ల చరాస్తులను జప్తు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం ధ్రువీకరించారు. విదేశీ షెల్ కంపెనీలు వింజో యూఎస్ ఇంక్ (అమెరికా), వింజో ఎస్‌జీ ప్రైవేట్ లిమిటెడ్ (సింగపూర్) ఖాతాలను కంపెనీ యాజమాన్య ప్రతినిధులు పవన్ నందా, సౌమ్య సింగ్ రాఠోడ్ నిర్వహించేవారు. ఈ కేసులో ఈడీ ఇప్పటి వరకు సుమారు రూ.689 కోట్ల చరాస్తులను జప్తు చేసుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ వంచనలకు సంబంధించి ఈడీ అధికారులు గత నవంబరు, డిసెంబరుల్లో కంపెనీ కార్యాలయాలు, డైరెక్టర్ల నివాసాలపై దాడులు చేశారు. వంచనలకు సంబంధించి పలు దస్త్రాలను జప్తు చేసుకున్నారు. జూదం ఆడేవారిని దారి తప్పించేలా కంప్యూటర్లతో ఆడించి జూదరులను బోల్తా కొట్టించే వారు. ఆన్‌లైన్ జూదం వ్యసనం బారిన పడి లక్షలాది మంది యువకులు తమ ఆస్తులను గుల్ల చేసుకునేవారు.

దారితప్పిన 'చెక్కు' సొమ్ము

శివమొగ్గ, న్యూస్‌టుడే : సంతేకడూరు కెనరా బ్యాంకు శాఖలో కాచినకట్టె నివాసి బీఎం నాగరాజ్ రూ.5.5 లక్షల చెక్కును జమ చేశారు. ఖాతాలో బ్యాంకు సిబ్బంది రూ.55 వేలు మాత్రమే జమ చేశారు. దీనిపై ఆయన 2024 జులైలో ఫిర్యాదు చేశారు. మిగిలిన రూ.4.95 లక్షలు జమ చేయాలని కోరినా, లేఖలు రాసినా స్పందన రాలేదు. దీన్ని ప్రశ్నిస్తూ వినియోగదారుల న్యాయస్థానంలో నాగరాజ్ అర్జీ వేసుకున్నారు. విచారణ పూర్తి చేసి రూ.4.95 లక్షలకు సాలీనా ఆరు శాతం వడ్డీ, పరిహారంగా మరో రూ.25 వేలను వినియోగదారుని ఖాతాకు జమ చేయాలని జిల్లా వినియోగదారుల న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

సీఎం కప్ బాడ్మింటన్ టోర్నీ లోగో ఆవిష్కరణ

ఈ నెల 21 నుంచి 9 డ్రీమ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ బాడ్మింటన్ పోటీల లోగోను సీఎం నివాసం కావేరిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సినీనటులు, మాధ్యమ ప్రతినిధులు పోటీల్లో పాల్గొంటున్నారు. సీఎం మాధ్యమ సలహాదారుడు కె.వి. ప్రభాకర్, ఏసీపీ పరమేశ్వర్, ఇమ్రాన్, కవితాలంకేశ్, పోటీల నిర్వాహకులు మంజునాథగౌడ, సునీల్, సనత్‌రై, తేజస్, బాలు, ఆశిక్‌శెట్టి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

కనులపండువగా తెప్పోత్సవం

తుమకూరు నగర శివారులోని సిద్ధగంగామఠంలో సిద్ధలింగేశ్వరస్వామి జాతర మహోత్సవం సందర్భంగా మఠం ఆవరణంలోని పుష్కరిణిలో వేలాది మంది భక్తుల సమక్షంలో సిద్ధలింగేశ్వరస్వామి తెప్పోత్సవం వైభవంగా సాగింది. సిద్ధగంగామఠం అధ్యక్షుడు సిద్ధలింగస్వామీజీ, చిన్నస్వామి శివసిద్ధేశ్వరస్వామి, అసంఖ్యాక భక్త సమూహం తెప్పోత్సవంలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తుమకూరు

భూస్వాధీనంపై రైతన్నల కన్నెర్ర

కార్యాలయాన్ని ముట్టడించిన అన్నదాతలు

ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న మహిళలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు, శూలగిరి, వేపనహళ్లి ప్రాంతాల్లో రైతుల జీవనాధార సారవంతమైన వ్యవసాయ భూములను అభివృద్ధి పేరుతో ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల అంగీకారం లేకుండా వేల ఎకరాల భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకించారు. డీఎంకే ప్రభుత్వంపై రైతు సంఘాల నాయకులతో కలిసి 120 గ్రామాల రైతులు, మహిళలు, కుటుంబ సభ్యులతో కలిసి గురువారం హోసూరు పట్టణాన్ని దిగ్బంధించారు. మహిళలు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. పోలీసుల కళ్లుగప్పి వేలాది మంది గ్రామాల నుంచి అడ్డదారుల్లో హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. వాహనాల్లో వస్తున్న రైతులను పోలీసులు అడ్డగించారు. రైతుల ఆందోళనతో పట్టణం అట్టుడికింది. ప్రధాన రహదారులన్నీ స్తంభించిపోయాయి. జన రద్దీగా ఉండే తాలూకా కార్యాలయం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా నిలిచారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు మండేఎండలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఒక వైపు ప్రదర్శన, ఒక వైపు ధర్నా, మరో వైపు నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. హోసూరులోని అన్ని రహదారులు గంటల కొద్దీ స్తంభించిపోయాయి. వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. ఆందోళనకు రైతుల సంఘాల అధ్యక్షుడు మునివెంకటప్ప నేతృత్వం వహించారు. రైతు సంఘాల నాయకులు ప్రత్యేక వాహనంపై నుంచి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం హోసూరును అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు 30 వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుందని, భూములకు నష్టపరిహారం ఇవ్వని కారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతు కుటుంబాలు పెళ్లాంపిల్లలతో బెంగళూరు వలస వెళ్లారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఎకరాకురూ.3 కోట్ల వరకు చెల్లిస్తుండగా ఇక్కడ కేవలం రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షలు మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శూలగిరి ప్రాంతంలో ఐదు, ఆరు పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయడానికి భూములు స్వాధీనం చేసుకున్నారని, హోసూరు ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనంతరం హోసూరు సబ్‌కలెక్టర్ ఆకృతిని రైతు సంఘాల నాయకులు కలిసి చర్చించారు. భూములు పోగొట్టుకున్న రైతు కుటుంబాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేదని, రైతు కుటుంబాలను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, తప్పకుండా న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అన్నదాతల ఆందోళన కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ శంకర్ నేతృత్వంలో గట్టి భద్రత కల్పించారు. రైతు సంఘాల ప్రతినిధులు పి.ఎం.కె.నాయకుడు అరసనట్టి మునిరాజు, లయన్స్ సంఘాల ఛైర్మన్ వై.వి.ఎస్.రెడ్డి, సామనపల్లి సురేశ్, అంబరీశ్, మురళీ, అరుణ్‌రాజ్, దేవగానపల్లి రవీంద్రరెడ్డి, ఉళియాలం జయకుమారరెడ్డి, వెంట్రాజు, ఈచంగూరు సీటీఆర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ ఆకృతితో చర్చిస్తున్న ప్రతినిధులు

వాహనంపై మాట్లాడుతున్న నాయకులు

వైభవంగా హిందూ సమాజోత్సవం

జ్యోతి వెలిగిస్తున్న రవికుమార్, నిశ్చలానందనాథస్వామి, తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దీనికి ఆహార పద్ధతి, ఒత్తిడి కారణమని విశ్వ ఒక్కలిగర మహాసంస్థానం ప్రతినిధి నిశ్చలానందనాథస్వామీజీ తెలిపారు. రాజాజీనగర పరిధిలోని ప్రకాశనగర గాయత్రి ఉద్యానవనంలో చిలుమె రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సార్వజనికుల ఆరోగ్య రక్షణ కోసం ఉచితంగా సంజీవని లడ్డు పంపిణీ, హిందూ సమాజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం జనజాగృతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ మఠానికి చెందిన దేవతార్షి జయసత్యవర్ధన, బ్రహ్మలింగ్వేరమఠం ప్రతినిధి బ్రహ్మానందయోగి, రవిశంకర్‌స్వామీజీ, సమాజసేవకులు కృష్ణేగౌడ తదితరులు పాల్గొన్నారు.

జయనగరలో రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం

ఉత్సవమూర్తిని పూజిస్తున్న వాదీంద్రాచార్యులు తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : జయనగర ఐదో బ్లాక్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సీనియర్ వ్యవస్థాపకుడు ఆర్.కె.వాదీంద్రాచార్యులు, పురోహితులు నందకిశోర్ నేతృత్వంలో రాఘవేంద్రస్వామి స్తోత్రాలు, అష్టోత్తర పారాయణంతో బృందావనానికి సహస్ర కళశాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వర్ణసింహాసనంపై రాఘవేంద్రస్వామి సువర్ణపాదుకలను ఉంచి పుష్పవృష్టితో వేడుకలను ప్రారంభించారు. బృందావనానికి నవరత్నాలతో కూడిన కవచం, పంచఫలాల హారం, పుష్పాలతో అలంకరించి మంగళహారతి ఇచ్చారు. ఈనెల 24 వరకు వేడుకలను ఆచరించనున్నట్లు వాదీంద్రాచార్యులు తెలిపారు.

మినీ వ్యాను బోల్తా పలువురికి గాయాలు

బోల్తాపడిన వాహనం

డెంకణీకోట, న్యూస్‌టుడే : అంచెట్టి నుంచి డెంకణీకోటకు 17 మంది కార్మికులను తీసుకొస్తున్న మినీ వ్యాన్ తిరుమురుకుల వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. తానపల్లి గ్రామానికి చెందిన సంగీత (23), శెల్వి(35), మారియమ్మ గుడి వీదికి చెందిన శశికల (20) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను డెంకణీకోట ఆసుపత్రికి తరలించారు. 10 మంది చిన్న గాయాలతో చికిత్స పొంది ఇళ్లకు వెళ్లారు. అంచెట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

పావగడ, న్యూస్‌టుడే : పురసభ బడ్జెట్ రూపకల్పనకు పుర ప్రముఖులు, సంఘ సంస్థల నాయకులతో ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ అధ్యక్షతన గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. పలు పుర నేతలు అనేక సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వ నిధులు, పురసభ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. పురసభ మాజీ అధ్యక్షుడు జి.సుదేశ్‌బాబు దొంగతనాలు ఎక్కువవుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఆప్ పార్టీ జిల్లా కార్యదర్శి రామాంజనేయ గత బడ్జెట్లో రూపొందించిన పనుల వివరాలను తెలియచేయాలని, రైతు సంఘం నాయకుడు నరసింహరెడ్డి పురసభ కార్యాలయంలో దళారీ వ్యవస్థను రూపుమాపాలన్నారు. పట్టణంలో పాదచారుల మార్గం ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు సక్రమంగా అమర్చాలని, పెనుకొండ, మధుగిరి ఊరు వాకిళ్లలో పరిశుభ్రత పాటించాలని అధికారి దృష్టికి తెచ్చారు.

పుర ప్రముఖులతో మాట్లాడుతున్న జాఫర్ షరీఫ్

శౌర్య పరాక్రమాలకు మారుపేరు ఛత్రపతి

తుమకూరులో పుష్పార్చనలు చేస్తున్న ప్రముఖులు

తుమకూరు, న్యూస్‌టుడే : ధైర్యం, శౌర్యం, ఆత్మవిశ్వాసానికి హిందవీ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మారుపేరని జిల్లా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు కె.ఎస్. సిద్ధలింగప్ప తెలిపారు. తుమకూరులోని గుబ్బి వీరణ్ణ రంగమందిరంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. జిల్లా మరాఠా ఒక్రి పరిషత్తు గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావ్, గాయకవాడ, కన్నడ సాంస్కృతికల శాఖ అధికారి సురేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు జయరాంరావ్ సోసాలె, శ్రీనివాస్‌రావ్ రమేశ్‌రావ్ సింధే, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : మరాఠా సామ్రాజ్య సంస్థాపకులు ఛత్రపతి శివాజీ మహరాజ్ శౌర్య పరాక్రమాలకు మారుపేరని జిల్లా పాలనాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం ఇక్కడ జిల్లాపాలనాధికారి కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పించారు. అతని సామ్రాజ్యంలో మహిళల గౌరవ మర్యాదలకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ గోవిందరాజు, కన్నడ సంస్కృతిశాఖ ఏడీ గుర్నాథ్, నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తాజ్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ, న్యూస్‌టుడే : మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమావేశ హాల్లో నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన శివాజీ చిత్రపటానికి అభిమానులు, కార్యాలయ సిబ్బంది మనసారా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖులు శ్రీరామసేన శేఖర్‌బాబు, అల్లుంద రాజ్, తేజ, రవి, తేజరాయల్, ఆర్‌వీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రదుర్గలో శివాజీ చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న కుమారస్వామి

నల్లబ్యాడ్జీలతో కార్మికుల ఆందోళన

ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

డెంకణీకోట, న్యూస్‌టుడే : ప్రభుత్వ రెవెన్యూశాఖ గ్రామాధికారులు, ఇతర కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు కుప్పన్ ఆధ్వర్యంలో కార్యదర్శి మునిమారప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజు, 63 మంది కార్మికులు పాల్గొన్నారు.

సిద్ధిగణపతి ఉత్సవాల ప్రారంభం

ముస్తాబైన గణేశుడు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు ఆర్.టి.నగర్ శంకరాపురం, కోతితోపు బడావణెలకు చెందిన హోరి ముద్దప్ప కాంపౌండ్‌లోని సిద్ధి గణపతి దేవాలయంలో శుక్రవారం మూడో వార్షికోత్సవం ప్రారంభమైంది. సిద్ధి గణపతికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అలంకరణ, హవాలు, పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవాలకు హిరేమఠం శివానంద శివాచార్యస్వామీజీ దివ్యసాన్నిధ్యం వహిస్తారు.

నగరంలో హైదరాబాదీ హలీం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రంజాన్ ఉపవాస దీక్షలను దృష్టిలో ఉంచుకుని ఉపవాస దీక్షలు చేసేవారు, మాంసాహారుల కోసం 'జష్నే హలీం' పేరిట హైదరాబాదీ హలీంను అందుబాటులోకి తెచ్చామని ప్యారడైజ్ హోటల్ ప్రకటించింది. తాము 1953 నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న 29 దినుసులు, మాంసంతో వేర్వేరుగా హలీం చేస్తున్నామని సంస్థ యాజమాన్య ప్రతినిధులు అబిక్‌మిత్ర, రొబిందర్ సింగ్ తెలిపారు. గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రంజాన్ సమయంలో లభించే హలీంకు చక్కని డిమాండ్ ఉంటుందని చెప్పారు. ఒక ఏడాదిలో 90 లక్షల బిర్యానీలను అందించి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేసుకున్నామని గుర్తు చేశారు. బెంగళూరులో తమకు 11 శాఖలు ఉండగా, ఈ ఏడాది చివరికి 20-22కు పెంచుతామని వివరించారు.

బెళ్లిశ్లి గ్రామస్తుల ఆందోళన విరమణ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధికి రూ.90 కోట్లు విడుదల చేస్తామని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) అధికారులు భరోసా ఇవ్వడంతో రెండు రోజుల నుంచి చెత్త తొలగించే లారీలను అడ్డగించి నిరసన ఆందోళనలు చేపట్టిన బెళ్లిశ్లి గ్రామస్తులు తమ ఆందోళనను విరమించారు. జీబీఏ అధికారులు రంగంలోకి దిగి గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : విద్యాసంస్థల చుట్టు పక్కల పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నియంత్రించే చర్యలను బెంగళూరు ఉత్తర నగర పాలికె అధికారులు చేపట్టారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానాలు వసూలు చేస్తున్నారు. దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు నియంత్రణ కార్యక్రమాన్ని ఈనెల 26 వరకు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఉత్తర నగర పాలికె పరిధిలోని విద్యాసంస్థల చుట్టు పక్కల ఉన్న దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాదారుల నుంచి రూ.11700 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న పాలికె అధికారులు

ఆంగ్ల పాఠ్య పుస్తకాలు, భోదనపై సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న రమేశ్, తాండవగౌడ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : డాక్టర్ మన్మోహన్‌సింగ్ బెంగళూరు నగర విశ్వవిద్యాలయం పరిశోధన, అధ్యయనం విభాగంలో కొత్త ఆంగ్ల పాఠ్య పుస్తకాలు, భోదన, తరగతుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సదస్సును ఉపకులపతి ఆచార్య బి.రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యలో భాషా అభ్యాసం, ఇందుకు పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. విశ్వవిద్యాలయం ప్రముఖులు టి.ఎన్.తాండవగౌడ, టీపీ బాలకృష్ణ పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి ఆంగ్ల విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు తెలుగు పాస్టర్ల సమావేశం

విలేకర్ల సమావేశంలో ప్రతినిధులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : తెలుగు పాస్టర్లు, ప్రతినిధుల ఐక్యత కోసం ఈనెల 21న కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ నేతృత్వంలో భైరవేశ్వరనగర అందానప్ప లేఅవుట్ న్యూ జెరూసలేం ఫెలోషిప్ ప్రార్థనాలయంలో పాస్టర్లు, నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ డాక్టర్ ఎన్.ఎ.ఆనందరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవ పాస్టర్లు, తెలుగు సంఘాల నాయకులు ఐకమత్యంతో సమాజంలో ఉత్తమ సేవలందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగు చర్చి సీనియర్ పాస్టర్ డాక్టర్ జేడీ మోసెస్ ప్రసంగిస్తారన్నారు. ప్రతినిధులు బెంజిమన్, డేవిడ్, సురేశ్ పాల్గొన్నారు.

వరాల వసంతం రంజాన్

జామియా మసీదు

ముళబాగిలు, న్యూస్‌టుడే : సమతా మమతలకు స్ఫూర్తినిచ్చే రంజాన్ మాసం బుధవారం రాత్రి ప్రారంభమైంది. ముస్లిం సోదరులకు పవిత్రమైన ఈ మాసం ఇస్లాం కాలమాన పట్టిక ప్రకారం షాబన్ నెల పూర్తికాగానే కనిపించే నెలవంకతో ప్రారంభమవుతుంది. సాయంత్రం నెలవంకను చూసి ముస్లిం సోదరులు ఇషా నమాజ్ తర్వాతా సామూహికంగా తరావీ నమాజ్ ఆచరించి ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. కోలారు జిల్లా వ్యాపంగా అన్ని మసీదుల్లో తరావీ నమాజ్‌లు ప్రారంభమయ్యాయి.

అలయెన్స్ విశ్వవిద్యాలయంలో ఆమె కథ

సంప్రదాయ నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : నారీశక్తిని ప్రతిబింబించే 'ఆమె కథ' పేరిట అలయెన్స్ విశ్వవిద్యాలయంలో సాహిత్య ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 'అలయెన్స్ ఒన్ 2026' పేరిట నిర్వహిస్తున్న ఉత్సవాల్లో వివిధ కళాశాలల నుంచి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం వరకు కొనసాగే ఉత్సవాల మొదటి రోజు ఐదు వేల మంది విద్యార్థులు, 200 మంది వక్తలు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు. చివరి రోజు నటి, నర్తకి శోభన నేతృత్వంలో నేపాల్, రష్యా, జర్మనీ, బ్రెజిల్‌కు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు కల్కి సుబ్రహ్మణియన్, అభయ్ జి చెబ్బి తదితరులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డ్యాన్స్, డ్రామా, సాంస్కృతిక ప్రదర్శనలు, వక్తృత్వం కార్యక్రమాలకు యువత నుంచి చక్కని స్పందన లభించింది.

క్రైం కార్నర్

భార్యను హత్య చేసిన భర్త

రామనగర, న్యూస్‌టుడే : వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో యారబ్‌నగర నివాసి సల్మాన్ అనే వ్యక్తి తన భార్య సోఫియాను హత్య చేశాడు. వివాహమైనప్పటి నుంచి తన భార్య శీలాన్ని అనుమానిస్తూ వచ్చిన అతను ఆమెను కత్తితో పొడిచి గురువారం హత్య చేశాడు. హత్య అనంతరం నేరుగా ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు.

పేలుడులో గాయపడిన బాలుడు

మంగళూరు, న్యూస్‌టుడే : బెళ్తంగడి తాలూకా బందారు గ్రామంలో తనకు దొరికిన బంతిలాంటి వస్తువుతో ఆడుకుంటున్న సమయంలో అది పేలిపోవడంతో అభీశ్ (8) అనే బాలుడు గాయపడ్డాడు. దూరంగా విసిరడంతో పేలుడు సంభవించి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. క్రికెట్ ఆడే బంతి అనుకుని.. పందులను వేటాడేందుకు తయారు చేసిన బాంబును విసరడంతోనే అది పేలిందని అంచనాకు వచ్చారు. బెళ్తంగడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏటీఎంల నగదును పక్కదారి

హాసన, న్యూస్‌టుడే : ఏటీఎంలలో నింపవలసిన నగదును క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు చెందిన నందీశ్, మధు అనే సిబ్బంది పక్కదారి పట్టించారని ఆరోపణలు వచ్చాయి. హాసనలోని 15 బ్యాంకులకు చెందిన 28 ఏటీఎంలలో నిత్యం నగదు నింపేవారు. గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఆడిట్‌లో రూ.2 కోట్ల తేడా వచ్చింది. బుధ, గురువారాల్లో మరోసారి నిర్వహించిన ఆడిట్‌లోనూ తేడా రావడంతో నందీశ్, మధు ఇద్దరూ నగదు నింపకుండానే తప్పుడు ఎంట్రీలు నమోదు చేశారని గుర్తించారు. తమపై కేసు నమోదవుతుందని గుర్తించిన వారిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లారని సంస్థ యాజమాన్య ప్రతినిధులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో పాతిక మందికి గాయాలు

కార్వార, న్యూస్‌టుడే : అంకోలా తాలూకా సుంకనాళ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతిక మంది గాయపడ్డారు. మంగళూరు నుంచి హుబ్బళ్లికి వస్తున్న లారీ, బెంగళూరు నుంచి గోవాకు వెళుతున్న సీబర్డ్ ట్రావెల్స్ బస్సును ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. వెనుక నుంచి వస్తున్న గణేశ్ ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న బస్సును ఢీకొట్టింది. హంపీ నుంచి గోవాకు వెళుతున్న 12 మంది ప్రయాణికులు ప్రమాదంలో గాయపడ్డారు. బాధితులను అంకోలా, కార్వార ఆసుపత్రుల్లో చేర్పించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

కలబురగి, న్యూస్‌టుడే : చిత్తాపుర ఠాణా పరిధిలో స్థానికులతో కలిసి జూదం ఆడుతూ దొరికిపోయిన కానిస్టేబుళ్లు గురునాథ, మడివాళప్పలను విధుల నుంచి తప్పిస్తూ కలబురగి నగర పోలీసు కమిషనర్ ఎస్‌డీ శరణప్ప ఆదేశాలు జారీ చేశారు. వీరిద్దరూ కలబురగి ఎంబీ నగర ఠాణాలో పని చేసేవారు. ఈనెల 17న దిగ్గావ్ గ్రామంలో స్థానికులతో కలిసి జూదం ఆడుతూ దొరికిపోయారు. జిల్లా ఎస్పీ అడ్డూరు శ్రీనివాసులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకుని వారిద్దరినీ విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రామయ్య ఆస్పత్రికి ఫ్యాక్ట్ గుర్తింపు

ఆస్పత్రి సిబ్బందిని అభినందిస్తున్న జయరాం

బెంగళూరు (కెంగేరి) న్యూస్‌టుడే : బెంగళూరుకు చెందిన రామయ్య స్మారక ఆస్పత్రికి ఫౌండేషన్ ఫర్ ద అక్రెడిటేషన్ ఆఫ్ సెల్యులార్ థెరపీ (ఫ్యాక్ట్) సంస్థ నుంచి గుర్తింపు లభించింది. దేశంలో కేవలం రెండు ఆస్పత్రులు మాత్రమే ఈ గుర్తింపు పొందాయి. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎం.ఆర్.జయరాం ఈ వివరాలు వెల్లడిస్తూ రక్త క్యాన్సర్లతో బాధపడే వారికి సురక్షితంగా బోన్‌మ్యారో మార్పిడి, కణజాల థెరపీలను చేపట్టే ఆస్పత్రులకు ఈ గుర్తింపు లభిస్తుందన్నారు. కేవలం ఆస్పత్రి సదుపాయాలు, సిబ్బంది నైపుణ్యంతో కాకుండా చికిత్సల పర్యావరణ వ్యవస్థలు, దాతలు, స్వీకర్తల ఆరోగ్య పరిరక్షణ, మూలకణ మార్పిడి విధానం, ఆస్పత్రుల వ్యవస్థలు, రోగుల దీర్ఘకాలిక పర్యవేక్షణ తదితర ప్రమాణాలను పరీక్షించి ఈ గుర్తింపు ఇస్తారన్నారు. ఈ గుర్తింపుతో ప్రపంచ స్థాయి చికిత్స విధానాలు అమలు చేసే వీలు కలుగుతుందన్నారు. ఫ్యాక్ట్‌తో పాటు జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ) గుర్తింపు కూడా మా ఆస్పత్రికి దక్కిందని ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ నాగేంద్రస్వామి తెలిపారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి

విద్యార్థులతో విద్యాసాగర్, రూతుసాగర్ తదితరులు

బెంగళూరు (బ్యాటరాయణపుర), న్యూస్‌టుడే : క్రమశిక్షణలో విద్య అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొత్తనూరు సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్ పేర్కొన్నారు. కొత్తనూరులోని సాండ్రా రికెట్స్ పబ్లిక్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విద్యాసాగర్, ప్రిన్సిపల్ రూతుసాగర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాచారాన్ని నిజాయితీగా అందించాలి

పత్రికను విడుదల చేసి ప్రదర్శిస్తున్న రమాకాంత్, ప్రతినిధులు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : పాత్రికేయులు అవాస్తవాలను వైభవీకరణ చేయకూడదని సీనియరు విలేకరి రమాకాంత్ హితవు పలికారు. 'మారుతున్న ప్రచార మధ్యమాలు, వార్తల సమర్పణ' అనే అంశమై జయనగర నేషనల్ కళాశాలలో మాస్ కమ్యూనికేషన్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో 'ది ఎన్‌సీజే టైమ్స్' క్యాంపస్ పత్రికను రమాకాంత్ విడుదల చేసి మాట్లాడారు. వార్తను వార్తలానే నేరుగా, స్పష్టంగా, తక్కువ పదాలతో, పాఠకుడిని చదివించేలా, అభూత కల్పనలు లేకుండా, నిజాయతీగా అందించాలని విద్యార్థులకు సూచించారు. కొత్త సాంకేతికతలు వచ్చినా ప్రచార మాధ్యమాలకు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. సాంకేతికతను అలవర్చుకుంటే, తక్కువ సమయంలోనే ఎక్కువ సమాచారాన్ని విశ్లేషించుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. కర్ణాటక నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ ఎన్ సుబ్రహ్మణ్య, ప్రతినిధులు డాక్టర్ హెచ్‌బీ వైశాలి, జీఎన్ రంగనాథ్, డాక్టర్ సి.జయలక్ష్మి, ఆచార్య చెలువప్ప, ఆచార్య మమత, వెంకటరామరెడ్డి, జయదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కోలుకున్న ప్రసన్నానందపురి స్వామీజీ



రాయచూరు, న్యూస్‌టుడే : స్వల్ప గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజనహళ్లి వాల్మీకి గురుపీఠం (హరిహర) జగద్గురువు వాల్మీకి ప్రసన్నానందపురి కోలుకున్నారు. బుధవారం స్వామీజీ దేవదుర్గ తాలూకా కనకగురు పీఠాన్ని సందర్శించి ఇటీవల శివైక్యం చెందిన సిద్ధరామనందపురి స్వామికి నివాళులర్పించారు. అక్కడి నుంచి హట్టికి వెళుతుండగా గుండెపోటు వచ్చింది. రాయచూరులోని వీజీ కులకర్ణి ఆసుపత్రి కార్డియాలజిస్ట్ వైద్యులు అజిత్ కులకర్ణి, సురేశ్‌సగరద, బసనగౌడపాటిల్, బసవరాజ్‌పాటిల్ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలోలో చేర్పించగా కోలుకున్నారు.

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

రేపు మాడగిరిలో బయలాట ప్రదర్శన

బషీర్ అహ్మద్

రాయచూరు, న్యూస్‌టుడే : మాన్వి తాలూకా మాడగిరి ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 21 బయలాట ప్రదర్శన జరుగుతుందని హొసమని ప్రకాశన అధ్యక్షుడు బషీర్ అహ్మద్ వెల్లడించారు. గురువారం ఇక్కడి పత్రికాభవన్‌లో రుద్రయ్య గణచారి, పర్వీనా బేగం, రఫిక్ అహ్మద్, సాయిసాగర్‌తో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు తారమ్మ ప్రారంభిస్తారని, పాఠశాల సమితి అధ్యక్షుడు మైనుద్దీన్, ప్రముఖుడు బసవ రాజప్పగౌడ, సాహితీవేత్త ఇమాముద్దీన్, ఉపాధ్యాయుడు విరూపాక్షి పాల్గొంటారని వివరించారు. ఉత్తమ బయలాట కళాకారులకు పురస్కారాలను ప్రదానం చేస్తామని వివరించారు.

పర్యావరణ రక్షణకు చక్కని రహదారులే ఊతం

అందమైన పాదచారి మార్గాలకూ నగరం ఆలవాలం

నాజూకు నగరికి నిలువుటద్దాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కన్నడిగుల రాజధాని నగరిని అందంగా తీర్చిదిద్దడానికి దారులు ఏర్పడ్డాయి. చక్కని రహదారులు, పాదచారి మార్గాలు, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధీకరణ, చెరువుల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణ, పాఠశాల స్థాయి పెంపు, ఉపాధి కల్పన పథకాలు, ఇంటి వద్దకే వైద్యం.. తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఐదు వార్డులను ఎంపిక చేసింది. ఐదు నగర పాలికెల పరిధిలోని తలా ఒకటి వార్డు చొప్పున ఎంపిక చేసి ఆదర్శ (మోడల్) వార్డులుగా అభివృద్ధి చేస్తామని పాలికె చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. ఆయా విభాగాల నుంచి జక్కూరు, శాంతల, బేగూరు, దక్షిణాన ఉల్లాళ్, తూర్పున పులకేశినగర వార్డులను అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇటీవల వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో చీఫ్‌కమిషనర్ సమావేశమై ఐదు వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. విజయవంతమైతే మిగతా వార్డులను ఎంపిక చేసుకుని

ఆదర్శ వార్డుల అభివృద్ధికి చర్యలు

అభివృద్ధి చేస్తారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ వర్గాల ప్రతినిధులతో వార్డు సమితులను ఏర్పాటు చేస్తారు. సమితులు సమావేశమై చర్చించి అభివృద్ధి పనులను చేపట్టాలని తీర్మానిస్తారు. అందుకోసం ప్రత్యేక కార్యాచరణ పథకాలను సిద్ధం చేసి అమలులోకి తెస్తారు.

నగరానికి ఆభరణాలు.. చారిత్రక చెరువులు

ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ

నివాళులర్పిస్తున్న ఉపకులపతి, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఆదికవి మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య శివానంద కెళగనమని పూలమాల వేసి అధికారులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణ కోసం పాటుపడిన శివాజీ బలమైన హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించారని తెలిపారు. ఆయన పాలనలో ముస్లింలకు ధార్మిక స్వాతంత్ర్యం, మహిళలకు సముచిత గౌరవం ఉండేదని వివరించారు. యుద్ధవిద్యల్లో ఆరితేరిన ఛత్రపతి వ్యూహాలు శత్రుసైన్యానికి అంతుచిక్కక ముప్పుతిప్పలు పడేవారని చెప్పారు. కర్ణాటకతో మెరుగైన సంబంధాలు కొనసాగించారని తెలిపారు. మానవతా విలువల, దేశ సంస్కృతి సంరక్షణ, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు శివాజీ చేసిన పోరాటస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, ఉప రిజిస్ట్రార్ వెంకటేష్, డీన్ లతా, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

సిరివారలో పూజలు చేస్తున్న తహసీల్దార్ అశోక్‌పవార్, తదితరులు

ఎల్‌బీఎస్ నగర్‌లో..

రాయచూరు : క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌లో శివాజీ జయంతిని నిర్వహించారు. ప్రముఖులు అంబాజీరావు మైదరకర్, రఘు, అంబోజి నన్నూరె, బసవరాజ్, భాగ్యశ్రీ, పవిత్ర తదితరులు ఛత్రపతి చిత్రపటానికి పూజలు చేశారు. మహారాజ్ ధైర్య సాహసాలు, దేశభక్తి, దైవభక్తిని స్మరించుకున్నారు. అనంతరం ప్రారంభమైన ఊరేగింపు మావిన చెరువుకు సమీపంలోని ఖాసబావికి దగ్గర్లోని శివాజీ విగ్రహం వరకు కొనసాగింది.

మాన్వి: ఛత్రపతి శివాజీ తల్లి చెప్పిన నీతి, మహనీయుల కథల నుంచి ప్రభావితుడైన యోధుడని, ఆయన జీవనశైలి యువతకు ఆదర్శం కావాలని తహసీల్దార్ భీమరాయ రామసంద్ర పేర్కొన్నారు. మాన్వి, సిరివార తాలూకా అధికార యంత్రాంగాల ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంత్యుత్సవాల్లో అధికారులు, వక్తలు ఛత్రపతి దేశప్రేమ, పోరాట పటిమను కొనియాడారు. మంచి యుద్ధ నైపుణ్యం గల వీరుడని, ఆయన జీవనం, సాధనలు యువతకు ప్రేరణ కావాలని పేర్కొన్నారు. సిరివారలో తహసీల్దార్ అశోక్ పవార్ జయంతిని ప్రారంభించారు. తహసీల్దార్ గ్రేడ్2 అబ్దుల్ వాహిద్, ఉప తహసీల్దార్ విరుపణ్ణ, అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఏపీఎంసీ వద్ద ఛత్రపతి శివాజీ యువక సంఘం ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, గిరి తడకల, బసవరాజ్, మహంతేశ్ ఆల్దాళ తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు: ఛత్రపతి శివాజీ మహారాజ్ భరతమాత ముద్దుబిడ్డ, ఆయన ఖడ్గాన్ని ఎక్కుపెట్టి ధర్మంతో గెలిచిన యోధుడని సింధనూరు కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష కీర్తించారు. శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ సేవాట్రస్ట్, వీహెచ్‌పీ, బజరంగదళ్ సంయుక్తంగా గురువారం ఘనంగా ఆచరించిన శివాజీ జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణ గంగావతి మార్గం నుంచి రైల్వే స్టేషను వైపునకు వెళ్లే వంపులో ఉన్న కూడలిని కార్యకర్తలు ఛత్రపతి శివాజీ సర్కిల్‌గా చేశారు. అక్కడ ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. గురువారం ఇదే కూడలిలో జయంతి కార్యక్రమాన్ని ఆచరించారు. శ్రీహర్ష ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ నిలువెత్తు పటానికి, విగ్రహానికి తొలుత పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జీకే.విశ్వనాథ్ చౌదరి, వీహెచ్‌పీ తాలూకా అధ్యక్షుడు దేవరాజ్ పాటిల్, ప్రముఖులు సతీష్ కుమార్, పద్మనాయుడు, నెక్కంటి ప్రసాద్, తమ్మినేని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. తొలుత మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప తదితరులు నివాళులు అర్పించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తాలూకా పాలనా యంత్రాంగం ఆచరించిన కార్యక్రమంలో పంపనగౌడ బాదర్లి, సోమనగౌడ బాదర్లి, అభిషేక్ నాడగౌడ, ఎం.దొడ్డబసవరాజ్, రాజశేఖర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీఎస్ నగర్‌లో జయంత్యుత్సవం

మాన్విలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఛత్రపతి శివాజీ యువక సంఘం ఆధ్వర్యంలో..

సింధనూరులో శ్రీహర్ష తదితరులు

రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దొరబాబు

మాన్వి: తాలూకాలోని అమరేశ్వ క్యాంపునకు చెందిన ప్రముఖ తెలుగు రైతు తూము దొరబాబు రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. క్యాంపులో బాజపాకు ఆదరణ అంతంత మాత్రమే ఉంది. పార్టీని బలోపేతం చేసే క్రమంలో పార్టీ తూము దొరబాబుని అధ్యక్షుడిగా నియమించింది. భాజపా బలోపేతానికి, రైతు పోరాటానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచించారు. దొరబాబు నియామకంపై క్యాంపు మద్దతుదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

జేఈఈలో శ్రీకృష్ణదేవరాయ విద్యార్థుల ఘనత

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు ఈజే.హొసళ్లిక్యాంపులోని శ్రీకృష్ణదేవరాయ పీయూ సైన్స్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ సెషన్-1 పరీక్షల్లో సత్తాచాటారు. అయిదు మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో చక్కని పర్సంటైల్ తెచ్చుకుని మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత పొందారు.

ముదగల్ తాలూకా కోసం ఉద్యమం షురూ

ఎమ్మెల్యే మానప్ప వజ్జల్

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని లింగసూగూరు తాలూకా ముదగల్ టౌన్ మున్సిపాలిటీని తాలూకా కేంద్రంగా ప్రకటించాలన్న ఉద్యమం పురుడు పోసుకుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి పార్టీలకతీతంగా అఖిల పక్షం బుధవారం నిర్వహించిన ముదగల్ బంద్ అంచనాలకు మించి విజయవంతమైంది. మరిన్ని ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బడ్జెట్‌కు ముందు పట్టణ బంద్ చేయడంతో నూతన తాలూకా అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాయచూరు తాలూకా యరగేరాను తాలూకా కేంద్రంగా వ్యవహరించాలని గతేడాది బెంగళూరు స్థాయిలో పోరాటం జరిగింది. 2023 విధానసభ ఎన్నికలప్పుడు ముదగల్‌ను తాలూకా మారుస్తామని పార్టీలు ఇచ్చిన భరోసాలను నిలబెట్టుకోవాలని అఖిల పక్షం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లోనే కొత్త తాలూకాలను ప్రకటిస్తారన్న ప్రజల నిరీక్షణ ఫలించలేదు. లింగసూగూరు ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ ముదగల్ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని వెల్లడించారు. భాజపా ఎమ్మెల్యే అయినందున కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందా? లేదా వేచి చూడాలి. లింగసూగూరు పరిధిలోని మస్కి, మాన్వి తాలూకాలోని సిరివార, దేవదుర్గలోని అరకేరాలను కొత్త తాలూకాలుగా ఆవిర్భవించిన విషయం విదితమే.

ముదగల్‌కు అర్హతలున్నాయ్.. చారిత్రక కోటలు, 60 గ్రామాలు, 18 తాండాలు, పురసభ, ఏపీఎంసీ, ఉప తహసీల్దార్ కార్యాలయం, ఉప ఖజానా, జాతీయ బ్యాంకులు, రెండు జాతీయ రహదారులు ఉన్నందున తాలూకా కావటానికి అన్ని అర్హతలు ఉన్నట్లు ప్రగతి పర సంఘాల నాయకులు విశ్లేషిస్తున్నారు. హుండేకార్, గద్ది గౌడర, వాసుదేవ సమితులు తాలూకాకు యోగ్యత కల్గిందని ప్రభుత్వానికి సిఫార్సు చేశాయని తెలిపారు. దశాబ్దన్నర క్రితమే అప్పటి ఎమ్మెల్యే గంగణ్ణ నేతృత్వంలో అనేక సార్లు సర్కారుకు విన్నవించారని వెల్లడించారు. తాలూకాగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ముదగల్ కోట

రూ.23.88 కోట్ల కొకైన్ స్వాధీనం

స్వాధీనం చేసుకున్న కొకైన్.. దాచిన సంచి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన బ్రెజిల్ జాతీయుడి నుంచి 4.776 కిలోల కొకైన్‌ను పోలీసులు జప్తు చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.23.88 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మహిళలు వినియోగించే నాలుగు వ్యానిటీ బ్యాగుల్లో మాదక ద్రవ్యాలు ఉంచుకుని మంగళవారం రాత్రి దొరికిపోయాడని అధికారులు గురువారం ప్రకటించారు. బ్రెజిల్‌లోని సావోపాలో నుంచి కతార్‌కు వచ్చి, అక్కడి నుంచి ఆ ప్రయాణికుడు బెంగళూరుకు వచ్చి దొరికిపోయాడని తెలిపారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

సజీవంగా కాలిపోయిన వృద్ధుడు

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : మైలసంద్రలోని తన ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న మైలారప్ప (80) అనే వృద్ధుడు సజీవంగా కాలిపోయారు. బుధవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు పొగ, మంటల్ని గుర్తించి అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం అందించారు. మంటల్ని ఆర్పేలోగా మైలారప్ప సజీవంగా కాలిపోయారు. కెంగేరి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో జీవిత ఖైదు

కార్వార, న్యూస్‌టుడే : సిద్ధాపురలోని వినాయక సౌహార్ద క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పిగ్మీ కలెక్టర్ గీతా ప్రభాకర్ హుండేకర్‌ను 2024 డిసెంబరు 23న హత్య చేసిన ఆరోపణలు రుజువు కావడంతో అభిజిత్ గణపతి అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.32 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సిద్ధాపుర ఠాణా పోలీసులు శిరసిలోని ఒకటో అదనపు జిల్లా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఇవ్వాలని జిల్లా న్యాయ ప్రాధికార అధికారులకు న్యాయమూర్తి కిరణ్ కిణి సూచించారు. ఆమె వద్ద ఉన్న పిగ్మీ కలెక్షన్, ఒంటిపై ఆభరణాల కోసమే నిందితుడు హత్య చేశాడని విచారణలో పోలీసులు గుర్తించారు.

దోపిడీ దొంగల అరెస్టు

విజయపుర, న్యూస్‌టుడే : చడచణ తాలూకా హలసంగిలోని భూమికా జ్యువెలరీ దుకాణంలో తుపాకీ చూపించి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పుణెలో అరెస్టు చేశారు. గత జనవరి 26న తుపాకీ చూపించి, దోపిడీకి పాల్పడిన నిందితులను హణమంత వాగోలి, శివరాజ్ నావిగా గుర్తించారు. వీరి నుంచి మూడు నాటు తుపాకులు, ఒక ఎయిర్‌గన్, 205 గ్రాముల ఆభరణాలు, కిలో వెండి వస్తువులు జప్తు చేసుకున్నారు. దుకాణం యజమాని మహారుద్ర నుదుట తుపాకీ పెట్టి 250 గ్రాముల ఆభరణాలు, 1.5 కిలోల వెండి వస్తువులు దోచుకున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం చడచణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

టికెట్ యంత్రం చోరీ

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి శిరశికి వెళ్లే నాన్-ఏసీ స్లీపర్ బస్సులో టికెట్టు జారీ చేసే మిషన్‌ను ముగ్గురు చోరులు దొంగిలించుకు వెళ్లారు. డ్రైవరు, కండెక్టరు బస్సులో ఉంచిన బ్యాగులు, మిషన్‌ను నిందితులు తీసుకువెళ్లారు. దీంతో బస్సు ప్రయాణం ఆలస్యమైంది. అర్ధరాత్రి అనంతరం మాములు టికెట్లు జారీ చేసిన అనంతరం ప్రయాణం ప్రారంభమైంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కార్మికులతో చర్చిస్తున్న అధ్యక్షుడు రఘు

రాయచూరు, న్యూస్‌టుడే : స్వచ్ఛతా కార్మికులతో మరుగుదొడ్ల పనులు చేయించడం అమానుషమని, ఇందుకు కారణమైన సూపర్‌వైజర్లకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సఫాయి కర్మచారి కమిషన్ అధ్యక్షుడు రఘు రిమ్స్ డైరెక్టర్ రమేష్‌కు సూచించారు. గురువారం రిమ్స్‌లో పర్యటించిన ఆయన స్వచ్ఛతను పరిశీలించారు. కార్మికులను పలుకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారుల సమావేశంలో మాట్లాడుతూ యంత్రాలను ఎందుకు వాడలేదని ప్రశ్నించారు. దీనిపై ప్రశ్నించారని ఉద్యోగం నుంచి తొలగించిన కార్మికులను చేర్చుకోవాలని ఆదేశించారు. ఆధారాలతో ఫిర్యాదు అందినందున ఆలస్యం చేయవద్దన్నారు. చర్యలు తీసుకోకుండా ఉపేక్షిస్తే డైరెక్టర్, ఇందులో ప్రమేయం ఉన్న అందరిపై చర్యలు చేపట్టాలని సర్కారుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. ఒప్పంద పద్ధతిలో పనిచేసే వారిని ఏటా రెన్యువల్ చేయాలని సూచించారు. కొందరు అధికారులు సిబ్బందిని లంచం అడుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, పునరావృతమైతే సహించేది లేదని స్పష్టం చేశారు.

బకాయిలు చెల్లించాలని మార్చి 5న ఆందోళన

పాత్రికేయులకు వివరిస్తున్న మల్లికార్జున, ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : బకాయిల చెల్లింపు కోసం మార్చి 5న ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు జిల్లా గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున వెల్లడించారు. గురువారం పత్రికాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.37 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, గుత్తేదార్ల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను విడుదల చేస్తామంటూ ప్రభుత్వం హామీలతో కాలయాపన చేస్తోందని, చిత్తశుద్ధి లేదని వాపోయారు. పోరాట రూపురేఖలపై చర్చించేందుకు ఈ నెల 21న నగరంలోని ఎస్‌ఎల్‌వీ కొరారియా సభా భవనంలో ఏర్పాటు చేసే సమావేశానికి రాష్ట్రాధ్యక్షుడు మంజునాథ్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గుత్తేదార్లు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రతినిధులు రవీంద్ర రెడ్డి, నాగప్ప గిరణి, రాజశేఖర్ హెంబరాళ, ఆంజనేయ, అశోక్ అంగడి, వీరయస్వామి, రామాంజినేయ, చాంద్‌పాషా పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న 'సింధనూరు జిల్లా' పోరాట సమితి

జిల్లా సాధనకు అభిప్రాయాల సేకరణ

సింధనూరు, న్యూస్‌టుడే: అందరి పోరుతో 'సింధనూరు నూతన జిల్లా' దస్త్రం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక్క అడుగు కదిలింది. ఇదే పోరాటానికి తొలిమెట్టు.. సింధనూరును జిల్లా చేయాలంటే ఏమేం కావాలి అనే విషయంపై ప్రభుత్వ ఉన్నత వర్గాలు రీజినల్ కమిషనర్, జిల్లాధికారి, తహసీల్దారులను కోరారు. ఈ విషయంలో అధికారులు తమ పోరాటానికి ఫలితం దక్కించే ప్రయత్నం చేయాలని సింధనూరు జిల్లా పోరాట సమితి ప్రతినిధులు గురువారం తహసీల్దారును కోరారు. ఈ మేరకు తహసీల్దారు అరుణ్ దేశాయ్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి ఇతర ప్రముఖులు ఉన్నారు. తహసీల్దారు రూపొందించే నివేదిక కీలకం కావడంతో దీనిని అంకితభావంతో చేయాలని ప్రతినిధులు అభ్యర్థించారు. సింధనూరు తాలూకావ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల నుంచి దీనిపై అభిప్రాయాలు సేకరించి అంతిమ నివేదిక ప్రభుత్వానికి పంపాలని కోరారు.

'స్నేహమయి' కొత్త దుమారం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముడా అక్రమాలకు, ఒకప్పటి అధికారి పదోన్నతికి సంబంధించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కి లంచాలు అందాయని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. ముడా మాజీ కమిషనర్ నటేశ్‌కు సన్నిహితులు కేఏ 41సి 6723 నంబరు కారులో ఐదు బ్యాగుల్లో నగదు తీసుకువచ్చి ఆమెకు అందించారని ఈడీ, ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కారు కర్ణాటక రాష్ట్ర ఖాదీ, గ్రామోద్యోగ శాఖకు చెందినది కాగా, ప్రస్తుతం నటేశ్ అదే శాఖలో పని చేస్తున్నారని కృష్ణ గుర్తు చేశారు. నగదుకు సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, వాటిని ఇప్పటికే ఆ శాఖల అధికారులకు అందించానని స్నేహమయి కృష్ణ పేర్కొన్నారు. ఆయన ఆరోపణలను శాలిని తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల మనవి

వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ కష్టాలను ప్రభుత్వానికి ఏకరవు పెట్టారు. ఈ మేరకు గురువారం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహదేవప్ప, కోశాధికారి శంకరగౌడ, కార్యదర్శి మల్లయ్య నాయకత్వంలో జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆరోగ్య సంజీవని పథకాన్ని విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు వర్తింపజేయాలని, 70 ఏళ్లపై బడిన వారికి పింఛను సొమ్మును పది శాతం పెంచాలని, 2022 జులై 1 నుంచి 2024 జులై 31 మధ్య పదవీవిరమణ చేసిన అందరికీ ఆర్థిక సౌలభ్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు విన్నవించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.99	1611.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	401	9,115
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.198	39.697

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నేడు ఎంపీ కుమార్‌నాయక్ పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం లింగసుగూరు చేరుకుంటారు. జిల్లా అధికారులతో కలిసి తాలూకాలోని చిత్తాపూర్ గ్రామంలో జలధార పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం తాలూకాలోని నవలి, సజ్జలగుడ్డ గ్రామాల్లో జలజీవన్ మిషన్, జలధార పనులను వీక్షిస్తారు. ముద్గల్, కన్నాపూర్ హట్టిల్లో ఎంబీఆర్1, ఎల్ఎస్ఆర్7, డీబీటీ పనులను తిలకిస్తారు. మాన్వి తాలూకా హిరేకొట్నేకల్ చేరుకుంటారు. రైల్వే అధికారులతో కలిసి రైల్వేట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. కరేగుడ్డలోని మహంతేశ్వర మఠాన్ని సందర్శించి భూమిపూజలో పాల్గొంటారు. సాయంత్రం మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌లతో కలిసి మాన్వి పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సిద్ధాపురలో గాలిలో కాల్పులు

రాయచూరు, న్యూస్‌టుడే : సార్వజనిక స్థలంలో లైసెన్సు తుపాకీని వినియోగించడం కలకలం సృష్టించింది. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హోసూరు సిద్ధాపుర గ్రామంలో యల్లమ్మదేవి ఉత్సవం ఊరేగింపు వేళ బస్టాండ్ దగ్గర్లో గాలిలో కాల్పులు జరిపారు. ఈ ఘటన జనవరి 27న జరిగినట్లు సమాచారం. సంబరాలు చేసుకునేందుకు కాల్పులు జరిపినట్లు భావిస్తున్నారు. తాజాగా వీడియో వైరల్ అయ్యింది. ఇందుకు సంబంధించి ఇద్దరి యువకులపై జాలహళ్లి పోలీస్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహా ప్రతిష్ఠ ఆహ్వానం



శ్రీ కోదండరామాలయం నుగుడోణి హొసూరు క్యాంపు నూతన దేవస్థానంలో శ్రీమహాగణపతి, శ్రీమహాలక్ష్మీ సమేత కోదండరామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరవుతున్న రాష్ట్ర చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి శ్రీ ఎన్. ఎస్. బోసురాజు గారికి, రాయచూరు లోక్‌సభ సభ్యులు శ్రీ జి.కుమార్‌నాయక్ గారికి, మాన్వి అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ జి.హంపయ్యనాయక్ గారికి, మాజీ ఎమ్మెల్యే శ్రీ గంగాధర్‌నాయక్ గారికి, ఇవే మా హృదయపూర్వక స్వాగత సుమాంజలి. 20.2.2026, ఉదయం 10.45 గంటలకి నిర్వహించే పుణ్యకార్యక్రమానికి హాజరై విగ్రహప్రతిష్ఠాపనని విజయవంతం చేయాల్సిందిగా భక్తమహాశయులకి విజ్ఞప్తి.
అందరికీ ఆదర స్వాగతం.
ఆహ్వానించువారు: శ్రీరామ సేవా సమితి నుగుడోణి హొసూరు క్యాంపు మరియు సమస్త భక్తజనం

TUNGABHADRA BOARD : TB DAM
e-Procurement Short term tender Notice
IFB No.24 to 34/2025-26 Dt: 19-02-2026
(in respect of LLC Division, TB Board, Ballari costing upto Rs 20.00 lakhs)

Bid Document downloading Start Date & Time	: 20.02.2026 at 11.00 AM
Bid Document downloading End Date & Time	: 26.02.2026 upto 1.00 PM
Last Date & Time for submission of Bids	: 26.02.2026 upto 3.00 PM
Date of opening of Price Bids	: 26.02.2026 at 4.00 PM

Further details can be seen @ https://tender.apeprocurement.gov.in
Ph: 08392 - 242415, 242519
Sd/- S.Narayana Naik
Executive Engineer, LLC Division, TB Board, Ballari

(c) eenadu

పాత బిల్లుల పంచాయితీ

■ ప్రభుత్వం వరమిచ్చినా.. ఇంజినీర్లు కరుణించరు

■ 1,473 పనులకు అప్‌లోడ్ చేసింది 16 మాత్రమే

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పంచాయతీ గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటికి బిల్లులు ఆపేసింది. పనులు చేసిన గుత్తేదారులు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్పందించింది. బకాయి బిల్లులను చెల్లించేందుకు పచ్చజెండా ఊపింది. బిల్లులు తయారు చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీర్లు మొండికేస్తుండటంతో గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ముందుకొచ్చి బకాయిలు చెల్లిస్తామంటున్నా ఇంజినీర్లు స్పందించకపోవడం దారుణమంటున్నారు.

తాఖీదులు ఇవ్వాలని ఆదేశం

● ఆదోని డివిజన్ పరిధిలో రూ.8.20 కోట్లతో 554 పనులు చేపట్టారు. వీటికి సంబంధించిన బిల్లులను సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేయడంలో పీఆర్ ఇంజినీర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ డివిజన్ నుంచి ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయకపోవడంతో ఈఈలకు తాఖీదులు జారీ చేయాలని అమరావతి నుంచి సీఈ ఆదేశించారు.

● నంద్యాల డివిజన్ పరిధిలో రూ.6.15 కోట్ల వ్యయంతో 648 పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.15 లక్షల విలువైన ఆరు పనుల వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారు.

● కర్నూలు డివిజన్‌లో రూ.2.99 కోట్ల అంచనాతో 271 పనులు చేశారు. వీటిలో రూ.27.38 లక్షల విలువైన పది పనుల బిల్లులను అప్‌లోడ్ చేశారు.

సాకులు చెబుతూ..

● 2014- 19లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి ఇప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయడం ఎలా సాధ్యమవుతుందని కొందరు పీఆర్ ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు.

● ఎప్పుడో చేసిన పనులకు సంబంధించిన ఇంజినీర్లు ఎవరో, ఎం.బుక్కులు ఎక్కడ ఉన్నాయో.. తమకెలా తెలుస్తుందని తర్జనభర్జనలు పడుతున్నారు. అప్పటి ఎం.బుక్కులు ఉన్నాయో లేదో అన్న సందేహం వ్యక్తమవుతోంది.

● అప్పట్లో పనులు పర్యవేక్షించిన ఏఈలు, డీఈలు ఇప్పుడు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందంటున్నారు. పాత బిల్లులు అప్‌లోడ్ చేసే క్రమంలో తప్పులు దొర్లితే ఏం చర్యలు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు.

రూ.17.24 కోట్లు ఆపేసిన వైకాపా

● ఉపాధిహామీ పథకం కింద 2014- 19లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 1473 పనులకు రూ.17.24 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ ఏడాది మార్చి నాటికి పాత బిల్లులన్నీ చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి వరకు చేయకపోతే మళ్లీ ఇచ్చే అవకాశం ఉండదని వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని పలుమార్లు పీఆర్ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా జిల్లాలోని ఇంజినీర్ల నుంచి స్పందన కరవైంది.

● గతంలో చేసిన పనులకు సంబంధించిన జాబితా, పాత బిల్లుల వివరాలను ఎం.బుక్ ప్రకారం అప్‌లోడ్ చేయాలని గత నెల 28వ తేదీన అన్ని జిల్లాల ఈఈలకు ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు జిల్లాలోని పీఆర్ ఈఈలు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

రక్షణలేని పని.. ప్రాణాలకు హాని

కేజీ రోడ్డులో కల్వర్టు నిర్మాణం కోసం తవ్విన గుంత వద్ద ఎటువంటి రక్షణ లేదు. కర్నూలు- గుంటూరు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వెంకాయపల్లె సమీపంలోని సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం రహదారిపై ఒకవైపు భారీ గుంత తవ్వి పనులు చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈనాడు, కర్నూలు

తడారుతున్న పట్టణ గొంతులు

■ తుంగభద్ర కాల్వకు నిలిచిన నీరు

■ రూపుదిద్దుకోని ప్రత్యామ్నాయ ప్రణాళిక

పరిశీలన

తుంగభద్ర జలాశయం గేట్ల మరమ్మతుల కారణంగా కాల్వకు నీటి విడుదల ఆపేశారు. మంచినీటి వనరులు (సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు) అడుగంటుతున్నాయి. ఎండలు పెరిగితే 'గంగ' ఇంకిపోయింది. ఇప్పటికే పట్టణాల్లో శివారు కాలనీలకు మంచినీరు సరిగా అందడం లేదు. వేసవిలో దాహం కేకలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రచించలేదు. గతంలో పురపాలికలకు వచ్చే ఏఎస్ఎఫ్ (గ్రాంట్) వైకాపా పాలనలో నిలిపివేసింది. కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు విడుదల చేసి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేయాలని పుర జనం విన్నవిస్తోంది.

– న్యూస్‌టుడే, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలిక, కర్నూలు నగర పాలక

దెబ్బతిన్న బసాపురం నీటి కుంట కట్టకు అడ్డుగా ఇసుక సంచులు

ఎక్కడ.. ఎలా ఉందంటే..!

❍ కర్నూలు నగర జనాభా 8 లక్షలు. 52 వార్డుల్లో కల్లూరు పరిధిలో 16, కోడుమూరు పరిధిలో మూడు వార్డులకు రోజు విడిచి రోజు నీరందిస్తున్నారు. మిగిలిన వార్డులకు రోజూ సరఫరా చేస్తున్నారు. రోజు 120 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా.. 95 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నారు. ఎస్.ఎస్.ట్యాంకు 0.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తుంగభద్రలో నీటి వనరులు లేకపోవడంతో వేసవిలో ఇక్కట్లు అధిగమించేందుకు జీడీపీలో నిల్వ చేస్తేనే ఆధారం. మరో ఎస్.ఎస్.ట్యాంకుతో పాటు ఉన్న 33 ఉపరితల నీటి ట్యాంకులకు తోడు మరో 25 నిర్మించాలన్న ప్రతిపాదన గట్టెక్కడం లేదు.

❍ ఆదోనిలో 42 వార్డులున్నాయి. రెండు లక్షలకుపైగా జనాభా. ఎల్లెల్సీకి నీరు నిలిచిపోవడం, ప్రధాన నీటి వనరైన బసాపురం నీటి కుంట మరమ్మతు కారణంగా ఈ సారి నీటి ఎద్దడి తప్పేలా లేదు. వేసవి రాకముందే మూడు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారు. రాంజల చెరువుతో పాటు బసాపురం కుంటలో ఉన్న నీటి నిల్వ 70 రోజులకు సరిపోతుంది. రోజు 24 మిలియన్ లీటర్ల నీరు ఇవ్వాల్సిన చోట 22 ఎం.ఎల్.కు మించడం లేదు. రూ.40 లక్షలతో వేసవి నీటి ఎద్దడి నివారణ ప్రణాళిక తయారు చేసుకున్నారు. ఏప్రిల్ మధ్యలో అత్యవసరంగా తాగునీటి అవసరాలకు ఎల్లెల్సీకి నీరు వదిలితేనే కొంత వరకు వేసవి గండం గట్టెక్కించొచ్చు. శివారులోని 15 కాలనీలకు నీటి గండం ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రత్యేక శ్రేణి పురపాలికలో సొంతంగా ఒక్క నీటి ట్యాంకర్ లేకపోవడం గమనార్హం.

❍ ఎమ్మిగనూరులో 34 వార్డుల్లో 1.35 లక్షల జనాభా ఉంది. గుడికల్లు చెరువులో 628, ఎస్.ఎస్.ట్యాంకులో 87 ఎం.ఎల్. నీరు నిల్వ ఉంది. ఇవి ఖాళీ అయితే పులికనుమ నీరే ఆధారం. రోజు 10.5 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. వేసవి ప్రణాళిక రూపొందించలేదు. శివారులోని సోమప్పనగర్, మిలట్రీ, మైనార్టీ కాలనీ, సాయినగర్, వెంకటాపురం, శివన్ననగర్ శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యలున్నాయి. వీటిలో చాలా వరకు కుళాయిలు లేకపోవడంతో, ఉన్న ఒక్క నీటి ట్యాంకర్‌తో సరఫరా ఎలా చేస్తారో అర్థం కాని పరిస్థితి.

మధుర ఫలం.. కవర్లతో భద్రం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మామిడి రైతులను ఆదుకోవడానికి 'కూటమి' ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. డోన్, ఓర్వకల్లు, వెల్దుర్తి, ప్యాపిలి, బేతంచెర్ల, కోడుమూరు, దేవనకొండ తదితర మండలాల్లో సాగు అధికంగా ఉంది.

మామిడి కాయలకు తొడిగిన కవర్లు

❑ ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. ఈ దశ నుంచే కాయలకు కవర్లు తొడిగి సంరక్షించేలా చర్యలు చేపట్టింది. కవరు, కూలీల ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తూ రైతులను ఆదుకుంటోంది.

❑ హెక్టారుకు 15 వేల కవర్లు అవసరమవుతాయి. ఒక కవర్ ధర రూ.2గా ఉంది. కవర్లు కొనుగోలు చేసేందుకు రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.15 వేల వరకు ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తోంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు గరిష్ఠంగా రాయితీ అందిస్తోంది.

❑ పిందె దశలో ఉన్నప్పుడు కాయకు కవర్ తొడగాలి. కాయ కొనభాగాన్ని జాగ్రత్తగా మూసేయాలి. కాయ పెరిగేకొద్దీ కవర్ రక్షణగా మారుతుంది. పండుగా మారిన తర్వాత కవర్ తొలగించి కోతలు ప్రారంభించాలి. కవర్లు తొడగడంతో రసాయన మందుల వాడకం తగ్గుతుంది.

❑ కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారా వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, క్రిమికీటకాలు, పక్షుల నుంచి రక్షణ కలుగుతుంది. ఎండ తీవ్రత పండుపై లేకుండా మొత్తం ఒకే రంగు వస్తుంది. ఫలితంగా నాణ్యమైన దిగుబడి వస్తుందని ఆత్మకూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి చందన పేర్కొన్నారు.

సంగమేశ్వరుడి శిఖర దర్శనం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం వెనుక జలాలు తగ్గుముఖం పట్టడంతో సంగమేశ్వరం గర్భాలయ శిఖరాగ్రం బయటపడుతోంది. గతేడాది జూన్ 27న గర్భాలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలో జలాధివాసమైంది. శ్రీశైల జలాశయం నీటిమట్టం గురువారం 866 అడుగులకు తగ్గడంతో శిఖర కొనభాగం కొంత కనిపిస్తోంది. శిఖరాగ్రానికి వచ్చే సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ తెలిపారు.



రాఘవుడికి పట్టాభిషేకం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: తుంగాతీరం ఒడ్డున రాఘవేంద్ర స్వామి పట్టాభిషేకం వైభవంగా కొనసాగింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి 405వ పట్టాధికార మహోత్సవం గురువారం నిర్వహించారు. స్వామి పాదుకలకు ప్రత్యేక పూజలు, అభిషేకం, పుష్పార్చన, కనకాభిషేకం చేశారు. అనంతరం స్వామి పాదుకలను స్వర్ణ రథంపై ఉంచి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. వారినుద్దేశించి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్, వెంకటేష్ జోషి తదితరులు ఉన్నారు.

రాఘవేంద్ర స్వామి పాదుకలు చూపిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

స్వర్ణ రథోత్సవంలో భక్తజనం

పంట అమ్మడానికొస్తే పస్తులు

■ మార్కెట్లో రైతుల ఆకలి కేకలు

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: అందరికీ అన్నం పెట్టేదాతలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. పంట అమ్ముకోవడానికి మార్కెట్‌కు వస్తే అధికారుల తీరుతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు రాయితీపై భోజనం అందిస్తున్నారు. రైతులు రూ.15 చెల్లిస్తే చాలు కడుపునిండా భోజనం పెట్టాలి. ఒక భోజనానికి మార్కెట్ కమిటీ రూ.20 చెల్లిస్తుండగా.. మిగిలింది నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ భరిస్తుంది.

సగం మందికే టోకెన్లు

● మార్కెట్‌కు కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి రైతులు వస్తుంటారు. సంక్రాంతి నుంచి నిత్యం 1,200 మంది 1,600 మంది రైతుల వరకు వస్తున్నారు.

● ఎవరైతే భోజనం చేస్తారో వారికి మార్కెట్ కమిటీ అధికారులు టోకెన్లు ఇస్తారు. నిత్యం 500 నుంచి 600 మందికి మాత్రమే ఇస్తున్నారు. ఎండుమిర్చి, ఉల్లి రైతులకు ఇవ్వడం లేదు.. వాము రైతులకు, ఇతర పంట ఉత్పత్తుల రైతులకు కలిపి 600 మందికి లోపే టోకెన్లు ఇస్తున్నారు.

● గురువారం మార్కెట్‌కు 1,777 లాట్లకు సంబంధించి 7,757 క్వింటాళ్ల మేర పంట ఉత్పత్తులు అమ్మకానికి వచ్చాయి. 1,500 మంది రైతులు మార్కెట్‌కు వచ్చారు.

రాయితీ భోజనం తింటున్న కొందరు రైతులు

అందులో కేవలం 550 నుంచి 600 మందికి మాత్రమే భోజనం టోకెన్లు ఇవ్వడం గమనార్హం.

అన్నదాతల ముసుగులో ఇతరులు

● రైతుల ముసుగులో మార్కెట్‌లో పనిచేసే కార్మికులు, సిబ్బంది, కమీషన్ ఏజెంట్ల దుకాణాల్లో పనిచేసే కార్మికులు, మార్కెట్ కమిటీ సిబ్బంది టోకెన్లు దక్కించుకొంటున్నారు. గురువారం కొందరు రైతులకే మజ్జిగ పంపిణీ చేశారు. అన్నంతోపాటు వంకాయ కూర, చట్నీ, సాంబారు వడ్డించారు.

● మేము టోకెన్లు ఇస్తున్నాం.. రైతులు బయట హోటళ్లకు వెళ్తున్నారని సిబ్బంది చెబుతుండగా.. ఒక భోజనానికి మార్కెట్ కమిటీ రూ.20 ఇవ్వాల్సి ఉంటుంది.. ఆ డబ్బులు మిగిల్చుకోవడానికి కొందరికే టోకెన్లు ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

స్థానిక ఓటరు జాబితా తయారీకి కసరత్తు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : మార్చి 9వ తేదీ నాటికి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా ఓటర్ల జాబితాను తయారు చేసుకోవాల్సి ఉంది. 2025 జనవరి 1న ప్రచురించిన తుది ఓటరు జాబితాను తమకు ఇప్పించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు.. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఓటర్ల జాబితాను పంపిణీ చేసేందుకు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం కార్యాలయంలో ఉప తహసీల్దార్లు సిబ్బందితో నియోజకవర్గాల ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేయిస్తున్నారు. వీటిని కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు

నియోజకవర్గాల జాబితాలను పోలింగ్ కేంద్రాల వారీగా వేరు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ కేంద్రం వారీగా మున్సిపాలిటీలు, పంచాయతీ అధికారులకు అందజేయనున్నారు. ఈ జాబితా ఆధారంగా ఈఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి మండలాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేసుకునేందుకు స్థానిక సంస్థల అధికారులు చర్యలు చేపడతారు. ఒకట్రెండు రోజుల్లో స్థానిక సంస్థల అధికారులకు 2025 జనవరి 1న ప్రచురించిన తుది ఓటరు జాబితాను పంపిణీ చేసేందుకు డీఆర్వో, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

వీరి ప్రోగ్రాం.. జిల్లా కేంద్రానికే పరిమితం

■ వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్‌పై పలువురి తిష్ట

■ ఫారిన్ సర్వీసుల పేరుతో పీహెచ్‌సీలకు వెళ్లని వైద్యులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు వైద్యులు పీహెచ్‌సీల్లో పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. జిల్లా కేంద్రాలను విడిచి వెళ్లేందుకు మొండికేస్తున్నారు. పీహెచ్‌సీలకు బదిలీ చేసినా అక్కడ విధుల్లో చేరకుండా.. పైరవీలు చేసి ప్రోగ్రాం ఆఫీసర్లుగా ఇక్కడే తిష్ట వేస్తున్నారు. డిప్యుటేషన్ లేదా ఫారిన్ సర్వీసు పేరుతో.. డీపీఎంవో, లేదా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త, సంచార చికిత్స కేంద్రం కన్వీనర్‌గా, ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారిగా లేదా ప్రాంతీయ రీజనల్ ల్యాబ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ జిల్లా కేంద్రాలైన కర్నూలు, నంద్యాలకే పరిమితమయ్యారు.

❑ ప్రస్తుతం ప్రాంతీయ ప్రయోగశాలలో పనిచేస్తున్న డాక్టర్ ఖురేషిరాజును మొదట లద్దగిరి పీహెచ్‌సీ వైద్యుడిగా నియమించారు. అక్కడ పనిచేయకుండా 2019 నుంచి డిప్యుటేషన్‌పై జిల్లా వైద్యారోగ్యశాఖలో ఏవోగా కొనసాగారు. ఆ పోస్టు డిప్యుటేషన్ గడువు తీరిపోగానే ప్రాంతీయ ప్రయోగశాలకు వచ్చారు. ఇక్కడ ఆయనకు ఎలాంటి పని ఉండదు. సుమారు నాలుగేళ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారు.

❑ ప్రస్తుతం సంచార చికిత్స నోడల్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ రఘు పీహెచ్‌సీ వైద్యుడిగా ఉంటూ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా పనిచేశారు. తర్వాత పక్కన ఉన్న ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధుల్లో చేరినా వెంటనే డిప్యుటేషన్ పేరుతో సంచార చికిత్స నోడల్ అధికారిగా పోస్టు తెచ్చుకొని పీహెచ్‌సీకి వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు.

❑ గూడూరు పీహెచ్‌సీ వైద్యుడిగా ఉంటున్న నాగప్రసాద్‌బాబు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏవోగా డిప్యుటేషన్ తెచ్చుకున్నారు. ఆ పోస్టు గడువు తీరగానే వెంటనే డిప్యుటేషన్‌పై డీఐవో పోస్టులో చేరారు. ఆ తర్వాత మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టులో చేరి సుమారు ఐదేళ్లుగా కొనసాగుతున్నారు.

❑ కల్లూరు పీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేయాల్సిన డాక్టర్ శైలేష్‌కుమార్.. డిప్యుటేషన్‌పై డీపీఎంవో పోస్టులో కుదురుకున్నారు. పీహెచ్‌సీకి వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే తిష్టవేశారు.

❑ డాక్టర్ మహేశ్వరప్రసాద్ ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్తగా ఫారిన్ సర్వీసు పోస్టు తెచ్చుకొని పీహెచ్‌సీకి వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు.

పరీక్షా కాలం బలవర్ధక ఆహారం

నంద్యాల, కర్నూలు వైద్యం, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ ఫలితాలు వచ్చేశాయి.. విద్యార్థులు రెండో విడత పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వచ్చేవారం ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలు కాబోతున్నాయి.. మరో ఇరవై రోజుల్లో మొదలయ్యే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.. విద్యార్థులు రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షల ధ్యాసలో పడి నీళ్లు తాగడం లేదు.. సరైన ఆహారం తీసుకోవడం లేదు.. అర్ధరాత్రి వరకు మేల్కొని చదువుకుంటున్నారు. ఈ సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. మంచి పౌష్టికాహారం అందిస్తూ ఒత్తిడిని దూరం చేసేలా శ్రద్ధ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

విభాగం	పరీక్ష రాసేవారు
పదో తరగతి	60,806
ఇంటర్మీడియట్	78,831

బయటి తిండి వద్దు : డా.శంకర్‌శర్మ, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, విశ్రాంత ప్రొఫెసర్

- పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితిలోనూ బయటి ఆహారం తీసుకోవద్దు. మసాలా, మాంసాహారం వంటి వాటికి దూరంగా ఉంటే మేలు. పిజ్జాలు, బర్గర్లు, పానీపూరి, కేకులు, మిఠాయిలు, శీతల పానీయాలు వంటివి తీసుకొంటే కడుపు నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది.
- చాలామంది పిల్లలకు కాఫీ, టీ అలవాటు ఉంటుంది. పరీక్షల సమయంలో ఉదయం చిన్న కప్పు మాత్రమే ఇస్తే బాగుంటుంది. వీటి కన్నా రాగిజావ ఇస్తే చాలా మేలు.
- చాలామంది మంచినీరు సక్రమంగా తీసుకోవడం లేదు. ఫలితంగా రక్తశుద్ధి సరిగా జరగదు. అలసట తదితర సమస్యలు వేధిస్తుంటాయి. మజ్జిగ, పళ్ల రసాలు, కొబ్బరి బోండాం వంటివి తీసుకోవాలి. ముఖ్యంగా వేడివేడిగా ఆహారం తీసుకుంటే మంచిది.

ఇతరులతో పోల్చొద్దు : డా.పి.లోకేశ్వర్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణులు, నంద్యాల

- తోటి విద్యార్థులతో పోల్చి ఒత్తిడికి గురి చేయొద్దు.. 'మార్కు' కనబరచాలంటూ తల్లిదండ్రులు తమ పిల్లలపై బలవంతంగా తమ అంచనాలు రుద్దుతున్నారు. ఇవి ఏమాత్రం సహేతుకం కావు.
- పరీక్షలకు ముందు కొత్త అంశాలు నేర్చుకోవడం ద్వారా లాభం కంటే.. నష్టమే ఎక్కువగా జరుగుతుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. గత ఆరు నెలల కాలంలో చదివిన వాటిని పునశ్చరణ చేయించాలి.
- పరీక్ష రాసి వచ్చిన వెంటనే పిల్లలతో నవ్వుతూ మాట్లాడాలి.. పరీక్ష రాసిన విధానంపై సమీక్ష చేయడం సరి కాదు. ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది.. మొదటి పరీక్ష బాగా రాయకుంటే మిగిలిన వాటిపై పడుతుంది.
- మానసిక ప్రశాంతత కోసం కాసేపు పిల్లలతో కలిసి స్థానికంగా ఉన్న పార్కుల్లో నడవాలి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగుపడి మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

రెండు గంటలకోసారి తీసుకోవాలి – రవీంద్ర, న్యూట్రిషనిస్ట్, కర్నూలు

- పరీక్షల సమయంలో విద్యార్థులు రెండు గంటలకోసారి ఆహారం తీసుకోవడం మంచిది. ఎక్కువగా ఆకుకూరలు తినాలి.
- ఉదయం ఏడు గంటలకు పాలు, వాల్‌నట్స్, ఖర్జూర, బాదం వంటివి.. తొమ్మిది దాటిన తర్వాత రాగి ఇడ్లీ, పెసర పప్పు దోసె, కూరగాయలతో చేసిన ఉప్మా, సాంబారు, బ్రౌన్ బ్రెడ్, డ్రైనట్స్, అంజీరా, గుమ్మడికాయ విత్తనాలు, పదకొండు గంటలకు పండ్లు తినాలి.
- మధ్యాహ్నం ఒకటి తర్వాత పోషకాలతో కూడిన భోజనం మితంగా తీసుకోవాలి. సాయంత్రం పండ్ల రసాలు తీసుకోవాలి.. రాత్రి 8-9 గంటల మధ్య జొన్న రొట్టె, చపాతీలు తీసుకోవచ్చు. రాత్రి వేళ వీలైనంత వరకు అన్నం తీసుకోకుండా ఉంటే మంచిది.

రాజవర్ధన్‌రెడ్డి కుటుంబానికి రూ.2.25 కోట్ల పరిహారం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : తెదేపా కోడుమూరు బాధ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు, మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేసులో అతని కుటుంబానికి రూ.2,25,90,800 నష్ట పరిహారం 7.5 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని ఏడో అదనపు జిల్లా జడ్జి లక్ష్మీరాజ్యం గురువారం తీర్పు ఇచ్చారు. 2022 ఏప్రిల్ 20న రాజవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కర్నూలుకు కారులో వస్తూ తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వాహనం టైర్లు పేలిపోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల తరఫున న్యాయవాది ఎంఎల్ శ్రీనివాసరెడ్డి కోర్టులో నష్ట పరిహారం కేసు దాఖలు చేశారు. విచారణ తర్వాత మృతుడి కుటుంబానికి రూ.2,25,90,800 నష్ట పరిహారాన్ని పిటిషన్ వేసిన తేదీ నుంచి 7.5 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని న్యాయమూర్తి లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థను ఆదేశించారు.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (శుక్ర)	సహెరీ (శని)
కర్నూలు	6:28	5:18
నంద్యాల	6:26	5:18
ఆదోని	6:25	5:18
ఆళ్లగడ్డ	6:23	5:22
బనగానపల్లి	6:27	5:14

– న్యూస్‌టుడే, కర్నూలు పాతబస్తీ

సాగుబడి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సాగు పాఠాలు నేర్పించాలని కేంద్రం నిర్ణయించింది.. సాగులో కీలకమైన నేల గురించి అవగాహన కల్పించేలా 'పాఠశాల మృత్తిక ఆరోగ్య కార్డు' (స్కూల్ సాయిల్ హెల్త్ కార్డు) ప్రోగ్రామ్ ప్రాజెక్టును ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో 39 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో జిల్లా పరిషత్, ఆదర్శ, గురుకులాలు కలిపి కర్నూలు జిల్లాలో 16, నంద్యాలలో 23 పాఠశాలలు ఉన్నాయి.

● ఒక్కో పాఠశాలల నుంచి ఆసక్తి ఉన్న 50 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. పాఠశాలల వారీగా మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, వాటి ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విశ్లేషించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

● పది మంది విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేసి ప్రాజెక్టు చేపడతారు. ఈ బాధ్యతను వ్యవసాయ పరిశోధనా స్థానాలు, భూసార పరీక్షా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయశాఖ, విద్యాశాఖ అధికారులకు అప్పజెప్పారు.

● "విద్యార్థులకు విద్యతో పాటు భూసారం, మట్టి నమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణ, మట్టి నమూనాల విశ్లేషణ, ఫలితాల విశ్లేషణ, భూసారాన్ని అంచనా వేసి దానికి తగ్గట్టుగా ఎరువుల వాడకం తదితరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడమే ఎస్ఎస్‌హెచ్‌సీ ప్రోగ్రామ్ ఉద్దేశమని" రైతు శిక్షణ కేంద్రం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి మద్దిలేటి తెలిపారు.

మట్టిని సేకరిస్తున్న విద్యార్థులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

గోడ కూలినా.. గోడు వినరు

ఆదోని రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలోని మున్సిపల్ మైదానం ప్రహరీ మధ్యలో పెద్ద రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. మైదానం ఆవరణలోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు గోడ మధ్యలో ఏర్పడిన రంధ్రంలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గోడ కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు స్పందించి గోడకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ

అలా కవరు చేశారు!

మద్దికెర మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన ఓ రైతు తనకున్న మూడు ఎకరాల పొలంలో ఖరీఫ్‌లో ఉల్లి సాగు చేశారు. ఆ సమయంలో అధిక వర్షాలు, ధర పతనంతో తీవ్రంగా నష్టపోయారు. రబీలో సాగు చేసిన జొన్న పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గింజ పడుతున్న కంకులను పక్షులు తినకుండా ఉండేందుకు కొత్తగా ఆలోచించారు. సిల్వర్ కలర్ ఉన్న ప్లాస్టిక్ కవర్లను ప్రతి కంకికి కట్టారు. అవి కదిలితే.. వచ్చే శబ్దానికి, వెలుతురుకు పక్షులు వాలడం తగ్గుతుందని రైతు వాలి వీరన్న చెబుతున్నారు. - న్యూస్‌టుడే, మద్దికెర

రాతన.. ఇరుకు గదులతో యాతన

రాతన జడ్పీ ఉన్నత పాఠశాలలో గదుల కొరతతో ఆరుబయట చదువులు తప్పడం లేదు. ఐదు తరగతుల్లో మొత్తం 237 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్నవి నాలుగు గదులే. వాటిలో ఒకటి స్టాఫ్ రూమ్‌కు పోగా.. ఐదు తరగతులకు మూడే మిగిలాయి. అందులోనూ ఓ గదిలో శుద్ధజల యంత్రానికి సంబంధించిన పరికరాలు, మరో గదిలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం బస్తాలు, పుస్తకాలతో ఇరుకుగా ఉంది. రెండు తరగతులను చెట్ల కిందే నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నిత్యం యాతన తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. చిన్నపాటి మరమ్మతులు చేపడితే నిర్మాణాలకు తేవచ్చని గ్రామస్థులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, తుగ్గలి

శనగ రైతుకు ప్రభుత్వం 'మద్దతు'

● క్వింటా రూ.5,875తో 12,800 టన్నుల సేకరణే లక్ష్యం

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సాగైన శనగ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో తక్కువగా ఉండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవైపు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిస్తే బహిరంగ మార్కెట్‌లో కూడా ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈనెల మొదటి వారం నుంచే మార్కెట్‌కు శనగ దిగుబడులు అమ్మకానికి వస్తున్నాయి. మరికొన్ని చోట్ల పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా శనగలను వ్యాపారులు గరిష్ఠ ధర రూ.5,000- 5,520 ధరతో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే బహిరంగ మార్కెట్‌లో క్వింటాపై రూ.500- 800 వరకు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

23వ తేదీ నుంచి కొనుగోళ్లు

నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీ ద్వారా జిల్లాలో మద్దతు ధరకు శనగలు సేకరించనున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.5,875 కాగా.. జిల్లాలో 12,800 టన్నుల శనగలను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా సంయుక్త కలెక్టర్ నూరుల్ ఖమర్ మద్దతు ధరతో శనగల కొనుగోలుకు గురువారం అనుమతి ఇచ్చినట్లు మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవాకేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 25 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 23 నుంచి వాటిని ప్రారంభించనున్నట్లు వివరించారు. శనగ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: శాప్ క్రీడా సంబరాల్లో భాగంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం తెలిపారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 23వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా /Rhttps:ports.gov.in//homendex వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కర్నూలులో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సెపక్‌తక్రా.. ఆదోని క్రీడాకారుల సత్తా

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఓ వైపు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే.. మైదానంలో గెలుపు మెరుపులు చూపుతున్నారు ఆదోని పట్టణానికి చెందిన యువ క్రీడాకారులు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి.. రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా పోటీల్లో విజేతగా నిలిచి కప్పును సొంతం చేసుకున్నారు. నిత్య సాధన.. గెలుపే లక్ష్యంగా.. సాగుతున్నారు. ఆదోని పట్టణంలోని డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ముగ్గురు యువ క్రీడాకారులు సెపక్‌తక్రా క్రీడలో తమ సత్తా చాటుతున్నారు. కళాశాల కరస్పాండెంట్ మురళీ బాబు ప్రోత్సాహంతో కోచ్ కె.సురేంద్ర క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీలక్ష్మి బీపీఈడీ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా పోటీల్లో డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల జట్టు విజయకేతనం ఎగురవేసి కప్పును సొంతం చేసుకుంది. ఈ విజయంలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభకనబరిచి జట్టు విజయానికి తోడ్పాటు అందించారు.

సెపక్‌తక్రాలో సాధన చేస్తున్న క్రీడాకారులు

'అరవింద్' సమేత జయం

ఆదోని అమరావతినగర్‌లో నివాసం ఉంటున్న బి.రంగనాథ్, శకుంతల దంపతుల కుమారుడు బి.అరవింద్ బీకాం కంప్యూటర్స్ చదువుతున్నాడు. సెపక్‌తక్రా క్రీడలో సెంటర్ సర్వర్ క్రీడాకారుడిగా బరిలో దిగి జట్టు విజయానికి అవసరమైన పాయింట్లు సాధించి పెట్టడంలో దిట్ట. ఇటీవల కర్నూలులో జరిగిన అంతర్ కళాశాల సెపక్‌తక్రా తుది పోరులో కళాశాల జయకేతనం ఎగురవేయడంలో కీలకంగా వ్యవహరించాడు. జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యమని, అందుకు తగినట్లు సాధన చేస్తున్నానని చెబుతున్నాడు అరవింద్.

రక్షణ శాఖ కొలువే అఖిల్ లక్ష్యం

ఆదోని పట్టణం అరుణజ్యోతి వీధిలో నివాసం ఉంటున్న బి.హనుమంతు, బి.అంజలి దంపతుల కుమారుడు బి.అఖిల్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల కోచ్ వద్ద సెపక్‌తక్రాలో శిక్షణ పొందుతున్నాడు. రైట్ సర్వర్‌గా బరిలో దిగి ప్రత్యర్థులను బోల్తా కొట్టించి పాయింట్లు సాధిస్తున్నాడు. ఈ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు కష్టపడి చదివి రక్షణ శాఖలో ఉద్యోగం సాధించి దేశ రక్షణలో తాను సైతం సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నానంటున్నాడు విద్యార్థి అఖిల్.

వీరేంద్ర ప్రతాపం

ఆదోని పట్టణం కార్పెంటర్‌పేటలో నివాసం ఉంటున్న బి.రామ, బి.రంగమ్మ దంపతుల కుమారుడు బి.వీరేంద్ర బీకాం కంప్యూటర్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల తరఫున ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా తుది పోరులో లెఫ్ట్ సర్వర్‌గా బరిలో దిగి పాయింట్లు సాధించి జట్టు విజయానికి తోడ్పాటు అందించాడు. బాగా చదివి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి పలువురు క్రీడాకారులను తయారు చేయడమే తన లక్ష్యమని చెబుతున్నాడు వీరేంద్ర.

రగ్బీ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

దక్షిణ మండలం జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 21 నుంచి జరిగే దక్షిణ మండలం జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్లను ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు గురువారం ప్రకటించారు. సబ్‌జూనియర్ అండర్-15, జూనియర్ అండర్-18 మహిళా జట్టు పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. క్రీడాకారులకు ఆదర్శ విద్యా మందిరంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ డా.హరికిషన్, జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు సురేందర్, దివ్య, మానస, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేయండి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగు విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జేడీఏ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖ అధికారులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఉల్లి పంటను తగ్గించి పండ్ల తోటలు, మల్లెపూల సాగును ప్రోత్సహించాలని చెప్పారు.

పోలీసుల నిర్లక్ష్యం.. యువతికి వైకల్యం

● బస్సు బోల్తా పడి తెగిపడిన అరచేయి ● చేతిభాగాన్ని వదిలేసి బాధితురాలిని ఆసుపత్రికి పంపిన తెలంగాణ పోలీసులు

ఈనాడు, కర్నూలు: తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు వద్ద గురువారం తెల్లవారుజామున బస్సు బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలై ఎడమ అరచేయి తెగిపోయిన స్నేహలత(23)ను తెలంగాణ పోలీసులు హుటాహుటిన కర్నూలు పంపారు. అయితే తెగపడిన అరచేయి భాగాన్ని పంపడం మరిచిపోయారు. కర్నూలు వచ్చిన తరువాత వైద్యులు ఆ అరచేతిని రెండు గంటల్లో తెస్తే తిరిగి అతికించవచ్చని చెప్పినా పట్టించుకునేవారే కరవయ్యారు. తెగపడిన అరచేతిని సకాలంలో తేలేకపోవడంతో ఆమె శాశ్వతంగా దివ్యాంగురాలిగా జీవించాల్సిన దుస్థితి తలెత్తింది.

కుటుంబానికి ఆమే ఆధారం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన దేవరకొండ స్నేహలత బీఫార్మసీ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. నిరుపేదలైన తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మీలకు ఆర్థికంగా అండగా ఉంటున్నారు. చెల్లి అక్షితను ఇంటర్ చదివిస్తున్నారు. తల్లికి ఒంట్లో బాగోలేదని తెలియడంతో స్నేహలత బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి అనంతపురం బయల్దేరారు. బస్సు ఇటిక్యాలపాడు వద్ద బోల్తా కొట్టడంతో ఆమె అరచేయి తెగి, సంఘటనా స్థలంలోనే పడిపోయింది. విరిగిపడ్డ అరచేతిని వదిలేసి పోలీసులు ఆమెను కర్నూలుకు పంపారు. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే చేయి వస్తుందని ఎవరో చెప్పడంతో ఆమె ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అరచేతిని తెచ్చుకుంటే ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పడంతో బాధితురాలు తన బంధువును మళ్లీ సంఘటనా స్థలానికి పంపించారు. వారు అరచేతి భాగాన్ని కర్నూలు తీసుకొచ్చేసరికి సమయం మించిపోయింది. అందులోని కణజాలన్నీ అప్పటికే నిర్వీర్యమైపోవడంతో దాన్ని అతికించడానికి అవకాశం లేదని వైద్యులు తేల్చిచెప్పారు. పోలీసులు తెగపడిన చేతిభాగాన్ని కూడా ఆసుపత్రికి పంపించి ఉంటే మరికొన్ని నెలలకైనా ఆమెకు చేయి వచ్చేది..వారి పొరపాటుతో తమ కుమార్తె శాశ్వతంగా దివ్యాంగురాలిగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆసుపత్రికి వచ్చిన ఆర్టీసీ అధికారులు తామూ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించలేమని తేల్చి చెప్పారు. దీంతో బాధితురాలి బంధువులు వారి వాహనం ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో యువతి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

స్నేహలత

తెగిపోయిన అరచేయి

పరిమళ తీరంలో తెప్పోత్సవం

● ప్రముఖులకు పురస్కారాల ప్రదానం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: గురువైభవోత్సవాల్లో భాగంగా మంత్రాలయంలో గురువారం సాయంత్రం పరిమళ తీర కోనేరులో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం యోగీంద్ర సభ మండపంలో పలువురు ప్రముఖులకు గురువైభవోత్సవ సన్మాన, పురస్కారాలను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల చేతులమీదుగా అందజేశారు. సత్కారం పొందిన వారిలో లింగబట్ల దుర్గా ప్రసాద్ (దుర్గా మల్లికార్జున స్వామి దేవాలయం, విజయవాడ), డాక్టర్ వెంకటప్ప అంబాజీ(పద్మశ్రీ అవార్డు గ్రహీత), కె.ఎం.నాగరాజు, జయకర్ శెట్టి ఇంద్రాలి (ఉడిపి), డాక్టర్ అజిత్ కులకర్ణి (రాయచూరు), వినయ్ బద్రి (రాయచూరు) ఉన్నారు.

కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతి

దుర్గ గుడి ప్రధాన అర్చకుడు లింగబట్ల దుర్గా ప్రసాద్‌ను సన్మానిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

క్లస్టర్ యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో క్లస్టర్ విశ్వవిద్యాలయం భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని, తక్షణమే నిధులు మంజూరు చేసి వర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో గురువారం ఆమె మాట్లాడారు. కర్నూలు నగరంలో ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ నదులు, కేసీ కాలువలో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క పెరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయని చెప్పారు. దోమల బెడద ఎక్కువై జనాలు రోగాల బారిన పడుతున్నారని, జల వనరులను శుభ్రం చేయించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరిత

ముఖ్యమంత్రిని కలిసిన తిక్కారెడ్డి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, కౌతాళం మండల నాయకుడు, ఉరుకుంద ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ చెన్నబస్సప్ప గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారు. ఆయన కార్యాలయంలో కలిసి మంత్రాలయం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలు, పార్టీ బలోపేతం గురించి చర్చించినట్లు సమాచారం. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం ఛైర్మన్ పదవిని వీరశైవ లింగాయత్‌లకు కేటాయించాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో తిక్కారెడ్డి, చెన్నబసప్ప

ఉద్యోగుల పదోన్నతులకు కృషి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రభుత్వ విభాగాలన్నింటితో అనుసంధానంగా ఉంటూ కీలకమైన సేవలందిస్తున్న ఖజానా శాఖ ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు.

గుండ్రేవుల ప్రాజెక్టుతో పశ్చిమం సస్యశ్యామలం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు మాత్రమే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించగలరని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విశ్వాసం వ్యక్తం చేశారు. కోడుమూరు నియోజకవర్గంతో పాటు జిల్లా పశ్చిమ ప్రాంత వాసుల జీవనాడి అయిన గుండ్రేవుల ప్రాజెక్టుపై గురువారం అసెంబ్లీలో మాట్లాడారు. తమ ప్రాంత వాసులు ఉపాధి లేక గుంటూరు, ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారన్నారు. ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చే ఏకైక మార్గం గుండ్రేవుల ప్రాజెక్టు అని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వలసలు తగ్గడంతో పాటు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వివరించారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

విజయవాడకు వెళ్లిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి గురువారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు గృహ గణన చేపడుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్రంలో మే 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు గృహ గణన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసింది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు అవకాశం ఉంటుంది.

దేశ, ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి

మాట్లాడుతున్న చికోటి ప్రవీణ్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు దేశం, ధర్మరక్షణ కోసం పనిచేయాల్సిన అవసరముందని హిందూ ధర్మరక్ష వ్యవస్థాపకులు చికోటి ప్రవీణ్ తెలిపారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్ట్ లైన్ ప్రాంతంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో చికోటి ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హైందవ ధర్మ రక్షణతో పాటు మన గుడి, బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కుల పిచ్చి వీడి, ఐకమత్యంతో జీవించడం అలవర్చుకోవాలన్నారు. దళితులకు ఆలయ ప్రవేశం చేయించాలన్నారు. అడ్డుకునే వారు ఎవరైనా సరే శిక్షించాల్సిందేనన్నారు. దేశంలో ధర్మరక్షణకు ప్రధానమంత్రి మోదీతో పాటు రాష్ట్రంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అండగా ఉన్నారన్నారు. అనంతరం పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కల్లుమఠం మఠాధిపతి గురుసిద్ధదేవరు, భాజపా రాష్ట్ర నాయకులు విట్టా రమేశ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, నాయకులు ఉపేంద్ర, తిమ్మప్ప, జిందే శంకర్, వెంకటేష్, మహదేవ్, సాయికుమార్, అంజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరైన ప్రజలు

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్
కర్నూలు, ఆంధ్రప్రదేశ్-518003.
ఫోన్ : 94409 05481 & 99499 15723

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): 1) M/s పృథ్వీ ఇండస్ట్రీస్ (ఋణగ్రహీత), ప్రొప్రయిటర్ : శ్రీమతి చిర్రా ఉదయ, సర్వే నెం.240/2, చెట్లమల్లాపురం, పాత బెంగళూరు సిటీ, కల్లూరు, కర్నూలు-518218. 2) శ్రీమతి చిర్రా ఉదయ (ప్రొప్రయిటర్), భర్త: చిర్రా జయరామ్ రెడ్డి, హెచ్.నెం.182/B, ధనలక్ష్మి సొసైటీ, రోడ్ నెం.10, మహీంద్రా హిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్-500026. 3) శ్రీమతి సిహెచ్ రాధిక రెడ్డి (హామీదారు), భర్త : సిహెచ్ వి. రెడ్డి, 202, జ్యోతి అబోడ్, కపాడియా లేన్, సోమాజిగూడ, హైదరాబాద్-500003 వారు తేది. 17-02-2026 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.4,82,53,675.72/- + తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 24-03-2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 24-03-2026, ఉ॥ 10.30 గం.లకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (E-bkray) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 23-03-2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, రాజేంద్ర నగర్ మండలం (ప్రస్తుతం గండిపేట మండలం), మణికొండ జాగీర్ గ్రామం, సర్వే నెం.201 నందు విస్తీర్ణం 13.56 ఎకరాల భూమిలో అవిభాజ్యమైన విస్తీర్ణం 38.79 చ॥గ॥లు లేదా 349.10 చ॥అ॥లు వాటాతో లాంకో హిల్స్‌లోని టవర్ - 6LH (ఆరు LH), G+30 అంతస్తుల కాంప్లెక్స్‌లోని 9వ అంతస్తు (గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి) లోని ఫ్లాట్ నెం.904 (3 BHK) విస్తీర్ణం 2489 చ॥అ॥ మరియు బేస్‌మెంట్‌లో ఒక్కో కారు పార్కింగ్ ఏరియా విస్తీర్ణం 134.55 చ॥అ॥తో 3 కార్ల పార్కింగ్‌తో గల స్థిరాస్తి శ్రీమతి చిర్రా ఉదయ, భర్త: సిహెచ్. జయరాం రెడ్డి గారి పేరున కలదు. ఫ్లాట్ నెం.904 కు హద్దులు: ఉత్తరం: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, తూర్పు: కారిడార్ & ఎదురుగా ఫ్లాట్ నెం.901, పడమర: శూన్యాకాశం. భూమి హద్దులు: ఉత్తరం: ప్రైవేట్ భూమి, దక్షిణం: APIIC మరియు ఇతరుల భూమి, తూర్పు: APIIC భూమి, పడమర: రోడ్డు.

రిజర్వు ధర: రూ. 1,98,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 19,80,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 94409 05481.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 17-02-2026, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 73821 14647.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు లేడి టెలీకాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 13 వేలు to 15 వేలు, లిమిటెడ్ వేకెన్సీస్. సంప్ర: 09177 132168.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS

Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.

Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF + జీతం. Q: డిగ్రీ/MBA, MCA ✆ 94403 51657.

సిమెంట్ కంపెనీల యందు సెక్యూరిటీ గార్డుగా పనిచేయుటకు వ్యక్తులు కావలెను జీతం 18 వేలు, 22 వేలు, 25 వేలు, 28 వేలు మాజీ సైనికులకు 30 వేలు ✆ 90521 24024, 94943 64596.

Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలీకాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

సీజనల్ వసతిగృహాలు మంజూరు చేయాలి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలోని పల్లె ప్రాంతానికి సీజనల్ వసతిగృహాలు మంజూరు చేసి, ఇక్కడి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆదోని నియోజకవర్గ భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. అసెంబ్లీ సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ సమావేశంలో ఈ అంశంపై తాను ప్రసావిస్తే.. రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి వైకాపా హయాం వరకు ఉన్న 25 వసతిగృహాలను 78కి పెంచారన్నారు. ఈ ప్రాంతంలో వెనుకబాటుతనం దూరం చేసేందుకు ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించి, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. అదనంగా కేజీబీవీ విద్యాలయాలు మంజూరు చేయడం ద్వారా డివిజన్లోని ఐదు నియోజకవర్గాలకు ఉపయుక్తంగా మారుతుందన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభ

గిరిగెట్ల(తుగ్గలి), న్యూస్‌టుడే: గిరిగెట్ల గ్రామ సచివాలయంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ గురువారం నిర్వహించారు. తనిఖీలో గుర్తించిన అంశాలను డీఆర్పీ సుధాకర్ సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి విజయలక్ష్మి, ఈసీ రాజశేఖర్, సాంకేతిక సహాయకులు పరీదప్ప, చంద్రశేఖర్, క్షేత్ర సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఆలూరు-గుంతకల్లు రహదారి పక్కన ఉన్న చెత్తాచెదారం తొలగించాలి. ఈ చెత్త కారణంగా దుర్వాసన వస్తోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – కొక్క నాగరాజు, విద్యకమిటీ ఛైర్మన్, చిప్పగిరి ✔: పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. – సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, చిప్పగిరి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: దూదేకొండ గ్రామంలోని బీసీ కాలనీలో దారులు నిత్యం బురదమయంగా ఉంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. – శివప్ప, కాలనీవాసి, దూదేకొండ ✔: బీసీ కాలనీలో కొన్ని వీధుల్లో సీసీ రహదారులు లేక మురుగు రహదారులపై పారుతోంది. పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మునిస్వామి, పంచాయతీ కార్యదర్శి

మహిళా క్రికెట్ జట్టు సారథిగా అంజలీ శర్వాణీ

అంజలీ శర్వాణీ

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ సీనియర్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఆదోని పట్టణానికి చెందిన అంజలీ శర్వాణీ ఎంపికయ్యారు. క్రీడాకారులు, అభిమానులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మేలో మోకాలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్న అంజలీ నాలుగు నెలలుగా మైదానంలో అడుగు పెట్టి సాధన చేస్తున్నారు. గత నెల ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడుతున్న ఆమెను కొత్త కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆల్‌రౌండర్ అంజలీ శర్వాణీ భారత జట్టు తరపున కొన్ని మ్యాచ్‌లు సైతం ఆడారు. తాజాగా సౌత్‌జోన్ సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు రమణారావు, అనురాధ, ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, ప్రధాన కార్యదర్శి, ఆదోని కోచ్ వెంకటేశ్ అన్నారు. మార్చి 5 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న వడ్డే సౌత్‌జోన్ సీనియర్ మహిళా ఇంటర్‌జోనల్ వడ్డే ట్రోఫీ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారన్నారు.

వాహనాల చోరీ.. అడ్డుకట్టకు ఏదీ దారి

☛ లబోదిబోమంటున్న బాధితులు ☛ అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

• **జనవరి 25న:** ఆదోని రైల్వేస్టేషన్ రహదారిలోని థియేటర్ వద్ద గత నెల యూనికార్న్ బైక్‌ను మధ్యాహ్న సమయంలో నిలిపి, పని ముగించుకొని వచ్చేసరికి గుర్తుతెలియని వారు ఎత్తుకెళ్లారని బాధితుడు గోపికృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకపోయింది. దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదైనా పోలీసులు ఇంతవరకు దొంగను పట్టుకోలేదు.

• **ఫిబ్రవరి 17న:** పట్టణంలోని క్రాంతినగర్‌లో లక్ష్మణ్‌కుమార్ తన ఇంటి ముందు పల్సర్ బైక్ నిలిపారు. ఉదయం లేచి చూడగా.. మాయమైంది. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నెల రోజులుగా ద్విచక్రవాహనాల దొంగతనాలు అధికమయ్యాయి. రహదారి పక్కన, ఇంటి ఎదుట నిలబెట్టిన వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్లిపోతున్నారు. బాధితులు కొందరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు స్టేషన్‌కు వెళ్లినా ఫలితం దొరకదని మిన్నకుండిపోతున్నారు.

ఆదోని పట్టణం కార్వన్‌పేటలో చోరీకి గురైన వాహనం

తాళం వేసినా.. మాయం

ఆదోని పట్టణంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్తున్నారు. రైల్వేస్టేషన్ రహదారిలోనే గత నెల రోజుల్లో సుమారు 8 వాహనాలు చోరీకి గురయ్యాయి. దొంగలు చాకచక్యంగా లాక్ తొలగించి యథేచ్ఛగా ఎత్తుకెళ్లిపోతున్నారు. ఇటీవల కాలంలో వాహనాల చోరీలు అధికం కావడంతో ఏదైనా దొంగల ముఠా సంచరిస్తుండా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ ఘటనల దృశ్యాలు కొన్ని సీసీ కెమెరాల్లో సైతం నమోదయ్యాయి. వీటి ఆధారంగా పోలీసు అధికారులు స్పందించి బైక్ దొంగల ఆటకట్టించి, బాధితులకు న్యాయం చేయాలని పురవాసులు కోరుతున్నారు. పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేయడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎస్పీకి మొరపెట్టుకున్నా.. ఫలితం లేదని వాపోయారు.

గాలింపు చర్యలు చేపట్టాం

- రాజశేఖర్‌రెడ్డి, సీఐ, రెండో పట్టణ పోలీసు స్టేషన్, ఆదోని

ఆదోని పట్టణంలో బైక్‌ల దొంగతనాలు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయి. చోరీలకు పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాం. వాహన చోదకులు కొందరు ఎక్కడంటే అక్కడ వాహనాలు వదిలేసి వెళ్తున్నారు. ఇలా కాకుండ పెయిడ్ పార్కింగ్ లేదా సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో పార్క్ చేయడం మంచిది. వాహన చోదకులు తమ వాహనాలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి.

ఇవి పాటిద్దాం..

• ద్విచక్రవాహనాల తాళాలు అరిగిపోతే.. ఇతర వాహనాల తాళాలతో సునాయాసంగా తీసి, దొంగిలించే అవకాశం ఉంటుంది. వాహనాల తాళాలు అరిగితే వెంటనే ఐఎస్ఐ మార్కుగల కొత్త తాళాలు వేయించాలి.

• అవసరమైతే వాహనాలకు వీల్ లాక్‌లు వేయాలి.

• వాహనాలకు సాంకేతికతతో కూడిన జీపీఎస్ సిస్టమ్‌ను అమర్చుకోవడం మంచిది. అలాంటి వాహనాలను ఎత్తుకెళ్తే జీపీఎస్ సిస్టమ్ ద్వారా గుర్తించే అవకాశం ఉంటుంది.

• బీమా తప్పనిసరిగా చేయించాలి.

• వాహనాలను సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో పార్క్ చేయడం ఉత్తమం. బస్టాండు, రైల్వేస్టేషన్, సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో పెయిడ్ పార్కింగ్‌లో నిలపాలి. ఇలా చేస్తే చోరీకి గురికాకుండా ఉంటాయి.

ఘనంగా హాజీమలంగ్ షా బాబా ఉరుసు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దపెండేకల్ గ్రామంలో గురువారం హాజీమలంగ్ షా బాబా ఉరుసు ఘనంగా నిర్వహించారు. స్వామి అశ్వాన్ని ఊరేగించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకుని బాబాను దర్శించుకున్నారు.

పెద్దపెండేకల్‌లో దర్గా ఆవరణలో భక్తుల సందడి

పునాదుల్లోనే చెత్త సంపద

ఆదోని మండలం గణేకల్ గ్రామంలో చెత్త సంపద కేంద్రం పునాదులకే పరిమితమైంది. 2023లో రూ.9.15 లక్షలతో నిర్మాణం చేపట్టారు. పునాదులు వేసి, పిల్లర్లు నిర్మించారు. అప్పటి నుంచి నిర్మాణం పూర్తిగా ఆగిపోయింది. ముళ్ల కంపలు పెరిగి అధ్వానంగా మారింది. గ్రామంలో చెత్త సేకరించే వారు లేరు. ఎక్కడపడితే అక్కడ వేస్తుండటంతో పారిశుద్ధ్యం లోపిస్తోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం

కాల్వ పైకప్పు.. మూయకపోతే ముప్పు

ఆలూరు పట్టణంలోని ఆదోని వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వ ప్రమాదకరంగా ఉంది. పాదచారులు నడిచేందుకు కాల్వపై పైకప్పు ఏర్పాటు చేశారు. కాల్వలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో నెల రోజుల కిందట శుభ్రం చేసేందుకు పైకప్పు మూత తొలగించారు. మూయకుండా అలాగే వదిలేశారు. ఈ మార్గంలో నిత్యం ఆదోని, కర్నూలు వైపు వెళ్లే వాహనచోదకులతో పాటు కోయనగర్ కాలనీకి రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాత్రి వేళల్లో కాల్వపై వెళ్లే సమయంలో అకస్మాత్తుగా కింద పడితే ముప్పు తప్పదు. పైకప్పు మూయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆలూరు

తొట్టె నిర్మించారు.. నీరు మరిచారు..

హాలహర్వి మండలం చింత కుంట మజరా గ్రామమైన శిరుగాపురం లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్టెలు నిర్మించారు. నీరు నిల్వ చేయకుండా వృథాగా వదిలేశారు. వివిధ నీటి అవసరాల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అక్కడే నీటి ట్యాంకులు ఏర్పాటు చేసినా.. వాటిలో నీరు నింపకుండా వినియోగంలోకి రాకుండా చేశారు. లక్షలు నిధులు ఖర్చు చేసి ప్రజలకు అవసరమైన వాటిని ఇలా వృథాగా వదిలేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి నిల్వ చేసి నీటి ట్యాంకు, తొట్టెలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చింతకుంట (హాలహర్వి)

భవనం శిథిలం.. చికిత్సలు పూజ్యం

చిప్పగిరి మండలంలోని రామదుర్గం, నేమకల్లు గ్రామాల్లో పశువుల ఆసుపత్రుల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది రామదుర్గం పశువుల ఆసుపత్రి భవనంలో నుంచి సిబ్బంది విధులు ముగించుకొని బయటకు వచ్చిన తర్వాత పైకప్పు కూలింది. వెనుకబడిన మండలంగా చిప్పగిరిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించింది. ఆ నిధులతో పశువుల ఆసుపత్రులు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఒక్క చిప్పగిరిలో తప్ప మండలంలోని పశువుల ఆసుపత్రి భవనాలన్నీ శిథిలమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఆదోని నేరవార్తలు, గ్రామీణం, న్యూస్‌టుడే: ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదోని పట్టణంలోని జాతీయ బైపాస్ రహదారి-167 సమీపంలో సర్వే నంబరు-586లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ఈ విషయాన్ని గత నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన 'గుట్టకింద భూతాలు' అనే కథనానికి ఆయన స్పందించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడారు.. ఈ సర్వే నంబరులోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారని.. వారికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఇలా ఆక్రమణలకు పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని రికార్డులు పరిశీలించామని, ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించామన్నారు. ఆయన వెంట ఉప తహసీల్దారు బాబు, మండల సర్వేయరు ఈశ్వర్, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ ఉన్నారు.

స్పందనకు వందనం

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలో శర్మాస్ పాఠశాల లైన్‌లో విద్యుత్తు తీగలు కిందకు వేలాడకుండా కర్నూలు డీఈ శేషాద్రి ఆధ్వర్యంలో మంగళవారం చర్యలు చేపట్టారు. 'వాలితే.. యమపాశమే' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. విద్యుత్తు తీగలు వేలాడుతున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. మధ్యలో అదనంగా మరో విద్యుత్తు స్తంభాన్ని యుద్ధప్రాతిపదికన గుత్తేదారు శ్రీవిష్ణురెడ్డితో ఏర్పాటు చేయించి సమస్యను వేగవంతంగా పరిష్కరించారు. ఆయన వెంట లైన్‌మెన్ వీరయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాల గదులు శుభ్రం

తుగ్గలి, న్యూస్‌టుడే: ఉప్పర్లపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం శుభ్రం చేయించారు. 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన 'పాఠశాల గదులు.. పశువుల పాకలు' అనే చిత్ర కథనానికి ఆయన స్పందించారు. అక్కడ పశువులు కట్టేయకుండా రైతులతో మాట్లాడారు. తరగతి గదులు, వరండాను శుభ్రం చేయించారు. పాఠశాలల విలీనంతో ఉప్పర్లపల్లిలో ఇప్పుడు ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. ఐదు తరగతులకు పాత భవనాలే సరిపోతున్నాయి. గతంలో ఏడు తరగతులు ఉండటంతో అదనపు తరగతి గదులు పాత భవనాలకు దూరంగా నిర్మించారు. వాటి అవసరం ఇప్పుడు లేక పోవడంతో నిరూపయోగంగా మారాయి.

జీవన ప్రమాణ పత్రాలు అందించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ సబ్ ట్రెజరీ పరిధిలో ఇప్పటి వరకు జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) అందజేయని సర్వీస్ కుటుంబ పింఛనుదారులు ఈ నెల ఆఖరు లోపు అందజేయాలని ఉప ఖజానా అధికారిణి కోరారు. ఉపఖజానా కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. పత్తికొండ పరిధిలో 711 మంది పింఛనుదారులు ఉండగా 674 మంది మాత్రమే ప్రమాణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. తాజాగా ఫిబ్రవరి 28 లోపు ప్రతాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకపోతే ఏప్రిల్‌కు సంబంధించి పింఛను నిలిచిపోతుందన్నారు. వివరాలకు 77803 92128 చరవాణిలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల చలో విజయవాడ 25న

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న ఎస్టీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న, ఆర్థిక కమిటీ సభ్యుడు మహాదేవప్ప పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని ఎస్టీయూ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు సూర్యుడు, సుధాకర్‌బాబు, భాస్కర్, హరిదాసు, భీమరాజు, గంగానాయక్, లక్ష్మన్న, రామకృష్ణ, బాలాంజనేయులు, సందీప్, ఇమ్రాన్, జ్యోతిమూర్తి, అవినాశ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

కొత్తపలి (మద్దికెర), న్యూస్‌టుడే: గ్రామాల్లో పాడిని మరింత అభివృద్ధి చేసుకునేందుకు రైతులు లేగ దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కర్నూలు ఈవో డీఎల్‌డీఏ రాజశేఖర్, ఆదోని డీడీ వెంకటరమణ, మద్దికెర పశువైద్యాధికారి లక్ష్మణ్ తదితరులు పేర్కొన్నారు. కొత్తపల్లిలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. సర్పంచి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మితో కలిసి ప్రదర్శనను ప్రారంభించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్(63) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది నాలుగు రోజులు కిందట ఇంట్లో పురుగు మందు తాగారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేస్తామని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలిపారు.

అగ్రహారం (మద్దికెర), న్యూస్‌టుడే: అగ్రహారం గ్రామానికి చెందిన అశోక్(24) కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఈ నెల 4న ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గోవర్ధనగిరి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని డోన్ రైల్వేగేటు ప్రాంతంలోని 44వ జాతీయ రహదారిపై ఈ నెల 16న జరిగిన ప్రమాదంలో గాయపడిన ఈశ్వరయ్య(53) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు.

నగదు ఎత్తుకెళ్లిన దుండగుల అరెస్టు

అమకతాడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: జాతీయ రహదారి-44లోని అమకతాడు టోల్ ప్లాజా సమీపంలో ఓ హోటల్ దగ్గర ఈ నెల 12న నిలిపి ఉన్న కారు డిక్కీలో ఉన్న రూ.3.80 లక్షల నగదు ఎత్తుకెళ్లిన వారిని గురువారం వెల్దుర్తి సమీపంలో చెరుకులపాడు క్రాస్ వద్ద పట్టుకొని, వారి నుంచి రూ.3లక్షలు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ మంజునాథ సహకారంతో సిద్ధార్థ నగదు తీసుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో వారిని గుర్తించి అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉపవాస దీక్షలు ప్రారంభం

హొళగుంద, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో.. మండల కేంద్రంలోని అన్ని మసీదులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు గురువారం ప్రారంభించారు. సామూహికంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు విరమిస్తున్న ముస్లింలు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఆదోని పట్టణంలో తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.

ఆదోనిలో వడ్డిస్తున్న తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, శ్రీనివాస ఆచారి


పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీడీలతో విద్యార్థి

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

హొళగుంద, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి సూర్యప్రకాశ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కబీర్ సాబ్, పీడీలు తేజశ్వర్ రెడ్డి, అపర్ణ గురువారం తెలిపారు. ఈ నెల 17న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీల్లో, స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లీగ్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజయం సాధించాడు. ఈ నెల 21, 22వ తేదీలలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికవడంతో, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

అంకిత భావంతో పనిచేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో కీలకమైన హోంగార్డుల విభాగంలోని సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని రాయలసీమ రేంజ్ సదరన్ కమాండెంట్ మహేశ్ అన్నారు. పత్తికొండలో గురువారం ఉదయం పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని హోంగార్డుల సాధారణ తనిఖీలో భాగంగా వారి పనితీరును పరిశీలించారు. ప్రజలతో స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆదోని, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న రాయలసీమ రేంజ్ సదరన్ కమాండెంట్ మహేశ్

ఉన్నతాధికారి నుంచి అభినందనలు అందుకుంటున్న నవీన్

పత్తికొండ వాసికి ఏఎస్పీగా పదోన్నతి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండకు చెందిన ఎం.నవీన్‌కు డిప్యూటీ కమాండెంట్ (ఏఎస్పీ)గా పదోన్నతి పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పత్తికొండకు చెందిన ఎం.శ్రీనివాసులు కుమారుడు నవీన్ సరిహద్దు (ఇండో టిబెటిన్ బోర్డర్ ఫోర్స్) విభాగంలో కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు ఏఎస్పీగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ రాష్ట్రంలోని పంచకులా జిల్లా భానులోని బేసిక్ శిక్షణ కేంద్రంలో సేవలందిస్తున్నారు.

నాలుగు తులాల బంగారు గొలుసు చోరీ

తెర్నేకల్(దేవనకొండ), న్యూస్‌టుడే: తెర్నేకల్ గ్రామంలో గురువారం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో నీటిశుద్ధి ప్లాంట్ నిర్వహిస్తున్న రంగారెడ్డి భార్య సువర్ణ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వేణుగోపాల్ విచారణ చేపడుతున్నారు.

తండ్రిపై తనయుడి దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు ఆస్తి పంచి ఇవ్వాలని తండ్రిపై తనయుడు దాడి చేసిన ఘటన కపటి గ్రామంలో చోటు చేసుకుంది. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శంకరప్పగౌడు ఆయన కుమారుడు వేణుగోపాల్‌గౌడు ఆస్తి విషయంలో గొడవపడ్డారు. రాడ్డు, కత్తితో తండ్రిపై దాడి చేశాడన్నారు. అడ్డుకోబోయిన తల్లి లక్ష్మికి సైతం గాయాలయ్యాయన్నారు.

వంట గది.. అవస్థలతోనే సరి

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల పరిధిలో 247 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 35,376 మంది విద్యార్థులున్నారు. కొన్ని చోట్ల వంట గదులు లేని దుస్థితి నెలకొంది. ఇలాంటి చోట అవస్థలు పడుతూ ఆరుబయటే వంట చేస్తున్నారు. మద్దికెరలోని బాలుర ఉన్నత పాఠశాలలో 330 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్మించిన వంట గది ఇరుకుగా ఉంది. వంట నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నగా ఉన్న ఈ గదిలో వంటకు అవసరమైన వస్తువులు నిల్వ చేసేందుకు సైతం స్థలం లేదు. కట్టెల పొయ్యిని వినియోగిస్తుండటంతో వస్తున్న పొగతో కళ్లు మండిపోతున్నాయని నిర్వాహకులు లక్ష్మీదేవి, మాధవి, సుశీల తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దికెర మండలంలో 26 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 3,880 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లో వంట నిర్వహణ ఇబ్బందిగానే ఉంది. కొన్ని చోట్ల మరింత కష్టంగా ఉందని నిర్వాహకులు చెపుతున్నారు. వంటకు గ్యాస్ కాకుండా ఇప్పటికీ కట్టెలే వినియోగిస్తుండడంతో ఇరుకు గదుల్లో పొగ వెళ్లే మార్గం లేక తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆదోని పాతపట్టణం: జగన్నాథగిరిస్వామి మఠంలో మరాఠ సమాజ్ ఆధ్వర్యంలో వేడుకలు

పత్తికొండ గ్రామీణం: పట్టణంలో భాజపా, విశ్వహిందూ పరిషత్తు నాయకులు శివాజీ చిత్రపటంతో ద్విచక్రవాహన ర్యాలీ

ప్రతి హిందువు ఛత్రపతి కావాలి

హిందూ ధర్మపరిరక్షణకు ప్రతి హిందువూ ఛత్రపతి శివాజీ కావాలని వక్తలు అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పలు మండలాల్లో శోభాయాత్ర నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం

వెల్దుర్తి: ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ

దేవనకొండ: ఆరె మరాఠీలు నిర్వహించిన కార్యక్రమంలో దేశనాయకుల వేషధారణలో చిన్నారులు

పెద్దకర్మ

జననం : 25-3-1969
మరణం : 11-2-2026
కీ॥శే॥ ఆవుల మైరాముడు గారు, B.A., B.L.
అడ్వకేట్, పత్తికొండ
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచి, మాకు సమాజంలో గౌరవ స్థానం కల్పించిన మీరు మా నుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
అమ్మ: ఎ.సుంకమ్మ భార్య: శ్రీమతి బి.హనుమంతమ్మ
కుమారుడు: ఎ.గౌతమ్ వీరేంద్రనాథ్, కుమార్తె: ఎ.తేరణి
గమనిక: పెద్దకర్మ తేదీ: 21-02-2026 శనివారం మా స్వగృహం ఎస్.ఆర్.నగర్, ఎస్.బి.ఐ.బ్యాంక్ వెనుక, పత్తికొండ నందు జరుగును.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

అర్జీ స్వీకరిస్తున్న ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్

నందవరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నందవరం రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీలు సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కోడుమూరు పట్టణం: ఆదర్శ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 23 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశాజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు మార్చి 31 చివరి తేదీ అని తెలిపారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కొత్తలం 8008574913

నందవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామం ఎస్సీ కాలనీలో మూడు విద్యుత్తు స్తంభాలకు దీపాలు వెలగడం లేదు. - **ప్రభాకర్, పోనకలదిన్నె** ✔: పంచాయతీ అధికారులకు తెలియజేసి, వీధిదీపాలు వెలిగేలా చూస్తాం. - **రామచంద్ర, ఈవోఆర్డీ, నందవరం మండలం**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: లక్ష్మీపేట పెద్దబావి లైన్‌లో రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది. - **లక్ష్మన్న, కాలనీవాసి** ✔: కొత్త రహదారికి ప్రతిపాదనలు తయారు చేశాం. **-గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు**

?: లక్ష్మీపేటలో తాగునీటి బోరు చెడిపోయి ఇబ్బందులు పడుతున్నాం. - **రంగమ్మ, కాలనీవాసి**

✔: మరమ్మతులు చేయిస్తాం. - **నీరజ, డీఈ**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని హులికన్విలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. - **రామాంజినేయులు, హులికన్వి** ✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్లి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - **ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు**

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని మోహిన్ వీధిలో మురుగు నిండి దుర్వాసన వస్తోంది. అధికారులు తక్షణం స్పందించి తొలగించాలి. - **రవి, స్థానికుడు** ✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - **వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఈ నెల 23 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిధిలో తాగునీరు, బెంచీలు, సీసీ కెమెరాలు, ఫ్యాన్లు, ఇతర వసతులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

☛ పట్టణంలో 8 జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 5400 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పర్యవేక్షణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

పరీక్షా కేంద్రాలివీ..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నలందా, నారాయణ, వైష్ణవి, గ్లోబల్, జూనియర్ కళాశాలలు, బనవాసి బాలికల గురుకులం

వేసవి ముప్పు.. కలగాలి కనువిప్పు

■ అదనపు మోటారు లేక అవస్థలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.నాగలాపురం తాగునీటి పథకం ద్వారా ఏడు గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. తాగునీటి పథకం పంపింగ్ మోటారు కాలిపోతే మరమ్మతులు చేసే వరకు పథకం కింద గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు తప్పవు. వేసవి సమీపిస్తున్న వేళ అదనపు మోటారు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

పరిశీలన

ముందే మేల్కొంటేనే..

ఈ తాగునీటి పథకం కింద గుడేకల్, మసీదుపురం, మాసుమాన్‌దొడ్డి, కందనాతి గ్రామాలకు నీటిని పంపింగ్ చేసేందుకు 60 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న విద్యుత్తు మోటారు, కడివెళ్లకు 15 హెచ్‌పీ, ఎస్.నాగలాపురానికి 5 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మొత్తం మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. కడివెళ్ల, ఎస్.నాగలాపురానికి అదనపు విద్యుత్తు మోటార్లు ఉన్నాయి. గుడేకల్, మసీదుపురం, మాసుమాన్‌దొడ్డి, కందనాతికి ఒకే విద్యుత్తు మోటారు ఉంది. అది మరమ్మతులకు గురైతే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. వేసవిలో కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి పొలాల్లోని మోటార్ల వద్ద తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.

మాసుమాన్‌దొడ్డి వద్ద పొలాల్లో బోరు నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి

–ప్రేమ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

నాలుగు గ్రామాలకు తాగునీటిని పంపింగ్ చేసే 60 హెచ్‌పీ మోటారు ఒకటే ఉంది. అదనపు మోటారు కోసం ప్రత్యేక నిధుల కింద రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఇటీవల టెండర్ పిలవగా గుత్తేదారులెవరూ టెండర్ దాఖలు చేయలేదు. మరోసారి టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

శుద్ధజలం.. అందని దైన్యం

కృష్ణదొడ్డిలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణదొడ్డి, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, బ్యాతోళి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాలకు 15 ఏళ్లుగా శుద్ధ జలం కలగానే మిగిలింది. 2012లో కాంగ్రెస్ హయాంలో 20 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.23 కోట్లు నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుగా హైదరాబాద్‌కు చెందిన కంపెనీ ముందుకు వచ్చి ఐదేళ్ల పాటు అడపాదడపా పనులు చేపట్టి సుంకేసులలో తుంగభద్ర నది నుంచి గొట్టం మార్గం ద్వారా సుంకేసులలో నిర్మించిన భూగర్భ ట్యాంకుకు నీటిని మళ్లించారు. ఈర్లదిన్నె, కొండాపురం, చింతమానుపల్లె, సి.బెళగల్ ప్రాంతాల్లో మంచినీటి పథకాలు నిర్మించారు. అనంతరం గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన ధోరణితో పనులు నత్తనడకన సాగి నీటి సరఫరా జరగలేదు. రెండేళ్ల క్రితం నుంచి పనులు పూర్తయి కొన్ని గ్రామాలకు తాగునీరు అందుతోంది. అయితే ఆ ఆరు గ్రామాలకు మాత్రం ఇప్పటికీ తాగునీరు అందని దుస్థితి. పైప్‌లైన్లకు తరచూ రంధ్రాలు పడుతుండటంతో ప్రజలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా పంచాయతీల సర్పంచులు స్థానికంగా బోర్లు వేసుకుని వాటి ద్వారా తాగునీరు అందేలా చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రషీదుల్లా నియామకం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా(ఏజీపీ) రషీదుల్లాను ప్రభుత్వం నియమించింది. పట్టణానికి చెందిన రషీదుల్లాకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రభుత్వం తరఫున ఉద్యోగులకు న్యాయ సేవలు అందిస్తారు.

స్వచ్ఛత కొరబడి



మండలంలోని ఆదర్శ పాఠశాల పరిసరాల్లో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. భోజనం షెడ్డు, తాగునీటి కుళాయిల వద్ద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో తరగతి గదుల్లోకి పాములు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. జిల్లా విద్యాధికారి పాఠశాలను సందర్శించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించినా స్పందన లేక పోవడం గమనార్హం. **– న్యూస్‌టుడే, గోనెగండ్ల**

అలుముకుని.. ప్రవాహాన్ని అడ్డుకుని

మండలంలోని గుడేకల్ చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోయింది. పట్టణానికి వేసవిలో తాగునీరు అందించే నీటి ట్యాంకుల సామర్థ్యం నెల రోజులకు కూడా సరిపోదు. దీంతో చెరువులో నీటిని నిల్వ ఉంచి అధికారులు పట్టణానికి సరఫరా చేస్తారు. గుర్రపుడెక్క అల్లుకుపోవడంతో చెరువు పూడిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. నీటి ఎద్దడి దృష్ట్యా గుర్రపుడెక్కను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. **– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం**

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఆదినాగేష్

రూ.18.72 లక్షలతో ఆసుపత్రికి మరమ్మతులు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు (ఎన్ క్వాస్) కింద చేపట్టిన మరమ్మతు పనులను గురువారం సూపరింటెండెంట్ ఆదినాగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో రూ.18.72 లక్షలతో బండబరుపు, పైకప్పు మరమ్మతు తదితర పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ హరిబ్రహ్మ ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా కాలనీలో సమస్యలను పరిష్కరించడం లేదని ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఈరమ్మ మండిపడ్డారు. లక్ష్మీపేటలో పని చేయని బోరు వద్ద గురువారం మహిళలతో కలిసి ఆందోళన చేపట్టారు. బోరు మరమ్మతులకు గురైనా అధికారుల నుంచి స్పందన లేదన్నారు. కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

నీటి ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.9,670

ఎమ్మిగనూరు వ్యవసాయం: వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుసెనగ గరిష్ఠ ధర రూ.9,670, మధ్యస్థ ధర రూ.7,480, కనిష్ఠ ధర రూ.5,240కు వ్యాపారులు కొన్నారు. కందులు గరిష్ఠ ధర రూ.6,412, మధ్యస్థ ధర రూ.5,290, కనిష్ఠ ధర రూ.4,820 పలికింది.

పాముకాటుతో విద్యార్థికి అస్వస్థత

సి.బెళగల్, న్యూస్‌టుడే: పాముకాటుతో అస్వస్థతకు గురైన ఘటన సి.బెళగల్ గురుకుల పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. ప్రిన్సిపల్ చింతలయ్య తెలిపిన వివరాల మేరకు.. గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది బైపీసీ చదువుతున్న రామ్‌చరణ్ గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా మరుగుదొడ్డి సమీపంలో పాముకాటుకు గురయ్యాడు. అస్వస్థతకు గురవగా ఉపాధ్యాయ బృందం చికిత్స కోసం సి.బెళగల్‌కు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు.

మంత్రాలయం: ఆరెకటిక, ఆర్ఎస్ఎస్ సంఘం ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న పీఠాధిపతి

పెద్దకడబూరు: కల్లుకుంటలో శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న యువకులు

ఎమ్మిగనూరు: రక్తదానం చేస్తున్న యువకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మొగల్ చక్రవర్తి ఛత్రపతి శివాజీ జయంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటాలను ఊరేగించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శివాజీ పాలన దక్షతను గుర్తు చేసుకున్నారు. యువకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, కోసిగి, సి.బెళగల్, కోడుమూరు గ్రామీణం, గోనెగండ్ల, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం గ్రామీణం

కోడుమూరు గ్రామీణం: చిత్రపటాన్ని ఊరేగిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

మెరుగైన ఫలితాలు సాధించాలి

గూడూరు గ్రామీణం: పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు మిగిలిన అభ్యసన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణత శాతం పెంచాలని డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు సూచించారు. పట్టణ పరిధిలోని ఆదర్శ పాఠశాల, జీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన కోడుమూరు ఎంఈవో జె.రామచంద్రుడుతో కలిసి సందర్శించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన విధానంపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం నాసీర్ హుస్సేన్, రవికుమార్, రాజశేఖరప్ప తదితరులు ఉన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేసిందని ఆ పార్టీ మండల నాయకులు తిరుపతయ్యనాయుడు, రామాంజినేయులు, బేతాళబడేసా, షేక్షావలి, నజీర్‌సాహెబ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు కులమాలలో గురువారం నాయకులు రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రెండేళ్ల పాలన కాలంలోనే గ్రామంలో రూ.కోటి నిధులతో సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచి బుడ్డన్న, రంగస్వామినాయుడు, వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, మోహన్‌రెడ్డి, రాముడు, దేవవరం, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉరుసుకు నీటి ట్యాంకర్లు

తాగునీటి బోరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గంజహళ్లిలో ఈ నెల 23న జరిగే మహాత్మ బడేసాహెబ్ స్వామి ఉరుసు కార్యక్రమంలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలోని తాగునీటి బోర్లు, చేతి పంపులను ఆయన, దర్గా ధర్మకర్త, పీఠాధిపతులు, గ్రామపెద్దలు పరిశీలించారు. భక్తుల కోసం 25 నీటి ట్యాంకర్ల దాకా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామ శివారులో బోర్ల నుంచి అక్కడక్కడా కుళాయిల సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కృష్ణమనాయుడు, తోలురాముడు తదితరులు పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శనగ దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏవో రవిప్రకాశ్ తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎకరాకు గరిష్ఠంగా 9 క్వింటాళ్ల వరకు తీసుకుంటోందని వివరించారు. క్వింటా రూ.5,875కు కొనుగోలు చేస్తోందని తెలిపారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఖాతాదారులు, ప్రజలకు బ్యాంకింగ్ ద్వారా మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంతో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కెనరా బ్యాంకు జీఎం పాండురంగ మితంతయ్య పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో పునరుద్ధరించిన శాఖను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు డిజిటల్ సేవలు, ఏటీఎంలు, బ్యాంకు రుణాలు ద్వారా సేవలు అందిస్తూ దేశంలో కెనరా బ్యాంకు మూడోస్థానంలో ఉందన్నారు. బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు, డిపాజిట్లు చేసిన వారికి అన్నీ బ్యాంకుల కంటే ఒక శాతం ఎక్కువగా వడ్డీరేట్లు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ అసిస్టెంట్ మేనేజర్ సుశాంత్‌కుమార్, సీనియర్ బ్రాంచి మేనేజర్ శిరీష, మేనేజర్ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ శ్వేత, అసిస్టెంట్ మేనేజర్ రాజేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపాతోనే సంక్షేమం, అభివృద్ధి

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు

వైకాపా ప్రభుత్వంలో వైద్య సిబ్బందికి అన్యాయం

శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణం ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వైద్య వెయ్యిమందికి పైగానే పని చేశారని.. కాని వారిని వైకాపా హయాంలో తొలగించారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. తక్షణమే వారిని అదుకోవాలని కోరారు. శాసనసభ సమావేశాల్లో గురువారం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. కరోనా సమయంలో వారి ప్రాణాలను అడ్డుపెట్టి సేవలు అందించారన్నారు. పని చేసిన వారికి సేవలు గుర్తించాల్సిన వైకాపా ప్రభుత్వం వారికి అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం స్పందించి వైద్య, ఇతర శాఖల్లో సర్దుబాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

గురువైభవోత్సవాలకు రూ.5 లక్షల విరాళం

చెక్కును పీఠాధిపతికి అందజేస్తున్న కెనరా బ్యాంకు రీజియన్ జనరల్ మేనేజర్ ఐపీ మిథున్ తాయా

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో జరుగుతున్న గురువైభవోత్సవాలకు గురువారం కెనరా బ్యాంకు రీజియన్ జనరల్ మేనేజర్ ఐపీ మిథున్ తాయా, అసిస్టెంట్ జనరల్ మేనేజరు కర్నూలు సుశాంత్‌కుమార్‌లు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. మఠంలో జరిగే సాంస్కృతిక, వైభవోత్సవాలకు విరాళం ఇస్తున్నట్లు వారు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని ఇనగండ్ల, సంగాల గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణాలను గురువారం కోడుమూరు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ కర్రెన్న, ఏఈ వెంకటప్రకాష్‌లు పర్యటించి పరిశీలించారు. భవనాలు త్వరితగతిన పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. సి.బెళగల్‌లో కేంద్రానికి స్థలం ఖరారైన వెంటనే నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామని ఏఈ తెలిపారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అసెంబ్లీలో గుండ్రేవుల సమస్యపై ప్రస్తావించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టుతో సాగునీరు, తాగునీటి సమస్య తీరుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కంబదహల్(సి.బెళగల్): మండలంలోని కంబదహల్ గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కాగడా హారతి ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పని చేస్తున్న కొత్త కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎల్లప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం కార్మిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు.

నందవరం: విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీవో పుల్లయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు.

మంత్రాలయం గ్రామీణం: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో దాతలు కె.ఎమ్.నాగరాజు బెంగళూరు వారు నిర్మించిన యజ్ఞశాలను గురువారం దాతలో కలసి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ప్రారంభించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. నగర పంచాయతీలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ అధ్యర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అమృత్ పథకం ద్వారా నిర్మించిన ట్యాంకులకు నీటి సరఫరా లేక దిష్టి బొమ్మలుగా ఉన్నాయన్నారు. వేసవి సమీపిస్తుండటంతో నీటి సమస్య జటిలం అవుతోందన్నారు. మినీ హెల్త్ సెంటర్ లేక ప్రజలు వైద్యం కోసం కర్నూలుకు పరుగులు పెడుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రజలతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, దానమన్న, రామాంజనేయులు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు కేవీ నారాయణ

ఘనంగా దేవతా విగ్రహాల ఊరేగింపు

సుంకులా పరమేశ్వరి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగిస్తున్న గ్రామస్థులు

సంగాల (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని సంగాల గ్రామంలో మారెమ్మ, సుంకులా పరమేశ్వరి దేవతల ప్రతిష్ఠోత్సవంలో భాగంగా గురువారం యాగశాలలో విగ్రహాలకు క్షీరాభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తుల విగ్రహాలను ట్రాక్టరుపై కొలువుదీర్చి మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించి యాగశాలకు చేర్చారుదీ సందర్భంగా స్థానికంగా సందడి నెలకొంది.

ముగిసిన యాదగిరప్ప స్వామి ఉత్సవాలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంటలో మహా శివరాత్రి సందర్భంగా ప్రారంభమైన శ్రీ యాదగిరప్ప స్వామి ఉత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. ప్రత్యేక పూజల అనంతరం స్వామి పల్లకి తిరిగి కల్లుకుంటకు చేరుకుంది. గ్రామంలోకి భక్తులు నిండు బిందెలతో జలాభిషేకాలు చేస్తూ పల్లకిని స్వాగతించారు.

సాధన చేస్తూ.. పతకాలు సాధిస్తూ

◆ క్రీడల్లో సత్తా చాటుతున్న గురుకుల విద్యార్థులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ భేష్ అనిపిస్తున్నారు. గతంలో పలుమార్లు పదో తరగతిలో వంద శాతం ఫలితాలతో నిలవటంతో పాటు ఆటల్లోను తక్కువ కాదంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుపులు మెరిపిస్తున్నారు. వారే మండలంలోని గోరంట్లకు చెందిన బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు. ప్రిన్సిపల్ భూషణ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజుల ప్రోత్సాహంతో సత్తా చాటుతున్నారు.

అలా స్ఫూర్తి పొందా – వినయ్‌కుమార్

నేను గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. ఎప్పుడూ క్రీడాకారుల పేర్లు దిన పత్రికలు, టీవీల్లో వస్తుంటాయి. వాటిని చూసి నాకు కూడా ఆటల్లో రాణించాలనే ఉండేది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో హ్యాండ్‌బాల్‌లో శిక్షణ తీసుకున్నా. క్రీడల అసోసియేషన్ వారు కర్నూలులో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టులో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. దాంతో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనేది లక్ష్యం.

దేశ సేవే లక్ష్యం – హాజి, 9వ తరగతి

నాకు ఆటలపై ఉన్న మక్కువతో అసోసియేషన్ వారు నిర్వహించిన 60 మీటర్ల పరుగు పందెం పోటీల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాను. దాంతో చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై రెండో స్థానంలో నిలిచాను. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో అండర్-17లో వినుకొండలో రాణించాను. భవిష్యత్తులో సీఆర్‌పీఎఫ్ లేదా ఆర్మీలో చేరి దేశానికి సేవలందించాలనేది లక్ష్యం.

ఉద్యోగం సాధిస్తా

– సుశాంత్

నేను గురుకులంలో 10వ తరగతి చదువుతున్నా. చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్నా. పాఠశాల క్రీడల సమాఖ్య కర్నూలులో జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో జట్టు తరఫున సత్తా చాటడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడి క్రీడా ధ్రువపత్రం, పతకం అందుకున్నా. బాగా చదువుకుని క్రీడా కోటా కింద ఉద్యోగం సాధించటమే లక్ష్యంగా పెట్టుకున్నా.

(c) eenadu

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

లబ్ధిదారులతో వివరాలు తెలుసుకుంటున్న పీడీ చిరంజీవి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణంలో పురోగతి సాధించాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సూచించారు. నన్నూరులో నిర్మాణంలో ఉన్న గృహాలను గురువారం ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లులు త్వరగా అందేలా చూడాలని ఏఈ శ్రీనివాసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ ప్రభాకర్, వర్క్ఇన్‌స్పెక్టర్ రామునాయక్, ఇంజినీరింగ్ సహాయకులు మునిస్వామి, రాజే పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో సీఐలు, ఎస్సైలు తమ పరిధిలోని సున్నిత ప్రాంతాల్లో గురువారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వాహన పత్రాలు పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85000 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: ధనలక్ష్మీనగర్, సరస్వతి నగర్‌లలో మురుగు కాలువలు వ్యర్థాలతో పూడిపోయాయి. శుభ్రం చేయాలి. **- రాజీవ్**
?: గణేశ్‌నగర్ వీధుల్లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**
✔: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తాం. **- నగరపాలక అధికారులు**

పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ వారి ఆదేశానుసారం కర్నూలు జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న యునైటెడ్ క్లబ్ ఆవరణలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ అబ్దుల్‌కరీం పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా గోపి లింగన్న, కార్యదర్శిగా తామూ శివారెడ్డి, కోశాధికారిగా మీసాల మాను మన్నను ఎన్నుకున్నారు. వీరిని సభ్యులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

నత్తనడకన.. ఆధార్ నవీకరణ

- సచివాలయాల్లో సక్రమంగా అందని సేవలు
- పట్టించుకోని సిబ్బంది.. కొరవడిన పర్యవేక్షణ

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఐదేళ్లు పైబడిన, 15 ఏళ్లు నిండిన పిల్లల ఆధార్ నవీకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. తర్వాత స్పందించిన ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కిట్లను ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా ఆధార్ నవీకరణ చేపట్టారు. ఆయా కేంద్రాలకు పిల్లలను తీసుకెళ్లిన ప్రజలకు నిరాశే మిగులుతోంది. కిట్లు సరిగా పని చేయకపోవడం.. సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రైవేటు మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

కిట్లు మూలకు.. సేవలు గాలికి

పట్టణ ప్రాంతాల్లో 10-15 సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలాల్లో ఒకటి రెండు సచివాలయాల్లో కూడా ఆధార్ కిట్లు అందుబాటులో ఉండటం లేదు. కొన్ని సచివాలయాల్లో ఆధార్ కిట్లు లేవు. మరి కొన్ని చోట్ల ఉన్నా పనిచేయడం లేదు. కొన్ని కేంద్రాల్లో కిట్లు నిరుపయోగంగా మారడంతో మూలన పడేశారు. ఫలితంగా సచివాలయాల్లో ఆధార్ నవీకరణ ప్రక్రియ ముక్కుతూ మూలుగుతూ జరుగుతోంది. కొన్ని సచివాలయాల్లో వారంలో ఒకరిద్దరి ఆధార్ నవీకరణ కూడా చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తపాలా కార్యాలయంలోని ఆధార్ కేంద్రంలో నవీకరణకు వేచి ఉన్న విద్యార్థులు, ప్రజలు

ఐదేళ్లు పైబడిన పిల్లల ఆధార్ నవీకరణ లక్ష్యం.. ఇప్పటి వరకు చేసింది..

మండలం	లక్ష్యం	చేసింది	పెండింగ్
కర్నూలు అర్బన్	18,891	754	18,137
కోడుమూరు	3,445	139	3,306
ఓర్వకల్లు	1,893	154	1,739
కర్నూలు రూరల్	3,231	473	2,758
కల్లూరు	1,812	525	1,287

ప్రైవేటు కేంద్రాల దోపిడీ

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ ప్రక్రియ సరిగా జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ నవీకరణ కోసం ప్రైవేటు ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అక్కడ పిల్లలకు ఆధార్ నవీకరణకు రూ.100-200 వరకు వసూలు చేస్తున్నారు. మండలాల బయోమెట్రిక్ ఆధార్ (ఏబీయూ) ప్రైవేటు ఆధార్ కేంద్రాల వారికి కాసులు కురిపిస్తోంది. గత్యంతరం లేక వారు అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా పాలనాధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కిట్లను ఉపయోగంలోకి తెచ్చి ఆధార్ నవీకరణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తప్పవు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర పరిధిలో క్రమబద్ధీకరించుకోని అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై ఎల్ఆర్ఎస్, బీపీఎస్ గడువుతీరిన తర్వాత శాఖాపరమైన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో గురువారం ఆయన పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో సమీక్షించారు. బీపీఎస్ పథకం గడువు వచ్చే నెల 11వ తేదీతో ముగుస్తుందన్నారు. 20 వేల అనధికార నిర్మాణాలను గుర్తించగా ఇప్పటివరకు 9 వేల నోటీసులు మాత్రమే ఇవ్వడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాత రుసుముల ప్రకారమే చెల్లించండి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు ఫీజులను పాత రుసుముల ప్రకారమే చెల్లించాలని మంత్రి టీజీ భరత్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. నగరంలో ట్రేడ్ లైసెన్సు రుసుములను పెంచుతూ గతేడాది పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పుడే అమలు చేయొద్దని నగరపాలక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులపై అదనపు భారం పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అధికారులు ట్రేడ్ లైసెన్స్ రుసుము బలవంతంగా వసూలు చేయకూడదన్నారు.

మార్గబిలం.. ముప్పు తథ్యం

కల్లూరు చెన్నమ్మ కూడలి నుంచి సుంకులమ్మ గుడికి వెళ్లే రస్తాలో మార్గబిలం ప్రమాదకరంగా మారింది. దీనిపై ఏర్పాటు చేసిన ఇనుప చట్రం విరిగిపోయి గుంత ఏర్పడింది. స్థానికులు దానికి అట్టలను అడ్డుగా పెట్టారు. వాహనదారులు గమనించకుండా వెళ్తే ప్రాణాలకే ప్రమాదం. నగరపాలక అధికారులు స్పందించి మార్గబిలంపై మూత ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

యువత శివాజీ చరిత్ర తెలుసుకోవాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : యువత ఛత్రపతి శివాజీ చరిత్ర, ఆయన త్యాగాలను తెలుసుకోవాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ సూచించారు. నగరంలోని కోడుమూరు రహదారిలో ఉన్న ఛత్రపతి శివాజీ మహరాజ్ కూడలిలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దళ్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, విక్రమ్‌సింగ్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ కార్యక్రమంలో టీజీ వెంకటేష్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి తదితరులు

వైకాపా నేతలు సంస్కారం నేర్చుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : వైకాపా నాయకులు మొదట సంస్కారం నేర్చుకోవాలని బ్రాహ్మణ సంఘం నాయకులు హితవుపలికారు. నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో గురువారం బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందరావు, బ్రాహ్మణ సంఘం నాయకులు రామరాజు, శ్రీనివాసరావు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. దేవాదాయశాఖ మాజీ సలహాదారు, వైకాపా నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ బ్రాహ్మణ కార్పొరేషన్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు మారుతీశర్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందరావు

వాము గరిష్ఠ ధర రూ.27,180

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో గురువారం క్వింటా వాము గరిష్ఠ ధర రూ.27,180 పలికింది. బ్యాడిగ మిర్చి రూ.32,510, దేవనూరు డీలక్స్ రూ.21,200, వేరుసెనగకాయలు రూ.9,730, ఆముదాలు రూ.6,051, మొక్కజొన్నలు రూ.1,649, కందులు రూ.7,869, కందుల వడకలు రూ.3,719, శనగలు రూ.5,519, ఉల్లి రూ.1,389, మినుములు రూ.8,200, సోయాబీన్స్ రూ.4,640, సజ్జలను రూ.1,929తో వ్యాపారులు కొనుగోలు చేశారు.

క్షతగాత్రులకు సర్వజన ఆసుపత్రిలో చికిత్స

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఇటిక్యాలపాడు వద్ద గురువారం బస్సు బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల్లో తొమ్మిదిమందిని కర్నూలు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వారిలో కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన గౌస్, రంగన్న, వీరేష్, శివ, మోహన్, ఆరుణ, సుబ్బరాయుడు, రామేశ్వరమ్మ, జయరాముడు ఉన్నారు. ఏడుగురు చికిత్స తీసుకుని వెళ్లిపోయారు. మోహన్, శివ చికిత్స పొందుతున్నారు.

In the Court of the Addl. Sr. Civil Judge, Kurnool.
E.P. No. 8/2018 In O.S. No. 122/2017
S.Hidayathulla Khadri -D.Hr
-Vs-
C.H.Rama -J.Dr
వేలం ప్రకటన
పై నెంబర్ EPలో D.Hr తనకు J.Dr. నుండి రావలసిన మొత్తంనకు గాను J.Dr. తాలూకు షెడ్యూలు దాఖల ఆస్తిని వేలంనకు తెచ్చినాడు. వేలం వాయిదా 9-03-2026 తేదీన ఉన్నది. సవాలుదారులు పై వేలం తేదీన పగలు 10.30 గం॥ల నుండి జరిగే వేలంలో పాల్గొని సవాలు పాడవచ్చును.
షెడ్యూలు: Item No.1: All that portion forming Flat No: G-7, In Ground floor, with a super built-Up area of 810 sft. (Including Common area) composite M.V. Rs. 1,000/- per sft. along with 1/27th undivided share in the schedule land to the extent of 27.49 Sq.Yards in the Residential complex Named as Mayuri Paradise ('B' Block-1) Forming part of the Land admeasuring 6680.5 sft. or 742.27 Sq.yards (out of 1.30 acrs) Part and Parcel of Sy.No. 1182 of Nannur Village, Orvakal Mandal, Kurnool Dist. Andhra Pradesh bounded as follows: Boundaries: East to West: 215.'6' or 65.6844 Mts, North-South: 31.'0' or 9.4488 Mts extent 6680.5 sft. or 742.27 Sq.Yards. **Boundaries** of the Flat No. GF-7 in Ground floor, in Mayuri Paradise ('B'-Block-1) **East:** Joint wall of Flat No: GF-8, **West:** Joint wall of Flat No: GF6, **North:** Parking Place, **South:** 12 ft Driveway.
Market Value Rs. 8,10,000/-
Ameena Value Rs: 8,50,000/-
Sub Register Value Rs. 14,58,000/-
Intem No.2: Plot No. 406 in Mari Gold Venture Bearing L.Dis.No. 27/71 Situated in Sy.No. 1237 of Nannuru Revenue Village, Limits Orvakal and Kurnool Division and Orvakal Sub Registration and Kurnool District Registration bounded as follows **East:** 33 fts wide Road, **West:** Plot No: 405, **North:** Plot No: 407, **South:** 40 fts Road, **Measurements: East-West:** 48 fts, **North-South:** 32 fts, Total is 1536 Sq.fts
D.Hr. Market Value is Rs. 60,000/-
Ameena Value Rs. 65,000/-
Sub Register Value Rs. 5,12,000-00
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
సి.లోకేశ్వరయ్య
D.Hr. పరం అడ్వకేటు, కర్నూలు.
సెల్: 90104 90270.

హర్షిత.. క్రీడల్లో విజేత

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయంలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న హర్షిత క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపుతోంది. ఆటలపై ఆసక్తితో ఖోఖో, అథ్లెటిక్స్ నేర్చుకుని.. నిత్యం సాధనతో నైపుణ్యం పెంచుకుని పోటీల్లో రాణిస్తోంది. ఆర్‌యూ అనుబంధ కళాశాలల మహిళా అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో సత్తాచాటి ప్రశంసలు అందుకుంది.

◆ 2021 ఆగస్టులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జిల్లాస్థాయి క్రీడల్లో ఖోఖోలో రాణించి తమ జట్టుకు రన్నర్స్ ట్రోఫీ అందించింది. ◆ 2022 జులైలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో రజత పతకం గెలుచుకుంది. ◆ 2025 డిసెంబరులో నంద్యాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో 4100 రిలే పరుగులో రజత పతకం సాధించింది. ◆ ఈనెల 14న కర్నూలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన మహిళల ఖోఖో పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేసి ఆర్‌యూ జట్టును విజేతగా నిలిపింది.

ఏజీ ఆడిట్ నిష్పక్షపాతంగా చేపట్టాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఆర్‌యూలో జరుగుతున్న ఏజీ ఆడిట్‌ను నిష్పక్షపాతంగా చేపట్టాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌యూలో ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ, ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ క్యాంపస్‌లో జరిగిన పనుల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. టెండర్ల విషయంలో ఓ ఉన్నతాధికారి లోపాయికారిగా ఒప్పందాలు చేసుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన విద్యార్థి సంఘం నాయకులు

ముగిసిన బుగ్గరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కాల్వబుగ్గలో ఆరు రోజుల పాటు జరిగిన బుగ్గ రామేశ్వస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఈనెల 14న కాల్వ గ్రామం నుంచి తీసుకొచ్చిన భ్రమరాంబాదేవి, బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తిరిగి కాల్వకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అర్చకులు పూజలు నిర్వహించి పల్లకిలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, నందికోల సేవల మధ్య స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా కాల్వకు చేరుకున్నారు. కర్నూలు గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్సై సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నారాయణ, ఈవో మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులను పల్లకిలో కాల్వకు తీసుకెళ్తున్న భక్తులు

అలరించిన బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాల్వబుగ్గలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు అలరించాయి. తితిదే పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పోటీలను ప్రారంభించారు. 20 జతల వృషభాలు తలపడిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన శివకృష్ణచౌదరి ఎద్దులు రూ.1.50 లక్షల ప్రథమ బహుమతి గెలుపొందాయి. గుంటూరు జిల్లా రైతు కోపూరి శ్రీనివాసరావు ఎద్దులు రూ.1.30 లక్షల ద్వితీయ, నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం రైతు అక్షరరెడ్డి వృషభాలు రూ.1.10 లక్షల తృతీయ, నంద్యాల జిల్లా పిన్నాపురం రైతు వెంకటకృష్ణయ్య, అనంతపురం జిల్లా నారాయణాపురానికి చెందిన షేక్ మహమ్మద్ ఫరీద్ వృషభాలు రూ.80 వేల చొప్పున నాలుగు, ఐదో బహుమతులు సాధించాయి. వాటి యజమానులకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నారాయణ, ఈవో మద్దిలేటి, హుసేనాపురం సొసైటీ అధ్యక్షుడు సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మల్లెల రాజశేఖర్

విలువలతో కూడిన విద్య నేర్పించండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నేర్పించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. నగరంలోని కృష్ణానగర్‌లో ఉన్న సర్వేపల్లి విద్యా సంస్థలో గురువారం ఫుడ్ కార్నివాల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటలు, ఫుడ్ కార్నివాల్‌లో పాల్గొనేలా చూడటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎంపీ ఫుడ్ స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత పి.శేషన్న, ప్రధానోపాధ్యాయిని కేపీ అరుణశ్రీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.దీక్షిత్, 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుడ్ కార్నివాల్‌ను సందర్శిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కర్నూలు జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుండ్రేవుల బాధ్యత తనదేనని చెప్పిన ముఖ్యమంత్రి బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించలేదని విమర్శించారు. స్థానిక కేకే భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులు రూ.1450 కోట్లు అడిగితే ప్రభుత్వం రూ.400 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో భాగమైన తెదేపా వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలను సాధించడంలో విఫలమైందన్నారు. జిల్లా అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూ బడ్జెట్‌లో సవరణలు చేయాలన్న డిమాండ్‌తో ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించాలని తీర్మానించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు జగన్నాథం, అంజిబాబు, రామకృష్ణ, జంధ్యాల రఘుబాబు, ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలోని గుత్తి పెట్రోలు బంకు సమీపంలో రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడు (25) ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. ఉదయం పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన రైల్వే కీమెన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్నూలు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలేవీ లభించకపోవడంతో మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

నన్నూరు (ఓర్వకల్లు), న్యూస్‌టుడే : నన్నూరు వద్ద గురువారం జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీపురానికి చెందిన రాముడు, శేఖర్ ద్విచక్ర వాహనంపై నంద్యాల వైపు వెళ్తూ నన్నూరు సబ్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందపడినట్లు పోలీసులు వెల్లడించారు.

బైక్ చోరీచేస్తూ.. దొరికిపోయిన దొంగ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగర శివారులోని నంద్యాల చెక్‌పోస్టు సమీప మారుతీనగర్ కాలనీలో ఓ ద్విచక్ర వాహనాల దొంగ దొరికిపోయాడు. గురువారం ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరిస్తుండగా స్థానికులు అప్రమత్తమై పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

కొంగనపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : కొంగనపాడు, దొడ్డిపాడు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను గృహనిర్మాణ శాఖ పీడీ చిరంజీవి గురువారం పరిశీలించారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. డీఈఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ : కర్నూలు వైద్య కళాశాలకు పూర్వ వైద్య విద్యార్థుల క్రికెట్ అసోసియేషన్, డా.మోహన్‌రెడ్డి, డా.రాజయ్య, డా.శారద గురువారం రూ.85 వేల విలువ చేసే గడ్డి కత్తిరించే యంత్రాన్ని అందించారు. కళాశాల మైదానంలో గడ్డి కత్తిరించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టినరసమ్మ పూర్వ విద్యార్థులను అభినందించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై ఆర్ఎస్ఎస్ దాడులను ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్, నగర కార్యదర్శి అంజి, ఆర్య పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ దాడులను నిరసిస్తూ స్థానిక సుందరయ్య కూడలి వద్ద గురువారం వారు ఆందోళన చేపట్టారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : పత్తి సేకరణలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశులు, రామకృష్ణ డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 250 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్ హుస్సేన్, షరీఫ్ తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతూ నిర్ణయిం తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ, మునెప్ప కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటూ గురువారం పీడీకి వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : సూరత్- చెన్నై జాతీయ రహదారికి భూములు కోల్పోయిన బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం డీఆర్వోకు వినతిపత్రం సమర్పించినట్లు రైతు సంఘం ప్రతినిధులు జగన్నాథం, శ్రీనివాసరావు తెలిపారు.

రక్షణ లేక.. భయపెడుతున్న నియంత్రిక

పరిశీలన

కర్నూలు విద్యుత్తు డివిజన్‌లో మొత్తం నియంత్రికలు : 15,070
త్రీఫేజ్ నియంత్రికలు : 13,020
సింగిల్ ఫేజ్ నియంత్రికలు : 2,050

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన, వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా మారాయి. చాలా వాటి చుట్టూ రక్షణ కంచెలు కూడా లేవు. వీటిని ఏర్పాటు చేసిన దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. కొన్నిచోట్ల వీటి విద్యుత్తు తీగలు, ఫీజు క్యారియర్లు వాహనదారులకు తగిలేలా రోడ్డుపైకి ప్రమాదకరంగా చొచ్చుకొచ్చాయి. నిర్వహణ లోపం కారణంగా నియంత్రికల నుంచి తరచూ నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయని, శబ్దాలు వస్తున్నాయని చుట్టుపక్కల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో.. వీటివల్ల ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి నిర్వహణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలాజీనగర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ నియంత్రిక చుట్టూ ఏర్పాటు చేసిన కంచె మాయమైంది. దీనిచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి.

దారి కాసిన ప్రమాదాలు

పలు కాలనీల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను రహదారుల పక్కనే ఏర్పాటు చేశారు. కొన్ని చాలా తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. ఆయా రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా నియంత్రికలను ఢీకొని ప్రమాదాల బారినపడే ఆస్కారముంది. వీటిని పక్కకు మార్చాలని.. లేదా రక్షణ గోడలైనా నిర్మించాలని ప్రజలు కోరుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు.

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టుపక్కల పిచ్చిమొక్కలు, గడ్డి పెరుగుతోంది. పశువులు గడ్డి మేసేందుకు వెళ్లి కరెంటు తీగలు తగిలి మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగినా నియంత్రణ చర్యలు కరవయ్యాయి.

ఇది సంతోష్‌నగర్ 5వ రోడ్డులో ఉంది. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రోడ్డుపైనే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన IV ADDL. DIST JUDGE: KURNOOL
E.P. No. 163/2017 in A.A. No. 811/2010
Between:
M/s Shriram Transport Finance Co Ltd,. Rep. by Authorised GPA Holder B.Hari Krishna Chary .. **Claimant / Decree Holder**
-Versus-
Om Sai Constructions Its Managing partner A.B.V. Suresh and another .. **Respondents / Judgment Debtors**
JDr No. 2
A.Vinod Kumar S/o A.Shankaraiah , H. No. Flat. No. G-2, S.L.V Paradise, Krishna Reddy Nagar, Kurnool.
బహిరంగ వేలం ప్రకటన
సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పై EP నెంబరు పిటిషన్లో కనబరచిన పిటిషన్దారు / డిక్రీ హోల్డర్ ఈ క్రింద కనబరచిన షెడ్యూలు ఆస్తిని తమ యొక్క బాకీ మొత్తమును రాబట్టుకొనుటకు గాను పై పిటిషన్ IV ADDL. DIST. JUDGE కోర్టు నందు దాఖలు చేసి సదరు పిటిషన్ దాఖలా ఆస్తిని కోర్టు వారి ద్వారా వేలమునకు తీసుకొనివచ్చుటకు ఆర్డరు పొందియున్నారు. సదరు కోర్టువారి వేలము 05-03-2026 తేదీన కర్నూలు IV ADDL. DIST. JUDGE కోర్టు ఆవరణములో పై తేదీనాడు బహిరంగ వేలము ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖల ఆస్తిని వేలము వేయబడును. ఎవరైనా సదరు వేలం నందు పాల్గొని క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని కొనుగోలు చేయవచ్చునని తెలియజేయడమైనది. కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రకటించడమైనది.
Schedule- J.Dr. No.2 Property Details (A.VINOD KUMAR)
The flat No G2 (Ground Floor) admeasuring built up area which includes common area with undivided share in the schedule land to the extent of 920.22 Sq. Yards and reserved parking space for one car on the still floor in the residential complex named S.L.V Paradise forming part of plot Nos 66 & 70, 67 & 69 and northern part of Plot No.68 admeasuring 8120 Sft or 90.22 Sq Yards or 54.64 Sq Mtrs, in survey No 307/2, 431/A, 433/2 (Lay out approval No.L. Dis no. 1/72) at Kallur Revenue Village, Situated at Ganesh Nagar in 76th ward at Kurnool Municipal Corporation Near D.No.76/116-9, within the jurisdiction of Registration Sub District of Kallur and Registration District of Kurnool and bounded by
East: 25 feet wide road, **North:** 33 feet wide road
West: 33 feet wide road, **South:** Remaining part in plot No.68
Measurements: East to west at north side is 70 feets (21.3360 Mtrs), East to West at South side 70 feets (21.3360 mts) North to south East side 116 feets (35.3568 mts), North to south West side 116 feets (35.3568 mts). Total extent 8120 Sq.Fts or 902.22 Yards or 754.64 Mts,
Boundaries of the Flat No.G-2 (Ground Floor) in S.L.V Paradise, East: Open to sky, **North:** Corridor, **West:** Open to sky and lift Block , **South:** Open sky, Measurements of the flat No.G-2 (Ground Floor) in SLV Paradise. East to West 20 Feets 6 inches, North to South: 45 Feets Total Extent 922.5 Sq Feets + 177.5 Sq Feets Common Area,
Total built up area 1100 Sq feets
DHR Value: Rs.15,83,000/- Ameena Value: Rs.18,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Hearing Date: 05-03-2026
C.Lokeswaraiah & K.Narasimhulu,
D.Hr. తరపు న్యాయవాదులు, కర్నూలు

(c) eenadu

ఈనాడు మార్కాపురం

శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 5

రూ.58 వేలు పలికిన ఏడాది వయసున్న పెయ్య

ఒంగోలుకే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మేలు జాతి పశువుల గురించి ఎంత చెప్పినా తక్కువే. వీటికి నానాటికి ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. వీటిని వేలం పాటలో దక్కించుకునేందుకు ఇతర జిల్లాలు, సుదూర ప్రాంతాల నుంచి రైతులు తరలివస్తున్నారు. ఎంత ధర వెచ్చించి అయినా కొనుగోలు చేసేందుకు వెనుకాడడం లేదు. - ఈనాడు, ఒంగోలు

ఒంగోలు గిత్త... భలే సత్తా!

- కొనుగోలుకు వేలంలో పోటాపోటీ
- ఇతర జిల్లాల నుంచి రైతుల రాక

చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రంలో నాణ్యమైన ఒంగోలు జాతి పశువులను ఉత్పత్తి చేస్తున్నారు. ఏటా ఇక్కడ పుట్టే దూడలను కొన్నింటిని ఉంచుకుని మిగిలినవి వేలంలో రైతులకు విక్రయిస్తారు. తాజాగా గురువారం పశుసంవర్ధకశాఖ డీడీ జయచంద్ర, జేడీఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో రైతులు పోటీపడి కొనుగోలు చేశారు. ఏడాది వయసున్న పెయ్య రూ.58 వేలు ధర పలికింది. సాధారణంగా ఇంతే వయసున్న ఇతర రకం ఆవు రూ.25 వేలే ఉంటుంది. ఇది మేలుజాతి కావడంతో వేలంలో పోటీపడి మరీ దక్కించుకున్నారు. గతంలో కోడెలను మాత్రమే కొనేందుకు మొగ్గు చూపేవారు. ఇప్పుడు వాటితో సమానంగా పెయ్యలకు గిరాకీ పెరిగింది. హైదరాబాద్‌లో గోశాల నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రత్యేకించి ఒంగోలు బ్రీడ్‌పై మక్కువతో పశువులను వేలంలో దక్కించుకుని తీసుకెళ్లారు. గొనసపూడికి చెందిన మహిళా రైతు మల్లేశ్వరి మాట్లాడుతూ తాము ఒంగోలు జాతి ఆవులను పెంచాలనే కోరికతో ఇక్కడికొచ్చామని, వేలంలో ఒకటి మాత్రమే దక్కించుకోగలిగామన్నారు. ఇదే మాదిరి 21 పెయ్య దూడలు, 33 కోడెలు, 5 ఆవులను పోటీపడి కొనుగోలు చేయడంతో మంచి ధర దక్కింది.

పెరిగిన ఆదాయం

గతంలో వేలంపై అవగాహన లేకపోవడంతో పోటీ చాలా తక్కువ ఉండేది. వీటిని తీసుకెళ్లి ఆరు నెలల పాటు పెంచితే రెండు రెట్లు డబ్బులిస్తామని ఆఫర్లు వస్తున్నాయి. ఆ నోటా ఈ నోటా ఒంగోలు జాతి పశువుల విశిష్టత తెలియడంతో రెట్టింపు ధరలకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం 59 పశువులకు రూ. 5.78 లక్షలు ధర నిర్ణయించగా, వేలంలో రూ.12.34 లక్షల ఆదాయం లభించింది. దాదాపు 60 శాతం అదనంగా ఆదాయం వచ్చింది. గతేడాది జులైలో 46 పశువులకు నిర్వహించిన వేలంలో రూ.9.84 లక్షల ఆదాయం వచ్చింది. రూ.5 లక్షల ధర నిర్ణయించగా, దాదాపు రెట్టింపు ఆదాయం సమకూరింది.

ఇదే ఈ జాతి గొప్పతనం

ఒంగోలు జాతి పశువులు బలిష్ఠంగా, ఎత్తుగా ఆకర్షణీయంగా ఉండడమే కాకుండా కోడెలు బరువులను అలవోకగా లాగుతాయి. ఎడ్ల పందేలకు కోడెలను కొనేవారు ఉన్నారు. ఆవులు పెంచేవారి సంఖ్య పెరగడం, మేలుజాతి పశువుల గురించి ప్రజలకు బాగా తెలియడం వంటి కారణాలతో వీటికి పోటీ బాగా పెరిగింది. వీటిని కొనేవారిలో 80 శాతం మంది రైతులే ఉంటున్నారు. మిగిలినవారు కోడెలను కొని వాటిని దున్నడానికి శిక్షణనిచ్చి రైతులకు అమ్ముతున్నారు.

-డాక్టరు రవి, పర్యవేక్షకులు, చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం

బృంగీశ్వర వాహనంపై మహేశ్వరుడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం రాత్రి బృంగీశ్వర వాహనంపై మహేశ్వర అలంకరణలో మార్కండేయ స్వామి పురవీధుల్లో విహరించారు. నగరోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పొదిలి, న్యూస్‌టుడే: రంజాన్ నెల ప్రారంభం కావడంతో గురువారం నుంచి ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీక్షాపరులు మసీదుల్లో సహరీ, ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. మసీదుల్లోని మినార్లను విద్యుద్దీపాలతో అలంకరించారు.

పొదిలి మసీదులో ఉపవాస దీక్షలు విరమిస్తున్న ముస్లిం సోదరులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్
శుక్రవారం సా.6-21

సహరీ
శనివారం ఉ.5-12

నేడు తెదేపా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించనున్న సమావేశంలోని అజెండా అంశాల దృష్ట్యా తాడేపల్లిలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని తెదేపా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు.

హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తెదేపా యెర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభించేందుకు ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తెదేపా యెర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. దోర్నాల మండలం గంటవాని పల్లె సమీపంలోని ఫీడరు కాలువ, దాని సమీపంలో హెలీప్యాడ్, బహిరంగ సభ వేదిక స్థలంతోపాటు రెండో సొరంగం సమీపంలోని హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. హెలీప్యాడ్, బహిరంగ సభకు ఏ ప్రదేశాలు అనుకూలంగా ఉంటాయనేదానిపై చర్చించారు. వీరి వెంట జేసీ శ్రీనివాసులు, వెలిగొండ జలాశయం ఎస్‌ఈ అబూతాలీం, డీఎస్పీ నాగరాజు, రెవెన్యూ, ఇంజినీరింగ్‌శాఖల అధికారులు ఉన్నారు.

భారీ రంధ్రం... జరభద్రం!

ఒంగోలు- కర్నూలు రహదారిలో సంతనూతలపాడు వద్ద ఏడాది కిందట కల్వర్టు ఓవైపు కుంగిపోవడంతో భారీ గుంత పడింది. రోడ్డు కుంగిపోతుండడంతో ఐరన్ బీమ్స్ దన్నుగా పెట్టారు. రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

-ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, ఎస్‌ఎన్‌పాడు

కొనుగోలు లేక గగ్గోలు!

- శనగ, కంది కేంద్రాలకు రైతుల వేడుకోలు
- దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టం

కంది దిగుబడులను జల్లెడ పడుతున్న కూలీలు

న్యూస్‌టుడే, మార్కాపురం

జిల్లాలో శనగ, కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. శనగ, కంది పంటలు చేతికందడంతో రైతులు తమ ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. కొంతమంది రైతులు ఇప్పటికే సాగుకు పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చడానికి తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. జిల్లా పరిధిలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఖరీఫ్, రబీలలో కలిపి శనగ 12,791 హెక్టార్లలో, కంది 50,775 హెక్టార్లల్లో సాగైంది. ఈ ఏడాది శనగకు ఎండు తెగులు, వాతావరణ మార్పులతో ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు, కంది 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది శనగ దిగుబడి 1.20 లక్షలు, కంది 5.80 లక్షల క్వింటాళ్ల దిగుబడి ఉత్పత్తి అయినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం ఈ ఏడాది శనగ క్వింటాకు రూ.5,875 మద్దతు ధర ప్రకటించగా, దళారులు రూ.5,100కు కొనుగోలు చేస్తున్నారు. కందికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 8 వేలు కాగా, దళారులు రూ.7,200 వరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు క్వింటాకు రూ.వెయ్యి వరకు నష్టపోతున్నారు.

రెండు రోజుల్లో ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో రెండు రోజుల్లో శనగ, కంది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు వారి వద్ద ఎన్ని క్వింటాళ్ల శనగ, కందులు ఉన్నవి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

- బాలాజీనాయక్, ఇన్‌ఛార్జి డీఏవో

విద్యార్థి మరణంపై వీడని మిస్టరీ

- సింగరాయకొండ వసతిగృహంలో అనుమానాస్పద మృతి
- విచారణలో అడుగడుగునా యంత్రాంగం నిర్లక్ష్యం

ఈనాడు, ఒంగోలు

'మా కుమారుడి మృతి వెనుక వార్డెన్ పాత్రపై అనుమానం ఉంది. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిపించండి.' అని బాధిత కుటుంబం కలెక్టర్ రాజాబాబును కోరింది. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఈవో, ఐసీడీఎస్ పీడీ, సింగరాయకొండ తహసీల్దారుతో కమిటీ వేసి నాలుగు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది జరిగి నాలుగు రోజులవుతున్నా కమిటీ సభ్యులు సింగరాయకొండలో అడుగుపెట్టలేదు.. వసతిగృహంలో విచారణ చేపట్టలేదు. విద్యార్థి మృతిచెందిన క్రమంలో పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు చేపట్టడంతోపాటు వసతిగృహంలో విచారణ జరిపితే ఆధారాలతో అది హత్య లేక ఆత్మహత్యా అన్నది తెలుతుంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 14వ తేదీన సింగరాయకొండలోని చైతన్య శిక్షణ కేంద్రం, వసతి గృహంలోని మరుగుదొడ్డిలో విద్యార్థి మృతిపై మిస్టరీ కొనసాగుతోంది.

ముందే సమాచారమివ్వలేదు...

కనిగిరికి చెందిన సయ్యద్ ఆలీ కుమారుడు సయ్యద్ తౌషిక్ నవోదయ ప్రవేశ పరీక్షకు సింగరాయకొండలో ఏడాదిగా శిక్షణ పొందుతున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం అయిదు గంటల సమయంలో తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం ఆరు గంటలకు శిక్షణ కేంద్రం నిర్వాహకులు తౌషిక్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కుమారుడు టవల్‌తో బాత్రూంలో ఉరేసుకుని చనిపోయినట్లు సమాచారమిచ్చారు. బాత్రూంలో గడియ పెట్టుకుని ఉరేసుకోగా, తాము లోపలికి దిగి తలుపు తీసి వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించామని, అక్కడ నుంచి కందుకూరు తీసుకెళ్లామని చెప్పారు. విద్యార్థిని కందుకూరు తీసుకెళ్లే వరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు సంతోషంగా మాట్లాడడని, ఫోన్ మాట్లాడిన అనంతరం వార్డెనే తమ కుమారుడిని చంపేసి ఉంటాడని, దర్యాప్తు సక్రమంగా చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. తమకు స్థానిక పోలీసులపై నమ్మకం లేదని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ముగ్గురు అధికారులతో కమిటీ వేసినా వారు కాల యాపన చేస్తూ వస్తున్నారు. దర్యాప్తు సక్రమంగా నిర్వహించి తమ కుమారుడి మృతికి కారణమైనవారిని శిక్షించాలని తౌషిక్ తల్లిదండ్రులు కోరుతున్నారు. వసతి గృహం నుంచి బాలుడిని భుజంపై మోసుకుని బయటకు తీసుకొస్తున్న సీసీ కెమెరా దృశ్యాలు తాజాగా వైరల్ అవుతున్నాయి.

కందుకూరు పోలీసుల దర్యాప్తు

సింగరాయకొండ పోలీసులు పక్షపాతం చూపిస్తున్నారని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించడంతో దర్యాప్తును కందుకూరు పోలీసులకు అప్పగించారు. వీరు ఇప్పటికే వసతి గృహం, బాలుడిని తీసుకెళ్లిన ఆసుపత్రులకు వెళ్లి విచారించారు. శిక్షణ కేంద్రానికి సంబంధించినవారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఎస్ఎల్ నివేదికల ఆధారంగా మృతికి గల కారణాలు వెల్లడవుతాయని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రుధిరం.. దూరం!

- మార్కాపురం జీజీహెచ్‌లో నిండుకున్న నిల్వలు
- వైద్యశాలలకు అందక రోగులకు తప్పని పాట్లు

న్యూస్‌టుడే, మార్కాపురం

జిల్లా కేంద్రమైన మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో రక్త నిల్వలు నిండుకున్నాయి. ఇక్కడ రక్త నిల్వ కేంద్రంలోని 4 శీతల యంత్రాలు ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో జిల్లాలోని దర్శి, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దోర్నాల, కంభం, పొదిలి ప్రభుత్వ వైద్యశాలలకు రక్త నిల్వల పంపిణీ నిలిచిపోయింది. ప్రతి నెల కేంద్రం ద్వారా 150 మందికి అవసరమైన రక్తం పంపిణీ జరిగేదని, సకాలంలో రక్తం అందుబాటులోకి రాకపోవడంతో నిల్వలు తగ్గిపోయినట్లు కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఇక్కడ 600 రక్తం యూనిట్లు (ప్యాకెట్లు) గానూ ప్రస్తుతం ఒక్క శీతల యంత్రంలో 14 ప్యాకెట్ల రక్త నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. రానున్న వేసవి నేపథ్యంలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు రక్తదాన శిబిరాలు జరగకపోవడంతో నిల్వ నిండుకుంటున్నాయని చెబుతున్నారు. మార్కా పురం ప్రాంతంలోని దాతలు ఎవరైనా ముందుకొచ్చి రక్తదానం చేయడంతో పాటు యువకులు, స్వచ్ఛంద సంస్థలు శిబిరాలు ఏర్పాటు చేస్తేనే రక్త నిల్వలు తగినన్ని అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ రక్త నిల్వ కేంద్రంలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. కేంద్రంలో వైద్యునితోపాటు అయిదుగురు ల్యాబ్ టెక్నిషియన్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇతర వైద్యసిబ్బంది పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. దీంతో వైద్య శిబిరాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మార్కాపురం జీజీహెచ్‌లోని రక్త నిల్వ కేంద్రంలో ఖాళీగా శీతల యంత్రాలు

నేతలతో లోకేశ్ ఆత్మీయ సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉండవల్లిలో గురువారం మంత్రి నారా లోకేశ్ ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆడపడుచులకు మంగళగిరి పట్టు చీరలు అందించారు. కార్యక్రమంలో మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, బీఎన్.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష

- అక్రమాలకు తావులేకుండా కొత్త విధానం
- ఉపాధ్యాయ పోస్టులకు 1,937 మంది పోటీ

ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో విద్యాశాఖ నూతన విధానం అవలంబిస్తోంది. మాన్యువల్ పరీక్షల స్థానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనుంది. గతంలో డీఈవో ఆధ్వర్యంలో నియమించిన కమిటీ ఆయా పాఠశాలల్లోనే దరఖాస్తుదారులకు పరీక్ష నిర్వహించి పోస్టులకు ఎంపిక చేసేవారు. దీంతో యాజమాన్యాలు ముందస్తు ఒప్పందాలు చేసుకుని వారు అనుకున్నవారికి ఉద్యోగాలిస్తున్నారని, ప్రతిభ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదులందడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పులు చేసింది. పోస్టుల భర్తీ చేయాలని కోరుతూ కొన్ని ఎయిడెడ్ యాజమాన్యాలు గతంలో కోర్టును ఆశ్రయించగా భర్తీకి అవకాశం లభించింది. కొత్తగా ప్రవేశ పెట్టిన పరీక్షల విధానాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. అప్పట్లో ఉన్న జీవో ప్రకారమే పరీక్ష నిర్వహించాలని కోర్టును ఆశ్రయించాయి. విద్యాశాఖ మాత్రం పారదర్శకతకు కంప్యూటర్ ఆధారిత విధానం కొనసాగింపునకు నిర్ణయించింది. తాజాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు ఎయిడెడ్ పాఠశాలల్లో 14 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల 26వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించగా, మొత్తం 1,937 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టులకు సరాసరిన 138 మంది పోటీ పడుతున్నారు. ఒంగోలు నగరంలోని ఏబీఎం ఉన్నతపాఠశాల, కనిగిరిలోని చిత్తరంజన్ అరబిక్ పాఠశాల, చీరాలలోని ఎమ్మెస్ ఉన్నత పాఠశాల, ముప్పవరంలోని పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలోని పోస్టులకు నియామకాలు జరగనున్నాయి. ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు సీబీటీ విధానంలో పరీక్ష జరుగుతుందని డీఈవో రేణుక ప్రకటించారు. హాల్ టిక్కెట్లు పొందిన వారికి ఒంగోలు నగరంలోని మామిడిపాలెం రోడ్డులోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియా కళాశాల, వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వీరికిచ్చిన స్లాట్ ప్రకారం అభ్యర్థులు ఆయా తేదీల్లో ఆయా కేంద్రాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

పామూరు ఆర్టీసీ బస్టాండులో నిలిపిన ఈ-ఆటోలు

ఈ-ఆటోలు ఇక్కడే ఎక్కువ

- పామూరులో 400కుపైగా ప్రయాణికులకు సేవలు

పామూరు మేజరు పంచాయతీ కేంద్రంలో 400కుపైగా ఈ-ఆటోలుండడం విశేషం. ఇక్కడ కోడూరి ప్రభాకర్ తొలి ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేశారు. అనంతరం పలువురు కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఇక్కడ అత్యధికంగా 400 ఆటోలు కొనుగోలు చేయడంతో హైదరాబాద్ నుంచి రెండు కంపెనీల ఉన్నతాధికారులు ఇక్కడకొచ్చి ఆటో యజమానులతో మాట్లాడి ఆటోలు తిరుగుతున్న తీరును పరిశీలించారు. డీజిల్ ఆటోల కంటే ఈ-ఆటోల ధరలు తక్కువగా ఉండడం, ప్రభుత్వ రాయితీలిస్తుండడం, వాహనం ఛార్జింగ్‌తో నడుస్తుండడం, ఛార్జింగ్‌కి విద్యుత్తు బిల్లులు తక్కువ మొత్తంలోనే వస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు చోదకులు ఆసక్తి చూపుతున్నారు. పామూరు వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం సమీప మండలాల నుంచి వేలాది మంది వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుండడంతో వీటికి బాగా గిరాకీ పెరిగింది. ఎలక్ట్రిక్ ఆటోలకు విద్యుత్తు ఛార్జింగ్ ఖర్చు తక్కువగా ఉంటుందని, వాహనం నిర్వహణ ఉండదని, దీంతో ఆదాయం కనిపిస్తోందని చోదకులు చెబుతున్నారు. ఇతర ఆటోలతో పోల్చుకుంటే ప్రయాణికులను తక్కువ ఛార్జీలు, బాడుగలకు వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నామని, ప్రయాణికులకు సైతం గిట్టుబాటు అవుతుండడంతో ఆదరిస్తున్నారని ఆటో చోదకులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, సీఎస్‌పురం, పామూరు

జలం... గరళం!

- మరమ్మతులకు నోచని ఫిల్టర్ బెడ్లు
- కాగితాలకే ప్రతిపాదనలు పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్థానికంగా ఉండే చెరువులకు వర్షం లేదా సాగర్ కాలువ ద్వారా చేరిన నీటిని యథేచ్ఛగా సరఫరా చేస్తుండడంతో కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛమైన నీరందిస్తాం.. అందుకు ఎంత మొత్తంలోనైనా నిధులు కేటాయిస్తాం.. అంటూ తరుచుగా ప్రజాప్రతినిధులు చెప్పే మాటలవి. ప్రభుత్వాలు మారుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాల ఫిల్టర్‌బెడ్లు ఏళ్ల తరబడి పనిచేయడంలేదు. కనీసం వాటి మరమ్మతులు పట్టించుకోకపోవడంతో ప్రజలు కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, కలెక్టరేట్

పనులకు మోక్షమెప్పుడో?

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి సంబంధించి 137 తాగునీటి చెరువులున్నాయి. సురక్షిత నీరందించాలనే ఉద్దేశంతో గతంలో ఆయా చెరువులతోపాటు వాటర్ ట్యాంకుల వద్ద మొత్తం 230 ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ఇవి మరమ్మతులకు గురైతే కనీసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉండడం, అంత మొత్తంలో పంచాయతీలకు నిధుల లేని కారణంగా వాటి నిర్వహణకు సంబంధించి పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోవడంలేదు. ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినప్పుడు బెడ్‌లోని ఇసుక మార్చుకోవాలి, లేకుంటే దాన్ని శుభ్రం చేసుకోవాలి. అందుకు కూడా చిన్న పంచాయతీల్లో నిధుల్లేకపోవడం సమస్యగా మారింది. గత వైకాపా ప్రభుతంలో నిధుల మంజూరు లేకపోవడంతో ఏళ్ల తరబడి మరమ్మతుల ఊసేలేదు. నాలుగేళ్ల కిందట ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లాలోని 68 తాగునీటి పథకాలకు చెందిన ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతుల నిమిత్తం రూ.3.92 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'జల జీవన్ మిషన్' పథకం కింద ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదించినప్పటికీ ఇంత వరకు చర్యల్లేకపోవడం గమనార్హం.

సంతనూతలపాడు మండలం మంగమూరులో మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్

ట్యాంకుల శుభ్రతపైనా నిర్లక్ష్యం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లో తాగునీరందించే ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే క్లోరినేషన్ చేయాలి. ఆ ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, తిరిగి ఎప్పుడు శుభ్రం చేస్తారన్న తేదీని రాయాల్సి ఉంటుంది. నిబంధనలు 95 శాతం గ్రామాల్లో ఎక్కడా అమలు కావడంలేదు. చాలా చోట్ల ఎప్పుడు శుభ్రం చేస్తున్నారో కూడా సరిగ్గా తెలియని పరిస్థితి నెలకొంది. శుభ్రం చేసినా క్లోరినేషన్ చేయడంలేదు. దీనికితోడు తాగునీటి సరఫరా పైపు లైన్లు మరమ్మతులకు గురైనా సకాలంలో పట్టించుకోవడంలేదు. వీటి వెంబడి మురుగు కాలువలు ఉండడంతో పైపు లైన్ లీకుల వద్ద తాగునీరు కలుషితమవుతోంది. ట్యాంకులను శుభ్రం చేయించడం దగ్గర నుంచి పైపు లైన్ లీకేజీల నివారణ, మరమ్మతుల్లో తీవ్ర అలసత్వం కనిపిస్తోంది.

అటవీ ప్రాంతంలో మంటలు ఆర్పుతున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలకు చెక్

- ఉపగ్రహ సమాచారంతో అడ్డుకట్ట
- నల్లమల సంరక్షణకు ప్రయత్నాలు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

జీవవైవిధ్యానికి నెలవైన నల్లమల పర్యావరణ సమతుల్యతలో ప్రధాన భూమిక పోషిస్తోంది. వేసవిలో వన్యప్రాణులు అగ్నిప్రమాదాల బారిన పడకుండా అటవీశాఖ అవసరమైన చర్యలు చేపడుతోంది. ఇందుకోసం సాంకేతిక సాయం తీసుకుంటూ అటవీ జీవాల సంరక్షణకు కృషి చేస్తోంది.

ఉపగ్రహాల సాయంతో...: ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహాల ద్వారా అగ్నిప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని గుర్తిస్తుంది. సమాచారాన్ని క్షేత్రస్థాయి అధికారులకు వెంటనే చేరవేస్తుంది. వారు వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న ప్రదేశానికి హుటాహుటిన తరలివెళ్లి మంటలు విస్తరించకుండా ఆర్పివేస్తారు. ఆయా చిత్రాలను ఫారెస్టు ఆఫ్ ఇండియాకు పంపుతారు.

నిరంతర పర్యవేక్షణ: జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు అటవీ డివిజన్‌ల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా అటవీ రేంజర్ల పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు విస్తరించకుండా రహదారికిరువైపులా 20 మీటర్ల వెడల్పుతో గడ్డి, చెట్ల కొమ్మలను తొలగించి ఫ్యూలైన్లు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని రహదారుల్లో ఫైర్ లైన్లు వేశారు. దట్టమైన అరణ్యంలోని వాచ్‌టవర్లపై నుంచి సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించే ప్రదేశాన్ని గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. సమీప గ్రామాలు, గూడాల్లో కళాజాతల ద్వారా అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనలు అతిక్రమిస్తే తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

(c) eenadu

కోనేరులో నీటిని నింపి మెట్లకు వేసిన రంగులు

21న నిర్మమహేశ్వరుని తెప్పోత్సవం

❖ ముస్తాబైన కోనేరు

న్యూస్‌టుడే, పొదిలి: పొదిలిలోని శ్రీ పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు (ఈనెల 21న) నిర్వహించే తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, ధర్మకర్తలు, ఈవో నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో కోనేరులో పాతనీటిని తోడి కొత్తనీటితో నింపుతున్నారు. దశాబ్దాలుగా పాడుబడిన కోనేరును మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో గత ఏడాది ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మరికొంతమంది పెద్దల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. మెట్లకు రంగులద్దారు. భక్తులు కోనేరులో పడకుండా చుట్టూ ఇనుప కంచె వేయించారు. ఈనెల 21 సాయంత్రం ఏడు గంటలకు తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే పొదిలి సీఐ ఎం.రాజేష్‌కుమార్, ఎస్సై ఎస్.రాజేష్‌లు కోనేరు ప్రాంతాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిణిగా నాగలక్ష్మి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిణిగా **టి.వి.నాగలక్ష్మి** గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కందుకూరులో ఉప రవాణశాఖ అధికారిగా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిగా నియమించడంతో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణం చేసి ప్రమాదాలకు కారణం అయితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అధికారులు శాలువాలు, పూలమాలలతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జి.భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్మిస్తున్న రహదారుల పనులను పంచాయతీరాజ్ డివిజినల్ ఇంజినీరు క్రిష్ణ మోహన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. తదుపరి ప్రధాన రహదారిలో నిర్మించాల్సిన సైడ్ కాలువలు, రహదారుల ప్రాంతాలను ఆయన పరిశీలించి కొలతలు తీయించారు. త్వరగా సర్వేయర్‌తో మార్కింగ్ చేసి సిద్ధంగా ఉంచాలని గ్రామ కార్యదర్శి నూరుల్లాకు సూచించారు. గతంలో నిర్మించిన అంతర్గత రహదారులను కలిపి వెళ్లేలా ప్రధాన రహదారిని నిర్మించాలని ఏఈ రవికి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవ్య, ఇతర సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల తెదేపా అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారి, సైడ్ కాలువల కొలతలు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ కృష్ణమోహన్

వసతులపై ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్ష

మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి సత్యనారాయణ

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల డిపో మేనేజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్టాండ్‌లోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో అన్ని డిపోల్లో ప్రయాణికుల వసతుల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సుల నిర్వహణ పై రివ్యూ నిర్వహించారు. డిపోలలో పాజిటివ్ పర్సెప్షన్ అభివృద్ధి చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో డిపో మేనేజర్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

మార్కాపురం: మార్కాపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల అన్నారు. బుధవారం రాత్రి నంద్యాల జిల్లా నుంచి పల్నాడు జిల్లాకు వెళ్లేందుకు బయలుదేరిన షర్మిల మార్గమధ్యలో మార్కాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని ఆవరణలో తన వాహనంలో బస చేశారు. గురువారం ఉదయం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు జావెద్ అన్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనంగా పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై వారు షర్మిలకు వివరించారు. అంతేకాకుండా నూతనంగా ఏర్పడిన జిల్లాలో ప్రజా సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి విన్నవించడానికి సహకరించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయపథం వైపు నడిపించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం ఆలయాల హుండీ ఆదాయం రూ.31.56 లక్షలు

కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం గ్రామీణం: త్రిపురాంతకం ఆలయాల హుండీ ద్వారా రూ. 31,56,212 ఆదాయం లభించినట్లు ఈవో డి.అనిల్ కుమార్ తెలిపారు. ఉభయ ఆలయాలకు 3 నెలల 10 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలను బాలాత్రిపురసుందరీదేవి ఆలయ ప్రాంగణంలో గురువారం లెక్కించారు. త్రిపురాంతకేశ్వర స్వామి హుండీ రూ. 14,24,302, బాలాత్రిపుర సుందరీదేవి హుండీ కానుకలు రూ. 17,13,379, అన్నదానం హుండీ ద్వారా రూ. 18,531 లభించాయి. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో మార్కాపురం డివిజన్ పర్యవేక్షణాధికారి ఆర్‌కే చైతన్య, బాలాత్రిపురసుందరీదేవి సేవా సమితి, నర్సరావుపేట దుర్గాదేవి సమితి, యర్రగొండపాలెం భ్రమరాంబిక మల్లికార్జున సేవా సమితి సభ్యులు, ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చేతిరాత.. మారుస్తుంది తలరాత!

❖ చూడముచ్చటైన అక్షరాలతో మంచి మార్కులకు అవకాశం



సాధన పరీక్ష రాస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల, పొదిలి:

పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చేతిరాత కీలకం. అందమైన అక్షరాలతో జవాబులు రాస్తే మొదట పేపరు దిద్దే వారికి విద్యార్థిపై సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. మంచి మార్కులు వస్తాయి. విద్యార్థులు ఏడాదంతా చదివినా ఫలితం మాత్రం పరీక్ష రాసే సమయంపై ఆధారపడి ఉంటుంది. ఈనెల 23 నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షలకు 43 వేల మందికి పైగా, టెన్త్‌లో 28 వేల మందికి పైగా విద్యార్థులు హాజరు కాబోతున్నారు. ఈ క్రమంలో ఒత్తిడికి గురికాకుండా చక్కటి దస్తూరితో పరీక్షలు రాయాలని నిపుణులు చెబుతున్నారు.

సమయపాలన ముఖ్యం

రాత బాగుండాలని ఒక్క ప్రశ్నకే ఎక్కువ సమయం కేటాయించడం, గుండ్రంగా రాస్తూ కూర్చోవడం చేయకూడదు. అలాగే.. సమాధానం తెలుసుకదా అని చాలా మంది విద్యార్థులు ఇష్టం వచ్చినట్లు రాస్తూపోతారు. దీనివల్ల చేతిరాత సరిగ్గా రాదు. అంతేకాదు సమయం సరిపోక ఒత్తిడికి గురవుతారు. ఫలితంగా మిగతా ప్రశ్నలకు సమాధానాలను తోచిన విధంగా రాయాల్సి వస్తుంది. కాబట్టి సమయపాలన పాటిస్తూ ఒత్తిడికి గురికాకుండా రాయాలి.

పొందికగా ఉండాలి

❖ జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయులు మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రతి రోజు కొద్దిసేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.

❖ జవాబులు రాసేటప్పుడు ప్యాడ్‌పై వాలిపోకుండా సాధ్యమైనంత వరకు సక్రమంగా కూర్చుని రాయడం మంచిది.

❖ కొట్టివేతలు లేకుండా అక్షరాలు గుండ్రంగా రాయాలి. కొట్టివేయాల్సి వచ్చినప్పుడు చిన్నగీత పెడితే సరిపోతుంది.

❖ శీర్షికలు, ఉపశీర్షికల ఆవశ్యకతను గుర్తిస్తూ ముఖ్యమైన అంశాల కింద గీతలు ఉపయోగించాలి. సైన్సు పరీక్షలకైతే చేతిరాతతో పాటు ఆకట్టుకునేలా చిత్రపటాలు వేయాలి. ❖ పేజీకి పదహారు నుంచి ఇరవై పంక్తులు మించకుండా రాయాలి.

దోషాలు లేకుండా చూసుకోండి

ప్రశ్నకు తగిన సమాధానం స్పష్టంగా రాయాలి, అక్షర దోషాలు లేకుండా గుండ్రంగా చేతి రాత ఉంటే మంచి మార్కులు సాధించవచ్చు. అందుకోసం విద్యార్థులు ప్రత్యేక సాధన చేయాలి.

– మస్తాన్‌నాయక్, ఎంఈవో, దోర్నాల

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి నిర్మల జ్యోతి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహ పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి నిర్మల జ్యోతి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ సహాయ అధికారి కార్యాలయంలో జిల్లాలోని వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని, వాటిని అమలు పర్చాలన్నారు. విద్యార్థులకు తప్పకుండా మెనూ అమలు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క అధికారి ఐవీఆర్ కాల్స్‌కు అటెండ్ కావాలని సూచించారు. సమావేశంలో మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి బీసీ సంక్షేమ సహాయ అధికారులు ఎస్‌కె.ఎండి.కాశింవలీ, డి.హరిప్రసాద్, రవికుమార్, జిల్లాలోని సంక్షేమ వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులపై చిన్నచూపు తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలు రైతులపై చిన్న చూపు తగదని, వారికి అన్నదాత-సుఖీభవ పథకం వర్తింపజేయడంతోపాటు, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24న కౌలు రైతుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన దీక్షలపై ముద్రించిన గోడప్రతులను స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాస్తవ సాగుదారులను గుర్తించి, కార్డుల జారీతోపాటు, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వ చిన్నచూపు కారణంగానే పీఎం కిసాన్, అన్నదాత-సుఖీభవ పథకంతోపాటు; పంట రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పమిడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

గుత్తేదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

అద్దంకి, న్యూస్‌టుడే : ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినట్లయితే సంబంధిత గుత్తేదారుపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా గృహనిర్మాణ పథకం సంచాలకులు పి.శ్రీనివాసప్రసాద్ అన్నారు. అద్దంకి అర్బన్‌లోని వేలమూరిపాడు, బొమ్మనంపాడు, నాగులపాడు లేఅవుట్‌లను గురువారం ఆయన పరిశీలించారు. పనులు చేపట్టిన గుత్తేదారులతో మాట్లాడారు. వేలమూరిపాడు లేఅవుట్ వద్ద గుత్తేదారు స్వయంగా తయారుచేస్తున్న ఇటుకల నాణ్యత అంచనా వేశారు. అద్దంకి అర్బన్‌లోని మూడు కాలనీల్లో గృహనిర్మాణ శాఖ ద్వారా 1,716 మంది లబ్ధిదారులకు గానూ, ఆప్షన్-3 కింద 715 గృహాలు నిర్మిస్తున్నట్లు ఏఈ కిరణ్ తెలిపారు. మార్చి 20 నాటికి ఇవి పూర్తి చేయాలని, లేకుంటే బిల్లుల మంజూరు కష్టమవుతుందన్నారు. ఉగాది నాటికి అద్దంకి అర్బన్‌లో 584 గృహ ప్రవేశాలు జరిపించాలన్నారు. ఆయన వెంట డీఈ దుర్గా రమేష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

22న జిల్లా స్థాయి హాకీ జట్ల ఎంపిక

మైనంపాడు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 22న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల హాకీ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.రమణారెడ్డి, ఎ.సుందర్‌రామిరెడ్డిలు పేర్కొన్నారు. 01.01.2010 తర్వాత పుట్టిన వారు తమ జనన ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్‌లు తీసుకొని 22న ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హాజరవ్వాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ తిరమలశెట్టి రవికుమార్, సెల్: 9951578357లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఎడ్ల పందేలు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లాలోని మేళ్లచెరువులో మహా శివరాత్రి సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు గురువారం రాత్రి ముగిశాయి. ❖ జూనియర్ విభాగంలో పుచ్చకాయల శేషాద్రి చౌదరి గిత్తల జత(మద్దిరాల, నాగుల్పులపాడు, ప్రకాశం) ద్వితీయ స్థానం గెలుచుకుంది.

వాహనం ఢీకొని సర్వేయర్‌కు తీవ్ర గాయాలు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో గ్రామ సర్వేయర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురాంతకం మండల కేంద్రంలోని బైపాస్ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉమ్మడివరం గ్రామ సర్వేయర్‌గా పని చేస్తున్న కె.నాగార్జున రీ సర్వే పనుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై విశ్వనాథపురం వెళుతున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం సమీపంలోకి రాగానే కుంట వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నాగార్జునకు తీవ్ర గాయాలు కాగా.. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్ సహాయంతో వినుకొండ తరలించారు. ఘటన పై కేసు నమోదు చేసిన ఎస్సై శివ బసవరాజు బొలెరో వాహనం కోసం దర్యాప్తు చేపట్టారు.

వాగులో ఈతకు దిగి బీటెక్ విద్యార్థి మృతి

శ్రీచరణ్

పొన్నలూరు, న్యూస్‌టుడే: వాగులో మునిగి బీటెక్ విద్యార్థి మృతిచెందిన సంఘటన పొన్నలూరు మండలం మంగపతివారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మల్లెబోయిన శ్రీచరణ్ (20) ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. మహాశివరాత్రి సందర్భంగా ఇటీవల ఇంటికి వచ్చిన అతడు.. కుటుంబ సభ్యులతో కలిసి కోటప్పకొండకు వెళ్లి మొక్కు తీర్చుకొని వచ్చాడు. గురువారం సాయంత్రం తిరిగి కళాశాలకు వెళ్లాలనుకుని, మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులోని పొలం వద్ద ఉన్న తండ్రి రామారావుకు చెప్పేందుకు వెళ్లాడు. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం సమీపంలోని గొరిశల వాగులో ఈత కొట్టేందుకు దిగాడు. వాగులో నీరు నిల్వ చేసేందుకు రైతులు గతంలో తవ్విన భారీ గోతులు ఉండటంతో వాటిలో కూరుకుపోయి మునిగిపోయాడు. ఎంత సేపటికి కుమారుడు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన రామారావు. . వాగు వద్దకు వెళ్లి చూడగా, ఒడ్డున శ్రీచరణ్ దుస్తులు కనిపించాయి. గ్రామస్థులకు సమాచారం అందించగా.. వారు వచ్చి శ్రీచరణ్ మృతదేహాన్ని వెలికితీశారు. కళాశాలకు వెళ్లి చదువుకోవాల్సిన కుమారుడు ఊహించని రీతిలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మద్యం మత్తులో గొంతెండి..

కంభం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కంభం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగోజీపల్లికి చెందిన షేక్ మహమ్మద్ (60) మద్యానికి బానిసై ఆ మత్తులో తిరుగుతుంటాడు. ఈ క్రమంలోనే గురువారం పూటుగా మద్యం తాగి బస్టాండ్ సమీపంలో పడిపోయాడు. స్థానికులెవరూ గుర్తించకపోవడంతో గొంతెండి చనిపోయాడు. తొలుత ఆయనను యాచకుడని భావించి... అంత్యక్రియలు నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. తరువాత ఆధార్ కార్డు లభ్యం కావడంతో. .. లింగోజీపల్లి వాసిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లి కర్మకాండలు నిర్వహించారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

లాభాల పట్టు!

❖ పెరిగిన ధరలతో రైతుల్లో ఆనందం

నేత్రికల్లో ఉన్న పట్టుగూళ్లు

న్యూస్‌టుడే, కంభం

గతంలో ఎన్నడూ లేనంతగా పట్టుగూళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. పలమనేరు, హిందూపురం తదితర మార్కెట్లలో బైవోల్టెన్ రకం కిలో రూ.864 పలుకుతోంది. మొన్నటి వరకు రూ.900కి పైగా ధర లభించింది. కర్ణాటకలో రూ.వెయ్యి వరకు వస్తోంది. చాన్నాళ్ల తరువాత పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో పెరిగిన డిమాండు...

ఉమ్మడి జిల్లాలో సమారు 1,600 ఎకరాల్లో పట్టు సాగవుతోంది. మార్కాపురం జిల్లాలోని బేస్తవారపేట, గిద్దలూరు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, మార్కాపురం, పుల్లలచెరువు తదితర మండలాల్లో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కర్ణాటకలో ధరలు మెరుగ్గా ఉండడంతో రైతులు ఆ రాష్ట్రంలోని రామ్‌నగర్, విజయపురి, సిద్ధగట్ల మార్కెట్లకు ఉత్పత్తి తరలిస్తున్నారు. ఇటు ఆంధ్ర, అటు కర్ణాటకలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడం... చైనా నుంచీ దిగుమతులు పడిపోవడం... మరో వైపు మార్కెట్‌లో పట్టుకు డిమాండ్ పెరగడంతో ధరలకు రెక్కలొచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం చేయూత...

పట్టు సాగుకు కూటమి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాయితీలు ఇస్తోంది. మల్బరీ తోటల పెంపకానికి సాధారణ రైతులకు రూ.22,500, ఎస్సీ ఎస్టీలకు రూ. 27 వేలు; వెయ్యి చదరపు అడుగుల షెడ్ల నిర్మాణానికి రూ.3.37 లక్షల నుంచి రూ.4.05 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. వీటితో పాటు రేరింగ్, యంత్ర పరికరాలు, రోగనిరోధక మందులకు సైతం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారానూ మల్బరీ సాగును ప్రోత్సహిస్తోంది. పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నందున జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మల్బరీ షెడ్లు ఉన్న రైతులంతా ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెరికల్చర్ అధికారి సుజయ్ తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టుపై కలెక్టర్ ఆరా

రాజాబాబును కలిసి పూల మొక్కను అందజేస్తున్న ఎస్ఈ అబూసలీం

మార్కాపురం: మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబును కలెక్టరేట్‌లో గురువారం వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూసలీం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈతో కలెక్టర్ వెలిగొండ ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 25న సీఎం పర్యట ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు సమగ్ర స్వరూపం అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఎస్ఈతో పాటు మార్కాపురం ఎంపీడీవో బాలచెన్నయ్య ఇన్‌ఛార్జి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

డీబీఆర్సీ సంస్థ కృషి ప్రశంసనీయం

నివేదిక ప్రతులను ఆవిష్కరిస్తున్న జేసీ కల్పనాకుమారి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాజంలో న్యాయం, సంక్షేమం, ప్రత్యామ్నాయ వృత్తుల కోసం ఎదురుచూస్తున్న వారికి చేయూతగా నిలిచి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ డీబీఆర్సీ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని సంయుక్త కలెక్టర్ కల్పనాకుమారి పేర్కొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో ముద్రించిన కార్యక్రమాల నివేదికను స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సంస్థ చేస్తున్న కృషి; అధికార యంత్రాంగం సహకారంతో సాధించిన ఫలితాల ద్వారా పేదల జీవితాల్లో వచ్చిన మార్పును డీబీఆర్సీ జిల్లా సమన్వయకర్త డి.కోటేశ్వరరావు జేసీకి వివరించారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తిచేయండి

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియాతో చర్చిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు, సింగరాయకొండతోపాటు, మిగతా రైల్వేస్టేషన్లల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గురువారం విజయవాడలోని కార్యాలయంలో డీఆర్ఎం మోహిత్ సోనాకియా దృష్టికి తీసుకెళ్లారు. అండర్ పాస్‌లు, ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణంతోపాటు, పలు సమస్యలపై చర్చించారు. ఒంగోలు స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నం.4, 5లోని సమస్యలను వివరించారు. కోచ్ డిస్‌ప్లే బోర్డులు లేని కారణంగా ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అప్పటివరకు రైళ్లను ప్లాట్‌ఫారం-3పైనే నడపాలని కోరారు.

టంగుటూరు వైకాపా అధ్యక్ష పదవికి కుమ్ములాట!

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా టంగుటూరు గ్రామ అధ్యక్ష పదవి వ్యవహారం ఆ పార్టీ నాయకుల మధ్య కుమ్ములాటకు దారితీసింది. సింగరాయకొండలోని వైకాపా కార్యాలయానికి ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ గురువారం వచ్చారు. ఈ సందర్భంగా టంగుటూరుకు చెందిన దుగ్గిరాల పేర్రాజు, పుట్టా వెంకట్రావు, కొమ్ము ప్రభుదాసు, ఉదయ్ కుమార్, మరికొందరు అధ్యక్ష పదవి కోసం ప్రతిపాదనలు అందజేశారు. దీన్ని చింతపల్లి హరిబాబు, కొమ్ము సురేంద్ర, రావినూతల మనోహర్ మరికొందరు వ్యతిరేకించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొని తోపులాటకు దారితీసింది. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన హరిబాబు.. దళిత నాయకులను అసభ్య పదజాలంతో దూషించి దాడికి ప్రయత్నించాడని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ పరిణామంతో ఇన్‌ఛార్జి సురేష్.. చేసేదేమీ లేక చూస్తూ ఉండిపోయారు. దీంతో కొందరు నాయకులు అలకబూని అక్కడి నుంచి వెళ్లిపోయారు. సింగరాయకొండకు చెందిన ముఖ్య నాయకుడు ఒకరు జోక్యం చేసుకుని తరువాత మాట్లాడదామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సింగరాయకొండ మండలంలో కూడా కొందరు వైకాపా సీనియర్ నాయకులు ఇన్‌ఛార్జి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లకు పైగా పార్టీ కోసం పనిచేసిన వారిని అణగదొక్కేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడుతున్నారు. మరోవైపు దుగ్గిరాల పేర్రాజు, కొమ్ము ప్రభుదాస్, ఉదయ్‌కుమార్ తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్‌కోయిల్ శ్రీఅగస్త్యే నాడిజ్యోతిష్యాలయం మీచేతిబొటన వేలు ముద్రతో మీభవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 8978215913.

REAL ESTATE

PLOT FOR SALE

మార్కాపురం (కుంట) దగ్గరలో 133 గజాలు కేవలం 2 లక్షలు మాత్రమే. దొనకొండ దగ్గరలో 133 గజాలు 1 లక్ష మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 9398621767.

JOBS

TELECALLERS(F)Qualification: Any Degree Age:-18to30yrs Salary:-10kto15k - Incentive Address:- CHANDU EDUCATION CONSULTANCY, Lawyerpet, Ongole. Contact:- 7729873052, 9133996028

ఒంగోలు LUCKY షాపింగ్ మాల్ ఎదురు గల JOCKEY షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవంగల సేల్స్ బాయ్స్ కావలెను. సంప్ర: 99898 48485.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌సగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22 సం||ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

ఒంగోలులోని అంజయ్య రోడ్డులో ఇంస్టామార్ట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ 18000+EPFO+ESI. ✆9885295999, 7658961999.

విద్యార్థులకు వారి కెరీర్ విద్యా ప్రవేశాల గురించి సలహాలు సూచనలు చేయడానికి టీచర్స్, రిటైర్డ్ టీచర్స్, ప్రిన్సిపల్స్‌ను ఖాళీ సమయంలో ఫ్రీలాన్స్ పద్ధతిన చేయడానికి ఆహ్వానం ట్రైనింగ్ ఇవ్వబడును. ఒంగోలు, ✆94402 42412, 72077 70916.

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆ 9959598279

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500

Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

ఆత్మీయ వేడుక

విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో తీసుకున్న చిత్రాలివి. - ఈనాడు, మార్కాపురం

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలం, కుళాయి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ పేర్కొన్నారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పన్ను వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన గృహాలను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అనధికారిక కుళాయిలను గుర్తించి సదరు యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఏఈఈ కోటేశ్వరరావు, ఆర్‌ఐ ప్రదీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యం మరింత బలంగా ఉండేలా!

● పోషక లోపాలుంటే ప్రత్యేక చికిత్స ● అంగన్‌వాడీల ద్వారా కార్యాచరణ

న్యూస్‌టుడే - బేస్తవారపేట, కొమరోలు

ఆరోగ్యకరమైన బాల భారతాన్ని నిర్మించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పోషకాహారం అందిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు చిన్నారుల్లో పోషకాహార లోపం సమస్యలు వెలుగు చూస్తుండడంతో సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాయి.

చిన్నారుల్లో సమస్యలు గుర్తిస్తే...

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెల లెక్కించి ఆ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. వయసుకు తగ్గ ఎదుగుదల, ఎత్తుకు తగ్గ బరువు లేనివారిని గుర్తించి... స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో చికిత్స అందిస్తారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకుంటే ఒంగోలు రిమ్స్‌లోని ఎన్‌ఆర్‌సీ (న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ సెంటర్)కి పంపుతారు. అక్కడ తగిన వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తారు. చిన్నారికి తోడుగా ఉండే తల్లికి సైతం ఆహారం అందించి... రోజుకు రూ.150 చొప్పున చెల్లిస్తారు. పిల్లల ఆరోగ్యం పూర్తిగా మెరుగు పడ్డాకే ఇంటికి పంపుతారు. బేస్తవారపేట, గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో తీవ్ర పోషకాహార లోపం కలిగిన చిన్నారులు లేరని... చిన్న చిన్న సమస్యలున్న వారికి స్థానిక పీహెచ్‌సీ వైద్యులతోనే చికిత్స చేయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన...

రక్తహీనత, పోషకాహార లోపంపై ఇప్పటికే తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. సమస్యలున్న చిన్నారులను సీడీపీవోలు, సూపర్‌వైజర్లు దత్తత తీసుకుని వారి పరిస్థితిలో మార్పు తీసుకురావాలని ఉన్నతాధికారులు సూచించారు. ఇందులో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఎత్తు, బరువు కొలిచే పరికరాలను అందజేశారు. ప్రతి నెల మొదటి వారంలోనే చిన్నారులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. లోపాలున్న పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు... వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు బేస్తవారపేట సీడీపీవో కుమారి తెలిపారు.

చిన్నారి ఎత్తు కొలుస్తున్న సీడీపీవో కుమారి

బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

అంగన్‌వాడీ కేంద్రాలు: 199
అయిదేళ్లలోపు చిన్నారులు: 5,461
వయసుకు తగ్గ ఎదుగుదల లేనివారు: 51
ఎత్తు, వయసుకు తగిన బరువు లేనివారు: 70

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114
గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: కంభం: యర్రబాలెం - తురిమెళ్ల మధ్య వెలిగొండ ప్రాజెక్టు కాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా రోడ్డు అధ్వానంగా ఉంది. - రంగనాయకులు

✓: రహదారి బాగుకు చర్యలు తీసుకుంటాం. - నరసింహులు, ఆర్‌అండ్‌బీ డీఈ

?: హనుమంతునిపాడు: కోటతిప్పల ఎస్సీకాలనీకి సాగర్ నీరు సక్రమంగా రాక ఇబ్బంది పడుతున్నాం. - వై.రామారావు

✓: పైపులైను సమస్య ఉంటే బాగు చేస్తాం. ప్రస్తుతం ఇంటింటి కుళాయిలు పని చేస్తున్నాయి. - శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సంపద కేంద్రాల సద్వినియోగంతో ప్రయోజనం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కనిగిరి డివిజనల్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వెంగనగుంట గ్రామాన్ని గురువారం సందర్శించారు. తడి, పొడి, హానికరక వ్యర్థాలను వేర్వేరుగా అందజేయాలని ప్రజలకు సూచించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను తొలగించాలని పంచాయతీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారి వాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● ఏకీకృత కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. పెదరాజుపాలెం స్వర్ణ సచివాలయాన్ని గురువారం తనిఖీచేశారు. లక్ష్యాలు, అందుతున్న సేవలను సమీక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

వెంగనగుంటలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీవో శ్రీనివాసరెడ్డి

నమ్మండి... ఇది పంట కాలువేనండి!

కంభం మండలం హజరత్‌గూడెం సమీపంలో చీకరాల కుంటలో పరిస్థితి ఇది. నిండా గడ్డి, తుంగ పెరిగి నీరు సాగని పరిస్థితి నెలకొంది. ఏడు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన ఈ కాలువ కింద రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగవుతున్నాయి. అధికారులు స్పందించి కాలువ బాగుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నీటి పారుదల శాఖ జేఈ శ్రీనువాయక్ స్పందిస్తూ కొద్ది నెలల క్రితమే పూడిక తీయించాం... నీటి విడుదల సమయంలో మరోసారి శుభ్రం చేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, కంభం

తవ్వారు సరే... కాలువ నిర్మాణమెపుడు?

సి.ఎస్.పురం ఏని మెట్ల వీధిలో ఎక్కువగా ఉన్న మురుగు సమస్య పరిష్కారించేందుకు కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు ఇరవై రోజుల క్రితం రోడ్డుకు ఇరువైపులా మట్టి తవ్వి దారిపై పోశారు. తరువాత పనులు చేయకుండా వదిలేయడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు ద్విచక్రవాహనదారులు జారిపడి గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీహరి స్పందిస్తూ... తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.- న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

వృథా... ఎవరికీ పట్టక వ్యధ

బేస్తవారపేట మండలం సోమవారపేటలో పైపులైను దెబ్బతిని విలువైన జలాలు... జాతీయ రహదారిపై ఇలా వృథాగా పోతున్నాయి. రెండు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత సిబ్బంది ఎవరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా దిగువ ప్రాంతాలకు సరిగా నీరందడం లేదు. ఇప్పటికైనా పైపులైను బాగుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.- న్యూస్‌టుడే, బేస్తవారపేట

బోరు వేశారు... గుంత మరిచారు!

గిద్దలూరు పట్టణం సుంకమ్మవీధిలో నీటి సమస్య పరిష్కారానికి.. . రెండు నెలల క్రితం రహదారిపై డీప్‌బోరు వేశారు. ఈ క్రమంలో చుట్టూ గొయ్యి తవ్వారు. తరువాత ఆ గుంతపై మూత వేయకుండా వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ పరిస్థితి ప్రమాదకరంగా ఉంటోంది. పిల్లలు, వృద్ధులు పడిపోయే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

చారిత్రక దొరువు... ఎవరికీ పట్టక

కనిగిరి పట్టణంలో చారిత్రక నేపథ్యం కలిగిన దొరువు ఇది. నిండా వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు... నీరంతా పాచిపట్టి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ జలవనరును బాగు చేయిస్తే వేసవి ఎద్దడిని కొంతమేర అధిగమించే అవకాశం ఉన్నా ఆ దిశగా యంత్రాంగం చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి దొరువును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కనిగిరి

బడ్జెట్‌తో కొత్త జిల్లాకు జవసత్వాలు

అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసి గత వైకాపా ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విమర్శించారు. అంసెబ్లీలో గురువారం నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో హేతుబద్ధత లేకుండా జిల్లాలు ఏర్పాటు చేయడంతో పశ్చిమ ప్రకాశానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ లోటును సరిచేసి... ప్రత్యేకంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి గత రెండు బడ్జెట్లలోనూ ప్రత్యేకంగా నిధులు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పంచాయతీరాజ్ వ్యవస్థను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గాడిలో పెట్టారన్నారు. సర్పంచులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా సుపరిపాలనకు అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 1,290 కోట్లతో జిల్లాలోని ప్రతి ఇంటికీ రక్షిత జలాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మంత్రి లోకేశ్ విద్యావ్యవస్థను కొత్తపుంతలు తొక్కిస్తున్నారన్నారు. పూర్వోదయ పథకం ద్వారా రాయలసీమతో పాటు ఉమ్మడి జిల్లాను హార్టీకల్చర్ హబ్‌లో చేర్చడంతో రైతులకు పెద్ద ఎత్తున మేలు కలగనుందన్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాలి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తలు మై టీడీపీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు బి.రమేష్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో యాప్‌పై అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పింఛన్ల పంపిణీ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు మాలకొండయ్య, జి.శ్రీనివాసవర్మ, డి.మల్లికార్జున, పి.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పామూరు, న్యూస్‌టుడే: మై టీడీపీ యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తారని తెదేపా మండల అధ్యక్షుడు బి.నరసింహారావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వైకాపా అసత్య ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టి... ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పాలన్నారు. నాయకులు వై.శ్రీనివాసులు, అమీర్, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సి.ఎస్.పురంలో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు

కంభంలో శివాజీ చిత్రపటాలతో ప్రదర్శన

పామూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న ప్రతినిధులు

వైభవంగా ఛత్రపతి శోభాయాత్ర

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఆరె మరాఠీ సోదరుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పామూరు, హనుమంతునిపాడు, కంభం, కొమరోలు తదితర ప్రాంతాల్లో చేపట్టిన శోభాయాత్ర వైభవంగా సాగింది. ఆయన సేవలను వక్తలు స్మరించుకున్నారు. చిత్రపటాలు, విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి... పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ పార్టీల నాయకులు, సంఘాలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం

సత్తా చాటిన తాండపాడు గిత్తలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముండ్లపాడులోని భవానీశంకరాలయంలో గురువారం నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. పల్నాడు జిల్లా తాండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్ల జత 4,193 అడుగుల మేర బండలాగి ప్రథమ స్థానం దక్కించుకున్నాయి. కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డి (కొమరోలు); బి.సాయి భవితారెడ్డి (పొద్దుటూరు); నక్కల బలరాం యాదవ్ (పల్నాడు జిల్లా అబ్బూరు), ఆకుల గౌస్‌పీరా (కడప జిల్లా నంద్యాలపేట), కూతుర్ల దక్షిత, నిశాంత్ (అక్కలరెడ్డిపల్లె), రాచర్ల కొండ గురవయ్య (కడప జిల్లా పుల్లారెడ్డిపల్లె) ఎడ్ల జతలు వరుసగా తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఆయా యజమానులకు నిర్వాహక కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. ముందుగా పోటీలను తెదేపా నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి ప్రారంభించారు. కొండు వెంకటరామిరెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మార్తాల సుబ్రహ్మణ్యం రెడ్డి భోజన సదుపాయం కల్పించారు.

బండ లాగుతున్న ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత

కనిగిరి ఎస్సైగా సందీప్

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పోలీసు స్టేషన్ ఎస్సైగా జి. సందీప్... గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు తాలూకా స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అర్జీల పరిష్కారంపై ఆరా

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు పేర్కొన్నారు. వాలిచెర్ల, నందనవనం సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, పరిష్కారంపై ఆరా తీశారు. కుటుంబ సర్వే, ఈకేవైసీ, పారిశుద్ధ్యం, అక్షరాంధ్ర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నెలాఖరుకల్లా సర్వేలు, ఇంటిపన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

మట్టి దారులతో చిక్కులు

కంభం మండలం కందులాపురం పంచాయతీ మదర్‌థెరెసా కాలనీలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఈ ప్రాంతంలో ఒక్క సిమెంట్ రోడ్డూ లేకపోగా... ఉన్నవి సైతం ముళ్లచెట్లతో కుంచించుకుపోయాయి. దీనికితోడు గుంతలు ఏర్పడడం రాకపోకలకు నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్నతాధికారులు పరిశీలించి దారుల అభివృద్ధికి హామీ ఇచ్చినా తరువాత పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ.. నిధుల లభ్యతను బట్టి రోడ్ల బాగుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంభం

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఏపీ అటవీశాఖ, ప్రపంచ ప్రకృతి నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి నల్లమల అటవీ పరిసర గ్రామాల్లో పశువులకు టీకా కార్యక్రమం చేపట్టారు. నాగార్జునసాగర్ - శ్రీశైలం పులుల అభయారణ్యం పరిధిలోని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. 'సురక్షిత అడవి' పేరుతో వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లోని కొలుకుల, సంఘంతండా, గాంధీనగర్, చెన్నరాయునిపల్లె, జంగంవారిపల్లె, శాంతినగర్, మర్రిపాలెం, బొమ్మలాపురం, బోడేనాయక్ తండా తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించారు. గేదెలు, ఆవులు, జీవాలు, పెంపుడు జంతువులు తదితరాలకు సైన్ టీకాలు వేశారు. స్థానిక పశువుల ద్వారా అడవి జంతువులకు వ్యాధులు సోకకుండా ఈ టీకాల కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పశు వైద్యుడు శివారెడ్డి, ఫారెస్ట్ రేంజర్ ప్రసన్నజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client, The Branch Manager, Shriram Finance Limited, Giddalur Branch of Prakasam District, I issued the following **Public Notice** to the general public.

One, **Sri. Dudekula Rafi S/o Subhan, Papaipalle Village, Bestavaripeta Mandal, Markapur District** intended to barrow loan and creat Equitabale Mortgage of her Schedule property in favour of my Client for the loan to be borrowed by her. As such if anyone has any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., should be informed by them to me within Five days from the date of this Public Notice, Otherwise later objections will not bind my client in this regard.

SCHEDULE: Prakasam District Cumbum Sub Registrar, Registration, Bestavaripeta Mandal, Papaipalle Village area, Sy.No. 276, Vacant site (Demolished Building of D.No.2-11) an extent of 47.05 Sq. yards (or) 39.52 Sq.mts. Bounded by **East:** Dudekula Mastanamma Building wall, **South:** Joint wall of Puli Pullaiah Building, **West:** High-way Road, **North:** Road ets, Admeasuring that total extent 47.05Sq. yards (or) 39. 52 Sq.mts vacant site.

GIDDALUR, Sd/- **BODDU PRAKASH**
Date: 17-02-2026 Advocate

గౌరవనీయ 6వ అదనపు జిల్లా జడ్జి, మార్కాపూర్ గారి కోర్టు, ప్రకాశంజిల్లా

IA NO 586/2025 IN O.S.NO.19/2025

గోపిసెట్టి వెంకటేశ్వర్లు, ... పిటీషనర్

Vs

1.మానం గణేష్ రెడ్డి 2.శేగు వెంకటేశ్వర్లు
3. కోట శ్రీనివాసులు 4. యల్లా శివకోటేశ్వరరావు
5. చిన్నబోయిన రామకృష్ణ 6. జంపారపు భాస్కర్ రావు
7. గోపిశెట్టి రవీంద్ర కుమార్ 8. శేనగళ్ళ గోపాల్
9. షేక్ అబ్దుల్ రహమాన్
10. మొటాటి గోపాల్ రెడ్డి .... ది డిఫెండెంట్స్

ప్రకటన

గిద్దలూరు గ్రామం, ప్రకాశం జిల్లాలో ఉన్న కింద పేర్కొన్న సర్వే నంబర్లలోని ఆస్తికి సంబంధించి, పిటీషర్ గోపిసెట్టి వెంకటేశ్వర్లు గారు గౌరవనీయ కోర్టు ముందు డిక్లరేషన్ మరియు పర్మనెంట్ ఇన్జక్షన్ ను ఫైల్ చేసి వివాదంలో ఉంచియున్నారు. సర్వే నంబర్లు: **Sy.No. 693,694,695,647/2** పై ఆస్తి ప్రథమ పిటీషనర్ కుటుంబానికే చెందినది. అందువలన, ఈ కేసు తుది తీర్పు వెలువడే వరకు, డిఫెండెంట్స్1 నుండి 10 వరకు మరియు వారిచేత సామాన్య ప్రజలకు ఏవిధమైన అమ్మకం, కొనుగోలు, బదలీ, క్రయ-విక్రయాలు లేదా మూడవ పక్షహక్కులు సృష్టించడం నిషిద్ధమైనది. ఏ వ్యక్తి అయినా పై ఆస్తికి సంబంధించిన అమ్మకం లేదా కొనుగోలు ఒప్పందాలలో ప్రవేశించినచో, అట్టి లావాదేవీలు పిటీషనర్‌ను సంబంధించవు, చట్టపరమైన విలువ కూడ ఉండదు, ఎందుకంటే పై వివాదం గౌరవనీయ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కాబట్టి, ప్రజలు మరియు భవిష్యత్ కొనుగోలుదారులు- ఈ ఆస్తికి సంబంధించిన ఏవిధమైన వ్యవహారాల్లో పాల్గొనకూడదు అని హెచ్చరిస్తున్నాము..

పిటీషనర్
గోపిసెట్టి వెంకటేశ్వర్లు,
గిద్దలూరు గ్రామం,
ప్రకాశం జిల్లా

SD/-
T.K. PADMAJA DEVI
ADVOCATE,
MARKAPUR

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

కనిగిరి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి పట్టణం పాతూరు ఎస్సీ కాలనీకి లోకేశ్ (24) పెయింటింగ్ పనులు చేస్తుంటారు. గురువారం పూటుగా మద్యం తాగి... ఆ మత్తులో ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. చుట్టుపక్కల వారు గమనించే సరికే పరిస్థితి చేజారిపోయింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హైవే బ్లాక్‌స్పాట్‌లో నిర్లక్ష్యం

అనంతపురం - అమరావతి జాతీయ రహదారిలో రాచర్ల మండలం ఎడవల్లి క్రాస్‌లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ఆ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు రాచర్ల పోలీసులు అక్కడ వాహనాల వేగం నియంత్రించేందుకు... ఖాళీ తారు డ్రమ్ములకు రేడియం స్టిక్కర్లను అతికించి రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేశారు. తగినంతగా రేడియం స్టిక్కర్లు అతికించక పోవడంతో రాత్రి వేళ వాహనదారులకు అవి సరిగా కనిపించక ఢీకొనడంతో అవి ఓ పక్కన పడిపోయాయి. బ్లాక్‌స్పాట్ ప్రాంతంలో నిత్యం పర్యవేక్షించాల్సిన పోలీసు అధికారులు ఇలా నిర్లక్ష్యంగా డ్రమ్ములు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

నిర్వహణ గాలికి... పరికరాలు మూలకు!

☛ సచివాలయాల్లో సేవలకు అంతరాయం

న్యూస్‌టుడే – కనిగిరి

సచివాలయ వ్యవస్థ ఆరంభంలో అప్పటి వైకాపా ప్రభుత్వం ఆయా కార్యాలయాలకు అంతర్జాలం అందుబాటులోకి తెచ్చేందుకు... రూ.లక్షలు వెచ్చించి ఫైబర్ నెట్ పరికరాలు ఏర్పాటు చేసింది. తరువాత నిర్వహణ గాలికొదిలేయడంతో చాలావరకు మూలకు చేరాయి. వీటితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు సైతం మొరాయిస్తుండడంతో సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది.

నిత్యం ఇక్కట్లే...

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో పన్నెండు సచివాలయాలున్నాయి. ఒక్కో కార్యాలయానికి రెండేసి కంప్యూటర్లు, యూపీఎస్ ప్రింటర్, ఇన్వర్టర్ తదితరాలు అందించారు. సిబ్బంది చొరవతో కొన్నిచోట్ల అవి పనిచేస్తుండగా చాలా వరకు మొరాయిస్తున్నాయి. దీంతో కుల, ఆదాయం, నివాస తదితర ధ్రువపత్రాల కోసం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఇంటింటి సర్వే నమోదు తదితరాలకూ ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల సిబ్బందే తలా కొంత మొత్తం వేసుకుని మరమ్మతులు చేయిస్తున్నారు. ఆ పరిస్థితి లేని చోట అంతా బాగున్న సచివాలయాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో హాట్‌స్పాట్ ద్వారా చరవాణుల డేటాను వినియోగించి సేవలందించాల్సి వస్తోందని కొందరు సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై కనిగిరి మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ప్రసాద్‌ను వివరణ కోరగా... మొరాయించిన చోట పరికరాలను బాగు చేయించి సమస్య లేకుండా చూస్తామన్నారు.

కనిగిరి వార్డు సచివాలయంలో పనిచేయని ఇన్వర్టర్

మార్కాపురం

•మార్కాపురం •యర్రగొండపాలెం

కాటంరాజు ఆలయ అభివృద్ధికి కృషి

మార్కాపురం, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి కలిగిన వేణుతల కాటంరాజు గంగాభవానీ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని దేవస్థానం సభ్యులు వైపాలెం తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబును కోరారు. గురువారం మార్కాపురంలోని విద్యానగర్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో దేవస్థానం కమిటీ సభ్యులు కలిసి సన్మానించారు. దేవస్థానం పరిసరాల్లో రూ.25 లక్షలతో బీసీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అనుమతులు తీసుకుచ్చిన సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధ్యక్షుడు గుమ్మా గంగరాజు యాదవ్, దేవస్థానం కీలక బాధ్యుడు పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షల వ్యయంతో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైపాలెం, మార్కాపురం, గిద్దలూరు ప్రాంత యాదవుల చిరకాల కోరిక తాగునీటి కోసం రూ.18 లక్షలతో హెడ్ ఓవర్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రూ.30 లక్షల విలువైన స్వచ్ఛభారత్ బయో మరుగుదొడ్లు మంజూరు చేశారన్నారు. మార్చి 18వ తేదీన జరిగే తిరునాళ్ల సందర్భంగా అన్ని ఏర్పాట్లు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాలి కొండయ్య యాదవ్, వెంకట సుబ్బారావు, పోలురాజు, ఎల్లయ్య, ఆత్మనంద, గాలెయ్య, పాలంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న కాటంరాజు దేవస్థానం కమిటీ సభ్యులు

25న ఎస్టీయూ చలో విజయవాడ

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై మూడు దశల ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దేశానాయక్ తెలిపారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేయాలన్నారు. గురుకుల ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలకొండానాయక్, మండల అధ్యక్షుడు సామ్యేల్, దేవప్రసాద్, మురళీగోపాల్, శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు.. కనీస వసతులు కరవు

న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్:

కాలనీ కష్టాలు

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలోని శివారు కాలనీల్లో కనీస వసతులు లేక నివాసితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా 11వ వార్డు ఎస్సీ బీసీ కాలనీలో కనీసం ప్రాథమిక సౌకర్యాలు కూడా లేవు.

అభివృద్ధికి నోచుకోని ఎస్సీ బీసీ కాలనీ

మూడు వీధులకు ఒకే బోరు

కాలనీ శివారు ప్రాంతంలో సీసీ రోడ్లు, పక్కా కాలువలు లేవు. రెండు, మూడు వీధులకు కలిపి ఒకటే డీప్ బోరు ఉండడంతో తరచూ నీటి ఎద్దడి తలెత్తుతోందని స్థానికులు తెలిపారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ప్రాంతంలో రోజువారీ కూలి పనులు చేసుకునేవారు అధికంగా నివసిస్తుంటారు. ఎస్టీ కాలనీ, మజీద్ కాలనీల్లో రోడ్లు, కాలువలు లేవు.

వేసవి వస్తే నీటి సమస్య తప్పడం లేదు

వేసవి వస్తే నీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. తమ పరిస్థితి ఆలకించే నాథుడే ఉండడం లేదు. పనులు మానుకొని ఉండాల్సి వస్తోంది. ముందస్తు ప్రణాళికతో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి.
– చెన్నబోయిన వెంకటనారాయణ, స్థానికుడు

కాలువలు లేక అవస్థలు పడుతున్నాం

మార్కాపురం పట్టణానికి తమ కాలనీ ప్రధానమైంది. కానీ అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోలేదు. కాలనీలోని చాలా వీధుల్లో సిమెంటు రోడ్లు లేవు. కొన్ని చోట్ల రోడ్లు ఉన్నా సైడు కాలువలు నిర్మించలేదు. – మునుగూరి కృష్ణవేణి, స్థానికురాలు

సేవలు పారదర్శకం... రైతుకు ప్రయోజనం

❑ ఈ-పంట నమోదుకు తుది గడువు ఈ నెల 25

చింతగుంటలో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న ఏవో ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి శైలజ

న్యూస్‌టుడే, కొనకనమిట్ల:

వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు అన్నదాతలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోంది. ఆయా సేవలు పారదర్శకంగా రైతులకు చేరేందుకు ఈ పంట నమోదు విధానాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం రబీలో సాగైన పంటల వివరాల నమోదు ప్రక్రియ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సాగుతోంది. హక్కుపత్రాలు పొందిన కౌలు రైతులు కూడా వారు సాగు చేసే పంటల నమోదు చేయించుకునే అవకాశం కల్పించారు. వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు ఈ పంట నమోదుకు ఈ నెల 25 తుది గడువు కావడంతో మరో ఏడు రోజులే మిగిలి ఉంది. మార్కాపురం డివిజన్లో ఇప్పటి వరకు 80 శాతం నమోదుకాగా, మిగిలిన వారంతా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కొనకనమిట్ల మండలంలో అత్యధికంగా సాగు

మార్కాపురం నియోజకవర్గం పరిధిలో కొనకనమిట్ల మండలంలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోల సమన్వయంతో గ్రామాల వారీగా బృందాలు ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియ నిర్వహించేలా కార్యాచరణ చేపట్టారు. సాగుదారులు తమ ఆధార్, చరవాణి నంబరు, సర్వే నంబరు చెప్పడంతో పాటు, పొలం వద్దకు వెళ్లి ఫొటో నమోదు చేస్తున్నారు. రబీ సీజన్‌లో మిరప, మినుము, శనగ పంటలకు మాత్రమే బీమా వర్తించనున్న నేపథ్యంలో వాటిని నోటిఫైడ్ పంటలుగా గుర్తించారు. అందులో నమోదు చేయకపోతే పంట నష్టపరిహారంతో పాటు, ప్రభుత్వం అందించే ఫలాలకు దూరం కావాల్సిందే. ఈ పంట నమోదుతోనే రైతు సేవా కేంద్రాల్లో శనగ, మినుము, కంది, మిరప తదితర పంటలు కొనుగోలు చేస్తారని ఏవో ప్రకాష్ తెలిపారు.

రబీలో ఇప్పటివరకు ఈ నమోదు లెక్క (ఎకరాల్లో) ఇలా..

మండలం	సాగు	ఈ పంట నమోదు	శాతం
మార్కాపురం	32,922	24,417	78
కొనకనమిట్ల	33,104	25,630	84
పొదిలి	25,392	22,7613	91
తర్లుపాడు	10,410	6,837	67

నిర్మ మహేశ్వరునికి ఘనంగా ఏకాంతసేవ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని శ్రీ పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఘనంగా ఏకాంత సేవ నిర్వహించారు. స్వామి వార్లను పుష్పమండపంపై ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు మన్నేపల్లి విజయశర్మ, కె.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

త్రిపురాంతక స్వామికి పూజలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కార్యక్రమ సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ గురువారం త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకేశ్వరుని వద్ద అభిషేక పూజలు, బాలాత్రిపురసుందరీదేవి వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం త్రిపురాంతకం ఆలయాల చిత్ర పటాన్ని ఈవో డి.అనిల్‌కుమార్ ఆయనకు బహుకరించారు.

వెంకటేష్‌కు ఆలయాల చిత్ర పటాన్ని బహూకరిస్తున్న ఈవో అనిల్ కుమార్

ఆత్మీయం.. ఆనందదాయకం

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో ఉండవల్లిలోని నివాసంలో గురువారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, ఆయన సతీమణి.

నల్లమలలో పశు సంరక్షణకు చర్యలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ అటవీశాఖ, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంయుక్త సహకారంతో ఈ నెల 19 నుంచి నల్లమల అటవీ ప్రాంత పరిసర గ్రామాల్లో విస్తృత స్థాయి పశువుల టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా నాగార్జున సాగర్- శ్రీశైలం పులుల అభయారణ్య పరిధి ప్రాంతాల్లో ఈ కార్యక్రమంపై అధికారులు దృష్టి సారించారు. సురక్షిత అడవి అనే పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమం గురువారం వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లో కొలుకుల, సంఘంతండా, గాంధీనగర్, చెన్నరాయునిపల్లె, జంగంవారిపల్లె, శాంతినగర్, మర్రిపాలెం, బొమ్మలాపురం, బోడేనాయక్ తండా తదితర గ్రామాల్లో జరిగింది. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు తదితర జంతువులకు స్వైన్ టీకాలు వేశారు. స్థానిక పశువుల వ్యాధులు అడవి జంతువులకు సోకకుండా ఈ టీకాల కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యుడు శివారెడ్డి, వైద్య బృందం, ఫారెస్టురేంజర్ ప్రసన్న జ్యోతి వారి సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

కొనకనపమిట్ల, న్యూస్‌టుడే:

?: మండలంలోని గొట్లగట్టు పంచాయతీలోని వెలుగొండరాయుడుపల్లె మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగిపోయి ఇబ్బందులకు గురవుతున్నాం. – చెన్నయ్య, స్థానికుడు
✓: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయించి, దోమల నివారణ ఫాగింగ్ చేయిస్తాం.
– బ్రహ్మనాయుడు, పంచాయతీ కార్యదర్శి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

?: కొత్తూరులోని కర్నూలు-గుంటూరు రహదారి పక్కన కాలువలు లేకపోవడంతో వృథా నీరు రహదారులపై చేరుతోంది. రహదారిలో వాహనాలు ప్రయాణించేటప్పుడు బురద నీరు వచ్చి గృహాల్లో పడుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోండి. – వెంకటేశ్వర్లు, కొత్తూరు.
✓: రహదారి ఇరువైపులా కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.
– భ్రమరాంబిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దోర్నాల.

పొదిలి, న్యూస్‌టుడే:

?: పొదిలిలోని బ్రహ్మయ్యతోట వీధిలో సాగర్ నీరు రావడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అదనంగా పైపులు ఏర్పాటుచేసి తాగునీరు అందించాలి. – స్థానిక ప్రజలు.
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తాం.
– షేక్షావలీ, ఇన్‌ఛార్జి కమిషనరు, పొదిలి.

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: వై.పాలెం పట్టణంలోని బీసీ కాలనీలో పలు చోట్ల వీధిదీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి వేళ తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వెంటనే దీపాలు ఏర్పాటుచేయగలరు.
– సుబ్రహ్మణ్యం, స్థానికుడు
✓: సిబ్బందిని పంపి పాతవి మరమ్మతులు చేయిస్తాం. కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం.
– రామసుబ్బయ్య, పీఎస్

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని రువ్వల మిల్లు వీధిలో విద్యుత్తు స్తంభాలను రోడ్డుపైనే పడేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే చర్యలు తీసుకోగలరు.
– నాగేశ్వరరావు, స్థానికుడు
✓: కొత్తవి ఏర్పాటు చేసేందుకు అక్కడ వేశాం. త్వరలో పనులు పూర్తిచేసి ఇబ్బంది లేకుండా చేస్తాం. –కిషోర్, విద్యుత్తు ఏఈ

యర్రగొండపాలెం పట్టణం

?: వీరభద్రాపురం మురికి కాల్వల్లో పూడిక తీయక పోవడంతో మురుగు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. దోమల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలి. ప్రతి వీధిలో బ్లీచింగ్ చల్లించాలి.
– బాదరయ్య, స్థానికుడు
✓: పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడతాం. పూడిక తీతతో పాటు బ్లీచింగ్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా చూస్తాం.
– బాలునాయక్, పంచాయతీ కార్యదర్శి.

చెరువుల్లో వ్యర్థాలు.. చేపలకు ముప్పు

కొనకనమిట్లలో చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను నుంచి సేకరించి ఇష్టారీతిన ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపి తరలిస్తున్నారు. అంతేకాకుండా వీటిని సమీప చెరువుల్లో వేయడం వల్ల నీరు కలుషితమై చేపలు తదితరాల ఉనికికే ముప్పు ఏర్పడుతోంది. వ్యర్థాల వాహనాలు వెళ్లే బస్టాండ్ సెంటర్‌తోపాటు ఇతర మార్గాల్లో భరించలేని దుర్వాసన వస్తోంది. ఫలితంగా తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. కోళ్ల వ్యర్థాలు చేపల చెరువుల్లో వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా దుకాణదారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మత్స్యశాఖ, పంచాయతీ అధికారులు, పోలీసులు సమన్వయంతో వ్యర్థాల రవాణా అరికట్టాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కొనకనమిట్ల

అసంపూర్తి నిర్మాణం.. కొలిక్కితెస్తే నయం

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. నాలుగేళ్ల క్రితం పాత భవనంపై నాలుగు గదులను నిర్మించారు. అయితే వాటికి కిటికీలు, తలుపులు బిగించకుండా వదిలేశారు. దీంతో అవి వినియోగంలోకి రాలేదు. మూడేళ్ల క్రితం పాఠశాల మైదానంలో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. వాటి నిర్మాణమూ పూర్తి కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణంపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

బస్సుల కొరత.. ప్రయాణికుల వెత

పొదిలి ఆర్టీసి బస్టాండ్‌లో తగినన్ని బస్సులు లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎక్కువ మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో గతంలో కంటే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. పొదిలి-ఒంగోలు, కనిగిరి, మార్కాపురం మార్గాల్లో ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటున్నా అధికారులు అందుకు తగినట్లు బస్సులు వేయడంలేదని పలువురు తెలిపారు. చేసేదిలేక వచ్చిన బస్సులోనే ఆపసోపాలు పడి ఎక్కి అలాగే వెళ్తున్నామన్నారు. రద్దీ వేళల్లో ఎక్కువ బస్సులు నడపాలని కోరారు. –న్యూస్‌టుడే, పొదిలి

పోలీస్ స్టేషన్ ఎదుటే అపరిశుభ్రత!

స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గత కొన్ని రోజులుగా మురుగు సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారింది. స్టేషన్ పక్కనే ఉండే కాలువ పూడిపోయి మురుగంతా రహదారిపైకి వచ్చి చేరుతోంది. దీంతో స్టేషన్ లోపలికి వచ్చే ప్రజలు మురుగు నీరు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. కొంత మంది జారి కింద పడుతున్నారు. వాహనాలు వచ్చి వెళ్లే సమయాల్లో మురుగు నీరు అటుగా వెళ్లే వారిపై చింది పడుతోంది. పోలీస్ అధికారులకు, సిబ్బందికి కూడా నిత్యం పెద్ద సమస్యగా మారింది. మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్

నేడు మార్కండేశ్వరుడి రథోత్సవం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర దేవస్థాన శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (శుక్రవారం) రథోత్సవ సేవ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో చెన్నకేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామి వారి రథోత్సవంలో పాల్గొనేందుకు అన్ని విధాల ఏర్పాట్లు చేశామన్నారు.

నీరసాన్ని దూరం చేస్తే మరింత రాణింపు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం సాధన చేస్తున్న విద్యార్థుల నీరసాన్ని దూరం చేస్తే చదువుల్లో మరింత చురుగ్గా రాణించగలుగుతారని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ (వీసీఐ) ఉపాధ్యక్షురాలు గోళ్ల వరలక్ష్మి ఆశాభావం వ్యక్తం చేశారు. వీసీఐ వారి అమృతాహార సేవ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రపు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించే కార్యక్రమాన్ని గురువారం మార్కాపురం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో 13 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం దాతల సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం మార్కాపురం, కంభం, పెద్దారవీడు, వై.పాలెం, తర్లుపాడు మండలాల్లోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సమన్వయంతో సుమారు 1000 మంది విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో రూ.1.8 లక్షల వ్యయంతో అల్పాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, సమన్వయకర్త వి.పిచ్చిరావు, తర్లుపాడు హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో అల్పాహారం పంపిణీలో పాల్గొన్న వీసీఐ ప్రతినిధులు

గురుకుల తాగునీటి ట్యాంకు శుభ్రం

యర్రగొండపాలెం పట్టణం: వై.పాలెం మాచర్లరోడ్డులోని ఏపీ గిరిజన బాలుర గురుకులంలో విద్యార్థులు తాగే మంచి నీటి ట్యాంకును గురువారం అధికారులు శుభ్రంగా కడిగించారు. వృథా నీరు నిల్వ ఉండ కుండా పారే విధంగా చేశారు. కుళాయిల వద్ద పాచిని తొలగించారు. పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా చేశారు. తాగు నీటి కుళాయిల కింద మురికి లేకుండా చేశారు. గురువారం 'ఈనాడు'లో 'గురుకుల ట్యాంకు.. అపరిశుభ్రత మెండు' అనే వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ట్యాంకు వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేశారు. మురికి నీరు పారే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

సత్తా చాటిన గిత్తలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముండ్లపాడులోని భవానీశంకరాలయంలో గురువారం నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. పల్నాడు జిల్లా తాండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్ల జత 4,193 అడుగుల మేర బండలాగి ప్రథమ స్థానం దక్కించుకున్నాయి. కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డి (కొమరోలు); బి.సాయి భవితారెడ్డి (పొద్దుటూరు); నక్కల బలరాం యాదవ్ (పల్నాడు జిల్లా అబ్బూరు), ఆకుల గౌస్ పీరా (కడప జిల్లా నంద్యాలపేట), కూతుర్ల దక్షిత, నిశాంత్ (అక్కలరెడ్డి పల్లె), రాచర్ల కొండ గురవయ్య (కడప జిల్లా పుల్లారెడ్డిపల్లె) ఎడ్ల జతలు వరుసగా తరువాతి స్థానాల్లో నిలిచాయి.

కార్మికులకు వేతనాలు చెల్లించండి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నగర పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరెడ్డి కోరారు. గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కార్మికులు మేనేజరు షేక్షావలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. సిబ్బంది కొరత వల్ల పన్నులు వసూలు కాలేదని అధికారులు చెప్పడం సరికాదన్నారు. పెండింగ్ జీతాలన్నీ ఒకేసారి ఇవ్వాలని, పండుగ అలవెన్స్ వెయ్యి రూపాయలు చెల్లించాలని, సమ్మె కాలపు బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జి.నాగేశ్వరరావు, కె.నరసింహ, జి.రాజయ్య, పి.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేనేజరు వలీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మురుగు తొలగింపు.. మరిచారా..!

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

జిల్లా కేంద్రంలోని మార్కాపురం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. పైపై మెరుగులు దిద్దినంత మాత్రాన ప్రయోజనం ఏం ఉంటుందని స్థానికులు విమర్శిస్తున్నారు. వచ్చేది ఎండాకాలమని, అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సకాలంలో పారిశుద్ధ్య చర్యలు కరవై..

మున్సిపాలిటీలో సకాలంలో పారిశుద్ధ్య చర్యలు కరవై, కాలువల్లో చెత్త పేరుకుపోయి, మురుగు నీరు పారటంలేదు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో దాదాపు రెండువేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల మీదుగా మురుగు కాలువ వెళ్తోంది. దీన్లో మురుగు తొలగించక పోవడంతో దుర్గంధం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. చదువుపై ఏకాగ్రతను దెబ్బ తీస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోని కాలువల్లోనే ఇటువంటి పరిస్థితి ఉంటే పుర వీధుల్లో సైడు కాలువల గురించి ఎంత చెప్పినా తక్కువేనని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జడ్పీ బాలికల పాఠశాల గేటు వద్ద చెత్తతో నిండిన ప్రధాన కాలువ

(c) eenadu

పాత బిల్లుల పంచాయితీ

■ ప్రభుత్వం వరమిచ్చినా.. ఇంజినీర్లు కరుణించరు

■ 1473 పనులకు అప్‌లోడ్ చేసింది 16 మాత్రమే

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వందలాది గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటికి బిల్లులు ఆపేసింది. పనులు చేసిన గుత్తేదారులు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్పందించింది. బకాయి బిల్లులను చెల్లించేందుకు పచ్చజెండా ఊపింది. బిల్లులు తయారు చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీర్లు మొండికేస్తుండటంతో గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ముందుకొచ్చి బకాయిలు చెల్లిస్తామంటున్నా ఇంజినీర్లు స్పందించకపోవడం దారుణమంటున్నారు.

తాఖీదులు ఇవ్వాలని ఆదేశం

● ఆదోని డివిజన్ పరిధిలో రూ.8.20 కోట్లతో 554 పనులు చేపట్టారు. వీటికి సంబంధించి బిల్లులను సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసేందుకు పీఆర్ ఇంజినీర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ డివిజన్ నుంచి ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయకపోవడంతో ఈఈలకు తాఖీదులు జారీ చేయాలనీ అమరావతి నుంచి సీఈ ఆదేశించారు.

● నంద్యాల డివిజన్ పరిధిలో రూ.6.15 కోట్ల వ్యయంతో 648 పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.15 లక్షల విలువైన ఆరు పనుల వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారు.

● కర్నూలు డివిజన్‌లో రూ.2.99 కోట్ల అంచనాతో 271 పనులు చేశారు. వీటిలో రూ.27.38 లక్షల విలువైన పది పనుల బిల్లులను అప్‌లోడ్ చేశారు.

సాకులు చెబుతూ..

● 2014- 19లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి ఇప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయడం ఎలా సాధ్యమవుతుందని కొందరు పీఆర్ ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు.

● ఎప్పుడో చేసిన పనులకు సంబంధించిన ఇంజినీర్లు ఎవరో, ఎం.బుక్కులు ఎక్కడ ఉన్నాయో.. వాటిని ఎలా సేకరించాలని తర్జనభర్జనలు పడుతున్నారు. అప్పటి ఎం.బుక్కులు ఉన్నాయో లేదో అన్న సందేహం వ్యక్తమవుతోంది.

● అప్పట్లో పనులు పర్యవేక్షించిన ఏఈఈ, డీఈఈలు ఇప్పుడు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందంటున్నారు. పాత బిల్లులు అప్‌లోడ్ చేసే క్రమంలో తప్పులు దొర్లితే ఏం చర్యలు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు.

రూ.17.24 కోట్లు ఆపేసిన వైకాపా

● ఉపాధిహామీ పథకం కింద 2014-19లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 1473 పనులకు రూ.17.24 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి పాత బిల్లులన్నీ చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి వరకు చెల్లింపులు చేయకపోతే మళ్లీ ఇచ్చే అవకాశం ఉండదని వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని పలుమార్లు పీఆర్ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా జిల్లాలోని ఇంజినీర్ల నుంచి స్పందన కరవైంది.

● గతంలో చేసిన పనులకు సంబంధించి జాబితా, పాత బిల్లుల వివరాలను ఎం.బుక్ ప్రకారం అప్‌లోడ్ చేయాలని గత నెల 28వ తేదీన అన్ని జిల్లాల ఎస్ఈలకు ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు జిల్లాలోని పీఆర్ ఈఈలు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

సంగమేశ్వరుడి శిఖర దర్శనం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం వెనుక జలాలు తగ్గుముఖం పట్టడంతో సంగమేశ్వరం గర్భాలయ శిఖరాగ్రం బయటపడుతోంది. గతేడాది జూన్ 27న గర్భాలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలో జలాధివాసమైంది. శ్రీశైల జలాశయం నీటి మట్టం గురువారం 866 అడుగులకు తగ్గడంతో శిఖర కొనభాగం కొంత కనిపిస్తోంది. శిఖరాగ్రానికి వచ్చే సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘు రామశర్మ తెలిపారు.

ఊరుంది.. దారే లేదు

పరిశీలన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మట్టి రోడ్ల నుంచి జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలుగా మారాయి. వేల కిలోమీటర్ల దూరాన్ని గంటల్లో చేరుకునే వేగంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో అసలు రోడ్డు సౌకర్యం లేని తండాలు, గిరిజన గూడేలు, మారుమూల పల్లెలు ఉన్నాయంటే ఆశ్చర్యమే. చాలాచోట్ల దశాబ్దాల కిందట వేసిన కాలిబాట మార్గాలే కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలు ఇప్పటికీ బస్సులను ఎరుగవు. వాహనాలు వెళ్లలంటే కాకసష్టమే. మోటారు సైకిళ్లపై వెళ్లాలన్నా నానా తంటాలు పడాల్సిందే. దశాబ్దాలు గడుస్తున్నా వీరి పల్లె జనం బతుకులు మాత్రం మారడం లేదు.

నాగలూటి గూడేనికి ఈ మార్గంలో వెళ్లాలి

అటవీ శాఖ కొర్రీలు

■ ఆత్మకూరు మండలం.. నల్లమల అటవీ ప్రాంతంలోని పెచ్చెర్వు, నాగలూటిగూడేనికి ఇప్పటివరకు మట్టి రోడ్డు కూడా లేదు. ఇక్కడ ఏ చిన్న పని ప్రారంభించాలన్నా అటవీ శాఖ అభ్యంతరాలు చెబుతుంది. రిజర్వు ఫారెస్టు కావడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలో పంచాయతీరాజ్ శాఖ ఇక్కడ మెటల్ రోడ్లకు ఉపాధి హామీ పథకం కింద నిధులు ప్రతిపాదించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఇక్కడి చెంచులకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన వివిధ సదుపాయాలు సరిగా దరిచేరడం లేదు. ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం, గుడ్లు, పాలు, పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, చక్కెర తదితరాలు అందజేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తప్పని అవస్థలు

■ పాములపాడు మండలం శ్రీరామనగర్ కొట్టాలు పూర్తిగా కేసీ కెనాల్ కట్ట మీద ఏర్పాటైంది. దీంతో ఈ గ్రామానికి ఇంతవరకు రహదారి సౌకర్యం లేదు. ఇక్కడ రహదారి నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు అనుమతించడం లేదు.

■ శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామ సమీపంలోని పూలతోట కొట్టాలకు వెళ్లే దారి ఇది. దశాబ్దాలుగా ఈ గ్రామానికి సరైన తోవ లేదు. వర్షాకాలంలో బురదమయమై కాలు పెట్టలేని పరిస్థితి. రహదారి సౌకర్యం లేక పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. కనీసం మంచి వైద్యం అందడం లేదు.

మండలం	తోవలేని ఊరు
జూపాడుబంగ్లా	రామసముద్రం
పాములపాడు	శాంతినివాసం
ఆత్మకూరు	పెచ్చెర్వు, ఇందిరేశ్వరం గూడెం, నాగలూటి గూడెం
గడివేముల	సోమాపురం
బనగానపల్లి	పటేనగర్
రుద్రవరం	సుగాలితండా
చాగలమర్రి	రాజోలి
పాములపాడు	శ్రీరామనగర్ కొట్టాల
అవుకు	చిన్న కొట్టాల
శిరివెళ్ల	పూలతోట కొట్టాల

కూటమి ప్రభుత్వం ఆరా

■ 2011 జనాభా లెక్కల వరకు 250, 500 లోపు ఉన్న జనాభా ఉన్న గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారులను ఇప్పటివరకు నిర్మించలేదు. ప్రస్తుతం ఈ నిబంధనను తొలగించి రహదారులు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఆయా గ్రామాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలంటూ పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులు వివరాలు సేకరించారు. గడివేముల మండలం సోమాపురం గ్రామానికి ఇటీవల నిధులు ప్రతిపాదించారు.

■ చాగలమర్రి మండలం రాజోలి గ్రామం. వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దులో ఉండటంతో సమస్య నెలకొంది. ఇరు జిల్లాలు తమ పరిధి కాదంటే.. తమ పరిధి కాదంటూ నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రస్తుతం ఇబ్బందికరంగా మారిన 0.83 కి.మీ. రహదారిని పొరుగు జిల్లా అధికారులే నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గూడెం జనాభా 500 లోపు ఉంది. ఇంతవరకు రహదారి సౌకర్యం ఏర్పాటు కాలేదు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.5.61 కోట్లు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపు.. గురువారం చంద్రావతి కల్యాణ మండపంలో జరిగింది. హుండీలను లెక్కించగా రూ.5,61,81,535 లభించింది. 124 గ్రాముల బంగారం, 5 కిలోల 550 గ్రాముల వెండితో పాటు పలు విదేశీ కరెన్సీని భక్తులు సమర్పించారు. హుండీ లెక్కింపులో ఆలయ ఉద్యోగులు, శివ సేవకులు పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వీరి ప్రోగ్రాం.. జిల్లా కేంద్రానికే పరిమితం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు వైద్యులు పీహెచ్‌సీల్లో పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. జిల్లా కేంద్రాలను విడిచి వెళ్లేందుకు మొండికేస్తున్నారు. పీహెచ్‌సీలకు బదిలీ చేసినా అక్కడ విధుల్లో చేరకుండా.. పైరవీలు చేసి ప్రోగ్రాం ఆఫీసర్లుగా ఇక్కడే తిష్టవేస్తున్నారు. డిప్యుటేషన్ లేదా ఫారిన్ సర్వీసు పేరుతో.. డీపీఎంవో, లేదా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త, సంచార చికిత్స కేంద్రం కన్వీనర్‌గా, ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారిగా లేదా ప్రాంతీయ రీజనల్ ల్యాబ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ జిల్లా కేంద్రాలైన కర్నూలు, నంద్యాలకే పరిమితమయ్యారు.

● గడివేముల పీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేస్తున్న విశ్వేశ్వరరెడ్డి కరోనా సమయంలో కొవిడ్ కోఆర్డినేటర్‌గా జిల్లా కేంద్రానికి వచ్చారు. అది ముగిసిన వెంటనే మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా సుమారు నాలుగేళ్ల పాటు కొనసాగారు. తర్వాత డీపీఎంవో పోస్టుకు ప్రయత్నించి వీలవకపోవడంతో బఫర్ వైద్యుడిగా జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు.

● టీబీ యూనిట్‌లో పనిచేస్తున్న అంకిరెడ్డి మొన్నటి వరకు నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేశారు. దాని డిప్యుటేషన్ కాలం ముగియగానే జిల్లా వైద్యారోగ్యశాఖలో డీపీఎంవోగా డిప్యుటేషన్ తెచ్చుకున్నారు. ఆ తర్వాత జిల్లా టీబీ కేంద్రంలో పోస్టులో చేరిపోయారు. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి ఈయన పీహెచ్‌సీలకు వెళ్లకుండా ఇక్కడే ఉంటున్నారు.

● జిళ్లెల్ల పీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులును డిప్యుటేషన్‌పై ఇన్‌ఛార్జి డీపీఎంవోగా నియమించారు. దీంతో జిళ్లెల్లలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది.

● గోకులపాడు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కాంతారావునాయక్ ప్రస్తుతం డిప్యుటేషన్‌పై ఇన్‌ఛార్జి ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్తగా జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. దీంతో పీహెచ్‌సీలో వైద్య సేవలు నిలిచిపోయాయి.

● గాజులపల్లె పీహెచ్‌సీ వైద్యుడైన జగదీష్‌చంద్రారెడ్డిని డిప్యుటేషన్‌పై ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారిగా నియమించారు.

● వెలుగోడు ట్రైబల్ హాస్పిటల్‌లో వైద్యాధికారిణిగా ఉన్న ప్రసన్నలక్ష్మి మొన్నటి వరకు ఇన్‌ఛార్జి డీఐవోగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. ఆ పోస్టుకు సిబ్బందిని అధికారిగా నియమించడంతో డిప్యుటేషన్‌పై మరో పోస్టులో చేరి ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

భయపెట్టి.. పడగొట్టి

- రూ.20 కోట్ల ఆస్తిపై కన్ను - అక్రమార్కుల అరాచకం

నిఘా నేత్రం

సున్నిపెంటలో 'భూ'తాలు భయపెడుతున్నాయి.. యజమానులైన భార్యాభర్తలిద్దరూ చనిపోవడం.. వారికి వారసులు లేకపోవడంతో తమను ప్రశ్నించేవారు లేరన్న ఉద్దేశంతో కొందరు వారి ఆస్తులను కబ్జా చేసేందుకు తెగబడుతున్నారు. రూ.20 కోట్ల విలువైన ఇల్లు, పొలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎకరం భూమిలో కీలకనేత అనుచరుడు నిర్మాణాలు చేస్తున్నారు. ఏడాది కిందట గోశాలలో ఉన్న సుమారు 40 వరకు ఆవుల జాడలేదు. సోలార్ పంపుసెట్టు పీకేశారు. మోటార్లను మాయం చేశారు. ఆవుల షెడ్డును ధ్వంసం చేశారు. గోశాల బోర్డు, ఫెన్సింగ్‌లో కొంత భాగాన్ని పెకిలించేశారు. బాధితులు మంగళగిరిలోని తెదేపా కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో సున్నిపెంట కబ్జాలు, విధ్వంసం విషయం వెలుగులోకి వచ్చింది. - ఈనాడు, నంద్యాల

■ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే.. దాని ఆధారంగా కేసు నమోదు చేయలేదు. ఇంటిని ఆక్రమించిన వారితో మాట్లాడుకోవాలని సూచించడంతో శివకుమార్ దంపతులు షాక్‌కు గురయ్యారు. ఇంటికి తాళం వేసి దానిని పోలీసులు తమవద్దే ఉంచుకున్నారు. దీంతో బాధితులు నంద్యాల జిల్లా పూర్వ ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న స్థలం

పోలీసుల వింత వైఖరి

■ ఆయా వివాదాల నేపథ్యంలో తీవ్ర ఆందోళనకు గురైన శివకుమార్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో శస్త్రచికిత్స చేయించుకుని గత ఏడాది కాలంగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు.

■ "సున్నిపెంటలో మా ఇంటికి వెళ్తే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కొన్ని భూముల్లో గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నారు. గోశాలను ధ్వంసం చేశారు. షెడ్డును నాశనం చేశారు. నా ఇంటికి నేను వెళ్లలేని పరిస్థితి కల్పించారు. ఆయా ఆందోళనలతో గుండెపోటుకు గురయ్యా. ఆస్తులు మొత్తం అడ్డగోలుగా కబ్జా చేయాలని చూస్తున్నారని" బాధితుడు శివకుమార్ వాపోయారు.

ఎనిమిది ఎకరాల్లో గోశాల

■ హైదరాబాద్‌కు చెందిన యలమంచిలి రవికుమార్ పారిశ్రామికవేత్త. శివభక్తుడైన ఆయన ఏటా శివరాత్రి, ఉగాది, ఇతర పర్వదినాల్లో సున్నిపెంటలో శివభక్తులకు అన్నదానం చేస్తుండేవారు. కొన్నేళ్ల కిందట సున్నిపెంటలో సుమారు ఎనిమిది ఎకరాలు కొనుగోలు చేసి గోశాల ఏర్పాటుచేసి 80 ఆవులను పెంచారు. వాటి కోసం షెడ్డు ఏర్పాటు చేయడంతోపాటు సోలార్ పంపుసెట్టు, నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు.

■ ఆయన వచ్చినప్పుడు ఉండేందుకు సున్నిపెంట రామాలయం వీధిలో ఒక ఇంటినీ నిర్మించుకున్నారు. వెస్ట్రన్ కాలనీలో ఎకరా భూమి, హనుమాన్ గుడి వద్ద మరో ఎకరా, డీఏవీ స్కూల్ వద్ద సుమారు ఎకరా, సాయిబాబా గెస్ట్ హౌస్‌ను దశలవారీగా పలువురు ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు.

ఇల్లు ధ్వంసం.. పత్రాలు మాయం

■ రవికుమార్(78)కు పిల్లలు లేకపోవడంతో తనకు వరుసకు సోదరుడయ్యే నాదెళ్ల శివకుమార్‌ను చేరదీసి సున్నిపెంటలో సేవా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఆయన 2020, మే 28న మృతి చెందారు. బతికి ఉన్నప్పుడే తన ఆస్తులను శివకుమార్ పేరిట విల్లు రాసిచ్చారు. గోశాల బాధ్యతలు, ఇతర సేవా కార్యక్రమాలు చూసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా గోసేవా ట్రస్ట్ ఏర్పాటుచేసి సేవలు కొనసాగిస్తున్నారు.

■ శివకుమార్ గతేడాది మార్చి 10వ తేదీన ఆరోగ్య పరీక్షల నిమిత్తం తన భార్య ఉషారాణితో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అదే అదనుగా రామాలయం వీధిలో ఆయన ఉన్న ఇంటిని కొందరు తాళాలు బద్దలు కొట్టి ఆక్రమించుకున్నారు. అందులోని చాలా వరకు సామగ్రిని కూడా బయటకు పంపేశారు. పలు డాక్యుమెంట్లు పట్టుకెళ్లారు. బంగారం, వెండి, నగదు దోచుకున్నారు.

తడారుతున్న పట్టణ గొంతులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎండలు పెరిగాయి.. 'పానీ'పట్టు యుద్ధాలు మొదలయ్యాయి. మంచినీటి వనరులు (సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు) అడుగంటుతున్నాయి. ఎండలు పెరిగితే వే'గంగా' ఇంకిపోనుంది. ఇప్పటికీ వరకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రచించలేదు. గతంలో పురపాలికలకు వచ్చే ఏఎస్సీ గ్రాంట్స్ వైకాపా పాలనలో నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వంలోనైనా విడుదల చేసి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేయాలని పుర జనం విన్నవిస్తోంది.

● ఆత్మకూరు పట్టణంలో 28 వార్డులున్నాయి, 55 వేల జనాభా ఉంది. వెలుగోడు రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు ఆధారం. పూటకు ఏడు మిలియన్ లీటర్ల నీరు అవసరమైతే.. సగం కూడా ఇవ్వడం లేదు. ఇంత వరకు వేసవి ప్రణాళిక తయారు చేసుకోలేదు.

● నీటి నిల్వ చేసుకునేందుకు ఎలాంటి వనరులు లేవు. వేసవి వచ్చిందంటే చాలు బోర్లన్నీ ఎండిపోతాయి. దీంతో ఎనిమిది వరకు అద్దె బోర్లు తీసుకొని, నీటిని తోడుకొని సరఫరా చేయాల్సి వస్తోంది. నాలుగు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేశారు.

పట్టణంలోని లింగాయత్ వీధిలో ట్యాంకరు వద్ద బిందెల వరుస

● ఆర్డీటీ కాలనీ, స్వరాజ్ నగర్, అర్బన్ కాలనీ, వెంగళరెడ్డి నగర్ ఇందిరానగర్, ఏబీఎం పాలెం, రహ్మత్ నగర్, ఏకలవ్య నగర్, సాయిబాబా నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. వేసవి రాకముందే బిందె నీరు రూ.2 చెల్లించి దాహం తీర్చుకుంటున్నారు. ట్యాంకరు నీరు కావాలంటే రూ.500 వెచ్చించాల్సిందే.

అహోబిలానికి చేరుకున్న నారసింహుడు

◆ ముగిసిన పార్వేట మహోత్సవం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట పల్లకి గురువారం ఉదయం అహోబిలం చేరుకుంది. పార్వేటలో ఆఖరి గ్రామమైన రుద్రవరంలో బుధవారం రాత్రి బయలుదేరి గురువారం తెల్లవారుజామున గండ్లేరు ప్రాంతానికి స్వామి చేరుకున్నారు. అక్కడ హరేరామ హరేకృష్ణ బృందం సభ్యులు స్వామికి విశేష పూజలు జరిపారు. అనంతరం అహోబిలానికి చేరుకున్న స్వామిని ఆలయ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిని ప్రత్యేకంగా ఆరాధించారు.

● జనవరి నెల 16వ తేదీన పార్వేటకు బయలుదేరిన స్వామి 35 రోజుల పాటు ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లోని 32 గ్రామాల్లో పర్యటించారు. తన వివాహానికి ఆహ్వానించేందుకు భక్తుల చెంతకు వెళ్లి విశేష పూజలు అందుకొని తిరిగి అహోబిలం చేరుకున్నారు.

స్వామి వార్లకు హారతినిస్తున్న అర్చకులు

పరీక్షా కాలం.. బలవర్ధక ఆహారం

నంద్యాల, కర్నూలు వైద్యం, న్యూస్‌టుడే : జేఈఈ మెయిన్ ఫలితాలు వచ్చేశాయి.. విద్యార్థులు రెండో విడత పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వచ్చేవారం ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలు కాబోతున్నాయి. మరో ఇరవై రోజుల్లో మొదలయ్యే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.. విద్యార్థులు రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షల ధ్యాసలో పడి నీళ్లు తాగడం లేదు.. సరైన ఆహారం తీసుకోవడం లేదు.. అర్ధరాత్రి వరకు మేల్కొని చదువుకుంటున్నారు. ఈ సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. మంచి పౌష్టికాహారం అందిస్తూ ఒత్తిడిని దూరం చేసేలా శ్రద్ధ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

విభాగం	పరీక్ష రాసేవారు
పదో తరగతి	60,806
ఇంటర్మీడియట్	78,831

బయటి తిండి వద్దు - డా.శంకర్‌శర్మ, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, విశ్రాంత ప్రొఫెసర్

● పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితిలోనూ బయటి ఆహారం తీసుకోవద్దు. మసాలా, మాంసాహారం వంటి వాటికి దూరంగా ఉంటే మేలు. పిజ్జాలు, బర్గర్లు, పానీపూరి, కేక్‌లు, మిఠాయిలు, శీతల పానీయాలు వంటివి తీసుకొంటే కడుపు నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది.

● చాలామంది పిల్లలకు కాఫీ, టీ అలవాటు ఉంటుంది. పరీక్షల సమయంలో ఉదయం చిన్న కప్పు మాత్రమే ఇస్తే బాగుంటుంది. వీటి కన్నా రాగిజావ ఇస్తే చాలా మేలు.

● చాలామంది మంచినీరు సక్రమంగా తీసుకోవడం లేదు. ఫలితంగా రక్తశుద్ధి సరిగా జరగదు. అలసట తదితర సమస్యలు వేధిస్తుంటాయి. మజ్జిగ, పళ్ల రసాలు, కొబ్బరి బోండాం వంటివి తీసుకోవాలి. ముఖ్యంగా వేడివేడిగా ఆహారం తీసుకుంటే మంచిది.

రెండు గంటలకోసారి తీసుకోవాలి - రవీంద్ర, న్యూట్రిషనిస్టు, కర్నూలు

● పరీక్షల సమయంలో విద్యార్థులు రెండు గంటలకోసారి ఆహారం తీసుకోవడం మంచిది. ఎక్కువగా ఆకుకూరలు తినాలి.

● ఉదయం ఏడు గంటలకు పాలు, వాల్‌నట్స్, ఖర్జూర, బాదం వంటివి.. తొమ్మిది దాటిన తర్వాత రాగి ఇడ్లీ, పెసరపప్పు దోసె, కూరగాయలతో చేసిన ఉప్మా, సాంబారు, బ్రౌన్ బ్రెడ్, డ్రైనట్స్, అంజీరా, గుమ్మడికాయ విత్తనాలు, పదకొండు గంటలకు పండ్లు తినాలి.

● మధ్యాహ్నం ఒకటి తర్వాత పోషకాలతో కూడిన భోజనం మితంగా తినాలి. సాయంత్రం పండ్ల రసాలు తీసుకోవాలి.. రాత్రి 8-9 గంటల మధ్య జొన్న రొట్టె, చపాతీలు తీసుకోవచ్చు. రాత్రి వేళ వీలైనంత వరకు అన్నం తీసుకోకుండా ఉంటే మంచిది.

ఇతరులతో పోల్చొద్దు - డా.పి.లోకేశ్వర్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణులు, నంద్యాల

● తోటి విద్యార్థులతో పోల్చి ఒత్తిడికి గురిచేయొద్దు..'మార్కు' కనబరచాలంటూ తల్లిదండ్రులు తమ పిల్లలపై బలవంతంగా తమ అంచనాలు రుద్దుతున్నారు. ఇవి ఏమాత్రం సహేతుకం కావు.

● పరీక్షలకు ముందు కొత్త అంశాలు నేర్చుకోవడం ద్వారా లాభం కంటే.. నష్టమే ఎక్కువగా జరుగుతుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. గత ఆరు నెలల కాలంలో చదివిన వాటిని పునశ్చరణ చేయించాలి.

● పరీక్ష రాసి వచ్చిన వెంటనే పిల్లలతో నవ్వుతూ మాట్లాడాలి.. పరీక్ష రాసిన విధానంపై సమీక్ష చేయడం సరికాదు. ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది.. మొదటి పరీక్ష బాగా రాయకుంటే మిగిలిన వాటిపై పడుతుంది.

● మానసిక ప్రశాంతత కోసం కాసేపు పిల్లలతో కలిసి స్థానికంగా ఉన్న పార్కుల్లో నడవాలి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగుపడి మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

మధుర ఫలం.. కవర్లతో భద్రం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మామిడి రైతులను ఆదుకోవడానికి 'కూటమి' ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. డోన్, ఓర్వకల్లు, వెల్దుర్తి, ప్యాపిలి, బేతంచెర్ల, కోడుమూరు, దేవనకొండ తదితర మండలాల్లో సాగు అధికంగా ఉంది.

● ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. ఈ దశ నుంచే కాయలకు కవర్లు తొడిగి సంరక్షించేలా చర్యలు చేపట్టింది. కవరు, కూలీల ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తూ రైతులను ఆదుకుంటోంది.

● హెక్టారుకు 15 వేల కవర్లు అవసరమవుతాయి. ఒక కవర్ ధర రూ.2గా ఉంది. కవర్లు కొనుగోలు చేసేందుకు రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.15 వేల వరకు ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తోంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు గరిష్ఠంగా రాయితీ అందిస్తోంది.

● పిందె దశలో ఉన్నప్పుడు కాయకు కవర్ తొడగాలి. కాయ కొనభాగాన్ని జాగ్రత్తగా మూసేయాలి. కాయ పెరిగేకొద్దీ కవర్ రక్షణగా మారుతుంది. పండుగా మారిన తర్వాత కవర్ తొలగించి కోతలు ప్రారంభించాలి. కవర్లు తొడగడంతో రసాయన మందుల వాడకం తగ్గుతుంది.



మామిడి కాయలకు తొడిగిన కవర్లు

● కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారా వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, క్రిమికీటకాలు, పక్షుల నుంచి రక్షణ కలుగుతుంది. ఎండ తీవ్రత పండుపై లేకుండా మొత్తం ఒకే రంగు వస్తుంది. ఫలితంగా నాణ్యమైన దిగుబడి వస్తుందని అధికారిణి చందన పేర్కొన్నారు.

పట్టణం	ఇఫ్తార్ (శుక్ర)	సహెరీ (శని)
కర్నూలు	6:28	5:18
నంద్యాల	6:26	5:18
ఆదోని	6:25	5:18
ఆళ్లగడ్డ	6:23	5:22
బనగానపల్లి	6:27	5:14

- న్యూస్‌టుడే, కర్నూలు పాతబస్తీ

సాగుబడి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సాగు పాఠాలు నేర్పించాలని కేంద్రం నిర్ణయించింది. సాగులో కీలకమైన నేల గురించి అవగాహన కల్పించేలా 'పాఠశాల మృత్తిక ఆరోగ్య కార్డు' (స్కూల్ సాయిల్ హెల్త్ కార్డు) ప్రోగ్రామ్ ప్రాజెక్టును ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో 39 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో జిల్లా పరిషత్, ఆదర్శ, గురుకులాలు కలిపి కర్నూలు జిల్లాలో 16, నంద్యాలలో 23 పాఠశాలలు ఉన్నాయి.

● ఒక్కో పాఠశాలల నుంచి ఆసక్తి ఉన్న 50 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. పాఠశాలల వారీగా మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, వాటి ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విశ్లేషించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

● పది మంది విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేసి ప్రాజెక్టు చేపడతారు. ఈ బాధ్యతను వ్యవసాయ పరిశోధనా స్థానాలు, భూసార పరీక్షా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయశాఖ, విద్యాశాఖ అధికారులకు అప్పజెప్పారు.

● "విద్యార్థులకు విద్యతో పాటు భూసారం, మట్టి నమూనాలు సేకరణ, రికార్డుల నిర్వహణ, మట్టి నమూనాల విశ్లేషణ, ఫలితాల విశ్లేషణ, భూసారాన్ని అంచనావేసి దానికి తగ్గట్టుగా ఎరువుల వాడకం తదితరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడమే ఎస్ఎస్‌హెచ్‌సీ ప్రోగ్రామ్ ఉద్దేశమని" రైతు శిక్షణ కేంద్రం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి మద్దిలేటి తెలిపారు.

మట్టిని సేకరిస్తున్న విద్యార్థులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

పెరిగిన పొదలు.. పర్యాటకుల అవస్థలు

బనగానపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామ సమీపంలో బిల్వస్వర్గం గుహలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో గుహలకు వెళ్లే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఈ దారిలోనే పర్యాటకులు గుహల సందర్శనకు వెళ్తుంటారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, రామకృష్ణాపురం (బనగానపల్లి గ్రామీణం)

కనిపించని పచ్చదనం.. నిర్వహణ శూన్యం

ప్యాపిలి మండలంలోని పోతుదొడ్డి గ్రామానికి వెళ్లే జాతీయ రహదారి మధ్యలోని విభాగినిపై అధికారులు మొక్కలు పెంచారు. విభాగినులపై మొక్కలు నాటి, పర్యవేక్షించాల్సిన హైవే యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. పోతుదొడ్డి గ్రామ సమీపంలోని విభాగినిలో పలు చోట్ల మొక్కలు కనిపించక కేవలం గడ్డి మాత్రమే కనిపిస్తోంది. పలు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డితోపాటు మొక్కలు కూడా ఎండిపోయాయి. అధికారులు స్పందించి జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ప్యాపిలి

చూడకుంటే.. కడ్డీలు గుచ్చుకుంటాయ్

ఆళ్లగడ్డ మండలంలోని దిగువ అహోబిలం తిరువీధుల్లో కాల్వల వద్ద భక్తుల రక్షణగా ఏర్పాటు చేసిన ప్రహరీ కడ్డీలు ప్రమాదకరంగా మారాయి. కడ్డీలు విరిగి బయటకు రావడంతో రాకపోకలు సాగించే సమయంలో భక్తులకు గుచ్చుకునే ప్రమాదం ఉంది. ప్రధానంగా ఆలయం ఎదుట వీధిలో వాహనాలు ఢీ కొట్టడంతో కడ్డీలు బయటకు చొచ్చుకొని వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆలయ నిర్వాహకులు కడ్డీలు సరి చేయాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

రగ్బీ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు జరుగనున్న దక్షిణ మండలం జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు గురువారం ప్రకటించారు. సబ్ జూనియర్ అండర్-15, జూనియర్ అండర్-18 మహిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గురువారం నగరంలోని ఆదర్శ విద్యా మందిరంలో అభినందన సభ ఏర్పాటు చేసి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ డా.హరికిషన్, జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు సురేందర్, జట్టు మేనేజరు దివ్య, మానస, చంద్రకళ, శిక్షకులు శ్రీకాంత్, సుమంత్, బాలాజీ పాల్గొన్నారు.

దక్షిణ మండలం జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు

క్లస్టర్ యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో క్లస్టర్ విశ్వవిద్యాలయం భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని, తక్షణమే నిధులు మంజూరు చేసి వర్సిటీని పూర్తిస్థాయిలో ప్రారంభించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో గురువారం ఆమె మాట్లాడారు.

సెపక్‌తక్రా.. ఆదోని క్రీడాకారుల సత్తా

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఓ వైపు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే.. మైదానంలో గెలుపు మెరుపులు చూపుతున్నారు ఆదోని పట్టణానికి చెందిన యువ క్రీడాకారులు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి.. రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా పోటీల్లో విజేతగా నిలిచి కప్పును సొంతం చేసుకున్నారు. నిత్య సాధన.. గెలుపే లక్ష్యంగా.. సాగుతున్నారు. ఆదోని పట్టణంలోని డాక్టరు జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ముగ్గురు యువ క్రీడాకారులు సెపక్‌తక్రా క్రీడ తమ సత్తా చాటుతున్నారు. కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు ప్రోత్సాహంతో కోచ్ కె.సురేంద్ర క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీలక్ష్మి బీపీఈడీ కళాశాలలో జరిగిన అంతర్ డిగ్రీ కళాశాలల సెపక్‌తక్రా పోటీల్లో డాక్టరు జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల జట్టు విజయకేతనం ఎగురవేసి కప్పును సొంతం చేసుకుంది. ఈ విజయంలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభకనబరచి జట్టు విజయానికి తోడ్పాటు అందించారు.

సెపక్‌తక్రా క్రీడలో సాధన చేస్తున్న క్రీడాకారులు

'అరవింద' సమేత జయం

ఆదోని అమరావతినగర్‌లో నివాసం ఉంటున్న బి.రంగనాథ్, శకుంతల దంపతుల కుమారుడు బి.అరవింద్ బీకాం కంప్యూటర్స్ చదువుతున్నాడు. సెపక్‌తక్రా క్రీడలో సెంటర్ సర్వర్ క్రీడాకారుడిగా బరిలో దిగి జట్టు విజయానికి అవసరమైన పాయింట్లు సాధించిపెట్టడంలో దిట్ట. ఇటీవల కర్నూలులో జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా తుది పోరులో కళాశాల జయకేతనం ఎగురవేయడంలో కీలకంగా వ్యవహరించాడు. జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యమని, అందుకు తగినట్లు సాధన చేస్తున్నానని చెబుతున్నాడు అరవింద్.

రక్షణ శాఖ కొలువే అఖిల్ లక్ష్యం

ఆదోని పట్టణం అరుళయ్య వీధిలో నివాసం ఉంటున్న బి.హనుమంతు, బి.అంజలి దంపతుల కుమారుడు బి.అఖిల్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల కోచ్ వద్ద సెపక్‌తక్రాలో శిక్షణ పొందుతున్నారు. రైట్ సర్వర్‌గా బరిలో దిగి ప్రత్యర్థులను బోల్తా కొట్టించి పాయింట్లు సాధిస్తున్నాడు. ఈ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు కష్టపడి చదవి రక్షణ శాఖలో ఉద్యోగం సాధించి దేశ రక్షణలో తాను సైతం సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నానంటున్నాడు విద్యార్థి అఖిల్.

వీరేంద్ర ప్రతాపం

ఆదోని పట్టణం కార్వన్‌పేటలో నివాసం ఉంటున్న బి.రాము, బి.రంగమ్మ దంపతుల కుమారుడు బి.వీరేంద్ర బీకాం కంప్యూటర్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల తరపున ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల సెపక్‌తక్రా తుది పోరులో లెఫ్ట్ సర్వర్‌గా బరిలో దిగి పాయింట్లు సాధించి జట్టు విజయానికి తోడ్పాటు అందించాడు. బాగా చదవి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి పలువురు క్రీడాకారులను తయారు చేయడమే తన లక్ష్యమని చెబుతున్నాడు వీరేంద్ర.

పోలీసుల నిర్లక్ష్యం.. యువతికి వైకల్యం

- బస్సు బోల్తా పడి అరచేయి తెగిపడిన యువతి
- చేతిభాగాన్ని వదిలేసి బాధితురాలిని ఆసుపత్రికి పంపిన తెలంగాణ పోలీసులు
- దివ్యాంగురాలిగా మిగిలిన బాధితురాలు

స్నేహలత

తెగిపోయిన అరచేయి

ఈనాడు, కర్నూలు: తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు దగ్గర గురువారం తెల్లవారుజామున బస్సు బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలై ఎడమ అరచేయి తెగిపోయిన స్నేహలత(23)ను తెలంగాణ పోలీసులు హుటాహుటిన కర్నూలు పంపారు. అయితే తెగిపడిన అరచేయి భాగాన్ని పంపడం మరిచిపోయారు. కర్నూలు వచ్చిన తరువాత వైద్యులు ఆ అరచేతిని రెండు గంటల్లో తెస్తే తిరిగి అతికించవచ్చని చెప్పినా పట్టించుకునేవారే కరవయ్యారు. తెగిపడిన అరచేతిని సకాలంలో తేలేకపోవడంతో ఆమె శాశ్వతంగా దివ్యాంగురాలిగా జీవించాల్సిన దుస్థితి తలెత్తింది.

కుటుంబానికి ఆమే ఆధారం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన దేవరకొండ స్నేహలత బీఫార్మసీ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. నిరుపేదలైన తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మిలకు ఆర్థికంగా అండగా ఉంటున్నారు. చెల్లి అక్షితను ఇంటర్ చదివిస్తున్నారు. తల్లికి ఒంట్లో బాగోలేదని తెలియడంతో స్నేహలత బుధవారం రాత్రి హడావుడిగా అనంతపురం బయల్దేరారు. బస్సు ఇటిక్యాలపాడు వద్ద బోల్తా కొట్టడంతో ఆమె అరచేయి తెగి, సంఘటనా స్థలంలోనే పడిపోయింది. విరిగిపడ్డ అరచేతిని వదిలేసి పోలీసులు ఆమెను కర్నూలుకు పంపారు. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే చేయి వస్తుందని ఎవరో చెప్పడంతో ఆమె ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అరచేతిని తెచ్చుకుంటే ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పడంతో బాధితురాలు తన బంధువును ఘటనాస్థలికి పంపించారు. వారు అరచేతి భాగాన్ని కర్నూలు తీసుకొచ్చేసరికి సమయం మించిపోయింది. అందులోని కణాలన్నీ అప్పటికే నిర్వీర్యమైపోవడంతో దాన్ని అతికించడానికి అవకాశం లేదని వైద్యులు తేల్చిచెప్పారు. పోలీసులు తెగిపడిన చేతిభాగాన్ని కూడా ఆసుపత్రికి పంపించి ఉంటే మరికొన్ని నెలలకైనా ఆమెకు చెయ్యి వచ్చేదని.. వారి పొరపాటుతో తమ కుమార్తె శాశ్వతంగా దివ్యాంగురాలిగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆసుపత్రికి వచ్చిన ఆర్టీసీ అధికారులు తాము ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించలేమని తెగేసి చెప్పేశారు. దీంతో బాధితురాలి బంధువులు వారి వాహనం ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం ఖర్చు భరించే స్థోమత లేకపోవడంతో యువతి తల్లిదండ్రులు కన్నీటిపర్యంత మవుతున్నారు.

భక్తుల భద్రతే ధ్యేయంగా మాక్‌డ్రిల్

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో భక్తుల భద్రతే లక్ష్యంగా మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు డీఎస్పీ ప్రమోద్ పేర్కొన్నారు. గురువారం అహోబిలం ఆలయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, తొక్కిసలాట, వ్యక్తిగత భద్రతకు ముప్పు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించాల్సిన తీరుపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. అగ్నిమాపక, వైద్య, పోలీసు విభాగాల పాత్ర, వారి బాధ్యతలను స్పష్టంగా వివరించారు. ఊహించని ఘటనలు ఎదురైనపుడు వృద్ధులు, చిన్నారులు, గర్భిణులను రక్షించే విధానాలను తెలియజేశారు. బ్రహ్మోత్సవాలకు ముందస్తు సంసిద్ధతను నిర్ధారిస్తూ వైద్య, అగ్నిమాపక, పోలీసు, ఆలయ నిర్వాహకుల సమన్వయంతో మాక్‌డ్రిల్ జరిపారు. కార్యక్రమంలో సీఐలు బి.వి.రమణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఉగాది నాటికి 10,178 గృహాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద మంజూరైన 2,348 గృహాల్లో 584 వరకు ప్రారంభమయ్యాయని మిగిలినవి నెలాఖరులోగా ప్రారంభించాలన్నారు. పేదల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాధాన్య అంశాల అమలులో ప్రజల సంతృప్తి స్థాయి పెంచే దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆమె గురువారం సమీక్షించారు. పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలన్నారు. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. ప్రతి పారామీటరుకు ప్రభుత్వం మార్కులు కేటాయించిన నేపథ్యంలో ఏ అంశంలోనూ నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు 35 ప్రభుత్వ ఆసుపత్రులు, 28 పాఠశాలలు, 41 రేషన్ దుకాణాలు, 13 బస్‌స్టేషన్లలో ప్రజల సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్నట్లు నివేదికలు వెల్లడించిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సీఎఫ్‌ఎంఎస్ ఐడీ కలిగిన ప్రతి ఉద్యోగి కనీసం 40 కోర్సులు పూర్తి చేయాలని, లేకుంటే వార్షిక ఇంక్రిమెంట్లు నిలిపివేసే చర్యలు తీసుకుంటామన్నారు.

చాగలమర్రి: కార్యక్రమంలో పాల్గొన్న హిందూ ఐక్య సంఘం నాయకులు

గొప్ప పాలనాదక్షుడు.. ఛత్రపతి శివాజీ

చాగలమర్రి, న్యూస్‌టుడే: హిందూ సామ్రాజ్య స్థాపకులు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని చాగలమర్రిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక న్యూబిల్డింగ్స్ సమీపంలో తెదేపా నాయకులు జెట్టి నాగరాజు, రామలింగేశ్వరాలయ ఆవరణలో అభినవ శంకరానందస్వామి, హిందూ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశంలో హిందూ సామ్రాజ్య స్థాపనకు శివాజీ చేసిన కృషిని కొనియాడారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు దేశం, ధర్మరక్షణ కోసం పనిచేయాల్సిన అవసరముందని హిందూ ధర్మరక్ష వ్యవస్థాపకులు చికోటి ప్రవీణ్ తెలిపారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్ట్‌లైన్ ప్రాంతంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో చికోటి ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. హైందవ ధర్మ రక్షణతో పాటు మన గుడి, బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మామిడి సాగుపై రైతులకు అవగాహన

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు

యాగంటిపల్లి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు పాటించి మామిడి పూత రాలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, వ్యవసాయ శాస్త్రవేత్త డా.హేమాద్రి పేర్కొన్నారు. మండల పరిధిలోని యాగంటిపల్లి గ్రామంలో బనగానపల్లి ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గోడ కూలినా.. గోడు వినరు

ఆదోని రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలోని మున్సిపల్ మైదానం ప్రహరీ మధ్యలో పెద్ద రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. మైదానం ఆవరణలోని మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలల విద్యార్థులు గోడ మధ్యలో ఏర్పడిన రంధ్రంలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గోడ కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు స్పందించి గోడకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ

వేతన సవరణ అమలు చేయాలి

నిరసన తెలుపుతున్న సహకార సంఘాల ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నేతలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జీవో నంబరు 36ను వెంటనే అమలు చేయాలని.. 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను అమలు చేయాలని ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వీరభద్రుడు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డీసీసీ బ్యాంకు ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. కొన్నేళ్లుగా సమస్యలతో సతమతమవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. లేదంటే పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, ఆదినారాయణ, శ్రీనివాసులు, అక్తర్‌బాషా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : శాప్ క్రీడా సంబరాల్లో భాగంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీన కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం తెలిపారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 23వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా /Rhttps:/ports.gov.in// homendex వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కర్నూలులో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్
కర్నూలు, ఆంధ్రప్రదేశ్-518003.
ఫోన్ : 94409 05481 & 99499 15723

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): 1) M/s పృథ్వీ ఇండస్ట్రీస్ (ఋణగ్రహీత), ప్రొప్రయిటర్ : శ్రీమతి చిర్రా ఉదయ, సర్వే నెం.240/2, చెట్లమల్లపురం, పాత బెంగళూరు సిటీ, కల్లూరు, కర్నూలు-518218. 2) శ్రీమతి చిర్రా ఉదయ (ప్రొప్రయిటర్), భర్త: చిర్రా జయరామ్ రెడ్డి, హెచ్.నెం.182/B, ధనలక్ష్మి సొసైటీ, రోడ్ నెం.10, మహీంద్రా హిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్-500026. 3) శ్రీమతి సిహెచ్ రాధిక రెడ్డి (హామీదారు), భర్త : సిహెచ్ వి. రెడ్డి, 202, జ్యోతి అబోడ్, కపాడియా లేన్, సోమాజిగూడ, హైదరాబాద్-500003 వారు తేది. 17-02-2026 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.4,82,53,675.72/- + తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 24-03-2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 24-03-2026, ఉ॥ 10.30 గం.లకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (E-bkray) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 23-03-2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, రాజేంద్ర నగర్ మండలం (ప్రస్తుతం గండిపేట మండలం), మణికొండ జాగీర్ గ్రామం, సర్వే నెం.201 నందు విస్తీర్ణం 13.56 ఎకరాల భూమిలో అవిభాజ్యమైన విస్తీర్ణం 38.79 చ॥గ॥లు లేదా 349.10 చ॥అ॥లు వాటాతో లాంకో హిల్స్‌లోని టవర్ - 6LH (ఆరు LH), G+30 అంతస్తుల కాంప్లెక్స్‌లోని 9వ అంతస్తు (గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి) లోని ఫ్లాట్ నెం.904 (3 BHK) విస్తీర్ణం 2489 చ॥అ॥ మరియు బేస్‌మెంట్‌లో ఒక్కో కారు పార్కింగ్ ఏరియా విస్తీర్ణం 134.55 చ॥అ॥తో 3 కార్ల పార్కింగ్‌తో గల స్థిరాస్తి శ్రీమతి చిర్రా ఉదయ, భర్త: సిహెచ్. జయరాం రెడ్డి గారి పేరున కలదు. ఫ్లాట్ నెం.904 కు హద్దులు: ఉత్తరం: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, తూర్పు: కారిడార్ & ఎదురుగా ఫ్లాట్ నెం.901, పడమర: శూన్యాకాశం. భూమి హద్దులు: ఉత్తరం: ప్రైవేట్ భూమి, దక్షిణం: APIIC మరియు ఇతరుల భూమి, తూర్పు: APIIC భూమి, పడమర: రోడ్డు.

రిజర్వు ధర: రూ. 1,98,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 19,80,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, చెన్నమ్మ సర్కిల్ బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 94409 05481.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 17-02-2026, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మద్యం మత్తులో భార్యకు నిప్పు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన నందికొట్కూరు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని అల్లూరు రహదారిలో మల్లికార్జున, కల్యాణి (28) నివసిస్తున్నారు. వీరి ఇంట్లో ప్రతిరోజూ గొడవలు జరుగుతుండేవి. మల్లికార్జున బంధువుల ఇంట్లో గురువారం లగ్నపత్రిక ఉండటం.. అక్కడికి వెళ్లేందుకు కల్యాణికి ఇష్టం లేక పుట్టింటికి బయలుదేరింది. ఆమెను అడ్డుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లికార్జున తాగిన మత్తులో తన ద్విచక్ర వాహనానికి తెచ్చుకున్న పెట్రోలును కల్యాణి ఒంటిపై పోసి నిప్పు పెట్టినట్లు సమాచారం. ఇరుగు పొరుగువారు వచ్చి మంటలు ఆర్పేశారు. బాధితురాలిని నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు.

గుండెనొప్పితో పాలకోవా వ్యాపారి మృతి

షేక్ బాషా (పాత చిత్రం)

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన పాలకోవా తయారీ వ్యాపారి షేక్ బాషా (43) గురువారం గుండెనొప్పితో మృతి చెందారు. అతను చాలాఏళ్లుగా పాలకోవా తయారుచేస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు సైతం తీసుకెళ్లి విక్రయించేవారు. తెలంగాణ రాష్ట్రంలో కొద్దిరోజుల కిందట మేడారంలో జరిగిన వివాదంతో అతని వ్యాపారం పూర్తిగా పడిపోయింది. పాలకోవా వ్యాపారం కోసం గేదెలను ప్రత్యేకంగా కొనుగోలు చేశారు. ఆటోలు సైతం కొనుగోలు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దాదాపు రెండు వారాలుగా వ్యాపారం లేకపోవటం, గేదెల పోషణ భారంగా మారడం.. పాలకోవా తయారు చేసే కార్మికులకు కూలీల చెల్లింపు ఆగిపోవడంతో మానసికంగా కుంగిపోయేవారని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

బోల్తాపడిన బస్సు.. 20 మందికి గాయాలు

ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధి ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏపీ ఎస్‌ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో 19 మంది ప్రయాణికులు, బస్సు డ్రైవర్ గాయపడ్డారు. సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. 108 సిబ్బంది, ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (సూపర్ లగ్జరీ) బుధవారం రాత్రి 10 గంటలకు హైదరాబాదు నుంచి బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు ఉండవల్లి మండలంలోని ఇటిక్యాలపాడు స్టేజి దాటింది. డ్రైవర్ జయరాముడు బస్సును అతివేగంగా అజాగ్రత్తగా నిద్రమత్తులో నడపటంతో జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో అనంతపురానికి చెందిన స్నేహలత చేయి అరచేతి వరకు తెగి పడిపోయింది. అరుణ, రంగన్న, శివ, వీరేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు బస్సు డ్రైవర్ సహా గాయపడిన వారిని నాలుగు అంబులెన్స్‌లలో కర్నూలు ఆసుపత్రులకు తరలించారు. ఘటనపై ప్రయాణికుడు రంగన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని అలంపూర్ సీఐ ప్రదీప్‌కుమార్, రవాణా శాఖ అధికారి రాములు, కర్నూలు డిపో మేనేజర్ మురళీధర్ పరిశీలించారు.

బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దువ్వూరు, న్యూస్‌టుడే: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన గురువారం వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో జరిగింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన హనుమంతు, శివపార్వతి, మధులు కడపకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటో ఢీకొంది. గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 73821 14647.

JOBS

Wanted PRO Qualification any Inter/ Degree. Vani Multi Speciality Hospitals, Dhone. ✆ 95155 59593.

Team Leadersగా కర్నూలు, నంద్యాల ఏరియాలలో on role / off role లో M/F కావలెను. PF + జీతం, Q: డిగ్రీ/MBA, MCA ✆ 94403 51657.

సిమెంట్ కంపెనీల యందు సెక్యూరిటీ గార్డుగా పనిచేయుటకు వ్యక్తులు కావలెను జీతం 18 వేలు, 22 వేలు, 25 వేలు, 28 వేలు మాజీ సైనికులకు 30 వేలు ✆ 90521 24024, 94943 64596.

Rize Academy లో జాబ్ కర్నూలులో చేయుటకు టెలీకాలర్స్ కావలెను. అర్హత, అనుభవానికి జీతం ఉండును. సంప్ర: 88864 44720, 79818 86828.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు లేడి టెలీకాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 13 వేలు to 15 వేలు, లిమిటెడ్ వేకెన్సీస్. సంప్ర: 09177 132168.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రతిభా పాటవాలు వెలికితీయాలి

విద్యార్థి గీసిన చిత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను గుర్తించి వెలికితీయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు జిల్లాస్థాయి కళలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. డీఈవో గురువారం పాల్గొని విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలించారు. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏఎంవో మాధవీలత, బనగానపల్లి మండలం విద్యాశాఖాధికారి స్వరూపరాణి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నంద్యాల విద్యాశాఖ అధికారులు బ్రహ్మానందం, శివరాం పాల్గొన్నారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

అభ్యంతరాలు తెలపండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రైతునగరం, నూనెపల్లె వార్డుల పరిధిలోని సర్వే నంబర్లు 279, 460-8లో ఉన్న అనధికార లేఅవుట్‌లో సవరణ ఉత్తర్వులను అనుసరించి తయారు చేసిన ముసాయిదాపై అభ్యంతరాలుంటే తెలపవచ్చని కమిషనర్ శేషన్న గురువారం తెలిపారు. మార్చి 5వ తేదీలోగా రాతపూర్వకంగా గానీ, ఈ-మెయిల్ ద్వారా అభ్యంతరాలు తెలియజేయొచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

?:పెద్దబండ సమీపంలో, బైబిల్ ప్రాంతంలో కాలువ శుభ్రం చేయడం లేదు. - **రంగయ్య, సుబ్బన్న**

?:పట్టణంలోని నీలి వీధిలో దోమల బెడద అధికంగా ఉంది. ఇబ్బందులు పడుతున్నాం. - **సుధాకర్**

?:పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. - **శరత్** ✓: కాలువలను శుభ్రం చేయించి దోమల మందు పిచికారీ చేయిస్తాం. కుక్కలను పట్టిస్తాం. - **లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నంద్యాల.** - న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం

?:ఒక్కీనగర్‌లో మురుగు వద్దనున్న చేతిపంపు పని చేయడం లేదు. నీటి సమస్య తలెత్తుతోంది. - **నారాయణ** ✓:చేతిపంపుకు మరమ్మతులు చేయిస్తాం. - **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ** ?: కొత్తపేట కాలువల్లో పూడిక తొలగించి గట్టుపై వేశారు. తిరిగి కాలువలోకి చేరుతోంది. - **రసూల్** ✓: పూడికను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **జీవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**- న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కృషి

మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సుధీర్

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమైందని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరదోణ సుధీర్, ఉపాధ్యక్షుడు మామిళ్లపల్లి ప్రభాకర్‌శర్మ అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.359 కోట్లు కేటాయించిందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు అరవిందప్రసాద్, బాలమురళీకృష్ణ, రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్సవాలు విజయవంతం

మహానంది, న్యూస్‌టుడే: సమష్టి కృషితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు పేర్కొన్నారు. మహానంది పుణ్యక్షేత్రంలో గురువారం దేవస్థానం సిబ్బందికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఏడాదికంటే ఈసారి మరింత సమర్థంగా విధులు నిర్వహించారని సిబ్బంది సేవలను కొనియాడారు. ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరావు, పసుపుల సుబ్బారెడ్డి, ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులను సత్కరించారు.

రూ.లక్షలు పోసి.. పరికరాలన్నీ నాసి

■ అధ్వానంగా బహిరంగ వ్యాయామశాలలు

పరిశీలన

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యం, అవసరాల నిమిత్తం రూ.లక్షలు వెచ్చించి పట్టణ పరిధిలోని పార్కులు, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన వ్యాయామశాలలు అలంకారప్రాయంగా మారాయి. చాలాచోట్ల పరికరాలు విరిగిపోయాయి. మరికొన్ని అపహరణకు గురయ్యాయి. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం వృథా అయింది. నంద్యాల పట్టణ పరిధిలో మొత్తం 10 ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. ఒక్కో వ్యాయామశాలలో 9 పరికరాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం భారీగా నిధులు వెచ్చించారు. పరికరాలు నాసిరకంగా ఉండటం.. నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. పట్టణంలోని వైఎస్సార్ నగర్, నర్స్ క్వార్టర్స్ ప్రాంతాల్లో గత కొన్నేళ్ల కిందట సుమారు రూ.14 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కొన్ని విరిగిపోయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. అయినప్పటికీ మరమ్మతులు చేయించలేదు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

★ పట్టణంలోని చెరువుకట్టపై మహిళలు, పురుషులకు వేర్వేరుగా రూ.15 లక్షలకుపైగా నిధులు వెచ్చించి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. మహిళలు ఉపయోగించే పరికరాల్లో చాలావరకు దెబ్బతిన్నాయి. నాణ్యత లేకపోవడంతో ఎక్కడికక్కడ మూలనపడ్డాయి. పురుషులు ఉపయోగించుకునే పరికరాల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. కొన్నింటి వద్ద సిమెంటు దిమ్మెలు ధ్వంసమయ్యాయి. వాటిపైనే వ్యాయామం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



చెరువు కట్టపై దెబ్బతిన్న వ్యాయామ పరికరాలు

★ ఎన్జీవో కాలనీలోని రామాలయం, నూనెపల్లె పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో గతంలో రూ.14 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఇందులో చాలావరకు ఉపయోగించే స్థితిలో లేవు.

★ పట్టణంలోని లలితానగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, పార్కు రోడ్డులో దాదాపు రూ.23 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యాయామశాలల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది.

ప్రజాధనం పక్కదారి

★ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణపై పురపాలక సంఘం అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు చోరీకి గురవుతున్నాయి. మరికొన్నిచోట్ల రబ్బరు సీలు, బోల్టులు తీసేశారు.

★ బహిరంగ వ్యాయామశాలల కోసం పురపాలక సంఘం అధికారులు భారీగా నిధులు వెచ్చించారు. అయినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేకపోవడం గమనార్హం.

నేడు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోటమకమ్మ, చౌడేశ్వరి దేవి, గంగమ్మ అమ్మవార్ల ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో గురువారం దేవతా కలశస్థాపన, నవగ్రహ పూజ, వాస్తు పూజ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆయన సోదరుడు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం ఆలయాల్లో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఆలయ ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు సైతం తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

వాల్వు గుంత.. వాహనదారుల చింత

పట్టణంలోని రమునాథ్ సెంటర్‌లో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి పక్కన వాల్వు మరమ్మతుల కోసం గుంత తవ్వారు. మరమ్మతులు చేసి గుంతలో పైపు ఏర్పాటు చేశారు. దాదాపు పది రోజులవుతున్నా గుంత పూడ్చకపోవటంతో జనం ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి కావడం.. ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం**

కుంగిన దారి.. ముప్పే మరి

నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి ఎన్జీవోస్ కాలనీ వెళ్లే సీసీ రహదారి దెబ్బతింది. వరుసకు ఇవ్వడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. పురపాలక సంఘం అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం**

చెత్త తొలగక.. దుర్గంధం వదలక

నంద్యాల పట్టణం.. శ్రీనివాసనగర్‌లోని నేషనల్ కళాశాలకు వెళ్లే రహదారిలో ఉన్న చెత్త కుండి నిండిపోయి రహదారిపై చెత్త పేరుకుపోతోంది. జనం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, వైద్యశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఫలితంగా నిత్యం రద్దీగా ఉంటుంది. పుర అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నంద్యాల పురపాలకం**

ప్రహరీ లేక.. రక్షణ కానరాక

నెహ్రూనగర్ గ్రామంలోని జడ్పీ పాఠశాల క్రీడా మైదానానికి రక్షణ గోడ కరవైంది. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 400 మందికిపైగా విద్యార్థులు చదువుకొంటున్నారు. రక్షణ గోడ లేకపోవడం.. చుట్టూ ముళ్లపొదలు ఉండటంతో విష పురుగులు మైదానంలోకి వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వెంటనే ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పగిడ్యాల**

మహానందిలో భక్తజనం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రం గురువారం భక్తులతో కళకళలాడింది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో సందడిగా మారింది. క్షేత్రంలోని పవిత్ర రుద్రగుండం, విష్ణుగుండాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు తదితరాలు చేయించుకున్నారు. మరోవైపు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహానంది ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

క్యూలో దర్శనానికి వెళుతున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల టీబీ యూనిట్‌లో లైఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు డా.లక్ష్మీసౌజన్య సహకారంతో టీబీ బాధితులకు పోషకాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. టీబీ యూనిట్ అధికారి డా. అంకిరెడ్డి, సమన్వయకర్త నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నంద్యాల కలెక్టరేట్ వద్ద ఈనెల 23, 24 తేదీల్లో నిరవధిక దీక్షలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద గురువారం గోడపత్రాలను ఆవిష్కరించారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మల్యాల జడ్పీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నందికొట్కూరు పట్టణానికి చెందిన సామాజికసేవ కార్యకర్త శివశంకర్ అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలకు కుర్చీలు అందజేశారు.

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీఎస్ఈ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బింద్య సింగ్, డాక్టర్ కవిత చోరడియా ముఖ్య అతిథులుగా పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఆంధ్రా వర్సిటీలో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను నిషేధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నిరసన చేపట్టారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పనిభారం, ఒత్తిడి తగ్గించాలని రెవెన్యూ సిబ్బంది కోరారు. ఈ మేరకు గురువారం నిరసన చేపట్టి తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

1930 నంబరుకు ఫిర్యాదు చేయండి

కొత్తపల్లె (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: సైబర్ నేరం జరిగితే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని నంద్యాల సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యుడు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలందరూ చరవాణిలో శక్తి యాప్ ఉండాలని సూచించారు. ఆపద సమయంలో శక్తి యాప్ నంబరు 7993485111కు ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తామని చెప్పారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

సమ్మె నోటీసు అందజేస్తున్న సొసైటీ ఉద్యోగులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా సహకార సంఘాల్లో పనిచేస్తున్న సొసైటీ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని యూనియన్ నాయకులు శ్రీరాములు యాదవ్, నాగేశ్వరరావు డిమాండు చేశారు. నిరవధిక ఆందోళనలో భాగంగా తాము సమ్మెలోకి వెళ్తున్నామంటూ ఆత్మకూరు, వేంపెంట, నాగంపల్లి సొసైటీ ఉద్యోగులు గురువారం కేడీసీసీ బ్యాంకు మేనేజరుకు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ జీవో నంబరు 36 అమలు చేయాలని. పెండింగులో ఉన్న వేతన సవరణ అమలు చేయాలని కోరారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని.. 2019 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విన్నవించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : వెలుగోడు పట్టణానికి చెందిన కోవాబన్ వలి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం, ఆవాజ్ కమిటీ నాయకులు రాజశేఖర్, మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. వెలుగోడు పట్టణంలో వలి కుటుంబాన్ని ఆయా సంఘాల నేతలు గురువారం పరామర్శించారు. వెలుగోడు నుంచి మేడారం వెళ్లి రూ.10కి బన్ను విక్రయిస్తుండటాన్ని సహించలేని పలువురు విష ప్రచారం చేశారని.. వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

రూ.30 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం

పనులను ప్రారంభించిన తెదేపా నాయకురాలు శశికళాకొండారెడ్డి తదితరులు

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పలు వార్డుల్లో రూ.30 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెదేపా నాయకురాలు గంగవరపు శశికళాకొండారెడ్డి పేర్కొన్నారు. గాజులపల్లె గ్రామంలో రహదారుల నిర్మాణాలకు గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పల్లెల ప్రగతిని కాంక్షించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల జిల్లా కేసీ కాలువ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినీలు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేలా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రయోజనాలను కలిగించేందుకు నిరంతరం పాటుపడుతామని స్పష్టం చేశారు.

మల్లన్న సేవలో ఔషధ మొక్కల బోర్డు సీఈవో

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను రాష్ట్ర ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆవుల చంద్రశేఖర్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

భాజపాలో పలువురి చేరిక

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని భాజపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. అభిరుచి మధు ఆధ్వర్యంలో సీపీఐ, గిరిజన సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో భాజపా బలోపేతమవుతోందని చెప్పారు. అన్నివర్గాల ప్రజలు పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

పార్టీలో చేరినవారితో భాజపా జిల్లా అధ్యక్షుడు మధు

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి జీవితాలను కాపాడుకోవాలని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయని చెప్పారు.

రూ.36 లక్షలతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లె గ్రామ సంచాయతీ మజరా ఆంజనేయపురంలో రూ.36 లక్షలతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఎనలేని కృషి చేశారని గోపవరం సింగిల్ విండో ఛైర్మన్ గంగవరపు ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల, న్యూస్‌టుడే : ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు సుబ్బరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్ గురువారం సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

శాస్త్రీయ దృక్పథం తప్పనిసరి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎంఈవో యశోద పేర్కొన్నారు. బండిఆత్మకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ ఆధ్వర్యంలో అటల్ కమ్యూనిటీ అవుట్‌రీచ్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్యామల, శేషు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేశారు. అటల్ సైన్స్ ల్యాబ్ ఉపాధ్యాయురాలు అనిత, సైన్స్ ఉపాధ్యాయులు జైనాబీ, ఫయాజుద్దీన్, రఫి, హసీనా, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

యువతకు ఛత్రపతి శివాజీ ఆదర్శం

శివాజీ చిత్రపటానికి పూలమాల వేసిన ప్రిన్సిపల్ సుబ్బయ్య తదితరులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. శివాజీ ధైర్యసాహసాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపల్ కేవీవీ సుబ్బయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇంతియాజ్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పనిభారం తగ్గించాలని వీఆర్వోల సంఘం నాయకులు వేణుగోపాల్, అశోక్ డిమాండ్ చేశారు. కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ పనులతో పాటు వివిధ సర్వేల పేరుతో తమపై భారం మోపుతున్నారని చెప్పారు. సచివాలయ సర్వే పనులను మినహాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీనివాసులు, రామసుబ్బయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : నిరసన తెలుపుతున్న వీఆర్వోలు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఓపీని ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తదితరులు

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: ఉచిత వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఐఎంఏ ఆధ్వర్యంలో గురువారం నుంచి నెల రోజుల పాటు పద్మావతినగర్‌లో ఉన్న జీఎస్ఆర్ ఆసుపత్రిలో డా.మహమ్మద్ రఫీ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని డా.రవికృష్ణ, నంద్యాల అధ్యక్షుడు డా. శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డా.మహమ్మద్ రఫీ, డా. ఆరీఫా, ఐఎంఏ సభ్యులు డా.మధుసూదన్‌రావు, డా. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగక.. వాహనాలు కదలక

● ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక పరిధిలోని పలు రహదారులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురయ్యాయి. పలువురు దుకాణదారులు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. పరిస్థితి ఇలా ఉన్నా పురపాలక సంఘం అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

నందికొట్కూరు పురపాలక పరిధిలో కర్నూలు-గుంటూరు (కేజీ), పగిడ్యాల, మిడుతూరు రహదారులు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. వ్యాపార కేంద్రంగా పట్టణానికి గుర్తింపు ఉండటంతో నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, గడివేముల తదితర మండలాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీతోపాటుగా జనాల రాకపోకలతో కిటకిటలాడుతూ ఉంటుంది. 340సీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తై.. వాహనాల రాకపోకలు ఎక్కువవడంతో మిడుతూరు రోడ్డు, పట్టణంలోని ఆసుపత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి.

కేజీ రహదారిపై వాహనాల పార్కింగ్

రోడ్లపైనే ఆపుతూ..

పట్టణ పరిధిలోని రహదారులు ఆక్రమణలకు గురవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పగిడ్యాల రహదారి మరింత అధ్వానంగా మారింది. చాలా మంది దుకాణదారులు కాలువలను దాటి ఏకంగా ఆర్అండ్‌బీ రహదారిపైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. మిడుతూరు రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేజీ రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండటంతో ఏడేళ్ల కిందట రహదారిని 8 అడుగుల చొప్పున ఇరువైపులా విస్తరించినా ప్రయోజనం లేకపోయింది. ఈ రహదారిలో దుకాణాల ముందు వాహనాలను అడ్డంగా ఆపేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

పట్టణ జనాభా: 56 వేలు
మొత్తం వార్డులు: 29
రోజూ తిరిగే వాహనాలు: 40 వేలకుపైగా

నిబంధనలు ఉల్లంఘిస్తూ..

☛ పగిడ్యాల రహదారిలోని పాత బస్టాండు, పటేల్ కూడలి, మిడుతూరు రహదారి, శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం సర్కిల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడంతో ఏ వాహనదారుడు ఎటు వైపు నుంచి వస్తున్నారో తెలియని పరిస్థితి. ఎవరూ నిబంధనలు పాటించడం లేదు.

☛ ఆయా మార్గాల్లో వాహనాలు ఢీకొని పలువురు ఆస్పత్రుల పాలైన ఘటనలున్నాయి.

☛ ఈ నేపథ్యంలో పురపాలక, పోలీసు శాఖ అధికారులు స్పందించి సమన్వయంతో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తే జనం కష్టాలు తీరుతాయి.

26న మెగా ఉద్యోగమేళా

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆత్మకూరులోని కేవీకే స్టేడియంలో 26వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో ఛైర్మన్ షహబుద్దీన్, వీఆర్ఎస్పీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, తెదేపా పట్టణ, మండల అధ్యక్షులు వేణుగోపాల్, రవీంద్రారెడ్డి అన్నారు. డీపీవో సుబ్బన్న ఆధ్వర్యంలో ఉద్యోగమేళాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. 14 కంపెనీల ఆధ్వర్యంలో 1,250 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: KADAPA
I.A. No. 2211 of 2024 in Review Petition No. of 2023 in I.A. No. 426 of 2013 in O.S.No.30 of 2004

Between:
1. Porumamirlla Munamma having died
2. Porumamirlla Sudharsan, Son of P.S.Chandra Mohan, Hindu, aged 43 years, resident of D.No.10/812, Jangam Yerikalappa Street, Kadapa City.
3. Porumamirlla Suneel Kumar Son of P.S. Chandra Mohan, Hindu, aged 49 years, resident of D.No.10/812, Jangam Yerikalappa Street, Kadapa City.

... Petitioners/Petitioners/Plaintiffs

And

5. Suseelamma, Wife of Venkateswarlu, aged about 53 years, Hindu, House-wife, residing in D.No. 21/615, Sreeramnagar Colony, Nandyal, Kurnool District.

... 5th Respondent / 5th Respondents / 5th defendant

NOTICE TO THE 5th RESPONDENT / 5th RESPONDENTS / 5th DEFENDANT

Please take notice that the petitioners / plaintiffs have filed the above I.A. to re-open the Review Petition which was closed on 22.01.2024 in the above Review Petition, hear and dispose the same according to law, stands posted to **03.03.2026** at 10.30 AM, either personally or through advocate, before the said court. If you fail to appear, on the above date, matter will be decided exparte.

// BY ORDER OF THE COURT //
Sri. M.SURESH KUMAR, M.A., B.L.,
Advocate for the Petitioners-Plaintiffs
Kadapa City, A.P. Cell. No. 8500271919.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

పారిశ్రామికాభివృద్ధికి దోహదం

కార్యక్రమంలో పాల్గొన్న ఈఈ భరతేశ్వర్, ఇతర అధికారులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పొట్టిపాడు గ్రామానికి నాణ్యమైన 24 గంటల త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించడం ద్వారా స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు దోహదం చేస్తుందని విద్యుత్తుశాఖ ఈఈ భరతేశ్వర్ అన్నారు. గుల్లదుర్తి గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నూతనంగా పొట్టిపాడు ఫీడర్ బ్రేక్ రీను ఏర్పాటు చేశారు. విద్యుత్తు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. పొట్టిపాడు గ్రామ విద్యుత్తు వినియోగదారులకు ఈ సౌకర్యం ద్వారా 24గంటలు నిరంతర విద్యుత్తు సరఫరా అందుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈలు సతీష్‌కుమార్‌రెడ్డి, రత్నాకర్, ఏఈ రామ్మోహన్, సిబ్బంది కుక్కలయ్య, మల్లికార్జునరెడ్డి, మనీష్ పాల్గొన్నారు.

నంది బాలోత్సవంలో చిన్నారి ప్రతిభ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో నిర్వహించిన నంది బాలోత్సవం పోటీల్లో పట్టణానికి చెందిన నంది బాలోత్సవం కుమార్తె లిజా అంజుమ్ ప్రతిభ చాటినట్లు ఎంఈవో కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ రావు గురువారం తెలిపారు. ఐదో తరగతి అభ్యసిస్తున్న బాలిక గీతాలాపన, వివిధ వేషధారణ, వక్తృత్వ పోటీల్లో వరుసగా ద్వితీయ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఈ సందర్భంగా బాలికను జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు డా.టి.సురేష్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శంషావలీగం, శ్రీదేవి, భాను, ఉమాదేవి తదితరులు అభినందించారు.

చిన్నారి లిజా అంజుమ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.15,84,215 విలువగల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ఆరోగ్య సంబంధిత చికిత్సల కోసం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీరాములు, మల్కాపురం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని విభాగినుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. విభాగినుల మధ్య మొక్కలు పెంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్యాపిలి మండలంలోని వంకమెట్టుపల్లె, గుట్టలపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. తాగునీటి సమస్యను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా బోరు వేయించేందుకు చర్యలు తీసుకున్నారు. నీరు పుష్కలంగా పడటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

శనగల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం శనగ దిగుబడి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. క్వింటా రూ.5875 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రైతులు తక్కువ ధరకు శనగలు విక్రయించరాదని సూచించారు. త్వరలోనే కొనుగోళ్లకు సంబంధించి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శిరివెళ్లలో కొనసాగుతున్న ఆధార్ శిబిరాన్ని ఎంఈవో గురువారం తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. విద్యార్థుల వివరాల్లో తప్పులకు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ప్రత్యేక నిధులతో పట్టణాభివృద్ధి

?: నంద్యాల రోడ్డు ప్రాంతంలో మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే ఇళ్ల మధ్య నీరు చేరుతోంది. - నరసింహ, కాలనీవాసి.

?: కోర్టు నుంచి హైవే వరకు రహదారి గుంతలమయంగా ఉంది. రాకపోకలకు కష్టంగా ఉంది. - మహబూబ్‌బాషా, శిల్పకళామందిరం వీధి.

?: కొత్తమిద్దెలు ప్రాంతంలో కొన్ని వీధుల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. సీసీ రహదారి నిర్మించాలి. - దస్తగిరి, కొత్తమిద్దెలు.

?: శిల్పకళాకారుల కుటుంబాలు వారు మెప్మా నుంచి రుణాలు కోరుకుంటున్నారు. మంజూరు చేస్తే మేలవుతుంది. - సుబ్రహ్మణ్యం, శిల్పకళామందిరం వీధి.

?: శిల్పాల తయారీ సమయంలో వచ్చే దుమ్ము, ధూళితో శిల్పులు అనారోగ్యం పాలవుతున్నారు. నెలలో ఒకసారి ఆరోగ్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. - హుస్సేన్‌బాషా, శిల్పి.

?: నాకు సెంటున్నర స్థలం ఉంది, ప్రభుత్వ గృహం మంజూరు చేస్తే ఇంటిని నిర్మించుకుంటా. - శ్రీనివాసులు, నంద్యాల రోడ్డు.

?: కొత్తమిద్దెలు కాలనీలో మురుగు కాల్వలు లేవు. వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి. - మహబూబ్ బాషా, కొత్తమిద్దెలు.

?: నంద్యాల రోడ్డు ప్రాంతంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. - రహిమాన్, నంద్యాల రోడ్డు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సమస్యలను గుర్తించేందుకు ఆళ్లగడ్డ పుర కమిషనర్ పి.కిశోర్ 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్ విత్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టణంలోని కీలకమైన నంద్యాల రోడ్డు, శిల్పకళామందిరం వీధి, కొత్తమిద్దెల కాలనీల పరిధిలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనలో పలు సమస్యలను గుర్తించారు. అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలస్వామి, ఇంజినీర్ సెక్షన్ అధికారులతో కలిసి పలు విభాగాలకు చెందిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కొన్ని చోట్ల ఆక్రమణలను గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు.

స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

ఎమ్మెల్యే సహకారంతో వసతుల కల్పన - పి.కిశోర్, పుర కమిషనర్

క్షేత్ర స్థాయి పర్యటనలో పలు సమస్యలను గుర్తించాం. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. వైద్యాధికారులతో చర్చించి నెలలో ఒకసారి వైద్యశిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపడతాం. త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నాం. కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం ప్రారంభించాం.

ప్రారంభమైన ఉపవాస దీక్షలు

సహరీ స్వీకరిస్తున్న దీక్షాపరులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆళ్లగడ్డ పట్టణం నూరానీ, మహమ్మదీయ మసీదుల పెద్దలు ఉపవాస దీక్షాపరులకు సహరీ(ఉపవాస ప్రారంభ సమయంలో తీసుకుని ఆహారం) ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో ఉపవాస దీక్షాపరులు సహరీని స్వీకరించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని దివ్యాంగుల వినతి

బనగానపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు కోరారు. గురువారం బనగానపల్లిలో ఆర్డీవో నరసింహులుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లతరబడి ఎంతో మంది దివ్యాంగులకు ఇళ్లు మంజూరు చేయలేదని విన్నవించారు. దివ్యాంగుల సంఘం నాయకులు గోపి, బాషా, రాజు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పాత బండి.. మొరాయింపు మామూలేనండి

ఆళ్లగడ్డ పురపాలికలోని చెత్త తరలింపు వాహనాలు నిత్యం మొరాయిస్తున్నాయి. కంప్యాక్టర్ ఎప్పుడు మరమ్మతులకు గురవుతుందో చెప్పలేని స్థితి నెలకొంది. గాలెన్న వీధిలో నాలుగు వీధుల కూడలిలో రహదారి మధ్యలో గురువారం ట్రాక్టర్ మరమ్మతులకు గురై ఆగిపోయింది. కూడలి ప్రాంతం కావడంతో ఇతర వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. మున్సిపాలిటీ వాహనాలు కొత్తవి మంజూరు చేయాలని పుర ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రం

బనగానపల్లి పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. నిత్యం 500 మంది రోగులు వైద్య చికిత్సలు పొందుతుంటారు. పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో గతంలో నిర్మించిన కొన్ని భవనాలు నిరుపయోగంగా మారిపోయాయి. అధికారులు స్పందించి పరిశుభ్రత పనులు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బనగానపల్లి

అబ్బిరెడ్డిపల్లె చెరువుకు జలకళ

ఏళ్లతరబడి నీరు లేక నెర్రలిచ్చిన చెరువును చూశాం. కానీ నేడు జలకళలు సంతరించుకున్నాయి. హంద్రీనీవా పైపులైన్ ద్వారా నీటిని చెరువుకు వదలటంతో డోన్ మండలంలో ఎంతో పెద్దదైన అబ్బిరెడ్డిపల్లె చెరువు పూర్తిస్థాయిలో నీరు చేరి నీటి కళ సంతరించుకుంది. సాగు నీరు అందుతోందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పక్కనే రహదారి ఉండటంతో వాహనదారులు చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, వెంకటాపురం(డోన్)

పంకాలు వేయరు.. ఇబ్బందులు పట్టించుకోరు

డోన్ బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం పంకాలు ఏర్పాటు చేసినా వాటిని ఉపయోగించడంలేదు. బస్టాండుకు ప్రతిరోజూ వందలాది మంది వస్తుంటారు. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఛార్జీలతోపాటు, సెస్సు రూపంలో ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పంకాలు తిరిగేలా చర్యలు తీసుకోవాలని జనం విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, డోన్ పట్టణం

ప్రమాదకరంగా విద్యుత్తు బోర్డు

బేతంచెర్ల మండలంలోని రహిమాన్‌పురం గ్రామంలో పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బోర్డు పగిలి పోయి ప్రమాదకరంగా మారింది. ఫ్యూజ్ బోర్డు ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్తు అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తక్షణం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రహిమాన్‌పురం(బేతంచెర్ల)

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: దత్త ఫంక్షన్‌హాల్ సమీపం నుంచి రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోయాయి. - సుదర్శన్, శ్రీనివాసనగర్. ✔: రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను తొలగిస్తాం. - రంగన్న, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి. ?: శ్రీనివాసనగర్‌లో థియేటర్ సమీపంలో రహదారిపై కంకర తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. - సోమన్న, ఆటోనగర్. ✔: త్వరలో మరమ్మతులు చేయిస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: శిరివెళ్లలోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి, నాయీబ్రాహ్మణ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేయించాలి. - పరమేశ్వరి, కాలనీవాసి.

✔: సిబ్బందితో మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - అశ్విన్‌కుమార్, ఇన్‌ఛార్జి ఈవో, శిరివెళ్ల.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలో సంత మార్కెట్ సమీపంలో శౌచాలయాలు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. - రమాదేవి, స్థానికురాలు.

✔: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి, ఈవో.

అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకు జలాశయం పరిధిలోని ప్రధాన వంతెన వద్ద విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. - జాఫర్‌హుస్సేన్, ఉప్పలపాడు.

✔: పరిశీలించి విద్యుత్తు తీగలను సరిచేస్తాం. - పక్కీరయ్య, ఏఈ ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: అహోబిలం గ్రామం కొత్తకొట్టాల చెంచుగూడెంలో వీధి దీపాలు వెలగడం లేదు. - నరసింహ, అహోబిలం.

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - నూర్జహాన్, ఎంపీడీవో.

ఘనంగా మాలిక్‌బాబా ఆరాధన ఉత్సవాలు

క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఆధ్యాత్మికం

డోన్, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని మాలిక్‌బాబా ఆలయంలో గురువారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి, తెదేపా యువనాయకులు ధర్మవరం గౌతంరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబుగ్గశివాలయం వద్ద రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్రకార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, శ్రీనివాసులు, రాఘవేంద్రగౌడ్, కొట్రికెహరికిషన్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంబరాలు విజయవంతం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రైతు సంబరాల్లో భాగంగా వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని తెదేపా నేత బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. అందరి సహకారంతో రైతు సంబరాలు విజయవంతమయ్యాయన్నారు. పోటీల్లో భాగంగా సీనియర్ క్యాటగిరీ విభాగంలో విజేతల యజమానులకు గురువారం బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న తెదేపా నేత బీసీ రాజారెడ్డి

చేనేతను అందరూ ప్రోత్సహించాలి

చేనేత వస్త్రాల కొనుగోలులో పాల్గొన్న మహిళా ఎమ్మెల్యేలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: చేనేత వస్త్రాలను అందరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లను ఇతర ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. చేనేత వస్త్రాలతో కార్మికులకు ఉపాధి లభిస్తుందని, చేతి వృత్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారంలో ఒకసారైనా చేనేత దుస్తులను ధరించాలన్న నియమాన్ని ప్రతి ఒక్కరూ అమలు చేయాలన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ప్యాపిలి, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వెంగళాంపల్లె గ్రామంలో వారం రోజుల పాటు చేపట్టిన సేవా కార్యక్రమాలకు సంబంధించి విద్యార్థులకు ప్రోగ్రాం అధికారి నవీనపాటి ఆధ్వర్యంలో ధ్రువపత్రాలను కళాశాలలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, ఓబులేసు, ముస్తాక్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, సురేష్, వన్నూర్, మంజునాథ్ పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని వీఆర్వోల ఆందోళన

బేతంచెర్ల, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: వీఆర్వోలపై పని భారం తగ్గించాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఆర్వోలు నిరసన ప్రదర్శన చేశారు. గురువారం ఆళ్లగడ్డ, బేతంచెర్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. తహసీల్దార్లకు వినతిపత్రం ఇచ్చి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు.

జానపద కళాకారుడికి సన్మానం

డోన్, న్యూస్‌టుడే: నాటకరంగ, జానపద కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. చెక్కభజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రాంపల్లె శ్రీనును స్థానిక కార్యాలయంలో డీఎస్పీతో పాటు బీసీ సంఘం నాయకులు వలసల రామకృష్ణ తదితరులు సన్మానించారు. రాంపల్లె శ్రీను మనిషి జీవితంపై రాసి పాడిన పాట ప్రేక్షకాదరణ పొందిందన్నారు. ఇలాంటి కళాకారులను ప్రోత్సహిస్తే మరిన్ని సందేశాత్మక పాటలు వెలుగుచూస్తాయన్నారు. బీసీ సంఘం నాయకులు నాగరాజు గౌడ్, సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

అతిథులను సన్మానిస్తున్న డోన్ నాయకులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పెన్షనర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని నంద్యాల జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడు పి.రామసుబ్బయ్య, టి.రామయ్యలు పేర్కొన్నారు. గురువారం స్థానిక పెన్షనర్ల సంఘం సమావేశ భవనంలో అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎన్.భానుసింగ్, బి.గాలయ్యల అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను పెన్షనర్లకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గోవిందపల్లెలో పికెటింగ్ తనిఖీ

గోవిందపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రాము పేర్కొన్నారు. గోవిందపల్లెలో కొనసాగుతున్న పికెటింగ్ కేంద్రాన్ని సీఐ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలిచ్చారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు.

భళా బాలిక.. పతకాల మాలిక

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఆ బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఆటలపై ఆసక్తి ఉండటంతో తల్లిదండ్రులు, వ్యాయామోపాధ్యాయులు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు. షూటింగ్ బాల్, వాలీబాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ వంటి ఆటల్లో పాల్గొంటూ ప్రతిభను చాటుతూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు. వివిధ స్థాయుల్లో ఆడి గుర్తింపు తెచ్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ముందుకు సాగుతున్నారు.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం

- నాగతేజస్వినిరెడ్డి, తొమ్మిదో తరగతి

కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో నాగతేజస్వినిరెడ్డి తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి చదువుతోపాటు ఆటల్లో చురుగ్గా ఉండటంతో తల్లిదండ్రులు బాలికను ప్రోత్సహిస్తున్నారు. 2023లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 2024లో రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీల్లో మొదటిస్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికైంది. ఇదే ఏడాది గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పతకం సాధించింది. 2025లో ఎస్‌జీఎఫ్ వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఆడి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఇదే ఏడాది ముంబయిలో జరిగిన జాతీయస్థాయి యంగ్‌మూడో పోటీల్లో రజత పతకం సాధించింది. క్రీడల్లో రాణించి పోలీసు కొలువే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు విద్యార్థిని చెబుతోంది.

జాతీయ స్థాయిలో రాణిస్తా

- నందినిరెడ్డి, తొమ్మిదో తరగతి

కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో నందినిరెడ్డి తొమ్మిదో తరగతి చదువుతోంది. 2023 ఆగస్టులో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి, ఇదే ఏడాది నవంబరులో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. 2025లో నల్గొండ జరిగిన సౌత్‌జోన్ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. 2025లో నియోజకవర్గస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో జిల్లాకు ఎంపికైంది. కర్నూలులో జరిగిన జిల్లా పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. ఇదే ఏడాదిలో ముంబయిలో జరిగిన జాతీయస్థాయి యంగ్‌మూడో పోటీల్లో రజత పతకం సాధించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడమే తన లక్ష్యమని విద్యార్థిని చెబుతోంది.

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

బేతంచెర్ల, ప్యాపిలి, చాగలమర్రి, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: దేశం సంస్కృతి నిర్మాణంలో ఛత్రపతి శివాజీ కీలకపాత్ర పోషించారని పలువురు పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని గ్రామాలు, పట్టణాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హిందూ సమాజం కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను కొనియాడారు.

బేతంచెర్ల: కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నాయకులు

ప్యాపిలి: శిశుమందిరం పాఠశాలలో..

సంక్షిప్త సమాచారం

సంజామల, న్యూస్‌టుడే: సంజామలలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్‌జీఎస్‌ఏ కార్యచరణ ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సల్మాన్ చెప్పారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ధరణి టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా పట్టణంలోని టాటా వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్‌ను సందర్శించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: యర్రగుంట్ల ఎంపీపీ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉర్దూ, జడ్పీ పాఠశాలల ప్రాంగణాలు రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారాయని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యకరంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యాధికారిణి భవ్యశ్రీ పేర్కొన్నారు. యర్రగుంట్ల పీహెచ్‌సీలో గురువారం గర్భిణులు, బాలింతలకు వైద్యాధికారిణి పలు సూచనలు, సలహాలిచ్చారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో నరసింహులు తెలిపారు. ఓటర్ల జాబితా ఇతర అంశాలపై సమావేశంలో చర్చిస్తారన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: పెట్నికోట గ్రామ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గజానంద్ శర్మ(62) అనారోగ్యంతో మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు గురువారం చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: ముత్యాలపాడు శివారులోని బర్డ్స్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎంఈవో శేషశయనారెడ్డి గురువారం ప్రారంభించి మాట్లాడారు.

అవుకు, న్యూస్‌టుడే: వృత్తి విద్య శిక్షణలో భాగంగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం అవుకులోని విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శించారు.

సంజామల, న్యూస్‌టుడే: పేరుసోముల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సందర్శించి పదోతరగతి విద్యార్థులకు ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గొర్విమానుపల్లెలో రూ.20 లక్షలతో సిమెంట్ రహదారి నిర్మిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి చెప్పారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మోసం కేసులో నందిపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేసులకు ఏడాది పాటు జైలు శిక్ష పడినట్లు సీఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ మేరకు బనగానపల్లి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ప్రతిమ తీర్పునిచ్చారు.

భవన నిర్మాణానికి నిధులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీలో పబ్లిక్‌హెల్త్ బ్లాక్ యూనిట్ నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి తెలియజేశారు. స్థానిక ఆసుపత్రి ఆవరణలో గురువారం భవన నిర్మాణ పనులకు ఆయన మార్కింగ్ ఇచ్చారు.

CHANGE OF NAME

I GOLLA SUDHEER KUMAR S/o. GOLLA VENKATESWARLU (Old Name) R/o. H.No. 14-20, Thasilpeta, Bethamcherla Post and Village, Bethamcherla Mandal, Nandyal District (Previously Kurnool District), AP-518599, have changed my Name as DHANIYALA SUDHEER KUMAR, S/o. DHANIYALA VENKATESWARLU (New Name).

(c) eenadu

65 వేల మందికి ఉద్యోగాలిస్తాం: సీఎస్

ప్రిన్సిపల్ కార్యదర్శులతో సీఎస్ అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది (2026)లో 65 వేల పోస్టుల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ చెప్పారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో సీఎస్ అధ్యక్షతన అన్నిశాఖల ప్రిన్సిపల్ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సమృద్ధ ఒడిశా ధ్యేయంగా కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం నియామకాలకూ ప్రాధాన్యమిచ్చిందన్నారు. గడిచిన 20 నెలల్లో 39,500 పోస్టులు భర్తీ కాగా, రానున్న నెలల్లో 34,641 మందికి నియామకాలు జరుగుతాయన్నారు. దీనికి సంబంధించి ఓపీఎస్‌సీ, ఓఎస్‌ఎస్‌బీలకు తెలియపర్చామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 40 రోజుల వ్యవధి మిగిలుండగా, ఆయా రంగాలకు జరిగిన కేటాయింపులు ఖర్చయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొండి బకాయిల వసూలుపైనా దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధి పనులకు చేసిన సూచనలు కార్యరూపంలోకి తేవాలన్నారు. 'వికసిత్ ఒడిశా-2036' లక్ష్యసాధనకు ముఖ్యమంత్రి ఆదేశిత 15 సూత్రాల అమలు పట్ల కార్యదర్శులు చిత్తశుద్ధి కనబర్చాలని, 2026-27 బడ్జెట్ కేటాయింపులు సక్రమంగా వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిషనర్ దేవరంజన్‌కుమార్ సింగ్, ఇతర అధికారులంతా పాల్గొన్నారు. వివిధ అంశాలపై స్థూలంగా సమీక్షించారు.

నినాదాల మధ్య సీఎం సమాధానం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో గురువారం సాయంత్రం విపక్షాల ప్రభుత్వ వ్యతిరేక నినాదాల మధ్య గవర్నరు ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సమాధానమిచ్చారు. రాష్ట్రాభివృద్ధే అజెండాగా తమ ప్రభుత్వం విధులు నిర్వహిస్తోందని, 20 నెలల పాలనలో పురోగతి సాధ్యమైందన్నారు. ఆర్థిక సర్వే నివేదిక ప్రగతికి నిలువుటద్దమని, సమృద్ధ ఒడిశా లక్ష్యం నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. సీఎం మాట్లాడుతున్న సమయంలో బిజద, కాంగ్రెస్ సభ్యులు పోడియం వద్ద నినాదాలు చేయడంతో ఆయన ఏం చెబుతున్నదీ వినిపించలేదు. ఆయన ప్రసంగానికి అడ్డు తగిలిన వారంతా కొద్దిసేపటి తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ధన్యవాద తీర్మానం ఆమోదం పొందింది.

శభాష్ సబ్‌కలెక్టర్ సారూ

● పరీక్షలకు ఆలస్యమైన ఇద్దరి విద్యార్థులను సొంత వాహనంలో తరలింపు

దినమణితో విద్యార్థినులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షలకు బస్సు కోసం వేచి చూస్తున్న ఇద్దరి విద్యార్థుల పరిస్థితిని గమనించి ఓ సబ్‌కలెక్టర్ వారికి సాయమందించారు. గురువారం నుంచి మొదలైన పరీక్షలకు ఆ ఇద్దరు విద్యార్థినులు ఆలస్యమవుతున్నట్లు తెలుసుకొని వారిని తన అధికారిక వాహనంలో తరలించి ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఢెంకనాల్ జిల్లా భుబాన్ సెంటర్ నుంచి ఇద్దరు విద్యార్థినులు పరీక్షల కోసం భనిరామ్ ఉన్నత పాఠశాలకు బయలుదేరారు. ఇందుకోసం కామాక్ష్యనగర్ బస్టాండు వద్ద బస్సుకోసం వేచి చూస్తుండగా, అప్పటికే ఆలస్యమవుతోంది. దీంతో విద్యార్థినులు పడుతున్న కంగారును చూసిన జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు కృష్ణచంద్ర సాహు సబ్‌కలెక్టర్ దినమణి నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి వెంటనే స్పందించిన నాయక్ 35 కి.మీ. దూరంలో ఉన్న ఆ పరీక్షా కేంద్రానికి వాళ్లను తన వాహనంలో తరలించేలా ఏర్పాట్లు చేశారు.

8 నిమిషాలే సభ... ప్రజాధనం వృథా

● శాసనసభ పోడియం వద్ద విపక్షాల నినాదాలు ● అన్నదాతల ఇబ్బందులు, ఉచిత విద్యుత్తుపై ఆందోళన

పోడియం వద్ద బిజద, కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో గురువారం కూడా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగాయి. సభాపతి సురమాపాఢి సభా కార్యక్రమాలు ప్రారంభించి ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి తరపున సభా వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ జలవనరుల శాఖకు సంబంధించి సమాధానాలు చెప్పడానికి లేచి నిల్చొన్నారు. ఇంతలో బిజద, కాంగ్రెస్ సభ్యులంతా పోడియం వద్దకొచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. డబుల్ ఇంజిన్ పాలకులు అన్నదాతల గొంతు నులిమేశారని, ధాన్యంతో మండీల వద్ద జాగరణ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నైతిక బాధ్యత వహించి ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన బిజద సభ్యులు బ్యానర్లు ప్రదర్శించారు.

ఏదీ ఉచిత కరెంటు?

రైతుల ఇబ్బందులతోపాటు ఉచిత కరెంటు గురించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో నిలదీశారు. ఎన్నికల మేనిఫెస్టోలో వినియోగదారులకు నెలకు 300 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇస్తామన్న డబుల్ ఇంజిన్ పెద్దలు ఎందుకు మోసగించారని ప్రశ్నించారు. సభ్యులు కార్యక్రమాలకు సహకరించాలని సభాపతి కోరినా విపక్ష సభ్యులు పట్టించుకోలేదు. దీంతో తొలుత 11.30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం వరకు కార్యక్రమాలు వాయిదా వేశారు. ఎనిమిది నిమిషాలు సభ కొలువుదీరింది.

అంతా వ్యూహం ప్రకారం

ప్రధాన విపక్షం (బిజద) కొన్నాళ్లుగా సభ లోపల, వెలుపల ప్రజల దృష్టిని ఆకర్షించలేకపోయింది. ప్రతిపక్ష బాధ్యత తాము నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెప్పుకున్నారు. ఫలితంగా బిజదలో అసంతృప్తి తీవ్రమైంది. దీంతో నవీన్ ఇటీవల కాలంలో జిల్లాల వారీగా నేతలందర్నీ పిలిచి మాట్లాడారు. స్థానిక సంస్థల (పంచాయతీ, మున్సిపల్) ఎన్నికలు దగ్గర పడిన తరుణంలో కలిసికట్టుగా ఉద్యమించాలని, ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతల అంశం విపక్షానికి ఆయుధమైంది. ఈ నెల 4 నుంచి రైతుల ఇబ్బందులపై జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇంతలో సభ కొలువుదీరడంతో ఆందోళనలు కొనసాగిస్తోంది. అన్నదాతల అంశంపై సభాపతికి వాయిదా తీర్మానమిచ్చి చర్చించే అవకాశం ఉన్నా సభను స్తంభింపజేస్తున్నారు.

కీలకం ప్రశ్నోత్తరాలు

అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు, శూన్యగంట(జీరో అవర్)లు కీలకమైనవి. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలు, ప్రజల ఇబ్బందులు ప్రస్తావించడానికి అవకాశం ఉంటుంది. ప్రజా సమస్యలు వదిలేసి వారి సొమ్ముతో కొలువుదీరుతున్న సభా సమయం వృథా చేస్తుండటం దురదృష్టకరమని పరిశీలకులంటున్నారు.

ఆశాజనకం... తలసరి ఆదాయం

● రాష్ట్రాభివృద్ధి రేటు 9.2 శాతం

● శాసనసభలో ఆర్థిక సర్వే నివేదిక

సభలో మాట్లాడుతున్న మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆర్థికశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శుక్రవారం (20న) సాయంత్రం శాసనసభలో 2026-27 సంవత్సరానికి పూర్తిస్థాయి రాష్ట్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీనికి ముందుగా గురువారం ఆర్థిక సర్వే నివేదిక ప్రకటించారు. అన్నిరంగాల్లో ఒడిశా ముందంజ వేస్తున్నట్లు వెల్లడించారు. సభలో విపక్షాల ఆరోపణలపై స్పందిస్తూ తాను గత ముఖ్యమంత్రిలా హామీ ఇచ్చి, ఒక మాట చెప్పి తప్పించుకొని వెళ్లిపోనని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని వివరించారు. రైతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

వివిధ రంగాల్లో రాష్ట్రాభివృద్ధి గురించి సీఎం చెప్పిన అంశాలు ఒకసారి పరిశీలిస్తే...

- 2025-26లో రాష్ట్రాభివృద్ధి రేటు (జీడీపీ) 9.2 శాతం, జాతీయస్థాయిలో ఇది 6.9 శాతం.
- గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్షన్ (జీఎస్‌డీజీ) 9.9 శాతం
- రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.1,86,761లు.
- వ్యవసాయాభివృద్ధి రేటు 19.6 శాతం. జాతీయస్థాయిలో ఇది 16.80 శాతం.
- వ్యవసాయోత్పత్తులు 150.5 లక్షల మెట్రిక్ టన్నులు. 2024-25లో ఇది 143.04 లక్షల మెట్రిక్ టన్నులు.
- 3 శాతం వృద్ధి రేటుతో క్షీర ఉత్పత్తులు 27.1 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగాయి.
- 2020-21లో 242 కోట్లుగా ఉన్న కోడిగుడ్ల ఉత్పత్తి 2024-25 నాటికి 406 కోట్లకు పెరిగింది.
- 11.92 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో చేపల ఉత్పత్తుల్లో జాతీయస్థాయిలో రాష్ట్రం 4వ స్థానంలో ఉంది. 2024-25లో రూ. 4,708 కోట్ల విలువ చేసే చేపలు, రొయ్యలు విదేశాలకు రవాణా అయ్యాయి.
- పారిశ్రామికరంగంలో రాష్ట్రం రూ.3.6 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి 8.3 శాతం వృద్ధి సాధించింది. జాతీయస్థాయిలో ఇది 7 శాతం.
- ఓడరేవుల ద్వారా రవాణా సామర్థ్యం 200 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 500 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది.
- కొవిడ్ తర్వాత రైళ్లలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య పెరిగింది. 2024-25లో ఇది 935 లక్షలుగా ఉంది.
- వైద్యరంగంలో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయి. 2024-25లో ఉచిత చికిత్స కింద రూ.19.7 వేల కోట్లు ఖర్చయ్యాయి.
- విద్యారంగంలో 2025-26లో రూ.31,185 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరగ్గా 38.4 శాతం వృద్ధి సాధ్యమైంది.
- మహిళల వికాసం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలు, సాంస్కృతిక వికాసం తదితర రంగాల్లో సమృద్ధి సాధ్యమైంది.

3,082 కేంద్రాల్లో మొదలైన 'పది' పరీక్షలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 3,082 కేంద్రాల్లో గురువారం పదోతరగతి పరీక్షలు మొదలయ్యాయి. సెకండరీ విద్యాబోర్డు(బీఎస్‌ఈ) వర్గాలు వెల్లడించిన వివరాల మేరకు మొత్తం 5,61,979 మంది విద్యార్థులు పరీక్షల కోసం హాల్ టికెట్లు పొందారు. వీరిలో 3,999 మంది దివ్యాంగ విద్యార్థులు ఉండగా, వారి కోసం ఒక్కో పరీక్షకు 50 నిమిషాలు, గణితం పరీక్షకు 55 నిమిషాల చొప్పున అదనపు సమయం కేటాయించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు బోర్డు 37 ప్రత్యేక స్క్వాడ్‌లను మోహరింపజేయగా, జిల్లాస్థాయిలో డీఈవోల నేతృత్వంలో మరో 72 స్క్వాడ్‌లను నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేసినట్లు బీఎస్‌ఈ వెల్లడించింది.

హాల్ టికెట్ల పరిశీలనకు క్యూలో నిల్చొన్న విద్యార్థులు

ఏఐ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాలు

కటక్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తూ...

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 3,082 కేంద్రాల్లో గురువారం నుంచి పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. 5.61 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈసారి కేంద్రాల్లో ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. చూచిరాతను నివారించడానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్చి 2 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

అప్పుల బాధ తట్టుకోలేక దంపతుల ఆత్మహత్య

అనాథలైన ఇద్దరు పిల్లలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: అప్పుల బాధ తట్టుకోలేక భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మిద్నాపూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మిద్నాపూర్ పట్టణానికి సమీపంలో గోప్‌గఢ్ ఈకో పార్క్ పక్కన ఉన్న అడవిలో ఎవరో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు ప్రాంతానికి చెందిన పింటూదాస్ (38), ఆయన భార్య మధుమిత దాస్(32)గా గుర్తించారు. మృతదేహాలను మిద్నాపూర్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. దీంతో వారు అనాథలయ్యారు. అప్పుల బాధ భరించలేక ఇలా చేశారని చుట్టుపక్కల వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జీవనదులు వెలవెల.. కరవు తీరేదెలా?

హాలువ వద్ద జంఝావతి ప్రవాహం

జేకేపూర్ వద్ద నాగావళి ప్రవాహం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: సకల జీవకోటికి అత్యవసరమైనది నీరు. అలాంటిది వేసవి రాకముందే జీవనదులు అడుగంటి పోతున్నాయి. కలహండి జిల్లాలో పుట్టిన నాగావళి, కొరాపుట్ జిల్లాలో పుట్టి రాయగడ జిల్లా మీదుగా ప్రవహిస్తున్న జంఝావతి నదులు వేసవి ఆరంభంలోనే నీరు లేక వెలవెలబోతున్నాయి. కల్యాణసింగుపూర్ సమితి మొదలుకొని కొలనార, రాయగడ మీదుగా ఆంధ్రా సరిహద్దు కెరడ వరకు ఉన్న నది పరీవాహక వాసులు వీటిపైన ఆధారపడి జీవిస్తున్నారు. సాగునీరు పక్కన పెడితే కనీసం తాగునీరు దొరకడం కూడా కష్టమయ్యేలా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇంతలా నీరు ఇంకిపోలేదని వాపోతున్నారు. వర్షాకాలంలో వరదలా పోటెత్తే వీటి ప్రవాహం నేడు పిల్లకాలువలా ఉండడం గమనార్హం. నీటి కొరత ఎక్కువ ఉన్న ఇలాంటి సమయంలో ఇలా జరగడం మరింత ఆందోళనకు గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు.

ప్రభావితమయ్యే ప్రాంతాలు..

జిల్లాలో కె సింగుపూర్ సమితి పరిధిలో బుడగుడ, మజ్జిగుడ, నారాయణపూర్, పూజారిగుడ, సెరిగుమ్మ కొలనార సమితిలో దుందిలి, గెడ్డ శేసికల్‌లు ఎక్కువగా ఈ నదులపైనే ఆధారపడి ఉన్నాయి. రాయగడ పరిధిలో ఆంధ్రా సరిహద్దు వరకు ఉన్న హాలువ, గుమ్మ, పెంట, చందిలి, కోమట్లపేట, కొత్తపేట, కె.మల్లిగాం, సంత శేసికల జమిడిపేట తదితర ప్రాంతాలకు తాగు, సాగు అధిక శాతం ఈ నదులు నుంచే అందుతాయి. ఇప్పటి వరకూ ఈ గ్రామాల్లో ఎలాంటి నీటి కొరత రాలేదని ఇప్పుడు పరిస్థితులు చూస్తే ఇక కష్టాలు తప్పవని భయాందోళన చెందుతున్నారు.

నాలుగు ఒప్పందాలు... యువత నైపుణ్యానికి మెరుగులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పారిశ్రామిక రంగాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేస్తోంది. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని ప్రపంచ నైపుణ్యాభివృద్ధి కేంద్రం (వరల్డ్ స్కిల్ సెంటర్)లో పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వయిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సంస్థలతో 4 ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది.

పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

22 ఐటీఐలకు జవసత్వాలు

టాటా టెక్నాలజీతో జరిగిన అవగాహన మేరకు రూ.779 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 22 పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు (ఐటీఐ) 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా తీర్చిదిద్దుతారు. వ్యయంలో 86 శాతం టాటా, 14 శాతం ప్రభుత్వం భరిస్తాయి. ఈ ఐటీఐలకు అత్యాధునిక యంత్ర సామగ్రి సమకూరుస్తారు. ఆటోమొబైల్, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డిజైన్ అండ్ వెరిఫికేషన్ టూల్స్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ అండ్ వీఎంసీ మెషినింగ్, అడ్వాన్స్‌డ్ ప్లంబింగ్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర రంగాల్లో టాటా టెక్నాలజీ అయిదేళ్ల వరకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంది.

యూనిసెఫ్‌తో యూత్ హబ్

యూనిసెఫ్‌తో కుదిరిన ఒప్పందం మేరకు యూత్ హబ్ ప్లాట్‌ఫాం మాధ్యమంలో 2 వేల మంది యువతీ యువకులకు డిజిటల్ శిక్షణ ఇస్తారు. కవాసాకి రోబోటిక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, వరల్డ్ స్కిల్ సెంటర్‌లు సంయుక్తంగా రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ శిక్షణ ఇస్తారు. ఆత్రేయ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్‌తో జరిగిన ఎంఓయూ మేరకు ఐరోపా దేశాల్లో రాష్ట్రానికి చెందిన యువకుల నియామకాల నేపథ్యంలో ఆయా దేశ భాషల్లో శిక్షణ అందిస్తారు.

ఉపాధి కల్పనే ధ్యేయం

ఈ సందర్భంగా మంత్రి సంపద్ మాట్లాడుతూ నైపుణ్య రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్ది యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర యువత విదేశాల్లోనూ రాణించాలన్న ఆశయంతో ఆయా దేశ భాషలు నేర్చుకొనే అవకాశాలు కల్పిస్తున్నామని, కుదిరిన 4 ఒప్పందాలు ప్రగతికి బాటలు వేస్తాయన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి భూపేంద్రసింగ్ పుణియా, సంచాలకుడు చక్రవర్తిసింగ్ రాఠోర్, వరల్డ్ స్కిల్ సెంటర్ సీఈఓ రశ్మీ మహాపాత్ర్, ఆయాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిలికాలో తగ్గిన చేపల ఉత్పత్తి

● ఏడాదిలో సుమారు 1,200 టన్నుల మేర తగ్గుముఖం

చిలికాలో చేపల వేటలో మత్స్యకారులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్యసంపద పుష్కలంగా ఉన్న జలవనరుల్లో ఒకటైన చిలికా సరస్సులో చేపల ఉత్పత్తి తగ్గుతోంది. ఏడాది కాలంలో సుమారు 1,200 టన్నుల మేర తగ్గుముఖం పట్టింది. శాసనసభలో జట్నీ ఎమ్మెల్యే బిభూతి భూషణ్ బలబంతరాయ్ అడిగిన ప్రశ్నకు మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు. 2023-24లో చిలికాలో మొత్తం చేపల ఉత్పత్తి 20,947.42 టన్నులు కాగా 2024-25 నాటికి 19,754.30 టన్నులకు తగ్గుముఖం పట్టింది. వీటిలో పీతలు ఓ మోస్తరుగా తగ్గగా, చేపలు, రొయ్యలు అధిక శాతం తగ్గడం గమనార్హం. మత్స్య సంపద మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సభకు గుర్తుచేశారు. ఇందులో భాగంగా సరస్సులో లవణీయత సమతుల్యం మెరుగు, నీటి మార్పిడి తదితర అంశాలపై చిలికా అభివృద్ధి అథారిటీ దృష్టి సారిస్తున్నట్లు మల్లిక్ పేర్కొన్నారు. అధికారులు క్రమం తప్పకుండా మట్టి, నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సరస్సులో వ్యర్థాల డంపింగ్, జెట్టీల నిర్మాణం వంటి వాటికి వ్యతిరేకంగా అవగాహన చేపడుతున్నామన్నారు.

గోకులానంద మల్లిక్

34 మత్స్య రేవు కేంద్రాలు

పూరీ, ఖుర్ధా, గంజాం జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న చిలికాలో 34 మత్స్య రేవు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గోకులానంద వెల్లడించారు. ముఖ్యమంత్రి మత్స్యజీవి కళ్యాణ్ యోజన కింద గంగపుత్రులకు సర్కారు సాయం పెంచుతోందని ఆయన గుర్తుచేశారు. కొత్త వలలు, చేపల వేటకు బోటులు వంటివి సమకూరుస్తున్నట్లు మంత్రి మల్లిక్ స్పష్టం చేశారు. మత్స్యసంపద మరీ తగ్గకుండా ఉండేందుకు చిన్న చేపల వేటను నిషేధించామని, ఇందుకోసం 10 మి.మీ. అంతకంటే ఎక్కువ కొలతతో కూడిన వలలనే వినియోగించాలని షరతులు విధించామన్నారు.

గడిచిన రెండేళ్లలో చిలికాలో చేపల ఉత్పత్తి వివరాలు ఇలా...

సంవత్సరం	చేపలు(టన్నుల్లో)	రొయ్యలు	పీతలు
2023-24	14,413.12	6,109.59	424.71
2024-25	13,344.25	5,970.58	439.47

కంజియాలో 1,500 కిలోల పసిడి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పసిడి ధరలు కొనుగోలు చేయలేని పరిస్థితికి చేరుకున్న తరుణంలో ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా కంజియాలో బంగారు గని గుర్తించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) చేపట్టిన తవ్వకాల్లో 1,500 కిలోల పసిడి నిల్వలున్నట్లు స్పష్టమైందని ఉక్కు గనులు, వాణిజ్య రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా చెప్పారు. గురువారం శాసనసభలో సభ్యులడిగిన ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కేంఝర్, దేవగడ్ జిల్లాల్లోనూ పసిడి నిక్షేపాలున్నట్లు స్పష్టమైందని, జీఎస్‌ఐ తవ్వకాలు చేస్తోందన్నారు.

కంజియా పసిడి గని

ఉపాధ్యాయుల కొరతతో బోధనకు అంతరాయం!

శాసనసభలో మాట్లాడుతున్న మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్

బ్రహ్మపుర నగరం, న్యూటుడే: ఉపాధ్యాయుల కొరతతో బోధనలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని గంజాం జిల్లా చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శాసనసభలో విపక్షాల నిరసన సమయంలో ఆయన మాట్లాడుతూ చికిటి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బ్లాక్ గ్రాంటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఆయా పాఠశాలల్లో ఉద్యోగ విరమణ చేస్తున్న వారి స్థానాలు భర్తీ కావడంలేదని పేర్కొన్నారు. ఆ ఖాళీల్లో విశ్రాంత ఉపాధ్యాయుల్ని నియమించాలని నిర్ణయించినా ఎవరూ అందుబాటులో లేరని చెప్పారు. బ్లాక్ గ్రాంటు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న చోట్ల ఉపాధ్యాయుల్ని నియమించాలని ఎమ్మెల్యే కోరారు.

1,171 స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ లేదు

భువనేశ్వర్, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 1,171 స్కూళ్లు, కళాశాలల బస్సులకు ఫిట్‌నెస్ లేదని రవాణాశాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా చెప్పారు. గురువారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతానికి విద్యాసంస్థలకు చెందిన 4,045 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని, లేనివాటి ఆర్‌సీ బుక్కులు రద్దు చేస్తామని, కఠిన చర్యలకు వెనుకాడేది లేదన్నారు. ప్రతి వాహనానికి కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు (పీయుసీసీ) ఉండాలని, వాహన, రోడ్డు భద్రతపై ప్రభుత్వం గట్టి చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు.

బిభూతి భూషణ్‌జెనా

మహానది జల వివాదం చర్చల్లో పురోగతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహానది జల వివాదానికి సంబంధించి ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య జరుగుతున్న చర్చలు పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. బిజద సభ్యుడు రాణేంద్ర ప్రతాప్ స్వయిన్ సభలో అడిగిన ప్రశ్నకు గురువారం సీఎం లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జల వనరుల శాఖ ఇంజినీర్లు పదకొండు సార్లు సమావేశం కాగా, ప్రిన్సిపల్ కార్యదర్శులు మూడుసార్లు చర్చించారన్నారు. మహానదికి సంబంధించి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో తరచూ సమావేశం అవుతున్నామని, చర్చ పురోగతి పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి సంఘం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

(c) eenadu

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి: సీఎస్

పాలనాధికారులతో మాట్లాడుతున్న సీఎస్ అనుగార్గ్, పక్కన దేవరంజన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు, అసంపూర్తి నిర్మాణాలపై పాలనాధికారులు దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనుగార్గ్ ఆదేశించారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాలనాధికారులతో మాట్లాడిన ఆమె ఎంపీ, ఎమ్మెల్యే ల్యాడ్ ఫండ్ వ్యయం గురించి అడిగి తెలుసుకున్నారు. విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణ త్వరగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిషనర్ దేవరంజన్‌కుమార్ సింగ్, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి గిరీష్ ఎస్.ఎన్. సంచాలకుడు వినీత్ భరద్వాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ దేహదారుఢ్య పోటీల్లో శ్రీకాంత్‌కు కాంస్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: దిల్లీలోని త్యాగరాజ్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ దేహదారుఢ్య పోటీల 2025-26లో బ్రహ్మపురకు చెందిన పడి శ్రీకాంత్ సత్తా చాటారు. గురువారం నిర్వహించిన 60 కిలోల కేటగిరీలో వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడి బెస్ట్ ఫిజిక్‌తో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం గెలుచుకున్నారు.

కాంస్య పతకంతో పడి శ్రీకాంత్

జాతీయ రోల్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న అండర్-11 బాలబాలికల 15వ జాతీయ రోల్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్లు సిద్ధమయ్యాయి. ఒడిశా రోల్‌బాల్ సంఘం ప్రతినిధులు భువనేశ్వర్ కళింగ మైదానంలో బుధవారం జట్టు బాలబాలికలకు శుభాకాంక్షలను తెలిపారు. రాష్ట్ర క్రీడ శాఖ ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.

పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలబాలికలు

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

● ఆరుగురి అరెస్టు, రూ. 30 లక్షల నగదు స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రఘునాథ్‌పాలి పోలీసులు క్రికెట్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసి రూ. 30 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రస్తుతం టీ-20 ప్రపంచకప్ క్రికెట్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై పూర్తి నిఘా పెట్టారు. బొండా ముండా ప్రాంతంలో బెట్టింగ్ ర్యాకెట్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు జరిపి ఆరుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 30.65 లక్షలు నగదు, మహీంద్రా థార్ మోడల్ కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఖరీదైన చరవాణులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న నగదు

కటక్‌లో ఏడీసీఏ టీ 20 ఆసియా కప్ క్రికెట్ పోటీలు

● ప్రారంభ మ్యాచులో శ్రీలంకపై భారత్ గెలుపు

ప్రారంభ వేడుకల్లో అతిథులు, జట్ల కెప్టెన్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భారత క్రికెట్ సంఘం, ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ)ల సహకారంతో ఆసియా బధిరుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కటక్‌లో గురువారం ఏడీసీఏ టీ 20 ఆసియా కప్ క్రికెట్ పోటీలు-2026 గురువారం ప్రారంభమయ్యాయి. బారాబటి స్టేడియంలో ఏర్పాటైన ప్రారంభ వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరైన జిందాల్ స్టీల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు రిషి పరిదిన పోటీలను ప్రారంభించారు. ఏడీసీఏ అధ్యక్షుడు సుమిత్ జైన్ మాట్లాడుతూ మొదటి ఎడిషన్ ద్వారా రాష్ట్రంలో నిర్వహిస్తున్న పోటీలతో మరెందరో ప్రతిభావంతులైన బధిరుల క్రికెట్‌లో రాణించే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో జిందాల్ హెడ్ సీఎస్ఆర్ జయంత్‌కుమార్ మహంతి, టాటా మోటార్స్ టీసీఎం శైలేష్ రాయ్, ఆస్థా స్కూల్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి బంకిమ్ మహంతి, ఏడీసీఏ, ఏడీసీఏ ప్రతినిధులు, భారత్, శ్రీలంక, నేపాల్ జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. తొలి రోజు నిర్వహించిన ప్రారంభమ్యాచులో భారత్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందింది. తొలుత శ్రీలంక 18.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన భారత్ 18.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసి విజయం సాధించింది.

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందుకుంటున్న సాయి ఆకాష్

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

సమావేశంలో పాల్గొన్న గంజాం పాలనాధికారి కీర్తివాసన్, గంజాం ఎస్పీ శుభేందు పాత్ర తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా వాసుల ఆరాధ్య దైవం మా తరాతరిణి శక్తిపీఠంలో చైత్ర మంగళవారాల యాత్ర మార్చిలో నాలుగు మంగళవారాలు జరుగుతాయని, యాత్రకు భారీగా తరలివచ్చే భక్తుల్ని దృష్టిలో పెట్టుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్ వివిధ విభాగాల అధికారులను కోరారు. ఛత్రపురంలో పాలనాధికారి కార్యాలయం ఆవరణలోని సద్భావన సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం చైత్ర మంగళవారాల యాత్రపై సన్నాహక సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కీర్తివాసన్ మాట్లాడుతూ శక్తిపీఠంలో వచ్చే మార్చి 10, 17, 24, 31వ తేదీల్లో ఈ యాత్ర జరుగుతుందని చెప్పారు. కింద నుంచి కొండపైనున్న శక్తిపీఠానికి భక్తుల రాకపోకలకు బస్సుల సేవల్ని మరింత పెంచాలని ఆయన అన్నారు. తాగునీరు, సంచార మరుగుదొడ్లు, తాత్కాలిక సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. తలనీలాలు సమర్పించే భక్తుల కోసం నాలుగు చోట్ల కేశ ఖండనశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు అన్నప్రసాదాలు, వాహనాలు నిలిపేందుకు పార్కింగు స్థలాలు గుర్తించాలని, ఆరోగ్య సేవలకు తాత్కాలిక ఆరోగ్య కేంద్రాలు సిద్ధం చేయాలని, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో గంజాం ఎస్పీ శుభేందు కుమార్ పాత్ర్, ఛత్రపురం సబ్‌కలెక్టరు శుభాశీష్ బరాల్, పురుషోత్తంపూర్ తహసీల్దారు, మా తరాతరిణి శక్తిపీఠం కార్యనిర్వహణాధికారి (ఈవో) బినోద్ కుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు

పేద రోగులకు ఆటోడ్రైవరు సాయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ నగరం ధనుపల్లికి చెందిన ఆటోడ్రైవరు కృష్ణ చంద్ర పటేల్ నిత్యం పేద రోగులను ఉచితంగా ఆసుపత్రులకు తీసుకెళుతూ సేవలందిస్తున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఖర్చుల్లేకుండా వృద్ధులు, బాధితులను విమ్సార్ ప్రధానాసుపత్రికి తీసుకెళుతూ ఔదార్యం చాటుకుంటున్నారు.

యుధిష్ఠరకు శ్రద్ధాంజలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభ (దివంగత) మాజీ సభాపతి యుధిష్ఠర దాస్ 12వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ విలేజ్ ప్రాంతంలో దివంగత నేత విగ్రహం వద్ద శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. భువనేశ్వర్ నగర మేయరు సులోచనా దాస్, ఇతర కార్పొరేటర్లు పాల్గొని యుధిష్ఠర సేవలను కొనియాడి శ్రద్ధాంజలి ఘటించారు.

దివంగత సభాపతి విగ్రహం వద్ద పుష్పాలు అర్పిస్తున్న సులోచన

పరీక్షా కేంద్రం పరిశీలించిన మంత్రి

న్యూస్‌టుడే, భువనేశ్వర్: పదో తరగతి పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ్ భువనేశ్వర్ యూనిట్-2 లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రానికి వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాంగ్రెస్‌కు జయరాం రాజీనామా

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎంపీ జయరాం పంగి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు, సంబంధించిన పత్రాలు పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్‌కు పంపించినట్టు గురువారం తెలిపారు.

థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న ఒడియా కార్మికులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న ఆరుగురు ఒడిశా కార్మికుల్ని రాష్ట్రానికి రప్పించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కి చెందిన ఒక ఏజెంటు వారిని అక్కడికి పంపించాడని, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝితో పాటు విపక్షనేత నవీన్‌పట్నాయక్‌లు కేంద్రం దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో దిల్లీలోని ప్రిన్సిపల్ రెసిడెన్స్ కమిషనర్ విశాల్‌గగన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు బుధవారం తెలియపరిచి కార్మికులను రాష్ట్రానికి తేవాలని కోరారు. వారంతా కేంద్రపడ, భద్రక్ జిల్లాల వాసులు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో మొదటి వివాహం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం మొదట వివాహం జరిగింది. తహసీల్దార్ వినోద్‌కుమార్ నాయక్ వివాహాన్ని నమోదు చేశారు. సదరు పంచాయతీ జిరాగూడ గ్రామానికి చెందిన ఉమాబొత్ర(20), జయపురం సమితి జాముండా పంచాయతీ కుంబారగూడ గ్రామానికి చెందిన బలరామ్‌బొత్ర(27) మూడు నెలల క్రితం వివాహం కోసం దరఖాస్తు చేసుకున్నారు. నియమావళి ప్రకారం ముగ్గురు సాక్షి సంతకాలు చేయగా వారి వివాహం జరిపించారు.

ముమ్మరంగా చండీ ఆలయ పనులు

తల్లి సన్నిధిలో నూతన నిర్మాణాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల ఆరాధ్యమాత కటక్ చండీ ఆలయం ఆధునికీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్మాణాలకు రూ. 70 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర బ్రిడ్జ్ అండ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఓబీసీసీ) పర్యవేక్షణలో ప్రస్తుతం గర్భగుడి గోపురం (పైకప్పు) పనులు జరుగుతున్నాయి.

భర్తను కాపాడిన భార్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా కరంజియా అటవీ రేంజ్ పరిధిలోని మిలు గ్రామానికి చెందిన మైడే సొరెన్ (భర్త), లిలీ సొరెన్ (భార్య) అడవి మార్గం మీదుగా మంగళవారం వస్తుండగా ఆరు ఎలుగులు దాడి చేశాయి. భర్తను అవి గాయపరుస్తుండగా భార్య చేతిలో ఉన్న గొడ్డలితో వాటిపై దాడి చేసి నియంత్రించింది. ఈ సమయంలో ఆమెపై కూడా అవి దాడి చేయడంతో గాయపడింది. అయినా వెనుకడుగు వేయకుండా ఎదిరించింది. దీంతో అవి పారిపోయాయి. విషయం తెలుసుకున్న రేంజ్ అధికారి ప్రశాంత్‌కుమార్ స్వయిన్ దంపతులను కరంజియా ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. వారు ప్రస్తుతం కోలుకున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

బ్రహ్మపురలో పంచదేవాలయం వీధిలోని పురాతనమైన సుప్రసిద్ధ శ్రీ పాతాళేశ్వరాలయంలో దేవతామూర్తుల జీర్ణోద్ధరణ ప్రతిష్ఠోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

మందిరం ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

దిగజారుడు రాజకీయాలు తగవు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అన్నదాతల ప్రయోజనాలే ధ్యేయంగా భాజపా ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ. 3,100లు చెల్లిస్తోందని, ఓర్వలేని విపక్షాలు శాసనసభను స్తంభింపజేస్తున్నాయని, దిగజారుడు రాజకీయాలు తగవని భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. గురువారం సాయంత్రం భువనేశ్వర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించిన సామల్ బిజద పాలనా కాలంలో ఖరీఫ్, రబీ పంట కాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కింద రూ. 15 వేల కోట్లు చెల్లిస్తూ రాగా, భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 27 వేల కోట్లకు పెరిగిందన్నారు. విపక్షాలు సభలో బాధ్యతగా మెలగాలని కోరుతున్నామన్నారు.

147 మందిని బలిగొన్న తుపానులు

శాసనసభలో మాట్లాడుతున్న సురేష్ పూజారి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గడిచిన పన్నెండేళ్లలో సంభవించిన తుపానులు 147 మంది ప్రాణులను బలిగొన్నాయి. వీటి వల్ల వేల కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. శాసనసభలో గురువారం ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి అడిగిన ప్రశ్నకు రెవెన్యూ, విపత్తు నివారణ శాఖ మంత్రి సురేష్‌పూజారి లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2014-2025 మధ్య రాష్ట్రంలో 12 తుపానులు సంభవించాయి. వీటిలో తీవ్ర ప్రభావం చూపిన నాలుగు తుపానులు 147 మంది మృతికి కారణమయ్యాయి. మొత్తం తుపానుల కారణంగా రూ. 19,529 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన అవకాశాలు

లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న అతిథులు

రాయగడ, న్యూస్‌టుడే: యువత నైపుణ్యాభివృద్ధితో మెరుగైన అవకాశాలు పొందొచ్చని అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఐటీఐలో ఎమ్ఎస్ఎమ్ఈ ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు రుణ పంపిణీ, ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 18 విభాగాల్లో చేతివృత్తుల కళాకారులు ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సహకారం అందించారు.

ఘనంగా సుభద్ర శక్తి మేళా

వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని గజపతి క్రీడా మైదానంలో మిషన్‌శక్తి ఆధ్వర్యంలో 7 రోజుల పాటు నిర్వహించిన సుభద్రశక్తి మేళా బుధవారం రాత్రి ప్రారంభమైంది. కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, అతిథులుగా మోహన ఎమ్మెల్యే దాశరథి గమాంగ్, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ నగరపాలక అధ్యక్షురాలు ఎం.సుధారాణి, ఎస్పీ జెకె పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మల శెఠి తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాలకు కొరాపుట్ అల్లం, నల్లజీర బియ్యం

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో సాగుచేసిన అల్లం, నల్లజీల బియ్యం పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. గురువారం వాహనానికి పచ్చజెండా ఊపి అధికారులు పంపించారు. కార్యక్రమంలో పాలనాధికారి మనోజ్ సత్యవాన్ పాల్గొన్నారు. ప్రగతి ఆర్గానిక్, అగ్రి ప్రొడక్షన్ కంపెనీ ద్వారా కర్ణాటక, పంజాబ్, హరియాణాకు 250 క్వింటాళ్ల అల్లం, 60 క్వింటాళ్ల నల్లజీర బియ్యం పంపించినట్లు, రాబోయే రోజుల్లో స్ట్రాబెర్రీ, పసుపు, పనస కూడా పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

వాహనానికి పచ్చజెండా ఊపుతున్న అధికారులు

వంతెన పనులు పూర్తిచేయండి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితిలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై లక్ష్మీపుర ఎమ్మెల్యే పవిత్ర శాంత మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో పూర్తి చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

అసంపూర్ణంగా వదిలేసిన వంతెన నిర్మాణం

కలెక్టర్ చేతుల మీదుగా దత్తత

దంపతులకు శిశువులను దత్తత ఇస్తున్న కలెక్టర్ అక్షయ్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా శిశు సంరక్షణ పర్యవేక్షణలో ఉన్న 10 ఏళ్ల బాలుడు, 13 ఏళ్ల బాలికను ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దంపతులు కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ చేతుల మీదుగా బుధవారం దత్తత తీసుకున్నారు. వీరు ఒక ఏడాదికి కిందటే దరఖాస్తు చేసుకోగా వివరాలను పరిశీలించిన అధికారులు దంపతులకు దత్తత ఇచ్చేందుకు అంగీకరించారు. ఇప్పటివరకు 80 మందిని దత్తత ఇచ్చినట్లు జిల్లా శిశు సంరక్షణ శాఖ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితి రాణిగూడ గ్రామం తేలంగిరి నదీ ప్రాంతాన్ని, మాలిగూడ రైల్వే గుహ వద్ద పర్యాటక ప్రాంతాన్ని అధికారులతో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పర్యటించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

బిజద కార్యకర్తల ర్యాలీ

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా పద్మాపూర్ సమితిలో ప్రజలు తాగునీరు అందక, రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అనేక సమస్యలు వేదిస్తున్నాయని నినాదాలు చేస్తూ బిజద కార్యకర్తలు ర్యాలీ చేశారు.

దివ్యాంగుల పింఛన్ పెంచండి

దివ్యాంగుల నిరసన ప్రదర్శన

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నవజీవన్ ఉదయన్ దివ్యాంగుల సంస్థ బుధవారం సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమ పింఛన్ పెంచమని వీరు డిమాండ్ చేశారు. ఎస్‌డీఎం సురభి సింగ్‌లాను కలిసి వినతిపత్రం అందజేశారు.

మహిళా రైతులకు అవగాహన శిబిరం

జయపురం, న్యూస్‌టుడే: ఎం.ఎస్. స్వామినాధన్ ఫౌండేషన్ తరపున కొరాపుట్‌లో మహిళా రైతులకు దరఖాస్తుకు సంబంధించిన అవగాహన శిబిరం జరిగింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

నిబంధనల ప్రకారమే మాజీ ఎమ్మెల్యేకు శస్త్రచికిత్స

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే బిక్రంకుమార్ పండా శస్త్రచికిత్సపై స్థానిక మూడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం గురువారం దాన్ని తిరస్కరించింది. ఈమేరకు అది బ్రహ్మపుర మండల కారాగారానికి ఆదేశాలు జారీ చేసింది. కారాగారం మాన్యువల్ ప్రకారం ఆయనకు చికిత్సలు జరుగుతాయని తెలిసింది. దీంతో స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రిలోనే బిక్రం పండాకు శస్త్రచికిత్స జరుగుతుందని సమాచారం. శస్త్రచికిత్స, అనంతరం చికిత్స సమయంలో బిక్రం వద్ద ఆయన కుటుంబ సభ్యులు ఉండేందుకు న్యాయస్థానం అనుమతించింది. న్యాయవాది పితబాస పండా హత్య కేసులో అరెస్టయి బ్రహ్మపుర మండల కారాగారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బిక్రం పండా గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చికిత్సకు చేరారు. పరీక్షించిన వైద్య బృందం గాల్‌బ్లాడర్ శస్త్రచికిత్స జరపాలని నిర్ణయించగా, అందుకు నిరాకరించిన ఆయన ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు అనుమతి కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.

నూతన భవనం ప్రారంభోత్సవం

రాయగడ, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మించిన అదనపు కలెక్టర్ కార్యాలయం భవనాన్ని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు, హోమం నిర్వహించారు.

28న కొత్త ఓటరు జాబితా విడుదల

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్ఐఆర్ దరఖాస్తులు నింపడం, సందేహాలను దరఖాస్తులపై హియరింగ్ జరపడం పూర్తయ్యాయి. స్థానిక బీఎల్ఓ టి.వెంకటేశ్వరరావు కొత్త ఓటరు జాబితా ఈనెల 28న విడుదలవుతుందని అధికారికంగా తమకు వర్తమానం అందిందని తెలియజేశారు.

అత్యాచారయత్నం కేసులో బాలుడికి రెండేళ్ల శిక్ష

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన ఠాణా పరిధిలో 2024 ఏడాది నవంబర్ నెలలో ఆరేళ్ల బాలికపై ఓ మైనర్ బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా ఈ కేసు విచారణ చేపట్టగా గురువారం జువెనైల్ జస్టిస్ బోర్డు రిజిస్ట్రారు, చీఫ్ మేజిస్ట్రేట్ ప్రసన్నకుమార్ బెహరా తుది తీర్పు వెల్లడించినట్లు ప్రభుత్వ న్యాయవాది రాజేష్ కుమార్ మిశ్ర తెలిపారు. బాలుడికి రెండేళ్ల పాటు బ్రహ్మపురంలోని షెల్టర్ హోమ్‌లో ఉంచాలని, రూ. 10 వేలు జరిమానా విధించాలని అన్నారు. జరిమానా కట్టని యెడల మరో ఆరు నెలల పాటు అదే హోమ్‌లో కొనసాగుతారని వివరించారు.

రెడీమేడ్ వస్త్రాలయంలో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని మంచేశ్వర్ పారిశ్రామికవాడ పరిధిలోని రెడీమేడ్ వస్త్రాలయంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. రూ.లక్షల విలువ చేసే సామగ్రి కాలి బూడిదైంది. అగ్నిమాపక జవానులు చేరుకొని మంటలు నియంత్రణలోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

బావిలో పడ్డ ఏనుగు పిల్ల

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా సాల్బోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా ఏనుగుల సంచారం అధికంగా ఉంది. అటవీ శాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి అడవిలో గుంపుగా సంచరిస్తున్న ఏనుగులలో ఒక గున్న ఏనుగు దారి తప్పి ఒక లోతైన బావిలో పడిపోయింది. సమాచారం తెలుసుకొని అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షించారు.

ట్రక్కు నుంచి లీకైన డీజిల్... జయపురం: జయపురం జాతీయ రహదారి-26పై వెళ్తున్న ట్రక్కు నుంచి డీజిల్ లీక్ అవ్వడంతో పలు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. త్రుటిలో నాలుగు చక్రాల వాహనాలు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ చత్తిస్‌పాడా శ్రీ ప్రసన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఇందులో భాగంగా బుధవారం రాత్రి మాయా కళా కేంద్రం చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

నదిలో రెండు మృతదేహాలు స్వాధీనం

జయపురం, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు వెళ్లి అదృశ్యమైన 19 రోజుల తరువాత నలుగురిలో ఇద్దరి మృతదేహాలను శబరి నది ఒడ్డున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ ఠాణా పరిధిలో దండబాడి గ్రామానికి చెందిన లలిత్‌పూజారి(34), అతని చిన్న కుమార్తె గెల్లి (4)గా గుర్తించారు. ఇప్పటి వరకు లలిత్ భార్య బృందా, పెద్దకుమార్తె బృందావతి ఆచూకీ తెలియరాలేదు. పోలీసులు, అగ్నిమాపక శాఖ తనిఖీలు కొనసాగిస్తున్నారు.

స్వగ్రామానికి వెళ్తూ...అనంత లోకాలకు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం...పనులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో యువకుడు ఘటనాస్థలంలో మృతిచెందాడు. బాధితుడు సుంద్రుబా గ్రామానికి చెందిన ప్రియదర్శన్ రైత్(21)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జయపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన జయపురం పట్టణంలో జరిగింది. మృతుడు పాత్రపుట్ ప్రాంతానిక చెందిన ఘస్సీరామ్ గొలారి (38), గాయపడిన వాడు డంగరచించి పంచాయతీ భట్టావించి గ్రామానికి చెందిన ఘస్సీరామ్ సాగరియాగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు ద్విచక్ర వాహనంపై గురువారం జగన్నాథ్ సాగరం నుంచి గ్లోకల్ ఆసుపత్రి బైపాస్ రహదారిపై వెళ్తుండగా అతి వేగంగా వస్తున్న నాలుగు చక్రాల వాహనం వీరిని ఎమ్‌సీసీ సెంటర్ వద్ద ఢీకొట్టింది. ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే గొలారి మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు.

పరీక్షకు వెళ్తూ.. విద్యార్థులకు గాయాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులకు వాహనం బోల్తా పడటంతో గాయాలైన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గజపతి జిల్లా గుమ్మ సమితి బదుడి మాధ్యమిక పాఠశాల విద్యార్థులు లేకష్ సబర్, రుహిత్ రైత్ ద్విచక్ర వాహనంపై గుమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పదోతరగతి పరీక్ష రాసేందుకు వెళుతుండగా పుడైటా గ్రామ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో బోల్తాపడ్డారు. ఈ ఘటనలో లేకష్‌కు తీవ్ర గాయాలు కాగా, రుహిత్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు క్షతగాత్రులను గుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం లేకష్‌ను జిల్లా ముఖ్య ఆసుపత్రికి చేర్పించారు.

హెరాయిన్‌తో పట్టుబడ్డ మహిళ

పోలీసుల అదుపులో నిందితురాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: హెరాయిన్ విక్రయిస్తున్న ఓ మహిళను కటక్ ఆబ్కారీ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆబ్కారీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సాతిచౌర ప్రాంతంలో హెరాయిన్ విక్రయం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది నిఘా పెట్టారు. అశ్వినీ ఆసుపత్రి రహదారి సమీపాన ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను తనిఖీ చేశారు. ఆమె వద్ద 186 గ్రాముల హెరాయిన్ లభించగా, దీని విలువ రూ. 18.60 లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పట్టుబడ్డ మహిళ రుబీ బేగం(20)గా గుర్తించి కేసు నమోదు చేశారు.

మూడు ట్రాక్టర్ల ఇసుక, గ్రానైట్ స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశా అటవీ విజిలెన్స్ విభాగం అధికారులు జాజ్‌పూర్‌లో బుధవారం మూడు ట్రాక్టర్ల ఇసుక, గ్రానైట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ వర్గాల సమాచారం మేరకు జెనాపూర్ పోలీసుస్టేషన్ బలరాంపూర్ ప్రతిపాదిత రిజర్వు అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించిన సందర్భంగా ఇది వెలుగుచూసింది. 16 క్యూబిక్ అడుగుల ఇసుక, రూ. 24.81 లక్షల విలువ చేసే నల్ల గ్రానైట్ రాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బరపాలి జగన్నాథ్‌నగర్‌లో అగ్నిప్రమాదం

బరగఢ్, న్యూస్‌టుడే: బరపాలి జగన్నాథ్ నగర్‌లోని యోగీముండా ఆలయం సమీపంలో, ఒక చెట్టు కింద గుడిసె వేసుకుని ఎన్నో సంవత్సరాలుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధుడి గుడిసెలో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నా లాభం లేకుండా పోయింది. ఈ అగ్నిప్రమాదంలో వృద్ధుడి వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న బరపాలి తహసీల్దార్ వృద్ధుడికి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆలయంలో చోరీ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ సమితి శేసికల్ పోలీసుస్టేషన్ పితామహల్ కొండపై గల ఝుడేశ్వర శివాలయంలో బుధవారం రాత్రి దొంగలుపడ్డారు. ఆలయ ప్రధాన గేటు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం హుండీలోని నగదు చోరీ చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈమేరకు గురువారం శేసికల్ పోలీస్‌స్టేషన్‌లో మందిర కమిటీ వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ కిషోరద బాగ్ తెలిపారు.

రూ.42 లక్షల నల్లమందు మొక్కలు ధ్వంసం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్‌లో పోలీసులు, ఆబ్కారీ సిబ్బంది రూ. 42 లక్షల విలువ చేసే నల్లమందు మొక్కలను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురుండియా అటవీ ప్రాంతం సమీపాన కొయిడాలో నల్లమందు తోటలను గుర్తించారు. మూడెకరాల్లో సాగుచేస్తున్న 42 వేల మొక్కలను తొలగించి ధ్వంసం చేశారు. సుమారు 5 గంటల పాటు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో నాశనం చేసిన వీటి విలువ రూ. 42 లక్షల మేర ఉంటుందన్నారు.

విజిలెన్స్‌కు చిక్కిన ఇన్‌ఛార్జి తహసీల్దార్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా సొరొ ఇన్‌ఛార్జి తహసీల్దార్ ధైతారి మల్లిక్ గురువారం 5 మొరం లారీలు విడిచి పెట్టడానికి రూ. 40 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దర్యాప్తు జరుగుతోంది.

జీజీహెచ్‌లో పునుగుపిల్లి ప్రత్యక్షం

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి బీరువాలో బుధవారం పునుగుపిల్లి దర్శనమిచ్చింది. ఆసుపత్రి అధికారులు తెలిపిన వివరాల మేరకు పవర్ రూం సమీపంలోని స్టోర్ రూం బీరువాలో తలదాచుకుంది. బీరువా తెరిచిన సిబ్బంది పునుగుపిల్లిగా గుర్తించారు. జేడీ బి.రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ శేషాచలం అడవుల్లో సంచరించే అరుదైన జాతికి చెందిన పునుగుపిల్లి ఇక్కడ ప్రత్యక్షం కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చి అప్పగిస్తామని తెలిపారు. బీరువాలోకి ఎలా చేరిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. - న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

బ్రహ్మోత్సవాలకు ముహూర్తపు రాట

ముహూర్తపు రాట పూజలో భక్తులు

రాయగడ, న్యూస్‌టుడే: పారిశ్రామిక వాడ జేకే పూర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణకు ముహూర్తపు రాట కార్యక్రమంలో జరిగింది. గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పురాధ్యక్షుడు రాజీనామా చేయాల్సిందే

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పురాధ్యక్షుడు నరేంద్రమహంతి అవినీతికి పాల్పడుతున్నారని, వివిధ ప్రాజెక్టుల్లో నిధులు పక్కదారి పట్టిస్తున్నారని బిజద పార్టీకి చెందిన పురపాలక మాజీ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రథ్ ఆరోపించారు. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలంటూ గురువారం మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు.

సముద్రంలో మునిగిన ఇంజిన్ బోటు

ఇసకలపాలెం సముద్ర తీరంలో లంగరు వేసిన సుమారు రూ.18 లక్షల విలువైన ఇంజిన్ బోటు ప్రమాదవశాత్తు మునిగిపోయింది. దాన్ని స్థానిక మత్స్యకారులు చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స్యకారులు సవడల డిల్లేశ్, బైపల్లి కామరాజు మంగళవారం చేపల వేట ముగిసిన అనంతరం ఇంజిన్ బోటుకు ఎప్పటిలాగే సముద్రం లోపల లంగరు వేశారు. బుధవారం తెల్లవారుజామున యథావిధిగా వేటకు తీరానికి వెళ్లి చూడగా బోటు కనిపించలేదు. బాధితులతోపాటు తోటి మత్స్యకారులు బోట్లు, తెప్పలతో చాలాసేపు వెతికి నీటిలో మునిగిన బోటును గుర్తించారు. గ్రామంలోని యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని తాడు సాయంతో దాన్ని లాగి ఒడ్డుకు చేర్చారు. విషయం తెలుసుకున్న వైకాపా ఇచ్ఛాపురం ఇన్‌ఛార్జి శ్యాంప్రసాదరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రకుమార్ యాదవ్, తిరుపతి, జోగారావు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.- న్యూస్‌టుడే, సోంపేట

పద్మపూర్ తహసీల్దార్ సస్పెన్షన్

బరగఢ్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణల నేపథ్యంలో బరగడ్ జిల్లా పద్మపూర్ తహసీల్దార్ బిపిన్ కుమార్ ప్రధాన్‌ని సస్పెండ్ చేసింది. ఈ విషయం రెవెన్యూశాఖ గురువారం వెల్లడించింది. కలెక్టర్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

యువకుల కొట్లాట: ఇంటిని చుట్టుముట్టిన గ్రామస్థులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ఇద్దరు యువకులపై మరో ఇద్దరు యువకులు దాడి చేసిన ఘటనలో గ్రామప్రజలు దాడి చేసిన యువకుల ఇంటిని చుట్టుముట్టారు. వివరాల్లోకి వెళితే.. ఫిబ్రవరి 15 శివరాత్రి నాడు మల్కాన్‌గిరి జిల్లా బలిమెల గ్రామంలో శివాలయంలో సాంస్కృతిక కార్యక్రమం జరుగుతున్న సమయంలో చితాపరి గ్రామం నుంచి కొంత మంది యువకులతో బలిమెల యువకులు గొడవ పడ్డారు. దీనివల్ల ఈ ఘటన చోటుచేసుకుంది.

బస్టాండు నిర్మాణానికి నిధులు మంజూరు

సమావేశంలో మాట్లాడుతున్న పాలనాధికారి తదితర అధికారులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ పట్టణంలో నూతన బస్టాండు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ముగిసింది. నిర్మాణానికి రూ. 50.70 కోట్లు నిధులు మంజూరయినట్టు, పోలీస్ హౌసింగ్ బోర్డు బస్టాండు నిర్మాణ బాధ్యతలు స్వీకరిస్తుందని, ప్రస్తుతం ఉన్న స్టాల్స్ యజమానులకు నూతన స్టాల్స్ నిర్మించి, ఇవ్వనున్నట్లు గురువారం జరిగిన సమావేశంలో పాలనాధికారి డా॥మహేశ్వర స్వయ్ తెలిపారు.

కొత్త భవనంలో టికెట్ కౌంటర్లు ప్రారంభం

నూతన భవనంలో ఏర్పాటైన టికెట్ కౌంటర్లు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫారంవైపు ప్రధాన ప్రవేశ మార్గంలో కొత్తగా నిర్మాణమైన భవనంలో సాధారణ టికెట్ కౌంటరు సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు సాధారణ టికెట్ కౌంటర్లతోపాటు విచారణ (ఎంక్వైరీ) కేంద్రం ఏర్పాటు చేశామని స్టేషన్ మేనేజరు దుర్గా ప్రసాద్ బ్రహ్మ మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పాత భవనం నుంచి నూతన భవనానికి కౌంటర్లు స్థానాంతరం చేసినట్లు స్టేషన్‌లో మైకు ద్వారా ప్రచారం జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.

సాగులో ఒదిగి.. లాభాలతో ఎదిగి!

ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆదర్శంగా మహిళల వ్యవసాయం

- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక చుట్టూ ఉప్పుటేరు ఉండటంతో ప్రమాదకరంగా పడవలో ప్రయాణం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి పంటలను బయటకు తరలించలేక.. సకాలంలో సరైన ధరలకు విక్రయించలేక నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.4 కోట్ల అంచనాతో వంతెన, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోగా పనులు సాగుతున్నాయి. త్వరలోనే వారి ప్రయాణ కష్టాలు గట్టెక్కే అవకాశం ఉండటంతో జీవనోపాధులపై మరింత ఆశలు పెరిగాయి. ఈక్రమంలో ఇక్కడి మహిళలు ప్రత్యేక శ్రద్ధతో అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. మంచి లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా ముందుకు సాగుతున్నారు.



టమాటా సాగు చేస్తున్న పొలం

ఆదాయం బాగు

రబీలో చోడి, పెసర, మినుములు, జినుగులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. టమాటా, వంకాయ, బెండకాయ, ముల్లంగి, మిరప, ఉల్లి, తెల్లదుంప, ఎర్ర దుంప, బీర, ఆనప, చిక్కుడు రకాలు, బంతిపూలు, గులాబి, చామంతి పూల జాతులు తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, పుదీనా తదితర ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు.
- ఉన్న పొలంలో సగం కంటే పైగా విస్తీర్ణంలో కాలానుగుణంగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. ఇంటికి రోజువారీ సరిపడే ఆదాయం వచ్చేలా శ్రమిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

- వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం పంచాయతీ పరిధి పూడిలంకలో సుమారు 60 ఇళ్లుంటాయి. 200 మంది నివసిస్తున్నారు. ఇక్కడ 100 ఎకరాల వరకు పంట భూములున్నాయి.
- ఉప్పుటేరు మధ్యలో గ్రామం ఉండటంతో సాగునీటి వనరులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉప్పునీరు కారణంగా వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది.
- చెరువును అభివృద్ధి చేసి వర్షం, ట్యాంకు నుంచి బయటకొస్తున్న వృథా నీటిని మళ్లిస్తూ నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి కొందరు మోటార్ల ద్వారా పొలాలకు నీరందేలా ఏర్పాట్లు చేసుకున్నారు.
- చాలా మంది మహిళలు బిందెలతో నీరు మోసి తడులు అందిస్తున్నారు. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారు. ఎక్కువగా అన్ని రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆదాయాన్ని పెంపొందించుకుంటూ కుటుంబ ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తున్నాం..

మొన్నటి వరకు సరైన రహదారి లేక అవస్థలు పడ్డాం. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మించడంతో రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు తప్పాయి. ఖాళీగా ఉన్న పొలాలన్నీ పచ్చగా మారాయి. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. మార్కెట్‌లో మంచి ధరలకు విక్రయిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు అధగిమిస్తున్నాం. - బచ్చల పోలమ్మ, రైతు, పూడిలంక

న్యాయవాది గాయత్రికి సన్మానం

ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న న్యాయవాది

జయపురం, న్యూస్‌టుడే: జిల్లా శిశు సంక్షేమ సమితి అధ్యక్షురాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది డా॥ గాయత్రిదేవిని కొరాపుట్ ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ రోహిత్‌వర్మ సన్మానించారు. ఆమె ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం కేసులో నిందితుడికి 165 రోజుల్లో 22 ఏళ్ల జైలు శిక్ష విధించేందుకు న్యాయస్థానాన్ని సహకరించినందుకు ఆమెను పలువురు అభినందించగా, ఎస్పీ ప్రశంసించారు.

చిరుత పిల్ల కళేబరం స్వాధీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ఉత్తర ఘుముసుర అటవీ డివిజన్ ఆధీనంలో ముజాగడ రేంజ్ పరిధిలోని బజ్రకోట గ్రామం పాఠశాల వెనుకవైపు చెట్ల పొదల్లో ఓ చిరుత పిల్ల కళేబరం వెలుగు చూసింది. గురువారం భువనేశ్వర్ నుంచి వచ్చిన జేటీఎఫ్ బృందం సమక్షంలో ముగ్గురు పశు వైద్యులు దాని కళేబరానికి పరీక్ష నిర్వహించారు. మృత చిరుత పిల్ల వయసు సుమారు రెండేళ్లు ఉంటుందని ఉత్తర ఘుముసుర అటవీ అధికారి (డీఎఫ్‌వో) హిమాంశు శేఖర్ మహంతి విలేకరులకు తెలిపారు. దాని శరీరంపై ఎక్కడా గాయాలు లేవని, పరీక్షా నివేదిక అందితే మృతికి గల కారణాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు. చెట్ల పొదల్లో పడి ఉన్న చిరుత పిల్ల కళేబరాన్ని బుధవారం సాయంత్రం కొందరు విద్యార్థులు చూశారు. విషయం గ్రామస్థులకు తెలియడంతో వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

కలిసొచ్చే కాలం.. కోరుతోంది ఊతం

కాసులు కురిపిస్తున్న గ్రానైట్

నీలి గ్రానైట్

ప్రపంచ వాణిజ్య చిత్రపటంలో జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చింది నీలి గ్రానైట్.. అగ్రశ్రేణి నాణ్యతను సొంతం చేసుకున్న ఆ గ్రానైట్ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.. గతేడాది ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు రూపాయితో డాలరు మారకపు విలువ రూ.6కుపైగా పెరగడం ఎగుమతిదారులకు లాభాలు చూపిస్తోంది. డిమాండ్ పెరగకపోయినా అంతర్జాతీయంగా జరిగిన పరిణామాలు కలిసొస్తున్నాయి. - న్యూస్‌టుడే, టెక్కలి

జిల్లాలోని నీలి గ్రానైట్‌కు కొన్ని దేశాల్లో డిమాండ్ ఉంది. ప్రధానంగా చైనా, యూరప్ దేశాల్లో శవపేటికల కోసం నీలి గ్రానైట్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. గతంలో ఎన్ని డాలర్లకు వెళ్లేదో.. ప్రస్తుతం అన్నే డాలర్లకు ఎగుమతి అవుతోంది. నాణ్యత విషయంలో గతంతో పోల్చుకుంటే ఆంక్షలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రోత్సాహం లేక ఇక్కట్లు..

★ 20 ఏళ్లుగా ఉత్పత్తి తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చు భారీగా పెరిగిపోయింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వట్లేదు.

★ [illegible]

★ [illegible]

భిన్నమైన పరిస్థితులు..

ఎగుమతులు, వాటి లాభాలు నాణేనికి ఒకవైపు. రెండోవైపు ఇందుకు విరుద్ధంగా ఉంది. ఎగుమతులు మినహాయిస్తే మిగిలిన గ్రానైట్‌ను జిల్లాలో పరిశ్రమలు [illegible] లాభాలు కనిపిస్తున్నాయి. [illegible] వ్యక్తం చేస్తున్నారు.

తరిమే ఆపదను తలచుకోరేం..!

- ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఆగట్లేదు. వరుస ఘటనలతోపాటు మరణాల రేటు పెరుగుతోంది. బాధితుల్లో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ఉండటం గమనార్హం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, శిరస్త్రాణం ధరించకపోవడంతో తీవ్రంగా గాయపడి.. మృత్యువాత పడుతున్నారు. [illegible]

శ్రీకాకుళం నగరంలో శిరస్త్రాణం లేకుండా చరవాణిలో మాట్లాడుతూ వెళ్తున్న యువకుడు

శిరస్త్రాణం ధరించక ద్విచక్ర వాహన ప్రమాదాలు

● మెళియాపుట్టి [illegible] కోత మిగిలింది.

★ జిల్లాలో గతేడాది 699 రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా 316 ద్విచక్ర వాహనాల ప్రమాదాలే ఉన్నాయి. ఇందులో 115 మంది మృతిచెందగా, 201 మంది తీవ్ర గాయాలయ్యాయి. ఆయా ఘటనల్లో అధికశాతం మంది శిరస్త్రాణాలు ధరించకే తీవ్రత పెరిగింది.

★ [illegible] పొడుస్తూ శిరస్త్రాణం ధరించలేదని 2025లో 43 వేల మందికిపైగా పోలీసు అధికారులు జరిమానా విధించారు.

★ మద్యం తాగి వాహనం నడుపుతున్న 6,338 మందిపై కేసులు నమోదు చేశారు. 62 మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశారు.

చర్యలేవీ..?

శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసు అధికారులు తనిఖీలు తగ్గించేశారు. పట్టణ ప్రాంతాల్లో నామమాత్రంగా ప్రక్రియ జరుగుతోంది. అవగాహన కార్యక్రమాలు [illegible]

తనిఖీలు పటిష్ఠం చేస్తాం..

ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలి. నిర్లక్ష్యం వహిస్తే వారిపై జైలు శిక్ష, జరిమానాలు, లైసెన్సులు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిని విడిచిపెట్టం. - కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

ఏదీ చెత్తశుద్ధి..

జిల్లాలో నీటి వనరుల పరిసరాలు [illegible] నది వైపు వెళ్లినా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఆయా వనరుల్లో నీరు కలుషితమవుతోంది. అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఆయా వనరుల్లో నీరు అడుగంటడంతో వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఇచ్ఛాపురం మండలం అరకభద్ర సమీపంలో బాహుదా నది వంతెన దిగువ భాగాన పేరుకుపోయిన చెత్తను చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి సానకొడి పంచాయతీలో యంత్రాంగం డి-అడిక్షన్ కేంద్రం దిశ తరఫున గురువారం మత్తు పదార్థాల వినియోగం వ్యతిరేకతపై అవగాహన కల్పించారు. మద్యానికి బానిసలైతే కుటుంబం ఎదుర్కోవాల్సిన సమస్యల గురించి వివరించారు.

చెక్‌డ్యాం.. లీకులమయం

సింగుపురం వద్ద సునాముధి కాలువపై రాజుల కాలంలో నిర్మించి చెక్‌డ్యాం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీని ద్వారా 500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం మరమ్మతులకు గురవ్వడంతో సాగునీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా శ్రమదానంతో ఇసుక బస్తాలతో నీటి వృథాను అరికడుతున్నామన్నారు. వేసవిలో పూర్తిస్థాయిలో బాగు చేస్తామని జలవనరులశాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. - న్యూస్‌టుడే, మందస

అంతిమ యాత్రకు అష్టకష్టాలు

జగతిలో శ్మశానానికి వెళ్లే రహదారి చుట్టూ ముళ్ల పొదలతో మూసుకుపోయింది. దీంతోపాటు ఇసుక రోడ్డు కావడంతో పలు చోట్ల గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కార్యదర్శి రమేష్ బెహరాను వివరణ కోరగా సర్పంచి, ఉపాధి సిబ్బందితో మాట్లాడి పొదలు తొలగించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

నిత్య వెలుగులు.. లేకుంటే చిమ్మ చీకట్లు



సున్నాడలోని మధ్య వీధిలో రెండు, శివాలయం దగ్గర ఒకటి, సున్నాడ కూడలి వద్ద మూడు మొత్తం ఆరు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి పూట రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండి వీధిలో రెండు వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కప్పు పాడైంది.. ముప్పు పొంచి ఉంది..

కర్తలి వద్ద రహదారికి ఆనుకుని ఉన్న మంచినీటి సరఫరా నియంత్రణకు ఏర్పాటు చేసిన వాల్వ్ కుండీ పైకప్పు పాడైంది. రహదారిపై స్పీడ్ బ్రేకర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి ప్రమాదం సంభవించొచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఎన్.మన్మథరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పార్కింగ్ స్థలం కాదు..

గోర్జీవీధిలోని ఇరుకు మార్గంలో రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ వీధిలో ఒక బ్యాంకుతోపాటు ఆరు ఆసుపత్రులు, రెండు ప్రైవేటు వసతిగృహాలు, 8 వ్యాపార సంస్థలు, రెండు గోదాములు ఉన్నాయి. తరచూ పోలీసు వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా, వారూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై దృష్టిసారించి, పరిష్కార చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. చిన్నంనాయుడు తెలిపారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పర్యవేక్షణ కరవాయె.. క్లోరినేషన్ లేదాయె..

పల్లె ప్రజలకు అందని శుద్ధజలం..

- చాలా చోట్ల రక్షిత తాగునీటి సరఫరా పథకాల మెట్లు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. పలు ప్రాంతాల్లో చాలా ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకులు పెచ్చులూడుతున్నాయి. ఈ క్రమంలో పైకి వెళ్లేందుకు వీలు కాకపోవడంతో ఆయా చోట్ల క్లోరినేషన్ చేయడం లేదు.
- దీనికి తోడు బోర్ల పైపులు దెబ్బతిని కలుషిత నీరు వస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ఎక్కడా నీటి పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రజలకు శుద్ధజలం అందడం లేదు.
- మరమ్మతులకు గురైన పైపులు, శిథిలమైన మెట్లు, అక్కడక్కడ పడిన లీకులకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు శుద్ధజలానికి దూరమవుతున్నారు. నియోజకవర్గంలో ఈదుపురం, తేలుకుంచి, జగన్నాథపురం, బెనుగానిపేట, మండపల్లి, ధర్మపురం, పి.శాసనం, బొడ్డబడ, కీర్తిపురం తదితర ప్రాంతాల్లో లీకులతోపాటు మెట్లు శిథిలావస్థకు చేరాయి.

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ప్రజలకు సురక్షిత జలం అందించేందుకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరవై లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల్లో ఉన్న ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయాలన్న నిబంధన ఉన్నా.. ఎక్కడా అమలు కావడం లేదు.

ధర్మపురంలో మంచి నీటి పథకం ట్యాంకు మెట్ల దుస్థితి

నియోజకవర్గంలో మంచినీటి పథకాల వివరాలు..

మండలం	పంచాయతీలు	బోర్లు	పాడైనవి	ఎన్టీఆర్ సుజల	పనిచేయనివి
ఇచ్ఛాపురం	21	323	18	11	6
కవిటి	23	659	29	38	35
కంచిలి	31	600	21	19	14
సోంపేట	23	483	23	16	6

ఓవర్ హెడ్ ట్యాంకులు ఇచ్ఛాపురం: 22, కవిటి: 19, కంచిలి: 52, సోంపేట: 20, ఇందులో సగానికి సగం శిథిలావస్థకు చేరాయి.

త్వరలో పరిష్కరిస్తాం

నియోజకవర్గ పరిధిలో నూతన మంచి నీటి పథకాల ఏర్పాటుకు సంబంధించి రూ.106 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం వేసవిలో పల్లెల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. - ఏవీ మురళీ మోహన్, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇచ్ఛాపురం

కల్యాణ మండపం అభివృద్ధికి విరాళం అందజేత

చంద్రమౌళి కుమందాన్‌కు విరాళం అందజేస్తున్న శ్రీనివాసశర్మ, సభ్యులు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీనగర్ వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపం అభివృద్ధికి ఉత్కళ ఆంధ్రా బ్రాహ్మణ సేవా సమాజం వారు రూ.50 వేలు విరాళం అందజేశారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు చంద్రమౌళి కుమందాన్‌కు సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాసశర్మ, కార్యదర్శి కొల్లూరు సూర్యనారాయణ శర్మ, కోశాధికారి తెన్నేటి సీతారామమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు బాష్కరాచార్యులు విరాళం అందజేశారు.

రాధాకృష్ణ మందిరం ప్రతిష్ఠ

శోభాయాత్రగా నదీ జలాలను తెస్తున్న మహిళలు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక సహకార కాలనీ (కోఆరేటివ్ కాలనీ)లో నిర్మించిన రాధాకృష్ణ మందిర ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం మహిళలు శోభాయాత్రగా నాగావళి నదీజలాలను తీసుకొని వచ్చారు. ఆలయ శుద్ధి పుణ్యావచనం తదితర కార్యక్రమాలు జరిగాయి.

(c) eenadu

25 వరకు సాగునీటి సరఫరా

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ పరిధిలోని 10ఆర్ చిలకలూరిపేట మేజర్, 10ఈ, 10జి మైనర్ కాలువలకు ఈ నెల 25 వరకు సాగునీటిని సరఫరా చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు తెలిపారు. మండలంలోని 10ఈ మైనర్ కాలువ కింద కేఎం అగ్రహారం తదితర గ్రామాల్లో సాగవుతున్న మొక్కజొన్న చేలను ఎన్నెస్పీ డీఈ ఉమాశంకర్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పంటల పెరుగుదల ఎలా ఉంది, సరఫరా అవుతున్న సాగునీరు సరిపోతుందా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. డీఈ మాట్లాడుతూ పంటలకు సరిపడా సాగునీరు సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

పల్నాడులో 86.. బాపట్లలో 100

❖ ప్రారంభం కాని అభివృద్ధి పనులు

❖ పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరై ప్రారంభం కాని పనులు పల్నాడు జిల్లాలో 86.. బాపట్ల జిల్లాలో 100 ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు నాడు-నేడు కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాల్ని వైకాపా ప్రభుత్వం చేపట్టి ఆదిలోనే వదిలేసింది. ఆయా భవనాల్ని పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దృష్టిసారించింది. ఈ నెలాఖరులోపు పనుల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేసింది. పీఎంశ్రీతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో పూర్తయినవి తక్కువగా ఉండగా, వివిధ దశల్లో ఉన్నవి ఎక్కువగా ఉన్నాయి. సరిపడా తరగతి గదుల్లేక ఉన్నత పాఠశాలల్లో బోధనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరితగతిన భవనాల నిర్మాణం పూర్తిచేస్తే విద్యార్థుల వెతలు తీరే అవకాశముంది.

సత్తెనపల్లిలోని జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా అదనపు భవనాల నిర్మాణం

జిల్లా	పనులు	నిధుల కేటాయింపు (రూ.లక్షల్లో)	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి	ప్రారంభం కానివి
పల్నాడు	531	6,091	109	336	86
బాపట్ల	437	2,992	137	200	100


రంజాన్ వేళలు
ఇఫ్తార్: (శుక్రవారం) సాయంత్రం: 6.19
సహరి: (శనివారం) ఉదయం: 5.16

కండక్టర్లకు పవర్ బ్యాంకులు

టికెట్ల జారీకి ఇబ్బందుల్లేకుండా చర్యలు

నరసరావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమల్లోకి తెచ్చాక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. దూరప్రాంత ప్రయాణాలకూ ఆదరణ మెండుగా ఉంది. టికెట్లు ఇచ్చేటప్పుడు టిమ్స్ పరికరాలకు తరచూ ఛార్జింగ్ సమస్య తలెత్తుతోంది. చాలా బస్సుల్లో ఛార్జింగ్ పాయింట్ల సదుపాయం లేనందున టికెట్ల జారీకి కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం కండక్టర్లకు పవర్ బ్యాంకులు సరఫరా చేసింది. ఒక్కో పవర్ బ్యాంకుకు రూ.3,499 చొప్పున వెచ్చించారు. జిల్లాలోని ఆరు డిపోలకు 859 పంపించారు. పవర్ బ్యాంకులతో టిమ్స్ పరికరాల్లో ఛార్జింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని డీపీటీవో అజితకుమారి తెలిపారు.

బ్యాంకర్ల పాత్రపై విచారణ!

నకిలీ ఖాతాలతో రుణాల వ్యవహారం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: మెప్మా రుణాలకు సంబంధించి నకిలీ ఖాతాలు సృష్టించి, ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన కేసులో బ్యాంకర్లను విచారించేందుకు దర్యాప్తు బృందం సిద్ధమైంది. నరసరావుపేట ఎస్‌బీఐ (ప్రకాశ్‌నగర్ బ్రాంచి) రూ.4.09 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.2.87 కోట్లు, జీడీసీసీ పిడుగురాళ్ల బ్రాంచి రూ.1.82 కోట్లను నకిలీ ఖాతాల ద్వారా మెప్మా రుణాలు అందించినట్లు అధికారులు గుర్తించారు. రెండ్రోజుల కిందట బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు బ్యాంకర్ల పాత్రపై విచారణకు రంగం సిద్ధం చేశారు. వినుకొండలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ముగిసిన తర్వాత.. ఈ మూడు బ్యాంకుల్లో నకిలీ ఖాతాలకు రుణాలు ఇవ్వడానికి సిబ్బంది ఎలా సహకరించారు? వారి వాటా ఎంత అనేది తేల్చనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 21న వినుకొండ పర్యటన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులంతా వినుకొండ చేరుకుని పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమ సమన్వయకర్త (ప్రోగ్రాం కోఆర్డినేటర్) పెందుర్తి వెంకటేష్ బుధవారం రాత్రి, గురువారం ఉదయం ప్రజావేదికను పరిశీలించి సూచనలు చేశారు. స్టాళ్ల ఏర్పాటు, కార్యకర్తల సమావేశం ఎక్కడ నిర్వహించాలనే దానిపై అధికారులు, స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా వేదిక ముందు భాగంలోని పిచ్చి మొక్కలు, చెట్లను యంత్రాలతో తొలగించి చదును చేస్తున్నారు. ప్రజావేదిక వద్ద విద్యుత్తు శాఖాధికారులు పాత లైన్లు తొలగించి కొత్తగా ఎత్తైన స్తంభాలు, నియంత్రిక ఏర్పాటు చేశారు. ఆర్డీవో మధులత నాలుగు రోజులుగా దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, ఆర్అండ్‌బీ అధికారులు జూనియర్ కళాశాలలో హెలిప్యాడ్, రోడ్డు ఏర్పాటు పనులు చేయిస్తున్నారు. సభ జరిగే ప్రాంతంతో పాటు పట్టణం అంతటా బ్యానర్లు ఏర్పాటు చేశారు.

పనులు పర్యవేక్షిస్తున్న పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులు



(c) eenadu

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- 49 కేంద్రాల్లో 600 సీసీ కెమెరాల ఏర్పాటు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం

ఇంటర్ డీఐఈవో నీలావతిదేవి వెల్లడి

చిలకలూరిపేట గ్రామీణ, నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఈనెల 23నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం, 24 నుంచి ప్రారంభమయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి నీలావతిదేవి గురువారం తెలిపారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి హాల్‌టిక్కెట్లు పంపిణీ చేశామని, ఇంకా ఎవరైనా హాల్‌టిక్కెట్లు తీసుకోని వారు ఉంటే వెంటనే తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా పరిధిలో 16 పోలీస్‌స్టేషన్లకు గురువారం నుంచి ప్రశ్నపత్రాలు చేరుకుంటున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఆయా కేంద్రాలకు పంపించామన్నారు. పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షించనున్నట్లు ఆమె తెలిపారు. 49 పరీక్ష కేంద్రాల్లో 600 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిని ఆయా కళాశాలలతో పాటు ఇంటర్ ప్రాంతీయ తనిఖీ అధికారి, ఇంటర్ విద్యామండలి కార్యాలయాలకు అనుసంధానం చేసినట్లు వివరించారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,740, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 16,636 మంది పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 15 చోట్ల 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో చిలకలూరిపేట 6, నరసరావుపేట 15, వినుకొండ, పిడుగురాళ్ల 4 చొప్పున, సత్తెనపల్లి 6, మాచర్ల 3, గురజాల, ధరణికోట 2 చొప్పున, పెదకూరపాడు, నాగార్జునసాగర్, దుర్గి, దాచేపల్లి, అచ్చంపేట, కారంపూడి, బెల్లంకొండ ఒక్కోటి చొప్పున ఉన్నాయన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారిని నియమించామన్నారు. ముగ్గురు సభ్యులు గల జిల్లా పరీక్షల కమిటీ పర్యవేక్షణలో మూడు ఫ్లయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు మంచినీరు, గాలి, వెలుతురు, ఇతర వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాల్సిందిగా ఆదేశాలిచ్చామన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో వైద్య బృందం, పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని ఆమె వివరించారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించబోమని, అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. సందేహాలుంటే 08647-223355 నంబరులో సంప్రదించాలన్నారు.

మూగజీవాలకూ ఆరోగ్య కార్డులు

కాకతీయనగర్ (నరసరావుపేట వ్యవసాయం), సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పశువుల ఆరోగ్య పరిరక్షణకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పశు సంపద వృద్ధి, వాటి ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం భారత్ పశుధన్ యాప్‌ను ప్రారంభించింది. నేషనల్ డిజిటల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌డీఎల్‌ఎం) రూపొందించిన ఈ యాప్ ద్వారా వంద శాతం పారదర్శకంగా సేవలు అందడంతో పాటు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. మూగజీవాలకు ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య కార్డులు జారీ చేయనున్నారు.

భారత్ పశుధన్ యాప్ లోగో

తప్పుడు లెక్కలకు అడ్డుకట్ట

జిల్లాలో 3,88,674 గేదెలు, 58,593 ఆవులు, 6,28,240 గొర్రెలు, 2,31,196 మేకలున్నాయి. పశు సంవర్ధక శాఖలో ఇన్నాళ్లూ జవాబుదారీతనం లోపించి సేవల్లో జాప్యం, అవకతవకలు జరిగేవి. మూగజీవాలకు వైద్య సేవలు, చికిత్సల్లో అక్రమాలు జరిగేవి. తప్పుడు లెక్కలతో నిధులు స్వాహా చేసేవారు. పశువుల ఆరోగ్య స్థితిగతుల అంచనా తదితరాల్లోనూ లోపాలు చోటు చేసుకునేవి. వీటిన్నింటికీ భారత్ పశుధన్ యాప్‌తో అడ్డుకట్ట పడనుంది. ప్రతి పశువుకు 12 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. అవి జన్మించిన నాటి నుంచి పూర్తి సమాచారం ఆన్‌లైన్లో భద్రంగా ఉంటుంది. ఆరోగ్య రికార్డుల నిర్వహణ, టీకాల వివరాలతోపాటు వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటారు. పశువుల బీమా వర్తించడంతో పాటు ఏ కారణంతో అయినా పశువు మరణిస్తే పరిహారం వెంటనే పొందేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. పశువుల క్రయ విక్రయాలు, రుణాల మంజూరు, వర్తించే రాయితీలు, పాల దిగుబడి, గర్భోత్పత్తి అంచనా తదితర సమస్త సమాచారం తెలుసుకోవచ్చు. ఎక్కడైనా అంటువ్యాధులు ఇతరత్రా కారణాలతో పశువులు మృతి చెందితే ఆ ప్రాంతంలోని రైతులను అప్రమత్తం చేస్తూ సందేశాలు పంపుతారు.

ఏం చేయాలి.. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాక సెల్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. యాప్‌లో యజమాని, పశువుల వివరాలన్నీ నమోదు చేయాలి. యాప్‌లోని సమాచారం ఆధారంగా భవిష్యత్తులో పశు పోషణకు ఎంత బడ్జెట్ కేటాయించాలన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి **డాక్టర్ రామారావు** తెలిపారు.

24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి గురువారం తెలిపారు. అండర్-18 (వ్యక్తిగత, మాస్టర్) విభాగంలో ఈ పోటీలు ఉంటాయని, ఇందులో గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 28, మార్చి 1వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు శాప్ వెబ్‌సైట్‌లో సరైన వ్యక్తిగత వివరాలను ఓపెన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ నెల 24న ఉదయం 9గంటల లోపు క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో స్టేడియంలోని క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

జిల్లాలో 28,742 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో 28,742 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేశామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు నారదముని గురువారం తెలిపారు. రూ.67.90 కోట్ల విలువైన ధాన్యాన్ని 4044 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 83చోట్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించడంలో ఏమైనా ఇబ్బందులుంటే జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 8897798430ను సంప్రదించాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెలిప్యాడ్ వద్ద చర్చిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావు తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈనెల 21న వినుకొండలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొంటున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు వాటిపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎక్కడా లోపం లేకుండా చూసుకోవాలని కలెక్టర్ చెప్పారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన

సీఎం సందర్శించే ప్రాంతాలను ఆయన భద్రత సిబ్బందితో కలిసి కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న హెలిప్యాడ్, ఎన్నెస్పీ కాలనీలో సభావేదిక, ప్రజావేదిక ప్రాంతాలను సందర్శించారు. సీఎం కాన్వాయ్ రాకపోకలు, వీవీఐపీ వాహనాల పార్కింగ్ ఇతరత్రా భద్రత ఏర్పాట్లపై చర్చించారు. వారి వెంట ఆర్డీవో మధులత, డీఎస్పీ ఎం.హనుమంతరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ గీతా రాణి, మున్సిపల్ కమిషనర్ శివరామప్రసాద్, తహసీల్దార్ సురేష్, ఎస్‌బీ సీఐ సురేష్, స్థానిక సీఐలు ప్రభాకర్, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

లోటుపాట్లు రానీయొద్దు

సభావేదికను పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, న్యూస్‌టుడే: ఈనెల 21న సీఎం చంద్రబాబునాయుడు వినుకొండ పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం పరిశీలించారు. ఎన్నెస్పీ కాలనీలోని సభావేదిక, బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజావేదిక ప్రాంతంలో గేటు వద్ద నిర్మిస్తున్న బయో మెడికల్ వేస్ట్ గదులను వాస్తు దృష్ట్యా మరోచోటకు మార్చాలని డీసీహెచ్ఎస్ ప్రసూనకు సూచించారు. సీఎం పరిశీలించే అన్ని విభాగాలను లోటుపాట్లు లేకుండా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావుతో మాట్లాడారు. జీవీ వెంట పలువురు తెదేపా నాయకులు ఉన్నారు.

సెపక్ తక్రా పోటీలకు వేళాయె

సాధన చేస్తున్న క్రీడాకారులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) అంతర్ కళాశాలల సెపక్ తక్రా (పురుషుల) పోటీలకు పట్టణంలోని విద్యాకేంద్రం డిగ్రీ కళాశాల ఆతిథ్యమిస్తోంది. శుక్ర, శనివారాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎనిమిది జట్లు పోటీలో పాల్గొననున్నాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులతో ఏఎన్‌యూ సెపక్ తక్రా జట్టును ఇక్కడే ఎంపిక చేయనున్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ తెలిపారు.

గురప్పనాయుడుపాలెంలో దొంగల స్వైరవిహారం

ఒకేరోజు ఆరు ఇళ్లు, రామాలయంలో చోరీ

నూజండ్ల, న్యూస్‌టుడే: అర్ధరాత్రి గ్రామంలోకి వచ్చిన దొంగలు తాళాలు వేసి ఉన్న ఆరు ఇళ్లతో పాటు రామాలయం తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని గురప్పనాయుడుపాలెంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొందరు ఇళ్లకు తాళాలు వేసి వినుకొండలో ఉంటున్నారు. అలాంటి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు తెగబడ్డారు. న్యాయవాది ఎం.జ్ఞానేశ్వరరావు, నాసరయ్య, కోటేశ్వరరావు, లగడపాటి చెన్నయ్య, కూరపాటి హనుమంతరావు, ద్రోణాదుల వెంకట్రావు ఇళ్లతో పాటు రామాలయం తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సమాచారం తెలిసి బాధిత కుటుంబాల వారు వినుకొండ నుంచి వచ్చి ఇళ్లను పరిశీలించారు. తమ ఇళ్లలో విలువైన వస్తువులేమీ లేకపోవడంతో నష్టం జరగలేదన్నారు. రామాలయంలో అమ్మవారి బంగారు రూపు, స్వామివారి వెండి జందెం తీసుకెళ్లారని అర్చకుడు రాము తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే రోజు ఏడు చోరీలపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

నేతి వేంకన్న తిరునాళ్లకు ఏర్పాట్లు

రేపటి నుంచి ఉత్సవ వారాలు

మూలవిరాట్టు

దేవరంపాడుగుడి(రాజుపాలెం), న్యూస్‌టుడే: పల్నాటి తిరుమలగా పేరుగాంచిన దేవరంపాడు మత్స్యరూప వేంకటేశ్వరస్వామి ఫాల్గుణ మాస ఉత్సవ వారాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 21న మొదటివారం, 28న రెండో వారం, మార్చి 7న మూడోవారం, మార్చి 14న నాల్గోవారం, ఉగాది పర్వదినాన ఐదోవారం నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోటప్పకొండ తరువాత పెద్ద ఉత్సవంగా పేరున్న ఈ తిరునాళ్లకు వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమస్యలు పునరావృతం కాకుండా.. గతంలో తాగు నీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ విషయంలో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వీఐపీ, సిఫార్సు దర్శనాలతో క్యూలైన్లలో ఉండే భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఏడాది అటువంటివి తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉంది. తలనీలాలు సమర్పించేందుకు అధికారికంగా వసూలు చేసే సొమ్ముతో పాటు అదనంగా రూ.100 చొప్పున తీసుకుంటున్నారని భక్తులు చెబుతున్నారు.

హుండీలను నంబర్లు కేటాయించాలి.. హుండీల విషయంలో దేవాదాయ అధికారులు ఏటా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే ప్రత్యేక హుండీలకు విధిగా నంబర్లు ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. అదే విధంగా ప్రసాదం నాణ్యతగా ఉండాలని, కొబ్బరికాయల ధరలు అదుపులో ఉంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బందుల్లేకుండా చర్యలు.. భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో గణపతి సురేష్ తెలిపారు. ఉచిత దర్శనంతోపాటు రూ.20తో శీఘ్ర దర్శనం, రూ.50 అర్చన దర్శనం, రూ.200 వీఐపీ దర్శనం ఉంటుందన్నారు.

'ఉపాధి' పేరు మార్పుపై జగన్ నోరు విప్పరేం: షర్మిల

శావల్యాపురం: మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

శావల్యాపురం, నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : వైఎస్సార్ ఆశయాల నుంచి పుట్టిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నోరు విప్పకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ పథకానికి, మోదీ తెస్తున్న వీబీ జీరామ్‌జీ పథకానికి ఎంతో తేడా ఉందన్నారు. ఉపాధి హామీపై కొత్త చట్టానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్దతు పలకడంపైనా మండిపడ్డారు. ఉపాధి హామీ పరిరక్షణ పాదయాత్రల్లో భాగంగా నరసరావుపేట మండలం రావిపాడు ఎస్సీ కాలనీ, శావల్యాపురం మండలం వేల్పూరులోని కళామందిర్ కూడలిలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారు. వేల్పూరులో ఉపాధి హామీ కూలీలతో పాటు, బొల్లాపల్లి మండలం గరికపాడు, మాచర్ల మండలం కొత్తపుల్లారెడ్డి గ్రామం నుంచి వచ్చిన కూలీలు పథకంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గతేడాది కూలీ ఇంతవరకు బ్యాంకులో జమ కాలేదని, పనికి రావాలంటే కొత్తగా పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించాలని క్షేత్రసహాయకులు చెబుతున్నారని, మరోపక్క కూలీలతో నామమాత్రంగా పనులు చేయిస్తూ ఎక్కువగా యంత్రాలనే వినియోగిస్తున్నారని వాపోయారు. కొత్త చట్టంలో పంచాయతీ తీర్మానంతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే పనులు కేటాయిస్తుందని, అప్పుడు గుత్తేదారు చెప్పిన వారు మాత్రమే పనికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అయ్యే వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా ఇవ్వడం ఆర్థికంగా భారమేనన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతాయని తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

BUILDING CONSTRUCTION

తాడేపల్లిలోని ఒక అపార్టుమెంట్ భవనములపై పెయింటింగ్ నిమిత్తము ముందుగా వాల్స్, భీములు మొదలగువాటి రిపేరు చేయుటకు అనుభవంగల నిపుణులైన వారినుండి అంచనా వ్యయాలను ఆహ్వానించటమైనది. 92477 27555.

PERSONAL CLASSIFIEDS

MISSING

ది. 12-02-2026 నుండి కనబడుటలేదు

పేరు: అమరా వెంకటరత్నం గారు
పొన్నూరు, గుంటూరు జిల్లా
వయస్సు: 81 సం॥
రంగు: చామన ఛాయ
ఎత్తు: 5'.11 అంగుళాలు
దుస్తులు: చొక్కా, లుంగీ
ఆచూకీ తెలిసినవారు క్రింది నెంబరుకు తెలుపగలరు
కుమారుడు
అమరా నారాయణరావు
సెల్: 95533 32166

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదిశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యనాడి జ్యోతిష్యాలయం మీచేతిబొటనవేలుముద్రతో మీభవిష్యత్తు పూర్తిగాచెప్పబడును. అన్నిసమస్యలకు పరిష్కారంచెప్పబడును. 8978215913.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

మార్కాపురం (కుంట) దగ్గరలో 133 గజాలు కేవలం 2 లక్షలు మాత్రమే. దొనకొండ దగ్గరలో 133 గజాలు 1 లక్ష మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 9398621767.

JOBS

WANTED Experienced Accountant in a Company at Auto Nagar, Guntur. Salary Package follows Experience. Ph.90631 83834.

SARIPUDI Suzuki, Guntur - Hiring Managers, Cashier, CRM, CREs and Service Advisors. Both Freshers and experienced Candidates can apply. Attractive Salary + Incentives. Interview on 23-02-2026. ✆ 7799960199, 149.

విజయవాడ సిటీ, తాడేపల్లి ఏరియాలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్. జీతం: 35,000/-, PF & ESI. ✆ 79933 22229.

ఆఫీసు మేనేజర్ కావలెను. డిగ్రీ పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 10 సం॥ల అనుభవం, కంప్యూటర్‌పై అవగాహన, 40 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పని చేయుటకు Male/Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. ✆ 63022 43437.

ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు అసిస్టెంట్ మరియు రిసెప్షనిస్ట్ స్టాఫ్ కావలెను. సంప్ర॥ 78420 31133.

ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, టీమ్‌లీడర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 87126 18882. గుంటూరు.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ నందు Senior Civil Engineersగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరాల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం॥ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

గుంటూరు పరిధిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు 10th/Inter చదివిన ఫుల్‌టైం లేడీవార్డెన్ కావలెను. Ph.93944 47117, 92477 45046.

MNY హాలిడేస్ & ప్రాజెక్ట్స్ కోసం గుంటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + Inc. ఇవ్వబడును. వయస్సుతో పనిలేదు. సంప్ర: 10am-6pm. ✆ 0863-4616071.

ASHOK Lalyland Dost Auto మరియు కారుకు లైసెన్స్, అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. అడ్రస్: వెంకట సీతావరలక్ష్మి ట్రేడర్స్, స్టాల్‌గర్ల్స్ హైస్కూల్ ఎదురు, నగరంపాలెం, గుంటూరు. జీతం:18500/-.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు స్టోర్‌కీపర్‌గా పనిచేయుటకు డిగ్రీ వుండి కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న పురుషులు కావలెను. జీతం: 15000/-, వర్కుచేయు ప్లేస్: గుంటూరు, పెదపలకలూరు. ఫోన్: 89784 80429.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

నిబంధనల అమలుకు ఇబ్బందులేంటి?

సామాజిక తనిఖీల నివేదికలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేయడానికి ఇబ్బందులేంటి? గత ఆర్థిక సంవత్సరం మండలంలో సక్రమంగా పనులు జరగలేదని సామాజిక తనిఖీల నివేదికలు చూస్తే అర్థమవుతుంది. వచ్చే ఏడాది ఇలాంటి పరిస్థితి లేకుండా చూడాలని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి పర్యవేక్షక అధికారులు, ఉద్యోగులు, క్షేత్ర సహాయకుల్ని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పనులు 445కు సంబంధించి రూ.4.77 కోట్లు, పీఆర్‌కి చెందిన రూ.2.22 కోట్ల వ్యయంతో 43 పనుల రికార్డులను సామాజిక తనిఖీ బృందాలు నిశితంగా పరిశీలించాయి. వీటిలో దమ్మాలపాడులో చెరువు పూడికతీత పనులు నిబంధనల మేరకు జరగలేదని గుర్తించాయి. పనులకు.. డ్రాచేసిన నిధులకు వ్యత్యాసం ఉన్నట్లు తేల్చి రూ.68 వేలు రికవరీ చేయాలని నిర్ణయించాయి. బొల్లవరంలో మస్టర్లు సక్రమంగా లేకపోవడంతో రూ.7,200, రుద్రవరంలో పనికి హాజరై కూలీ నుంచి వేలిముద్ర తీసుకుని వివరాలు నమోదు చేయకపోవడంతో రూ.1,620 రికవరీకి పీడీ ఆదేశాలు చేశారు. మొత్తం రూ.72,098 రికవరీ, రూ.2,31,992 విలువ చేసే పనులపై పున:విచారణ, రూ.39,791 పనుల రీసర్టిఫికేషన్, రూ.22 వేలు జరిమానా విధిస్తూ పీడీ చర్యలు తీసుకున్నారు. 100 రోజుల పనిదినాల కల్పనతోపాటు గోకులం షెడ్లు, ఇంకుడు, సేద్యపు గుంతలు ఇతర ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాల్ని మార్చిలోపు పూర్తి చేయాలని పీడీ చెప్పారు. ప్రజావేదికలో ఎస్సార్పీ తులసినాయక్, ఏపీడీ కేవీ నారాయణ, జెక్యూసీడీ ప్రభాకర్, ఎంపీపీ వీరభాస్కరరెడ్డి, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఏపీవో ఏడుకొండలు, తెదేపా మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బి.ఎన్.ఆర్ గోల్డ్ డైమండ్స్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డులోని బి.ఎన్.ఆర్. గోల్డ్ డైమండ్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ఇస్తున్నట్లు ఛైర్మన్ బాపిరెడ్డి నాగిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బాపిరెడ్డి రోహిత్ చరణ్‌రెడ్డి తెలిపారు. డైమండ్ క్యారెట్ ధర రూ.44,999 నుంచి ప్రారంభం అవుతోందని, 22, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు ఉండవని, పోల్కి డైమండ్స్‌పై తరుగు, మేకింగ్ ఛార్జీలు లేవన్నారు. బంగారు ఆభరణాలపై 6 నుంచి 9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు మార్చి 1వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని షోరూమ్‌తోపాటు బెంగళూరులోని జయనగర్ మార్తహళ్లి షోరూమ్‌లో ఈ ఆఫర్లు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిర్చియార్డు ఛైర్మన్ ప్రమాణస్వీకారం నేడు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కుర్రా అప్పారావు వెల్లడించారు. ఉదయం 12.06 గంటలకు మిర్చియార్డులో పదవీ బాధ్యతలు స్వీకరిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ర్యాలీ, ప్రమాణస్వీకారసభ జరుగుతాయన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రింగ్‌రోడ్డులోని సాయిబాబా రోడ్డు జంక్షన్‌లో తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడ నుంచి కొరిటెపాడు, లక్ష్మీపురం మదర్‌థెరెసా విగ్రహం వైపు నుంచి ప్రధాన రహదారిలోకి చేరుకుని ఎన్టీఆర్ స్టేడియం మీదుగా చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సభకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారన్నారు. తనతో పాటు వైస్‌ఛైర్మన్ బిట్రగుంట మల్లిక, డైరెక్టర్లు అందరితో వారు ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అప్పారావు కోరారు.

వేసవిలో విద్యుత్తు అంతరాయాలు లేకుండా చర్యలు

మల్లమ్మసెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: వేసవిలో గృహాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు తీసుకుంటున్న చర్యలను మార్చి 26కల్లా పూర్తి చేయాలని, సిబ్బందికి సూచనలు చేశామని హెచ్‌ఆర్డీ ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. విద్యుత్తు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటగిరీ 2, 3 సర్వీసులను కూడా స్మార్ట్‌మీటర్ల పరిధిలోకి తీసుకొస్తామన్నారు. ఆర్డీఎస్ పనుల్ని మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ లబ్ధిదారులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు విషయంలో సిబ్బంది చొరవ చూపి లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలన్నారు. నియంత్రికల్లో లోపాలను సరిచేయాలని సూచించామన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంలో స్థల సేకరణ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించామన్నారు. ఎస్‌ఈ పి.విజయ్‌కుమార్, నరసరావుపేట ఈఈ సిహెచ్ రాంబొట్లు, మాచర్ల ఈఈ సింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటో నడిపిన వ్యక్తికి జైలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో బుధవారం రాత్రి పట్టణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ తనిఖీల్లో పట్టణానికి చెందిన ఎస్. రామారావు మద్యం తాగి ఆటో నడుపుతున్నట్లు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి గురువారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతడికి ఏడురోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఆటలతో మానసికోల్లాసం

బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని సాంబశివనగర్ చెరువు రోడ్డులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గట్టినేని విజయసాయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు బ్యాటింగ్ చేసి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాలకు బానిస కాకుండా ఆటలాడటం ద్వారా మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా ఉండవచ్చునన్నారు. విజేతకు మొదటి బహుమతిగా రూ.1,00,116ను నిర్వాహకులు ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పార్టీ నాయకులు జవ్వాజి మదన్, కందుల రమణ, అసిస్ట్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

హెల్మెట్ తప్పనిసరి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సీఐ వెంకటరమణ కోరారు. గురువారం మాచర్లలోని పార్కు సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల నుంచి బయటపడవచ్చన్నారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

జాతర విజయవంతం చేద్దాం

మాట్లాడుతున్న యాగంటి వెంకటేశ్వర్లు

అడిగొప్పల(దుర్గి): సమష్టి కృషితో అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి జాతర జయప్రదం చేయాలని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. గురువారం ఆలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం తహసీల్దార్ వరకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8న అమ్మవారి జాతర నిర్వహించనున్నామని, పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆలయ ఈవో, ఏసీ ఆదిశేషనాయుడు తెలిపారు. ఈ సమావేశంలో కారంపూడి సీఐ శరత్‌బాబు, సర్పంచి రమేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని వడ్డవల్లిలో ఎంపీపీఎస్(ఏబీఎం) పాఠశాల సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. దోమల బెడద పెరుగుతోంది. విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. **- స్థానికులు, వడ్డవల్లి** ✔ నాలుగు రోడ్ల కూడలిలో చెత్త, వ్యర్థాలను తొలగించి, పరిసరాలను శుభ్రంగా మారుస్తాం.
- విజయసారథి, శానిటరి ఇన్‌స్పెక్టర్. - న్యూస్‌టుడే, సత్తెనపల్లి

? కారంపూడిలో వీధి దీపాలు పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. అలాగే ఎన్నెస్పీ కాలువ పక్కనున్న యానాదుల కాలనీలో రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నాం.
- నరసింహారావు, కారంపూడి ✔ వీధి దీపాల విషయంలో విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకోవాలి. యానాదుల కాలనీలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
- కశిన్యానాయక్, కార్యదర్శి– న్యూస్‌టుడే, కారంపూడి

అన్నదాతకు యాప్ అండ

చరవాణి ద్వారా సమగ్ర సమాచారం

ధరణికోట, అమరావతి, న్యూస్‌టుడే

రైతులకు అందించే సేవల్లో సాంకేతికతను జోడించి నూతన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చరవాణి ద్వారానే సమగ్ర సమాచారం అందుబాటులోకి తెచ్చింది. తద్వారా సాగును మరింత సులభం చేస్తోంది. చేతిలో ఫోన్ ఉంటే చాలు.. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. రైతులకు తక్షణ సేవలు అందించడానికి వ్యవసాయశాఖ ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీఏఐఎంఎస్) చరవాణి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీన్ని వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల చరవాణుల్లో ఇన్‌స్టాల్ చేసి, అవగాహన కల్పిస్తున్నారు.

రైతు సేవా కేంద్రంలో యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పల్లెల్లో అవగాహన .. యాప్ ద్వారా రైతులు భూముల వివరాలు, సర్వే నంబర్లు, మ్యాప్‌లు మొదలైన వివరాలు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. సాగు విధానం, చీడపీడల నివారణకు సలహాలు, వాతావరణ సమాచారం పొందొచ్చు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పనిలేకుండా రైతులే నేరుగా ఈ-పంట నమోదు చేసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రైతు ఆధార్ నంబరుతో రిజిస్టరై పిన్ నంబరును ఏర్పాటు చేసుకోవాలి. దీనిపై సిబ్బంది గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తున్నారు.

మార్కెట్ ధరలు తెలుసుకోవచ్చు

యాప్‌లో పంటల మార్కెట్ ధరలను తెలుసుకోవచ్చు. ధరల ప్రకారం పంటను మార్కెట్‌కు తరలించే వెసులుబాటు కలుగుతుంది. రానున్న ఐదు రోజుల మార్కెట్ ధరల అంచనాలు కనిపిస్తాయి. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ ధరలు తెలుసుకునేలా యాప్‌ను డిజైన్ చేశారు. వరదలతో నష్టం వాటిల్లినప్పుడు పరిహారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఈ యాప్‌లో పంట నష్టం ట్యాబ్‌ను క్లిక్ చేస్తే దరఖాస్తు ఏ స్థితిలో ఉందో తెలుస్తుంది. గ్రామంలో పంట నష్టం వివరాలు తెలుస్తాయి. తుపాను, భారీ వర్షాల సమాచారం రైతుల ఫోన్‌కు నోటిఫికేషన్ వచ్చేలా యాప్ ఉపయోగపడుతుంది. ముఖ్యఅధికారులు, శాస్త్రవేత్తల వివరాలు, వారి సలహాలు, సూచనలు యాప్‌లో కనిపిస్తాయి. యంత్ర పరికరాలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు.

నేడు ఈ-వ్యర్థాల సేకరణ

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మాచర్లలో శుక్రవారం ఈ-వ్యర్థాలను సేకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి పార్కు సెంటర్ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ-వ్యర్థాలు సేకరిస్తున్నట్లు వివరించారు. ప్రజలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనికిరాని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేయాలని కోరారు. ప్రతి నెలా 10, 20వ తేదీల్లో సేకరిస్తామని, ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

దాచేపల్లి, న్యూస్‌టుడే: ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాచేపల్లిలో త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పించారు. కేసానుపల్లి రోడ్డు, కొట్ల బజార్, జమ్మిచెట్టు సెంటరు ప్రాంతాల్లో సభ్యులు ప్రచారం చేశారు. భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు.

మాదిరి ప్రశ్నపత్రం ఆవిష్కరణ

గురజాల, న్యూస్‌టుడే: కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష మాదిరి ప్రశ్నపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో ఏవో సుజాత ఆవిష్కరించారు. సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యాబోధన, ఆర్థిక సాయం చేయడం, బాలబాట పాఠశాల ఏర్పాటు అభినందనీయం అన్నారు. సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్, గురజాల, దాచేపల్లి ఏరియా కోఆర్డినేటర్లు దయామని, సునీల్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. గురువారం ప్రజావేదిక ఏర్పాటు చేసి తనిఖీల్లో వెల్లడైన అక్రమాలు తెలియజేశారు. మస్తర్ల నిర్వహణలో రూ.1.67 లక్షలు అవకతవకలు గుర్తించారు. డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి ఆధ్వర్యంలో అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మస్తర్ల నిర్వహణలో లోపాలు లేకుండా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి కుటుంబానికి వందరోజులు పనిదినాలు కల్పించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పీఆర్ పనుల రికార్డులు అందజేయలేదన్నారు. 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 మధ్య కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో 780 పనులకు రూ.6.46 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. ఎంపీడీవో జి.రవికుమార్, డీవీవో హీరాలాల్, జేక్యూసీ ప్రభాకర్, ఎస్ఆర్ ఆవులయ్య, ఇన్‌ఛార్జి ఏపీవో వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, అధికారులు

వినాయకుడి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవం

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చామర్రులో వరసిద్ధి వినాయక ఆలయంలో పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శతకలశాభిషేకం, విశేష స్నపనం, హోమాలు నిర్వహించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం పుష్పగిరి పీఠాధిపతి మదబినవొద్దండ విద్యాశంకర భారతీస్వామి అనుగ్రహ భాషణం చేస్తారు.

ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పులిపాడు గ్రామంలో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామికి మహాకుంభాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గణపతి పూజ, ధ్వజారోహణ తదితర పూజలు చేశారు.

స్వామి మూలవిరాట్టు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్త సమస్యలను పార్టీ దృష్టికి తీసుకు రావాలని తెదేపా నాయకుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి కోరారు. గురువారం యాప్ ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మై టీడీపీ యాప్‌పై ప్రచారం చేపట్టారు. పట్టణంలోని 13వ వార్డులో ప్రతి ఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ మై టీడీపీ యాప్‌ను చరవాణిలో ఇన్‌స్టాల్ చేసుకుని, తద్వారా వార్డు, గ్రామాల్లో సమస్యలు తెలియజేయాలన్నారు. అలాగే సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవచ్చన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరులోని శిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమం భారీగా జరిగింది. మార్చి 19న జరిగే ఆలయ వార్షికోత్సవంలో పదివేల మందికి అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యుడు వెంకట్రావు తెలిపారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు గురువారం ప్రారంభించారు. మధ్యాహ్నం నమాజ్ చేసేందుకు పెద్ద మసీదుకు వచ్చారు. ప్రార్థనల అనంతరం ప్రధానరోడ్డుపైకి వచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు ఉస్మాన్‌మేస్త్రీ, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ మాట్లాడుతూ మానవాళి కోసం ఖురాన్ అవతరించిన నెల రంజాన్ మాసమని, అందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ముస్లిం ఉపవాసదీక్ష ప్రారంభిస్తారని తెలిపారు. మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎండీ గఫార్, అంజుమాన్ కమిటీ ఛైర్మన్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పణిదం సొసైటీ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరుతూ గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకుడు సిహెచ్ సాయిప్రసాద్ తెలిపారు. 'పణిదం సొసైటీ.. ఏమిటీ దుర్గతి' శీర్షికన ఈనెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సహకార సంఘం ప్రస్తుతం రూ.30 లక్షల నష్టంతో నడుస్తుందని, అప్కో నుంచి రూ.6 లక్షలు రావాల్సి ఉందన్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు అందుబాటులో లేకపోవడంతో పాలకవర్గం పాత భవనానికి మరమ్మతులు చేస్తూ.. సభ్యులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నారని ఏడీ తెలిపారు.

పన్నులు చెల్లించాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, మంచినీటి వినియోగ ఛార్జీల బకాయిలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.ఆనంద్‌కుమార్ కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయిల్ని గడువులోపు చెల్లించాలన్నారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా ఉందని తెలిపారు.

చెరువులో మొసలి సంచారం

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని తురకపాలెం చెరువులో మొసలి సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పగలు నీటిలో ఉంటూ, రాత్రివేళ ఒడ్డుకు వస్తోంది. ఎవరైనా అటుగా వస్తే అలజడికి నీటిలోకి జారుకుంటోంది. ఇటీవల చెరువు నీటిని తాగేందుకు వెళ్లిన రెండు మేకలను తినేసింది. పశువులు, జీవాలకు దాహార్తి తీర్చాలంటే భయపడుతున్నారు. మొసలిని బంధించాలని గ్రామస్థులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

రెంటపాళ్ల (సత్తెనపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: రెంటపాళ్లలో ద్విచక్ర వాహనం ఢీకొని మారిశెట్టి వెంకాయమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమె కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా సత్తెనపల్లి-మాదిపాడు ప్రధాన రహదారిలో వెనుకగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయం కాగా.. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

శివాజీ స్ఫూర్తితో హైందవ ధర్మాన్ని పరిరక్షిద్దాం

ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేద్దామని మాజీ కౌన్సిలర్ భానోజీ, యోగా గురువు రమేష్, స్ఫూర్తి విద్యాసంస్థల బాధ్యుడు సత్యనారాయణ అన్నారు. ఛత్రపతి శివాజీ యూత్, ఆరె క్షత్రియ మరాఠా సంఘం, శక్తి యోగ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం శివాజీ జయంతి నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మాచర్ల పట్టణం: ఛత్రపతి శివాజీ, రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాచర్లలోని రామకృష్ణ సేవాసమితి ఆశ్రమంలో నిర్వాహకులు గోవింద రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

రెంటచింతల: ఛత్రపతి శివాజీ జయంతి కూటమి నేతలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళి అర్పించారు. నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, సైదులు, విజయసారథి, కోటేశ్వరరావు, సాగర్, కుమార్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

తాగునీటి సరఫరాకు వినతి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ముస్లిం సోదరులు నివసించే ప్రాంతాల్లో, మసీదులు ఉన్న ప్రాంతాల్లో రెండు పూటల మంచినీరు సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని కోరారు. తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, జనసేన నాయకుడు ఖాసింసైదా, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తెదేపా పనిచేస్తోందని పార్టీ నాయకుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. గురువారం మాచర్లలోని 9వ వార్డులో రూ.6.5 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి నిధులు తెస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, పట్టణ తెదేపా అధ్యక్షుడు దుర్గారావు, సైదయ్య, మంజుల వెంకటేశ్వర్లు, రెడ్యానాయక్, బండ్ల శ్రీను, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

తాగేస్తూ.. నడిపేస్తూ..

న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

మద్యం మత్తులో కొందరు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదుపు తప్పి డివైడర్లు, చెట్లు, బారికేడ్లు ఢీకొని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మూడు నెలల కిందట పట్టణానికి చెందిన యువకుడు మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ కొండమోడు జంక్షన్ సమీపంలో రోడ్డుపక్కన రెయిలింగును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. గణేశుని సత్తెనపల్లికి చెందిన యువకుడు మద్యం తాగి కారంపూడి వైపు వెళుతూ జానపాడురోడ్డులో మరో వాహనాన్ని ఢీకొని చనిపోయారు. పట్టణానికి చెందిన యువకుడు సున్నపురాళ్లు వైపు వెళుతూ డివైడర్‌ను ఢీకొని ప్రాణాలు విడిచాడు. ఇలా తరచూ ఏదో ఒక ప్రాంతంలో మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడుతున్నారు. చేతికొచ్చిన కుమారులు మృతితో తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. కొన్నిసార్లు ఎదురుగా వస్తున్న పాదచారులు, వాహనాలను ఢీకొంటూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఓ వైపు పోలీసులు, మరోవైపు రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నా.. మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు.

బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

నిత్యం పోలీసుల తనిఖీలు.. పట్టణ పోలీసులు ప్రతిరోజు రాత్రి రహదారుల్లో ఉండి తనిఖీలు చేస్తున్నారు. వాహనదారులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరిశీలిస్తున్నారు. మద్యం తాగినట్లు తేలితే వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. వారాంతపు సెలవు రోజుల్లో ఎక్కువ మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. కొంతమంది యువకులు ఊరి బయట రోడ్ల పక్కన కూర్చొని తాగుతున్నారు. పిడుగురాళ్ల పోలీసుస్టేషన్ పరిధిలో 2025 సంవత్సరంలో 151 కేసులు నమోదు చేశారు. 83 కేసులకు రూ.8.3 లక్షలు జరిమానా విధించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 49 కేసులు నమోదయ్యాయి. వాటిల్లో 11 కేసులకు జరిమానా విధించారు.

చెత్తతో ముప్పు

మాచర్ల మండలం కంభంపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాలు చెత్తతో నిండిపోయాయి. దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు చెత్తను పాఠశాల వద్ద వేసి, నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ కమ్ముకొని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, మాచర్ల పట్టణం**

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

మాచర్ల పట్టణం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నామని, ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవోలు సురేష్, కోటేశ్వరరావు తెలిపారు. మార్చి 10వ తేదీ లోపు గ్రామ, వార్డు సచివాలయాలు లేదా విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దుర్గి: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఒకటో తరగతిలో చేరే విద్యార్థులు దరఖాస్తులు అందజేయాలని ఎంఈవో బెంజిమెన్ తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న పిల్లలు అర్హులన్నారు.

రోటరీ సేవలు నిరుపమానం

చిలకలూరిపేట పట్టణం, యడ్లపాడు, న్యూస్‌టుడే: చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల రక్షణకు రేడియం జాకెట్లు పంపిణీ, పేద విద్యార్థినికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గ్రంథాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అనంతరం యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్, శ్రీ వెంకట్రాయ శ్రీధర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్ క్లాసుల గురించి వివరించారు. జాష్టి రంగారావు రోటరీ ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. పోట్రు పూర్ణచంద్రరావు, కందిమళ్ల అంజిబాబు ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

బీమా పథకంతో ప్రయోజనాలెన్నో!

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: సంగం డెయిరీలో పాలు పోసే వారిని ఆపదలో ఆదుకోవడానికి పాల ఉత్పత్తిదారులతో పాటు పశువులకు బీమా చేయిస్తున్నామని డెయిరీ మేనేజర్ మక్కెన జానకి రామారావు అన్నారు. ములకలూరులో పాల ఉత్పత్తిదారు కమలమ్మ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీనివాసరావుకు రూ.60 వేల బీమా చెక్కు అందించి మాట్లాడారు. బీమా పథకంలో చేరితే పొందే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సంగం అధ్యక్షుడు కంచర్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

లెవల్ క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణకాంతరెడ్డి, రైల్వే అధికారులు

అండర్ పాస్ నిర్మాణంపై సమాలోచనలు

రాజుపాలెం, న్యూస్‌టుడే: నల్లపాడు-పగిడిపల్లి రైల్వే మార్గం డబ్లింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో లెవల్ క్రాసింగ్‌ల వద్ద అండర్ పాస్‌లు నిర్మించేందుకు రైల్వే శాఖ ప్రతిపాదనలు చేపట్టింది. ఈక్రమంలో ఆశాఖ అధికారులు, ఆర్డీవో రమణకాంతరెడ్డి గురువారం రాజుపాలెం, చౌటపాపాయపాలెంలోని 52, 54వ లెవల్ క్రాసింగ్‌లను పరిశీలించారు. రాజుపాలెంలో అండర్ పాస్ లేదా ఫ్లైవంతెనలో ఏది అనుకూలంగా ఉంటుందోనని చర్చించారు. దీనిపై గ్రామస్థుల నుంచి అభిప్రాయం సేకరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆయన వెంట తహసీల్దారు సరోజ, ఇతర అధికారులు ఉన్నారు.

జడ్పీ సీఈవో జ్యోతిబసుకు ఉద్యోగోన్నతి

గుంటూరు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్‌శాఖలో డీపీవో, డీడీవోలకు సీఈవోలుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. దీంతో జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు ఉద్యోగోన్నతి పొందారు. ఆయన ఇప్పటి వరకు డీఎల్‌డీవో క్యాడర్‌లో ఉంటూ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి లభించడంతో రెగ్యులర్ సీఈవోగా కొనసాగనున్నారు. ప్రస్తుత పోస్టులోనే కొనసాగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పుల్లేకుండా పంట వివరాలు నమోదు చేయాలి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పులు లేకుండా ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు రవిబాబు సూచించారు. గురువారం ఆయన పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరులో ఈ-పంట నమోదు ప్రక్రియ పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పంటల వివరాలు నమోదు చేయాలని ఏవో కృష్ణయ్యకు సూచించారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, రమణ సూచించారు. ఆ సంఘం సత్తెనపల్లి తాలుకాశాఖ బాధ్యులు గురువారం విజయవాడలోని కార్యాలయంలో వారిని కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, సత్తెనపల్లి తాలుకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు మణిరావు, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రాధాన్యం

సత్తెనపల్లి, పెదకూరపాడు, న్యూస్‌టుడే

గర్భిణుల్లో ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికితోడు పోషకాహార లేమితో తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. మాతాశిశు సంరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులకు నెలనెలా పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నాయి. అవగాహనలేమితో చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవట్లేదు. ప్రభుత్వాసుపత్రుల్లోని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా సమాచారమిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు వివరాలు నమోదు చేసుకుని నెలనెలా పోషకాలు అందిస్తారు.

గర్భిణికి పోషకాహారం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఐసీడీఎస్ ప్రాజెక్టు	గర్భిణులు	బాలింతలు	మొత్తం
గురజాల	772	711	1483
క్రోసూరు	1028	1246	2274
మాచర్ల	1598	1526	3124
పిడుగురాళ్ల	837	977	1814
సత్తెనపల్లి	1276	1321	2597

ఎంసీపీ కార్డు కీలకం.. మహిళ గర్భం దాల్చినట్లు వైద్యాధికారులు నిర్ధారిస్తే వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ద్వారా మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీపీ) జారీ చేస్తారు. రీ ప్రొడక్ట్ అండ్ ఛైల్డ్ హెల్త్ (ఆర్సీహెచ్) ఐడీని బట్టి నెలనెలా పోషకాహారం తీసుకెళ్లేందుకు అంగన్‌వాడీలకు అవకాశం కల్పిస్తారు.

అందించే పోషకాలు ఇవే..

❖ **గర్భిణులకు:** నెలకు 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, 500 గ్రాముల నూనె. వీటితోపాటు అదనపు పోషకాల కోసం కిలో అటుకులు, రెండు కిలోల రాగి, జొన్నపిండి, పావు కిలో చిక్కీలు, బెల్లం, ఖర్జూరంతో కూడిన కిట్లు అందిస్తారు. ఇవే కాకుండా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు (నెలలో రెండుసార్లు) ఇస్తారు.

❖ **బిడ్డ పుట్టాక (బాలింతలకు):** బిడ్డకు మూడేళ్ల వరకు బాలామృతం, పాలు, కోడి గుడ్లు ఇస్తారు. ప్రతినెలా 6వ తేదీలోగా గర్భిణులు పేర్లు నమోదు చేసుకుంటే మరుసటి నెల నుంచి పోషకాలు తీసుకెళ్లవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి కోరారు.

రైతు బజారు నిరుపయోగం

వృథాగా దుకాణాలు

దశాబ్దకాలం కిందట ఏర్పడిన సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు బజారు క్రమేణా వినియోగదారుల ఆదరణకు దూరమవుతోంది. తొలినాళ్లలో పది దుకాణాల్లో కూరగాయలు, ఆకుకూరలు తదితర విక్రయాలతో సందడిగా ఉండేది. అప్పట్లో వినియోగదారుల డిమాండు మేరకు మరో పది దుకాణాలను నిర్మించారు. ఉచితంగా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారుల రాకపోకలు గణనీయంగా తగ్గడంతో నేడు అవన్నీ వృథాగా మారాయి. ప్రస్తుతం రెండు స్టాళ్లలో విక్రయాలు జరుగుతున్నాయి. వెలవెలబోతున్న రైతు బజారుకు పునరుజ్జీవమివ్వాలని యార్డు ఛైర్మన్ కోమటినేని శోభారాణి భావించారు. ఈ మేరకు చేపట్టాల్సిన అంశాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే స్థలాన్వేషణ చేశారు. ఆర్అండ్‌బి శాఖ, పాత రిజిస్ట్రార్ కార్యాలయ స్థలాలను పరిశీలించారు. ఆఖరుకు ప్రధాన రహదారి పక్కనే యార్డులోని ఓ ద్వారా వద్ద ఇరువైపులా దుకాణాలు నిర్మించాలని ప్రతిపాదించారు. రూ.8.5 లక్షల వ్యయం అంచనాలతో కమిషనరేట్ కార్యాలయానికి పంపారు. త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గదులు నిర్మిస్తే రైతు బజారు వినియోగదారులకు అందుబాటులో రానుంది.
– న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ

నరసరావుపేట

•నరసరావుపేట •వినుకొండ •చిలకలూరిపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సైకిల్ స్టాండ్ పక్కన ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. ప్రయాణికులు చాలా అసౌకర్యంగా ఉంటోంది. - రామారావు ✔ మరుగుదొడ్లు శుభ్రం చేయించి ప్రయాణికులు అసౌకర్యం లేకుండా చూస్తాం. - వేణుబాబు, ఆర్టీసీ డీఎం. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? నరసరావుపేట పట్టణంలో పెద్ద చెరువు ఇందిరాగాంధీ బొమ్మ వద్ద నిత్యం మూగజీవాలు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. వాహనాలకు అడ్డుపడుతున్నాయి. - మహేష్, వాహనచోదకుడు ✔ మూగ జీవాలను రోడ్లపైకి వదిలేస్తే వాటి యజమానులకు సూచిస్తాం. వినకుంటే తగిన చర్యలు తీసుకుంటాం. - జ్యోతి, మున్సిపల్ ఏఈ - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

పాఠశాలకు మైక్ అందజేత

చిలకలూరిపేట (గ్రామీణ: నాదెండ్ల మండలం కనపర్రు ప్రాథమిక పాఠశాలకు ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ ఎం.నాగరాజు దంపతులు గురువారం మైక్ సెట్ అందజేశారు. హెచ్ఎం జవహర్‌లాల్, ఉపాధ్యాయులు వారిని సత్కరించారు.

గాంధీపార్కు వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాల కేంద్రం ఏర్పాటు

నేడు నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఎలక్ట్రానిక్ వేస్ట్ సెంటర్ (ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాల కేంద్రం) ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ రవిశంకర్ తెలిపారు. ఇళ్లు, కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలల్లో పనికిరాని సెల్‌ఫోన్లు, చార్జర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మిషన్లు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు ఈ కేంద్రంలో తీసుకుంటామన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఎక్కడపడితే అక్కడ పారబోస్తే వాటిలో విష పూరిత రసాయనాల వల్ల ప్రజలకు హాని కలుగుతుందని, స్వచ్ఛ నరసరావుపేటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రేపు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

సాతులూరు(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: సాతులూరులోని ఈతరం ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవాన్ని ఈనెల 21న శనివారం నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు బండారుపల్లి సత్యనారాయణ, పాటిబండ్ల శివరామకృష్ణ ప్రసాద్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ అరవిందబాబు, ఒంగోలు శ్రీహర్షిణి విద్యాసంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, హైదరాబాద్ యోగా విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు అయినవోలు జగన్ పాల్గొంటారన్నారు.

22న గుత్తావారిపాలెం తిరునాళ్ల

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గుత్తావారిపాలెంలో శ్రీవీరేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈనెల 22న ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసే విద్యుత్తు ప్రభలను చుట్టుపక్కల గ్రామాల వారు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల జరిగే రోజున పూజలు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పొంగళ్ల నివేదన, దైవ దర్శనానికి వచ్చే భక్తులకు వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఐక్యతతోనే అభివృద్ధి

సాతులూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహించుకోవాలని నాదెండ్ల మండల తెదేపా అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ పిలుపు చేశారు. నాదెండ్ల మండలం సాతులూరులోని గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయ మరమ్మతులు, రంగులు వేసేందుకు బండారుపల్లి మస్తాన్‌రావు, బండారుపల్లి సత్యనారాయణ రూ.లక్ష, ఈదర సాంబశివరావు రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీకి గురువారం అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలన్నారు.

సైబర్ నేరం.. పూటకో రూపం

నమ్మితే మునిగినట్లే

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

సైబర్ నేరాలు పూటకో కొత్త రూపం దాలుస్తున్నాయి. దుండగులు ఎప్పుడు ఏ తరహాలో మోసాలకు పాల్పడుతున్నారో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని ఆకట్టుకునేలా లింకులు పంపుతున్నారు. తక్కువ ధరకు వస్తువులు లభిస్తాయని, ఉచితంగా ఇస్తామన్న లింకులను చూసి అమాయకులు క్లిక్ చేయగానే కొనుగోలుకు పురమాయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసిన తర్వాత సదరు వస్తువులు సమయానికి అందడంలేదు. అలానే మరికొన్ని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లబ్ధి కలుగుతుందన్న లింకులు, కొంతమంది చేత వివిధంగా ప్రయోజనం పొందామని నకిలీ వీడియోలు పెడుతున్నారు. వాటిని తెరిచి ఎంతోమంది మోసపోతున్నారు. అమాయకులే ఎరగా నగదు దోచేస్తున్నారు. అవగాహన లేకపోవడంతో రూ.లక్షల్లో నగదు పోగొట్టుకుని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే సందేశాలు, లింకులకు ఎవరూ స్పందించరాదు. వీటిని ఓపెన్ చేసిన వెంటనే తెలుసుకోవాలని ప్రయత్నం చేయడం మంచిది కాదని రెండో పట్టణ సీఐ ప్రభాకర్ సూచిస్తున్నారు. అపరిచిత నంబర్ల నుండి వచ్చే ఫోన్లు నమ్మొద్దు. ఆధార్, రాయితీల పేరిట మోసగించే అవకాశం ఉంది. డబ్బులు ఎవరికీ ఆశకి లోనై చేయొద్దు. ఏపీకే ఫైల్స్ అసలు ఓపెన్ చేయరాదు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే పోలీసులకు తెలపాలి. 1930 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించాలి.

ఇటీవల నరసరావుపేట డివిజన్ పరిధిలో జరిగిన సైబర్ మోసాలివి..

★ ఈపూరు మండలం అంగలూరు గ్రామానికి చెందిన గజపతి ఉదయకిరణ్‌కు ఈనెల 5న రాత్రి 8 గంటల సమయంలో అపరిచిత నంబరు నుండి ఫోను వచ్చింది. దాన్ని లిఫ్ట్ చేసి వెంటనే కట్ చేశారు. 15 నిమిషాల తర్వాత అతని ఖాతా నుండి రూ.47 వేలు గల్లంతయ్యాయి. ఏకంగా మూడు సార్లు రూ.3,89,623 నగదు అతని ఖాతా నుండి సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. బాధితుడు 1930కి ఫిర్యాదు చేశారు.

★ నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన ఓ మహిళకు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. అందులో రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లిస్తే అదనంగా రూ.2,800 వస్తాయని నమ్మబలికారు. మొదట ఆమెకు నగదు జమ చేసి, అనంతరం ఎనిమిది సార్లుగా రూ.1.50 లక్షలు జమ చేస్తే రెట్టింపు నగదు పంపుతామని నమ్మించగా, ఆశకు పోయి నగదు జమ చేసి మోసపోయినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

★ నరసరావుపేట బరంపేటకు చెందిన రాజుకు ఇటీవల ఓ అపరిచిత నంబరు నుండి ఫోన్ వచ్చింది. మీ ఆధార్ కార్డులో మార్పులు చేయాలి. మీకు నగదు జమ చేస్తామని చెప్పగా నమ్మి సైబర్ నేరగాళ్లు పంపిన లింకు ఓపెన్ చేయగా ఖాతాలో రూ.5 వేలు నగదు మాయం అయ్యాయి.

ఎత్తిపోతల పథకాల్ని అందుబాటులోకి తేవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట (గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రజలకు సాగు, తాగు నీరందించే పలు ఎత్తిపోతల పథకాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాల (లిఫ్టుల) నిర్వహణ సమస్యపై గురువారం మాట్లాడారు. సాగు, తాగునీటి లిఫ్టుల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామని గతంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పినా ఇప్పటి వరకు కార్యాచరణ దాల్చలేదన్నారు. ప్రస్తుతం అవసరమున్న ఎత్తిపోతల పథకాలైనా వెంటనే మరమ్మతులు చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో నక్కవాగు, కప్పగంజి, ఓగేరు వాగులపై 55 ఎత్తిపోతల పథకాలున్నాయి. గ్రామాలకు తాగునీరు కూడా వాటిద్వారా అందుతుంది. ఈ వాగులు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. జలవనరులశాఖ నుంచి బడ్జెట్ కేటాయించి పూడిక తీయించడంతోపాటు మరమ్మతులు చేయించి సాగు, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే ఏదైనా సమస్యల వల్ల నిధులు ఆగి పోతే లిఫ్టుల నిర్వహణ స్తంభించి రైతులకు నీటి కష్టాలు మొదలవుతాయన్నారు. ప్రజల కోసం అవసరాలు తీర్చే లిఫ్టుల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వాటి నిర్వహణను నిమా ఉంచితే బాగుంటుందని సూచించారు. వాగులన్నీ పూడిక, కంపచెట్లతో నిండిపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉందని ప్రభుత్వం ప్రతి ఏటా వాగులను బాగుచేయడంపై ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. వాగుల్లో నీటి ప్రవాహం సాఫీగా ఉన్నప్పుడు లిఫ్టుల నిరాటంకంగా పనిచేస్తాయని అప్పుడే ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న నియోజకవర్గంలోని 50 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.38.31 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం క్యాంప్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో యార్డు మాజీ ఛైర్మన్ తేళ్ల సుబ్బారావు, యార్డు వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, తెదేపా నాయకులు పఠాన్ సమదఖాన్, మద్దుమాల రవి, కొన్నిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ పూజలు

దేవతా మూర్తులకు నమస్కరిస్తున్న భక్తులు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని దక్షిణ బజారులో కొత్తగా నిర్మించిన శ్రీరామ సమేత సత్యనారాయణస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండో రోజు గురువారం విశిష్ట పూజలు చేశారు. పండితుడు కోదండరామాచార్యులు ఆలయ ట్రస్టీ జొన్నలగడ్డ పాండురంగారావు, వెంకటచంద్ర రమాదేవి దంపతులతో శిలలకు పూజలు చేయించారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ బాబ్జీ, గౌరవ అధ్యక్షుడు తాతా వెంకటసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ ప్రతిపాదిత ప్రాంత పరిశీలన

గుంటూరు రైల్వే డివిజన్ ఎస్ఈ బాషాతో మాట్లాడుతున్న సత్యనారాయణ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం సాతులూరు - కనపర్రు మార్గంలో 289వ నంబరు రైల్వే గేటు మూసి వేసి ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే అధికారులు అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు గుంటూరు రైల్వే డివిజన్ ఎస్ఈ బాషా గురువారం సాతులూరు వచ్చారు. ఆర్ అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్తు అధికారులతో కలిసి 289, 290 రైల్వే గేట్లను పరిశీలించారు. రెండు గేట్లను మూసి వేసి ఆర్‌వోబీ నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆర్‌వోబీ నిర్మించినా బుక్కాపురం గేటు వైపు అండర్‌పాస్ నిర్మాణం చేయాలని, బుక్కాపురం గేటు నుంచి రైల్వేట్రాక్‌కు దక్షిణం వైపు కనపర్రు గేటు వరకు బీటీ రహదారి ఏర్పాటు చేయాలని అలా అయితేనే రైతులకు ఇబ్బందులు ఉండవని నాదెండ్ల మండల తెదేపా అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కూడా బుక్కాపురం గేటు మూసివేసినప్పుడు పెద్ద ఎత్తున రైతులు నిరసన తెలిపి తిరిగి గేటు తెరిచేవరకు పోరాటం చేసిన విషయం గుర్తుచేశారు. అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రి రాకతో వైద్యశాలకు కొత్త రూపు

బయోమెడికల్ వేస్ట్ స్టోరేజ్ గదుల నిర్మాణం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఈనెల 21న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండ రానుండటంతో ప్రభుత్వ వైద్యశాలకు మంచి రోజులు వచ్చాయి. ఎప్పటి నుంచో పేరుకుపోయిన పనులకు మోక్షం లభించింది. ఆసుపత్రి అభివృద్ధికి రూ.57 లక్షల నిధులు కేటాయించగా ఆ నిధుల నుండి మరమ్మతులు చేపట్టారని సూపరింటెండెంట్ దయానిధి తెలిపారు. మూడ్రోజులుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎప్పుడూ అపరిశుభ్రంగా, చుట్టూ పల్లంగా ఉండే మార్చురీ గది, దానికి ఎదురుగా ఉండే ఖాళీ స్థలంలో మట్టి తోలి చదును చేస్తున్నారు. ఖాళీ స్థలంలో ముఖ్యమంత్రితో మొక్కలు నాటిస్తారని సమాచారం. పగుళ్లిచ్చిన ప్రహరీకి ప్లాస్టింగ్, పూల మొక్కల చుట్టూ లైనింగ్ ఏర్పాటు, స్నానపు గదులు, మరుగుదొడ్లతో పాటు అవసరమైన పనులు చేస్తున్నారు. ఈనెల 17న వైద్యశాల పరిశీలించిన కలెక్టర్ బయో మెడికల్ వేస్ట్ నిల్వ విధానాన్ని పరిశీలించి నాలుగు గదులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో ప్రత్యేక గదుల నిర్మాణం చేపట్టారు. ఒక్కో గదికి ఒక్కో రంగు (పసుపు, ఎరుపు, నీలం, తెలుపు) వేసి అవే రంగుల్లో డబ్బాలు ఏర్పాటు చేస్తామని వ్యర్థాలను డబ్బాల్లో వేయనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటికే వైద్యశాల ఉత్తరం వైపు గేటు వద్ద కాంక్రీటు వేసి రోడ్డు ఎత్తు పెంచే పనులు పూర్తి చేశారు.

ఇళ్లలోకి కాలువ నీళ్లు రాకుండా చూడండి

వినుకొండ: ఎన్నెస్పీ పంట కాలువ తెగి తమ ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని మండలంలో విఠంరాజుపల్లె శివారు రామిరెడ్డిపేట వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పీడీఎం నాయకులతో కలిసి తహసీల్దార్ సురేష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కాలువ తెగిన చోట మరమ్మతులు చేసి నీరు రాకుండా చూడాలని కోరారు. రామిరెడ్డిపేట వాసులు జగ్గమ్మ, శైలజ, రంగారావుతో పాటు పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

బాలికల మదర్సాకు శంకుస్థాపన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ముస్లిం సమాజాభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని అన్నారు. చిలకలూరిపేట పట్టణం సుభానీనగర్‌లో ముస్లిం బాలికల మదర్సా భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నాణ్యమైన విద్యాబోధనకు ఇది దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వజ్రోత్సవ స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు

నూతన శోభ సంతరించుకున్న సంస్కృత పాఠశాల

రూ.15 లక్షలు వెచ్చించిన పూర్వ విద్యార్థులు

శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ఉన్నత పాఠశాల

ఎన్జీవో కాలనీ (మల్లమ్మ సెంటర్, నరసరావుపేట), న్యూస్‌టుడే: వారంతా పూర్వ విద్యార్థులు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడిన పాఠశాల అభ్యున్నతికి నడుం బిగించారు. గతేడాది పాఠశాలలో నిర్వహించిన వజ్రోత్సవంలో తీసుకున్న సంకల్పాన్ని అమలు చేసి చూపారు. నరసరావుపేట పట్టణం బరంపేట ఏనుగుల బజార్‌లో 1961లో దాత వేదాంతం రామకృష్ణచార్యులు ఈ పాఠశాల ప్రారంభించారు. మొదట్లో పాకలో పాఠశాలను నడిపేవారు. 2002లో అప్పటి శాసనసభ్యుడు కోడెల శివప్రసాదరావు సహకారంతో ఎంపీ నిధులు రూ.25 లక్షలతో పాఠశాల నిర్మించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడం, పల్లపు ప్రాంతం కావడంతో ప్రాంగణమంతా బురద, నీటితో నిండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. 2022లో ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు ఇచ్చారు. ఈ నేపథ్యంలో గతేడాది జులైలో నిర్వహించిన వజ్రోత్సవంలో 1961-25 మధ్య పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు హాజరై పాఠశాల దుస్థితి చూసి చలించారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సంకల్పించారు. 1990-91 పదో తరగతి విద్యార్థులు రూ.5 లక్షలు సేకరించి పాఠశాలకు రంగులు, మరమ్మతులు చేయించారు. మరో పూర్వ విద్యార్థి అర్వపల్లి మనోహర్ (1994-95) చొరవతో వి.టెక్ సిస్టమ్స్, హైదరాబాద్ సహాయ సహకారాలతో రూ.10 లక్షలు వెచ్చించి పాఠశాల చుట్టూ ప్రహరీ, మైదానం ఎత్తు పెంపు, సభావేదిక నిర్మాణం, ప్రధాన గేటుతో పాటు మరో గేటు ఏర్పాటు చేశారు. నూతన శోభ సంతరించుకున్న పాఠశాలను స్థానిక శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా ఈ నెల 20న ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి బి.సత్యనారాయణసింగ్ తెలిపారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్వ విద్యార్థులు వేదాంతం అంజనీకుమార్, జూలకంటి సీతారామాంజనేయులు పర్యవేక్షణలో జరిగాయన్నారు. ఈ పాఠశాల జిల్లాలోనే ఏకైక సంస్కృత పాఠశాల కావడం విశేషం.

రైతన్నా మేలుకో.. చేయూత అందుకో!

నేటితో ముగియనున్న ఈ-పంట నమోదు గడువు

రొంపిచర్ల ఈ-పంటలో రైతు వివరాలు నమోదు చేస్తున్న డీఏవో తదితరులు

రొంపిచర్ల, నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ఒడిదొడుకులు తట్టుకుని పంటలు సాగు చేస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలిచేందుకు ఈ-పంట విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం అమలు చేసే పథకాలు పారదర్శకంగా అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రస్తుత రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ -పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సూచిస్తున్నారు.

ఈ-కర్షక్‌లోనూ.. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీలో 2,57,737 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రతి రైతు ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. దీనికి ఈ నెల 20వ తేదీ గడువు ముగుస్తోంది. దీంతో పాటు ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ-కర్షక్ పోర్టల్‌లో నమోదవుతుంది. ఈ సంవత్సరం పంటలు సాగు చేయని భూముల వివరాలూ ల్యాండ్ పార్శిల్ పేరిట పొందుపర్చాలి. రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి జగ్గారావు కోరారు.

స్వయంగా చేయండిలా.. రైతులే ఈ-పంటను స్వయంగా నమోదు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ సంఖ్య, పేరు, ఇతర వివరాలు నమోదు చేశాక వ్యవసాయ క్షేత్రం వద్ద నిల్చొని ఫొటో తీసుకుని సబ్మిట్ చేయాలి. ఈ- పంట నమోదులో లోపాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కర్షక్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆధార్ సంఖ్య ద్వారా పరిశీలించుకుని సరిచేసుకోవచ్చు.

ప్రయోజనాలివి.. రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకుంటే ఉచిత పంటల బీమా, పెట్టుబడి రాయితీ, మద్దతు ధర, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి ప్రయోజనాలు పొందవచ్చు. వ్యవసాయశాఖ నుంచి వచ్చే అన్ని పథకాలు, రాయితీలు పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తాయని అధికారులు చెబుతున్నారు. రైతులు కూడా సహకరించి సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

మూడు వాహనాలు ఢీ.. నలుగురికి గాయాలు

బోల్తా పడిన కారు

యడ్లపాడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని రెండు వాహనాలు అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు. . కొండ్రుపాడుకు చెందిన బాలరాజు (24) ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళుతూ మార్గంమధ్యలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు యడ్లపాడు ఉప్పువాగు వద్ద రోడ్డు పక్కన వాహనం నిలిపాడు. ఇంతలో వెనుక నుంచి వస్తున్న కారును దాని వెనుక వస్తున్న ఆటో ఢీకొంది. అదే క్రమంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు కింద భాగంలోకి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో బాలరాజు తలకు గాయం కాగా యడ్లపాడుకు చెందిన ఆటోడ్రైవర్ ఆరుమళ్ల రాంబాబు కాలు విరిగింది. కారులో ప్రయాణిస్తున్న తెనాలికి చెందిన గనిపిశెట్టి నాగేశ్వరరావుతో పాటు అతడి పదేళ్ల కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

పరీక్ష సామగ్రి అందజేత

శావల్యాపురం, న్యూస్‌టుడే : విద్యార్థులు జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి పదో తరగతి తొలిమెట్టని శావల్యాపురం సొసైటీ అధ్యక్షుడు గడుపూడి విశ్వనాథం తెలిపారు. స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రి అందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలు సాధించి నియోజకవర్గంలో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకు రావాలని కోరారు. ఎంఈవో మద్దిగుంట సాంబశివరావు, పీఎంసీ ఛైర్మన్ శ్రావణ్, ప్రధానోపాధ్యాయిని బొడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయుడు బి.వి.నాగేశ్వరరావు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుడోలో గిరిజన యువకుడి ప్రతిభ

ధ్రువపత్రం అందుకుంటున్న గోవిందునాయక్

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే: బొల్లాపల్లి మండలం గండిగనుమల పైతండాకు చెందిన వి.గోవిందునాయక్ శాప్ నిర్వహించిన కుడో పోటీల్లో సత్తాచాటాడు. సీనియర్ విభాగంలో (24 సంవత్సరాలు) జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 31, ఈనెల 1న విశాఖలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం దక్కించుకున్నాడు. ఈనె 18న గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో కుడో జిల్లా కార్యదర్శి సిద్ధార్థ చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకున్నాడు. వచ్చే మేలో పుణెలో నిర్వహించే జాతీయ పోటీలలో మన రాష్ట్రం తరపున ఆడనున్నట్లు అతను తెలిపాడు.

ఛత్రపతి పాలన నేటితరానికి ఆదర్శం

నరసరావుపేట సెంట్రల్, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: కులమతాలకు అతీతంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన ఛత్రపతి శివాజీ పాలన నేటి తరానికి ఆదర్శనీయమని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ తెలిపారు. శివాజీ జయంతి సందర్భంగా చిలకలూరిపేట సుగాలీకాలనీలో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. నరసరావుపేట కాకుమాను బజారులో శివాజీ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ కథం నాగజ్యోతి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గుండేపల్లి మైనర్ దిగువ భూములకు నీటిఎద్దడి

న్యూస్‌టుడే, ఈపూరు

గుండేపల్లి మైనరు కాలువకు అడ్డుకట్ట వేసి నీళ్లు మళ్లించుకుంటున్న ఎగువ భూముల రైతులు

మండలంలో అంగలూరు మేజరు కాలువ పరిధిలో దిగువ భూముల రైతులు సాగునీటి కొరతతో అల్లాడుతున్నారు. మేజరు కాలువలకు తరచూ నీటిసరఫరా నిలిపేస్తుండటం, కొన్నిచోట్ల కాలువ కట్టలు బలహీనంగా ఉండి ఎక్కువ నీళ్లు వదిలిన సమయంలో పొంగి పొర్లి దిగువ భూములకు సక్రమంగా నీరందడం లేదు. అంగలూరు మేజరు పరిధిలో గుండేపల్లి మైనరు కాలువ నుంచి వనికుంట భూములకు నీళ్లు ఎక్కకపోవడంతో కాలువ డ్రాపుల వద్ద అడ్డుకట్టలు వేసుకుని రైతులు తమ పొలాలకు నీళ్లు మళ్లించుకుంటున్నారు. దిగువకు వెళ్లాల్సిన నీటికి వనికుంట రైతులు అడ్డుకట్టలు వేస్తుండటంతో పెదకొండాయపాలెం, చినకొండాయపాలెం, గుండేపల్లి గ్రామాల భూములకు సాగునీరు వెళ్లడం లేదు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటలకు నీటి ఎద్దడి ఏర్పడుతోంది. మూడు గ్రామాల రైతులు సుమారు 600ఎకరాల్లో మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న కండె దశలో, పొగాకు కోత దశలో ఉంది. ఈ దశలో పైరుకు ఎక్కువ నీళ్లు అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎగువన కాలువకు అడ్డుకట్టలు వేయడంతో దిగువకు నీళ్లు రావడం లేదు. దీంతో ఈ గ్రామాల రైతులు నీళ్ల కోసం రాత్రిళ్లు కాలువ కట్టలపై పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యపై ఎన్నెస్పీ ఏఈఈ విజయకుమార్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ప్రతినిధులతో మాట్లాడి ఎగువ రైతులను ఒప్పించి కాలువకు వేసిన అడ్డుకట్టలను తొలగించామని, ఉదయం ఒకరు, సాయంత్రం ఇంకొకరు చొప్పున ఎగువ, దిగువ ప్రాంతాల రైతులు పొలాలకు నీళ్లు పెట్టుకునేలా రైతుల మధ్య అంగీకారం కుదిరిందన్నారు. కాలువ పరిధిలో సాగునీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు.

రోటరీ సేవలు నిరుపమానం

చిలకలూరిపేట పట్టణం, యడ్లపాడు: చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల రక్షణకు రేడియం జాకెట్ల పంపిణీ, పేద విద్యార్థినికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గ్రంథాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అనంతరం యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్, శ్రీ వెంకట్రాయ శ్రీధర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్ క్లాసుల గురించి వివరించారు. జాస్తి రంగారావు రోటరీ ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. పోట్రు పూర్ణచంద్రరావు, కందిమళ్ల అంజిబాబు ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు, టి. వెంకటనారాయణ, గల్లా సాంబశివరావు, పఠాన్ ముక్తార్, రత్న ప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం చేస్తున్న క్లబ్ సభ్యులు

పారిశుద్ధ్య కార్మికులకు సమవస్త్రాల పంపిణీ

వినుకొండ, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు 180 మందికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సమ వస్త్రాలు పంపిణీ చేసింది. సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కార్యాలయ ప్రాంగణంలో కమిషనర్ శివరామప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మేలు చేసేందుకు ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలు చేపట్టనున్నారని ఫౌండేషన్ మేనేజర్ ఫణి తెలిపారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు రోశయ్య, మాజీ అధ్యక్షుడు పీవీ సురేష్, పొలిటికల్ మేనేజర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకంతో ప్రయోజనాలెన్నో!

వినుకొండ రూరల్: సంగం డెయిరీలో పాలు పోసే వారిని ఆపదలో ఆదుకోవడానికి పాల ఉత్పత్తిదారులతో పాటు పశువులకు బీమా చేయిస్తున్నామని డెయిరీ మేనేజర్ మక్కెన జానకి రామారావు అన్నారు. ములకలూరులో పాల ఉత్పత్తిదారు కమలమ్మ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీనివాసరావుకు రూ.60 వేల బీమా చెక్కు అందించి మాట్లాడారు. బీమా పథకంలో చేరితే పొందే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సంగం అధ్యక్షుడు కంచర్ల వెంకటస్వామి పాల్గొన్నారు.

(c) eenadu

ప్రతి ఇంట్లో ఓ వ్యాపారవేత్త

శాఖల సమష్టి బాధ్యతతో సాకారం: కలెక్టర్

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాల్సిన బాధ్యతను అన్ని శాఖలు సమష్టిగా పూర్తిచేయాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. గురువారం తన కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రగతి లక్ష్యాలకు సంబంధించి సమీక్షించారు. బ్యాంకుల నుంచి పరపతి పొందినవారి వివరాలపై ఆరా తీశారు. సిబిల్ స్కోర్ తదితర అంశాలు కొంతమేర అడ్డంకిగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. దీనిపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి తగు సూచనలు ఇవ్వాలని లీడ్‌బ్యాంకు ప్రబంధకుడిని ఆదేశించారు. ఆసక్తి ఉన్న యువత వ్యాపారం చేసుకునేందుకు సహకరించాలన్నారు. దరఖాస్తు చేసే విధానం, ఇతర అంశాలను డీఆర్‌డీఏ, పరిశ్రమల శాఖ సంయుక్తంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం, ఉద్యానశాఖాధికారి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, పరిశ్రమలశాఖ అధికారి సీతారాం

ఉపాధ్యాయులకు శిక్షణ

సామాన్యశాస్త్ర ఉపాధ్యాయులు, వృత్తి విద్య బోధకులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల హావభావాలు చక్కగా ఉండాలని, దీనికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు నిలవాలంటే బాలల మనసులను మెప్పించేలా ఆహార్యం ఉండాలని చెప్పారు.

ఆసుపత్రులపై..: ఆసుపత్రుల్లో శత శాతం సుఖప్రసవాలు జరగాలని కలెక్టరు ఆదేశించారు. వైద్యాధికారులతో దూరదృశ్యశ్రవణ సమావేశం నిర్వహించారు. ప్రతి వైద్యుడూ సుఖప్రసవం చేసేలా స్త్రీ వైద్య నిపుణులతో తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగ సంఘాలతో..: ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలెక్టరు పీజీఆర్‌ఎస్ భవనంలో సమావేశమయ్యారు. ఏపీ ఎన్జీజీవో సంఘం అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్, రెవెన్యూ సేవల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీరామ్మూర్తి, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, ఖజానా ఉద్యోగుల సంఘం, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు హాజరయ్యారు. ఉద్యోగులు జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు స్వాగతం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గురువారం జిల్లాకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కంటోన్మెంట్‌లోని తన బంగ్లాకు చేరుకున్నారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పలువురు నాయకులు, అభిమానులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మరో 31 పాఠశాలల్లో క్లిక్కర్

మండలానికి రెండు చొప్పున

పార్వతీపురం, న్యూస్‌టుడే: విద్యాశాఖ పాఠశాలల్లో క్లిక్కర్ వినియోగాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా జిల్లా భామిని ఆదర్శ పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ క్లిక్కరు అమలును ప్రారంభించిన విషయం విదితమే. ఇప్పటికే జిల్లాలో మూడు పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం కేవలం తొమ్మిదో తరగతి విద్యార్థులకు మాత్రమే పాఠ్యాంశాల బోధనకు సంబంధించిన పాఠాలు సీడీల రూపంలో అందుబాటులో ఉన్నాయి. పార్వతీపురంలో కేపీఎం పాఠశాల, కొమరాడలో కోటిపాం, భామిని ఆదర్శ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది మరింత విస్తృతం కానుంది.

జిల్లాలో ఈ విధానంలో బోధించడానికి, విద్యార్థుల పఠన, అభ్యసన స్థాయిని మూల్యాంకనం చేయడానికి మరికొన్ని బడుల్లో అమలు చేయాలని భావిస్తున్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. ఈ మేరకు 31 పాఠశాలలను ప్రతిపాదించారు. ఒక్కో మండలానికి రెండు పాఠశాలలు వెరసి 15 మండలాలకు 30, జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో అదనంగా మరో పాఠశాలలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరానికి ఈ పాఠశాలలను సిద్ధం చేసేలా ఉత్తర్వులు వస్తాయని భావిస్తున్నట్లు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం సహాయకుడు శంకరరావు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

క్లిక్కర్ ఉపయోగించి సమాధానాలు ఎంపిక చేస్తున్న విద్యార్థులు

చెరువుల కబ్జాదారులకు నోటీసులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు పట్టణంలోని చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకునే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. 'ఆక్రమణల జోరు.. పట్టించుకోరు' శీర్షికన ఈనెల 3న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ప్రభాకరరెడ్డి స్పందించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ, పురపాలక, జలవనరుల శాఖ యంత్రాంగం రంగంలోకి దిగింది. పట్టణంలో నెల్లిచెరువు, బీళ్ల బంద, దేవునిబందతోపాటుగా బాలగుడబ పంచాయతీ పరిధిలోని లంకెల చెరువులో పాగా వేసిన వారిని గుర్తించి నోటీసులు ఇస్తున్నారు.

వీఆర్వోలకు ఇదే పని

గ్రామీణ ప్రాంతంలో ఉన్న చెరువులకు సంబంధించి ఆక్రమణలపై చర్యలు తీసుకునే బాధ్యతను రెవెన్యూశాఖ తీసుకుంది. పట్టణంలో పురపాలక శాఖ వివరాలు సేకరిస్తోంది. తొలి నోటీసు తర్వాత పదిహేను రోజుల్లో మరోసారి ఇస్తామని, అప్పటికీ ఆక్రమణలు తొలగించకుంటే యంత్రాంగమే వాటిని కూల్చేందుకు చర్యలు తీసుకుంటుందని తహసీల్దారు సురేష్ చెప్పారు. గురువారం ఉదయం గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఏలు చెరువుల ఆక్రమణదారులను గుర్తించి, వారికి నోటీసులు తయారుచేసే పనిలో పడ్డారు. ఇప్పటికే ఏ చెరువులో ఎవరెవరు ఎంత విస్తీర్ణంలో ఆక్రమించారనే విషయాన్ని గుర్తించి నివేదికలను తహసీల్దారుకు సమర్పించారు.

మరణాల కథ కంచెకు చేరదా?

రబ్బరుడ్యామ్ వద్ద కానరాని రక్షణ

● 2025 నవంబరులో జంఝావతి జలాశయం వద్ద ఈతకు దిగిన ముగ్గురు యువకులు ఒకరి వెంట ఒకరుగా రబ్బరు డ్యామ్ దగ్గర ప్రవాహంలో కొట్టుకుపోయారు. కుటుంబాలకు అంతులేని విషాదాన్ని మిగిల్చారు.

● 2024లో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు.

ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతే.. అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి.. ఇకపై అలా జరగకుండా చూస్తామని చెప్పడమే కానీ ఆచరణలో మాత్రం చర్యలు కనిపించడం లేదు. ఏళ్లుగా ఇదే పరిస్థితితో పలు కుటుంబాల్లో విషాదం నిండింది. కొమరాడ మండలం జంఝావతి జలాశయం ఎంతో ప్రత్యేకం. ఆసియాలోనే ఇది మొట్టమొదటి రబ్బరు డ్యామ్. ఇక్కడ నీటి ప్రవాహం చూపరులను ఆకట్టుకుంటుంది. అందుకే ఏటా వేలల్లో పర్యాటకులు సందర్శిస్తుంటారు. ఆ సమయంలో ప్రమాదాలు జరిగి, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, కొమరాడ

ప్రమాదాలు జరుగుతున్న జంఝావతి రబ్బరుడ్యామ్ ప్రాంతం

రూ.7 లక్షలు లేవా?: ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలోకి సందర్శకుల ప్రవేశాన్ని నిషేధించేందుకు ఉండేందుకు ఇనుప కంచె నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో చెప్పుకొచ్చారు. ఆపై జంఝావతి ఇంజినీరింగు అధికారులు రూ.7 లక్షలతో జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదించారు. కానీ నగదు లేవని చేతులెత్తేస్తున్నారు. ప్రాణాలు రక్షించడానికి ఇక్కడ రక్షణ కంచె మినహా వేరే ప్రత్యామ్నాయం లేదు.

ఇందులోనూ నిర్లక్ష్యమే

జంఝావతి రబ్బరుడ్యామ్ కాలువ నుంచి నీటిని ఎత్తిపోసి వన్‌ఆర్ డిస్ట్రిబ్యూటరీకి అనుసంధానించి.. 12 వేల ఎకరాలకు ఇవ్వాలని పంపులను ఏర్పాటు చేశారు. దీనికి విద్యుత్తు అందించేందుకు ప్రత్యేకంగా ఉపకేంద్రం స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నియంత్రికలు తరచూ మరమ్మతులకు గురికావడంతో బాగుకు గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. బిల్లులు చెల్లించక ప్రస్తుతం పథకం నిరుపయోగంగా ఉంది. ఇప్పుడు వెయ్యి ఎకరాలకు కూడా సాగు నీరివ్వడం కష్టంగా మారుతోంది.

కలెక్టర్‌కు నివేదించాం..

జలవనరులశాఖ దగ్గర రక్షణ కంచె ఏర్పాటుకు నిధుల్లేవు. రూ.6-7 లక్షలు అవసరమని అంచనాలు రూపొందించి కలెక్టరుకు సమర్పించాం. నిధులు మంజూరుచేస్తే కంచె ఏర్పాటు చేస్తాం. ఎత్తిపోతల పథకాన్ని ఏపీఎస్ఎంఐడీసీకి అప్పగించేలా ప్రతిపాదించాం.

– ఢిల్లీశ్వరరావు, ఈఈ, జంఝావతి డివిజన్

అనుబంధ కమిటీల నియామకంపై కసరత్తు

● సమావేశమైన అరకు పార్లమెంటరీ తెదేపా నేతలు

అరకు పార్లమెంటరీ పరిధిలో తెదేపా అనుబంధ కమిటీల నియామకానికి పార్టీ ఉన్నతస్థాయి కమిటీ గురువారం అమరావతిలో సమావేశమైంది. మంత్రి జి.సంధ్యారాణి, ఉత్తరాంధ్ర సమన్వయకర్త డి.సత్య, జిల్లా అధ్యక్షురాలు తేజోవతి, ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, శాసన సభ్యులు జగదీశ్వరి(కురుపాం), విజయచంద్ర(పార్వతీపురం), పార్టీ ఇన్‌ఛార్జులు జి.ఈశ్వరి(పాడేరు), దొన్నుదొర(అరకు) పాల్గొన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యమివ్వాలని సమన్వయకర్త సత్య సూచించారు. పార్టీలో ఎవరూ ప్రత్యేక వర్గాలను తయారుచేసేలా వ్యవహరించవద్దన్నారు. పార్టీ మరింత బలోపేతానికి అంతా కట్టుబడి పనిచేయాలన్నారు. అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని.. ఈనెల 27 మరోసారి జరిగే సమావేశంలో కమిటీలను ప్రకటించనున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

యోధుడా.. ఇదే మా నివాళి

సాలూరు: శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా పట్టణంలోని శివాజీ కూడలిలో ఉన్న విగ్రహానికి సీఐ అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. మరాఠా సామ్రాజ్య యోధుడు, హిందూ సామ్రాజ్య నిర్మాత అని కొనియాడారు. ఆయన భారతజాతికి ఆదర్శమని జనసేన నేత శివకృష్ణ, భాజపా నేత మురళి అన్నారు. కార్యక్రమంలో హైందవ ధర్మసేన సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న హైందవ ధర్మసేన సభ్యులు

యువతకు కంప్యూటర్ శిక్షణ

సాలూరు: పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ కేంద్రంలో కంప్యూటర్ ఉద్యోగాలకు సోమవారం శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సెంటర్ సమన్వయకర్త ఎం.త్రినాథ్ తెలిపారు. ఒక్కో కోర్సుకు 30 మంది, మూడు నెలల పాటు శిక్షణ పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18 ఏళ్లు నిండినవారు అర్హులన్నారు.

WALK-IN-INTERVIEW

పేరం గ్రూప్ Peram Group

PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

❖ADVOCATES	6 No's (2-3 yrs. exp)
❖OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
❖ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
❖ADMINS	8 No's (1-5 yrs. exp)
❖DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
❖STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
❖MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
❖DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
❖MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
❖VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
❖FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
❖EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
❖VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
❖DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
❖PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
❖PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
❖JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
❖SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
❖SURVEYORS	2 No's (2-3 yrs. exp)
❖LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
❖LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
❖CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
❖BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
❖MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
❖ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
❖CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)

D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969



నీటి తీరువా.. రూ.16.51 కోట్లు

పేరుకుపోతున్న బకాయిలు

న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

సాగునీటి వనరులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఏటా రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేస్తోంది. ఈ నిధులతోనే పంటలకు సాగునీరందించే పనులు చేపడుతోంది. సకాలంలో రైతులు తీరువా చెల్లించలేకపోవడంతో ఏటా బకాయిలు పేరుకుపోయి గుదిబండగా మారుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు రూ.16.51 కోట్ల నీటి తీరువా వసూలు కావాల్సి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి రూ.2.06 కోట్లు, పాతబకాయిలు రూ.13.63 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీనికితోడు సకాలంలో చెల్లించని వాటినుంచి ఆరు శాతం వడ్డీ రూపంలో మరో రూ.81 లక్షలు ఖజానాకు చేరాల్సి ఉంది.

నీటి సంఘాల ద్వారా పనులు

నీటి తీరువాను తిరిగి రైతులకు అవసరమైన పనులకోసమే ప్రభుత్వం వినియోగిస్తోంది. వీటిలో 90 శాతం నిధులు నీటి సంఘాలకు ఖర్చు చేస్తోంది. మరో పది శాతం గ్రామ పంచాయతీల అభివృద్ధికి వెచ్చిస్తోంది. వైకాపా హయాంలో నీటి సంఘాలను ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని ఏర్పాటు చేసింది. తీరువా వసూలుకాక వీటికి నిధుల కొరత వెంటాడుతోంది. ఏటా కాలువలు పూడికలతో నిండిపోవడంతో ఖరీఫ్ కాలంలో సాగునీటి సమస్య తలెత్తుతుంది. పూర్తిస్థాయిలో నీటి తీరువా వసూలైతే కర్షకులకు సాగునీటి సమస్యలు ఉండవు.

రైతులు సహకరించాలి: నీటి తీరువా చెల్లింపులకు సంబంధించి రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలి. వీఆర్వోలకు వారం రోజుల లక్ష్యాలు నిర్దేశించాం. ప్రతి వారం చెల్లింపులపై పర్యవేక్షిస్తున్నాం. – సీహెచ్ రాధాకృష్ణమూర్తి, తహసీల్దారు

రూ.కోటితో నియంత్రిక ఏర్పాటు

కొమరాడ, న్యూస్‌టుడే: రైతులు, గృహ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ మల్లికార్జునరావు అన్నారు. కొట్టు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్(నియంత్రిక)ను గురువారం ఆయన ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.కోటి వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. డీఈ గోపాలరావు నాయుడు, ఏడీఈ రంగారావు, ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా: ధర్మాన టీవీఎస్, విజయనగరం: 9014143226 | పవన్ శేఖర్ టీవీఎస్, విజయనగరం: 7780241677 | శ్రీనివాస ఆటోమొబైల్స్, పార్వతీపురం : 9848433017 | అమృతవర్షిణి ఆటోమొబైల్స్, ఎస్ కోట: 9246671219 | గాయత్రి మోటర్స్, బొబ్బిలి: 9440193098 | పద్మశ్రీ ఆటోమొబైల్స్, సాలూరు: 9010614619 | వినాయక ఆటోమొబైల్స్, గజపతినగరం: 9949278793 | వెంకట సాయి ఏజెన్సీస్, పూసపాటి రేగ: 9392542348 | ధర్మాన టీవీఎస్, రాజాం 9010074740 | లీలా సాయి మోటార్స్, చీపురుపల్లి: 8639015726 | ధర్మశాస్తా ఆటోమొబైల్స్, రామభద్రపురం: 7702774907.

(c) eenadu

సన్యాసేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.17.31లక్షలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం శివారు సన్యాసేశ్వరస్వామి ఆలయానికి మహాశివరాత్రి జాతర సందర్భంగా రూ.17,31,428 ఆదాయం లభించిందని ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. గురువారం లెక్కించగా హుండీ ద్వారా రూ.7,56,515, ప్రత్యేక దర్శనాలు ద్వారా రూ.1,86,600 వచ్చిందన్నారు. 2024-25లో రూ.15,55,422 రాగా, ఈ ఏడాది ఆదాయం పెరిగిందన్నారు.

ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

జాతీయ జెండాతో విద్యార్థినులు

వార్షికోత్సవ సందడి

ఐక్కు.నాయుడుపేట అంబేడ్కర్ గురుకులం వార్షికోత్సవాలు గురువారం సందడిగా సాగాయి. విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల కళల సమ్మేళనం, ఏరోబిక్స్, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఎంఈవో ఎన్.నాగభూషణరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, వేపాడ

వెయిట్‌లిఫ్టింగ్‌లో మనోళ్ల సత్తా

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో వల్లూరి సుస్మిత సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకుంది. స్నాచ్ 86 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 106 కిలోలు బరువులెత్తి విజేతగా నిలిచింది. బీ గరికిపేట గ్రామానికి చెందిన బెల్లాన నాని ఈనెల 3వ తేదీ వరకు భోపాల్‌లో జరిగిన సౌత్ వెస్ట్ ఇంటర్ విశ్వవిద్యాలయ పోటీల్లో స్వర్ణం, పంజాబ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాలతో మెరిసింది. వీరిని డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు గురువారం అభినందించారు.

విజేతలతో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, శిక్షకుడు రవి

పారా అథ్లెట్ రాముకు అభినందన

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: దుబాయ్ వేదికగా ఇటీవల జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించిన విజయనగరానికి చెందిన పైడి రాము గురువారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ భరణి, ఛైర్మన్ రవినాయుడు, పారా అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామును వారు అభినందించారు. త్వరలో జరిగే ఏషియన్ గేమ్స్‌లోనూ సత్తా చాటాలని, అవసరమైన సహకారం అందిస్తామన్నారు. పారా అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న శాప్ ఎండీ భరణి

ఆరోగ్య కేంద్రాలుగా అంగన్‌వాడీలు

– న్యూస్‌టుడే, అయ్యన్నపేట, గరివిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. పోషకాహారం అందించడంతో పాటు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను పక్కాగా అందిస్తోంది. ఇప్పటికే తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లకు నిధులు కేటాయించగా.. తాజాగా పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. వారికి సకాలంలో ప్రథమ చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా మందుల కిట్లను సరఫరా చేస్తోంది. జిల్లాలో ఉన్న 11 ప్రాజెక్టుల్లో ఏడింటి పరిధిలో పంపిణీ చేశారు. మిగిలిన వాటికి త్వరలోనే అందజేస్తామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

అందించే మందుల వివరాలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో అయిదేళ్లలోపు చిన్నారులు 58,493 మంది ఉన్నారు. 7,093 మంది గర్భిణులు, 6,457 మంది బాలింతలకు సేవలు అందుతున్నాయి. వీరిలో చాలామంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కిట్లను ఇస్తోంది. ఇప్పటికే 7 ప్రాజెక్టుల పరిధిలో 1676 కిట్లు అందించారు. బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, చీపురుపల్లి ప్రాజెక్టులకు అందించాల్సి ఉంది. మరోవైపు ప్రసవ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కార్యకర్తలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

సరఫరా ఇలా..

11 రకాల మందులతో కూడిన కిట్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. పిల్లలకు జ్వరం వస్తే పారాసిటమాల్ సిరప్ అందిస్తారు. గాయాలైతే కాటన్ బ్యాండేజీ, అయోడిన్ ఇస్తారు. కళ్లు ఎర్రబడటం, చెవి పోటు, దురద, మంట, దగ్గు, జలుబు, తెగడం.. తదితర వాటికి సైతం మందులున్నాయి. అత్యవసరమైతే సమీపంలోని పీహెచ్‌సీలకు పంపించే వెసులుబాటు కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కార్పొరేట్ తరహాలో ప్రీస్కూల్ విద్య అందుతోంది. దీనిలో భాగంగా ప్రభుత్వం మందుల కిట్లను ఇస్తోంది. ఇవి పూర్తిగా సురక్షితం. కార్యకర్తలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. తక్కువ డోసుతో ఉంటాయి.

– సుజాత, ఇన్‌ఛార్జి పీడీ

పంపిణీ ఇలా..

ప్రాజెక్టు	గంట్యాడ	రాజాం	గరివిడి	భోగాపురం	విజయనగరం	వియ్యంపేట	ఎస్.కోట
కిట్లు	166	339	177	272	317	226	179

తప్పెవరిది.. ముప్పెవరికి?

ఈనాడు, విజయనగరం

ఏదైనా పరీక్ష రాస్తే 100కి కనీసం 35 మార్కులు సంపాదించుకుంటే పాస్ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న వారు నూటికి నూరు మార్కులు సాధించి తీరాలి. లేకుంటే ఉత్తీర్ణత సాధించలేదని లైసెన్స్ జారీ చేయరు. ఈ తిప్పలన్నీ ఎందుకని చాలా మంది డ్రైవింగ్ స్కూల్ యజమానులను, ప్రైవేటు ఏజెంట్లను సంప్రదిస్తున్నారు. వాహనం నడపడం రాకుండానే లైసెన్స్ మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. రెండు జిల్లాల్లో ఈ తంతు సాగుతోంది.

విజయనగరంలో ఖాళీ స్థలం లేని ఓ శిక్షణ పాఠశాల

డ్రైవింగ్ స్కూళ్లలో కానరాని నిబంధనలు

విజయనగరంలో 15 సంస్థల మూత

కనీస వసతులేవీ?

విజయనగరంలో 25, మన్యం జిల్లాలో ప్రైవేటు వ్యక్తులు అయిదు డ్రైవింగ్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. వీటిల్లో 90 శాతానికి పైగా కనీస వసతులు లేవు. ఫీజులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. తరగతి గదిలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై చోదకులకు బోధన, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వాహనం నడపడంలో శిక్షణ తప్పనిసరి. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తూ లైసెన్సులు జారీ చేయిస్తున్నారు. దీంతో చివరకు అనుభవం లేని డ్రైవర్లు తయారవుతున్నారు. ఒక్కోసారి కొందరు మృత్యువాత పడుతున్నారు.

నాణ్యమైన శిక్షణ అవసరం

డ్రైవింగ్ స్కూళ్లలో చేరిన వారికి నాణ్యమైన శిక్షణ అవసరం. ఇటీవల తనిఖీలు చేసి కొన్నింటిని మూసివేశాం. అందులో కనీస వసతులు లేవు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత కేంద్రాల కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలి. ఎక్కడైనా వాహనాలు తిరిగినా, అభ్యర్థులను చేర్పించుకున్నా చర్యలు తప్పవు. ఆదేశాలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. – మణికుమార్, రవాణా శాఖ ఉప కమిషనర్, విజయనగరం

అక్రమాలపై కన్ను..

సరైన శిక్షణ ఇవ్వకుండా లైసెన్సులు ఇప్పించడం, నియమాలు పాటించకపోవడం, డ్యుయల్ కంట్రోల్ వాహనాలు లేకపోవడం, వసతులు, అనుభవం ఉన్న శిక్షకులను నియమించకపోవడం.. తదితర అక్రమాలు రవాణా శాఖ అధికారుల దృష్టికి వచ్చాయి. ఇప్పటికే విజయనగరం అధికారులు నిఘా పెట్టారు. చట్ట ప్రకారం కేంద్రాల ముందు ఖాళీస్థలాలు ఉన్నాయా.. అక్కడ సరైన తర్ఫీదు అందుతోందా.. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తనిఖీ చేశారు. వాటిపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ఫిర్యాదులు సైతం వస్తుండడంతో నియమాలు పాటించని 15 పాఠశాలల లైసెన్సులను రద్దు చేశారు. మిగిలిన వాటిని కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. మన్యం జిల్లాలో రెండు మూతపడగా, మూడు కొనసాగుతున్నాయి. వాటినీ తనిఖీ చేసి చర్యలు తీసుకునేందుకు ఆ జిల్లా అధికారులు సిద్ధమయ్యారు.

జాగ్రత్తలివీ..

- ★ శిక్షణకు చేరే ముందు సదరు పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉందో లేదో తనిఖీ చేయండి
- ★ డ్యుయల్ కంట్రోల్ సిస్టమ్ ఉన్న వాహనాలనే ఆశ్రయించాలి
- ★ శిక్షణ సమయాలు, ఫీజుల వివరాలు ముందుగా తెలుసుకోవాలి
- ★ సిబ్బంది సక్రమంగా స్పందించకపోయినా, అదనంగా డిమాండు చేసినా రవాణా శాఖాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు

సీఆర్టీలను క్రమబద్ధీకరించాలి

నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న తేజోవతి

గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, న్యూస్‌టుడే: సీఆర్టీల అర్హతను పరిగణనలోకి తీసుకుని సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్‌కు గురువారం అమరావతిలో విన్నవించినట్లు గిరిజన సలహా మండలి సభ్యులు, తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతి చెప్పారు. 209 మంది ఒప్పంద ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించినా.. మరో 56 మందివి పెండింగులో ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తోటపల్లి సమస్యలు



సీఎంకు సమస్యలు వివరిస్తున్న కళా

గరివిడి, న్యూస్‌టుడే: జిల్లాలో తోటపల్లి కాలువలో పూడికలు తీయడానికి రూ.20 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రిని గురువారం అసెంబ్లీ హాలులో కలసి పలు సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. గత వైకాపా హయాంలో జిల్లాలో తెదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

21న జిల్లాకు పి.విక్రమ్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ పి.విక్రమ్ జిల్లాలో పర్యటించనున్నారని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమితి ఆధ్వర్యంలో విజయనగరంలోని గీతాంజలి పాఠశాలలో జరిగే వేడుకల్లో పాల్గొంటారన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, సీవీవీ, పాస్‌వర్డులు.. తదితర వాటిని ఎవరికీ చెప్పొద్దని కోరారు. ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ చలానాల పేరుతో లింకులు, ఏపీకే ఫైల్స్ పంపి అమాయకుల నుంచి నేరగాళ్లు దోచుకుంటున్నారని చెప్పారు. పోలీసుశాఖ అలాంటివి పంపదని గుర్తు చేశారు. అనుమానాస్పద లింకులను తెరవద్దన్నారు. అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లను మాత్రమే వినియోగించాలని కోరారు. సమస్యలుంటే 100/112, 1930, www.cybercrime.gov.in ను సంప్రదించాలన్నారు.

ఉషాశ్రీని సన్మానిస్తున్న కళాశాల నిర్వాహకులు

క్రీడలతో మానసికోల్లాసం

డెంకాడ, న్యూస్‌టుడే: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పెద్దిశెట్టి ఉషాశ్రీ అన్నారు. గురువారం జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ముఖ్యమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వీవీ రామారెడ్డి, కార్యదర్శి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు ఆమెను శాలువతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ టి.హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్త జనం మెచ్చేలా.. జాతర ఏర్పాట్లు

న్యూస్‌టుడే- రాజాం: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నందున కీలక శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సమీక్షించి పలు సూచనలు చేశారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ అశోక్‌కుమార్, పురపాలిక కమిషనర్ రామచంద్రరావు, రాజాం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.హరిబాబు, ఈపీడీసీఎల్ ఏఈ కుమార్ వివరాలను వెల్లడించారు.

నియంత్రిక ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రత్యేక పనులు..

శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతారు. ఇందుకు 45 మంది సిబ్బందిని అదనంగా నియమించారు. తాగునీటి సమస్యలు లేకుండా రెండు నీటి ట్యాంకులను నిరంతరం అందుబాటులో ఉంచుతారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కీలక రహదారుల్లో పనికిరాని మొక్కలు తొలగిస్తున్నారు. రాజాం ప్రభుత్వాసుపత్రిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ఇప్పటికే అందులో పనిచేసే వైద్యులెవరూ సెలవులు పెట్టడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చారు. ప్రత్యేక అంబులెన్స్‌ను ఆలయం వద్ద ఉంచుతారు. కిలోమీటరు మేర విద్యుత్తు అలంకరణ చేపడుతుండడంతో లోడ్‌ను తట్టుకునేలా ఏడు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు..

బొబ్బిలి రహదారి నుంచి చీపురుపల్లి, విజయనగరం, విశాఖ వెళ్లే బస్సులను చీకటిపేట కూడలి వద్ద జీసీపల్లి రహదారిలో మళ్లిస్తారు. బొబ్బిలి నుంచి పాలకొండ వెళ్లాల్సిన వాహనాలను పాలకొండ రోడ్డుకు మళ్లిస్తారు. ఇంటర్ పరీక్షల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. బొబ్బిలి రహదారి నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలను చీపురుపల్లి- రాజాం రోడ్డుకు మళ్లిస్తారు. 300 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం కేటాయించాలని స్థానిక అధికారులు కోరారు.

రైల్వే పైవంతెన నిర్మాణ స్థలంపై గ్రామసభ

గజపతినగరం, న్యూస్‌టుడే: రైల్వేగేటును మూసివేసి, వంతెన నిర్మాణానికి స్థలాల పరిస్థితిపై ఆర్డీవో రామ్మోహనరావు పురిటిపెంట పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కాంప్లెక్సు నుంచి నేరుగా ప్రస్తుతమున్న మెంటాడ రోడ్డును కలిపేలా వంతెన నిర్మించేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదించారన్నారు. దిగువ వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, ఆ ప్రతిపాదన ఉందని రైల్వే అధికారులు తెలిపారు. సర్వీసు రోడ్లు, పైవంతెన పక్కన కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉపసర్పంచి సురేష్, బంగారునాయుడు, రీసర్వే డీటీ జోగినాయుడు, రైల్వే ఇంజినీరింగు అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

EENADU e Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

VZM JNTU Jn. towards RK township Nr. Orissa Daba, E/F, 222 Sq.Y. (33.3x60) 3B/R Individual House for sale. Full residential area & vastu ✆: 9703116256.

TO LET

COMMERCIAL

VZM Town Siddarthanagar GST Office Opposite, Ground floor 2100 Sft suitable Banks, Office near RTC Complex road ✆ 9701129889, 9100994599.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ SUBHAGRUHA ఉద్యోగావకాశాలు SALARY + INCENTIVES 8106863499 9010988707

HDFC ఫైనాన్సియల్ కన్సల్టెంట్స్ కావలెను. 10 to డిగ్రీ, జీతం 15-30k, Age: 25-55y, విజయనగరం జిల్లా అంతటా పని చేయాలి ✆: 8919867018.

MNC కంపెనీలో కాంట్రాక్టర్ల వద్ద B.టెక్, Dip., ITI, డిగ్రీ ఇంజనీర్స్, సూపర్‌వైజర్స్, స్టోర్స్, సిస్టం ఆపరేటర్స్, టెలికాలర్స్, Asst., ✆ 8341177761.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

FACULTY/ TEACHERS

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K- ఫుడ్& అకామిడేషన్. 9848577745, 9666694545

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, శ్రీకాకుళం, విజయనగరంలో పనికొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్, భోజనం కలదు. PF, ESI. జీతం 20 వేలు, 30 వేలు. 6300071128

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

బాలసాదు పేరంటాల తీర్థం

మహోత్సవంలో మహిళల కోలాటం

పెదమజ్జిపాలెం(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని మదనాపురం బాలసాదు సన్యాసమ్మ తీర్థమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండి, గుర్రం పరుగు, కబడ్డీ పోటీలు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. ఎస్సై సాయికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

22న రుషింగిలో కోలాటం పోటీలు

వంగర, న్యూస్‌టుడే: మండలంలోని రుషింగిలో దుర్గా షిరిడిసాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మురళీకృష్ణ తెలిపారు. వివరాలకు 83094 87836కు సంప్రదించాలన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

వేర్వేరుచోట్ల చోరీలు.. 13 తులాల బంగారం మాయం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని తోటపాలెంలో చోరీ జరిగింది. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్సై సురేంద్రనాయుడు వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే సీహెచ్ పైడితల్లి(64) ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటలకు వంగర మండలం సంగాం దేవాలయానికి వెళ్లారు. 18న తిరిగి వచ్చి చూడగా. . బీరువాలో ఆరు తులాల బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తలుపులు వేసినట్లే ఉన్నాయని, ఇంటి వెనుకవైపు ఉన్న కిటికీ నుంచి దొంగ లోపలకు ప్రవేశించి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆలస్యంగా వెలుగులోకి..

నగరంలోని ఉడాకాలనీ ఫేజ్-1లో నివాసం ఉంటున్న జి.సంధ్యారాణి గతేడాది డిసెంబరు 12న బంగారు ఆభరణాలు ధరించి ఓ శుభకార్యానికి వెళ్లారు. ఆరోజే ఇంటికి తిరిగొచ్చి వాటిని బీరువాలో భద్రపరిచారు. గతనెల 14న చూసేసరికి ఏడు తులాల బంగారం మాయమైంది. దగ్గర బంధువులకు చెందిన ఓ బాలుడిపై అనుమానం రావడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అనుమానితుడు ఎంతకీ స్పందించకపోవడంతో ఎట్టకేలకు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.

మహిళ మృతికి కారణమైన కారు గుర్తింపు

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖపట్నం-అరకు జాతీయ రహదారిపై దేశపాత్రునిపాలెం కూడలి వద్ద ఈనెల 2న రాత్రి గోకాడ పద్మ(55)ను ఢీకొని ఆమె మృతికి కారణమైన కారును సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించామని సీఐ సీహెచ్.షణ్ముఖరావు గురువారం తెలిపారు. ఆరోజు రాత్రి 10 గంటల సమయంలో పాలకేంద్రం మూసేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ నేరానికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టుకు చెందిన కారు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆక్రమించుకుంటున్నా పట్టించుకోరా?

బొబ్బిలి, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తులకు రుసుములు వసూలు చేసేందుకు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి ఎదురుగా గతంలో రూ.2 లక్షలతో షెడ్డు నిర్మించి చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. దీని వెనుక స్థలం కొనుగోలు చేసిన ఓ వ్యక్తి షెడ్డును ఆక్రమించుకున్నారు. గురువారం మార్కెట్ కమిటీ సిబ్బందికి తెలియకుండానే తాళాలు తెరిచి అందులో ఉన్న ఫర్నిచర్, ఇతర దస్త్రాలను మూలన పడేసి, షెడ్డు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై మార్కెట్ కమిటీ కార్యదర్శి-2 ఈశ్వరరావు మాట్లాడుతూ వేరే చోట షెడ్డు నిర్మిస్తామని ఆయన చెప్పారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

విద్యార్థినులతో ఆకతాయిల అసభ్య ప్రవర్తన

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినులతో ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. మండలంలోని కోమటిపల్లి సమీపంలో కళాశాలకు చెందిన విద్యార్థినులు అద్దింట్లో ఉంటూ చదువుకుంటున్నారు. బుధవారం కళాశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో నలుగురు వ్యక్తులు అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందికి గురి చేశారు. అధ్యాపకులకు విషయం చెప్పడంతో వారు ప్రశ్నించగా ఆకతాయిలు గొడవకు దిగారు. దీంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. గతంలోనూ ఇటువంటి ఘటనలు జరిగేవన్నారు. దీనిపై సీఐ నారాయణరావును అడగ్గా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

శ్రీనివాస్ (పాతచిత్రం)

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: భార్య మందలించిందన్న కారణంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్సై అశోక్‌కుమార్ వివరాల ప్రకారం. . గాంధీనగర్‌కు చెందిన బెవర శ్రీనివాస్(28) రోజు కూలీ. ఓ మాంసం దుకాణంలో పనిచేసేవాడు. ఆయనకు భార్య రేవతి, ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్య మందలించడంతో గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైక్లిస్టు వందనకు ఎంపీ సత్కారం

మియాపూర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రముఖ సైక్లిస్ట్ వందనను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. ఇటీవల ఆమె ప్రతిష్ఠాత్మక రేస్ అక్రాస్ అమెరికాకు ఎంపికైంది. ఈ నేపథ్యంలోని ఈటీవీ, ఈనాడు వసుంధరలో ఆమె సైక్లిస్ట్‌గా సాధించిన విజయాల గురించి వచ్చిన కథనాన్ని చదివిన ఎంపీ.. నగరంలోని మదీనాగూడలో ఉంటున్న ఆమె ఇంటికి వచ్చారు. వందనను, ఆమె భర్త నితిన్‌ను సత్కరించారు. త్వరలోనే వందనను రాష్ట్రపతి వద్దకు తీసుకువెళ్తానని పేర్కొన్నార

(c) eenadu

కదలదు.. మెదలదు!

పాలకొండ పంచాయతీ కార్యాలయంలో ఏళ్లుగా రోడ్డు రోలర్ కదలకుండా మెదలకుండా ఉంది. ఆరు బయట ఎండ, వానకు వదిలేయడంతో పూర్తిగా పాడైంది. గతంలో రహదారుల నిర్మాణాల్లో అధికారులు దీన్ని వినియోగించేవారు. ఆపై ఆధునిక వాహనాలు అందుబాటులోకి రావడంతో దీన్ని ఇలా వదిలేశారు. కనీసం అధికారులు వాహనాన్ని నీడలో భద్రపర్చినా, విక్రయించినా కొంత మేర ప్రయోజనం ఉండేది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఈఈ జి.రవి తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

ఇళ్ల మధ్య మురికికూపాలు

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో చాలా మంది స్థలాలు కొనుగోలు చేసి, వదిలేశారు. ఇవి ప్రస్తుతం అనారోగ్య కారకాలుగా మారుతున్నాయి. ఇళ్లలోని వాడుకనీరు ఖాళీ స్థలాల్లో చేరి మురుగుకూపాలుగా మరాయి. గాయత్రీనగర్, ఎన్‌కేరాజపురం, సరస్వతీనగర్, మురళీమోహన్‌నగర్, వడమకాలనీ, గారమ్మకాలనీ, కొండవీధి తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. నీరు నిల్వ లేకుండా చూస్తామని, యజమానులకు నోటీసులు ఇస్తామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పదేళ్లుగా ఇలానే..!

గుచ్చిమి గ్రామ పంచాయతీ పరిధిలో తలపెట్టిన మూడు అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక పాఠశాల-1 ఆవరణలో రెండు, పాఠశాల-2 పరిసరాల్లో ఒక భవన నిర్మాణ పనులు చేపట్టారు. పైకప్పు వేసిన తర్వాత.. బిల్లుల సమస్యతో గుత్తేదారు వదిలేశారు. ప్రస్తుతం మూడు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

యంత్రాలు మూలకు చేర్చారు

రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు ఉపయోగించక.. మూలకు చేరాయి. గత వైకాపా హయాంలో రూ.కోట్లు వెచ్చించి కేంద్రానికి ఒకటి చొప్పున అందించారు. కురుపాం, మొండెంఖల్లు, నీలకంఠాపురం, రస్తాకుంటుబాయి తదితర కేంద్రాల్లో వీటిని వినియోగించకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఏవో నాగేశ్వరరావు చెప్పారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

పాకలో పాఠాలు..!

కోస్టువలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 92 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతుల నిర్వహణకు సరిపడా గదుల్లేవు. సమస్యను హెచ్ఎం నాగేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచి సీతారామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్థులంతా ఏకమై గడ్డితో పాకను నిర్మించారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

తెరపై ఈనాడు

✦ శ్రీ సినిమా(ఎస్‌వీబీ): ఫంకీ, కపుల్ ఫ్రెండ్లీ ✦ టీబీఆర్: మన శంకర వరప్రసాద్ గారు, మనసంతా నువ్వే

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో గురువారం సాయంత్రానికి ఇలా ఉన్నాయి. (కిలో..రూపాయిల్లో)... ✦ టమాటా: 13, ✦ వంకాయలు: 25, ✦ బెండ: 45, ✦ బీర: 44, ✦ దొండ: 50, ✦ చిక్కుడు: 28, ✦ పచ్చిమిర్చి: 67, ✦ కాకర: 36, ✦ క్యారెట్: 38, ✦ బీట్‌రూట్: 27, ✦ ఉల్లి: 22, ✦ బంగాళాదుంపలు: 23, ✦ అల్లం: 76, ✦ వెల్లుల్లి: 132, ✦ క్యాప్సికమ్: 65, ✦ అరటి కాయ: 5, ✦ ఆనపకాయ: 14

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: పాలకొండలోని ఎన్‌కేరాజపురం రామమందిరం వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. - భకులు ● పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - రత్నరాజ్, నగర పంచాయతీ కమిషనర్ – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: కురుపాంలో ఉన్నత పాఠశాలకు మట్టి రోడ్డులో వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. - సాయికుల ● రహదారి నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభిస్తాం. - జి.సత్యనారాయణ, ఏపీవో – న్యూస్‌టుడే, కురుపాం

?: పెదమదిక పంచాయతీ కొత్తఊరు అంగన్‌వాడీ కేంద్రానికి సరైన దారి లేక పిల్లలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. కాలువపై వంతెన కట్టాలి. - రాజన్న, గర్భిణి ● కార్యదర్శిని అప్రమత్తం చేస్తాం. - కె.సత్యం, ఎంపీడీవో – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: కాశాపేట జగనన్న కాలనీలో కాలువలు, రోడ్లు లేక ఇబ్బందిగా ఉంది. - స్వామి నాయుడు ● నిధులు మంజూరయ్యాయి. పనులు చేపడతాం. - శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, సీతానగరం

?: పాలకొండ వేమకోటివారి వీధి కూడలిలో చేతిపంపు పనిచేయడం లేదు. - రమణమ్మ, గృహిణి ● మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తాం. - దేవీవరప్రసాద్, ఏఈ – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: కురుపాం గ్రామ వీధుల్లో కాలువల్లో మురుగు పేరుకుపోయింది. - అనిల్ ● మురుగు తొలగిస్తాం. దోమల మందు పిచికారీ చేయిస్తాం. - కె.సురేష్, పంచాయతీ ఈవో – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

దారి శుభ్రం

స్పందనకు వందనం

పాలకొండ గ్రామీణం: పాలకొండలోని కోమటి పేట కూడలి ఎట్టకేలకు శుభ్రపడింది. వ్యర్థాలు రోడ్డుపై గుట్టలుగా పడి ఉండడంతో 'ఈనాడు'లో ఈనెల 18న 'సార్.. ఇంత ఘోరమా?' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ రత్నరాజ్ సిబ్బందితో బుధవారం శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం.. పట్టణ వైద్యం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) భవనం అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గుత్తేదారు చిన్నపాటి పనులను చేయకుండా వదిలేయడంతో సుమారు రెండేళ్లుగా భవనం వృథాగా ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వెనుక వైపు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఎంత ఆలస్యం చేస్తే అంత నష్టం ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్తు పనులు పూర్తి చేస్తే భవనాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు సమయం దగ్గర పడింది. ఈలోగా పనులు చేయకపోతే మరోమారు అంచనా విలువ మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలుమార్లు అంచనా విలువ మారింది. మరోపక్క అద్దె భవనంలో ఇటు రోగులు, అటు సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. దీంతో చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే జిల్లా కేంద్ర ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.

రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోని భవనం

అరకొర వైద్య సేవలతో ఇబ్బందులు

వృథాగా నూతన భవనం

ప్రస్తుతం సేవలు అందిస్తున్న గది ఇలా..

అట్టపెట్టెల్లోనే పరికరాలు..

యూపీహెచ్‌సీను మూడేళ్ల క్రితం ఎస్ఎన్‌పీ కాలనీలోని అద్దె భవనంలో తాత్కాలికంగా ప్రారంభించారు. ప్రస్తుతం 50 నుంచి 80 వరకు ఓపీ వస్తోంది. కొత్త బెలగాం, బంగారమ్మ కాలనీ, సాయినగర్ కాలనీ, బాలగుడబ, వల్లరి గుడబ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు వెళ్తున్నారు. సరిపడా సౌకర్యాలు, స్థలం లేక విలువైన వైద్య పరికరాలు, మంచాలను ఇష్టారీతిలో ఉంచడంతో స్టోర్ రూమ్‌లా తయారైంది. సిబ్బంది కూర్చునేందుకు వీలుకాని పరిస్థితి. వ్యాధి నిర్ధారణ పరికరాలను మంచాలు, బల్లలపై ఉంచుతున్నారు. కొన్ని వాడేందుకు వీలుపడక అట్టపెట్టెల్లోనే ఉంచారు.

త్వరలో అందుబాటులోకి..

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి సంబంధించి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. టెండర్లు పిలిచాం. త్వరలో పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. – డి.పావని, పుర కమిషనర్

శ్రద్ధ చూపిస్తేనే..

పట్టణం వేగంగా విస్తరిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది కుటుంబాలు ఉపాధి, పిల్లల చదువుల కోసం వలస రావడంతో జనాభా ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 62 వేల మంది ఉన్నారు. అందుకు తగ్గట్టు మురికివాడల్లోని పేదలకు ప్రభుత్వ వైద్యం దరిచేర్చాలని కొత్తబెలగాంలో గత వైకాపా ప్రభుత్వం యూపీహెచ్‌సీని మంజూరు చేసింది. నాలుగేళ్ల క్రితం రూ.63 లక్షలతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. సకాలంలో బిల్లులు అందక గుత్తేదారు ఆగుతూ.. సాగుతూ పనులు చేశారు. రెండేళ్ల క్రితం భవనం పూర్తయింది. విద్యుత్తు, గచ్చులు తదితర చిన్నపాటి పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు మంజూరు చేసింది. మిగిలిన పనుల పూర్తికి సుమారు రూ.10 లక్షల వరకు అంచనా వ్యయం పెరిగినట్లు చెబుతున్నారు. మార్చి నెలాఖరులోగా చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. అధికారులు శ్రద్ధ చూపి చర్యలు తీసుకుంటే మంచిదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బాధితుడికి రూ.3 లక్షల పరిహారం

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, కార్మికశాఖ అధికారిణి సువర్ణ తదితరులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని శివగంగలో ఒక వ్యాపారి దగ్గర కొన్నేళ్లుగా వెట్టిచాకిరీ చేసి, గత ఏడాది విముక్తి పొందిన అప్పారావుకు రూ.3 లక్షల పరిహారం మంజూరైంది. ఈ మొత్తాన్ని గురువారం కలెక్టరు ప్రభాకర రెడ్డి చేతుల మీదుగా జిల్లా కార్మిక శాఖ అధికారిణి పి.సువర్ణ అందజేశారు.

పనులు చేపట్టకుంటే చర్యలు తప్పవు

పీఆర్ ఏఈని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన నిర్మాణ పనులు వచ్చే నెల 15లోగా పూర్తిచేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందిని ఆదేశించారు. మండల కార్యాలయంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో గత నెల 31న మంజూరు చేసిన సీసీ రహదారులు, కాలువల పనులు నేటికీ ప్రారంభించకపోవడంతో పీఆర్ ఏఈ పాత్రపాయిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఏపీవో తులసీదాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే విధానంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

తప్పులు లేకుండా రీసర్వే చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఎటువంటి తప్పులు లేకుండా రీసర్వే పక్కాగా జరుగుతుందని జిల్లా సర్వే సహాయ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం తహసీల్దారు కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశమై, మాట్లాడారు. గ్రామాల్లో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సర్వే చేపట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లాలోని 965 గ్రామాల్లో 2,361 చదరపు కిలోమీటర్ల సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. 317 గ్రామాల్లో పూర్తయిందని చెప్పారు. 147 చోట్ల కొనసాగుతోందని, ఇప్పటివరకు 1,100 చదరపు కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సిగ్నల్ లేని 329 గ్రామాల్లో ఆఫ్‌లైన్‌లో సర్వే ప్రారంభం కానుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి శతశాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సర్వే ఇన్‌స్పెక్టర్ నారాయణ రావు, తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.

గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ

అధికారులతో చర్చిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన యువత ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలోని పీవో ఛాంబరులో నైపుణ్యాభివృద్ధి శిక్షణ భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. శిక్షణ కేవలం విషయాన్ని తెలియజేసేందుకు మాత్రమే కాకుండా వారి భవిష్యత్తులో ఉపాధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఏపీవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి పట్టణ సమస్యలు

వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణ సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తీసుకెళ్లారు. అమరావతిలో మంత్రిని గురువారం కలిసి పట్టణ సమస్యలపై వినతిపత్రం అందించారు. పట్టణంలో 102 సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణానికి రూ.6.60 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. తెదేపా అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి గంటా సంతోష్, కర్నేన అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

రహదారుల నిర్మాణానికి భూమిపూజ

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: నందివానివలస గ్రామం నుంచి గదబవలస వరకు రూ.2.5 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి తోటపల్లి ఎంపీటీసీ ఎం.సింహాచలం, గ్రామస్థులు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పూర్తయితే సుమారు 300 ఎకరాల భూములకు వెళ్లేందుకు రైతులకు సౌకర్యం ఏర్పడుతుంది. నీటి సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణంనాయుడు, మాజీ సర్పంచి రెడ్డి పద్మావతి, కె.ఎల్లంనాయుడు పాల్గొన్నారు. ✦ వీరఘట్టం: విక్రంపురం గ్రామంలో ఎన్టీఆర్ నగర్ కాలనీ రహదారి నిర్మాణానికి తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగ, నాయకులు భూమి పూజ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరావు

జియ్యమ్మవలస, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామానికి చెందిన ఆర్.తిరుపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆయన్ను నియమించారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ తదితరులు ఉన్నారు.

రాళ్లు గుచ్చుకుంటాయి.. జాగ్రత్త నాన్నా

సీతంపేట మండలం కె.గుమడ నుంచి ఆనపకాయగూడ, బూర్జిమానుగూడ మీదుగా పుల్లగూడ వరకు ఉన్న రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి సగంలో వదిలేయడంతో రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. రహదారి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. విషయమై డీఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

విద్యార్థులకు కిట్ల పంపిణీ



సామగ్రి అందజేస్తున్న వీరేశ్ చంద్రదేవ్

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. పీ-4 దత్తత కార్యక్రమంలో భాగంగా గురువారం కురుపాంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడేలా అట్ట, పెన్నులు తదితర సామగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా రూ.3 లక్షలు విలువైన సుమారు 3 వేల కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం ఏపీఎస్‌డీపీఎస్ యంగ్ ప్రొఫెషనల్ అధికారి జి.శరత్‌కుమార్, నాయకులు వంశీ, రామకృష్ణ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ✦ సీతంపేట: శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో పదో తరగతి చదువుతున్న 759 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయంలో అవసరమైన 8 రకాల వస్తువులను అందజేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.అన్నాదొర తెలిపారు.

కార్యాలయ సబార్డినేట్ చికిత్స అందించారు!

ఆవుకు ఇంజెక్షన్ చేస్తున్న రాధ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం బాగువలస పశువైద్యశాలలో పశువులకు చికిత్స అందిస్తున్న ఈమె వైద్యాధికారిణి కాదు. ఇక్కడ పశువైద్యాధికారిగా పనిచేస్తున్న పోలన్నదొర మక్కువ పశువైద్యశాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆపై ఆ పోస్టును భర్తీ చేయలేదు. గురువారం పోలన్నదొర బాగువలస హాజరు కాకపోవడంతో కార్యాలయ సబార్డినేట్‌గా ఉన్న రాధ పశువులకు చికిత్స అందించారు. దీనిపై పశువైద్యశాఖ ఏడీ గంగాధర్ మాట్లాడుతూ.. కార్యాలయ సబార్డినేట్.. వైద్యుడికి సహాయకారిగా మాత్రమే ఉండాలని చెప్పారు. పూర్తిగా వైద్యం అందించకూడదని, పరిశీలిస్తామని తెలిపారు.

కళ ఉంటే.. కాదేదీ వ్యర్థం

చక్కటి రూపమిచ్చారు..

సాలూరు, న్యూస్‌టుడే: వ్యర్థాలను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణ తోపాటు.. ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేశారా విద్యార్థినులు. పట్టణంలోని జ్యోతి బాపులే గురుకుల బాలిక పాఠశాల విద్యార్థులు వావ్ (వెల్త్ ఔట్ ఆఫ్ వేస్ట్) కార్యక్రమంలో భాగంగా పలు వ్యర్థాలతో బొమ్మలు సృష్టించారు.

తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

పేపరు, పిల్లలు తినే చిక్కీల రేపర్లు, అట్టలు, చిరిగిన వస్త్రాలు, దూది, గాజులు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కవర్లు, పౌడరు డబ్బాలు, కర్ర ముక్కలు వంటి వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వీటితోపాటు పెన్నులు పెట్టుకునే స్టాండ్, బాస్కెట్, పిచ్చుక గూడు, గుడ్లు కింద పడినా పాడవకుండా రక్షణ కవచం, కాలికింద వేసుకునే మ్యాట్స్, ఇంట్లో అలంకరణకు వినియోగించే గోడ గడియారం, సంచి, చిత్తు పేపర్లకు రంగులు వేసి ఫ్లవర్ బొకేలు వంటివి తయారు చేశారు. పాఠశాలకు ఉన్నతాధికారులు ఎవరైనా వస్తే కాగితాలతో తయారు చేసిన పూలబొకేలను అందించి స్వాగతం పలుకుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి చిప్పలు, పేపర్లతో తయారు చేసిన అలంకరణ వస్తువులు

సృజనాత్మకత వెలికి తీయడమే కాకుండా వ్యర్థాలను ఎలా నియంత్రించాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. వాటితో తయారుచేసిన బొమ్మలను పాఠశాలలో అలంకరణకు వినియోగిస్తున్నాం. - మహాలక్ష్మి, ప్రిన్సిపల్

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో జి.రజినీకుమారి, జిల్లా బాలల సంరక్షణ కమిటీ అధికారి శ్రీదేవి అన్నారు. గురువారం నీలకంఠాపురం, బొంగుడెం, గుమ్మ, మొండెంఖల్లు, గుమ్మిడిగూడ, కురుపాం గ్రామాల్లో బాలల సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెరుగ్గా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల అమలు మరింత మెరుగుపరచాలని పురపాలక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. గురువారం పురపాలకంపై దూరదృశ్య శ్రవణ సమీక్ష నిర్వహించారు. మురికివాడల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, కాలువల్లో పూడిక తీసే పనులు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. కమిషనరు డి.పావని, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయండి

పాలకొండ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత, నిబద్ధతతో పనిచేయాలని కమిషనర్ ఎస్‌జేవీ రత్నరాజ్ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజారోగ్యం పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. స్వచ్ఛభారత్ జిల్లా కో-ఆర్డినేటర్ గణపతమ్మ, సాయి కిరణ్ తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వైకాపా నేత, దేవాదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు శ్రీకాంత్.. బ్రాహ్మణ సమాజాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్‌కుమార్ నాయక్ అభిప్రాయపడ్డారు. గుమ్మలక్ష్మీపురంలో గురువారం మాట్లాడిన ఆయన.. శ్రీకాంత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి రూ.350 కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు.

రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: రైతులంతా విధిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి జి.సత్యవతి సూచించారు. గురువారం తాళ్లడుమ్మ పంచాయతీలో రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించారు. 11 అంకెల గుర్తింపు సంఖ్య విధిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ ఈనెల 25 లోపు చేయించుకోవాలన్నారు. ఏవో విజయభారతి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

23 నుంచి రిలే దీక్షలు

కలెక్టరేట్ ప్రాంగణం: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపు విషయం బడ్జెట్‌లో చర్చించకపోవడం శోచనీయమని సిటు నాయకురాలు ఇందిరా, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు అలివేలు, గౌరీమణి అన్నారు. గురువారం ప్రాజెక్టు పరిధిలో సమావేశం నిర్వహించారు. ఈనెల 23 నుంచి 27 వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ✦ పాచిపెంట: పాచిపెంట అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో పాల్గొననున్నట్లు తెలియజేస్తూ సీడీపీవో అనంతలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సంఘం కార్యదర్శి పార్వతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు కంపెనీ బోర్డు మార్చుతుండగా ప్రమాదవశాత్తు కింద జారిపడటంతో పట్టణానికి చెందిన జి.చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడికి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందిస్తామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు

డిపో గేటు వద్ద నిరసన

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల పేరిట ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఎస్ఎస్ రావు, రాము ఆరోపించారు. గురువారం పార్వతీపురం ఆర్టీసీ డిపో వద్ద నిరసన చేపట్టారు. సిటు నాయకులు మద్దతు పలికారు. ప్రైవేటీకరణ జరిగితే డిపోలు మూతపడే అవకాశం ఉంటుందన్నారు. కాలుష్య నియంత్రణకు బస్సులు వినియోగించాలని కేంద్రం చెప్పిందని, ఆర్టీసీ వాహనాలనే ఎనర్జీ బస్సులుగా మార్చాలని కోరారు. మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

పార్వతీపురం పురపాలక, పాచిపెంట, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిద్దామని భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం శివాజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. పార్వతీపురం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరామ్, జై శివాజీ అంటూ నినాదాలు చేశారు. భాజపా, ఆర్ఎస్ఎస్, తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాచిపెంటలో శివాజీ చిత్రపటాలతో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు.

పట్టణంలో ర్యాలీ

ఎట్టకేలకు మోక్షం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు-బాగువలస రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. రహదారి గోతులమయంగా మారడంతో కూటమి ప్రభుత్వం 10 కిలోమీటర్ల మేర బాగుకు రూ.5.40 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. సాలూరు పట్టణ శివారు గ్రామీణ పోలీసు స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట కొత్తగా రోడ్డు నిర్మాణాన్ని గురువారం పూర్తి చేశారు. బాగువలస రహదారి పనులు త్వరగా పూర్తి చేస్తామని ర.భ. శాఖ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

☛ **పరిధి:** గరుగుబిల్లి మండలం నాగూరు ఉప కేంద్రం. * **సమయం:** ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదు.

☛ కురుపాం ఉప కేంద్రం * ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు

☛ సీతానగరం మండలం బూర్జ విద్యుత్తు ఉప కేంద్రం * ఉదయం 8 గంటల నుంచి 12 వరకు

☛ పార్వతీపురం మండలం నర్సిపురం సబ్‌స్టేషన్ * ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

☛ పాలకొండ ఉప కేంద్రం * ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు

– న్యూస్‌టుడే, గరుగుబిల్లి, కురుపాం గ్రామీణం, సీతానగరం, పార్వతీపురం గ్రామీణం, బెలగాం, పాలకొండ గ్రామీణం

(c) eenadu

తుదిపోరు ఉత్కంఠ భరితం

వాలీబాల్ పోటీల మహిళల విజేతగా సదరన్ రైల్వే

సదరన్ రైల్వే, ఎస్‌ఆర్‌ఎం మహిళా జట్ల మధ్య పోటీ

ఉప్పలగుప్తం: కోనసీమ జిల్లాలోని గొల్లవిల్లిలో జరిగిన అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ జట్ల మధ్య తుది పోరు గురువారం రాత్రి రసవత్తరంగా సాగింది. మూడో స్థానం కోసం పురుషుల జట్లు జీఎస్‌టీ(ముంబయి), కర్ణాటక పోటీ పడ్డాయి. 3-1 స్కోర్‌తో జీఎస్‌టీ జట్టు మూడో స్థానం దక్కించుకుంది. మహిళా జట్లు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, సదరన్ రైల్వే(చెన్నై) మధ్య జరిగిన హోరా హోరీ పోటీలో సదరన్ రైల్వే జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతరం మొదటి, రెండు స్థానాల కోసం పురుషుల జట్లు ఐవోబీ(చెన్నై), ఇండియన్ బ్యాంక్(చెన్నై) తలపడ్డాయి.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు జై..!

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ ప్రదీప్ యాదవ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పుష్కరాల రేవు వద్ద మొదలైన ప్రదర్శన గోకవరం బస్టాండ్, దేవీచౌక్, కంబాల చెరువు, తాడితోట, కోటిపల్లి బస్టాండ్ మీదుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్దకు చేరుకుని, శివాజీ మహారాజ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. – న్యూస్‌టుడే, వీఎల్ రోడ్డు

ఈనాడు పోలవరం
శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పేర్కొన్నారు. దేవీపట్నం మండలం ముసినిగుంట బాలికల ఆశ్రమ పాఠశాల, శరభవరం, కొత్తవీధి, కొండమొదలు గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, భోజనం, కూరలు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కొన్ని ఆశ్రమ పాఠశాలలు శిథిలస్థితిలో ఉండటంతో వాటి స్థానంలో కొత్త భవనాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

అధికారులతో సమీక్షిస్తున్న పీవో స్మరణ్‌రాజ్

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలో గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధకశాఖల ద్వారా రైతులకు రుణాలను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలను తయారు చేసి తనకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నాబార్డు డీడీఎం మేనేజర్, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి, వ్యవసాయశాఖలకు చెందిన ఏడీలు, డీసీసీబీ డీజీఎం, వెటర్నరీ డీడీతో పాటు రెండు డివిజన్లకు చెందిన బ్యాంకు మేనేజర్లు, అధికారులతో స్మరణ్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగంలో రైతులకు పెట్టుబడి కింద రుణాలతో ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చేపల పెంపకం, ఉద్యాన పంటల సాగుకు చేపట్టడానికి అవసరమయ్యే అంశాలపై నివేదికలను తయారు చేయాలని సూచించారు. గతంలో రైతులు తీసుకున్న రుణాలు ఎంతవరకు చెల్లించారని బ్యాంకు అధికారులను ఆరాతీశారు. ఈ సమీక్షలో డీసీసీబీ డీజీఎం శ్రీధర్, నాబార్డు డీడీఎం సోమునాయుడు, వెటర్నరీ డీడీ షరీఫ్, జిల్లా మత్స్య అధికారిని షేక్ దిల్షాద్, పీహెచ్‌వో దేవదానం, ఏడీఏ రామ్‌మోహనరావు, బ్యాంకు మేనేజర్లు బుజ్జిబాబు, మురళీమోహన్, రమేష్‌కుమార్, ముత్యాలరావు పాల్గొన్నారు.

వైభవోపేతం.. వీరేశ్వరస్వామి తెప్పోత్సవం



ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా కోనసీమ జిల్లాలోని ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి, అమ్మవార్లను రథంపై ఉంచి గ్రామోత్సవం అనంతరం వృద్ధ గౌతమి గోదావరి నది వద్దకు తీసుకువెళ్లారు. గోదావరి మాతకు ఆలయ అర్చక, పురోహిత, వేద పండితులు ప్రత్యేక పూజలు, పంచహారతులు ఇచ్చారు. అనంతరం భద్రకాళీ సమేతుడైన వీరేశ్వరస్వామి హంస వాహనంపై గోదావరిలో నదీలో విహారం చేశారు. విద్యుత్తు కాంతులు, భారీ బాణ సంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేల సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామి వారి తెప్పోత్సవం జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రత్నాబాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు

రత్నాబాయి కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

రంపచోడవరం: మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి మృతి బాధాకరమని, కాంగ్రెస్‌పార్టీకి ఆమె చేసిన సేవలు మరువలేనివని కేంద్రమాజీ మంత్రి మంగపతి పల్లంరాజు కొనియాడారు. ఈ సందర్భంగా గురువారం రంపచోడవరంలో రత్నాబాయి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. పార్టీ అధినేత సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సైతం నివాళులు అర్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బాలాజీశ్రీను, పీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు, మాజీ సర్పంచి నిరంజనీదేవి, నక్కా బాలశివరామకృష్ణ, కారుకోడి పూజ, నాయకులు గొర్తి రమేష్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

ఆహ్లాదమే కాదు.. అపాయాలు ఉన్నాయ్

✦ మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలో తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు

✦ ఇక్కడి రహదారులు, పరిస్థితులపై అవగాహన లేక ముప్పు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి రమణీయత.. చుట్టూ పచ్చని కొండలు.. జలపాతాలు.. అడవుల గుండా సన్నగా సాగిపోయే రహదారులు.. మారేడుమిల్లి సొంతం. అందుకే ఇక్కడి పర్యాటక ప్రాంతాలను చూడటానికి వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారికి ఈ ప్రాంతాల్లో ఉత్సాహంతో పాటు, అపాయాలూ స్వాగతం పలుకుతున్నాయి. పర్యాటకుల అతి విశ్వాసం, మద్యపానం, ఆకతాయితనంతో అదే పనిగా ప్రయాణం ప్రమాదాల బారిన పడుతున్నారు.

గతంలో మృత్యువాత పడిన వారెందరో..

● కర్ణాటకకు చెందిన పర్యాటకులు భద్రాచలం నుంచి మారేడుమిల్లి వస్తుండగా, ఘాట్‌రోడ్డులో టెంపో ట్రావెలర్ బోల్తాపడటంతో అక్కడికక్కడే ముగ్గురు దుర్మరణం పాలై, 20 మంది గాయపడ్డారు. ● గుడిస వెళ్లి తిరిగి వస్తూ ఆటో మామిడికోట సంగినవ కాలువలో మునిగిన రెండు ఘటనల్లో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ● మారేడుమిల్లి- చింతూరు రహదారిలో కారు అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో కర్నూలుకు చెందిన ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ● ఏలూరులోని ఆశ్రమ్ వైద్యకళాశాల విద్యార్థులు విహార యాత్రకు రాగా, జలతరంగిణి జలపాతంలో జలకాలాడుతుండగా, వాగు ఉప్పొంగి, ఐదుగురు వైద్యవిద్యార్థులు గల్లంతయ్యారు. ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.

మన్యంలోని ప్రమాదకర మలుపులతో ఉన్న రహదారి

ప్రమాదకర ప్రదేశాలు ఇవే..

■ రంపచోడవరం నుంచి మారేడుమిల్లి, భద్రాచలం వెళ్లే రహదారుల్లో అనేక ప్రమాదకర ప్రదేశాలున్నాయి. రహదారులు మలుపులతో ఉండి, ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించని పర్యాటకులు ఎదురుగా వచ్చే వాహనాలను, చెట్లను ఢీకొంటున్నారు. ■ మారేడుమిల్లి- చింతూరు ఘాట్‌రోడ్డులో మలుపులవద్ద రక్షణ గోడలు లేక లోయల్లో పడుతున్నాయి. సుమారు 30 కిలోమీటర్ల మేర ఇదే విధంగా మలుపులు ఉండడం గమనార్హం. ■ పాములేరు వద్ద వాగు సుందరంగా కనిపిస్తున్నా అమితంగా లోతు ఉండడంతో దీనిలో దిగిన వారు గల్లంతవుతారు. ■ మారేడుమిల్లి నుంచి గుడిస, చావడికోట, దుంపవలస, వలస వెళ్లే రహదారులు సన్నగా ఉండి, ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురౌతున్నాయి.

మారేడుమిల్లిలో చూడదగ్గ ప్రదేశాలు

● గుడిస, చావడికోట కొండల్లో ప్రకృతి అందాలు ● జలతరంగిణి, అమృతధార, దుంపవలస, రంకోట, దుమ్ముదారగండి, పొల్లూరు జలపాతాలు ● గోదావరి నదిపై బోటు షికారు ● రంప శివాలయం, జలపాతం ● ఐ.పోలవరం వద్ద వాగు పరవాహక ప్రదేశాలు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

★ ఆయా ప్రమాదకర మలుపుల్లో రక్షణ గోడలు నిర్మించాలి. ★ రహదారులకు ఇరువైపులా తుప్పలు తొలగిస్తే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపిస్తాయి. ★ పర్యాటకులు ఇక్కడి రహదారులపై అవగాహన పెంచుకోవాలి. ★ వాగులు, జలపాతాల్లో దిగకుండా, జాగ్రత్త పడాలి. ★ మలుపుల్లోని రహదారులపై స్వీయచిత్రాల కోసం అడ్డుగా ఉండకూడదు.

పర్యాటకులు అప్రమత్తంగా వ్యవహరించాలి

మారేడుమిల్లి పర్యటక ప్రదేశాలకు వచ్చే సందర్శకులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి. పర్యాటకులను పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపి, ఇక్కడి పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నాం. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం, మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రమాదకర ప్రదేశాల్లో సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం.

– టి.గోపీనరేంద్రప్రసాద్, సీఐ, మారేడుమిల్లి

ఆదమరిస్తే గోదాట్లోకే..

అసంపూర్తిగా డొక్కా సీతమ్మ అక్విడక్టు టోపాత్

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టుకు సంబంధించిన సాగు నీటి ట్రఫ్(తొట్టి) టోపాత్(రహదారి పడవను తాడుతో తీసుకెళ్లేవారు నడిచే దారి)పై రెయిలింగ్ అసంపూర్ణంగా ఉండిపోయింది. 2022లో అప్పటి కలెక్టర్ హిమాన్షుశుక్లా మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో 440 మీటర్ల పొడవునా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రోడ్డు వంతెన మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో దీనిపై దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

ట్రఫ్ టోపాత్‌పై రెయిలింగ్ లేక ప్రమాదకరంగా రాకపోకలు

ప్రస్తుత పనుల నేపథ్యంలో..

డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెనపై ఉన్న సమస్యలను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పందించారు. సమస్యను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఒ.ఎన్.జి.సి. నుంచి రూ.62 లక్షలు మంజూరు చేయించారు. రూ.13 లక్షలతో గతంలో రోడ్డు వంతెనపై సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.49.03 లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నారు. టోపాత్‌పై మిగిలిన 240 మీటర్ల మేర రెయిలింగ్ కూడా పూర్తిచేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని అంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల రాకపోకలతో ప్రమాదం

స్థానికులు కొందరు ఈ టోపాత్ మీద నడిచి వెళుతుంటారు. రెయిలింగ్ అసంపూర్ణంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఒక వైపున సాగునీటి ట్రఫ్, మరో వైపున గోదావరి నది ఉంది. ఏమాత్రం అదుపుతప్పినా వాటిలో పడిపోవడం ఖాయం. అదే జరిగితే ప్రాణనష్టం జరుగుతుంది. 2022లో 680 మీటర్లకు గాను 440 మీటర్ల మేర రెయిలింగ్ ఏర్పాటు చేసి నిధులు సరిపోక పనిని నిలిపేయాల్సి వచ్చింది. మిగిలిన 240 మీటర్ల మేర ఏర్పాటు చేయాలంటే రూ.20 లక్షలు అవసరం ఉంటుందని జలవనరుల శాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు వివరించారు.

పాఠశాల విద్యార్థులకు ప్రయోగ పాఠాలు

దేవీచౌక్: ల్యాబ్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి గురువారం తంటికొండ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు వివిధ ప్రయోగాలను వివరించి వారితో చేయించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కోమల లక్ష్మి, అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.భార్గవి, కె.సురేష్, వై.రాము, జె.నిరంజనరావు, ఎన్.వెంకన్నబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సీబీఎస్ఈ పరీక్షలు

రాజవొమ్మంగి న్యూస్‌టుడే: ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాసంస్థల్లో (ఈఎంఆర్ఎస్) సీబీఎస్ఈ విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. పోలవరం జిల్లాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కన్వీనర్ ప్రిన్సిపల్ శంకర్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో నాలుగు విద్యాలయాల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈజీ గ్రూపులకు చెందిన 336 మంది విద్యార్థులకు ఈ నెల 20 నుంచి మార్చి 30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో రాజవొమ్మంగి విద్యాలయానికి చెందిన 73 మంది, చింతూరు 89, మారేడుమిల్లి 84, వై.రామవరం విద్యాలయానికి చెందిన 90 మంది విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు 24న

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 24వ తేదీన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అండర్-18 కేటగిరిలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జిల్లావాసులై ఉండాలి. సైకిల్, ఆధార్ కార్డు నకలుతో హాజరుకావాలన్నారు. ఎంపికైనవారు రాష్ట్రస్థాయి శాప్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90002 74225, 63031 93400 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

ఏళ్లు గడుస్తున్నా ఏఎన్ఎంలను నియమించరా?

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల ఆవేదన

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్లు గడుస్తున్నా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎంలను భర్తీ చేయడం లేదు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఉపాధ్యాయులు లేదా సిబ్బందే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. కేవలం ఐదు పాఠశాలల్లో మాత్రమే ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మారేడుమిల్లి మండలం బోదులూరు ఆశ్రమ పాఠశాల, రంపచోడవరం మండలం ఇర్లపల్లి, యర్రంపాలెం,

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివరాలు ఇలా..		
పాఠశాలలు, వసతిగృహాలు	సంఖ్య	విద్యార్థులు
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు	79	16,238
గిరిజన సంక్షేమ వసతిగృహాలు	15	1,281
గిరిజన ప్రాథమిక పాఠశాలలు	289	6,744
గురుకుల విద్యాలయాలు	15	5,738
ఏకలవ్య ఆదర్శ విద్యాలయాలు	6	2,128

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

గంగవరం మండలంలో గంగవరం రాజవొమ్మంగి మండలం సింగంపల్లిలో ఏఎన్ఎంలు ఉన్నారు. మిగిలిన పాఠశాలల్లో ఎక్కడా ఏఎన్ఎంలు లేరు. దీంతో జ్వరం వచ్చినా, జలుబు చేసినా, వాంతులు, విరేచనాలకు గురైన ప్రథమ చికిత్స చేసేందుకు వైద్యసిబ్బంది లేకపోవడంతో ఉపాధ్యాయులు, లేదా వాచ్‌మెన్‌లు, వంట మనుషులే పీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు.

■ గత ప్రభుత్వంలోనే తొలగించారు..

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గతంలో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో తాత్కాలిక పద్ధతిలో 216 మంది వరకు ఏఎన్ఎంలు పనిచేసేవారు. అనారోగ్యానికి గురైన పిల్లలకు పాఠశాలల్లోనే వైద్య సేవలను అందించేవారు. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం ఏఎన్ఎంలను పూర్తిగా విధులనుంచి తొలగించారు. దీంతో విద్యార్థులకు వైద్యసేవలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. పలుమార్లు ఏఎన్ఎంలను నియమించాలని ఉపాధ్యాయ సంఘాలతోపాటు ఆదివాసీసంఘాల ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికి చర్యలు చేపట్టలేదు.

ప్రభుత్వానికి నివేదించాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. కేవలం ఐదు పాఠశాలల్లో మాత్రమే రెగ్యులర్ ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన చోట ఎక్కడా లేకపోవడంతో వైద్యపరంగా ఎదురవుతున్న ఇబ్బందులను నివేదించాం. – రుక్మాంగదయ్య, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, రంపచోడవరం

రక్షిత తాగునీటి పునరుద్ధరణ

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు రెండు నెలలు తరువాత సత్యసాయి రక్షిత తాగునీరు గ్రామాలకు వెళ్లడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఉన్న సత్యసాయి తాగునీటి పథకంలో తాగునీటిని సరఫరా చేసే మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో అయిదు మండలాల్లో 84 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు సమస్యను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లగా పురుషోత్తపట్నంలో ఉన్న సత్యసాయి తాగునీటి పథకాన్ని పరిశీలించి మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. బుధవారం సాయంత్రానికి ఇందుకూరుపేటలో ఉన్న సత్యసాయి పంపుహౌస్‌కు తాగునీరు సరఫరా కావడంతో గురువారం ఉదయం నుంచి మన్యంతో పాటు మైదాన ప్రాంతాలకు సరఫరా జరుగుతోంది.

పంపా జలాశయానికి త్వరలో కొత్త గేట్ల బిగింపు

రూ.3.36 కోట్ల పనులు మార్చి వరకు పూర్తి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామం పంపా రిజర్వాయర్‌కు కొత్త వరద గేట్లు ఈ ఏడాది మార్చిలోగా అమర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న గేట్లు తొలగించి కొత్త గేట్లు అమర్చేందుకు, రోలర్స్, రోప్ రింగ్, కవర్ డ్రైవర్ యూనిట్, కొత్త జనరేటర్, విద్యుత్తు పనులు, సైరన్, విద్యుత్తు ప్యానల్ తదితర పనులకు కూటమి ప్రభుత్వం రూ.3.36 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులన్నీ గత ఏడాది ఖరీఫ్‌కి పూర్తి చేయాల్సి ఉన్నా టెండర్లలో జాప్యం, రిజర్వాయర్‌లో నీటి నిల్వలతో పనులు జరగలేదు. ప్రస్తుతం కొవ్వూరు వద్ద గేట్లు పకడ్బందీగా తయారవుతున్నాయి. త్వరలోనే గేట్లను తెచ్చి రిజర్వాయర్‌కు అమర్చనున్నారు.

గత వైకాపా ప్రభుత్వం రిజర్వాయర్ నిర్వహణపై కనీస శ్రద్ధ చూపలేదు.

పలు సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులు

2023లో మిగ్‌జాం తుపాను సమయంలో గరిష్ఠ స్థాయికి నీరు చేరింది. ఈ సమయంలో 2, 4 గేట్లు అదుపు తప్పాయి. గేట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. పలు తుపాన్ల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకుంది. 2021లోనే గేట్లు పరిస్థితి, ఆధునికీకరణపై నిపుణులు నివేదిక ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసింది.

సిద్ధమవుతున్న గేట్లు

డీఆర్‌డీఏ పీడీగా రత్నాకరరావు

రంపచోడవరం: పోలవరం జిల్లా డీఆర్‌డీఏ పీడీగా డాక్టర్ దాసరి రత్నాకరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వెలుగు ఏపీడీగా పనిచేసిన డేగలయ్య అదనపు విధులు నిర్వహిస్తూ విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డేగలయ్య రత్నాకరరావుకు డీఆర్‌డీఏ బాధ్యతలను అప్పగించారు. విజయనగరం జిల్లా డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న రత్నాకరరావు పదోన్నతిపై రంపచోడవరం విచ్చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

రత్నాకరరావుకు బాధ్యతలను అప్పగిస్తున్న డేగలయ్య

అన్నదాతా.. మిగిలింది 5 రోజులే

ఈ పంట నమోదుకు 25 వరకు అవకాశం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రైతులకు వ్యవసాయం పరంగా ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు, ఇతర ప్రయోజనాలు దక్కాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి. రైతులకు భూ హక్కు పత్రాలు ఎంత ముఖ్యమో.. సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు కూడా అంతే కీలకం. బీమా వర్తించాలన్నా, సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలన్నా.. ఎరువులు కావాలన్నా, పంట విక్రయించాలన్నా ఇది తప్పనిసరి. ప్రస్తుతం సాగవుతున్న రబీ పంటల వివరాల నమోదు గడువు మరో అయిదు రోజుల్లో ముగియనుంది. 2025-26 రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్నతో పాటు, వాణిజ్య, ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి.

జిల్లాలో ఈ-పంట వివరాలు	
పంట	ఎకరాలు
వరి	1917.11
మినుములు	5854.13
పెసలు	1298.07
కందులు	5.53
వేరుశెనగ	9.30
జొన్న	142.96
మొక్కజొన్న	1475.22
ఎండుమిర్చి	1027.81
నువ్వులు	978.30
పొగాకు	241.02

రైతు వివరాలతో పంట నమోదు చేస్తున్న ఏవో, సిబ్బంది

జిల్లాలో పంటల వివరాలు ఎకరాలలో	
రబీలో సాధారణ విస్తీర్ణం	12,520
ప్రస్తుతం సాగైనది	16,657.5
ఇప్పటి వరకు ఈ-పంట నమోదు	12,949

మీరే చేసుకోవచ్చు.

★ అన్నదాతలు స్మార్ట్‌ఫోన్‌లో ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ ఆధార్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పిన్ సెట్ చేసుకోవాలి. ★ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానమైన రైతుకు చెందిన భూములు యాప్‌లో కనిపిస్తాయి. ★ దాని ద్వారా ఇప్పటి వరకు వీఏఏలు నమోదు చేయని పంటల వివరాలు సకాలంలో నమోదుచేసుకోవచ్చు. ★ 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో పొలంలో పంటతో సహా చిత్రం తీయాలి.

అవగాహన కల్పించాం



రైతులు తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలి. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా వీఏఏలు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా రైతులు సొంతంగా కూడా చేసుకోవచ్చు. ఎలా చేయాలో ఇప్పటికే అవగాహన కల్పించాం.

– ఎస్‌బీఎస్ నంద్, జిల్లా వ్యవసాయాధికారి

మురిపిస్తున్న మిరియాలు

హుకుంపేట: గిరిజనుల జీవితాలను మార్చేసిన పంటల్లో ప్రధానమైనది మిరియాలు. మిరియాలను సేకరించి వాటిని ఎండబెట్టి సంతల్లో విక్రయించేందుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. కాఫీ తోటల్లో అంతర పంటగా వేసే ఈ మిరియాల పంట గిరి రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. గత మూడు సంవత్సరాలుగా కేజీ సుమారు రూ.450 నుంచి రూ.550 వరకు ధర పలికింది. ఈ సీజన్ ప్రారంభంలోనే కేజీ దాదాపు రూ.550 నుంచి రూ.650 వరకు సంతల్లో విక్రయిస్తున్నారు. ధరలు అధికంగా ఉండటంతో గ్రామాల్లో పంట సేకరణ ముమ్మరంగా సాగుతోంది. ఎంతో కష్టపడి సేకరించి.. వాటిని బాగు చేసి సంతలకు తీసుకొస్తే దళారులు, వ్యాపారులు కాటాల ద్వారా మోసం చేసి రైతులకు డబ్బులు రాకుండా దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 100 కేజీల కొనుగోలులో దళారులు సుమారు 5 కేజీల వరకు మోసం చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా పంట కొనుగోలు చేసి తమకు నష్టం రాకుండా చూడాలని పలువురు విన్నవిస్తున్నారు.

(c) eenadu

గుడ్లగూబకు గాయం.. అందిన వైద్యం

అనార్గొంగంలో జాతీయ రహదారిపై పడిపోయిన ఓ గుడ్లగూబకు చికిత్స చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని హైవేపై గురువారం ఓ గుడ్లగూబ పడిపోగా, ముక్కు నుంచి రక్తం కారుతోంది. స్థానికుడు ఒకరు గమనించి పుష్కరవనంలోని వన్యప్రాణి ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చి ఫారెస్ట్ రేంజ్ అధికారి దావీదురాజుకు అప్పగించారు. అక్కడ రెస్క్యూ సెంటర్‌లోని వన్యప్రాణి వైద్యాధికారి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స అనంతరం రక్తం కారడం ఆగిందని దావీదురాజు తెలిపారు. ప్రస్తుతం దానికి ఆహారం ఇస్తున్నామని, దాని వయసు సుమారు 8 నెలలు ఉండవచ్చన్నారు. పూర్తిగా స్వస్థత చేకూరిన తర్వాత తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు. పుష్కరవనంలో వన్యప్రాణి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఏవైనా గాయపడిన ప్రాణులను ఇక్కడకు తీసుకొస్తే వైద్యం చేయిస్తామన్నారు. వివరాల కోసం 6309730519 నంబరులో సంప్రదించాలని సూచించారు. - న్యూస్‌టుడే, రాజానగరం

వ్యాఘ్రేశ్వరస్వామికి పుష్పయాగం

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివాలయమైన వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీ సమేత వ్యాఘ్రేశ్వరస్వామి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. గురువారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. - న్యూస్‌టుడే, అంబాజీపేట

చింతలూరు నూకాంబిక జాతరకు అంకురార్పణ

ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రసిద్ధి పొందిన చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతరకు గురువారం అంకురార్పణ జరిగింది. అమ్మవారిని బుట్టగొడుగు రూపంలో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మార్చి 17న జాగరణ, 18న తీర్థం, 19న ఊరేగింపు వేడుకలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 17 వరకు తీర్థం జరుగుతుంది. జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో ఉండపల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ వీర అప్పారావు, వెంకట్రావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఆలమూరు

వస్తోంది.. బాల్య వివాహాల విముక్తి రథం

వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో బాల్య వివాహ విముక్తి రథాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటికే వన్‌స్టాప్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా గృహ హింస, వరకట్న వేధింపులు, ఇతర ఇబ్బందులకు గురవుతున్న మహిళలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఏర్పాటు చేసిన రథాన్ని ప్రారంభించారు. దీని ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఐసీడీఎస్ పీడీ నాగమణి, రమాదేవి, విజయ, తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

మార్చి 1 నుంచి గడపగడపకూ సీపీఐ

- కాకినాడలో ముగిసిన రాష్ట్ర సమితి సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేలా, ప్రజలకు చేరువ చేసేలా మార్చి 1 నుంచి 15 వరకు గడపగడపకూ సీపీఐ కార్యక్రమం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో కేవలం కొద్దిమంది చేతుల్లోనే పోగుపడిన సంపదను వివిధ పన్నుల ద్వారా సేకరించి పునఃపంపిణీ చేయడం ద్వారా సామాజిక న్యాయం సాధించాలన్నారు. మోదీ 12 ఏళ్ల పాలనా కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాసి రాజ్యాంగానికి ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కొత్త పథకంతో పేదల ఉపాధి హక్కుకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. రైతుల పంటలకు లాభసాటి ధరలు కల్పించాలని, యువతకు ఉపాధి, ఉద్యోగ నైపుణ్యాలు కల్పించాలని, లేకుంటే పరిహారం ఇవ్వాలని తీర్మానించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ ఈ నెల 20 తేదీ శుక్రవారం సామాజిక న్యాయ దినోత్సవాన్ని సామాజిక, ఆర్థిక న్యాయం నినాదంతో అర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సమితి సమావేశాల్లో నాయకులు ఆమోదించిన పార్టీ తీర్మానాలను జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ చదివి వినిపించారు. తీర్మాన కాపీలను తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి బోడకొండ, తోకల ప్రసాద్‌లకు అందించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అన్ని జిల్లాల కార్యదర్శులు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య చేతుల మీదుగా తీర్మాన ప్రతులు అందుకుంటున్న నాయకులు మధు, బోడకొండ, ప్రసాద్, చిత్రంలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

గోదావరి వరదలపై క్షేత్రస్థాయి అధ్యయనం

కొత్తపేట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్త ఎస్.వి.శివప్రసాద్‌రావు బృందం గురువారం కొత్తపేట మండలం నారాయణలంక, వానపల్లి తదితర లంక గ్రామాల్లో పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న నీటిమట్టం, 1986, 2022 సంవత్సరాల్లో వచ్చిన ఉద్ధృత గోదావరి వరదల సమయంలో నీటిమట్ట స్థాయిలను బేరీజు వేశారు. నదిపై మొదటి, రెండు, మూడు, నాలుగో ప్రమాద హెచ్చరికల సమయంలో పరిస్థితి ఏమిటి అనే వివరాలు తెలుసుకున్నారు. వరద ఉద్ధృతి ప్రాంతాలను శాటిలైట్‌కు అనుసంధానం చేసి కేంద్రస్థాయి నుంచి వివరాలు గమనించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రజలు, ప్రభుత్వ ఆస్తులకు ఏవిధమైన నష్టం తలెత్తకుండా భవిష్యత్తు కార్యాచరణపై అధ్యయనం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై. రాంబాబు, ఎంపీడీవో పి.ఎస్.నరేష్‌కుమార్, నీటిపారుదలశాఖాధికారి శివప్రసాద్, వానపల్లి సర్పంచి పల్లి భీమారావు, గనిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణలంకలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అప్పనపల్లిలో పుష్కర పనుల పరిశీలన

మామిడికుదురు, న్యూస్‌టుడే: రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం పరిశీలన చేశారు. స్థానికంగా ఉన్న బాలాజీ సదన్‌ను అన్ని సౌకర్యాలతో ఆధునికీకరించేందుకు, అక్కడి గోశాల సమీపంలోని 3.39 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించారు. భక్తులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలకు సంబంధించి స్థానిక అధికారులతో సమీక్షించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏసీ రాంబాబు రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకుంటున్న దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

కాల్పనిక ప్రపంచంలో.. అవకాశాల హరివిల్లు

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాల్టీ(ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఏపీవీఏజీపీ సంయుక్త సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన రెండు రోజుల ఏవీజీసీ-ఎక్స్ఆర్ సమ్మిట్-2026 గురువారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ యువత ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఉద్యోగాలు ఆశించకుండా, సృష్టించాలన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకంగా నిలుస్తుందన్నారు. జేసీ, హబ్ డైరెక్టర్ వై.మేఘాస్వరూప్ మాట్లాడుతూ యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఇలాంటి వేదికలను వినియోగించుకోవాలన్నారు.

గ్రాఫిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణురాలు

బోలెడు ఉద్యోగాలు..

ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు బాగున్నాయి. యువతకు ఈ రంగం ఆశాకిరణంగా కనిపిస్తోంది. వీఎఫ్ఎక్స్, ఫిల్మ్‌మేకింగ్, ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ సాంకేతికత, అందులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. నాలాంటి చాలామందికి ఇలాంటి వాటిపై ఆసక్తి ఉన్నా అవగాహన లేక ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి కార్యక్రమాలతో ఎంతో ప్రయోజనం ఉంటుంది.

- సీహెచ్ లిఖిత, బీటెక్ తృతీయ సంవత్సరం

ఈ రంగంలోనూ ఏఐ..

గేమింగ్, యానిమేషన్, కామిక్స్ రంగాలకు ఎప్పటినుంచో మంచి ఆదరణ ఉంది. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుంది. వీటిలో కూడా కృత్రిమ మేధను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నా. వీడియో, స్టోరీని ఎలా రూపొందించాలో నేర్పించారు. చదువుతున్న సమయంలోనే ఇలాంటి వాటిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది.

- ఎం.సాయివర్మ, బీటెక్ తృతీయ సంవత్సరం

గేమ్స్ రూపొందిస్తా..

రెండు రోజుల కార్యక్రమాల్లో సినిమాల్లోని వీఎఫ్ఎక్స్ ఎలా ఉపయోగిస్తారో తెలుసుకున్నా. నాకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. ఆ ఆసక్తితోనే ఈ కార్యక్రమానికి వచ్చాను. పిల్లల నుంచి పెద్దల వరకు గేమింగ్ యాప్స్ చాలా ఆడుతున్నారు. వాటికి విపరీతమైన ఆదరణ ఉంది. భవిష్యత్తులో గేమ్స్‌ను రూపొందించి ఉపాధి పొందాలనే ఆలోచన ఉంది.

- కె.జాగృతి, బీఎస్సీ తృతీయ సంవత్సరం

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: డీటీవో

రాజోలు: రాజోలు మండలం కడలిలో ఈ నెల 18న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదో తరగతి విద్యార్థి యశ్వంత్ దుర్మరణం చెందడం బాధాకరమని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. దీంతో మీతోపాటు కుటుంబం కూడా క్షేమంగా ఉంటుందని హితవు పలికారు. శిరస్త్రాణం బరువుగా కాకుండా బాధ్యతగా ధరించాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం ఇవ్వొద్దని, వారు పట్టుబడితే తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంటుందన్నారు. ప్రమాదం జరిగితే తండ్రిని విచారిస్తామని చెప్పారు.

తితిదే ఆధీనంలోకి ఏవీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయం

తొండంగి, న్యూస్‌టుడే: ఏవీనగరంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తితిదే తిరుమకైంకర్య కార్యక్రమం గురువారం వేదపండితుల మంత్రోచ్చరణాల నడుమ వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాతలు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతుల చేతులమీదుగా తితిదే డీఈవో శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆలయపత్రాలు అందుకున్నారు. ఆలయ ఆస్తులు, కల్యాణ మండపాలు తదితర సామగ్రి తితిదేకు అప్పగించారు. ఈ ఆలయాన్ని యనమల 2016లో నిర్మించారు. తితిదే డీఈవో మాట్లాడుతూ.. ఆలయ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని తీసుకోవడంతో పాటు నిర్వహణ అంతా తితిదే చూసుకుంటుందన్నారు. సుప్రభాత సేవ నుంచి కల్యాణం వరకు అన్ని కార్యక్రమాలు విధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి ప్రసాదాన్ని తయారుచేసేందుకు, భక్తులకు అందించేందుకు మూడు రోజుల్లో సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు. ఆలయ నిర్వహణకు ఏడాదికి రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు అవసరం కానుందన్నారు. భవిష్యత్తులో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. యనమల రాజేష్, యనమల నాగేశ్వరరావు, చింతంనీడి అబ్బాయి, నరహరశెట్టి సూర్యప్రకాష్, కొయ్యా కేశవ, తితిదేకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తితిదే అధికారులకు పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి యనమల

కుటుంబ సభ్యులు హింసిస్తున్నారని మహిళ ఫిర్యాదు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: తనకు ఇష్టం లేని పెళ్లి చేశారని, తనను హింసిస్తుండటంతో రక్షణ కల్పించాలంటూ లంపకలోవకు చెందిన ఓ వివాహిత ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పెళ్లికి ముందే వేరే వ్యక్తిని ప్రేమించానని చెప్పినా బలవంతంగా ఇంట్లో వారు పెళ్లి చేశారన్నారు. ఇదే విషయాన్ని భర్తకు చెప్పినా హింసించారన్నారు. దీంతో పాడేరు వెళ్లిపోయానన్నారు. విడాకులు ఇప్పిస్తామని పిలిపించి అమ్మ, అన్నయ్య, పెద్దమ్మ వేధించారని, తాళి కట్టిన వ్యక్తి చంపాలని చూశారని ఆరోపించారు. తనకు తానుగానే ఇంట్లోంచి వెలుపలకు వచ్చేశానన్నారు. రక్షణ కల్పించాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. హోంమంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. ఎస్సై లక్ష్మీకాంతంను వివరణ కోరగా ఈమె కనిపించడం లేదని పాయకరావుపేట పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుపై అక్కడ విచారిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల సూచనమేరకు ఆమెకు, ఇరువైపుల కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉందన్నారు.

8 మందికి సీఈవోలుగా ఉద్యోగోన్నతి

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న 8 మంది అధికారులకు జడ్పీ సీఈవోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- డీడీవో హోదాలో పనిచేస్తున్న కాకినాడ జడ్పీ సీఈవో వీవీవీ లక్ష్మణరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డ్వామా ఏపీడీ(కాకినాడ) పి.జగదాంబ, సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న కేఎన్‌వీ ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్ సీఈవోలుగా ఉద్యోగోన్నతి పొందారు.
- డిప్యూటీ సీఈవో హోదాలో ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, అమలాపురం డీడీవో జె.వేణుగోపాల్, తూర్పుగోదావరి జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిణి రత్నకుమారిలకు పదోన్నతులు లభించాయి.

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ డ్వామా పీడీ వెంకటలక్ష్మి

సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపల్ ప్రసాద్

డ్వామా ఏపీడీ (కాకినాడ) జగదాంబ

పోస్టింగ్‌లపై తర్జన భర్జన

ఉద్యోగోన్నతులు పొందిన అధికారులను జడ్పీ సీఈవోలుగా, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలుగా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, బిల్లులు అప్‌లోడ్ చేయాలి. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో డ్వామా పీడీలు, ఏపీడీలు ఉన్న నేపథ్యంలో తక్షణం పోస్టింగ్‌లు ఇచ్చి, బదిలీ చేస్తే ప్రగతి కుంటుపడుతుందని, ఈ నేపథ్యంలో వీరికి మార్చి నెలలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉందని ఈ శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. కొత్త జిల్లాల్లో నూతన పాలకవర్గాలు ఏర్పడితే చాలామందికి సీఈవో పోస్టులు దక్కే అవకాశం ఉంది.

అభ్యంతరాల స్వీకరణకు 23 వరకు గడువు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జోన్-2(ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు) వైద్యఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుని కార్యాలయం పరిధిలో ఫార్మసీ అధికారి పోస్టులకు సంబంధించి సవరించిన ప్రొవిజనల్ ప్రతిభ జాబితా విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ పద్మాశశిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 20 నుంచి 23వ తేదీ సాయంత్రం అయిదు గంటల్లోపు రాజమహేంద్రవరంలోని ఆర్డీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించి గతేడాది అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించారు.

డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీగా రాంబాబు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జి పీడీగా డి.రాంబాబును నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లాలోనే డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్న జయచంద్రగాంధీని పలు కారణాల వల్ల కలెక్టర్ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేశారు. తర్వాత ఏపీడీ హోదాలో ఉన్న ఆదిత్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పీడీగా బాధ్యతలు చేపట్టిన రాంబాబు గురువారం కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వెబ్‌సైట్‌లో ఫార్మసీ పోస్టుల జాబితా

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2 రాజమహేంద్రవరం పరిధిలోని ఫార్మసీ ఆఫీసర్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును జిల్లా వెబ్‌సైట్లలో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో నరసింహనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 20 నుంచి 23 తేదీలోపు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

విగ్రహం గింజంత.. స్ఫూర్తి ఆకాశమంత..

మండపేట, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన కళాకారుడు దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు 18 మిల్లీగ్రాముల బంగారంతో ఛత్రపతి శివాజీ త్రీడీ విగ్రహాన్ని తయారు చేశారు. ధాన్యపు గింజ పరిమాణంలో ఉన్న దీనిని తయారు చేయడానికి రోజుకు 3 గంటల చొప్పున 15 గంటల సమయం పట్టిందని తెలిపారు. గతంలో ఈయన తయారు చేసిన పలు సూక్ష్మవిగ్రహాలకు ప్రపంచ రికార్డు దక్కింది.

వెబ్ డెవలపర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో పీఎంకేవీవై శిక్షణలో భాగంగా వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపీకృష్ణ తెలియజేశారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. వివరాలకు 90107 37998 నెంబరులో సంప్రదించాలన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

వివిధ కేసుల్లో నిందితుడి అరెస్టు

రాజోలు: చోరీ ఘటనలో నిందితులకు సహకరించిన కేసులో సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన చిలకలపూడి శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజోలు అదనపు ఎస్సై కె.నాగేశ్వరరావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది ఆదాయపు పన్ను అధికారులమంటూ హైదరాబాద్‌లో 2021లో ఓ ఇంటిపై దాడిచేసి పెద్ద మొత్తంలో నగలు, నగదు ఎత్తుకెళ్లిపోయారు. ఆ సమయంలో శ్రీనివాస్ ఎవరూ ఇంట్లోకి రాకుండా కాపలాగా ఉన్నాడు. అప్పట్లో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. జిల్లాలోని అంతర్వేదిపాలెం, శివకోటి గ్రామాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినందున పలు కేసులు నమోదు అయ్యాయి. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు అదనపు ఎస్సై తెలిపారు.

నగదు చోరీ.. అదుపులో బాలుడు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణానికి చెందిన ఓ బాలనేరస్థుడిని అదుపులోకి తీసుకుని రూ.20వేలు సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. అతన్ని రాజమహేంద్రవరం జువైనల్ పీవో(బాలనేరస్తుల ప్రొబిషన్ అధికారి) సమక్షంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల ప్రధాన రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ దుకాణంలో చోరీకి పాల్పడి రూ.22వేల సొత్తును తల్లికి ఇచ్చాడని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి అతని తల్లి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఈ నెల 24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభమవుతాయని కళాపరిషత్ ప్రతినిధులు గురువారం తెలిపారు. శ్రీఅపర్ణా సమేత నాగేశ్వరస్వామి దివ్యకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న కాకినాడ సాయి కార్తిక్ క్రియేషన్స్ సభ్యులు మధురస్వరం, 25న హైదరాబాద్ కళాంజలి సభ్యుల యాగం నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ నెల 26న గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ సభ్యులు తరమెల్లిపోతున్నదో, 28న ఎడ్లపాడు సభ్యులు అందరూ మంచివారే కాని.. నాటకాలను ప్రదర్శిస్తారన్నారు. మార్చి 1న గుంటూరు అభినయ ఆర్ట్స్ సభ్యులు సహన నాటకం ప్రదర్శిస్తారన్నారు.

కేంద్ర కారాగారంలో వసతుల పరిశీలన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలను గురువారం సాయంత్రం బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం సందర్శించింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలు, వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న భోజన వసతులు, బ్యారక్‌లు, పరిశుభ్రత, జైలు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, బేకరీ విభాగం, జైలు వంటశాల ప్రాంతాలను అధికారుల బృందం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. మహిళా ప్రత్యేక కారాగారం పర్యవేక్షణాధికారిణి వసంతకుమారి, జైలు వైద్యాధికారిణి పి.భావన, జిల్లా స్థాయి అధికారులు బి.దిలీప్‌కుమార్, ఎండీ ఘుజుద్దీన్, కె.రాబర్ట్‌పాల్, డాక్టర్ ఇందిరాభారతీరాయ్, సుభాషిణి, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిషోర్ తదితరులు

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50 లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

Properties Bazar's @ Kakinada Touch Your Luck, Buy Plot & Win Plot, Free Lucky Draw with Guaranteed Prizes. Cell: 9154184236

RAJAMAHENDRAVARAM RURAL

రాజమండ్రి పిడింగొయ్యి పంచాయతీలో DTCP అప్రూవ్డ్ కలిగిన N/E 272 చ॥గ॥లు, N/F 272 చ॥గ॥ల స్థలములు అమ్మకం. Contact: 7382 19 4444.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Wanted Marketing Executives in Rajahmundry, Kakinada Areas. Salary 18,000 to 20,000. Lakshmi Sanjani Garments. Send resume to whatsapp Cell: 95050 66887.

WANTED: Telecallers for Reputed Overseas Edu Consultancy in Rajahmundry. Experence Preferred. Contact Cell: 98521 59999.

రాజమండ్రి దేవిచౌక్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ M/F కావలెను. Qul: డిగ్రీ. ✆ 99898 76799.

శ్రీలక్ష్మివెంకటేశ్వర వెహికల్ ఫైనాన్స్ కొరకు ఆఫీస్ బోయ్, కలెక్షన్ బోయ్స్, 30-35 సం॥గల హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96662 19999.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ (Male) కావలెను. Contact Cell: 80991 91919.

రాజమండ్రి విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేయుటకు Asst. అకౌంట్స్ (F) కావలెను. బీకామ్ ఫ్రెషర్, టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి. ✆ 85006 44978.

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ కాకినాడలో కొత్తశాఖ కోసం డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. వయస్సు: 35 సం॥రాలు పైబడిన వారు. జీతం: 75,000/- వరకు+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. సంప్రదించండి: 6361185310.

రాజమండ్రిలో ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు వంటమనుషులు, లేడీ వార్డెన్, ఆయా కావలెను. జీతం + వసతి + భోజనం. Cont: 94937 15552

కడియంలో ప్రముఖ నర్సరీలో పనిచేయుటకు అనుభవం గల అకౌంటెంట్ (M/F) కావలెను. Contact Cell: 99488 36667.

FACULTY/ TEACHERS

Wanted Teachers to teach Primary & Higher English & Science Fluency in English is must. GopiKrishna EM High School, Gandhipuram-1, Rajahmundry. 8374208700, 9515542339

SECURITY GUARDS

Wanted Security Guard: Night Duty 8 pm to 6 am, Salary: Rs.12,000/- Per Month, Work is at Kakinada. Contact: 95020 97778.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రహదారి భద్రత నియమాలు పాటించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చింతూరు, న్యూస్‌టుడే: వాహనదారులు రహదారి భద్రత పాటించి వాహనాలు నడపాలని ఎస్సై రమేష్ పేర్కొన్నారు. గురువారం పోలీస్ స్టేషన్ ఎదుట వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే జైలు శిక్ష పడుతుందని, ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని వివరించారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ పదోన్నతులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆశ్రమ పాఠశాలల్లో భాషా పండితులైన తెలుగు, హిందీ, పీఈటీల పదోన్నతులను పారదర్శకంగా నియమిస్తామని గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక పీఎంఆర్‌సీలో ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులుగా 9మందిని భర్తీ చేశామన్నారు. ఎస్టీయూ ప్రతినిధులు ఎల్.వేణుగోపాల్, కృష్ణ, భూషణం, యూటీఎఫ్ నేతలు చుక్కా సనాతనబాబు, కారం సూరిబాబు, మహేష్, లండా వెంకటేశ్వర్లు, ఏటీవో చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రుక్మాంగదయ్య

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అడ్డతీగల, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులోనూ ఉన్నతంగా రాణించాలని అడ్డతీగల జడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి అన్నారు. అడ్డతీగల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న వీడ్కోలు సమావేశంలో ప్రదర్శించిన పలు నృత్యాలు, గేయాలు చూపరులను అలరించాయి. పాఠశాల హెచ్ఎం వెంకటలక్ష్మి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

క్రికెట్ విజేత చింతూరు జట్టు

చింతూరు, న్యూస్‌టుడే: మండలంలోని కారంగూడెంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో చింతూరు జట్టు విజేతగా నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్‌లో చింతూరు, రామన్నపాలెం జట్లు తలపడగా 40 పరుగుల తేడాతో చింతూరు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని తెదేపా మండల అధ్యక్షుడు జమాల్ ఖాన్ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన రామన్నపాలెం జట్టుకు నగదు, జ్ఞాపికను అందజేశారు. పోటీల నిర్వహణ ప్రైజ్‌మనీ, బహుమతులను జమాల్ ఖాన్ ట్రస్టు ద్వారా అందించారు. ట్రస్టు సభ్యులు వినోద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు కప్పు అందజేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ 10 - మ 1 రంపచోడవరం 9490877172 అడ్డతీగల 9491575045 దేవీపట్నం 7673936638 గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి మండలంలో నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో కాకవాడ గండి సమీపంలోని మలుపు ప్రమాదకరంగా మారింది.
- సత్యనారాయణ, మారేడుమిల్లి

పరిష్కారం: మలుపు వద్ద అవసరమైన రక్షణ చర్యలు చేపడతాం.
- ప్రదీప్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, మారేడుమిల్లి
- న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సమస్య: వై.రామవరం మండలంలో వీధి రోడ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
-వాసు, వై.రామవరం

పరిష్కారం: ఎక్కడ వీధి రోడ్డు అవసరమో గుర్తించి రోడ్డు నిర్మాణాల ప్రతిపాదనలు పంపిస్తాం.
- బాలన్నదొర, ఎంపీడీవో
- న్యూస్‌టుడే, వై.రామవరం

ప్రతిభను గుర్తించడానికి అవకాశం

కూనవరం, న్యూస్‌టుడే: మండలాల్లోనూ ప్రీమియర్ లీగులు నిర్వహించడంతో క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించడానికి చక్కని అవకాశం ఉంటుందని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ అన్నారు. కూనవరం పోలీస్ మైదానంలో యువత నిర్వహిస్తున్న ఉమెన్స్ చంద్రబోస్ ఎస్ మెమోరియల్ క్రికెట్ (కూనవరం ప్రీమియర్ లీగ్) పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారికి పెద్ద ప్రీమియర్ లీగ్‌ల్లో అవకాశం దొరుకుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాగైన క్రీడాకారుల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. టోర్నమెంట్ మొత్తంలో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికైన వారికి ఐటీడీఏ నుంచి ప్రోత్సాహకం ఉంటుందన్నారు. బాలికల ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తే ఐటీడీఏ సహకరిస్తుందన్నారు. అనంతరం మొదట పోటీలో తలపడిన చొప్పల్లి, వీఆర్‌పురం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వీఆర్‌పురం జట్టుపై చొప్పల్లి విజయం సాధించింది. చొప్పల్లి నుంచి భద్రం 40 పరుగులు, రెండు వికెట్లు తీసి ఉత్తమ ప్లేయర్ అవార్డు అందుకున్నారు. కూటమి నాయకులు ఎడవల్లి భాస్కర్‌రావు, నరేంద్ర, రామారావు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీవో శుభంనొఖ్వాల్

సమస్యలకు నిలయంగా... ఆశ్రమ పాఠశాల

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఆశ్రమ పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. మారేడుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేక, మురుగునీరు పారే డ్రైనేజీ నిర్మాణ లోపం ఉండడంతో దుర్వాసన తప్పడం లేదు. అడుగడుగునా సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ఆశ్రమ పాఠశాలలో సుమారు 280 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి తోడుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతోన్న మరో వంద మందికి ఇక్కడే వసతి సదుపాయం కల్పిస్తున్నారు.

మారేడుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

చిన్న పాకలోనే వంటలు

కళాశాల విద్యార్థుల కోసం వంటలు చేయడానికి వంటగది లేకపోవడంతో చిన్న పాకలోనే తయారు చేస్తున్నారు. అది ఎప్పుడు పడిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. డైనింగ్ హాలులో టేబుళ్లు లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చుని, ఆరు బయట భోజనాలు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా వసతులు

ఇంతమంది విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన వాటికి నీటి సదుపాయం లేకపోవడంతో పాటు, తలుపులు ఇతరత్రా విరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. తీవ్ర దుర్వాసన వల్ల అటువైపుగా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా విద్యార్థులంతా కాలకృత్యాల కోసం కొండవాగు వద్దకు వెళ్లాల్సి అగత్యం ఏర్పడింది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురవడంతో తాగునీరు లేక అందుబాటులో ఉన్న నీటినే తాగుతున్నారు. అలాగే పాఠశాలలో వాడకం నీటితో పాటు, మురుగు పారేందుకు నిర్మించిన డ్రైనేజీలు నిర్మించారు. నిర్వహణ లోపం వల్ల మురుగు అక్కడే నిలిచిపోతోంది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

వై.రామవరం: జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా చెట్లను తొలగించాల్సిన కారణంగా గంగవరం-అడ్డతీగలకు వచ్చే 33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో నేడు సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ వెంకటరమణ తెలిపారు. అడ్డతీగల మండలం, వై. రామవరం మండలాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని అన్నారు. అడ్డతీగల గ్రామంలో మాత్రం విద్యుత్తు అందుబాటులో ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలి

రాజవొమ్మంగి న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఏకీకృత కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని విద్యానగర్, శాంతినగర్, వయ్యేడు, బూరుగుపల్లి తదితర ప్రాంతాల్లో జరుగుతోన్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలను చేరువ చేయడానికి సర్వే దోహదపడుతుందన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెంలోని సద్గురు ప్రసన్న సాయి మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు ప్రత్యేక హారతి, పంచామృతాభిషేకాలు, పల్లకీ సేవ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాబాకు క్షీరాభిషేకం చేస్తోన్న సాయి సేవకుడు

సూరంపాలెంలో ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్యశిబిరం

గంగవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ డా.తీగల ప్రభ, సూరంపాలెం మాజీ సర్పంచి ఎస్.నారాయణరావు కోరారు. గురువారం సూరంపాలెంలో ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వైద్యాధికారి ప్రసాద్ ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ గోపాలకృష్ణ , ల్యాబ్ సిబ్బంది స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది నాని, ఏఎన్ఎం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోగులకు వైద్యసేవలందిస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది

ఉపవాస దీక్షలు ప్రారంభం

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టులోని గ్రామాల్లోని మసీదుల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉంటూ ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు. మోతుగూడెం మసీదు గురువు మహ్మద్ వజీర్ ఆధ్వర్యంలో గురువారం ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మసీదులను అందంగా ముస్తాబు చేశారు.

వేసవి రాకముందే విద్యుత్తు వెతలు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: విలీన మండలాల్లో వేసవి రాకముందే విద్యుత్తు వెతలు ప్రారంభమయ్యాయి. గత పక్షం రోజులుగా పగలు, కొన్నిసార్లు రాత్రివేళ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కూనవరం, వీఆర్‌పురం మండలాలకు ఒకటే విద్యుత్ ఉపకేంద్రం ఉండడంతో ఒకేసారి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వీఆర్‌పురం మండలానికి ప్రత్యేక విద్యుత్ ఉపకేంద్రం లేకపోవడం ప్రజల ఇబ్బందులకు ఒక కారణం. ఈనెల మొదటి వారం నుంచి మరమ్మతుల పేరుతో సరఫరాలో కోతలు ఎక్కువయ్యాయి. విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపించడంతో, విద్యుత్తు అంతరాయం వల్ల అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

గంజాయి వినియోగంతో జీవితం చిత్తు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: గంజాయి వినియోగంతో వ్యక్తుల జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయని రాజవొమ్మంగి ఎస్సై శివకుమార్ అన్నారు. డి.మల్లవరంలో గురువారం మహిళలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు, సైబర్ మోసాలు, నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే అకృత్యాలకు చట్టపరమైన రక్షణలు, చట్టాలు ఉన్నాయని చిన్నారులపై జరిగే లైంగిక దాడుల నివారణకు పోక్సోచట్టం ఎంత కీలకమో తెలిపారు.

21న సర్వసభ్య సమావేశం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఇమ్మానుయేల్ గురువారం తెలిపారు. రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఈ సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరవ్వాలని అన్నారు.

జెన్‌కో ఉద్యోగులకు జీవిత బీమాపై అవగాహన

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టులోని జెన్‌కో ఉద్యోగులకు గురువారం ఉద్యోగుల సమావేశ మందిరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్ లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రాజమహేంద్రవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ మౌనిక పొదుపు, పెన్షన్, స్వల్పకాలిక పెట్టుబడి ప్రణాళికలు, జీవిత బీమా కవర్‌పై డిజిటల్ బోర్డుపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీర్ కె.వెంకట రాజారావు హాజరయ్యారు. ఓఅండ్ఎం ఎస్ఈ చిన కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాలకృష్ణ, వరప్రసాద్, ఎస్ఏవో ప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీ సాజిద్ అలీ పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత భవిష్యత్తుపై దృష్టి సారించాలి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థినులు చదువుపై శ్రద్ధపెట్టి, ఉన్నత భవిష్యత్తు నిర్మించుకోవాలని మారేడుమిల్లి సీఐ టి.గోపీనరేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మారేడుమిల్లి మండలం బోదులూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజన విద్యకు ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సాహాన్ని, మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఏఎస్సై కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

గంగవరం, న్యూస్‌టుడే: ఇంటింటికి రక్షిత మంచినీరు అందిచడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సర్పంచి పాయం రాజులమ్మ అన్నారు. మండలంలోని రాజంపాలెంలో గురువారం జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. పెసా ఉపాధ్యక్షుడు కుంజం వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచి కలుముల ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న సర్పంచి

వరుస చోరీలు.. జనాల బెంబేలు

గంగవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయని వాటిలో కొన్ని పోలీస్ శాఖ దృష్టికి వస్తుంటే మరికొన్ని దృష్టికి తీసుకువెళ్లడం లేదని, రాత్రివేళ ఇళ్లల్లో చోరీలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యవసాయ పొలాల్లో విద్యుత్తు మోటార్లు, సోలార్ పలకలను దొంగలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

గంగవరంలో మందుల దుకాణం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

తరచూ ఘటనలు..

ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి గంగవరం పోలీస్ స్టేషన్ సమీపంలోని ఒక ఇంటి వద్ద ద్విచక్రవాహనం అపహరణకు గురైంది. అదే రోజు అడ్డపల్లి వద్ద మరో వాహనాన్ని దొంగలించిన వ్యక్తులు పాత బ్యాంకు వీధిలో మరోసారి దొంగతనానికి ప్రయత్నించగా కేకలు వేయడంతో పారిపోయారని స్థానికులు చెబుతున్నారు. అలాగే అయిదు రోజుల క్రితం కొమరవరం గ్రామానికి చెందిన ఒక మహిళ ఇంటి వద్దకు యువకులు కోళ్లను కొనుగోలు చేయడానికి వచ్చామని గంగవరం ఏటీఎం వద్ద నగదు తీసి ఇస్తామని నమ్మించారు. సదరు మహిళ గంగవరం వెళుతోన్న క్రమంలో మార్గం మధ్యలో ఆమె చేతిలో ఉన్న కోళ్లను, ఆభరణాలను అపహరించి పారిపోయారు. అవి బంగారు ఆభరణాలు కాకపోవడంతో ఫిర్యాదు చేయలేదని సమాచారం.

సోలార్ పరికరాలు మాయం...

2019కి ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన సోలార్ బోర్లకు సంబంధించిన పరికరాలు, పలకలను దొంగలు రాత్రుళ్లు మాయం చేస్తున్నారు. మండల పరిధిలోనే ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయని పలువురు చెబుతున్నారు. అలాగే జాతీయ రహదారి వెంబడి ఏర్పాటుచేసిన సోలార్ సిగ్నల్ లైట్లు, పలకలను సైతం మాయం చేస్తున్నారు. 4రోజుల క్రితం పాత గంగవరంలోని ఓ మెడికల్ షాపులో చోరీ చేశారు. దీనిపై గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై వెంకయ్య, అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి కాకినాడ క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా వారు ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా....

అడ్డతీగల సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లు, షాపుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో దొంగతనాలను తగ్గించి, త్వరితగతిన పట్టుకోవడానికి వీలుంటుంది.
- నరసింహమూర్తి, సీఐ, అడ్డతీగల

22న నెల్లిపాకలో ఉచిత వైద్య శిబిరం

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఈ నెల 22న ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హైదరాబాద్ కేర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో గుండె, వెన్నెముక, తల, స్త్రీల సమస్యలు, కీళ్ల నొప్పులు, క్యాన్సర్, సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, 2డీఎకో, అల్ట్రా సౌండ్, సోనోగ్రఫీ.. తదితర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 21 తేదీ వరకు స్థానిక పీహెచ్‌సీ వద్ద వాలంటీర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేస్తారని, దూర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారురిజిస్ట్రేషన్‌కు 9502620618, 9848920652 నంబర్లను సంప్రదించాలన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలిగా స్వర్ణ

ఎటపాక, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి సభ్యురాలిగా మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా పార్టీ సభ్యురాలు కందుకూరి స్వర్ణ ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన హక్కులు, భూ సమస్యలు, పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతున్న ఆమెకు రాష్ట్ర సమితి సభ్యురాలిగా స్థానం కల్పించడంపై పలువురు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకముంచి అవకాశం ఇచ్చిన పార్టీ అభివృద్ధి కోసం సాయశక్తులా కృషిచేస్తానని ఆమె తెలిపారు.

జీడిగింజ కాదండోయ్..

రాజవొమ్మంగి మండలంలోని చినరేలంగిపాడుకి చెందిన వి.రాజా ఇంటి పెరట్లో పెరిగిన టమాట మొక్కకు కాసిన కాయల్లో ఒకటి జీడి గింజ మాదిరిగా ఉండటంతో అబ్బురపరుస్తోంది. దీనిపై జిల్లా ఉద్యానశాఖాధికారి దేవదానం మాట్లాడుతూ జన్యుపరమైన లోపంతో ఇలాంటి ఆకృతులు వస్తాయన్నారు. - న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

రాళ్లు తేలిన రహదారి

రాజవొమ్మంగిలోని 99 భవనాల సముదాయం నుంచి మొల్లిమెట్ల వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. ఐసీడీఎస్ కార్యాలయం, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ, గురుకుల పాఠశాల, కళాశాలకు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. రాళ్లు తేలి, గోతులతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

శిథిల భవనాలే సిబ్బంది నివాసాలు

వై.రామవరంలో ఆరోగ్య సిబ్బందికి నిర్మించిన భవనాలు శిథిలస్థితికి చేరాయి. గతంలో ఈ భవనాలను నిర్మించినప్పటికీ మరమ్మతులు చేపట్టక పోవడంతో పూర్తి స్థాయిలో శిథిలమయ్యాయి. సిబ్బంది భవనాలు నివాసానికి ఇబ్బందికరంగా ఉండడంతో, గ్రామంలో అద్దె భవనాలు అందుబాటులో లేక దూర ప్రాంతాల నుంచి ప్రయాణించి విధులను నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలను నిర్మించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వై.రామవరం

రంపచోడవరం ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా స్వామిదొర

రంపచోడవరం: భారత ఆదివాసీ పార్టీ రంపచోడవరం డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మండలంలో తామరపల్లి గ్రామానికి చెందిన కుంజం స్వామిదొర నియమితులయ్యారు. తనను డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మద్దేటి అంజిరెడ్డి నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన గురువారం తెలియజేశారు.

చెరువులు ఇలా... నీరు నిలిచేదెలా..?

కూనవరం, న్యూస్‌టుడే: మండలంలో పంట కాలువలు లేకపోవడంతో రైతులు నీటి వనరుల కోసం ఆకాశం వైపు ఆశగా చూడడం తప్ప మరో మార్గం లేదు. వర్షాకాలంలో కురిసిన వానలతో నిండిన చెరువులే వీరికి ప్రధాన ఆధారం. మండలంలోని 16 పంచాయతీల్లో సుమారు 50 వరకు చెరువులు ఉన్నాయి. వీటి కింద సుమారు 8వేల ఎకరాల వరకు సాగు జరుగుతోంది. గతంలో ప్రతి చెరువు 10-20 అడుగుల లోతు ఉండి నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉండేది. ఆ నీటితోనే సాగుదారులు ఏడాదంతా పంటలను పండించే వారు. కాలక్రమంలో చెరువులకు పూడిక తీతలు లేకపోవడంతో నీటి నిల్వలు నామమాత్రంగా మారుతున్నాయి.

నీటి కోసం అవస్థలు

ఫలితంగా సాగు మొదలు పెట్టిన 2 నెలలకే నీటి కోసం అవస్థలు తప్పడం లేదు. రబీలో వేసే మిర్చి, లంక పొగాకు, మొక్కజొన్న వంటి పంటలకు నవంబరు, డిసెంబరు నెలల్లో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో పంటలకు తడి పెట్టడానికి నీరు అందడం లేదు. చెరువుల్లో పూడిక తీయకపోవడంతో తూటి కాడలు, పిచ్చి మొక్కలు పెరిగి ఉన్న కొద్దిపాటి ప్రాంతాలను ఆక్రమిస్తున్నాయి. దీంతో లోతు కోల్పోయిన చెరువులు కొద్దిపాటి వర్షాలకే నిండి పొర్లి పోతున్నాయి. తర్వాత కొద్దిరోజులకే ఉన్న నీరు ఆవిరి అయిపోతుంది. ఏటా ఉపాధిహామీ పథకంలో భాగంగా పూడికలు తీయిస్తున్నా... వాటిలో తూటి కాడలను తొలగించకుండా మైదానంలా ఉన్న ప్రాంతాల్లోనే తవ్వకాలు చేయడంతో అవి చెరువులను మరింతగా ఆక్రమిస్తున్నాయి. వీటి వల్ల రైతుల అవసరాలకు సాగు నీరు అందడం లేదు. అధికారులు స్పందించి చెరువుల్లో ఉన్న తూటికాడలు, పిచ్చి మొక్కలను తొలగించి యంత్రాల సాయంతో పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో నిండిపోయిన భీమవరం చెరువు

నిబంధనలు మారాయి

మారిన నిబంధనల ప్రకారం చెరువు కట్ట నుంచి 50 మీటర్ల లోపు మాత్రమే తూటికాడ తొలగించగలరు. అంతకన్నా ఎక్కువ దూరం ఉంటే కూలీలకు మట్టి మోయడం కష్టమవుతుంది. ఆ కారణం చేత ఈ నిబంధన పెట్టారు. 50 మీ దాటితే అది నీటి పారుదల శాఖ పరిధిలో ఉంటుంది. త్వరలో సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తాం.
- ఏపీవో, శ్రీకాంత్, కూనవరం

కోడి పందేలపై దాడి

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని ఇందుకూరుపేటలో గురువారం సాయంత్రం కోడి పందేలపై దాడి చేశామని ఎస్సై షరీఫ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది వ్యక్తులు, అయిదు ద్విచక్రవాహనాలు, నగదు, రెండు కోళ్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

(c) eenadu

రూ.58 వేలు పలికిన ఏడాది వయసున్న పెయ్య

ఒంగోలుకే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మేలు జాతి పశువుల గురించి ఎంత చెప్పినా తక్కువే. వీటికి ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. వీటిని వేలం పాటలో దక్కించుకునేందుకు ఇతర జిల్లాలు, సుదూర ప్రాంతాల నుంచి రైతులు తరలివస్తున్నారు. ఎంత ధర వెచ్చించి అయినా కొనుగోలు చేసేందుకు వెనుకాడడం లేదు. - ఈనాడు, ఒంగోలు

ఒంగోలు గిత్త... భలే సత్తా!

● కొనుగోలుకు వేలంలో పోటాపోటీ ● ఇతర జిల్లాల నుంచి రైతుల రాక

చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రంలో నాణ్యమైన ఒంగోలు జాతి పశువులను ఉత్పత్తి చేస్తున్నారు. ఏటా ఇక్కడ పుట్టే దూడలను కొన్నింటిని ఉంచుకుని మిగిలినవి వేలంలో రైతులకు విక్రయిస్తారు. తాజాగా గురువారం పశుసంవర్ధకశాఖ డీడీ జయచంద్ర, జేడీఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో రైతులు పోటీపడి కొనుగోలు చేశారు. ఏడాది వయసున్న పెయ్య రూ.58 వేలు ధర పలికింది. సాధారణంగా ఇంతే వయసున్న ఇతర రకం ఆవు రూ.25 వేలే ఉంటుంది. ఇది మేలుజాతి కావడంతో వేలంలో పోటీపడి మరీ దక్కించుకున్నారు. గతంలో కోడెలను మాత్రమే కొనేందుకు మొగ్గు చూపేవారు. ఇప్పుడు వాటితో సమానంగా పెయ్యలకు గిరాకీ పెరిగింది. హైదరాబాద్‌లో గోశాల నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రత్యేకించి ఒంగోలు బ్రీడ్‌పై మక్కువతో పశువులను వేలంలో దక్కించుకుని తీసుకెళ్లారు. గొనసపూడికి చెందిన మహిళా రైతు మల్లేశ్వరి మాట్లాడుతూ తాము ఒంగోలు జాతి ఆవులను పెంచాలనే కోరికతో ఇక్కడికొచ్చామని, వేలంలో ఒకటి మాత్రమే దక్కించుకోగలిగామన్నారు. ఇదే మాదిరి 21 పెయ్య దూడలు, 33 కోడెలు, 5 ఆవులను పోటీపడి కొనుగోలు చేయడంతో మంచి ధర దక్కింది.

పెరిగిన ఆదాయం

గతంలో వేలంపై అవగాహన లేకపోవడంతో పోటీ చాలా తక్కువ ఉండేది. వీటిని తీసుకెళ్లి ఆరు నెలల పాటు పెంచితే రెండు రెట్లు డబ్బులిస్తామని ఆఫర్లు వస్తున్నాయి. ఆ నోటా ఈ నోటా ఒంగోలు జాతి పశువుల విశిష్టత తెలియడంతో రెట్టింపు ధరలకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం 59 పశువులకు రూ.5.78 లక్షలు ధర నిర్ణయించగా, వేలంలో రూ.12.34 లక్షల ఆదాయం లభించింది. దాదాపు 60 శాతం అదనంగా ఆదాయం వచ్చింది. గతేడాది జులైలో 46 పశువులకు నిర్వహించిన వేలంలో రూ.9.84 లక్షల ఆదాయం వచ్చింది. రూ.5 లక్షల ధర నిర్ణయించగా, దాదాపు రెట్టింపు ఆదాయం సమకూరింది.

ఇదే ఈ జాతి గొప్పతనం

ఒంగోలు జాతి పశువులు బలిష్ఠంగా, ఎత్తుగా ఆకర్షణీయంగా ఉండడమే కాకుండా కోడెలు బరువులను అలవోకగా లాగుతాయి. ఎడ్ల పందేలకు కోడెలను కొనేవారు ఉన్నారు. ఆవులు పెంచేవారి సంఖ్య పెరగడం, మేలుజాతి పశువుల గురించి ప్రజలకు బాగా తెలియడం వంటి కారణాలతో వీటికి పోటీ బాగా పెరిగింది. వీటిని కొనేవారిలో 80 శాతం మంది రైతులే ఉంటున్నారు. మిగిలినవారు కోడెలను కొని వాటిని దున్నడానికి శిక్షణనిచ్చి రైతులకు అమ్ముతున్నారు.

-డాక్టరు రవి, పర్యవేక్షకులు, చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం

ఘనంగా రథోత్సవం

మహాశివరాత్రి సందర్భంగా కొత్తపట్నం మండలం మడనూరులో శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రథోత్సవంతో ఘనంగా ముగిశాయి. హరిహర మహాదేవ శంభో శంకర అంటూ పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

ఇలా ప్రయాణం... కాదా ప్రమాదం?

నిబంధనలకు విరుద్ధంగా కిక్కిరిసిన ప్రయాణికులతో వాహనాలు దూసుకెళుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా చోదకులు, ప్రయాణికుల తీరులో మార్పు రావడం లేదు. యజమానులు తమ పొలాల్లో పనుల నిమిత్తం ఒక్కో మినీ వాహనంలో 30 మందికి తగ్గకుండా కూలీలను తరలిస్తున్నారు. తాళ్లూరు తదితర ప్రాంతాల్లో ఇవి నిత్యకృత్యంగా మారాయి. -న్యూస్‌టుడే తాళ్లూరు

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పొదిలి, న్యూస్‌టుడే: రంజాన్ నెల ప్రారంభం కావడంతో గురువారం నుంచి ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీక్షాపరులు మసీదుల్లో సహరీ, ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. మసీదుల్లోని మినార్లను విద్యుద్దీపాలతో అలంకరించారు.

పొదిలి మసీదులో ఉపవాస దీక్షలు విరమిస్తున్న ముస్లిం సోదరులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్
శుక్రవారం సా.6-21
సహరీ
శనివారం ఉ.5-12

నేడు తెదేపా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించనున్న సమావేశంలోని అజెండా అంశాల దృష్ట్యా తాడేపల్లిలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని తెదేపా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు.

నూరు శాతం ఉద్యోగ కల్పన

◆ ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చర్యలు
◆ ప్రాంగణ ఎంపికల్లో 35 మంది కొలువుల సాధన

న్యూస్‌టుడే, ఒంగోలు విద్య

నూరు శాతం ఉద్యోగ కల్పన దిశగా ఒంగోలు నగరంలోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అడుగులు వేస్తోంది. చెన్నైకు చెందిన రాణే గ్రూపు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ట్రిపుల్‌ఈ విభాగానికి చెందిన 35 మంది విద్యార్థులు కొలువులు సాధించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న చివరి సంవత్సరం విద్యార్థులను కూడా ప్రాంగణ ఎంపికలకు ఆహ్వానించారు. మొత్తం 80 మందిలో 70 మందిని డిప్లొమా ఇంజినీర్ ట్రైనీ పోస్టులకు ఎంపిక చేశారు. సెయింట్‌ఆన్స్, పేస్ తదితర కళాశాలల నుంచి మెకానికల్, ఈసీఈ విద్యార్థులు 35 మంది ఎంపికయ్యారు. త్వరలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని కళాశాల ప్రిన్సిపల్ నర్రా శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఇప్పటికే 70శాతం మందికి అవకాశాలు: పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, కంప్యూటర్ కోర్సులకు గిరాకీ ఉంది. తొలిదశలో కంపెనీలు ఆయా విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. సివిల్ విభాగం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరగాల్సి ఉంది. ఈ ఏడాది ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చివరి సంవత్సరం విద్యార్థులు మొత్తం 90 మంది ఉండగా, వారిలో కొంతమంది ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు. ఆయా కంపెనీలే శిక్షణ అనంతరం ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించాయి. డెల్ఫీ, టీవీఎస్ లాంటి సంస్థలు శిక్షణతోపాటు ఉద్యోగ కల్పనకు ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతం కన్నా ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. తమ వద్ద చదువుతున్న 90 మంది విద్యార్థులకు ప్రాంగణంలోనే ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు మరోసారి ప్రాంగణ ఎంపికలు ఉంటాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటే అవకాశాలకు కొదవ లేదన్నారు.

ప్రాంగణ ఎంపికలకు హాజరైన పాలిటెక్నిక్ చివరి సంవత్సరం విద్యార్థులు

నుయ్యి కాదండోయ్.. గొయ్యి ఉందండోయ్

ఒంగోలు- కర్నూలు రహదారిలో సంతనూతలపాడు వద్ద ఏడాది కిందట కల్వర్టు ఓవైపు కుంగిపోవడంతో భారీ గుంత పడింది. రోడ్డు కుంగిపోతుండడంతో ఐరన్ బీమ్స్ దన్నుగా పెట్టారు. రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.
-ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, ఎస్ఎన్‌పాడు



ఒంగోలుకు సాగర్ జలాలు

◆ వేసవి చెరువుల్లో 47 శాతం నిల్వలు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరపాలక సంస్థ

రానున్న వేసవిలో ఒంగోలు నగర ప్రజలకు ఇబ్బంది రాకుండా చెరువులు నింపే కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కలెక్టర్ రాజాబాబు వేసవి చెరువులు నింపడానికి నీరు విడుదల చేయాలని ఎన్ఎస్‌పీ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు గురువారం రామతీర్థం జలాశయం నుంచి వస్తున్న నీటిని చెరువులకు మళ్లించారు. కొన్ని రోజులుగా సాగర్ నీరు వస్తున్నప్పటికీ రైతుల అవసరాలకు వినియోగిస్తున్నారు. వారాబందీ పద్ధతిలో పొలాలకు, వేసవి చెరువులకు సరఫరా చేయనున్నారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావు, ఏఈలు ఈతముక్కల మేజర్ వద్ద కాలువ ప్రవాహాన్ని పరిశీలించారు. మార్గమధ్యంలో ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు పహారా ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం ఒకటో వేసవి చెరువులో 1,900 మిలియన్ లీటర్లకు 1157 మిలియన్ లీటర్లు, రెండో వేసవి చెరువులో 3,500 ఎంఎల్‌కు 1,585 ఎంఎల్ నీటి నిల్వ లున్నాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నింపితే జూన్ వరకు తాగునీటికి ఇబ్బంది ఉండదని అంచనా వేశారు. రెండు చెరువులు నిండే వరకు సాగర్ నీరు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

చెరువులకు వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పరీక్షలకు గుండ్లకమ్మ నీరు: గతంలో సాగర్ నీటితో పాటు గుండ్లకమ్మ జలాశయం నుంచి నగరానికి రా వాటర్ తీసుకునేవారు. జలాశయంలో నీరు రంగు మారి వాసన వస్తుందని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో తాత్కాలికంగా సరఫరా నిలిపివేశారు. గతేడాది జూన్ నుంచి కేవలం సాగర్ నీరు మాత్రమే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. భవిష్యత్తులో గుండ్లకమ్మ నీరు అవసరం అవుతుందని భావించి నీటి పరీక్షలు చేయించేందుకు ఇటీవల నమూనాలను విజయవాడలోని ప్రభుత్వ ప్రయోగశాలకు పంపారు. నీటి వాడకం వల్ల ఇబ్బంది లేదని నివేదిక వస్తే ఆ నీటిని కూడా తీసుకోవాలని అధికారులు యోచిస్తున్నారు.

విద్యార్థి మరణంపై వీడని మిస్టరీ

• సింగరాయకొండ వసతిగృహంలో అనుమానాస్పద మృతి
• విచారణలో అడుగడుగునా యంత్రాంగం నిర్లక్ష్యం

ఈనాడు, ఒంగోలు, సింగరాయకొండ గ్రామీణం

'మా కుమారుడి మృతి వెనుక వార్డెన్ పాత్రపై అనుమానం ఉంది. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిపించండి..' అని బాధిత కుటుంబం కలెక్టర్ రాజాబాబును కోరింది. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఈవో, ఐసీడీఎస్ పీడీ, సింగరాయకొండ తహసీల్దారుతో కమిటీ వేసి నాలుగు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది జరిగి నాలుగు రోజులవుతున్నా కమిటీ సభ్యులు విచారణ చేపట్టలేదు. విద్యార్థి మృతి చెందిన క్రమంలో పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు చేపట్టడంతోపాటు వసతిగృహంలో విచారణ జరిపితే ఆధారాలతో అది హత్య లేక ఆత్మహత్యా అన్నది తేలుతుంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 14వ తేదీన సింగరాయకొండలోని చైతన్య శిక్షణ కేంద్రం, వసతి గృహంలోని మరుగుదొడ్డిలో విద్యార్థి మృతిపై మిస్టరీ కొనసాగుతోంది.

ముందే సమాచారమివ్వలేదు...

కనిగిరికి చెందిన సయ్యద్ ఆలీ కుమారుడు సయ్యద్ తౌషిక్ నవోదయ ప్రవేశ పరీక్షకు సింగరాయకొండలో ఏడాదిగా శిక్షణ పొందుతున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం అయిదు గంటల సమయంలో తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం ఆరు గంటలకు శిక్షణ కేంద్రం నిర్వాహకులు తౌషిక్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కుమారుడు టవల్‌తో బాత్రూంలో ఉరేసుకుని చనిపోయినట్లు సమాచారమిచ్చారు. బాత్రూంలో గడియ పెట్టుకుని ఉరేసుకోగా, తాము లోపలికి దిగి తలుపు తీసి వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించామని, అక్కడ నుంచి కందుకూరు తీసుకెళ్లామని చెప్పారు. విద్యార్థిని కందుకూరు తీసుకెళ్లే వరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు సంతోషంగా మాట్లాడడని, ఫోన్ మాట్లాడిన అనంతరం వార్డెనే తమ కుమారుడిని చంపేసి ఉంటాడని, దర్యాప్తు సక్రమంగా చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ముగ్గురు అధికారులతో కమిటీ వేసినా వారు కాలయాపన చేస్తూ వస్తున్నారు. దర్యాప్తు సక్రమంగా నిర్వహించి తమ కుమారుడి మృతికి కారణమైన వారిని శిక్షించాలని తౌషిక్ తల్లిదండ్రులు కోరుతున్నారు. వసతి గృహం నుంచి బాలుడిని భుజంపై మోసుకుని బయటకు తీసుకొస్తున్న సీసీ కెమెరా దృశ్యాలు తాజాగా వైరల్ అవుతున్నాయి.

కందుకూరు పోలీసుల దర్యాప్తు

సింగరాయకొండ పోలీసులు పక్షపాతం చూపిస్తున్నారని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించడంతో దర్యాప్తును కందుకూరు పోలీసులకు అప్పగించారు. వీరు ఇప్పటికే వసతి గృహం, బాలుడిని తీసుకెళ్లిన ఆసుపత్రులకు వెళ్లి విచారించారు. శిక్షణ కేంద్రానికి సంబంధించినవారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఎస్ఎల్ నివేదికల ఆధారంగా మృతికి గల కారణాలు వెల్లడవుతాయని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

నేతలతో లోకేశ్ ఆత్మీయ సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉండవల్లిలో గురువారం మంత్రి నారా లోకేశ్ ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆడపడుచులకు మంగళగిరి పట్టు చీరలు అందించారు. కార్యక్రమంలో మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, బీఎన్.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభించేందుకు ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తెదేపా వైపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువ, దాని సమీపంలో హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక స్థలంతోపాటు రెండో సొరంగం సమీపంలోని హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్, బహిరంగ సభకు ఏ ప్రదేశాలు అనుకూలంగా ఉంటాయనేదానిపై చర్చించారు. వీరి వెంట జేసీ శ్రీనివాసులు, వెలిగొండ జలాశయం ఎస్ఈ అబూతాలీం, డీఎస్పీ నాగరాజు, రెవెన్యూ, ఇంజినీరింగ్‌శాఖల అధికారులు ఉన్నారు.

ఎయిడెడ్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష

◆ అక్రమాలకు తావులేకుండా కొత్త విధానం
◆ ఉపాధ్యాయ పోస్టులకు 1,937 మంది పోటీ

ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో విద్యాశాఖ నూతన విధానం అవలంబిస్తోంది. మాన్యువల్ పరీక్షల స్థానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనుంది. గతంలో డీఈవో ఆధ్వర్యంలో నియమించిన కమిటీ ఆయా పాఠశాలల్లోనే దరఖాస్తుదారులకు పరీక్ష నిర్వహించి పోస్టులకు ఎంపిక చేసేవారు. దీంతో యాజమాన్యాలు ముందస్తు ఒప్పందాలు చేసుకుని వారు అనుకున్నవారికి ఉద్యోగాలిస్తున్నారని, ప్రతిభ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదులందడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పులు చేసింది. పోస్టుల భర్తీ చేయాలని కోరుతూ కొన్ని ఎయిడెడ్ యాజమాన్యాలు గతంలో కోర్టును ఆశ్రయించగా భర్తీకి అవకాశం లభించింది. కొత్తగా ప్రవేశ పెట్టిన పరీక్షల విధానాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. అప్పట్లో ఉన్న జీవో ప్రకారమే పరీక్ష నిర్వహించాలని కోర్టును ఆశ్రయించాయి. విద్యాశాఖ మాత్రం పారదర్శకతకు కంప్యూటర్ ఆధారిత విదానం కొనసాగింపునకు నిర్ణయించింది. తాజాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాలుగు ఎయిడెడ్ పాఠశాలల్లో 14 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల 26వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించగా, మొత్తం 1,937 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టులకు సరాసరిన 138 మంది పోటీ పడుతున్నారు. ఒంగోలు నగరంలోని ఏబీఎం ఉన్నతపాఠశాల, కనిగిరిలోని చిత్తరంజన్ అరబిక్ పాఠశాల, చీరాలలోని ఎమ్మెస్ ఉన్నత పాఠశాల, ముప్పవరంలోని పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలోని పోస్టులకు నియామకాలు జరగనున్నాయి. ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు సీబీటీ విధానంలో పరీక్ష జరుగుతుందని డీఈవో రేణుక ప్రకటించారు. హాల్ టిక్కెట్లు పొందిన వారికి ఒంగోలు నగరంలోని మామిడిపాలెం రోడ్డులోని నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియా కళాశాల, వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వీరికిచ్చిన స్లాట్ ప్రకారం అభ్యర్థులు ఆయా తేదీల్లో ఆయా కేంద్రాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

జలం... గరళం!

● మరమ్మతులకు నోచని ఫిల్టర్ బెడ్లు
● కాగితాలకే ప్రతిపాదనలు పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్థానికంగా ఉండే చెరువులకు వర్షం లేదా సాగర్ కాలువ ద్వారా చేరిన నీటిని యథేచ్ఛగా సరఫరా చేస్తుండడంతో కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వచ్ఛమైన నీరందిస్తాం..అందుకు ఎంత మొత్తంలోనైనా నిధులు కేటాయిస్తాం..అంటూ తరుచుగా ప్రజాప్రతినిధులు చెప్పే మాటలవి. ప్రభుత్వాలు మారుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాల ఫిల్టర్‌బెడ్లు ఏళ్ల తరబడి పనిచేయడంలేదు. కనీసం వాటి మరమ్మతులు పట్టించుకోకపోవడంతో ప్రజలు కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది.
- న్యూస్‌టుడే, కలెక్టరేట్

సంతనూతలపాడు మండలం మంగమూరులో మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్

పనులకు మోక్షమెప్పుడో?

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి సంబంధించి 137 తాగునీటి చెరువులున్నాయి. సురక్షిత నీరందించాలనే ఉద్దేశంతో గతంలో ఆయా చెరువులతోపాటు వాటర్ ట్యాంకుల వద్ద మొత్తం 230 ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ఇవి మరమ్మతులకు గురైతే కనీసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉండడం, అంత మొత్తంలో పంచాయతీలకు నిధుల లేని కారణంగా వాటి నిర్వహణకు సంబంధించి పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోవడంలేదు. ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినప్పుడు బెడ్‌లోని ఇసుక మార్చుకోవాలి, లేకుంటే దాన్ని శుభ్రం చేసుకోవాలి. అందుకు కూడా చిన్న పంచాయతీల్లో నిధుల్లేకపోవడం సమస్యగా మారింది. గత వైకాపా ప్రభుతంలో నిధుల మంజూరు లేకపోవడంతో ఏళ్ల తరబడి మరమ్మతుల ఊసేలేదు. నాలుగేళ్ల కిందట ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లాలోని 68 తాగునీటి పథకాలకు చెందిన ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతుల నిమిత్తం రూ.3.92 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'జల జీవన్ మిషన్' పథకం కింద ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదించినప్పటికీ ఇంత వరకు చర్యల్లేకపోవడం గమనార్హం.

ట్యాంకుల శుభ్రతపైనా నిర్లక్ష్యం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లో తాగునీరందించే ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే క్లోరినేషన్ చేయాలి. ఆ ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, తిరిగి ఎప్పుడు శుభ్రం చేస్తారన్న తేదీని రాయాల్సి ఉంటుంది. నిబంధనలు 95 శాతం గ్రామాల్లో ఎక్కడా అమలు కావడంలేదు. చాలా చోట్ల ఎప్పుడు శుభ్రం చేస్తున్నారో కూడా సరిగ్గా తెలియని పరిస్థితి నెలకొంది. శుభ్రం చేసినా క్లోరినేషన్ చేయడంలేదు. దీనికితోడు తాగునీటి సరఫరా పైపు లైన్లు మరమ్మతులకు గురైనా సకాలంలో పట్టించుకోవడంలేదు. వీటి వెంబడి మురుగు కాలువలు ఉండడంతో పైపులైన్ లీకుల వద్ద తాగునీరు కలుషితమవుతోంది. ట్యాంకులను శుభ్రం చేయించడం దగ్గర నుంచి పైపులైన్ లీకేజీల నివారణ, మరమ్మతుల్లో తీవ్ర అలసత్వం కనిపిస్తోంది.

పన్ను బకాయిదారులపై కేసులకు రంగం

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

దీర్ఘకాలంగా ఇంటి పన్నులు చెల్లించని మొండి బకాయిలు రాబట్టడానికి ఒంగోలు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొన్ని అసెస్‌మెంట్ నంబర్లు (ఆస్తులు) కోర్టుపరమైన వివాదంలో ఉండడంతో వసూలుకు కష్టతరంగా మారింది. దీంతో అలాంటి వారి జాబితాను తయారు చేసి లోక్‌అదాలత్‌లో కేసులు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పన్ను వసూలుపై సమీక్ష జరిపినప్పుడు రూ.5 లక్షలు నుంచి రూ.కోటిపైగా చెల్లించాల్సిన వారి జాబితాను వెలికితీశారు. నగరంలో మూసివేసిన ఓ ఇంజినీరింగ్ కళాశాల నుంచి రూ.3 కోట్లకుపైగా బకాయిలున్నట్లు గుర్తించారు. మూసేసిన ఓ లాడ్జి, రెస్టారెంట్, ఒక మాల్ నుంచి రూ.కోటి వరకు బకాయి వసూలు కావాల్సి ఉంది. మరికొన్ని అసెస్‌మెంట్లుకు సంబంధించి ఏళ్లతరబడి పన్నులు జమ కావడంలేదు. అలాంటి వారికి లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మార్చి ఆఖరులోగా నూరు శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు. నగరంలో పాత బకాయిలతో కలిపి రూ.53.36 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 27.51 కోట్లు వసూలు చేశారు. మొత్తం 65,183 అసెస్‌మెంట్లకు సంబంధించి వార్షిక డిమాండు రూ.39.35 కోట్లు కాగా, మిగిలినవి పాత బకాయిలు. 280 ప్రభుత్వ భవనాల నుంచి రూ.15.15 కోట్లు రావాల్సి ఉంది. బకాయిదారులందరికీ తాజా రెడ్ నోటీసులు జారీ చేశారు. కొన్ని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు నిలిపివేశారు. మొండి బకాయిదారుల పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

32 మంది కార్యదర్శులకు తాఖీదులు: పన్ను వసూలు లక్ష్యాలకు దూరంగా ఉన్న 32 మంది సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సంజాయిషీ నోటీసులిచ్చారు. తమ పరిధిలో వసూలు చేయాల్సిన దానిలో 30 శాతంలోపు ఉన్నవారికి తాఖీదులిచ్చారు. సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించడానికి కార్యాలయంలో కౌంటరు తెరచి ఉంచాలని ఆదేశాలిచ్చారు. పురమిత్ర యాప్ ద్వారా ఎక్కడ నుంచైనా పన్ను చెల్లించేవిధంగా ఏర్పాట్లు చేశారు.

(c) eenadu

జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్.

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మార్చి 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే. ఇబ్రహీం షరీఫ్ కోరారు. గురువారం ఆయన జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత లోక్ అదాలత్‌లో ప్రకాశం జిల్లా మొదటి ఐదు స్థానాలలో నిలిచిందన్నారు. ఇందుకు సహకరించిన న్యాయవాదులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మరోసారి మెరుగైన స్థానం సాధించటానికి పూర్తి స్థాయిలో కృషి చేద్దామని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులు చెల్లించిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. ఈ విషయంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు, న్యాయవాదులు ఇ.రాజశేఖర్ రెడ్డి, కె. శ్రీనివాసులు నాయుడు, డి.వి.కృష్ణారావు, సి.వి.రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిణిగా నాగలక్ష్మి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిణిగా **టి.వి.నాగలక్ష్మి** గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కందుకూరులో ఉప రవాణాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిగా నియమించడంతో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణం చేసి ప్రమాదాలకు కారణం అయితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అధికారులు శాలువాలు, పూలమాలలతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జి.భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్మిస్తున్న రహదారుల పనులను పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీరు క్రిష్ణ మోహన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. తదుపరి ప్రధాన రహదారిలో నిర్మించాల్సిన సైడ్ కాలువలు, రహదారుల ప్రాంతాలను ఆయన పరిశీలించి కొలతలు తీయించారు. త్వరగా సర్వేయర్‌తో మార్కింగ్ చేసి సిద్ధంగా ఉంచాలని గ్రామ కార్యదర్శి నూరుల్లాకు సూచించారు. గతంలో నిర్మించిన అంతర్గత రహదారులను కలిపి వెళ్లేలా ప్రధాన రహదారిని నిర్మించాలని ఏఈ రవికి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవ్య, ఇతర సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల తెదేపా అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారి, సైడ్ కాలువల కొలతలు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ కృష్ణమోహన్

వసతులపై ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్ష

మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి సత్యనారాయణ

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల డిపో మేనేజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్టాండ్‌లోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో అన్ని డిపోల్లో ప్రయాణికుల వసతుల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సుల నిర్వహణ పై రివ్యూ నిర్వహించారు. డిపోలలో పాజిటివ్ పర్సెప్షన్ అభివృద్ధి చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో డిపో మేనేజర్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

మార్కాపురం: మార్కాపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల అన్నారు. బుధవారం రాత్రి నంద్యాల జిల్లా నుంచి పల్నాడు జిల్లాకు వెళ్లేందుకు బయలుదేరిన షర్మిల మార్గమధ్యలో మార్కాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని ఆవరణలో తన వాహనంలో బస చేశారు. గురువారం ఉదయం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు జావెద్ అన్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై వారు షర్మిలకు వివరించారు. అంతేకాకుండా నూతనంగా ఏర్పడిన జిల్లాలో ప్రజా సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి విన్నవించడానికి సహకరించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయపథం వైపు నడిపించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

21న నిర్మమహేశ్వరుని తెప్పోత్సవం

❖ ముస్తాబైన కోనేరు

కోనేరులో నీటిని నింపి మెట్లకు వేసిన రంగులు

న్యూస్‌టుడే, పొదిలి: పొదిలిలోని శ్రీ పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు (ఈనెల 21న) నిర్వహించే తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, ధర్మకర్తలు, ఈవో నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో కోనేరులో పాతనీటిని తోడి కొత్తనీటితో నింపుతున్నారు. దశాబ్దాలుగా పాడుబడిన కోనేరును మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో గత ఏడాది ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మరికొంతమంది పెద్దల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. మెట్లకు రంగులద్దారు. భక్తులు కోనేరులో పడకుండా చుట్టూ ఇనుప కంచె వేయించారు. ఈనెల 21 సాయంత్రం ఏడు గంటలకు తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే పొదిలి సీఐ ఎం.రాజేష్‌కుమార్, ఎస్సై ఎస్.రాజేష్‌లు కోనేరు ప్రాంతాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

చేతిరాత.. మారుస్తుంది తలరాత!

❖ చూడముచ్చటైన అక్షరాలతో మంచి మార్కులకు అవకాశం

సాధన పరీక్ష రాస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల, పొదిలి:

పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చేతిరాత కీలకం. అందమైన అక్షరాలతో జవాబులు రాస్తే మొదట పేపరు దిద్దే వారికి విద్యార్థిపై సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. మంచి మార్కులు వస్తాయి. విద్యార్థులు ఏడాదంతా చదివినా ఫలితం మాత్రం పరీక్ష రాసే సమయంపై ఆధారపడి ఉంటుంది. ఈనెల 23 నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షలకు 43 వేల మందికి పైగా, టెన్త్‌లో 28 వేల మందికి పైగా విద్యార్థులు హాజరు కాబోతున్నారు. ఈ క్రమంలో ఒత్తిడికి గురికాకుండా చక్కటి దస్తూరితో పరీక్షలు రాయాలని నిపుణులు చెబుతున్నారు.

సమయపాలన ముఖ్యం

రాత బాగుండాలని ఒక్క ప్రశ్నకే ఎక్కువ సమయం కేటాయించడం, గుండ్రంగా రాస్తూ కూర్చోవడం చేయకూడదు. అలాగే.. సమాధానం తెలుసుకదా అని చాలా మంది విద్యార్థులు ఇష్టం వచ్చినట్లు రాస్తూపోతారు. దీనివల్ల చేతిరాత సరిగ్గా రాదు. అంతేకాదు సమయం సరిపోక ఒత్తిడికి గురవుతారు. ఫలితంగా మిగతా ప్రశ్నలకు సమాధానాలను తోచిన విధంగా రాయాల్సి వస్తుంది. కాబట్టి సమయపాలన పాటిస్తూ ఒత్తిడికి గురికాకుండా రాయాలి.

పొందికగా ఉండాలి

❖ జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయులు మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రతి రోజు కొద్దిసేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.

❖ జవాబులు రాసేటప్పుడు ప్యాడ్‌పై వాలిపోకుండా సాధ్యమైనంత వరకు సక్రమంగా కూర్చుని రాయడం మంచిది.

❖ కొట్టివేతలు లేకుండా అక్షరాలు గుండ్రంగా రాయాలి. కొట్టివేయాల్సి వచ్చినపుడు చిన్నగీత పెడితే సరిపోతుంది.

❖ శీర్షికలు, ఉపశీర్షికల ఆవశ్యకతను గుర్తిస్తూ ముఖ్యమైన అంశాల కింద గీతలు ఉపయోగించాలి. సైన్సు పరీక్షలకైతే చేతిరాతతో పాటు ఆకట్టుకునేలా చిత్రపటాలు వేయాలి. ❖ పేజీకి పదహారు నుంచి ఇరవై పంక్తులు మించకుండా రాయాలి.

దోషాలు లేకుండా చూసుకోండి

ప్రశ్నకు తగిన సమాధానం స్పష్టంగా రాయాలి, అక్షర దోషాలు లేకుండా గుండ్రంగా చేతి రాత ఉంటే మంచి మార్కులు సాధించవచ్చు. అందుకోసం విద్యార్థులు ప్రత్యేక సాధన చేయాలి.

– మస్తాన్‌నాయక్, ఎంఈవో, దోర్నాల

సమావేశానికి ఎంపీడీవోలు డుమ్మా

❖ ఎస్ఈ తీవ్ర అసహనం

ఆగ్రహించి వెళ్లిపోతున్న ఎస్ఈ నాగేశ్వరరావు

తాళ్లూరు, న్యూస్‌టుడే : వేసవి ముంచుకొస్తున్న వేళ. .నిర్వహించిన కీలక సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఎస్ఈ నాగేశ్వరరావు సమావేశం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు. దర్శిలో గురువారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి ఎంపీడీవోలు, ఇంజినీరింగు సహాయకులు, మంచినీటి సరఫరా అధికారులు, సిబ్బంది హాజరు కావాల్సి ఉంది. ఎంపీడీవోలతో పాటు సిబ్బంది దీనికి గైర్హాజరయ్యారు. కీలకమైన అధికారులే రాకుంటే మంచినీటి సమస్యలను ఎలా అధిగమించగలమని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వారి తీరుకు నిరసనగా సమావేశం కొనసాగించకుండా వెళ్లిపోయారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. స్థానిక డీఈ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులపై చిన్నచూపు తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలు రైతులపై చిన్న చూపు తగదని, వారికి అన్నదాత-సుఖీభవ పథకం వర్తింపజేయడంతోపాటు, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24న కౌలు రైతుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన దీక్షలపై ముద్రించిన గోడప్రతులను స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాస్తవ సాగుదారులను గుర్తించి, కార్డుల జారీతోపాటు, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వ చిన్నచూపు కారణంగానే పీఎం కిసాన్, అన్నదాత-సుఖీభవ పథకంతోపాటు; పంట రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పమిడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

గుత్తేదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

అద్దంకి, న్యూస్‌టుడే : ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినట్లయితే సంబంధిత గుత్తేదారుపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా గృహనిర్మాణ పథకం సంచాలకులు పి.శ్రీనివాసప్రసాద్ అన్నారు. అద్దంకి అర్బన్‌లోని వేలమూరిపాడు, బొమ్మనంపాడు, నాగులపాడు లేఅవుట్‌లను గురువారం ఆయన పరిశీలించారు. పనులు చేపట్టిన గుత్తేదారులతో మాట్లాడారు. వేలమూరిపాడు లేఅవుట్ వద్ద గుత్తేదారు స్వయంగా తయారుచేస్తున్న ఇటుకల నాణ్యత అంచనా వేశారు. అద్దంకి అర్బన్‌లోని మూడు కాలనీల్లో గృహనిర్మాణ శాఖ ద్వారా 1,716 మంది లబ్ధిదారులకు గానూ, ఆప్షన్-3 కింద 715 గృహాలు నిర్మిస్తున్నట్లు ఏఈ కిరణ్ తెలిపారు. మార్చి 20 నాటికి ఇవి పూర్తి చేయాలని, లేకుంటే బిల్లుల మంజూరు కష్టమవుతుందన్నారు. ఉగాది నాటికి అద్దంకి అర్బన్‌లో 584 గృహ ప్రవేశాలు జరిపించాలన్నారు. ఆయన వెంట డీఈ దుర్గా రమేష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

22న జిల్లా స్థాయి హాకీ జట్ల ఎంపిక

మైనంపాడు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 22న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల హాకీ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.రమణారెడ్డి, ఎ.సుందర్‌రామిరెడ్డిలు పేర్కొన్నారు. 01.01.2010 తర్వాత పుట్టిన వారు తమ జనన ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లు తీసుకొని 22న ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హాజరవ్వాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ తిరమలశెట్టి రవికుమార్, సెల్: 9951578357లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఎడ్ల పందేలు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లాలోని మేళ్లచెరువులో మహా శివరాత్రి సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు గురువారం రాత్రి ముగిశాయి. ❖ జూనియర్ విభాగంలో పుచ్చకాయల శేషాద్రి చౌదరి గిత్తల జత(మద్దిరాల, నాగుల్పులపాడు, ప్రకాశం) ద్వితీయ స్థానం గెలుచుకుంది.

వాహనం ఢీకొని సర్వేయర్‌కు తీవ్ర గాయాలు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో గ్రామ సర్వేయర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురాంతకం మండల కేంద్రంలోని బైపాస్ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉమ్మడివరం గ్రామ సర్వేయర్‌గా పని చేస్తున్న కె.నాగార్జున రీ సర్వే పనుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై విశ్వనాథపురం వెళుతున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం సమీపంలోకి రాగానే కుంట వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నాగార్జునకు తీవ్ర గాయాలు కాగా.. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్ సహాయంతో వినుకొండ తరలించారు. ఘటన పై కేసు నమోదు చేసిన ఎస్సై శివ బసవరాజు బొలెరో వాహనం కోసం దర్యాప్తు చేపట్టారు.

వాగులో ఈతకు దిగి బీటెక్ విద్యార్థి మృతి

శ్రీచరణ్

పొన్నలూరు, న్యూస్‌టుడే: వాగులో మునిగి బీటెక్ విద్యార్థి మృతిచెందిన సంఘటన పొన్నలూరు మండలం మంగపతివారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మల్లెబోయిన శ్రీచరణ్ (20) ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. మహాశివరాత్రి సందర్భంగా ఇటీవల ఇంటికి వచ్చిన అతడు.. కుటుంబ సభ్యులతో కలిసి కోటప్పకొండకు వెళ్లి మొక్కు తీర్చుకొని వచ్చాడు. గురువారం సాయంత్రం తిరిగి కళాశాలకు వెళ్లాలనుకుని, మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులోని పొలం వద్ద ఉన్న తండ్రి రామారావుకు చెప్పేందుకు వెళ్లాడు. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం సమీపంలోని గొరిశల వాగులో ఈత కొట్టేందుకు దిగాడు. వాగులో నీరు నిల్వ చేసేందుకు రైతులు గతంలో తవ్విన భారీ గోతులు ఉండటంతో వాటిలో కూరుకుపోయి మునిగిపోయాడు. ఎంత సేపటికి కుమారుడు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన రామారావు. . వాగు వద్దకు వెళ్లి చూడగా, ఒడ్డున శ్రీచరణ్ దుస్తులు కనిపించాయి. గ్రామస్థులకు సమాచారం అందించగా.. వారు వచ్చి శ్రీచరణ్ మృతదేహాన్ని వెలికితీశారు. కళాశాలకు వెళ్లి చదువుకోవాల్సిన కుమారుడు ఊహించని రీతిలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మద్యం మత్తులో గొంతెండి..

కంభం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కంభం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగోజిపల్లికి చెందిన షేక్ మహమ్మద్ (60) మద్యానికి బానిసై ఆ మత్తులో తిరుగుతుంటాడు. ఈ క్రమంలోనే గురువారం పూటుగా మద్యం తాగి బస్టాండ్ సమీపంలో పడిపోయాడు. స్థానికులెవరూ గుర్తించకపోవడంతో గొంతెండి చనిపోయాడు. తొలుత ఆయనను యాచకుడని భావించి... అంత్యక్రియలు నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. తరువాత ఆధార్ కార్డు లభ్యం కావడంతో. .. లింగోజిపల్లి వాసిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లి కర్మకాండలు నిర్వహించారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

లాభాల పట్టు!

❖ పెరిగిన ధరలతో రైతుల్లో ఆనందం

నేత్రికల్లో ఉన్న పట్టుగూళ్లు

న్యూస్‌టుడే, కంభం

గతంలో ఎన్నడూ లేనంతగా పట్టుగూళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. పలమనేరు, హిందూపురం తదితర మార్కెట్లలో బైవోల్టెన్ రకం కిలో రూ.864 పలుకుతోంది. మొన్నటి వరకు రూ.900కి పైగా ధర లభించింది. కర్ణాటకలో రూ.వెయ్యి వరకు వస్తోంది. చాన్నాళ్ల తరువాత పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో పెరిగిన డిమాండు...

ఉమ్మడి జిల్లాలో సమారు 1,600 ఎకరాల్లో పట్టు సాగవుతోంది. మార్కాపురం జిల్లాలోని బేస్తవారపేట, గిద్దలూరు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, మార్కాపురం, పుల్లలచెరువు తదితర మండలాల్లో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. కర్ణాటకలో ధరలు మెరుగ్గా ఉండడంతో రైతులు ఆ రాష్ట్రంలోని రామ్‌నగర్, విజయపురి, సిద్ధగట్ల మార్కెట్లకు ఉత్పత్తి తరలిస్తున్నారు. ఇటు ఆంధ్ర, అటు కర్ణాటకలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడం... చైనా నుంచీ దిగుమతులు పడిపోవడం... మరో వైపు మార్కెట్‌లో పట్టుకు డిమాండ్ పెరగడంతో ధరలకు రెక్కలొచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం చేయూత...

పట్టు సాగుకు కూటమి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాయితీలు ఇస్తోంది. మల్బరీ తోటల పెంపకానికి సాధారణ రైతులకు రూ.22,500, ఎస్సీ ఎస్టీలకు రూ. 27 వేలు; వెయ్యి చదరపు అడుగుల షెడ్ల నిర్మాణానికి రూ.3.37 లక్షల నుంచి రూ.4.05 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. వీటితో పాటు రేరింగ్, యంత్ర పరికరాలు, రోగనిరోధక మందులకు సైతం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారానూ మల్బరీ సాగును ప్రోత్సహిస్తోంది. 'పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నందున జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మల్బరీ షెడ్లు ఉన్న రైతులంతా ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాల'ని జిల్లా సెరికల్చర్ అధికారి సుజయ్ తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టుపై కలెక్టర్ ఆరా

రాజాబాబును కలిసి పూల మొక్కను అందజేస్తున్న ఎస్ఈ అబూసలీం

మార్కాపురం: మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబును కలెక్టరేట్‌లో గురువారం వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూసలీం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈతో కలెక్టర్ వెలిగొండ ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 25న సీఎం పర్యట ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు సమగ్ర స్వరూపం అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఎస్ఈతో పాటు మార్కాపురం ఎంపీడీవో బాలచెన్నయ్య ఇన్‌ఛార్జి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

డీబీఆర్సీ సంస్థ కృషి ప్రశంసనీయం

నివేదిక ప్రతులను ఆవిష్కరిస్తున్న జేసీ కల్పనాకుమారి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాజంలో న్యాయం, సంక్షేమం, ప్రత్యామ్నాయ వృత్తుల కోసం ఎదురుచూస్తున్న వారికి చేయూతగా నిలిచి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ డీబీఆర్సీ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని సంయుక్త కలెక్టర్ కల్పనాకుమారి పేర్కొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో ముద్రించిన కార్యక్రమాల నివేదికను స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సంస్థ చేస్తున్న కృషి; అధికార యంత్రాంగం సహకారంతో సాధించిన ఫలితాల ద్వారా పేదల జీవితాల్లో వచ్చిన మార్పును డీబీఆర్సీ జిల్లా సమన్వయకర్త డి.కోటేశ్వరరావు జేసీకి వివరించారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తిచేయండి

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియాతో చర్చిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు, సింగరాయకొండతోపాటు, మిగతా రైల్వేస్టేషన్లల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గురువారం విజయవాడలోని కార్యాలయంలో డీఆర్ఎం మోహిత్ సోనాకియా దృష్టికి తీసుకెళ్లారు. అండర్ పాస్‌లు, ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణంతోపాటు, పలు సమస్యలపై చర్చించారు. ఒంగోలు స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నం.4, 5లోని సమస్యలను వివరించారు. కోచ్ డిస్‌ప్లే బోర్డులు లేని కారణంగా ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అప్పటివరకు రైళ్లను ప్లాట్‌ఫారం-3పైనే నడపాలని కోరారు.

టంగుటూరు వైకాపా అధ్యక్ష పదవికి కుమ్ములాట!

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా టంగుటూరు గ్రామ అధ్యక్ష పదవి వ్యవహారం ఆ పార్టీ నాయకుల మధ్య కుమ్ములాటకు దారితీసింది. సింగరాయకొండలోని వైకాపా కార్యాలయానికి ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ గురువారం వచ్చారు. ఈ సందర్భంగా టంగుటూరుకు చెందిన దుగ్గిరాల పేర్రాజు, పుట్టా వెంకట్రావు, కొమ్ము ప్రభుదాసు, ఉదయ్ కుమార్, మరికొందరు అధ్యక్ష పదవి కోసం ప్రతిపాదనలు అందజేశారు. దీన్ని చింతపల్లి హరిబాబు, కొమ్ము సురేంద్ర, రావినూతల మనోహర్ మరికొందరు వ్యతిరేకించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొని తోపులాటకు దారితీసింది. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన హరిబాబు.. దళిత నాయకులను అసభ్య పదజాలంతో దూషించి దాడికి ప్రయత్నించాడని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ పరిణామంతో ఇన్‌ఛార్జి సురేష్.. చేసేదేమీ లేక చూస్తూ ఉండిపోయారు. దీంతో కొందరు నాయకులు అలకబూని అక్కడి నుంచి వెళ్లిపోయారు. సింగరాయకొండకు చెందిన ముఖ్య నాయకుడు ఒకరు జోక్యం చేసుకుని తరువాత మాట్లాడదామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సింగరాయకొండ మండలంలో కూడా కొందరు వైకాపా సీనియర్ నాయకులు ఇన్‌ఛార్జి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లకు పైగా పార్టీ కోసం పనిచేసిన వారిని అణగదొక్కేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడుతున్నారు. మరోవైపు దుగ్గిరాల పేర్రాజు, కొమ్ము ప్రభుదాస్, ఉదయ్‌కుమార్ తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUSINESS OFFER

Running 30Bedded Hospital Lease@ MiryalagudaTown, Nalgonda. For Obstetrics, Urology, Pediatrics, Ortho-Physician. 9848231654

EDUCATION

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

తమిళనాడు వైదీశ్వరన్‌కోయిల్ శ్రీఅగస్త్యే నాడిజ్యోతిష్యాలయం మీచేతిబొటన వేలు ముద్రతో మీభవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. 8978215913.

REAL ESTATE

PLOT FOR SALE

మార్కాపురం (కుంట) దగ్గరలో 133 గజాలు కేవలం 2 లక్షలు మాత్రమే. దొనకొండ దగ్గరలో 133 గజాలు 1 లక్ష మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 9398621767.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500

Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

TELECALLERS(F)Qualification: Any Degree Age:-18to30yrs Salary:-10kto15k + Incentive Address:- CHANDU EDUCATION CONSULTANCY, Lawyerpet, Ongole. Contact:- 7729873052, 9133996028

ఒంగోలు LUCKY షాపింగ్ మాల్ ఎదురు గల JOCKEY షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవంగల సేల్స్ బాయ్స్ కావలెను. సంప్ర: 99898 48485.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం||ల పైన ఉండవలెను. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్ నెం: 92487 33340.

ఒంగోలులోని అంజయ్య రోడ్డులో ఇన్‌స్టామార్ట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ 18000+EPFO+ESI. ✆9885295999, 7658961999.

విద్యార్థులకు వారి కెరీర్ విద్యా ప్రవేశాల గురించి సలహాలు సూచనలు చేయడానికి టీచర్స్, రిటైర్డ్ టీచర్స్, ప్రిన్సిపల్స్‌ను ఖాళీ సమయంలో ఫ్రీలాన్స్ పద్ధతిన చేయడానికి ఆహ్వానం ట్రైనింగ్ ఇవ్వబడును. ఒంగోలు, ✆94402 42412, 72077 70916.

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆ 9959598279

(c) eenadu

కందుకూరు

• కందుకూరు • కొండపి

వసతులు లేక.. ఉండలేక!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

పట్టణంలోని కనిగిరిరోడ్డులో నాంచారమ్మకాలనీ, కోమటికుంటకు దక్షిణ ప్రాంతాల్లో మౌలిక వసతుల లేమితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోందని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. * కనిగిరి రోడ్డు వెంబడి ఉన్న ప్రధాన కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఒకటి నుంచి ఆరో వీధి వరకు మురుగు సక్రమంగా పారని పరిస్థితి నెలకొంది. 4, 5 వీధుల్లో ఇళ్ల నిర్మాణాలు చేసే వారు కాలువలపై ఇటుక, ఇసుక తదితర నిర్మాణ సామగ్రి నిల్వ చేస్తుండటంతో మురుగు ముందుకు సాగక నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. * గాజుల కాలువ నుంచి కాలనీకి వెళ్లే దారిలో గేదెలను సిమెంట్ రోడ్డుపైనే కట్టేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్లు చిమ్మకపోవడంతో దుమ్ముధూళి రేగుతోంది. ఇళ్లకు విద్యుత్తు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఒకటో వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. * కనిగిరి రోడ్డు, గాజుల కాలువ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. * శ్రీరామ్‌నగర్, లంబాడి డొంక ప్రాంతాల్లో రోడ్లు, కాలువల సమస్య ఉంది. కాలనీలు ఏర్పాటు చేసి దశాబ్దాలు గడుస్తున్నా మౌలిక వసతులు కల్పించలేదు. ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలుస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను లబ్ధిదారుల నుంచి ప్రైవేటుగా కొనుగోలు చేసి దశాబ్దాల క్రితమే ఇళ్లు నిర్మించుకున్నా.. ప్రస్తుతం పొజిషన్ సర్టిఫికెట్లు లేక అవస్థలు పడుతున్నారు. * దూబగుంట ప్రాంతంలోనూ దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన రోడ్లు కావడంతో రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. రెండు చోట్ల రోడ్ల సమస్య నెలకొంది.

నాంచారమ్మకాలనీ ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త

వార్డు: 30
కాలనీలు: నాంచారమ్మకాలనీ, దూబగుంట, శ్రీరామ్‌నగర్, లంబాడిడొంక
నివాసాలు: 800
జనాభా: 3400

వాస్తవ సాగుదారుల వివరాలు నమోదు చేయండి

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కె.బిట్రగుంటలో నిర్వహిస్తున్న ఈ పంట నమోదు ప్రక్రియను జేసీ కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాస్తవ సాగుదారుల వివరాలనే నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి సర్వే నంబరుకు ఓ ల్యాండ్ పార్సిల్ ఉంటుందన్నారు. రబీకి సంబంధించి మండలంలో మొత్తం 32,000 పార్సిల్స్ ఉండగా, ఇప్పటి వరకు 23000 (70 శాతం) పూర్తి చేశారని, మిగిలినవి కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మలాకుమారి, తహసీల్దార్ పి.మురళి, వ్యవసాయ అధికారి కావిత్రీనాథ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బిట్రగుంటలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ కల్పనాకుమారి

బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చౌక బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ కల్పనా కుమారి.. సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎఫ్‌సీఐ గోదామును ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. సరకులు అస్తవ్యస్తంగా ఉండటం, పదుల సంఖ్యలో పావురాళ్లు బియ్యం నిల్వలపై సంచరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలతల్లో తేడా లేకుండా రేషన్ డీలర్లకు సరకులు, బియ్యం అందించాలని సూచించారు. గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ రాజేష్, గోదాము డీటీ రాము, సిబ్బంది ఉన్నారు.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తోందని, కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జేసీ కల్పనాకుమారి తెలిపారు. పట్టణంలోని ఉప్పుచెరువు, కృష్ణానగర్, విజయనగర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె కందుకూరు సబ్‌కలెక్టర్ డి.హిమవంశీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా దస్త్రాల నిర్వహణ, సరకుల నిల్వలను తనిఖీ చేశారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి

ఉలవపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బందిపై ఉందని డీఎల్పీవో కృష్ణమోహన్ అన్నారు. గురువారం మండలంలోని వీరేపల్లి గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. గ్రామంలోని పలు గృహాలను సందర్శించి ఐవీఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు.

సొంతింటి కల సాకారానికి అడుగులు!

❐ పీఎంఏవై ప్లస్ కింద అర్హుల గుర్తింపు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

ఇళ్లు లేని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా కొత్తగా ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన ప్లస్(పీఎంఏవై 2.0) పథకం కింద ఇళ్లు మంజూరు చేసేందుకు గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే సర్వే చేశారు. అర్హులను గుర్తించి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేశారు. కందుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో 9563 మందికి లబ్ధి కలగనుంది.

గతంలో పొందలేని వారి కోసం

ఇళ్లులేని పేదలకు ప్రభుత్వం గతంలో పీఎంఏవై కింద ఇళ్లు మంజూరు చేసింది. అయితే అప్పట్లో అవగాహన లేక కొందరు పొందలేకపోయారు. అటువంటి వారి కోసం పీఎంఏవై 2.0 అమలుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా 2025 ఆగస్టు నుంచి డిసెంబరు వరకు క్షేత్రస్థాయిలో డీఈ, ఏఈ, సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులు సర్వే నిర్వహించారు. పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి ప్రస్తుతం ఉంటున్న నివాసం, నూతనంగా ఇల్లు నిర్మించుకోనున్న స్థలం ఫొటోలు తదితరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. స్థలం ఉన్న వారు, స్థలంతో పాటు పక్కా గృహం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి వేర్వేరుగా అర్హులను గుర్తించారు. పీఎంఏవై కింద పట్టణాల్లో ఇప్పటికే ఇళ్లు మంజూరు చేయగా ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.50 లక్షల చొప్పున అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వారికి రూ.1.80 లక్షలు అందించే అవకాశం ఉంది. వారికి సంబంధించి ఇప్పటికే తెల్ల రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు స్వీకరించారు. అతి త్వరలోనే పక్కా ఇళ్లు మంజూరవుతాయని గృహనిర్మాణ సంస్థ ఏఈ సుబ్బారావు తెలిపారు.

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	సొంత స్థలం ఉన్న వారు	లేనివారు
కందుకూరు	1021	77
గుడ్లూరు	1921	264
లింగసముద్రం	1723	386
ఉలవపాడు	1359	603
వలేటివారిపాలెం	1821	388

సంపద తయారీ లక్ష్యం నీరుగార్చితే సహించం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యాన్ని నీరుగారిస్తే సహించేది లేదని డీపీవో వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం కందుకూరు మండలం మాచవరం, ఓగూరు గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పొడి చెత్త సేకరణ ద్వారా లభించే వస్తువులను ప్రతి గురువారం విక్రయించగా. రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తోందన్నారు. వాటిని ఆయా పంచాయతీలకు జమచేస్తున్నట్లు చెప్పారు. 27 మండలాల్లో స్వచ్ఛ రథాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తొమ్మిది రకాల దస్త్రాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో నెలలో రెండుసార్లు కాలువలు శుభ్రం చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం రాయితీపై నాటుపడవలు అందిస్తున్నామని అవసరమైన వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. డీపీవో వెంట ఎంపీడీవో రత్నజ్యోతి, డిప్యూటీ ఎంపీడీవో ఓబులేసు తదితరులు ఉన్నారు.

మాచవరం సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఎంఈవో కార్యాలయంలో దస్త్రాలు పరిశీలిస్తున్న డీఈవో రేణుక

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి

టంగుటూరు, న్యూస్‌టుడే: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక అన్నారు. మంగళవారం టంగుటూరు మండలం ఆలకూరపాడు ప్రైమరీ మోడల్ పాఠశాల, టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆలకూరపాడు పాఠశాలలో ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి వారికి నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి వసతులను తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో దస్త్రాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవోలు చెల్లి ఆనందరావు, తన్నీరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, పద్మావతి, చెరుకూరి పూర్ణచంద్రరావు, భ్రమరాంబ తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?: మండలంలోని తుమాడు ఎస్సీ కాలనీలో చెత్త పేరుకుపోయింది. వ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన నెలకొంది. -రవి, స్థానికుడు

✓: చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -మౌనిక, పంచాయతీ కార్యదర్శి

గుడ్లూరు, న్యూస్‌టుడే

?: మండల కేంద్రం గుడ్లూరు యాదవ బజారులో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. -గౌతమ్ కృష్ణ

✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. -నరేశ్, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: మండలంలోని వల్లాయిపాలెం బస్టాండ్ కూడలిలో మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. -మీరయ్య, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. -సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

లింగసముద్రం, న్యూస్‌టుడే

?: తిమ్మారెడ్డిపాలెంలో మురుగునీటి కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దోమలు అధికంగా ఉన్నాయి. -మాలకొండయ్య, స్థానికుడు

✓: పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -కె.శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే

?: సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం రామాలయం సమీపంలో కొందరు గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. మందుబాబుల ఆగడాలతో మహిళలు భయాందోళన చెందుతున్నారు. -సుబ్బారెడ్డి, స్థానికుడు

✓: నిఘా పెట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.-శివకుమారి, ఎక్సైజ్ సీఐ

?: సింగరాయకొండ పట్టాభి వీధిలో రెండు నెలలుగా మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. -శ్రీనివాసరావు, స్థానికుడు

✓: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం. -సతీష్, శానిటరీ మేస్త్రి

ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

కందుకూరు పట్టణం, గుడ్లూరు, ఉలవపాడు, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండ సంఘ చాలక్ డాక్టర్ టి.మల్లికార్జున అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని బజరంగి సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మల్లికార్జున మాట్లాడుతూ శివాజీ ధీరత్వాన్ని, దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ కన్వీనర్ జి.హరిబాబు, ఎం.మురళీమోహన్, మాధవ, కల్యాణ్, చక్కా కేశవ, రాధాకృష్ణమాచార్యులు, అల్లూరయ్య పాల్గొన్నారు. * గుడ్లూరులో నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమంలో భాజపా నాయకుడు ఇన్నమూరి సుధాకర్, ఆర్య వైశ్య సంఘం నాయకులు అమరా మాల్యాద్రి, సి.శ్రీనివాసులు, స్వరూప్, శివ, వరుణ్, నాగరాజు, అంకమ్మరావు పాల్గొన్నారు.

● ఉలవపాడులో రాచగల్ల నాగచంద్ర, బి.శ్రీధర్, సుబ్బారావు, యలమందయ్య, సత్యం, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కందుకూరులో నివాళులర్పిస్తున్న భాజపా, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో ఉండవల్లిలోని నివాసంలో గురువారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు

రుణాల సద్వినియోగంపై పరిశీలన

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల సభ్యుల జీవనోపాధులపై ఈనారీలు చేపడుతున్న సర్వేను సమర్థంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణరావు సూచించారు. మండలంలోని కొండముడుసుపాలెంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 971 సంఘాలకు చెందిన 9710 మంది సభ్యులు తీసుకున్న రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. 10 సంఘాలకు ఓ ఈనారీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీఎం టి.సురేష్, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండముడుసుపాలెంలో వివరాలు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణరావు

ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోండి

గుడ్లూరు, న్యూస్‌టుడే: మామిడి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని మోచర్లలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ పండ్ల సంచులను రాయితీపై అందజేస్తామన్నారు. పూత దశలో బూడిద తెగులు కనిపిస్తోందన్నారు. పిందె దశలో గొంగళి పురుగుల నివారణకు రసాయన మందులు పిచికారీ చేయాలన్నారు. నల్లతామర నివారణకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారిణి జ్యోతి, ఆర్ఎస్కే సిబ్బంది వెంకట్రావు, శ్రీను, సుధ, పలువురు రైతులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

బాలిక వైద్య ఖర్చులకు సాయం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: గుడ్లూరు అభ్యుదయ పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ వార్షికోత్సవ వేడుకలకు తన తల్లితో కలిసి పాఠశాలకు వెళ్తున్న అవంతిక ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తల్లి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నట్లు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యుల దృష్టికి రావడంతో రూ.28 వేలు సమకూర్చి.. గురువారం బాలిక తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధి రవ్వా శ్రీనివాసులు, కేశవ, సురేష్, శ్రీను, సుధాకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు, న్యూస్‌టుడే: బాలిక అవంతిక వైద్య ఖర్చుల నిమిత్తం మొగళ్లూరు కేజీబీవీ బాలికలు సుమారు రూ.7200.. అభ్యుదయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలగారెడ్డికి గురువారం అందజేశారు.

ప్రాంతీయాసుపత్రి స్థాయి పెంచాలని వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి స్థాయి పెంచాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి విన్నవించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పాటు ఓడరేవు, పరిశ్రమలు రానున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 100 పడకలను 300కు పెంచాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరులో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు స్థానిక తెదేపా నాయకులు గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక గ్రామంలోని ఉత్తరం వైపు రైల్వే అండర్ పాస్ నుంచి చాకిరేవు వరకు సీసీ రహదారి నిర్మాణం, భూగర్భ డ్రెయినేజీ పనులకు సర్పంచి మద్దిరాల మమత, తెదేపా మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బెల్లం జయంత్‌బాబు తదితరులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కామని విజయ్‌కుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కెన హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

లింగసముద్రం, న్యూస్‌టుడే: పెదపవని సాయిబాబా ఆలయ సమీపంలోని రైస్ మిల్లుపై ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కృష్ణమోహన్, రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. మిల్లులో 101 బస్తాల ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. నివేదికను జేసీకి అందజేస్తామని అధికారులు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.విక్టోరియారాణి అన్నారు. గురువారం కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలిసి, తెలియని వయసులో పెళ్లి చేసుకోవడం ద్వారా కలిగే నష్టాలకు వివరించారు. బాల్య వివాహాలు చేస్తుంటే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాల్య వివాహం వద్దు, చదువు ముద్దు అనే నినాదంతో ప్రదర్శన నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడ్లూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. గురువారం గుడ్లూరు కంఠయ్య కల్యాణ మండపంలో విద్యుత్తు అదాలత్ నిర్వహించారు. పలువురు వినియోగదారులు తమ సమస్యలను ఛైర్మన్‌కు వినతిపత్రాల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఏదైనా సమస్య వస్తే సిబ్బంది తక్షణం స్పందిస్తారని చెప్పారు. గుడ్లూరు విద్యుత్తు ఉపకేంద్రానికి చెందిన స్థలాన్ని స్థిరాస్తి వ్యాపారులు ఆక్రమించి రహదారి నిర్మించారని పలువురు గ్రామస్థులు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఏఈ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

దాడి ఘటనలో నిందితుడికి జైలు, జరిమానా

జరుగుమల్లి: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ సింగరాయకొండ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.లీలా శ్యామసుందరి గురువారం తీర్పుచెప్పారు. జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. 2018 మార్చి 25న జరుగుమల్లికి చెందిన అన్నం నేతాజీ(62).. తన పశువులను పొలంలో మేపుతుండగా, అదే గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తి పాత గొడవలను మనసులో పెట్టుకుని ఘర్షణకు దిగి కర్రతో దాడిచేశాడు. ఈ ఘటనలో నేతాజీ కుడి చేయి, మోకాలికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై జి.సోమశేఖర్ కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు మస్తాన్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ డి.వరకుమారి వాదనలు వినిపించారు.

భూములు చవుడుబారి.. లక్ష్యం నీరుగారి!

లింగసముద్రం, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో భాగంగా 1958లో లింగసముద్రం మండలం చినపవనిలో 510 ఎకరాల్లో వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో ఆ భూముల్లోని 410 ఎకరాలను ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించడంతో క్షేత్రానికి పూర్వ వైభవం వస్తుందని అంతా భావించారు. అయితే నాలుగేళ్లయినా పురోగతి నామమాత్రంగా ఉంది. దీనికి నిధుల కొరత, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉండటంతో పాటు చుట్టూ కంచె లేకపోవడం ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. 2021-22లో 40 ఎకరాల్లో పంటల సాగు ప్రారంభించగా.. 2024-25లో అది 150 ఎకరాలకు చేరింది. ఈ ఏడాది వరి-20, నువ్వులు-30, మినుము-25, జొన్న-10 చొప్పున మొత్తం 85 ఎకరాలకు పరిమితమైంది. పూర్తిస్థాయి విస్తీర్ణంలో పంటల సాగు ఎప్పటికి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

క్షేత్రంలో ఖాళీగా దర్శనమిస్తోన్న భూమి

రాళ్లపాడు జలాశయం నీరే ఆధారం

క్షేత్రంలో తగినంత నీరు అందుబాటులో లేదు. బోర్ల నీరు ఉప్పుకయ్యగా ఉంటోంది. దీంతో రాళ్లపాడు జలాశయంపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో ఏడాది పొడవునా పంటలు సాగు కష్టంగా మారింది.

నేల స్వభావంలో మార్పులు

1994, 96లో రాళ్లపాడు ప్రాజెక్టుకు వరదలు రావడంతో కొంత కాలం క్షేత్రంలో పంటల సాగు నిలిచింది. ఆ సమయంలో భూములు కొన్ని చవుడుగా మారాయి. దీంతో ఇప్పటికీ పంటలు వేయడం లేదు. వాటిని తిరిగి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

రక్షణ కంచె లేక ఇక్కట్లు

క్షేత్రం భూముల చుట్టూ రక్షణ కంచె లేదు. పరిసర ప్రాంతాల ప్రజలు గేదెలు, గొర్రెలను క్షేత్రంలోకి తీసుకొస్తున్నారు. దీంతో అవి పంటలను నాశనం చేస్తున్నాయి. తద్వారా పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

క్షేత్రంలో నీరు నిల్వ చేసేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అవి మంజూరైతే సమస్య తీరుతుంది. భూముల హద్దుల సర్వే కోసం రెవెన్యూ అధికారులను ఆశ్రయించాం. -శ్రీనివాసులరెడ్డి, క్షేత్రం అధికారి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉలవపాడు: పదో తరగతి విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గురువారం కరేడు ఒకటో స్వర్ణ గ్రామ కార్యాలయం పరిధిలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎంపీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd..Ongole-1 Branch. Prakasam District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant **Sri. Mukthinutalapati Venkateswara Rao, S/o. Subbarao. R/o. Flat No.103, S.R. Residency, Sundar Nagar, Mangamuru Donka. Ongole, Prakasam District, Andhra Pradesh** submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents. I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages. sale agreements. court attachments. court disputes, etc., shall be informed to the below address within 5 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE : Prakasam District. Ongole Sub-Registration District, Ongole Mandal, Manduvavaripalem Panchayat, Throvagunta Revenue Village Sy.No.465/2 and 469 covering an extent of Ac.1-22 1/2 cents in it as per approved layout T.L.P.No. 7/2014/P, covered in Sy.No.469, Plot No.14 admeasuring an extent of 1980 sq.fts or 27 gadis 36 sq.fts., or 220 sq. yards or 183.92 Sq.mtrs of vacant site bounded by: **East :** Plot No.13 site - 60 feet **South :** Plot No.10 site-33 feet **West :** Plot No.15 site -60 feet **North :** 33 ft wide Road - 33 feet

Sd/- **M.S.S.PRASAD,** Advocate
Legal Advisor, AP/3706/2023

(c) eenadu

అద్దంకి
• అద్దంకి • దర్శి

సాగర్ కాలువలు ఆక్రమిస్తే సహించం

అద్దంకి, న్యూస్‌టుడే : సాగర్ కాలువల్ని ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని, యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగిస్తామని ముండ్లమూరు ఎన్నెస్పీ డీఈఈ పూర్ణచంద్ర అన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు గురువారం మోదేపల్లి మేజరు కాలువపై ఆయన పర్యటించారు. మోదేపల్లి మరమ్మతులకు రూ.మూడు కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆయా నిధులతో చిల్లచెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేస్తామన్నారు. ఈ ఏడాది మోదేపల్లి మేజరు ఆయకట్టు చివరి భూములైన కొటికలపూడి, కుంకుపాడు, మోదేపల్లి గ్రామాలకు సాగునీరు అందించినట్లు వెల్లడించారు. తిమ్మాయపాలెం మైనరు కాలువ పొడవునా ఉన్న కబ్జాలను తక్షణం తొలగిస్తామని డీఈ వెల్లడించారు. ముండ్లమూరు శంకరాపురం సమీపం నుంచి మూడు కిమీ పొడవునా కాలువ ఆనవాళ్లు లేకుండా పోయిందన్నారు. సాగర్ కాలువల్ని ఎవరు ఆక్రమించవద్దని, ఇతర రైతులకు ఇబ్బంది కలిగించొద్దని హితవు పలికారు.

స్థలాలు కాపాడాలని గ్రామస్థుల వినతి

తహసీల్దారు శింగరావుకు వినతిపత్రం అందిస్తున్న బైటమంజులూరు వాసులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: తాము కొనుగోలు చేసిన స్థలాన్ని మరో వ్యక్తి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారంటూ బైటమంజులూరువాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలానికి చెందిన గ్రామస్థులు తమ స్థలాలను కాపాడాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శింగరావుకు గురువారం వినతిపత్రం అందించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో సర్వే నెంబరు 105లో కొంత భూమి ఉంది. అందులో 1975లో ఓ ఎకరం పాఠశాలకు రిజిస్టర్ చేయగా, మిగిలిన 2.46 ఎకరాలను గ్రామానికి చెందిన 19 మంది కొనుగోలు చేశారన్నారు. ఆ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు తహసీల్దారుకు విన్నవించారు. ఈ విషయమై తహసీల్దారు శింగరావు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. చక్రవరం శివరాజు, తల్లపనేని రామారావు, అనిల్‌కుమార్, అప్పలరాజు, లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వెలుగు

బల్లికురవ, న్యూస్‌టుడే: విద్య ఒక్కటే జీవితంలో వెలుగు నింపుతుందని తహసీల్దార్ రవినాయక్ అన్నారు. గురువారం గుంటుపల్లి గ్రామ సమీపంలోని మహాత్మాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి సీడీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆత్మవిశ్వాసంతో రాస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవో-2 రమేష్‌బాబు మాట్లాడారు.

భక్తులకు అన్నదానం

తాళ్లూరు, న్యూస్‌టుడే : తాళ్లూరు శివారు కొత్తపాలెంలో వెంచేసి ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు విశేషంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వేదపఠనముతో బాబాకు అభిషేకాలు, అష్టోత్తరం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తదుపరి తాళ్లూరు, కొత్తపాలెం, మాధవరం, విఠలాపురం, తదితర గ్రామాలనుంచి భక్తులు విరివిగా తరలి వచ్చి బాబాకు కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. తర్వాత వారందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేయడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. పలువురు పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వేసవికి రూ.25 లక్షలతో కార్యాచరణ

✧ దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు ✧ అద్దంకి కమిషనర్ రవీంద్ర

ముఖాముఖి

న్యూస్‌టుడే, అద్దంకి :

అద్దంకి మేజరు పంచాయతీ నుంచి నగర పంచాయతీగా.. అనంతరం మూడో శ్రేణి పురపాలక సంఘంగా మారింది. అయితే వేసవి వేళ మంచినీటి సమస్యపై కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అద్దంకి పురపాలక కమిషనర్ డి. రవీంద్రతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. వచ్చే వేసవిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూ.24 లక్షలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఆ విశేషాలు..

శివార్లలో సమస్య తలెత్తకుండా..

అద్దంకి పట్టణంలోని శివారు కాలనీలకు ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నాం. 19వ వార్డులోని బత్తులవారిపాలెం, కట్టకిందపాలెం, మొండితోకపాలెం, శ్రీరాం నగర్ కాలనీలో కొంత ఇబ్బంది ఉంది. గుండ్లకమ్మ నీటిని శుద్ధిచేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం. మే లోనూ ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదు. విద్యుత్తు కోతలుంటే జనరేటర్ సాయంతో అధిగమిస్తాం.

వచ్చే ఏడాది అందుబాటులోకి భారీ నీటి పథకం

ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిధులతో చేపట్టిన భారీ రక్షిత మంచినీటి పథకం 2027 నాటికి పూర్తయ్యే అవకాశముంది. తమ్మవరం వద్ద గుండ్లకమ్మ నది నుంచి పైపులైన్ నిర్మించి పట్టణంలో రక్షిత మంచినీటి పథకాల ద్వారా కుళాయిలకు నీరందిస్తాం. దీనికి గాను ఇప్పటికే ఎన్నెస్పీ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏఎంసీ ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. మరో నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. మిగిలిన పనులకు రూ.101 కోట్లు అవసరమని అంచనా వేశారు. టెండరు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తారు.

అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు

పట్టణంలోని గుంజివారిపాలెం, సాయిబాబా గుడి ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రత్యేక అదనపు సిబ్బందితో చెత్త తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

రూ.ఏడు లక్షలతో చలివేంద్రాలు

అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని ఏడు ప్రాంతాల్లో రూ.ఏడు లక్షలతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. గతేడాది మాదిరిగా శీతల శుద్ధజలాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నాం. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నెలకొల్పుతాం. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్నతీకరించిన అద్దంకిలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

250 బోర్లలో పుష్కలంగా జలం

సుమారు 50 వేల జనాభా కలిగిన అద్దంకి పట్టణంలో ప్రస్తుతం రెండు రక్షిత మంచినీటి పథకాల ద్వారా రోజుకు 25 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నాం. రామ్‌నగర్, కాకానిపాలెం రక్షిత మంచినీటి పథకాలు బాగా పనిచేస్తున్నాయి. దీంతోపాటు కార్యాలయ రక్షిత మంచినీటి పథకం సంపు ద్వారా నిరంతరాయంగా సరఫరా అవుతోంది. 5,450 ఇంటి కుళాయిలు కాక, 420 వీధి కుళాయిలు కూడా చక్కగా పనిచేస్తున్నాయి. 250 బోర్లతో వాడుక జలం అందుబాటులో ఉంది.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, న్యూస్‌టుడే : వివాహాలు, జాతరలు జరుగుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని అద్దంకి సీఐ సుబ్బరాజు సూచించారు. బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో జిల్లాలో గొలుసుల దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. మహిళలు బంగారు, వెండి ఆభరణాలు ధరించి ఒంటరిగా బయటకు రావద్దని ఓ ప్రకటనలో కోరారు.

2 ముక్కల్లో

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

బల్లికురవ, న్యూస్‌టుడే: మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉప్పుమాగులూరు గ్రామంలో పర్యటించనున్నారు. ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

గుంతను పూడ్చిన సిబ్బంది

జె.పంగులూరు, న్యూస్‌టుడే: కొండమూరు కూడలిలో ప్రమాదకర గుంతతో స్థానికులు పడుతున్న అవస్థలపై ఈ నెల 2న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పీఆర్ ఏఈ గడ్డం హనుమంతరావు గురువారం రోడ్డు నిర్వహణ సిబ్బందితో గుంతను పూడ్చించారు.

జూదరుల అరెస్టు

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే : ఏల్చూరు జగనన్న కాలనీలోని పేకాట శిబిరంపై సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ దివ్యాంగుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో వేములబండ పంచాయతీలోని రమణారెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. ఏఎస్సై హనుమంతరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గండూరి వెంకట్రావు(43) దివ్యాంగుడు. ఆయన సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 12న ఆయన పని నిమిత్తం బయటకు వెళ్లి 15న ఇంటికి తిరిగిరాగా, కుటుంబ సభ్యులెవరూ లేరు. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా పెళ్లికి వెళ్లడంతో మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బంధువులు వెంటనే ఆయన్ను గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్షలు సమకూర్చి..పుస్తకాలు దరిచేర్చి

కురిచేడు మండలంలోని పొట్లపాడులో శ్రీ రామయోగి సేవాసమితి ఆధ్వర్యంలో రూ.11 లక్షలతో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. గ్రామానికి చెందిన కొంతమంది ఉద్యోగులు, యువత బృందంగా ఏర్పడి శ్రీ రామయోగి సేవా సమితిని ఏర్పాటుచేశారు. సభ్యులందరూ వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని గ్రామంలోని ప్రధాన సమస్యలపై చర్చించేవారు. అందులో భాగంగా డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించి, సత్వరం నిర్మించారు. మరికొద్ది రోజుల్లో గ్రామ యువతకు అందుబాటులోకి రానున్నట్లు సేవా సమితి సభ్యులు వెంకటస్వామి, యోగి తెలిపారు. న్యూస్‌టుడే, కురిచేడు :

సాగర్ ఆయకట్టులో సిరుల పంట

ధాన్యం దిగుబడులతో అన్నదాతల లోగిళ్లు నిండాయి. సంతమాగులూరు, అద్దంకి, కొరిశపాడు ఎన్నెస్పీ సబ్ డివిజన్ల పరిధిలో ఈ ఏడాది 33 వేల ఎకరాల్లో వరి సాగైంది. పైరు వేసిన దగ్గర నుంచి కోతల వరకూ సాగు నీరు విడుదల కావడం..ప్రకృతి వైపరీత్యాలు సంభవించకపోవడంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. ఎన్‌ఎల్‌ఆర్, ఎల్‌ఆర్ రకం వంగడాలను రైతులు సాగు చేశారు. ఎకరానికి సగటున 30 నుంచి 40 బస్తాల మేర దిగుబడులొచ్చాయి. మంచి రేట్లు ఉండటంతో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సంతమాగులూరు, అద్దంకి న్యూస్‌టుడే:

సమైక్య కృషితో తిరునాళ్ల విజయవంతం

శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ల గోడపత్రికను మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈనెల 28న ప్రారంభమయ్యే వార్షిక వేడుకలు మార్చి 2 తేదీతో ముగుస్తాయి. సమైక్య కృషితో తిరునాళ్లను విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. సహాయ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రస్టీలు పద్మజ, నూతి లక్ష్మీప్రసాద్, దేవరపల్లి సురేష్‌బాబు పాల్గొన్నారు.– అద్దంకి, న్యూస్‌టుడే :

ఎట్టకేలకు వీడిన చెత్త సమస్య

వ్యర్థజలాలు, ప్లాస్టిక్‌తో బల్లికురవ బస్ స్టాండ్ ఆవరణ అధ్వానంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించారు. గురువారం పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం జేసీబీ, ట్రాక్టర్లను ఏర్పాటుచేసి వ్యర్థాలను తొలగింపజేశారు. దుకాణదారులు వ్యర్థాలు, మురుగునీటిని ఆర్టీసీ ప్రాంగణంలో వదిలితే నోటీసులు జారీ చేస్తామన్నారు. – బల్లికురవ, న్యూస్‌టుడే:

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

అద్దంకి, న్యూస్‌టుడే : ఇంటర్ ప్రశ్నపత్రాలు గురువారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. పట్టణంలోని ప్రభుత్వ, శ్రీచైతన్య, విశ్వభారతి జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ నెల 23 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం 1067 మంది, ద్వితీయ సంవత్సరం 911 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు యు.కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. అనంతరం జూనియర్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అధ్యాపకులు రాజేశ్వరమ్మ, బుజ్జిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలు ప్రైవేటుకు అప్పగించడం తగదు

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి ఆర్టీసీ ప్రాంగణంలో స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. డిపో కార్యదర్శి సుబ్బారావు అధ్యక్షత వహించారు. గుంటూరు-2, నెల్లూరు-2, విద్యాధరపురం, మంగళగిరి డిపోలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం తగదన్నారు. అనంతపురం కర్నూలు, కడప, కాకినాడ, రాజమహేంద్రపురంతోపాటు మరి కొన్ని డిపోలు, గ్యారేజీల్లో పాక్షికంగా కొంత భాగాన్ని ప్రైవేటు కంపెనీలకు ఇవ్వడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ ఆస్తుల్ని ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు దీనిపై ఎస్‌డబ్ల్యుఎఫ్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జనరల్ కార్యదర్శి అయ్యపరెడ్డి, తిరుపతిరెడ్డి, రత్నకుమార్, శంషావలీ, అనూష, బీబీ జాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోతవరం వాసి ఆత్మహత్య

తాడేపల్లి, న్యూస్‌టుడే: దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన ఆవుల తిరుమలకొండ(45) గుంటూరు జిల్లా తాడేపల్లి బోటు యార్డు వద్ద డెల్టా కాలువ పక్కన చెట్టుకు గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. అతడి మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు శవపంచనామా నిమిత్తం తరలించినట్లు తెలిపారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే తిరుమలకొండకు ఇద్దరు సంతానం. ఒకరు వడ్డేశ్వరంలోని కేఎల్‌యూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు 8వ తరగతి గుంటూరు భాష్యం పాఠశాల వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తిరుమలకొండ.. పెద్దకుమారుని వద్దకు వెళుతున్నానని చిన్నకుమారునికి చెప్పి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

కులదూషణపై కేసు నమోదు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో గురువారం కులదూషణపై కేసు నమోదైంది. సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు..పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాలుడిని బీసీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కులం పేరుతో దూషించారు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

అద్దంకి, న్యూస్‌టుడే : నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై ఎన్టీఆర్‌నగర్ పెట్రోలు బంకు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు నెల్లూరు మహిళలకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళుతున్న కారు అదుపు తప్పి ఎన్టీఆర్‌నగర్ వద్ద ఇనుప గ్రిల్స్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జి.మస్తానమ్మ, ఎస్ భవానీలకు గాయాలయ్యాయి.


ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌తో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కుటుంబ సభ్యులు

శింగరకొండకు భారీగా ఆదాయం

అద్దంకి: శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేయనున్న దుకాణాలకు గురువారం వేలం నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి చక్రాయపాలెం మలుపు వరకు ఈ దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. వేలంలో అద్దంకికి చెందిన ఎస్.శ్రీకాంత్ అత్యధికంగా రూ.16.26 లక్షలకు పాడారు. గత ఏడాది జరిగిన వేలంలో రూ.14.55 లక్షల ఆదాయం సమకూరింది. డీఎల్‌పీవో సువార్త, ఎంపీడీవో వరూధిని, చెన్నయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి మండలం కొత్తపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు అక్కడి ప్రాథమిక పాఠశాల్లోని 368 మంది విద్యార్థులకు గురువారం వైద్యాధికారి డాక్టరు కల్లూరి వెంకట శ్రీనివాసులు రక్త పరీక్షలు చేశారు. రక్త గ్రూపుల నిర్ధరణతోపాటు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి సూచనలు చేశారు. సర్పంచి బట్టు రాము, హెచ్‌ఎం కిరణ్మయి, ల్యాబ్ టెక్నీషియన్ వసంత్ కుమార్, సీహెచ్‌వో సరళ, కేశవకుమార్, ముకుంద, వెంకట్, ప్రశాంతి, అశోక్‌కుమార్, కరుణ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని బాపట్ల డీఈవో శ్రీనివాస్ అన్నారు. కొండమంజులూరు, చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులకు ప్రశ్నలడిగి వారి విద్యా సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠశాలలో వంద రోజులు, 75 రోజుల ప్రణాళికల గురించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇమ్మడి అనిత, చందలూరి గిరిజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మేదరమెట్ల: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదవాలని డీఈవో శ్రీనివాస్ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. డిప్యూటీ డీఈవో గంగాధరరావు, కొరిశపాడు ఎంఈవోలు పున్నయ్య, వీరరాఘవయ్య, హెచ్‌ఎం అంజనీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ

పరీక్షలు రాస్తున్న మహిళలు

తాళ్లూరు, న్యూస్‌టుడే : తూర్పుగంగవరంలో గురువారం బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ముగిశాయి. మూడు నెలల నుంచి జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యాన మహిళలకు పాల్వాది సునీత శిక్షణ ఇచ్చారు. పర్యవేక్షకులు సునీల్ తర్ఫీదు తీరును పరిశీలించారు. అనంతరం వారికి పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి త్వరలో ధ్రువపత్రాలు అందించనున్నారు.

మినీ బైపాస్ నిర్మాణంలో కదలిక

బైపాస్ నిర్మాణానికి సిద్ధంచేసిన విద్యుత్తు స్తంభాలు

న్యూస్‌టుడే, అద్దంకి :

మినీ బైపాస్ నిర్మాణంలో కదలిక వచ్చింది. రహదారి అంచుల్లో విద్యుత్తు స్తంభాల ఏర్పాటును విద్యుత్తు, పురపాలక అధికారులు, ఇతర సిబ్బంది పరిశీలించారు. రెండు నెలల క్రితం మినీ బైపాస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రామ్‌నగర్ నుంచి రేణంగివరం రహదారి వరకు సుమారు 1.5 కి.మీ. పొడవున ఎన్నెస్పీ కాలువకు ఇరువైపులా ఇళ్లను నిర్మించుకున్న వారు స్వచ్ఛందంగా ఖాళీ చేశారు. దీంతో జిల్లా సర్వేయరు సారథ్యంలో రహదారి అంచుల్లో సరిహద్దులు నిర్ణయించారు. కొండ గ్రావెల్‌తో రోడ్లు ఏర్పాటుచేయడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. తదనంతరం పనులు నిలిచిపోయాయి. కాలువకట్ట వెంబడి నిర్మాణదారుల్లో ఒకరిద్దరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అధికారుల వేగానికి కళ్లెం పడినట్లు భావించారు.

సాగర్ కాలువ తవ్వుతాం – డి.రవీంద్ర, పురపాలక కమిషనర్

మినీ బైపాస్ నిర్మాణంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు ఇది అవసరం మొత్తం 72 అడుగుల వెడల్పు గల కాలువకట్టను గుర్తించాం. ఇందులో రెండు వైపులా 28 అడుగుల చొప్పున రహదారి నిర్మిస్తాం. సాగర్ కాలువ నిర్మిస్తాం. వీధి దీపాలు, మురుగు కాలువలు, సుందరీకరణ పనులు చేస్తాం.

అయితే ఇలాంటి అంశాలను న్యాయ, చట్టపరంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధపడి ముందుకు వెళుతున్నట్లు సమాచారం.

వేడుకల్లో పాల్గొన్న యువకులు, గ్రామ పెద్దలు

యువతకు ఆదర్శం ఛత్రపతి శివాజీ

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలోని కురిచేడు ప్రధాన సెంటర్లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, యూత్ సభ్యులు కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివాజీ దేశభక్తి, అంకితభావం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా భక్తిగీతాలు ఆలపించి, నినాదాలు చేశారు. అనంతరం ఆయన్ను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కిషోర్, చప్పిడి రామ్, నాగేశ్వరరావు, రామారావు, రాజా, సురేంద్ర, అయ్యపుశెట్టి పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ఆరంభం

తాళ్లూరు, న్యూస్‌టుడే : దర్శి, తాళ్లూరు, అద్దంకి ప్రాంతాల్లో గురువారం రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం, రజానగరం, రమణాలవారిపాలెం, బొద్దికూరపాడు, నాగంబొట్లపాలెం, సోమవరప్పాడు, రామభద్రాపురంతో పాటు దర్శిలో పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులున్నారు. ఇప్పటికే మసీదులను శోభాయమానంగా తీర్చిదిద్దారు. సహరీ, ఇఫ్తార్‌తో పాటు రాత్రి నిర్వహించే తరావీ నమాజ్‌లతో సందడి నెలకొంది.

రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు

దర్శి (తాళ్లూరు), న్యూస్‌టుడే : దర్శి మండలం చలివేంద్ర వద్ద ఉన్న సేవాశ్రమంలో గురువారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ప్రత్యేక పూజలుచేసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా చెన్నలత బృందం భక్తి గీతాలు ఆలపించింది. ఆశ్రమ కార్యదర్శి ఎం.కామేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: దర్శి పట్టణ శివారు శివరాజ్‌నగర్‌లో గురువారం పశు సంవర్ధకశాఖ తరపున పాడి రైతులకు రాయితీలపై పశువుల దాణాను దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. తెలుపు రంగు రేషన్‌కార్డు కలిగిన పేద రైతులకు యాభై కిలోల బస్తాను యాభై శాతం రాయితీపై రూ. 555ల వంతున పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పశు సంవర్ధకశాఖ ఏడీ ఎ.పురుషోత్తంరాజు, ఏఎంసీ ఛైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, కౌన్సిలర్ రామగిరి, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై దాణా పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

పనిభారం తగ్గించాలని వీఆర్వోల నిరసన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్వోలు మూడో రోజు నిరసన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం నల్లరిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ.. తమపై పని భారాలను తగ్గించాలన్నారు. రాత్రుళ్లు సైతం సమావేశాల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిరెడ్డి,శ్రీనివాసులు, శ్రీనివాసరావు, హనుమంతరావు, జాలయ్య, సంజీవరావు, వినీల, మధు, సర్వేయర్లు శివ, అనూష, వీఆర్ఏలు భాస్కర్, మల్లేశ్వరిలు పాల్గొన్నారు.

తెదేపా సభ్యత్వానికి రాజీనామా

చీమకుర్తి: తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు అవిసినేని వెంగన్న తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెంగన్న గతంలో బాపట్ల పార్లమెంట్ నియోజక వర్గ కార్యనిర్వహక కార్యదర్శిగా పనిచేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగర పరిధిలోని స్తంభాల మరమ్మతుల కారణంగా వంట కాలనీ, గాంధీ పార్కు, కొండయ్య బొంకు, సాయిబాబా గుడి, మంగమూరురోడ్డు, విన్నకోట వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తుశాఖ డీఈ పాండు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీకృష్ణ, హౌసింగ్ ఏఈ శంకర్ నారాయణ

ఉగాది నాటికి లబ్ధిదారులకు ఇళ్లు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో శ్రీకృష్ణ సూచించారు. గురువారం మండలం అల్లూరు గ్రామంలో ఆర్‌ఆర్‌కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు ఆలస్యం కాకుండా వెంటనే పూర్తి చేయాలని కోరారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ రూ.70, ఎస్సీ, బీసీలకు రూ.50 ఇస్తుందన్నారు. ఉగాది నాటి పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శంకర్ నారాయణ, ఇంజినీరింగ్ సహాయకురాలు రేష్మా పాల్గొన్నారు.

నారీ యాప్‌పై అవగాహన

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మైనంపాడులో నారీ యాప్ సర్వేను వెలుగు శాఖ డివిజన్ ఏపీడీ సి.నీలకంఠరెడ్డి పరిశీలించారు. నారీ యాప్‌లో ఎలా నమోదు చేస్తున్నారు, ఎంత మందిని నమోదు చేశారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారీ సభ్యులు, వీవోఏలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెలుగుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాంజలితో ప్రగతి!

❖ పాఠశాలల వివరాల నమోదుకు చర్యలు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఒంగోలు మండలం ఉలిచి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షిత తాగునీరందించేందుకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు రూ.80 వేలుతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ సర్పంచి చుంచు శేషయ్య తమ వంతు సహకారం కింద రూ.3.60 లక్షలతో పాఠశాల ముఖద్వారం నిర్మించారు. కరవది గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించారు.

మౌలిక సదుపాయాల కల్పన దిశగా..

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత మొత్తంలో నిధులు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో వసతులు మాత్రం సమకూరడం లేదు. దాతలను స్ఫూర్తిగా తీసుకుని విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 'విద్యాంజలి' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సేవా భావంతో ముందుకొచ్చే ప్రవాసాంధ్రులు, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు హంగులు కల్పించనున్నారు. పాఠశాలల అవసరాలు గుర్తించి వివరాలను విద్యాంజలి 2.0 పోర్టల్‌లో నమోదు చేయడానికి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు ఎంఈవోల ఆధ్వర్యంలో ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు. పోర్టల్‌లో పాఠశాలలను ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో అవగాహన కల్పించారు.

వ్యయం అంచనాల నమోదు

పోర్టల్‌లో యూడీఐఎస్‌ఈ కోడ్, పాఠశాల పేరు, చిరునామా, ప్రధానోపాధ్యాయుని పేరు, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ తదితర వివరాల నమోదుతో రిజిస్ట్రేషన్ పూర్తవుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాలల్లోని సదుపాయాలు, అదనంగా కావాల్సినవి, అందుకయ్యే వ్యయం వివరాలు పొందుపరచాలి. ఆర్థిక సాయానికి ముందుకొచ్చే దాతలు వెబ్‌సైట్‌లోని వాలంటీర్ రిజిస్ట్రేషన్ విభాగంలో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు ఏదైనా సబ్జెక్టు బోధనకు ఆసక్తి ఉన్నవారు పాఠశాలలను టాగ్ చేసుకుని సేవలందించవచ్చు. ఆసక్తి ఉన్నవారు జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే పోర్టల్‌లో నమోదుకు సహకారం అందించనున్నారు. విద్యాంజలి పథకం గతంలోనూ అమల్లో ఉంది. అప్పట్లో పూర్తిస్థాయి డిజిటల్ ప్లాట్‌ఫాం లేదు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో చేయూత అందించడానికి ముందుకొచ్చే వారితోపాటు; పాఠశాలలకు అవసరమైన వివరాలన్నీ పక్కాగా రిజిస్టర్ చేసేవిధంగా చర్యలు చేపట్టారు. ఆసక్తి ఉన్నవారు vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో వాలంటీర్‌గా రిజిస్టర్ చేసుకుని, మీకు దగ్గరలోని పాఠశాల అవసరాలను తీర్చే అవకాశం ఉంది.

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
ఒంగోలు	82	7,555
కొత్తపట్నం	52	5,518
ఎస్ఎన్‌పాడు	42	3,950
ఎన్‌జీపాడు	64	4,004
మద్దిపాడు	50	3,378
చీమకుర్తి	62	5,827

పాఠశాలకు నూతనంగా నిర్మించిన ముఖద్వారం

మంత్రి లోకేశ్‌తో దామచర్ల కుటుంబసభ్యులు, విజయ్‌కుమార్

ఆత్మీయ కలయిక

ఒంగోలు గ్రామీణం : ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులతో ఉండవల్లిలోని నివాసంలో గురువారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌ని ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ కలిశారు. వివిధ సమస్యలు, నియోజక వర్గ అభివృద్ధి పనులు చర్చించారు. అనంతరం ఆడపడుచులకు మా ఇంటి గౌరవం అంటూ లోకేశ్ మహిళలకు మంగళగిరి పట్టు చీరలు అందించారు.

శింగరకొండకు భారీగా ఆదాయం

అద్దంకి, న్యూస్‌టుడే: శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేయనున్న దుకాణాలకు గురువారం వేలం నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి చక్రాయపాలెం మలుపు వరకు ఈ దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. వేలంలో అద్దంకికి చెందిన ఎస్.శ్రీకాంత్ అత్యధికంగా రూ.16.26 లక్షలకు పాడారు. గత ఏడాది జరిగిన వేలంలో రూ.14.55 లక్షల ఆదాయం సమకూరింది. డీఎల్‌పీవో సువార్త, ఎంపీడీవో వరూధిని, పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

రద్దీమార్గం.. జర భద్రం

నగరంలోని కాపు కల్యాణ మండపం నుంచి ఆర్టీసీ డిపోకు వెళ్లే మార్గంలో పెద్ద గొయ్యి తీసి వదిలేశారు. గోతిని పూడ్చకుండా అలానే వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి భద్రత బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు నిత్యం రద్దీగా ఉండేగా మార్గం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

చీమకుర్తి బైపాస్ రహదారి తూర్పు, పడమర వైపు కూడళ్లలో ఏర్పడిన గోతుల వల్ల వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరమ్మతులు లక చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రెండు కూడళ్లలో నాలుగుకు పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ రెండు ప్రాంతాలతో పాటు, చీమకుర్తి శివారు సినిమాహాళ్ల ప్రాంతం, గ్రానైట్ క్వారీలు, మర్రిచెట్లపాలెం వంతెన వద్ద మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు అయితే పనులు చేస్తామని ఆర్‌అండ్‌బీ వారు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం రెండు కూడళ్లలోనైనా గుంతలను పూడ్చించేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

అసంపూర్తి పనులు.. రాకపోకలకు అవస్థలు

సంతపేట మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద జీవుల వైపు లైన్ మరమ్మతుల కోసం రహదారి పగలగొట్టి గుంత తీశారు. గుంతను పూడ్చివేశారు కాని రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవ్వినచోట సిమెంట్ రోడ్డు అంచుల వద్ద మట్టిలేచిపోయి వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య వివరణ కోరగా త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. - ఒంగోలు నగరం, న్యూస్‌టుడే

కార్యాలయాల చుట్టూ చిల్లచెట్లు

కొత్తపట్నం మండల కార్యాలయాల వద్ద గుంపులుగుంపులుగా చిల్ల చెట్లు పెరిగిపోయాయి. ఇక్కడే మండల కార్యాలయాలైన తహసీల్దార్, మండల పరిషత్, పోలీసు స్టేషన్ పలు కార్యాలయాలు ఇక్కడే ఉంటాయి. సమస్యలు కోసం వచ్చిన ప్రజలు పాములు కనపడటంతో భయాందోళనలకు గురవుతున్నారు. మండల కార్యాలయాల వద్ద చిల్ల చెట్లు పెరిగిపోయిన అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పెరిగిపోయిన చిల్లచెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. - కొత్తపట్నం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

కొత్తపట్నం, న్యూస్ టుడే:

?: కొత్తపట్నం గ్రామంలో తుమ్మకూరిపాలెం రోడ్డు వ్యర్థాలు పెరుకుపోతున్నాయి. సమస్యను పరిష్కరించగలరు.
– ప్రసాద్, స్థానికుడు.

✓: వ్యర్థాలు వెంటనే తొలగిస్తాం. – వేణు గోపాల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో.

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: మద్దిపాడు మండల కేంద్రంలో పాఠశాల వదిలినప్పుడు విద్యార్థులు బస్సుల కోసం నిలబడి వేచి చూస్తున్నారు వారు కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేయాలి.
– నూనె శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు.

✓: రవాణా శాఖాధికారులతో చర్చించి విద్యార్థులు కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేయిస్తాం.
– నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి.

?: మద్దిపాడు మండలం గుండ్లాపల్లి ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. వీటి వల్ల దోమల వ్యాప్తి అధికమవుతోంది. – అంజయ్య, గ్రామ వాసి.

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయించి దోమల నివారణకు పిచికారీ చేయిస్తాం. – మణిదీప్ ఇంఛార్జి, పంచాయతీ కార్యదర్శి,

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: చీమకుర్తి కోటకట్లవారి బజారు శివారు కొత్త సినిమాహాలు కూడలిలో వీధిదీపం వెలగడం లేదు. సమస్యను పరిష్కరించగలరు.
– ఏ.సుబ్బారావు. చీమకుర్తి.

✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
– వై.రామకృష్ణయ్య. కమిషనర్ చీమకుర్తి.

కాలనీవాసుల సమస్యలపై చలో కలెక్టరేట్

స్థానికులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు సర్వే నం.186లోని కార్మికనగర్ కాలనీ వాసుల సమస్యలపై ఈ నెల 23న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు పేర్కొన్నారు. ఇళ్లు కూల్చివేతకు గురైన కార్మికనగర్ కాలనీ వాసులను గురువారం ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 15 సంవత్సరాలుగా ఈనాం భూమిలో రేకులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామన్నారు. ఈ నెల 4న కొందరు జేసీబీల సహాయంతో కూల్చి వేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఈ మేరకు కాలనీవాసులకు న్యాయం జరిగే వరకు 'వంటా-వార్పు' నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు డి.లక్ష్మీనారాయణ, పేరయ్య, పి.సుధాకర్, దాసరి సుందరం, డి.అప్పారావు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేలా కృషి

కారుమంచి మేజర్‌కాలువ కట్టపై రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ వరలక్ష్మి

చీమకుర్తి, సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సాగరు కారుమంచి మేజర్ కాలువ చివరి ఆయకట్టుకు నీరుందేలా చర్యలు చేపట్టినట్లు జల వనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మీ పేర్కొన్నారు. చీమకుర్తి నుంచి సంతనూతలపాడు మండలం ఎనికపాడు వరకు గురువారం ఆమె కారుమంచి మేజర్ కాలువపై పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడారు. ఎగువ ప్రాంతంలో తూములన్నింటిని మూసి వేసి ప్రస్తుతం దిగువకు నీరు నడుపుతున్నట్లు చెప్పారు. చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపట్టినందున రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దివాకర్, గిరిబాబు, నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు అందుకున్న విద్యార్థులతో దాత

విద్యతో ఉన్నత శిఖరాలు

మద్దులూరు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: మండలంలోని మద్దులూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో దాత ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గురువారం గ్రామానికి చెందిన గుట్టపల్లి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన భార్య సులోచన రూ.25వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులను పాఠశాల్లోని 150 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దాతల సహకారంతో విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజ సేవకు పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో దోమల నియంత్రణ లేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 16 వ తేదీ సోమవారం ఈనాడు దినపత్రికలో " కాలువలిలా... దోమలు వదిలేదెలా ?" శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంకు స్పందించిన పంచాయతీ అధికారులు వైద్యసిబ్బంది గురువారం కొలచనకోట గ్రామంలో గ్రామ సర్పంచి డొక్కా మరియమ్మ, కార్యదర్శి మీరా ఆధ్వర్యంలో ప్రధాన రహదారితో పాటు కాలువలపై, గ్రామంలోని వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ మద్దిపాడు మండల కేంద్రంలో ఇందిరమ్మకాలనీకి వెళ్లే దారిలో పైప్‌లైన్ లీక్ అయి నీరు వృథాగా పోతుంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. " మేమున్నాం... మీకు తోడుగా.. " లో ఈ నెల 18 వ తేదీన వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ కార్యదర్శి నూరుల్లా 19 వ తేదీ గురువారం పంచాయతీ కార్మికులను పంపి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు.

కేకు కోసి సందడి చేస్తున్న సంఘం ప్రతినిధులు

ఘనంగా ఛత్రపతి జయంత్యుత్సవం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మరాఠీపాలెంలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరాఠీ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. మొఘలు సామ్రాజ్యాన్ని ఎదిరించి సనాతన ధర్మానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. సంఘ అధ్యక్షుడు కాళే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశభక్తికి, ధైర్య సాహసములకు మారు పేరు ఛత్రపతి శివాజీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, తిరుమలరావు, కృష్ణమోహన్, శివ, సుబ్బారావు, శంకర్, వీహెచ్‌పీ సభ్యులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయండి

యరజర్లలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో రాజశేఖర్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు 21వ తేదీ నాటికి కుటుంబ సమగ్ర సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ ఆదేశించారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. యాప్‌లో నమోదు చేస్తున్న తీరు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని మొత్తం కుటుంబాలు, వారి ఆదాయ వివరాలపై ఆరా తీశారు. కుటుంబ స్థితిగతులతోపాటు, వారి సమగ్ర సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

శీతల గిడ్డంగులకు పొగాకు బేళ్లు!

❖ రైతులకు తప్పని వ్యయప్రయాసలు

న్యూస్‌టుడే, చీమకుర్తి, సంతనూతలపాడు

ఈ ఏడాది ఇప్పుడిప్పుడే పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యే సూచనలు కనిపించకపోవడంతో రైతులు పొగాకు బేళ్లను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. అధిక శాతం మంది రైతులు పొగకు చెక్కులు (బేళ్లు) గిడ్డంగులకు తరలిస్తుండటంతో వీటి బాడుగను యజమానులు ఏడాదికేడాదికి పెంచుకుంటూపోతున్నారు. గతేడాది ఒక్కో బేలుకు రూ.740గా ఉన్న మొత్తాన్ని ఈ ఏడాది రూ.810కి పెంచడం గమనార్హం.

❖ ఒంగోలు పొగాకు వేలం కేంద్రం పరిధిలోని చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు గ్రామీణ మండలాల్లో ఈ ఏడాది సుమారు 17 వేల ఎకరాల్లో పొగాకు సాగుచేశారు. గతేడాది అక్టోబరులో నాట్లు ప్రారంభం కాగా, ఈ నెల మొదటి వారం వరకు మొక్కలు వేస్తూనే ఉన్నారు. నవంబరులో వచ్చిన తుపాను అనంతరం వర్షాలు లేకపోవడంతో

గోదాములో నిల్వ చేసేందుకు ట్రాక్టర్లలో తెచ్చిన పొగాకు బేళ్లు

తోటలను కాపాడు కునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేశారు. సాగరు కాలువలు, వాగులు, చెక్ డ్యాంలు ఎక్కడ కాస్తంత సాగునీరు అందుబాటులో ఉన్నా తోటలకు తరలించిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఏడాది రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయి. నాణ్యమైన దిగుబడులు రావడంతో మార్కెట్‌పైనే రైతన్నలు గంపెడాశతో బోర్డు ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.

❖ గతేడాది మార్చి మొదటి వారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించారు. సాధారణంగా కొనుగోళ్లు ప్రారంభించే నెల ముందుగా బోర్డు అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది ఆ దిశగా చర్యల్లేని పరిస్థితుల్లో కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని భావిస్తున్న రైతులు పొగాకు బేళ్లను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. నాణ్యత దెబ్బ తినకుండా ఉండడం, గిట్టుబాటు ధరలు లభిస్తాయనే ఆశాభావంతో పలువురు రైతులు అధిక వ్యయ ప్రయాసల కోర్చి బేళ్లను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న గిడ్డంగుల యజమానులు కిరాయి పెంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాధ్యమైనంత త్వరగా పొగాకు కొనుగోళ్లు ప్రారంభించేందుకు బోర్డు చర్యలు చేపట్టాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు నేరం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.విక్టోరియా రాణి అన్నారు. గురువారం కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలిసి, తెలియని వయసులో పెళ్లి చేసుకోవడం ద్వారా కలిగే నష్టాలకు వివరించారు. బాల్య వివాహాలు చేస్తుంటే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాల్య వివాహం వద్దు, చదువు ముద్దు అనే నినాదంతో ప్రదర్శన నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

జె.పంగులూరు: పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని బాపట్ల డీఈవో శ్రీనివాస్ అన్నారు. కొండమంజులూరు, చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులకు ప్రశ్నలడిగి వారి విద్యా సామర్థ్యాలను అంచనా వేశారు. పాఠశాలలో వంద రోజులు, 75 రోజుల ప్రణాళికల గురించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇమ్మడి అనిత, చందలూరి గిరిజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సాయంత్రం అల్పాహారం పంపిణీని గురువారం ప్రారంభించారు. పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, డిస్ట్రిక్ ఛైర్మన్ చలువాది బదరీనారాయణ, అధ్యక్షులు పార్థ సారథి, రమేష్, అంజిరెడ్డి, ప్రసాద్, షణ్ముఖ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

జయహో.. ఛత్రపతి

ఛత్రపతి శివాజీ జయంతిని వివిధ హిందూ సంస్థలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాయి. నెల్లూరు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్తు, ఆర్ఎస్ఎస్, హిందూ సేవాసమితి తదితర 11 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వీఆర్సీ మైదానంలో తొలుత ఏబీవీపీ ఆధ్వర్యంలో బహిరంగసభ నిర్వహించారు. అనంతరం కాషాయ జెండాలతో శివాజీసేన అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, శివాజీ సమితి నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులు మధు, హరిరెడ్డి, పెరుమాళ్లు, సోడా బాలాజీ, రమేష్, సన్నపరెడ్డి సురేశ్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

తేలుస్తారా.. తేల్చేస్తారా!

ఫ్రీహోల్డ్ వ్యవహారంపై నాన్చివేత

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారం ఎటూ తేలడం లేదు. ఫలితంగా నిషేధిత జాబితాలో చేర్చిన భూముల క్రయ విక్రయాలకు అర్హులు సైతం ఇబ్బంది పడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో భూములు కేటాయించిన తర్వాత.. 20 ఏళ్లు దాటితే ఫ్రీహోల్డ్ చేసి.. రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినా.. ఆ ముసుగులో నిబంధనలను అతిక్రమించారు. నాటి నాయకుల సిఫార్సులకే పెద్దపీట వేసి అడ్డగోలుగా వ్యవహరించారు. అసైన్డ్, చుక్కల, షరతులు ఉన్న భూముల కింద మొత్తం 98,785.51 ఎకరాలను నిషిద్ధ జాబితా నుంచి తొలగించగా.. వీటిలో సుమారు 14,834 ఎకరాలను అడ్డగోలుగా చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపి నెలలు గడుస్తున్నా.. నేటికీ చర్యలు లేవు. అర్హులైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

తొలగింపు అలా..
22ఏ నుంచి: (ఎకరాల్లో): 98,785.51
అందులో
అసైన్డ్: 55,447
ఇనాం: 67.58
చుక్కల: 43,270.93

ఉల్లంఘన ఇలా..
మొత్తం భూములు: 14,834.49
అందులో
అసైన్డ్: 14,552.87
ఇనాం: –
చుక్కల: 281.62

అక్రమార్కులపై చర్యలేవీ?

అసైన్డ్ భూములను అనుభవిస్తున్నవారు.. తమ తదనంతరం వాటిని వారసులకే అప్పగించాలి. 1954కు ముందు నాటి అసైన్డ్ భూములైతే కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ పొంది.. అమ్ముకోవచ్చు. గత వైకాపా పాలనలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. 2023 నాటికి 20 ఏళ్లు దాటినవి అమ్ముకోవచ్చు. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని.. భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. 'గిఫ్ట్' రిజిస్ట్రేషన్లు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 500 ఎకరాలకు పైగా రిజిస్ట్రేషన్లు జరగ్గా.. వీటిలో నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించారు. విచారణ పూర్తయి ఏడాది కావస్తున్నా.. ఇప్పటికీ చర్యలు లేవు. ఈ వ్యవహారాల్లో అప్పటి వైకాపా నాయకుల పాత్ర ఎంత మేర ఉందనే విషయాన్ని మాత్రం అధికారులు గుట్టుగా ఉంచారు.

● దీనిపై డీఆర్వో విజయకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలతో విచారణ చేసి.. పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేశాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్లక్ష్యాన్ని అంటుగట్టి.. మొక్కలను ఎండగట్టి!

ముగ్గురు అధికారుల నుంచి వివరణ కోరిన ప్రభుత్వం

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఉద్యానశాఖ పరిధిలోని పేరున్న నర్సరీలో మామిడి అంటు మొక్కల లెక్క తేలకపోవడం, పెద్దఎత్తున నష్టం రావడంపై విచారణ జరిపిన ప్రభుత్వం... అక్రమాలు తేలడంతో రాత పూర్వక వివరణ ఇవ్వాలని ముగ్గురు అధికారులను ఆదేశించడం చర్చనీయాంశమైంది.

లోపాలు ఇలా...

సర్వేపల్లి ప్రాంతంలోని హార్టికల్చర్ ఫారంలో 2014-15 నుంచి 2016-17 మధ్య కాలంలో మామిడి అంటు మొక్కల నిర్వహణలో లోపాలు చోటు చేసుకున్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా వేలాది మొక్కలు ఎండిపోయాయి. ప్రభుత్వ విచారణలో స్టాక్ రిజిస్టర్‌లో 29,985 మొక్కలు ఉండాల్సి ఉండగా.. 7,500 మాత్రమే ఉన్నట్లు తేలింది. మిగతావి లెక్క తేలలేదు.

సంరక్షణ కొరవడి..

మొక్కలకు సరైన సంరక్షణ లేక, సమయానికి అమ్మకాలు లేక.. అప్పట్లో పనిచేసిన ఏడీహెచ్ బి. రవీంద్రబాబు కాలంలో 15,095 అంట్లు ఎండిపోయి రూ. 3,65,815, మరో ఏడీహెచ్ ఉమాదేవి హయాంలో 6,580 అంట్లు ఎండిపోయి రూ. 1,51,340 నష్టం వాటిల్లినట్లు తేల్చారు. వీరిద్దరూ పనిచేసిన సమయంలో హార్టికల్చర్ అధికారిగా ఉన్న డి. రమేశ్ నిర్లక్ష్యం దీనికి కారణమని తేల్చారు.

సమీక్షలో వెలుగులోకి...

2024, ఏప్రిల్ 24న ఉద్యాన కమిషనర్ నిర్వహించిన సమీక్షలో అంటు మొక్కల కొరత వెలుగు చూసింది. విచారణాధికారి పరిశీలనలో పాత సంవత్సరాలకు చెందిన మొక్కలు నర్సరీలో ఎక్కడా లభించలేదని గుర్తించారు. పర్యవేక్షణ, స్టాక్ ధ్రువీకరణ, నర్సరీ తనిఖీ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదని నివేదికలో స్పష్టం చేశారు. బాధ్యులుగా తేల్చిన ముగ్గురు అధికారులపై కామన్ డిసిప్లినరీ ప్రొసీడింగ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అక్రమని నిర్ధారణ అయితే చర్యలు తప్పవు. సంబంధిత ముగ్గురు అధికారులు రాత పూర్వక వివరణ ఇవ్వాలని ఎక్స్ అఫిషియో స్పెషల్ సెక్రటరీ బి. రాజశేఖర్ ఆదేశించారు.

23న సైన్స్ సమగ్ర మహోత్సవం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకునే దిశగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 23న పాఠశాల స్థాయిలో 'సైన్స్ సమగ్ర మహోత్సవం- 2కే 26 పేరిట ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఆర్. బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచిస్తూ సైన్స్ వర్కింగ్ మోడల్స్‌ను రూపొందించి ఈ నెల 22వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో 24, 25 తేదీల్లో, జిల్లా స్థాయిలో 26న జరుగుతాయని.. విజేతలకు ఫిబ్రవరి 28న బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. విద్యార్థులు ముగ్గురు కలిసి ఒక టీమ్‌గా ఏర్పడి గైడ్ టీచర్ సహాయంతో మోడల్ చేయాలని, ప్రతి పాఠశాల నుంచి 10 టీమ్‌లు పాల్గొనవచ్చని తెలిపారు.

ఆహారం.. సంతృప్తికరం

అమలుపై 78.2 శాతం హర్షం

ఈనాడు, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం సరఫరా చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం అందించే ఆహారంలో నాణ్యత పెరిగింది. ఫలితంగా విద్యార్థుల్లో ఎక్కువ మంది నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. మెనూ సమర్థ అమలుతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ఈ విషయం స్పష్టమైంది. సంతృప్తి స్థాయి తెలుసుకునేందుకు ఇటీవల 5 ప్రశ్నలతో రాష్ట్ర వ్యాప్తంగా 2.27 లక్షల మందిని సంప్రదించగా.. 24.7 శాతం వ్యతిరేకంగా స్పందించారు. జిల్లాలో ఇవే ప్రశ్నలకు 78.2 శాతం సంతృప్తి, 21.8 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేస్తుండటాన్ని చాలా మంది హర్షించారు.

కావలి : మధ్యాహ్న భోజనం పెట్టించుకుంటున్న విద్యార్థులు

అయిదో స్థానంలో.. జిల్లా

వైకాపా ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా ఉన్న మెనూ.. కూటమి ప్రభుత్వం ధరలు పెంచడం(పీఎం పోషణ్)తో మెరుగుపడింది. పథకం ద్వారా జిల్లాలో 1.50 లక్షల మంది లబ్ధి పొందుతుండగా.. ఏడాదికి రూ. 35 కోట్ల నుంచి రూ. 40 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కాగా, కొన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు చేయకపోవడం.. వంటషెడ్లు నిర్మించినా ఆరుబయటే వంటలు చేయడం.. మెనూ అమలు కాకపోవడం.. వంటకు అల్యూమినియం పాత్రలు వినియోగిస్తుండటం.. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. సుమారు 20 శాతం మంది అసంతృప్తికి ఇవే కారణాలుగా తెలుస్తోంది. అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

సర్వేలో ప్రశ్నలు ఇలా(శాతాల్లో)!	అవును	లేదు
మెనూ ప్రకారం భోజనం	84.6	15.4
రుచి బాగుందా?	78	22
నాణ్యత	73.4	26.6
చిక్కి నాణ్యత	79.5	20.5
భోజనంలో అన్నం నాణ్యత	75.8	24.2

జిల్లాలో.. అమలవుతున్న పాఠశాలలు: 2,503 | విద్యార్థులు: 1,47,401 | ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 23 | చదువుతున్నవారు: 3491

అటు..ఇటు..క్రేను తృప్తి క్యాంటీను

రాష్ట్రంలో మొదటిసారిగా నెల్లూరు నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద తృప్తి క్యాంటీన్ ఏర్పాటు చేశారు. దాని అడుగు భాగంలో ఎలుకలు పందికొక్కులు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఆ ప్రాంతం అపరిశుభ్రంగా చేశాయి. విసిగిపోయిన నిర్వాహకులు క్యాంటీన్‌ను రైల్వే ప్రహరీ పక్కన ఏర్పాటు చేసి.. మరమ్మతుల అనంతరం గురువారం పొక్లెయిన్‌ల సాయంతో ఇలా యథాస్థానంలో ఉంచారు. – ఈనాడు, నెల్లూరు

నిపుణుల పరిశీలనకు.. నిరీక్షణ

సంగం, న్యూస్‌టుడే: రోజూ నాలుగు వేల వాహనాలు రాకపోకలు సాగించే నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై... సంగం కొండ నుంచి రాళ్లు జారిపడుతుండటం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో దినదినగండంగా ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తిరుమల ఘాట్ రోడ్డు తరహాలో చర్యలకు జాతీయ రహదారి విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఎదురు చూపులు తప్పడం లేదు. కృష్ణపట్నం, మంగళూరు ఓడరేవుతో పాటు రాయలసీమ.. నెల్లూరు జిల్లాకు అనుసంధానంగా ఉన్న ఈ జాతీయ రహదారి పటిష్టపరిచే పనులకు వేసవి అనువైన కాలమని, త్వరపడితే ప్రయోజకరమన్న మాట వినిపిస్తోంది.

కొండను బద్దలు కొట్టి...

వాహనాలు సంగంలోకి రాకుండా నేరుగా వెళ్లేలా 2015లో సుమారు 2.5 కి.మీ. పొడవునా కొండను బద్దలుకొట్టి రహదారి నిర్మించారు. ఉత్తరం వైపు వంద మీటర్ల మేర.. సుమారు పది మీటర్ల ఎత్తు నుంచి కొండ చరియలు జారిపడుతుండటం సంకటంగా మారింది. గత ఏడాది అక్టోబరులో ఒకేసారి 12 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆ సమయంలో రాళ్లు భారీగా పడ్డాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో ముప్పు తప్పింది.

జాతీయ రహదారిపై రాళ్లుజారిపడే ప్రదేశం

సూచనలు, సలహాలకు..

శాశ్వత పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాల కోసం జియోటెక్నికల్ విభాగం నిపుణలను ఆశ్రయించారు. వారు పరిశీలించి.. కొండపై రాళ్లు, మట్టి, భూస్థితిపై ఇచ్చిన నివేదిక మేరకు పనులు చేపట్టనున్నారు. ఇక్కడే ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీనిపై జాతీయ రహదారి విభాగం ఏఈ పాపారావుతో మాట్లాడగా... నిపుణుల పరిశీలన కోసం ఎదురు చూస్తున్నామని.. వారి నివేదిక మేరకు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కంట్రోల్ రూమ్ నంబర్ 0861 2320312

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య): ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా- బోర్డు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ప్రథమ, మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదలై.. మార్చి 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరగనుండగా.. 8.30 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని కన్వీనరు, ప్రాంతీయ పర్యవేక్షకులు టి. వరప్రసాదరావు తెలిపారు.

ప్రత్యేక నిఘా...

జిల్లాలో 12 సమస్యాత్మక, 3 అతి సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించారు. వీటిపై ప్రత్యేక నిఘాతో పాటు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను 33 స్టోరేజీ పాయింట్ల నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య కేంద్రాలకు చేరవేస్తున్నారు. ప్రథమ సంవత్సరం 26,935, ద్వితీయ సంవత్సరం 26,469 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వృత్తి విద్యకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 2,335 మంది పరీక్షలు రాయనున్నారు.

కేంద్రాలు: 81
విద్యార్థులు: 53,404
చీఫ్ సూపరింటెండెంట్లు: 81
డిపార్టుమెంట్ అధికారులు: 81
కస్టోడియన్లు: 17
ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు: 04
సిటింగ్ స్క్వాడ్‌లు: 05

కోట పోలీస్‌స్టేషన్ వద్ద ప్రశ్నపత్రాలు భద్రపరుచుకుంటున్న అధ్యాపకులు

రాష్ట్ర కార్యాలయంతో అనుసంధానం

పరీక్షల నిర్వహణను ప్రతిక్షణం పర్యవేక్షించేలా ఇంటర్ బోర్డు కార్యాలయం, రాష్ట్ర బోర్డు కార్యాలయానికి సీసీ కెమెరాలు అనుసంధానం చేశారు. అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 0861 2320312కు సమాచారం ఇవ్వాలని ఆర్ఐవో సూచించారు.

పేదల బతుకుల్లో.. పీ4 వెలుగులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4 పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం.. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు ప్రజావేదిక కార్యక్రమంలో గత మేడే రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో 14,665 బంగారు కుటుంబాలను గుర్తించగా.. 646 మంది మార్గదర్శకులు ముందుకొచ్చారు. ఇప్పటి వరకు 3,283 కుటుంబాలకు ప్రయోజనం చేకూరింది.

జీవనోపాధి

చెర్లోయడవల్లికి చెందిన జ్ఞానమ్మ కటిక పేదరికంలో ఉండగా- నారంపేటకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు ఆమె స్థితిని తెలుసుకుని భరోసా ఇచ్చారు. మార్గదర్శిగా పి. నాగేశ్వరరావు వారికి జీవనోపాధిగా రూ. లక్ష విలువైన మేకలు అందించి.. షెడ్డు కూడా నిర్మించి ఇచ్చారు. పక్కాగృహాన్ని కూడా మంజూరు చేశారు.

విద్యార్థికి భరోసా

మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లికి చెందిన పాగాల మస్తానమ్మకు ముగ్గురు సంతానం. పేదరికం.. కుమార్తె శ్రుతి పదో తరగతిలో 571 మార్కులు సాధించారు. ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించారు. చదువులకు ఆర్థిక లేమి అడ్డంకి కాగా.. మార్గదర్శిగా కె. రమణయ్య రూ. 50వేలు ఆర్థిక సాయం అందించారు.

దివ్యాంగుడికి అండగా...

ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లికి చెందిన బొమ్మిరెడ్డి బాలు ప్రమాదంలో ఒక కాలు పోగొట్టుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కళాశాల సందర్శనలో బాలు పరిస్థితి తెలిసింది. ఆయన భరోసా ఇవ్వడం.. ఆనం కైవల్యారెడ్డి పీ4 పథకం కింద చదువులకు ఆర్థిక సాయం చేశారు. జైపూర్ కాలును అమర్చారు.

"పీ4లో భాగంగా డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి సహకారంతో అనంతసాగరం మండలం సోమశిలలో శంకర నేత్రాలయ వారు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందికి వైద్య సేవలు, 100 మందికి శస్త్రచికిత్సలు చేశారు. మర్రిపాడు మండలం నెర్దనంపాడులో రూ. 50 వేలతో రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీకి గ్రావెల్‌రోడ్డు వేయించారు."

అక్రమాలకు రెక్కలు!

విమానాశ్రయ భూసేకరణలో లొసుగులు

దగదర్తి, న్యూస్‌టుడే: జిల్లా వాసులకు విమానయానాన్ని అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ ఆశయాన్ని కొందరు అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. భూసేకరణలో మతలబు చేయడం.. రికార్డులు తారుమారు చేయడం.. కాసులిచ్చిన వారికి అనుకూలంగా జాబితా తయారు చేసి.. అక్రమాలకు తెరదీశారు. ఇటీవల నిర్వహిస్తున్న గ్రామ సభల్లో ఈ వ్యవహారాలు వెలుగు చూస్తున్నాయి.

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ

భూములు మాయం...

దామవరంలోని సర్వే నంబరు 1-1లో శాశ్వత లీజుదారులకు 700 ఎకరాల భూమి ఉంది. ఇందులో 418 ఎకరాలు విమానాశ్రయానికి సేకరిస్తున్నారు. అధికారులు తయారు చేసిన జాబితాలో కొందరి భూములు మాయమైనట్లు గురువారం ఆర్డీవో వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో ఆందోళన వ్యక్తమైంది. అందులో బిట్-2లో 105 ఎకరాల విషయమై విచారించారు. జాబితాలో శాశ్వత లీజుదారులకు బదులు ఇతరులను నమోదు చేశారు. కొనుగోలుదారుల జాబితాలో అత్యధికంగా పారిశ్రామికవేత్తలు ఉన్నారు. 418 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. 390కి లబ్ధిదారులను ప్రకటించారు. మిగిలిన 28 ఎకరాల విషయం తేల్చాలని రైతులు డిమాండ్ చేశారు. కొందరికి లబ్ధి చేకూర్చేందుకే వాటిని ప్రకటించలేదని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్వాకంతో తాము నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● దీనిపై కావలి ఆర్డీవో వంశీకృష్ణ మాట్లాడుతూ... 'భూసేకరణలో అర్హులందరికీ న్యాయం చేస్తాం. అందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నాం. అందరినీ, అభ్యంతరాలను విచారించి.. న్యాయం చేస్తాం' అన్నారు.

నెల్లూరు ఎంపీ పీఏనని చెబుతూ మోసం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు(పీఏ) అంటూ బెదిరింపులకు దిగి నగదు డిమాండ్ చేసిన నకిలీ పీఏను దర్గామిట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతికి చెందిన నదీమ్ ఎంపీ పీఏ అంటూ వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన గొల్ల నరేష్‌కు పలుమార్లు ఫోన్ చేసి నగదు కోసం బెదిరించాడు. ఆయన విషయాన్ని ఎంపీ కార్యాలయానికి తెలియజేశారు. దాంతో కార్యాలయ సిబ్బంది గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం

కొడవలూరు, ముత్తుకూరు, న్యూస్‌టుడే: ఉపాధి కల్పన దిశగా పరిశ్రమల ఏర్పాటు, విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పరిశ్రమలశాఖ డైరెక్టర్ శుభమ్ బన్సల్ స్పష్టం చేశారు. గురువారం ఆయన కొడవలూరు మండలం రాచర్లపాడులోని ఇఫ్కో కిసాన్ సెజ్‌ను పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. వాటిని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కృష్ణపట్నం క్లస్టర్‌లోని ఎడిబుల్ ఇండస్ట్రీస్ వద్ద పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

బ్యాంకు గ్యారంటీపై.. మిల్లర్ల మీనమేషాలు!

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో తొలిపంట ద్వారా లభించే ధాన్యం కొనుగోళ్లలో పౌరసరఫరాలశాఖకు సహకరించాల్సిన రైస్ మిల్లర్లు వెనకడుగు వేస్తున్నారు. ప్రతి మిల్లరు నుంచి కనీసం రూ. 50 లక్షల మేర ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారంటీ(బీజీ) ఇవ్వాలన్న నిబంధన పెట్టడంతో ముందుకు రావడం లేదు.

గత నెల నుంచి..

గత నెల నుంచి పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లర్లను ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారంటీలు కోరుతున్నా.. మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదాలు వేసినా.. అందుకు అధికారులు అంగీకరించినా.. సరైన స్పందన రావడం లేదు. ధరలు బహిరంగ మార్కెట్‌లో బాగుంటే.. పౌరసరఫరాలశాఖ సేకరించాల్సిన అవసరం ఉండదని, తమకు కస్టమ్ మిల్లింగ్ అవకాశం లేకపోతే జీబీల రూపంలో పెట్టిన పెట్టుబడికి నష్టం జరుగుతుందనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇంకొందరు రైతుల కోసం పెట్టుబడి పెట్టే బదులు.. నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనతో ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో అధికారులు రూ. వంద కోట్ల మేర లక్ష్యం పెట్టుకున్నా.. రూ. 25 కోట్ల మేరకు మాత్రమే మిల్లర్ల నుంచి గ్యారంటీ లభించింది.

● దీనిపై పౌరసరఫరాలశాఖ జీఎం అర్జునరావు మాట్లాడుతూ... 'మిల్లర్లతో నిరంతరం చర్చిస్తున్నాం. సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకుంటున్నారనే సమాచారం ఉంది. త్వరలోనే లక్ష్యం చేరుకుంటా'మని అన్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..
రైస్ మిల్లులు: 123
ఒక్కో మిల్లు ద్వారా బీజీ: కనీసం రూ.50లక్షలు
పౌరసరఫరాలశాఖ లక్ష్యం: రూ.100 కోట్లు
ఇప్పటి వరకు లభించింది: రూ.25 కోట్లు

"మిల్లర్లు రూ. వంద కోట్ల మేర బీజీలు ఇస్తే.. దానికి 1:2 లెక్కన.. రూ. 200 కోట్ల మేర ధాన్యం పొందేందుకు అవకాశం ఉంది. తద్వారా 80వేల టన్నులు రైతుల నుంచి పౌరసరఫరాల శాఖ సేకరించేందుకు వీలవుతుంది. రైతులకూ అందుకు అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయి."

ప్రథమవర్ధంతి
ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను మాకు పంచిన మా తండ్రి గారు కీ.శే. బోడేపూడి నాగయ్య (LIC) గారు దైవసన్నిధికి చేరి నేటికి సంవత్సరకాలం గడిచినా వారి జ్ఞాపకాలను తలచుకుంటూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ.శే. బోడేపూడి నాగయ్య (LIC) గారు
పరమపదించిన తేది: 03-03-2025
కుమారుడు: బోడేపూడి నందకిషోర్ మరియు కుటుంబసభ్యులు
ప్రథమవర్ధంతి : తేది 21-2-2026 శనివారం ఉదయం గం|| 10.30 నిలకు నెల్లూరు వేదాయపాలెం రైల్వేగేటు రోడ్డులోని లిఖిత అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెం. 103, మా స్వగృహము నందు జరుగును.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

వారు మూతేశారు.. వీరు ఆరేశారు!

ఆత్మకూరు మండలం రావులకొల్లు ప్రాథమిక పాఠశాల ఇది. చిన్నారులు లేక రెండేళ్లుగా మూతపడిపోవడంతో స్థానికులు తమ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఉతికిన దుస్తులను ఆరేస్తున్నారు. వాహనాలు, ఇతర సామగ్రి పెట్టుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలవైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం, విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనడానికి ఈ దృశ్యం ఉదాహరణగా నిలుస్తోంది.
– న్యూస్‌టుడే, ఆత్మకూరు

సిమెంటు రోడ్డు.. సొగసు చూడు

గ్రామంలోని అరుంధతీయవాడకు వెళ్లేందుకు గతంలో వేసిన సిమెంటు రోడ్డు బద్దలుగా పగిలిపోయింది. వర్షాలు వచ్చినప్పుడు అధ్వానంగా మారుతుంది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఈ విషయమై ఎంపీడీవో ఆదినారాయణను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని వివరించారు.
– న్యూస్‌టుడే, కొండాపురం

రథం ట్రయల్ రన్ విజయవంతం

కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథం ట్రయల్ రన్ విజయవంతమైంది. ఈవో రాధాకృష్ణ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా స్వామి రథాన్ని ముందుకు తీసుకెళ్లి తిరిగి యథాస్థానంలో ఉంచారు.
– న్యూస్‌టుడే, బిట్రగుంట

ప్రధాన మార్గం.. భయం.. భయం

పట్టణం నుంచి కావలికి వెళ్లే ప్రధాన మార్గంలో స్టేట్‌పేట వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఆమార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఏక్షణంలో ఏంజరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ఏఈ చెంగయ్య దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఉదయగిరి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

నెల్లూరు(కలెక్టరేట్): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు వారి సమస్యలకు సంబంధించిన అర్జీలు అందించారు. ప్రతి ఉద్యోగితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి విజయకుమార్, ఉద్యోగులుపాల్గొన్నారు.

ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్

పేదల ఇళ్లకు సౌర వెలుగులు

ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీపై సోలార్ పరికరాలు

పేద, మధ్య తరగతి కుటుంబాలను విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం కల్పించేందుకు సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. 'ప్రధాన మంత్రి సూర్యఘర్' పథకంలో భాగంగా ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు పలకలు అమర్చనున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(విద్యుత్తు)

ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్తు పలకలు

జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు : 8,99,151
ఎస్సీ కుటుంబాలవి : 1,72,098
ఎస్టీలవి : 78,642

33,534 కనెక్షన్ల లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సోలార్ పలకలను నూరు శాతం రాయితీపై ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని ఆయా సామాజికవర్గాల వారీగా ఉన్న విద్యుత్తు కనెక్షన్ల వివరాలను జిల్లా అధికారులు సేకరించారు. ఈ ఏడాది తొలి విడతగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 33,534 కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రెండు కిలోవాట్‌ల సామర్థ్యం

ప్రస్తుతం 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు సరాసరిన సుమారు రూ.6 వరకు ప్రభుత్వమే ఖర్చు చేస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే సొమ్ము ఆదా అయినట్లే. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఎక్కువ మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో అందరికీ రెండు కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ పలకలు అమర్చనున్నారు. తద్వారా నెలకు సరాసరిన 200 యూనిట్ల వరకు సౌర విద్యుత్తు ఉత్పత్తి కానుంది. దీంతో వినియోగదారులకు బిల్లురాదు. మరోపక్క ప్రభుత్వానికి భారం ఉండదు.

టెండర్లు పూర్తి

నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు డివిజన్లలో టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని డివిజన్లలో పనులు ప్రారంభించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు సర్వే చేసి ఆ తర్వాత ఆసక్తి ఉన్న వినియోగదారులకు సోలార్ పలకలు అమర్చనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఎస్ఈ కె.రాఘవేంద్రం పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో మార్పు

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాల, బాలికల గురుకుల పాఠశాలల్లో ఆరు నుంచి పదోతరగతి ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష కేంద్రాలను ఇంటర్ పరీక్షల కారణంగా మార్పుచేసినట్లు సంగం గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు [illegible] తెలిపారు. మార్చి నెల రెండో తేదీన జరిగే ప్రవేశ పరీక్ష కోసం సంగం, ముత్తుకూరు పాఠశాలలను ఎంపిక చేసుకున్నవారు.. తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరులో రాయాల్సి ఉంటుందన్నారు. [illegible] బోగోలు గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు.

సోమశిలకు 1,337 క్యూసెక్కుల వరద

అనంతసాగరం : జలాశయంలో గురువారానికి 1,337 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 67.825 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 325.413 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 1,800, 12వ క్రస్ట్‌గేట్ ద్వారా 1,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టా లైన కండలేరు వరద కాలువకు 150, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పేదల గూడుకు మరింత భరోసా

జిల్లాలో 26,873 మందికి లబ్ధి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

కొత్త వాటిని ప్రభుత్వం మంజూరు చేయనుంది

రూ. 2.39 లక్షలకు..

న్యూస్‌టుడే, దుత్తలూరు

గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రుణ మొత్తాన్ని పెంచుతూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో ఇళ్ల నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న 26,873 మంది గ్రామీణ ప్రాంత వాసులకు ప్రయోజనం కలగనుంది. గ్రామాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించడానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల జిల్లాలో అధికారులు గ్రామాల్లో సర్వే చేసి అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త వాటిని ప్రభుత్వం మంజూరు చేయనుంది.

గృహ నిర్మాణ శాఖ అధికారులు సర్వే చేసి జిల్లాలో 26,873 మంది అర్హులను గుర్తించారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ. 2.50 లక్షలు ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రూ. 1.80 లక్షల నుంచి రూ. 2.39 లక్షలకు పెంచారు. ఇందులో కేంద్రం వాటా రూ. 95,400 కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 63,600, ఉపాధి హామీ పథకంలో రూ. 27 వేలు, స్వచ్ఛభారత్ మిషన్ నుంచి రూ. 12 వేలు ఇవ్వనున్నారు. దీనికి అదనంగా డ్వాక్రా తరఫున రూ. 25 వేల నుంచి రూ. 50 వేల వరకు బ్యాంకు రుణాన్ని కూడా అందిస్తారు. ఇటీవల గ్రామాల్లో తిరిగి అధికారులు గుర్తించిన వారికి మాత్రమే ఈ రుణం మంజూరవుతుంది. ఈవిషయమై గృహనిర్మాణ శాఖ డీఈ పీరాన్ మాట్లాడుతూ పెంచిన రుణానికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో విధివిధానాలు రావాల్సి ఉందన్నారు. పెంపుతో అర్హులైన లబ్ధిదారులకు మేలు జరుగుతుందని వివరించారు.

ఇప్పటివరకు ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టే వారికి ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ. 1.80 లక్షలు రుణంగా ఇస్తున్నారు. దీనిలో రూ. 1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో రూ. 30 వేలు ఇస్తోంది. ప్రభుత్వం ఇచ్చే రుణం సరిపోవడం లేదు. అప్పులు చేసి పూర్తి చేసుకునే వారు. ఇంటి సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం మరికొంత సాయం ప్రకటించింది.

నగదు అందజేస్తున్న మేకపాటి దంపతులు

'గ్రంథాలయాలను జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతా'

మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రంథాలయాలను జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మేకపాటి శాంతకుమారి అన్నారు. గురువారం మర్రిపాడు మండలంలోని [illegible] పర్యటించారు. నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా గ్రామంలో నూతన గ్రంథాలయం నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా మసీదు మరమ్మతుల కోసం ముస్లిం సోదరులకు రూ.2 లక్షలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై విచారణ

అనంతసాగరం, న్యూస్‌టుడే: భూములు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని సంజీవ నగరం గ్రామానికి చెందిన కొందరు రైతులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీవో పావని విచారణ చేపట్టారు. గురువారం డీఎస్పీ వేణు గోపాల్‌తో కలిసి గ్రామానికి వెళ్లి వివాదానికి కారణమైన పొలాలు పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఇరువర్గాల వాదనలు విన్నారు. విచారణ పూర్తయ్యే వరకు ఇరువర్గాలు పొలంలోకి దిగరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట సీఐ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ జయవర్ధన్, ఎస్సై సూర్యప్రకాశ్ రెడ్డి, డీటీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో పావని

రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగా భవాని

ఉపాధి పనుల దస్త్రాలు పక్కాగా నిర్వహించాలి

మర్రిపాడు(ఆత్మకూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి దస్త్రాలను పక్కాగా నిర్వహించాలని డ్వామా పీడీ గంగా భవాని ఆదేశించారు. గురువారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 24 పంచాయతీల్లో రూ.8 కోట్లతో పనులు జరిగాయన్నారు. రూ.1,78,174 నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించామన్నారు. ఆ మొత్తాన్ని క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కొన్ని రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఏపీవో వెంటక నారాయణ, సామాజిక తనిఖీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులు పేర్లు నమోదు చేసుకోండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, పథకాలు పొందేందుకు అసంఘటిత కార్మికులు తమ పేర్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని గూడూరు సహాయ కార్మిక శాఖ అధికారి శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదులో ఎవరికైనా సందేహాలుంటే 94925 55122 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీ

కలిగిరి: గ్రామంలోని ఓ పెట్రోలు బంకులో డీజిల్ కల్తీ విషయమై బుధవారం రాత్రి తహసీల్దార్ ఎం.గిరీష్, ఎస్సై ఉమాశంకర్ తనిఖీ చేశారు. స్థానిక వివరాలు నమోదు చేసుకున్నారు. విక్రయాలు ఆపాలని ఆదేశించారు. గురువారం సీఎస్‌డీటీ శ్రీనివాసులు, వీఆర్వోలు శేషయ్య, రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. డీజిల్ పట్టించుకుని వాహనాలు మరమ్మతులకు గురైన బాధితులు, బంకు యాజమాన్యంతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి: ఆర్డీవో

ఆత్మకూరు, న్యూస్‌టుడే: యువత అవకాశాలు అందిపుచ్చుకున్నప్పుడే లక్ష్యాలు సాధిస్తారని ఆత్మకూరు ఆర్డీవో పావని అన్నారు. గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. 306 మంది నిరుద్యోగులు హాజరుకాగా వీరిలో 190 మంది మలిదశ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. మొదటి రోజు ఉద్యోగాలకు ఎంపికైన 17మందికి ఆర్డీవో నియామక పత్రాలు అందజేశారు. మెగా జాబ్‌మేళాకు 21 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు పద్మజాకుమారి, కమిషనర్ గంగాప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యాం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివకృష్ణ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం కమనీయంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు అత్యంత సాంప్రదాయబద్ధంగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేడుకగా అలకలతోప్పు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరంలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం చప్పర ఉత్సవం చేపట్టారు. రాత్రికి ఆదిదంపతుల మధ్య అలకలతోపు కార్యక్రమాన్ని వేదపండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, ఛైర్మన్ అజయ్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 14,803
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,18,424
వెండి గ్రాము :	రూ. 266.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	128
లేయర్	90
బ్రాయిలర్స్	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	256
లేయర్ మాంసం	153

మాట్లాడుతున్న ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ

చిల్లకూరు, న్యూస్‌టుడే: గృహాల్లో పోగయ్యే ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గుమ్మళ్లదిబ్బలో స్థానికులకు శిక్షణనిచ్చారు. వ్యర్థాలను సక్రమంగా తొలగించడం అలవాటు చేసుకుంటే ఇంటి స్థలంతోపాటు గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ వివరించారు. సర్పంచి నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, యువశక్తి సోషల్ వెల్ఫేర్ గ్రూపు సభ్యులు, మత్స్యకార కాపులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణే లక్ష్యం

మనుబోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని దేవాలయాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని మాతాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆరుముళ్ల మురళి పేర్కొన్నారు. ముద్దుమూడిలోని మాతా పరమేశ్వరి ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలు అందించడమే తమ కమిటీ లక్ష్యమన్నారు. భాజపా నాయకులు కాకుటూరు రవీంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాధా కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, పెంచలయ్య, రమణయ్య, కృష్ణయ్య, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ప్రయాణికులకు శుద్ధ జలం

పొదలకూరు, న్యూస్‌టుడే: వేసవి కాలంలో ప్రయాణికులకు శుద్ధ జలం అందించేందుకు ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పరిశీలించారు. గురువారం పొదలకూరు ఆర్టీసీ బస్సుస్టేషన్, పంచాయతీ బస్టాండు, రాపూరు డిపోలో నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక భాజపా నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION
B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES
పర్సనల్, వ్యవసాయ భూములకు, రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రియల్‌కు ఫైనాన్స్ ఇవ్వబడును. Contact Cell: 90632 90864.

REAL ESTATE

PLOT FOR SALE
కావలి టౌన్ రామమూర్తిపేట ట్రెండ్స్ షోరూం ప్రక్క వీధిలో MRO ఆఫీస్‌కి ఎదురుగా 220 అంకణముల స్థలం అమ్మకంనకు కలదు. ✆ 92987 52705.

ప్లాట్లు అమ్మబడును
కమర్షియల్ ప్లాట్స్ ఫర్ సేల్
నెల్లూరు టౌన్ దగ్గరగా బొంబే హైవే, చెన్నై వైపు సమీపంలో నుడా & తుడా అప్రూవ్డ్ ప్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
93469 48665, 93817 79202

ఆత్మకూరు బస్టాండ్ కొత్త కాలువ సెంటర్, గూడూరు, చెన్నూరు, మనుబోలు హైవేకి, స్పాట్ రిజి||. బ్యాంక్ లోన్, గోల్డ్ కాయిన్ గిఫ్ట్. ✆ 9121459131, 7661963007

JOBS
WANTED TELE-CALLER & PRO-04, Marketing Executive-50, Same Mandal in Work. Con: 88013 98165.

నెల్లూరు పత్తేఖాన్‌పేటలోని ఎవర్‌గ్రీన్ సోలార్ సిస్టమ్స్ కంపెనీలో పనిచేయుటకు ITI టెక్నీషియన్లు మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. Cont: 9110712220

GVK. హోండా షోరూం కావలిలో పర్క్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, జాబ్ కార్డ్ అడ్వైజర్స్, మెకానిక్స్ కావలెను. క్వాలిఫికేషన్: ఐటిఐ, డిగ్రీ. ✆ 99850 53087

అధిక స్పందనలు పొందండి.
వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

లారీని అధిగమిస్తూ డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

ప్రమాదంలో యువకుడి దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిల్లకూరు, న్యూస్‌టుడే : చిల్లకూరు మండల పరిధిలోని వరగలి అడ్డరోడ్డు సమీపంలో బుధవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గూడూరు బొగ్గులదిబ్బ ప్రాంతానికి చెందిన **మైపాటి సాయిమహేశ్** (32), మౌలా, మస్తాన్ ద్విచక్రవాహనంపై బూదనంలోని మిత్రుడి ఇంటికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని గూడూరుకు బయల్దేరారు. మార్గమధ్యలో వరగలి అడ్డరోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో ముగ్గురు యువకులు రహదారిపై పడిపోయారు. సాయిమహేశ్ తలకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు స్వల్పగాయాలతో సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

దగదర్తి, అల్లూరు, న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన ఉలవపాళ్లకు చెందిన నూనె లోకేశ్(23) మృతదేహం గురువారం లభ్యమైంది. అల్లూరు మండలం ఇస్కపల్లి సముద్ర తీరంలో గుర్తించినట్లు మెరైన్ ఎస్సై జానకిరాం తెలిపారు. మిత్రులు దీపక్, ఇమ్మానుయేలుతో కలిసి లోకేశ్ సరదాగా ఈత కొట్టేందుకు బోగోలు మండలం తాటిచెట్లపాలేనికి గత సోమవారం వెళ్లగా గల్లంతయ్యారు. ఇమ్మానుయేలు తప్పించుకోగా దీపక్ మృతదేహాన్ని మత్స్యకారులు అదేరోజు గాలించి వెలికితీశారు. లోకేశ్ మృతదేహం ఎట్టకేలకు ఇస్కపల్లిలో గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటున్న అతను తల్లిదండ్రులు మృతి చెందడంతో నాలుగేళ్ల క్రితం ఉలవపాళ్లకు వచ్చి మేనమామ చినమస్తాన్ వద్ద ఉంటున్నారు. కూలి పనులకు వెళుతున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. విద్యార్థులకు ఏప్రిల్ 12న ఆయా ఆదర్శ పాఠశాలల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి సిలబస్‌పై ఆంగ్లమాధ్యమంలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలను ఆన్‌లైన్‌లో, ఆయా ఆదర్శ పాఠశాలల్లో తెలుసుకోవచ్చన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని రూ.లక్షల్లో నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నగరం బీవీ నగర్‌లో హరి నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తెకు ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఓ మెడికల్ ఎడ్యుకేర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు శ్రీను నమ్మించాడు. అయిదేళ్లకు రూ.35 లక్షలు అవుతుందని, మొదట రూ.8.50 లక్షలు అడ్వాన్స్‌గా ఇవ్వాలని చెప్పాడు. దీంతో హరి అతనికి నగదు చెల్లించాడు. రోజులు గడుస్తున్నా సీటు ఇప్పించకపోగా నగదు తిరిగి చెల్లించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బూదనం సమీపంలో జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరు పోలీసు కాలనీ ప్రాంతానికి చెందిన చెంబేటి నాగేశ్వరరావు (55) ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈనెల 17న ద్విచక్రవాహనంపై నాయుడు పేటకు వెళుతున్నారు. బూదనం వద్దకు రాగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్ర గాయాలై చికిత్స నిమిత్తం 108లో నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నాసిరకంగా నిర్మించిన తొట్టె

నీటి తొట్టె.. కాసుల పెట్టె

న్యూస్‌టుడే, సీతారామపురం

పశువుల దాహార్తి పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. మూగజీవాల నీటి అవసరాలకని తొట్టెలు కట్టారు. నాసిరకంగా నిర్మించడంతో ఉపయోగానికి ముందే శిథిలమవుతున్నాయి. వీటి పేరుతో రూ.లక్షల నిధులు దారి మళ్లించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు ప్రభుత్వం గత ఏడాది నీటి తొట్టెలు మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.30 వేలు చొప్పున కేటాయించింది. పశువుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట నిర్మించి వాటిలో నీరు నింపాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొన్ని పూర్తికాగా.. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తయినవి వినియోగంలోకి రాలేదు. పైగా పగుళ్లిచ్చి శిథిలమవుతున్నాయి. సీతారామపురం మండలంలోని 14 పంచాయతీల్లో పబ్బులేటిపల్లి మినహా మిగతా అన్నిపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో తొట్టెలు నిర్మించారు. 43 మంజూరయ్యాయి. 19 పూర్తి కాగా.. 22 నిర్మాణంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇలాగే వింజమూరు మండలంలో చాలా చోట్ల పగుళ్లిచ్చాయి.

నిరుపయోగంగా..

తొట్టెల్లో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తొట్టెల్లో పగుళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పశువుల కాపరులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు.. శివప్రసాద్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో

మండలంలో నీటి తొట్టెలు ఎక్కడెక్కడ నిర్మించారో పరిశీలిస్తాం, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

నెలాఖరుకు నూరు శాతం పన్ను వసూలు

మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

వింజమూరు, న్యూస్‌టుడే : నెలాఖరుకు ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని కావలి డీఎల్‌పీవో వెంకటరమణ ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ రూ. 1.54 కోట్లు బకాయిలుండగా ఇప్పటివరకు రూ. 54 లక్షలు వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

అనంతసాగరం, న్యూస్‌టుడే: అనంతసాగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. 60 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఎంఈవో-2 ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుజాతమ్మ, తెదేపా నాయకులు సుబ్బారెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

కావలి, సీతారామపురం, వరికుంటపాడు, సంగం, న్యూస్‌టుడే: శివాజీ జయంతి వేడుకలు గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. కావలి ట్రంకురోడ్డులోని విగ్రహానికి న్యాయవాదులు ఇర్ల వెంకటరణయ్య, నరసింహం, చిన్న, తదితరులు నివాళులర్పించారు. సీతారామపురం తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి సుమన్, మండల తెలుగు యువత అధ్యక్షుడు వికాస్‌బాబు, నాయకులు పాల్గొన్నారు. వరికుంటపాడు మండలం నార్తుకొండాయపాలెంలో జరిగిన వేడుకల్లో భాజపా మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, బీసీ మోర్చా నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంగంలోని శివాజీ సెంటరులో బాలలు కేకును కోసి శివాజీ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు.

సీతారామపురం: చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

వరికుంటపాడు: శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

నీటి వనరు.. నిర్వహణ కరవు

కావలి పెద్ద చెరువు ఆయకట్టులో సర్వాయపాలెం సమీపంలోని పొలాలు ఎండుతున్నాయని ఆ ప్రాంతానికి వెళ్లే కాలువకు బుధవారం నీరు వదిలారు. దీంతో పొంగడంతో ఇరువైపులా ఉన్న ప్రాంతాలు నీట మునిగాయి. ఈ కాలువ సామర్థ్యం 60 క్యూసెక్కులు. ఇప్పటివరకు అందులో సగం మేరకు వదులుతున్నారు. ఆయకట్టుకు నీరు అందడం లేదని 50 క్యూసెక్కుల వరకు పెంచారు. అంతే కాలువలో నుంచి నీరంతా ఇరువైపులా పొంగింది. 15 ఎకరాల వరకు పొట్ట దశలో ఉన్న పంటలోకి నీరు చేరింది. మద్దూరుపాడులోని ఇళ్లను ముంచేసింది.

న్యూస్‌టుడే, కావలి

చెరువులు, కాలువల నిర్వహణను పాలకులు మరిచిపోయారు. దీంతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వెన్ను దశలో ఉన్న వరికి నీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువల సామర్థ్యం మేరకు నీరు విడుదల చేయడం లేదు. గరిష్ఠ స్థాయిలో వదిలితే పొంగుతున్నాయి. కావలి పట్టణంలోని పెద్ద చెరువును సమస్యలు వెంటాడుతున్నాయి. గత మొంథా తుపాన్ సమయంలో అలుగులు ధ్వంసం చేసి అదనపు నీటిని వదిలేశారు. భారీ వర్షాలు కురిస్తే పాపిరెడ్డి చెరువుకు వచ్చే వరద ప్రవాహం దారి తప్పకుండా వెళ్లేలా కాలువ తవ్వారు. దీని కింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షపు నీరు చెరువుకు చేరకపోగా కావలి- తుమ్మలపెంట రోడ్డు సైతం దెబ్బతింటుంది. చలంచర్ల గ్రామ చెరువు తూము చాలా వరకు శిథిలమైంది. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ చెరువు పరిధిలో 250 ఎకరాల వరకు సాగు జరుగుతోంది. చాలారోజులుగా తూము బాగు కోసం రైతులు కోరుతున్నా, నిధుల మంజూరు ఊసే లేదు. చలంచర్ల కండ్రిగ చెరువు కట్ట బలహీనంగా మారింది. దీని కింద 180 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. చెరువుకట్ట బలహీనంగా ఉండడంతోపాటు కర్రతుమ్మ చెట్లు ఏపుగా పెరిగాయి. గత వైకాపా పాలనలో సాగునీటి వ్యవస్థలో ప్రధానమైన చెరువులు, కాలువల బాగు పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వివిధ పనులు చేపడుతున్నా, వాటితో పూర్తి స్థాయి ప్రయోజనాలు కలగడం లేదు. కావలి డివిజన్ పరిధిలో మొత్తం 281 చెరువులు ఉండగా, అన్నింటా సమస్యలు ఉన్నాయి.

అధ్వానంగా బుడంగుంట చెరువు సప్లై ఛానల్

మరమ్మతులు చేస్తాం

చెరువులకు మరమ్మతులు చేయాల్సిన మాట వాస్తవమే. శాశ్వత పరిష్కార చర్యలకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. నివేదికలు గతంలోనే పంపించాం. ఉత్తర్వులు వస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగానే ఉన్నాం. కావలి చెరువు తూము పునర్నిర్మాణానికి రూ. 35 లక్షలు మంజూరయ్యాయి. పంటలు పూర్తి కాగానే బాగు చేస్తాం.

– పీఎంఖాన్, ఈఈ, జలవనరుల శాఖ, కావలి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: మా ప్రాంతానికి నీరు సరిగా రావడం లేదు. –ఉలమంచి కామాక్షమ్మ, వైకుంఠపురం

సమాధానం: ప్రస్తుతం పైపులైన్ పనులు జరుగుతున్నాయి. పూర్తయ్యే వరకు ట్యాంకర్లతో నీరిస్తాం. –మౌనిక, ఈవో – న్యూస్‌టుడే, కావలి

? మా గ్రామంలో తూర్పు బావి వద్ద ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. –ప్రసాద్, తరుణవాయి

✓ తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం – ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి

? మా గ్రామంలోని ప్రభుత్వ లేఅవుట్లో ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. రాత్రిళ్లు విష సర్పాలు తిరుగుతున్నాయి. –నాగరాజు, సోమశిల

✓ సిబ్బందిని పంపి ముళ్ల చెట్లను తొలగిస్తాం. –శరత్ చంద్ర, ఈఈ, గృహనిర్మాణ శాఖ

? మర్రిపాడు మండలం, పీసీపల్లి బీసీ కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో రాత్రిళ్లు అంధకారం నెలకొంటుంది. – రవి, స్థానికుడు

✓ దీపాలు ఏర్పాటు చేస్తాం. – శ్రీలత, కార్యదర్శి –న్యూస్‌టుడే, మర్రిపాడు

ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవం

కొండాపురం: గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, ఎంఈవోలు రవికుమార్, ఆనంద్‌రావు, తహసీల్దారు సురేష్ బాబు, ఎస్సై జె. మాల్యాద్రి పాల్గొన్నారు.

స్తంభాలు.. ఇలా వదిలేశారు

ఇవి కావలి పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విద్యుత్తు ఉపకేంద్రం ముందు నిరుపయోగంగా ఉన్న స్తంభాలు. పట్టణ పరిధిలోని చాలా చోట్ల శిథిల ఇనుప విద్యుత్తు స్తంభాలతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి. వాటిని మార్చడం లేదు. పైగా ఇలా వృథాగా పెడుతున్నారు. –న్యూస్‌టుడే, కావలి

హవ్వ..కర్రతో నీరు ఆగుతుందా!

మండలంలోని తూర్పురొంపిదొడ్లలో (పల్లె) కుళాయి ఏర్పాటుకు పైపు వేశారు. దీనికి ట్యాపు లేకపోవడంతో నీరు వృథాగా పోతుంది. దీంతో స్థానికులు కర్రను పెట్టారు. అయినా నీరు పోతోంది. పరిశీలించి కుళాయి ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి సురేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, వరికుంటపాడు

అసంపూర్తి భవనం.. పట్టించుకోరే?

మండలంలోని పడమర గోగులపల్లిలో గత ప్రభుత్వం ప్రజా యోజనార్థం భవనాన్ని నిర్మాణం చేసి అసంపూర్తిగా వదిలివేసింది. దీంతో నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకునే దశలో ఉంది. భవనాన్ని పూర్తిచేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –అల్లూరు, న్యూస్‌టుడే

అరుగుపై నియంత్రిక.. నిర్లక్ష్యానికి సూచిక

మండలంలోని తూర్పురొంపి దొడ్ల (పల్లెలో) అరుగుపై విద్యుత్తు నియంత్రిక ఇదు నెలలుగా దర్శనమిస్తోంది. గ్రామానికి చెందిన మల్లంపాటి శివరామ్ తోటలోని నియంత్రిక మరమ్మతులకు గురైంది. కొత్తది ఏర్పాటుయాలని అధికారులను కోరగా.. రూ.20 వేలు అవుతుందని చెప్పడంతో వెంటనే చెల్లించారు. పాత దాన్ని తెచ్చి ఇలా పెట్టారు. – న్యూస్‌టుడే, వరికుంటపాడు

జాతీయరహదారి.. ప్రమాదమోయి

జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రాంతంలో వేగ నిరోధకాలు, సూచికల బోర్డులు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నేషనల్ హైవే డీఈ నాగిరెడ్డి మాట్లాడుతూ హెచ్చరిక బోర్డులు, సూచికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జలదంకి

సంక్షిప్త సమాచారం

హామీకే పరిమితమైన ఘాట్ రోడ్డు అభివృద్ధి

ఉదయగిరి: బండగానిపల్లి ఘాట్ రోడ్డు అభివృద్ధి ఎన్నికల హామీలకే పరిమితమైందని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య ఆరోపించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతుల్లేక రెండున్నర కిలోమీటర్ల ఘాట్ రోడ్డు ఏళ్ల తరబడి అధ్వానంగా ఉందన్నారు. దీన్ని బాగుచేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో కల్యాణి, మస్తాన్‌రెడ్డి, సంజీవరాజు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో రూ. 1.40 కోట్లతో నూతన భవనాలు

ఉదయగిరి: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో నూతనంగా మంజూరైన భవన నిర్మాణాల కోసం స్థలం చదును చేసే పనులను గురువారం ఇన్‌ఛార్జి ఏఈ చెంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ రూ. 1.40 కోట్లతో చేపట్టే నూతన భవనాల నిర్మాణాల నిమిత్తం ఈ పనులు చేస్తున్నామని వివరించారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

ఉదయగిరి: పొదుపు సంఘాల్లోని సభ్యులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం శారా ప్రవంతి పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆరోగ్య కమిటీలు, మండల సమాఖ్య ఓబీలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, సీసీలు పాల్గొన్నారు.

పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఉదయగిరి: మండలంలోని వెంకట్రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ ఛైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవం, సరస్వతి పూజకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ ఛైర్మన్ రసూల్, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి భూములను విడిపించండి

జలదంకి: ఆక్రమణదారు నుంచి భూములను విడిపించి, రక్షణ కల్పించాలని తెదేపా మండల మాజీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ ఎస్.సీతామహాలక్ష్మికి బాధితులతో కలసి వినతి పత్రం ఇచ్చారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

అనంతసాగరం: విద్యార్థులు శ్రద్ధతో చదివి పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈవో జానకీ రామ్ సూచించారు. గురువారం ఉప్పలపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణను పరిశీలించారు. అనంతరం సోమశిల గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ క్యాంపులో ఉన్న విద్యార్థుల వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

పశుబీమా పథకంతో పాడి రైతులకు మేలు

సంగం: పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ సహాయసంచాలకులు డా.సీవీరెడ్డి సూచించారు. గురువారం తరుణవాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.300 వంతున రైతులు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 వంతున భరిస్తుందన్నారు. అనంతరం లేగదూడల అందాల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులందజేశారు. పశువైద్యాధికారులు శ్రీనివాసరావు, మోహన్ రెడ్డి,ఏ.జయపాల్, వీర హారీన్, రామచంద్రారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు.

చిత్తు కాగితాల సేకరణ పేరుతో చోరీకి యత్నం

సంగం, న్యూస్‌టుడే: చిత్తుకాగితాల సేకరణ పేరుతో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలను తరుణవాయి గ్రామస్థులు పట్టుకున్నారు. వివరాల మేరకు గురువారం జి.సునీల్ అనే వ్యక్తి ఇంటి వద్ద ఎవరూ కనిపించకపోవడంతో ఇద్దరు మహిళలు ఒక గది తలుపులు పగలకొట్టారు. ఆసమయంలో ఇంటిలోనే ఉన్న సునీల్ గమనించి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

బిట్రగుంట: బోగోలు మండలంలోని ముంగమూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జడరాయ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కప్పురాళ్లతిప్ప, కడనూతల, ముంగమూరు, తదితర గ్రామాల్లో విద్యుత్తు ఉండదన్నారు.

మరుగు.. సాయం కరవు

వైకాపా ప్రభుత్వంలో కొరవడిన ప్రోత్సాహం

న్యూస్‌టుడే, కలిగిరి

వైకాపా ప్రభుత్వ హయాంలో అయిదేళ్లుగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. ఆర్థిక స్థోమత లేక పేదలు నిర్మించుకోలేకపోయారు. దీంతో జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇప్పటికీ బహిరంగ మలవిసర్జన సాగుతుంది. ప్రస్తుత ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం నింపే కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పుడైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో బహిరంగ మల విసర్జన నిర్మూలనకు కృషి చేస్తే అన్నివిధాలా ప్రజలకు మేలు జరుగుతుంది..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో బహిరంగ మల విసర్జనపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయడంతో పాటు నిధులు మంజూరుచేసింది. గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మరీ కట్టించారు. ఎవరైనా వెనుకంజ వేస్తే వారి ఇళ్లకు మండల, జిల్లా స్థాయి అధికారులు చైతన్యం కల్పించారు. వంద శాతం మరుగుదొడ్లు నిర్మించిన గ్రామాలకు పురస్కారాలు అందించి ప్రోత్సహించారు. బహిరంగ మల విసర్జన తగ్గింది. ఆ తర్వాత వైకాపా పాలనలో సాయం కొరవడింది. మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చే వారికి సాయం అందించే పరిస్థితి కనిపించలేదు. మరోవైపు వైకాపా ప్రభుత్వంలో గృహ నిర్మాణ పథకం సైతం ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో కొందరు పేదలు ఇళ్లు నిర్మించుకున్నా మరుగుదొడ్డి నిర్మాణంపై ఆసక్తి చూపలేదు. దీంతో బహిరంగ మల విసర్జనతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవుతోంది.

నిధులు లేక అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్డి

ఇంటి నిర్మాణ సొమ్మే రాలేదు: సుబ్బారావు

అప్పులు చేసి 2018లో ఇల్లు కట్టుకున్నాం. ఆ సొమ్మే అప్పుడు పూర్తిగా రాలేదు. మరుగుదొడ్డికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

అవగాహన కల్పిస్తాం

– విజయ్‌కుమార్, డీడీవో, కావలి డివిజన్

బహిరంగ మలవిసర్జనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. దీనిపై అవగాహన కల్పిస్తాం. ప్రజలందరూ మరుగుదొడ్ల వాడకంపై శ్రద్ధ చూపాలి.

గుంతల రోడ్లు.. వాహనదారులకు పాట్లు

న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

ఏఎస్‌పేట మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలతో ప్రమాదకరంగా మారాయి. కలిగిరి, వింజమూరు, ఆత్మకూరు మండలాలకు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు తీర్చాలని అధికారులను కోరుతున్నా.. పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏఎస్‌పేట నుంచి సీబీవరం వెళ్లే రహదారి దుస్థితి

ఎక్కడెక్కడంటే..

- ఏఎస్‌పేట నుంచి గుడిపాడు వెళ్లే రోడ్డు, పెద్దబ్బీపురం- సీబీవరం, హసనాపురం- కావలిఎడవల్లి మార్గాల్లో ఉన్న రహదారులతోపాటు సంగం, కలిగిరి రోడ్డు నుంచి శ్రీకొలను వెళ్లే మార్గాలు రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. ఇటుగా వెళ్లే క్రమంలో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.
- ఏఎస్‌పేట నుంచి సీబీవరం వెళ్లే రోడ్డు పది కిలోమీటర్లు పొడవునా ఉండగా.. మొత్తం కంకర, తారు తొలగిపోయింది. గుడిపాడు నుంచి రంగన్నపాడు వెళ్లే మార్గంలో రోడ్డు వేసేందుకు ఏడాది క్రితం కంకర పరచారు. నేటికీ తారు వేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.
- ఈ విషయమై ర.భశాఖ ఇన్‌ఛార్జి ఏఈ అమనుల్లా మాట్లాడుతూ రూ.14 కోట్లతో హసనాపురం-కావలిఎడవల్లి రోడ్డును రెండు వరుసల రహదారిగా మార్చేందుకు, రూ. 20లక్షలతో ఏఎస్‌పేట -గుడిపాడు రోడ్డు మరమ్మతులు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరయితే పనులు చేపడతామన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు లైన్‌మెన్‌కు గాయాలు

దుత్తలూరు, న్యూస్‌టుడే : వేగంగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన నందిపాడు కూడలిలో 565వ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... ఉదయగిరి మండలం గండిపాలెంలో విద్యుత్తు లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చీదర్ల విజయ్ నెల్లూరు నుంచి విధులకు ద్విచక్ర వాహనంపై గండిపాలెం వెళుతున్నారు. ఈక్రమంలో కడప జిల్లా బద్వేలు నుంచి కావలి వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. గాయాలైన విజయ్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొంటేనే దాహం తీరేది

తీరంలో నీటి ఎద్దడి

న్యూస్‌టుడే, అల్లూరు

వేసవి రాకముందే తీరగ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. దాహం తీర్చుకోవడానికి ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. కుళాయిల నుంచి రాకపోవడంతో కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు. ఇదీ మండలంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి. మండలంలో పది పంచాయతీలు.. ఒక నగర పంచాయతీ ఉంది. వీటిలో అల్లూరు నగర పంచాయతీలోని సింగపేట చెలికసంఘం ప్రాంతానికి కొద్ది సంవత్సరాలుగా సరఫరా జరగడం లేదు. నీటి పథకం పైపులకు తరచూ మరమ్మతులు వస్తున్నాయి. పడమర గోగులపల్లిలోని చింతచెట్టు కాలనీలో వారానికి ఒకసారి వస్తోంది. తూర్పుగోగులపల్లి ప్రాంతంలో పూర్తి స్థాయిలో రావడం లేదు. ఇందుపూరు, పురిణిలో తరచూ సమస్యలు వస్తున్నాయి. బీరంగుంట గ్రామంలో తాగునీటి ట్యాంకు ఉన్నా వినియోగంలో లేదు. నార్తుఆములూరులో నేరుగా సరఫరా చేస్తున్నారు. బట్రకాగొల్లు కాలనీల్లోని ప్రాంతాలకు తగినంత సరఫరా కావడం లేదు. అల్లూరు నగర పంచాయతీలోని కాలనీలకు కూడా సరఫరా కావం లేదు. దళితవాడలు, కాలనీలకు తక్కువగా వస్తోంది రెండు నుంచి నాలుగు రోజుల వరకు రావడం లేదని ప్రజలు చెబుతున్నారు.

తాగునీటి ప్లాంటు వద్ద క్యాన్లు

ఒక్కో కుటుంబానికి రూ.300 ఖర్చు

తాగునీటి అవసరాలకు ఎక్కువ మంది నీటి క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో దానికి రూ.20ల వరకు చెల్లిస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే రెండు రోజులకు ఒకటి కొంటున్నారు. దీన్నిబట్టి నెలకు రూ.300 వరకు ఖర్చు చేస్తున్నారు.

మెరుగుపరుస్తాం : పురుషోత్తం, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

గ్రామాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరుస్తాం. లోపాలు సరిచేసి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఆక్రమణల తొలగింపు

కావలి: పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పురపాలక అధికారులు తొలగించారు. గురువారం ఈ విషయమై సమాచారం అందగానే పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్పందించారు. ఆ ప్రాంతానికి టీపీవో వివేక్‌తో కలసి వెళ్లారు. విచారణ జరగ్గానే నిబంధనలకు విరుద్ధమని తెలిసి అప్పటికప్పుడే పొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు.

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT GADWAL

OS NO: 01/2024

Between:

Kamireddy Amarender Reddy ...Plaintiffs

And

Chilakur Sanjay Reddy and Others ...Defendants

To:

G. Vijay kumar Reddy S/o: Laxminarayan Reddy, Age: 68 years, Occ: Agriculture, R/o: Alluru Village and Mandal, Nellore district, Andhra Pradesh. ...Defendants No: 2

The notices/summons were send to you defendant No: 2 several times through court and RP in the above case in OS NO: 01/2024, but you are managed to un-served the same. Hence, through this paper publication informed to you instead of service of summons as substitute service of notices/summons for your appearance in the above said case. The above case is posted on 26-02-2026 at about 10-30 AM, Hence you are required to appear in the above said Hon'ble court to defend the case, else the matter will be decided according to law.

// By order of the Court//

K.Sugunakar Goud and E.Suresh Goud

Advocate, Gadwal, Cell No: 9440551179

వైభవంగా శేష వాహన సేవ

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని వైకుంఠపురంలో పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో గురువారం వివిధ పూజలు చేశారు. కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

విజేతలకు బహుమతి అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మారెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో వక్త పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గురువారం నిర్వహించిన పోటీల్లో ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి, జిల్లా బాధ్యులు పి.మాల్యాచలం, మండల ఉపాధ్యక్షుడు డి.వి.రమణ, ఎంఈవో గుత్తి కొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిగలేరు.. దిగితే పడిపోతారు!

గ్రామంలోని ప్రధాన సిమెంట్ రోడ్డుకు అనుగుణంగా మార్జిన్లు లేవు. కిందికు దిగితే ద్విచక్ర వాహనాలు తిరిగి ఎక్కడం కష్టమవుతోంది. ఇలాగే ఇటీవల ఓ యువకుడు పడిపోవడంతో అటుగా వస్తున్న బస్సు ఎక్కడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ ఏఈ షేక్ ఫయాజ్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

– న్యూస్‌టుడే, వింజమూరు

కోతకు గురైన సిమెంట్ రోడ్డు మార్జిన్

రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఏజీఎన్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేత

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని చినఅన్నలూరు పంచాయతీ తూర్పుమాలపాలెంలో పునర్నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయానికి ఏజీయన్ నిర్మాణ సంస్థ అధినేతలైన గడ్డం ఫకీరయ్య, రంజాన్ గురువారం రూ. లక్ష చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్థులు వారిని అభినందించారు.

పీఎంశ్రీ తనిఖీకి సిద్ధం కండి

వింజమూరు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం అమలుపై తనిఖీకి కేంద్ర బృందం త్వరలో వస్తుందని, అందుకు సమాయత్తం కావాలని సహాయ ప్రాజెక్ట్ సమన్వయకర్త వెంకటసుబ్బారెడ్డి సూచించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబుతో కలసి సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వీరరాఘవులు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

10వ వర్ధంతి

ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు మంచితనానికి మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో సుస్థిరస్థానాన్ని సంపాదించిన మా దైవం కీ॥ శే॥ డా॥ నలగొర్ల తిరుపాలు గారు మా నుండి మీరు భౌతికంగా దూరమై పది సంవత్సరముల కాలం గడిచినా

కీ॥ శే॥ డా॥ నలగొర్ల తిరుపాలు గారు

కావలి

మరణం : 20-2-2016

మా హృదయాలలో ఎప్పటికి నిలిచి ఉంటారు..

భార్య : శ్రీమతి ఎన్.లక్ష్మి

కుమార్తెలు : డా॥ ఎన్.ఎస్.ఎస్.పి.రీతిక, ఎన్.ఎస్.ఎస్.రవీణ, ఎన్.మిశ్రిత

మరియు బంధుమిత్రులు

గూడూరు

•గూడూరు •కోవూరు •సర్వేపల్లి

పర్యాటక ప్రాజెక్టులతో యువతకు ఉద్యోగావకాశాలు

సైదాపురం, న్యూస్‌టుడే: కలువాయి, రాపూరు మండలాల్లో టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వెన్నెలకంటి రామకృష్ణ దర్శనం కోసం కండలేరు ప్రాజెక్టు కాలువకు లింక్ ఏర్పాటు చేయాలని కోరారు. రాపూరు మండలం పెంచలకోన, కలువాయి మండలంలో పెన్నా నది ఒడ్డున ఉన్న పురాతన దేవాలయం తదితర ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు. కండలేరు డ్యాం, కలువాయి మినీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన

చిల్లకూరు, న్యూస్‌టుడే: చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు ఆటపాటలతో విద్యాబోధన చేయడం ఎంతైనా అవసరమని పల్లిపాడు డైట్ కళాశాల అధ్యాపకులు హరిబాబు అన్నారు. మండలంలోని పల్లిపాడు ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా సామర్థ్యాలపై గురువారం ఆయన ఆరాతీశారు. విద్యార్థులకు 'జాదూకా పిటారా' మెటీరియల్‌తో బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980

? సమస్య: వెంకటాచలం మండలం కసుమూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. చెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – నరసింహులు, కసుమూరు
✓ సమాధానం: చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు రెడ్డి, ఎంఈవో
? వెంకటాచలం మండలం ఎర్రగుంట ప్రాథమిక పాఠశాల పక్కనే చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త తొలగించి తిరిగి వేయకుండా చర్యలు తీసుకోవాలి. – పెంచలయ్య, ఎర్రగుంట
✓ పరిశీలించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – సుధీర్, ఈవోపీఆర్డీ
? వెంకటాచలం కసుమూరు రోడ్డు వద్ద జాతీయ రహదారిపైనే చెత్త వేస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు గాయపడుతున్నారు. – నరసింహులు, స్థానికుడు
✓ రహదారిపై చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. – మస్తానయ్య, పంచాయతీ కార్యదర్శి
? విడవలూరులోని స్థానిక అంకమ్మగుడి సమీపంలో వాటర్ ట్యాంకు వద్ద చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు ప్రబలుతున్నాయి. – స్థానికులు
✓ సమస్య పరిశీలించి చెత్త తొలగిస్తాం. – జగదీశ్, పంచాయతీ కార్యదర్శి
? కోవూరు పట్టణం శీలంశెట్టివారి వీధిలో కొన్ని రోజులుగా మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. – వెంకటసుబ్బయ్య
✓ పరిశీలించి పూడిక తీయిస్తాం. – శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో
? పొదలకూరు మండల పరిధిలోని అల్లూరి-నావూరుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మించాలి. – రత్నయ్య, స్థానికుడు
✓ అంచనాలు రూపొందించి పంపాం. మంజూరైనానే నిర్మిస్తాం. – శ్రీనివాసులు, ర.భ ఏఈ
? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం కలుజు వద్ద కాలువలో గుర్రపుడెక్క నిండిపోయింది. – చంద్ర, స్థానికుడు
✓ తొలగిస్తాం.–ఆలీ, ఏఈ, నీటిపారుదలశాఖ
? తోటపల్లిగూడూరు మండలం పేడూరులో వ్యర్థాలు రోడ్డుపక్కనే వేస్తున్నారు.– శ్రీనివాసులు
✓ తొలగిస్తాం.–సరస్వతి, డిప్యూటీ ఎంపీడీవో
? కోట మండలం గోవిందపల్లిపాళెం మార్గంలోని రోడ్డు అధ్వానంగా ఉంది.– మస్తానయ్య
✓ బాగుచేస్తాం.–మల్లికార్జునరావు,ఇన్‌ఛార్జి ఏఈ
? పొదలకూరు రూరల్ పరిధిలో మర్రిపల్లి గోను సముద్రంలో విద్యుత్ దీపాలు పది రోజులుగా వెలగడం లేదు. – రాజా, స్థానికుడు
✓ సరిచేయిస్తాం. – యశ్వంత్ సింగ్, ఈవో
? మనుబోలు మండలం లక్ష్మీనరసింహపురం - పిడూరు గ్రామానికెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. – పోలయ్య, స్థానికుడు
✓ మరమ్మతులు చేస్తాం– చంద్రశేఖర్, డీఈ

సైబర్ నేరాలను కట్టడి చేయండి: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, కోవూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఇది ఒక వ్యక్తి సమస్యలా కాకుండా సమాజ భద్రతకు పెను సవాల్‌గా మారిందని వీటిని అరికట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. గురువారం అసెంబ్లీలో సైబర్ నేరాలపై మాట్లాడారు. డిజిటల్ లావాదేవీలతో నేరాలు పెరుగుతున్నాయన్నారు. కోవూరుకు చెందిన ఓ మహిళకు కేవైసీ పేరుతో మొబైల్‌కు లింకు రాగా దానిని క్లిక్ చేయడంతో రూ.2 లక్షలు పోగొట్టుకున్నారన్నారు. సైబర్ క్రైం కంట్రోల్‌కు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

మంత్రి ఫరూక్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గ పరిధిలో ముస్లిం సోదరులకు అవసరమైన షాదీమంజిల్, శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్, సీసీ రోడ్లు మంజూరుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గురువారం మైనార్టీశాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాకాడు షాదీమంజిల్‌లో డైనింగ్‌హాల్, కిచెన్ రూం ఏర్పాటుకు, కోట మండలం చండ్రశేఖరపురంలో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులివ్వాలని కోరారు. గూడూరులో క్రిస్టియన్లకు ఫంక్షన్ హాల్, గాంధీనగర్ వద్ద క్రిస్టియన్ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి, పలు చర్చిల మరమ్మతులకు నిధులిచ్చి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

సర్వే పేరుతో విధులకు దూరం..!

ఎవరూ లేక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

పాలిచర్లలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం, కోట, చిల్లకూరు

ప్రజలకు తక్కువ సమయంలో ఉత్తమ సేవలు అందించాలని ఏర్పాటు చేసిన సచివాలయాల సేవలు గాడి తప్పుతున్నాయి. కొందరు ఉద్యోగులు అందుబాటులో లేకపోవడం, క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

● చిల్లకూరు మండల పరిధిలోని 19 సచివాలయాల్లో 132 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారిలో 90 మంది మాత్రమే విధులకు హాజరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆన్‌డ్యూటీ, సెలవుపై వెళుతున్న సిబ్బంది కచ్చితంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. నిబంధనలను ఏమాత్రం పాటించకుండా దాదాపు 42 మంది గైర్హాజరయ్యారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. గ్రామాల్లో వివిధ పనుల నిమిత్తం ఆయా సచివాలయాలకు వెళ్లిన ప్రజలకు సిబ్బంది అందుబాటులో లేక ఇక్కట్లు తప్పడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● గూడూరు మండలంలో 19 పంచాయతీలకు 10 సర్వ గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 120 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది అందుబాటులో లేక వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సర్వేలతో పాటు వివిధ పనులకు క్షేత్ర స్థాయికి వెళ్లాల్సివస్తే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో అర్జీదారులు సచివాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోంది. పాలిచర్ల సచివాలయం పరిధిలో 12 మంది ఉద్యోగులకు ఒక్కరే అందుబాటులో ఉన్నారు. మిగిలిన వారంతా సర్వే చేస్తున్నట్లు సదరు ఉద్యోగి తెలపగా ఆ పుస్తకంలో ఒకరు మాత్రమే నమోదు చేశారు. మిగిలిన తొమ్మిది సచివాలయాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారా లేదా సర్వే పేరుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అన్నది సంబంధిత అధికారులకే తెలియాలి.

అధికారుల పర్యవేక్షణ లేక..

విధుల్లో ఇద్దరేనా..

● కోట మండలం 16 సచివాలయాల్లో 160 మంది సిబ్బందికి 120 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీనికితోడు ఉన్న వారు కూడా సర్వేల పేరుతో బయటకు వెళుతున్నారు. తీర ప్రాంతంలోని కొత్తపట్నం సచివాలయంలో 11 మందికి ముగ్గురే ఉన్నారు. చిట్టేడులో 5 మంది, గూడలిలో 5 మంది విధుల్లో ఉన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం.. తీరిన దాహం

న్యూస్‌టుడే, కలువాయి, మనుబోలు

పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్

వారు చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు.. తాగునీటికి ఇబ్బందులు లేకుండా పాఠశాలలో శుద్ధ జలకేంద్రం ఏర్పాటు చేశారు... పదకొండేళ్లుగా నిర్వహణ బాధ్యతలు తీసుకొని నిరవధికంగా నీరందిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

● కలువాయి బీవీఎన్నార్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థులు 11 ఏళ్ల క్రితం సమావేశమయ్యారు. పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవస్థలు గమనించారు. రూ.3 లక్షలు వెచ్చించి శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. 2015 ఫిబ్రవరిలో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. అంతటితో వదిలేయకుండా నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. మరో మూడు లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. దశాబ్దానికి పైగా చిన్నపాటి మరమ్మతులు చేసిన వెంటనే బాగు చేయిస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

● పూర్వవిద్యార్థి నరసింహులు మాట్లాడుతూ... ప్రతిరోజూ విద్యార్థులకు దాదాపు 750 మంది విద్యార్థులకు 1400 లీటర్ల నీటిని అందిస్తున్నామన్నారు. ఏడాదికి కేంద్రం నిర్వహణకు రూ.30 వేలు ఖర్చవుతోందన్నారు. డిపాజిట్ చేసిన దానికి వడ్డీ రూ.18 వేలు వస్తోందని, మిగిలిన రూ.12 వేలు సొంత నగదు వెచ్చిస్తున్నామని పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

గూడూరులో నినాదాలు చేస్తున్న నాయకులు

గూడూరు పట్టణం, కోట, విడవలూరు, బుచ్చి, ముత్తుకూరు, న్యూస్‌టుడే: హైందవ ధర్మం బాగుంటే విశ్వకల్యాణం జరుగుతుందని, నేటితరం యువత తెలుసుకోవాల్సిన అవసరముందని హిందూ చైతన్య వేదిక కన్వీనర్ మల్లికార్జున్ తెలిపారు. గూడూరు పట్టణంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ద్విచక్రవాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణంనాయుడు, దయాకర్, యుగంధర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ● కోటలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటంతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు విశ్వనాథం, శ్రీనివాసులు, సుబ్బారావు, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదర్శ పాలకుడు, నవతరానికి మార్గదర్శి ఛత్రపతి శివాజీ అని విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.సుజాత అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా అధ్యాపకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● వావిళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చెంచురామయ్య ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. ఛత్రపతి శివాజీ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని ప్రిన్సిపల్ చిరంజీవి తెలిపారు. బుచ్చిలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముత్తుకూరులో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

పునాదులకే పరిమితం

పొదలకూరు మండలం నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు పశువైద్య సేవలు అందించాల్సిన పశువుల ఆసుపత్రి గత మూడేళ్లుగా పునాదులకే పరిమితమైంది. గతంలో పంచాయతీ భవనంలో సేవలందిస్తుండగా, దాని స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అయితే కొంత వరకు కట్టి నిలిపేశారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

అదుపు తప్పితే కాలువలోకే..

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం నుంచి బీచ్ వెళ్లే దారిలోని బకింగ్ హాం కాలువపై నిర్మించిన రక్షణ గోడ ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. సమీపంలో వివిధ పరిశ్రమలు ఉండడంతో నిత్యం టిప్పర్లు, లారీలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే అదుపుతప్పి కాలువలో పడే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

షట్టర్లు ధ్వంసమైనా పట్టించుకోరా..!

తిక్కవరప్పాడు బ్రాంచి కెనాల్ నుంచి వెంకటాచలం పెద్దగుంట చెరువుకు సాగునీరు సరఫరా చేసే ప్రధాన తూములను రెండేళ్ల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇనుప షట్టర్లను అపహరించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేయకుండానే సీజన్‌లో ఇసుక బస్తాలు వేసి నెట్టుకొస్తున్నారు. షట్టర్లు లేని కారణంగా నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

అపరిశుభ్రం.. విష స్వరాలతో భయం

కోవూరు మండలం పెళ్లకూరు కాలనీలో ప్రభుత్వ పాఠశాల వద్ద వాటర్‌ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉంది. విష సర్పాలు సంచరిస్తున్నాయి. సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి మంచినీటి పథకం చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ సిబ్బందితో శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు, కోవూరు

అసంపూర్తిగా వదిలేశారు

కసుమూరులో గత వైకాపా హయాంలో నిర్మాణం ప్రారంభించిన సచివాలయ భవనం అసంపూర్తిగా ఉంది. గుత్తేదారు బిల్లులు రాలేదని మధ్యలో వదిలేశారు. రెండున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి. భవనం లోపల, చుట్టూ భారీగా చెట్లు పెరిగి.. భవనం కూడా కనిపించడం లేదు. పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రం, మరొక భవనం అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్ష

జామియా మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు రూరల్ న్యూస్‌టుడే : రంజాన్ మాసం ప్రారంభమవగా తొలిరోజు గురువారం ఉపవాస దీక్షను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని మసీదుల్లో రద్దీ నెలకొంది. ఇమామ్‌లు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఖురాన్‌లోని ప్రతి పదాన్ని అర్థం చేసుకొని చదవాలన్నారు. అలాగే నెల మొత్తం తరావీహ్ నమాజులో అందరూ పాల్గొనాలని తెలిపారు. పలు ప్రాంతాల్లో ఉపవాసం ఉన్నవారికి అవసరమైన రేషన్ అందించాలన్నారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ చేశారు.

వేములచేడులో ఉపాధి హామీ గ్రామసభ

సైదాపురం, న్యూస్‌టుడే: మండలంలోని వేములచేడులో గురువారం సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. 2024-25 సంవత్సరంలో చేపట్టిన పనులు, వాటి పరిశీలన నివేదికలను సభలో వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరు మండల పరిధిలోని ఆర్.వై.పాళెనికి చెందిన శీనయ్య ఇంట్లో విద్యుదాఘాతంతో సామగ్రి ఈనెల 15న రాత్రి దగ్ధమయ్యాయి. గురువారం తెదేపా నాయకులు రూ.30 వేల విలువ చేసే ఇంటికి అవసరమైన వస్తువులు, నగదు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షులు మస్తాన్‌బాబు, శీనయ్య, సురేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సామాజిక భవనాలు

వినియోగంలో లేక అధ్వానంగా ఉన్న భవనం

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: వివిధ సామాజిక వర్గాల వారి కోసం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. పొదలకూరు- నెల్లూరు మార్గంలోని టైలర్స్‌కాలనీ సమీపంలో 2011లో మహనీయులు బాబూ జగ్జీవన్ రాం, మహాత్మా జ్యోతిబా పులే విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రాంగణంలోనే భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. పాలకులు, నాయకులు కేవలం వారి జయంతి, వర్ధంతి రోజుల్లో మాత్రమే పూలమాలలు వేసి స్మరించుకుంటున్నారు. ప్రస్తుతం వీటి గురించి పట్టించుకునేవారు లేక దిష్టిబొమ్మల్లా మారాయని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రాంగణంలో పిచ్చి చెట్లతో నిండిపోయి విష సర్పాలకు నిలయాలుగా మారాయి. భవనం తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. విద్యుత్తు సరఫరా సైతం లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వం విస్మరించడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రాంగణాలను శుభ్రపరచి, భవనాలకు మరమ్మతులు చేసివినియోగంలోకి తేవాలని పలువురు విన్నవిస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE I[st] ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT GADWAL
OS NO: 01/2024
Between:
Kamireddy Amarender Reddy ...Plaintiffs
And
Chilakur Sanjay Reddy and Others ...Defendants
To:
Y. Veeraswamy Reddy S/o: Subbarami Reddy, Age: 75 years, Occ: Agriculture, R/o: Varakavipudi, Thotapally Gudur Mandal, Nellore district, Andhra Pradesh. ... Defendants No: 3
The notices/summons was send to you/defendant No: 3 several times through court and RP in the above case in OS NO: 01/2024, but you are managed to un-served the same. Hence, through this paper publication informed to you instead of issuing summons as substitute service of notices/summons for your appearance in the above said case. The above case is posted on 26-02-2026 at about 10-30 AM, Hence you are required to appear in the above said Hon'ble court to defend the case, else the matter will be decided according to law.
// By order of the Court//
K.Sugunakar Goud and E.Suresh Goud
Advocate, Gadwal, Cell No: 9440551179

సమస్యలు పరిష్కరించాలని సమ్మె

గూడూరు పట్టణం, సైదాపురం, ముత్తుకూరు, న్యూస్‌టుడే: వేతన సవరణ చేయాలని, జీవో నెం 36 వెంటనే అమలు చేయాలని పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం గూడూరులో నిరవధిక సమ్మె గురువారం నిర్వహించారు. నాయకులు నారాయణ, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమ్మెతో సైదాపురం కార్యాలయం మూతపడింది. రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపు నివ్వడంతో తాము పాల్గొన్నట్లు సీఈవో శ్రీనివాసరావు తెలిపారు. ముత్తుకూరులో సిబ్బంది మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసంపూర్తి గృహాలు.. లబ్ధిదారుల అవస్థలు

న్యూస్‌టుడే, సైదాపురం

అర్హులైన పేదలందరికి ఇంటి స్థలాలతో పాటు గృహాలు నిర్మిస్తామని అధికారులు గత పాలనలో హడావుడి చేశారు. సైదాపురం మండల పరిధిలోని సైదాపురం, తలుపూరు, మలిచేడు, ఊటుకూరు, పాలూరు, రామసాగరం గ్రామాల్లో 162 మందికి గృహాలు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు బదులు గుత్తేదారులే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా అధికారులు మూడో ఆప్షన్ ఎంపిక చేశారు. కొన్ని గ్రామాల్లో బేస్‌మెంట్ లెవల్, మరికొన్ని గ్రామాల్లో స్లాబ్ లెవల్‌కు పనులు చేసి గుత్తేదారులు లెక్కకు మించి దోచేశారు. ప్రభుత్వం మారడంతో గుత్తేదారులు పత్తాలేకుండా పోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు అవకాశం కల్పించినప్పటికీ ఆప్షన్ మార్పుచేయని కారణంగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించి లబ్ధిదారులే గృహాలు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

సైదాపురంలో అసంపూర్తిగా నిర్మాణాలు

● గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ..సైదాపురం మండలంలో అసంపూర్తి గృహ నిర్మాణాలను లబ్ధిదారులే నిర్మించుకునేలా వారిని చైతన్యపరుస్తున్నామన్నారు. ఇప్పటికే దాదాపు 65 మందికి సంబంధించి గుత్తేదారుల ఆప్షన్ నుంచి లబ్ధిదారులకు మార్పుచేయాలని ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

మనుబోలు, కోట, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ మనుబోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లావణ్య లత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఈ నెల 23 నుంచి మార్చి 17 వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు, 24 నుంచి మార్చి 18 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరంలో 75 మంది, ద్వితీయ సంవత్సరంలో 114 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. నిఘానేత్రాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ● కోట మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోటలోని ఎస్సీ గురుకుల కళాశాల, ప్రగతి కళాశాల, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలను ఎంపిక చేశారు. ఎస్సీ గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 435 మంది, సీనియర్ ఇంటర్‌లో 373, ప్రగతి కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 296, సీనియర్ ఇంటర్‌లో 335 మంది, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 360 మంది, సీనియర్ ఇంటర్ 395 మంది పరీక్షలు రాయనున్నారు. గురువారం సెట్-1 ప్రశ్నాపత్రాలు పోలీసు స్టేషన్‌కు రావడంతో ఆయా కేంద్రాల ప్రిన్సిపల్స్ పర్యవేక్షణలో భద్రపరిచారు.

వేధిస్తున్నారన్న ఫిర్యాదుపై కేసు నమోదు

కోట, న్యూస్‌టుడే: కోట మండల పరిధిలోని విద్యానగర్‌కు చెందిన వివాహితను భర్త, అత్త తదితరులు వరకట్న వేధింపులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. విద్యానగర్‌కు చెందిన అన్వితకు తిరుపతి జిల్లా వాకాడు మండలం వెంకటరెడ్డిపాళేనికి చెందిన వేణుతో మూడేళ్ల క్రితం వివాహమవగా ఒక కుమార్తె ఉంది. వారిద్దరూ తరచూ వేధిస్తున్నారన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని పేర్కొన్నారు.

ఏయూలో దాడి హేయమైన చర్య

పొదలకూరు, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్ఎస్ఎస్ శాఖ నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొన్న నాయకులపై వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు దాడి చేయడం దారుణమని భాజపా నాయకులు రమేశ్ అన్నారు. గురువారం పొదలకూరులో ఆయన మాట్లాడారు. స్థానిక భాజపా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణస్వామి ఆరాధన

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరులోని చిట్టేపల్లి తిప్పపై వెలసిఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ప్రథమ శిష్యులు నారాయణస్వామి ఆరాధన గురువారం ఘనంగా నిర్వహించారు. నిత్యపూజలు అనంతరం త్రిముఖ విఘ్నేశ్వరస్వామిపూజ, లక్ష్మీగణపతి హోమం, ఓం నారాయణ ఆది నారాయణ హోమం, పూర్ణాహుతి హోమం జరగ్గా ఆలయ నిర్వాహకులు గుండ్రా జనార్దన్‌రెడ్డి, వసుంధరమ్మ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

దర్శనానికి వచ్చిన భక్తులు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీనివాస వైష్ణవి కోలాటం, భజనలు, భక్తి పాటల ప్రదర్శన ఆకట్టుకుంది.

శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానము
బుచ్చిరెడ్డిపాళెం టౌన్ & మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. ఫోన్: 9441183561, 9490289380
టి.జె.మాగాణి భూములు కౌలుకు వేలం పాట ప్రకటన
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం మండలం మరియు టౌన్‌లో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానం హక్కు భుక్తమైన సంగం మండలం, మక్తాపురం గ్రామములోని యల్.పి.నెం.1)463లో య.13.73 సెం., 2)463లో య.19.70 సెం., 3) 463లో య.8.14 సెం., 4) 463లో య.15.38 సెం., 5)463లో య.14.00 సెం. టి.జె.మాగాణి భూములను మార్చి 2026 సం॥ల నుండి మార్చి 2029 సం॥ల వరకు అనగా మూడు (3)సం॥ల వరకు కౌలు సాగుబడికి గాను. తే:02-03-2026ది బుధవారం ఉదయం గం॥ 11-00లకు సంగం మండలం, మక్తాపురం గ్రామములోని శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానము వద్ద బహిరంగ కౌలు వేలం పాట షరతులకు లోబడి జరుపబడును. కావున ఆసక్తి గల వారందరూ వేలము నందు పాల్గొనవచ్చును.
ఇతర వివరములకు, షరతులకు పై కార్యాలయములో తెలుసుకొనవచ్చును.
బుచ్చిరెడ్డిపాళెం
తేది: 19-02-2026
ఇట్లు
దొడ్ల మురళీకృష్ణా రెడ్డి
వ్యవస్థాపక ధర్మకర్త మరియు ఎగ్జిక్యూటివ్ అథారిటీ.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానము
గంగపట్నం గ్రామం, ఇందుకూరుపేట మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
బహిరంగ వేలం ప్రకటన
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం, గంగపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానమునకు పూర్తి హక్కు భుక్తమైయున్న తాత్కాలిక లైసెన్స్ హక్కులను తేదీ: 01-05-2026 నుండి 30-04-2027 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు ఇచ్చుటకు మరియు దేవస్థానమనకు చెందిన పాత రాగి తొడుగులు విక్రయించుటకు గాను తేదీ: 27-02-2026 శుక్రవారం ఉదయం గం॥ 10.00లకు బహిరంగ వేలం పాట జరుపబడును. మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.
గుండాల కృష్ణారెడ్డి
చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి
కార్యనిర్వహణాధికారి

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ర్యాలీగా వస్తున్న మరాఠి మిత్రమండలి సభ్యులు, మహిళలు

వేడుకగా శివాజీ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని శివాజీకూడలిలో మరాఠి మిత్రమండలి కుటుంబీకులు, శివాజీ కూడలి మిత్రమండలి సంయుక్తంగా ట్రంకురోడ్డులో శివాజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహంతో స్థానిక వీధుల్లో ర్యాలీ సాగింది. మరాఠి మిత్రమండలికి చెందిన దేవదాస్, బలరాంతోపాటు కేవీ సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ ధర్మవరం సుబ్బారావు, వేలూరు మహేష్, రామకృష్ణ, భాస్కరరావు, రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: రోగులను ఆదుకోవడం ప్రతి ఒక్కరూ అదృష్టంగా భావించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ తెలిపారు. నగరంలోని కొండాయపాలెం అబైడింగ్ హోప్ ట్రస్టులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని టీబీ, క్యాన్సర్ రోగులు, చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.1500 విలువజేసే పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బాలాజీనగర్ వాసవీనగర్‌లోని పోలేరమ్మ గుడి వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుడికి వచ్చే భక్తులతో పాటు విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు. – సుబ్బారావు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలకసంస్థ వెటర్నరీ అధికారి

? నగరంలోని పోస్టల్ కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – లక్ష్మి

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్, నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి

? వేదాయపాళెం 10వ వీధిలోని ఖాళీ స్థలంలో చెత్తాచెదారాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

✓ చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ దినేష్, నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి

? మూలాపేట మహాలక్ష్మీ దేవాలయం పక్కవీధిలో ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు

✓ నీటి వృథాను అరికడతాం. – నందన్, నగరపాలకసంస్థకమిషనర్

- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, స్టోన్‌హౌస్ పేట)

బీపీఎస్‌పై అవగాహన కల్పించండి

నెల్లూరు(నగరపాలకసంస్థ): బీపీఎస్‌పై అర్హులందరికీ అవగాహన కల్పించి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా ప్రతి ఒక్క ప్లానింగ్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైవో నందన్ తెలిపారు. గురువారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో పట్టణ ప్రణాళిక విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై అధికార లేఅవుట్ల యజమానులు, అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కలిగిన యజమానులకు అవగాహన కల్పించి తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్రీడా మైదానానికి వితరణ

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 203 మొదటి గవర్నర్ డాక్టర్ కోర్సిపాటి అంకిరెడ్డి జ్ఞాపకార్థం విశ్రాంతి తీసుకునే బల్లను అందించారు. అసోసియేషన్ సభ్యులు స్వర్ణ రమేష్ బాబు అందజేయగా, మాజీ అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి ఆవిష్కరించారు.

కలల గూడు.. వసతుల తోడు

స్వాధీనం చేసుకోనివి రద్దు

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నెల్లూరు నగరంలో గతంలో ఇచ్చిన ఉచిత టిడ్కో ఇళ్లు తీసుకున్న వారు అందులో చేరలేదు. వాటిని రద్దు చేసి.. అర్హులైన వారికి అందించే దిశగా నగరపాలిక అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో పేదలకు గతంలో తెదేపా ప్రభుత్వం టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించడంలో గత వైకాపా పాలకులు అయిదేళ్లు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కొన్నిచోట్ల రంగులు వేసి వదిలేయడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం జూన్ నాటికి వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో టిడ్కో ఇళ్ల పనులు పునఃప్రారంభించేదుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



టిడ్కో గృహ సముదాయం

ఇదీ పరిస్థితి

నెల్లూరు నగరం వెంకటేశ్వరపురంలో ఫేజ్-1లో నిర్మించిన 4800 ఇళ్లలో 3606 గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఆత్మకూరు నెల్లూరుపాలెంలో 1056కి 842, అల్లీపురంలో 11424కి 3242, అక్కచెరువుపాడులో 3696కి 1507, కల్లూరుపల్లిలో 2496కి 1170, కొండ్లపూడిలో 2496కి 1671 లబ్ధిదారులకు అప్పగించారు. రెండో విడత వెంకటేశ్వరపురంలో 2352 గృహాలకు 1482 నివాసాలను లబ్ధిదారులు తాళాలు అందజేశారు. గృహ సముదాయాల్లో కాలువల నిర్మాణం, తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. ఇళ్లు అప్పగించినా మౌలిక వసతులు లేక గృహ ప్రవేశాలు చేయలేని పరిస్థితి నెలకొంది.

నోటీసులిచ్చినా స్పందించని 508 మంది

నగరంలో గతంలో 300 చ.అ. ఉచిత టిడ్కో ఇళ్లు తీసుకున్న 508 మంది స్వాధీనం చేసుకోలేదు. నగరపాలకసంస్థ అధికారులు నోటీసులిచ్చినా స్పందించలేదు. దీంతో ఇళ్లను రద్దు చేశారు. వాటిని ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా అర్హులైన వారికి అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించి అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అద్దె బకాయి.. నిర్వాహకుల లడాయి

దుకాణాల స్వాధీనం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరంలోని కార్పొరేషన్‌కు చెందిన భవన సముదాయాల్లో గదులకు అద్దెలు చెల్లించకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన కేంద్రాల్లో నగరపాలకసంస్థ రూ.కోట్లు ఖర్చు పెట్టి పెద్దఎత్తున షాపింగ్ కాంప్లెక్సులను నిర్మించి.. దుకాణాలను అద్దె రూపంలో కేటాయించారు. తక్కువ అద్దెకే దక్కించుకున్నారు. ప్రభుత్వ భవనాలు కావడంతో అడిగేవారు ఎవరున్నారులే అనుకున్నారో.. ఏమో కొందరు అద్దెను చెల్లించడం మానేశారు. మరికొందరికి రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అద్దెను అడిగేవారు కరవయ్యారు. ఒక్కొక్కరు రూ.లక్షల అద్దెను నగరపాలక సంస్థకు చెల్లించడం మానేశారు.

దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఆర్ఐ, సిబ్బంది

ఇతరుల అధీనంలో..

షాపింగ్ కాంప్లెక్సులకు ప్రత్యేకంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీవీఎస్ కిరణ్‌ను నియమించారు. దుకాణాలకు సంబంధించి నెలవారీ అద్దె చెల్లించకపోవడం, అసలు లీజుదారులు కాకుండా ఇతరుల అధీనంలో నిర్వహిస్తుంటాన్ని గుర్తించారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు గురువారం జేవీఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పాత డైకస్‌రోడ్డు, ఏసీ బొమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆరు దుకాణాలను సీజ్ చేశారు.

బకాయిలు ఇలా..

పాత డైకస్ రోడ్డులో సముదాయంలో 1వ దుకాణం రూ.3.25 లక్షలు, మూడోది రూ.7లక్షలు, నాల్గోది రూ.38వేలు, జేవీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 16వ దుకాణం రూ.7,38,975, ఏసీబొమ్మ భవన సముదాయంలో మూడో నంబరు దుకాణం వారు రూ.8,63,712, నాల్గో షాపు వారు రూ.8,63,712 చెల్లించాల్సి ఉందని అధికారులు గుర్తించి సీజ్ చేశారు.

నెల్లూరు జట్టు విజయభేరి

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏపీప సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో కడప, నెల్లూరు జట్లు విజయభేరి మోగించాయి. వైఎస్ఆర్ఆర్ - ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం జరిగిన క్రికెట్ పోటీల వివరాలు ఇలా..! ● కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. జట్టులో మహమ్మద్ నవాజ్ 88, శశిధర్ అజేయంగా 48 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో హితేష్‌భగత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం కర్నూలు జట్టు బ్యాటింగ్ చేసి 29.1 ఓవర్లలో 103 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. జట్టులో గౌతమ్ రెడ్డి 49 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సుచిత్‌రెడ్డి 5, శశిధర్‌రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. 128 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది.

88 పరుగులు చేసిన మహమ్మద్ నవాజ్ (నెల్లూరు)

5 వికెట్లు తీసిన సుచిత్‌రెడ్డి (నెల్లూరు)

ముగిసిన ఆదిశంకరుడి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: మహ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పొగతోట గాంధీనగర్‌లో అయిదురోజులపాటు జరిగిన ఆధ్యాత్మిక ఉపన్యాసాలు గురువారంతో ముగిశాయి. ఆదిశంకర ధ్యానమండలి కమిటీ, చక్రాలవారి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు బాపట్ల వాస్తవ్యులు బ్రహ్మశ్రీ శ్రీనివాసరావు ఆదిశంకరుని విశేష ఘట్టాలు వివరించారు. అందులో భాగంగా చివరిరోజున ఆదిశంకరాచార్యుని సన్యాస దీక్ష గురించి తెలిపారు. కమిటీ సభ్యులు సత్యనారాయణ, నాగరాజు, ఉదయకుమార్‌శర్మ, వెంకటేశ్వరరావు, వినోద్‌కుమార్, రత్నకుమారి పాల్గొన్నారు.

బార్ ఏర్పాటు తగదు

నెల్లూరు(టౌన్, వేదాయపాలెం), న్యూస్‌టుడే: నగరంలోని పెద్దబజారు డైకస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌ను స్థానికులు అడ్డుకున్నారు. గురువారం ముస్లిం మైనార్టీ నేతలు సయ్యద్ సమీ, అష్ఫాక్, జుబేర్, హాజీతో పాటు పలువురు నిరసన వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.

LOST

K.స్టాన్లీ, తండ్రి: K.జేసుదాస్, అడ్రస్: ఎస్.వి.ఎం. ఎలైట్, 301, ఫుడ్ కాంప్లెక్స్, విక్రమ్ నగర్, నెల్లూరు. నాకు సంబంధించిన NSE బాండ్స్ (డాక్యుమెంట్) నెం. 22CC267303 తేది: 26-2-1998, 22CC267304 తేది: 26-2-1998, 22CC267305 తేది: 26-2-1998, 22CC267306 తేది: 26-2-1998, 22CC267307 తేది: 26-2-1998, 22CC267308 తేది: 26-2-1998) జెరాక్స్ నిమిత్తం వేదాయపాలెం వెళుతుండగా దారిలో పోయినవి. ఎవరికైనను దొరికిన యెడల పై అడ్రస్‌కు తెలియజేయగలరు.

Cell: 92476 26879

అడవి కాదు.. పార్కు స్థలమే

నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఉన్న ఓ పార్కు స్థలం చిట్టడివిని తలపిస్తోంది. పెద్దఎత్తున తుమ్మ చెట్లు, పిచ్చిమొక్కలు మొలిచి ముళ్ల కంపలతో నిండిపోయి ఉంది. పరిసరాల నుంచి మురుగు నీరు పార్కు స్థలంలోకి చేరుతోంది. పార్కు చుట్టుపక్కల ఉన్న చిన్న పరిశ్రమల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(గ్రామీణం

రోడ్డంతా మాదే...

ఇవి ఆత్మకూరు బస్టాండ్ ఎదుట నిలిచిపోయిన ఆటోలు. పెరుగుతున్న ఆటోలతో నగరం రోడ్లన్నీ నిండిపోతున్నాయి. నగరంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నవి 20వేలు, అనధికారికంగా రెండు వేలు, గ్రామాల నుంచి నగరానికి వచ్చేవి మరో రెండు వేలు తిరుగుతున్నాయి. ప్రయాణికుల కోసం ఆటోవాలాలు రోడ్లపై నిలిపివేసి ట్రాఫిక్‌కు సమస్యకు కారణమవుతున్నారు. – ఈనాడు, నెల్లూరు

రెండు నెలలుగా ఇంతే

నగరంలోని కొండాయపాలెం సెంటర్ నుంచి పొదలకూరు రోడ్డు వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా తయారైంది. రెండు రోడ్లు కలిసే చోట పెద్ద ఎత్తున గుంతలు పడటంతో నిత్యం ఈ రహదారిపై తిరిగే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనబడక ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలలు నుంచి సమస్య నెలకొందని తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

కాలువ కాదు.. తాగునీరే

నగరంలో ఎండ్ టు ఎండ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా తాగునీటి పైపులైన్లు పగిలిపోతున్నాయి. రోడ్డు అంచులను పొక్లెయినర్‌తో తవ్వుతుండటంతో పైపులైన్లకు రంధ్రాలు పడుతున్నాయి. మూలాపేట రామయ్యబడి ప్రాంతంలో రోడ్డు పనులు చేపడుతున్నారు. పొక్లెయినర్‌తో తవ్వడంతో పైపు లైను పగిలి భారీగా నీరు లీకై కాలువను తలపించింది.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT GADWAL

OS NO: 01/2024

Between:
Kamireddy Amarender Reddy ...Plaintiffs
And
Chilakur Sanjay Reddy and Others ...Defendants

To:
C.H. Koteswar Rao son of Krishna Murthy, aged about: 67 years, Occ: Agriculture R/o: 19/143, Kamathi Street, Nellore District, AP. Defendants No:4

The notices/summons was send to you/defendant No: 4 several times through court and RP in the above case in **OS NO: 01/2024**, but you are managed to un-served the same. Hence, through this paper publication informed to you instead of issuing summons as substitute service of notices/summons for your appearance in the above said case. The above case is posted on **26-02-2026 at about 10-30 AM**, Hence you are required to appear in the above said Hon'ble court to defend the case, else the matter will be decided according to law.

// By order of the Court//

K.Sugunakar Goud and E.Suresh Goud
Advocate, Gadwal, Cell No: 9440551179

వెలగని విద్యుద్దీపాలు.. సర్పాలతో సమస్యలు

న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్)

జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి మార్చురీకి వెళ్లాలంటే ఒక్క విద్యుద్దీపం వెలగడం లేదు. పాములు తిరుగుతుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివే విద్యార్థులకు ఆసుపత్రి ఆవరణలోనే వసతి భవనం ఉంది. బాలికలు తమ హాస్టల్‌కు వెళ్లాలంటే ఆసుపత్రి నుంచి మార్చురీకి వెళ్లే దారే ఆధారం కావడంతో వారూ ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు ఆందోళనతో జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌కు ఇటీవల వినతి పత్రం అందించారు.

మౌలిక వసతులు లేక

నగరంలోని సర్వజన ఆసుపత్రిలో మౌలిక వసతులు లేక రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రుల్లో ఆసుపత్రి ప్రాంగణంలో తిరగాలంటే భయాందోళనలు చెందుతున్నారు. విద్యుద్దీపాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏ వైపు నుంచి పాములు వస్తాయో నని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ప్రధాన ఆసుపత్రి కావడంతో జిల్లా నలుమూలల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడికే తీసుకువస్తారు. ప్రాథమిక చికిత్స అనంతరం మృతదేహాలను మార్చురీలో భద్రపరుస్తారు. ఇక్కడకు వెళ్లేందుకు వీధి దీపాలు లేక ఇక్కట్లకు గురవుతున్నారు.

పనిచేయని విద్యుద్దీపాలు

● సమస్యలు పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ మాధవి తెలిపారు.

ఏపుగా పెరిగిన చెట్లు

ఆసుపత్రి ప్రాంగణమంతా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతంలో విష సర్పాలు సిబ్బందిని కాటు వేయగా.. మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. పాములను పట్టేందుకు, తిరగకుండా చూసేందుకు ప్రైవేటు సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. నిబంధనల ప్రకారం వీరు ఆసుపత్రి ప్రాంగణంలో పాములు, ఎలుకలు రాకుండా చూడాల్సి ఉంది. పట్టించుకోకపోడంతో విష సర్పాలు తిరుగుతున్నాయి. సాయంత్రమైతే నాగు పాములు తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆస్పత్రి అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు, రోగులు కోరుతున్నారు.

ఖరీదైన చోట.. సమస్యల బాట

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

చుట్టూ మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన తుంగ, రాళ్లు తేలిన రహదారులతో మాగుంటలేఅవుట్ వాసులు సతమతమవుతున్నారు. ఖరీదైన ప్రాంతంగా గుర్తింపు ఉన్నా సమస్యలు వేధిస్తున్నాయి. ఈ ప్రాంతంలో వక్ఫ్‌బోర్డు, దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు ఉన్నాయి. వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఖాళీ స్థలంలో వర్షం నీరు, మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఏపుగా పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో విష సర్పాలు, క్రిమికీటకాలతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఏళ్ల తరబడి ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అన్నమయ్య సర్కిల్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వైపు వచ్చే రహదారి పక్కనే కాలువ ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పక్కనే పెద్ద కాలువ ఉన్నా దానికి ఎలాంటి గోడ ఏర్పాటు చేయలేదు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా కాలువలో పడిపోయే అవకాశం ఉంది.

ప్రమాదకరంగా కాలువ

రాళ్లు తేలిన రహదారులు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఏర్పాటు చేసిన మాన్‌హోల్స్ అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్డు కన్నా దిగువకు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలు సిమెంట్‌రోడ్లు నాశిరకంగా నిర్మించడంతో రాళ్లు తేలి గుంతల మిట్టలుగా మారాయి. రైల్వే ట్రాక్ పక్కనే ప్రవహిస్తున్న కాలువ పరిస్థితి దారుణంగా ఉంది. గుర్రపుడెక్క, చెత్తాచెదారాలతో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని, కాలువల్లో పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము

నరసింహకొండ, దేవరపాళెం గ్రామం, నెల్లూరు రూరల్ మం.
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. ఫోన్: 94942 89008
ఇ-ప్రొక్యూర్‌మెంట్ - సీల్డుటెండరు - బహిరంగ వేలం ప్రకటన - 2వ పిలుపు

2026-27 ఆర్థిక సంవత్సరమునకు ఈ క్రింద కనపరచిన హక్కులు లైసెన్సు హక్కులు & వివిధ ఐటములు సరఫరా చేయుటకు ఇ-టెండరు/ సీల్డ్ టెండర్లు దేవదాయ శాఖ అధికారుల సమక్షమున, దేవస్థాన కార్యనిర్వహణాధికారిచే నిర్వహించబడును. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ-టెండర్లకు దాఖలు పరచు తేది: 18-02-2026 నుండి 26-02-2026 వరకు, సీల్డు టెండర్లు దాఖలు పరచు తేదిలు 18-02-2026 నుండి 27-02-2026 ఉదయం 9 గంటల వరకు బహిరంగ వేలం తేది: 27-02-2026 ఉదయం 10 గంటల నుండి దేవస్థాన ప్రాంగణములో జరుగును.

నెం.	వివరములు	ధరావత్తు రూ.
1.	పార్కింగ్ వసూలు చేసుకొను హక్కు	1,00,000/-
2.	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు విక్రయించుకొను హక్కు	2,50,000/-
3.	కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు	1,50,000/-
4.	తలనీలాలు సేకరించుకొను హక్కు	5,00,000/-
5.	బుక్‌స్టాల్- పుస్తకాలు, సీడీలు, ఫొటోలు వగైరా అమ్ముకొను హక్కు	50,000/-
6.	కళ్యాణమండపమునకు హైరర్స్ పూలు డెకరేషన్ చేసుకొను హక్కు	50,000/-
7.	షాపునెం. 1 కూల్‌డ్రింక్స్ & ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకొను హక్కు	50,000/-
8.	షాపునెం. 2 కూల్‌డ్రింక్స్ & ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకొను హక్కు	50,000/-
9.	షాపునెం. 3 కూల్‌డ్రింక్స్ & ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకొను హక్కు	50,000/-
10.	ఖర్జూరం, కలకండ, చక్కెరగుండ్లు అమ్ముకొను హక్కు	20,000/-
11.	చెప్పుల స్టాండ్ నిర్వహణ హక్కు	5,000/-
12.	భక్తులు శ్రీ స్వామి అమ్మవార్లకు సమర్పించిన వస్త్రములు సేకరణ	25,000/-
13.	ఫ్లవర్ స్టాల్ నిర్వహణ	10,000/-
14.	కొండపై టిఫిన్లు, టీ, కాఫీ అమ్ముకొనుట	20,000/-
15.	ఫలసరకులు సప్లై చేయుట	10,000/-
16.	నిత్య పుష్పం సరఫరా చేయుట	5,000/-
17.	ప్రింటింగ్ పనులు చేయుట	5,000/-
18.	కరెంటు, ప్లంబింగ్ సామానులు సరఫరా చేయుట	5,000/-
19.	మర్యాద వస్త్రములు సరఫరా చేయుట	5,000/-
20.	కూరగాయలు సరఫరా చేయుట	2,000/-
21.	భక్తులు సమర్పించిన ముతక బియ్యం సేకరణ	2,000/-
22.	స్టేషనరీ సామానులు సరఫరా	2,000/-
23.	వివిధ రకముల స్క్రాప్ వస్తువులు వేలం	5,000/-
24.	గోశాలలోని ఎరువు అమ్మకం	5,000/-

షరతులకు దేవస్థాన కార్యాలయము పనిచేయు సమయములో మరియు బహిరంగ వేలం సమయంలో తెలుసుకోగలరు. ఆన్‌లైన్‌ద్వారా టెండరు వేయువారు **https://tender.apeprocurement.gov.in** నందు సంప్రదించవచ్చును. సీల్డ్ టెండరు షెడ్యూలు తేది. 26.02.2026 సా॥ 5 లోపు రూ. 500/- చెల్లించి పొందగలరు. షెడ్యూలు దాఖలు తేది: 27.02.2026 ఉ॥ 10 గంటలలోపు టెండరు బాక్సులో వేయగలరు.

స్థలం: నరసింహకొండ | చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు | కార్యనిర్వహణాధికారి
తేది:18.2.2026

ఆటో నగర్‌లో గంజాయి విక్రయాలు

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: నగరంలోని అయ్యప్పగుడి ఆటో నగర్‌లో గంజాయి క్రయ విక్రయాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆటో నగర్‌లోని పాత ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం వెనక గంజాయి తాగుతున్నారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ పి.దయాసాగర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఏఈఎస్ ఆర్. జగదీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో స్థానికంగా రాము, షఫి ఇద్దరు మోతిలాల్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు దర్యాప్తులో పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 340 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలకృష్ణ, ఎస్సై పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎ.రమేష్ కుమార్, ఎం.కిరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. రెండో డివిజన్ గుడిపల్లిపాడులో కాలువలు, సిమెంటు రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికంగా ఉన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న నూతన భవనాలకు అనుమతులను తనిఖీ చేశారు. బాలాజీనగర్ అన్నపూర్ణ అపార్టుమెంటు ప్రాంతంలో పన్ను బకాయిలున్న వారితో మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న ఎండ్‌టు ఎండ్ సిమెంటు రోడ్ల పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మూలాపేట రామయ్యబడి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను, బట్వాడిపాలెం సెంటరులో ఐలాండ్ నిర్మాణాన్ని తనిఖీ చేశారు.

పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

బకాయిలున్న వారికి జాతీయ లోక్ అదాలత్ ద్వారా నోటీసులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో ఆస్తి, తాగునీటి కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల ఎగవేతదారులపై క్రిమినల్ చర్యలు, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగానికి న్యాయస్థానాల ద్వారా నోటీసులు పంపుతామని కమిషనర్ వైవో నందన్ సూచించారు. గురువారం కార్యాలయంలోని ఛాంబరులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలకసంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.247కోట్లు, ఖాళీ స్థలాల పన్ను రూ.37కోట్లు, తాగునీటి కుళాయి పన్ను రూ.63 కోట్లు మొత్తం రూ.347 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. మొండి బకాయిలతో పాటు ప్రస్తుత డిమాండ్ మొత్తం రూ.347 కోట్లకు గాను కేవలం రూ.90కోట్లు వసూలు చేశామని తెలిపారు. బకాయిలున్న వారందరికీ జాతీయ లోక్ అదాలత్ ద్వారా నోటీసులు జారీ చేయనున్నామని స్పష్టం చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, నళినీ మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై చర్చిస్తామన్నారు.

కళల కాణాచి.. తాన్యా

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

సకల కళల్లో రాణిస్తోంది.. నెల్లూరు నగరానికి చెందిన తాన్యా. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు జీవం పోస్తూ సింహపురి కీర్తిని చాటుతున్నారు. ఈమె యూరప్‌లో జన్మించింది. ఆ తరువాత తల్లిదండ్రులు భారతదేశానికి వచ్చారు. వీరు వేదాయపాలెంలో నివాసం ఉంటున్నారు. తండ్రి వెంకట్ వృత్తిరీత్యా ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. తల్లి ప్రవీణ సాఫ్ట్‌వేర్ రంగాన్ని వీడి యోగా శిక్షకురాలిగా మారారు. యువతి చెన్నైలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది.

నృత్య ప్రదర్శనలో

150కి పైగా నృత్య ప్రదర్శనలు

యూరప్‌లో ఉన్నప్పుడే భారతీయ కళలపై తాన్యా అడుగులు వేసింది. కళలు, సంస్కృతి, వ్యక్తిత్వ వికాసంపై పట్టు సాధించి.. నాట్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కూచిపూడి నృత్యంలో ప్రత్యేకం శిక్షణ పొంది పట్టు సాధించడమే కాదు.. గిన్నిస్‌బుక్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులు కైవసం చేసుకుంది. ఇప్పటికే 150కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. తల్లి ప్రోత్సాహంతో యువతి యోగా, ధ్యానంలోనూ రాణిస్తోంది. కర్ణాటక సంగీతంలో స్వరాలాపనలో దిట్ట.

యాంకర్‌గా రాణిస్తూ

తాన్యా వక్తగా, వ్యాఖ్యాతగా రాణిస్తున్నారు. ఎంతటి వేదికపైనైనా అవలీలగా వ్యాఖ్యాతగా ప్రతిభ చూపడంతోపాటు భగవద్గీతలోని ఆధ్యాత్మిక విలువలను హృదయాలను హత్తుకునేలా వివరించడం ఈమె ప్రత్యేకత. ఆమె మాటలతో నిరాశలో ఉన్నవారికి ఆశలు నింపుతూ లక్ష్యాలు ఎంచుకుని జీవితం వైపు సాగేలా ఉంటాయి. నాట్యమయూరీగా పురస్కారం అందుకున్నారు. తానా ప్రపంచ పోటీల్లో ప్రథమ బహుమతితోపాటు పురస్కారం వరించింది.



తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.ఐ) షెడ్యూల్: స్క్రీన్.1. నవాబ్ కేఫ్ (తెలుగు), బుకి (తెలుగు), స్క్రీన్ 2.. హే బల్వాన్త్ (తెలుగు), స్క్రీన్.3.. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), ఫంకీ (తెలుగు), **పార్వీ సినిమాస్ (స్పైస్):** స్క్రీన్.1.. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), స్క్రీన్ 2. గోట్ 3డి (ఇంగ్లిష్), స్క్రీన్ 3. ఫంకీ (తెలుగు), స్క్రీన్ 4. నవాబ్ కేఫ్ (తెలుగు), బుకి (తెలుగు), స్క్రీన్.5.. హే బల్వాన్త్ (తెలుగు), **రైన్ సినిమా షెడ్యూల్ :** స్క్రీన్..1. హే బల్వాన్త్. (తెలుగు), స్క్రీన్ 2. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), స్క్రీన్ 3.నవాబ్ కేఫ్ (తెలుగు), స్క్రీన్ 4. ఆల్ఫామెన్ లవ్ వెంజన్స్ (తెలుగు), బుకి (తెలుగు)

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఏసిపిసి-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

ఇ-వేలం ద్వారా వాహనముల అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యమును పొందియున్నారు. బ్యాంకుకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమంగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనం చేసుకొని **"యధాతథ స్థితి"**లో వేలం ద్వారా దిగువ తెలిపిన తేదీన అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోన్ తాలూకు అసలు బకాయిసొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఇ-వేలమునకు ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఋణగ్రహీత పేరు & ఖాతా నెం. & బ్రాంచి పేరు	వాహన వివరములు, రిజిస్ట్రేషన్ నెం., మోడల్	రిజర్వు ధర & ఇఎమ్‌డి	వేలం సమయం	వాహన వివరములకు సంప్రదించవచ్చు
1	శ్రీ సుబ్రమణ్య ఉదయ్ కిరణ్ కొట్ర అకౌంట్ నెం.42476817994 బ్రాంచి: పోరంకి (11101)	TATA SAFARI AP40 BA 0716 / 2022 / Diesel / ENGINE NO. 463438414195205	Rs.7,00,000/- & Rs.70,000/-	10.00 AM to 12.00 NOON	8985644774 Rahamtulla

ఇ-వేలం తేది మరియు సమయం: 27-02-2026, ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 12.00 గం॥ల వరకు

బిడ్ పెంపుదల: బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.1,000/- లతో గుణింపు ఆన్‌లైన్‌లో హెచ్చించవలెను.

నియమనిబంధనలు: (1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. (2) విజయవంతమైన పాటదారుడు బిడ్ మొత్తం మీద 15% మొత్తము వెంటనే చెల్లించవలెను, మిగిలిన సొమ్మును 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా ఇప్పటివరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు రద్దుచేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. **(4) వాహనం రిజిస్ట్రేషన్ బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌ది మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనం ఇవ్వబడును. (5) వాహనం పార్కింగ్ యార్డు యొక్క అద్దె విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను.** (6) ఇతర వివరములకు అధీకృత అధికారి, **SBI**, హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఏసిపిసి-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008, సెల్:9441127661 నందు మరియు ఇ-వేలం కొరకు **please visit https://baanknet.com** నందు సందర్శించగలరు.

గమనిక: వాహనం యొక్క రిజిస్ట్రేషన్ పేరు మార్పునకు మొబైల్ నెం:8985644774 ను సంప్రదించగలరు మరియు వాహనం యొక్క రిజిస్ట్రేషన్ ఛార్జీలు విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను.

తేది: 19-02-2026, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, SBI, RACPC-II, విజయవాడ

(c) eenadu

ముద్దిరెడ్డిపల్లిలో నీటిశుద్ధి ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, చిత్రంలో ఏపీ టెక్నికల్ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

పట్టుపరిశ్రమ అభివృద్ధికి ఆద్యుడు ఎన్టీఆర్

హిందూపురం, న్యూస్‌టుడే: పటికోడనా సంస్థ, పట్టుగూళ్లకు గిట్టుబాటు ధర లభించేలా రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌ను హిందూపురంలో నిర్మించిన ఘనత ఎన్టీఆర్‌దే దక్కుతుందని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఈ ప్రాంతంలో పట్టుపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు ఆద్యుడు ఆయనే అని కొనియాడారు. హిందూపురంలో సీఎస్‌బీ, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 8 కోట్లతో నూతనంగా నిర్మించే పట్టుగూళ్ల మార్కెట్‌కు గురువారం బాలకృష్ణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొస్తోందన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటోందని వివరించారు. పట్టు రైతులకు, రీలర్లకు బకాయి ఉన్న ప్రోత్సాహక నిధులు దాదాపు రూ.80 కోట్లు త్వరితగతిన మంజూరు చేసేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో సీఎస్‌బీ కార్యదర్శి నరేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకులు అరుణకుమార్, జేడీ శోభారాణి, మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు నీటిశుద్ధి ప్లాంట్లు ప్రారంభం

హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీ టెక్నికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంట్లను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. గతంలోనూ ఆయా ప్రాంతాల్లో ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా చేయూత అందిస్తున్న ఏపీ టెక్నికల్ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణను బాలకృష్ణ అభినందించారు. అనంతరం మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నారన్నారు. ప్రధానంగా తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు.

రేపు జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి పాఠశాలల ప్రతిభా పాటవ పోటీలు ఈనెల 21వ తేదీన జరగనున్నాయి. అనంత నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. గత నాలుగు నెలలుగా అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిరలోని వివిధ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, క్విజ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఒక్కో విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఒక్కో పాఠశాల నుంచి 12 మంది విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారికి జిల్లాస్థాయి పోటీలు శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అనంతపురంలోని పీవీకేకే కళాశాల వద్దకు విద్యార్థులు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

అక్రమ లేఅవుట్ మాట వినిపించొద్దు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం-హిందూపురం (అహుడా) పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని ప్రతి లేఅవుట్ క్రమబద్ధీకరించాలని అహుడా వైస్ ఛైర్మన్, జేసీ విష్ణు చరణ్ స్పష్టం చేశారు. గురువారం అహుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు.

మిషన్ శక్తి నిధులు గోల్‌మాల్

కొటేషన్‌లో చేతివాటం

అడ్డదారిలో ఐసీడీఎస్ అధికారులు

రూ.15.75 లక్షలు పక్కదారి?

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుబంధ 'మిషన్ శక్తి' పథకం అమలులో కాసు 'గోల్‌మాల్' జోరు చేసుకుంది. రూ.లక్షలాది నిధులు అడ్డదారిలో ఖర్చు చేయడమే కాదు.. 'చేతివాటం' ప్రదర్శిస్తున్న వైనంపై తీవ్ర విమర్శలు దారి తీసింది. మిషన్ శక్తి నిధుల వ్యయానికి సంబంధించి 2025 జులై 16న జారీ చేసిన జీవో, మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా.. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖల్లో (ఐసీడీఎస్) వేర్వేరుగా అమలు చేసిన తీరు ఆశ్చర్యానికి, అనుమానానికి గురి చేస్తోంది. అనంత జిల్లాలో మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత అంశాలపై బాలికలు, మహిళల అవగాహన కోసం నిధులు వ్యయం చేస్తుండగా.. శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం జీవోలను తుంగలో తొక్కారు. ఏ రకమైన వాహనాలూ అసలు కొనుగోలు చేయకూడదంటూ 1994లో జీవో 5, 2004లో 162, 2005లో 170 జీవోలను జారీ చేస్తూ ప్రభుత్వం నిషేధం విధించింది. అవసరమైతే అద్దె ప్రాతిపదికపై తీసుకోవచ్చని స్పష్టత ఇచ్చింది.

జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ఛైర్మన్‌గా జేసీ ఉంటారు. ఈయనకే కాదు.. కలెక్టర్, రాష్ట్ర డైరెక్టర్లు, కార్యదర్శులకు.. ఇలా ఉన్నతాధికారులు ఎవరైనా సరే ఏమేమీ కొనుగోలు చేయాలన్నా దానిపై 2020 అక్టోబరు 21న జీవో 148ను జారీ చేశారు. 43 రకాల వస్తువులను కొనొచ్చు. ఇందులో వాహనాల కొనుగోలు లేదు. కేవలం మరమ్మతు, నిర్వహణకు నిధులు మంజూరు చేసే అధికారం మాత్రమే ఉంది. కానీ.. శ్రీసత్యసాయి ఐసీడీఎస్ పీడీ మాత్రం ఏకంగా రూ.13.51 లక్షలు వెచ్చించి ఒక వాహనాన్ని కొనడం విశేషం. మిషన్ శక్తి కింద రూ.15.75 లక్షలు ఉంటే.. అందులో వాహనానికే రూ.13.51 లక్షలు ఇచ్చేశారు. కలెక్టర్, జేసీలకే బురిడీ కొట్టించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైన కొనాలంటే రూ.5 లక్షల్లోపు అయితే కనీసం మూడు కొటేషన్లు స్వీకరించాలి. రూ.5 లక్షలు దాటితే విధిగా టెండరు ఆహ్వానించాలి. ఇక్కడ వాహనం కొనుగోలుకు రూ.13.51 లక్షలు వెచ్చించారు. టెండర్ ఆహ్వానించకుండా నచ్చిన వారితో కొటేషన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. వాహనం కొనుగోలుకు జేసీతో సహా ఎనిమిది మంది జిల్లా అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఏమాత్రం సంబంధం లేని డీఎస్ఓ, సీపీఓ, డీఐసీ.. వంటి అధికారులను నియమించడం అనుమానాలకు దారి తీసింది. డీసీపీఓ ఒప్పంద ఉద్యోగి. ఇతన్ని కూడా ఆ కమిటీలో నియమించడం ప్రస్తావనార్హం. కీలకమైన ఆర్టీఏ అధికారే వాహన కొనుగోలు దస్త్రంపై సంతకం పెట్టలేదని విశ్వసనీయ సమాచారం.

కలెక్టరు ఆదేశాలతో కొంటున్నాం

- ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

వాహనం కొనుగోలు వ్యవహారం కలెక్టర్ చూస్తున్నారు. ఇందుకు సంబంధించి మాకు పూర్తి సమాచారం లేదు. ఏదైన నిబంధనల ప్రకారమే చేస్తాం. వాహనం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులేవీ మా వద్ద లేవు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, కాలవ శ్రీనివాసులు

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు కృషి

అనంతపురం, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, సురేంద్రబాబు చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఆర్డీటీ నిర్వహణ కష్టంగా మారిందని, ఆస్తులను విక్రయించే స్థితికి రావడం దురదృష్టకరమని సీఎంకు వివరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలోనే పాలకులు పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, త్వరగా ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించేలా చూడాలని ఎమ్మెల్యేలు విన్నవించారు. ఇప్పటికే చాలాసార్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లామని సీఎం గుర్తు చేశారు. మరోసారి దిల్లీ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని సీఎం భరోసా ఇచ్చారని ఎమ్మెల్యేలు తెలిపారు.

కార్యక్రమం అమలు ఇలా..

ప్రాజెక్టు పేరు : చెలిమి

అమలు ఎక్కడ: చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం మండలాల్లోని 16 గ్రామాల్లో

అమలు ఇలా: 30 మంది లీడర్లతో జన చైతన్య సమాఖ్య ఏర్పాటు చేస్తారు. స్థానికంగా ఉన్న ఉమ్మడి నీటి వనరులు, భూగర్భ జలాల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేసి వాటి కనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తారు.

టింబక్టు ఆధ్వర్యం.. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారం

సంకల్పం.. సాక్షాత్కారం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెరువులు, నీటి కమతాల బాగు, పటిష్ఠతకు చర్యలు తీసుకుని పంట, నీరు భద్రతకు కృషి చేస్తూ ఇటు రైతులకు, అటు ప్రకృతికి మేలు జరిగేలా టింబక్టు కలెక్టివ్ సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్టు (చెలిమి) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024 ఏప్రిల్ 1న ప్రారంభించిన ఈ పథకానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. గ్రామాల్లో చెరువులు, కట్టలు, కాలువలు, చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు నిర్వహించడం, పూడిక తీసి మట్టిని రైతుల పొలాలకు తరలించడం ముఖ్యోద్దేశం. గ్రామాల్లో నీటి వనరులను గుర్తించి వాటికి మరమ్మతులు నిర్వహించి సుస్థిరంగా వినియోగించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ పని చేస్తోందని ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.

చెరువుకట్టపై ముళ్లపొదల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న సమాఖ్య మహిళలు

ఇప్పటివరకు..

పోలేపల్లి, పెద్దకోడిపల్లి, శేషంపల్లి, చెరుకూరు, దోడగట్ట, కోగిర చెరువుల కట్టలపై ముళ్ల పొదలు తొలగించారు. ముష్టికోవెల, కనుముక్కలలో రెండు చెరువులు, పెద్దకోడిపల్లి, రామగిరి, కోగిర చెరువుల ఆయకట్టు కాలువలను బాగు చేయించారు. శిథిలావస్థలో ఉన్న 14చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేశారు. 9 నీటి కుంటల్ని బాగు చేశారు. 14 గ్రామాలలో వర్షపాత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆరు చెరువుల్లో పూడిక తీసి 653 మంది రైతుల పొలాలకు 22 వేల ట్రాక్టర్ల మట్టిని తరలించారు.

సేంద్రియ వ్యవసాయం

16 గ్రామాల్లో 7,014 మంది రైతులతో 20,620 ఎకరాల్లో సేంద్రియ సాగు చేపట్టారు. అందులో 178 మంది రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యపు పరికరాలు అందించారు. రైతులకు వేప చెక్క, వేప నూనె, కషాయాలు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టె విత్తనాలు ఉచితంగా అందిస్తున్నారు. రైతులే సొంతంగా తయారు చేసుకునేలా సంస్థ సిబ్బంది కార్యశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

రెవెన్యూ ప్రక్షాళనకు రంగంలోకి కలెక్టర్

గోరంట్ల, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా వసూలు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుండడం వంటి ఆరోపణలపై 'ఈనాడు'లో గురువారం 'కాసుక్కూచున్నారు' శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తక్షణమే స్పందించారు. రెవెన్యూశాఖ ప్రక్షాళనకు నేరుగా రంగంలోకి దిగారు. గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు అనూహ్యంగా ప్రత్యక్షం కావడంతో సిబ్బంది కంగుతిన్నారు. కలెక్టర్ నేరుగా దస్త్రాలు, కంప్యూటర్ గదులకు వెళ్లారు. అనంతరం కంప్యూటర్ గదిలో కూర్చొని స్వయంగా పెండింగ్ ఫైళ్లను చూసి ఆలస్యానికి కారణాలను విచారించారు. పీజీఆర్ఎస్, ఆర్ఓఆర్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, సిబ్బంది హాజరు రిజిస్టర్, పెండింగ్ ఫైళ్లు, రెవెన్యూ క్లినిక్, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల పరిష్కార స్థితి తదితర అంశాలపై సుమారు 20 నిమిషాలకు పైగా తహసీల్దార్ మధుసూదననాయక్, ఇతర సిబ్బందితో విచారించారు. సిబ్బంది సమయపాలన, సేవలు ఆలస్యం, అక్రమాలకు పాల్పడడం సీరియస్‌గా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, వేగవంతంగా, పారదర్శకంగా సేవలందించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులు కార్యాలయాల్లో కనిపిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు.



కంప్యూటర్ గదిలో పరిష్కారం కాని ఫైళ్లపై తహసీల్దార్‌తో విచారిస్తున్న కలెక్టర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
హిందూపురం	6.29	5.25
కదిరి	6.26	5.21
ధర్మవరం	6.31	5.21

పీఏబీఆర్‌లో తాగునీటి పంపింగ్‌కు రూ.3.50 కోట్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పీఏబీఆర్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఇంటెక్‌వెల్ వద్ద నీటి పంపింగ్‌తోపాటు మోటార్ల మరమ్మతులకు అత్యవసరంగా రూ. 3.50 కోట్లు మంజూరైంది. ఈ వివరాలను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం విలేకరులకు తెలిపారు.

● జలాశయంలో నీటి పంపింగ్‌కు రెండు మోటార్లు ఉండగా, ఒకటి పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఒక దానితోనే ఆ ప్రక్రియ కొనసాగుతోంది. తాగు, సాగునీటికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఎస్ఎస్ఆర్‌డీడబ్ల్యూఎస్‌పీ అభివృద్ధికి ఆ నిధుల మంజూరుకు పరిపాలన ఉత్తర్వులు వచ్చాయి. ఈ నిధులతో మోటారుకు తక్షణం మరమ్మతులు చేయించేలా చొరవ చూపుతాం. నీటి పంపింగ్ అంశంలో తగిన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశిస్తాం. ఉమ్మడి జిల్లాలో అత్యధిక భాగానికి ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. వేసవి దృష్ట్యా నీటి పంపింగ్‌కు ఎలాంటి ఇక్కట్లు లేకుండా ఈ చర్యలు చేపట్టాం.

ధర్మవరం పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన ఉమర్ ఫారుఖ్ దూదేకుల(బీసీ-బీ) కులానికి చెందినవాడు. స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈఏపీసెట్ రాసేందుకు కుల ధ్రువపత్రం అవసరం కావడంతో వార్డు సచివాలయంలో దరఖాస్తు చేశాడు. కుల ధ్రువపత్రం రాగా.. అందులో ఎస్టీ (ఎరుకుల)గా ఉండటంతో కంగుతిన్నాడు. జిల్లాలోని చాలామంది విద్యార్థులకు ఈ సమస్య ఎదురవుతోంది.

వైకాపా నిర్లక్ష్యం... విద్యార్థులకు శాపం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రస్తుతం విద్యార్థులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. అప్పట్లో జగనన్న సురక్ష పేరిట వార్డు, గ్రామ సచివాలయాల్లో 11 రకాల ఉచిత సేవలు అందిస్తున్నాం. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వాలంటీర్ల ద్వారా ఇంటింటా ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ కుల ధ్రువపత్రం ఉచితంగా (ఫ్రీకాస్ట్) మంజూరు చేస్తామని చెప్పారు. దీంతో పలువురు ఆధార్ కార్డులను వాలంటీర్లకు అందజేశారు. వారు సుమోటో క్యాస్ట్ కరెక్షన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4లక్షలకు పైగా వివరాలు నమోదు చేయడం గమనార్హం. వాస్తవానికి వీఆర్వోలు ఆధార్ కార్డులు తీసుకుని క్షేత్రస్థాయిలో అభ్యర్థుల కుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 నవంబరు నుంచి కొత్తగా కుల ధ్రువపత్రాలను మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సుమోటో క్యాస్ట్ కరెక్షన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసి గతంలో దొర్లిన తప్పులను సరి చేస్తోంది. కానీ ఈ తప్పులు వేలాదిగా బయట పడుతున్నాయి. రీ-ఇష్యూరేషన్స్ సర్టిఫికెట్‌లో జరిగిన తప్పులను లబ్ధిదారులతో మాట్లాడి సరి చేస్తున్నారు. ముందుగా తహసీల్దార్ వద్దకు వెళ్లి సమస్యను చెప్పి ఓ విజ్ఞాపన పత్రాన్ని రాయాల్సి ఉంటుంది. దాన్ని జేసీ లాగిన్‌కు పంపాలి. అక్కడ రీటిక్ చేస్తేనే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. ఈ తతంగం తెలియక చాలామంది తికమక పడుతున్నారు. ఏమాత్రం ఆలస్యం చేసిన విద్యార్థుల జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పొరపాట్లను వెంటనే సరి చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం - మహేష్, ధర్మవరం ఆర్డీఓ

కొందరికి పంపిణీ చేసిన కుల ధ్రువపత్రాల్లో తప్పులు దొర్లినట్లు గుర్తించాం. వాటిని జేసీ లాగిన్‌లోనే సరిచేయాల్సి ఉంది. సమస్య అన్ని చోట్ల ఉండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

ఆర్టీసీ కండక్టర్లకు పవర్ బ్యాంకులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : ప్రయాణ వేళల్లో టిమ్ మిషన్లలో ఛార్జింగ్ సమస్యలు తలెత్తకుండా కండక్టర్లకు పవర్ బ్యాంకులు అందించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో ఆయన 593 మందికి పవర్ బ్యాంకులను అందజేశారు. టిమ్ మిషన్‌లో ఛార్జింగ్ లేకపోవడంతో ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పవర్ బ్యాంకులతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. 'మన మిత్ర-వాట్సప్ గవర్నన్స్' లో జీటీఎఫ్ఎస్ బెస్ట్ ట్రాకింగ్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

సమయం లేదు.. సమీక్షా జరగలేదు!

కదిరి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యేనా?

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు మరో ఆరు రోజుల్లో అంకురార్పణ జరగనుంది. ఏటా ఉత్సవాలకు 15 రోజుల ముందే సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించేవారు. ఈ ఏడాది ఆ ప్రక్రియ మొదలవలేదు. ఉత్సవాల ప్రచార కార్యక్రమాలు, ఏర్పాట్లు, అలంకరణలు, భక్తులకు సదుపాయాలు కల్పించాలి. ఆ హడావుడి ఏమీ కనిపించలేదు. బ్రహ్మోత్సవాల వైభవాన్ని చాటేందుకు తక్కువ సమయంలో ప్రచారం ఎలాగన్న చర్చ భక్తుల్లో ఉంది. అధికారులు, పాలకులు చొరవ చూపి ఘనమైన ఏర్పాట్లతో ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మాండంగా నిర్వహిస్తాం

- శ్రీనివాసరెడ్డి, ఈవో

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశాన్ని ఈనెల 21న నిర్వహిస్తున్నాం. ఆరోజు సాయంత్రం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్డీవో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ఉభయదారులు, తదితరులు తప్పక హాజరుకావాలి.

★ కదిరి నృసింహస్వామి భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్సవాలకు అధికారుల సమన్వయంతో జరిగే సమీక్ష కీలకం.

★ ప్రధానంగా రథోత్సవానికి అవసరమైన మొద్దులు, తెడ్లను అటవీశాఖ అధికారులు సమకూర్చుతారు.

★ విద్యుత్తు సమస్య తలెత్తకుండా ఆశాఖ బాధ్యత వహించాలి.

★ తిరువీధుల్లో అడ్డంకులు, పరిసరాల శుభ్రతను మున్సిపల్ శాఖ, భద్రతా ఏర్పాట్లను పోలీసుశాఖ చూడాల్సి ఉంది.

★ భక్తులకు ఆహ్వానం పలుకుతూ పట్టణం నలువైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలి. ఉత్సవాల తేదీల వివరాలతో గోడపత్రాలతో ప్రచారం నిర్వహించాలి.

మొరాయించిన ప్యాసింజర్ రైలు

కళ్యాణదుర్గంలో నాలుగు గంటలు ఆగిన వైనం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రైలు ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో కదిరిదేవరపల్లి - తిరుపతి ప్యాసింజర్ మొరాయించింది. నాలుగు గంటల పాటు ఆగిపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. గురువారం కదిరిదేవపల్లి నుంచి బయల్దేరిన రైలు.. కొద్ది దూరం ప్రయాణించాక ఇంజిన్‌లో సమస్య ఏర్పడింది. కాసేపు మరమ్మతు చేసి కళ్యాణదుర్గం స్టేషన్ వరకు తీసుకొచ్చారు. తరువాత పూర్తిస్థాయిలో మరమ్మతు చేసినా ఫలితం లేకపోవడంతో రాయదుర్గం నుంచి మరో ఇంజిన్ వచ్చినట్లు కళ్యాణదుర్గం స్టేషన్ మేనేజరు ధర్మతేజ తెలిపారు. కళ్యాణదుర్గంలో మధ్యాహ్నం 2.20 గంటలకు వెళ్లాల్సిన రైలు సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరింది. ఫలితంగా గమ్యస్థానాలు చేరుకోవాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నిలిచిపోయిన కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్ రైలు

రైతు ఇంట చామంతి సిరులు

తాడిపత్రి పట్టణం, శింగనమల, న్యూస్‌టుడే: సాగులో వైవిధ్యం చూపిస్తే ఫలితాలు అదే స్థాయిలో ఉంటాయని నిరూపిస్తున్నారు ఉద్యాన రైతులు. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించే చామంతి పూల సాగును చేపట్టి మంచి లాభాలు గడిస్తున్నారు. పసుపు, తెలుపు రంగుల్లో ఉండే పేపర్, ఐశ్వర్య, సెంట్ రకాల పూల సాగు చేపట్టారు.

ఆశాజనకంగా ధర: ప్రస్తుతం ధర కిలో రూ.130 నుంచి రూ. 150 పలుకుతుండటంతో మంచి లాభాలు గడిస్తున్నారు. పెద్దపప్పూరు, షేక్‌పల్లి, చిన్నపప్పూరు, పుట్లూరు మండలంలోని కొండాపురం, అరకటివేముల తదితర గ్రామాల్లో చామంతి పంట దాదాపు 250 ఎకరాల్లో ఉంది. గత పదిహేను రోజుల కిందట కిలో రూ.30 పలికిన ధర ప్రస్తుతం రూ.150 ఉంది.

బయట మార్కెట్లలో డిమాండ్

రైతులు నేరుగా నెల్లూరు, హైదరాబాదు, బెంగళూరు ప్రాంతాలకు పంటను తరలిస్తున్నారు. ఎకరాకు దాదాపు 4 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఇదే ధర కొనసాగితే పెట్టుబడులు పోను ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం గడించే అవకాశం ఉంది. రెండు మండలాల పరిధిలో నిత్యం 6 టన్నుల పంట దిగుబడులు మార్కెట్లకు తరలిస్తున్నారు.

పెద్దపప్పూరులో సాగులో ఉన్న చామంతి పంట

సైబర్‌నేరాల అడ్డుకట్టకు అవగాహన ఒప్పందం

పత్రాలతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, పోలీసు శాఖ ఐజీ తదితరులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సైబర్‌నేరాల అడ్డుకట్టకు రాష్ట్ర పోలీసు శాఖతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ మాట్లాడుతూ డిజిటల్ మోసాలు, దర్యాప్తులు, సైబర్ నేరాలు అరికట్టడం, స్మార్ట్ పోలీసింగ్ సాధనాలతో కార్యాచరణ, డేటా ఆధారిత నేర విశ్లేషణ, సాక్ష్య ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి ఈ అవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ, బెస్ట్ ప్రాక్టీస్ నేర్పించడానికి కృషి చేస్తామన్నారు. బీటెక్, ఎంటెక్ చదువుతున్న విద్యార్థులకు పైఅంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సాంకేతిక పరంగా సైబర్ నేరాలు అరికట్టడానికి జేఎన్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసు శాఖ రాష్ట్ర ఐజీ సత్యయేసుబాబు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న, డీఏపీ డైరెక్టర్ సత్యనారాయణ, ఆచార్య భానుమూర్తి, నాగప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

హంస వాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున ఉన్న బుగ్గరామలింగేశ్వరుడి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు పదో రోజు యథావిధిగా సాగాయి. ఉదయం బుగ్గరామలింగేశ్వరుడిని, రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై ఉంచి పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. ఇందులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కసాపురం ఆలయ సమాచారం

గుంతకల్లు పట్టణం: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నేటి (శుక్రవారం) జరుగు పూజ కార్యక్రమాలు. వేకువ జామున 4.15 నుంచి 5.15 గంటల వరకు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, 5.30 నుంచి 6.గంటల వరకు స్వామి వారి నిజరూప దర్శనం, ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు ఉంటాయి. తరువాత ఆలయ తలుపులు మూసివేత, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

నిధులు అందక.. లక్ష్యం నెరవేరక

గొర్రెల పెంపకం క్షేత్రం నిర్వహణ భారం

పెనుకొండ, న్యూస్‌టుడే: రాయలసీమలో గొర్రెల పెంపకం దారులకు అధిక లాభాలు చేకూర్చాలి. అందుకు నాణ్యమైన విత్తన పొటేళ్ల సరఫరా చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పెనుకొండ శివారులో 578 ఎకరాల్లో గొర్రెల పెంపకం క్షేత్రాన్ని ప్రారంభించింది. ఈక్షేత్రంలో డీడీతోపాటు ఇద్దరు ఏడీలు, ముగ్గురు వైద్యులు, 30 మంది సిబ్బంది నివాసం ఉండేలా భవనాలు కూడా నిర్మించారు. అయితే కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో క్షేత్రం లక్ష్యానికి దూరమైంది. ప్రస్తుతం డీడీ, ఓ వైద్యుడు, ఓ సీనియర్ సహాయకుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గొర్రెలు, క్షేత్రం సంరక్షణకు 18 మంది కూలీలు పని చేస్తున్నారు. సిబ్బంది కొరత, నిధుల లేమి కారణంగా క్షేత్రం నిర్వహణ భారంగా మారుతోంది.

విత్తన పొటేళ్లు సరఫరా

క్షేత్రంలో ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో గొర్రెల పెంపకందారులకు నాణ్యమైన విత్తన పొటేళ్లను కిలో రూ.450 ప్రకారం లైవ్ వెయిట్‌తో విక్రయిస్తారు. ఏటా 80 మంది రైతులకు సుమారు 100 పొటేళ్ల సరఫరా చేస్తున్నారు. క్షేత్రంలో 14 ఎకరాల్లో గడ్డి, గడ్డిజాతి మొక్కలు పెంపకం చేస్తున్నారు. మరో 25 ఎకరాల్లో వర్షాధారం కింద గడ్డి సాగు చేస్తారు. మిగిలిన భూమిలో గొర్రెలను మేపేందుకు తీసుకెళతారు.

క్షేత్రంలో నెల్లూరు బ్రౌన్ గొర్రె పిల్లలు

ఇతర అవసరాలకు భూ కేటాయింపులు

గొర్రెల పెంపక క్షేత్రం కోసం కేటాయించిన భూమిలో గత ప్రభుత్వం వైద్యకళాశాల నిర్మాణానికి, ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటుకు ఇలా ఇతర అవసరాలకు దాదాపు 100 ఎకరాలకుపైగా భూమి తీసుకుంది. ప్రస్తుతం నెల్లూరుబ్రౌన్ బ్రీడ్‌కు సంబంధించి 595 గొర్రెలను ఇక్కడ సంరక్షిస్తున్నారు. మిగిలిన 470 ఎకరాల భూమికి సైతం కంచె లేకపోవడం వల్ల అన్యాక్రాంతం అవుతుందనే ఆరోపణలున్నాయి. గతంలో పెనుకొండ క్షేత్రానికి రూ.2 కోట్లతో గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వైకాపా ప్రభుత్వ పాలనలో ఈ భవనం నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లిపోవడంతో సరైన భవనం లేకుండా పోయింది.

ప్రభుత్వ తోడ్పాటు అవసరం

రాష్ట్రంలో ఉన్న ఏకైక బ్రీడ్ నెల్లూరుబ్రౌన్ అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు అవసరం. క్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు సమకూరితే పూర్తి స్థాయిలో గొర్రెల పెంపకందారులకు ఉపయోగకరంగా ఉంటుంది. పెనుకొండలో నేషనల్ రీసర్చ్ సెంటర్ ఆన్ మీట్ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

- కాంతమ్మ, డీడీ, గొర్రెల పెంపక క్షేత్రం

న్యాయవిద్య పరీక్ష తేదీల్లో మార్పు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో న్యాయవిద్య 3, 5 ఏళ్ల కోర్సు ప్రథమ సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షా విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ నెల 21న పరీక్షలు మొదలవుతాయన్నారు. 21న జరగాల్సిన పరీక్ష 28న, 23కు సంబంధించి మార్చి 2న నిర్వహిస్తారని ఆయన చెప్పారు.

డిగ్రీ పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ మెదటి సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. అనంత నగరంలోని ఎస్ఎల్ఎన్, శ్రీవాణి డిగ్రీ కళాశాలల్లో ముగ్గురు చొప్పున, గోరంట్లలోని ఎస్‌వీపీఎం డిగ్రీ కళాశాలలో ఇద్దరిని డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ వెల్లడించారు.

రంజాన్ మాసం.. పనివేళల్లో మార్పులు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: రంజాన్ సందర్భంగా ఉపవాసం ఆచరించే ఉపాధ్యాయులు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో పని వేళలను సవరించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. సవరించిన పనివేళలు రంజాన్ మాసానికి మాత్రమే వర్తిస్తాయని, ముగిసిన తర్వాత యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఇస్లాం మతాన్ని ఆచరించే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు రోజూ పని ముగిసే సమయానికి కంటే ఒక గంట ముందుగా వెళ్లడానికి సర్కారు సౌలభ్యం కల్పించిందని తెలిపారు. డీఈవోలు, ఎంఈవోలు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని డీఈవో సూచించారు.

జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం

జాతీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ధార్వాడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కోటీశ్ అన్నారు. రెండు రోజుల పాటు స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జీవవైవిధ్య జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. భూమిపై ఉన్న అన్ని రకాల జీవులు, మొక్కలు, జంతువులు, సూక్ష్మ జీవులు, వాటి మధ్య ఉన్న సంబంధాల సమాహారమే జీవవైవిధ్యమన్నారు. దేశంలో 8 వేల రకాలు, ప్రపంచవ్యాప్తంగా 21 వేల రకాల ఔషధ మొక్కలున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం అధ్యాపకులు కళాశాల ఆవరణలో రకరకాల మొక్కలు నాటారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, అధ్యాపకులు రవిశంకర్‌శర్మ, భీమలింగయ్య, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా అంగన్‌వాడీ పోస్టులకు ముఖాముఖి

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చేపట్టిన ముఖాముఖి (ఇంటర్వ్యూ) సజావుగా సాగింది. మూడు రోజులు సాగే ప్రక్రియలో భాగంగా గురువారం అనంత ఆర్డీఓ కార్యాలయంలో తొలి రోజు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సారథ్యంలో అభ్యర్థులను పలు ప్రశ్నలు అడిగారు. శింగనమల, అనంత అర్బన్, అనంత గ్రామీణం, తాడిపత్రి, నార్పల ప్రాజెక్టుల వారీగా ముఖాముఖి జరిగింది. మొత్తం ఎనిమిది అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 29 మంది దరఖాస్తు చేసుకోగా అందరూ హాజరయ్యారు. 40 ఆయా పోస్టులకు 83 మంది దరఖాస్తు చేసుకోగా, 74 మంది వచ్చారు. మరో వైపు ఈ నెల 20న కళ్యాణదుర్గం, 21న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయాల్లో ఆయా ప్రాజెక్టుల అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించనున్నారు.

ఖాద్రీ క్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయల ఏకవాక్య శాసనం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన సింహాసనంపై ఏకవాక్య శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. విజయనగర సామ్రాజ్య కాలంనాటి ఆలయ నిర్మాణాలు, వాటి విశేషాల అంశంపై పరిశోధనలో భాగంగా కదిరి ఆలయంలో ఈవో శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. కల్యాణ మండపంలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు ఆదేశంతో రాజప్రతినిధి తిమ్మప్పనాయుడు, శ్రీలక్ష్మీనరసింహస్వామికి సింహాసనాన్ని నిర్మించినట్లు, ఉత్సవ విగ్రహాలను సింహాసనంపై కొలువుదీర్చి కల్యాణోత్సవం జరిపేలా అద్భుత శిల్ప సంపదతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండపాన్ని కూడా శ్రీకృష్ణదేవరాయలే నిర్మించి ఉంటారని అభిప్రాయపడ్డారు.

శిల్పకళ ఆసనం వద్ద మైనాస్వామి, ఈవో శ్రీనివాసరెడ్డి

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని ✆ 7382114647.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో అద్భుతంగా డెవెలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204

JOBS

Job Vacancy: We Hiring Open Positions Himayat Grand Luxury Hotel in Anantapur Contact: 6300123535. Requirements : 1-2 Years Experience in Hotel Industry Good Communication Skills Excellent Computer Skill

ప్రముఖ మా సంస్థ యందు వర్క్ చేయుటకు రిసెప్షన్, టెలీకాలర్, ఆఫీస్ అసిస్టెంట్ అర్జెంట్‌గా కావలెను. Q: 10 to డిగ్రీ, జీతం 9 K to 25K 9491555724

వెంకటాద్రి ఇన్‌ఫ్రా, ATPలో పనిచేయుటకు అనుభవం కల Site Supervisor కావలెను. జీతం: 15,000/- (అనుభవాన్ని బట్టి) బయోడేటా Whatsapp చేయగలరు. 7779992688

అనంతపురం టౌన్ గుత్తిరోడ్‌లో మాంటిస్సోరి స్కూల్ పక్కన గల JK Enterprises నందు పనిచేయుటకు Tally Billing ఆపరేటర్ కావలెను. 8008803109

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు

8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

ధర్నాకు మద్దతిస్తున్న మల్లరాయుడు, దివాకర్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తున్నారు. ఇప్పటికే సమ్మెలో ఉన్న ఉద్యోగులు జిల్లా, డివిజన్ స్థాయిలో ధర్నాలు చేసి బ్యాంకుల కార్యకలాపాలను స్తంభింపజేయడానికి సిద్ధమయ్యారు. గురువారం ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేశారు. సొసైటీల తాళాలు వేసి ధర్నాలో పాల్గొన్నారు. డివిజనల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

- జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లరాయుడు, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు దివాకర్ ధర్నాకు మద్దతు ప్రకటించారు. సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, కోశాధికారి హనుమంతరెడ్డి, పలువురు
- సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ విధానం అమలు చేయాలని, పదేళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం కరుణించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం జారీ చేసిన జీఓ నం.36ను తక్షణమే అమలు చేసి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసులకు క్రమశిక్షణ తప్పనిసరి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పోలీస్ డీటీసీలో శిక్షణ పొందుతున్న 101 మంది ట్రైనీ కానిస్టేబుళ్లతో ఎస్పీ జగదీశ్ గురువారం సమావేశమయ్యారు. తొలుత ఆయన సాంకేతిక పరిజ్ఞానాన్ని శిక్షణలో భాగం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ల్యాబ్‌తో శిక్షణార్థులు సైబర్ నేరాలు, డిజిటల్ రికార్డులు, కొత్త పోలీసింగ్ విధానాలపై ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందుతారన్నారు. శిక్షణార్థుల వసతులపై ఆరా తీశారు. భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి శిక్షణార్థులతో కలిసి భోంచేశారు. శిక్షణతో పాటు సత్ప్రవర్తన, క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాద, చట్టపరమైన అవగాహన అంశాలు చాలా ముఖ్యమన్నారు. ఆయన వెంట డీటీసీ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ యువరాజు, ఆర్ఐలు తదితరులున్నారు.

డీటీసీలో భోజనాన్ని రుచి చూస్తున్న అనంత ఎస్పీ జగదీశ్

గ్రామీణ క్రికెట్ పోటీలతో ఉజ్వల భవిత

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రికెట్ పోటీలను సద్వినియోగం చేసుకున్న క్రికెటర్లకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, ఏడీసీఏ ఎస్‌ఎం సీఈవో మధుసూదన్ తెలిపారు. అనంత క్రీడా గ్రామంలో గురువారం మొదలైన గ్రామీణ క్రికెట్ పోటీల వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో క్రికెట్ పోటీలు మళ్లీ మొదలవడంతో ప్రతిభావంతులను గుర్తించి సానబెడతామన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వచ్చే వారంలో లీగ్ పోటీలు ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లలోపు బాలురు, 16 ఏళ్లలోపు బాలికలు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు.

120 పరుగులు చేసిన పూర్ణచంద్రిక

హిందూపురం జట్టు ఘన విజయం: తొలిరోజు జరిగిన బాలికల పోటీలో హిందూపురం జట్టు రాప్తాడుపై 78 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన హిందూపురం 30 ఓవర్లలో 3 వికెట్లకు 244 పరుగులు భారీ స్కోరు చేసింది. బ్యాటర్ ఈ.పూర్ణచంద్రిక (120) అద్భుత శతకంతో అజేయంగా నిలిచింది. ఛేదనలో రాప్తాడు జట్టు 166 పరుగులు చేసి ఓటమి పాలైంది. బాలుర విభాగంలో తాడిపత్రి జట్టు 85 పరుగుల తేడాతో ధర్మవరం జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన తాడిపత్రి 40 ఓవర్లలో 7 వికెట్లకు 233 పరుగులు చేయగా, ధర్మవరం 148 పరుగులు మాత్రమే చేసి ఓడింది. పోటీలు శుక్రవారమూ కొనసాగుతాయి.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ పాదయాత్ర

మొవ్వ(కూచిపూడి): తెదేపా వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ బి.ఎన్.నర్సింహులు పాదయాత్ర చేస్తున్నారని తెదేపా నాయకుడు తాతినేని పూర్ణచంద్రరావు అన్నారు. ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు నర్సింహులు కృష్ణాజిల్లాలో 41రోజుల మండల దీక్షను మూడురోజుల కిందట నిమ్మకూరులో ప్రారంభించారన్నారు. గురువారం మొవ్వకు చేరుకున్నాక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.మొవ్వపాలెం, వేములమడ, కోసూరుల మీదుగా కాజ వరకు పాదయాత్ర కొనసాగింది.

THE ANANTAPUR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD.,
Subash Road, ANANTAPUR - 515001 (Andhra Pradesh)
Toll free Number: 18004258076. Email: adccbankatp@gmail.com, ceo_atpr@apcob.org, Web: anantapurdccb.bank.in

Ref: ADCCB/Premises/KLDG/2025-26 Date: 19-02-2026

SHORT TENDER NOTICE

Name of the Work: Construction of New Branch Building in Sy.No.351-3C2B1A, Kalyandurg Town, Beside District Cooperative Marketing Society, Govt. Junior College Road, Kalyandurg, from qualified Class-I Contractors. Sealed Tenders are Invited from Eligible and Qualified Class-I Contractors for the above work. The details are as follows: (1).**Total Estimated Cost:** Rs.60,00,000/-, (2) **Cost of Tender Application Fee:** Rs.5,000/-, (3) **EMD:** Rs.1,25,000/- (by way of Demand Draft drawn in favour of the Chief Executive Officer, ADCC Bank Ltd.), (4) **Start Date and Time for Submission of Tenders:** 23-02-2026 10.00 AM, (5) **Last Date and Time for Submission of Tenders:** 02-03-2026 4.00 PM, (6) **Date and Time of Opening of Tedners will be intimated soon.**
For detailed tender documents, rules, and other terms and conditions, Please Contact Premises section: 8977779217 (Chief Manager Premises), ADCC Bank Ltd., Anantapur. For More details visit website anantapurdccb.bank.in available from 21-02-2026

Sd/- K.Surekha Rani, Cheif Executive Officer (FAC)

ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సిరితేజ క్లినిక్
రుమటాలజీ

SIRITHEJA PHARMACY: # 12-3-162, 5th Cross, Sai Nagar, Prathyn Enclave, 2nd Floor, Vesta Scanning Center, Ananthapur.

డా॥ సి.తేజస్విని MBBS, M.D., (General Medicine, SVIMS) FIR
రుమటాలజి కన్సల్టెంట్
రుమటాలజిస్ట్ & ఫిజిషియన్
Regd. No. APMC/FMR/80053

మా క్లినిక్ నందు అందించు వైద్య సేవలు

మా ప్రత్యేకతలు

రుమటాయిడ్ ఆర్థరైటిస్, స్కిరో దర్మా, సొరియాటిక్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, లూపస్, MCTD, గౌట్, అంకైలోసింగ్ స్పాండిలైటిస్, షుగర్, బి.పి., థైరాయిడ్, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ & చికెన్‌గునియా, యూరిన్ ఇన్‌ఫెక్షన్, టి.బి., నిమోనియా, దగ్గు, జలుబు, ఆస్తమా, వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి, తలనొప్పి, కాళ్ల వాపులు, రక్తహీనత (అనీమియా), కామెర్లు (జాండీస్)

Scanning Services Available in our Building

X-Ray | MRI | CT Scan | Ultra Sound

అపాయింట్‌మెంట్ కొరకు: 9071288999, 9704044888

వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లోని విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. గురువారం కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గృహాల జిల్లా అధికారులు, గురుకుల జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లతో వర్చువల్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై, మెనూ అమలు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్ల పనితీరు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పదో తరగతి "100 డేస్ ప్రోగ్రామ్"లో అధికారులు పూర్తి స్థాయిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలికల వసతి గృహాల్లో రాకపోకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఆలస్యంగా వచ్చిన సందర్భాల్లో కౌన్సిలింగ్ నిర్వహించేందుకు మహిళా పోలీసు సిబ్బంది, సంబంధిత అధికారులను పంపుతామని తెలిపారు. రోజూ ఒకపూట జిల్లా అధికారులు వసతి గృహాలను సందర్శించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే క్రైస్తవుల సంక్షేమం

మాట్లాడుతున్న తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ అన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో క్రైస్తవుల కోసం రూ.125 కోట్లను కేటాయించడం చాలా ఆనందించాల్సిన విషయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రైస్తవుల సంక్షేమం గురించి ఆలోచించడం వల్లే పెద్దఎత్తున నిధుల కేటాయింపు జరిగిందన్నారు. ఈసమావేశంలో నారాలోకేశ్ అభిమానం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, తెదేపా నాయకులు హనుమంతు, అంజి, శివన్న, కేశప్ప, ఫజులు, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్ తర్వాతే సప్లిమెంటరీకి విజ్ఞప్తి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎల్ఎల్‌బీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసిన తర్వాతే సప్లిమెంటరీ పరీక్షలు జరపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వారు గురువారం రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్కేయూ కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

సర్వజన వైద్యశాల ఏవోగా రమణ

అనంతపురం (వైద్యం): అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలనా అధికారిగా (ఏవో)గా రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కడప డెంటల్ కళాశాలలో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏవోగా పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో ఆయన సర్వజన వైద్యశాలలో వివిధ హోదాల్లో పనిచేసిన విషయం తెలిసిందే.

జయప్పను సన్మానిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

లేపాక్షి, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ జయప్పను మంత్రి కందుల దుర్గేష్, ఎండీ ఆమ్రపాలి, ఛైర్మన్ బాలాజీ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా లేపాక్షిలో పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై పత్యేక ప్రణాళికను మంత్రికి అందించినట్లు ఆయన తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో అరెస్ట్ చేసిన వైకాపా కార్యకర్త గోవర్ధన్‌ను గురువారం పెనుకొండ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ కేవీ మహేశ్ తెలిపారు. గురువారం గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆంజినేయులుతో కలిసి డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోవర్ధన్.. 14 సంవత్సరాల బాలికను బలవంతంగా ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడన్నారు. వెంటనే బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో సిబ్బందిని అప్రమత్తం చేసి అతడిని, బాలికను అదుపులోకి తీసుకొన్నామన్నారు. బాలికను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: పట్టపగలే మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లిన ఘటన గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని గొంచిరెడ్డిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని నంజాపురం గ్రామానికి చెందిన తులసి కళ్యాణదుర్గం నుంచి స్కూటీలో నంజాపురానికి వెళ్తోంది. ఈ క్రమంలో గొంచిరెడ్డిపల్లికి కొంత దూరంలో వెళ్తుండగా వెనక నుంచి మరో స్కూటీలో వచ్చిన ఓ దుండగుడు తులసిని అడ్డగించాడు. ఆమె స్కూటీ ఆపడంతో మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఆమె గట్టిగా అరుపులు, కేకలు వేసినా వదల్లేదు. అనంతరం అటుగా వచ్చిన వాహనదారులు చోరీ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయికుమార్ వెంటనే అక్కడికి చేరుకొని వివరాలను బాధితురాలితో అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్తి వివాదంతోనే జంటహత్యలు

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇల్లు, పొలం తమకు దక్కలేదనే అక్కసే తరిమెల జంట హత్యలకు కారణమని శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఈ నెల 2న శింగనమల మండలం తరిమెలలో జరిగిన తల్లీకొడుకుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులు దండోరా లక్ష్మీదేవి, ఆమె కుమారులు జగజ్జీవన్‌రామ్, ఓంకార్, మిత్రులు శ్రీనివాసులు (ఇల్లూరు), సాయికిరణ్ (వీరేపల్లి)ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం శింగనమల పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. తరిమెలకు చెందిన దండోరా నల్లప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య లక్ష్మీదేవి కుమారులు జగజ్జీవన్‌రామ్, ఓంకార్. రెండో భార్య ఎల్లమ్మకు అంబేద్కర్ అలియాస్ చిన్నా సంతానం. ఎల్లమ్మ స్థానికంగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. నల్లప్ప కొంతకాలం క్రితం మృతి చెందాడు. అతడికి తరిమెలలో కొంత పొలం, ఇల్లు ఉండగా, మరణానంతరం ఆస్తి పంపకాలు జరగలేదు. ఆ పొలం, ఇంటిని మొదటి భార్య కుమారులకు తెలియకుండా ఎల్లమ్మ తన పేరుపై మార్చుకుంది. ఈ విషయంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2వ తేదీన జగజ్జీవన్‌రామ్, ఓంకార్ ఎల్లమ్మ ఇంటికి వెళ్లారు. వారి మిత్రులు శ్రీనివాసులు, సాయిచరణ్ బయట కాపలాగా ఉన్నారు. తొలుత హాలులో నిద్రిస్తున్న చిన్నాను రాళ్లతో కొట్టి, కొడవళ్లతో నరికి చంపారు. అది చూసిన ఎల్లమ్మ భయంతో పడక గదిలోకి వెళ్లి తలుపులేసుకుంది. కిటికీ నుంచి తలుపు గడియ తీసి బయటకు లాక్కొచ్చిన నిందితులు, ఆమె తలను ఒకరు పట్టుకోగా, మరొకరు కొడవలితో మెడను నరికి మొండెం నుంచి వేరుచేశారు. తలను చేతిలో పట్టుకుని వీధిలోకి వచ్చి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం రెండు మృతదేహాలను ఇంట్లో పడేసి తల్లితో కలిసి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో శింగనమల, నార్పల, గార్లదిన్నె ఎస్సైలు విజయకుమార్, సాగర్, మహమ్మద్‌గౌస్‌లతో కూడిన మూడు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఈక్రమంలో పాత కల్లూరు సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న శింగనమ సీఐ కౌలుట్లయ్య

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.5కోట్లు ఇవ్వండి

మడకశిర, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే చిట్ట చివరన సముద్ర మట్టానికి 2వేల అడుగుల ఎత్తులో ఉన్న మడకశిర నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటి ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రభుత్వం పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు గురువారం శాసనసభలో సభాపతి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి తక్షణ సాయంగా రూ.5కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 200 బోర్లు తవ్వించినా సమస్య తీరలేదని వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అదే విధంగా విద్యుత్తు సమస్యలు తీర్చాలని అసెంబ్లీలో మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: అయ్యవారిపల్లిలో గత ఏడాది తవ్వించిన బోరుకు పైపులైన్ ఏర్పాటుచేసి కుళాయిలు బిగించండి. - గంగమ్మ

సమాధానం: పైపులైన్ ఏర్పాటుచేసి కుళాయిలు బిగిస్తాం. - రమేశ్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: కదిరేపల్లిలోని బీసీ కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. -హనుమంతరాయప్ప

సమాధానం: సత్వరమే శుభ్రపరుస్తాం.
-నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి, కదిరేపల్లి
- న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

సమస్య: పీఎన్‌పాళ్యం ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగం లేదు. - ఈరన్న

సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం.
- సతీశ్‌బాబు, సర్పంచి, దేవరహట్టి

సమస్య: జమ్మలబండలో తాగునీటి సమస్య నెలకొంది. - మంజునాథ్

సమాధానం: బోరుకు మోటారు, పంప్‌సెట్, స్టార్టరు బిగించి నీటి సమస్య పరిష్కరిస్తాం.
-డా.డి.శ్రీనివాసమూర్తి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి, జమ్మలబండ
-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం, గుడిబండ

సమస్య: పూలకుంట పంచాయతీ ఇందిరమ్మకాలనీ శివారులో వీధి దీపాలు లేవు. - ప్రమీలమ్మ

సమాధానం: పరిశీలించి కొత్త దీపాలను ఏర్పాటు చేయిస్తాను. -మహేశ్, ఏఈ
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య విన్నారు... పరిష్కరించారు

హిందూపురం గ్రామీణం: ''ఈనాడు''లో ప్రచురితమయ్యే ''మేమున్నాం..మీకు తోడుగా'' దృష్టికి ప్రజలు కిరికెర పంచాయతీలోని సెరికల్చర్ కాలనీలో పందులు స్వైరవిహారం, పారిశుద్ధ్య సమస్యను ఈనెల 16న తీసుకొచ్చారు. ఎంపీడీవో దామోదరమ్మ స్పందించి పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి కాలనీలో శుభ్రం చేయించారు. పందుల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ఉపాధికి ఊతం.. విద్యార్థులకు ప్రోత్సాహం

పరిగిలోని ఇండియన్ డిజైన్ వస్త్ర పరిశ్రమలో కుట్టు పనిలో నిమగ్నమైన మహిళా కార్మికులు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండల పరిధిలోని కాలువపల్లి, పరిగిలో ఏర్పాటు చేసిన వస్త్ర పరిశ్రమల ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి లభిస్తోంది. గతంలో ఉపాధి పనులు లభించక బెంగళూరు, ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే వారు. నేడు స్థానికంగానే పరిశ్రమలు నెలకొల్పుతుండటంతో మహిళలకు ఉపాధి లభిస్తోంది. పరిశ్రమల్లో పనిచేస్తూ వచ్చే సంపాదనతో వారి కుటుంబ జీవనం, పిల్లల బాగోగులు సాఫీగా సాగుతున్నాయి.

మండలం: పరిగి
వస్త్ర పరిశ్రమలు: కాలువపల్లి, పరిగి
చేకూరుతున్న లబ్ధి: 5వేల మందికి

పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి

నాకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చనిపోవడంతో పిల్లా పాపలతో తల్లిదండ్రుల చెంత ఉంటున్నాను. పిల్లల చదువుకు ఆర్థికంగా భారంగా ఉండేది. యాజమాన్యం చేస్తున్న ఆర్థిక చేయూతతో పిల్లల భవిష్యత్తుకు కొంత బరోసా లభిస్తోంది. - భారతి, మహిళా కార్మికురాలు

ఉన్నత చదువులు చదివిస్తున్నా..

మాది వ్యవసాయ కుటుంబం, భర్త వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దీంతో భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలన్న ఉద్దేశంతో స్థానిక వస్త్ర పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తున్న. వచ్చే సంపాదనతో పాటు స్కాలర్‌షిప్ ద్వారా పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నా. - అనిత, ధనాపురం

యాజమాన్యం చేయూత

వస్త్ర పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికుల పిల్లలను విద్యావంతులను చేసేందుకు పరిశ్రమ యాజమాన్యం ఆర్థికంగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. 7 నుంచి పదోతరగతి చదివే వారికి రూ.10వేలు. ఇంటర్ చదివే వారికి రూ.14వేలు. డిగ్రీ, డిప్లొమా, ఏదైనా ఉన్నత చదువు చదివే విద్యార్థులకు 20వేలు. సంవత్సరంలో రెండు విడుతలుగా చెక్కుల రూపంలో నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. దీంతో పాటు యాజమాన్యం తరుపున మహిళా కార్మికులకు ఉచితంగా వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నాం. పరిగి ఇండియన్ డిజైన్ వస్త్ర పరిశ్రమలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఔత్సాహికులైన మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తాం. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలి.
- సురేష్. డీజీఎం, పరిగి ఇండియన్ వస్త్ర పరిశ్రమ

అభివృద్ధిలో పురం ఆదర్శం కావాలి : బాలయ్య

● రూ.15.45 కోట్ల పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు

పులమతి చెరువులో జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం,హిందూపురం గ్రామీణం, లేపాక్షి: అభివృద్ధి కార్యక్రమాల అమలులో హిందూపురం నియోజకవర్గం ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం లేపాక్షి, హిందూపురం పట్టణం, గ్రామీణ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. ● లేపాక్షి మండలం పులమతిచెరువులో పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. మానెంపల్లిలో రూ.2.60 కోట్లతో ఏర్పాటు చేసే బీటీరోడ్డుకు భూమిపూజ చేసి పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. అనంతరం రూ.3.5 కోట్లతో నాగేపల్లి-కొత్తపల్లి బీటీ రహదారికి భూమి పూజ చేశారు. మానేపల్లి నుంచి గౌరిగానిపల్లికి రూ.2.60 కోట్లతో ఏర్పాటు చేసే బీటీ రహదారి కి భూమి పూజ చేశారు. ● ముద్దిరెడిపల్లి 36 వార్డులో సీసీ రహదారి ఏర్పాటుకు భూమిపూజ చేశారు. సాయంత్రం రైల్వేరోడ్ నిర్మాణ పనులు పరిశీలించారు. ● కిరికెరలో విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

లెమన్ టీ రుచి చూసి కితాబు

హిందూపురం పట్టణం త్యాగరాజనగర్‌కు చెందిన తెదేపా నాయకురాలు, ఎమ్మెల్యే బాలకృష్ణ అభిమాని సంధ్య ఆహ్వానం మేరకు గురువారం ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రీకంఠపురంలో ఏర్పాటు చేసిన టీడీ దుకాణాన్ని సందర్శించారు. లెమన్ టీ రుచి చూసి బాగా ఉందని కితాబు ఇవ్వడంతో ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ రాఘవేంద్ర, తెదేపా నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

హిందూపురం: తెదేపా బీసీసెల్ అధ్యక్షుడు, టౌన్ వైడ్ ఎన్‌బీకే ఫ్యాన్స్ కార్యదర్శి బి.రాజశేఖర్‌బాబు కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హాజరై వరుడు నవీన్‌కుమార్, వధువు లక్ష్మీప్రశాంతిలను ఆశీర్వదించారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ అన్న కుమారుడు వివాహానికి ఎమ్మెల్యే హాజరై వరుడు నందకిశోర్, వధువు లావణ్యలను ఆశీర్వదించారు. తెదేపా నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

వేగవంతమైన భూముల విభజన

భూముల హద్దులను పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వాతి, సిబ్బంది

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని అడదకుపల్లిలో భూముల రీసర్వేలో భాగంగా తహసీల్దార్ స్వాతి ఆధ్వర్యంలో జాయింట్ పట్టాదారుల భూముల విభజన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. గురువారం గ్రామంలోని సర్వేనంబరు 152, 155లోని నల్లరేగడి భూముల్లో మొత్తం 160మంది రైతులకు సంబంధించిన వ్యక్తిగత హద్దులు నిర్ధారించారు. మిగిలిన భూముల విభజన ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసేవిధంగా రెవెన్యు అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాల విజయవంతంపై హర్షం

ఆలయ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షిలో మహ శివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్‌ను మండల గౌడ సంఘం ప్రతినిధులు గురువారం సన్మానించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వారు ఛైర్మన్‌ను సన్మానించి భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, బాలాజీగౌడ్, సాయికుమార్, సాయికృష్ణ, విశ్వనాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్న రథోత్సవం

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హేమావతిలో గురువారం చిన్న రథోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలోకి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్, గ్రామ పెద్దలు పూజలు చేసి రథాన్ని ప్రారంభించారు. అనంతరం హరహరశంభో మహదేవ అంటూ రథాన్ని ఆలయం నుంచి బస్టాండు వరకు లాగారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మరథోత్సవ కార్యక్రమం వైభవంగా జరగనుంది.

హేమావతిలో చిన్న రథాన్ని లాగుతున్న భక్తులు

సమీప కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానుండటంతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్, ఎస్సై పరశురాం తెలిపారు.

పనితీరులో మార్పు రాకుంటే చర్యలు

సమావేశమైన పీడీ విజయేంద్రప్రసాద్

లేపాక్షి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ సిబ్బంది పనితీరులో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ విజయేంద్రప్రసాద్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాంకేతిక సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వీటిని వెంటనే ప్రారంభించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టంలో మార్పులు చేసిన నేపథ్యంలో గతంలో మొదలు పెట్టిన పనులను పూర్తి చేస్తేనే కొత్త పనులు మంజూరుకు అవకాశం ఉందని తెలిపారు. వీటిని ఈ నెలాఖరుకు పూర్తిచేసి ఆన్‌లైన్ నమోదు చేసిన తర్వాతే రహదారుల నిర్మాణాలు చేయాల్సి ఉందన్నారు. ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీవో నరసింహులు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో చంద్రశేఖర్, ఈసీ మధుసూధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ర్యాలీగా వస్తున్న ట్రస్ట్ సభ్యులు, భాజపా నాయకులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలో ఛత్రపతి శివాజీ, వానర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి తెచ్చిన శివాజీ విగ్రహాన్ని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రజలు, భక్తులు పుర వీధుల గుండా ఊరేగింపుగా తెచ్చి మేళాపురం సమీపంలో ప్రతిష్ఠించారు. సేవా ట్రస్టు అధ్యక్షుడు కేవీ చలపతి మాట్లాడుతూ భారతదేశంలో శివాజీ లాంటి ధర్మానికి కట్టుబడిన వ్యక్తి ఎవరూ లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ, వానరసేన సభ్యులు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయ ఆవరణలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా విశ్వహిందూపరిషత్ ప్రఖండ, భజరంగదళ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హిందూధర్మ రక్షణ కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హిందువులు పాల్గొన్నారు.

తొట్టెను వేరే ప్రాంతంలో నిర్మించండి

పీసీగిరి అంగన్‌వాడీ కేంద్రం ముందు పశువుల నీటి తొట్టె నిర్మించడంతో ప్రమాదకరంగా మారింది. దీనిలో నీరు నింపితే చిన్నపిల్లలు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. పశువులు తొట్టెను వేరే చోట నిర్మించి దాహం తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఏపీఓ జగదీష్ మాట్లాడుతూ వేరే ప్రాంతంలో తొట్టెను నిర్మిస్తామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

ప్రమాదకరంగా రెయిలింగ్ రేకులు

కొడికొండ శిర జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాల బారిన పడకుండ రాళ్లో రహదారికి రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. పరిగి చెరువు కట్ట కింద బోల్టులు ఊడిపోయి రేకులు అక్కడ కృడ పడిపోయాయి. బలమైన గాలులు వీస్తే అవి రహదారిపై వచ్చే వాహనాలపై పడే ప్రమాదం ఉంది. వెంటనే సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పరిగి

పూడిక తీయక.. దుర్వాసన ఆగక

పెనుకొండ పట్టణంలోని కుమ్మరవాడ్లకేరిలో కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ఉద్ధృతి అధికంగా ఉండటం శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వ్యర్థాలు తొలగిస్తామని, మళ్లీ అవి డ్రైనేజీలోకి చేరకుండా రక్షణ గోడ, కంచె నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పెనుకొండ

భూ వివాదంపై విచారణ

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో కొన్నేళ్లుగా నలుగురు అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూ వివాదంపై తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. ఉప్పర్లపల్లి అధికారులు ఎం. కొత్తపల్లి గ్రామ పొలానికి చెందిన 723, 724 సర్వే నంబర్లలో జరిగిన భూ పంపకాల్లో భాగంగా ఓ బంక పోరంబోకు భూమిని కేటాయించారు. ఇదే పంచాయతీలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన 26 మందికి ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేశారు. ఇందులో కొందరి మధ్య భూ వివాదం నెలకొంది. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి మండల ఫైవ్ మ్యాన్ కమిటీతో పాటు బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరాముడ్జులు కలిసి వచ్చి సమస్యను వివరించారు. ఆయన స్పందించి రికార్డులను పరిశీలించారు. పట్టాలు పొందిన వారికి త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కె.బసవనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జయంత్ నాయక్, ఆప్తాలమిక్ ఆఫీసర్ సుబ్బారావు పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి అధ్యక్షతన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్యం జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వందమందికి పైగా విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు.

ఎడ్లబండ్ల పోటీలకు నేటి నుంచి పేర్ల నమోదు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల - పుట్టపర్తి రహదారిలో కరావులపల్లితండా సమీపంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని మార్చి 28న నిర్వహించే ఎడ్లబండ్ల పరుగు పందెం పోటీలకు శుక్రవారం (నేటి) నుంచి పేర్లు నమోదు చేసుకుంటున్నట్లు నిర్వాహకులు శంకర్‌నాయక్, న్యాయవాది తిప్పానాయక్ తెలిపారు.

సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన ముఖ్యం

దస్త్రాలు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

గోరంట్ల, న్యూస్‌టుడే: సాధారణ ప్రజలకు పెద్దసమస్యగా కనిపిస్తున్న సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అడిషనల్ ఎస్పీ అంకితసురాన పేర్కొన్నారు. గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, లాకప్, కంప్యూటర్ గదులు, మహిళా హెల్ప్‌డెస్క్, జప్తు చేసిన వాహనాలు, కార్యాలయ రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరుపై ఆరాతీశారు. రాత్రి గస్తీ పెరగాలి, విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా ఉంచాలన్నారు. ఎస్సైలు రామచంద్ర, నిర్మల, ఏఎస్సైలు షేక్షావలి, రామాంజనేయులు అన్ని విషయాలను ఏఎస్పీకి వివరించారు.

రహదారి ప్రమాదంలో దంపతులకు గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలో గేటెడ్ పెద్ద వద్ద గురువారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో మండలంలోని మల్లేపల్లికి చెందిన శ్రీనివాసులు, సుగుణమ్మ దంపతులు గాయపడ్డారు. వీరు హిందూపురంలో జరిగే బంధువుల గృహప్రవేశానికి వెళుతూ వేగనిరోధకం వద్ద ప్రమాదానికి గురయ్యారు. సుగుణమ్మకు బలమైన గాయాలు కావడంతో మొదట హిందూపురం ఆసుపత్రి అక్కడి నుంచి బెంగళూరు తరలించినట్లు బంధువులు తెలిపారు.

తపాలా జీవితబీమాకు విశేష స్పందన

మాట్లాడుతున్న తపాలాశాఖ ఏడీ నాగేనాయక్, ఎస్పీ నాగూర్‌రెడ్డిబాష

పెనుకొండ, న్యూస్‌టుడే: తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమా పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ కర్నూల్ ఏడీ నాగేనాయక్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక తపాలా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలాశాఖ ఈనెల 18 నుంచి 20వతేదీ వరకు బీమా సంకల్ప్3.0 డ్రైవన్‌ను నిర్వహిస్తోందన్నారు. హిందూపురం డివిజన్‌లో నిర్వహించిన డ్రైవ్‌లో 706 కుటుంబాలకు బీమా రక్షణ కల్పించామన్నారు. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పథకాలు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తూ, తక్కువ ప్రీమియంతో అధిక భద్రత కల్గిన జీవిత బీమా అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రజల కోసం ప్రత్యేకంగా ఆర్పీఎల్ఐ రూపొందించబడిందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిందూపురం డివిజన్ తపాలా ఎస్పీ నాగూర్‌రెడ్డిబాష, ఐపీవో అనిల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

21న కొల్హాపుర మహాలక్ష్మికి కుంభాభిషేకం

హిందూపురం సాంస్కృతికం : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి వీధిలోని కొల్హాపుర మహాలక్ష్మి ఆలయంలో ఈనెల 21, 22 తేదీలు కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు శ్రీనివాసప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంతర పంటలు.. ఆదాయ మార్గాలు

వక్కతోటలో అంతర పంటగా సాగవుతున్న వేరుసెనగ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకే పంటను సాగుచేసి నష్టపోవడం కంటే అన్ని వనరులు ఉన్న రైతులు అంతర పంటలు సాగుచేస్తే మేలు చేకూరడంతో పాటు మంచి దిగుబడులు వచ్చి లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇది అక్షరాలా నిజమని చలివెందల గ్రామానికి చెందిన రైతు మధురెడ్డి నిరూపిస్తున్నారు. ఆయన వేర్వేరు చోట్ల 30 ఎకరాల్లో ఐదేళ్ల క్రితం వక్కపంట సాగు చేశారు. ఈ ఏడాది దిగుబడి రావడం ప్రారంభమైంది. ఇదే సంవత్సరంలో శాస్త్రవేత్తల సలహాలతో అంతర పంటలుగా వేరుసెనగ, మొక్కజొన్న 2 నెలల క్రితం సాగు చేశాడు. పెప్పర్, కాఫీ, కోకో పంటలను సాగుచేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇదేలా సాధ్యమైందో .. రైతు మధురెడ్డి మాటల్లోనే..

తాతల కాలం నుంచి వేరుసెనగ పంటను ప్రధానంగా సాగుచేసి మంచి దిగుబడులు వచ్చి లాభదాయకంగా ఉండేది. గత 20 సంవత్సరాల నుంచి సకాలంలో వర్షాలు రాకపోవడం, తెగుళ్ల బెడద ఎక్కువ కావడం, దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో హిందూపురం ప్రాంత రైతులు ఈ పంటను సాగుచేయడం బాగా తగ్గించారు. నీటివసతి ఉన్న రైతులు మల్బరీ పంట సాగు చేశారు. మార్కెట్లో ధరలు లేనందున పంటను తొలగించేశారు. నేను ఈ నిర్ణయమే తీసుకుని భూమిని బీడుగా ఉంచేశాను. మడకశిర ప్రాంతాల్లోని రైతులు వక్కతోట సాగులో లాభాలు గడిస్తున్నారని తెలుసుకొని 2021లో 18వేల వక్క మొక్కలను నాటి బిందు సేద్యం ద్వారా నీరు అందిస్తున్నా. కదిరిలోని వేరుసెనగ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన సూచనలు, సలహాలతో దిగుబడులు బాగా వస్తాయని భావించి 2025 డిసెంబరులో అంతరపంటలుగా 10 ఎకరాల్లో వేరుసెనగ, 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నా. మిగతాది త్వరలో పెప్పర్, కోకో, కాఫీ తోటలను సాగుచేయడానికి సిద్ధమవుతున్నాను. నీటివసతి, ఆర్థిక స్థోమత, వ్యవసాయ పరంగా అన్ని వనరులున్న రైతులు అంతర పంటలు సాగుచేస్తే ఎంతో లాభదాయకం.

హెచ్ఎంకు అందజేస్తున్న దాత దంపతులు

యూపీఎస్, ఇన్వర్టర్ అందజేత

పాలసముద్రం (గోరంట్ల): తను ఉన్నతస్థాయికి చేరుకోవడానికి బాటలు వేసిన పాఠశాలకు పాలసముద్రం గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి యూపీఎస్, ఇన్వర్టర్ వితరణ చేశారు. వాటిని దాత బాలరాజు గురువారం హెచ్ఎం రామాంజులు యాదవ్‌కు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, రాతపుస్తకాలు అందించి బాగా చదువుకోవాలని సూచించారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE ANANTAPURAMU
E.P.No. 78/2023 IN DRA. No.438/2016
Between:-
M/s. Kapil Chits Hyderabad Pvt. Ltd.,
Anantapuramu, Rept.by its Legal Officer ....Dhr/Petitioner
And
K.Sateesh Kumar, & Others .... Jdr/Respondents
To
5. Vetti Sujatha, W/o. Late V.Eswarappa, Hindu, A/a. 44 Years, R/at. HSC. No. 3428, Mangalagir Street, Aguvagadda, Penukonda (P&M). Sri Satya Sai (Dt.).
6. Vetti Rajesh, S/o. Late V.Eswarappa, Hindu, A/a. 22 Years, R/at. HSC. No. 3428, Mangalagir Street, Aguvagadda, Penukonda (P&M). Sri Satya Sai (Dt.).
7. Vetti Lokesh, S/o. Late V.Eswarappa, Hindu, A/a. 20 Years, R/at. HSC. No. 3428, Mangalagir Street, Aguvagadda, Penukonda (P&M). Sri Satya Sai (Dt.).
8. Vetti Dinesh, S/o. Late V.Eswarappa, Hindu, A/a. 18 Years, R/at. HSC. No. 3428, Mangalagir Street, Aguvagadda, Penukonda (P&M). Sri Satya Sai (Dt.).
NOTICE TO RESPONDENT Jdr.No.5 to 8
WHEREAS the Dhr Chit Fund Company, in the above E.P has instituted the above E.P for recovery of money and E.P filed the **E.P.78/2023 in DRA. No. 438/2016** for Adding of Legal Hairs Jdr.5 to Jdr.8 and the same is posted for your appearance in the said Court on the 23-02-2026 by 10:30 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.
// By the Order of the Court //
Sd/- (D.NARAYANA SWAMY)
Advocate for the Petitioner, Anantapuramu.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. అంగన్‌వాడీల్లో ఎస్బీఎం, ఐసీడీఎస్ నిధులతో చేపట్టిన మరుగుదొడ్లు, తాగునీటి పనులపై ప్రత్యేక సమీక్ష జరిపారు. వేసవికి ముందే డివిజన్ స్థాయిలో డీఈఈలు, మండలాల్లో ఏఈఈలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్బీఎం నిధులతో చేపట్టిన 194 మరుగుదొడ్ల పనుల్లో 72 పూర్తయితే, 105 పురోగతిలో, ప్రారంభం కానివి 17 ఉన్నాయి. ఐసీడీఎస్ నిధులతో చేస్తున్న 106 పనుల్లో 55 పూర్తయ్యాయి. మరో 39 పురోగతిలో, 12 ప్రారంభం కావాల్సి ఉందన్నారు. తాగునీటి సదుపాయానికి చేస్తున్న 310 పనుల్లో 264 పూర్తవగా, 8 మొదలుకాలేదని మరో 38 పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ సరైన వేదిక

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

ధర్మవరం న్యూస్‌టుడే: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే కేసుల పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. గురువారం ధర్మవరం కోర్టు ఆవరణలో సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్చి 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కేసులు రాజీ చేసుకొని పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ సరైన వేదికని కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులు పరిష్కరించే విధంగా చూడాలని జడ్జి పేర్కొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

ముదిగుబ్బ: తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు దళారులుగా మారడంతో 'కాసుక్కూచున్నారు' అనే శీర్షికతో 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ దళారులను కార్యాలయంలోకి అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు. ప్రజలు దళారులను ఆశ్రయించకుండా సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలన్నారు.

స్పందించారు..జరిమానా విధించారు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మట్టిని అక్రమ రవాణా చేస్తుండటంతో 'ఎర్రమట్టి..కొల్లగొట్టి' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌కు జరిమానా విధించారు. అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ప్రజాసమస్యల ఫిర్యాదు వేదిక

అమడగూరు(ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసే ప్రజాసమస్యల ఫిర్యాదు వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో సువర్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయండి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న భూసర్వే పనులను ఆర్డీవో మహేష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఆర్డీవో చేరుకొని సిబ్బందితో సర్వే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దాడితోటలో సర్వేను పర్యవేక్షించారు. నిబంధనల మేరకు సర్వేను చేపట్టాలని, వాటిని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

వసూలు చేస్తారు.. వసతులు కల్పించరు

శివారు కాలనీల్లో సమస్యల తీరిది

కదిరి, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు ఉంటాయన్న భావనతో చాలా మంది గ్రామీణులు వలస వస్తుంటారు. కానీ పురపాలికలోని శివారు కాలనీలు కనీస సౌకర్యాలకు దూరమై సమస్యలతో సతమతం అవుతున్నాయి. దీంతో వారు అసౌకర్యాలతో సహవాసం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన కాలనీల్లోనూ నేటికీ సరైన రహదారులు, మురుగు వ్యవస్థ లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎప్పుడో ఏళ్ల కిందట వేసిన మట్టిరోడ్లు గుంతలు తేలి జనం నడ్డి విరుస్తున్నాయి. వీధుల్లో మురుగు పారుతూ స్థానికులను ఆసుపత్రులపాలు చేస్తోంది. ప్రజల నుంచి పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు మౌలిక సదుపాయాల కల్పనలో చేతులెత్తేస్తున్నారు.

ఇక్కడే అధికం

కదిరి పురపాలికలో 20- 30 ఏళ్ల కిందట ఏర్పడిన కాలనీల్లోనూ మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. కుటాగుళ్ల ఇందిరమ్మ కాలనీ, పిల్లవంక, దివ్యాంగుల కాలనీలు, వెలుగు, కదిరికుంట నారాయణమ్మ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లు దెబ్బతిని గుంతలు పడ్డాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కిక్కురుమనడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.

● ధర్మవరంలోని గిర్రాజు కాలనీ 20 ఏళ్ల కిందట ఏర్పాటైంది. ఇక్కడ నేటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదు. వర్షాకాలం వస్తే నీరు నిలిచి జన సంచారానికి ఇబ్బందిగా మారింది. ఇక మురుగు, రోడ్ల పరిస్థితి ఎంత చెప్పుకున్నా తక్కువే.

● పుట్టపర్తి పురపాలికలో శిల్పారామం, రాయలవారిపల్లి, బీడుపల్లి, బడేనాయక్‌తండా, గోనేనాయక్‌తండాలు శివారు ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిలో అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో నేటికీ మారుమూలనే నిలుస్తున్నాయి. పేరుకు మున్సిపాలిటీ అయినా సీసీరోడ్లు, డ్రైనేజీలు సమకూర్చలేదు. ఫలితంగా అసౌకర్యాలతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

ధర్మవరంలోని గిర్రాజు కాలనీలో దర్శనమిస్తున్న మట్టిరోడ్డు

త్వరలోనే పనులు చేపడతాం

కదిరి పట్టణంలోని 14 వార్డుల్లో రూ.1.29 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే పనులు చేపడతాం. పుట్టపర్తి, ధర్మవరం పట్టణాల్లోనూ పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలుపెడతాం. **- క్రాంతికుమార్, పుట్టపర్తి కమిషనర్, సందీప్ కదిరి మున్సిపల్ ఏఈ**

ఉపాధ్యాయ క్రికెట్ టోర్నీ విజేతలకు సన్మానం

విజేతలను సన్మానిస్తున్న ఎంఈఓ గోపాల్‌నాయక్ తదితరులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీ సత్యసాయి జిల్లా క్రికెట్ టీం గెలుపొందింది. జట్టులో మండలానికి చెందిన ఉపాధ్యాయులను ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ గోపాల్‌నాయక్, హెచ్ఎం మోహన్‌రెడ్డిల సమక్షంలో ఘనంగా సన్మానించారు. కెప్టెన్ సందీప్, మహమ్మద్ రఫీ, ఆనంద్‌నాయక్, రఘునాథరెడ్డి, సుదర్శన్‌లు పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియచేశారు. జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సుభాషిని, శివయ్య, అంజినాయక్, శంకర్‌రెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో కొత్త ఆలోచనలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకుడు బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని టింబక్టు సీఫైఆర్‌సీ ప్రాంగణంలో చెన్నేకొత్తపల్లి, పెనుగొండ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వారు తయారు చేసిన వివిధ వైజ్ఞానిక నమూనాల ప్రదర్శనలను గురువారం నిర్వహించారు.

చిరస్మరణీయుడు ఛత్రపతి శివాజీ

శివాజీ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భాజపా శ్రేణులు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 399వ జయంతిని భాజపా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ పాండురంగ ఆలయం కూడలి నుంచి ప్రధాన రహదారి మీదుగా ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తూ శోభాయాత్ర చేపట్టారు. మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు నియోజకవర్గంలోని భాజపా నాయకులు, కార్యకర్తలు శోభాయాత్రలో పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయం కూడలి వద్ద నిర్వహించిన వేదికపై శివాజీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు వివేకానంద, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, బత్తలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, పట్టణ గ్రామీణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర పాల్గొన్నారు.

● పట్టణంలో అంబాభవానీ దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ద్విచక్రవాహన ర్యాలీ చేశారు.

నేటి నుంచి చెన్నకేశవ, పోతలప్పస్వామి ఉత్సవాలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: చెన్నకేశవ, పోతలప్ప, బంగారులింగమయ్య స్వాముల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. పట్టణ సమీపంలోని చింతతోపు వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. వేడుకలను పురస్కరించుకొని ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి పట్టణం, పెద్దకమ్మవారిపల్లి గ్రామ పురవీధుల్లో ఎలువగంప ఊరేగింపు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నారు. పలహారపు బండ్లు దేవాలయ ప్రదక్షిణ, దాసంగల మడుగుల ఉత్సవం, రాత్రికి నవరత్నల నాటక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం జ్యోతులు, బోనాల ఊరేగింపు, పోతలప్పస్వామి ఉత్సవం జరగనుంది.

ఆరోగ్య కేంద్ర ప్రహరీ నిర్మాణం

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని నిజాంవలి కాలనీలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రహరీ నిర్మాణ పనులకు గురువారం ఛైర్‌పర్సన్ దిల్షాదున్నిసా భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచనతో పీహెచ్‌సీకి రూ.10లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సిలర్ మహబూబ్‌బాషా, నాయకులు బహువుద్దీన్, ఇర్ఫాన్, ఇలాహి, మార్కెట్ నౌషాద్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

నంబులపూలకుంట,న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఫిబ్రవరి 25న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు, ఉపాధ్యాయులు మురళీ, పర్వతరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, అంజి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

సంక్షేమ పథకాల అమలు వేగవంతం

మాట్లాడుతున్న ఆర్డీవో సువర్ణ

పుట్టపర్తి పట్టణం,న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందించి వాటి అమలును వేగవంతం చేయాలని ఆర్డీవో సువర్ణ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి, సర్వేలు, పీ4 పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 805 బంగారు కుటుంబాల్లో ఇప్పటి వరకు 253 కుటుంబాలకు మార్గదర్శులను అనుసంధానం చేశారని, మిగిలిన వారికి మార్గదర్శులను ఎంపిక చేయాలన్నారు. ఎంఈవో-2 బొల్లె ప్రసాద్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

నల్లమాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధి వివిధ ప్రణాళికలపై గురువారం జిల్లా గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికారి సమతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటిపన్నులపై, పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ అంశాలపై ప్రధానంగా సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నుల వసూలు ఈ నెలాఖరులోగా వంద శాతం వసూలు చేయాల్సిందిగా ఆదేశించారు. మండల డిప్యూటీ ఎంపీడీఓ అబ్దుల్ మునాఫ్, మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు దాదాపాహెబ్, జనార్దన్ రెడ్డి, ఉస్మాన్, సోనియా, వనజా పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసమే పోలీసుల బలం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్రజల విశ్వాసమే పోలీసులకు నిజమైన బలంగా ఉంటుందని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. కొత్తచెరువు యూపీఎస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పై అంతస్తులో ఉన్న పుట్టపర్తి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు.

నీరుగారుతున్నా స్పందించరు

మండలంలోని గంటాపురంలో గురుజాల అప్పస్వామి ఆలయంలో సమీపంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ లీకేజీ అవుతోంది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. వేసవి సమీపిస్తున్న తరుణంలో నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో లీకేజీ అవుతున్న కుళాయిలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గంగను వివరణ కోరగా లీకేజీ కుళాయిలు గుర్తించి కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, బత్తలపల్లి

ఆదమరిస్తే గుచ్చుకోవడమే

పట్టణంలోని మారుతినగర్‌లో కాలువపై రాకపోకలకు అనువుగా ఏర్పాటుచేసిన సిమెంటు దిమ్మెలు దుస్థితికి చేరాయి. దిమ్మెల నుంచి ఇనుప చువ్వలు బయటకు చొచ్చుకురావడంతో చోదకులు ఆందోళన చెందుతున్నారు. కడ్డీలను చూసుకోకుండా ప్రయాణిస్తే గుచ్చుకునే అవకాశం ఉంది. ఇనుప చువ్వలను తొలగించాలని పురపాలక అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరవయ్యారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని జీనియస్ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గ్లోబల్ లెవల్ అబాకస్ పోటీల్లో అవార్డులు సాధించినట్లు కరస్పాండెంట్ కిషోర్ గురువారం తెలిపారు. వేదిక్ మ్యాథ్స్, హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థుల ర్యాలీ

అమడగూరు(ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు' అనే నినాదంతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీగా తరలి వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. అనుమానితులు కనిపిస్తే విద్యార్థులు వెంటనే 100కు కాల్ చేయాలని లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై గోపాలకృష్ణ సూచించారు. ఎంఈఓ జిలాన్‌బాషా, ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డెప్ప, ఈశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ రాధకృష్ణగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం వితరణ

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శ్మశాన వాటికకు సర్వేనంబర్ 281 లో 70 సెంట్ల స్థలాన్ని సాయిరాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సభ్యులు సీఎం సాంబశివారెడ్డి, వెంకటరమణమ్మలు రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో కుటీరం నిర్మాణానికి రూ.50 వేలు, దిగువతూపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో మైక్‌సెట్ ఏర్పాటుకు రూ.18 వేలను అందించినట్లు చెప్పారు. శ్మశాన వాటికకు ఇచ్చిన స్థలాన్ని పంచాయతీ అధికారులకు అప్పజెప్పనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

పీర్లమాన్యం వివాదంపై సమావేశం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సర్వేనంబర్ 891లో 4.46 ఎకరాల్లో 1.50 ఎకరాలకు సంబంధించిన పీర్లమాన్యం స్థలవివాదంపై ముజవర్లు, నాయీబ్రాహ్మణులతో తహసీల్దార్ బాబురావు గురువారం సమావేశం నిర్వహించారు. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పనులు ప్రారంభించి దస్త్రాల ఆధారంగా హక్కులను కేటాయిస్తామని ఆయన ఇరువర్గాలకు సూచించారు. తగిన ఆధారాలను సమర్పిస్తే దస్త్రాలను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ఇరువర్గాలకు చెందిన వారు గడువులోగా తగిన దస్త్రాలను సమర్పించి హక్కులు పొందాలని సూచించారు. అంతవరకు ఘర్షణకు వెళ్లకూడదని ఆదేశించారు.

లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరించండి

మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: హంద్రీనీవా ప్రాజెక్టు స్టేజ్-2 కింద రాప్తాడు నియోజకవర్గంలో 1,03,362 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఈమేరకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాప్తాడు పర్యటనకు వచ్చిన సమయంలో అన్ని ప్రాంతాలకు నీరందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా డీపీఆర్ తయారీకి నిధులు ఇవ్వాలన్నారు. మొత్తం రూ.17.628 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని, ఆమోదించాలని విన్నవించారు. ట్యాంకులకు నీటి సరఫరా కోసం కాలువలు తవ్వడానికి రూ.6.30 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆమె మంత్రిని కోరారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

బత్తలపల్లి న్యూస్‌టుడే: ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైె యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గంటాపురంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు బెంగళూరుకు చెందిన సాకే భువిరాజ్ గంటాపురం గ్రామానికి చెందిన వెన్నెలను కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరు కొంతకాలం బెంగళూరులో నివాసం ఉన్నారు. అక్కడ భువిరాజ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. విషయం తెలిసిన వెన్నెల తల్లిదండ్రులు కొంతకాలం కిందట కుమార్తె, అల్లుడిని గంటాపురం గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం అతను బేల్దారి పనిచేసుకుంటూ మళ్లీ మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైె బుధవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమశేఖర్ తెలిపారు. మృతునికి భార్య వెన్నెల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విషపూరిత గడ్డి తిని గొర్రెలు మృతి

నల్లమాడ, న్యూస్‌టుడే: విషగ్రాసం తిని 15 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలోని వంకరకుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వంకరకుంటకు చెందిన నాగేశ్వర్‌రావు(మాజీ ఎంపీటీసీ), గంగులప్ప ఇద్దరు గొర్రెల కాపరులు. వీరు అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని మొక్కజొన్న గ్రాసాన్ని ఐదు రోజుల కిందట కొనుగోలు చేశారు. రోజు మాదిరే గురువారం యథావిధిగా గొర్రెలను మేపడానికి పొలంలోకి వెళ్లారు. అక్కడ పశుగ్రాసం తిన్న గంట వ్యవధిలోనే నాగేశ్వర్‌రావుకు చెందిన నాలుగు గొర్రెలు, గంగులప్పకు చెందిన పదకొండు గొర్రెలు అకస్మాత్తుగా మృతిచెందాయి. విషయం తెలిసి రెడ్డిపల్లి వెటర్నరీ సర్జన్ ధనుంజయ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి, పశుగ్రాసంలో పురుగుల మందు ఆనవాలు కలవడంతో మృతిచెందినట్లు ఆయన చెప్పారు.

క్రైమ్.. కార్నర్

గొర్రెల గూడుకు నిప్పు..13 పిల్లలు..

రామగిరి, న్యూస్‌టుడే: గొర్రెల గూడుకు నిప్పు పెట్టడంతో 13 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన రామగిరిలో గురువారం జరిగింది. ఈ గొర్రెలు బోయ ముత్యాలప్పకు చెందినవి. ప్రమాదవశాత్తు జరిగిందా, ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా? అన్నది తెలియాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఈతోడు గ్రామంలో గ్రామదేవత గొడ్డెమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలో నగదును బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. హుండీకి ఉన్న తాళాన్ని పగులకొట్టి నగదు అపహరించారు. గ్రామస్థులు గురువారం గుర్తించిన పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో దాదాపు రూ.80 వేలు నగదు ఉన్నట్టు వారు తెలిపారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

తలుపుల, న్యూస్‌టుడే: గుండువారిపల్లి సమీపంలో జూదం ఆడుతున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెన్నయ్య తెలిపారు. వారి నుంచి రూ.12,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

భూవివాదం.. ఒకరిపై కేసు నమోదు

ముదిగుబ్బ: ఇద్దరు వ్యక్తుల మధ్య భూవివాదం ముదరడంతో ఉన్నతాధికారుల జోక్యంతో కేసు నమోదైంది. ముదిగుబ్బకు చెందిన సుంకు రమేష్, సుధాకర్‌కు మధ్య కొంతకాలంగా భూ సమస్య ఉంది. ఇరువురి మధ్య గొడవ జరిగింది. సుధాకర్ తన దుస్తులు చింపేశారంటూ అనంతపురం డీఐజీ షిమోషికి రమేష్ ఫిర్యాదు చేశారు. డీఐజీ ఆదేశాల మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఘటనపై ఆరాతీసి చర్యలు తీసుకోవాలని సీఐ శివరాముడుకు సూచించారు. దీంతో సుధాకర్‌పై బుధవారం కేసు నమోదైంది. కాగా సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండల తెదేపా నాయకులు ఆరోపించారు. ఇటీవల వీరనారాయణస్వామి పరస వైకాపా అధినేత జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వారిపై కేసులు నమోదు చేయలేదని వారు వాపోయారు.

భూసారం తీస్తున్నారు!

ఎరువుల అధిక వినియోగంతో అనర్థం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: రైతులు వరి పంట త్వరగా ఎదిగేందుకు యూరియా అతిగా వినియోగిస్తుండటంతో అనేక అనర్థాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా పంట దిగుబడులు బాగా వస్తాయనే ఉద్దేశంతో వాడాల్సిన దానికన్నా రెట్టింపు స్థాయిలో వాడేస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతినడమే కాకుండా రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ఖరీఫ్‌లో 25 వేల ఎకరాలు, ప్రస్తుతం రబీలో 5 వేల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 7 వేల మంది రైతులు వరి సాగుచేస్తున్నారు. అన్నదాతలు వరికి మూడు విడతలుగా ఎకరానికి మూడు బ్యాగుల చొప్పున యూరియా వినియోగించాలి. కానీ హాలికుల అవగాహనలేమితో, అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో మరో మూడు బ్యాగుల యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు వాడేస్తున్నారు. దీంతో రైతుకు ఎకరాకు అదనంగా రూ.5 వేల వరకు పెట్టుబడి పెరుగుతోంది. సాధారణంగా ఎకరా వరికి 72 కిలోల నత్రజని మాత్రమే వాడాలి. ఇందులో కాంప్లెక్స్ ఎరువులు కలిసి ఉండటంతో పైరు బాగా ఎదుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పురుగు మందుల వినియోగం కూడా బాగా పెరిగింది. చిన్న తెగులు వ్యాపించినా ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయించడంతో వారు ఒకటికి నాలుగు మందులు రైతులకు అంటగడుతున్నారు.

బీడుబారుతున్న నేల

జిల్లావ్యాప్తంగా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను కర్షకులు టన్నుల్లో వినియోగిస్తున్నారు. అధిక రసాయనాల వినియోగం ద్వారా నేల గట్టిపడి, భూమిలో మేలు చేసే సూక్ష్మజీవులు నశించి, నేల సహజ సారవంతాన్ని కోల్పోతోంది. అధిక ఎరువులు, మందుల వినియోగంతో తొలిదశలో అధిక దిగుబడి వచ్చినా తర్వాత కాలంలో భూమి పాడైపోయి దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. మితిమీరిన ఎరువులు నీరు, గాలి, నేలను కలుషితం చేస్తున్నాయి. రసాయన ఎరువుల వాడకం పెరిగి పండించిన పంటలను తినడం ద్వారా కూడా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి.

అవసరమైన మేరకే వాడాలి

హాలికులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి అవసరమైనంత మేరకే ఎరువులు వాడాలి. నత్రజని, భాస్వరం, పొటాష్‌లను సరైన నిష్పత్తిలో ఉపయోగించాలి. పశువుల ఎరువులు, వర్మీకంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులను వాడటం ద్వారా నేల ఆరోగ్యంగా ఉంటూ మరింత దిగుబడినిచ్చేలా సారవంతంగా మారుతుంది.
- కృష్ణయ్య, జిల్లా వ్యవసాయాధికారి

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా

సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు తదితరులు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వైద్య కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు పెండింగ్ జీతాల కోసం ధర్నా నిర్వహించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్చిలోగా జీతాలు అందేలా చూస్తానని ఆర్డీవో ఇచ్చిన హామీ మేరకు వారు ధర్నాను విరమించారు.

కదిరి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్షలు చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గురువారం సీడీపీఓ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 23 నుంచి 27 వరకు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూలు కలిసి దీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి పలుమార్లు వినతులు ఇచ్చినా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. రిలే దీక్షలకు సహకరించాలని విన్నవించారు. మధునాయక్, మాబున్నీసా, భాగ్యలక్ష్మి, సుశీల, శాంతి, కుంతల శారద, లక్ష్మీదేవి, లక్ష్మి, రమణమ్మలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, ధర్మవరం టౌన్, ఇంటి నంబరు : 1-446-15, శాంతినగరు నందు కాపురం ఉండు **P.లక్ష్మి W/o P.శివశంకర్,** అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని, UNION BANK OF INDIA, C.C.MARKET BRANCH, ధర్మవరం వారికి ఆయకం ఉంచి, ఋణము పొందుటకు వచ్చియున్నారు. అయితే సదరి **P.లక్ష్మి W/o P.శివశంకర్,** ధర్మవరం, ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు తేదీ: 21-7-1997, డాక్యుమెంటు నంబరు: 1763/97 తనవద్దలేదని, సదరు పత్రము తను పోగొట్టుకొన్నానని, సదరు విషయం తాను ధర్మవరం II టౌన్ పోలీసు స్టేషను నందు కంప్లైంటు చేసి, వారి వద్ద నుండి 14-2-2026వ తేదీన సర్టిఫికేట్ కూడా పొంది ఉన్నానని, కావున ప్రస్తుతం తన వద్ద సదరు పత్రం యొక్క నకలు పత్రము మాత్రమే ఉన్నదని తెలిపియున్నారు. కావున సదరు పత్రము ఎవరికైనను దొరికి వుండినచో, సదరు పత్రము నాకు గాని, నా క్లయింట్ బ్యాంకుకు గాని అందజేయవలసినదిగా కోరడమైనది. ఈ క్రింది కనబరచిన ఆస్తి విషయముగా, ఎవరికైనను ఎలాంటి హక్కుగాని, క్లైములుగాని, ఆయకములుగాని, విక్రయములుగాని ఉన్న యెడల, ఈ నోటీసు జారీ చేసిన తేది నుండి ఒక వారము లోపల సరియైన ఆధారములతో, నాకుగాని, నా క్లయింట్ బ్యాంకుకు గాని లిఖిత పూర్వకముగా అందజేయవలయును లేనంతట, సదరు P.లక్ష్మికి నా క్లయింట్ బ్యాంకు వారు, సదరు పత్రము యొక్క నకలు పత్రము తీసుకొని ఋణము మంజూరు చేయుదురు అని తెలుపడమైనది.

షెడ్యూలు

శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం SRD, పుట్టపర్తి R.D., ధర్మవరం గ్రామం పొలములో, ధర్మవరం మునిసిపల్ ఏరియాలో 1వ వార్డు, రేగడి కొట్టాల వీధిలో గల జాగా వివరం. C.D.S.No: 21-1 : 8-92 సెం॥ పైకి య.3-05 సెంట్లు పైకి (PLOT.No: 95) : 0-92 సెం॥ పైకి 0-02 సెం॥ (OR) తూ.ప.: 18 అడుగులు, ఉ.ద: 48 అడుగులు (OR) 96.8 చ॥గ॥లు గల జాగకు చెక్కుబందులు:
తూ: PLOT.No: 97 బండారు జయమ్మ, ద: PLOT.No: 98 P.రామలక్ష్మమ్మ, ప: రోడ్డు ఉ: PLOT.No: 92

డి.డి.హేమకుమార్, అడ్వకేట్,
ధర్మవరం. CELL No: 9848385839

(c) eenadu

ఉపవాస దీక్షలు ప్రారంభం

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. జిల్లాలోని ముస్లిం సోదరులు గురువారం నుంచి ఉపవాస దీక్షలు మొదలుపెట్టారు. మసీదుల్లో వేకువ జాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ప్రేమ, దానం, త్యాగం గొప్పదనాన్ని వివరించారు. సాయంత్రం మసీదుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదులో తొలి ఇఫ్తార్ విందు జరిగింది. అదే ఈ చిత్రం. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

గాడి తప్పిన వ్యవస్థ.. విద్యార్థులకు అవస్థ..!

- అస్తవ్యస్తంగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ పరిస్థితి

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్యాంపస్‌లో గ్రూపు విభేదాలు.. పంచాయితీలు పెరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్జీయూకేటీ వీసీతో పాటు, వాటి పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల డైరెక్టర్లు వారి పదవుల నుంచి రాజీనామా చేశారు. అది జరిగి రెండేళ్లు పూర్తవుతున్నా నేటికీ కొత్తవారిని నియమించకపోవడంతో వారే కొనసాగుతున్నారు. వాళ్లు బాధ్యతల విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరించడంతో వ్యవస్థ గాడి తప్పుతోంది. చివరికి విద్యార్థులే నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం క్యాంపస్‌లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు పెట్టడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సంబంధించి పీయూసీ-2తో పాటు ఇంజినీరింగ్ నాలుగేళ్లు కలిపి మొత్తం ఐదు బ్యాచులకు స్థానికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. వసతి సమస్య కారణంగా పీయూసీ-1ను మాత్రం నూజివీడులో కొనసాగిస్తున్నారు. అక్కడ 20 రోజుల కిందట ఓ విద్యార్థినితో ఓ అధ్యాపకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. అది ఉన్నతాధికారులకు తెలియడంతో విధుల నుంచి తప్పుకోవాలని ఆ అధ్యాపకుడికి సూచించినట్లు సమాచారం. అతను తన కంటే ముందు ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించినట్లు తెలిసింది. సదరు అధ్యాపకుడు నెలలో 15 రోజులు శ్రీకాకుళం క్యాంపస్‌లో, మరో 15 రోజులు నూజివీడులో విధులు నిర్వరిస్తున్నారు. ఆ ప్రభావంతోనే రెండు నెలల తర్వాత మళ్లీ కమిటీ విచారణ వచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

విచారణ ఏమవుతుందో..?

- గతేడాది డిసెంబరులో విద్యార్థినులు ఫిర్యాదు చేసిన 14 మంది బోధన, బోధనేతర సిబ్బంది నుంచి రాత పూర్వకంగా వివరణలు స్వీకరించారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.
- క్యాంపస్‌లో నూజివీడు నుంచి వచ్చిన ఆరుగురు సభ్యుల కమిటీ రెండు రోజుల నుంచి విచారణ చేస్తోంది.
- గురువారం సాయంత్రం మరోసారి పలువురు విద్యార్థినులు, మహిళా బోధనా సిబ్బందిని విచారించడం గమనార్హం.
- ఇదిలా ఉండగా కమిటీ సభ్యులకు శ్రీకాకుళం క్యాంపస్ బోధన సిబ్బందితో పరిచయాలు ఉండటంతో నివేదిక పారదర్శకంగా ఉంటుందా.. లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- వేరొక వర్సిటీకి చెందిన సీనియర్, ఉద్యోగ విరమణ పొందినవారితో విచారణ చేయిస్తే వాస్తవాలు బయట పడి విద్యార్థులకు న్యాయం జరిగేందుకు అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నీరుగారుస్తూ ఇంకెన్నాళ్లు..?

- దయనీయంగా వంశధార ఎడమ ప్రధాన కాలువ దుస్థితి
- ఆధునికీకరణకు బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం

– ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

ఏళ్లు గడిచిపోతున్నా.. శివారుకు నీరందట్లేదు. ప్రభుత్వాలు మారుతున్నా అన్నదాత కన్నీరు ఆగట్లేదు. వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ఏటా అంచనాలు రూపొందించడమే తప్ప.. నిధులు మంజూరు కాకపోవడంతో ఆధునికీకరణ కలగానే మిగులుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లోనూ కేవలం నిర్వహణకు రూ. కోటి మంజూరు చేసి.. ఆధునికీకరణ ఊసెత్తకపోవడంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నందిగాం మండలం పెంటూరు వద్ద ఎడమ ప్రధాన కాలువపై 57 ఆర్ మేజర్ డిస్ట్రిబ్యూటరీ పరిస్థితి ఇదీ..

వంశధార ప్రాజెక్టు మొదటి దశ పనుల్లో భాగంగా 1971లో ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం ప్రారంభించి.. 1977లో పూర్తి చేశారు. హిరమండలం, మెళియాపుట్టి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో విస్తరించి ఉంది. 49 ఏళ్ల నుంచి ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టలేదు. వైకాపా హయాంలో నిర్వహణను సైతం గాలికొదిలేయడంతో రాతి కట్టడాలు ఎక్కడికక్కడ ధ్వంసమయ్యాయి. షట్టర్లు పూర్తిగా కొట్టుకుపోయి శిథిలమయ్యాయి. మట్టి పూడుకుపోయి 2,480 క్యూసెక్కుల నీటి సామర్థ్యం 1,850 క్యూసెక్కులకు పడిపోయింది.

చేయాల్సిన పనులివే..

- పేరుకుపోయిన 2 మీటర్ల లోతు పూడిక తీయాలి.
- కోతకు గురికాకుండా గట్లు పటిష్ఠం చేయాలి.
- కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టాలి.
- నీటి నిల్వ, మళ్లించేందుకు రాతి కట్టడాలు, షట్టర్లు పునరుద్ధరించాలి.
- అనుసంధాన కాలువలు, చెరువులు, పంటపొలాలకు వెళ్లే మార్గాలను బాగు చేయాలి.

ఉన్నా.. వినియోగించుకోలేరు..

ప్రతి ఆర్థిక సంవత్సరం అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించడం పరిపాటిగా మారింది. 2020-21లో రూ.785.32 కోట్లు, 2022-23లో రూ.954 కోట్లు, 2024-25లో రూ.1400 కోట్లతో పనులు ప్రతిపాదించారు. మూడేళ్లలో అంచనాలు ఏకంగా రెండింతలు పెరిగిపోయాయి. ఏటా ఇదే జరుగుతుంది తప్ప నిధులు మాత్రం మంజూరు కావట్లేదు. కళ్ల ముందు నీరున్నా నిలిచే వెసులుబాటు లేకపోవడంతో రైతులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

కాలువ స్వరూపం ఇలా..
పొడవు: 104 కి.మీ.
సామర్థ్యం: 2,480 క్యూసెక్కులు
ఆయకట్టు: 1,48,230 ఎకరాలు
మండలాలు: 12
గ్రామాలు: 398

తప్పకుండా చేస్తాం..: వైకాపా సర్కారు ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఇచ్చిన మాట ప్రకారం మేం అధికారంలోకి వచ్చాక శివారుకు నీరిచ్చేలా కృషి చేశాం. తప్పనిసరిగా ఎడమ ప్రధాన కాలువను ఆధునికీకరిస్తాం. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ పూర్వోదయ పథకం ద్వారా అభివృద్ధి చేసేలా చూస్తాం. కూటమి హయాంలోనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.
- కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి

సాగు ఖర్చు తడిసి మోపెడు..!

వేసవి ప్రారంభం కాకుండానే రైతులకు తిప్పలు మొదలయ్యాయి. ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో జిల్లాలో చాలా చోట్ల చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. పైపుల ద్వారా సాగునీరందక రబీ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చేసేదేమీ లేక మోటార్లు పెట్టి నీరు మళ్లించుకుంటున్నారు. పంటకు తడులు అందించేందుకు అదనంగా ఖర్చు తప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూర్జ మండలంలోని కొల్లివలస వద్ద గిరడవాని చెరువులో నీరు తగ్గిపోవడంతో రైతులు చేస్తున్న భగీరథ యత్నాన్ని చిత్రాల్లో చూడొచ్చు.
– న్యూస్‌టుడే, బూర్జ

28లోగా జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛను పొందుతున్నవారు ఈ నెల 28లోగా జీవన ప్రమాణ పత్రాన్ని(లైఫ్ సర్టిఫికెట్) సమర్పించాలని ఉప ఖజానాధికారి బి.కృష్ణారావు ఓ ప్రకటనలో కోరారు. జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్ ద్వారా లేదా ఖజానాశాఖ కార్యాలయాల్లో ప్రక్రియ పూర్తి చేయొచ్చన్నారు. వేలిముద్ర పడని వారు సమీప కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?

క్యారెట్ల నాణ్యతపై ప్రశ్నిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

గార(శాలిహుండం), న్యూస్‌టుడే: గార మండలం శాలిహుండంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిలో కూరగాయల నిల్వలను పరిశీలించి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్ల నిల్వకు దస్త్రంలో లెక్కలకు పొంతన లేకపోవడంతో (300 గుడ్లు) వ్యత్యాసంపై సిబ్బందిని ప్రశ్నించారు. కొద్దిసేపటి తర్వాత లెక్కలు సరిచేసి దస్త్రాన్ని జేసీకి చూపడం గమనార్హం. క్యాబేజీ, క్యారెట్, ఆనపకాయ ఇతర కూరగాయలు నాసిరకంగా ఉండటంతో కాంట్రాక్ట్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ఎన్ని గంటలకు ఏం ఇస్తున్నారు వంటి వివరాలు ఆరా తీశారు. మెస్ ఇన్‌ఛార్జి కమిటీ సభ్యులతో కలిసి వంటశాలను పరిశీలించి పదార్థాల నాణ్యత పరిశీలించే విధానాన్ని ప్రశ్నించారు. సమీపంలోని విపాసన యోగా కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు చక్రవర్తి తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తున్నట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ అజయ్ కార్తికేయ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డులను ఆధార్, బ్యాంకు ఖాతాలతో కార్మిక శాఖ కార్యాలయంలో అనుసంధానించుకోవాలని సూచించారు. గుర్తింపు కార్డు అమలులో లేకపోతే సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత ఉండదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94925 55037కు ఫోన్ చేయాలని సూచించారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉద్యోగులతో మాట్లాడుతున్న డీసీసీబీ అధ్యక్షుడు శివ్వాల సూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలను సహకార శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అధ్యక్షుడు శివ్వాల సూర్యనారాయణ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాథ్ డిమాండ్లు వివరించారు. రెండు వేతన సవరణలు అపరిష్కృతంగా ఉండటంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. సంఘాల పని తీరు ఆధారంగా వేతనాలు చెల్లిస్తామనడం సరికాదని స్పష్టం చేశారు. జీవో 36 రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. డీసీసీబీ అధికారుల సంఘ అధ్యక్షుడు శిమ్మ జగదీశ్, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు మురళి, కామరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, డీసీసీబీ అధికారి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

ఆరోగ్య పాఠం.. ఒంటబట్టించుకుందాం..!



– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఏడాదంతా చదివేది ఒక ఎత్తయితే.. పరీక్షల వేళ సాధన చేయడం మరో ఎత్తు. తెలివైన విద్యార్థులు కూడా ఈ సమయంలో ఒత్తిడికి గురవుతుంటారు. మంచి మార్కులు తెచ్చుకోగలమో.. లేదో.. అని ఆందోళన చెందుతారు. ఆ ప్రభావంతో కంటి నిండా నిద్రపోరు. కడుపు నిండా తినరు. కొందరు ఏదో ఒకటి గబగబా తినేస్తుంటారు. ఈ ధోరణి ఎంత మాత్రం సరికాదని.. తిండి, నిద్ర విషయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే మెదడు చురుగ్గా పని చేస్తుందని ఆహార నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో విద్యార్థుల వివరాలిలా..
పదో తరగతి: 28,943
ఇంటర్: 39,847
మిగిలినవారు: 1,97,057

వీటన్నింటికీ ఒకటే ఔషధం..

- పరీక్షల భయంతో తలనొప్పి, వికారం వంటివి విద్యార్థుల్లో సహజంగా వస్తుంటాయి.
- ఆందోళన, ఒత్తిడి కారణంగా కొందరు కడుపునొప్పి, వణుకు లక్షణాలతో ఏకాగ్రత కోల్పోతారు.
- ప్రతికూల భావనల మూలంగా ఆత్మవిశ్వాసం సన్నగిల్లి.. నిరాశకు లోనవుతారు.
- ఆహార పదార్థాలు, దినచర్యలో మార్పు చేసుకోవడమే వీటన్నింటికీ సరైన మందు అని పేర్కొంటున్నారు.

అవి తినకుంటేనే మంచిది..: చదువుతో పాటు ఆహార అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించగలరు. పోషకాహారం తీసుకుంటే మెదడు చురుగ్గా పని చేసేందుకు దోహదపడే 'టైరోసిస్' ఆమ్లం ఉత్పత్తవుతుంది. ఒత్తిడిని తగ్గించేందుకు బి కాంప్లెక్స్, విటమిన్ సి, జింక్ వంటివి తినే పదార్థాల్లో ఉంటే హార్మోన్లను సమతుల్యం చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరిగేందుకు వాల్ నట్స్, అవిసె గింజలు వంటివి తీసుకోవచ్చు. వీలైనంత వరకు బయట నుంచి కొనుగోలు చేసిన ఆహారం తినకపోవడం మంచిది. - డా.సునీత రుంజాల, పోషకాహార నిపుణురాలు

ఇలా చేద్దాం.. పరీక్షలు రాద్దాం..

- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పరీక్షల సమయంలో బ్రేక్ ఫాస్ట్ మిస్ చేయకూడదు.
- మాంసాహారం, నూనెతో చేసిన పదార్థాలను తక్కువగా తినాలి.
- అన్నం తక్కువ మోతాదులో తీసుకుంటూ పప్పుధాన్యాలు, సోయా గింజలు, పెరుగు, పాల పదార్థాలు ఆహారంలో భాగం చేసుకోవాలి. జొన్న, సజ్జ, గోధుమ రొట్టెలు తీసుకుంటే మంచిది.
- ఎండాకాలం కావడంతో నీరు ఎక్కువ తాగాలి. నిమ్మకాయ, గ్లూకోజ్ కూడా కలుపుకోవచ్చు.
- కాఫీ, టీలను తగ్గించి. పండ్ల రసాలకు ప్రాధాన్యమివ్వాలి.
- ఆకుకూరలు, రాగి జావ, నువ్వులు, బాదం, ఉసిరికాయలు కూడా తినొచ్చు.
- చిప్స్, శీతల పానీయాలు, తీపి పదార్థాలను ఎక్కువగా తింటే నిద్ర ఎక్కువగా వస్తుంది.

WALK-IN-INTERVIEW
పేరం గ్రూప్ Peram Group
PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

ADVOCATES	6 No's (2-3 yrs. exp)
OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
ADMINS	8 No's (1-5 yrs. exp)
DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
SURVEYORS	2 No's (2-3 yrs. exp)
LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)
D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969

48 గంటల్లో జాబ్ కార్డు

ముకోసం

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పథకంలో పలు మార్పులు చేర్పులు చేసింది. పథకం పేరును వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(వీబీ జీరామ్‌జీ)గా మారుస్తూ పని దినాలను 125 రోజులకు పెంచింది. ఇకపై సమయానికి వేతన చెల్లింపులు చేసేలా, ఆలస్యానికి పరిహారం అందించేలా భరోసానిస్తూ పథకాన్ని రూపొందించింది. కొత్తగా జాబ్ కార్డు కావాలనుకునే వారికి జారీ సులభతరం చేసింది. దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీని అమల్లోకి తెచ్చింది. ◆ రెండు మూడు చోట్ల పేర్లు నమోదు చేసుకోవడం, ఒకరి బదులు మరొకరు పనులు చేయడం, పనులకు రాని వారి పేర్లపై మస్తర్లు వేయడం వంటి అక్రమాలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోనున్నారు. ◆ ఆధార్ కార్డుతో నేరుగా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని సంప్రదిస్తే ఈ-కేవైసీ పూర్తి చేసి దరఖాస్తు చేస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి కార్డును జారీ చేస్తారు.

22న విద్యార్థులకు పోటీలు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భాజపా నాయకులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ పదేళ్ల కిందట ప్రారంభించిన మన్ కీ బాత్ కార్యక్రమం ఓ విజ్ఞాన తరంగమని భాజపా జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం దీనికి సంబంధించిన గోడప్రతులు, కరపత్రాలను పలువురు నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కట్టా పద్మ మాట్లాడుతూ స్ఫూర్తిదాయక, సృజనాత్మకత, వైజ్ఞానిక అంశాల్లో అభివృద్ధిని ప్రధాని మోదీ వివరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 22న జరిగే 131వ ఎపిసోడ్‌లో పాల్గొనే విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా: ధర్మాన టీవీఎస్, శ్రీకాకుళం: 9246631177 | ధర్మాన టీవీఎస్, నరసన్నపేట: 9246634112 | సాయికృష్ణ ఆటోమోటివ్స్, టెక్కలి: 9440105664 | శ్రీ శ్రీనివాస టైర్స్ & ఆటోమొబైల్స్, పలాస: 9440195172 | శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్స్, సోంపేట: 8277151090 | శ్రీ లక్ష్మీనారాయణ మోటార్స్, ఆమదాలవలస: 9949278793 | GK ఆటోమొబైల్స్ రణస్థలం: 9618458637 | ధర్మాన టీవీఎస్, పెదపాడు: 8802555999 | శ్రీనివాస ఆటోమొబైల్స్ కొత్తూరు: 9440618100 | శ్రీ సూర్య మోటార్స్, పాలకొండ : 9573181711.

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ

శైవ క్షేత్రం దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఈవో ఏడుకొండలు ఆధ్వర్యంలో అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి నిరంతరం పూజలందుకున్నారు. అవి ముగియడంతో సంప్రోక్షణ (ఆలయ శుద్ధి) కార్యక్రమం చేపట్టారు. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ ద్రవ్యాలతో ఆలయాన్ని శుద్ధి చేశారు. దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, జలుమూరు

విదేశీయుల హరినామ సంకీర్తన

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కూర్మ గ్రామ ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం నరసన్నపేటలో హరినామ సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకులతో పాటు విదేశీ భక్తులు హరినామ సంకీర్తన ఆలపించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన రహదారిపై పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా భజనలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక పెద్దపేట సమీపంలోని ఓ కల్యాణ మండపంలో సంధ్యాహారతి, భగవద్గీత ప్రసంగం తదితర కార్యక్రమాలు జరిగాయి. - న్యూస్‌టుడే, నరసన్నపేట

సెపక్‌తక్రా విజేతకు సత్కారం

శ్రీలంకలో ఇటీవల నిర్వహించిన దక్షిణాసియా సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు విజయం సాధించి బంగారు పతకం అందుకుంది. ఇందులో కీలకంగా వ్యవహరించిన క్రీడాకారిణి గేదెల దుర్గాప్రశాంతిని జిల్లా సంఘ అధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి సత్కరించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో గురువారం సీనియర్ క్రీడాకారులు ఆమెను అభినందించారు. గతంలో జాతీయ స్థాయిలో పలు పతకాలను అందుకుందని గుర్తు చేశారు. కోచ్ అర్జున్ రావురెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

నేతన్నలకు చేయూత

'న్యూస్‌టుడే'తో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు జనార్దనరావు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ముఖాముఖి

చేనేత వస్త్రాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. ఇక్కడి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గిరాకీ ఉంది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి చేయడానికి ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు చేయూత అందించడానికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు టి.జనార్దనరావు 'న్యూస్‌టుడే'కు ఇచ్చిన ముఖాముఖిలో తెలిపారు.

సంఘాల పనితీరు మెరుగుకు చర్యలు

జిల్లాలోని 11 మండలాల పరిధిలో కోర్ ఏరియాలు గుర్తించాం. శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం, గార మండలం అంపోలు, పొందూరు, తోలాపి, ఆమదాలవలస మండలం అక్కులపేట, బూర్జ, పాతపట్నం మండలం కొరసవాడ, కోటబొమ్మాళి మండలం తిలారు, మందస మండలం బైరి సారంగిపురం, సోంపేట మండలం జింకిభద్ర, జి.సిగడాం మండలం టి.దుగ్గివలస గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. 36 సొసైటీలుండగా 20 మాత్రమే క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. మిగిలినవి బలోపేతమయ్యేలా కృషి చేస్తున్నాం.

శిక్షణతో చైతన్యం

జిల్లాలో సుమారు 3 వేల మంది చేనేత వృత్తిలో కొనసాగుతున్నారు. వారిని ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ మార్కెట్‌లో గిరాకీ అనుగుణంగా వస్త్రాలు తయారు చేసేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ముద్ర రుణాల మంజూరు

కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ముద్ర రుణాలు వర్తించేలా అనుమతిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 214 మందికి రూ.2.56 కోట్లు, 2025-26లో 176 మందికి రూ.1.97 కోట్లు మంజూరు చేశాం. ఒక్కో లబ్ధిదారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందవచ్చు. 20 శాతం లేదా అత్యధికంగా రూ.25 వేల వరకు రాయితీ లభిస్తోంది. క్రమ పద్ధతిలో చెల్లిస్తే కొత్త రుణాలు ఇవ్వడానికి వీలుంటుంది.

13 క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కేంద్ర ప్రభుత్వం పొందూరులో రెండు, తోలాపిలో ఒక క్లస్టర్‌ను అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసింది. 574 మంది కార్మికులకు సాంకేతికంగా, ఆర్థికంగా తోడ్పాటు అందుతోంది. మగ్గాలు, పరికరాలు, డైయింగ్ యూనిట్లు వంటివి చేనేత, జౌళి శాఖ అందిస్తోంది. మెరుగైన ఫలితాలొస్తున్నాయి. కొత్తగా మరో 13 క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

240 మందికి థ్రిఫ్ట్ పథకం

జిల్లాలో 7 చేనేత సంఘాలకు థ్రిఫ్ట్ పథకం అమలులో ఉంది. 240 మందికి వర్తిస్తుంది. రూ.26.15 లక్షలు విడుదల చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇప్పటికే రూ.9.81 లక్షలు మంజూరు చేసింది. కార్మికులు 8 శాతం వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం రెట్టింపు వాటా సమకూరుస్తుంది.

ఉచిత విద్యుత్తు అమలు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించనుంది. జిల్లాలో 1,350 మందికి 100 యూనిట్ల పథకం వర్తిస్తోంది. అంతకు మించి వినియోగిస్తే బిల్లు చెల్లిస్తున్నారు. 200 యూనిట్ల వరకు ఉచితమని ప్రకటించడంతో సుమారు 2 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి.

రీ సర్వే పారదర్శకంగా చేయండి

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఆ శాఖ ఏడీ ఎం.జోష్నా అన్నారు. జలుమూరు మండలం రాణాలో జరుగుతున్న రీ సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దస్త్రాలను పరిశీలించారు. తప్పులు జరిగినట్లు ఏ ఒక్క రైతు నుంచి ఫిర్యాదు రాకుండా, తప్పిదాలకు తావులేకుండా చూసుకోవాలని సూచించారు. రీ సర్వే డీటీ ఆర్.పుష్పలత, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, పలువురు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రాణాలో రీ సర్వేపై సూచనలు చేస్తున్న ఏడీ ఎం.జోష్నా

బాల వికాసం..భవితకు అందలం!

న్యూస్‌టుడే, పలాస పట్టణం

బాలల మేధో వికాసానికి ప్రభుత్వం, వివిధ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు వారి ఆలోచనల విస్తృతికి మరింత ఊతమిస్తున్నాయి. విద్యార్థుల్లో ప్రయోగాత్మక, వినోదాత్మక అభ్యసనం ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'సైన్స్ సమగ్ర మహోత్సవం' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ సిటీ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనుంది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు.

- సైన్స్ సమగ్ర మహోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమం
- 22 వరకు లీప్ యాప్‌లో నమోదుకు అవకాశం

నిబంధనలివీ..

- విద్యార్థులు వినూత్నంగా, సొంతంగా ఆలోచిస్తూ ప్రాజెక్టు నమూనాలు తయారు చేయాలి. న్యాయనిర్ణేతలు వాటికి మార్కులు కేటాయిస్తారు. సొంత ఆలోచన, సృజనాత్మకతకు 25 మార్కులు, స్పష్టమైన శాస్త్రీయ ఆలోచనకు 25, నిజజీవిత అన్వయానికి 20, వివరణ, బృంద పనికి 20, ప్రాజెక్టు తయారీకి ఉపయోగించే వస్తువులకు (వ్యర్థ లేదా పర్యావరణహిత) 10 మార్కులు కేటాయించారు.
- పాఠశాలల స్థాయిలో ఎంపిక చేసిన నమూనాలను ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో ప్రదర్శిస్తారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన న్యాయనిర్ణేతల బృందం ఈ ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.
- ప్రతి పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో ఆసక్తి ఉన్న అర్హులు. గరిష్ఠంగా ముగ్గురు చొప్పున ఒక జట్టు ఉండాలి. ఇలా ఒక్కో పాఠశాల నుంచి గరిష్ఠంగా పది జట్ల వరకు పాల్గొనొచ్చు.
- తొలుత పాఠశాల స్థాయిలో విద్యార్థి జట్లు ఈ నెల 22 వరకు లీప్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. 23న పాఠశాలలో శాస్త్రీయ నమూనాలు ప్రదర్శించాలి. ఇందులో విజేత జట్టు నమూనాను ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలోని న్యాయనిర్ణేతల కమిటీ ఎంపిక చేసి 3 లేదా 4 నిమిషాల వీడియో, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- మండల స్థాయిలో విజయం సాధించిన నమూనాలను జిల్లా స్థాయిలో ఈ నెల 26న రెండు చొప్పున ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతారు. ఇలా 26 జిల్లాల నుంచి 52 నమూనాలు రాష్ట్రస్థాయికి చేరతాయి.
- వాటిలో జిల్లాకు ఒకటి చొప్పున 26 నమూనాలు ఎంపిక చేస్తారు. ఈ నెల 28న విజేతలకు ముఖ్యమంత్రి లేదా మంత్రుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందిస్తారు.
- ఈ మొత్తం ప్రక్రియలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ధ్రువపత్రం ఆన్‌లైన్‌లో అందుతుంది.
- ఒకేరోజు ఇంత మంది శాస్త్రీయ నమూనాల ప్రదర్శనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసి అందులో పాల్గొన్న వారికి, విజేతలకు ధ్రువపత్రాలు అందజేస్తారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్

శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ఆనందరావు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల సర్వీసు అసోసియేషన్ అధ్యక్షుడిగా మందస పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలో గురువారం సంఘ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వై.సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టి.హరికృష్ణ, కోశాధికారిగా ఎల్.కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఓంకార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఆర్.ఆనందరావు, రాష్ట్ర పరిశీలకులుగా వి.రమణ వ్యవహరించారు. జేడీ కె.రాజగోపాల్, డీడీలు నర్సింహులు, సూర్యనారాయణమూర్తి, గణపతి, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

విధుల్లో లేని సిబ్బందికి షోకాజ్ నోటీసులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం సవర సిద్దమణుగు బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధుల్లో లేని సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందించినట్లు ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు పేర్కొన్నారు. గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆహార నాణ్యత, రుచిని మరింత మెరుగుపరచాలన్నారు. విధుల్లో ఉండాల్సిన డిప్యూటీ వార్డెన్ జీవన్‌రావు, రాత్రి స్టడీ అవర్ విధుల్లో ఉండాల్సిన ఉపాధ్యాయుడు దేవరాజు లేకపోవడాన్ని గమనించి వీరిద్దరికీ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

21న 'ఆఫ్ సైట్' మాక్ డ్రిల్

రణస్థలం, న్యూస్‌టుడే: రసాయన పరిశ్రమల్లో ప్రమాదం జరిగినప్పుడు సమయం వృథా చేయకుండా ప్రాణాలు కాపాడటమే తొలి ప్రాధాన్యత కావాలని పరిశ్రమల తనిఖీ అధికారి రాంబాబు అన్నారు. 21న నిర్వహించనున్న ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్ సన్నాహక సమావేశం పైడిభీమవరంలో నిర్వహించారు. ప్రతి రసాయన పరిశ్రమ నుంచి 10 మంది ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో సైరన్లు, లౌడ్ స్పీకర్లు, సామాజిక మాధ్యమాలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహన్‌రావు, జిల్లా పరిశ్రమల శాఖ సహాయ డైరెక్టర్ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులు ప్రజలకే ఉపయోగపడాలి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: ప్రకృతి వనరులు ప్రజలకు ఉపయోగపడాలే తప్ప బహుళజాతి సంస్థలకు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. మందస మండలం మీలగంగువాడలో కార్గో విమానాశ్రయం ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సమావేశం నిర్వహించారు. పచ్చని తోటలు ధ్వంసం చేసి ప్రకృతి వినాశనానికి పాల్పడొద్దని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలన్నారు. ఈ ప్రాంత పంటల ఆధారంగా పరిశ్రమలు నెలకొల్పాలని.. విమానాశ్రయంతోనే అభివృద్ధి అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొనడం తగదన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈనెల 26 నుంచి ఆయా గ్రామాల్లో విస్తృత స్థాయి ప్రచారం చేపట్టి, 28న వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో భారీ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోరాట ఉద్యమ అధ్యక్షుడు కె.వాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటరావు, రామారావు, మాధవరావు, సర్పంచి ధర్మారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

24న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శాప్ లీగ్‌లో భాగంగా ఈ నెల 24న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొనే జట్ల ఎంపికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ.మహేశ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-18 విభాగంలో బాలబాలికలకు విడివిడిగా ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు sports.ap.gov.inలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారు ఈ నెల 28న ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93903 52942, 94948 14087కు ఫోన్ చేయాలని కోరారు.

అభివృద్ధికి సహకరించాలి

నగదు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆఫ్‌షోర్ జలాశయ ప్రభావిత గ్రామం రేగులపాడుకు చెందిన పలు నిర్వాసిత కుటుంబాలు ఇళ్లపై కట్టిన నిర్మాణాలకు పరిహారం మంజూరైంది. తహసీల్దారు కార్యాలయంలో గురువారం 50 కుటుంబాలకు రూ.52 లక్షలు అందజేశారు. ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పి.విఠల్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు బ్రాహ్మణవీధికి చెందిన కె.సాయికుమార్‌పై బీరు సీసాలతో దాడిచేసిన ఘటనలో గురువారం కేసు నమోదు చేసి, ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.వెంకటేశ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి కొత్తూరుకు చెందిన టి.వినయ్‌కుమార్, సిరుసువాడ గ్రామానికి చెందిన కె.తరుణ్‌ను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డయాలసిస్ కేంద్రానికి మరో రెండు యూనిట్లు

ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజికాసుపత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో మరో రెండు కొత్త యూనిట్లను ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పాతిర్ల దేవేంద్రరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఐదు యూనిట్లతో సేవలందిస్తున్న ఈ కేంద్రంలో మరో రెండు యూనిట్లు ఏర్పాటు కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మూత్రపిండాల బాధితులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో రక్తశుద్ధి, మార్పిడి, వైద్యసేవల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రభుత్వానికి నివేదించారు. ఈమేరకు జిల్లా వైద్యశాఖాధికారులు నివేదికలో పేర్కొనడంతో యూనిట్లు మంజూరయ్యాయి. వాటికి గురువారం పూజలు చేసిన డా.దేవేంద్రరెడ్డి ప్రారంభించారు. ఇప్పటికే ఆసుపత్రి సేవల కోసం ప్రభుత్వం జనరేటర్‌ను సమకూర్చింది. డయాలసిస్ కేంద్ర వైద్యురాలు డా.రోషిణి, హెడ్‌నర్సు భవానీ, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

హిందీ భాషపై పట్టు సాధించండి

పోలాకి మండలం తిరువాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు హిందీ భాషపై చిత్రలేఖన, చేతిరాత, భాషను అనర్గళంగా చదవడం వంటి అంశాలపై పోటీలు జరిగాయి. హెచ్ఎం కె.ముఖలింగం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. ఉపాధ్యాయులు, సంతోష్‌కుమార్, శ్రీధర్, గోవిందరావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పోలాకి

గొలుసు దొంగల హల్‌చల్

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: మందస పోలీసుస్టేషన్ పరిధిలోని పిడిమందస, కుంటికోట, దూగిపురం, వీజీపురం పరిసర ప్రాంతాల్లో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం సాయంత్రం ఓ మహిళ మెడలోంచి బంగారు నగలు తెంపే ప్రయత్నంలో ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో తప్పించుకుని దుండగులు పారిపోయారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి సంబంధిత ఆధారాలను స్థానికులు మందస పోలీసులకు అందజేశారు. మందస పోలీసులు సీసీ ఫుటేజ్‌ను జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో ప్రత్యేక బృందం గాలింపు పనిలో పడింది.

EENADU e Classifieds

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం టౌన్ RTC కాంప్లెక్స్ SSR డిగ్రీకాలేజ్ దరి 15,500 & 5500 SFTతో 2G+3 బిల్డింగ్స్ విద్యాసంస్థలు హాస్పిటల్స్ బ్యాంక్స్ అద్దెకు ✆ 9703779230, 9398873241.

JOBS

S.A.T బైక్‌బజార్ పెద్దపాడు రోడ్ శ్రీకాకుళంలో పనిచేయుటకు అనుభవంగల కలక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 9010408813, 9553754134.

డెస్టినేషన్ హాలిడే ఇన్, న్యూ బ్రిడ్జి రోడ్, శ్రీకాకుళంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), టెలికాలర్స్(F) 30సం||లులోపు వారు కావలెను. ఫోన్: 8977211596.

బ్యాంకులోన్స్ ఇన్సూరెన్స్, కాలేజీలు, స్కూల్స్ సిస్టం ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ సిబ్బంది, టెలికాలర్స్, వయస్సు 45+, జీతం 18 వేలు. ✆ 8019647888.

MNC కంపెనీలో కాంట్రాక్టర్ల వద్ద B.టెక్, Dip., ITI, డిగ్రీ ఇంజనీర్స్, సూపర్‌వైజర్స్, స్టోర్స్, సిస్టం ఆపరేటర్స్, టెలికాలర్స్, Asst., ✆ 8341177761.

FACULTY/ TEACHERS

Wanted teachers for primary and high school Maths, Physics and English qualification B.Sc., B.Ed., B.Tech and B.A, B.Ed., ✆9441707763, 7702490940.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K+ ఫుడ్ & అకామిడేషన్. 9848577745, 9666694545

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, శ్రీకాకుళం, విజయనగరంలో పనికొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్, భోజనం కలదు. PF, ESI. జీతం: 20 వేలు, 30 వేలు. 6300071128

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కౌలు రైతుల సంఘ నాయకులు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేసి ఖాతాలో రూ.20 వేలు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు వి.రమణ, రైతు సంఘ నాయకుడు ఎన్.చిరంజీవి డిమాండు చేశారు. శ్రీకాకుళం నగర పరిధి హయాతీనగరంలో గురువారం వారు మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద కౌలు రైతుల సమస్యలపై నిరహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా మంత్రి అచ్చెన్నాయుడు కొత్త చట్టం తీసుకొస్తామని చేసిన ప్రకటన హామీకే పరిమితమైందని విమర్శించారు. సంఘ నాయకులు పి.శ్రీరాములు, రామారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

చెట్టు నుంచి జారి పడి వ్యక్తి మృతి

నీలప్పడు (పాతచిత్రం)

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన లొట్టి నీలప్పడు (50) బుధవారం మధ్యాహ్నం కొబ్బరి చెట్టు ఎక్కి జారి పడి మృతి చెందాడు. కొబ్బరి బొండాలు విక్రయిస్తూ జీవనం సాధించిన నీలప్పడు గ్రామ సమీపంలో బొండాలు తీస్తుండగా ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

నిర్వహణ లేక.. దాహం తీరక!

సౌర నీటి పథకాలకు వీడని గ్రహణం

న్యూస్‌టుడే, మెళియాపుట్టి

గిరిజన గ్రామాల్లో రోజంతా సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో దశాబ్దం కిందట రూ. లక్షలు వెచ్చించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌర నీటి పథకాలు సాంకేతిక లోపాలు, ప్రకృతి వైపరీత్యాలతో పడకేశాయి. వైకాపా పాలనలో వీటి నిర్వహణ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఊట నీరు, బావులపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తీసుకొస్తే గిరిజనులకు తాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉంది.

ఇది పరిస్థితి..

- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 2018 నాటికి 125 సౌర నీటి పథకాలు ఏర్పాటు చేశారు.
- మెళియాపుట్టి మండలం గిరి శిఖర గ్రామమైన అడ్డివాడలో రూ.10 లక్షలు వ్యయంతో నెలకొల్పిన పథకం తాగునీటి వనరులు లేక అలంకారప్రాయంగా మారింది. గ్రామస్థులు ఊటనీరుపై ఆధారపడుతున్నారు.
- నందిగాం మండలం కల్లాడ పంచాయతీ పరిధి జమ్మిపేట, కాశీరాజుకాశీపురం, బంజీరు గిరిజన గ్రామాల్లో పథకాలు తిత్లీ తుపాను ప్రభావంతో దెబ్బతిన్నాయి.
- సారవకోట మండలం బంజీరుపేటలో మూడేళ్లుగా పని చేయడం లేదు.
- నరసన్నపేట మండలం తోటాడ, బాడాం గ్రామాల్లో మూలకు చేరాయి.
- జలుమూరు మండలం మట్టవానిపేటలో అలంకారప్రాయంగా మారడంతో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకుంటున్నారు.

మెళియాపుట్టి మండలం అడ్డివాడలో నిరుపయోగంగా మారిన సౌర నీటి పథకం

- వెంకటాపురం పంచాయతీ పరిధి జంతూరులో 62 ఇళ్లు ఉన్నాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పథకం తుపాను ప్రభావానికి గురై దెబ్బతింది. గ్రామస్థులు ప్రత్యామ్నాయంగా బావిలో మోటారు అమర్చి తాగునీరు సమకూర్చుకుంటున్నారు. విద్యుత్తు ఛార్జీల భారం, కోతల సమయంలో అవస్థలు తప్పడం లేదు.
- పరుశురాంపురం పంచాయతీ పరిధి నందవలో పథకం పడకేయడంతో బావిలో మోటారు అమర్చారు. అందులో నీటి మట్టం తగ్గితే గ్రామస్థులకు అవస్థలు తప్పవు..
- కుద్దబ, రాయికోల, డేగలపోలూరు, పాత్రలోవ, తొవ్వూరు తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గం	పథకాలు
పాతపట్నం	27
పలాస	11
నరసన్నపేట	09
టెక్కలి	05
ఇచ్ఛాపురం	03

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం

గిరిజన గ్రామాల్లో సౌర నీటి పథకాలను నిర్వహించిన ఏజెన్సీల కాలపరిమితి ముగిసింది. సాంకేతిక సమస్యల పరిష్కారానికి నైపుణ్యం ఉన్న వారు అందుబాటులో లేక వృథాగా ఉన్నాయి. కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల పరిధిలో 105 పథకాలు ఏర్పాటు చేయగా 90 దెబ్బతిన్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా దృష్టి సారించాం. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తాం. - సీహెచ్ వెంకట అప్పలనాయుడు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం, పాతపట్నం

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

కాలుష్యంతో సతమతం

సంతపేట, జేఎల్, పండాకాలనీ ప్రజలకు ఇటుకల పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ అవస్థలకు గురిచేస్తోంది. ఈ ప్రాంతాల్లో సుమారు వంద కుటుంబాలు ఉంటున్నాయి. మూడు దేవాలయాలు, రెండు ప్రార్థనా మందిరాలకు వచ్చేవారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై రెవెన్యూ సిబ్బంది సాహు, కృష్ణ స్పందిస్తూ నిబంధనల మేరకు పరిశ్రమలు నిర్వహించుకోవాలని, వాటి అనుమతులు పరిశీలిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

లబ్ధిదారులకు హుద్‌హుద్ ఇళ్లు ఇప్పించండి

శాసన సభలో గురువారం శూన్య గంట సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడారు. 'పలాస పురపాలక సంఘం, వజ్రపుకొత్తూరు మండలంలో 398 గ్రూప్ హౌసింగ్ కింద హుద్‌హుద్ ఇళ్లు నిర్మించారు. 2018 అక్టోబరులో తిత్లీ తుపాను కారణంగా.. పంపిణీలో జాప్యం నెలకొంది. ప్రభుత్వం మారాక కొవిడ్ క్వారంటైన్ కేంద్రంగా ఉపయోగించారు. ప్రస్తుతం అవి నివాసయోగ్యంగా లేవు. టెక్కలి, ఇచ్ఛాపురంలోనూ ఇలాంటి ఇళ్లున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలి. ఒక్కో నియోజకవర్గంలో 400 మందికి ఇళ్లు ఇవ్వొచ్చు.' అని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: మార్చి 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మాధురి పేర్కొన్నారు. కోర్టులో గురువారం పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీఐ వై.రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం మెరుగు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని పలాస ఆర్డీవో వెంకటేశ్ అన్నారు. వచ్చే నెల 13 నుంచి 15 వరకు జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు క్రీడలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీవోకు రెవెన్యూ ఉద్యోగులు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు డీవీవీఎస్ఎన్ రాజు, నాయక్, లింగరాజు, రామారావు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరిశంకర్: హే బలవంత్, భాస్కరరామ: ఎర్రచీర ఇచ్ఛాపురంలో.. మణికంఠ ఎల్ మ్యాక్స్: హే బలవంత్, పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు సోంపేటలో.. ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: హే బలవంత్ – న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
8008574279
9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: తారకేశ్వరవీధి రహదారి దారుణంగా ఉంది. - బి.సత్యం, ఇచ్ఛాపురం

సమాధానం: నిధుల మేరకు.. రహదారి నిర్మాణం చేపడతాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

గుంత పూడ్చారు

ఇచ్ఛాపురం బెల్లుపడ రోడ్డులో పెద్ద గుంత ఏర్పడటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత మంగళవారం 'రోడ్డు కీలకం.. ఇదీ వాలకం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ర.భ.శాఖ డీఈఈ నాగమోహనరావు సూచనల మేరకు జేఈ డి.విక్రమ్ స్పందించారు. పాత జాతీయ రహదారి మరమ్మతుల్లో భాగంగా ఈ రోడ్డులో గుంతలు పూడ్చారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సరి చేశారు..

స్పందనకు వందనం

కర్తలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నీటి సరఫరాను నియంత్రించే వాల్వ్ కుండీ పై కప్పు పాడై ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈ నెల 18న 'కప్పు పాడైంది.. ముప్పు పొంచి ఉంది' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీ కార్యదర్శి మన్మథరావు గురువారం స్పందించారు. సిబ్బందితో పై కప్పును సరి చేయించారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

కొంచెం నిధులు.. విడుదల చేస్తే మేలు



పెద్ద కర్రివానిపాలెంలోని నిర్మాణ దశలో నిలిచిన భవనం

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, పలాస గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులకు అక్షర జ్ఞానాన్ని అందిస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం మాటలు గాలిమూటలయ్యాయి. ప్రధానంగా నూతన భవనాల నిర్మాణాలను పూర్తిగా విస్మరించింది. ఐదేళ్ల కాలంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు కనిపించలేదు. దీంతో అద్దె, సామాజిక భవనాల్లోనే కేంద్రాలు నడపాల్సిన దుస్థితి నెలకొంది.

అద్దె ఇళ్లల్లో అవస్థలు

✤ ఇచ్ఛాపురం ప్రాజెక్టు పరిధిలో 260 అంగన్‌వాడీ కేంద్రాలుంటే 138 అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. 2014-19 మధ్య నాటి తెదేపా ప్రభుత్వం ప్రాజెక్టు పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు రెండు దశల్లో 70 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేసింది. 32 నిర్మాణాలు పూర్తయ్యాయి. 30 భవనాలు వివిధ దశల్లో నిలిచాయి. మరో 8 భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

✤ సోంపేట ప్రాజెక్టు పరిధిలో 228 కేంద్రాలకు 71, పలాస ప్రాజెక్టు పరిధిలో 189 కేంద్రాలకు 61, మందస ప్రాజెక్టు పరిధిలో 176 కేంద్రాలకు 51 బడులు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటికి మంజూరైన భవన నిర్మాణాలు సగానికి పైగా అసంపూర్తిగా నిలిచిపోయాయి.

✤ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయని, అదనపు సాయం మంజూరు చేయాలని కోరుతూ గుత్తేదారులు పనులు నిలిపేశారు. వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్మాణాల పూర్తికి చొరవ చూపలేదు. అదనపు నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించినా స్పందించలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధులు కేటాయిస్తే బాల బడులకు మేలు చేకూరుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గాల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	పిల్లలు
ఇచ్ఛాపురం	260	7,968
సోంపేట	228	6,198
కాశీబుగ్గ	189	6,561
మందస	176	3,405

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రాజెక్టు పరిధిలో అర్ధాంతరంగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నిధులు రాగానే వివిధ దశల్లో నిలిచిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. – ఎం.రాజేశ్వరి, సీడీపీవో, ఇచ్ఛాపురం

నీరు నింపరు.. దాహం తీర్చరు

మందస మండలం హంసరాలి పంచాయతీ బుబ్బురు గిరిజన గ్రామం శివారులోని తొట్టి ఇది. వేసవిలో మట్టి పక్షుల గ్రామాలకు చెందిన మూగజీవాల దాహార్తి తీర్చేందుకు దీన్ని రెండేళ్ల కిందట నిర్మించారు. అనంతరం నీరు నింపకుండా నిరుపయోగంగా వదిలేశారు. ఈ విషయాన్ని సర్పంచి జగదీష్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

భవనం పూర్తయ్యేనా..!

కవిటి మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పదేళ్ల కిందట సర్వశిక్షా అభియాన్ పథకం కింద సిబ్బంది విధుల నిర్వహణకు అదనపు భవనం మంజూరైంది. నిర్మాణం ప్రారంభించి సగంలోనే వదిలేశారు. దీంతో ఎమ్మార్సీలో చిన్న గదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎంఈవో ధనంజయను వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు రాగానే పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

నాలుగు నెలలుగా ఇదే నీరు

ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మురుగు గుంత అధ్వానంగా మారింది. కాంప్లెక్స్ ఆవరణలోని స్థలాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ముఖద్వారం వద్ద మట్టి తీసి వదిలేశారు. గతేడాది అక్టోబరులో కురిసిన వర్షానికి నీరు చేరింది. నాలుగు నెలలు గడిచినా, మురికికూపంలా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పలాస డిపో మేనేజర్ ఎస్‌వీ నాయుడు వద్ద ప్రస్తావించగా, పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కల్వర్టు ఎత్తయింది.. దాటాలంటే కష్టంగా ఉంది

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఉదయపురానికి వెళ్లే కూడలి వద్ద కల్వర్టు ఎత్తుగా నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్రవాహనాలతో పాటు కార్లు, వ్యాన్, ఆటోలు ఎత్తుగా ఉన్న కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించే సమయంలో ఆగిపోతున్నాయి. కల్వర్టు మధ్యలో శిథిలమైంది. కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించి, ఎత్తు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

డంపింగ్ యార్డు కాదు

బారువ పోలీసుస్టేషన్ పక్కనే పెద్ద ఎత్తున చెత్త, వ్యర్థాలు వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసుస్టేషన్, సామాజిక ఆసుపత్రి, బీసీ కాలనీ, శివారు వీధులకు ఈ మార్గం ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు. చెరువు పక్కనే డంపింగ్‌యార్డులా తయారవ్వడంతో సమస్యలు నెలకొంటున్నాయి. సమస్యను పంచాయతీ ఈవో రాజేష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

హిందూ సామ్రాజ్య స్థాపన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవలు అమూల్యమైనవని వక్తలు అన్నారు. ఆయన జయంతిని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో విద్యాలయాలు, పలు యువజన సంఘాలు గురువారం ఘనంగా నిర్వహించాయి. శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాయి. పలాస గోపీ చంద్ రోలార్ స్కేటింగ్ క్లబ్ క్రీడాకారులు జాతీయ జెండాలతో పలాస నుంచి 5కి.మీ. వరకు ర్యాలీ నిర్వహించారు. శిక్షకులు బి.చంద్రావతి శివాజీ త్యాగాలను, జాతికిచ్చిన కీర్తిని చాటారు. కవిటి మండలం కొజ్జిరియాలో ధనాలశెట్టి హేమసుందర్ పర్యవేక్షణలో యువతులు, జనసైనికుల సహకారంతో జెమ్స్ ఆసుపత్రి వైద్య, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.. యువకులు రక్తదానం చేశారు. – న్యూస్‌టుడే, బృందం

పలాసలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

కవిటి మండలం కొజ్జిరియాలో రక్తదానం చేస్తున్న యువకులు

కీలక రహదారులకు మోక్షం

లక్కవరం రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎనిమిదేళ్ల కిందట గత తెదేపా హయాంలో ఈ రోడ్డు పనులను ప్రారంభించగా వైకాపా ప్రభుత్వంలో దీన్ని పట్టించుకోలేదు. దీంతో రాళ్లు తేలి, గోతులు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. నడిచేందుకు సైతం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురించగా ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ఉపాధిహామీ నిధులు మంజూరుకు కృషి చేయడంతో రూ.1.29 కోట్లతో ఎట్టకేలకు రహదారి పనులు పూర్తయ్యాయి. – న్యూస్‌టుడే, సోంపేట

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కొటెరుబంద రోడ్డు నుంచి దానంపేటను కలిపే మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు పనులను ప్రారంభించారు. ఈ రోడ్డులో కొంత భాగం గతంలోనే జరగగా, అది పూర్తి కాకపోవడంతో వాడుకలోకి రాలేదు. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం పనులు ప్రారంభించారు. ఏఈ కిశోర్, పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి ఎస్.కోటి, మాజీ కౌన్సిలర్ సరస్వతి పాల్గొన్నారు.

పనులు పూర్తయిన లక్కవరం రోడ్డు

వైభవంగా డోలోత్సవాలు

బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవం, చతుర్ధ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం స్వామికి సుప్రభాత సేవ, నిత్య పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య తిరువీధి నిర్వహించారు. రాత్రి నిర్వహించిన హరికథ గానం అందరినీ ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శన

శివసాగర తీరాన వెలిసిన నీలకంఠేశ్వర ఆలయం కళావేదికపై మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం రాత్రి ప్రవాసాంధ్రుల (బిలాయి) బాలగంధర్వ నాట్య కళామండలి కళాకారులు ప్రదర్శించిన 'ఆగండి కొంచెం ఆలోచించండి' సాంఘిక నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు సామాజిక సన్నివేశాలు ఆలోచింపజేశాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

కొద్దిరోజులు శ్రమిస్తే.. విజయం తథ్యం

మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విలియమ్స్

ఇచ్ఛాపురం/గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఇతర వ్యాపకాలు వదిలి చదువుపై దృష్టి సారించాలని పలాస డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ సూచించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించేందుకు గురువారం ఇచ్ఛాపురంలో పర్యటించారు. కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మమేకమయ్యారు. వెనకబడిన విద్యార్థుల బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. బెల్లుపడకాలనీలోని బీసీ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మందస మండలం గుడారిరాజమణిపురం ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్యాన్సులు చేసి ఉల్లాసంగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులు టి.నాగరాజు విద్యార్థులకు పరీక్షల్లో వినియోగించే సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు కె.రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

పేరుకే డివిజన్.. కార్యాలయాలు, సిబ్బంది కరవే..!

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పలాస పేరుకు డివిజన్ అయినా ఇక్కడ ఆ స్థాయి కార్యాలయాలకు సొంత భవనాలు మాత్రం లేవు. ఏవేవో భవనాల్లో అరకొర సిబ్బందితో సేవలందిస్తున్నారు. ప్రస్తుతమున్న కార్యాలయాల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందడం లేదు. వైకాపా పాలనలో పలాస డివిజన్‌గా ఏర్పడినా అప్పటి నాయకులు వీటి గురించి పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గౌతు శిరీష, అధికారులు దృష్టిసారించి డివిజన్ స్థాయి కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించి, సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

▸ ప్రభుత్వం డీడీవోలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై అధికారాలు, బాధ్యతలు, విధులు కల్పించింది. వీరికి స్థానికంగా ఎక్కడో చిన్న గదుల్లో కార్యాలయాలు కేటాయించడంలో ఇబ్బందులు తప్పడం లేదు. సొంతంగా కార్యాలయం, మౌలిక సదుపాయాలు లేకపోవడం, సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా మారింది.

▸ పలాస డీడీవో కార్యాలయంలో డీడీవోతోపాటు సూపరింటెండెంట్ ఒకరు, సీనియర్ అసిస్టెంట్ ఒకరు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు, డేటా ఎంట్రీ ఆపరేటర్, టైపిస్టులు ఇద్దరు, ఆఫీస్ సబార్డినేట్‌లు ఇద్దరు మొత్తం ఎనిమిది మంది ఉండాలి. ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. డీడీవో రెగ్యులర్ కాగా సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఉన్నవాళ్లు ఎప్పుడొస్తున్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో ప్రజలకు తెలియడం లేదు.

▸ పలాసలోని ఆర్డీవో, డిప్యూటీ డీఈవోలకూ సొంత కార్యాలయాలు లేవు. ఇతర ప్రభుత్వ భవనాల్లో సేవలందిస్తున్నా ఇక్కడా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న కొద్దిపాటి సిబ్బందిలో కొంత మంది డిప్యుటేషన్ మీదనే పనిచేస్తున్నారు. డిప్యూటీ డీఈవో కూడా ఇన్‌ఛార్జినే. ఉన్న ఉద్యోగులూ చిన్న చిన్న గదుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీని కారణంగా ప్రజలకు అందాల్సిన సేవల్లో నాణ్యత తగ్గుతోంది.

పలాసలో డీడీవో కార్యాలయం

సిబ్బందిని నియమిస్తాం

పలాసలోని ఈ కార్యాలయాలన్నింటికి స్థలాలు గుర్తించమని అధికారులకు ఇది వరకే చెప్పాం. అధికారులు స్థలాలు గుర్తించే పనిలో ఉన్నారు. అప్పటివరకు కొన్ని ప్రభుత్వ భవనాల్లోనే తాత్కాలికంగా ఈ కార్యాలయాలు ఏర్పాటు చేశాం. డీడీవో కార్యాలయంలో సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టిసారించింది. దశలవారీగా సిబ్బందిని నియమిస్తున్నాం. – సత్యనారాయణ, జడ్పీ సీఈవో, శ్రీకాకుళం

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కంచిలి గ్రామీణం : ఒరియా నారాయణపురానికి చెందిన నొలియా కృష్ణ (4) గతేడాది తలతంపరలో గ్రామ దేవత ఉత్సవాల సమయంలో జరిగిన విద్యుత్తు ప్రమాదంలో మరణించాడు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషితో బాధిత కుటుంబాలకు విద్యుత్తు సంస్థ నుంచి పరిహారం మంజూరైన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన రూ.5 లక్షల చెక్కును తెదేపా మండలాధ్యక్షుడు మాదిన రామారావు స్థానిక నేతలతో కలిసి కృష్ణ తండ్రి జగబందుకు గురువారం అందజేశారు.

స్వచ్ఛతకు అందరి సహకారం తప్పనిసరి

మాట్లాడుతున్న పురాధ్యక్షుడు గిరిబాబు

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘ స్వచ్ఛతకు అందరూ సహకారమందించాలని పలాస-కాశీబుగ్గ పురాధ్యక్షుడు బళ్ల గిరిబాబు కోరారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మెప్మా, సచివాలయ ఉద్యోగులకు గురువారం శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కమిషనర్ ఇ.శ్రీనివాసులు, ఏఐఐఎల్‌జీ కోఆర్డినేటర్ ఎల్.వి.రావు, తిరుపతిరావు, జిల్లా కోఆర్డినేటర్ కె.దేవి, స్వచ్ఛ కార్పొరేషన్ ప్రతినిధులు అజరుద్దీన్, సుధీర్, నవీన్, మెప్మా సీఎంఎం పి.మోహన్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

సోంపేట, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న బెంకిలి గ్రామానికి చెందిన టెంక విశ్వనాథానికి ఉద్దానం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం చేశారు. సంస్థ ప్రతినిధులు హేమారావు, ఢిల్లీరావు, అనిల్, బుజ్జి, నానాజీ, జానకిరావు గురువారం విశ్వనాథం ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10 వేలు సాయం అందజేశారు. ★ వజ్రపుకొత్తూరు మండలం యూఆర్‌కేపురానికి చెందిన చిట్టి జానకమ్మ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుండటంతో ఉద్దానం అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన దున్న విఘ్నేశ్వరరావుకు వైద్య ఖర్చుల కోసం రూ.5వేల సాయం అందించారు. విజయ్, మహేశ్, ఈశ్వర్, దానేసు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు స్థలం అవసరం

ఇచ్ఛాపురంలో రైతు బజారు ఏర్పాటుకు 50 సెంట్లు స్థలం అవసరమని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు రెడ్డిక కార్పొరేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, ఏఎంసీ అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, ఉపాధ్యక్షుడు శేఖర్, కూటమి నాయకులు శ్రీనివాస రౌళో, దాసరి రాజు తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆర్ఐ చిరంజీవిసాహుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్ఛాపురానికి రైతు బజారు ఏర్పాటుపై సానుకూలంగా ఉందని, స్థలం నిర్ధారిస్తే, ఏఎంసీ ద్వారా పనులు చేపడతామన్నారు. ఏఎంసీ డైరెక్టర్లు సరస్వతి, భాస్కర్, శ్యామ్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పాఠశాలలకు సామగ్రి వితరణ

సోంపేట, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ముత్యాలమ్మపేట పుర ప్రాథమిక పాఠశాలకు ఇక్కడ సేవలందిస్తున్న నూతన ఉపాధ్యాయులు జయలక్ష్మి, లిఖిత, హరిత సౌండ్ బాక్సును గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ధనలక్ష్మిబాయి ఆధ్వర్యంలో వితరణ చేశారు. ★ సోంపేట మండలం నడుమూరు పాఠశాలకు డొంకలూరు గ్రామ ప్రతినిధులు మద్దు రాజు, పాఠశాల పూర్వ విద్యార్థి సిసింద్రీ సోదరులు సౌండ్‌సిస్టం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చక్రధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమ తండ్రి హరికృష్ణ జ్ఞాపకార్థం దీన్ని అందజేశారు.

ఆర్.బెలగాం జట్టు విజయం

కవిటి: పాత కొజ్జిరియాలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఎల్‌వీఎస్ మెమోరియల్ మెగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఆర్.బెలగాం, ఇచ్ఛాపురం కేవీ వీధి జట్లు తలపడగా ఆర్.బెలగాం విజయం సాధించింది.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించండి

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: అన్ని గ్రామాల్లోనూ ప్రతి ఇంటి నుంచి రోజూ చెత్త సేకరణ జరగాలని డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు ఆదేశించారు. పలాస మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్) ఉమాపతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు

పూర్వ విద్యార్థుల ఔదార్యం అభినందనీయం

మందస: తాము చదువుకున్న బడి రుణం తీర్చుకోవడానికి ముందుకొచ్చిన పూర్వ విద్యార్థుల ఔదార్యం అభినందనీయమని మందస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. భవనాన్ని రూ.40 లక్షలతో పునరుద్ధరించడం, విద్యార్థులు కూర్చునేందుకు 60 బెంచీలు సమకూర్చడం గొప్ప విషయమన్నారు. పాఠశాలకు పూర్వ విద్యార్థులు గురువారం బెంచీలు అందజేశారు. తిరుపతిరెడ్డి, కిశోర్, మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ.. పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: బొడ్డపాడులో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న పోతనపల్లి జయక్క ఆరో వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు బొడ్డపాడులో గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, వంకల మాధవరావు, సన్నశెట్టి రాజశేఖర్, పోతనపల్లి కుసుమ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పల్లెల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా లొద్దపుట్టిలో శ్రీకాకుళం మెడికవర్ సౌజన్యంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనసైనికులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో రిక్షా కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం/గ్రామీణం

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం అమరావతిలో సీఎం కార్యాలయంలో ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. వంశధార నిర్వాసితులపై ఉన్న కేసులను ఉపసంహరించాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.110 కోట్లు వెనక్కి వెళ్లిన నేపథ్యంలో వాటిని పునరుద్ధరించాలన్నారు ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేయాలని వేడుకున్నారు.

ఘనంగా శివాజీ జయంతి

టెక్కలి, హిరమండలం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక వివేకానంద కూడలి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు సనాతన హిందూ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తిని కొనసాగిద్దామని భాజపా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరె నరేంద్రచక్రవర్తి అన్నారు. ★ హిరమండలంలో భాజపా నాయకులు శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టెక్కలి: వేడుకల్లో భాగంగా నృత్యం చేస్తున్న యువత

వెయిట్ లిఫ్టింగ్‌లో మహిళల ప్రతిభ

రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట మండలం యారబాడులో గురువారం నిర్వహించిన బలప్రదర్శన పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బూరవెల్లికి చెందిన దూబ యామశ్రీ, అడవరానికి చెందిన తాలాడ కావ్య, పురుషుల విభాగంలో గేదెల సత్యనారాయణ, ఆవల గోవిందరావు వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

నరసన్నపేట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సౌత్‌జోన్ రగ్బీ పోటీలకు నరసన్నపేటకు చెందిన ఆర్.చందు ఎంపికైంది. శని, ఆదివారాల్లో తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థిని పాల్గొంటుందని జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు, ఏవో అప్పారావు తెలియజేశారు.

సాంకేతిక చిక్కులు.. సర్వేకు తిప్పలు

– సారవకోట, పోలాకి, జలుమూరు, నరసన్నపేట

మండలాల్లో ఏకీకృత సర్వే ముందుకు సాగడం లేదు. ఆరంభం నుంచి సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందించడానికి కుటుంబ స్థితిగతులు, అవసరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోంది. వైకాపా హయాంలో గ్రామ వాలంటీర్ల ద్వారా చేపట్టిన సర్వే మ్యాపింగ్‌లో పలు తప్పులు దొర్లడంతో అర్హత ఉన్నప్పటికీ చాలా మంది సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆ లోపాలను సరిదిద్ది లబ్ధిదారులకు పథకాలందేలా చేపట్టిన సర్వే నేటికీ బాలారిష్టాలను అధిగమించలేక పోతోంది.

పోలాకిలో సర్వే చేస్తున్న పంచాయతీ అధికారి

సర్వర్ మొరాయింపుతో ఇబ్బందులు

● ప్రతి కుటుంబం నుంచి 10 రకాల సమాచారం సేకరించేందుకు సర్వే ప్రారంభించారు. గతేడాది డిసెంబరు నెలలోనే ప్రక్రియ పట్టాలెక్కింది. సచివాలయ ఉద్యోగుల్లో ఒక్కొక్కరికీ గ్రూపుల వారీగా లక్ష్యం విధించారు. యాప్ అందుబాటులోకి రాక కొద్ది రోజులపాటు సర్వేలో జాప్యం జరిగింది. ప్రస్తుతం సర్వర్ సమస్యతో ఒక్కో కుటుంబం వివరాలు అప్‌లోడ్ చేసేందుకు గంట నుంచి రెండు గంటల సమయం పడుతోంది.

● యాప్‌లో ధ్రువపత్రాలు స్కాన్ చేసి వివరాలు నమోదు చేయాలి. కుటుంబ సభ్యుల పేర్లు ఆధార్, చరవాణి నంబరు వివరాలు తీసుకోవాలి. వీటితో పాటు ఆస్తుల వివరాలు గ్యాస్, వాహనాలు, విద్యార్హత, కులం, మతం, ఉపాధి తదితర సమాచారం సేకరించాలి.

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు

మండలం	సచివాలయాలు	లక్ష్యం	పూర్తి	పెండింగ్
జలుమూరు	24	20,652	12,621	8,031
పోలాకి	23	22,517	14,434	8083
సారవకోట	20	17,536	13,206	4,330
నరసన్నపేట	24	26,027	16,501	9,526

నెలాఖరుకు గడువు..

ఏకీకృత సర్వేను ఈ నెల 28వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతిక కారణాలతో ఈ నెల 15కు పూర్తి కాలేదు. సేకరణలో తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదే. క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తున్నాం.
– రవికుమార్, మోహనరావు, చిన్నంనాయుడు, కేవీప్రసాద్ నాలుగు మండలాల ఎంపీడీవోలు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: నందిగాం మండలం కర్లపూడిలో రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురయ్యింది. 6 నెలల నుంచి తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. పరిష్కరించండి.
– గంటం చైతన్య, స్థానికుడు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – రాఘవ, పంచాయతీ కార్యదర్శి, కర్లపూడి
- న్యూస్‌టుడే, నందిగాం

ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ పురస్కారం ప్రదానం

నందిగాంకు చెందిన వైద్యుడు మాదిన జయంతిరావుకు భారత ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ పురస్కారం దక్కింది. ఈ అవార్డు కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖకు చెందిన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి ప్రొఫెసర్ బుద్ధ చంద్రశేఖర్ తదితరులు దిల్లీ నుంచి వర్చువల్ విధానంలో గురువారం ప్రదానం చేశారు. జయంతిరావు ప్రస్తుతం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అభినందించారు. – న్యూస్‌టుడే, నందిగాం

రేపు అమెరికా భక్తుల ప్రవచనం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలం మోదుగువలస ఆర్ఆర్ కాలనీ(చిన్నకొల్లివలస)లో ఈ నెల 21న అమెరికాకు చెందిన భక్తుల ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన, భగవద్గీత ప్రసంగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామంలోని రామాలయం పక్కనే ఉన్న స్థలంలో సాయంత్రం 4 గంటల నుంచి హరి నామ సంకీర్తన, 6 గంటలకు సంధ్యా హారతి, 6.30 గంటలకు భగవద్గీత ప్రసంగం ఉంటుందని తెలిపారు.

పగలూ వెలుగులే..

హిరమండలం మేజరు పంచాయతీలో హిరమండలం, పాత హిరమండలం, చిన్నకోరాడ, పెద్దకోరాడ పాటు పలు గ్రామాల్లో విద్యుద్దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథాతో పాటు బిల్లుల భారం పంచాయతీపై పడుతోందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. త్రీఫేజ్ లైన్ లేకపోవడంతో సమస్య నెలకొందని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సాయిప్రసాద్ అన్నారు.
– న్యూస్‌టుడే, హిరమండలం

నిర్లక్ష్యం వీడండి..

ఎంబరాం కూడలి సమీపంలో ఏబీ రహదారిపై చెత్త దర్శనమిస్తోంది. అప్పుడప్పుడు ఇక్కడ మంటలు వ్యాపిస్తున్నాయని, దగ్గరలో నియంత్రిక ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని సమీప దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి పక్కనే ఉన్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి జయమోహన్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఎల్.ఎన్.పేట

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

సారవకోట నుంచి గోపాలపురం, బద్రి మీదుగా బుడితి 7 కి.మీ. ఈ మార్గంలో ప్రమాదకర మలుపులు 10 ఉన్నాయి. అక్కివలస, అగదల గ్రామాల వద్ద ఉన్న 4 మలుపుల వద్ద పనికిరాని మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ర.భ.శాఖ ఏఈ సరోజ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, సారవకోట

కల్వర్టు కుంగింది..

పెద్దతామరాపల్లి బీసీ కాలనీలో ఉన్న కాలువపై కల్వర్టు సరిగా వేయకపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై చిన్నతామరాపల్లి, కర్లపూడి, పోతులూరు తదితర గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. పొరపాటున వాహనం కాలువలో పడితే ప్రమాదం పొంచేసుకుంటుందని ఆందోళన చెందుతున్నారు. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని పీఆర్ ఏఈ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, నందిగాం

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి మండా పోలం కాలనీలో క్యాన్సర్‌తో బాధపడుతున్న కాకినాడ రోజాకు పూర్వ విద్యార్థులు రూ.52 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. వారందరూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994- 95లో ఆమెతో కలిసి చదువుకున్నారు.

గ్రూప్-2 విజేతలకు సత్కారం

పోలాకి, న్యూస్‌టుడే: గ్రూప్-2లో విజయం సాధించిన దీర్ఘాశి సచివాలయ కార్యదర్శి బాడాన జగదీశ్, గంగివలస పంచాయతీ కార్యదర్శి కె.రమేష్‌లను మండల జడ్పీటీసీ సభ్యుడు కృష్ణచైతన్య సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారాపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పారాపురంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. నివగాం ఆయుర్వేద వైద్యాధికారి చైతన్య సుందర్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి),న్యూస్‌టుడే: కేజీబీవీ వంట నిర్వాహకులు బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వండాలని పది పరీక్షల ప్రత్యేకాధికారి, మండల పరిషత్తు పాలనాధికారి కిల్లారి నారాయణరావు సూచించారు. స్థానిక కేజీబీవీని ఆయన సందర్శించారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో మార్చి 13న నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రెవెన్యూ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

ఉపాధి పనులపై సమావేశం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలో జరిగిన పనులకు త్వరలో గ్రామ సభలను నిర్వహిస్తామని టెక్కలి క్లస్టర్ ఏపీడీ ఎం.శైలజ అన్నారు. పాతపట్నం కార్యాలయంలో ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను సద్వినియోగపరచుకోండి

మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్రకుమార్

కోటబొమ్మాళి,న్యూస్‌టుడే: గృహ వినియోగదారులకు వర్తించే పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బ్యాంకర్లు, తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీసంస్థ అధికారులు, క్షేత్రసిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఈఈ సురేష్‌కుమార్, ఏఈ కోటేశ్వరరావు, నాయకులు మల్లేశ్వరరావు, వెంకటరావు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

శుభ్రం చేశారు..

స్పందనకు వందనం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపురం సోలారు తాగునీటి పథకం చుట్టూ పేరుకుపోయిన పనికిరాని మొక్కలను, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఇటీవల 'స్పందించండి.. తొలగించండి' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి సర్పంచి కొంచాడ వెంకటరమణ, ఈవోఆర్డీ లక్ష్మణరావు స్పందించి శుభ్రం చేయించారు.

ఒత్తిడికి గురికావొద్దు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఒత్తిడికి గురికాకుండా లక్ష్య సాధనతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి ఉప్పాడ శాంతారావు విద్యార్థులకు సూచించారు. బాడాం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.జగదీశ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెనకబడిన విద్యార్థులపై చూపిన శ్రద్ధ తదితర వివరాలు వివరించి పలు సూచనలు చేశారు.

వైభవంగా గురప్పస్వామి ఉత్సవం

కలివరపుపేటలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక కలివరపుపేటలో గురువారం గురప్పస్వామి ఉత్సవం వైభవంగా ప్రారంభమైంది. వైశ్యరాజు వంశీకుల ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాలకు ఒడిశా తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం పుట్టమట్టిని సేకరించి గురప్పస్వామి ఉత్సవ మూర్తిని రూపొందించి శోభయాత్ర నిర్వహించారు. మహిళలు లలితా పారాయణ, గోవింద నామస్మరణ చేశారు. కమిటీ ప్రతినిధులు వైశ్యరాజు నాగరాజు, వెంకన్న, అప్పలరాజు, వాసుదేవ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మెళియాపుట్టి, పోలాకి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని టెక్కలి డివిజనల్ విద్యుత్తు అధికారి నర్సింహ కుమార్ పేర్కొన్నారు. తిడ్డిమి, చాపర గ్రామీణ, పారిశ్రామిక ఫీడర్ల పరిధిలో సరఫరా ఉండదన్నారు. ★ నరసన్నపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక అరుణా విద్యాలయంలో గురువారం నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు 150కి పైగా ప్రాజెక్టులు తయారుచేశారు. తల్లిదండ్రులు, సమీప పాఠశాలల విద్యార్థులు హాజరై దీనిని తిలకించారు. పాఠశాల డైరెక్టర్ టి.ఆనందరావు, ప్రధానోపాధ్యాయుడు డి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు హేమలత, జి.రవి, జయశ్రీ, శ్రీకాంత్,

తయారుచేసిన ప్రాజెక్టులతో విద్యార్థులు

కైవల్యరథం వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులకు శ్రీకాకుళం నగరానికి చెందిన బామిడిపాటి శ్రీనివాసరావు రూ.8 లక్షల విలువైన కైవల్యరథాన్ని గురువారం అందజేశారు. స్థానిక జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిత్యాన్నపూర్ణ సేవాసంఘ భవనం వద్ద దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, బోయిన నర్సింహమూర్తి, లలిత, చంటి, మల్లేశ్వరరావు, నారాయణమూర్తి, జగదీశ్వరరావు, ఉప్పాడ భాస్కరరావు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

అందించిన వాహనంతో దాత, సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: సంతలక్ష్మీపురం పంచాయతీ పరిధి టక్కోయి గ్రామంలో సవర పోలమ్మ ఆలయ ప్రారంభ మహోత్సవం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చల్లదనం చేశారు.

ధర్మాన్ని కాపాడండి

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ధర్మాన్ని కాపాడాలని సత్సంగకుడు టి.రమణమూర్తి పేర్కొన్నారు. సుమంతాపురం గ్రామంలో గురువారం రాత్రి తితిదే ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత సారాంశాన్ని ఆయన వివరించారు.

9 నుంచి జాతీయస్థాయి కార్యశాల

టెక్కలి, న్యూస్‌టుడే : ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ విభాగం విద్యార్థుల కోసం జాతీయస్థాయి కార్యశాల నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడప్రతులను కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. 'కంప్యూటర్ ఆధారిత అభ్యాసన అనువర్తనాలు' అనే అంశంపై వచ్చే నెల 9 నుంచి అయిదు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

లలితా సహస్రనామ పారాయణం

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం సత్యసాయి మందిరంలో లలితా సహస్రనామ పారాయణం జరిగింది. రాయ్‌పూర్‌కు చెందిన శ్రీవిద్యా ఉపాసకులు, ఆధ్యాత్మికవేత్త పి.అరుణ లలితా పారాయణ ప్రవచనం వినిపించారు. అంతకుముందు జగన్నాథస్వామి ఆలయం నుంచి సత్యసాయి మందిరం వరకు రథంపై ఊరేగింపుగా ఆమెను తీసుకెళ్లారు.

సందడిగా వీడ్కోలు కార్యక్రమం

విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవరుచుకున్న నాడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి శంకరరావు అన్నారు. పెద్దదూగాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కొట్టి అప్పలనాయుడు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, జలుమూరు

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

అధ్వానానికి అద్దం

మండలంలోని డకరవలస-సుభద్రాపురం గ్రామాల మధ్య రహదారి రాళ్లతేలి అధ్వానంగా మారింది. కాలిన డకన వెళ్లలేని పరిస్థితి. వాహనాలు పాడవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేయాలని కోరుతున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ జేఈ కూర్మానాథ రావు వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరైతే సమస్య పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

విద్యార్థి సంఘాల నాయకులపై దాడి హేయం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై ఆర్ఎస్ఎస్ విద్యార్థిసంఘాల నేతలు చేసిన దాడిని వ్యతిరేకిస్తూ గురువారం ఎచ్చెర్లలోని డా. బి.ఆర్.అంబేడ్కర్‌విశ్వవిద్యాలయంలో బీఆర్ఏయూ ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్ఎస్ఎస్‌ని బ్యాన్ చేయాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీడీఎస్‌వో విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతాయన్నారు.

శివాజీకి నివాళి

గార మండలం కళింగపట్నం-మత్స్యలేశంలో..

గార(కళింగపట్నం-మత్స్యలేశం), శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: గార మండలం కళింగపట్నం-మత్స్యలేశంలో గురువారం దుమ్ము సంతోష్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీజనార్దన్ తదితరులు పాల్గొన్నారు. శ్రీబుద్ధా పాఠశాల ఛైర్మన్ యర్రన్న ఆధ్వర్యంలో శివాజీ జయంతి జరిగింది. * శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం - స్మృతివనంలో శివాజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు శివాజీ సేవల్ని కొనియాడారు.

ఎవరికీ చెప్పుకోలేక.. ఆరుబయటకు వెళ్లలేక..!

★ ఆర్ఎస్కేల్లో పాడైన మరుగుదొడ్లు
★ మహిళా ఉద్యోగులకు తప్పని అవస్థలు

–న్యూస్‌టుడే, జి.సిగడాం

రైతు సేవా కేంద్రాల్లో మహిళా ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్లు పాడైపోవడంతో వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడం చాలా కష్టంగా మారింది.

★ ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, లావేరు మండలాల్లో పలు రైతు సేవా కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా లేవు. మరుగుదొడ్లు తలుపులు విరిగిపోవడంతోపాటు నీటి సరఫరా లేక మహిళా ఉద్యోగులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు ఎవరికీ చెప్పుకోలే బాధలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జి.సిగడాం రైతు సేవా కేంద్రంలో తలుపులు విరిగిన మరుగుదొడ్డు

★ జి.సిగడాం మండలంలో 31 పంచాయతీలకు జి.సిగడాం, చంద్రయ్యపేట, సీతంపేట, జగన్నాథవలస, సేతుభీమవరం తదితర గ్రామాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎచ్చెర్ల మండలంలో 26 పంచాయతీలకు సుమారు 14 , లావేరు మండలంలో 33 పంచాయతీలకుగాను 12 ఆర్ఎస్కేల్లో మరుగుదొడ్లు వినియోగించలేని పరిస్థితిలో ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాం. త్వరలో మరుగుదొడ్లు బాగు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.
–శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రణస్థలం

గోదాం కాదండీ.. అంగన్‌వాడీ కేంద్రం

కనిపిస్తున్న చిత్రం ధాన్యం బస్తాలు నిల్వ చేసే గోదాం అనుకుంటే పొరపాటే. నిజానికి అది అంగన్‌వాడీ కేంద్రం. ఇటీవల నూతనంగా నిర్మించారు. తలుపులు, కిటికీలు సక్రమంగా లేవని వినియోగించకుండా వదిలేశారు. దీంతో స్థానికులు సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ఈ అంశంపై బూర్జ ఐసీడీఎస్ పీవో గీత ప్రస్తావించగా భవనం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

కార్యకర్తల కష్టానికి గుర్తింపు

రణస్థలం, న్యూస్‌టుడే : కార్యకర్తల కష్టాన్ని తెదేపా మర్చిపోదని, తగిన గుర్తింపు ఉంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం సాయంత్రం కోష్టలో ప్రజాదర్బారు నిర్వహించి కార్యకర్తలతో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి విజయకేతనం ఎగురవేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

తెరపై ఈనాడు

★ సరస్వతి: **ఫంకీ** ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): **మన శంకరవరప్రసాద్ గారు** ★ సన్ మ్యాక్స్: **హే బల్‌వంత్** ★ మారుతి : **బూకీ** ★ కిన్నెర : **విత్ లవ్** ★ కీర్తన:**అల్ఫా** ★ కీర్తిక: **నవాబ్ కేఫ్** ★ సూర్య : **కపుల్ ఫ్రెండ్లీ**
– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
9502198883
8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: వెంకయ్యపేట-కృష్ణాపురం రహదారి రాళ్లు తేలి, గోతులు ఏర్పడ్డాయి. **హరి, ఆమదాలవలస.** ★: త్వరలోనే కొత్త రహదారి నిర్మిస్తాం. **-జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస**

?: ఎన్టీఆర్ కాలనీకి నీరు రావడం లేదు. **లక్ష్మీ, స్థానికురాలు** ★: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **టి.రవి,మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస**

?: ఇంటింటికి తాగునీటి కుళాయి వేసి రెండేళ్లు అవుతున్నా.. నీటి సరఫరా లేదు. **స్థానికులు, కొల్లివలస** ★: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **-ఎంవీకే నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, బూర్జ**

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

కళ్లల్లోకి ఊక.. రహదారి కానరాక

పొందూరు మండలం తోలాపి గ్రామం నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిలో రైస్ మిల్లులోని ఊక ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మిస్తే సమస్య తీరుతుందని తెలిపారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.
–న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం,

ప్రమాదానికి సంకేతం

పొందూరు మండలంలోని కొంచాడ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం ప్రధాన రహదారిపై కుళాయి లీకై నీరు వృథాగా పోతుంది. నీరు నిలిచిపోవడంతోపాటు మరో వైపు విద్యుత్తు నియంత్రిక ఉండటంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి, చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

మట్టి రహదారే దిక్కు

ఆమదాలవలస బీఆర్ నగర్‌లో నేటికీ మట్టి రహదారే దర్శనమిస్తోంది. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా ప్రతిపాదనలు చేశామని నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

మురుగుతో అవస్థలు

శ్రీకాకుళం గ్రామీణ మండలం నైరా పంచాయతీ చల్లపేటలో రహదారి పక్కన ఉన్న కాలువలో చెత్త పేరుకుపోవడంతో మురుగు కదలడం లేదు. దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రకాష్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

బోరు ఉంది.. దారి లేదు

మండలం ఉప్పినివలసలోని తాగునీటి బోరు నుంచి వాడుక నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో బోరు పరిసరాలు మురుగుతో నిండిపోయింది. దుర్వాసన వస్తున్నా.. నీటి కోసం తప్పడం లేదని స్థానికులు వాపోయారు. ఎంపీడీవో తిరుపతిరావు వివరణ కోరగా సంబంధిత సిబ్బందికి చెప్పి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, బూర్జ

నైపుణ్యాల పెంపునకు ప్రోత్సహించండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు వారి గ్రూపులకు అనుబంధమైన పరిశ్రమలకు సమన్వయం చేసి అధునాతన సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆయా విద్యాసంస్థలు ప్రోత్సహించాలని ఆక్సిలరేటర్ ఓమెగా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంఎస్ఎంఈ కన్సల్టెంట్ డా. కె.వెంకటేష్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచబ్యాంక్ సహకారంతో నిర్వహిస్తున్న ర్యాంప్ (రెయిజింగ్ అండ్ ఎక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర ఫార్మెన్స్) సంస్థ ఆధ్వర్యంలో డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలపై 20 రోజులపాటు నిర్వహించే కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ప్రతి సాంకేతిక విద్యాసంస్థకు ఇంక్యుబేషన్ సెంటర్ అంతర్భాగం కావాలన్నారు.

మాట్లాడుతున్న కన్సల్టెంట్ డా. కె.వెంకటేష్

పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని పారిశుద్ధ్య సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కూర్మారావు ఆదేశించారు. పెద్దపాడు, కళింగ రహదారి తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

శరవేగంగా కల్వర్టు పనులు

ఆమదాలవలస మండలం గోపీనగరం కొత్త రోడ్డు వద్ద కల్వర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సమన్వయంతో పనులు పూర్తి చేస్తున్నారు. వైకాపా హయాంలో కల్వర్టు కూలిపోవడంతో రాకపోకలు అంతరాయంతో పాటు ట్రాఫిక్ ప్రతి రోజు ఉండేది. దీంతో ప్రజలు నరకం చూసేవారు. కల్వర్టు నిర్మాణం పూర్తయితే ఇకపై ఎలాంటి సమస్య ఉండదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం)

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఐసీడీఎస్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని కోరుతూ మార్చి 2న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్లు హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమస్యలను చర్చించారు. బడ్జెట్‌లో కార్పొరేట్లకు భారీ రాయితీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు మాత్రం నిధులు కేటాయించడం లేదన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు

ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యమివ్వండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ప్రజాప్రయోజిత పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలని సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కోరారు. శ్రీకాకుళం నగరంలో రామలక్ష్మణ కూడలి వద్ద గురువారం యాక్సిస్ బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించారు. ప్రజలు ఆర్థికంగా వృద్ధిలోకి రావడానికి బ్యాంకర్ల పాత్ర అత్యంత కీలకమని.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజరు ఎం.శ్రీనివాస్, ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్, వరం షోరూం ఎండీ అంధవరపు ప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ గీతాశ్రీకాంత్, బ్రాంచి మేనేజరు రమేశ్‌కుమార్, క్లస్టర్ హెడ్ భరణి పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం తాళ్లవలస గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని మరమ్మతులకు గురైన గొట్టాలను బాగు చేస్తున్నామని మాజీ సర్పంచి ముప్పిడి మురళీమోహన్ తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకానికి సంబంధించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

సరుబుజ్జిలి, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉచిత కంటి పరీక్షల శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని అన్నారు. సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షలు నిర్వహించారు. 25 మందికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని తెలిపారు. ★ ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస గ్రామంలో జయ సంజీవిని ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. 40 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

ఎమ్మెల్యే శ్రావణికి ధన్యవాదాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్పెషల్ పోలీస్ కానిస్టేబుళ్ల ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి ఎచ్చెర్ల ఒకటో ఐఆర్ బెటాలియన్ స్పెషల్ పోలీసులు ధన్యవాదాలు తెలిపారు. వంద శాతం కన్వర్షన్ ఖాళీలను నేరుగా భర్తీ చేస్తే న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరితగతిన పూర్తి చేయండి

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం దవళపేట గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులను మండల ఇంజినీరింగ్ అధికారిణి లతశ్రీ పరిశీలించారు. వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యార్థికి ఆపన్న హస్తం

లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన మద్దెల శంకర్ కుమారుడు సంజయ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. స్పందించిన బుడుమూరు యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.2.11 లక్షల నగదు సేకరించి కుటుంబ సభ్యులకు అందించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సభ్యులు తెలిపారు. –న్యూస్‌టుడే, లావేరు

హిందీపై పట్టు సాధించండి

పొందూరు: హిందీపై విద్యార్థులు పట్టు సాధించాలని మండల విద్యాశాఖాధికారిణి వాగ్దేవి అన్నారు. పొందూరు ఉన్నత పాఠశాలలో భాషా వారోత్సవాల్లో భాగంగా గురువారం హిందీ భాషకు సంబంధించి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మాతృ భాషతోపాటు జాతీయ భాష హిందీ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు.

కళాశాల ఏర్పాటుకు కమిటీని నియమించండి

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఫీజిబులిటీ కమిటీ ఏర్పాటు చేయాలని కళాశాల విద్యా ప్రాంతీయ డైరెక్టర్ ఎస్.శోభారాణి, ఉన్నత విద్య కమిషనరుకు లేఖ రాసినట్లు సురాజ్య భారత్ కన్వీనరు దుక్క ఆదినారాయణ తెలిపారు. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చింతాడ సంత ఆశీల పాట ఖరారు

ఆశీలు వసూలు పాట నిర్వహిస్తున్న కమిషనర్ టి.రవి

ఆమదాలవలస పట్టణం: ఆమదాలవలస పుర పరిధిలోని చింతాడ వారాంతపు సంత 2026-2027 సంవత్సరానికి ఆశీలు వసూలు పాట బోర బాలాజీకి ఖరారు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.రవి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ ఆశీలు వసూలు పాటను నిర్వహించగా బాలాజీ అత్యధికంగా రూ.7.73 లక్షలకు పాడి దక్కించుకున్నారు.

కృష్ణారావు సేవలు ఎనలేనివి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సంఘ మాజీ అధ్యక్షుడు గంగు కృష్ణారావు సంస్మరణ సభ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు మాట్లాడుతూ కృష్ణారావు సేవలను కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు పాడి సీతంనాయుడు, పీవీ రమణదయాళ్, ఎన్ని సూర్యారావు, వాన కృష్ణచంద్, శిష్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాదరావు

పోలియో నిర్మూలనే ధ్యేయం

ర్యాలీలో పాల్గొన్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పోలియో నిర్మూలనే ధ్యేయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.కల్యాణ చక్రవర్తి అన్నారు. శ్రీకాకుళం నగరంలో గురువారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, రోటరీ క్లబ్ సంయుక్త నిర్వహణలో సమావేశం నిర్వహించారు. నిధుల సేకరణకు ఇచ్ఛాపురం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు బరాటం శ్రీనివాస్, శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు కె.దుర్గారావు, పార్థసారథి, శివశంకర్, ఎంఆర్‌కే దాస్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే విజయం

శ్రీకాకుళం సాంస్కృతికం: జేసీఐ శ్రీకాకుళం ప్రధాన శాఖ ఆధ్వర్యంలో విద్యాధరి కళాశాలలో గురువారం పరీక్ష మంత్రం కార్యక్రమం జరిగింది. జోనల్ అధ్యక్షుడు తమ్మినేని ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జామి భీమశంకరరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధమైతే విజయం తథ్యమని తెలిపారు. మణిశర్మ సాయిసుధీర్, సంతోష్, రమ్య, అంబిక, సురేంద్ర, తిరుపతి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం బాగుండాలి... బోధన నాణ్యంగా ఉండాలి

పొందూరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు రుచికరంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 రాజారావు అన్నారు. పొందూరు మండలం దల్లిపేట ప్రాథమికోన్నత, పుల్లాజీపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించి భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వండాలని సిబ్బందిని ఆదేశించారు. బోధన విషయమై పలు సూచనలు చేశారు.

దల్లిపేట పాఠశాల తరగతిని పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారి రాజారావు

కొబ్బరి తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడి

రణస్థలం, న్యూస్‌టుడే: కొబ్బరిలో తెగుళ్ల నివారణకు రణస్థలం ఉద్యానవన అధికారిణి టి.అమరేశ్వరి సూచనలు చేశారు. గోసాంలో గురువారం రైతులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కొమ్ము పురుగు నివారణకు మొవ్వులో ఇమిడాక్లోరోప్రిడ్ 0.3మి.లీ లీటరు నీటిలో కలిపి కొట్టాలన్నారు. కొబ్బరిలో బోరాన్ లోపానికి ఒక మొక్కకి 100 గ్రాములు బోరాన్ వేసుకోవాలి. ఇలా చేస్తే పిందెలు రాలడం ఆపొచ్చని, దిగుబడి బాగుంటుందన్నారు. అనంతరం టమాటా సాగును పరిశీలించారు.

టమాటా పంట పరిశీలిస్తున్న అధికారిణి అమరేశ్వరి

పొగ రక్కసి.. ఊపిరాడకుండా చేసి..!

● వ్యర్థాలకు నిప్పు
● దెబ్బతింటోన్న ప్రజల ఆరోగ్యం

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

ఆమదాలవలస నియోజకవర్గంలో మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో బహిరంగంగా వ్యర్థాలు కాల్చివేస్తుండటంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. సేకరించిన చెత్తతో పాటు ఆయా వీధుల్లో ఎండిన ఆకులు, చెత్తను పోగు చేసి నిప్పు పెడుతుండటంతో విషవాయువులు గాల్లో కలిసి స్థానికులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

▶ పొందూరు మండలంలో లోలుగు, కృష్ణాపురం, తండ్యాం, బానాం, కోటిపల్లి, మజ్జిలిపేట, గోకర్లపల్లి, గోరింట, కనిమెట్ట, బురిడికంచరాం ఇతర గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలున్నా నిర్వహణకు నోచుకోక చెత్తను కాల్చి నివాసితులు, ప్రయాణికులకు ఊపిరాడకుండా చేస్తున్నారు.

▶ ఆముదాలవలస మండలంలో ఆముదాలవలస పట్టణంతో పాటు రామచంద్రాపురం, పొన్నాంపేట, చిట్టివలస, గాజులకొల్లివలస, వంజంగి, వంజంగిపేట, దూసి, మునగవలస, జొన్నవలసలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

లోలుగులో రోడ్డు పక్కన కాల్చేస్తున్న చెత్త

▶ సరుబుజ్జిలి మండల కేంద్రంతో పాటు రొట్టవలస, కొత్తకోట, పాలవలస, అలమాజీపేట, సింధువాడ, చిన్న కాగితాపల్లి, షలంత్రి, మతలాబుపేట, చిగురువలస, సరుబుజ్జిలిలోనూ ఈ బాధలు తప్పడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. సంపద కేంద్రాలకు వాటిని తరలిస్తే సమస్య తీరుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

▶ బూర్జ మండలంలో పాలవలస, అప్పలపేట, కొల్లివలస, టి.డి.అర్. రాజుపేట, లక్కుపురం తదితర గ్రామాల్లోనూ సమస్య వేధిస్తోంది.

'పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశాం. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా అవగాహన కల్పిస్తున్నాం. చెత్త నుంచి సంపద కేంద్రాలకు నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.' అని నాలుగు మండలాల ఎంపీడీవోలు వాసుదేవరావు, రామ్మోహనరావు, తిరుపతిరావు, పావనిలు తెలిపారు.

నారాయణ సేవా పథకానికి వాహనం బహూకరణ

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నారాయణ సేవా పథకానికి వ్యాపారవేత్త అంధవరపు కేశవరావు సుమారు రూ.2 లక్షల విలువైన వ్యాన్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు భోజనం అందించడానికి వినియోగించాలని కోరారు. సర్వజనాసుపత్రిలో గురువారం సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం కేశవరావును సత్కరించారు. రిమ్స్ సత్యసాయి అన్నపూర్ణ పథకం అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.రమణబాబు, కిల్లాన ఫల్గుణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పప్పల నాగేశ్వరరావు, నరసింహమూర్తి, జి.కృష్ణారావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాసుపత్రిలో అన్నపూర్ణ పథకానికి వాహనం బహూకరించిన దాత కేశవరావును సత్కరిస్తున్న సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు

కారును ఢీకొన్న లారీ

రణస్థలం, న్యూస్‌టుడే : జేఆర్‌పురంలోని పైవంతెన నిర్మాణం జరుగుతున్న సర్వీసు రహదారిలో కారును లారీ ఢీకొనడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం సాయంత్రం ట్రాఫిక్ రద్దీ ఉండగా విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ, ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. కారులో నలుగురు వ్యక్తులు ఉన్నారు. వాహనాలు నెమ్మదిగా రావడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

WANTED
కంపెనీలో పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను, రమణ గారు: 9550309913, శ్రీనివాస్ గారు, గార, మెయిన్ రోడ్: 9704829619

(c) eenadu

కొత్త పార్టీ పెట్టిన పన్రుట్టి రామచంద్రన్

పార్టీ జెండా పరిచయం చేస్తున్న దృశ్యం

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు పన్రుట్టి రామచంద్రన్ కొత్త పార్టీ ప్రారంభించారు. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న ఆయన 'ఎంజీఆర్ అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం' పేరిట కొత్త పార్టీ స్థాపించారు. జెండాను కూడా పరిచయం చేశారు. ఈ కార్యక్రమం చెన్నై నుంగంబాక్కంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పన్రుట్టి రామచంద్రన్ మాట్లాడుతూ... ప్రస్తుత రాజకీయ ప్రపంచం సిద్ధాంత, గుర్తింపు రాజకీయాల మధ్య పోరుగా ఉందని తెలిపారు. పుట్టుక ఆధారంగా ఎవరికీ అవకాశం నిరాకరించకూడదన్నారు. సమాన అవకాశాలు కల్పించేందుకు న్యాయవంతమైన సమాజాన్ని సృష్టించటమే మా పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల గురించి మాట్లాడుతూ... ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ ప్రారంభించలేదని తెలిపారు. ఇది సుదీర్ఘ రాజకీయ ప్రయాణమన్నారు. ఎన్నికలు అందులో ఓ భాగమన్నారు. తమ సిద్ధాంతాలతో ఏకీభవించే వారికి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం గురించి మాట్లాడుతూ.. ఆ అధ్యాయం ముగిసిందని తెలిపారు. ప్రత్యేక వ్యక్తి కోసం రాజకీయ జీవితాన్ని వృథా చేయలేమని తెలిపారు. రాజకీయాలు ప్రజల కోసమని, వ్యక్తుల కోసం కాదన్నారు. ఓపీఎస్ కోసం ప్రాణం ఇవ్వడం కుదురుతుందా? అని, దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. 2026 ఎన్నికల్లో డీఎంకే, విజయ్‌ మధ్యే పోటీ అని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ ప్రారంభోత్సవం 29వ తేదీ కాంచీపురంలో జరగనుంది. ఆ రోజు పార్టీ సిద్ధాంతాలు, ప్రణాళికలు ప్రకటించనున్నారు.

- మేయర్ అభ్యర్థిగా తమిళనాడు మహిళ
- తేని జిల్లా నుంచి వలస వెళ్లిన కుటుంబం

వాషింగ్టన్ ఉన్నతికి కృషి చేస్తా..!

ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజల్లోకి..

'రినీ ఫర్ మేయర్' నినాదం అమెరికాలోని వాషింగ్టన్ డీసీ నగరంలో మారుమోగుతోంది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంటోంది. తమిళనాడు మూలాలున్న మహిళ అక్కడి ప్రజల్లో ఆదరణ పొందడం గొప్ప విషయంగా చర్చించుకుంటున్నారు. ఆమే.. రినీ సంపత్. వాషింగ్టన్‌ను కొత్తగా చూపిస్తానంటూ ప్రచారంలో దూసుకుపోతున్న ఈ మహిళ జీవితంలో పలు ఆశ్చర్యకర విషయాలున్నాయి. **- ఈనాడు-చెన్నై**

రినీ సంపత్ బాల్యం తమిళనాడులోనే సాగింది. అప్పట్లో వారి కుటుంబం తేనిలోనే ఉండేది. బడిలో పాఠాలు ఇక్కడే సాగాయి. తల్లిదండ్రులకు అమెరికాతో సంబంధాలు ఉండటంతో తాత, అమ్మమ్మలు ఆనందించారు. రినీ చక్కటి చదువుకు ఇదోబాట అని చెబుతూ అమెరికాలో స్థిరపడేందుకు ప్రోత్సహించారు. "మా తాత 7వ తరగతి, అమ్మమ్మ ఒకటో తరగతి వరకే చదివారు. విద్యావంతులు కాలేకపోయామనే బాధ వారిలో ఉండేది. అందుకే నన్ను అమెరికా వెళ్లమన్నారు. అక్కడ బాగా చదివి ఉన్నతస్థాయికి రావాలని కోరుకున్నారు. వారు నింపిన స్ఫూర్తి, వారిచ్చిన ప్రోత్సాహమే ఇప్పుడు నన్ను ఎన్నికల్లో పోటీ చేసేలా చేస్తోంది" అంటారు రినీ సంపత్. వారివల్లే తనకు చక్కటి జీవనశైలి అలవడిందని, సామాజిక దృక్పథం ఏర్పడిందని అంటారు. సామాజిక అంశాలపై గళమెత్తుతూ పేరు తెచ్చుకుంటున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాలో చదివిన ఆమె.. విద్యార్థి నేతగా ప్రభావవంతంగా ఎదిగారు. విద్యార్థి సంఘం ఎన్నికల్లో గెలిచి అధ్యక్షురాలయ్యారు. డెలాయిట్, యాక్సెంచర్ కంపెనీల్లో పనిచేశారు. ఆ తర్వాత తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు. 2016లో అమెరికా అధ్యక్షుడి ఎన్నిక ప్రచారంలో వాషింగ్టన్ ఫీల్డ్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. అనంతరం ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఏజెన్సీ ఫెడరల్ కాంట్రాక్టర్‌గా రాణించారు. ప్రజాసేవలు మెరుగుపరచడం, పథకాలు వారికి అందేలా చేయడం, సేవల్లో నాణ్యత పెంచడం, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు తర్ఫీదునివ్వడం లాంటి వాటిలో కీలకంగా వ్యవహరించారు. దీంతో ప్రజలతో ఆమెకు చక్కటి అనుబంధం ఏర్పడింది. సైబర్ సెక్యూరిటీ టూల్స్ నేపథ్యంగా పని చేసే టోరోస్ కంపెనీలో ఫెడరల్ సివిలియన్ డైరెక్టర్‌గా పనిచేస్తూ తాజాగా బయటికొచ్చి.. వాషింగ్టన్ మేయర్‌గా పోటీ చేస్తున్నారు.

రినీ సంపత్

నేను రాజకీయ నాయకురాలిని కాదు

రినీ సంపత్ తన మాటలతో ఆకట్టుకుంటున్నారు. "నేను రాజకీయ నాయకురాలిని కాదు. నాకు ఏ పార్టీ మద్దతు లేదు. కానీ నగరం కోసం అవిశ్రాంతంగా శ్రమించే పట్టుదల ఉంది. ఒక మహిళగా నేను ఆ పనిచేయగలనని గట్టిగా నమ్ముతున్నా. వాషింగ్టన్‌ను ఉన్నతమైన నగరంగా మార్చే సత్తా నాకు ఉంది. అందుకే మేయర్‌గా పోటీ చేస్తున్నా" అని ప్రకటించారు. చక్కటి జీవనశైలిని ప్రజలకు అందిస్తానని భరోసా ఇస్తున్నానని తన ప్రచారానికి అవసరమైన నిధులనూ ఫండ్ రైజింగ్ ద్వారా సేకరిస్తున్నారు. **- రినీ సంపత్**

మేనిఫెస్టో మేటిగా..

కనీస మౌలిక వసతుల కల్పనే తన ఎజెండాగా చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వాషింగ్టన్ నగరంలోని రోడ్లు, పాదబాటలు, సైకిల్‌బాటల్ని ప్రమాదకరహితంగా మారుస్తానని చెబుతున్నారు. తాగునీటి పైపులైన్ వ్యవస్థను గాడిలో పెడతానంటున్నారు. ఇప్పటికే చాలావరకు ధ్వంసమయ్యాయని, వాటిని బాగుచేస్తానని అంటున్నారు. సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన కాల్‌సెంటర్‌ను అందుబాటులోకి తెస్తానని ప్రకటించారు. ప్రతీ సమస్యలోనూ బాధ్యత తీసుకున్న తొలిరోజు నుంచి ఏడాదిలో, తన పదవీకాలంలో ఏమేం చేస్తామనేది వివరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సరకులు, కూరగాయలు, తాజా ఆహార దుకాణాలను ఇళ్లచెంతకే తెస్తానని చెబుతున్నారు. జీవన వ్యయం బాగా తగ్గేలా చూస్తానని వెల్లడిస్తున్నారు. పారిశుద్ధ్యానికి, శుభ్రతకు పెద్దపీట వేస్తానని అంటున్నారు. అనవసర పన్నులు, ఫీజులు తగ్గిస్తానని హామీ ఇస్తున్నారు. తన పనితీరులో పారదర్శకతను తెస్తానని చెబుతున్నారు. ప్రజాపాలనలో కచ్చితమైన ప్రమాణాలు తీసుకొస్తానని ప్రకటించారు.

రాష్ట్ర అప్పులపై సభలో మాటల యుద్ధం

సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర అప్పుల వ్యవహారంపై శాసనసభలో వివాదం చోటుచేసుకుంది. భాజపా శాసనసభా పక్షనేత నయినార్ నాగేంద్రన్ లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రులతో పాటు ముఖ్యమంత్రి స్పందించి దీటుగా సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో గురువారం చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ... ఈ బడ్జెట్‌ను ఎండమావిగా చూస్తున్నామని, ఈ బడ్జెట్‌లో భవిష్యత్తు ప్రణాళికలు ఏమీ లేవని తెలిపారు. డీఎంకే మళ్లీ అధికారంలోకి రాలేదని నిర్ణయించి ఎలాంటి ప్రకటనలు చేయలేదా? అని ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ... ప్రభుత్వ పథకాల గురించే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రూపొందించారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి బడ్జెట్‌ను సమర్పిస్తామని చెప్పారు. మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ... నిధుల కేటాయింపులు, భవిష్యత్తు ప్రణాళికలు గురించి మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ప్రకటిస్తారని తెలిపారు. రాష్ట్ర అప్పుల గురించి నయినార్ నాగేంద్రన్ ప్రశ్నించడంతో మంత్రి వేలు స్పందిస్తూ... డీఎంకే హయాంలో ఎక్కువ రుణాలు తీసుకుంటున్నట్లు చిత్రీకరిస్తున్నారని తెలిపారు. అన్నాడీఎంకే హయాంలో తీసుకున్న రుణాలు ఐదేళ్లలో రూ.1.88 లక్షల కోట్ల వడ్డీ చెల్లించామన్నారు. దీనిని అసలుతో కలిపితే అన్నాడీఎంకే అప్పు మాత్రమే రూ. 6.45 లక్షల కోట్లుగా ఉందని పేర్కొన్నారు. రూ.2.85 లక్షల కోట్లు డీఎంకే మాత్రమే అప్పు తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై హింసాత్మక చర్యలు పెరిగాయని నయినార్ నాగేంద్రన్ ఆరోపించగా ముఖ్యమంత్రి స్పందిస్తూ... మణిపుర్‌ను కూడా కలిపి చెబితే బాగుంటుందని ఎద్దేవా చేశారు. భారతదేశంలో సరిపోల్చితే తమిళనాడు మెరుగ్గా ఉందన్నారు. మ్యాజిక్ తరహాలో మహిళలకు ముఖ్యమంత్రి రూ. 5వేలు ఇచ్చారని, దానికి ఆయన ఇచ్చిన వివరణ వాస్తవ విరుద్ధంగా ఉందని నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. దీనిని శాసనసభ ఎన్నికల దృష్ట్యా అందించిన నగదుగానే పరిగణిస్తున్నామని తెలిపారు. భాజపా, డీఎంకే మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలో వాడివేడీ వాతావరణం చోటుచేసుకుంది.

ఇదేనా ముస్లింలకు రంజాన్ కానుక?: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో వెనుకబడిన ముస్లింలకు 5శాతం రిజర్వేషన్‌ను తొలగించడమే భాజపా ప్రకటించే రంజాన్ కానుకా? అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశ్నించారు. ఆయన తన 'ఎక్స్'లో... ఇటీవల మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ 2014లో వెనుకబడిన ముస్లింలకు 5శాతం రిజర్వేషన్ కల్పించేందుకు నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ఆయన మరణించిన బాధ ఇంకా పలువురి మనసుల్లోంచి తొలగకముందే ఆయన నిర్ణయాన్ని భాజపా ప్రభుత్వం తొలగించిందని పేర్కొన్నారు. ఇదే ముస్లింలకు ఉండే మైనారిటీ భాజపా ప్రకటించే రంజాన్ కానుకా? అని ప్రశ్నించారు. తమిళనాడులోకి ఎన్డీయే రాకూడదని ఇందుకే చెబుతున్నామని, ఒకవేళ వస్తే అందరి రిజర్వేషన్లు గల్లంతేనని తెలిపారు. వారికి అభివృద్ధి రాజకీయాలు తెలియవని, మతోన్మాద కుట్ర రాజకీయాలే తెలుసని ఆరోపించారు. ఇలాంటి విద్వేష ఇంజిన్లు తమిళనాడులో నడిచేందుకు అనుమతించబోమన్నారు.

పార్టీల ఇష్టం మేరకు కూటమి ఏర్పాటు

ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: కూటమి ఏర్పాటు అనేది ఆయా పార్టీల ఇష్టమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ గురువారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి డీఎంకే కూటమిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఎడప్పాడి పళనిసామిని విలేకర్లు ప్రశ్నించగా. . కూటమి ఏర్పాటు అనేది ఆయా పార్టీల ఇష్టమని పేర్కొన్నారు.

కెప్టెన్ ఆత్మ క్షమించదు: ఖుష్బూ

సైదాపేట: ప్రేమలత డీఎంకే కూటమిలో చేరడాన్ని కెప్టెన్ విజయకాంత్ ఆత్మ క్షమించదని భాజపా నాయకురాలు ఖుష్బూ విమర్శించారు. ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. . విజయకాంత్ ప్రాణంతో ఉన్నంత వరకు అరివాలయంలోకి వెళ్లలేదన్నారు. ఎవరైనా పిలుస్తారని వేచి చూసి వేరే మార్గం లేదని ప్రేమలత డీఎంకే కూటమిలో చేరారని పేర్కొన్నారు. డీఎంకేకు ఈసారి ఓటమి తప్పదని తెలిసి ఎవరు వచ్చినా చేర్చుకుని గట్టెక్కాలని ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్‌కు సిగ్గు అనేది ఉంటే డీఎంకే కూటమి నుంచి వైదొలగాలని, అయితే వారికి అది లేదని ఎద్దేవా చేశారు.

అందుకే టీవీకేతో పొత్తుకు ఎవరూ ముందుకు రాలేదు: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే కొత్త పార్టీ కావడంతోనే దానితో కూటమి ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కో-ఆర్డినేటరు సీమాన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీట్‌ను రద్దు చేయాల్సిన బాధ్యత, కర్తవ్యం డీఎంకేకే ఉందన్నారు. నీట్‌ను కాంగ్రెస్ తీసుకురాగా దానిని భాజపా అమలు చేసిందని, అలాంటప్పుడు ఆ పార్టీలతో డీఎంకే, అన్నాడీఎంకేలు ఎందుకు కూటమి ఏర్పాటు చేశాయని ప్రశ్నించారు. నీట్ వ్యవహారంలో భాజపా వైఖరిని ఎడప్పాడి పళనిసామి వెల్లడించగలరా? అని ప్రశ్నించారు. ఎన్నికల నేపథ్యంలో మహిళల ఖాతాల్లో డీఎంకే ప్రభుత్వం రూ.5వేలు వేసిందని, తాను అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని నిర్మూలిస్తానని తెలిపారు. రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పు ఉన్న నేపథ్యంలో ప్రయోజనకరమైన పథకాలను డీఎంకే ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ద్రావిడం, జాతీయం ఒకటి కాదన్నారు. విజయ్ కొత్తగా పార్టీని ప్రారంభించడం వల్లే ఆయన్ను నమ్మి ఎవరూ కూటమి ఏర్పాటుకు ముందుకు రావడంలేదని తెలిపారు.

వ్యతిరేకులు, ద్రోహులను నిర్మూలిద్దాం: శశికళ

సైదాపేట, న్యూస్‌టుడే: వ్యతిరేకులను, ద్రోహులను నిర్మూలిద్దామని జయలలిత నెచ్చెలి శశికళ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి మద్దతుదారులకు ఆమె లేఖ రాశారు. జయలలిత జయంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 24న రామనాథపురం పసుంపొన్‌లో శశికళ తరఫున భారీ సభ జరగనుంది. ఇందులో కొత్త పార్టీ ప్రకటన చేయనున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పసుంపొన్ సభలో మద్దతుదారులు అందరూ పాల్గొనాలని శశికళ పిలుపునిచ్చారు. అందరం ఐక్యంగా శత్రువులను, ద్రోహులను నిర్మూలిద్దామని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో 2.50లక్షల ఏళ్లనాటి

మానవ ఆవాసాల గుర్తింపు

ఆవాసాలను గుర్తించిన ప్రదేశంలో పూర్వ విద్యార్థి సుదర్శన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మద్రాసు విశ్వవిద్యాలయంలో చదివిన పురావస్తుశాఖ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా దిగువపట్నంలో 2.50 లక్షల ఏళ్లనాటి మానవ నివాస ప్రాంతాన్ని కనుగొన్నారు. దీని గురించి మద్రాసు వర్సిటీ పూర్వ విద్యార్థి సుదర్శన్ మాట్లాడుతూ... తాను వర్సిటీలో చివరి సంవత్సరం చదువుతున్నప్పుడు తోటి విద్యార్థులతో కలిసి విభాగాధిపతి సౌందరరాజన్ సలహా మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న పర్వత ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశోధనలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో 2.50లక్షల ఏళ్ల క్రితం మానవులు ఉపయోగించిన పనిముట్లను కనుగొన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాతిపై చెక్కిన చిత్రాలు, 10కిపైగా గుహ నివాసాలను గుర్తించామని, పెన్నా నది ఒడ్డున వివిధ కాలాలకు చెందిన అనేక రకాల రాళ్లతో తయారు చేసిన చేతి గొడ్డళ్లు బయటపడ్డాయని తెలిపారు. తలకు కండువాలు ధరించిన మానవుల బొమ్మలు, నృత్య భంగిమలు, వివిధ జంతువుల బొమ్మలు, వ్యవసాయం, వేట చిత్రాలు రాళ్లపై చిత్రించారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే ఇంకా అరుదైన సమాచారం దొరుకుతుందని వివరించారు.

స్థూల వ్యర్థాల ఉత్పత్తిదారులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

చెన్నై, న్యూస్‌టుడే: భారీ పరిమాణంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసేవారికి చెన్నై మహానగర పాలక సంస్థ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జీసీసీ వెల్లడించింది. తన ప్రకటనలో... ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026 మేరకు 20వేల చదరపు మీటర్లు లేదా దానికి మించిన వైశాల్యంలోని భవనం లేక ప్రతిరోజు 40వేల లీటర్లు లేక అంతకు మించిన నీటి వినియోగం, లేక ప్రతిరోజు 100 కిలోలు లేదా అంతకు మించిన ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసేవారిని స్థూల వ్యర్థాల ఉత్పత్తిదారులు (బీడబ్ల్యూజీ)గా పరిగణించనున్నట్లు తెలిపింది. ఈ వర్గీకరణలోకి వాణిజ్య సంస్థలు, నివాస సంఘాలు/సొసైటీలు, హోటళ్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, ఐటీ పార్కులు, కల్యాణ మండపాలు, వాణిజ్య ప్రాంగణాలు, మార్కెట్లు, పరిశ్రమలు, భారీ సంస్థలు వస్తాయని వెల్లడించింది. స్థూల వ్యర్థాల ఉత్పత్తిదారులు జీసీసీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని, ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు అర్హులైన అందరూ నమోదు చేయాలని తెలిపింది. నిర్ణీత కాలంలోగా నమోదు చేయనివారికి ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026 మేరకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించింది. మరిన్ని వివరాలను జీసీసీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించి తెలుసుకోవాలని సూచించింది.

తిరుపత్తూరు జిల్లా పక్షిగా ఇండియన్ గ్రే ప్యారెట్

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా యంత్రాంగం, అటవీశాఖ, పర్యావరణ కార్యకర్తలు సంయుక్తంగా జిల్లా గుర్తింపుగా ఓ ప్రత్యేకమైన పక్షిని ఎంపిక చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లా సరిహద్దుల్లోని ప్రాంతాల్లో అరుదుగా కనిపించే 7 పక్షుల జాతులను గుర్తించి ఎంపిక చేశారు. వాటిలో ఇండియన్ గ్రే ప్యారెట్, రాక్ ఈగల్, బ్లాక్ బ్యాక్డ్ హాక్, లాంగ్ లెగ్డ్ బజార్డ్, లెస్సర్ స్ట్రైక్, రెడ్ బ్యాక్డ్ గ్రెబ్, వైట్ బ్యాక్డ్ గ్రెబ్ పక్షులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. గత నెల రోజులుగా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 1,53,386 ఓట్లు నమోదయ్యాయి. వాటి ఆధారంగా ఇండియన్ గ్రే ప్యారెట్‌ను జిల్లా పక్షిగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో తిరుపత్తూరు ప్యూర్ హార్ట్ కళాశాలలో ప్రకటన కార్యక్రమం గురువారం జిల్లా రెవెన్యూశాఖ అధికారి నారాయణన్ అధ్యక్షతన ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఇండియన్ గ్రే ప్యారెట్‌ను తిరుపత్తూరు జిల్లా పక్షిగా నారాయణన్ ప్రకటించారు.

23 నుంచి పదో తరగతి ప్రాక్టికల్ పరీక్షలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర పాఠ్యాంశాల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించేందుకు పనులు వేగంగా జరపాలని ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్.. జిల్లా ప్రాథమిక విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకుగాను రెండు గంటల సమయం, 25 మార్కులు కేటాయించారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షల నుంచి మినహాయింపు ఇవ్వవచ్చని, హాజరుకాని విద్యార్థుల వివరాలను పంపాలని, వేరే పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను పర్యవేక్షకులుగా నియమించాలని సూచించారు. ప్రాక్టికల్స్ ముగిసిన తర్వాత మార్కుల జాబితాను మార్చి 2వ తేదీలోగా తమకు పంపించాలని పేర్కొన్నారు.

కొత్త ప్రదర్శన హాలు ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు ఉన్నత విద్యాశాఖ కింద పని చేసే పునరుద్ధరించిన తమిళనాడు ఆర్కైవ్స్ విభాగ పాత కార్యాలయ భవనం, రూ.15 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన ప్రదర్శన హాలును ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గురువారం ప్రారంభించారు. ఈ ఆర్కైవ్‌లో భద్రపరిచిన 100ఏళ్ల నాటి అరుదైన పత్రాలను జపనీస్ టిష్యూ పద్ధతిలో పునరుద్ధరించి భద్రపరిచే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు శేఖర్ బాబు, కోవి చెళియన్, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పురావస్తుశాఖ భవనం, ప్రదర్శన హాలు ప్రారంభిస్తున్న ఉదయనిధి స్టాలిన్

కచ్చతీవు ఆలయ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం



చెన్నై, న్యూస్‌టుడే: కచ్చతీవులోని అంథోని ఆలయ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రామేశ్వరం నుంచి 22 నాటికల్ మైళ్ల దూరంలోని గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లో భారత్-శ్రీలంక సరిహద్దుల్లో నెలకొన్న కచ్చతీవును 1974లో శ్రీలంకకు భారత దేశం అప్పగించింది. ఇక్కడి సెయింట్ అంథోని చర్చిలో ఏటా ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చి తొలి వారంలో రెండు రోజుల పాటు జరిగే వేడుకలకు ఇరు దేశాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహణతో ఆలయ వేడుకలు ప్రారంభమై రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ వేడుకలకు రామేశ్వరం నుంచి 85 మరబోట్లు, 24 నాటు పడవల్లో 4వేల మంది హాజరుకానున్నారు. దీంతో కచ్చతీవులో బోట్లను నిలిపే ఏర్పాట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు వంటి వసతులను కల్పిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వైద్య ఉపకరణాలతో కూడిన తాత్కాలిక ఆస్పత్రినీ ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని వాహనాలకు రూ.25వేల జరిమానా

చెన్నై, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించని వాహనాలకు రూ.25వేల తక్షణ జరిమానా విధించనున్నట్లు చెన్నై మహానగర పాలక సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో... మహానగరంలో పెరుగుతున్న గాలి కాలుష్యాన్ని నియంత్రించడానికి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి 'క్లీన్ అండ్ సేఫ్ కన్‌స్ట్రక్షన్ గైడ్‌లైన్స్ 2025'ను జీసీసీ అమలు చేసిందని తెలిపింది. ఆ మేరకు నిర్మాణ వస్తువులు, నిర్మాణ వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు నిబంధనలను పాటించడాన్ని తప్పనిసరి చేసినట్లు పేర్కొంది. గాలిలో కలిసే సూక్ష్మరేణువులను తగ్గించే ఉద్దేశంతో నిబంధనలను అతిక్రమించే వాహనాలపై చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. టార్పాలిన్‌తో సక్రమంగా మూయకుండా నిర్మాణ వస్తువులను తీసుకెళ్లే, రోడ్లపై అవి చెల్లాచెదురయ్యేలా తీసుకెళ్లే, నిర్ణీత భారం కన్నా ఎక్కువగా తీసుకెళ్లే వాహనాలను వెంటనే స్వాధీనం చేసుకుని రూ.25 వేల తక్షణ జరిమానా విధించనున్నట్లు హెచ్చరించింది.

'జోహోర్'లో సీవోఈ-ఏఏఐ కేంద్ర స్థాపన

☛ సిద్ధమవుతున్న 'ఐఐటీ ఎం'

వడపళని, న్యూస్‌టుడే: మలేసియా దేశంలోని జోహోర్ రాష్ట్రంలో 'జోహోర్ కార్పొరేషన్(జేకార్ప్)'తో కలిసి ఐఐటీ మద్రాస్ గ్లోబల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఐఐటీఎం గ్లోబల్) ఆ రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ అప్లైడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(సీవోఈ-ఏఏఐ) కేంద్రాన్ని స్థాపించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకుగాను ఇరు సంస్థల మధ్య ఇటీవల ఒప్పందాలు కూడా జరిగాయని ఐఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. బాధ్యతాయుతమైన ఆవిష్కరణ, ప్రతిభ, అభివృద్ధి, దీర్ఘకాలిక విలువలను ప్రోత్సహించేటప్పుడు అధునాతన 'ఏఐ' సామర్థ్యాలను ఆచరణాత్మక పరిశ్రమ అనువర్తనాలుగా మార్చేందుకు ఈ కేంద్రం వేదికగా ఉండనుందని తెలిపింది. ఈ నెల ప్రారంభంలో ప్రధాని నరేంద్ర మోదీ మలేసియాను సందర్శించిన తర్వాత మలేసియాలోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో కౌలాలంపూర్‌లో జరిగిన 'ప్రి-ఏఐ' సదస్సులో అవగాహన ఒప్పందం జరిగిందని పేర్కొంది. ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి మలేసియాలోని భారత హైకమిషనర్ బీఎన్ రెడ్డి మాట్లాడుతూ... ఇరు దేశాల పరిశ్రమల భాగస్వామ్యంతో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ టాలెంట్, ఏఐ కింద సహకారాన్ని పెంచడానికి కేంద్రం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జోహోర్ రాష్ట్రాన్ని ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్‌గా మార్చడానికి, కొత్తగా వృద్ధిలోకి వస్తున్న రంగాలను ప్రోత్సహించడానికి ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వ పర్యావరణ వ్యవస్థలను నిర్మించాలన్నదే తమ లక్ష్యమని జోహోర్ కార్పొరేషన్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ అహ్మద్ యుస్రీ మొహమ్మద్ పేర్కొన్నారు. అవగాహన ఒప్పందం ద్వారా ప్రపంచ ఆవిష్కరణల భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి వీలవుతుందని ఐఐటీఎం గ్లోబల్ సీఈవో తిరుమలై మాధవ నారాయణన్ పేర్కొన్నారు.

విజయ్‌కు దివ్యా సత్యరాజ్ సవాల్

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు, ఆ పార్టీ కార్యకర్తలకు నటుడు సత్యరాజ్ కుమార్తె, డీఎంకే ఐటీ విభాగం రాష్ట్ర ఉపకార్యదర్శి దివ్యా సత్యరాజ్ బహిరంగ సవాల్ విసిరారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ... ప్రజలకు ఏం చేయాలనే అవగాహన టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు లేదన్నారు. అలాంటి వ్యక్తిని నమ్ముకుని ప్రజలు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. 3 రోజుల్లోపు విజయ్‌తో కలిసి ఫొటో దిగి దానిని తన ఇన్‌స్టా పేజీకి షేర్ చేయగలరా? అని టీవీకే కార్యకర్తలకు సవాల్ విసిరారు. కాగితం చూసి చదవకుండా పార్టీలోని 10 మంది కార్యకర్తల పేర్లను చెప్పగలరా? అంటూ విజయ్‌కూ సవాల్ విసిరారు. పార్టీ నాయకుడంటే కార్యకర్తలు తెలిసి ఉండాలన్నారు.

చెన్నైలో ఆటోమోటివ్ కాంపిటెన్సీ సెంటర్

☛ ప్రారంభించిన 'బిట్స్ పిలానీ'

కార్యక్రమంలో ఆచార్యులు పరమేశ్ చిదంబరం, పీబీ వెంకటరామన్, వి.రామగోపాల్ రావు, జి.సుందర్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: బిట్స్ పిలానీ.. 'వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్(డబ్ల్యూఐఎల్పీ)'లో భాగంగా చెన్నైలో 'ఆటోమోటివ్ కాంపిటెన్సీ సెంటర్(ఏసీసీ)'ను గురువారం ప్రారంభించింది. పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఆటోమోటివ్, మొబిలిటీ సిస్టమ్‌లలో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి కేంద్రం ఏర్పాటైంది. ఈ కేంద్రం ఎంఎస్ఎంఈల సమస్యల పరిష్కారాలకు, ఇంజినీర్ల అభివృద్ధికి ఉపయోగకరంగా ఉండనుంది. బిట్స్ పిలానీ గ్రూప్ ఉపకులపతి, ఆచార్యులు వి.రాంగోపాల్ రావు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. బిట్స్ పిలానీ డబ్ల్యూఐఎల్పీలో విద్యాపరమైన దృఢత్వానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికి కావలసిన వాతావరణాన్ని సృష్టించాలన్నదే తమ ఆలోచన అని తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ డబ్ల్యూఐఎల్పీ డివిజన్ డైరెక్టర్ ఆచార్యులు జి.సుందర్, డబ్ల్యూఐఎల్పీ ఆచార్యులు పీబీ వెంకటరామన్, మహీంద్రా అండ్ మహీంద్రా టెక్నాలజీ ఇన్నోవేషన్ ఉపాధ్యక్షుడు శంకర్ వేణుగోపాల్, టాటా మోటార్స్ కేపబిలిటీ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ హెడ్ మార్సెల్ ఫెర్నాండెజ్, కోర్ ఇంజినీరింగ్ విభాగ హెడ్, ఆచార్యులు పరమేశ్ చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

అటానమస్ వెహికల్

(c) eenadu

రంజాన్ వేళలు

ఇఫ్తార్: శుక్రవారం(సా) 6.19
సహర్: శనివారం(ఉ) 5.05

రైల్వే స్టేషన్ లిఫ్ట్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

లిఫ్ట్‌లో చిక్కుకున్నవారిని బయటకు తీసుకొస్తున్న దృశ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మైలాపూర్ ముండగకణ్ణి అమ్మన్ కోయిల్ సబర్బన్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపైకి వెళ్లేందుకు వీలుగా లిఫ్ట్ సౌకర్యం ఉంది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి స్టేషన్‌కు వచ్చిన కొందరు మహిళా ప్రయాణికులు లిఫ్ట్‌లోకి ఎక్కారు. సాంకేతిక సమస్యతో లిఫ్ట్ మధ్యలో ఆగిపోయింది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని లిఫ్ట్‌లో ఉన్నవారిని ఒక్కొక్కరిగా బయటకు తీశారు.

'పద్మశ్రీ' గ్రహీతల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలు

వడివేల్, మాసి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పద్మశ్రీ అవార్డులు పొందిన చెంగల్పట్టు జిల్లాకు చెందిన ఇద్దరు పాములు పట్టుకునే వృత్తుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. చెంగల్పట్టు జిల్లా తిరుక్కళుకుండ్రం సమీపం సెన్నేరి గ్రామంలో ఇరులర్ గిరిజన వర్గానికి చెందిన పాములు పట్టే వడివేల్, మాసి అనే వ్యక్తులు జంతువుల సంరక్షణ విభాగంలో పద్మశ్రీ అవార్డులు పొందారు. ప్రమాదకరమైన, విషపూరితమైన పాములను పట్టుకోవడంలో ఇద్దరు నైపుణ్యం ఉన్నవారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు వెళ్లి ప్రాణాంతకమైన విషపూరితమైన పాములను పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వడివేల్ కుమారుడు సురేష్, మాసి కుమారుడు తంగరాసుకు వారి విద్యార్హతల మేరకు వండలూర్ వద్ద ఉన్న కుమిలి ప్రభుత్వ ఏకలవ్య మోడల్ బోర్డింగ్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో తోటమాలి, రాత్రి కాపలాదారుడిగా నియమించింది. ఇందుకుగాను ఉద్యోగ ఉత్తర్వులను కలెక్టర్ స్నేహ బుధవారం వారికి అందజేశారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వడపళని, న్యూస్‌టుడే: పైపు లైన్ మరమ్మతుల కారణంగా చెన్నైలోని తిరువొత్తియూర్, మనలి ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10 నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనుందని మెట్రోవాటర్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. తిరువొత్తియూర్ జోన్‌లోని ఎర్నావూర్, రాజా షణ్ముగ నగర్, కార్గిల్ నగర్, మనలి జోన్‌లో మనలి పుదునగర్, సత్యమూర్తి నగర్, సడయాన్‌కుప్పం, ఆండార్‌కుప్పం, ద్వారకా నగర్, మనలి, మాతూర్ పరిసరాల్లో నీటి సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

రేపు ఐఐటీఎంలో నూతన కోర్సు ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్.. 'బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ డేటా సైన్స్' కోర్సును శనివారం ప్రారంభించనుంది. ఐఐటీ ప్రాంగణంలోని ఐసీఎస్ఆర్ హాలులో ఆ రోజు ఉదయం 11.30 గంటలకు జరిగే కార్యక్రమానికి 'ఫోర్డ్ మోటార్ కంపెనీ 'ఇండియా సైట్ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ గంగాప్రియ చక్రవర్తి ముఖ్య అతిథిగా, సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రాజీవ్ సి.లోచన్ గౌరవ అతిథిగా పాల్గొంటున్నారు. కార్యక్రమం ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి సమక్షంలో జరుగుతుందని ఐఐటీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది.

బుట్టల తయారీ వృత్తికి వెదురు దెబ్బ

ఉపాధి లేక కార్మికుల అవస్థ

- న్యూస్‌టుడే, విల్లివాక్కం

ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడం, వెదురు చెట్ల కొరత కారణంగా వెదురు బుట్టల తయారీ వృత్తి కనుమరుగవుతోంది. దానిని నమ్ముకున్న కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. కృష్ణగిరి జిల్లా హోసూర్, తేన్‌కనికోట్టై కొండ గ్రామాల్లో వెదురు చెట్ల ఆధారంగా వివిధ రకాల వస్తువులు ఉత్పత్తి చేసి చాలా కుటుంబాలు బతుకీడుస్తున్నాయి. వీరు ఈరోడ్, సత్యమంగళం, కేరళ నుంచి దళారుల ద్వారా వెదురు కర్రలు కొనుగోలు చేస్తున్నారు. ఈ వెదురుతో గంపలు, చాటలు, కోళ్ల గంపలు, పూజ సామగ్రి తీసుకెళ్లే బుట్టలు, కుర్చీలు, ఊయలలు, గృహాలంకరణ వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఉపయోగం పెరిగి వెదురు వస్తువులవినియోగం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో వెదురు చెట్లు దొరకడంలో పలు సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల దళారుల ద్వారా అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఓ దశలో తమ వద్ద కర్రలు ఉంచుకుంటే పోలీసులు, అటవీశాఖ వారు తమపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దీంతో పలువురు ప్రత్యామ్నాయ వృత్తికి మారారని ఆవేదన వ్యక్తం చేశారు. హోసూర్ ప్రాంతంలో 100కు పైగా కుటుంబాలు ఈ వృత్తిలో ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం 20 కుటుంబాలు మాత్రమే వదలుకోలేక నెట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి ఉందని వాపోయారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకం

దీని గురించి కొందరు కార్మికులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కుటుంబాలు తరతరాలుగా ఈ వృత్తిలో ఉన్నట్లు తెలిపారు. నాగరికత మార్పు కారణంగా ప్లాస్టిక్ వస్తువుల

కొన్ని చోట్ల చెట్లు వృథా

విదేశాల్లో వెదురుతో చేసిన వస్తువులకు మంచి ఆదరణ ఉంది. హోసూర్ అటవీ సర్కిల్ పరిధిలోని తేన్‌కనికోట్టై, అంచెట్టి, ఉరిగం తదితర ప్రాంతాలలో వేలాది ఎకరాల్లో వెదురు అడవులున్నాయి. ఇక్కడి చెట్లు ఎండిపోయి వృథా అవుతున్నాయి. అంతేకాకుండా వేసవిలో ఎండిన చెట్లు ఒకదానికొకటి రాసుకుని కార్చిచ్చు ఏర్పడుతోంది. అటవీశాఖవారు ఎండిన చెట్లను తమకు తక్కువ ధరకు విక్రయిస్తే వృత్తిని కొనసాగించవచ్చని కోరారు. తద్వారా తమ జీవనాధారం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ వృత్తిలో ఉన్న కార్మికులకు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి రుణాలు అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జాలర్లను తీసుకురావడానికి చర్యలు చేపట్టండి

● కేంద్రానికి స్టాలిన్ లేఖ

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీలంకలో చిక్కుకున్న రాష్ట్ర జాలర్లను మాతృదేశానికి తీసుకొచ్చేందుకు దౌత్యపరమైన చర్యలను వెంటనే చేపట్టాలని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఈ మేరకు గురువారం రాసిన లేఖలో.. సముద్రంలో చేపలు పట్టేందుకు 18న రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి 3 బోట్లలో 18 మంది జాలర్లు, మండపం ఫిషింగ్ హార్బర్ నుంచి ఓ బోటులో నలుగురు జాలర్లు వెళ్లగా వారిని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిందని తెలిపారు. నేటి పరిస్థితి మేరకు 104 మంది జాలర్లు, 258 ఫిషింగ్ బోట్లు శ్రీలంక అదుపులో ఉన్నాయన్నారు. ఈ నెల తొలి వారంలో జాఫ్నా కోర్టు విడుదల చేసిన 12 మంది జాలర్లు మాతృదేశానికి తిరిగి రావడంలో ఆలస్యం ఏర్పడుతోందని తెలిపారు. వారిని మాతృదేశానికి తీసుకొచ్చేందుకు, శ్రీలంక చెరలో ఉన్న భారత జాలర్లను విడిపించడానికి వెంటనే దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

అభిమానం ఓటుగా మారుతుందా?

మాట్లాడుతున్న కార్తి చిదంబరం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విజయ్ అభిమానుల సమూహం ఓటుగా మారుతుందా? లేదా? ప్రశ్నార్థకమేనని ఎంపీ కార్తి చిదంబరం పేర్కొన్నారు. చెన్నై సమీపం క్రోంపేటలో గురువారం కాంగ్రెస్ పార్టీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ తరఫున డీఎంకేను రాజ్యసభ సీటు అడిగే అవకాశం ఉందన్నారు. చెన్నైలో విజయ్‌కు ఓట్లు అధికంగా రావచ్చని, గ్రామాల్లో తక్కువగానే ఉంటాయన్నారు. ఈ ఎన్నికలు కాస్త కఠినంగానే ఉన్నా ఇండియా కూటమి గెలుస్తుందన్నారు. విజయ్‌కు అభిమానులు ఎక్కువగా ఉన్నా, వారంతా ఓటు బ్యాంకుగా మారుతారా? అనేది ప్రశ్నార్థకమేనని తెలిపారు. చాలా ఏళ్ల కూటమిలో ఉన్నందున చిన్నచిన్న సమస్యలు వస్తాయని, వాటిని పెద్దవిగా చేయనవసరం లేదన్నారు.

బస్సులో మహిళలను దుర్భాషలాడిన కండక్టర్

అతనితోపాటు డ్రైవరు సస్పెన్షన్

బస్సు దిగిన మహిళలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్ డిపో ప్రభుత్వ బస్సు బుధవారం కాంగేయం వచ్చింది. కాంగేయం హాస్టల్ స్టాపు వద్ద కొందరు మహిళలు ఎక్కారు. మెడికల్ కళాశాల స్టాపులో దిగుతామని ఉచిత టికెట్ ఇవ్వాలని కండక్టర్‌ను అడిగారు. రెండు స్టాపులే ఉన్నాయని, నడిచి వెళ్లాలని, తాను టికెట్ ఇవ్వనని చెప్పాడు. మధ్యలో ఆపకుండా బస్సును నేరుగా బస్టాండ్‌కు తీసుకెళ్లారు. దీంతో కండక్టర్, మహిళల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వారికి రవాణా సంస్థ అధికారులు, పోలీసులు నచ్చజెప్పారు. ఈ గొడవనంతా అక్కడున్నవారు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి విడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. నగర బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన కండక్టర్, డ్రైవర్‌పై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేశారు. దీంతో తిరుప్పూర్ రవాణా సంస్థ అధికారులు విచారణ జరిపి కండక్టర్, డ్రైవర్‌ని సస్పెండ్ చేశారు. ఘటనపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

'హెచ్ఐటీఎస్'లో బాస్కెట్‌బాల్ పోటీలు

విజేతలతో నిర్వాహకులు

వడపళని, న్యూస్‌టుడే: 35వ డాక్టర్ జేకబ్ వర్గీస్ మెమోరియల్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలు హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని 'ఎయిర్ బర్గర్' బాస్కెట్‌బాల్ క్యాంపస్‌లో ఘనంగా జరిగాయి. డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్, హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటీఎస్) ఆధ్వర్యంలో వర్సిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేసీజీ వర్గీస్ జ్ఞాపకార్థం జరిగిన పోటీలకు 20 వర్సిటీలకు చెందిన పురుషుల, మహిళా బృందాలు పాల్గొన్నాయని హెచ్ఐటీఎస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. కులపతి డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారిని అభినందించారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దక్షిణ రైల్వే చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్, ఇండియన్ ఇంటర్నేష నల్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు రెంజిని పీటర్‌తో పాటు ఇండియన్ బాస్కెట్‌బాల్ జట్టు, ఏషియన్ ఆల్ స్టార్ (1997), మాజీ కెప్టెన్ జయశంకర్ మేనన్, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ వికాస్ మిశ్రా, స్పోర్ట్స్ అడ్వైజర్ అబ్రహం వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు నగదు, ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

ఆవిన్ కార్యాలయంలోని వస్తువుల జప్తు

ప్యారిస్, న్యూస్‌టుడే: కోర్టు ఆదేశాల మేరకు ఆవిన్ కార్యాలయంలోని వస్తువులను జప్తు చేసేందుకు వెళ్లిన కోర్టు సిబ్బంది, ఆవిన్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. మదురై జిల్లా ఆవిన్‌లో 1985 నుంచి పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులను 1996లో పర్మినెంట్ చేయాలని కార్మిక సంక్షేమశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఉత్తర్వులను అమలు చేయడంలో ఆవిన్ నిర్లక్ష్యం వహించడంతో లేబర్ కోర్టులో కేసు దాఖలైంది. అనంతరం శాశ్వత నియామకం పొందిన తేదీ నుంచి ఉద్యోగులకు తగిన వేతనం ఇవ్వాలని, నగదు ప్రయోజనాలు అందించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆవిన్ తరఫున దాఖలైన పిటిషన్లను మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో వెంకటాచలం అనే ఉద్యోగి కోర్టు ఆదేశాల మేరకు నగదు ప్రయోజనాలు పొందిన నేపథ్యంలో కేసు విచారణలో ఉన్నప్పుడు నలుగురు మృతి చెందారు. అనంతరం మిగిలిన 19 మందికి నగదు ప్రయోజనాలు అందించాలని ఉత్తర్వులు జారీ అయినప్పటికీ వాటిని అమలు చేయలేదు. అనంతరం సుమారు రూ.1.25 కోట్ల నగదు ప్రయోజనాలకు బదులుగా ఆవిన్ కార్యాలయంలో ఉన్న వస్తువులను జప్తు చేయాలని మదురై లేబర్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ మేరకు ఆవిన్ కార్యాలయానికి వెళ్లిన కోర్టు సిబ్బందితో ఆవిన్ అధికారులు వాగ్వాదానికి దిగారు. అనంతరం కోర్టు సిబ్బంది 30 కంప్యూటర్లు, ఏసీని జప్తు చేసి వ్యానులో ఎక్కించారు.

వేద విజ్ఞాన వేదిక వార్షికోత్సవం 22న

టీనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీ సేవా సంస్థ 'వేద విజ్ఞాన వేదిక 16వ వార్షికోత్సవం ఈ నెల 22వ తేదీ చెన్నైలో జరగనుంది. చెన్నై టీనగర్ విజయరాఘవ రోడ్‌లోని ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకుల డాక్టర్ వరప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా, కూచిపూడి నృత్య కళాకారిణి ప్రభా రమేష్ విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సంగీత నీరాజనాలు జరుగనున్నట్లు వేద విజ్ఞాన వేదిక సంస్థ కార్యదర్శి కందనూరు మధు, అధ్యక్షుడు జేకే రెడ్డి తెలిపారు. ప్రభా రమేష్ ఆధ్వర్యంలో నిశాల్ ప్రదర్శన, ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి కుమారి భవ్య తూములూరు గాత్ర కచేరీ ఉంటాయని వివరించారు.

బస్టాండులో బిడ్డను వదిలి వెళ్లిన మహిళ

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తేని బస్టాండుకు బుధవారం సాయంత్రం ఏడాది బిడ్డతో ఓ మహిళ వచ్చింది. అక్కడి పూల వ్యాపారితో.. తాను దిండుక్కల్ నుంచి వస్తున్నానని, మరుగుదొడ్డికి వెళ్లి వస్తానని, బిడ్డను కాసేపు చూసుకోవాలని అక్కడ ఉంచి వెళ్లింది. ఎంతసేపయినా ఆమె రాకపోవడంతో పూల వ్యాపారి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని అక్కడి సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

సరైన సమయంలో కూటమిపై విజయ్ ప్రకటన

విలేకరులతో మాట్లాడుతున్న నిర్మల్ కుమార్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సరైన సమయంలో తమ అధ్యక్షుడు విజయ్ కూటమి గురించి ప్రకటిస్తారని టీవీకే జాయింట్ సెక్రటరీ జనరల్ సీటీఆర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. చెన్నై పల్లావరంలో టీవీకే ఎన్నికల ప్రచార వాహనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. డీఎంకే, అన్నాడీఎంకే లాంటి ద్రావిడ పార్టీలు ఆర్థిక బలంతో ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నాయని విమర్శించారు. కానీ టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రజా బలాన్ని మాత్రమే నమ్మి బరిలోకి దిగుతున్నారని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తామనే హామీని విజయ్ ఇచ్చారన్నారు. ఆ హామీని స్వీకరిస్తూ అన్ని వర్గాల ప్రజలు టీవీకేకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార వాహనంలో నటుడు అజిత్‌కుమార్ ఫొటో వాడడం గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అది వ్యక్తిగతంగా ఓ నిర్వాహకుడు కోరారని, ఆయన అజిత్‌కు వీరాభిమాని కావడంతో ఫొటో వాడేందుకు మూడేళ్లుగా అనుమతి కోరారన్నారు. ఆ ప్రకారమే ఇప్పుడు అనుమతించామని చెప్పారు. కార్యకర్తలు, ప్రజలు, నిర్వాహకులు వారికి ఇష్టమైన రీతిలో టీవీకేకు ప్రచారం చేయవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 23న వేలూర్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేశామన్నారు.

రవాణా సంస్థ పింఛనుదారులకు రూ.2446కోట్ల ప్రత్యేక నిధి

అన్నానగర్, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థ పింఛనుదారులకు రూ.2446కోట్ల ప్రత్యేక నిధిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఏప్రిల్ నుంచి 2026 మార్చి 2026 వరకు 6,867 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు. వారికి పీఎఫ్ వంటి నగదు ప్రయోజనాలు కల్పించేందుకు ఈ నిధిని కేటాయించారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్‌లో పునరాభివృద్ధి పనుల కారణంగా ఈ కింద పేర్కొన్న రైలు ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు తాంబరం నుంచి సేవలందిస్తుందని దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

● **22662** రామేశ్వరం-చెన్నై ఎగ్మోర్ సేతు ఎక్స్‌ప్రెస్ 19 నుంచి ఏప్రిల్ 5 వరకు తాంబరానికి 06.35కు వస్తుంది. ● **22661** చెన్నై ఎగ్మోర్-రామేశ్వరం 20 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు తాంబరంలో 18.25 గంటలకు బయలుదేరుతుంది. ● **సబర్బన్‌లు పాక్షికంగా రద్దు...** చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షనులోని సూళ్లూరుపేట యార్డులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా ఈ కింది రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి. ● మూర్ మార్కెట్ కాంప్లెక్స్ (ఎంఎంసీ)-సూళ్లూరుపేట 21న 12.10కి బయలుదేరే రైలు ఎలావూరు వరకు నడుస్తుంది. ● సూళ్లూరుపేట-ఎంఎంసీ 21న 13.15 గంటలకు ఎలావూరు నుంచి బయలుదేరుతుంది.

టీవీకేతో త్వరలో ముఖ్య పార్టీల పొత్తు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: టీవీకేతో త్వరలో ముఖ్య పార్టీలు పొత్తు పెట్టుకోనున్నాయని ఆ పార్టీ సీనియర్ నేత నాంజిల్ సంపత్ వెల్లడించారు. తిరువళ్లూర్ జిల్లా కుండ్రత్తూరులో పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ.. ఓ జాతీయ పార్టీతో పాటు ఇతర పార్టీల నేతలు తమ పార్టీ అధినేత విజయ్‌తో మంతనాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా విజయ్ ఓ మంచి కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

మహిళా ఇన్‌స్పెక్టరుపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆదాయానికి మించి అధికంగా రూ.5.42 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టిన మహిళా ఇన్‌స్పెక్టరుపై అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది. చెన్నై వ్యభిచార నిరోధక విభాగంలో ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి 2017 నుంచి 2025 వరకు ఆదాయానికి మించి అధికంగా రూ.5.42 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది. 1999లో సబ్ ఇన్‌స్పెక్టరుగా విధుల్లో చేరిన రాజ్యలక్ష్మి ఆర్థిక నేర విభాగం, ప్రొహిబిషన్ వింగ్, ట్రాఫిక్ విభాగంలో పని చేశారు. కొన్ని రోజుల క్రితం ఆమె ఇంట్లో అనిశా అధికారులు ఆకస్మిక సోదాలు చేపట్టిన నేపథ్యంలో ప్రస్తుతం ఆమెపై కేసు నమోదు చేశారు.

గృహాల నిర్మాణ పనుల పరిశీలన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై సైదాపేట శాసనసభ నియోజకవర్గం కోట్టూర్‌పురం ప్రాంతంలో రూ.307.24కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 1800 బహుళ అంతస్తుల నివాసాల నిర్మాణ పనులను గురువారం మంత్రులు అన్బరసన్, మా.సుబ్రమణియన్ పరిశీలించారు. అనంతరం అన్బరసన్ మాట్లాడుతూ... మురికివాడల్లో నివసించే ప్రజలు కాంక్రీట్ ఇళ్లలో నివసించాలనే ఉద్దేశంతో స్లమ్ ఏరియా కన్వర్షన్ బోర్డుని 1970లో కలైజ్ఞర్ ప్రారంభించి కోట్టూర్‌పురం ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నివాసాలను నిర్మించి ఇచ్చారన్నారు. ప్రస్తుతం కోట్టూర్‌పురంలో 1800 నివాసాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాయపురంలోని చెట్టితోట్టం ప్రాంతంలో 243 నివాసాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మొత్తంగా చెన్నైలోని 9 ప్రాంతాలలో రూ.696.55కోట్ల వ్యయంతో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల్లోని 4035 నివాసాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.

తమిళనాడు వక్ఫ్ బోర్డుపై మధ్యంతర స్టే ఎత్తివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడు వక్ఫ్ బోర్డుకి మద్రాసు హైకోర్టు విధించిన స్టేని ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తమిళనాడు వక్ఫ్ బోర్డుకి ఛైర్మన్, సభ్యులను తమిళనాడు వెనుకబడిన తరగతులు, మైనారిటీల సంక్షేమశాఖ నియమించింది. కేంద్ర ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌ను సక్రమంగా పాటించకుండా బోర్డు సభ్యులను నియమించారని తెలుపుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన హైకోర్టు.. తమిళనాడు వక్ఫ్ బోర్డు కార్యకలాపాలపై మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ తమిళనాడు వక్ఫ్ బోర్డు తరఫున సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలైంది. ఈ పిటిషన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనంలో గురువారం విచారణకు వచ్చింది. అప్పుడు వక్ఫ్ బోర్డు తరఫున సీనియర్ న్యాయవాది విల్సన్ హాజరై వాదనలు వినిపించారు. బోర్డుకి ఇప్పటివరకు ఎనిమిది మంది సభ్యులను నియమించారని, ముగ్గురిని మాత్రమే నియమించలేదని తెలిపారు. అయితే బోర్డు కార్యకలాపాలు నిలిపేసేందుకు ఇది సరైన కారణం కాదన్నారు. అనంతరం న్యాయమూర్తులు కొత్త కమిటీ నియామకానికి సంబంధించిన సిఫారసులని దాఖలు చేయాలని వక్ఫ్ బోర్డుని ఆదేశించారు. అదేవిధంగా బోర్డుకి మద్రాసు హైకోర్టు విధించిన మధ్యంతర స్టేని ఎత్తివేశారు.

రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడిన ఇద్దరికి శస్త్రచికిత్స విజయవంతం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై రాయపురంలోని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తనాళాల శస్త్రచికిత్సా విభాగం ఉంది. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం చెన్నైకు చెందిన పారిబన్(34) అనేవ్యక్తి రక్తనాళాల్లో నొప్పి రావడంతో చికిత్స కోసం వచ్చారు. ఆయనకు జరిపిన పరీక్షల్లో రక్తనాళం పగిలిపోయి, రక్తం వ్యాపించి, ఎడమ ఊపిరితిత్తిని దెబ్బతీసి ప్రాణాలకు ముప్పు కలిగించే సితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రక్తనాళాల శస్త్రచికిత్సా విభాగాధిపతి డాక్టర్ ఇళంచెరలాథన్ నేతృత్వంలో వైద్యబృందం శస్త్రచికిత్స చేసింది. మూత్రపిండాలకు రక్తప్రసరణ సజావుగా సాగేవిధంగా రక్తనాళ మార్గాన్ని తిరిగి అమర్చారు. అదేవిధంగా స్టంట్ వేసి పర్యవేక్షణలో ఉంచారు. అదేవిధంగా చెన్నైకు చెందిన కుప్పమ్మాల్(45) అనే మహిళకు జలుబు కారణంగా దగ్గినప్పుడు నోటి నుంచి రక్తం రావడంతో స్టాన్లీకి వచ్చారు. ఆమెకు పరీక్షలు చేయగా ఛాతిలో పెద్ద రక్తనాళం పగిలిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆమెకు శస్త్రచికిత్స చేసి స్టంట్ వేశారు. దీని గురించి డాక్టర్ ఇళంచెరలాథన్ మాట్లాడుతూ.. ఈ తరహా శస్త్రచికిత్సలకు రూ.20 నుంచి రూ.30లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ స్టాన్లీలో ముఖ్యమంత్రి బీమా పథకం ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు.

PUBLIC NOTICE

IN THE COURT OF THE III ADDL. DISTRICT & SESSIONS JUDGE :: ONGOLE
IA No.235/2025
In OS No.159/2011

Between:
1.Pittu Nagabhushanam(died)
2.Pittu Gangamma & others
And
Petitioners
1. Jagarlamudi Jagadeesh Krishna Prasad(died)
2. Maddiboina Vanaja and others
Respondents
To
(R3)
Ravi Abhilash, S/o Samuel, Aged 52 years, Hindu, Doctor, r/o Kambar Nagar, 207/5, Chennai, Tamil Nadu State.

It is informed to you that in the above number petition, you are dragging on the matter without receiving the notices sent from the above mentioned court. The Hon'ble Court directed me to publish the petition notice through paper publication and adjourned the matter to 27-02-2026. Hence you are directed to appear before the above Hon'ble Court in person or through your advocate by 10-30 AM on 27-02-2026 for your objections. Otherwise the matter will be disposed in your absence. As per the direction of the Hon'ble Court.

Ongole
Date:02-02-2026
(T.SREELAKSHMMAMMA)
Advocate, Ongole.
Cell No.9490112558.

కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగాలకు ఏర్పాట్లు

● మయిల్‌సామి అన్నాదురై

చంద్రయాన్ నమూనా తిలకిస్తున్న మయిల్‌సామి అన్నాదురై, కలెక్టరు పవన్‌కుమార్ తదితరులు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కులశేఖరపట్టినంలో రాకెట్ల ప్రయోగానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చంద్రయాన్ ప్రాజెక్టు డైరెక్టర్ మయిల్‌సామి అన్నాదురై పేర్కొన్నారు. కోయంబత్తూర్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద గాంధీపురం సిగ్నల్ వద్ద చంద్రయాన్, రోవర్ నమూనాలను ఆయన గురువారం ఆవిష్కరించారు. తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోయంబత్తూర్ జిల్లా విజ్ఞానంలో మంచి స్థానంలో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉపగ్రహ శాస్త్రం తెలుసుకోవడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు భారతదేశం పురోగమించాలని, కులశేఖరపట్టినం తుదపరి కేంద్రంగా ఉండబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై ఫలించిన పరిశోధనలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో పలువురు చిరుధాన్యాల ఆహారంపై ఆసక్తి కనబరుస్తున్నారు. అందువల్ల రైతులు ప్రస్తుతం చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపుతున్నారు. కాగా, జాతీయ స్థాయిలో భారత వ్యవసాయ పరిశోధన సంస్థ, రాష్ట్ర స్థాయి లో తమిళనాడు వ్యవసాయ వర్సిటీ సంయుక్తంగా చిరుధాన్యాలపై చేపడుతున్న పరిశోధనల ఫలితంగా పలు ఉత్తమ రకాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటున్నారు.

కొత్త పెట్రోల్ బంకుల ఏర్పాటులో అవకతవకల కేసు సీబీఐకి బదిలీ

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కొత్త పెట్రోల్ బంక్‌ల ఏర్పాటులో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసుని సీబీఐకి బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకి పోలీసులు నిరభ్యంతర ధ్రువపత్రం ఇవ్వాలి. అయితే కొందరు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తమిళనాడు, పుదుచ్చేరిలో వందకి పైగా ప్రాంతాల్లో కొత్తగా బంక్‌ల ఏర్పాటుకు లైసెన్సులు పొందారు. ఈ మోసం గురించి ఇదివరకే హైకోర్టు ఆదేశాల మేరకు సీబీసీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. అయితే దర్యాప్తు సక్రమంగా జరగలేదని, సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనంలో గురువారం విచారణకు వచ్చింది. అప్పుడు సీబీసీఐడీ తరఫున.. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు చేపట్టి, సక్రమంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కానీ పిటిషనరు అందుకు అభ్యంతరం తెలుపుతూ ఒక్క చెన్నైలోనే నకిలీ నిరభ్యంతర సర్టిఫికెట్ల ద్వారా 72 బంక్‌లను ఏర్పాటు చేశారని, ఈ కేసులో అసలైన నిందితులను పోలీసులు కాపాడేలా వ్యవహరిస్తున్నారని వాదించారు. అన్ని తరపు వాదనలు విన్న న్యాయమూర్తులు.. ఈ కేసుని సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా దిండుగల్, ఈరోడ్ మొదలైన ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి సీబీసీఐడీ చర్యలు చేపట్టింది కావున ఆ ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై సీబీసీఐడీనే దర్యాప్తు కొనసాగించవచ్చని పేర్కొంది.

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. వర్సిటీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించిన తర్వాత ప్రదానం చేశారని వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక నుంచి చెన్నై చేరుకున్న 11మంది జాలర్లు

చెన్నై విమానాశ్రయంలో మత్స్యకారులు

వడపళని, న్యూస్‌టుడే: శ్రీలంక జైలు నుంచి విడుదలైన 11 మంది జాలర్లు గురువారం ఉదయం చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు స్వస్థలాలైన రామనాథపురం, నాగపట్టిణం, మయిలాడుత్తురై జిల్లాలకు ప్రత్యేక వాహనాలలో తరలించారు. 2025 జులై 23న మత్స్యకారులు మర పడవలో సముద్రంపై చేపల వేటకు వెళ్లారు. అప్పుడు సరిహద్దులు దాటి వచ్చారని ఆరోపిస్తూ శ్రీలంక నావికాదళం వారిని అరెస్టు చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ చొరవడతో కేంద్ర ప్రభుత్వం వారిని విడిపించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో శ్రీలంక కోర్టు వారిని విడుదల చేసింది.

తాజాగా 22మంది అరెస్టు

బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో 22 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసి వారి నాలుగు పడవలను స్వాధీనం చేసుకుందని నేషనల్ ఫిషర్‌మెన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీఆర్ సెందిల్‌వేల్ పేర్కొన్నారు. బుధవారం 450కు పైగా పడవలు ధనుష్కోడి, తలైమన్నార్ మధ్య గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లో చేపల వేటలో ఉండగా అక్కడకు వచ్చిన లంక నావికా దళం మూడు పడవలు, 18 మంది జాలర్లను అదుపులోకి తీసుకుందని తెలిపారు. అదేవిధంగా మండపం నుంచి పాల్క్ స్ట్రెయిట లోని నెడుంతీవు వద్ద వేటలో ఉన్న నలుగురు జాలర్లను అరెస్టు చేసి పడవను స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు.

(c) eenadu

నేడు మూడు సినిమాలు రీరిలీజ్

సూదు కవ్వుం

గిల్లి

తునివు

తెరి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ చిత్రసీమలో ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో మరికొన్ని చిత్రాలు రీరిలీజ్‌కు సిద్ధమయ్యాయి. నలన్ కుమారసామి దర్శకత్వంలో విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించి 2013లో విడుదలైన చిత్రం 'సూదు కవ్వుం'. దీనికి రెండో భాగాన్ని 'సూదు కవ్వుం 2-నాడుం నాట్టు మక్కళుక్కుం' పేరిట మిర్చి శివ కథానాయకుడిగా ఎం.ఎస్.అర్జున్ తెరకెక్కించగా 2024లో విడుదలైంది. ఈ నేపథ్యంలో 'సూదు కవ్వుం' చిత్రాన్ని ఈ నెల 20న రీరిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. టికెట్ ధరను రూ.100గా నిర్ణయించింది. ధరణి దర్శకత్వంలో విజయ్, త్రిష జంటగా నటించి 2004లో విడుదలైన సూపర్‌హిట్ చిత్రం 'గిల్లి' (మహేశ్‌బాబు నటించిన 'ఒక్కడు' చిత్రానికి పునర్నిర్మాణం) చిత్రాన్నీ ఈ నెల 20న రీరిలీజ్ చేయనున్నట్లు ఆ చిత్ర నిర్మాణ సంస్థ శక్తి ఫిలిమ్ ఫ్యాక్టరీ ప్రకటించింది. సినిమా థియేటర్ల యజమానుల అభ్యర్థన మేరకు ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించింది. అజిత్‌కుమార్, మంజువారియర్, సముద్రకని, భవానీరెడ్డి తదితరులు ముఖ్యతారాగణంగా నటించి 2023లో విడుదలైన 'తునివు' కూడా ఈ నెల 20న రీరిలీజ్ కానున్నట్లు ఆ చిత్ర బృందం ప్రకటించింది. అదేవిధంగా అట్లీ దర్శకత్వంలో విజయ్, సమంత, ఎమీ జాక్సన్ హీరోహీరోయిన్లుగా నటించి 2016లో విడుదలైన చిత్రం 'తెరి'. వసూళ్లపరంగానూ రికార్డు సృష్టించిన ఈ చిత్రాన్ని పొంగల్ పర్వదినం సందర్భంగా జనవరి 15న రీరిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాత కలైపులి ఎస్.థాణు ప్రకటించారు. 'జన నాయగన్' విడుదలకు అవాంతరం ఏర్పడటంతో పలు చిన్న చిత్రాలు విడుదలయ్యాయి. దీంతో 'తెరి' చిత్రం రీరిలీజ్‌ను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో చిత్రాన్ని ఈ నెల 27న రీరిలీజ్ చేయనున్నట్లు కలైపులి ఎస్.థాణు కొత్త పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా తన 'ఎక్స్'లో.. 'ఐపీఎస్ విజయ కుమార్ ఆన్ డ్యూటీ ఫ్రమ్ 27 ఫిబ్రవరి' అని వెల్లడించారు.

చిన్న చిత్రాలకు మూడు నెలలు కేటాయించాలి: చేరన్

ఆడియో ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెన్నై: ఎల్.ఆర్.సుందరపాండి దర్శకత్వంలో ఆరి అర్జునన్ కథానాయకుడిగా నటించిన థ్రిల్లర్ చిత్రం 'ఫోర్త్ ఫ్లోర్'. మనో క్రియేషన్ పతాకంపై రాజా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దర్శకనటుడు చేరన్ మాట్లాడుతూ... గతంలో డబ్బింగ్ సినిమాల హవా నడిచినప్పుడు తమిళ చిత్రాలు అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో కచ్చితంగా 90 రోజులు తమిళ చిత్రాలు ప్రదర్శించాలని, లేకుంటే లైసెన్సు రద్దవుతుందని నాటి ముఖ్యమంత్రి ఎంజీఆర్ ఆదేశించారని తెలిపారు. అదే తరహాలో నేడు చిన్నచిత్రాలకు 3 నెలలు కేటాయించాలని కోరారు. దీంతో చిన్న చిత్రాల నిర్మాతలు బతుకుతారన్నారు. దీని గురించి అందరూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు. నటుడు ఆరి అర్జునన్ మాట్లాడుతూ... బిగ్‌బాస్ షో తర్వాత తన చిత్రాలు ఎక్కువ సంఖ్యలో రాలేదన్నారు. కలైజ్ఞర్ టీవీలో తన షో మాత్రం పెద్ద హిట్టయిందని తెలిపారు. చిత్రం విజయవంతమైతే అందరూ స్టారేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మాత ధనంజెయన్, దర్శకులు సుశీంద్రన్, విజయ్ మిల్టన్, నటుడు భరత్, ప్రజిన్, సుబ్రమణియ శివ, సంగీత దర్శకుడు తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక, ఫ్రాన్స్‌లో తాయ్ కిళవి

చెన్నై: శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రాధిక ప్రధానపాత్రలో నటించిన 'తాయ్ కిళవి' ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. శివకార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం శ్రీలంక, ఫ్రాన్స్ దేశాల్లోనూ విడుదల కానుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టరులో 'ఓ తల్లి ఎప్పుడూ తన మార్గాన్ని కనుగొంటుంది. 'తాయ్ కిళవి' శ్రీలంకకు వస్తుంది' అని పేర్కొంది. చిత్రం విడుదల సందర్భంగా ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో చిత్రం 'స్క్రిప్ట్ టు స్క్రీన్' వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో సినిమా చిత్రీకరణ ప్రారంభం నుంచి రిలీజ్ వరకు పనులకు సంబంధించిన సన్నివేశాలు చోటుచేసుకున్నాయి.

రియా షిబు నటనకు సూర్య దంపతుల ప్రశంసలు

చెన్నై: నటనలో రాణించిన నిర్మాత రియా షిబుకు సూర్య, జ్యోతిక దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. నివిన్ పౌలి కథానాయకుడిగా నటించి ఇటీవల విడుదలైన 'సర్వం మాయ' చిత్రం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇందులో 'డెలులు' అనే కథాపాత్రలో నిర్మాత రియా షిబు నటన పలువురిని ఆకట్టుకుంది. ఆమె నటనను మెచ్చుకుంటూ నటులు సూర్య-జ్యోతిక దంపతులు పుష్పగుచ్ఛంతో కూడిన ప్రశంస లేఖను పంపారు. 20ఏళ్ల వయసున్న రియా షిబు హెచ్‌ఆర్ పిక్చర్స్ అధినేత కావడం, తమిళంలో విక్రమ్ నటించిన 'వీర ధీర శూరన్' చిత్రానికి ఆమె నిర్మాత కావడం గమనార్హం.

లేఖను చూపుతున్న రియా షిబు

సెమ్మంజేరిలో గ్లోబల్ స్పోర్ట్స్ సిటీకి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ తరఫున 'చాంపియన్స్ ఆఫ్ తమిళనాడు' పేరిట క్రీడా శ్రేష్ఠత సంబరాలను చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని 3శాతం కోటా కింద 178 మంది క్రీడాకారులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు, 1,172 మంది క్రీడాకారులకు రూ.33.50 కోట్ల పెంచిన నజరానా, తమిళనాడు చాంపియన్స్ ఫౌండేషన్ ఫండ్ నుంచి క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేసి ప్రారంభించారు. సెమ్మంజేరిలో రూ.2.61 కోట్ల వ్యయంతో ఏర్పాటుకానున్న గ్లోబల్ స్పోర్ట్స్ సిటీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా క్రీడాకారులకు కోచ్‌లను నియమించలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2023లో 76 మందిని నియమించామని తెలిపారు. మరో నలుగురు దివ్యాంగ కోచ్‌లు సహా 34 మంది కోచ్‌ల ఉద్యోగ ఖాళీలకు గత నెల ప్రకటన విడుదల చేశామన్నారు. గ్లోబల్ స్పోర్ట్స్ సిటీ అందుబాటులోకి వస్తే హాకీ, టెన్నిస్ క్రీడలతో పాటు ఇతర క్రీడల్లోనూ చెన్నై ప్రముఖ స్థానాన్ని పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందరం తదితరులు పాల్గొన్నారు.

అలా చేయకుంటే పోక్సో చట్టమెందుకు?

■ మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికను తనతో తీసుకెళ్లే ప్రియుడిపై చర్యలు చేపట్టకుంటే పిల్లల భద్రత కోసం తీసుకొచ్చిన పోక్సో చట్టం ఎందుకని మద్రాసు హైకోర్టు పోలీసులను ప్రశ్నించింది. కడలూరు ప్రాంతానికి చెందిన 17ఏళ్ల బాలిక కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆమె 27ఏళ్ల యువకుడితో ఇష్టపూర్వకంగా వెళ్లినట్లు తెలిసింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేయలేదు. అనంతరం బాలిక తండ్రి.. తన కుమార్తెను గుర్తించి తనకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ వేల్మురుగన్, జస్టిస్ జ్యోతిరామన్ ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అప్పుడు పోలీసుల తరఫున.. బాలిక ఇష్టంతో వెళ్లినందున పోక్సో కేసు నమోదు చేయవద్దని ప్రత్యేక ధర్మాసనం ఇదివరకే ఉత్తర్వులు ఇచ్చిందని, అందుకే కేసు నమోదు చేయలేదని తెలిపారు. దానిని అంగీకరించని న్యాయమూర్తులు.. పోక్సో చట్టాన్ని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదు చేయకపోతే అందుకు సంబంధించిన జీవోని కోర్టులో దాఖలు చేయాలని తెలిపారు. 16ఏళ్ల బాలికను ఆమె ఆమోదంతో వివాహం జరిగితే కేసు నమోదు చేయకుండా ఉంటారా, బాలలు ఇష్టంతో గంజాయి తాగితే అది నేరం కాదా? అని ప్రశ్నించారు. అనంతరం పోలీసులు సదరు 17ఏళ్ల బాలికను కోర్టులో హాజరుపరిచారు. చదువుకోవాలని ఇంట్లో తిట్టడంతో యువకుడితో వెళ్లిపోయినట్లు చెప్పింది. దీంతో న్యాయమూర్తులు హితవుపలికి తల్లిదండ్రులతో పంపారు. సంబంధిత యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎండీకే నిర్ణయం ప్రజల మనోభావాలకు విరుద్ధం


పార్టీ దరఖాస్తు ఫారాలు చూపుతున్న జీకే వాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకే కూటమిలో డీఎండీకే చేరడం ప్రజల మనోభావాలకు విరుద్ధమని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ పేర్కొన్నారు. టీఎంసీ తరఫున తిరుచ్చి, తంజావూర్, పుదుకోట్టై, తిరువారూర్, అరియలూర్, పెరంబలూర్, నాగై జిల్లాల అధ్యక్షులు, నిర్వాహకులతో సమీక్ష సమావేశం గురువారం తిరుచ్చిలో జీకే వాసన్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టీఎంసీ తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహులకు జీకే వాసన్ దరఖాస్తులు అందజేశారు. అనంతరం జీకే వాసన్ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర వ్యవసాయ బడ్జెట్‌తో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. విజయకాంత్ ఇష్టపడని డీఎంకేతో పొత్తు పెట్టుకోలేదని తెలిపారు. ఎన్డీయేకి ప్రజల్లో అధికారం మద్దతు ఉందన్నారు.

డీఎంకేకు కలవరం సంతోషకరం: వైగో

ప్యారిస్: డీఎంకే కూటమిలోకి డీఎండీకే చేరడం మంచి శుభవార్త అని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. మదురైలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. .. తాము డీఎంకేను ఎన్ని సీట్లు కోరతామో ముందుగానే చెప్పడం కుదరదని తెలిపారు. డీఎంకే కూటమి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని, డీఎంకే కోట మరింత బలపడిందని చెప్పారు. ఎండీఎంకే ఈసారి ప్రత్యేక గుర్తుపై పోటీ చేస్తుందని తెలిపారు. రాజ్యసభ సీటు కోసం తాను ఎప్పుడూ ఆశించలేదని, కార్యకర్తలకు ఆశ ఉంటుందని పేర్కొన్నారు.

మునిగిపోతున్న పడవ ఎక్కడం బాధాకరం: తమిళిసై

వేలూర్: డీఎండీకే మునిగిపోతున్న నావలోకి ఎక్కడం బాధాకరం అని బాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ విమర్శించారు. వేలూర్ జిల్లా గుడియాత్తంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విలేకరులతో మాట్లాడుతూ... సముద్రంలో మునిగిపోతున్న ఓడలోకి ప్రేమలత ప్రవేశం చేయడం ఎంతో బాధగా ఉందని, ప్రేమలతకు తన సంతాపాన్ని తెలియజేస్తున్నానని తెలిపారు. ఎన్డీయే చాలా బలంగా ఉందన్నారు.

డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం నేడు

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు జరగనుందని పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడైన ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న సమావేశంలో.. 'వెల్లుం తమిళ్ పెణ్‌గళ్' పేరిట ఇంటింటికి వెళ్లి చేపట్టే ప్రచార ఏర్పాట్లు గురించి చర్చించనున్నారని తెలిపారు.

ఫైనాన్స్ సంస్థ వేధింపులతో వ్యక్తి ఆత్మాహుతియత్నం

● కొత్త చట్టం కింద రాష్ట్రంలో తొలి కేసు నమోదు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విలుపురం జిల్లా తిరువెన్నెనల్లూర్ సమీపం పొన్నవలం గ్రామానికి చెందిన అబ్బాస్ అనే వ్యక్తి 2019లో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రూ.9.84లక్షలు రుణం తీసుకొని ప్రొక్లెయిన్ కొనుగోలు చేశారు. మొదట సకాలంలో వాయిదాలు చెల్లించిన అబ్బాస్.. గత రెండున్నరేళ్లుగా మానేశాడు. ఇంకా చెల్లించాల్సిన రూ.10.80లక్షల వసూలుకు ఫైనాన్స్ సంస్థ చర్యలు చేపట్టింది. ఈనెల 13వ తేదీ అబ్బాస్, ఆయన కుటుంబీకులను ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ మూర్తి, ఉద్యోగిని దీపజ్యోతి దుర్భాషలాడారు. ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకోవడానికి యత్నించారు. దీంతో మనస్తాపానికి గురైన అబ్బాస్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబీకులు చెన్నై కీల్పాక్కం ఆస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై తమిళనాడు మనీ లెండింగ్ ఎంటిటీస్ చట్టం కింద కేసు నమోదు చేసిన తిరువెన్నెనల్లూర్ పోలీసులు ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ మూర్తి(43)ని ఈనెల 14వ తేదీ అరెస్ట్ చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. ఈ నేపథ్యంలో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక చట్టం కింద తొలి కేసు తమిళనాడులోని విలుపురంలో నమోదైందని ఇన్‌ఛార్జ్ డీజీపీ వెంకట్రామన్ తెలిపారు.

చేపల తొట్టెలో పడి మూడేళ్ల బాలుడి మృతి

లక్ష్మణన్ (పాతచిత్రం)

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు సమీపం ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బాబు(36) భవన నిర్మాణ కార్మికుడు. ఈయనకు భార్య మేఘల(32), మూడేళ్ల కుమారుడు లక్ష్మణన్ ఉన్నారు. గురువారం పనికి బయలుదేరిన తండ్రి వెంట కుమారుడు కూడా వెళ్లాడు. ఆర్కాడు-సెయ్యూరు రోడ్డు పక్కనున్న తోపు కరుప్పస్వామి ఆలయంలో బాబు నిర్మాణ పనుల్లో ఉండగా ఆలయ ప్రాంగణంలో బాలుడు లక్ష్మణన్ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడున్న చేపల తొట్టెలో పడ్డాడు. గమనించిన ఆలయ నిర్వాహకులు బాలుడిని బయటకు తీసి ఆర్కాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూరు సమీపం మేల్‌నల్లాత్తూరుకు చెందిన సంతానరాజ్ (40) వ్యాను డ్రైవర్. ఈయన మరమ్మతుకు గురైన వ్యానుకు విడిభాగాలు కొనుగోలు చేసేందుకు గురువారం ద్విచక్ర వాహనంపై తిరువళ్లూర్‌కు బయలుదేరాడు. మనవాళనగర్‌లో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

● **గుమ్మిడిపూండి:** తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం కవరప్పేటకు చెందిన మురళి(40) వ్యవసాయ కూలీ. ఈయన బుధవారం రాత్రి సిరువాపురి ప్రాంతంలో నడచి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలిలోనే మరణించాడు. కవరప్పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పడవ బోల్తాపడి మహిళ...

ఆర్కేనగర్: కర్ణాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన విజయ్, సోనియా దంపతులు. వీరు తమ ముగ్గురు పిల్లలు, బంధువులు మొత్తం 8మందితో కలిసి పుదుచ్చేరి పర్యాటకానికి బుధవారం వెళ్లారు. వీరపట్టినంలోని ఓ రిసార్టులో బస చేశారు. గురువారం ఉదయం వీరపట్టినం బీచ్‌లో ఆ ప్రాంతానికి చెందిన సతీష్ అనే వ్యక్తి పడవలో ఎక్కారు. పెద్ద అల రావడంతో చిన్న వీరపట్టినం ప్రాంతంలో పడవ బోల్తాపడింది. గమనించిన మత్స్యకారులు సముద్రంలో పడిపోయినవారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో మునిగి సోనియా మృతి చెందింది. మిగిలినవారిని పుదుచ్చేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసి ఉన్న ఇంట్లో వ్యక్తి మృతదేహం లభ్యం

అరక్కోణం, న్యూస్‌టుడే: కారైకుడి ప్రాంతానికి చెందిన మెయ్యప్పన్(58) రాణిపేట వద్ద ఉన్న తోళ్ల పరిశ్రమలో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. అభిప్రాయభేదాలతో భార్యాభర్తలు ఐదేళ్ల క్రితం విడిపోయారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వేలూర్ సమీపం సత్తువాచ్చారి పోలీసు స్టేషన్ వెనుక ఉన్న ఓ ఇంట్లో మెయ్యప్పన్ అద్దెకు ఉంటున్నారు. వారం రోజులుగా ఇంటి తలుపు మూసి ఉంది. లోపలి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగువారు గురువారం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని తలుపులు పగులగొట్టి లోనికెళ్లి చూడగా మెయ్యప్పన్ మృతదేహం కనిపించింది. పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

అద్దె ఇళ్లలో నివాసం.. అదను చూసి మోసం

నిందితుడు జగదీష్

అన్నానగర్, న్యూస్‌టుడే: తిరువణ్ణామలైకు చెందిన పునీతశ్రీ అనే మహిళ ఇంటి కింది అంతస్తులో జగదీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెతో అద్దెకు ఉంటున్నాడు. గతేడాది జూన్ 16న జగదీష్ ఫొటో షూట్ చేద్దామని చెప్పి అతని కుమార్తెతో పాటు పునీతశ్రీ, అతని తమ్ముడిని చెన్నై తీసుకెళ్లాడు. రాయపేటలోని ఓ వస్త్ర దుకాణంలోకి తీసుకెళ్లి దుస్తులు ధరించి చూడాలని పునీతశ్రీ, అతని తమ్ముడిని ట్రయల్ రూంలోకి పంపించాడు. లోపలికి వెళ్తూ పునీతశ్రీ 16సవర్ల బంగారు నగలు, 2 సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను జగదీష్‌కు ఇచ్చి వెళ్లింది. బయటికి వచ్చి చూడగా జగదీష్ కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అన్నాసాలై పోలీసులు దర్యాప్తు చేపట్టి బుధవారం కోయంబత్తూర్‌కు చెందిన జగదీష్, అతని 16ఏళ్ల కుమార్తెను అరెస్టు చేశారు. వారి నుంచి 16సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. జగదీష్ ఇదేతరహాలో చెన్నై శాస్త్రినగర్, వేలచ్చేరి తదితర ప్రాంతాల్లో మోసం చేశాడని తెలిసింది.

రూ.9.54లక్షలు మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా పాపనాశం ప్రాంతానికి చెందిన సలీమ్ ముహ్మద్(26) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఈయనకు టెలిగ్రామ్‌లో ఓ లింక్ వచ్చింది. అనంతరం సలీమ్‌ను సంప్రదించిన ఓ మహిళ.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపింది. తాము పంపిన లింక్‌పై క్లిక్ చేసి పెట్టుబడి పెట్టాలని చెప్పగా ఆయన 2025 సెప్టెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు 31 ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా రూ.9.63లక్షల వరకు పంపించారు. ఓసారి మాత్రమే లాభం అని చెప్పి రూ.8,860 పంపించారు. రోజులు గడిచినా ఎలాంటి లాభాలు రాకపోవడంతో సలీమ్ ముహ్మద్ వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా కుదరలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి తంజావూర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నగదు పంపిన బ్యాంకు ఖాతాలు గుజరాత్ రాష్ట్రానికి చెందినవిగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుపదార్థాలతో ఉన్న ఇద్దరి అరెస్టు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ పోలీసులు గురువారం పాడియనల్లూరులో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి చేతి సంచుల్లో సోదా చేసి 2వేల మత్తుమాత్రలు, 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నారావారికుప్పం సమీపం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కార్తిక్, ఎడప్పాళ్యానికి చెందిన మణిగా గుర్తించి అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి...

అన్నానగర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని రెండు రోజుల క్రితం చెన్నై ఆదంబాక్కంలో జరిగిన శ్మశానకొల్ల ఉత్సవం జరిగింది. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన అక్క కుమార్తెతో కలిసి కార్యక్రమం చూడడానికి వెళ్లింది. అప్పుడు ఓ వ్యక్తి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. భయంతో బాలిక పెద్దగా కేకలు వేసి తన చిన్నమ్మకు విషయం చెప్పింది. దీంతో మహిళ అక్కడున్నవారి సాయంతో మాధవపురానికి చెందిన యువరాజ్ అనే వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించింది. మడిపాక్కం ఆల్ ఉమెన్ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి ఆలందూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

నగల చోరీకి పాల్పడిన నిందితుడు...

విల్లివాక్కం: ఈరోడ్ నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలోని ఓ ఇంట్లో నివాసం ఉంటున్న రాజన్, నిర్మలాదేవి దంపతులు మంగళవారం ఉద్యోగాలకు వెళ్లారు. సాయంత్రం నిర్మలాదేవి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 63 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన కరుంగల్‌పాలయం పోలీసులు.. వారి చిన్న కుమారుడు జయకృష్ణ స్నేహితుడు మయిల్‌సామి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. దీంతో మయిల్‌సామిని అరెస్ట్ చేసి 63 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచార కేంద్రం నడుపుతున్న మహిళ...

గిండి: చెన్నై ఓట్టేరి పోలీసులకు అందిన సమాచారం మేరకు మహిళా పోలీసులు పెరంబూరు కుక్స్ రోడ్డులోని ఓ ఇంట్లో తనిఖీ చేశారు. అక్కడ పులియాంతోప్పునకు చెందిన పరమేశ్వరి అనే మహిళ ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచార కేంద్రం నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో పరమేశ్వరిని బుధవారం అరెస్టు చేశారు. ముగ్గురు మహిళలను రక్షించారు. పరారీలో ఉన్న మరో నిందితురాలి కోసం గాలిస్తున్నారు.

క్రైం కార్నర్

కిడ్నాప్ కేసులో ముగ్గురు...

గిండి: చెన్నై వన్నారపేటకు చెందిన ఆనందకుమార్ అనే వ్యక్తి రైస్ మిల్లు నడుపుతున్నారు. ఈయన ఈనెల 16వ తేదీ మిల్లులో పని ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తుండగా స్టాన్లీ సబ్ వే వద్ద కొరుక్కుపేటకు చెందిన ధనశేఖర్.. అతని స్నేహితులతో కలిసి ఆనందకుమార్‌ను కిడ్నాప్ చేశాడు. అనంతరం ఆయన భార్యకు ఫోన్ చేసి రూ.3లక్షలు డిమాండ్ చేశాడు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టి ధనశేఖర్, ఏసుదాస్, రాజాలను అరెస్టు చేసి ఆనందకుమార్‌ను విడిపించారు. దర్యాప్తులో.. ఆనందకుమార్ మిల్లులో ధనశేఖర్ పనిచేశాడని, మిల్లులో చోరీ చేసి జైలుకు వెళ్లొచ్చాడని, యజమానిపై పగ పెంచుకున్న ధనశేఖర్ కిడ్నాప్ చేశాడని తెలిసింది. నిందితులను కోర్టులో హాజరుపరచి మంగళవారం రిమాండుకు తరలించారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

ధనశేఖర్, ఏసుదాస్, రాజా

పరారీ నిందితుడు...

అన్నానగర్: చెన్నై కందన్‌చావడి ప్రాంతంలో 2016 ఆగస్టు 4వ తేదీ రాత్రి జరిగిన ఆదినారాయణన్ అలియాస్ సత్య హత్య కేసులో నిందితుడైన పాలవాక్కానికి చెందిన టోబి అలియాస్ గోపి అలియాస్ గోపాలకృష్ణన్‌ను తురైపాక్కం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన అతను కోర్టులో హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. అతని కోసం గాలించిన పోలీసులు బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

నగదు మోసానికి పాల్పడిన ముగ్గురు...

కోయంబత్తూరు: కోయంబత్తూర్‌లోని నెహ్రూ నగర్‌కి చెందిన చెన్నిమలై అనే వ్యక్తి భవన నిర్మాణ సంస్థ నిర్వహిస్తున్నారు. వ్యాపార విస్తరణకు డబ్బులు అవసరం కావడంతో సేలం జిల్లా ఎడప్పాడికి చెందిన సెంథిల్‌వాసన్ అనే వ్యక్తి పెట్టుబడిదారులను పరిచయం చేశారు. కణ్ణన్ అనే వ్యక్తి రూ.25కోట్ల రుణం ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని రోజుల తర్వాత కణ్ణన్ సహా ఐదుగురు తమ కమీషన్, కొన్ని పత్రాలు ఇస్తే వెంటనే రుణం మంజూరు చేయిస్తామని చెప్పారు. దీంతో చెన్నిమలై రూ.67 లక్షలు వారికి ఇచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ఐదుగురు వ్యక్తులు.. చెన్నిమలైని గాంధీపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి రమ్మని పిలిచారు. అక్కడకు వెళ్లిన ఆయన వారు రానట్లు గుర్తించి మోసపోయినట్లు గ్రహించారు. ఫిర్యాదు మేరకు పీళమేడు పోలీసులు దర్యాప్తు చేపట్టి సెంథిల్‌వాసన్, మురుగన్, అన్బుసెల్వన్, కదిరేశన్, ఆంతోనిపై కేసు నమోదు చేశారు. ఇందులో సెంథిల్‌వాసన్‌ను అరెస్టు చేశారు.

అరెస్టయిన హరి నాడార్

● ఇదిలా ఉండగా చెన్నైలో జరిగిన మరో మోసం కేసులో క్షత్రియ సాంద్రోర్ పడై కట్చి వ్యవస్థాపకుడు హరి నాడార్ అరెస్టయ్యాడు. దర్యాప్తులో.. మురుగన్ పేరుతో కోయంబత్తూర్‌కు చెందిన చెన్నిమలైకు రుణం ఇప్పిస్తానని రూ.67లక్షలు మోసానికి పాల్పడినట్లు తెలిసింది. తర్వాత పీళమేడు పోలీసులు చెన్నైకి వెళ్లి హరి నాడార్, కదిరేశన్‌ను బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. వారిని కోయంబత్తూర్ రెండో మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఘర్షణలో ఐదుగురికి తీవ్రగాయాలు

ఒకరి పరిస్థితి విషమం

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా ఆనైకట్టు సమీపం అగరం ప్రాంతానికి చెందిన మురుగన్(75), ఆనందన్(48) కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. ఇదిలా ఉండగా బుధవారం మురుగన్, ఆనందన్ మద్యం మత్తులో గొడవపడ్డారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు వెప్పనగుప్పం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గురువారం ఇద్దరినీ స్టేషన్‌కు పిలిచి విచారిస్తుండగా మురుగన్ బావమరిది గోవిందరాజ్(60), అతని మనవడు కార్తిక్(25)పై ఆనందన్ మద్దతుదారులు శివకుమార్, కేశవన్, కోదండన్ కత్తులతో దాడిచేశారు. దాడిలో రెండు వర్గాలకు చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు అడుకంపారై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీ నుంచి 6 సవర్ల బంగారు నగ స్వాధీనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నైజీరియాకు చెందిన నాన్సోజోయసిన్(42) అనే వ్యక్తి మత్తుపదార్థాలు తరలిస్తుండగా గుమ్మిడిపూండి పోలీసులు ఇటీవల అరెస్టు చేసి పుళల్ కేంద్ర కారాగారంలో ఉంచారు. ఇతను 6 సవర్ల బంగారు ఆభరణం ధరించి ఉండటాన్ని గురువారం గమనించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జైలుకు తరలించేటప్పుడు అతను నగను లోదుస్తుల్లో దాచినట్లు దర్యాప్తులో తేలింది. పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ జైలర్‌పై దాడి చేసిన ఖైదీపై కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై గిండిలోని గవర్నర్ హాల్‌పై పెట్రోల్ బాంబు విసిరిన కేసులో పదేళ్ల శిక్ష పడిన కరుక్కా వినోద్ తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపం పుళల్ జైల్లో ఉంటున్నాడు. ఇతని గదిలో సబ్ జైలర్ సెల్వం గురువారం తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆక్రోశానికి గురైన వినోద్ దాడి చేయడంతో సెల్వం గాయపడ్డారు. పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి...

అన్నానగర్: చెన్నై ఫ్లవర్ బజార్ పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం టీఎన్‌పీఎస్‌సీ రోడ్‌లో నిఘా పెట్టారు. అక్కడ అనుమానాస్పదంగా నిలబడి ఉన్న రెహ్మాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగులో సోదా చేసి 110 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై అక్రమ మద్యం విక్రయానికి సంబంధించి 15 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని బుధవారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

← స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో నిందితుడు రెహ్మాన్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

కలల గూడు.. సాకారానికి తోడు

పీఎంఏవై 2.0లో 41,564 లబ్ధిదారులు

తిరుపతి (జిప కేస), న్యూస్‌టుడే: సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే గ్రామీణ పేదలకు చేయూతనివ్వి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎంఏవై-జీ 2.0 పథకం కింద వర్షాల్లో ఇళ్లు నిర్మించుకోవాలనే లబ్ధిదారుల మద్దతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలు నిర్ణయించాయి. ఇప్పటికే జిల్లాలో దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో.. గృహనిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచేసే తదుపరి సన్నాహాలకు సిద్ధం చేస్తున్నారు.

దరఖాస్తుల వివరాలు

పీఎంఏవై- ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 33 మండలాల నుంచి 41,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని మూడు దశలుగా విభజించి, రానున్న మూడేళ్ల కాలంలో అందరికీ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

ప్రభుత్వాల సాయం ఇలా..

రూ.2.39 లక్షల్లో కేంద్రం రూ.95,400, రాష్ట్ర వాటా రూ.63,600, స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.12 వేలు, జాతీయ ఉపాధి పథకం కింద రూ.27 వేలు అందిస్తారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే మహిళలకు అదనంగా ఆ సంఘాల ద్వారా రుణం పొందేందుకు అవకాశం కల్పించారు.

మండలాల వారీగా అర్హులు..

ఏర్పేడు 1303, రేణిగుంట 451, యర్రావారిపాలెం 668, పాకాల 761, తిరుపతి గ్రామీణ 735, పిచ్చాటూరు 387, రామచంద్రాపురం 402, వడమాలపేట 388, నారాయణవనం 690, చంద్రగిరి 1476, వెంకటగిరి 973, చిన్నగొట్టిగల్లు 699, డక్కిలి 1382, శ్రీకాళహస్తి 1543, చిల్లకూరు 1697, గూడూరు 1122, దొరవారిసత్రం 1835, కోట 1881, కె.వి.బి.పురం 1291, సత్యవేడు 858, నాగలాపురం 641, తొట్టంబేడు 1631, బాలాయపల్లె 2099, పెళ్లకూరు 2089, ఓజిలి 1975, నాయుడుపేట 1340, బుచ్చినాయుడుకండ్రిగ 1473, వరదయ్యపాలెం 1174, సూళ్లూరుపేట 1558, తడ 2451, వాకాడు 1806.

అత్యధికంగా: చిట్టమూరు 2,669 మంది • అత్యల్పంగా: పుత్తూరు 175 మంది

ద్రవిడకు తితిదే నుంచి రూ.కోటి నిధులు

కుప్పం గ్రామీణ: కుప్పం ద్రవిడ వర్సిటీకి 2024-25 విద్యా సంవత్సరం నుంచి తితిదే ఏటా రూ.కోటి నిధుల మంజూరుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి జవహర్‌లాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏటా తితిదే నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసేవారు. వైకాపా హయాంలో రాలేదు. తాజాగా నిధుల మంజూరుపై వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ద్రవిడలో కొత్త డీన్ల నియామకం: ద్రవిడ విశ్వవిద్యాలయంలో గతంలో పని చేస్తున్న పీఠాధిపతులు.. శాఖాధిపతులను బాధ్యత నుంచి తప్పించి కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ ఆఫ్ కంపారిటివ్ ద్రవిడియన్ లిటరేచర్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ డీన్‌గా తెలుగుశాఖ ఆచార్యులు శ్రీదేవి, స్కూల్ ఆఫ్ హ్యూమన్ అండ్ సోషియల్ సైన్స్ డీన్‌గా ఆచార్య కేశవమూర్తి, స్కూల్ ఆఫ్ హెర్బల్ స్టడీస్ అండ్ నేచరో సైన్స్ డీన్‌గా ఆచార్య మస్తాన్, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి, డీన్‌గా ఆచార్య యశోద, స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డీన్‌గా ఆచార్య అమ్ములు, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ఆచార్య కనకరత్నంను నియమించారు.

రేణిగుంటలో గ్రావెల్ దొంగలు

• చక్రం తిప్పుతోన్న వైకాపా నుంచి తెదేపాలో చేరిన నాయకులు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, రేణిగుంట: దొంగలు.. దొంగలు కలిసి ఊళ్లను పంచుకున్నారన్నది పాత సామెత. రేణిగుంట మండలంలో గత ఎన్నికలకు ముందు, తర్వాత వైకాపా నుంచి తెదేపాలో చేరిన నేతలు కొండలను పంచేసుకున్నారు. వీరంతా కీలక ప్రజాప్రతినిధికి వాటాలు ఇచ్చి గ్రావెల్‌ను దోచేస్తున్నారు. కడప- తిరుపతి జాతీయ రహదారికి సమీపంలో జరుగుతున్న ఈ దందాకు ఉన్నతాధికారులైనా అడ్డుకట్ట వేయాలి.

కీలక నేతకూ 30 శాతం

ఈ దందాకు సహకరించినందుకు కీలక నేతకు 30 శాతం అందుతోంది. స్థానిక రెవెన్యూ అధికారులకూ వాటాలు ముడుతున్నాయి. దాంతో ఇక్కడ తవ్వకాలే జరగనట్టుగా యంత్రాంగం వ్యవహరిస్తోంది. మరోవైపు కొండకు వెళ్లేందుకు సరిగా రోడ్డు లేకపోవడంతో మల్లెమడుగు నుంచి వచ్చే నీళ్లకు అడ్డుకట్ట వేసి ప్రత్యేకంగా మార్గం వేసుకున్నారు. కొంతకాలంగా జరుగుతోన్న తవ్వకాలతో ఆ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అందులో నీరు చేరింది.

తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో చేరిన నీరు

విద్యుత్తు టవర్ల చుట్టూ..

వైకాపా హయాంలో రేణిగుంట మండలం మల్లెమడుగు జలాశయం వెనుక ఉన్న కొండను ఆ పార్టీ నాయకులు కొల్లగొట్టారు. అప్పట్లో ముఖ్య ప్రజాప్రతినిధికి నెలనెలా రూ.లక్షల్లో మామూళ్లు ఇచ్చి దోపిడీకి అడ్డు రాకుండా, అధికారులను అటువైపు రానివ్వకుండా చూసుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు ఇందులో ఓ నాయకుడు తెదేపాలో చేరారు. ప్రస్తుతం ఇతని హవానే సాగుతోంది. వైకాపా నుంచి వచ్చిన వారితో ముఠా కట్టడంతోపాటు మరికొందరు స్థానిక తెలుగుదేశం నాయకులను ఇందులో చేర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పక్కనే ఉన్న మరో కొండపై కన్నేశాడు. కొంతకాలం పగటి పూటే తవ్వకాలు చేశారు. ఇది వెలుగులోకి రావడంతో రాత్రిళ్లు కొండను కొల్లగొట్టడం మొదలుపెట్టారు. అందులో ఉన్న భారీ విద్యుత్తు టవర్ల చుట్టూ తవ్వకాలు చేస్తున్నారు. పొరపాటున అవి కూలితే ఎస్పీడీసీఎల్‌కు తీవ్ర నష్టం రావడంతో పాటు విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగడం ఖాయం.

రాత్రి సంపాదనే రూ.లక్షల్లో

15 రోజులుగా తవ్వకాలను మరింత ముమ్మరం చేశారు. రాత్రి 8 నుంచి 6 గంటల వరకు టిప్పర్లలో పెద్దఎత్తున గ్రావెల్‌ను చెన్నై, తిరుపతికి అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక్క టిప్పర్ మట్టిని రూ.30వేలు- రూ.35వేలకు అమ్ముతున్నారు. నిత్యం 150 టిప్పర్ల గ్రావెల్‌ను దోచేస్తున్నారు. ఒక్క రాత్రే రూ.35 లక్షలు- రూ.40 లక్షలు సంపాదిస్తున్నారని స్థానికులే అంటున్నారు. ఈలెక్కన 15 రోజుల్లో రూ.5.20 కోట్లు- రూ.6 కోట్ల విలువైన సంపదను స్వాహా చేశారు.



శ్రీవారి సేవలో సినీనటి త్రిష

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని గురువారం సాయంత్రం నైవేద్య విరామం.. శ్రీవారి బ్రేక్ సమయంలో సినీనటి త్రిష దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మీదుగా మహాద్వారం గుండా ఆమె ఆలయంలోకి చేరుకుని స్వామి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

అడ్డగోలు పనులు.. అడ్డంగా దోపిడీ

రాసుకొని దోచుకోవడానికి ఎత్తుగడలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట పురపాలక సంఘంలో కొందరు నాయకులు అడ్డగోలు పనులతో అడ్డంగా దోచుకుంటున్నారు. రాబడికి మించి వ్యయమవుతున్నా.. అప్రాధాన్య పనులు చేసి బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు.

వైకాపా హయాంలో మొదలై..

వివాదాస్పద స్థలంలో నిర్మిస్తున్న గదులు

వైకాపా ఐదేళ్ల పాలనలో పురపాలిక సంఘంలో ప్రజామోదం లేని పనులు తీర్మానించి పురపాలిక సంఘం నిధులను అడ్డగోలుగా పనులకు వినియోగించారు. స్వర్ణముఖి ఏటి పండుగ, మైనార్టీల క్రీడా మైదానంలో ప్రహరీ నిర్మాణం, మునిరత్నంనగర్‌లో గుంతలు పూడ్చడం, ర.భ. అతిథిగృహ భవనంలో ఏసీల ఏర్పాటు, తాగునీటి పథకాల మరమ్మతులు, మురుగు కాల్వల్లో పూడికతీత, బీడీకాలనీలో వాహనాలకు, షికారీలకు షెడ్ల నిర్మాణం, పట్టణ ఆరోగ్య కేంద్రాలు చదును చేయడం వంటి పనులను తూతూ మంత్రంగా చేశారు. అధికారులను అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా బిల్లు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి.

ఆదాయానికి మించి ప్రతిపాదనలు

పురపాలిక సంఘానికి ఏటా పన్నులు, ఇతర వనరుల ద్వారా రూ.5 కోట్ల రాబడి ఉంటుంది. సిబ్బంది వేతనాలు, పాలనా ఖర్చులు, తాగునీటి పథకాలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, విద్యుత్తు బిల్లుల చెల్లింపులు కలిసి రూ.3.50 కోట్లు. మిగిలిన రూ.1.5 కోట్లు మాత్రమే సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేయాలి. ఇందుకు భిన్నంగా నాయకుల జోక్యంతో పాలకవర్గం పనులు ప్రతిపాదించింది.

రూ.6.50 కోట్ల బకాయిలు

పురపాలిక సంఘంలో అడ్డగోలుగా చేసిన పనులకు రూ.6.50 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. చెల్లింపులో జాప్యం చేస్తున్నారని ఓ నాయకుడు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. పాత బిల్లులు పెండింగ్‌లో ఉండగానే పాలకవర్గం ఇటీవల మరో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు తీర్మానం చేయడం గమనార్హం. వైకాపా నాయకులు.. కూటమి నేతల చెంత చేరి బిల్లు పొందే యత్నాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోర్టు వివాదంతో అసంపూర్తిగా ఉన్న షికారీల షెడ్లకు బిల్లులు చెల్లించాలని ఓ నాయకుడు కొన్నిరోజులుగా కమిషనర్‌పై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కమిషనర్ ఫజులుల్లాను వివరణ కోరగా నిబంధనల మేరకే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

ఈ-పంట.. నమోదుకు తంటా!

సాంకేతిక సమస్యలతో పూర్తి కాని సర్వే!

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: అన్నదాతలు వ్యవసాయ సంబంధిత పథకాల రాయితీలు పొందాలన్నా.. ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన ఈ ప్రక్రియ జిల్లాలో నెమ్మదిగా సాగుతోంది. మరో పక్క సాంకేతిక చిక్కులు అవరోధం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం విధించిన గడువులోగా నమోదు పూర్తికాకపోతే రైతులు అన్ని విధాలా నష్టపోవాల్సి వస్తుంది.

● జిల్లాలో రైతులు రబీలో 5.30 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ మొత్తం విస్తీర్ణాన్ని ఖాతా, సర్వే నంబర్ల వారీగా ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలి. ప్రక్రియను ఈ నెల 25వ తేదీ లోగా పూర్తి చేయాల్సి ఉంది.

ఆలస్యానికి కారణాలివి..

● మారిన నిబంధనల ప్రకారం సర్వే నంబర్ల వారీగా జియో మ్యాపింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం క్షేత్రస్థాయిలో పూర్తికావడానికి ఎక్కువ సమయం పడుతోంది. సాంకేతిక సమస్యలతో పనులు ముందుకు కదలడం లేదు.

● వెబ్‌ల్యాండ్ నుంచి ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే, ఖాతా నంబర్లు డౌన్‌లోడ్ అయితే వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేయాల్సి ఉంది. వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలు ఉన్నా, లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి. బీడు భూములను అయిదేళ్లకు పైగా సాగు చేయనివి, 1-5 ఏళ్ల మధ్య చేయనివి, ఈ ఏడాది సాగు చేయనివిగా విడదీయాలి.

● భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లకు, వ్యవసాయశాఖ సిబ్బంది దగ్గరున్న సర్వే నంబర్లకు సరిపోలడం లేదు.

● జిల్లాలో రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానశాఖల సహాయకుల సిబ్బంది కొరత ఉంది.

● బయోమెట్రిక్ పడని రైతులకు ఐరిస్ చేయడానికి సిగ్నల్ సమస్య వేధిస్తోంది.

జిల్లాలో వివరాలు ఇలా..

పంట విస్తీర్ణం	ఇంత వరకు ఈ-పంట నమోదు	ఉద్యాన పంటల విస్తీర్ణం	ఇంత వరకు ఈ-పంట నమోదు
4.50 లక్షల ఎకరాలు	3.23 లక్షల ఎకరాలు	80 వేల ఎకరాలు	70 వేల ఎకరాలు

ఆర్థిక మండలి కేంద్రంగా తిరుపతిపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సీఐఐ ప్రతినిధులు

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ఆర్థిక మండలి కేంద్రంగా తిరుపతిని మార్చడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక తాజ్ హోటల్‌లో గురువారం జరిగిన భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ) తిరుపతి జోన్ 2025-26 వార్షిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 15-20 ఏళ్లలో నెల్లూరు, తిరుపతి, చెన్నై పరిసర ప్రాంతాలు పారిశ్రామిక అభివృద్ధిని సాధించాయని, తిరుపతి.. చెన్నై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు ఫీడర్ ప్రాంతంగా పనిచేస్తుందని వివరించారు. సాగర్‌మాల రోడ్ల కింద నాలుగు ప్రధాన జాతీయ రహదారుల ప్యాకేజీలు అమలు చేయనున్నామని, ఒక్కో ప్యాకేజీకి సగటున రూ.1200-1500 కోట్లు ఖర్చవుతుందని, రూ.6వేల కోట్లకుపైగా విలువైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో ఉందని, బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే దాదాపు పూర్తయిందని వివరించారు. జిల్లాలో రూ.6,500 కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, పర్యాటక రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. సమావేశంలో సీఐఐ తిరుపతి జోన్ ఎండీ జగన్నాథ అనిరుధ్, ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ, అమరా ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని, రేవండ్స్ కంట్రోల్స్ సీఈవో డి.దామోదర్ నాయుడు, సీఐఐ విశాఖపట్నం మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు పాల్గొన్నారు.

నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల నియామకం: వార్షిక సమావేశంలో భాగంగా 2026-27 సంవత్సరానికి సీఐఐ తిరుపతి జోన్ ఛైర్మన్‌గా కజారియా సిరామిక్స్ లిమిటెడ్ (శ్రీకాళహస్తి) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్.పి.రాజేంద్రన్, వైస్ ఛైర్మన్‌గా ఎక్సాఫ్లూయన్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ టి.ఎన్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

గిరి ప్రదక్షిణం.. భక్తజన పరవశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పెళ్లివేడుకకు వచ్చిన అతిథులను సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలు దగ్గరుండి సాగనంపారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కైలాసగిరి ప్రదక్షిణోత్సవం సుమారు 24 కి.మీ.ల పొడవునా ఆద్యంతం రమణీయంగా సాగింది. ఏటా రెండుసార్లు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కనుమ పండుగ రోజున కల్యాణోత్సవానికి ఆహ్వానిస్తే. . బ్రహ్మోత్సవాల్లో వచ్చిన వాళ్లందరికి కైలాసగిరి ప్రదక్షిణోత్సవంతో వీడ్కోలు పలికారు. నవ వధువైన జ్ఞానాంబికకు బేరి వంశీయులు తీసుకువచ్చిన నాగవల్లి బొట్టును ఆగమోక్తంగా అలంకరించారు.

కైలాసగిరి ప్రదక్షిణోత్సవానికి బయలుదేరిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులు

ఆలయంలో సినీనటి శ్రేయ, బోర్డు ఛైర్మన్ సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆనంద్, తారక శ్రీనివాసులు

ప్రసూతి.. మసకబారుతున్న ఖ్యాతి

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఒకప్పుడు అమ్మతనానికి పురిటి గడ్డ. కాన్పు అంటే ప్రసూతి (ఆడోళ్ల ఆస్పత్రి)కి వచ్చేవారు. అక్కడే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మహామహులు జన్మించారు. అలాంటి ప్రసూతి ఆస్పత్రి ఖ్యాతి ప్రస్తుతం మసకబారుతోంది. రోజుకు 35 - 40 కాన్పులు జరిగే ఆస్పత్రిలో ఫిబ్రవరిలో 12 - 14కు పడిపోయింది. సిజేరియన్ కాన్పులు చేస్తే.. ఆస్పత్రిలోనే ఇన్‌ఫెక్షన్‌కు గురవుతున్నారు. ఐదారు రోజుల్లో డిశ్చార్జ్ కావాల్సిన వారు పక్షం రోజులు ఆస్పత్రిలో గడపాల్సి వస్తోంది. అలా ఆరోగ్యం కుదుటపడక తనువు చాలించిన వారు ఆరేడు నెలల్లోనే ఆరుగురు ఉన్నారు. ప్రభుత్వం తగినంత మంది వైద్యులు.. సదుపాయాలు సమకూర్చినా గర్భిణుల్లో ప్రసూతిపై నమ్మకం రోజు రోజుకూ సన్నగిల్లి ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు.

7 యూనిట్లు.. పెరగని ప్రసవాలు

ఇద్దరు వైద్యులు ఉండే ప్రైవేట్ హాస్పిటల్‌లో రోజూ రెండు ప్రసవాలు జరుగుతుంటే. . 9 మంది ప్రొఫెసర్లు, ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు.. 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఐదుగురు ఎస్ఆర్‌లు, 41 మంది పీజీలతో కొనసాగుతున్న 7 యూనిట్ల ప్రసూతి ఆస్పత్రిలో కేవలం 20 కాన్పులకు మించడం లేదు. ప్రసూతి విభాగాధిపతి, మెటర్నిటీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ పదవులు ఒక్కరికే ఉండటంతో దీని ప్రభావం వైద్య సేవలపై పడుతోంది.

గత ఐదేళ్లలో జనవరిలో జరిగిన ప్రసవాలు

ఏడాది	డెలివరీలు	సిజేరియన్లు
2022	836	341
2023	876	362
2024	780	336
2025	749	297

ఓపీ వద్ద ఎదురుచూస్తున్న మహిళలు

నిర్లక్ష్యంతోనే ప్రైవేట్‌కు

ప్రసూతి ఆస్పత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తుంది. రోజూ ఓపీకి వందల్లో గర్భిణులు వస్తుంటే.. చివరకు అడ్మిట్ అయ్యేది మాత్రం పదుల సంఖ్యలో ఉంటున్నారు. మిగిలిన వారు ప్రైవేట్ హాస్పిటల్‌ను ఆశ్రయిస్తున్నారు. అక్కడి వైద్యులే సొంత ఆస్పత్రులకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. సాధారణ కాన్పుల కన్నా శస్త్రచికిత్సలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీరిలో ఇటీవల పదుల సంఖ్యలో ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యారు.

23న మహిళా వర్సిటీలో చాగంటి ప్రసంగం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఈ నెల 23న శ్రీ పద్మావతి మహిళా వర్సిటీకి రానున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కార్యక్రమం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలలనుంచి 1200 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రెండు గంటలపాటు విద్యార్థులతో గడిపి వారి సందేహాలు నివృత్తి చేస్తూ విద్యా విలువలు, వ్యక్తిత్వ వికాసంపై దిశానిర్దేశం చేయనున్నారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో జనవరి నెలలో నిర్వహించిన బి.ఒకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 63,804 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.90 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

ఉద్యోగే కాదు.. అయినా విధులు

అనధికారికంగా తిరుపతి నగరపాలికలో కొలువు



నగరపాలిక సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అనధికారిక వ్యక్తి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: ఈ వ్యక్తిని చూశారా. ఇతను తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అనధికారికంగా పని చేస్తున్నారు. నగరపాలిక అధికారిక లాగిన్‌లో ఇంటి పన్నుల మదింపు దస్త్రాన్ని అప్‌లోడ్ చేస్తున్న దృశ్యమిది. ఇతడి పేరు ప్రసన్నకుమార్ అని సిబ్బంది చెబుతున్నారు. ఈ వ్యక్తికి కార్యాలయంలో అధికారికంగా ఓ సీటు, కంప్యూటర్‌తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం గమనార్హం. అసలు నగరపాలికకు సంబంధమే లేని వ్యక్తికి పెద్దపీట వేయడం శోచనీయం.

కీలక విభాగంలో పని..

ఇతడు గత ఐదారేళ్లుగా ఉద్యోగిగా చలామణి అవుతున్నట్లు అక్కడి వారు చెబుతున్నారు. అందులోనూ కీలకమైన రెవెన్యూ విభాగంలో ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అనధికారిక సహాయకుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. సదరు ఆర్ఐ తరపున ఆస్తి పన్ను దరఖాస్తుల స్వీకరణ, పన్ను మదింపు, విధింపు, బకాయిల వసూలు ఇలా అన్నింటిని ఇతనే చక్కబెడతారు. తిరుపతి నగరపాలక సంస్థలో 2019 వరకు ఐదుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండగా.. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో నలుగురు ఉద్యోగులను దొడ్డిదారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా నియమించింది. వారిలో ఒకరికి ప్రసన్నకుమార్ సహాయకుడిగా సేవలు అందించి.. అప్పట్లో రెవెన్యూ విభాగంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను మార్చినా అనధికారిక సహాయకులు మాత్రం కొనసాగుతున్నారు.

మరో ఇద్దరు సైతం..

అతనితో పాటు మరో ఇద్దరు సైతం ఇలానే కొనసాగుతున్నారు. కార్యాలయంలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా డికేటీ భూములు, నిషేధిత భూముల్లో నిర్మించిన ఇళ్లకు సైతం పన్నులు మార్చిన మాఫియాపై విచారణ ప్రారంభమైంది. నగరపాలిక అధికారులు ప్రస్తుతం 126 అసెస్మెంట్‌లలో మాత్రమే పేర్లు మార్పు జరిగినట్లు గుర్తించినప్పటికీ ఐదారేళ్లుగా విచ్చలవిడిగా ఈ తరహా పన్ను మార్పులు జరిగినట్లు చెబుతున్నారు.

అలాంటి వారిని సాగనంపుతాం

రెవెన్యూ విభాగంలో ఇద్దరు వ్యక్తులు చాలా ఏళ్లుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. వారిద్దరినీ ఇక కార్యాలయంలోకి అడుగు పెట్టనివ్వం. వారితో పనిచేయించుకుంటున్న ఉద్యోగులపైనా చర్యలు తీసుకుంటాం.

– అమరయ్య, ఉప కమిషనర్

మెరుగైన ఫలితాలు సాధించాలి: జేఈవో

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తితిదే జేఈవో (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్ సూచించారు. గురువారం ఆయన కళాశాల, వసతి గృహాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు తితిదే విద్యా సంస్థల్లో సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పరీక్షల ఫలితాలు తగ్గితే సంబంధిత అధ్యాపకులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం వసతి గృహాల వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయలు కాలానికి చెందిన పురాతన బావిని, కోనేరును పరిశీలించి అందంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థినులతో అనంతరం కలిసి భోజనం చేశారు.

వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న శరత్

(c) eenadu

ప్రత్యేకం.. శ్రీకాళహస్తికి సొంతం

చతుర్విధ పురుషార్థాలకు నిదర్శనం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేషత సంతరించుకున్న స్వర్ణ, రాతి ధ్వజస్తంభాలు ◗ 30 ఏళ్ల క్రితం కన్పిస్తున్న కట్టడాలు

శ్రీకాళహస్తీశ్వరాలయం అద్భుతమైన శిల్పసంపదకు నిలయమే కాదు.. ఎన్నో ప్రత్యేకతలకు నిదర్శనం కూడా. ఇక్కడి ఆలయాన్ని ఎందరో రాజులు, చక్రవర్తులు, జమిందార్లు ఎంతో అభివృద్ధి పరిచారు. అయితే ఇక్కడున్న ప్రత్యేకతలను పురాతన కాలం నుంచి సంరక్షిస్తూనే వస్తున్నారు.

అవి.. చతుర్విధ పురుషార్థాలు..: ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు చతుర్విధ పురుషార్థాలుగా పిలుస్తారు. అయితే ఇవన్నీ ఒకే దగ్గర ఉండటం విశేషతను సంతరించుకుంటోంది. వాయు లింగేశ్వరుని దర్శనార్థం వెళ్లే సమయంలో మహాద్వారం ఎదురుగా ఉన్న నందీశ్వరుడు, బలి పీఠం, రాతిధ్వజస్తంభం, దారు ధ్వజస్తంభం వరుస క్రమంలో ఉండటం విశేషం. రెండు ధ్వజ స్తంభాలు పక్కపక్కన ఉండటం, అందులో ఒకటి ఏక శిలా ధ్వజ స్తంభంగా ఖ్యాతి పొందింది. ఇక్కడి ధ్వజస్తంభంపై ఒక్కో దిక్కున ఒక్కో దేవతా రూపం చెక్కబడి ఉన్నారు. దీనిపై ఉన్న వజ్రేశ్వరీ దేవి ప్రతిమ మరింతగా ఆకట్టుకోవడం విశేషం. శ్రావణ మాసంలో ఇక్కడి అమ్మవారికి విశేష అలంకరణలు చేపడతారు. ఇలాంటి ధ్వజస్తంభం దక్షిణ భారత దేశంలో ఎక్కడా కన్పించదు మరి. మరొకటి దారు ధ్వజస్తంభానికి బంగారు పూత వేయించడంతో మరింత సుందరంగా ఆకట్టుకుంది. ఇలా క్రమ పద్ధతిలో అమరినట్లు దేశంలో మరెక్కడా లేదన్న విషయాన్ని స్థల పురాణంలో విశద పరిచారు.

ఒక్కొక్కటి ఒక్కో ప్రాభవం..: దక్షిణామూర్తిని చూస్తూ నిత్యం ఆయన్ను సేవించుకుంటూ ఉన్న నందీశ్వరుని విగ్రహం ధర్మానికి ప్రతీకగా చెప్తారు. నంది విగ్రహం చిన్నపాటి మండపంలో కొలువుదీరి ఉంటుంది. ఇక వెనుక వైపున బలిపీఠం అర్థమునకు, రాతి ధ్వజస్తంభం కామమునకు, స్వర్ణ ధ్వజస్తంభం మోక్షానికి ప్రతీకలుగా చెప్తుంటారు. మహద్వారం ఎదురుగా ఇవన్నీ ఏర్పాటై ఉండటం, అందులోనూ ఎంతో ముచ్చటగా భక్తులను ఆకట్టుకోవడం విశేషం. ఇలా చారిత్రాత్మకంగా, పురాణపరంగా ఇంతటి విషయ సమాచారం ఇక్కడే దాగుండటం విశేషం.

ముక్కంటి ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

జ్ఞానతత్వం.. మేధా దక్షిణామూర్తి వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయం అక్షరాభ్యాసాలకు ఎంతో మహోన్నతమైందనే చెప్పాలి. ఎందుకంటే రుషులకు వేద విజ్ఞాన తత్వాన్ని బోధించే మేధా దక్షిణామూర్తి కొలువుదీరిన ఆలయం ఇది. మహద్వారం నుంచి ఆలయంలోనికి అడుగుపెట్టగానే కన్పించే విశేష మహిమాన్విత మూర్తి దక్షిణామూర్తి. అందుకే ప్రతి గురువారం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పాఠశాలలు పునః ప్రారంభించాక ప్రభుత్వం తరపున భారీగా అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా వసంత పంచమితో పాటు ఎప్పుడైనా అక్షరాభ్యాసాన్ని జరిపించుకునే విధంగా ఇక్కడి ఆలయంలో ఏర్పాట్లు ఉన్నాయి. దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ విశేష ఆర్జిత సేవ నిర్వహిస్తుంటారు.

మీకు తెలుసా

టికెట్ ధర: రూ.216 **ప్రవేశం:** ఒకరికి **నిర్వహణ ప్రదేశం:** శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి **సేవా ఫలం:** దక్షిణామూర్తి జ్ఞానప్రదాత. ఆయన చెంతన అక్షరాభ్యాస మహోత్సవం జరుపుతుంటారు. పలక, విద్యా ఉపకరణాలు భక్తులే తీసుకురావాలి. వేదపండితుల మంత్రోచ్చారణలతో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించవచ్చు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

◗ శ్రీవారి ఆలయం ఎదుట సినీనటి శ్రేయశరణ్ ◗ డ్రమ్స్ శివమణి ◗ నటీమణి రమ్యశ్రీ ◗ నటుడు చరణ్‌రాజ్ ◗ తెలంగాణ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీవారి తోమాలసేవలో హీరోయిన్ శ్రియాశరణ్, ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో డ్రమ్స్ శివమణి, ప్రొడ్యూసర్ లోహిత్, నటీమణి రమ్యశ్రీ, నటుడు చరణ్ రాజ్, తెలంగాణ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో తిరుమల చక్కగా ఉంది

ఆలయం వెలుపల నటుడు చరణ్‌రాజ్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో తిరుమల చక్కగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. తిరుమలలో పేదలు, ధనవంతులు అనే తేడా లేకుండా అందరికి చక్కటి సౌకర్యాలు తితిదే కల్పిస్తోందన్నారు. తెలుగు, తమిళం, కన్నడలో సినిమాలు చేస్తున్నానని త్వరలోనే తన కుమారుడు హీరోగా చిత్రం చేసేందుకు ప్రాజెక్టు సిద్ధం చేస్తున్నామన్నారు.

వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువాన్షత్, డాక్టర్ పి.చాయ్ జాన్సన్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్‌ఎంయూటీకే) 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువాన్షత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ ఛైర్మన్ డాక్టర్ పి.చాయ్ జాన్సన్ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారు. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీకి తితిదే వార్షిక గ్రాంటు పెంపు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీకి తితిదే ఏటా అందజేస్తున్న వార్షిక నిర్వహణ గ్రాంటును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ (ఎండోమెంట్స్-3) శాఖ జీవో 129ను గురువారం విడుదల చేసింది. ఇప్పటివరకు వర్సిటీకి తితిదే ద్వారా అందుతున్న గ్రాంటు రూ.కోటి ఉండగా.. దాన్ని రూ.1.50 కోట్లకు పెంచారు. ఈ పెంపు 2024-2025 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుంది. తితిదే బోర్డు తీర్మానం మేరకు కార్యనిర్వాహక అధికారి ప్రతిపాదన్ని సంప్రదించగా, పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మరింత ఊతం లభించనుందని వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖ సహాయ కమిషనర్‌గా సుధ

తిరుపతి (విద్య): జిల్లా విద్యా శాఖలో సహాయ కమిషనర్ (పరీక్షల విభాగం)గా సుధ బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న పగడాల గురుస్వామిరెడ్డి గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో అమరావతిలో విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా ఉన్న సుధను పదోన్నతిపై నియమించగా విధుల్లో చేరారు. పది పరీక్షల కోసం ఆమెను నియమించారు.

ఆర్చరీలో మళ్లీ పసిడి

ఆర్చరీ క్రీడాకారుడితో గణేష్ మణిరత్నం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం కేరళ రాష్ట్రంలోని కొచ్చి కేంద్రంగా బుధవారం జరిగిన ఎన్‌టీపీసీ మూడో జాతీయ ఆర్చరీ టోర్నమెంట్ పోటీల్లో సీనియర్ కాంపౌండ్ విభాగంలో రెండో పసిడి పతకం సాధించారు. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 13 పసిడి పతకాలు సాధించిన ఆర్చరీ క్రీడాకారుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు.

వేడుకగా హయగ్రీవ ప్రతిష్ఠ

ముగిసిన అష్టబంధన మహోత్సవం

ధ్వజస్తంభానికి పంచగవ్యాదివాసం చేస్తున్న అర్చకులు

నాగలాపురం, న్యూస్‌టుడే: వేద నారాయణస్వామి ఆలయంలో విశేష ప్రాధాన్యమున్న హయగ్రీవస్వామి పరివార ఆలయాన్ని నూతనంగా నిర్మించి స్వామిని వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. ఆలయంలోని దేవతామూర్తుల విగ్రహాలకు అష్టబంధన మహోత్సవాన్ని గురువారం పూర్తి చేశారు. ఆలయ యాగశాలలో కలశాలలో సిద్ధం చేసిన అభిషేక జలంతో విగ్రహాలకు పంచగవ్యాదివాసాన్ని మంగళవాయిద్యాల నడుమ అర్చక బృందం పూర్తి చేశారు. రెండేళ్లుగా కూలీల కదలికలతో ఉన్న ఆలయ గర్భాలయాలను అర్చకులు తమ ఆధీనంలోకి తీసుకుని పూజాధికాలకు శ్రీకారం చుట్టారు. ఏర్పాట్లను తితిదే సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారులు చెంగల్రాయులు, శ్రీనివాసులు, ప్రధానార్చకులు నాగరాజుభట్టాచార్యులు పర్యవేక్షించారు.

ప్రేరణతో నైపుణ్యాలు మెరుగు

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ప్రేరణ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపడుతాయని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గీత అన్నారు. గురువారం విద్యాలయంలో అనుభవ పూర్వక అభ్యాస కార్యక్రమం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2,881 మంది బాలబాలికలు నమోదు చేసుకోగా 136 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి, భారతదేశంపై దార్శనికత, వికసిత్ భారత్ అంశాల్లో వ్యాసరచన, కవితా రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 30 మంది విజేతలను ఎంపిక చేశామని, వారు గుజరాత్ రాష్ట్రంలోని పురాతన చారిత్రక పట్టణం వాద్‌నగర్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. నిర్వాహకులు సురేంద్రన్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు అవసరం

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏపీసీటీఈ వీసీ నరసింగరావు, కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, అధ్యాపకులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో మనసులో పుట్టే చిన్న ఆలోచన సమాజానికి ఉపయోగపడే మహత్తర ఆవిష్కరణలు కావాలని ఏపీసీటీఈ విశ్వవిద్యాలయ ఉపకులపతి తాతా నరసింగరావు తెలిపారు. పి.కొత్తకోటలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయన ఏపీసీటీఈ ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఏపీసీటీఈ సహకారంతో ఏర్పాటు చేసిన వేము ఐడియా ల్యాబ్ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, స్టార్టప్ ఆలోచనలను పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రిన్సిపల్ నవీన్ కిలారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట నూతన గేట్ల ఏర్పాటు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయం ఎదుట నూతన గేట్లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఉన్న గేట్ల స్థానంలో మడతపెట్టే (ఫోల్డబుల్) గేట్లను కార్మికులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ నియంత్రణకు వీటిని వినియోగిస్తారు.

శ్రీవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న నూతన గేట్లు

నకిలీ కళాశాలలపై విద్యార్థి సంఘాల ఫిర్యాదు

తిరుపతి (ఎస్వీయూ): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న నకిలీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వీసీ ఆచార్య నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావులకు పలు విద్యార్థి సంఘాల నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విద్యార్థులను చేర్చుకుంటూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాల నిబంధనలు అతిక్రమించడంతో రూ.10 లక్షలు జరిమానా విధించగా.. సగం మాత్రమే చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని వసూలు చేయాలన్నారు. తిరుపతి ఆటోనగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా కళాశాలలు నడుపుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని సమర్పించారు.

రూ.11 కోట్లతో

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 2026-27 ఆర్థికానికిగానూ రూ.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌ను ఆమోదించారు. చిత్తూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరిగింది. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ చిత్తూరులో జరుగుతున్న జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణ పనుల్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, డీఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION TO LET

COACHING CENTRES

2 నెల్లో 10th, ఇంటర్ (MPC, Bi.P.C, C.E.C) State Govt బోర్డ్ ద్వారా March 26, పరీక్షలు వ్రాయడానికి Passతో All CETS Eligible, Exam Center TPT. ✆ 99851 92105, 94406 50496.

DISTANCE EDUCATION

B.Tech, M.Tech, Diploma, MBA, MCA, M.Sc(IT&CS), B.Sc (Ag), BBA, BCA, D.Pharm, B.Pharm, LLB, Ph.D, 10th, Inter. Noble Institute, Nellore. Ph: 8008303655, 9440278681

FINANCIAL SERVICES

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

APARTMENTS

TIRUPATI POSTAL Colony 3 BHK New Construction East Facing 1st Floor NRR Enclave - Near Pradepty Residency ✆9440847355

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Wanted Sales Executive: Job Location Kadapa & Chittoor (Dist.). Qual: Dip/ B.Tech/ Degree. Exp: Fresher/ 2-3 yrs. Salary: 20-30K + TA & DA. Cont: 83286 75684 or mail: jkmedicalsystems@gmail.com

WANTED TELECALLER & PRO -04, Marketing Executive -50. Same Mandal in Work Cont: 88013 98165.

WANTED IMMEDIATELY PRO's & Higher Biology Teacher for a reputed School in Mangalam & Tirupati. Con: 81794 67247.

AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

80085 13290

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

ఆంగ్లభాషణం.. భయం వీడితే భూషణం

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అంజలా సూజన్ బకూలా, హరిపద్మారాణి

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: భయం, అపోహలు వీడితే ఆంగ్లంలో సులువుగా సంభాషించొచ్చని అమెరికా నుంచి విచ్చేసిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెలో అంజలా సూజన్ బకూలా, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఆంగ్ల విభాగాధిపతి హరిపద్మారాణి పేర్కొన్నారు. వర్సిటీలో గురువారం మైక్రోబయాలజీ విద్యార్థినులకు ఆంగ్లంలో నిర్వహించిన భావవ్యక్తీకరణ నైపుణ్యాల కార్యశాలలో వారు మాట్లాడారు. ఆంగ్లంలో మాట్లాడాలంటే చాలామంది భయపడుతుంటారని, తక్కువ పదాలతో సులువుగా ఆంగ్లం మాట్లాడటం నేర్చుకోవచ్చన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

తిరుపతి (మహిళా వర్సిటీ): సంగీతంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. వర్సిటీ సంగీతం, నృత్య, లలిత కళల విభాగంలో పీఎం ఉష యాక్టివిటీ-29లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యశాలలో ఆమె మాట్లాడారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత సుధానిధి రాగాలాపనలపై వివరించారు. సంగీత విభాగాధిపతి శైలేశ్వరి, అధ్యాపకురాలు హిమబిందు పాల్గొన్నారు.

అమరలో వంద మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు

మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్ గొరినేని

రేణిగుంట: ఆస్పత్రిలో విజయవంతంగా వంద రోబోటిక్ మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేయడం తమకు ఎంతో గర్వకారణమని అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని తెలిపారు. గురువారం ఆస్పత్రిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి వరదరాజనగర్‌కు చెందిన 70 ఏళ్ల శంకర్‌నారాయణకు 100వ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యంత సురక్షితమన్నారు. రోగులు వేగంగా కోలుకుని సాధారణ స్థితికి వస్తారని వివరించారు. ఎంతో అనుభవం కలిగిన వైద్యులతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. వైద్యులు రవికుమార్, కృష్ణయ్య, హేమంత్ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అవకాశాలు కల్పించాలి

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంభం లోకయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక కేటీ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం పలు నియోజకవర్గాలు, మండలాల నూతన కమిటీలను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మధు మార్గచార్య, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేంద్ర, డాక్టర్ మస్తానమ్మ, షరీఫ్, రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో భర్త బలవన్మరణం

రేణిగుంట, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని కుమ్మరపల్లెలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మోపాటి హరిబాబు (33) బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరేసుకున్నాడు. గురువారం కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. మృతదేహన్ని పరీక్షల నిమిత్తం రుయాకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

హరిణి (పాతచిత్రం)

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. అప్పంబట్టుకు చెందిన రంగన్‌రెడ్డి కుమార్తె హరిణి(23)కి ఏడాది కిందట చిత్తూరుకు చెందిన భరత్‌కుమార్‌తో వివాహమైంది. ఆర్మీలో ఆయన పనిచేస్తుండటంతో ఇంటివద్ద అత్తమామలు చంద్రబాబు, గౌరమ్మలతో హరిణి ఉండేది. వీరి నడుమ వాగ్వాదాలతో గురువారం హరిణిని అత్తమామలు అప్పంబట్టులోని పుట్టింటికి తీసుకువచ్చి వదలివెళ్లిపోయారు. కాసేపటికే ఆమె ఇంటివద్ద ఉరేసుకుని మరణించింది. విషయం తెలుసుకున్న మృతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిని అపహరించి.. నగదు దోపిడీ..!

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

నిందితులతో తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు, పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పరిచయం లేని యువకుడిని అపహరించి.. రూ.60 వేలు నగదు దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. 'తిరుపతి ఆటోనగర్‌కు చెందిన అఖిల్.. తాజ్ హోటల్‌లో పనిచేస్తారు. ఈ నెల 11న నగరంలోని తుడా రోడ్డులో మద్యం మత్తులో ఉండగా.. అదే సమయంలో కారులో వచ్చిన నలుగురు అఖిల్‌ను కారులో అపహరించారు. అతన్ని కొట్టి సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్ పిన్ నంబరు తెలుసుకున్నారు. చరవాణి నుంచి గేమింగ్ స్కానర్‌కు రూ.60 వేలు నగదు పంపించుకున్నారు. అఖిల్‌తో బలవంతంగా మత్తు పదార్థాలు తాగించి స్పృహ కోల్పోయాక కారు నుంచి గెంటేశారు. కోలుకున్న అఖిల్ బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించి.. ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చింతలచేను రైల్వే గేటు వద్ద ఉన్న నలుగురిని గురువారం అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఎర్రసానిపల్లి గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ (27) కొంతకాలంగా తిరుపతి కొర్లగుంటలోని సోదరి ఇంట్లో ఉంటూ డ్రైవింగ్ చేస్తుంటారు. అతనికి పుత్తూరు సమీపంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న శ్రీనగర్ కాలనీకి చెందిన యోగేష్ (21), చిన్నగొట్టిగల్లు మండలం నల్లుంట్లవారిపల్లెకు చెందిన గురు ప్రకాష్ (21), బుచ్చినాయుడుకండ్రిగ మండలం తనిగల్లుకు చెందిన చరణ్ (21)తో పరిచయం ఏర్పడింది. అందరూ మద్యం మత్తులో అఖిల్‌ను అపహరించి ఫోన్‌లో నగదు కాజేశారు. నిందితుల నుంచి కారు, రూ.24 వేలు నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక పశువైద్య వర్సిటీ పాలక మండలి సభ్యుడిగా జి.ఆర్.కె.శర్మ

జి.ఆర్.కె.శర్మను సన్మానిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి, (పశువైద్య వర్సిటీ): శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పశువైద్య విస్తరణ విభాగాధిపతి డా. జి.ఆర్.కె. శర్మ కర్ణాటక పశువైద్య వర్సిటీ పాలక మండలి సభ్యుడిగా, అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన పశువైద్య నిపుణుల విభాగంలో పాలక మండలి సభ్యుడిగా వర్సిటీ పాలనలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా పశువైద్య వర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు యు.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జి.ఆర్.కె.శర్మను సత్కరించారు.

ఏప్రిల్ నుంచి వీబీ జీరామ్‌జీ

మార్చి నెలాఖరుకు ఉపాధి హామీ పనుల పూర్తికి పరుగులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మార్చి నెలాఖరుతో ఉపాధి హామీ పథకం శకం ముగియనుంది. ఆపై వీబీ జీ రామ్‌జీ పేరుతో సరికొత్తగా ప్రారంభం కానుంది. ఈ లోపు పనులు, పద్దులను పూర్తి చేయాలని అధికారులు దృష్టి సారించారు. సమయం తక్కువగా ఉండడంతో నిత్య సమీక్షలతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో హడావుడి నెలకొంది. ఏప్రిల్ 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ(వీబీజీరామ్‌జీ) పేరుతో సరికొత్త నిబంధనలతో ప్రారంభం కానుంది.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి.. మొక్కలు నాటడం, రోడ్ల నిర్మాణం, పంట కుంటల తవ్వకం, ఇలా అనేక పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉంటే బిల్లులు యుద్ధ ప్రాతిపదికన చెల్లిస్తున్నారు. గోకులాలు, పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, ఇలా అనేకం నిర్మాణంలో ఉండడంతో మార్చి 31లోగా పూర్తవుతాయా అన్న అనుమానాలున్నాయి. ఈ విషయాన్ని అధికారులు ఉన్నత స్థాయికి నివేదించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో స్పష్టత కోరారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 45 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా, 23 లక్షల పని దినాలు పూర్తయ్యాయి.

మారిన నిబంధనలు.. కొత్త విధానంలో లేబర్, మెటీరియల్ బడ్జెట్ నుంచి పరిపాలన ఖర్చుల వరకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలి. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఆధునిక సాంకేతికత, బయోమెట్రిక్ హాజరు, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ(డీబీటీ) అయ్యేలా నిబంధనలు అమలు చేయనున్నారు.

సులభంగా డబ్బు సంపాదనకు బాలికల అపహరణ

☛ నిందితురాలిని పట్టుకున్న తిరుమల వన్‌టౌన్ పోలీసులు ☛ తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

◗ చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన తిరుమల వన్‌టౌన్ పీఎస్ ఎస్‌ఐ రమేష్‌బాబు తదితరులు ◗ నిందితురాలు గుండ్లూరు శివమ్మ

తిరుమల, న్యూస్‌టుడే: సులభంగా డబ్బు సంపాదించేందుకు ఇద్దరు చిన్నారులను అపహరించిన నిందితురాలిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికలను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎస్‌ఐలు చలపతి, రమేష్‌బాబు కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన లక్ష్మి, రాంబాబు దంపతులు తమ కుమార్తెలు నవదుర్గ(5), అశ్విని(3)లతో తిరుమల వచ్చారు. ఈ నెల 16న ఉదయం స్థానిక నాదనీరాజనం ప్రాంతంలో బాలికలు ఆడుకుంటుండగా. . అన్నమయ్య జిల్లా కలకడ మండలానికి చెందిన గుండ్లూరు శివమ్మ (42) వారిని అపహరించి తన వెంట తీసుకుపోయింది. బాలికల తల్లి తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారం సేకరించారు. ప్రత్యేక పోలీసు బృందాలతో నిందితురాలిని ఈ నెల 17న కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకుని ఇద్దరు చిన్నారులను రక్షించారు. బాలికలకు రాజమహేంద్రవరం బాలల సంరక్షణ గృహానికి అప్పగించి, నిందితురాలిని హోంకు తరలించారు. సులభంగా నగదు సంపాదించాలనే ఉద్దేశంతో తిరుమలలో ఒంటరిగా ఉన్న చిన్నారులను అపహరించి వారితో భిక్షాటన చేయించేందుకు ప్రణాళిక రచించినట్లు నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతిలోని సీడబ్ల్యూసీ ద్వారా బాలికలను తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన తిరుమల 2 టౌన్ సీఐ శ్రీరాముడు, వన్‌టౌన్ ఎస్‌ఐలు డి.రమేష్‌బాబు, సి.చలపతి, సీసీఎస్ ఎస్‌ఐ నరేష్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

చేతివృత్తి శిక్షణ.. చేతినిండా సంపాదన

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: చేతి వృత్తుల్లో శిక్షణ పొందితే చేతినిండా సంపాదించవచ్చని నిరూపిస్తున్నారు దామినేడుకు చెందిన మహిళలు. తిరుపతికి చెందిన సిర్డ్స్ స్వచ్ఛంద సేవాసంస్థకు చెందిన ఉమెన్ రిసోర్స్ సెంటర్ దామినేడులోని మహిళలకు రెండేళ్లుగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తోంది. సొంత పనులు చేసుకుంటూ తీరిక సమయాల్లో కుట్లు, అల్లికలు నేర్చుకుని తద్వారా కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. సంస్థ ద్వారా ఈ ఏడాది 125 మంది మహిళలు కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ

టైలరింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళలు

తీసుకోగా.. వీరిలో 75 మందికి సిర్డ్స్ సంస్థ ఉచితంగా కుట్టుమిషన్లను అందజేసింది. ప్రస్తుతం ఈ సంస్థలో 40 మంది మహిళలు శిక్షణ పొందుతూ పలు రకాల డిజైన్లతో దుస్తులు కుడుతూ రోజుకు రూ.500 వరకు ఆర్జిస్తున్నారు.

కుటుంబానికి ఆసరా

మాది ఒంగోలు. బతుకు తెరువు కోసం రెండేళ్ల కిందట మేం తిరుపతి వచ్చాం. సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ టైలరింగ్ నేర్పిస్తున్నారని తెలిసి నేనూ చేరాను. మిషన్లు తీసుకునేందుకు కూడా నా వద్ద నగదు లేకపోతే సంస్థ నుంచే మాకు ఉచితంగా మిషన్లు పంపిణీ చేసి మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. నా భర్త మేస్త్రీ పనితో వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోవడం లేదని నేను కుట్టు శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం నేను శిక్షణ పొందుతూనే చిన్న చిన్న ఆర్డర్లతో రోజుకు రూ.200-500 వరకు సంపాదిస్తున్నా. **- వి.లక్ష్మి, దామినేడు**

ఆర్యావర్క్‌లోనూ తర్ఫీదు

నా భర్త వంట పని చేస్తారు. ఆయన సంపాదన సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నాం. నేను ఇంట్లో ఖాళీగానే ఉంటూ ఏదైనా పనికి వెళ్లాలని ఆలోచించే సమయంలో సిర్డ్స్ సంస్థ టైలరింగ్ శిక్షణలో చేరా. శిక్షణతోపాటు కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. ఆర్యావర్క్, కలంకారీ పెయింటింగ్‌లోనూ శిక్షణ ఇచ్చారు. దుస్తులు కుట్టడం నేర్చుకుంటూ వచ్చిన ఆర్డర్లతో కొంతవరకు సంపాదిస్తున్నా. కుటుంబ పోషణలో నా వంతు ఆర్థికంగా సహకరిస్తున్నా. **- యమున, దామినేడు**

అమ్మవారి సేవలో స్వామీజీలు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని గురువారం జర్మనీకి చెందిన పరమహంస విశ్వానందస్వామీజీ 20 దేశాలకు చెందిన 150 మంది శిష్యులతో కలిసి దర్శించుకున్నారు. అపోలో సంస్థల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి వేరుగా అమ్మవారి సేవలో పాల్గొన్నారు. శ్రీపద్మావతీ అమ్మవారిని తమిళనాడు తిరునల్వేలి

అమ్మవారి ఆలయం వద్ద పరమహంస విశ్వానందస్వామీజీ

ఆళ్వార్ తిరునగరి పీఠాధిపతి శ్రీరంగరామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు.

వీక్షించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు వాట్సాప్ ద్వారా 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెస్తున్న సమస్యలను అధికారులు పరిష్కరించారు. నగరపాలిక అనుబంధ సమస్యల్ని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాలతో ఎస్ఈ శ్యాంసుందర్, డీసీపీ ఖాన్, వైద్యాధికారి యువఅన్వేష్, పశువైద్యాధికారి గుణశేఖర్ పరిష్కరించడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ✱ దొడ్డాపురం నగరపాలిక పాఠశాల ఎదుట చెత్త కుప్పలను సిబ్బంది తొలగించారు. ✱ గ్రీన్ పార్కు అపార్టుమెంట్ వెనుక కాలువ పునర్‌నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ✱ ఎస్ఎల్‌వీ నగర్‌లో తాగునీటి సరఫరా వ్యవస్థను సరిచేశారు. ✱ మహిళా వర్సిటీ ముందున్న రహదారిలో వేగనిరోధకాలు గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. ✱ ఎన్జీవో కాలనీలోని ఖాళీ జాగాల్లో పాముల సంచారాన్ని నియంత్రించేందుకు చెత్త తొలగించారు. ✱ బండారు కాలనీలో చెత్త తరలింపు ప్రాంతాన్ని మార్చారు. ✱ రాయల్‌చెరువు రైతుబజార్ వద్ద ట్రాఫిక్ సమస్య తాత్కాలికంగా పరిష్కరించారు. ✱ స్కావెంజర్స్ కాలనీలో కోళ్లదుకాణదారు కాలువలో వ్యర్థాలు వేయకుండా అధికారులు హెచ్చరించారు. ✱ లీలామహల్ - రైల్వేకాలనీ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదించారు. ✱ కొర్లగుంట మారుతీనగర్‌లో మీసేవ వద్ద మురుగు కాలువల్లో పూడికతీశారు. ✱ ఎల్.ఎస్.నగర్‌లోని అనధికారిక హోంస్టేలతో కలుగుతున్న ఇబ్బందులను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ✱ పద్మావతినగర్‌లోని కుక్కల బెడద, అక్కారంపల్లెలో ఖాళీస్థలంలో వేస్తున్న చెత్త సమస్యలను పరిష్కరించారు. ✱ రామచంద్ర పుష్కరిణి వద్ద రోడ్డు మీదకు విస్తరించిన దుకాణాలను అక్కడి నుంచి తరలించారు.

రామచంద్ర పుష్కరిణి వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న తోపుడుబండ్లు తరలిస్తున్న అధికారులు

వీధుల్లో వెలుగులు

✱ పద్మావతినగర్, వేశాలమ్మగుడి, గొల్లవానిగుంట గంగమ్మ వీధుల్లో దీపాలకు మరమ్మతులు చేశారు.

రోడ్డు తవ్వి.. అసంపూర్తిగా వదిలేసి

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: నగరంలోని ముత్యాలరెడ్డిపల్లి ఎల్ఎస్‌నగర్‌లో ప్రధాన రోడ్లకు అనుసంధానంగా ఉన్న ఏడు రోడ్ల మరమ్మతులు చేయడానికి గుత్తేదారు తవ్వారు. పనులు పూర్తిచేయకుండా అసంపూర్తిగా మట్టిని కుప్పలుగా పోసి వదిలేశారు. ప్రధాన రహదారి నుంచి అనుసంధాన రోడ్ల గుండా ఇళ్లలోకి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగరపాలిక అధికారులు గుత్తేదారుతో త్వరితగతిన మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఎల్ఎస్‌నగర్‌లో రోడ్డు దుస్థితి

క్షేత్రస్థాయిలో పరిష్కరించకుంటే అదాలత్ దృష్టికి తెండి

తిరుపతి (జీవకోన): విద్యుత్ వినియోగదారుల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించకుంటే అదాలత్ దృష్టికి తేవాలని అదాలత్ ఛైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి సూచించారు. తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో 13 సమస్యలను ప్రజలు విన్నవించారు.

మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలోని బ్లూబింగ్‌బడ్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో గ్రేడ్-1 విభాగంలో తోషిణి, హర్షిత, చంద్రహాస్‌రాజు, గ్రేడ్-2లో కార్తీక్, హాసిని, చాతుర్యరెడ్డి; గ్రేడ్-3 విభాగంలో మోక్షిత్‌రెడ్డి, చాతుర్యయాదవ్, నిత్య; గ్రేడ్-4 విభాగంలో రుషాంక్‌రెడ్డి, కుషల్, స్వీకృతిరెడ్డి; గ్రేడ్-5 విభాగంలో తనుశ్రీ, భువనచంద్రారెడ్డి, అల్తాజ్ వరుసగా మూడు స్థానాలు దక్కించుకున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ బి.హితేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు.

మఠం భూముల కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతి పరిసరాల్లో మఠం భూమి ఆక్రమించి అమాయకులకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తిరుపతిలోని హెడ్ పోస్టాఫీస్ నుంచి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారా లోకేశ్‌కు లేఖలు పంపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

● **భక్తిశ్రద్ధలతో శ్రీరామకృష్ణ జన్మతిథి వేడుకలు.. పాకాల:** శ్రీరామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలను స్థానిక రామకృష్ణ మఠం వద్ద గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామకృష్ణ ఆదర్శాలను తిరుపతి రామకృష్ణ మిషన్ స్వామీజీ శ్రీ సత్యస్థానందజీ మహరాజ్ భక్తులకు వివరించారు. రామకృష్ణమఠం అధ్యక్షుడు ఎన్వీ రామచంద్రారెడ్డి, కార్యదర్శి విశ్రాంత మేజర్ పి.రవినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

● **గ్రంథాలయాల సందర్శన.. పాకాల:** దామలచెరువు, పాకాల శాఖా గ్రంథాలయాలను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రెడ్డివారి గురవారెడ్డి గురువారం సందర్శించారు. పుస్తకాలను పరిశీలించి, అవసరమైన వాటి గురించి ఆరా తీశారు. గ్రంథాలయాధికారులు తాళ్ల రవీంద్రబాబు, మురళిబాబు, కవి పత్తిపాటి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

● **తిరుమలలో కొద్దిసేపు స్తంభించిన ఎయిర్‌టెల్ సేవలు.. తిరుమల:** తిరుమలలో ఎయిర్‌టెల్ సేవలు గురువారం సాయంత్రం కొంతసేపు స్తంభించాయి. సాయంత్రం 4.30 నుంచి 6.00 గంటల వరకు సెల్‌ఫోన్‌లో సిగ్నళ్లు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

● **నాదోపాసన గోడపత్రికల ఆవిష్కరణ.. తిరుపతి (మంగళం):** హైదరాబాద్‌కు చెందిన శ్రీవాగ్దేవి కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో, 22న రాజంపేటలోని అన్నమయ్య ధ్యానమందిరంలో నిర్వహించనున్న నాదోపాసన కార్యక్రమం గోడపత్రికలను గురువారం తిరుపతిలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ శివశంకర్ లోతేటి ఆవిష్కరించారు.

● **తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయ ఛైర్మన్‌గా సతీష్.. తిరుపతి (బైరాగిపట్టెడ):** తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా అద్దేపల్లి సతీష్‌ను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

● **ట్రెండ్స్ భవనాల పరిశీలన.. తిరుపతి (మంగళం):** మంగళం సమీపంలోని ట్రెండ్స్ భవనాలను ఆర్డీవో రామ్మోహన్ గురువారం పరిశీలించారు. ఇక్కడున్న పరికరాలు, తుక్కుకు వేలం నిర్వహించి, పాడుబడిన భవనాలు తొలగించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించిన నేపథ్యంలో పరిశీలనకు వచ్చామన్నారు.

● **శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలి.. చంద్రగిరి:** స్థానిక కోటలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయాలని శాసనసభలో ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు.

● **8న వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం.. తిరుపతి (గాంధీరోడ్డు):** వన్నెకుల క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో మార్చిన 8న తనపల్లి రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం, వధూవరుల వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకురాలు తేజోవతి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు.

● **25లోగా సర్వే పూర్తి చేయండి.. రామచంద్రాపురం:** జిల్లాలో ఏకీకృత కుటుంబ సర్వేను ఈ నెల 25 లోగా పూర్తిచేయాలని జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జీవీ నారాయణరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం రామచంద్రాపురం మండలం సి.రామాపురం, నెన్నూరు స్వర్ణ గ్రామ కార్యాలయాలు తనిఖీ చేశారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: యువత శివాజీ మహరాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి, ధర్మరక్షణ, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు గోపినాథ్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా భాజపా ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, రామ్‌కుమార్, పురుషోత్తం, కిషోర్, మస్తాన్ పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

● **భాకరాపేట:** శివాజీ జయంతి వేడుకలను భాకరాపేట గాంధీ విగ్రహ కూడలి గ్రామస్థులు నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

WANTED
మా Wheels Zone కంపెనీ పాకల బ్రాంచ్ లో
సేల్స్ మేనేజర్ (Male)
పనిచేయుటకు కావలెను
జీతం: 20k, విద్యార్హత: డిగ్రీ
ONLINE ఇంటర్వ్యూ
Near HDFC Bank, Mainroad
✆77990 28444

కవర్లతో మామిడికాయల సంరక్షణ

దామలచెరువు (పాకాల), న్యూస్‌టుడే: మామిడి కాయలకు కవర్లు తొడిగితే శిలీంద్రం, బ్యాక్టీరియా వల్ల ఏర్పడే మచ్చలతో పాటు కాయ తొలుచు పురుగు, పండుఈగ, తేనెమంచు, ఇతర తెగుళ్ల నుంచి రక్షణ లభిస్తుందని ఉద్యానాధికారిణి శైలజ పేర్కొన్నారు. గురువారం దామలచెరువులో రైతులకు ఆమె అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఉద్యానాధికారిని సంప్రదిస్తే హెక్టారు విస్తీర్ణానికి గరిష్ఠంగా 15 వేల కవర్లను రాయితీపై పొందవచ్చని తెలిపారు.

కవర్ల ఆవశ్యకతను రైతులకు వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి శైలజ

టెండర్ ప్రకటన

యస్ వి గవర్నమెంట్ పాలిటెక్నిక్, కే. టి. రోడ్, తిరుపతి, నందు "క్యాంటీన్ మరియు "స్టేషనరీ & స్నాక్స్ షాప్" ల నిర్వహణ కొరకు టెండర్ లను ఆహ్వానిస్తున్నాము. టెండర్ దరఖాస్తు మరియు ఇతర వివరాలకొరకు 26-02-2026 లోపు కళాశాల పరిపాలనా అధికారి శ్రీ విశ్వనాధ గుప్త గారిని సంప్రదించగలరు.

Cell: 9849113258

నమ్మక ద్రోహం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

తిరుపతి (లీగల్): నమ్మక ద్రోహం కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారని ఏపీపీ సుజాత, కోర్టు పోలీసు ప్రభాకర్ తెలిపారు. రేణిగుంట రోడ్డులోని కుర్లాన్ కంపెనీ గిడ్డంగి ఇన్‌ఛార్జులు సి.ఎం.జితేంద్ర, జె.ఆర్.నాగరాజ 2021లో రూ.81,19,145 విలువైన కంపెనీ ఉత్పత్తులను దుర్వినియోగం చేశారు. ఈ మేరకు కంపెనీ లీగల్ అధికారి ఫిర్యాదు చేయగా అలిపిరి పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేశారు.

చెక్కు బౌన్స్ కేసులో మహిళకు ఆరు నెలలు..

తిరుపతి (లీగల్): చెక్కు బౌన్స్ కేసులో నిందితురాలికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు వెలువరించినట్లు న్యాయవాది వాణి తెలిపారు. చంద్రగిరి చర్చివీధికి చెందిన జి.మునిరాజమ్మ.. తిరుపతి శ్రీనగర్ కాలనీకి చెందిన టి.ఎస్.మోహన్‌రెడ్డి వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. మునిరాజమ్మ ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో కేసు నమోదైంది.

ప్రమాదం కేసులో డ్రైవర్‌కు.. చంద్రగిరి మండలం కొత్తూరుకు చెందిన సుమో డ్రైవర్ ఎ.నాగేంద్రరెడ్డి 2023 సెప్టెంబరు 26న రేణిగుంట రోడ్డులో నిర్లక్ష్యంగా వాహనం నడిపి రోడ్డు దాటుతున్న సెల్వరాజ్‌ను ఢీకొట్టాడు. సాక్ష్యాధారాలతో కేసు నిరూపితం కావడంతో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష పడింది.

ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్రగాయాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఎం.కొంగరవారిపల్లి పంచాయతీ బోడింబావి సమీపంలో గురువారం సాయంత్రం చిత్తూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన చంద్రగిరికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు ఎం.మంజునాథ్‌ను 108లో రుయాకు తరలించారు. ఎస్ఐ ప్రవల్లిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు అసోంవాసి.. చంద్రగిరి: నూకలగుంట సచివాలయం సమీపంలో ముళ్లపొదల్లో మూడ్రోజుల కిందట కనిపించిన మృతదేహం అసోం రాష్ట్రానికి చెందిన నయన్ మోనిబోరి(46)గా ఆధార్‌కార్డును బట్టి పోలీసులు గుర్తించారు.

యువకుడిపై పోక్సో కేసు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరుకు చెందిన బాలికను తిరుపతి యువకుడు యూనస్ (23) మూడు రోజుల క్రితం తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గురువారం యువకుడిని విచారణ చేయగా నేరం అంగీకరించడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్‌రెడ్డి చెప్పారు.

పాఠశాల జీవితం.. చెరిగిపోని జ్ఞాపకం

ప్రసంగిస్తున్న ఎంఈవో బాజ్జీ

పాకాల, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి పాఠశాల జీవితం ఓ అనుభవమని, వీడ్కోలు ఓ మధుర జ్ఞాపకమని ఎంఈవో బాజ్జీ పేర్కొన్నారు. మొగరాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈవో-2 లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తితిదే ఎస్వీ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తితిదే నిర్వహణలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల 54వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఆర్ఐవో రాజశేఖర్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పరీక్షలు, క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు.

జ్యోతి వెలిగిస్తున్న ఆర్ఐవో రాజశేఖర్‌రెడ్డి

ఓర్పుతో ఒత్తిడి దూరం.. తిరుపతి (మంగళం): ఏ రంగంలోనైనా ఎదురయ్యే ఒత్తిళ్లు, సవాళ్లను ఓర్పుతో ఎదుర్కోవాలని సైకాలజిస్టు డాక్టర్ జి.అనుపమ సూచించారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఒత్తిడి నిర్వహణ పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సి.నాదమునిరెడ్డి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కె.రమ్య పాల్గొన్నారు.

న్యాయ విద్య.. హక్కులు కాపాడే సాధనం

తిరుపతి (మహిళా వర్సిటీ): హక్కులు కాపాడే సాధనం న్యాయ విద్య అని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ న్యాయ శాఖాధిపతి సీతాకుమారి పేర్కొన్నారు. వర్సిటీ న్యాయ విద్యాశాఖ ఆధ్వర్యంలో మిట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లలితకుమారి, న్యాయ విభాగం అధ్యాపకులు మాధురిపరదేశి, సమన్వయకర్త సునీత, విద్యా విభాగం ఆచార్యులు అముదవల్లి ప్రసంగించారు.

శంకర్‌రెడ్డికి సన్మానం.. రామచంద్రాపురం, న్యూస్‌టుడే: భాజపా జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా నియమితులైన సి.రామాపురానికి చెందిన పొన్న శంకర్‌రెడ్డిని గురువారం మండల కూడలిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, దుర్గం ప్రసాద్, దామినేటి శివ, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, తులసి రామ్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు ఎంపీ పీఏనంటూ బెదిరింపు

నెల్లూరు(నేర విభాగం): నెల్లూరు ఎంపీ వ్యక్తిగత సహాయకుడి(పీఏ)ని అంటూ బెదిరింపులకు దిగి నగదు డిమాండ్ చేసిన నకిలీ పీఏను నెల్లూరు నగర దర్గామిట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతికి చెందిన నదీమ్ ఎంపీ పీఏ అంటూ వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన గొల్ల నరేష్‌కు పలుమార్లు ఫోన్ చేసి నగదు కోసం బెదిరించాడు. ఆయన ఈ విషయాన్ని ఎంపీ కార్యాలయానికి తెలియజేశారు. సిబ్బంది ఎం.విజయకుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడు తిరుపతిలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం.

కేజీబీవీని తనిఖీ చేసిన ఆర్జేడీ.. ఎర్రవారిపాలెం, న్యూస్‌టుడే: ఎర్రవారిపాలెం కేజీబీవీలోని రైజింగ్ స్టార్ పదో తరగతి కేంద్రాన్ని ఆర్జేడీ శామ్యూల్ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు.

గోవుల తరలింపు అడ్డగింత.. చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: కబేలాకు తరలిస్తున్న గోవులను భాజపా మండల అధ్యక్షుడు కిషోర్ కుమార్, ధర్మక్షేత్రం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గురువారం రాత్రి అడ్డుకున్నారు. రొంపిచర్ల నుంచి అక్రమంగా గోవులు తరలిస్తుండగా వాహనాన్ని వెంబడించి భాకరాపేట కనుమలో అడ్డుకున్నట్లు వారు తెలిపారు. రొంపిచర్ల పోలీసులకు అప్పగించారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

గిరి ప్రదక్షిణ భక్తులకు అన్నదానం

అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: కైలాసగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు స్వయంభు ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు అంబలి స్వామి ఆధ్వర్యంలో కన్నుల పండువగా వేదం సమీపంలో భారీగా అన్నదానం చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం.. ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడులోని గుంటకట్టపై వెలిసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన వధువరులగా తీర్చిదిద్ది వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా కల్యాణక్రతువు చేపట్టారు. అధిసంఖ్యలో భక్తులు కనులారా తిలకించారు. సర్పంచి శివయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

శ్రీకాళహస్తి గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని మేలచ్చూరులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద అధికంగా ఉండటంతో రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. **- చెంచయ్య, స్థానికుడు**

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శితో చర్చించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో, శ్రీకాళహస్తి**

సత్యవేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని కాదిరివేడు పంచాయతీ బాలకృష్ణాపురం గ్రామంలో పలు వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. **- మురుగేష్, స్థానికుడు**

సమాధానం: వారం రోజుల్లో మొక్కలు తొలగించడానికి చర్యలు చేపట్టుతాం. **-ఇందుమతి, సర్పంచి**

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారిపై చిందేపల్లి గ్రామం వద్ద బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో బయట వ్యక్తులు ఇబ్బందులు పడుతున్నారు. **- గిరి, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి వెంటనే సూచిక బోర్డు ఏర్పాటు చేయిస్తాం. **- రమణకుమార్, డిప్యూటీ ఎంపీడీవో, ఏర్పేడు**

అశ్వంపై.. ఆదిదేవుని శౌర్యం

సోమస్కందమూర్తికి విశేష అలంకరణలు

గిరిప్రదక్షిణలో ఉత్సవమూర్తులను స్వాగతిస్తున్న భక్తగణం

జ్ఞానాంబిక

అశ్వ, సింహవాహనాలపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ధూర్జటి కళా ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో జగద్రక్షకుడైన సోమస్కందమూర్తి అశ్వంపై, జ్ఞానాంబిక సింహ వాహనాలు అధిరోహించి భక్తులకు దివ్య దర్శనం కల్పించారు. కైలాసగిరి ప్రదక్షిణోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం బయలుదేరిన స్వామి, అమ్మవార్లు సాయంత్రానికి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లకు స్వాగతించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. వాహన మండపానికి తీసుకువచ్చి మళ్లీ అలంకరణలు నిర్వహించాక పురవీధుల్లో ఊరేగించారు.

పరవశించిన పల్లె జనం..: నవ దంపతులైన శ్రీజ్ఞానాంబిక, సోమస్కందమూర్తి ఉత్సవంగా గిరిప్రదక్షిణకు వస్తున్నారని తెలిసి చుట్టుపక్కల పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. అడుగడుగునా ఘనంగా స్వాగతం పలుకుతూ ఉత్సవమూర్తులకు నీరాజనాలు పలికారు. అక్కడి జనం రంగవల్లులు, మామిడి తోరణాలు, కర్పూర హారతులతో స్వాగతించారు. అన్నప్రసాదాలు, తినుబండారాలు, శీతల పానీయాలు అందజేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడం, మధ్యాహ్నం 1 గంట వరకు ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు అనుమతించలేదు. బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతికోత్సవాలు అలరించాయి.

నేడు ధ్వజావరోహణం..: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజావరోహణ పట్టం జరగనుంది. ఉదయం సన్నిధివీధిలోని జలవినాయకస్వామి ఆలయం వద్ద వసంతోత్సవం, మధ్యాహ్నం కలశోద్వాసన పూర్ణాహుతి దేవతామూర్తులకు అభిషేకాలు జరగనున్నాయి. అనంతరం ధ్వజావరోహణం జరుగనుంది.

మండపాలు ప్రత్యేకం

ఆలయంలోని రెండు కాళ్ల మండపం

మీకు తెలుసా..?

ముక్కంటి ఆలయంలో ఉన్న రెండు మండపాలు ఎంతో ప్రాభవాన్ని, ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

● **వందకాళ్ల మండపం..:** 1516వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడ ఏడంతస్తుల గోపురాన్ని నిర్మించారు. అదే సమయంలో ఆలయంలోని తిరుమంజన గోపురానికి సమీపంలో వందకాళ్ల మండపాన్ని నిర్మించారు. గతంలో ఇక్కడ పరిపాలన భవనం ఉంటూ వచ్చింది. అయితే ప్రస్తుతం రూ. 500 రాహు, కేతు పూజలు నిర్వహించే రాయలు వారి శాంతి మండపంగా గుర్తింపు పొందుతోంది.

● **రెండు కాళ్ల మండపం:** వింటేనే ఆశ్చర్యం వేస్తోంది కదూ. వాస్తవమే. పాతాళ వినాయకుని ఆలయం నుంచి కాస్తంత ముందుకొస్తే ఓ మూలన ఉంటుంది ఈ మండపం. నిశితంగా పరిశీలిస్తే తప్ప కన్పించదు. మండపానికి రెండు స్తంభాలు మాత్రమే ఉంటాయి. మిగిలిన భాగం ప్రాకారంలో కలిపి నిర్మించారు. ఇక్కడ వినాయక స్వామి కొలువుదీరి ఉన్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన వందకాళ్ల మండపం ప్రవేశ ద్వారం

నిర్ణయం.. సత్ఫలం

శ్రీపాదకూలీలతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, ఈవో బాపిరెడ్డి

ప్రదక్షిణోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు వివిధ శాఖల అధికారులతో చర్చించి తీసుకున్న సమష్టి నిర్ణయాలు సత్ఫలితాలను ఇచ్చాయి. ప్రధానంగా కనుమ పండుగ రోజున భారీగా వాహనాల రాకపోకలతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దేవతామూర్తులను మోసుకెళ్లే శ్రీపాదకూలీలు భయాందోళనలకు గురికావాల్సి వచ్చింది. అయితే గురువారం నిర్వహించిన ఈ విశేషోత్సవం సందర్భంగా ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఆయా మార్గాల్లో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. దీంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో గిరిప్రదక్షిణ పూర్తి చేయగలిగారు. **ఆలస్యమైనా.. సమయపాలన..:** ప్రదక్షిణోత్సవం ఆలస్యంగా ప్రారంభమైనా కచ్చితమైన సమయపాలనతో ఉత్సవాన్ని పూర్తి చేయగలిగారు. ఏడున్నర గంటలకు ఉత్సవమూర్తులు ఎదురుసేవ మండపం నుంచి వాహన మండపానికి తీసుకురావడం, అక్కడ నుంచి అశ్వ, సింహ వాహన సేవలు చేపట్టడంతో భక్తులందరూ ఉత్సవాన్ని వీక్షించగలిగినారు.

చెరువు ఆక్రమణ తొలగింపు

స్పందనకు వందనం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రామచంద్రాపురం సమీపంలోని అప్పలాయగుంట చెరువు కట్టను స్థిరాస్తి వ్యాపారులు ధ్వంసం చేయడంపై బుధవారం 'ఈనాడు'లో 'రియల్.. అడ్డదారులు తొక్కెన్..!' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన జలవనరులశాఖ అధికారులు తహసీల్దారు భారతికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో ఆర్ఐ సుజాత సిబ్బందితో ఆక్రమిత చెరువు వద్దకు వెళ్లి సర్వే జేసీబీ సాయంతో అక్రమంగా నిర్మించిన రోడ్డును తొలగించారు.

విదేశీ భక్తులతో చండీ హోమం

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం మహా చండీ హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు 27 దేశాల నుంచి విదేశీ భక్తులు పాల్గొంటారని అందులో పేర్కొన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సీఎం సహాయ నిధి.. కొందరికి కమిషన్ల నిధి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: అనారోగ్య బాధితులకు ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి కొందరికి కాసులు కురిపిస్తోంది. తమకు మంజూరైన డబ్బులో ఇరవై నుంచి యాభై శాతం కమిషన్ అడుగుతున్నారని కొందరు లబ్ధిదారులు, బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మొదట తిరస్కరించిన దరఖాస్తులను తాము సరిచేసి, నగదు మంజూరు చేయిస్తామని చెప్పి.. ఆ పని చేయించి దందా సాగిస్తున్నారు. మండలంలోని రాఘవరాజపురం పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి తన కుమారునికి అనారోగ్య కారణంగా సుమారు రూ. 30 లక్షల వరకు ఆసుపత్రులకు ఖర్చు చేశారు. ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వివిధ కారణాలతో తిరస్కరించారు. అయితే ఆ దరఖాస్తును తాను సరి చేయిస్తామని ఓ సర్పంచి సోదరుడు ముందుకొచ్చారు. చెప్పినట్లే ఆ దరఖాస్తును చెల్లుబాటు చేయించి బాధితునికి రూ. 4 లక్షలు వచ్చేలా చేశారు. అలా చేసినందుకు తనకు రూ. 2 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు లబ్ధిదారుడు చెబుతున్నారు. ఇలాగే అనేక మంది సీఎం సహాయ నిధిలో పర్సంటేజీలు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వం చెక్కుల రూపంలో కాకుండా నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాలకే నగదు పంపేలా చర్యలు చేపట్టడం మంచిదని బాధితులు అభిప్రాయపడుతున్నారు.

నాబార్డు నిధులు 'నీళ్ల'పాలు

నిరుపయోగంగా ఆర్వోప్లాంటు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: విద్యార్థులకు శుద్ధిజలాలు అందించేందుకు మంజూరైన రూ. లక్షల నాబార్డు నిధులు సమన్వయ లోపం కారణంగా నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వహయాంలో నాబార్డు మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆర్వోప్లాంటు నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఆర్వోప్లాంటు యంత్రం సమకూర్చారు. నీటిశుద్ధి కేంద్రం కోసం ఓ గదిని కూడా నిర్మించాల్సి ఉంది. అయితే బిల్లు అందక గుత్తేదారు పనులు చేపట్టకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. యంత్రం కూడా మరమ్మతులకు గురైంది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన నీటిశుద్ధి యంత్రం నిరుపయోగంగా మారింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తయ్యేలా నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

'కొబ్బరికాయ' వివాదం..

కొబ్బరికాయ కొడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చోటుచేసుకున్న కొబ్బరికాయ వివాదం చర్చనీయాంశంగా మారింది. ప్రదక్షిణోత్సవం ప్రారంభానికి ముందు అలంకార మండపంలో తొలి కొబ్బరికాయ ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు ఛైర్మన్, ఆనక ఉభయదారుల వద్ద కొట్టించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే తొలి కొబ్బరికాయను సినీనటి శ్రేయ దగ్గర కొట్టించడం, జ్ఞానాంబిక అమ్మవారి ఉభయదారులైన బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కుటుంబీకులు కొబ్బరికాయ కొట్టకముందే ఉత్సవమూర్తులకు హారతులు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే ఉభయదారులను పట్టించుకోకపోతే ఎలాగంటూ ఈవోను నిలదీశారు. దీనిపై ఆలయ అధికారులు స్పందిస్తూ.. భారీగా శ్రేణులతో రాకూడదని, తామే పిలిచి స్వామి వారి వద్ద కొబ్బరికాయ కొట్టించామని, అమ్మవారి వద్దకు ఆయన ముందుకు రాలేదని చెప్పారు.

ప్రణాళికా లోపం.. ప్రజలకు శాపం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రణాళికా లోపంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మండలంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం నిర్వహణలోనూ ప్రణాళిక లోపించింది. ఈ నెల 15న ఆదివారం, మహాశివరాత్రి రోజున గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి, శ్రీకాళహస్తీశ్వరాలయానికి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల అధికారులు ఆలయాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చారు. ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయం అధికారులు మాత్రం అదే రోజున మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటన జారీ చేశారు. దీనికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఒక్కరూ రాకపోవడంతో ఈ నెల 28న నిర్వహించేందుకు ప్రకటన జారీ చేశారు. సమావేశ నిర్వహణపై సరైన ప్రణాళిక రూపొందించలేని అధికారులు.. అభివృద్ధి ఎలా చేస్తారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

భూవివాదాలు లేని గ్రామాలే లక్ష్యం

కువ్వాకుళ్లి: ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే భూవివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సుధీర్‌రెడ్డి కోరారు. మండలంలోని కువ్వాకుళ్లిలో భూ రీసర్వే ప్రారంభం సందర్భంగా గురువారం ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలసర్వేయరు వెంకటరమణ మాట్లాడుతూ రైతులు భూసర్వేలో పాల్గొని రెవెన్యూ రికార్డులు, కొనుగోలు, అమ్మకాల పత్రాలు అందిస్తే భూవివాదాలకు అవకాశం లేకుండా హద్దులు నిర్ణయించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నల్లయ్య, లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా శామ్యూల్ అరవింద్

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్న శామ్యూల్ అరవింద్‌ను కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ నారాయణ భరత్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డా.సుజాతను ఓడీపై పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు.

ఏజీపీగా కమలకుమార్

శ్రీకాళహస్తి: న్యాయవాది కమల కుమార్ ప్రభుత్వ సహాయ ప్లీడరుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఏజీపీగా కొనసాగవచ్చని, నెలకు రూ.18 వేల గౌరవవేతనం ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చారు.

హనుమంతునిపై ఆదిదేవుడు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: తొండమాన్‌పురంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామి హనుమంత వాహనంపై అధిరోహించి గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చాడు. అధిక సంఖ్యలో భక్తులు తొండమాన్‌పురానికి చేరుకుని ప్రత్యేక అలంకరణలో ఉన్న ఆదిదేవుడు గోవిందనామస్మరణలతో దర్శించుకున్నారు.

పారిశ్రామికవాడకు మట్టిరోడ్డే దిక్కు

పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. రేణిగుంట-తిరుపతి మార్గంలోని పారిశ్రామికవాడలో రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. కనీస వసతులైన రోడ్లు అవసరం చాలానే ఉన్న ఆ దిశగా అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ సరుకు రవాణా వాహనాలు ఇక్కడ సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే ఇక్కడ గుంతలమయమైన రోడ్లు బాగు చేయాలని కార్మికులు కోరుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పుల్లంపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని రైల్వేకోడూరు తెదేపా నాయకురాలు వరలక్ష్మి అన్నారు. గురువారం పుల్లంపేట మండలంలోని పలుగ్రామాల్లో బాధిత కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధిని కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దాతల సాయంతో విద్యార్థులకు అల్పాహారం

కొత్తపేటలో అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: దాతల సాయంతో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు అక్బర్ ఆలీ అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలోనే ఉండటంతో నీరసించిపోతున్నారు. ఉపాధ్యాయులే దాతలుగా మారి వారికి అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగని ఎలుగుబంటి దాడులు

గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు, ఎస్సై మహేష్

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: వారం రోజులుగా గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఎలుగుబంటి గురువారం మరొకరిపై దాడి చేసింది. మండల పరిధిలోని యల్లాయపల్లె నుంచి బోటుమీదపల్లెకు రైలు పట్టాలపై వెళుతున్న బత్తల దేసయ్యపైన పక్కనే ముళ్ల పొదల్లో నక్కిన ఎలుగుబంటి దాడి చేసింది. కేకలు వేస్తూ గ్రామానికి చేరుకోవడంతో 108లో వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్సై మహేష్ గ్రామానికి చేరుకుని మాట్లాడారు.

ఛత్రపతి శివాజీకి నివాళి

శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు, ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వీపీఆర్ కండ్రిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. భాజపా నాయకులు తోట శ్రీనివాసులు, జయప్రకాష్ నారాయణవర్మ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. **పుల్లంపేట:** పాఠశాల దశలోనే విద్యార్థులు, దేశభక్తి భక్తిని పెంపొందించుకోవాలని మండల భాజపా అధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, కొత్తపేట సర్పంచి మణికంఠ అన్నారు. గురువారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **రేణిగుంట:** విమానాశ్రయ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాల పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మిఠాయి పంపిణీ చేశారు.

అండర్ బ్రిడ్జి వద్ద లారీ హల్‌చల్

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక అండర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి లారీ హల్‌చల్ చేసింది. తిరుపతి వైపు నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న ఇసుక టిప్పర్ అండర్ బ్రిడ్జి సమీపంలోని హెచ్చరిక స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం పక్కకు వాలిపోవడంతో టిప్పర్ ఇరుక్కుపోయింది. టిప్పర్ చోదకుడికి తెలియకుండా ఈ ఘటన జరగడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఇక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

బీఎన్‌కండ్రిగ: కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న పలువురు విద్యార్థులు ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ ధర్మేంద్రకుమార్‌సింగ్ తెలిపారు. గురువారం వారిని సన్మానించి మాట్లాడారు. సతీష్‌నాయక్, రాంచరణ్ నాయక్, దీపక్ నాయక్, ఉమాదేవి బాయ్, తేజస్వినీ జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత సాధించి ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

విభిన్న భాషలపై అవగాహన అవసరం

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే విభిన్న భాషలపై అవగాహన అవసరమని ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజవేలు తెలిపారు. భాషోత్సవాలను పురస్కరించుకుని గురువారం పాఠశాలలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉగాది లక్ష్యంగా పనులు చేపట్టాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉగాది లక్ష్యంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలంటూ జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం అయ్యారు. పీఎంఏవై 1.0, ఐహెచ్‌ఎల్, పీఎంఏవై 2.0 పథకాలకు సంబంధించి లక్ష్యాలను వేగవంతం చేయాలని సూచించారు, ప్రభుత్వం నిర్దేశించిన పారామీటర్స్ ప్రకారం పూర్తి చేయించాలని ఆదేశించారు. డీఈ శేషగిరి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కేవీఎన్‌పురానికి చెందిన శతాధిక వృద్ధురాలు చిన్నక్క (105) మృతి చెందింది. శ్వాస తీసుకునేందుకు కొంత ఇబ్బంది పడుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, వీళ్ల సంతానంతో కలిపి ఐదు తరాలతో కాలక్షేపం చేసేదని గ్రామస్థులు చెబుతున్నారు.

స్టార్టర్లు, విద్యుత్తు తీగల చోరీ

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కరకంబాడి పంచాయతీలోని వ్యవసాయ భూముల్లో గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్లు, విద్యుత్తు తీగలు ఎత్తుకెళ్లారు. కరకంబాడి నుంచి కడప మార్గంలో ఉన్న పెట్రోల్ బంక్ పక్కనే అరటి తోటలో రైతు తెచ్చి పెట్టుకున్న సోలార్ స్టార్టర్లు, ఎదురుగా ఉన్న మరో రైతుకు చెందిన పొలంలో స్టార్టర్లు, వైర్లు అపహరించినట్లు వారు తెలిపారు. వీటి విలువ రూ.75 వేలు వరకు ఉంటుందని, పోలీసులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

వాహనాలకు జరిమానాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన చోదకులు నిబంధనలు పాటించాలని రేణిగుంట సీఐ జయచంద్ర కోరారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కూడలి వద్ద పట్టణ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్లు, రికార్డులు సక్రమంగా లేని 23 వాహనాలకు జరిమానాలు విధించారు. ఎస్సై ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లేశారు.. కాల్వలు మరిచారు

✦ మురుగునీటి పారుదల వ్యవస్థ లేక అవస్థలు
✦ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దయనీయం

పిచ్చాటూరులో రహదారిపైనే పారుతున్న మురుగు

సత్యవేడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ఇళ్ల నుంచి విడుదలయ్యే వృథా నీరు పారుదల వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులు నిర్మించి.. పక్కా కాల్వల ఏర్పాటును విస్మరిస్తున్నారు. ఏడు మండలాల్లో 173 పంచాయతీలున్నాయి. వీటిలో అనేక గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించారు. 90 శాతం గ్రామాల్లో మురుగు కాల్వలు లేక పరిస్థితి దారుణంగా ఉంది.

సీసీకి రూ. కోట్లు.. కాల్వలకు రూ. లక్షలు

గతేడాది నియోజకవర్గంలో పల్లెపండగ -1 భాగంగా 38.5 కిలోమీటర్ల సీసీ రహదారులకు రూ. 16.15 కోట్లు ఖర్చు చేశారు. పల్లెపండగ-2లో 35 కిలోమీటర్లు మేర రూ.14. 62 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు గ్రామాల్లో వేగంగా జరుగుతున్నాయి. పీఎమ్ఏజీవై కింద కేవీబీపురం మండలంలోని రాయపేడలో రూ. 10 లక్షలు, కందూర్లు పంచాయతీలో రూ.5 లక్షలు, గుంటిపేడు రూ.4 లక్షలతోనే డ్రైనేజీ నిర్మాణాలు జరిగాయి.

మండలాల వారీగా ఇదీ సంగతి

● వరదయ్యపాళెం మండలంలోని ముస్లింపాళెం, కళత్తూరు, కదూరు, ఎస్టీకాలనీ, కారిపాకం, బత్తలవల్లం, ఇందిరానగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదు. ● నాగలాపురంలో జానకీపురం, ఎస్ఎస్‌పురం, టీపీకోట, టీపీపాళెం, కారణి, కృష్ణాపురం, అడవికండ్రిగ వేంబాకుల గ్రామాలు. ● కేవీబీపురంలో పాతపాళెం, ఓళూరు, ఆదరం, వేములపూడి గ్రామాల్లో, బుచ్చినాయుడు కండ్రిగలో కనమనంబేడు, పల్లమాల, గాజులపెళ్లూరులలో ఇదే పరిస్థితి. . ● నారాయణవనంలో పాలమంగళం కొత్త ఎస్సీ కాలనీకి మురుగు కాలువలు లేదు. తుంబూరు నుంచి వెంగళత్తూరు కండ్రిగ, పాలమంగళం, ఎల్‌వీ పురం, తిరువట్యం రోడ్లు సైతం బాగాలేవు.

● సత్యవేడులోని అల్లప్పగుంట, జడేరి, కొత్త మారికుప్పం మదనంబేడు, కాదిరివేడు, బాలగోపాలపురం ఎస్టీకాలనీల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేవు. బాలగోపాలపురం ఎస్టీ కాలనీ.

ప్రతిపాదనలు పంపుతాం

ప్రస్తుతం సీసీ రహదారులు నిర్మిస్తున్నాం. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం.
- ఉప్పు గోపాల్, పంచాయతీ రాజ్ డీఈఈ

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నా కక్షిదారులైన రేణిగుంట వాస్తవ్యులు **కుడుము మంజునాథ రెడ్డి S/o కె.ఓబి రెడ్డి** మరియు **కె.కవిత రెడ్డి W/o కుడుము మంజునాథ రెడ్డి**, అనువారు క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుటకు స్థిరాస్తి విక్రయ అగ్రిమెంటును రేణిగుంట నివాసి అగు కె.నాగేంద్ర S/o నాగరాజు నుండి పొందివున్నారు. కనుక క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి తనఖా గాని, అగ్రిమెంటు గాని మరియు ఇతర అభ్యంతరాలు వున్న ఎడల ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి **7 రోజులు** లోగా లిఖితపూర్వకంగా తెలపగలరు. లేనిచో అభ్యంతరాలు లేనివిగా భావించబడును.

షెడ్యూలు

తిరుపతి జిల్లా, రేణిగుంట సబ్.డి., రేణిగుంట మండలం, తూకివాకం మజరా, రేణిగుంట గ్రామ పంచాయతీ పాత వార్డు 4రు, 5కు చేరిన గోవిందరాజ మొదలివీధి రెసిడెన్షియల్ ఏరియాలో తూకివాకం గ్రామలెక్కదాఖలా **సర్వే నెం.796/2**రులో డోరు నెం.4-8రు, అసెస్‌మెంట్ నెం.444 (ఎల్.డిస్.డి/1321/94రు, తేది:25-6-94)రు గల ఆర్.సి.సి.మిద్దె ఇంటికి హద్దులు, కొలతలు వివరములు. **తూర్పు:** పంచాయతీ వారి జాగా, **పడమర:** 12 అడుగులు వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** పి.శ్రీదేవి గారి జాగా, **దక్షిణం:** అన్పు గారి ఖాళీ జాగా, ఈ హద్దుల మధ్యన తూర్పు-పడమర ఇరువైపులా అడుగులు 60, ఉత్తరం-దక్షిణం ఇరువైపులా అడుగులు 40.

MC KRISHNAMACHARYULU
Y.LAKSHMI PRAVALIKA
Advocates, D.No.1-49/18, 2nd Floor,
S.V.P.Colony, Tiruchanur, Cell: 9652373519

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

నేడు మాజీ సీఎం నేదురుమల్లి జయంతి

వాకాడు, న్యూస్‌టుడే: దివంగత ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని శుక్రవారం వాకాడులో నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి గురువారం తెలిపారు. స్థానిక బాలక్రీష్ణ సేవా క్షేత్రం ఆవరణలో కార్యక్రమం జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. నేదురుమల్లి అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ల వితరణ

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: వీఐఎస్ ఆసుపత్రి అధినేత డాక్టర్ వెంకట్రావు బాబు ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌లను అందజేశారు. యూనియన్‌లో సభ్యత్వం ఉన్న ప్రతి డ్రైవర్ కుటుంబానికి తమ ఆసుపత్రిలో ఉచిత ఓపీతో పాటు, ల్యాబ్ పరీక్షలు, ఎమర్జెన్సీ సేవల్లో రాయితీలు అందిస్తామన్నారు. ఆటో యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మయ్య ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

రొయ్యల గుంతల పరిశీలన

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని దుగరాజపట్నంలో రొయ్యలగుంతల కారణంగా తన పంట నష్టపోయానంటూ వెంకయ్య అనే రైతు ఇటీవల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అధికారులు కలిసి రొయ్యల గుంతలు, వ్యవసాయ సాగును పరిశీలించారు. తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్, మత్స్యశాఖ అధికారి రెడ్డినాయక్, మండల వ్యవసాయాధికారిణి దీప సిబ్బంది పాల్గొన్నారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు పేర్కొన్నారు.

శివాజీకి ఘన నివాళి

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ పాలకూరు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పాఠశాలలో శివాజీ జయంతి నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ సంఘ అధ్యక్షుడు చెంచయ్య, వార్డ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రులకు ఎమ్మెల్యే వినతులు

వాకాడు, న్యూస్‌టుడే: మంత్రి అచ్చెన్నాయుడు, మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్‌లతో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో వ్యవసాయ పొలాలకు వెళ్లే లింకు రోడ్లకు, కమిటీ కార్యాలయ ఆవరణలో ఉన్న భవనాల మరమ్మతులకు, షాదీ మంజిల్‌లో డైనింగ్ హాల్, వంట గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కోరారు.

మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

నీలకంఠేశ్వరుడికి పుష్పయాగం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని తుమ్మూరు శ్రీగంగా భవానీ కామాక్షి నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు అమ్మవార్లకు పుష్పయాగం పూజలు నిర్వహించారు. తితిదే వివిధ రకాల పుష్పాలను తీసుకొచ్చి అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, స్వర్ణముఖినది తీరాన ఉన్న ప్రసన్నాంబ నీలకంఠేశ్వరస్వామి, బ్రహ్మణవీధిలో కాశీవిశ్వేశ్వరస్వామి, పడమటివీధిలో జంబుకేశ్వరస్వామి ఆలయాల్లో ధ్వజావరోహణ పూజలు జరిగాయి.

పూజలు అందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు

కొంటేనే తాగునీరు.. లేదంటే కన్నీరు!

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రంలో తీరప్రాంతం అధికంగా ఉంది. అయినా నీటి ఎద్దడి ఏర్పడుతోంది. తాగునీరు కావాలంటే పక్కనున్న గ్రామాల నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. అవి తరచూ మరమ్మతులకు గురవుతూనే ఉంటాయి. వేసవి ప్రారంభం కాకముందే పులికాట్ సరస్సులో నీరు అడుగంటింది. చేతిపంపులు పాడైపోయాయి. కొన్ని చోట్ల తాగునీటి పథకాలు పని చేయడం లేదు. పైపులైన్లు బాగుచేస్తే ప్రజల దాహార్తిని తీర్చవచ్చు.

కనీస అవసరాలకు డబ్బు పెట్టాల్సిందే

మండలంలోని కొమ్మినేనిపల్లి గ్రామం ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి పెద్దపడవకు వెళ్లే పైపులైన్లలో నీరు ముందుకు సాగక ప్రజలు కనీస అవసరాలకు కూడా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కుదిరి, కుదిరి రిహాబిలిటేషన్, కుదిరి తిప్పకుండ్రిగ గ్రామాలకు తాగునీటి పథకాలు దెబ్బతినడంతో గత రెండు నెలలుగా నీరు రావడం లేదని వాపోతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల దగ్గర నీళ్ల బిందె రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. పొలం పనులకు వెళ్లేవారికి నీరు అందుబాటులో లేక పక్కన ఉన్న దొరువులలో నీటిని ముంచుకొని వాడుకుంటున్నారు. ఆ నీరు కలుషితం కావడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కనీసం ఎవరైన చనిపోయిన కూడా కనీస అవసరాలను తీర్చుకోవాలంటే డబ్బు పెట్టాల్సిన పరిస్థితి అని గ్రామాల ప్రజలు అంటున్నారు.

● దొరవారిసత్రం మండలంలోని కారికాడు, ఏలికాడు, మీజూరు గ్రామాలకు సింగనాల్తూరు చెరువు బావి ద్వారా 5 కిలోమీటర్లు నీటి సరఫరా జరుగుతుంది. అదే విధంగా సూళ్లూరుపేట మండలం ఆభాక చెరువులో నుంచి పైపులైను ద్వారా 7 కిలోమీటర్లు నీటి సరఫరా జరుగుతుంది. పులికాట్‌కి నీరు అందిచేటప్పుడు మరమ్మత్తులకు గురవుతున్నాయి. ఇటీవల ఇలానే జరగడంతో తీరప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

● తడ మండలంలోని కారిజాత, వాటంబేడు గ్రామాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు ఉప్పు నీరుగా మారుతున్నాయి. తాగునీటి పథకాలను ఏర్పాటు చేసి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ప్రతిపాదనలు పంపించాం

మరమ్మతులకు గురైన పైపులైన్లకు అంచనా వేసి అధికారులకు పంపాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం. కుదిరి, కుదిరి తిప్పకుండ్రిగ గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. - చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట, న్యూస్‌టుడే: ? పెళ్లకూరులో పైపులైను నిర్మాణం కోసం గుంతలు తీయడంతో పాత పైపులు దెబ్బతిని నాలుగు రోజులుగా నీటి సరఫరా జరగడం లేదు. - **స్థానికులు** * **సమాధానం:** నీటి సమస్య లేకుండా చేస్తాం. - **ఏఈ మనోజ్‌కుమార్**

తడ, న్యూస్‌టుడే: ? బీఐటి కళాశాల సమీపంలో మురుగు కాల్వ పొంగి జాతీయ రహదారి పొడవునా పారుతోంది. తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. - **రాజేష్, స్థానికుడు** **సమాధానం:** పంచాయతీలో నిధులు లేవు. మురుగు కాల్వ జాతీయ రహదారి నిర్వహణ సంస్థ ఏర్పాటు చేయాలి. - **కె.ఆర్మంగం, తడ సర్పంచి**

వాకాడు, న్యూస్‌టుడే: ? స్వర్ణముఖి బ్యారేజీ వంతెనపై చివర్లో రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతలను పూడండి. - **సుధాకర్, వాహనచోదకుడు** * **సమాధానం:** చర్యలు చేపడుతాం. - **రామాంజనేయులు, రభ ఈఈ, గూడూరు**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ? మండలంలోని దామానెల్లూరు, పోలిరెడ్డి పాళెం గ్రామాల్లో రాత్రిపూట వెలగాల్సిన విద్యుత్ దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి - **రవితేజ** * **సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **శేఖర్‌బాబు, ఏడీ**

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ? రాజగోపాలపురం లోని వీధుల్లో సైడుకాల్వల్లో పూడిక తీయడం లేదు. - **బలరాం** * **సమాధానం:** సిబ్బందితో పూడిక తీయిస్తాం - **ఎస్‌కే.ఫజులుల్లా, కమిషనర్ నాయుడుపేట**

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా శామ్యూల్ అరవింద్.. సత్యవేడు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్న శామ్యూల్ అరవింద్‌ను కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ నారాయణ భరత్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

22న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

నాయుడుపేట: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణ భగవద్గీత మందిరం వార్షికోత్సవ వేడుకలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు తెలిపారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీకృష్ణ రుక్మిణి, సత్యభామల కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. వై.నాగేశ్వరావు, అనూరాధలు ఉభదాతలుగా వ్యవహరిస్తారన్నారు.

ఆర్థిక అభివృద్ధి సాధించేలా బడ్జెట్

తడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ అన్నారు. తడలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు, మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేలా బడ్జెట్ రూపొందించారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన పళని, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏకాంబరం, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

సమావేశమైన బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్, నాయకులు

బస్ షెల్టర్.. బాగు చేయండి

ప్రయాణికులు తలదాచుకునే బస్‌షెల్టర్ గురించి పట్టించుకోక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. వెంకటగిరి- గూడూరు మార్గమధ్యలో బాలాయపల్లి పంచాయతీ రామాపురం రోడ్డుకూడలి వద్ద ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీ నిధులతో దీనిని నిర్మించారు. ఈ కూడలి కేంద్రంగా రామాపురం, కడగుంట, నిండలి మీదుగా డక్కిలి, సైదాపురం మండలాల గ్రామాల వారు రాకపోకలు సాగిస్తారు. కాబట్టి అధికారులు మరమ్మతులు చేసి ప్రయాణికులకు అందించాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, బాలాయపల్లి

దశాబ్దం దాటినా.. గండ్లు పూడ్చలే..!

వరదలకు 2015లో మండలం అతలాకుతలమైంది. దాంతో వాకాడు- దుగరాజపట్నం మార్గంలో పలు గ్రామాల వద్ద పొలాల్లో వరదనీరు ప్రవహించి రోడ్డుపై వచ్చి పలుచోట్ల రోడ్డుకు గండ్లు పడ్డాయి. ఇలా జరిగి నేటికీ దశాబ్ద కాలం దాటింది. ఆ సమయంలో కోడివాక వడ్డిపాలెం వద్ద రోడ్డుకు మార్జిన్‌లో పడిన గొయ్యి అలానే ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డు మార్జిన్ కనపడక పోవడంతో గుంతలో పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ర.భ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. **- వాకాడు, న్యూస్‌టుడే**

ముక్కు మూసుకోవాల్సిందే

నాయుడుపేట అమరాగార్డెన్ ప్రధాన రోడ్డుపై చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఈ దారిలో స్థానికులు ఆ కంపుని పీల్చుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి. కొందరు ఇష్టానుసారంగా చెత్తను పాడేస్తున్నారు. ఇక్కడి ప్రజలకు పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంది. పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను అందించేలా మార్పు తేవాల్సి ఉంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

తుప్పు పడుతున్నాయ్..!

మండల కేంద్రం పెళ్లకూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాల సంఖ్య క్రమంగా పెరిగి చివరికి తుప్పు పట్టి ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసుల్లో తీసుకొచ్చిన వాటని స్టేషన్ ప్రాంగణంలో నిల్వ ఉంచుతున్నారు. వీటికి సంబంధించిన కేసులు పరిష్కారం కాకపోవడంతో ఏళ్ల తరబడి ఆవరణలోనే నిల్వ ఉండి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. ప్రాంగణం అంతా కూడా తుప్పు వాహనాలతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉంది. **- పెళ్లకూరు, న్యూస్‌టుడే**

దిగాలంటే గండం దాటాల్సిందే

పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వద్ద ర.భ. సిమెంటు రోడ్డు చివరన దిగే చోట గాడులు పడి వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. ర.భ.రోడ్డుపై ఏపీఐఐసీ అధికారులు రూ.5 కోట్లతో కిలోమీటరు వరకూ సిమెంటు రోడ్డు వేసి ఆపేశారు. తర్వాత మిగిలిన రోడ్డు అలాగే వదిలేశారు. దీంతో పాత కొత్త రోడ్లు కలిసే చోట పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించే వాహనాల చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

బాధ్యతలు చట్టపరంగా నిర్వహించాలి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పౌరులు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం ద్వారా చట్టాలను గౌరవించినట్లు అవుతుందని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి సూచించారు. గురువారం మండల కేంద్రం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచుకృష్ణయ్య, న్యాయవాదులు వంశీకృష్ణ, మోహన్, రవి, మాధవి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి

28లోగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారులు ఈ నెల 28 లోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని ఇన్‌ఛార్జీ పుర కమిషనర్ సాంబశివయ్య అన్నారు. గురువారం ఛాంబర్‌లో పబ్లిక్ హెల్త్, శానిటేషన్ విభాగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 1 నుంచి 25 శాతం అపరాధ రుసుంతో కట్టాల్సి వస్తుందన్నారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. లేని వారికి నోటీస్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విజేతలకు బహుమతులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల్లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి వక్త పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందించారు. పది ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఆర్.ఉపజ్ఞ, కె.ముకుందరోషిణి, వై.మన్వితలు నిలిచారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, టి.కృష్ణయ్య, ఆసిన్‌బాబు, రామ్మూర్తి, స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

25న పెళ్లకూరులో విద్యుత్తు అదాలత్

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలం డిస్కం ఏఈఈ కార్యాలయంలో ఈనెల 25న సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట డీఈ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. అదాలత్ ఛైర్‌పర్సన్‌గా విశ్రాంతి న్యాయమూర్తి శ్రీనివాస అంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు జీ.మధుకుమార్ సాంకేతిక సహాయకులు శ్రీనివాసబాబు, సభ్యులు పాల్గొంటారన్నారు.

ఉగాది లక్ష్యంగా పనులు చేపట్టాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉగాది లక్ష్యంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలంటూ జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం అయ్యారు. పీఎంఏవై 1.0, ఐహెచ్‌ఎల్, పీఎంఏవై 2.0 పథకాలకు సంబంధించి లక్ష్యాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పూర్తి చేయించాలని ఆదేశించారు. డీఈ శేషగిరి పాల్గొన్నారు.

వాటంబేడు రైల్వేగేటు మూత

తడ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వాటంబేడు మార్గంలో గొల్లలములువు వద్ద ఉన్న రైల్వే గేటు(ఎల్‌సీ 58)ను మూడు రోజుల పాటు మూయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అక్కంపేట- సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సోమవారం సాయంత్రం 5 వరకు గేటు మూసి వేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శ్మశానానికి కొత్త రూపు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని జీలపాటూరు గ్రామంలో సర్పంచి కందమూడి శివకుమార్ చొరవతో శ్మశానవాటికకు కొత్త రూపురేఖలు వచ్చాయి. స్వర్ణముఖినది తీరాన ఉన్న శ్మశానంలో కొన్నేళ్లుగా చెట్లు పెరిగా అధ్వానంగా మారింది. మృతదేహాలు ఖననం చేయాలన్నా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. జేసీబీతో కంచెలు, పొదలు తొలగించారు.

అధికారుల అలసత్వం.. రూ. కోట్లలో బకాయిలు

నాయుడుపేట పట్టణం, సూళ్లూరుపేట పట్టణం, వెంకటగిరి, న్యూస్‌టుడే: అక్రమ కొళాయిల్ని ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేస్తున్నారు. వాటి నియంత్రణపై పాలకులు, అధికారులు చొరవ తీసుకోవడం లేదు. కొళాయిల బకాయిలు లక్షల్లో పేరుకుంటున్నాయి. కనెక్షన్లు తొలగించేందుకు సిబ్బంది వెళితే రాజకీయ నాయకులు ఒత్తిడి తేవడంతో వెనక్కి తగ్గుతున్నారు.

పురపాలిక	కుళాయిలు	అక్రమ కుళాయిలు	నెలకు పన్నురూ.	బకాయిలు రూ.
సూళ్లూరుపేట	3037	500	75	76
నాయుడుపేట	9300	1100	100	1.50
వెంకటగిరి	5962	1500	100	2.51

వైకాపా నాయకుల అండ..

పురపాలక సంఘాల్లో కొళాయిల పన్నులు నాలుగైదేళ్లుగా పలువురు చెల్లించడంలేదు. నెలనెలా చెల్లించక పోవడంతో తాగునీటి సిబ్బంది కనెక్షన్లు తొలగించేందుకు వెళ్లడంతో వైకాపా నాయకులు అడ్డుపడిన దాఖలాలు ఉన్నాయి. వైకాపా నాయకులు పురాల్లో తమకిష్టమైన చోట్ల కొళాయి కనెక్షన్లు ఇప్పించి నగదు దోచుకున్నారు. ఇటీవల కొందరు కౌన్సిలర్లు తమకిష్టమైన వ్యాపార సంస్థలకు కనెక్షన్లు తీసుకున్నారు.

అక్రమ కనెక్షన్లపై చర్యలేవి..

సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి పురపాలక సంఘాల పరిధిలో అధికారికంగా ఒక కనెక్షను తీసుకుని పెద్దపెద్ద భవంతులకు మోటార్లు అమర్చి నీటిని ట్యాంకులకు నింపుతున్నారు. బహుళ అంతస్తులకు కనెక్షన్లు వినియోగిస్తున్నారు. ఇటీవల నాయుడుపేటలో ఇంటింటా కొళాయిల కనెక్షన్లపై సర్వేచేస్తే భారీ సంఖ్యలో అక్రమ కొళాయిలు బయటపడ్డాయి. సంబంధిత యజమానులచే నగదు కట్టించి రెగ్యులర్ చేస్తున్నారు. ఉన్నత వర్గాల వాళ్లు పేదల పేరుతో తక్కువ రుసుం చెల్లించి కొళాయిలు పొందారు. పురాల్లో బకాయిలు వసూలు చేస్తే ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

● దీనిపై కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లా వివరణ కోరగా ఇటీవల కొన్ని అక్రమ కొళాయిలు గుర్తించామని, బకాయిలు వసూలు చేస్తామన్నారు.

అనుబంధ కమిటీల ఏర్పాటుకు చర్యలు

నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షురాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: తిరుపతి పార్లమెంట్ పరిధిలోని వెంకటగిరిలో అనుబంధ కమిటీలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త దీపక్‌రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనుబంధ కమిటీలైన తెలుగు మహిళ, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్, వాణిజ్య విభాగం, చేనేత, అంగన్‌వాడీ, టీఎన్‌టీయూసీ విభాగంలో కమిటీలను భర్తీ చేస్తామన్నారు. కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. పార్టీ బలోపేతానికి ఈ కమిటీలు ఎంతో తోడ్పాటు ఇస్తాయన్నారు.

జోరుగా టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో బుధవారం టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగింది. ఉగాదిలోపు లబ్ధిదారులకు ఇళ్లు అందించాలని సచివాలయ సిబ్బంది, పుర కార్యాలయం తరపున మేనేజరు ఉరుకుందమ్మ రిజిస్ట్రేషన్లను నిర్వహించారు. 2 వేల ఇళ్లకు 750 పూర్తి చేశామని, మిగిలినవి గడువు లోపు పూర్తి చేస్తామని పుర మేనేజర్ పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్లు చేస్తున్న మేనేజర్ ఉరుకుందమ్మ, సిబ్బంది

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తులసీజ్యోతి తెలిపారు. ఈ నెల 23నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో మార్చి 31 లోగా ప్రవేశ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 12న ప్రవేశపరీక్ష నిర్వహించి, 27న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. వివరాలకు 83330 66000 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కల్యాణం.. కమనీయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడులోని గుంటకట్టపై వెలిసిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులుగా తీర్చిదిద్ది వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా కల్యాణక్రతువు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కనులారా తిలకించారు. సర్పంచి శివయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

చెట్ల అక్రమ నరికివేతపై వినతులు

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని బురదగాలి కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమంగా చెట్లను నరికివేయడంపై పంచాయతీ వాసులు గురువారం రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, పోరంబోకు భూములు పరాధీనం కాకుండా చర్యలు తీసుకోవాలని, నాలుగు రోజుల క్రితం కొందరు పేరిపాటితిప్ప వద్ద చెట్లు కొట్టేస్తుండగా తాము అడ్డుకొన్నామని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు విన్నవించారు. అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ వెంకటరమణయ్య, నరేష్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, మహేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఎలుగుబంటి దాడులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: వారం రోజులుగా గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఎలుగుబంటి గురువారం మరొకరిపై దాడి చేసింది. మండల పరిధిలోని యల్లాయపల్లె నుంచి బోటుమీదపల్లెకు రైలు పట్టాలపై వెళుతున్న బత్తల దేసయ్యపైన పక్కనే ముళ్ల పొదల్లో నక్కిన ఎలుగుబంటి దాడి చేసింది. కేకలు వేస్తూ గ్రామానికి చేరుకోవడంతో వైద్యశాలకు తరలించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్సై మహేష్ గ్రామానికి చేరుకుని మాట్లాడారు.

LOSS OF PASSPORT
I, KOTA RENUKA, W/o KOTA CHINNAIAH, Residing at D.No. 4-28, Thimmayagunta Village, Venkatagiri Mandal, Tirupati District, A.P. I have loss my Passport bearing No : P5261239 issued on 19-10-2016 and date of expiry on 18-10-2026, on 09-01-2026 while I am travelling from Thimmayagunta to Parasuramu Colony. If anyone found
Please Contact My Ph. No : 9866816093

వరి..డోంట్ వర్రీ

ప్రభుత్వ మద్దతు ధరతో రైతులకు ఊరట

నాయుడుపేట, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వరి ధాన్యం ధరలు గత ఏడాది పోలిస్తే ఈ సారి ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడం దీనికి తోడు జలాశయాలు, ప్రధాన కాలువల ద్వారా సాగు నీరు చేరడంతో సూళ్లూరుపేట, నాయుడుపేట వెంకటగిరి వ్యవసాయ సబ్ డివిజన్లలో రబీ సీజన్‌లో 1.48 లక్షల ఎకరాల్లో రైతులు అత్యధికంగా పంట సాగు చేశారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరి నాటికి అన్ని గ్రామాల్లో వరి కోతలు పుంజుకునే అవకాశం ఉంది.

గత ఏడాది కంటే మెరుగ్గా

గత ఏడాది 75 కిలోల ఏ గ్రేడ్ రకం ధాన్యం రూ.1,550 నుంచి రూ.1,600 మధ్య పలికింది. ప్రస్తుతం రూ.1,700 నుంచి రూ.1,950 వరకు పలుకుతుంది. ప్రభుత్వం ఈసారి కూడా మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రవాణా ఛార్జీలు, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకొని పొలం వద్దనే వ్యాపారులకు ధాన్యం అమ్ముకునేందుకు సన్న, చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

విన్నమాల వద్ద ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతులు

ఈ-పంట నమోదుతో సులభం

ఈ-పంట వివరాలు నమోదు చేసుకుంటే దళారుల బెడద లేకుండా రైతులే స్వయంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. నమోదు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే సంచులు, రవాణా వసతి ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకు నగదును రైతులు ఖాతాలో జమ చేస్తారు. అధిక విస్తీర్ణం పంట సాగు చేసిన ఈ విధానం అనుకూలంగా మారింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు ఇలా..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వ్యర్థాలు, మట్టిరాళ్లు, పెళ్లలు, బెత్త, తాలు ఒక్కోశాతం. ముడుచుకుపోయినవి, వంకర తిరిగిన ధాన్యం గింజలకు మూడు శాతం, చెడిపోయి, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యానికి ఐదు శాతం, కేళీలు ఉంటే ఆరు శాతం, తేమ 17 శాతం మించి ఉంటే మించి నగదు చెల్లిస్తారు. సంచికి రూ.4.74 లేబర్ ఛార్జీ క్వింటాకు రూ.22కే తీసుకునే విధంగా ఈ ఏడాది పౌర సరఫరాల శాఖ నాణ్యత ప్రమాణాలను నిర్ణయించింది.

● ఈ- పంట వివరాలు నమోదు చేసుకున్న రైతులు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే వెసులుబాటు కల్పించిందని నాయుడుపేట ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు.

రబీలో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలు

ధాన్యం రకం	క్వింటాలు(100) రూపాయల్లో	బస్తా(75 కేజీలు) రూపాయల్లో
ఏ గ్రేడ్	2,389	1792
సాధారణ రకం	2369	1777

(c) eenadu

రక్షణ మంత్రికి జ్ఞాపిక

మిలన్-2026 వేడుకల నిమిత్తం గురువారం నగరానికి వచ్చిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపిక అందించిన నావికాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి, తూర్పు నావికాదళ అధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా. –ఈనాడు, విశాఖపట్నం

గవర్నర్‌కు ఘన స్వాగతం

బీచ్ రోడ్‌లో గురువారం జరిగిన మిలన్ విన్యాసాలు, సిటీ పరేడ్ వీక్షణకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. భారత, తూర్పు నౌకాదళాధిపతులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. –ఈనాడు, విశాఖపట్నం

కళ్ల ముందు శౌర్యం.. ఇదీ దేశ ధైర్యం!!

- మిలన్ విన్యాసాల్లో అబ్బురపరిచిన సాహసాలు
- ఆకట్టుకున్న అంతర్జాతీయ సిటీ పరేడ్

ఈనాడు–విశాఖపట్నం: విశాఖ సాగర తీరం 'ఓ సైనికా' అంటూ దేశభక్తితో మార్మోగింది. భారత నావికాదళం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మిలన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. సముద్ర రక్షణలో నావికుల శౌర్యాన్ని ప్రతిబింబిస్తూ చేపట్టిన విన్యాసాలు, కవాతు ప్రతి ఒక్కరిని కట్టిపడేశాయి. ఆర్కేబీచ్‌లో ప్రతిధ్వనించిన బ్యాండ్‌లు, గర్వాన్ని నింపుతున్న నావికుల అడుగుల మోతలు తీర ప్రాంత వాతావరణానికి మరింత ఉత్సవ కళను అద్దాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తీరంలో యుద్ధ ట్యాంకులు

పైలెట్‌ల శిక్షణకు, దాడులకు ఉపయోగించే ఫాంటమ్స్ అని పిలిచే హాక్-ఏజేటీ.. ఫైటర్ జెట్ విమానాల నుంచి బాంబులు వదిలిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా సాగాయి.

★ నిశ్శబ్దంగా సముద్ర లోతుల్లో దాక్కొని శత్రు నౌకలు, జలాంతర్గాములపై దాడులకు ఉపయోగించే నేవీ సబ్‌మెరైన్ల రహస్య, విధ్వంసక శక్తిని తెలియజేసేలా 'సబ్‌మెరైన్ సెయిల్ పాస్ట్' పేరుతో నిర్వహించిన ప్రదర్శన కనువిందుగా సాగింది.

★ దేశంలోని అత్యున్నత మెరైన్ కమాండోలు (మార్కోస్) ధ్రువ్ హెలికాప్టర్ల నుంచి ప్రదర్శించిన ధైర్య సాహసాలు మాటల్లో వర్ణించలేనివి.

★ ఆయిల్ రిగ్ భారీ పేలుడు, ఆ వెంటనే మార్కోస్ దాడి.. పడవలపై ఆరెంజ్ పొగను వదులుతూ మిషన్ విజయవంతమంటూ ప్రదర్శించిన తీరు చూసితీరాల్సిందే అన్నట్లు సాగింది.

● యాంటీ సబ్‌మెరైన్ రాకెట్లను శత్రు జలాంతర్గాములు, నౌకలపైకి ఎలా ఫైర్ చేస్తారనే డెమో ఆకట్టుకుంది.

సిటీ పరేడ్‌లో ఆకట్టుకున్న కవాతు

★ కమాండోలు తమ పారాచూట్‌ల సాయంతో శత్రు భూభాగంలో కచ్చితంగా ఎలా నైపుణ్యంతో దిగుతారో ప్రదర్శించారు.

★ నేవీ కార్యకలాపాల్లో అంతర్భాగమైన హెలికాప్టర్లు సముద్రంలో కీలక పాత్ర పోషిస్తాయి. యుద్ధ, నావికా నౌకలపై అవి ఎలా దిగుతాయి.. ఎలా నౌకలపై నుంచి ఎగురుతాయి అనే పైలెట్‌ల నైపుణ్యాలను 'హెలో ల్యాండింగ్ డెమో' పేరుతో నిర్వహించారు.

★ ఓడలో నావికుల జీవితాన్ని, విధులను ప్రతిబింబించేలా శారీరకంగా, ఆరోగ్యంగా ఉండటానికి 'హార్న్ పైప్' నృత్యం ఎంతో వినోదం కలిగిస్తుంది. సీ క్యాడెట్ కార్ప్స్ ప్రదర్శించిన ఈ నృత్యం అలరించింది.

● విశాఖ, అరక్కోణంలోని నావికా స్థావరాల నుంచి పనిచేసే తూర్పు నావికా కమాండ్ హాక్, మిగ్-29, చేతక్, ధ్రువ్, కమోవ్, సీకింగ్, పి-81బోయింగ్ వంటి రకాలైన విమానాలతో ఒకేసారి ఆకాశంలో 'కాంపోజిట్ ఫ్లై పాస్ట్' నిర్వహించారు.

● సూర్యాస్తమయ సమయంలో దళాలు యుద్ధం నుంచి వైదొలిగినప్పుడు 'బీటింగ్ రిట్రీట్' అనేది సైనిక సంప్రదాయం. బగ్లర్స్ రిట్రీట్ మోగించిన వెంటనే దళాలు పోరాటం ఆపి, విశ్రాంతి తీసుకోవడానికి, మరుసటి రోజు యుద్ధానికి సిద్ధం కావడానికి ఆ యుద్ధభూమి నుంచి వైదొలుగుతాయి. ఈ బీటింగ్ రీట్రీట్ ఆకట్టుకుంది.

● చివరిగా తుపాకులతో కంటిన్యూటీ డ్రిల్ ప్రదర్శనతో మిలన్ హార్బర్ ఫేజ్ కార్యక్రమం ముగిసింది.

కార్యక్రమానికి వచ్చిన నౌకాదళ ఉద్యోగుల కుటుంబ సభ్యులు

★ భారత సాయుధ దళాలు మూడూ సంయుక్తంగా ఎలా దాడులు చేస్తాయో కళ్లకు కట్టారు. నావెల్ కమాండర్ ఆధ్వర్యంలో ఆర్మీ, నావెల్ ట్రూప్స్.. శత్రు భూభాగంలోకి చేరుకుని యుద్ధ ట్యాంకర్లు, గన్‌లతో లక్ష్యంపై దాడి చేసే విధానం చూపారు.

పర్యాటక శాఖ శకటం

★ భూమిపై ఉన్న లక్ష్యాలపై దాడికి, వాయు రక్షణలో కీలకంగా ఉపయోగించే 'హాక్' ఫైటర్ జెట్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ★ చేతక్ హెలికాప్టర్లను ఏంజెల్స్ అని పిలుస్తారు. నాలుగు చేతక్ హెలికాప్టర్లు బహుముఖ ప్రజ్ఞ, యుక్తి సామర్థ్యాలను సమన్వయంగా ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. ★ అదేవిధంగా ఎస్ఏఆర్ (సెర్చ్‌అండ్ రెస్క్యూ)లో భాగంగా సముద్రంలో చిక్కుకున్న బాధితులను రక్షించడం, తరలింపు వంటివి హెలికాప్టర్‌లతో ప్రదర్శించారు.

బాణసంచా వెలుగుల్లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్: శుక్రవారం 6:03 గం॥లకు
సహరి: శనివారం 5:03 గం॥లకు

తీర ప్రాంత భద్రతపై చర్చ

సిరిపురం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: తీర ప్రాంత భద్రతపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన గురువారం వర్చువల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, ఈఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో విశాఖలో సుమారు 28.81 కి.మీ. తీర ప్రాంతం అధిక కోతకు, 46.2 కి.మీ మేర మధ్యస్థ లేదా తక్కువ కోతకు గురయ్యే అవకాశం ఉందని కమిషనర్ వివరించారు. 30 గ్రామాలు, 60వేల మంది ప్రజలు నేరుగా ప్రభావితం అవుతున్నట్లు పేర్కొన్నారు. ముప్పు పొంచి ఉన్న కీలక ఆస్తులలో కురుసురా సబ్‌మెరైన్ మ్యూజియం, గోకుల్ పార్క్, టీయూ-142 ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం, వివిధ పార్కులు, ప్రీమియం హోటళ్లు, విశాఖ-భీమిలి ప్రధాన రహదారి ఉన్నట్లు కమిషనర్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్, తదితరులు

WALK-IN-INTERVIEW

పేరం గ్రూప్ Peram Group

PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

ADVOCATES	6 No's (2-3 yrs. exp)
OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
ADMINS	8 No's (1-5 yrs. exp)
DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
SURVEYORS	2 No's (2-3 yrs. exp)
LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)

D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969

నిధులు రాక.. పనులు సాగక..!

ఏఎంసీలో మందకొడిగా వసతిగృహాల నిర్మాణం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో చదువుతున్న పీజీలు, యూజీలు, సీనియర్ రెసిడెంట్స్ కోసం పందిమెట్ట మెడికోల వసతి గృహ ప్రాంగణంలో చేపట్టిన వసతి గృహాల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో ఆయా పనులకు శ్రీకారం చుట్టారు.

రెండేళ్లు దాటినా..!

★ ఏఎంసీలో పీజీ, యూజీ సీట్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో మెడికోల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో భవనాలు నిర్మించాలని ప్రతిపాదించారు. 2024 జనవరిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

★ ఆయా పనులు ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉన్నా, ఇప్పటికి రెండేళ్లు దాటినా... కొలిక్కి రాలేదు. ప్రస్తుతం శ్లాబుల వరకు నిర్మించారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో ఏడాది సమయం పడుతుంది.

నిర్మాణంలో ఉన్న పీజీల వసతి గృహం

రూ. 30కోట్ల నిధులతో..

★ యూజీ, పీజీ, హౌస్‌సర్జన్లకు సంబంధించి 228 గదులతో కూడిన 8 అంతస్తుల భవనం అందుబాటులోకి వస్తే 572 మందికి వసతి కల్పించొచ్చు.

★ 140 గదులతో ఏడు అంతస్తులతో కూడిన మరో భవనాన్ని సూపర్‌స్పెషాలిటీ మహిళల కోసం నిర్మిస్తున్నారు. అందులో 140 మందికి వసతి కల్పించే వీలుంది. ఈ రెండు భవనాలకు రూ.30కోట్లు ఖర్చు చేస్తున్నారు.

'అద్దె'.. అవస్థలు: ■ ఏఎంసీలో 1250 మంది యూజీలు(ఎంబీబీఎస్ చేస్తున్న వారు), మరో వెయ్యి మంది పీజీలు ఉన్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడకు వస్తున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతి లేక నానా అవస్థలు పడుతున్నారు.

■ ప్రస్తుతం ఉన్న గృహాల్లో కేవలం 500 మందికి మాత్రమే వసతి కల్పిస్తున్నారు. దీంతో మిగిలిన వారు అద్దె గదుల్లో ఉంటూ చదువు సాగిస్తున్నారు. వారి ఇబ్బందులు తీర్చే విధంగా రెండు భవనాలను సిద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక..!

వైకాపా పాలనలో నిధులను ఇతర అవసరాలకు మళ్లించడంతో... పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం జరిగింది. ఇప్పటికీ దాదాపు రూ.14 కోట్ల మేర నిధులు రావాల్సి ఉంది. ★ నిర్మాణ పనుల పురోగతిపై ప్రభుత్వానికి నివేదించామని, త్వరలో నిధులు విడుదలైతే పనుల్లో వేగం పెంచుతామని సంబంధిత అధికారులు తెలిపారు.

పేదలకూ 'ప్రైవేటు' చదువులు

న్యూస్‌టుడే, సింధియా, గోపాలపట్నం : పేద వర్గాల పిల్లలు సైతం ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునేందుకు వీలుగా 25 శాతం సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయిదేళ్లు నిండిన పిల్లలకు ఒకటో తరగతిలో ప్రవేశించడానికి విద్యాహక్కు చట్టం-2009ను అనుసరించి 2026-27 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వారి నివాస సమీప ప్రాంతంలో ఉన్న ఏ ప్రైవేట్ పాఠశాలనైనా ఎంచుకునే అవకాశం కల్పించారు. లాటరీ ప్రాతిపదికన ఎంపికలు నిర్వహిస్తారు.

25 శాతంలో కేటాయింపులు ఇలా..

నిర్ధారిత అనాథ, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగులకు: 5	
షెడ్యూల్ కులాల వారికి: 10	షెడ్యూల్ తెగల వారికి: 4
బలహీన వర్గాలకు: 6	

అర్హతలు పేద విద్యార్థులు సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ పాఠశాలల్లో ప్రవేశానికి 2.04.2020 నుంచి 31.03.2021, స్టేట్ సిలబస్ పాఠశాలకు 2.06.2020 నుంచి 31.05.2021 మధ్య జన్మించి ఉండాలి.

దరఖాస్తు గడువు.. అర్హులైన వారంతా ఫిబ్రవరి 20 నుంచి మార్చి 10 వరకు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఇ.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సమీపంలో ఉన్న సచివాలయం, ఇంటర్నెట్ సెంటర్, ఎంఈవో కార్యాలయం, మీ-సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు..

చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, విద్యుత్తు బిల్లు, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదైనా సరిపోతాయి. వయసు నిర్ధారణకు పుట్టిన తేదీ ధ్రువపత్రం అవసరం. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినపుడు లాటరీ విధానంలో ఎంపికలు జరుగుతాయని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి **దివాకర్** తెలిపారు.

నేడు ఐసీఏఐ అధ్యక్షుడి రాక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షులు డి.ప్రసన్నకుమార్ శుక్రవారం నగరానికి రానున్నారు. ఇటీవల దిల్లీలో బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా విశాఖ నగరానికి వస్తున్నారు. ఇంత వరకు ఆయన ఐసీఏఐ ఉపాధ్యక్షునిగా వ్యవహరించగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవి దక్కింది. రాష్ట్రం నుంచి సంబంధిత పదవి దక్కించుకున్న తొలి వ్యక్తి ఈయనే కావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు సంబంధిత సంస్థ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విమానాశ్రయం అటూ.. ఇటూ!

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల నడుమ కొత్త విమానాశ్రయం నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక అంశం అనకాపల్లి-కాకినాడ జిల్లాల మధ్య దోబూచులాడుతోంది. గతంలో కాకినాడ జిల్లాలోని అన్నవరం, తుని మధ్యలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఇందుకు భూములిచ్చే ప్రసక్తే లేదని అప్పట్లో రైతులు తేల్చిచెప్పారు. దానికితోడు అక్కడ సాంకేతికపరమైన ఇబ్బందులు రావడంతో అప్పట్లోనే పాయకరావుపేట, నక్కపల్లి మధ్య ఉన్న గోపాలపట్నం ఆవ పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. కానీ కాలక్రమంలో ఆ ప్రతిపాదనా తెరమరుగైంది. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 9 విమానాశ్రయాలు నిర్మించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా తుని, అన్నవరం మధ్య విమానాశ్రయం నిర్మించేందుకు అవసరమైన సవివర ప్రణాళిక నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ స్పష్టం చేసింది.

★ కాకినాడ, ఉప్పాడ ప్రాంతాల మధ్య రూ.వేల కోట్లతో పలు పరిశ్రమలు కొలువుదీరనున్నాయి. వీటికి సమీపంగా నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కుపరిశ్రమ, పాయకరావుపేట మండల పరిధిలో జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్టీపీసీ) ప్లాంట్ నిర్మితం కానున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో విమానాశ్రయం నిర్మిస్తే పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తునికి రెండువైపులా దాదాపు 100 కి.మీ. దూరంలోని రాజమహేంద్రవరం, విశాఖలో విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తుని దగ్గర భూములు విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా లేవనే ఉద్దేశంతో అప్పట్లో నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అందువల్ల ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాకపోతే సమీప ప్రత్యామ్నాయం పాయకరావుపేటే కావడంతో ఈ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశముందంటున్నారు.

Authorised Main Dealers: OLIVE TVS: VISHAKAPATNAM, Cell: 8142299966, DHARMANA TVS: GAJUWAKA, Cell: 7989851681, OLIVE TVS: N.A.D, Cell: 9182472619, OLIVE TVS: MVP COLONY, Cell: 8142299923, OLIVE TVS: MURALINAGAR, Cell: 8142299924, OLIVE TVS: PENDURTHY, Cell: 8142299970, OLIVE TVS: MADHURAWADA, Cell: 8142299972, DHARMANA TVS: MALKAPURAM, Cell: 9398656775, DHARMANA TVS: ANAKAPALLE, Cell: 8341546429, Authorised Dealer: JHANVI TVS: PADERU, Cell: 8341123619.

(c) eenadu

1,062 మందితో శుభ్రత పనులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ సాగర తీరంలో నిర్వహించిన అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ, మిలన్-2026 కార్యక్రమాల నేపథ్యంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో రోజుకు 1,062 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించారు. షిఫ్ట్‌కు 354 మంది చొప్పున మొత్తం మూడు షిఫ్ట్‌ల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, రక్షణ రంగ ప్రముఖులతో పాటు, దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు రావడంతో.. ఎక్కడా ఇబ్బంది లేకుండా పరిశుభ్రత పనులు నిర్వహించారు. ప్రజారోగ్యం విభాగం అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య పక్కా ప్రణాళిక సిద్ధం చేసి, కార్మికుల విధులను పర్యవేక్షించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ

(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ LXIII OF 1951 క్రింద ఏర్పాటు చేయబడింది.

విశాఖపట్నం బ్రాంచ్, # 52-14-77/1, కొత్త రేసపువానిపాలెం, బుల్లయ్య కాలేజ్ దగ్గర, విశాఖపట్నం-530013. ఫోన్ : 0891-2747661 & 94908 24955, ఇ-మెయిల్ : vizag@apsfc.com

ISO APSFC

ఇంటి సామాన్లు & చరాస్తి ఐటమ్స్ వగైరా తొలగించుట కొరకు బహిరంగ ప్రకటన

1. శ్రీమతి కుక్కల కృష్ణ కుమారి, భర్త : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా-521150.
2. శ్రీ కుక్కల వెంకట రామ విద్యాసాగర్, తండ్రి : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, # 194, రోడ్ నెం.10C, MLA & MP కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
3. శ్రీ కుక్కల మోహన్ నాగేశ్వర్, తండ్రి : (లేటు) కుక్కల నాగేశ్వరరావు, # 401, పద్మజ మాన్షన్ 11, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట్, హైదరాబాద్-500033.

డియర్ సర్/మేడమ్,

SFC యాక్ట్ 1951లోని సెక్షన్ 32G క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, AP Revenue Recovery Act 1864లోని r/w నిబంధనల ప్రకారం, కార్పొరేషన్, శ్రీమతి కుక్కల కృష్ణ కుమారి గారికి చెందిన షెడ్యూల్డ్ ఆస్తిని తేది.20.01.2022 న భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది.

కార్పొరేషన్ తేది.11.12.2025 న బహిరంగ వేలం ద్వారా షెడ్యూల్ ఆస్తిని విక్రయించింది మరియు వేలం కొనుగోలుదారుకు అనుకూలంగా అమ్మకపు నిర్ధారణ లేఖను జారీ చేయడమైనది.

కార్పొరేషన్ ఇప్పటికే తేది.15.12.2025 న లేఖను జారీ చేయడమైనది. దీనిలో మీరు షెడ్యూల్ చేయబడిన ఆస్తిలో ఉన్న మీ హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ మరియు చరాస్తి ఐటమ్స్‌ను ఈ నోటీసు అందిన తేదీ నుండి 7 రోజులలోపు ఖాళీ చేయాలని ఆదేశించడమైనది. కొరియర్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా రశీదు బకాయితో పంపబడిన లేఖను డెలివరీ చేయకుండా తిరిగి వచ్చినందున ఈ క్రింది వ్యాఖ్యలతో, ఈ చిరునామా/చిరునామాదారుడు ఎవరూ సూచనలు లేకుండా వదిలివేయబడినది.

పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని, శ్రీమతి కె. కృష్ణ కుమారి/ఆమె అధీకృత వ్యక్తులు ఈ ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోపు షెడ్యూల్ ప్రాంగణంలో ఉన్న హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ మరియు ఇతర చరాస్తి ఐటమ్స్‌ను ఖాళీ చేయాలని ఇందుమూలంగా కోరడమైనది. లేని యెడల కార్పొరేషన్ వారు ఆస్తిని వేలం కొనుగోలుదారునికి అప్పగించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఖర్చు మరియు పరిణామాలకు సంబంధించి మీ బాధ్యత మేరకు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించవలెను.

షెడ్యూల్ ఆస్తి

విశాఖపట్నం, వాల్తేర్ వార్డు, సిరిపురం, బాలాజీ నగర్, T.S.నెం.68/2, ప్లాట్ నెం.17 భాగం నందు విస్తీర్ణం 338.5 చ॥గ॥ులలోని భూమితో పాటు గోకుల్ నివాస్, డి నెంలు. 9-29-10A & 10/2, G+2 అంతస్తులతో రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: ఉత్తరం: 30 అ॥ల రోడ్డు, దక్షిణం: మిగిలిన ప్లాట్ నెం.17లోని డి నెం.9-29-10, తూర్పు: 30 అ॥ల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.16 లోని H.M. సూరత్‌వాలా భవనం డి నెం.9-29-24.

తేది : 20.02.2026
ప్రదేశం : విశాఖపట్నం

సం/- సీనియర్ బ్రాంచ్ మేనేజర్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ
APRR యాక్ట్ 1864 ప్రకారం నియమించబడిన కలెక్టర్

తీరం మెరిసింది... విశాఖ మురిసింది!!

★ ఘనంగా మిలన్-2026, సిటీ పరేడ్ కార్యక్రమాలు
★ పాల్గొన్న 74 దేశాల నౌకాదళాలు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: అంతర్జాతీయ యుద్ధనౌకల పండుగ విశాఖ తీరంలో అద్భుతంగా జరిగింది. భారత నౌకాదళం నిర్వహించిన అంతర్జాతీయ నౌకల సమీక్ష (ఐఎఫ్‌ఆర్), మిలన్-2026, ఇండియన్ ఓషన్ నేషన్స్ సింపోజియంల సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ సిటీ పరేడ్ రెండున్నర గంటలపాటు వీక్షకులను ఆకట్టుకుంది. అంతకుముందు గగనతలంలో, తీరంలో నిర్వహించిన నావికాదళ విన్యాసాలు అబ్బురపరిచాయి. 74 దేశాలు ఈ ఉత్సవంలో భాగస్వామ్యం అయినట్లు భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై విన్యాసాలు తిలకించడంతోపాటు, నౌకా దళాలు కవాతు, గౌరవ వందనం అందుకున్నారు. విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో గురువారం సాయంత్రం జాతీయ గీతం ఆలాపనతో మిలన్ ప్రారంభమైంది. జాతీయ గీతానికి లయబద్ధంగా నౌకాదళ బ్యాండ్, చేతక్ హెలికాప్టర్లు జాతీయ జెండాలతో తీరంలో మోహరింపు ఆకట్టుకున్నాయి.

అలరించిన నేవీ విన్యాసాలు: నేవీ ఆపరేషన్ డెమోలో గగనతలంలో 60కిపైగా నౌకాదళ హెలికాప్టర్లు, విమానాలు రకరకాల విన్యాసాలు చేశాయి. తీరంలో ఒడ్డున శరత్ పేరుతో ప్రసిద్ధి చెందిన నాలుగు యుద్ధట్యాంకులు శత్రుమూకలపై ఎలా దాడి చేస్తాయో ప్రదర్శించాయి. కమాండర్ అవినాష్ బాండా ఆధ్వర్యంలో వజ్రాకృతిలో నాలుగు హెలికాప్టర్లు చక్కర్లు కొడుతూ చేసిన విన్యాసాలు కట్టిపడేశాయి.

కనుల పండువగా పరేడ్: సిటీ పరేడ్‌లో భాగంగా నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) బాలికల బృందం చేసిన నృత్యం ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. 8 దేశాల నేవీ

ఆసియా సభ్య దేశాల నౌకాదళాధిపతులతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బ్యాండ్లు, 45కు పైగా బృందాలతో అంతర్జాతీయ సిటీ పరేడ్ సాగింది. కోరుకొండ సైనిక్ స్కూల్, నేవీ, ఎన్‌సీసీ, ఎస్‌సీసీ బృందాలు కవాతు చేశాయి. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, షీషెల్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, థాయ్‌లాండ్, వియత్నాం, తదితర దేశాల నేవీ బృందాలు ఈ పరేడ్‌లో పాల్గొన్నాయి. శ్రీలంక నేవీ బ్యాండ్ 'సారే జహాసే అచ్ఛా' గీతాన్ని ఆలపించడం విశేషం. కూచిపూడి, థింసా, గరగలు, కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు, డోలు కళాకారులు, అమ్మోరు భక్త తాండవం, వీరశైవ భక్త సంప్రదాయం, జానపద పురాణ ఘట్టాల గ్రామీణ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన శక్తి నృత్యం అబ్బురపరిచింది. పర్యాటకశాఖ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖల శకటాలు ప్రదర్శించారు. వందేమాతరం గీతానికి 150ఏళ్ల సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన శకటం ఆకట్టుకుంది. కంటిన్యూటీ డ్రిల్ పేరుతో జవాన్లు తుపాకులతో చిమ్మచీకటిలో చేసిన సాహస ప్రదర్శనతో పరేడ్ ముగిసింది. అనంతరం సముద్రంలోని యుద్ధనౌకల నుంచి లేజర్‌షో, డ్రోన్లతో ఆకాశంలో ఆకృతులు, బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి.

కొన్ని నెలలుగా ప్రణాళిక: గత కొన్ని నెలల నుంచి నేవీ, జిల్లా యంత్రాంగం అంతర్జాతీయ సిటీ పరేడ్ నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేశాయి. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుక తిన్నెలపై 40 వేదికలను ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి 150 వరకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. తూర్పు నౌకాదళ అధిపతి సంజయ్ భల్లా గురువారం సాయంత్రం 4.30గంటలకు, ముఖ్యఅతిథి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి 5గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. జాతీయ గీతాలాపనతో మిలన్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, మేయరు పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, జేసీ విద్యాధరి తదితర అధికారులతో పాటు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

★ ఆర్కే బీచ్‌కు అటు, ఇటుగా 40 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4గంటలకు ఆయా వేదికలు జనాలతో నిండాయి.

★ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్కు హోటలు వరకు ప్రధాన రహదారిలో వాహనాలు, సాధారణ ప్రజల రాకపోకలను మధ్యాహ్నం నుంచి పూర్తిగా నిషేధించారు. నౌకా దళాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, వారి సన్నిహితులతో పాటు సివిలియన్స్, ముఖ్యుల కోసం ఆర్కేబీచ్‌లో ఏర్పాటు చేసిన దాదాపు 38 ఎన్‌క్లోజర్లు సాయంత్రం 4గంటలకే నిండిపోయాయి.

భారీ కొండచిలువ కలకలం

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రాం షిప్‌యార్డుకాలనీలో నిరుపయోగంగా ఉన్న శిథిలభవనంలో గురువారం భారీ కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయంతో స్నేక్‌క్యాచర్ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. గంటసేపు శ్రమించి ఎట్టకేలకు దానిని బంధించారు. రెండు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో ఈ కొండచిలువ కనిపించింది. స్థానికులు నాగరాజుకు సమాచారం ఇవ్వగా.. అతను వచ్చేటప్పటికి జారుకుంది. ఎట్టకేలకు చిక్కడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

కొండచిలువను బంధిస్తున్న నాగరాజు

ప్రణాళికాధికారికి 45 రోజుల సెలవులు మంజూరు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో నగర ప్రణాళికాధికారి(సీపీ)గా విధులు నిర్వహిస్తున్న కె.ధనుంజయరెడ్డికి 45 రోజుల సెలవులు మంజూరు చేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కుమార్తె వివాహ నిమిత్తం ఆయన అమెరికా వెళ్లేందుకు వీలుగా మార్చి 2 నుంచి ఏప్రిల్ 15 వరకు సెలవులు మంజూరయ్యాయి.

కప్పస్తంభం వద్ద మొక్కుతున్న డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ దంపతులు

అప్పన్న సన్నిధిలో డీఆర్‌డీవో ఛైర్మన్

సింహాచలం, న్యూస్‌టుడే: భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ గురువారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ప్రొటోకాల్ పర్యవేక్షకుడు త్రిమూర్తులు, అర్చకులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

ఏజీపీఎల్‌కు టాప్ కస్టోడియన్ అవార్డు

గాజువాక, న్యూస్‌టుడే: అంతర్జాతీయ కస్టమ్స్ దినం పురస్కరించుకుని గురువారం అదానీ గంగవరం పోర్టుకు ప్రతిష్ఠాత్మక టాప్ కస్టోడియన్ పోర్ట్ అవార్డు లభించింది. వాణిజ్య సులభతరం, కార్యాచరణ నైపుణ్యంతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న పోర్టుకు ఈ అవార్డు దక్కినట్లు పోర్టు వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అత్యుత్తమ కార్గో నిర్వహణ, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దీంతోపాటు మరో రెండు ముఖ్యమైన అవార్డులను సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9866027578.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ వైష్ణవ శ్రీనివాస, తండ్రి : ఎమ్. చాంద్ వైష్ణవ, ప్లాట్ నెం.ఎ/3/5, సర్వే నెం.73, బ్లాక్ బి, ఎపిఐఐసి ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటో నగర్, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530012. శ్రీ వైష్ణవ శ్రీనివాస, తండ్రి : ఎం.చాంద్ వైష్ణవ, ఫ్లాట్ నెం.508, నాల్గవ అంతస్తు, సూర్యటవర్స్, యస్.నెం.45/39, ప్లాటు నెం.10, 11 & 12, డోర్ నెం.3-299/13/40, హాస్పిటల్ రోడ్డు, ప్రశాంతినగర్, వార్డు నెం.56, గల్లవానిపాలెం, అగనంపూడి గ్రామం, గాజువాక, విశాఖపట్నం-530046. డిమాండ్ నోటీసు తేది: 29-09-2022

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.28.09.2022 నాటికి రూ.1,59,31,995/- + తేది.29.09.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.18-02-2026 నాటికి రూ.2,18,82,765/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

(ఆస్తి ఐడి:SBIN90662441680): గాజువాక జోన్-5, అగనంపూడి గ్రామం, గల్లవానిపాలెం, వార్డు నెం.56, ప్రశాంతి నగర్, ఆసుపత్రి రోడ్డు, సర్వే నెం.45/39, ప్లాటు నెం.10, 11 & 12లోని 1226.93 చ॥గ॥ులలో 33 చ॥గ॥లు లేదా 27.59 చ॥మీ॥లు అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు సూర్యటవర్స్, నాల్గవ అంతస్తు (జి+4)లోని 1105 చ॥అ॥లు (కామన్ ఏరియాలతో కలిపి) ప్లింత్ ఏరియాతో డోర్ నెం.3-299/13/40తో గల ఫ్లాట్ నెం.508 శ్రీ వైష్ణవ శ్రీనివాస, తండ్రి: చాంద్ వైష్ణవ గారి పేరున కలదు. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.53/2020, తేది.07.01.2020, ఎస్ఆర్ఓ లంకెలపాలెం ప్రకారం). ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఫ్లాట్ నెం.507, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై, మొత్తం భవనంనకు హద్దులు : తూర్పు: రోడ్డు, దక్షిణం: రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.6, 7, 8, 9, 9ఎ.

రిజర్వు ధర : రూ.29,28,000/- ధరావత్తు : రూ.2,92,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 09-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:20-02-2026 నుండి 08-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ https://baanknet.com నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.

తేది:18-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

టగ్ నిర్మాణ పనులకు శ్రీకారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) అవసరాలకు వీలుగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్‌ఎల్)లో నిర్మిస్తున్న రెండో టగ్ స్టీల్ కటింగ్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీపీఏ డిప్యూటీ ఛైర్‌పర్సన్ కె.రోష్నీ అపరంజి మాట్లాడుతూ... 60 టన్నుల సామర్థ్యంతో నిర్మించే టగ్ నిర్మాణానికి సంబంధించి గత ఏడాది డిసెంబరులోనే ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. మొదటి టగ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండగానే, రెండో టగ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని హెచ్ఎస్‌ఎల్ సీఎండీ జి.వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో ఇరుసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌కటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తున్న పోర్టు డిప్యూటీ ఛైర్‌పర్సన్ అపరంజి. చిత్రంలో సీఎండీ వెంకటేశ్వర్లు, తదితరులు

లైఫ్ సేవింగ్ శిక్షకుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

సాగరనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు తీర ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్) ఆంధ్రప్రదేశ్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వాటర్ స్పోర్ట్స్ సీఈవో బి.బలరామ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మార్చి ఒకటి నుంచి 6వ తేదీ వరకు ఆర్కేబీచ్‌లో జరుగనున్న జాతీయస్థాయి శిక్షకుల శిక్షణ (ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్) ఉచ్చె కార్యక్రమానికి రాష్ట్రం నుంచి పది మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి ప్రమాదాలు, అదుపుతప్పిన ప్రమాదాల వంటి విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈతలో ప్రావీణ్యం, సమాజసేవ పట్ల ఆసక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యం గలవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రాణ రక్షణ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే ముఖ్య లక్ష్యమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 97037 84560 వాట్సాప్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న డ్వాక్ శేఖర్‌రావు స్మారక క్రికెట్ పోటీల క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరాయి. ఇప్పటికే టీబీ అవెంజర్స్ సీసీ, గౌరీ యూత్ సీసీ, మేజిస్టిక్ సీసీ, స్పోర్ట్స్ ఎలెవెన్ సీసీ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో విజేతలైన మరో నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ★ గురువారం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో సూపర్‌స్టార్స్ సీసీ జట్టు 4 వికెట్ల తేడాతో యునైటెడ్ సీసీ జట్టుపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో జోలీ రోవర్స్ సీసీ జట్టు 6 వికెట్ల తేడాతో వైజాగ్ స్టార్ లైట్స్ జట్టుపై విజయం సాధించింది.

ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పనులు ఆరంభం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయ ధ్వజస్తంభం పున ప్రతిష్ఠాపన నేపథ్యంలో గురువారం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన ర్చకుల వెంపలపల్లి వెంకట రమణ మూర్తి శర్మ, వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. వాస్తుపూజ, హోమం నిర్వహించారు. ఈవో జె.వెంకటరావు పూజల్లో పాల్గొన్నారు. తొలుత పాత ధ్వజస్తంభానికి కళా నిరూపణ తొలగింపు నిర్వహించి తొలగించారు. అనంతరం ఈ నెల 23 నుంచి పునః ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమవుతాయి. 27న ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగుతుంది. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఈఈ బందారు రాంబాబు, డీఈఈ రామరాజు, ఏఈ రవి రాజు, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతక స్వామి ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజల్లో పాల్గొన్న ఈవో వెంకటరావు, అర్చకులు

విశాఖ జిల్లా డీసీహెచ్ఎస్‌గా నరేంద్రసింగ్

రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్)గా డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ నియమితులయ్యారు. గుంటూరు జిల్లా తెనాలి జిల్లా ఆసుపత్రి నుంచి బదిలీపై విశాఖ వచ్చిన ఆయన గురువారం పెందుర్తి సీహెచ్‌సీ ఆవరణలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ పి.శంకర్‌ప్రసాద్ అగనంపూడి ఆసుపత్రిలో పూర్వపు విధుల్లో చేరారు. డాక్టర్ నరేంద్రసింగ్‌ను పెందుర్తి సీహెచ్‌సీ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కే దొర, వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విశాఖ జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని నూతన డీసీహెచ్ఎస్ డాక్టర్ నరేంద్రసింగ్ తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పెందుర్తి సీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రి వచ్చే రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవల గురించి స్పష్టంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కే దొరను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులను త్వరలో సందర్శించి రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఘన స్వాగతం

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: నావికాదళం ఆధ్వర్యంలో జరిగే మిలన్‌లో పాల్గొనేందుకు కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం విశాఖ చేరుకున్నారు. ఐఎన్ఎస్ డేగాలో ఆయనకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, నేవీ అధికారులు ఘన స్వాగతం పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

పోలీస్ కమిషనర్ పర్యవేక్షణ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఐఎఫ్ఆర్‌లో భాగంగా గురువారం బీచ్‌రోడ్డులోని పార్కుహోటల్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు అంతర్జాతీయ సిటీ పరేడ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును సీపీ శంఖబ్రతబాగ్చీ స్వయంగా పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డాక్టర్ వి.ఎస్.కృష్ణా పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ యోజన ద్వారా కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కంప్యూటర్ కోర్సు అప్లికేషన్ డెవలపర్ వెబ్ - అండ్ మొబైల్ శిక్షణకు బీఎస్సీ కంప్యూటర్స్, బీటెక్, గణితం చేసిన వారు అర్హులన్నారు. వయసు 18-35 ఏళ్లు ఉండాలన్నారు. మూడున్నర నెలలు శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 90147 66143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	110
లైవ్	147	130
డ్రెస్డ్	213	230
స్కిన్‌లెస్	243	240

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం

విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ : ఫోన్ నెం. 0891-2764949
Website: www.simhachalamdevasthanam.net
Email: endow-eosvlnsd@gov.in, jc_eo_simhachalam@yahoo.co.in

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ మరియు సీల్డ్ కొటేషన్స్ షార్ట్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం.Engg/01/2026 తేది: 19-02-2026

శ్రీ స్వామి వారి కొండపైన మరియు కొండ దిగువ వార్షిక ఉత్సవ పనులు మరియు అభివృద్ధి పనులు సివిల్ మరియు ఎలక్ట్రికల్ (11 Nos) పనులకు గాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ పిలుచుటకు (7 రోజులు) మరియు సివిల్, ఎలక్ట్రికల్ సీల్డ్ కొటేషన్స్ పనులు (6 Nos) గాను సీల్డ్ కొటేషన్స్ కోరడమైనది. (7రోజులు).

షెడ్యూల్ జారీ చేయు తేది	: 20.02.2026 నుండి తేది.27.02.2026 వరకు
షెడ్యూల్ దాఖలు చేయు ఆఖరి తేది	: 28.02.2026 సాయంత్రం 04.00 వరకు
సీల్డ్ కొటేషన్లు తెరుచు తేది	: 28.02.2026 సాయంత్రం 04.30 గం.లకు

పై పనులకు www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు పిలువడమైనది. Website: www.simhachalamdevasthanam.net

Contact No: +91 9618072527, +91 8519807173, +91 7659990664, +91 9177444441

సం/- జె.వెంకటరావు
కార్యనిర్వాహణాధికారి.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

PILES

పైల్స్, భగందరం, ఫిషర్ స్పెషలిస్ట్: Dr.Prem Kumar, Mrs.Deepti వైజాగ్: సింగ్ హోటల్ జంక్షన్, జడ్జికోర్ట్ దగ్గర & గాజువాక: శ్రీహరిపురం చర్చిడౌన్. సంప్రదించండి: 8309200608, 9866070593.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

ఫ్లాట్ అమ్మకం

విశాఖపట్నం, బక్కన్నపాలెం వద్ద "విరాట్ బ్లాక్" లోని "ఉత్కర్ష ఎబోడ్స్" యొక్క 4వ అంతస్తులో 1494 చ॥అ॥ల విస్తీర్ణంతో, కార్ పార్కింగ్‌తో సహా గల ఫ్లాట్ నెం.502 యొక్క కనీసపు ధర రూ.51,64,000/- గా నిర్ణయించి వేలము నందు అమ్మబడును.
99486 74546
92466 11933

3BHK, North facing 1300 sft with car parking(USD-33.89)2nd floor, 9th sector, Opp.Samata College, MVP Colony. Cont: 9494576200.

HOUSE FOR SALE

VZM ROAD

VZM JNTU Jn. towards RK township Nr. Orissa Daba, E/F, 222 Sq.Y. (33.3x60) 3B/R Individual House for sale. Full residential area & vastu ✆: 9703116256.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

TO LET

COMMERCIAL

NAD

2000 Sft. First Floor Santhinagar, NAD Jn., Behind Old Spencers for Offices / Schools / Coaching Centers Lease / Rent. Rs: 25,000/- M. ✆ 8522936667.

JOBS

Part time Job, MNC only Retd. Person/ Sr. Citizen/ Housewives, Age: 50 & above, 10th Pass, Fixed Salary, ESI. ✆ 9966385515.

Wanted DTP Operator, MS Office, Photoshop Male or Female. Contact No : 9705929214, 8019929214.

Part Time Job MNC only Retd. Person / Sr. Citizen / House wives. Age: 40 above. 10th Pass. Fixed Salary, ESI. Ph: 9009204507.

WANTED
ప్రముఖ ఆటోమొబైల్ షోరూమ్ (2W/3W) సంస్థకి వైజాగ్, గాజువాక, అనకాపల్లి, మధురవాడ ఏరియాలకి సంబంధించి 10th, 12th, Degree చేసిన Freshers / Experienced Male Executives కావలెను.
Srinivasa Rao
Madhurawada, Vizag
9666838334, 8712644055

WANTED
BTAH, Gajuwaka, Vizag.
1. OPERATORS for Loaders
2. OPERATORS for Excavators
3. SUPERVISORS Mechanical for dumpers
4. WELDERS
5. ELECTRICIAN For Dumpers
6. MECHANICS for Loaders & Excavators
7. SUPERVISORS (STORE) for Dupers Spares
7799506762

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైఫ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 7842125628.

క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వైజాగ్ ఆటోనగర్ బ్రాంచ్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పనిచేయుటకు 10 ఆపై చదివిన వారు మరియు ట్రాన్స్‌పోర్ట్ రంగంలో అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను సంప్ర: ✆ 70324 00999.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ
SUBHAGRUHA
ఉద్యోగావకాశాలు
SALARY + INCENTIVES
8106863499
9010988707

కుక్స్- cooks (ఆడ / మగవారు) ఆహార వంటకాల అనుభవంతో వంటవారు కావలెను. కాల్: 8897663366

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు టెలీకాలర్స్ M/F కావలెను. భోగాపురంలో ప్లాట్స్ అందుబాటులో కలవు. సంప్రదించండి: ✆ 9014367399.

Naval Dockyardనందు మేనేజర్, సూపర్‌వైజర్‌గా పనిచేయుటకు పురుష అభ్యర్థులు కావలెను. ✆ 9395122999, 7995476203.

టి.వి.యస్. షోరూమ్ మల్కాపురం నందు పనిచేయుటకు సేల్స్, డెమో ఎగ్జిక్యూటివ్‌లు, మెకానిక్‌లు కావలెను. జీతం: 10,000/- ఇన్సెంటివ్ అనుభవం కలవారికి ప్రాధా॥ ✆ 9951312909.

BMS, స్మార్ట్ సిస్టమ్ పర్పస్‌లో పనిచేయుటకు యువతీ/యువకులు (M/F) కావలెను. అర్హత: బి.కామ్ కంప్యూటర్స్ బి.టెక్. మంచి జీతం. వాట్సాప్: 9949129054.

WANTED
A Reputed Multi Crore Organisation Requires
DEVELOPMENT OFFICERS BUSINESS PARTNERS
Qua: 40+ M/F
Prefer: Retd/VRS/Employees, Housewives, LIC Insurance
2 & 3 Years Marketing Experience
Yearly Package 12 Lakhs
M.RAMANI
P & T Colony, Vizag
88972 96440
89780 87956

SECURITY GUARDS

వైజాగ్ సిటీలో అన్ని ఏరియాల్లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపింగ్ స్టాఫ్, ఆఫీస్ బాయ్స్, టీబాయ్స్ & ఇంట్లో, రూమ్, భోజనం వసతి కలదు. జీతం 18 వేలు, 36 వేల. ✆ 6300071128

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవాలని పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చేసుకున్న లేదా చేసుకునే క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారుల సమాచారం అందించిన సేవల లేదా ఉత్పత్తుల నాణ్యత వంటి విషయాలకు ఈ పత్రిక బాధ్యత వహించదు. అలాగే ఎటువంటి డబ్బులు, వసూలు చేయరాదు. ప్రకటనదారులతో లావాదేవీలకు పాఠకులే బాధ్యులు కావున మరియు/ లేదా ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: హే బలవంత్
స్క్రీన్-2: ఆల్ఫా

నేడు ఉచిత అంబులెన్స్ ప్రారంభం

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపారు. ఈ మేరకు నగర సీపీ శంఖబ్రత బాగ్చి సంబంధిత వాహనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతిమ యాత్ర, మోక్ష రథం వాహనంతో పాటు ఫ్రీజర్ బాక్సు సేవలు సమకూరుస్తున్నామని అన్నారు. ఉచిత అంబులెన్స్ సేవల కోసం 99665 16516, 99665 44888 నంబర్లకు ఫోనులో సంప్రదించాలని కోరారు.

22న సరిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పెందుర్తి, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఆర్కే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్ఎస్‌కే రేవంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే శిబిరంలో పలువురు నిపుణులు పాల్గొని వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ఆర్‌ఆర్ వెంకటాపురం కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. –నాగేశ్వరరావు, వెంకటాపురం, స్థానికులు ✓: కాలువలను సిబ్బందితో శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. –ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలి నుంచి సినిమాహాల్ కూడలికి వెళ్లే మార్గంలో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –రవి, పరవాడ ✓: వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. –లలిత, ఏఈ, ఆర్అండ్‌బీ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొర్లెవానిపాలెంలో చెత్త పేరుకుపోయింది. –జీవీహెచ్ దేముడు, గొర్లెవానిపాలెం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం మెయిన్ రోడ్డులోని డివైడర్ మధ్యలో ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. –ఎం.కనకరాజు, సబ్బవరం ✓: వెలగని దీపాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. –డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

పరీక్షల సమయం.. జాగ్రత్తలే ముఖ్యం..

ఇస్లాంపేట కళాశాలలో నిర్వహిస్తున్న అదనపు తరగతులలో చదువుకుంటున్న విద్యార్థులు

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితంలో పది, ఇంటర్మీడియట్ ఎంతో కీలకం. ఈనెల 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఇంటర్, మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల తేదీ సమీపిస్తున్న కొద్దీ కొందరు విద్యార్థులు ఆందోళనకు గురై చదువులో వెనుకబడుతారు. ఈ క్రమంలో పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతో పాటు ఆరోగ్యం, నిద్ర, మంచి పౌష్టికాహారం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాయుతంగా ఏకాగ్రతతో చదివితే పరీక్షలు నిర్భయంగా రాసేయవచ్చునని చెబుతున్నారు. ఇదే సమయంలో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బ తినకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వీటిని పాటిస్తే మేలు..

పరీక్షల సమయంలో నిద్రకు దూరమై చదవకుండా మధ్యలో కొంత సమయం విరామం ఇవ్వాలి. దీనివల్ల చదివిన అంశాలు బాగా గుర్తుండడంతో పాటు మంచి మార్కులు సాధించవచ్చు. ఏకాగ్రత దెబ్బ తినకుండా పౌష్టికాహారంపై దృష్టి సారించడంతో పాటు ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకుని చదివితే జ్ఞాపకం ఉంటుంది. పునశ్చరణ ద్వారా మరింత పట్టు సాధించే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా చక్కగా రాయవచ్చు. చిరుతిళ్లు, చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు		
మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పరవాడ	13	793
పెందుర్తి	12	1032
సబ్బవరం	08	472
మొత్తం	33	2297

నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలలు	విద్యార్థులు
★ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల	763
★ రాంపురం ప్లస్2..	12
★ పరవాడ జూనియర్ కళాశాల	300
★ పరవాడ ప్లస్2..	48
★ ఇస్లాంపేట కళాశాల	82
★ తానాం గురుకులం	300
★ సబ్బవరం ప్రభుత్వ కళాశాల	590
★ సబ్బవరం కేజీబీవీ	74
మొత్తం	2169

★ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ రోజుకు ఏడు గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. త్వరగా జీర్ణమయ్యే పోషక విలువలు గల ఆహారం, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుంది. జంక్‌ఫుడ్స్‌కు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. రోజుకు చిన్నపాటి శారీరక వ్యాయామం, యోగా చేయాలి. కాచి చల్లార్చిన నీరు, పాలు, పండ్లు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలి. మధ్యలో కొంత విశ్రాంతి తీసుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్షలు దగ్గర పడడంతో పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి.
–ప్రదీప్‌ప్రసాదురాజా, దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి

కాలుష్యంపై నాలుగుసార్లు ప్రస్తావించినా స్పందన కరవు


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధి పరవాడ మండలంలోని ఎన్‌టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల వల్ల ఎదురవుతున్న కాలుష్య సమస్యపై నాలుగు సార్లు శాసనసభలో ప్రస్తావించినా పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభ సమావేశాల శూన్య గంటలో ఆయన గురువారం సంబంధిత సమస్యను ప్రస్తావించారు. పరిశ్రమల వాహనాల ద్వారా లంకెలపాలెం రహదారిని ఆనుకుని ఉన్న ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ పరిశ్రమలు. . రవాణాకు ఉపయోగించే భారీ, ఇతర వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ దిశగా ప్రయత్నించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది సాకారమైతే సుమారు 50శాతం కాలుష్యం తగ్గుతుందన్నారు. కాలుష్య సమస్యలపై ఇప్పటికే సభలో నాలుగుసార్లు ప్రస్తావించినా నేటికీ పరిష్కారం దొరకలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

22 నుంచి పరదేశిమాంబ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు పరదేశిమాంబ అమ్మవారి వేడుకలు నిర్వహించనున్నారు. సంబంధిత కార్యక్రమాలకు చెందిన గోడపత్రికలను గురువారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, అనకాపల్లి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచి పైలా రామారావు, వర్రి వసంతరావు తదితరుల చేతులమీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, పెద్దఎత్తున బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. ఈనెల 24వ తేదీన అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం అనుపోత్సవం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జగన్నాథరావు, వెంకటరమణ తదితర నాయకులు

అవీ ఇవీ

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలోని శ్రీపోలమాంబ పండగ సందర్భంగా ఈనెల 21వ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్లకు ఈనెల 24న నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఇతర వివరాల కోసం 98856 36637 నంబరుకు ఫోనులో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: విరాట్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఈనెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దీనివల్ల బాలాజీగార్డెన్స్, శ్రీనివాసనగర్, గొల్లనారాయణపురం, దత్తసాయినగర్, సింహాద్రినగర్, సింహాచలం ఆర్టీసీడిపో, విరాట్‌నగర్, ప్రహ్లాదపురం, దుర్గానగర్ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: 11 కేవీ శ్రమశక్తినగర్ ఫీడర్‌పై మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలోని శారదాపీఠం ప్రాంతం, శ్రమశక్తినగర్ పరిసర ప్రాంతాలు, ఎంఈఎస్ లేఅవుట్, బంగారమ్మ కాలనీ, ఇంద్రగంటి పార్కు ప్రాంతం, పార్వతీనగర్, చలమాజీ అపార్టుమెంట్ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

బాల కార్మికులతో పని చేయించడం నేరం

సబ్బవరం, న్యూస్‌టుడే: 18 ఏళ్ల వయసు నిండని వారితో పని చేయించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏఎల్‌వో) పి.సూర్యనారాయణ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి గురువారం సబ్బవరం మండలంలోని వివిధ దుకాణాలతో పాటు పలు చోట్ల తనిఖీ చేపట్టారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ ఆర్.రామచంద్రరావు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

22న రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపికను ఈ నెల 22న రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రెండు విభాగాల్లోనూ 65 కేజీల లోపల, 65 కిలోల పైబడి, మాస్టర్స్(పురుషుల) విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్ల వయసు పైబడిన వారికి పోటీలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8885203519 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పులగవానిపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి పులగవానిపాలెంలోని శ్రీకృష్ణాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు గోపాలుడికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయితి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. మండల జనసేన అధ్యక్షుడు కొరుపోలు రామునాయుడు, నాయకులు సుధాకర్ రాజు, కరణం కనకరాజు, అవగడ్డ అప్పలనాయుడు, గొరపల్లి సత్తిబాబు, వర్రి శివ, తదితరులు ఈ పూజల్లో పాల్గొని అన్నదానం ప్రారంభించారు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు సింహాచలంనాయుడు, ఇతర నాయకులు

సాగర తనయకు వైభవంగా కుంకుమార్చన

పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి ఫాల్గుణ పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు సాగర తనయకు శ్రీసూక్త సహిత కుంకుమార్చన జరిపారు. అష్టలక్ష్మి స్తోత్ర పారాయణం చేసి విశేష హారతులతో ఆరాధించారు. భక్తులు అధిక సంఖ్యలో జగన్మాతను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

పోలమాంబ వేడుకలకు ఏర్పాట్లు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు శ్రీపోలమాంబ అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక విద్యుత్తు అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో నృత్యప్రదర్శనలు, బుర్రకథలు, నాటికలు తదితర ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 24న ఉదయం 4గంటల నుంచి దర్శనాలు, ప్రత్యేక పూజలు మొదలవుతాయి. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదం, మజ్జిగ, తాగునీటి వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం అనుపోత్సవం జరిగాక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ప్రజలు ఈ వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రారంభ వేడుకలు గురువారం మొదలయ్యాయి. ముందుగా స్వామివారి శోభాయాత్రను మంగళవాయిద్యాల నడుమ వెంకటసాయి నగర్, అప్పలనర్సయ్యకాలనీ, రవినగర్, బంటాకాలనీ, నాయుడుతోట పరిసర ప్రాంతాల్లో చేపట్టారు. అనంతరం వేద మంగళ స్వస్తివాచనం, ఉత్సవ సంకల్పం, అఖండ దీపారాధన, హోమాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతసేవతో పూజలు ప్రారంభం అవుతాయన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి శేషవాహన ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

శోభాయాత్రకు బయలుదేరిన అర్చకులు, భక్తులు

సీపీఎస్ ఉద్యోగుల దీక్షను జయప్రదం చేయాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: తమ హక్కుల సాధన కోసం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఈనెల 22న చేపట్టనున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగులు కోరారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు సబ్బవరం మండలం రావులమ్మపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం సంబంధిత గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘానికి చెందిన సబ్బవరం మండల బాధ్యులు భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యంనాయుడు, పైల దేముడు, అప్పారావు, గోవింద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

22న లాసెట్‌పై అవగాహన సదస్సు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఈనెల 22న పెందుర్తి సమీప పురుషోత్తపురం శివాలయం వద్ద లాసెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని విశ్రాంత ఆచార్యులు డీకే.రెడ్డి తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని భాజపా దక్షిణ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లాసెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తిలి శంకరరావు, తోట వాసుదేవరావు, రాజుగౌడ్, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఆచార్య డీకే.రెడ్డి, తదితరులు

పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందే
జిల్లా విద్యాశాఖాధికారి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో తప్పనిసరిగా 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందేనని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం పురుషోత్తపురంలోని బాలాజీ పాఠశాలలో పెందుర్తి, గోపాలపట్నం మండలాల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా సీట్లు పొందిన సంబంధిత విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ప్రవేశాలు కల్పించాలని కోరారు. సీటు పొందిన ఏ ఒక్కరినీ తిరస్కరించరాదని ఆదేశించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పరస్పర సహకారం అవసరమని పాఠశాల యాజమాన్యాలకు తెలిపారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవోలు కె.సువర్ణ, డి.దివాకర్, ప్రయివేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం రావాడ గ్రామంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ తోట రాము తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ చరిత్రతో పాటు ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సామ్రాజ్యాన్ని సంరక్షించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. పరవాడ ఫార్మాసిటీలోని విష్ణు కెమికల్స్ కంపెనీలో గురువారం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ఉన్నవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లు తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కోటేశ్వరరావు, మూర్తి, సతీష్, పాత్రుడు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు డిగ్రీ విద్యార్థి ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మంగళగిరిలో జరగనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.వెంకటకుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శంకర్ వెల్లడించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 70 మందిలో కుమార్ పేరు ఉండడం గర్వించతగ్గ విషయమన్నారు. ఇందుకోసం నిర్వాహకులు చేపట్టిన వివిధ పోటీ పరీక్షల ఆధారంగా వీరిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారు మంగళగిరిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఇంటెన్సివ్ నైపుణ్య శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటకుమార్‌ను ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శంకర్ తదితరులు

ఎంపీపీ పదవి నుంచి నాగమణి తొలగింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: అవిశ్వాస తీర్మానంలో ఓటమికి గురైన పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షురాలు మధుపాడ నాగమణిని ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి ఎంపీపీపై మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఈ నెల 9న విశాఖ ఆర్డీవో ఆధ్వర్యంలో పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో విశ్వాస పరీక్ష జరిగింది. మండలంలోని తొమ్మిది ప్రాదేశిక స్థానాలకు గాను ఎంపీపీ నాగమణి సహా 8మంది పాల్గొన్నారు. ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని బలపరచడంతో ఎంపీపీ తొలగింపు అనివార్యమైంది. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు నాగమణి ఆ పదవిలో కొనసాగినా.. తాజాగా వెలువడిన ఉత్తర్వుల్లో తక్షణమే ఆమె పదవి నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆదేశించింది.

★ ఈ నేపథ్యంలో నూతన ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. అయితే ఆ ప్రక్రియ జరిగే వరకు ఉప ఎంపీపీ-1కి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు విశాఖ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అదే జరిగితే గొరపల్లి ఎంపీటీసీ సభ్యుడు, ఉప ఎంపీపీ-1 దేముడుకు ఇన్‌ఛార్జి ఎంపీపీగా అవకాశం దక్కుతుంది.

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులు కురిపించే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన చేపట్టారు.

WANTED TEACHERS
SRISHTI WORLD SCHOOL
(CBSE AFFILIATION No - 130520)
(A Leader for Excellence in Education)
SECTOR-XI, UKKUNAGARAM, VISAKHAPATNAM
30 years
MOTHER TEACHERS, PRE-PRIMARY, PRIMARY & HIGH SCHOOL
(TRAINED TEACHERS with B.Ed)
❖ FOR ALL SUBJECTS (Eng, Tel, Hin, Math, Sci, Soc, Sanskrit)
❖ For GK & CURRENT AFFAIRS, Computers (Robotics/ Artificial Intelligence/ Coding)
❖ For IIT, Spoken English, Story Tellers and Vocal Music (Classical & Western)
❖ Trained P.E.Ts with B.P.Ed/ M.P.Ed/ NCC ('C' Cert holders)& Admin Co-ordinators
❖ Career Counselor ❖ Psychology Counselor
❖ Soft Skills Trainer ❖ Skill Educator
NOTE: Family Accommodation is available for deserving candidates.
Walk-in-Interview: 21st Feb 2026 onwards (Except Sundays)
❖ Share your resume to mail id: hr.srishtiworldschool@gmail.com or
9391188874 or 8341122949 or 9652947708
(WHATSAPP NUMBERS)

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గజేక్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - హేయ్ బల్వంత్
సప్తగిరి - కపుల్ ఫ్రెండ్లీ

బంగారమ్మకు నీరాజనం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం (దసపల్లా లేఅవుట్)లోని బంగారమ్మ ఆలయంలో గురువారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.వెంకటేశ్వర్మ సమక్షంలో అమ్మవారిని పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

ముగిసిన 'సప్తశక్తి సంగమ్'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం గురువారం కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. విద్యా భారతి అఖిల భారతీయ సప్తశక్తి సంగమ్ సభ్యురాలు, సప్తశక్తి సంగమ్ దక్షిణ క్షేత్ర సంయోజికి డాక్టర్ బండారు దరణీప్రియ మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు వేలాది మాత్ర సమ్మేళనాలు జరిగాయన్నారు. మరో అతిథి కె.వెంటభాను మాట్లాడుతూ ఒక మహిళ తన కుటుంబాన్ని ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. మరో వక్త డాక్టర్ టి.రాధాబాయి వివిధ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: మిథిలాపురి వుడా కాలనీ(మధురవాడ)లో శివాలయం ఎదురుగా ఉన్న వీధుల్లో చెత్త సేకరణకు జీవీఎంసీ వాహనాలు రావడం లేదు. - స్థానికులు ✓: ప్రతి రోజూ చెత్త సేకరించేలా చర్యలు చేపడతాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: మధురవాడ పరిధి మిథిలాపురి కాలనీలో ఉన్న ఖుషి షాపింగ్ మాల్ పరిసరాలలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. - బి.చిన్న ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - అయ్యప్పనాయుడు, జెడ్డీ

?: తారక రామాలేఅవుట్(రుషికొండ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - చలపతి ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజ రవికుమార్, ఆరోగ్య అధికారి

?: అల్లూరి కూడలి (సాగర్‌నగర్) నుంచి బీచ్‌కు వెళ్లే దారిలో వాహనాలు ఎక్కడికక్కడ పార్కు చేస్తున్నారు. - ప్రయాణికులు ✓: అనధికారిక పార్కింగ్ చేసే వాహనాలపై కేసులు నమోదు చేస్తాం. - ప్రభాకర్, ఆరిలోవ సీఐ

స్పందనకు వందనం

చెత్త తరలింపు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి రుషికొండలో గల ఎంఆర్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో గత పది రోజులుగా చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది రాక తీవ్ర దుర్వాసన, దోమలతో ఇక్కట్లకు గురవుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం. .మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తమ సిబ్బందితో జీవీఎంసీ చెత్త వాహనంతో వ్యర్థాలను సేకరించారు.

పార్కులో శుభ్రత చర్యలు

ఎండాడ: స్వతంత్రనగర్ (మధురవాడ)లో ఉన్న పార్కులో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వార్డు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో పార్కు శుభ్రతకు చర్యలు చేపట్టారు.

నేల బావులు బాగు చేయరూ..

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ మధురవాడ జోన్ లోని పలు ప్రాంతాల్లో ఉన్న మంచినీటి బావులు ఎండిపోయి పూడికలతో దర్శనమిస్తున్నాయి. అసలే రానున్నది వేసవి కాలం. ఈసారి మరీ ఎండలు పెరిగే పరిస్థితి లేకపోలేదు. భూగర్భ జలాలను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్య తీవ్రం కాకముందే తాగునీటి వనరులపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా 5వ వార్డులో పలు ప్రాంతాల్లో చాలా బావులు వృథాగా ఉన్నాయి. వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. వేసవిని దృష్టిలో ఉంచుకొని వీటిని అందుబాటులోకి తెస్తే ఉపయోగకరంగా ఉంటాయి.

మారికవలస రాజీవ్‌గృహకల్ప కొత్తకాలనీలో ఉన్న బావిలో పేరుకుపోయిన వ్యర్థాలు

★ మధురవాడ, కొమ్మాది, మారికవలస ఓజోన్‌వ్యాలీ, రాజీవ్‌గృహకల్ప, పరదేశిపాలెం, బోరవానిపాలెం, పాత పరదేశిపాలెం, కొత్తపాలెం, శివశక్తినగర్ శివారు ప్రాంతాల్లో చాలా బావులు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా అవన్నీ నిరుపయోగంగా మారాయి. పూడికలు, వ్యర్థాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల బావుల్లో నీరు ఉన్నా వాడుకో లేని విధంగా దర్శనమిస్తున్నాయి. గతంలో ఇవే బావుల్లో మోటార్ల ద్వారా వాటర్ ట్యాంకుల్లోకి నీటిని నింపి తాగునీటి అవసరాలకు, పంట పొలాలకు వినియోగించుకునేవారు. వాటి నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావులను బాగు చేసి తాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హైవే దాటాలంటే హడలే!

ప్రమాదకరంగా రెయిలింగ్ దాటుతూ..

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస జాతీయ రహదారి దాటాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మించాక ఊర్లోకి రావడానికి మార్గం లేకుండా పోయింది. నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్య జిల్లాలకు రాకపోకలు సాగించే బస్సులన్నీ నేరుగా హైవే పై ఓవర్ మీదుగా పోతున్నాయి. గతంలో బైపాస్ కూడలిలో ఈ బస్సులు ఆగడంతో అందరూ సౌకర్యంగా వీటి సేవలను వినియోగించుకునేవారు. ఏడేళ్ల కిందట నిర్మించిన పై వంతెన తర్వాత తగరపువలస, చిట్టివలస పట్టణవాసుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో ఊరికి చివర గోస్తనీ నది వంతెన వద్దనున్న వెంకటేశ్వరమెట్ట ప్రాంతానికి వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోంది. హైవే కావడంతో రోడ్డు వెంబడి రక్షణగా వేసిన రెయిలింగ్‌ను దాటేందుకు మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ్య కూడళ్లలో ఒకటిగా ఆది నుంచి పేరొందిన తగరపువలసలో నెలకొన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

'అల్లూరి' అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఆనందపురం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు నీతి ఆయోగ్ చొరవతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) సహకారంతో గంభీరం ఐఐఎంవీలో గురువారం కార్యశాల నిర్వహించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ ప్రారంభించిన సంపూర్ణత అభియాన్ 2.0 కింద ఆకాంక్షిత జిల్లాల ఎంపికలో అల్లూరి ఉందన్నారు. ఈ మేరకు ఆరు నెలల ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో 213 కీలక అంశాల ఆధారంగా 627 గృహాల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించడం జరిగిందన్నారు. వీటిపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ సంపూర్ణత అభియాన్ 2.0 ప్రాజెక్టు అధ్యాపకులు, జిల్లా ఉన్నతాధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక, పర్యాటకపరంగా అల్లూరి జిల్లా సమృద్ధి వనరులతో కలిగి ఉందన్నారు. ఐదు ఇతివృత్తాలు, 46 అంశాల్లో పని తీరు మెరుగుపరచడానికి సంపూర్ణత అభియాన్ కింద ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి ఇక్కడ లభిస్తున్న కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అనంతరం ఐఐఎంవీ పరిశోధన బృందాన్ని ప్రశంసించారు. ఐఐఎంవీ అధ్యాపక బృందం అంబేడ్కర్, విజయ మారిశెట్టి, అభినాష్ సింగ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ అధ్యాపకులు, జిల్లా అధికారులు

ముందుకు కదలనున్న వంతెన పనులు

కొమ్మాది, న్యూస్‌టుడే: నడక వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, శంకుస్థాపన చేసి మూడు నెలలు కావస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ యంత్రాంగం స్పందించింది. జాతీయ రహదారిపై చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా నడక వంతెన నిర్మాణానికి రూ.3.23 కోట్లు జీవీఎంసీ నిధులు కేటాయించింది. వంతెన నిర్మించేందుకు ఇరువైపులా ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు మధురవాడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) ఆనుకుని ఉన్న భారీ వృక్షాలు, విద్యుత్తు స్తంభాలను తొలగించాలి. ఎట్టకేలకు ఆ ప్రక్రియ పనులు మొదలు కానున్నాయి. శుక్రవారం జీవీఎంసీ ఉద్యానవన శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది భారీ వృక్షాలను తొలగించనున్నట్లు డీఈ మణికుమార్ తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామని, మధురవాడ చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అంతేగాక వృక్షాలు తొలగించే సమయంలో ప్రజలు అటువైపు రాకూడదన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చిరుదుకాణాలు సైతం తొలగించాలని సూచించారు. విద్యుత్తు స్తంభాలు సైతం తొలగించి భూగర్భ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆయా పనులు పూర్తి చేసి నడక వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పీఏసీఎస్ డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా పరిష్కారం కాకుండా ఉన్న తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ డిమాండ్ చేస్తూ పద్మనాభం డీసీసీబీ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. జీవో నంబర్ 36ను తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పించాలని, 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జి.రామకృష్ణ, నారాయణరావు, సన్యాసిరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఎదుట ఆందోళన చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

PUBLIC NOTICE

My client Sri Vakada Udayabhaskara Reddy, S/o. V. Srinivasa Rao, residing at D.No.3-184, Karanam Veedhi, Kuppili Village, Etcherla Mandal, Srikakulam District. My client instructed me to issue this general notice informing the public that, My client intends to purchase the Schedule property from Smt. Ommi Loshini, W/o. O. Venkat Kalyan Kumar.

She acquired the property under a Regd. Sale Deed Vide Doc.No.646/2014, dated.05.02.2014 Registered at SRO Madhurawada from Smt. Allu Parvathi and ever since she has been uninterrupted possession and enjoyment of the property. Hence any person having objections, claim, interest over the below said property may inform me or my client within 7 days from the date of this publication, failing which, my client will treat that there are no objections and proceed with the sale transaction.

SCHEDULE OF THE PROPERTY

All that vacant site measuring an extent of 167 Sq.yds or 139.62 Sq.mts, being Plot No.61 in the layout approved by VUDA vide L.P. No.10/96, covered by S.No.112/11A, situated at Paradesipalem Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam District and Bounded by: **Boundaries of the Site: East** : Plot No.62, **South:** Plot No.74, **West :** Plot No.60, **North:** 33 Feet wide Road.

D.V. RAMA CHANDRA REDDY,
Advocate
D.No.53-16-59/1, Maddipalem, P & T Colony Post, Visakhapatnam - 13.
Mobile: 9440138870 & 9581426639.
Visakhapatnam,
Dt.17-02-2026

షూటింగ్ బాల్‌లో సత్తా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించిన విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపిన భీమిలి విద్యాసాగర స్కూల్ విద్యార్థులను గురువారం పాఠశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన పోటీల్లో విశాఖ జిల్లా తరపున పాల్గొన్న 12 మంది క్రీడాకారుల జట్టులో ఈ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు కె.మణిచరణ్, కె.హేమంత్, కె.ఫణీంద్ర, వి.మోహన్, ఎస్.వంశీలు పాల్గొన్నారు. వీరిని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు కె.శాంత, కె.ఎల్.ఎన్.మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.సురేష్ అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

క్వారీల అనుమతికి ప్రజా విచారణ

పద్మనాభం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే సంఖ్య 293, 294, 295లలో మూడు మైనింగ్ క్వారీల ఏర్పాటుకు సంబంధించి ఈ నెల 24న పర్యావరణ ప్రజా విచారణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా విచారణ సభలు ప్రతిపాదించిన క్వారీల వద్ద జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు గొట్టుముక్కల వెంకట విజయ హరి వర్మ రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్, గ్రావెల్ క్వారీ వద్ద, మధ్యాహ్నం 12.30 గంటలకు మెసర్స్ విష్ణుప్రియా గ్రానైట్స్ గ్రావెల్ క్వారీ వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు మెసర్స్ నాగభూషణం అండ్ కో వారి మాన్యుఫాక్చర్డ్ సాండ్, గ్రావెల్ క్వారీ వద్ద నిర్వహించనున్నట్లు వివరించారు.

సైబర్ మోసాలపై అవగాహన

ఆనందపురం, న్యూస్‌టుడే: విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గొట్టిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై గురువారం అవగాహన కల్పించారు. కౌన్సిల్ ప్రతినిధులు దాసరి కిశోర్, సి.సీమా, జి.నవీన్ పాల్గొని వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవడం, సైబర్ నేరాలపై ఆచరణాత్మక చర్యల గురించి వివరించారు. బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు

క్రీడా కిట్లు అందజేత

ఎండాడ, న్యూస్‌టుడే: నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎండాడ జిల్లా పరిషత్ పాఠశాలలో 145 మంది బాలికలకు క్రీడా కిట్లను గురువారం అందజేశారు. ఇందులో బ్యాగు, పుస్తకాలు, పెన్నులు, రెండు టీషర్టు లతో పాటు 14 శానిటరీ ప్యాడ్స్ తదితర సామగ్రి ఉన్నాయన్నారు. దీంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులకు ట్రోఫీలు, బ్యాగులు అందజేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.ఉషా రాణి, ప్రాజెక్ట్ స్కిల్ అసోసియేట్ ఉపాధ్యాయులు కె.శైలజ పాల్గొన్నారు.

క్రీడా కిట్లు అందుకున్న విద్యార్థులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఆనందపురం, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ విభాగం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో ఆనందపురం మండలం కల్లివానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.గోపీనాథ్ పర్యవేక్షణలో గీతం ఆసుపత్రికి చెందిన కళ్ల, చర్మవ్యాధుల, చిన్నపిల్లల వైద్య నిపుణులు దివ్య, సెల్వన్, అరవింద్ తదితరులు విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా ఔషధాలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, పోషకాహార ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ఆయా విభాగాధిపతి డాక్టర్ శరత్‌బాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్‌వీజీ.రెడ్డి, హెచ్ఎం లక్కోజీ కొండాజీ, ఎల్.అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని కుసులవాడ పంచాయతీ పరిధిలోని ఇచ్ఛాపురం గ్రామానికి ఆనుకుని ఉన్న కొండల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిలో దర్జాగా భారీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అమాయక గిరిజనుల నుంచి డీపట్టా, జిరాయితీ భూములను కొనుగోలు చేసిన స్థలాల్లోకి దర్జాగా సమారు కిలోమీటరు మేర కొండ పోరంబోకు గుండా గెడ్డవాగులు, కాలువలను భారీ యంత్రాల సహాయంతో పూడ్చివేసి రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. భారీ ఎత్తున రోడ్డు వేయడాన్ని గుర్తించిన కొందరు గిరిజనులు పోలీసు, మైనింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తుల వద్ద ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పోలీసులు పనులు నిలిపి వేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ ఉన్నాతాధికారులు ఫ్లీట్ రివ్యూ, మిలన్ కార్యక్రమాల విధుల్లో ఉండటం చూసి ఇష్టారాజ్యంగా ఇలా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఛత్రపతి శివాజీ యువతకు ఆదర్శం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి గీతం డీమ్డ్ వర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోరాట పటిమను కొనియాడారు. ప్రొ-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, డైరెక్టర్లు ప్రొఫెసర్లు పి.భరణిచంద్రకుమార్, కె.తిరుపతిరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జీవీఎస్ రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కె.నగరపాలెం (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి బీచ్‌రోడ్డులోని కె.నగరపాలెం కూడలిలో గురువారం నిర్వహించారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జీరు కైలాశ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, తదితరులు హాజరై శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోడూరి సంజీవరావు, పాల రమణ, దోని నాగరాజు, చిన్నారావు, ఏబీవీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గీతం ప్రొ-వీసీ గౌతమ్‌రావు, అధ్యాపకులు

కె.నగరపాలెం కూడలిలో శివాజీ విగ్రహానికి నివాళులర్పించిన సురేంద్రమోహన్, తదితరులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామ రాజు ఉద్యానవనం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మిషన్ గ్రీన్ భీమిలి ట్రస్ట్ అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి ఆదిత్య, ఫాబ్ ప్రతినిధి మునునూరి సూర్యశ్రీనివాస్, సా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాల్గొన్నారు.

ఎండాడ, న్యూస్‌టుడే: ఎస్సీకాలనీ (ఎండాడ)లో అంబేడ్కర్ యువజన సేవా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు కార్యక్రమంలో తెదేపా నాయకుడు బెల్లాన శ్రీను, సంఘ సభ్యులు పైడిరాజు, బలరామకృష్ణ, ఎన్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కార్నివాల్

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సన్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన కిడ్స్ కార్నివాల్ ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన రాణి రుద్రమదేవి, ఛత్రపతి శివాజీ ఏకపాత్రాభినయనాలతో పాటు జానపద, సంప్రదాయ నృత్యాలు, యోగాప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు ఆకట్టుకున్నాయి. సన్‌స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించేందుకు ఇటువంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులకు సైతం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సన్‌స్కూలు డైరెక్టర్ లక్ష్మీలావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల యోగాసన ప్రదర్శనలు

A Landmark *for* Celebrations

SREE BALAJI CONVENTIONS
శ్రీ బాలాజీ కన్వెన్షన్స్

Wedding Functions, Birthday Parties, Half Saree Functions, Anniversaries, Retirement functions, Kitty Parties etc.,

For Bookings Contact: 988 577 5656

ఆనంద్ భవన్, ఉడాకాలనీ, 100 ఫీట్ రోడ్డు, మధురవాడ.

సిరి నరసింహుడికి స్వర్ణ పుష్పార్చన

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులు కురిపించే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.



స్వామి, అమ్మవార్లు

గరుడ వాహనంపై గోవిందుడి శోభ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సంప్రదాయబద్ధంగా పైడితల్లి అమ్మవారి పరస

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అప్పన్న స్వామి సోదరి, అడివివరం గ్రామ దేవత శ్రీపైడితల్లి అమ్మవారి పరస ఉత్సవం గురువారం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామస్థులు జగన్మాతను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అప్పన్న ఆలయ మాజీ ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం, పరదేశిపాలెం విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈ మండల అప్పలనాయుడు వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆనందపురం, వేములవలస, సత్యకల్యాణి అపార్టుమెంట్స్, లొడగలవానిపాలెం కాలనీ, గంభీరం కాలనీ, జేఎన్ఆర్ఎం కాలనీ, కల్లివానిపాలెం, యాతపేట, కాపులుప్పాడ, బంటుబిల్లి కళ్లాలు పంచాయతీ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

విద్యా ఉపకరణాల పంపిణీ

పద్మనాభం, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులకు నాంది ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం విద్యా ఉపకరణాలు అందజేశారు. పుస్తకాలు, టీషర్టు, షూష్ తదితర సామగ్రితో కూడిన కిట్టును పాఠశాలలో ఆరు నుంచి ఎనిమిది తరగతి చదువుతున్న 120 మంది బాలికలకు మండల విద్యాశాఖాధికారులు పి.రమణ, ఎస్.బాబూలాల్ చేతులమీదుగా అందజేశారు. నాంది ఫౌండేషన్ ప్రతినిధి ఝూన్సీ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు కె.గ్రేసీలిల్లీ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: గొట్టిపల్లి ఉన్నత పాఠశాలలో 67 మంది విద్యార్థులకు సామాజిక కార్యకర్త కొట్యాడ సత్యమూర్తి తన సొంత నిధులతో పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు. ప్రతి ఏటా ఇలా అందజేస్తారని ప్రధానోపాధ్యాయుడు పందిరి కనకేశ్వరరావు పేర్కొన్నారు.

అందుకున్న విద్యా సామగ్రితో బాలికలు

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం. ఫోన్ : 08933-226022

సీల్డ్ టెండర్లు మరియు వేలం
(SARFAESI చట్టం రూల్ 9(1) క్రింద నోటీసు)

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 01-12-2022 న రూ.4,25,773/- (అక్షరములా నాలుగు లక్షల ఇరవై అయిదు వేల ఏడు వందల డెబ్బయి మూడు రూపాయలు మాత్రమే) తేది 30-11-2022 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా **1) కుమారి పరిమి సత్యధరణి,** D/o. వెంకట చిరంజీవరావు, **2) శ్రీమతి పరిమి సీతామహాలక్ష్మి (మరణించినారు),** W/o. వెంకట చిరంజీవరావు, **3) శ్రీ పరిమి వెంకట చిరంజీవరావు,** S/o. (లేటు) సత్యనారాయణ, **4) కుమారి పరిమి లక్ష్మి ధరణి,** D/o. వెంకట చిరంజీవరావు (వ. నెం. 1, 3 & 4 వ. నెం. 2 కు లీగల్ హైర్స్‌గా ఉన్నారు) వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని 13(4) క్రింద తే 02-02-2023 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ నుదహరించిన స్థిరాస్థిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నది అలాగ" వేలం వేయుటకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం, ఫోన్ నెం. 08933-226022 వద్ద **తేది 11-03-2026 ఉదయం 10-00** గంటలకు సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 11-03-2026 బుధవారం ఉదయం 10-00 గంటలకు
సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం

తనఖా ఆస్థి వివరములు	బకాయి మొత్తం (రూ.) 31-01-2026 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
జి.వి.యం.సి., విశాఖపట్నం, సర్వే నెం. 28 & 29/1, 2 పార్ట్ పరిధిలో చేరిన విశాఖపట్నం, భీమునిపట్నం, తగరపువలస,	6,41,752/-	12,51,936/-	1,25,194/-

చిట్టివలసలోని వలందపేట లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గరలోని బ్లాక్ నెం. 59, వార్డు నెం. 13, ఫ్లాట్ నెం. 22లో "అమ్మా రెసిడెన్సీ"లోని స్టిల్ట్ ఫ్లోర్‌లో 690 చ॥ అడుగులు (అసంపూర్తిగా ఉన్నటువంటి) ఫ్లాట్‌గా ఉన్న డోర్ నెం. 4-59-225/8 (డాక్యుమెంట్ ప్రకారం డోర్ నెం. 4-59/2-244 దగ్గరగల) గా ఉన్నటువంటి ఆర్.సి.సి. స్లాబ్ గ్రూప్ హౌస్ ఇల్లు.

హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.23, దక్షిణం: ప్లాట్ నెం.30, ఉత్తరం: పార్కింగ్ స్థలం&40 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 21.

విస్తీర్ణం : మొత్తం 147.00 చ॥గజములలో అవిభాజ్యపు & విడదీయరాని 31 .1/2 చ॥ గజములు

మరిన్ని వివరములకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ వెబ్‌సైట్ www.vcbl.bank.in లింక్ సందు చూడవచ్చును లేదా ఆధీకృత అధికారి, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం నందు బ్యాంకు పని వేళలలో సంప్రదించవచ్చును.

రిజర్వు ధరలో 10% బయానా మొత్తంగా ఆర్.టి.జి.ఎస్./నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, భీమునిపట్నం బ్రాంచి, తగరపువలస, విశాఖపట్నం నకు తేది 10-03-2026 సాయంత్రం 6-00 గంటల లోపు చెల్లించవలెను.

బ్యాంకుకు తెలిసిన/తెలియనటువంటి బాకీ/టాక్సులు ఏమైనా ఉన్నట్లయితే వేలం ద్వారా కొనుగోలు చేసినవారు చెల్లించవలసి వుంటుంది. ఆ మొత్తాన్ని ఫైనల్ బిడ్‌కు జతచేయబడుతుంది.

వేలం విధానం మరియు నియమ నిబంధనల కొరకు ఆధీకృత అధికారి వారిని గానీ మరియు బ్యాంక్ వెబ్‌సైట్ www.vcbl.bank.in నందు గానీ సంప్రదించగలరు.

తేది : 19-02-2026, విశాఖపట్నం — అధీకృత అధికారి, భీమునిపట్నం బ్రాంచి

(c) eenadu

విశాఖ తూర్పు

24న బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల నేపథ్యంలో ప్రజలతో పాటు విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న 'హెల్మెట్ సేఫ్టీ అవేర్‌నెస్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ఏయూ మెయిన్ గేట్ వద్ద ర్యాలీ ప్రారంభించి సాగర తీరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు ఈ ప్రదర్శన చేపడతామని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు తమ సొంత ద్విచక్రవాహనాలపై హెల్మెట్‌తో పాల్గొనాలని కోరారు.

ఏయూలో పోలీసుల పహారా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో గురువారం పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఏయూ బాస్కెట్‌బాల్ మైదానం, పరిపాలనా భవనం వద్ద వీరు కాపలా ఉన్నారు. ఏయూలో ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ కవాతు నేపథ్యంలో ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వర్సిటీలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు ఏయూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నగరంలో ఐఎఫ్ఆర్ జరుగుతుండడం, జాతీయ స్థాయి నాయకులు నగరానికి రావడంతో వర్సిటీలో ఎలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఏబీవీపీ విద్యార్థులు బుధ, గురువారాల్లో బాస్కెట్‌బాల్ మైదానంలో తమ కార్యక్రమాలు శాంతియుతంగా చేపట్టారు. ఇతరులను వర్సిటీ లోపలకు రానీయడం లేదని, ఐడీ కార్డులు చూపిన విద్యార్థులనే పోలీసులు అనుమతిస్తున్నట్లు ఏయూ సెక్యూరిటీ డీన్ ఆచార్య అమ్మాజీరావు తెలిపారు. కాగా వసతిగృహాల్లో నాన్ బోర్డర్లను బయటకు పంపించేందుకు రాత్రిళ్లు ఏయూ వసతిగృహాల చీఫ్ వార్డెన్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఏయూ పరిపాలన భవనం వద్ద పోలీసులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీ సీఐటీ కార్యాలయం రహదారిలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. – మాధవరావు, పైనాపిల్ కాలనీ ✓: సిబ్బందిని పంపి వెలగని దీపాల స్థానే కొత్త దీపాలు అమరుస్తాం. – రాజేష్, ఏఈ, జీవీఎంసీ విద్యుత్తు విభాగం.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: శివాజీపాలెం, పీతలవానిపాలెం ప్రాంతాల్లోని కాలువలో పూడికలు తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెంది దుర్వాసన వస్తోంది. – అప్పలనాయుడు ✓: సిబ్బందిని పంపించి పూడికలు తీయిస్తాం. – శ్రీనివాసరావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎం.ఎం.టీ.సీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 15వ వార్డు ఎంఎంటీసీ కాలనీలో వీధి దీపాలు వెలగక చీకటిగా ఉంటోంది. మందుబాబుల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. – దుర్గాప్రసాద్ ✓: పరిశీలించి చర్యలు చేపడతాం. – ఆశ, వీధి దీపాల నిర్వహణ వర్క్ ఇన్‌స్పెక్టర్

ఇందిరానగర్, (విశాలాక్షినగర్) న్యూస్‌టుడే: ?: ఏదో వార్డు పరిధి ఇందిరానగర్ రామాలయం ప్రవేశద్వారం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – నివాసితులు ✓: గుత్తేదారుతో చర్చించి, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. – చంద్రమౌళి, ఏఈ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి ప్రధాన రహదారిలో పోలీస్‌గ్రౌండ్ ప్రహరీ వద్ద అనధికార పార్కింగ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – కల్పన, నివాసితురాలు. ✓: పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం. – ధర్మేంద్ర, ట్రాఫిక్ ఎస్సై

ఉపాధి శిక్షణ... భవితకు రక్షణ..!

'దయాల్‌బాగ్'లో వృత్తి విద్యా కోర్సులకు ఆదరణ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్ కాలనీలో ఉన్న దయాల్‌బాగ్ విద్యాకేంద్రంలో అందిస్తున్న వృత్తి విద్యాకోర్సులకు ఆదరణ పెరుగుతోంది. పలువురు యువత, మహిళలు నైపుణ్యాలు పెంపొందించుకుని, ఉద్యోగ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. ■ కొన్ని కోర్సులకు సంబంధించి శిక్షణ తరగతులు పూర్తవుతుండడంతో, ఆయా కోర్సుల్లో కొత్తగా చేరే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం కేంద్రంలో సంప్రదించాలన్నారు.

శిక్షణ పొందుతున్న మహిళలు

కోర్సుల వివరాలు.. ■ 'టై అండ్ డై' మూడు నెలల శిక్షణ ఉంటుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. పదో తరగతి పూర్తి చేసిన వారికి అవకాశం ఉంటుంది. శిక్షణ కాలంలో.. వస్త్రాలపై ఆకర్షణీయ రంగులు వేయడం, డిజైన్లు తీర్చిదిద్దడం, ఆధునిక రీతుల్లో దుస్తులు తయారు చేయడం తదితర అంశాల్లో మెలకువలు నేర్పిస్తారు. మార్కెటింగ్ అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. ■ 'ఆఫీస్ మేనేజ్‌మెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్' కోర్సులో ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. మొత్తం 40 సీట్లలో ఇంటర్ పూర్తి చేసిన వారికి అవకాశం కల్పిస్తారు. శిక్షణ కాలంలో.. కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, టాలీ, సీ లాంగ్వేజ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణ, టైపింగ్ స్కిల్స్, కీబోర్డ్ షార్ట్‌కట్స్, డేటా ఎంట్రీలో మెలకువలు, ఇంటర్నెట్ బేసిక్స్, స్కానింగ్, ప్రింటింగ్, ఫైల్ మేనేజ్‌మెంట్, డేటా సేవ్ బ్యాకప్, బిల్లుల తయారీ, అకౌంటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ■ 'సెల్‌ఫోన్ మెకానిజం'పై మూడు నెలల పాటు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. సెల్‌ఫోన్ విడి భాగాల పనితీరు, మరమ్మతులు, నిర్వహణ తదితర అంశాలపై మెలకువలు నేర్పిస్తారు. ఉపాధి అవకాశాలకు మార్గనిర్దేశం చేస్తారు.

ఆర్డర్లు వస్తున్నాయి..!: 'నేను టైలరింగ్ అండ్ టెక్స్‌టైల్ డిజైనింగ్ కోర్సు చేశా. వివిధ డిజైన్లలో చిన్నపిల్లల దుస్తులు, చీరలు, బ్లౌజులు కుట్టడం నేర్చుకున్నా. నేను, మరో ఇద్దరు స్నేహితులు కలిసి దుకాణం ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి. ప్రతి నెలా రూ.20వేలు సంపాదిస్తున్నా. కుటుంబానికి ఆర్థికంగా చేయూత ఇస్తున్నా.' – రాధ, విశాఖ.

కుటుంబాన్ని పోషిస్తున్నా..: 'నేను సెల్‌ఫోన్ శిక్షణ తీసుకోవడంతో అన్ని అంశాలపై అవగాహన ఏర్పడింది. పాడైన ఫోన్లకు మరమ్మతులు చేయడంలో పట్టు సాధించా. ప్రస్తుతం సెల్‌ఫోన్ దుకాణం ఏర్పాటు చేసుకుని, కుటుంబాన్ని పోషిస్తున్నా. నా వద్ద ఇద్దరు వర్కర్లు పని చేస్తున్నారు' – రాజు, మద్దిలపాలెం.

నగరంలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించాలి

మద్దిలపాలెం(ఎంవీపీకాలనీ), న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో కొత్తగా 159 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కొత్తగా 159 అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న 215 కేంద్రాలకు నిధులు కేటాయించాలని కోరారు. వీటితో పాటు చిన్నారులకు బెంచీలు, కుర్చీలు, ఆట వస్తువులు, విద్యా సామగ్రి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రతి వెయ్యి మంది లబ్ధిదారులకు ఒక అంగన్‌వాడీ కేంద్రం అవసరమన్నారు. విశాఖకు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోందన్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఘనంగా ఆదిలక్ష్మి హోమం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఆదిలక్ష్మి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో అదినారాయణ, ఛైర్మన్ గోవిందరెడ్డి, ప్రధాన అర్చకులు సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్పందనకు వందన

దారపాలెం(ఆరిలోవ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో వీధి కాలువలు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నిలిచిపోయిందని మంగళవారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు స్పందించారు. సంబంధిత సిబ్బందితో కాలువల్లో వ్యర్థాలు శుభ్రం చేయించారు.

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 12వ వార్డు పరిధి పెదగదిలి కొండ ప్రాంతం, సింహగిరికాలనీ కొండదరి వీధుల్లో వీధి దీపాలు వెలగడంలేదని శనివారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు వీధి దీపాల పర్యవేక్షకులు ఎం.రామకృష్ణ స్పందించారు. సంబంధిత సిబ్బందితో కాలనీలో వెలగని దీపాల స్థానే కొత్త దీపాలు అమర్చారు. కొండదరికాలనీ శివారులో అన్ని దీపాలు వెలిగేలా బాగుచేశారు.

పశువుల్ని తరలించారు..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ సమీప కైలాసగిరి కూడలి, హనుమంతువాక పరిసర ప్రధాన రహదారులపై పశువుల సంచారం పెరగడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు ప్రచురితమైన వార్తలకు పశుసంవర్ధక అధికారి డాక్టర్ రాజారవికుమార్ స్పందించారు. తమ సిబ్బందితో పశువుల్ని తరలించారు.

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: మద్దిలపాలెం 16వ వార్డు శివాలయం సమీపంలోని కాలువల్లో పూడికలు తొలగించడం లేదని గురువారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు స్పందించి వెంటనే సిబ్బందిని పంపించి పూడిక తొలగించారు.

కుంగిన మ్యాన్‌హోల్..!

టీఐసీపాయింట్(ఆరిలోవ), న్యూస్‌టుడే

జీవీఎంసీ 12వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ ప్రధాన రహదారిలోని మ్యాన్‌హోల్ మూత కుంగిపోవడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో పలువురు ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి.. మరమ్మతులు చేపట్టాలని నివాసితులు కోరుతున్నారు.

వ్యర్థాల పారబోత..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

పాతడెయిరీ ఫారం కూడలి నుంచి గ్రామీణ తహసీల్దార్ కార్యాలయ కూడలికి వెళ్లే రహదారి పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాల్లో తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో విషపురుగుల సంచారం పెరిగి, రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. ఇటీవలే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించి, మార్గాన్ని విస్తరించారు. ముడసర్లోవ జలాశయం వెనుక ప్రాంతంలోని వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై హైట్‌గేజ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఇన్నాళ్లు అక్కడ డంప్ చేసిన వారంతా, ఇప్పుడు స్థానిక రహదారిలో పారబోస్తున్నారు. అధికారులు స్పందించి... తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేరుకుపోయిన పూడిక..!

జీవీఎంసీ 15, 16వ వార్డుల్లోని గెడ్డలు, కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ శ్మశానవాటికకు వెళ్లే మార్గం, ఇసుకతోట, హెచ్‌బీకాలనీ, సింహాద్రిపురం, పాతవెంకోజీపాలెం ప్రాంతాల్లో కాలువలను సకాలంలో శుభ్రతకు నోచుకోకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య విభాగం సిబ్బంది స్పందించి వ్యర్థాలను తరలించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హెచ్‌బీ కాలనీ(మద్దిలపాలెం)

సమాచార కేంద్రం ఏర్పాటు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు బీచ్‌రోడ్డులో గురువారం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎటు నుంచి తీరానికి వెళ్లాలి, పిల్లలు తప్పిపోతే సహాయ కేంద్రం ద్వారా ప్రచారం చేసి తల్లిదండ్రులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టారు. వాహనాల పార్కింగ్ స్థలాల వివరాలు తెలియజేశారు. వ్యాఖ్యాతగా డిపార్టుమెంటుకు చెందిన బీశెట్టి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం వద్ద ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు.

మైక్‌లో సందర్శకులకు సూచనలిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: తమ పూర్వీకుల నుంచి వినియోగిస్తున్న శ్మశాన వాటిక అభివృద్ధిని దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారులు అడ్డుకోవద్దని కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం, పాతవెంకోజీపాలెం గ్రామస్థులు, శ్రీ సీతారామ సంఘం సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారానికి నాలుగో రోజుకు చేరింది. శ్మశానవాటికకు వెళ్లే మార్గం వద్ద సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు గురువారం వంటావార్పు చేశారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్, కె.వి.ఎస్.అప్పారావు, కాళ్ల వరహాలు, కొత్త వెంకోజీపాలెం అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న గ్రామ సేవా సంఘం సభ్యులు

ముగిసిన 'సప్తశక్తి సంగమ్'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తశక్తి సంగమ్ ముగింపు కార్యక్రమం గురువారం కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. విద్యా భారతి అఖిల భారతీయ సప్తశక్తి సంగమ్ సభ్యురాలు, సప్తశక్తి సంగమ్ దక్షిణ క్షేత్ర సంయోజికి డాక్టర్ బండారు ధరణీప్రియ మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు వేలాది మాతృ సమ్మేళనాలు జరిగాయన్నారు. మరో అతిథి కె.వెంటభాను మాట్లాడుతూ ఒక మహిళ తన కుటుంబాన్ని ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. మరో వక్త డాక్టర్ టి.రాధాబాయి వివిధ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏయూ తైక్వాండో జట్ల ఎంపిక

ఏయూప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం తైక్వాండో పురుషులు, మహిళల జట్ల ఎంపికలు గురువారం ఏయూ న్యూ జిమ్నాజియంలో జరిగాయి. డీన్ ఇన్‌ఫ్రా ప్లానింగ్ ఆచార్య కె.శ్రీనివాసరావు అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు టీఏ, డీఏతో పాటు ట్రాక్ సూట్స్ వంటివి అందజేస్తామంటూ సంబంధిత క్రీడాకారులను అభినందించారు. ఏయూ చీఫ్ ఇంజినీర్ తిరుపతిరావు, ఆచార్య ఆదిశేషు, ఆయా కళాశాలల వ్యాయామ విద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో ఏయూ అధికారులు

22న లాసెట్‌పై అవగాహన సదస్సు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఈనెల 22న పెందుర్తి సమీప పురుషోత్తపురం శివాలయం వద్ద లాసెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని విశ్రాంత ఆచార్యులు డీకే.రెడ్డి తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని భాజపా దక్షిణ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . లాసెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తిలి శంకరరావు, తోట వాసుదేవరావు, రాజుగౌడ్, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ప్రదర్శిస్తున్న ఆచార్య డీకే.రెడ్డి, తదితరులు

'మన్ కీ బాత్'పై క్విజ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఈనెల 22న నిర్వహించనున్నట్లు భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎం.ప్రకాష్ తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీ వరకు నిర్వహించబోయే మన్ కీ బాత్ కార్యక్రమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి క్విజ్ నిర్వహిస్తామన్నారు. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దేశంలో ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాల సందర్శనకు ఎంపిక చేస్తామన్నారు. వీటితో పాటు పార్లమెంటు సందర్శన, బి.ఆర్.అంబేడ్కర్ దీక్ష భూమి, సంత్ రవిదాస్ జన్మస్థలానికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా మీడియా కన్వీనర్ టి.కోటేశ్వరరావు, జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షులు ఎ.శంకరరావు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జి.రాకేష్‌చంద్ర పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న భాజపా శ్రేణులు

ఆటిజంపై గ్రామీణుల్లో అవగాహన కల్పించాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వృత్తి పరమైన ప్రగతి సాధించాలంటే సంబంధిత అంశంపై అభిరుచి, ఆసక్తి ఉండాలని 'ట్రాన్స్‌ఫార్మ్ హేబిట్స్' డైరెక్టర్ ఇంద్రాణి యశోద కొంపెల్ల అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో గురువారం 'అప్లయిడ్ బిహేవియర్ అనాలసిస్ ఇన్ ఆటిజం-ఫౌండేషన్స్ ఛాలెంజెస్ అండ్ ప్రాక్టీస్ కాంటెక్స్ట్' అంశంపై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ఆటిజంపై సరైన అవగాహన లేదని, ఈ పరిస్థితిలో దీనిపై గ్రామీణులకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ జన్యుపరమైన, కాలుష్యం, ఆహారపు అలవాట్లు తదితరమైనవి సంతానంపై ప్రభావం చూపుతున్నందున మనోవైకల్యంతో జన్మించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంద్రాణి యశోద కొంపెల్ల

పార్కులో ప్రత్యేక అలంకరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ నేపథ్యంలో వుడాపార్కులో ఎదురు బొంగులు, చెట్లకు విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఈ మేరకు సందర్శకులకు కనువిందు చేసింది. కార్యక్రమం పూర్తయిన తర్వాత వాహనదారులు ఒకేసారి బయటకు రావడంతో గేటు వద్ద ఇబ్బంది పడ్డారు.

14 రోజుల ప్రవచన యజ్ఞం

ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: భగవంతుని గురించి చెప్పేదే భాగవతం అని ప్రవచన కర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. విశాఖ రుషిపీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి గుడి సమీప ఏబీసీ పార్కులో గురువారం నుంచి మార్చి నాలుగో తేదీ వరకు చేపట్టిన 14 రోజుల 'శ్రీమద్భాగవతం ప్రవచన యజ్ఞం' ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాగవతంలో భగవంతుడు, భక్తులకు సంబంధించిన ఎన్నో కథలు ఉంటాయని వివరిస్తూ అందులోని పలు ప్రధాన ఘట్టాలను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో 'వావ్' అథ్లెట్స్ సత్తా

మురళీనగర్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ(వావ్) అథ్లెట్లు సత్తాచాటారు. పోటీల్లో వావ్ నుంచి 62 మంది క్రీడాకారులు పాల్గొనగా 5కె వాక్, రన్నింగ్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో పాల్గొని 31 స్వర్ణాలు, 44 రజతాలు, 30 కాంస్య పతకాలు సాధించినట్లు వావ్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్ తెలిపారు. క్రీడాకారులకు కోఆర్డినేటర్ సి.హెచ్.శ్రీనివాసరాజు, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, చీఫ్ పేటర్న్ కమల్‌బైద్ అభినందనలు తెలిపారు.

క్రీడాకారులతో వావ్ సభ్యులు

■ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

హనుమంతువాక(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : హనుమంతువాక కూడలిలోని శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, సహస్ర జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. హనుమంతువాక, క్రాంతి నగర్, విజయదుర్గకాలనీ, పాత పందుల ఫారం, విశాలాక్షినగర్, ఆరిలోవ, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. తొమ్మిదో వార్డు తెదేపా ఇన్‌ఛార్జి బుడుమూరి గోవింద్, ఆలయ కమిటీ ప్రతినిధులు, హనుమాన్ గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

■ బంగారు గొలుసు చోరీకి యత్నం

గురుద్వారా, న్యూస్‌టుడే: నడుస్తూ వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసేందుకు దొంగ ప్రయత్నించిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో అక్కయ్యపాలెంలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన ఆమె పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా ఆ వ్యక్తిని కనిపెట్టేందుకు రంగంలోకి దిగారు. దొంగతనం చేసేందుకు వినియోగించిన ద్విచక్రవాహనంపై నెంబర్ ప్లేట్ లేనట్లు పోలీసులు గుర్తించారు.

పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించాలి

జిల్లా విద్యాశాఖాధికారి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో తప్పనిసరిగా 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందేనని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం పురుషోత్తపురంలోని బాలాజీ పాఠశాలలో పెందుర్తి, గోపాలపట్నం మండలాల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా సీట్లు పొందిన సంబంధిత విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ప్రవేశాలు కల్పించాలని కోరారు. సీటు పొందిన ఏ ఒక్కరినీ తిరస్కరించరాదని ఆదేశించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పరస్పర సహకారం అవసరమని పాఠశాల యాజమాన్యాలకు తెలిపారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవోలు కె.సువర్ణ, డి.దివాకర్, ప్రయివేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్

'అల్లూరి' అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఆనందపురం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు నీతి ఆయోగ్ చొరవతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) సహకారంతో గంభీరం ఐఐఎంవీలో గురువారం కార్యశాల నిర్వహించారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ ప్రారంభించిన సంపూర్ణత అభియాన్ 2.0 కింద ఆకాంక్షిత జిల్లాల ఎంపికలో అల్లూరి ఉందన్నారు.

★ ఈ మేరకు ఆరు నెలల ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో 213 కీలక అంశాల ఆధారంగా 627 గృహాల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించడం జరిగిందన్నారు. వీటిపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ సంపూర్ణత అభియాన్ 2.0 ప్రాజెక్టు అధ్యాపకులు, జిల్లా ఉన్నతాధికారులు చర్చించారు.

★ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక, పర్యాటకపరంగా అల్లూరి జిల్లా సమృద్ధి వనరులతో కలిగి ఉందన్నారు. ఐదు ఇతివృత్తాలు, 46 అంశాల్లో పని తీరు మెరుగుపరచడానికి సంపూర్ణత అభియాన్ కింద ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి ఇక్కడ లభిస్తున్న కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

★ అనంతరం ఐఐఎంవీ పరిశోధన బృందాన్ని ప్రశంసించారు. ఐఐఎంవీ అధ్యాపక బృందం అంబేడ్కర్, విజయ మారిశెట్టి, అభినాష్ సింగ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐఐఎంవీ అధ్యాపకులు, జిల్లా అధికారులు

(c) eenadu

22న రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపికను ఈ నెల 22న రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రెండు విభాగాల్లోనూ 65 కేజీల లోపల, 65 కిలోల పైబడి, మాస్టర్స్(పురుషుల) విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్ల వయసు పైబడిన వారికి పోటీలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8885203519 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 36వ వార్డు సున్నపు వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఒంటరిగా నడిచి వెళ్లేందుకు చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. – రమణి, స్థానిక మహిళ ✓: సిబ్బందిని పంపి, వీధి కుక్కల్ని పట్టిస్తాం. –మల్లయ్యనాయుడు, జోన్–4 జేడీ

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు వుడాకాలనీ ప్రధాన రహదారిలోని చెత్త కుండీలు వ్యర్థాలతో నిండి, తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. – పీ.వి.రాజు ✓: సిబ్బందిని పంపించి చెత్త తరలించేలా చూస్తాం. – వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

● నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సీతంపేట, న్యూస్‌టుడే: హెచ్‌టీ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-1 కార్యనిర్వాహక ఇంజినీర్(ఆపరేషన్స్) పి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట, శాంతినగర్, పీఅండ్‌టీ కాలనీ, గురుద్వారా ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో రేపు..

మాధవధార, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాధవధార, కాకానినగర్ ఫీడర్లలో విద్యుత్తు మరమ్మతులు నిర్వహిస్తుండటంతో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-2 డీఈఈ బి.కె.నాయుడు తెలిపారు. మాధవధార, కళింగనగర్, వుడాకాలనీ, కాకానినగర్, సాకేతపురం, వినోద్‌నగర్, విమాన్‌నగర్, ఎస్.వి.కె.నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

● మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నం

గురుద్వారా, న్యూస్‌టుడే: నడుస్తూ వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసేందుకు దొంగ ప్రయత్నించిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో అక్కయ్యపాలెంలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన ఆమె పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా ఆ వ్యక్తిని కనిపెట్టేందుకు రంగంలోకి దిగారు. దొంగతనం చేసేందుకు వినియోగించిన ద్విచక్రవాహనంపై నెంబర్ ప్లేట్ లేనట్లు పోలీసులు గుర్తించారు.

● ఏయూలో పోలీసుల పహారా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఘటనల నేపథ్యంలో గురువారం పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఏయూ బాస్కెట్‌బాల్ మైదానం, పరిపాలనా భవనం వద్ద పోలీసులు కాపలా ఉన్నారు. ఏయూలో ఇటీవల ఆర్ఎస్ఎస్ కవాతు నేపథ్యంలో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వర్సిటీలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ఏయూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నగరంలో ఐఎఫ్ఆర్ జరుగుతుండడం, జాతీయ స్థాయి నాయకులు నగరానికి రావడంతో వర్సిటీలో ఎలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఏబీవీపీ విద్యార్థులు బుధ, గురువారాల్లో బాస్కెట్‌బాల్ మైదానంలో తమ కార్యక్రమాలు శాంతియుతంగా చేపట్టారు. ఇతరులను వర్సిటీ లోపలకు రానీయడం లేదని, ఐడీ కార్డులు చూపిన విద్యార్థులనే పోలీసులు అనుమతిస్తున్నట్లు ఏయూ సెక్యూరిటీ డీన్ ఆచార్య ఇమ్మానియేల్ రాజు తెలిపారు. కాగా వసతిగృహాల్లో నాన్ బోర్డర్లను బయటకు పంపించేందుకు రాత్రిళ్లు ఆయా వసతిగృహాల చీఫ్ వార్డెన్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

అధికారులంతా ఒకేచోట..
తిప్పలు ఉండవిక..

నూతన భవనంలోకి కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీస్‌స్టేషన్లు

మాధవధార, న్యూస్‌టుడే: కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్లను నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్పు చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధమైంది. దీనిలో భాగంగా మర్రిపాలెం వుడాకాలనీ వద్ద రైతుబజారు వెనుక రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనం పనులు పూర్తయ్యాయి. ఇందులో కంచరపాలెం ట్రాఫిక్ స్టేషన్‌తో పాటు, ఎయిర్‌పోర్టు క్రైమ్ స్టేషన్, ట్రాఫిక్ విభాగాలను ఇక్కడికి మార్పు చేయనున్నారు. త్వరలోనే వీటిని ప్రారంభించి కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలియజేశారు.

ప్రారంభానికి సిద్ధమైన భవనం

త్వరలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు: సైబర్ నేరాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం జిల్లాకు ఒక సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. విశాఖ నగరంలో సైబర్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు రావడంతో వీలైనంత త్వరలో ఇదే భవనంలో ప్రారంభించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. మొదటి అంతస్తులో కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్‌పోర్టు క్రైమ్ స్టేషన్లు, రెండో అంతస్తులో సైబర్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

చాలీచాలని గదుల్లో విధులు: ఆర్అండ్‌బీ వద్దనున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పాత కార్యాలయంలో ప్రస్తుతం కంచరపాలెం, ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ ఏసీపీ-2 కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క విభాగానికి ఒక గది కేటాయించారు. దీంతో చాలీచాలని గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. అధికారులు స్టేషన్‌లో ఉండాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఎయిర్‌పోర్టు లా అండ్ ఆర్డర్ స్టేషన్‌లోనే ఎయిర్‌పోర్టు క్రైమ్ స్టేషన్ నడుస్తోంది. ఎయిర్‌పోర్టు క్రైమ్ సీఐ కంచరపాలెం స్టేషన్‌లో, ఎస్సై ఎయిర్‌పోర్టు స్టేషన్‌లో ఉంటున్నారు. దీంతో క్రైమ్‌కు సంబంధించిన ఫిర్యాదుదారులు రెండు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఈ మూడు విభాగాలు నూతన భవనంలోకి రావడంతో ఒకే చోట సీఐ, ఎస్సైలు అందుబాటులో ఉండనున్నారు. ఈనెల 14న ప్రారంభం కావాల్సి ఉండగా, ఐఎఫ్ఆర్ ఏర్పాట్లలో పోలీసులు బిజీగా ఉండటంతో వాయిదా పడింది. మరో వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు సమాచారం.

వైభవంగా రామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలు



రామకృష్ణ పరమహంస విగ్రహం వద్ద పార్కు కమిటీ సభ్యులు

మురళీనగర్, న్యూస్‌టుడే: భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలను అనుభవ పూర్వకంగా ప్రపంచానికి చాటిచెప్పిన ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలను సెక్టార్-3 వ్యాసం శ్రీరామ్మూర్తి ప్రశాంతి ఆధ్యాత్మిక ఉద్యానవనం సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్కు ఆవరణలోని రామకృష్ణ పరమహంస విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్కు కమిటీ సభ్యుల వితరణతో జీవీఎంసీ కార్మికులకు దుస్తులు, రొట్టెలు, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. సాయంత్రం భజనలు, కీర్తనలు ఆలపించారు. పార్కు గౌరవ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రఘురాం పండా, ఉపాధ్యక్షులు యు.శుభ, జి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

22న లాసెట్‌పై అవగాహన సదస్సు

గోడపత్రిక ప్రదర్శిస్తున్న ఆచార్య డీకే.రెడ్డి, తదితరులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఈనెల 22న పెందుర్తి సమీప పురుషోత్తపురం శివాలయం వద్ద లాసెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని విశ్రాంత ఆచార్యులు డీకే.రెడ్డి తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని భాజపా దక్షిణ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లాసెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తిలి శంకరరావు, తోట వాసుదేవరావు, రాజుగౌడ్, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి తాగునీటి కూలర్ వితరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఏకాదశి కీర్తన్ మహిళా సంఘం సభ్యులు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయిబాబా ధ్యాన మందిరానికి తాగునీటి కూలర్‌ను గురువారం బహూకరించారు. వేసవి సమీపిస్తుండటంతో మందిరానికి వచ్చే భక్తులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దీన్ని అందజేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అర్చకులు మంత్రోచ్ఛారణ నడుమ మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు గురువారం తాగునీటి కూలర్‌ను ప్రారంభించారు.

కూలర్‌ను ప్రారంభిస్తున్న మందిరం అధ్యక్షుడు శేషగిరిరావు

దివంగత ఎంపీ అప్పలనరసింహం సేవలు మరువలేనివి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దివంగత ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిన కృషి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఆయన తనయుడు, విశాఖ పశ్చిమం ఎమ్మెల్యే పి.గణబాబు కొనియాడారు. అప్పలనరసింహం జయంతి సందర్భంగా డైమండ్ పార్కులోని ఆయన కాంస్య విగ్రహానికి గురువారం ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటు పడిన వ్యక్తి అప్పలనరసింహం అని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుకెళ్తున్నానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని వీరారావు, తెదేపా నాయకులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీశివప్రసాద్, బొడ్డేటి మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ వీరారావు, నాయకులు

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. కళాశాలలో మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులకు గురువారం బోయింగ్ సంస్థ సౌజన్యంతో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దండిగా ఉన్నాయని, ఒక వైపు చదువుకుంటూనే మరోవైపు నైపుణ్యాలు పెంపొందించుకుని అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కె.ఫణికృష్ణ, ఎం.మల్లేశ్వరరావు, వర్క్‌షాప్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, ట్రైనర్ సత్యశాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తదితరులు

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : తెదేపాలో కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఉంటుందని పార్టీ దక్షిణం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. జ్ఞానాపురం సిరిల్‌వీధిలో నివాసం ఉండే పార్టీ కార్యకర్త డి.జోజిబాబు గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి తెదేపా సభ్యత్వ బీమా కింద రూ.5 లక్షల నగదు మంజూరైంది. గురువారం సుధాకర్, ఇతర నాయకులు బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంతోనే ఆర్థిక సాయం మంజూరైందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు ఐతి మధుబాబు, నాయకులు విల్లూరి చక్రవర్తి, ఉరుకూటి నారాయణ, బొచ్చ రామిరెడ్డి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో సీతంరాజు సుధాకర్, తదితరులు

ఉపాధి శిక్షణ... భవితకు రక్షణ..!

'దయాల్‌బాగ్'లో వృత్తి విద్యా కోర్సులకు ఆదరణ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్ కాలనీలో ఉన్న దయాల్‌బాగ్ విద్యాకేంద్రంలో అందిస్తున్న వృత్తి విద్యాకోర్సులకు ఆదరణ పెరుగుతోంది. పలువురు యువత, మహిళలు నైపుణ్యాలు పెంపొందించుకుని, ఉద్యోగ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. ■ కొన్ని కోర్సులకు సంబంధించిన శిక్షణ తరగతులు పూర్తవుతుండడంతో, ఆయా కోర్సుల్లో కొత్తగా చేరే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం కేంద్రంలో సంప్రదించాలన్నారు.

మెలకువలు నేర్చుకుంటున్న మహిళలు

కోర్సుల వివరాలు.. ■ 'టై అండ్ డై'లో మూడు నెలల శిక్షణ ఉంటుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. పదో తరగతికి పూర్తి చేసిన వారికి అవకాశం ఉంటుంది. శిక్షణ కాలంలో.. వస్త్రాలపై ఆకర్షణీయ రంగులు వేయడం, డిజైన్లు తీర్చిదిద్దడం, ఆధునిక రీతుల్లో దుస్తులు తయారు చేయడం తదితర అంశాల్లో మెలకువలు నేర్పిస్తారు. మార్కెటింగ్ అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. ■ 'ఆఫీస్ మేనేజ్‌మెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్' కోర్సులో ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. మొత్తం 40 సీట్లలో ఇంటర్ పూర్తి చేసిన వారికి అవకాశం కల్పిస్తారు. శిక్షణ కాలంలో.. కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, టాలీ, సీ లాంగ్వేజ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణ, టైపింగ్ స్కిల్స్, కీబోర్డ్ షార్ట్‌కట్స్, డేటా ఎంట్రీలో మెలకువలు, ఇంటర్‌నెట్ బేసిక్స్, స్కానింగ్, ప్రింటింగ్, ఫైల్ మేనేజ్‌మెంట్, డేటా సేవ్ బ్యాకప్, బిల్లుల తయారీ, అకౌంటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

■ 'సెల్‌ఫోన్ మెకానిజం'పై మూడు నెలల పాటు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. సెల్‌ఫోన్ విడి భాగాల పనితీరు, మరమ్మతులు, నిర్వహణ తదితర అంశాలపై మెలకువలు నేర్పించి.. ఉపాధి అవకాశాలకు మార్గనిర్దేశం చేస్తారు.

ఆర్డర్లు వస్తున్నాయి..!: 'నేను టైలరింగ్ అండ్ టెక్స్‌టైల్ డిజైనింగ్ కోర్సు చేశా. వివిధ డిజైన్లలో చిన్నపిల్లల దుస్తులు, చీరలు, బ్లౌజులు కుట్టడం నేర్చుకున్నా. నేను, మరో ఇద్దరు స్నేహితులు కలిసి దుకాణం ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి. ప్రతి నెలా తలో రూ.20వేలు సంపాదిస్తూ, కుటుంబాలకు ఆర్థికంగా చేయూత ఇస్తున్నాం.' – రాధ, విశాఖ.

కుటుంబాన్ని పోషిస్తున్నా..: ''నేను సెల్‌ఫోన్ శిక్షణ తీసుకోవడంతో అన్ని అంశాలపై అవగాహన ఏర్పడింది. పాడైన ఫోన్లకు మరమ్మతులు చేయడంలో పట్టు సాధించా. ప్రస్తుతం సెల్‌ఫోన్ దుకాణం ఏర్పాటు చేసుకుని, కుటుంబాన్ని పోషిస్తున్నా. నా వద్ద ఇద్దరు వర్కర్లు పని చేస్తున్నారు.' – రాజు, మద్దిలపాలెం.

నగరంలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో కొత్తగా 159 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కొత్తగా 159 అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న 215 కేంద్రాలకు నిధులు కేటాయించాలని కోరారు. వీటితో పాటు చిన్నారులకు బెంచీలు, కుర్చీలు, ఆట వస్తువులు, విద్యా సామగ్రి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రతి వెయ్యి మంది లబ్ధిదారులకు ఒక అంగన్‌వాడీ కేంద్రం అవసరమన్నారు. విశాఖకు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోందన్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

బార్ ఏర్పాటు చేయొద్దంటూ నిరసన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ సమీప అఫీషియల్‌కాలనీ మూడో వీధిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయొద్దని స్థానిక మహిళలు, ఏఐటీయూసీ ప్రతినిధులు గురువారం ధర్నాకు దిగారు. మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి, ఏఐటీయూసీ నాయకులు తెడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడారు. కేజీహెచ్, ఆలయం, పాఠశాల సమీపంలోనే బార్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని వారు కోరారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే, ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలరాజు, సత్తిరాజు, వేణు, కనక తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న మహిళలు

వృద్ధులకు వస్త్రాలు అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవాన్ని, రామకృష్ణ పరమహంస జయంతిని గురువారం సంస్థ ఆవరణలో నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సీఎంఏ.జహీర్ అహ్మద్, సంఘం సేవకులు గోడి నర్సింహాచారి, జలీల్‌అహ్మద్, శర్మ తదితరులు హాజరై పరమహంస చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు నూతన వస్త్రాలు అందించి, వారిని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సభ్యులు టి.కృష్ణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను సత్కరించిన అతిథులు, నిర్వాహకులు

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులు కురిపించే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గోవిందుడికి గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన చేపట్టారు.

జాతీయ పోటీల్లో వావ్ అథ్లెట్స్ సత్తా

మురళీనగర్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ(వావ్) అథ్లెట్లు సత్తాచాటారు. పోటీల్లో వావ్ నుంచి 62 మంది క్రీడాకారులు పాల్గొనగా 5కె వాక్, రన్నింగ్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో పాల్గొని 31 స్వర్ణాలు, 44 రజతాలు, 30 కాంస్య పతకాలు సాధించినట్లు వావ్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్ తెలిపారు. క్రీడాకారులకు కోఆర్డినేటర్ సి.హెచ్.శ్రీనివాసరాజు, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, చీఫ్ పేటర్న్ కమల్‌బైద్ అభినందనలు తెలిపారు.

క్రీడాకారులతో వావ్ సభ్యులు

పిక్కలు పీకేస్తున్నాయ్!

జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్, కూరగాయలు మార్కెట్ ప్రాంతాల్లోని రహదారులపై వెళ్లాలంటే ప్రయాణికులు, స్థానికులు హడలిపోతున్నారు. కుక్కలు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులను వెంబడిస్తూ పిక్కలు పీకేస్తున్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు జీవీఎంసీ పీజీఆర్ఎస్‌లో తెలిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని ఆయా ప్రదేశాల నుంచి తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

అరకొర పనులతో అవస్థలు

సెక్టార్-8 కొండవాలు ప్రాంతంలో వర్మ కాంప్లెక్సు ప్రధాన రహదారిలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు నత్తనడకన సాగుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని బహుళ అంతస్తులు, దుకాణాల ముందు తవ్వేసి కేబుల్స్ వేయకుండా వదిలేశారు. దీంతో ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే నానా అవస్థలు పడుతున్నామని, అత్యవసర సమయాల్లో కనీసం ద్విచక్ర వాహనాలను సైతం బయటకు తీయలేకపోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మురళీనగర్

కదలని మురుగు.. వదలని వాసన..

జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్‌పార్క్ నుంచి మహత్ కాలనీ రహదారిలోని ప్రధాన కాలువలో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. గత నెలరోజులుగా శుభ్రతకు నోచుకోకపోవడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దోమలు వృద్ధి చెంది చిన్నారులు, వృద్ధులు, దుర్వాసనతో తరచూ జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, రోజురోజుకు ఇబ్బందులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మాధవధార

ఆటిజంపై గ్రామీణుల్లో అవగాహన కల్పించాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వృత్తి పరమైన ప్రగతి సాధించాలంటే సంబంధిత అంశంపై అభిరుచి, ఆసక్తి ఉండాలని 'ట్రాన్స్‌ఫార్మ్ హెబిట్స్' డైరెక్టర్ ఇంద్రాణి యశోద కొంపెల్ల అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో గురువారం 'అప్లయిడ్ బిహేవియర్ అనాలసిస్ ఇన్ ఆటిజం-ఫౌండేషన్స్ ఛాలెంజెస్ అండ్ ప్రాక్టీస్ కాంటెక్స్ట్' అంశంపై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ఆటిజంపై సరైన అవగాహన లేదని, ఈ పరిస్థితిలో దీనిపై గ్రామీణులను విస్తృతంగా చైతన్యపరచాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ [illegible] కల్యాణ్ [illegible] ప్రక్రియ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ తైక్వాండో జట్టు ఎంపిక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం తైక్వాండో పురుషులు, మహిళల జట్ల ఎంపికలు గురువారం ఏయూ న్యూ జిమ్నాజియంలో జరిగాయి. డీన్ ఇన్‌ఫ్రా ప్లానింగ్ ఆచార్య కె.శ్రీనివాసరావు అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు టీఏ, డీఏతో పాటు ట్రాక్ సూట్స్ వంటివి అందజేస్తామంటూ సంబంధిత క్రీడాకారులను అభినందించారు. ఏయూ [illegible] ఆచార్య [illegible], ఆయా కళాశాలల వ్యాయామ విద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎంపికైన తైక్వాండో జట్టుతో ఏయూ అధికారులు

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

హక్కుల ప్రాధాన్యతపై కార్యశాల

కార్యశాలకు హాజరైన విద్యార్థినులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: సృజనాత్మక ఆలోచనలను రూపొందించి, వాణిజ్యపరంగా ఎలా అభివృద్ధి చేయాలో వివరించేందుకు కాపులుప్పాడలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతీక్ శ్రీవాస్తవ.. పేటెంట్లు, హక్కుల నమోదు విధానం, ఆవిష్కరణల పరిరక్షణ, వ్యాపార అవకాశాలను వివరించారు. కళాశాల విద్యార్థి మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెంచిన పాల ధరలను తగ్గించాలని డిమాండ్

విశాఖ డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం, న్యూస్‌టుడే : పసిపిల్లలు తాగే పాలపై లీటరుకు రూ.2 లు పెంచడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం విశాఖ డెయిరీ పాల బూత్ వద్ద గురువారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పెంచిన పాల ధరను తగ్గించే వరకు నిరసనలను ఆపే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మణమూర్తి, పైడిరాజు, పెంటరావు, సత్యరావు, కె.రమణ, ఐద్వా నాయకురాలు విమల, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: బీసీరోడ్డు విస్తరణలో భాగంగా దయాల్‌నగర్ వద్ద ఆరిలెడ్డి పంక్షన్ హాలు ముందు ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారు. అటుగా రాకపోకలు సాగించలేక పోతున్నాం. –అది రెడ్డి సురేష్, దయాల్‌నగర్. ✓: త్వరితగతిన పనుల పూర్తికి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించాం. -శేషాద్రి, డీఈ

?: కూర్మన్నపాలెం పుడా ఫేజ్-2లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చెట్ల కొమ్మల వల్ల ఇబ్బందులు పడుతున్నాం. –నారాయణ స్వామి, కూర్మన్నపాలెం. ✓: సిబ్బందికి తగిన ఆదేశాలిస్తాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్రకాలనీ రోడ్డులో కాలువల్లో పూడికలు తీయడం లేదు. – ఎ. రమేష్, నాగేంద్రకాలనీ. ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం.– రామకృష్ణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో అసంపూర్తి పనులతో ఇబ్బందులు పడుతున్నాం. – ఒమ్మి అప్పలరాజు, బుచ్చిరాజుపాలెం. ✓: రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. – వెంకటలక్ష్మి, పనుల విభాగం డీఈ

ఫాగింగ్ ఆపరేషన్

స్పందనకు వందనం

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 65వ వార్డు మత్స్యకార గ్రామాల్లో దోమల నివారణకు జీవీఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో దోమల బెడదపై వచ్చిన వార్తలకు జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది స్పందించి మినీ ఫాగింగ్ యంత్రాలతో దోమల పొగ వదిలారు.

నేడు, రేపు విద్యుత్తు అంతరాయం

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : శ్రీనగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గాజువాక శ్రీనగర్, అఫీషియల్‌కాలనీలో అంతరాయం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ★ శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం వరకూ వాంబేకాలనీ, అశోక్‌నగర్, నేతాజీకాలనీ, సంజీవకాలనీ, యాతపాలెం, దిబ్బపాలెంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కూర్మన్నపాలెం : శాతవాహననగర్ రోడ్ నెం.1 నుంచి 9, ముస్తఫా కూడలి, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీనగర్, యాతపాలెం, అశోక్‌నగర్, శివాజీనగర్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్, శివసాయినగర్‌లలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్తు ఉండదని అధికారులు తెలిపారు.

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధిలోని పలు కాలనీలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.మురళీకృష్ణ తెలిపారు. మంగళపాలెం, అగనంపూడి ఇండోర్ ఉపకేంద్రాల్లో నిర్వహణ పనుల కారణంగా డొంకాడ, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, దువ్వాడ, మంగళపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామని చెప్పారు.

అక్కిరెడ్డిపాలెం, : శనివారం పలు ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాతయ్యపాలెం, బంగారమ్మ ఆలయ ప్రాంతం, మర్రిచెట్టు కూడలి ప్రాంతం, పాత ట్రాన్స్‌ఫార్మర్ ఏరియా, ఐయాన్ డిజిటల్ కేంద్రం, నవ్య న్యూలైఫ్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిల్చిపోతుందని అధికారులు పేర్కొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే: శనివారం కోడిపందేలదిబ్బ, కుంచమంబకాలనీ, శ్రీనివాస్‌నగర్, రామ్‌నగర్, శ్రీహరిపురం ప్రధాన సేవా రహదారి ఏరియా, పిలకవానిపాలెం, కుంచమ్మ కాలనీ, అశోక్‌నగర్, హనుమాన్ సంజీవ్ కాలనీ, మాజీ సైనికుల కాలనీ, నెహ్రూనగర్ లేబరు జంక్షన్, కొత్తనక్కవానిపాలెం, గుల్లలపాలెం, రాజ్‌కమల్‌దేవీ కాలనీ, అన్నమ్మకాలనీ పరిసరాల్లో ఉదయం 9 నుంచి సాయంత్ర 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీకే నాయుడు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

గృహ సముదాయం ప్రారంభానికి సన్నాహాలు

గాజువాక(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: నిర్మాణాలు పూర్తిచేసుకుని మూడున్నరేళ్లుగా ప్రారంభానికి ఎదురుచూస్తున్న గాజువాక 76వ వార్డు బర్మాకాలనీలోని టిడ్కో గృహ సముదాయం తలుపులు ఎట్టకేలకు తెరుచుకోనున్నాయి. లబ్ధిదారుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఈనెల 21న దీన్ని ప్రారంభించడానికి మహావిశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ), గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(టిడ్కో) అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీతో, లబ్ధిదారులకు బ్యాంకు రుణ సౌకర్యం కల్పిస్తూ ఈ గృహాలు అందించనున్నారు. బర్మాకాలనీ గెడ్డ సమీపంలో విశాలమైన స్థలంలో 48 ప్లాట్లతో గృహ సముదాయం సిద్ధమైంది. ఇక్కడి ప్లాట్లను నగర శివారులోని నిరుపేదలకు కేటాయించారు. లబ్ధిదారుని వాటాగా రూ.25వేలు చెల్లించగా, బ్యాంకు రుణం రూ.3.15 లక్షలతో వీటిని కేటాయించారు.

గాజువాక నియోజకవర్గంలో టిడ్కో ఇళ్లు ఎక్కడెంత?

దువ్వాడ: 1056	భానోజీతోట: 1056
నడుపూరు: 960	పెదగంట్యాడ: 672
తలారివానిపాలెం: 1200	

బర్మాకాలనీలో టిడ్కో గృహాలు

చేరువలోకి వసతులు

ఇప్పటికే బర్మాకాలనీ ప్రధాన మార్గం నుంచి గెడ్డ పక్క నుంచి గృహ సముదాయానికి వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి తెచ్చారు. వాటర్ ట్యాంకు నిర్మాణం, మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రస్తుతం విద్యుత్తు మీటర్లు వేస్తున్నారు. గతంలోనే నిర్మాణాలు పూర్తయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి దిష్టిబొమ్మలుగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించడంతో లబ్ధిదారుల వదనాలు వికసిస్తున్నాయి. పట్టణ శివారులో పలుచోట్ల ఈ గృహాల ప్రారంభోత్సవం జరిగినా ఇంకా సౌకర్యాలు కల్పించాల్సి ఉండటంతో లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదు. బర్మాకాలనీలో 21న ఉదయం 10 గంటలకు గృహ సముదాయం ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇప్పటికే సంబంధిత లబ్ధిదారులు గాజువాక జోన్ యూసీడీ విభాగం సిబ్బంది సమాచారం ఇచ్చారు.

గృహ సముదాయానికి కొత్త మార్గం

అగనంపూడి అధికారుల ఫోన్ నెంబర్లివే!

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడిలో కొత్తగా ఏర్పాటు చేసిన జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పలువురు అధికారులు విధుల్లో చేరారు. మరి కొంత మంది ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయం పరిధిలోకి తీసుకొచ్చిన 77, 78, 79, 85 వార్డుల పరిధిలోని ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం అధికారులను సంప్రదించాలనుకునే వారు ఈ కింద నంబర్లకు ఫోన్ చేయొచ్చు.

అధికారి పేరు	విభాగం..	ఫోన్ నెంబరు
మనీషాత్రిపాఠి	జోనల్ కమిషనర్	9912872224
టి. సత్యవేణి	సూపరింటెండెంట్	8121708116
ఎస్.వి.వి.ఎస్ నారాయణ	ఈఈ, ఇంజినీరింగ్	9912349479
కేదార్‌నాథ్	ఈఈ, నీటి సరఫరా	8187892316
కె. బాబూరావు	ఈఈ, విద్యుత్తు	9948078504
ఎస్. కిరణ్‌కుమార్	ఎ. ఎం. ఒ. హెచ్	9441883442
వెంకటరావు	పట్టణ ప్రణాళిక	8187898432
కె. దుర్గాప్రసాద్	ఏపీవో, యూసీడీ	7729995950
జి. ప్రియాంక	ఉద్యాన శాఖ	9666387106
ఎం. శేఖర్‌బాబు	రెవెన్యూ	7780382333

ఎస్టీబీఎల్‌లో సినిమాలు స్క్రీన్-1: విత్ లవ్, స్క్రీన్-2: హే బల్వంత్ స్క్రీన్-3: నవాబ్ కేఫ్, స్క్రీన్-4: కపుల్ ఫ్రెండ్లీ

భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు..!

విశాఖపట్నం (మల్కాపురం) న్యూస్‌టుడే : ఇష్టానుసారంగా భూకబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ములగాడ తహసీల్దారు రమేష్ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీలో సర్వే నంబరు 14లో సుమారుగా రెండు ఎకరాల స్థలాన్ని ఆక్రమించారని గుర్తించిన తహసీల్దారు, ఆ స్థలాన్ని రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆ స్థలంలో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఆక్రమణకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డులు పెట్టిన రెవెన్యూ సిబ్బంది

పెండింగ్ పోస్టుల భర్తీకి డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ పబ్లిక్‌హెల్త్ విభాగంలో ఖాళీ అయిన రిటైర్‌మెంటు, డెత్ కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలో పారిశుద్ధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ.. ఏళ్లతరబడి పెండింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడం బాధాకరమన్నారు. నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణ ముఖ్యం

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గాజువాక పీహెచ్‌సీలో గురువారం కిల్కారి ప్రోగ్రాం పేరుతో ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుచూపుతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమన్నారు. రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కొవిరి మౌనిక, సూపర్‌వైజర్ అచ్యుతరావు, గండేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని పునే జిల్లా బిగ్వాన్ ప్రాంతానికి చెందిన రక్మబాయి(68) మానసికస్థితి బాగోలేక.. తీవ్ర అనారోగ్యంతో నగరానికి వచ్చేసింది. దీనిపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రాజేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు మమత ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్పందించారు. వృద్ధురాలిని మాతృప్రేమ వృద్ధాశ్రమంలో చేర్చి వైద్యసేవలు అందించారు. కోలుకున్న వృద్ధురాలిని శ్రద్ధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం పోలీసుల పర్యవేక్షణలో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ ఎ.మమత గురువారం తెలిపారు.

బౌద్ధ వ్యాప్తికి విశేష కృషి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గాజువాక, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మ వ్యాప్తికి కృషిచేసిన బౌద్ధ ఉపాసకుడు అర్జునరావు సేవలు అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. పెదగంట్యాడ బర్మాకాలనీలో గురువారం బర్మా ఆంధ్ర సంఘం ఆధ్వర్యంలో అర్జునరావు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం ఛైర్మన్ బోరవేణుగోపాల్ గౌతం, అఖిలపక్ష నాయకులు మార్డుపూడి పరదేశి, ఎం. శంకర నారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. సభ్యులు గుణపూడి అరుణ, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, అప్పలరాజు, రోజా తదితరులు పాల్గొన్నారు. బుద్ధిస్టు సొసైటీ రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను వీరు ఆవిష్కరించారు.

లోక్ అదాలత్ వినియోగించుకోవాలి

గాజువాక, న్యూస్‌టుడే: వచ్చేనెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, రాజీమార్గం ద్వారా పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని 13వ అదనపు జిల్లాజడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. గురువారం గాజువాక కోర్టులో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయవాదులు మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకుంటే కేసుల రాజీకి అవకాశం ఉంటుందన్నారు. సివిల్ తగాదాలు, క్రిమినల్, మోటారు ప్రమాదాల కేసులకు రాజీ మార్గం మంచిదన్నారు. న్యాయమూర్తులు కవిత, యార్లగడ్డ లక్ష్మి, ఎం. శేషమ్మ, సీనియర్ న్యాయవాదులు తులసీ రమేష్, లెనిన్, కార్యవర్గ సభ్యులు చిరంజీవి, బీవీఎం కృష్ణ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు జడ్జి షణ్ముఖరావు, పలువురు న్యాయమూర్తులు, బార్ సభ్యులు

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

కూర్మన్నపాలెం కూడలిలో నిరసన చేపడుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: 'రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని' దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గురువారం కూర్మన్నపాలెం కూడలిలోని పులే, అంబేడ్కర్ విగ్రహాలవద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐక్య వేదిక నాయకులు మాటూరి శ్రీనివాసరావు, సంఘం ప్రతినిధులు కేబీఆర్ అంబేడ్కర్, బి.జగ్జీవన్‌రామ్, బి.వెంకటరావు, పి.పెద్దిరాజు, పి.పెంటారావు, జి.చింతయ్య, బాలభాస్కరరావు, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాజీ పోరాటం ఆదర్శం

పాతకర్నవానిపాలెం(గాజువాక), న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహరాజ్ పోరాటం యువతరానికి ఆదర్శనీయమని భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గురువారం గాజువాక పార్టీ కార్యాలయంలో వీహెచ్‌పీ, భాజపా ఆధ్వర్యంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నర్సింగరావు మాట్లాడుతూ.. శివాజీ పోరాట యోధుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మద్ది కృష్ణారెడ్డి, శంకరరావు, అప్పారావు, దుర్గాప్రసాద్, ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

శివాజీకి నివాళులర్పిస్తున్న భాజపా కన్వీనర్ నర్సింగరావు, వీహెచ్‌సీ కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో సారె ఊరేగింపు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి డొంకాడ కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ దుర్గమాంబ ఆలయ 25వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారె ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీఎత్తున అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం బాలాజీకి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి ప్రాంగణంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. సుమారు 25 కిలోల బియ్యాన్ని పులిహోరగా చేసి రాశిలా పోసి పూజలు చేపట్టారు. పూజ అనంతరం భక్తులకు ఆ పులిహోరా ప్రసాదంగా పంపిణీ చేశారు. అర్చకులు తిరుప్పావడ సేవ విశిష్టతను భక్తులకు తెలియజేశారు.

తిరుప్పావడ సేవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

22న రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టు ఎంపికను ఈ నెల 22న రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రెండు విభాగాల్లోనూ 65 కేజీల లోపల, 65 కిలోల పైబడి, మాస్టర్స్(పురుషుల) విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్ల వయసు పైబడిన వారికి పోటీలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8885203519 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 9 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. కోర్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తయారీ, బ్యాంకింగ్, ఫార్మా, లాజిస్టిక్స్, సేవారంగాలకు చెందిన సుమారు 70 పరిశ్రమల ప్రతినిధులు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ★ ప్రాంగణ ఎంపికకు వచ్చిన సంస్థలు 4,650 ఖాళీలు ప్రకటించాయి. అభ్యర్థులకు విభిన్న రంగాల్లో ఉపాధి అవకాశాలు లభించాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతిభావంతులైన ఉద్యోగులను ఎంపిక చేసేందుకు జాబ్ మేళా వేదికగా నిలిచిందని విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్లేస్‌మెంట్స్ డీన్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

గ్రంథాలయం.. సమస్యలతో సతమతం

మల్కాపురం, న్యూస్‌టుడే : ఆరు దశాబ్దాల క్రితం హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో ఏర్పాటు చేసిన గాంధీగ్రాం శాఖ గ్రంథాలయం నేడు సమస్యలతో సతమతమవుతోంది. శాఖ గ్రంథాలయం నిర్వహణను అటు షిప్‌యార్డు యాజమాన్యం, ఇటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. దయనీయంగా మారింది.

★ కాలనీలో ఉద్యోగులు, కుటుంబ సభ్యుల సౌకర్యార్థం 1960లో షిప్‌యార్డు యాజమాన్యం క్వార్టర్‌ను కేటాయించగా. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ★ షిప్‌యార్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ గ్రంథాలయాన్ని చక్కగా వినియోగించుకునే వారు. అయితే కాలనీ చాలా వరకు ఖాళీ కావడంతో ప్రస్తుతం గ్రంథాలయానికి ఇక్కడ ఆదరణ తగ్గిందని గ్రంథాలయాధికారి కనకరాజు తెలిపారు.

★ వేలాది విలువైన పుస్తకాలు ఉన్నా వాటిని చదివే పాఠకులు కరవయ్యారు. ఇప్పుడున్న భవనంలో ఆరుగురు కూర్చునేందుకు మాత్రమే చోటు ఉంది. ఎక్కువ మంది వస్తే ఆరుబయట కూర్చొని చదువుకోవాల్సిందే. గ్రంథాలయం భవనం చుట్టూ ఉన్న క్వార్టర్స్ ఖాళీగా ఉండడంతో పాములకు నిలయంగా మారాయి. పుస్తకాలను ఉంచేందుకు అరలు, సరిపడా గదులు లేక గ్రంథాలయం భవనానికి ఎదురుగా ఉన్న క్వార్టర్స్‌లో ఉంచాల్సి వస్తోంది. ఇక్కడ చదువుకునే వారి సంఖ్య తగ్గినందున ఆదరణ ఉన్న ప్రాంతానికి తరలించాల్సిన అవసరం ఉందని స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు.


గాంధీగ్రాం శాఖ గ్రంథాలయ భవనంలో చోటు లేక వేరే క్వార్టర్స్‌లో భద్రపరిచిన విలువైన పుస్తకాలు

గాంధీగ్రాం శాఖ గ్రంథాలయం

రక్తదాన శిబిరం విజయవంతం

గోపాలపట్నం, న్యూస్‌టుడే: పార్లమెంటు మాజీ సభ్యుడు దివంగత పెతకంశెట్టి అప్పల నరసింహం జయంతి సందర్భంగా అప్పల నరసింహం మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా పలు ప్రాంతాలకు చెందిన నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని అప్పలనరసింహం చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ పి.శ్రీనివాసరావు, అపోలో సీఈవో కృష్ణప్రసాద్, కోరమాండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, ఎస్.రాజశేఖర్, పశ్చిమ తెదేపా యువ నాయకులు మౌర్యసింహ, పశ్చిమ వార్డు తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పల నరసింహం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, నాయకులు

జారిపడిపోతున్నా జాలిచూపరే..!

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: గంగవరం పోర్టు అప్రోచ్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. పోర్టు గేటు నుంచి కణితి వై.జంక్షన్ వరకూ దారిని నీటితో తడుపుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. భారీ లోడు వాహనాలు దారికి ఇరువైపులా పార్కు చేయడంతో అటుగా వెళ్లాలంటేనే గుండెలు అరచేత్తో పట్టుకుంటున్నారు. ఇటీవల సమీప నివాసితులు దారిలో పార్కుచేసిన వాహనాల టైర్లకు గాలి తీసేశారు. అయినా దుమ్ము, ధూళి ఆగడం లేదని, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జారిపడిన వాహనం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లోని శ్రీ శిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయినాథునికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. స్థానిక వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం కళా సేవా పీఠం ఆధ్వర్యంలో సంఘ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 91వ వార్డు ప్రశాంత్‌నగర్‌లోని శిర్డీసాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నవితరణ చేపట్టారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.సోములు, గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, జి.రామదాసు, శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

మూసేస్తే ఇలా.. మురుగు పారేదెలా..?

ఫోకస్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: మురుగు ప్రవహించాల్సిన కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ వాడుక నీరు జామై మురుగుపారుదల వ్యవస్థకు ఆటంకం కలిగిస్తోంది. ఈ పరిస్థితి గాజువాక 66వ వార్డులోని పలు కాలనీల్లో కనిపిస్తోంది. జనావాసాల మీదుగా వెళ్లే డ్రైన్లను కలుపుకొని అనేకమంది పక్కా నిర్మాణాలు సాగించారు. 3, 5 అడుగుల వెడల్పు కాలువలు సైతం రెండడుగులుగా మారిపోయాయి. దీంతో రోజువారీ శుభ్రత పనులకు ఆటంకం కలుగుతోంది. మురుగు ప్రవాహానికి వీలుగా డ్రైన్లను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

కాలువ తీరిదీ

WANTED TEACHERS
SRISHTI WORLD SCHOOL
(CBSE AFFILIATION No - 130520)
(A Leader for Excellence in Education)
SECTOR-XI, UKKUNAGARAM, VISAKHAPATNAM
MOTHER TEACHERS, PRE-PRIMARY, PRIMARY & HIGH SCHOOL
(TRAINED TEACHERS with B.Ed)
❖ FOR ALL SUBJECTS (Eng, Tel, Hin, Math, Sci, Soc, Sanskrit)
❖ For GK & CURRENT AFFAIRS, Computers (Robotics/ Artificial Intelligence/ Coding)
❖ For IIT, Spoken English, Story Tellers and Vocal Music (Classical & Western)
❖ Trained P.E.Ts with B.P.Ed/ M.P.Ed/ NCC ('C' Cert holders)& Admin Co-ordinators
❖ Career Counselor ❖ Psychology Counselor
❖ Soft Skills Trainer ❖ Skill Educator
NOTE: Family Accommodation is available for deserving candidates.
Walk-in-Interview: 21st Feb 2026 onwards (Except Sundays)
❖ Share your resume to mail id: hr.srishtiworldschool@gmail.com or
9391188874 or 8341122949 or 9652947708
(WHATSAPP NUMBERS)

(c) eenadu

అశోక్ గజపతిరాజుకు స్వాగతం

పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు గురువారం జిల్లాకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కంటోన్మెంట్‌లోని తన బంగ్లాకు చేరుకున్నారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పలువురు నాయకులు, అభిమానులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెదేపా నాయకులు సువ్వాడ రవిశేఖర్, ప్రసాదుల వరప్రసాద్, ఐవీపీరాజు, విజ్జపు ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయకుమార్, కోండ్రు శ్రీనివాసరావు, కుటుంబరావు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యు. మాణిక్యం నాయుడు తెలిపారు. ఈనెల 23 నుంచి మార్చి 31 వరకు www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125, ఓసీ, బీసీ వారు రూ.200 రుసుము చెల్లించాలని, పూర్తి వివరాలకు సంబంధిత పాఠశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలని సూచించారు.

అన్నదాతకు విశిష్ట గుర్తింపు

11 నంబర్లతో కూడిన కార్డులు జారీ

న్యూస్‌టుడే– గరివిడి, విజయనగరం వ్యవసాయ విభాగం

ఆధార్ తరహాలోనే రైతులకు 11 నంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భవిష్యత్తులో ప్రభుత్వాలు అమలుచేసే వ్యవసాయ సంబంధిత పథకాలకు ఈ కార్డులనే ప్రామాణికంగా తీసుకోనున్నారు. భూమి ఉండి పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతూ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకోవాలి. సొంత భూములున్నవారితో పాటు కౌలు, ఇనాం, డీపట్టా భూముల్లో సాగుచేసేవారూ ఈ కార్డులు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. అన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని వ్యవసాయాధికారి వీటీ రామారావు చెప్పారు.

గజపతినగరం మండలం శ్రీరంగరాజపురంలో నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

జిల్లాలో దాదాపు 80 శాతానికి పైగా ఇప్పటికే నమోదు జరిగింది. ఇంకా 53 వేల మందివరకు నమోదు కావాల్సి ఉంది. వీరిలో ఎక్కువగా మృతిచెందినవారు, శాశ్వతంగా వలసలు వెళ్లిన వారు, గతంలో భూములు లేకుండా పథకాల సాయం పొందినవారు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. కొంతమంది రైతుల ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం కాకపోవడం, రీసర్వే గ్రామాల్లో పరిష్కారం కాని ఎల్‌పీఎం నంబర్ల సమస్యలు నమోదుకు ప్రతిబంధకమవుతున్నాయి.

నమోదు ఇలా..

రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నంబరు, ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరు వివరాలను రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలి.

పథకాలకు ప్రామాణికం

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఎరువులు, విత్తనాల రాయితీ, పంటల బీమా, వ్యవసాయ రుణాలు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు ఇలా అన్నింటికీ విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి కానుంది.

జిల్లాలో మొత్తం రైతులు: 2,83,517 | విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదైనవారు: 2,30,152

మహిళల పండగ.. మెప్మా తోడుగా

● పథకాలతో వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా 'ఒక కుటుంబానికి.. ఒక వ్యాపారవేత్త' నినాదంతో ముందుకెళుతోంది. ఈ సంకల్పాన్ని పట్టణ ప్రాంతాల్లో పండగలా నిర్వహించాలని భావిస్తోంది. ఈ మేరకు మెప్మా ఆధ్వర్యంలో వివిధ పథకాలను అమలు చేస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తోంది. బ్యాంకు లింకేజీ, జీవనోపాధులు, పీఎం స్వానిధి, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, ముద్ర యోజన, ఎంఎస్‌ఎంఈ, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాంలను దరి చేరుస్తోంది.

యూనిట్లలో కొన్ని..

60 రకాల యూనిట్లు ఉన్నాయి. కొత్తగా ఛాయ్ రస్తా, ఈజీ మార్ట్, స్మార్ట్ స్త్రీ, అరకు కాఫీ, ఫుడ్ కియోస్క్, ఫిష్ రేరింగ్ యూనిట్, కోనసీమ కోయర్, రోబోటిక్, ర్యాపిడో, ఎగ్ కార్ట్, హోమ్ డెకరేషన్, హెర్బల్, ఆర్టిఫిషియల్ జ్యూయలరీ, డిజీ లక్ష్మి.. తదితరాలను తీసుకొచ్చారు. వీటితో నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది.

అధికారిక వెబ్‌సైట్ ద్వారా..

లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్(ఎల్‌హెచ్‌పీ సెల్) ద్వారా వ్యాపారవేత్తలను తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్లలో 8,419 సంఘాలు ఉండగా.. 90,556 మంది సభ్యులు కొనసాగుతున్నారు. వీరికి జీవనోపాధులు కల్పించేందుకు ఒక్కో ఆర్పీకి నాలుగు యూనిట్ల చొప్పున లక్ష్యం విధించారు. ఇప్పటివరకు 1304 దరఖాస్తులు రాగా.. 617 మంది ఏర్పాటుకు అడుగులు వేశారు. ఇప్పటికే 319 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి. కొత్తవారు https://www.apmepma.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చు. 18- 55 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

పట్టణాల వారీగా రుణం(రూ.కోట్లలో)

ప్రాంతం	సంఘాలు	నగదు
విజయనగరం	1,349	178.87
బొబ్బిలి	452	52.64
నెల్లిమర్ల	137	15.62
రాజాం	279	35.67

లక్ష్యానికి మించి..

● ఈ ఆర్థిక ఏడాదిలో 2,750 మందికి రూ.275 కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలు అందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 2,217 సంఘాలకు రూ.282.50 కోట్లు అందించారు.

వినూత్న కార్యక్రమాలు..

స్పెషల్ ప్రాజెక్ట్స్ ద్వారా వ్యాపారాభివృద్ధికి అధికారులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా తొలుత ర్యాపిడో సంస్థ ఆధ్వర్యంలో చోదకంలో అనుభవం గల మహిళలకు వాహనాలు కేటాయించాలని భావించారు. జిల్లా లక్ష్యం 108 యూనిట్లు. ఆసక్తిగలవారు ముందుకొస్తే అవకాశం కల్పించారు. ఈ-ఆటో, ఈ-బైక్‌లను వినియోగించవచ్చు. కొన్ని నెలల పాటు ప్లాట్‌ఫారం ఛార్జీలను మినహాయిస్తారు. అవసరం మేరకు రుణ సదుపాయం కల్పిస్తారు. విజయనగరంలోని కార్యాలయాన్ని సంప్రదిస్తే మరిన్ని పథకాల గురించి తెలియజేస్తామని మెప్మా పీడీ చిట్టిరాజు తెలిపారు

ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో వసతులు కల్పించండి

పారిశ్రామిక పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తదితరులు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పారిశ్రామిక పార్కుల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. విజయనగరం మండలం కొండకరకాంలో ప్రతిపాదిత ఎంఎస్‌ఎంఈ పార్కు స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. రిజిస్టర్ అయిన సంస్థలకు త్వరితగతిన భూములు కేటాయించాలన్నారు. స్థలాల అప్పగింత పూర్తయ్యాక రోడ్లు, కాలువలు, విద్యుత్తు, తాగునీరు తదితర పనులు చేపట్టాలన్నారు. ఆర్డీవో దాట్ల కీర్తి, ఏపీఐఐసీ జీఎం ఎం.మురళీమోహనరావు, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి కరుణాకర్, తహసీల్దారు కూర్మనాథరావు, సర్వేయరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, సీవీవీ, పాస్‌వర్డులు.. తదితర వాటిని ఎవరికీ చెప్పొద్దన్నారు. ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ చలానాల పేరుతో లింకులు, ఏపీకే ఫైల్స్ పంపి అమాయకుల నుంచి నేరగాళ్లు దోచుకుంటున్నారని చెప్పారు. పోలీసుశాఖ అలాంటివి పంపదని గుర్తు చేశారు. అనుమానాస్పద లింకులను తెరవద్దన్నారు. అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లను మాత్రమే వినియోగించాలని కోరారు. సమస్యలుంటే 100/112, 1930 లేదా www.cybercrime.gov.in ను సంప్రదించాలన్నారు.

భవన నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

ప్రిన్సిపల్ దేవీ మాధవి, కళాశాల వర్గాలతో సమావేశమైన నాబార్డు జీఎం ప్రసాద్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో భవనాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని నాబార్డు జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ వైద్యాధికారులను సూచించారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వైద్యులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రిన్సిపల్ దేవీ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: తితిదే మాజీ ఈవో, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం గురువారం విజయనగరంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును కలిశారు. అతని వెంట ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, అఖిల భారత హిందూ మహాసభ గౌరవ అధ్యక్షుడు జీవీఆర్ శాస్త్రి ఉన్నారు. వీరిద్దరూ కలవడం వెనకున్న కారణాలు బయటకు రాలేదు. వైకాపా హయాంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సుబ్రహ్మణ్యం ఇక్కడకు రావడంపై చర్చ జరుగుతోంది.

కోదండరాముని విగ్రహం పరిశీలన

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో గతంలో ధ్వంసమైన కోదండరాముని విగ్రహాన్ని వీరు గురువారం పరిశీలించారు. నీలాచలం కొండపైన ఉన్న కోదండరాముని ఆలయాన్ని దర్శించుకున్నారు.

WALK-IN-INTERVIEW

పేరం గ్రూప్ Peram Group

PERAM GROUP EXPANDING THEIR NEW BRANCHES IN VIZAG, VIZIANAGARAM & SRIKAKULAM, ORISSA - REQUIRES YOUNG, DYNAMIC & REAL ESTATE EXPERIENCED PERSONS FOR THE FOLLOWING POSTS.

❖ADVOCATES	6 No's (2-3 yrs. exp)
❖OPERATIONAL HEADS	10 No's (5-10 yrs. exp)
❖ACCOUNTANTS	4 No's (3-6 yrs. exp)
❖ADMINS	8 No's (1-5 yrs. exp)
❖DOCUMENT WRITERS	5 No's (5-10 yrs. exp)
❖STENOGRAPHER	4 No's (3-5 yrs. exp)
❖MOTIVATOR / CORPORATE CERTIFIED TRAINERS	2 No's (3+ yrs. exp)
❖DIGITAL(GRAPHIC DESINGER)	4 No's (2+ yrs. exp)
❖MIS LEAD (FOR TASK TRACKER)	4 No's (2-3 yrs. exp)
❖VIDEO EDITOR (REELS / SHORTS)	4 No's (2+ yrs. exp)
❖FLOOR MANAGER / LOBBY MANAGER	3 No's (3+ yrs. exp)
❖EVENT MANAGER	2 No's (2+ yrs. exp)
❖VEHICLE INCHARGE	2 No's (3+ yrs. exp)
❖DRIVERS (FOR PREMIUM CARS)	4 No's (3+ yrs. exp)
❖PA / PS - LADIES AND GENTS	10 No's (2-3 yrs. exp)
❖PROJECT MANAGER	5 No's (4-8 yrs. exp)
❖JUNIOR ENGINEER	10 No's (2-3 yrs. exp)
❖SENIOR ENGINEER	4 No's (5-10 yrs. exp)
❖SURVEYORS	2 No's (2-3 yrs. exp)
❖LAND PROCUREMENT OFFICER	4 No's (3-5 yrs. exp)
❖LAND PROTECTION OFFICER (RETIRED CI,SI)	1 No's (5-10 yrs. exp)
❖CRM (REAL ESTATE EXPERINCE)	2 No's (3+ yrs. exp)
❖BUSINESS DEVELOPMENT OFFICER (TARGET BASED)	10 No's (5-10 yrs. exp)
❖MARKETING TEAMS	30 TEAMS (5-10 yrs. exp)
❖ESTATE OFFICERS	5 No's (5-10 yrs. exp)
❖CHANNEL PARTNERS	50 TEAMS (0-1 yrs. exp)

Interviews on 20th, 21st, 22nd, 23rd, 24th. Feb. 2026 (10 AM to 5.30 PM)

D.NO. 9-29-19/A, FLAT NO. 101, WALTAIR HEIGHTS, OPP: CANARA BANK, SIRIPURAM, BALAJI NAGAR, VIP ROAD, VISAKHAPATNAM. CELL: 8143596892, 8125366969

బొబ్బిలి శివార్లలో గుప్పుమన్న గంజాయి

జూనియర్లకు విక్రయిస్తున్న సీనియర్లు

పోలీసుల అదుపులో 11 మంది?

ఈనాడు, విజయనగరం, బొబ్బిలి, బొబ్బిలి గ్రామీణం

గంజాయి అక్రమార్కులపై పోలీసులు ఉక్కుపాదం మోపినా, గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడ విక్రయిస్తున్నారు. ప్రత్యేక నిఘాతో సమాచారం సేకరిస్తున్న పోలీసులకు బొబ్బిలి పట్టణానికి అయిదు కిలోమీటర్ల దూరంలోని గంజాయి ముఠా గురువారం సాయంత్రం చిక్కింది. పలు ప్రాంతాలకు చెందిన కొందరు సీనియర్లు.. జూనియర్ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు ఉప్పందింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..

బొబ్బిలి గ్రామీణ మండలం ఓ గ్రామం వద్ద మూడు విద్యా సంస్థల్లో విద్యార్థులు చదువుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన గరివిడి, రాజాంకు చెందిన కొందరు సీనియర్ విద్యార్థులు ఒడిశా నుంచి రైలులో గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. వీరి వద్ద కొనుగోలు చేసినవారు విద్యాసంస్థల వెనుక ఉన్న లేఅవుట్లలో వినియోగిస్తున్నారు. బొబ్బిలి పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేశారు.

నాలుగు కేజీల స్వాధీనం

సరకు విక్రయిస్తున్న నలుగురి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద కొనుగోలు చేసి గంజాయి తాగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 11 మందిని పోలీసులు విచారిస్తున్నారు. వీరు ఏఏ ప్రాంతాలకు చెందినవారో ఆరా తీస్తున్నారు.

లింకులు ఛేదించే ప్రయత్నం

రాయగడ నుంచి బొబ్బిలిలోని విద్యార్థులకు గంజాయి సరఫరా చేసే ముఠాకు ఉన్న లింకులు తెలుసుకునే ప్రయత్నంలో పోలీసు అధికారులు ఉన్నారు. వీరి వెనుక కీలక సూత్రధారి కోసం జల్లెడ పడుతున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో విద్యా సంస్థల్లో విద్యార్థులకూ సరఫరా చేస్తున్నారా.. అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.

డొంక కదిలిందిలా..

15 రోజుల కిందట బొబ్బిలి ప్రాంతంలో ఓ యువకుడు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఆ యువకుడి సమాచారం మేరకు పోలీసులు కీలక వ్యక్తులను పట్టుకున్నారు. మరింత సమచారం వచ్చాక వివరాలు వెల్లడిస్తామని సీఐ నారాయణరావు తెలిపారు.



పక్కాగా పర్యవేక్షణ.. పారదర్శకంగా పరీక్షలు

న్యూస్‌టుడే, రేగిడి, రాజాం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సంబంధించి పర్యవేక్షకుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా పాఠ్యాంశ నిపుణులు, 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఏకోపాధ్యాయ పాఠశాలలోని ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతల నుంచి మినహాయించారు. ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ స్వయంగా నియామకాలు చేపడుతోంది. మార్చి 1వ తేదీ నాటికి నియామకాలు పూర్తి కానున్నట్లు చెబుతున్నారు.

గతంలో ఇలా..

గతంలో మండల విద్యాశాఖ ద్వారా పర్యవేక్షకుల జాబితా ఉపవిద్యాశాఖాధికారికి పంపేవారు. పరీక్షా కేంద్రానికి 8 కిలోమీటర్ల లోపు ఉండే పాఠశాలల నుంచి వీరిని ఎంపిక చేసేవారు. ఆ వివరాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అనుమతి మేరకు నియామక ఉత్తర్వులు ఇచ్చేవారు. ఇందులో సిఫార్సులకు కొంతమేర అవకాశం ఉండేది. ఈ విధానానికి స్వస్తి పలికేందుకు మార్పులు తెచ్చారు. లీప్ యాప్ ద్వారా పొందుపర్చిన వివరాల ప్రకారం జాబితాలు రూపొందించి నేరుగా ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

సౌకర్యాలపై ఆరా..

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు మండలాల పరిధిలోని కేంద్రాలను పరిశీలిస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు ఇలా కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నదీ లేనిదీ ఆరా తీస్తున్నారు. పరీక్షల సమయానికి సౌకర్యాలన్నీ ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

యాప్‌లోనే నియామక ఉత్తర్వులు..

లీప్ యాప్ ద్వారానే పర్యవేక్షకుల నియామకం జరుగుతోంది. నియమించిన వారికి నేరుగా లీప్ యాప్‌లోనే పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఉంచుతుంది. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ముందుగానే చర్యలు తీసుకుంటున్నాం.

– సన్యాసిరాజు, జిల్లా పరీక్షల నిర్వహణాధికారి

విజయనగరం జిల్లా: ధర్మాన టివిఎస్, విజయనగరం: 9014143226 | పవన్ శేఖర్ టివిఎస్, విజయనగరం: 7780241677 | శ్రీనివాస ఆటోమొబైల్స్, పార్వతీపురం : 9848433017 | అమృతవర్షిణి ఆటోమొబైల్స్, ఎస్ కోటా: 9246671219 | గాయత్రి మోటర్స్, బొబ్బిలి: 9440193098 | పద్మశ్రీ ఆటోమొబైల్స్, సాలూరు: 9010614619 | వినాయక ఆటోమొబైల్స్, గజపతినగరం: 9949278793 | వెంకట సాయి ఏజెన్సీస్, పూసపాటి రేగ: 9392542348 | ధర్మాన టివిఎస్, రాజం 9010074740 | లీలా సాయి మోటార్స్, చీపురుపల్లి : 8639015726 | ధర్మశాస్తా ఆటోమొబైల్స్, రామభద్రపురం: 7702774907.

(c) eenadu

సన్యాసేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.17.31లక్షలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం శివారు సన్యాసేశ్వరస్వామి ఆలయానికి మహాశివరాత్రి జాతర సందర్భంగా రూ.17,31,428 ఆదాయం లభించిందని ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. గురువారం లెక్కించగా హుండీ ద్వారా రూ.7,56,515, ప్రత్యేక దర్శనాలు ద్వారా రూ.1,86,600 వచ్చిందన్నారు. 2024-25లో రూ.15,55,422 రాగా, ఈ ఏడాది ఆదాయం పెరిగిందన్నారు.

ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

జాతీయ జెండాతో విద్యార్థినులు

వార్షికోత్సవ సందడి

బొక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకులం వార్షికోత్సవాలు గురువారం సందడిగా సాగాయి. విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల కళల సమ్మేళనం, ఏరోబిక్స్, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఎంఈవో ఎన్.నాగభూషణరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, వేపాడ

వెయిట్‌లిఫ్టింగ్‌లో మనోళ్ల సత్తా

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో వల్లూరి సుస్మిత సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకుంది. స్నాచ్ 86 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 106 కిలోలు బరువులెత్తి విజేతగా నిలిచింది. బీ గరికిపేట గ్రామానికి చెందిన బెల్లాన నాని ఈనెల 3వ తేదీ వరకు భోపాల్‌లో జరిగిన సౌత్ వెస్ట్ ఇంటర్ విశ్వవిద్యాలయ పోటీల్లో స్వర్ణం, పంజాబ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాలతో మెరిసింది. వీరిని డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు గురువారం అభినందించారు.

విజేతలతో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, శిక్షకుడు రవి

పారా అథ్లెట్ రాముకు అభినందన

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: దుబాయ్ వేదికగా ఇటీవల జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించిన విజయనగరానికి చెందిన పైడి రాము గురువారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ భరణి, ఛైర్మన్ రవినాయుడు, పారా అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామును వారు అభినందించారు. త్వరలో జరిగే ఏషియన్ గేమ్స్‌లోనూ సత్తా చాటాలని, అవసరమైన సహకారం అందిస్తామన్నారు. పారా అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న శాప్ ఎండీ భరణి

ఆరోగ్య కేంద్రాలుగా అంగన్‌వాడీలు

– న్యూస్‌టుడే, అయ్యన్నపేట, గరివిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. పోషకాహారం అందించడంతో పాటు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను పక్కాగా అందిస్తోంది. ఇప్పటికే తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిధులు కేటాయించారు. తాజాగా పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. వారికి సకాలంలో ప్రథమ చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా మందుల కిట్లను సరఫరా చేస్తోంది. జిల్లాలో ఉన్న 11 ప్రాజెక్టుల్లో ఏడింటి పరిధిలో పంపిణీ చేశారు. మిగిలిన వాటికి త్వరలోనే అందజేస్తామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.


అందించే మందుల వివరాలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 58,493 మంది ఉన్నారు. 7,093 మంది గర్భిణులు, 6,457 మంది బాలింతలకు సేవలు అందుతున్నాయి. వీరిలో చాలామంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కిట్లను ఇస్తోంది. ఇప్పటికే 7 ప్రాజెక్టుల పరిధిలో 1676 కిట్లు అందించారు. బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, చీపురుపల్లి ప్రాజెక్టులకు అందించాల్సి ఉంది. మరోవైపు ప్రసవ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కార్యకర్తలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

సరఫరా ఇలా..

11 రకాల మందులతో కూడిన కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. పిల్లలకు జ్వరం వస్తే పారాసిటమాల్ సిరప్ అందిస్తారు. గాయాలైతే కాటన్ బ్యాండేజీ, అయోడిన్ ఇస్తారు. కళ్ల ఎర్రబడటం, చెవి పోటు, దురద, మంట, దగ్గు, జలుబు, తెగడం.. తదితర వాటికి సైతం మందులున్నాయి. అత్యవసరమైతే సమీపంలోని పీహెచ్‌సీలకు పంపించే వెసులుబాటు కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కార్పొరేట్ తరహాలో ప్రీస్కూల్ విద్య అందిస్తోంది. దీనిలో భాగంగా ప్రభుత్వం మందుల కిట్లను ఇస్తోంది. ఇవి పూర్తిగా సురక్షితం. కార్యకర్తలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. తక్కువ డోసుతో ఉంటాయి.
– సుజాత, ఇన్‌ఛార్జి పీడీ

పంపిణీ ఇలా..

ప్రాజెక్టు	గంట్యాడ	రాజాం	గరివిడి	భోగాపురం	విజయనగరం	వియ్యంపేట	ఎస్.కోట
కిట్లు	166	339	177	272	317	226	179

ఈనాడు, విజయనగరం

తప్పెవరిది.. ముప్పెవరికి?

డ్రైవింగ్ స్కూళ్లలో కానరాని నిబంధనలు

విజయనగరంలో 15 సంస్థల మూత

ఏదైనా పరీక్ష రాస్తే 100కి కనీసం 35 మార్కులు సంపాదించుకుంటే పాస్ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న వారు నూటికి నూరు మార్కులు సాధించి తీరాలి. లేకుంటే ఉత్తీర్ణత సాధించలేదని లైసెన్స్ జారీ చేయరు. ఈ తిప్పలన్నీ ఎందుకని చాలా మంది డ్రైవింగ్ స్కూల్ యజమానులను, ప్రైవేటు ఏజెంట్లను సంప్రదిస్తున్నారు. వాహనం నడపడం రాకుండానే లైసెన్స్ మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. రెండు జిల్లాల్లో ఈ తంతు సాగుతోంది.

విజయనగరంలో ఖాళీ స్థలం లేని ఓ శిక్షణ పాఠశాల

కనీస వసతులేవీ?

విజయనగరంలో 25, మన్యం జిల్లాలో ప్రైవేటు వ్యక్తులు ఐదు డ్రైవింగ్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. వీటిల్లో 90 శాతానికి పైగా కనీస వసతులు లేవు. ఫీజులు మాత్రం దండిగా వసూలు చేస్తున్నారు. తరగతి గదిలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై చోదకులకు బోధన, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వాహనం నడపడంలో శిక్షణ తప్పనిసరి. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తూ లైసెన్సులు జారీ చేయిస్తున్నారు. దీంతో చివరకు అనుభవం లేని డ్రైవర్లు తయారవుతున్నారు. ఒక్కోసారి కొందరు మృత్యువాత పడుతున్నారు.

నాణ్యమైన శిక్షణ అవసరం

డ్రైవింగ్ స్కూళ్లలో చేరిన వారికి నాణ్యమైన శిక్షణ అవసరం. ఇటీవల తనిఖీలు చేసి కొన్నింటిని మూసివేశాం. అందులో కనీస వసతులు లేవు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత కేంద్రాల కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలి. ఎక్కడైనా వాహనాలు తిరిగినా, అభ్యర్థులను చేర్పించుకున్నా చర్యలు తప్పవు. ఆదేశాలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. – మణికుమార్, రవాణా శాఖ ఉప కమిషనర్, విజయనగరం

అక్రమాలపై కన్ను..

సరైన శిక్షణ ఇవ్వకుండా లైసెన్సులు ఇప్పించడం, నియమాలు పాటించకపోవడం, డ్యుయల్ కంట్రోల్ వాహనాలు లేకపోవడం, వసతులు, అనుభవం ఉన్న శిక్షకులను నియమించకపోవడం.. తదితర అక్రమాలు రవాణా శాఖ అధికారుల దృష్టికి వచ్చాయి. ఇప్పటికే విజయనగరం అధికారులు నిఘా పెట్టారు. చట్ట ప్రకారం కేంద్రాల ముందు బోర్డులు ఉన్నాయా.. అభ్యర్థులకు సరైన తర్ఫీదు అందుతోందా.. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తనిఖీ చేశారు. వాటిపై ఒక్కో పాఠశాలకు మోటారు వాహన నిబంధనలు వర్తింపజేశారు. ఫిర్యాదులు సైతం వస్తుండడంతో నియమాలు పాటించని 15 పాఠశాలల లైసెన్సులు రద్దు చేశారు. మిగిలిన వాటిని కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. మన్యం జిల్లాలో రెండు మూతపడగా, మూడు కొనసాగుతున్నాయి. వాటినీ తనిఖీ చేసి చర్యలు తీసుకునేందుకు ఆ జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు.

జాగ్రత్తలివీ..

- ★ శిక్షణకు చేరే ముందు సదరు పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉందో లేదో తనిఖీ చేయండి
- ★ డ్యుయల్ కంట్రోల్ సిస్టమ్ ఉన్న వాహనాలనే ఆశ్రయించాలి
- ★ శిక్షణ సమయాలు, ఫీజుల వివరాలు ముందుగా తెలుసుకోవాలి
- ★ సిబ్బంది సక్రమంగా స్పందించకపోయినా, అదనంగా డిమాండు చేసినా రవాణా శాఖాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు

సీఆర్టీలను క్రమబద్ధీకరించాలి

నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న తేజోవతి

గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, న్యూస్‌టుడే: సీఆర్టీల అర్హతను పరిగణనలోకి తీసుకుని సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నాయక్‌కు గురువారం అమరావతిలో విన్నవించినట్లు గిరిజన సలహా మండలి సభ్యులు, తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతి చెప్పారు. 209 మంది ఒప్పంద ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించినా.. మరో 56 మందివి పెండింగులో ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తోటపల్లి సమస్యలు


సీఎంకు సమస్యలు వివరిస్తున్న కళా

గరివిడి, న్యూస్‌టుడే: జిల్లాలో తోటపల్లి కాలువలో పూడికలు తీయడానికి రూ.20 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రిని గురువారం అసెంబ్లీ హాలులో కలిసి పలు సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. గత వైకాపా హయాంలో జిల్లాలో తెదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

భక్త జనం మెచ్చేలా.. జాతర ఏర్పాట్లు

న్యూస్‌టుడే– రాజాం: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నందున కీలక శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సమీక్షించి పలు సూచనలు చేశారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ అశోక్‌కుమార్, పురపాలిక కమిషనర్ రామచంద్రరావు, రాజాం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.హరిబాబు, ఈపీడీసీఎల్ ఏఈ కుమార్ వివరాలను వెల్లడించారు.

నియంత్రిక ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రత్యేక పనులు..

శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతారు. ఇందుకు 45 మంది సిబ్బందిని అదనంగా నియమించారు. తాగునీటి సమస్యలు లేకుండా రెండు నీటి ట్యాంకులను నిరంతరం అందుబాటులో ఉంచుతారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కీలక రహదారుల్లో పనికిరాని మొక్కలు తొలగిస్తున్నారు. రాజాం ప్రభుత్వాసుపత్రిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ఇప్పటికే అందులో పనిచేసే వైద్యులెవరూ సెలవులు పెట్టడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చారు. ప్రత్యేక అంబులెన్స్‌ను ఆలయం వద్ద ఉంచుతారు. కిలోమీటరు మేర విద్యుత్తు అలంకరణ చేపడుతుండడంతో లోడ్‌ను తట్టుకునేలా ఏడు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు..

బొబ్బిలి రహదారి నుంచి చీపురుపల్లి, విజయనగరం, విశాఖ వెళ్లే బస్సులను చీకటిపేట కూడలి వద్ద జీసీపల్లి రహదారిలో మళ్లిస్తారు. బొబ్బిలి నుంచి పాలకొండ వెళ్లాల్సిన వాహనాలను పాలకొండ రోడ్డుకు మళ్లిస్తారు. ఇంటర్ పరీక్షల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. బొబ్బిలి రహదారి నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలను చీపురుపల్లి- రాజాం రోడ్డుకు మళ్లిస్తారు. 300 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం కేటాయించాలని స్థానిక అధికారులు కోరారు.

21న జిల్లాకు పి.విక్రమ్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ పి.విక్రమ్ జిల్లాలో పర్యటించనున్నారని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమితి ఆధ్వర్యంలో విజయనగరంలోని గీతాంజలి పాఠశాలలో జరిగే వేడుకల్లో పాల్గొంటారన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.

E.P. No.28/2025 in O.S.No.8/2023

Between:
G.Seshagiri Rao ...Decree Holder
And:
Boddu Ramu ... Judgment Debtor

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో Decree Holder అమలు సొమ్ము తదుపరి వడ్డీ మరియు ఖర్చులు Judgment Debtor నుండి వసూలు చేయు నిమిత్తం ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది: 09-03-2026న ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల లోపు పై కోర్టులో ఉదయం 10.30 గం॥లకు హాజరై పాడుకొనవలెను.

Petition Schedule Property

District: Vizianagaram, Sub Registrar: Vizianagaram, Mandal: Bondapalli, Village: Kothapalem.

Item No.1: Khata No. 467, Survey No. 30/2, measuring extent of Ac. 2.77 cents of dry land bounded by:
East: Ralla Gedda, West: Reserve Forest, North: Cart Way, South: Ch. Apparao & Ch. Rama Swamy's Dry Land.

Item No.2: Khata No. 471, Survey No. 30/1/B measuring extent of Ac. 2.77 cents of dry land bounded by:
East: Ralla Gedda, West: Reserve Forest, North: Cartway, South: Ch. Apparao & Ch. Rama Swamy's dry land.

Amin Value: Rs.40,16,500-00
Market Value: Rs.72,50,000-00
DHR Value: Rs.40,79,633-00
(By order of the Court)

CHINTAPALLI APPARAO, Advocate for Decree Holder, Vizianagaram, 9348222390.

ఉషాశ్రీని సన్మానిస్తున్న కళాశాల నిర్వాహకులు

క్రీడలతో మానసికోల్లాసం

డెంకాడ, న్యూస్‌టుడే: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పెద్దిశెట్టి ఉషాశ్రీ అన్నారు. గురువారం జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ముఖ్యమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వీవీ రామారెడ్డి, కార్యదర్శి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు ఆమెను శాలువతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ టి.హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వే పైవంతెన నిర్మాణ స్థలంపై గ్రామసభ

గజపతినగరం, న్యూస్‌టుడే: రైల్వేగేటును మూసివేసి, వంతెన నిర్మాణానికి స్థలాల పరిస్థితిపై ఆర్డీవో రామ్మోహనరావు పురిటిపెంట పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కాంప్లెక్సు నుంచి నేరుగా ప్రస్తుతమున్న మెంటాడ రోడ్డును కలిపేలా వంతెన నిర్మించేందుకు రైల్వే అధికారులు ప్రతిపాదించారన్నారు. దిగువ వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, ఆ ప్రతిపాదన ఉందని రైల్వే అధికారులు తెలిపారు. సర్వీసు రోడ్లు, పైవంతెన పక్కన కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉపసర్పంచి సురేష్, బంగారునాయుడు, రీసర్వే డీటీ జోగినాయుడు, రైల్వే ఇంజినీరింగు అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

VZM JNTU Jn. towards RK township Nr. Orissa Daba, E/F, 222 Sq.Y. (33.3x60) 3B/R Individual House for sale. Full residential area & vastu ✆: 9703116256.

TO LET

COMMERCIAL

VZM Town Siddarthanagar GST Office Opposite, Ground floor 2100 Sft suitable Banks, Office near RTC Complex road ✆ 9701129889, 9100994599.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ
SUBHAGRUHA
ఉద్యోగావకాశాలు
SALARY + INCENTIVES
8106863499
9010988707

HDFC ఫైనాన్సియల్ కన్సల్టెంట్స్ కావలెను. 10 to డిగ్రీ, జీతం 15-30k, Age: 25-55y, విజయనగరం జిల్లా అంతటా పని చేయాలి ✆: 8919867018.

MNC కంపెనీలో కాంట్రాక్టర్ల వద్ద B.టెక్, Dip., ITI, డిగ్రీ ఇంజనీర్స్, సూపర్‌వైజర్స్, స్టోర్స్, సిస్టం ఆపరేటర్స్, టెలికాలర్స్, Asst., ✆ 8341177761.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

FACULTY/ TEACHERS

గాజువాక విశాఖడిఫెన్స్ అకాడమీలో హాస్టల్లో ఉండి పనిచేయుటకు Physical Education Teacher కావలెను. జీ:10K+ ఫుడ్& అకామిడేషన్. 9848577745, 9666694545

SECURITY GUARDS

వైజాగ్ సిటీ, శ్రీకాకుళం, విజయనగరంలో పనికొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్, భోజనం కలదు. PF, ESI. జీతం 20 వేలు, 30 వేలు. 6300071128

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

బాలసాదు పేరంటాల తీర్థం

మహోత్సవంలో మహిళల కోలాటం

పెదమజ్జిపాలెం(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని మదనాపురం బాలసాదు సన్యాసమ్మ తీర్థమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లబండి, గుర్రం పరుగు, కబడ్డీ పోటీలు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. ఎస్సై సాయికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

22న రుషింగిలో కోలాటం పోటీలు

వంగర, న్యూస్‌టుడే: మండలంలోని రుషింగిలో దుర్గా షిరిడిసాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మురళీకృష్ణ తెలిపారు. వివరాలకు 83094 87836కు సంప్రదించాలన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వేర్వేరుచోట్ల చోరీలు.. 13 తులాల బంగారం మాయం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని తోటపాలెంలో చోరీ జరిగింది. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్సై సురేంద్రనాయుడు వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే సీహెచ్ పైడితల్లి(64) ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటలకు వంగర మండలం సంగాం దేవాలయానికి వెళ్లారు. 18న తిరిగి వచ్చి చూడగా. . బీరువాలో ఆరు తులాల బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తలుపులు వేసినట్లే ఉన్నాయని, ఇంటి వెనుకవైపు ఉన్న కిటికీ నుంచి దొంగ లోపలకు ప్రవేశించి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆలస్యంగా వెలుగులోకి..

నగరంలోని ఉడాకాలనీ ఫేజ్-1లో నివాసం ఉంటున్న జి.సంధ్యారాణి గతేడాది డిసెంబరు 12న బంగారు ఆభరణాలు ధరించి ఓ శుభకార్యానికి వెళ్లారు. ఆరోజే ఇంటికి తిరిగొచ్చి వాటిని బీరువాలో భద్రపరిచారు. గతనెల 14న చూసేసరికి ఏడు తులాల బంగారం మాయమైంది. దగ్గర బంధువులకు చెందిన ఓ బాలుడిపై అనుమానం రావడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అనుమానితుడు ఎంతకీ స్పందించకపోవడంతో ఎట్టకేలకు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.

మహిళ మృతికి కారణమైన కారు గుర్తింపు

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖపట్నం-అరకు జాతీయ రహదారిపై దేశపాత్రునిపాలెం కూడలి వద్ద ఈనెల 2న రాత్రి గోకాడ పద్మ(55)ను ఢీకొని ఆమె మృతికి కారణమైన కారును సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించామని సీఐ సీహెచ్.షణ్ముఖరావు గురువారం తెలిపారు. ఆరోజు రాత్రి 10 గంటల సమయంలో పాలకేంద్రం మూసేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ నేరానికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టుకు చెందిన కారు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థినులతో ఆకతాయిల అసభ్య ప్రవర్తన

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినులతో ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. మండలంలోని కోమటిపల్లి సమీపంలో కళాశాలకు చెందిన విద్యార్థినులు అద్దింట్లో ఉంటూ చదువుకుంటున్నారు. బుధవారం కళాశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో నలుగురు వ్యక్తులు అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందికి గురి చేశారు. అధ్యాపకులకు విషయం చెప్పడంతో వారు ప్రశ్నించగా ఆకతాయిలు గొడవకు దిగారు. దీంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. గతంలోనూ ఇటువంటి ఘటనలు జరిగేవన్నారు. దీనిపై సీఐ నారాయణరావును అడగ్గా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: భార్య మందలించిందన్న కారణంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్సై అశోక్‌కుమార్ వివరాల ప్రకారం. . గాంధీనగర్‌కు చెందిన బెవర శ్రీనివాస్(28) రోజు కూలీ. ఓ మాంసం దుకాణంలో పనిచేసేవాడు. ఆయనకు భార్య రేవతి, ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్య మందలించడంతో గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీనివాస్ (పాతచిత్రం)

ఆక్రమించుకుంటున్నా పట్టించుకోరా?

బొబ్బిలి, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తులకు రుసుములు వసూలు చేసేందుకు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి ఎదురుగా గతంలో రూ.2 లక్షలతో షెడ్డు నిర్మించి చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. దీని వెనుక స్థలం కొనుగోలు చేసిన ఓ వ్యక్తి షెడ్డును ఆక్రమించుకున్నారు. గురువారం మార్కెట్ కమిటీ సిబ్బందికి తెలియకుండానే తాళాలు తెరిచి అందులో ఉన్న ఫర్నిచర్, ఇతర దస్త్రాలను మూలన పడేసి, షెడ్డు సుందరీకరణ పనులు చేపట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై మార్కెట్ కమిటీ కార్యదర్శి-2 ఈశ్వరరావు మాట్లాడుతూ వేరే చోట షెడ్డు నిర్మిస్తామని ఆయన చెప్పారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సైక్లిస్టు వందనకు ఎంపీ సత్కారం

మియాపూర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రముఖ సైక్లిస్ట్ వందనను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. ఇటీవల ఆమె ప్రతిష్ఠాత్మక రేస్ అక్రాస్ అమెరికాకు ఎంపికైంది. ఈ నేపథ్యంలోని ఈటీవీ, ఈనాడు వసుంధరలో ఆమె సైక్లిస్ట్‌గా సాధించిన విజయాల గురించి వచ్చిన కథనాన్ని చదివిన ఎంపీ.. నగరంలోని మదీనాగూడలో ఉంటున్న ఆమె ఇంటికి వచ్చారు. వందనను, ఆమె భర్త నితిన్‌ను సత్కరించారు. త్వరలోనే వందనను రాష్ట్రపతి వద్దకు తీసుకువెళ్తానని పేర్కొన్నార

(c) eenadu

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

చరిత్రలో నిలిచేలా పైడితల్లి ఉత్సవం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం, న్యూస్‌టుడే: పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి జాతర చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనాలు ఉన్నందున, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలం నుంచి మూడు కమిటీలను ఏర్పాటు చేసి సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినందున ఖర్చుల పారదర్శకంగా ఉండాలన్నారు. తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గురువాన నారాయణరావు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు కె.అప్పలనాయుడు, నాయకులు డి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు, కమిషనర్ ఎ.రామచంద్రరావు, ఈవో మాధవరావు పాల్గొన్నారు. ✦ రాజాం గ్రామీణం: పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే మురళీ మోహన్ గురువారం దర్శించుకున్నారు. జాతరను రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించిన జీవో కాపీని అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త దుర్గా ప్రసాద్ ఉన్నారు.

ప్రతి మహిళా ఘటాలు మోసేలా చర్యలు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మేజర్ పంచాయతీలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో చిన్నమ్మతల్లి పండగ నేపథ్యంలో గురువారం రాత్రి సర్పంచి ఈశ్వరరావు, ఉప సర్పంచి రామకృష్ణ, కమిటీ సభ్యులతో సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రసాదరావు సమావేశం నిర్వహించారు. ప్రతి మహిళా ఘటాలు మోసేలా చర్యలు తీసుకుంటామన్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ పెద్ద రామకృష్ణ, సభ్యులు సన్యాసినాయుడు, చిన్నమ్మతల్లి, రమేష్, నూకంనాయుడు తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ జాతరలో పటిష్ఠ బందోబస్తు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ లక్ష్మణరావు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గంట్యాడ గ్రామంలో ఈనెల 24న ఎల్లమ్మతల్లి జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. జాతరలో ఎటువంటి సమస్యలు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సై సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం సొంతం

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

చీపురుపల్లి గ్రామీణం, గరివిడి, న్యూస్‌టుడే: ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని డీఈవో మాణిక్యంనాయుడు అన్నారు. చీపురుపల్లి మండలం మెట్టపల్లి పీఎంశ్రీ జడ్పీ ఉన్నత, గరివిడి మండలం కొండపాలెం ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవో-2 విజయకుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఖాళీ జాగా.. దోమల పాగా

రాజాం పట్టణం పరిధిలో..	
వార్డులు	- 24
సచివాలయాలు	- 11
జనాభా	- 48,000
మురికివాడలు	- 20
పారిశుద్ధ్య సిబ్బంది	- 64

రాజాం పట్టణం, న్యూస్‌టుడే: పారిశ్రామిక, వ్యాపార, విద్య, వైద్య పరంగా రాజాం అభివృద్ధి చెందుతుండటంతో శివారు కాలనీలు పెరుగుతున్నాయి. దీంతో పట్టణంలో భవనాల నిర్మాణాలకు స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. నిర్మించకుండా ఏళ్లుగా అలానే వదిలేస్తుండడంతో పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా మారుతున్నాయి. దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

శ్రీకాకుళం రోడ్డులోని సౌత్ సైడ్‌లో, వాసవీ నగర్, ప్రశాంతినగర్, మారుతీనగర్‌లలో ఖాళీ స్థలాలు పనికిరాని మొక్కలతో నిండిపోయాయి. పరిసరాలు అధ్వానంగా మారాయి. విషసర్పాలు, కీటకాలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినాయకనగర్‌లో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిల్వ ఉంటోంది. దోమల బెడద ఎక్కువైంది. ఆదర్శ నగర్, బాబానగర్‌లోనూ ఇదే పరిస్థితి.

వాసవీనగర్‌లో కంచిక మొక్కలతో ఇలా..

చిట్టడవులుగా మారి..

పట్టణ పరిధిలో ప్రైవేట్ వ్యక్తుల పన్నులు చెల్లిస్తున్న స్థలాలు 337 ఉన్నాయి. ఏటా వీటి ద్వారా రూ.12.64 లక్షలు వసూలవుతోంది. యజమానులు సకాలంలో నిర్మాణాలు చేపట్టక చిట్టడవులుగా దర్శనమిస్తున్నాయి. తుప్పలు పెరిగి, నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీనికితోడు డ్రైనేజీ సమస్య వస్తోంది. దీంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రాంతీయులు వాపోతున్నారు. కేసుల పరిసరాల పరిశుభ్రత, ఫాగింగ్ చేయడం లేదని చెబుతున్నారు. దోమల తెరలు వినియోగించాలని, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రాంతీయాసుపత్రి సూపరింటెండెంట్ హరిబాబు తెలిపారు.

ప్రత్యేక కార్యాచరణ: ఖాళీస్థలాల్లో శుభ్రత విషయంలో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం. సచివాలయాల వారీగా వివరాలు సేకరిస్తున్నాం. శుభ్రం చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. స్పందించకుంటే చర్యలు తప్పవు. - ఎ.రామచంద్రరావు, కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? సాలాపువలస-కాలరాజుపేటకు రహదారి అధ్వానంగా ఉంది. - స్థానికులు ✦ ప్రతిపాదనలు పంపిస్తాం. - హరికృష్ణ, పీఆర్ ఏఈ - న్యూస్‌టుడే, మెరకముడిదాం

? పొనుగుటివలస వార్డు పరిధిలోని ఎస్సీ వీధి మూడో లైన్‌లో కాలువలు చెత్తతో నిండిపోయాయి. - స్థానికులు ✦ చెత్త తొలగిస్తాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? కోటశిర్లాంలోని ఏపీఆర్ గడ్డపై కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుంది. - స్థానికులు ✦ నిధుల కోసం ప్రతిపాదిస్తాం. - రమేష్, ఏఈ -న్యూస్‌టుడే, రామభద్రపురం

? నరవలో పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. - స్థానికులు ✦ ఉన్నతాధికారులకు నివేదిస్తాం. - ఆర్.కృష్ణ, ఏడీ – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? పోరాంలోని మేదరవీధి సిమెంటు రోడ్డుపై చెత్త పేరుకుంది. - స్థానికులు ✦ చర్యలు తీసుకుంటాం. - విమలకుమారి, విస్తరణాధికారి – న్యూస్‌టుడే, మెంటాడ

కుళాయి ఉంది.. నీరెలా పట్టుకోవాలి?

బొబ్బిలి మండలంలోని పలు ప్రాంతాల్లో వేసిన కుళాయిల వద్ద నీరు పట్టుకోవడానికి ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. బళ్లవీధి, పాతబొబ్బిలి పల్లె వీధి, ఓంకార్ థియేటర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల అంచులో ఏర్పాటు చేశారు. దీంతో నీరు పట్టుకునేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పురపాలిక కమిషనర్ రామలక్ష్మి వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

– బొబ్బిలి, న్యూస్‌టుడే

ఎక్కడికక్కడే చెత్త.. కానరాని స్వచ్ఛత

గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం, కొనిశ, పాత బగ్గాం, మధుపాడ, లింగాలవలస, జిన్నాం, సీతారాంపురం, పిడిశీల కాలంరాజుపేట గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సంపద తయారీ కేంద్రాలున్నా వాటిని వినియోగించడం లేదు. దీంతో ఎక్కడ పడితే అక్కడ వేసేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో శంకరరావును వివరణ కోరగా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

పనిచేయదు.. తాగు నీరివ్వదు

రామభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌వో ప్లాంటు నిరుపయోగంగా మారింది. ఇక్కడ 700 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. తాగునీటి కోసం గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. మరమ్మతులకు గురవడంతో బాగు చేయకుండా వదిలేశారు. దీంతో మూలకు చేరింది. ప్రస్తుతం బోరు నీరే తాగుతున్నారు. హెచ్‌ఎం గోపాల్‌నాయుడు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరతామన్నారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

కప్పేశాయ్.. రూపురేఖలు మార్చేశాయ్

బొబ్బిలి మండలంలోని భైరవసాగరం, బైపాస్ రోడ్డు పెద్ద చెరువు, తారకరామకాలనీ, అప్పయ్యపేట కోనేర్లు గుర్రపు డెక్కతో నిండి అధ్వానంగా మారాయి. చెరువుల సుందరీకరణలో భాగంగా గతంలో వీటిని శుభ్రపరిచేవారు. ఇప్పుడు పట్టించుకోకపోవడంతో రూపురేఖలు మారిపోయాయి. సమస్యను పుర కమిషనర్ రామలక్ష్మి వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

చేరుకున్నాయి రిక్షాలు

ఇంటింటా చెత్త సేకరణ చేసేందుకు 35 రిక్షాలు చీపురుపల్లి మండల పరిషత్తు కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయనున్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో వీటిని అందజేస్తామని డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు.

- న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి గ్రంథాలయంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ✦ బొబ్బిలి: రాజా కళాశాల మైదానంలో జరిగిన వేడుకల్లో హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేశవ, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ రాజశేఖర్, ఎం.గణేష్, వినయ్, జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు నివాళులర్పించారు. కళింగవైశ్య సంఘం, తెదేపా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు దుస్తులు పంపిణీ చేశారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఎల్ఈడీ బల్బులు అందజేస్తున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నందున బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయానికి సీఐ శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావు సమకూర్చిన రూ.5వేల విలువైన లైట్లు, వైర్లను డీఎస్పీ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ప్రధానాచారిణి ఎ.రాణిశ్రీ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నిధులొస్తేనే నీళ్లు

ప్రతిపాదనల దశలోనే చెరువుల అభివృద్ధి

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

వచ్చే ఖరీఫ్ నాటికి చెరువులు అభివృద్ధి చేస్తారని.. సాగునీటికి ఇబ్బంది లుండవని ఆశపడ్డ రైతులకు ఈసారీ ఇబ్బందులు తప్పేలా లేవు. సాగునీటి చెరువుల అభివృద్ధికి గతేడాది జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకంలో కార్మికులతో మట్టి పని, తుప్పలు తొలగించడం తప్ప.. సిమెంటు పనులు చేయలేదు. దీంతో పంట పొలాలకు సాగునీరు అందక వృథాగా పోయేది. వాటిని ఇప్పుడు బాగుచేద్దామని ప్రతిపాదనలు పంపించారు.

మండలాల వారీ ఇలా..		
మండలం	చెరువులు	నిధులు (రూ.కోట్లలో)
బొబ్బిలి	32	8.87
తెర్లాం	66	7.54
రామభద్రపురం	46	6.33
బాడంగి	66	7.26

230 చెరువుల మెరుగుకు..

బొబ్బిలి డివిజన్ పరిధిలోని రామభద్రపురం, తెర్లాం, బాడంగి, బొబ్బిలి మండలాల్లో 230 చెరువులు అభివృద్ధికి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ చెరువుల పరిధి సుమారు 47,082 ఎకరాల ఆయకట్టు ఉంది. కేవలం వర్షాధారంపైనే రైతులు పంటలు సాగుచేస్తున్నారు. గతంలో నిర్మించిన మదుములు, చప్టాలు కొట్టుకుపోయాయి.

కృష్ణాపురంలో ఊర చెరువు

తాజాగా మరికొన్నింటికి.. గతంలో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. తాజాగా మరికొన్ని చెరువులకు కూడా ప్రతిపాదనలు పంపిస్తున్నాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం. ఉపాధి హామీ పథకంలో మట్టితీసి గట్లు పటిష్టం చేస్తున్నాం. - సుధీర్, హరిబాబు, ఏఈఈలు

సంపద సృష్టించే కేటాయింపులు బడ్జెట్‌లో లేవు

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి శ్రీనివాస్

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేంద్రం, రాష్ట్రంలో సంపద సృష్టించే విధంగా బడ్జెట్ కేటాయింపులు లేవని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో గురువారం ఇందిరా గాంధీ డిగ్రీ కళాశాలలో జరిగిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లపై స్టడీ సర్కిల్ సదస్సులో మాట్లాడారు. ప్రజలపై పన్నులు పెంచుతున్నారని విమర్శించారు. నాయకులు సత్యంనాయుడు, కరస్పాండెంటు కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. సంబంధిత సెట్-1 ప్రశ్నపత్రాలు గురువారం గజపతినగరం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్షా కేంద్రాల సిబ్బంది చేరుకుని పరీక్షా పత్రాల కట్టలు సరిచూసుకొని స్టేషన్ లోపల స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు ప్రకాశరావు పట్నాయక్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు మైక్ సెట్టు వితరణ

గరివిడి, న్యూస్‌టుడే: మండలంలోని కాపుశంభాం ఉన్నత పాఠశాలకు రూ.50వేలు విలువైన మైక్‌సెట్టును గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పిన్నింటి రామకృష్ణ సమకూర్చారు. దీనిని గురువారం హెచ్‌ఎం శివాజీకి అతని తండ్రి సింహాచలం అందజేశారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో ఈనెల 22 నుంచి 24 వరకు జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఏర్పాట్లను తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు గురువారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జి.నాగరాజు, వైస్ ఛైర్మన్ పి.త్రినాథరావు, ఎస్సై దామోదరరావు, ఎంపీడీవో ఐ.సురేష్, ఈవో నానాజీబాబు, నాయకులు ఆర్.కామునాయుడు, వి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

రేగిడి, న్యూస్‌టుడే: తోకలవలస పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మున్నాయుడు, పి.శ్రీదేవిని గురువారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

96 మందికి నేత్ర పరీక్షలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వంగపల్లిపేటలో మానవీయత స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థుల ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 94 మందికి పరీక్షలు చేయగా, 26 మందికి శస్త్ర చికిత్సలకు సూచించారు. సంస్థ వ్యవస్థాపకుడు గోవిందరాజులు, ఆసుపత్రి పీఆర్వో నాగరాజు పాల్గొన్నారు. ✦ తెర్లాం: లోచర్లలో రాగోలు జెమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి దాలెమ్మ, యూటీఎఫ్ అధ్యక్షుడు జి.మునిస్వామి ఉన్నారు.

ఓటర్లను మ్యాపింగ్ చేయాలి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాను పరిశీలించి కామన్‌గా ఉన్న వారిని మ్యాపింగ్ చేయాలని తహసీల్దారు శ్రీను అన్నారు. మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. 60 శాతం కంటే తక్కువ ప్రోగ్రస్ ఉన్న బీఎల్‌వోలు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎన్నికల ఉప తహసీల్దారు గౌరీశంకరరావు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలవరాయిలో విద్యార్థులకు సూచనలిస్తున్న శ్యామలాకుమారి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కలవరాయి, పిరిడి బీసీ సంక్షేమశాఖ బాలుర వసతి గృహాలను బొబ్బిలి డివిజన్ సహాయ సంక్షేమాధికారిణి శ్యామలాకుమారి గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సూచనలు చేశారు. కష్టపడి చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సంక్షేమాధికారి శ్రీనివాసరెడ్డికి సూచించారు. మరుగుదొడ్లు, పరిసరాలు, వంటకాలు పరిశీలించారు.

ఉగాది నాటికి పూర్తిచేయాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని డీడీవో హేమసుందర్ అన్నారు. విజయకాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు చేపడితే వెంటనే బిల్లులు మంజూరవుతున్నాయన్నారు. రామభద్రపురం: రొంపల్లి, గొల్లపేటలో నిర్మాణాలను మండల ప్రత్యేక అధికారి ప్రశాంత్‌కుమార్ తనిఖీ చేశారు. తహసీల్దారు రఫీజాన్, గృహ నిర్మాణశాఖ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీడీవో హేమసుందర్

డిజిటల్ అసిస్టెంట్ బదిలీ

గుర్ల, న్యూస్‌టుడే: నాగళ్లవలస సచివాలయంలో పనిచేస్తున్న ఆర్.ఎస్.శ్రీవాత్సవ్‌ను బదిలీ చేస్తూ డీపీవో మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. డీఏగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు రాగా మండల అధికారులు విచారణ చేపట్టి డీపీవోకు నివేదించారు. ఈ మేరకు ఆయనను గంట్యాడ మండలం దిగువకొండపర్తి సచివాలయానికి బదిలీ చేశారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

మెరకముడిదాం: చినబంటుపల్లికి చెందిన ఎం.ఆదినారాయణ కుటుంబ సభ్యులు గురువారం ఉపాధి పనులకు వెళ్లిన తర్వాత మంటలు చెలరేగాయి. పూరిల్లు కావడంతో దగ్ధమైంది. రూ.32వేల నగదు, ఇతర సామగ్రి కాలిపోయాయి. నష్టం అంచనా వేసి, పరిహారం వచ్చేలా చూస్తామని వీఆర్వో అన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు కె.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ కృష్ణమూర్తి బియ్యం, ఇతర సామగ్రి బాధితులకు అందజేశారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

తెర్లాం: ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని డీడీఈవో కె.మోహన్‌రావు అన్నారు. వెలగవలస జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎంఈవో జె.త్రినాథరావు, హెచ్‌ఎం బంగారినాయుడు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెర్లాం, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ ఎం.కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది గస్తీ నిర్వహించి, కుసుమూరు సమీప వేగావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. రూ.5,700 అపరాధ రుసుము విధించారు.

తెర్లాం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో పట్టుబడిన ట్రాక్టర్

మహిళల ఆర్థిక సాధికారతకు దోహదం

సంతకవిటి, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఈ-నారీ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఏపీఎం దదికుమార్ అన్నారు. మండలంలోని స్త్రీనిధి భవనంలో గురువారం డ్వాక్రా మహిళలకు ఈ-నారీపై శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా మహిళలు పలు పథకాల ద్వారా తీసుకున్న రుణాలు ఎలా సద్వినియోగం చేస్తున్నారనే విషయంపై సీఆర్‌పీలు సర్వే చేస్తారన్నారు. వెలుగు సిబ్బంది, సీసీలు, సీఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మెంటాడ, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల నిమిత్తం ఆండ్ర 11కేవీ ఫీడర్, ఆర్‌డబ్ల్యూఎస్ 11కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు బొబ్బిలి ఆపరేషన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు రఘు తెలిపారు. ✦ చీపురుపల్లి గ్రామీణం: గచ్చలవలస, చీపురుపల్లి, టీకే పాలవలస సబ్‌స్టేషన్ పరిధిలోని నిర్వహణ పనుల కారణంగా కర్లాం, మోదుగులపేట, చింతలపేట, రావివలస, కొత్తపేట తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ త్రినాథరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

(c) eenadu

విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా మారారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. గురువారం విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని వీటీ.అగ్రహారంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి వంద రోజుల ప్రణాళిక అమలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, మెనూపై ఆరా తీశారు. అనంతరం బాలలతో ముచ్చటించారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు బి.మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

బంగారమ్మతల్లి ఉత్సవం

కోలాటం ఆడుతున్న మహిళలు

అలంకరణలో అమ్మవారు

ఎల్.కోటలో వేంచేసిఉన్న బంగారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుడు శ్రీహరిశర్మ సామూహిక కుంకుమ పూజలు చేయించారు. సాయంత్రం మహిళలందరూ పసుపు, కుంకుమలు, పూజా సామగ్రి తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువత నృత్యాల నడుమ నెయ్యిల వీధి నుంచి కదలి వచ్చారు. ఈ సందర్భంగా కోలాటం ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, ఎల్.కోట

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: నగరంలోని పంచముఖాంజనేయస్వామి ఆలయంలో 41 రోజుల పాటు జరగనున్న హనుమాన్ చాలీసా పారాయణం గురువారం భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభమైంది. దేవాలయ గౌరవాధ్యక్షుడు వీరభద్రస్వామి జ్యోతి వెలిగించారు. కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానందస్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వామి వారు వెండి కవచధారణలో దర్శనమిచ్చారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు

కొత్తవలస మండలంలోని ములగ పాకవాని పాలెం(దాసరివాని పాలెం)లో గ్రామ దేవత ముత్యాలమ్మ తీర్థం గురువారం ఘనంగా జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ● వేపాడ మండలంలోని బొద్దాం గ్రామంలో వీరాగ్రమ్మ వార్షికోత్సవం నిర్వహించారు. – న్యూస్‌టుడే, కొత్తవలస, వేపాడ

పైపులో చేరుతోంది.. గొంతులోకి వెళుతోంది

మురుగు కాలువల్లో నీటిసరఫరా వ్యవస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపుల్లో మురుగు ప్రవహిస్తోంది. డ్రైనేజీల్లో ప్రధాన లైన్లు ఉండడంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో కొన్ని వీధులకు దుర్వాసనతో కూడిన నీరు సరఫరా అవుతోంది. ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు లీకుల కారణంగానూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మళ్లీ అదే పరిస్థితి..

జిల్లా కేంద్రంలో 88 వేల గృహ సముదాయాలున్నాయి. వీటిల్లో 3.04 లక్షల మంది నివసిస్తున్నారు. తాగునీటి సరఫరాకు గానూ 36 ట్యాంకులు ఏర్పాటు చేశారు. ముషిడిపల్లి, నెల్లిమర్ల, రామతీర్థం పంప్‌హౌస్‌ల నుంచి నీటి తీసుకుని, కుళాయిల ద్వారా ఇస్తున్నారు. ప్రస్తుతం 490 కిలోమీటర్ల మేర సరఫరా లైన్లు విస్తరించాయి. వీటికి 32 కి.మీల మేర ఉన్న ప్రధాన పంపింగ్ వ్యవస్థ ద్వారా కనెక్షన్లు ఇచ్చారు. మినీ లైన్లలో చాలావరకు కాలువల్లోనే ఉన్నాయి. గతంలో తొలగింపు పనులు చేపట్టినప్పటికీ మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోంది.

నగరంలోని మజ్జివీధిలో మురుగు కాలువలో పైపులైన్లు

ఇక్కడే ఎక్కువ..

కొణిసవీధి, గౌడవీధి, సుంకరివీధి, కాటవీధి, అశోక్‌నగర్, గోశాల రోడ్డు, ఇప్పిలి వీధి, కలెక్టరేట్ రోడ్డు, మందుగుండు తోట, ఏనుగురాయి కాలనీ, కమ్మవీధి, అంబటి సత్రం, కంటోన్మెంట్ తెలకల వీధి, బజారు రోడ్డు, గాజులరేగ, ఘోషాసుపత్రి దారి, స్వీపరుకాలనీ, జొన్నగుడ్డి, తోటపాలెం, లంకాపట్నం తదితర ప్రాంతాల్లో ఈ సమస్య కనిపిస్తోంది.

ప్రత్యేక దృష్టి..

కాలువల్లో ఉన్నవాటిని తొలగిస్తున్నామని డీఈఈ బి.నరసింహారెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రహదారుల నిర్మాణం, కాలువల తవ్వకం సమయంలో కొందరు ఇష్టానుసారంగా వేయడంతో ఇబ్బంది ఎదురవుతోందని చెప్పారు. వాటికి లీకులు ఉంటే వెంటనే సరిచేస్తామని వెల్లడించారు. కలుషిత నీరు వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని, ఇక నుంచి ప్రత్యేకంగా దృష్టిసారిస్తామన్నారు.

సరఫరా తీరు ఇలా..	రోజూ నీటి అవసరం:	ఇస్తోంది:	సాధారణ కుళాయిలు:	అమృత్:	ఏపీఎండీపీ కింద వేసినవి:	నీరు రానివి:
	40 ఎంఎల్‌డీ	26 ఎంఎల్‌డీ (రోజు విడిచి రోజు)	28,333	7,417	4,120	4 వేలకు పైబడి

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

నెల్లిమర్లలోని పంప్‌హౌస్ వద్ద అధికారులతో కమిషనరు బాలస్వామి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనరు కె.బాలస్వామి తెలిపారు. గురువారం నెల్లిమర్ల పంప్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిల్వ సామర్థ్యం, పంపింగ్‌పై ఆరా తీశారు. ఈ ఏడాది నీటి ప్రవాహాలు ఆశాజనకంగా ఉండడంతో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదన్నారు. ఆంధ్ర జలాశయం నుంచి జలాల విడుదల కోసం కలెక్టరుకు లేఖ రాసినట్లు చెప్పారు. ఆయన వెంట ఈఈ పీవీఎస్ ప్రసాద్, డీఈఈ బి.నరసింహారెడ్డి తదితరులున్నారు. ● ప్రకాశం పార్కు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనరు తనిఖీ చేశారు. ● పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పంచాయతీల్లో పన్ను వసూలు

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్తవలస మండలంలోని ఎనిమిది పంచాయతీల పరిధిలో ఇంటి పన్నులు శత శాతం వసూలైనట్లు డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీదేవి చెప్పారు. అప్పన్నపాలెం, చీడివలస, చినరావుపల్లి, చిన్నిపాలెం, గనిశెట్టిపాలెం, గులివిందాడ, నిమ్మలపాలెం, వియ్యంపేట పరిధిలోని గ్రామాల్లో అందరూ చెల్లింపులు పూర్తి చేశారన్నారు. మండలంలోని 25 పంచాయతీల్లో 21,420 అసెస్మెంట్ల నుంచి పాత, ప్రస్తుత సంవత్సరానికి గానూ రూ.221.59 లక్షలు వసూలు కావాలన్నారు. ఇందులో బుధవారం నాటికి రూ.111.4 లక్షలు వసూలైందన్నారు. కొత్తవలస మేజరు పంచాయతీ నుంచి అత్యధికంగా రూ.148.1 లక్షలు రావాల్సి ఉండగా రూ.62.97 లక్షలు అందిందని వెల్లడించారు. మిగిలిన వారు సకాలంలో కట్టాలని కోరారు.

తెరపై ఈనాడు

ఎన్సీఎస్: పంకీ ● శ్రీకృష్ణ: కపుల్ ఫ్రెండ్లీ ●ఆదిత్య: హనీ ●లీలామహల్: నారీ నారీ నడుమ మురారి, మనసంతా నువ్వే ● రంజనీ స్క్రీన్–1: హేయ్ బల్వంత్ ● శివరంజనీ స్క్రీన్–2: మన శంకరవరప్రసాద్ గారు, నవాబ్ కాఫీ ● హిమగిరి: మన శంకరవరప్రసాద్‌గారు ● సప్తగిరి: హేయ్ బల్వంత్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

? సుంకరిపేటలో శివారు గ్రామాలకు నీరు అందడం లేదు. అదనపు ట్యాంకు నిర్మించాలి. – స్థానికులు ● పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - జి.వెంకటరావు, ఎంపీడీవో

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

? కొత్తదేవర వీధిలో విద్యుత్తు స్తంభం వేసి, వీధి దీపం బిగించలేదు.- గురునాథరావు, స్థానికుడు ● సిబ్బందిని పంపించి, కొత్తది ఏర్పాటు చేయిస్తాం. - స్రవంతి, ఏఈ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పరిసరాలు శుభ్రం

విజయనగరం పట్టణం: కోమటిచెరువు, నీలాటి చెరువు పరిసరాలను కార్మికులు శుభ్రం చేశారు. అక్కడి పరిస్థితిపై 'ఈనాడు'లో ఈనెల 17న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

కళాశాల ఏర్పాటుకు సహకరించండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, న్యూస్‌టుడే: ఎస్.కోట నియోజకవర్గంలోని కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, సివిల్ కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎమ్మెల్యే లలితకుమారి ప్రభుత్వానికి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో నియోజకవర్గంలోని సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు.

వేతనాల పెంపునకు డిమాండు

భోగాపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు 2019 నుంచి వేతనాలు పెంచలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డిమాండు చేసింది. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేస్తూ ఈనెల 23 నుంచి 27 వరకు నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఈమేరకు గురువారం భోగాపురంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ సుజాతకు సమ్మె నోటీసు ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు జి.ప్రవీణ, పి.అనిత, తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు

విజయనగరం మండలం జొన్నవలస నుంచి పినవేమలి, రాకోడు వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారింది. జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో నిత్యం రాకపోకలు సాగుతాయి. ఎక్కడికక్కడే మలుపులున్నాయి. అక్కడ హెచ్చరిక బోర్డులు గానీ.. వీధి దీపాలు గానీ లేవు. దీంతో రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. ఆయా స్థలాలను ఎంపీడీవో వెంకటరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

ఏర్పాటు సరే.. అడ్డంగా ఎందుకో?

నగరంలోని మయూరి కూడలిలో ఏర్పాటు చేసిన సాసర్ టీకప్పుతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుందరీకరణలో భాగంగా గతంలో దీనిని పెట్టారు. ఇటు రైల్వేస్టేషన్, అటు విశాఖపట్నం, ఎస్.కోట రోడ్డు మీదుగా వచ్చేవారు ఆగి ఎటు వైపు మూసే ప్రాంతం నుంచి సంకేతాలు కనిపించడం లేదు. ప్రధానంగా ఎర్రరంగు కానరాక చాలామంది ముందుకెళ్లిపోతున్నారు. ఈక్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

మైదానం కాదండోయ్.. చెరువే

ఇదేదో పచ్చని మైదానం అనుకునేరు.. కానే కాదండోయ్ గుర్రపుడెక్కతో నిండిన చెరువు. కొత్తవలస మండలం రెల్లి గ్రామానికి వెళ్లే దారిలో అప్పన్నదొరపాలెం రహదారి పక్కనున్న నీటి వనరు ఇది. గుర్రపుడెక్క పెద్దఎత్తున పెరగడంతో ఇలా మైదానంలా దర్శనమిస్తోంది. దీనికి ఎదురుగానే అప్పన్నదొరపాలెం మండల ప్రజా పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉంది. విద్యార్థులు పొరపాటున ఇటు వస్తే ముప్పు తప్పదు. పరిశీలించి, గుర్రపుడెక్కను తొలగిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

ఇలా వదిలేస్తే ఎలా?

జిల్లా కేంద్రంలో పలుచోట్ల నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో కొన్నిచోట్ల ఆక్రమణల బారిన పడ్డాయి. గతంలో ఉద్యానాలుగా మార్చాలని ప్రతిపాదించారు. ఆ మేరకు కొన్నింటి చుట్టూ ప్రహరీలు నిర్మించి వదిలేశారు. ఆరో డివిజన్ జగన్నాథనగర్ ప్రాంతంలో ఉన్న స్థలంలో పెద్దఎత్తున తుప్పలు పెరిగాయి. విష సర్పాలు వస్తున్నాయని స్థానిక కాలనీవాసులు చెబుతున్నారు. పరిశీలించి, శుభ్రం చేయిస్తామని నగరపాలిక ఈఈ ప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వాహనం రాదు.. చెత్త కదలదు

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రోడ్లు, కూడళ్లలోనూ చెత్త కనిపిస్తోంది. డంపర్ బిన్లు నిండిపోవడంతో రోడ్లపై పడుతోంది. స్థానిక నీలాటి చెరువు దారిలోని ఉద్యాన ప్రాంతంలో కొన్ని రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదు. పందుల సంచారం ఎక్కువైనా దాన్ని తొలగించేందుకు వాహనం రావడం లేదని చెప్తున్నారు. కార్మికులతో శుభ్రం చేయిస్తామని, వాహనం వెళ్లేలా చూస్తామని ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రాజేష్ వర్మ, ఎస్సీ మోర్చా నాయకులు

ప్రధాని బాటలో నడవాలి

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: యువత ప్రధాని నరేంద్ర మోదీ బాటలో నడవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ పిలుపునిచ్చారు. ప్రతినెలా చివరి ఆదివారం జరిగే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.

సీఎం సహాయ నిధి అందజేత

చెక్కులు పొందిన లబ్ధిదారులతో కర్రోతు

భోగాపురం, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న 24 మందికి రూ.12,78,072 విలువైన చెక్కులను రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు గురువారం అందించారు. భోగాపురం మండలంలో ఇప్పటివరకు రూ.కోటి విలువైన చెక్కులు అందించామన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శంకరరావు, అప్పలరామిరెడ్డి, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతర పనుల పరిశీలన

జామి, న్యూస్‌టుడే: జామి యల్లారమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు యంత్రాంగానికి ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు సహకరించాలని డీఎస్పీ గోవిందరాజులు కోరారు. గురువారం యల్లారమ్మ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా సిద్ధం చేయాలని ఆలయ ఈవో ప్రసాదరావుకు సూచించారు. సీఐ అప్పలనాయుడు, జామి ఎస్సై వీరజనార్దన్, సేవా కమిటీ అధ్యక్షుడు అల్లాడ పెద్ద, తెదేపా మండలాధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

శృంగవరపుకోట: ఎస్.కోటలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఉన్నతస్థానాల్లో స్థిరపడాలని కరస్పాండెంటు సీహెచ్‌ఆర్‌కే.ప్రసాద్ ఆకాంక్షించారు. జూనియర్ విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు.

భౌతిక దాడులు తగవు

కంటోన్మెంట్: ఏయూలో జరిగిన ఘటనకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ విజయనగరం జిల్లా శాఖ డిమాండు చేసింది. కోట కూడలిలో పరిషత్ నాయకులు ఆందోళన చేపట్టారు. భౌతిక దాడులకు దిగడం దారుణమన్నారు.

బాలలకు దుస్తుల అందజేత

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బాలలకు అండగా నిలిచారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు వీలుగా 80 జతల క్రీడా దుస్తులను వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాబ్జీకి అందించారు.

సంక్షిప్త సమాచారం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శృంగవరపుకోట: విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాలు విక్రయించకూడదని ఎస్.కోట పీహెచ్‌సీ వైద్యాధికారి మానస అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో గణపతి లక్ష్మి, హెచ్‌ఎం జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై అవగాహన

కొత్తవలస: కొత్తవలస- విజయనగరం మధ్య నాలుగో రైలు మార్గం కోసం చినరావుపల్లి, కాటకాపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో సేకరిస్తున్న భూములపై తహసీల్దారు సునీత రైల్వే అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు.

రోడ్డు నిర్మాణ పనులపై ఆరా

భోగాపురం: అన్నవరం రెవెన్యూ ప్రాంతంలో నిర్మిస్తున్న ఒబెరాయ్ హోటల్‌కు వెళ్లేందుకు కంచేరు నుంచి వేయనున్న రోడ్డు నిర్మాణంలో స్థానికులకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆర్డీవో కీర్తి తెలుసుకున్నారు. దిబ్బలపాలెంలో పర్యటించిన ఆమె ప్రాజెక్టు వివరాలపై ఆరా తీశారు. సమస్యలుంటే జిల్లా కార్యాలయానికి రావాలన్నారు.

కనక మహాలక్ష్మికి నారికేళ అభిషేకం

కంటోన్మెంట్: విజయనగరంలోని సిటీబస్టాండ్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో వేంచేసిఉన్న కనకమహాలక్ష్మికి నారికేళ అభిషేకం జరిగింది. అంతకుముందు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

సకాలంలో అభివృద్ధి పనుల పూర్తి

వేపాడ: మండల కేంద్రానికి సమీపంలోని వల్లంపూడిలో ఎస్సీల శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఎంపీపీ సత్యవంతుడు పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో పనులు సకాలంలో పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కంటోన్మెంట్: గూడ్స్ షెడ్ సమీపంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. శివరాత్రి రోజుల్లో రూ.72,272 సమకూరినట్లు ఈవో కె.వెంకటరమణ తెలిపారు.

22 నుంచి ఎల్లమ్మ సిరుల మహోత్సవం

ఆహ్వానప్రతులు ఆవిష్కరిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరంలోని సంగీత కళాశాల సమీపంలో కొలువుదీరిన ఎల్లమ్మతల్లి సిరుల మహోత్సవం ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు జరగనుందని ఎల్లమాంబ సేవా సంఘం ప్రతినిధులు వెంకటరావు, వాలీ, సత్తిబాబు తెలిపారు. తొలిరోజు ప్రత్యేక పూజలు, 23న తొలేళ్లు, 24న సిరిమాను ఉత్సవం నిర్వహిస్తామని, రోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు.

రామకృష్ణ పరమహంస జయంతి వేడుక

వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయానంద సరస్వతీ తదితరులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామకృష్ణ పరమహంస ప్రవచనాలను భక్తిశ్రద్ధలతో ఆచరించాలని విజయానంద సరస్వతీ(చిన్మయ మిషన్) పిలుపునిచ్చారు. గురువారం నెల్లిమర్లలో భగవాన్ రామకృష్ణ పరమహంస 191వ జయంతి వేడుకలు స్థానిక రామకృష్ణ ధ్యాన మందిరంలో సంస్థ కార్యదర్శి జగన్నాథరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన విజయానంద సరస్వతీ, దీపానందజీ, మహారాజ్ ప్రవచనాలు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి సారిపల్లి త్రినాథరావు, సన్యాసిరావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

జామి, డెంకాడ, ఎల్.కోట: జామి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని లక్ష్మీపురం, జాగరం, పావాడ, ఎల్.కోట మండలం వీరభద్రపేట, ఎస్.కోట మండలం అలుగుబిల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏఈ జ్యోతీశ్వరరావు తెలిపారు. ● డెంకాడ మండలం గొండయ్యపాలెం, బంగార్రాజుపేట, కొండర్రాజుపేట, మోపాడ గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు ● ఎల్.కోట మండలం రంగాపురం, దాసుళ్లపాలెం, గనివాడ, వేచలపువానిపాలెం, జమ్మాదేవిపేట, గేదెలవానిపాలెం గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ రామారావు తెలిపారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.07 కోట్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి హుండీల ఆదాయం అధిక మొత్తంలో లభించింది. దేవస్థానం కల్యాణ మండపంలో అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ అధికారులు హుండీలను తెరిచి ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడిచిన 21 రోజులకు నగదు రూ.2,07,22,111, బంగారం 321 గ్రాములు, వెండి 3.047 కిలోలు సమకూరినట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు. పలు దేశాల విదేశీ కరెన్సీతోపాటు చెల్లని పాత నోట్లు కూడా లభించాయని ఆయన పేర్కొన్నారు.

ఏకీకృత సర్వేలో వెనుకంజపై ఆగ్రహం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏకీకృత సర్వేలో జిల్లా వెనుకబడి ఉందని కలెక్టర్ నాగరాణి అన్నారు. సంబంధిత అధికారులతో ఆమె గురువారం వీసీ నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వారం చివరికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయం 7 గంటలకే ప్రారంభించాలని, పరిశీలనకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జిల్లాలో 6,30,855 గృహాలు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,10,587 ఇళ్లలో పూర్తయిందన్నారు. జిల్లాలో ఇంకా 1,39,453 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉందని, దాన్ని కూడా వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో శివన్నారాయణరెడ్డి పాల్గొన్నారు. ✦ మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో 13 నుంచి 15 వరకు జరిగిన పోటీల్లో రెండు బంగారు, రెండు రజతాలు, ఒక కాంస్య పతకం గెలుచుకున్న అథ్లెట్ యాతం నాగబాబు కలెక్టర్‌కు మర్యాద పూర్వకంగా కలవగా అభినందించారు.

నేడు అమరావతికి.. కలెక్టర్ భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమరావతిలో శుక్రవారం జరిగే జనాభా లెక్కల సేకరణ-2027 రాష్ట్రస్థాయి సమావేశానికి కలెక్టర్ నాగరాణి వెళ్లనున్నారు.

ఇన్నాళ్లూ చూశారు.. ఇన్నేళ్లూ వదిలేశారు

➡ పాములపర్రు, అర్తమూరు ఛానల్స్‌కు ఉండి ప్రధాన పంట కాలువ నుంచి నీరందించే పైపు కల్వర్టు దెబ్బతిని ఇప్పటికే అయిదేళ్లు దాటిపోయింది. దీని పునర్నిర్మాణానికి గత ప్రభుత్వంలో చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. గతేడాది వర్షాకాలంలో ఇది పూర్తిగా దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకే ఈ మార్గాన్ని పరిమితం చేశారు. వేసవిలో దీనిని అత్యవసరంగా చేయాల్సిన అవసరాన్ని యంత్రాంగం గుర్తించింది.

ఉండి, న్యూస్‌టుడే

ఖరీఫ్‌లో అతివృష్టి.. రబీలో అనావృష్టితో అన్నదాతలు నిలువునా మునిగిపోతున్నారు. దీనికి కారణం గత ప్రభుత్వమే. కాలువల ప్రక్షాళన పనులపై గత అయిదేళ్లు వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణితో సాగు సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. బలహీన పడిన కాలువ గట్లను పటిష్ఠపరచడం, లాకులు, వియర్లు, స్లూయిజ్‌ల అభివృద్ధి, షట్టర్లకు మరమ్మతులు తదితర పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా చేపట్టాల్సిన ఈ పనుల జాబితా పెద్దగానే కనిపిస్తోందని నీటి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. వీరు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలతో ప్రతిపాదనల సంఖ్య పెంచుకుంటూ వెళ్తున్నారు.

కాలువల ప్రక్షాళనకు ప్రతిపాదనలు

➡ ఇది వెలివర్రు గ్రామానికి నీరందించే పైపు కల్వర్టు ప్రాంతం. ఇక్కడి గోడ చాలాకాలం కిందటే కూలిపోవడంతో మట్టి, ఇసుక బస్తాలతో తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ కట్టడానికి వీలైనంత వేగంగా మరమ్మతులు చేస్తేనే శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు చేరే అవకాశాలు ఉన్నాయి.

● జల వనరుల శాఖ ఉండి సబ్ డివిజన్ పరిధిలో ఉండి, చిలకంపాడు, యండగండి, గణపవరం, ఆకివీడు సెక్షన్ల పరిధిలో 1,49,320 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో ఇదంతా వరి సాగు చేసేవారు. 2002 నుంచి ప్రారంభమైన వారబందీ విధానంతో వరి విస్తీర్ణం తగ్గిపోయి ఆక్వా చెరువులు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం శివారు ప్రాంతాలకు నీరందాలంటే ప్రధాన కాలువలు, ఉప కాలువల్లో మట్టిపూడికతీత పనులు చేపట్టాలి. యండగండిలో సర్‌ప్లస్ వియర్, చిలకంపాడు, పరిమెళ్ల, చినకాపవరం లాకులను అభివృద్ధి చేయాలి. చిలకంపాడు నుంచి ఉండి వరకు, పరిమెళ్ల నుంచి ఏలూరుపాడు వరకు వెంకయ్య వయ్యేరు కాలువల గట్లు పలుచోట్ల పటిష్ఠపరచాలి. ఉండి, ఎన్నార్పీఅగ్రహారం, మహదేవపట్నం, చెరుకువాడ, యండగండిలో పైపు కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వేలాది ఎకరాల్లో పంటను కాపాడేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి పంపుతున్నాం.. క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలు, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులిచ్చిన సమాచారం క్రోడీకరించాం. కాలువల్లో పూడికతీత, కట్టడాలు, షట్టర్ల మరమ్మతులు తదితర అన్ని రకాల అంశాలతో ప్రతిపాదనల జాబితాలు ఒక ట్రెండు రోజుల్లో సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నాం. - **సత్యనారాయణ మూర్తి, డీఈఈ, జల వనరుల శాఖ, ఉండి**

ప్రతి మంగళవారం 22ఏ భూములపై విచారణ

విచారణ నిర్వహిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సెలవు రోజు మినహా ఇక ప్రతి మంగళవారం 22ఏ నిషేధిత జాబితాలో చేరిన భూములపై వచ్చిన అర్జీలపై విచారణ చేస్తామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అత్తిలి, కాళ్ల, పోడూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలపై ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో విచారణ నిర్వహించారు. వాటిలో ఆరు అర్జీలను ఆమోదించామని, మిగిలిన వాటికి సంబంధించి పూర్తిస్థాయి రికార్డుతో ఈ నెల 24న అధికారులు రావాలని ఆదేశించారు.

22న ఆనంద ఆదివారం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించే ఉద్దేశంతో హ్యాపీ సండే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెచ్చింది. 2014-19 మధ్య ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేది. అప్పట్లో సమాజానికి సందేశాన్నిచ్చే బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలు, యువతతో సందడిగా ఉండేది. భీమవరంలో ఈ నెల 22న ఉదయం 6 గంటల నుంచి 10 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భీమవరం కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర యోగా, సైక్లింగ్, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారు. పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, వీధులు శుభ్రం చేయడం, సంగీతం, నృత్య ప్రదర్శనలు, వృద్ధులకు తేలికపాటి వ్యాయామాలు చేయించే కార్యక్రమాలు ఉంటాయి.

మహిమాన్విత మాత పెద్దింట్లమ్మ

కైకలూరు, న్యూస్‌టుడే: భక్తుల కష్టాలను తీర్చే మహిమాన్విత మాత పెద్దింట్లమ్మా అంటూ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు చలువ పందిళ్లలో పాల పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీజల దుర్గా సమేత పెద్దింటమ్మ మూల విరాట్టుకు సుగంధ ద్రవ్యాభిషేకం, పుష్పాలంకరణ, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు సమర్పించారు. దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడదాం : భోగిరెడ్డి ఆదిలక్ష్మి

కేఎన్‌రోడ్డు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భారతదేశంలో హిందూ ధర్మాన్ని కాపాడిన గొప్ప వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని వక్తలు కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం హౌసింగ్‌బోర్డు కూడలి నుంచి కేఎన్ రోడ్డు వరకు ద్విచక్ర వాహన శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నిట్ డీన్ జీఆర్‌కే శాస్త్రి, నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, ఆర్ఎస్ఎస్ నాయకుడు అశోక్ కుమార్ పాల్గొని మాట్లాడారు. శివాజీ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ భారతీయులంతా ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ సభ్యులు, ఏబీవీపీ, భాజపా నాయకులు, పట్టణ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

వసతి ఎలాగుంది.. భోజనం బాగుందా..

సంక్షేమ గృహాలపై ఐవీఆర్ఎస్ సర్వే

ఉంగుటూరు, తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వసతి గృహాల్లోని సంక్షేమాధికారుల పనితీరు, ఆహార పట్టిక అమలు, మౌలిక వసతులు తదితర అంశాలపై నిఘా పెట్టింది. ఈ మేరకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. వాటి ఆధారంగా సేవలు సంతృప్తికరంగా లేని చోట అవి మెరుగయ్యేలా చూడటంతోపాటు అధికారులు మరింత బాధ్యతగా పని చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

గాలికొదిలేసిన గత వైకాపా సర్కారు.. ప్రభుత్వ వసతి గృహాలను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. శిథిల భవనాలు, సదుపాయాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించింది. మరుగుదొడ్ల నిర్మాణం, రక్షిత మంచి నీటి యంత్రాలు సరఫరా చేసింది.

ఏయే అంశాలపై అంటే.. వసతి గృహాల్లో ఆహార పట్టిక ప్రకారం భోజనం పెడుతున్నారా, సంక్షేమాధికారుల పనితీరు ఎలా ఉంది, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తీరుకు సంబంధించిన ప్రశ్నలపై ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కచ్చితమైన సమాచారం ఇస్తే వాటి అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఎస్సీ వసతి గృహాల నిర్వహణలో ఏలూరు జిల్లా 23, పశ్చిమ 12 స్థానంలో నిలిచాయి. బీసీ వసతి గృహాల నిర్వహణలో ఏలూరు జిల్లా 6, పశ్చిమ గోదావరి 16 స్థానంలో ఉన్నాయి.

జిల్లాలో	ఎస్సీ		బీసీ	
	అవును	లేదు	అవును	లేదు
ఆహార పట్టిక ప్రకారం భోజనం పెడుతున్నారా	76.9	23.1	83.3	16.7
సంక్షేమాధికారుల పనితీరు సంతృప్తికరంగా ఉందా	71.6	28.4	72.6	27.4
తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ సంతృప్తికరంగా ఉందా	67.3	32.7	73.8	26.2

నిరుద్యోగులకు తీపి కబురు

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 198

ఉగాదికి వెలువడనున్న డీఎస్సీ ప్రకటన

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి సర్కారు తీపి కబురు అందించింది. గత ఏడాది మెగా డీఎస్సీ నిర్వహించిన ప్రభుత్వం.. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది మరో డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయ ఖాళీల వివరాలను సేకరించింది.

వివరాల సేకరణ.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 198 ఉన్నాయి. ఈ వివరాలను జిల్లా విద్యాశాఖ నుంచి ప్రభుత్వానికి నివేదించారు. వాటిలో పాఠశాల సహాయకుల కొలువులు 116, మాధ్యమిక గ్రేడ్ కొలువులు 82 ఉన్నాయి. 2026, మే 31 ప్రాతిపదికగా ఈ వివరాలు సేకరించారు. వాటిని పాఠశాల విద్యాశాఖ ఆమోదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ తర్వాత 70:30 నిష్పత్తిలో ఖాళీలను విభజిస్తారు. 70 శాతం కొలువులను ఉద్యోగోన్నతుల ద్వారా, 30 శాతం నేరుగా నియామకాల విధానంలో భర్తీ చేస్తారు. ఉపాధ్యాయ ఖాళీల ఆమోదం తర్వాత పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని అనుసరించి హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారు. అనంతరం పాఠశాల సహాయకులు, మాధ్యమిక ఉపాధ్యాయుల ఖాళీలను ఆయా సబ్జెక్టుల వారీగా ప్రకటిస్తారు.

1,023.. గతంలో భర్తీ చేసినవి.. గత ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,034 ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించారు. ఇందులో 1,023 ఖాళీలను భర్తీ చేశారు. 11 కొలువులకు అర్హులు లేనందున బ్యాక్‌లాగ్ జాబితాలోకి చేర్చారు. ఉగాదికి ఇచ్చే డీఎస్సీ సిలబస్‌లో మార్పులేమీ ఉండబోవు. గత ఏడాది డీఎస్సీకి ఇచ్చిన సిలబస్ మార్గదర్శకాలనే ఈసారీ అమలు చేయనున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, భూవివాదాలు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు రాజీ చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

బెదిరింపులపై ఫిర్యాదు చేయండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'నేను రాష్ట్రస్థాయి అధికారిని.. మీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా లేదని ఫిర్యాదులొస్తున్నాయి. మిమ్మల్ని సస్పెండ్ చేయడానికి 2 నిమిషాలు చాలు.. మీరు రూ.40 వేలు ఫోన్‌పే చేస్తే మిగతాది మేం చూసుకుంటామంటూ' కొందరు ఉపాధ్యాయులకు ఫోన్ చేస్తున్నారు. ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే జిల్లా విద్యాశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఈవో నారాయణ సూచించారు.

విహంగ వీక్షణ.. జల వనరులకు రక్షణ!

ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన లైడార్ సర్వే

సర్వేకు వినియోగించే విమానం, పరికరం

నరసాపురం, న్యూస్‌టుడే: జలవనరులపై సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం చేపట్టిన లైడార్ సర్వే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో తాజాగా ప్రారంభమైంది. దాదాపు 125 ఏళ్ల కిందట సర్ ఆర్థర్ కాటన్ హయాంలో ఈ ప్రాంతంలో జలవనరులపై సర్వే నిర్వహించినట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కాలువలు, డ్రెయిన్లు, ఉప్పుటేరులు, ఇతర జలవనరుల సమగ్ర సమాచార సేకరణ కోసం ఈ సర్వే చేపట్టారు. ఈ సర్వే నివేదికల ఆధారంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జల వనరుల స్థిరీకరణకు కాలువలు, డ్రెయిన్లు, చెరువులను పరిరక్షించి ఆధునికీకరించనున్నారు. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు కేంద్రంగా చిన్న విమానంలో అమర్చిన ఆధునిక పరికరాలతో ఈ సర్వే జరుగుతోంది. గురువారం వాసవీ పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో సర్వే జరిగిందని జలవనరులశాఖ నరసాపురం డీఈ వెంకటనారాయణ తెలిపారు. ఈ నెల 20న నరసాపురం, పాలకొల్లు, అత్తిలి, గణపవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెంలలో, 21న పేరుపాలెం, మొగల్తూరు, భీమవరం, వీరవాసరం, ఉంగుటూరు, భీమడోలు ప్రాంతాల్లో సర్వే జరుగుతుందని డీఈ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

SASI GROUP
Values we live...
VELIVENNU
The VEDAM School
BHIMAVARAM
BENGALURU
RAJAMAHENDRAVARAM
46 YEARS OF EXCELLENCE
95532 00007
96404 30007
careers@sasi.edu.in
www.sasi.edu.in

WALK-IN INTERVIEW
22nd FEB-2026
TIME : 9:00 AM TO 2:00 PM

VENUE: NIRMALA DEVI FUNCTION HALL, J.P ROAD, PEDAMIRAM, BHIMAVARAM

ONE OF THE BEST EDUCATIONAL INSTITUTIONS HAVING PRODUCED A NUMBER OF HIGH PROFILE PROFESSIONALS ACROSS THE COUNTRY AND ABROAD AND HAVING A LEGACY OF MORE THAN FOUR DECADES OF EDUCATIONAL EXCELLENCE INVITES PASSIONATE AND COMMITTED EDUCATORS TO SHARE AND IMPART THEIR KNOWLEDGE TO OUR STUDENTS AND TO HAVE THE BEST REWARDING CAREER GROWTH IN THE FIELD.

S.No	Name of the Post	Subjects & Qualifications	Salary (Rs.)
1	OFFICE MANAGER	Post Graduation / MBA	₹ 20,000 to ₹ 35,000 PM
2	FINANCE MANAGER	Post Graduation / MBA	
3	ADMISSION MANAGER	Post Graduation / MBA	₹ 16,000 to ₹ 30,000 PM
4	FRONT OFFICE EXECUTIVES / COUNSELLORS	M.Com / MBA (Finance)	
5	PROGRAM MANAGER	MCA / MBA / PG	
6	BUILDING MANAGER	Graduation / PG / MBA	
7	ACCOUNTANT	B.Com/ M.Com or Any Equivalent Degree	
8	CASHIER	Graduation	
9	RECORD MANAGER	Graduation	
10	COMPUTER OPERATOR	Graduation	₹ 12,000 to ₹ 24,000 PM
11	RECEPTIONIST	Graduation	₹ 12,000 to ₹ 18,000 PM
12	WARDENS (Male & Female)	Degree Pass or Fail	₹ 14,000 to ₹ 18,000 PM

Note: 1. Good spoken English skills required (S.No 1 To 5) 2. Good Computer skills required (S.No 1 To 11)
3. Min. 1 year of experience required; additional experience will be compensated accordingly.
4. Maximum age limit is 48 years. 5. Attend with photocopies of certificates and one recent passport size photo.

08819-350123, 96404 30007

SASI GROUP
Values we live...
VELIVENNU
The VEDAM School
BHIMAVARAM
BENGALURU
RAJAMAHENDRAVARAM
46 YEARS OF EXCELLENCE
95532 00007
96404 30007
careers@sasi.edu.in
www.sasi.edu.in

WALK-IN INTERVIEW
22nd FEB-2026
TIME : 9:00 AM TO 2:00 PM

VENUE: NIRMALA DEVI FUNCTION HALL, J.P ROAD, PEDAMIRAM, BHIMAVARAM

One Of The Best Educational Institutions Having Produced A Number Of High Profile Professionals Across The Country And Abroad And Having A Legacy Of More Than Four Decades Of Educational Excellence Invites Passionate And Committed Educators To Share And Impart Their Knowledge To Our Students And To Have The Best Rewarding Career Growth In The Field.

S.No	Name of the Post	Subjects & Qualifications	Salary (Rs.)
1	SENIOR LECTURERS To teach JEE ADVANCED, MAIN & NEET	Mathematics, Physics & Chemistry (PG & B.Ed / B.Tech / M.Tech)	₹ 18 LPA to ₹ 50+ LPA
2	JUNIOR LECTURERS To teach IPE, CBSE (XI & XII), JEE MAIN, NEET & EAPCET	Mathematics, Physics, Chemistry, Botany, Zoology, Sanskrit & English (PG & B.Ed / B.Tech / M.Tech)	₹ 4.8 LPA to ₹ 16 LPA
3	SCHOOL IIT FOUNDATION TEACHERS To teach Classes 6th to 10th	Mathematics, Physics & Chemistry (PG & B.Ed / B.Tech / M.Tech)	₹ 6 LPA to ₹ 14 LPA
4	CBSE / STATE HIGH SCHOOL TEACHERS To teach Classes 6th to 10th	All Subjects (PG / Graduation with B.Ed / D.Ed)	₹ 3.6 LPA to ₹ 7.2 LPA
5	PRIMARY SCHOOL TEACHERS To teach Classes LKG to 5th	All Subjects (PG / Graduation with B.Ed / D.Ed)	₹ 16,000 to ₹ 30,000 PM
6	MUSIC TEACHER	Diploma / Graduation / PG in Music	₹ 24,000 to ₹ 32,000 PM
7	DRAWING TEACHERS	D.Ed / B.Ed in Drawing	
8	ART & CRAFT TEACHERS	D.Ed / B.Ed in Craft	₹ 20,000 to ₹ 28,000 PM
9	SPECIAL EDUCATOR	D.Ed / B.Ed in Special Education	
10	WELLNESS TEACHER	Graduation / PG in Psychology	
11	LAB ASSISTANTS (Maths / Physics / Chemistry / Biology)	(Maths / Physics / Chemistry / Biology) B.Sc / M.Sc	₹ 15,000 to ₹ 24,000 PM
12	LIBRARIAN	B.LI.Sc / M.LI.Sc	
13	P.E.T (Male & Female)	D.P.Ed / B.P.Ed / M.P.Ed	

Note: 1. Good spoken English skills required (S.No 1 To 10)
2. Maximum age limit is 48 years.
3. Attend with photocopies of certificates and one passport size photo.

08819-350123
95532 00007

(c) eenadu

స్తంభించిన సహకార సేవలు

పూర్తిస్థాయి సమ్మెలో ఉద్యోగులు

మార్టేరులో డివిజన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

మార్టేరు, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించాలంటూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఉద్యోగ విరమణ వయసు పెంచాలని, వీఆర్‌ఎస్ అమలు చేయాలని, కొత్తగా నియమించిన సిబ్బందిని కొనసాగించాలని, చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలనే డిమాండ్లతో వీరు సోమవారం నుంచి సమ్మె చేపట్టారు. బుధవారం నుంచి పూర్తి స్థాయి సమ్మెకు దిగడంతో సొసైటీ కార్యాలయాల్లో సేవలన్నీ నిలిచిపోయాయి. ఆయా డివిజన్ కార్యాలయాల ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

రుణాలపై ప్రభావం.. జిల్లా వ్యాప్తంగా 122 సహకార సంఘాలు ఉన్నాయి. కార్యదర్శులు, క్లర్కులు, అటెండర్లు, ఇతర సహాయ సిబ్బంది విధులను బహిష్కరించడంతో ఈ కార్యాలయాల్లో అన్ని లావాదేవీలు నిలిచిపోయాయి. వీటి పరిధిలో పంట రుణాలకు సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా జరుగుతాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో ఉద్యోగులు సమ్మెకు దిగడంతో రుణాల వసూలు, ఇతర లావాదేవీలపై పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

పశు బీమా.. పోషకులకు ధీమా

తొలి విడత నమోదు ప్రక్రియ ప్రారంభం

పాలకొల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతులను ఆదుకొనేలా పలు పథకాలను ప్రవేశపెట్టింది. రాయితీపై దాణా సరఫరా, ఊరూరా పశు వైద్య శిబిరాలు నిర్వహణ చేపట్టింది. తాజాగా పశువులకు రాయితీపై బీమా చేయడానికి నిధులు విడుదల చేసింది. జిల్లాలో ప్రస్తుతం తొలి విడత నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఇక్కడే బీమా వర్తింపజేయనుంది.

రూ.4 లక్షల కేటాయింపు.. జిల్లాలో తొలి విడతగా ప్రభుత్వం రూ. 4 లక్షల రాయితీ సొమ్మును పశు బీమా సంస్థకు కేటాయించింది. ఈ నిధులు సుమారు 500 పశువులకు బీమా నమోదుకు రైతు వాటాతో కలిపి సరిపోతాయి. ఈ మొత్తం పూర్తయ్యాక రెండో విడతలో మరిన్ని నిధులు కేటాయించనున్నారు. ఇప్పటి వరకు 250కు పైగా పశువులకు బీమా చేశామని జిల్లా పర్యవేక్షణ అధికారి బాబు తెలిపారు.

అర్హత ఇలా.. తెల్ల రేషన్‌కార్డు ఉన్న రైతులు, ఎస్సీ ఎస్టీ పాడి రైతులు అర్హులు. రెండేళ్ల నుంచి పదేళ్ల వయసున్న ఆవులు, 3- 12 ఏళ్ల పాడి గేదెలకు బీమా వర్తిస్తుంది. ఒక రేషన్‌కార్డు పరిధిలో గరిష్ఠంగా 10 పశువులకు బీమా చేయించుకోవచ్చు. మేకలు, గొర్రెలకు ఆరు నెలల వయసు దాటిన వాటికి వర్తిస్తుంది.

రూ.2.5 లక్షల విలువైన వెండి ఆభరణాల సమర్పణ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కుంచనపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి భక్తులు గురువారం రూ.2.50 లక్షల విలువైన వెండి వస్తువులను బహూకరించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మలిశెట్టి వెంకటేశ్వరరావు సుభద్ర దంపతులు స్వామికి రజత వక్ష స్థల పతకాలను రూ.1.70 లక్షలతో, మైలవరపు గోపాల కృష్ణ శ్రీలత దంపతులు రజత తిరునామాన్ని 90వేల రూపాయలతో తయారు చేయించి స్వామికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గర్భస్రావాల పెరుగుదల ఆందోళనకరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాలో పెరుగుతున్న గర్భస్రావాల సంఖ్య ఆందోళన కలిగిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు హైమావతి అధ్యక్షతన గురువారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వసతులు కల్పించక, వైద్యులు సరిపడా ఉండకపోవడంతో పేదలు విధి లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. స్కానింగ్ పేరిట గర్భిణుల నుంచి పెద్ద ఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులకు రూ.లక్షల్లో ఖర్చవుతున్నా అబార్షన్లు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించి, స్కానింగ్, రక్త పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

తేనెటీగల యూనిట్ల స్థాపనకు ముందుకు రండి

ఉండి, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకం యూనిట్ల స్థాపనకు యువత, మహిళలు ముందుకు రావాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు కోరారు. ఉండి కేవీకేలో మూడో విడత జరుగుతున్న శిక్షణ తరగతులను ఉద్దేశించి గురువారం ఆయన మాట్లాడారు. కుట్టని తేనెటీగల పెంపక యూనిట్లను ఇంటి పెరట్లో ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. తేనెతో పాటు దాని ఉప ఉత్పత్తులను బ్రాండ్ పేరుతో విక్రయిస్తే మంచి ఆదాయాన్ని పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డెబోరా మెస్సియానా, శ్రీనివాసరావు, వినయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం తేనె సేకరణ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.

పంచ్ కొడితే.. పతకాల పంటే..

జాతీయస్థాయి కుంగ్‌ఫూ టోర్నీలో సత్తాచాటిన విద్యార్థులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వారంతా పేదింటి పిల్లలు. అందరిలాగే పాఠశాలలకు వెళ్తూనే ఏదైనా రంగంలో అదనపు ప్రావీణ్యం సాధించాలనే తపన వారిది. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. దీంతో జంగారెడ్డిగూడెనికి చెందిన ఆ విద్యార్థులు కుంగ్‌ఫూలో చేరి గండం సురేశ్ వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నారు. ఫిబ్రవరి 8న విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఈ విద్యార్థులతో 'న్యూస్‌టుడే' ముచ్చటించింది.

తండ్రి ప్రోత్సాహంతో..

నా తండ్రి చిన్నతనంలో కుంగ్‌ఫూ నేర్చుకున్నారు. అప్పటి విషయాలు, కుంగ్‌ఫూ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు చెప్పడంతో నాకు ఆసక్తి కలిగింది. తండ్రి ప్రేరణతోనే 2020లో కుంగ్‌ఫూలో చేరా. అప్పటి నుంచి చిలకలూరిపేట, విజయవాడ, ఏలూరు, హనుమాన్‌జంక్షన్‌తోపాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొని ఐదు బంగారు, 2 వెండి పతకాలు సాధించా. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకున్నా. పోలీసు అధికారిని అవుతా.

- సయ్యద్ మోదిన్ బాషా, 7వ తరగతి.

ఐపీఎస్ అవుతా..

ఐదేళ్లుగా కుంగ్‌ఫూ నేర్చుకుంటున్నా. 2022లో చిలకలూరిపేటలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. 2023లో హనుమాన్ జంక్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం గెలుచుకున్నా. విజయవాడలో 2025, 2026 ఫిబ్రవరి 8న జరిగిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు కైవసం చేసుకున్నా. ఐదేళ్లలో 5 బంగారు, 2 వెండి పతకాలు సాధించా. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

- నల్లమిల్లి గ్రీష్మంత్, 6వ తరగతి

ఆత్మవిశ్వాసం పెరిగింది...

కుంగ్‌ఫూతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యంతో పాటు నాలో ఆత్మవిశ్వాసం బాగా పెరిగింది. 2020 నుంచి ఇప్పటి వరకూ విజయవాడ, చాగల్లు, తణుకు, ఏలూరు, చిలకలూరిపేట, హనుమాన్‌జంక్షన్ తదితర చోట్ల జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో సత్తా చాటా. ఆయా పోటీల్లో 4 బంగారు, 3 వెండి పతకాలు సాధించా. ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం.

- కాపకాయల సుదర్శన్, 6వ తరగతి

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
19న రాత్రి 10గంటల సమయానికి	20న	21న
ధర్మప్పారాయ నిలయం	73	39
తితిదే సత్రం	05	13
రాణి చిన్నమ్మారావు సత్రం	28	24
కాటేజీలు	22	00
బాలాజీ	07	07

సంప్రదించాల్సిన నంబర్లు:
90375 69891, 90375 67892
ఆన్‌లైన్ బుకింగ్ కోసం: www.aptemples.ap.gov.in

సులభంగా డబ్బు సంపాదనకు బాలికల అపహరణ

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

తిరుమల, న్యూస్‌టుడే: సులభంగా డబ్బు సంపాదించేందుకు ఇద్దరు చిన్నారులను అపహరించిన నిందితురాలిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికలను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎస్‌ఐలు చలపతి, రమేష్‌బాబు కథనం మేరకు.. తణుకుకు చెందిన లక్ష్మి, రాంబాబు దంపతులు తమ కుమార్తెలతో కలిసి ఈ నెల 16న తిరుమల వచ్చారు. ఈ నెల 16న ఉదయం స్థానిక నాదనీరాజనం ప్రాంతంలో బాలికలు ఆడుకుంటుండగా కలకడ మండలానికి చెందిన నడి వయసు మహిళ గుండ్లూరు శివమ్మ వారిని అపహరించి తన వెంట తీసుకుపోయింది. బాలికల తల్లి తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి ప్రత్యక్ష సాక్ష్యుల నుంచి సమాచారం సేకరించారు. ప్రత్యేక పోలీసు బృందాలతో నిందితురాలిని ఈ నెల 17న కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకుని ఇద్దరు చిన్నారులను రక్షించారు. బాలికలను రాజమహేంద్రవరం బాలల సంరక్షణ గృహానికి అప్పగించి, తిరుపతికి తరలించారు. సులభంగా నగదు సంపాదించాలనే ఉద్దేశంతో తిరుమలలో ఒంటరిగా ఉన్న చిన్నారులను అపహరించి వారితో భిక్షాటన చేయించేందుకు ప్రణాళిక రచించినట్లు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతిలోని సీడబ్ల్యూసీ ద్వారా బాలికలను తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన తిరుమల 2 టౌన్ సీఐ శ్రీరాముడు, వన్‌టౌన్ ఎస్‌ఐలు డి.రమేష్‌బాబు, సి.చలపతి, సీసీఎస్ ఎస్‌ఐ నరేష్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

ఆందోళన నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ఆర్టీసీ డిపోలు ప్రైవేటుపరం చేయొద్దు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపోలను ప్రైవేటుపరం చేయొద్దని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తంచేసే 88 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. పుణేకు చెందిన పినకిల్ సంస్థకు మొదటి దశలో విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళగిరి డిపోలను అప్పగించడానికి సిద్ధమవడం సరికాదన్నారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం ఈనెల 24న విజయవాడలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డీకే రావు, కార్యదర్శి ఎన్.సురేశ్, సీఐటీయూ నాయకుడు పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు పరిధి సర్వే త్వరగా చేయాలి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాలో కొల్లేరు అభయారణ్య పరిధి సర్వే త్వరగా చేయాలని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కొల్లేరు పరిధి సరిహద్దుల సర్వే పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొల్లేరు ప్రాంతంలోని 55 గ్రామాల్లో 120 జీవో ప్రకారం సరిహద్దులను రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల సిబ్బంది సర్వే చేసిన తర్వాత ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. ఇప్పటికే 52 గ్రామాల్లో సరిహద్దులు గుర్తించారని, మిగిలిన గ్రామాల్లోనూ సర్వే త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ రెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ యాజమాన్యం పన్నులు చెల్లించాల్సిందే

డైరెక్టర్‌తో చర్చిస్తున్న అధికారులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం నూజివీడు పురపాలక సంఘానికి బాకీపడ్డ మొత్తం చెల్లించాలని నూజివీడు మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి పీరయ్య కోరారు. గురువారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌ను కలిసి నీటి పన్ను రూ.2.40 కోట్లు, ఇంటి పన్నులు రూ.92 లక్షలు చెల్లించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తెలిపారు. నీటి పన్ను రూ.కోటి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే పురపాలక సంఘం అకౌంట్‌కు జమ చేస్తామని తెలిపారు.

పురపాలక సంఘ కార్యాలయము, తణుకు

ఆర్.ఓ.సి.నెం. 47/2024–ఎ1 తేది: 19–02–2026

2026–2027వ సంవత్సరములో రోడ్డు మార్జిన్లు రోజువారి మార్కెట్టు, ఆదివారం మార్కెట్టులలో ఆశీలు వసూలు చేసుకొను హక్కు బహిరంగ వేలం నోటీసు

తణుకు పురపాలక సంఘ ఏరియాలోని రోడ్డు మార్జిన్లు రోజు వారీ మార్కెట్టు, ఆదివారం మార్కెట్టు మరియు కొత్తగా విలీనమైన పైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురంతో కలిపి 2026-2027 సంవత్సరమునకు అనగా ది. 01-04-2026 నుండి ది. 31-03-2027 ఆశీలు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు గజిట్ నెం. 26 ది. 15-03-2024 లోని షరతులు ప్రకారము **తేది. 02–03–2026, సోమవారం** ఉదయం గం. 11.30 ని.లకు తణుకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీ కమిషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. ఏ కారణము చెప్పకనే పాటను ఆమోదించుట గాని లేక వాయిదా వేయుటకు గాని, లేక తిరస్కరించుటకు గాని, ఈ దిగువ సంతకముదారునికి పూర్తి అధికారము కలదు. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా సాల్వెన్సీ, డిపాజిట్టు మరియు స్టాంపు డ్యూటీ మొత్తము వేలమునకు ముందు అనగా (02-03-2026) ఉదయం గం. 10.00 లలోపు పురపాలక సంఘమునకు డిపాజిట్టు చేయవలెను. పాటలో పాల్గొను వారికి ఎటువంటి బకాయిలు ఉండరాదు. మిగిలిన విషయములు, పాట షరతులు పురపాలక సంఘములో ఆఫీసు పని దినములలో ఎ1 గుమస్తాను అడిగి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	పాట వివరములు	పాట సమయములో చేయవలసిన ధరావతు	పాట సమయములో చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ డిపాజిట్టు	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ మొత్తము
1	రోడ్డు మార్జిన్లు రోజు వారి మార్కెట్టు, ఆదివారం సంత మరియు మార్కెట్టు నందు 2026-27 సంవత్సరమునకు (ది.01-04-2026 నుండి ది. 31-03-2027 వరకు) కాలమునకు ఆశీలు వసూలు చేసుకొనే హక్కు	రూ. 5,00,000/-	రూ. 1,50,000/-	రూ. 5,00,000/-

కేంద్ర ప్రభుత్వ జి.ఎస్.టి. నోటిఫికేషన్ నం. 12/2015 ది.28-05-2027 ప్రకారము మార్కెట్టు పాట విలువపై 18% జి.ఎస్.టి. పాటదారుడే చెల్లించవలెను.

సం/- కమిషనర్, తణుకు పురపాలక సంఘము

పురుగుమందుల అధిక వినియోగంతో అనర్థం

సదస్సులో పాల్గొన్న ఇన్‌ఛార్జి వీసీ

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయంలో మామిడి పంట యాజమాన్య పద్ధతులపై మేధోమథన సదస్సు వర్చువల్‌గా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ రాష్ట్ర సంచాలకుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి సాగులో ఎదురయ్యే సమస్యలకు ఉద్యాన వర్సిటీ పరిష్కారం చూపాలన్నారు. శాస్త్రవేత్తల బృందాన్ని సమన్వయం చేసుకొని, క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖను ఆదేశించారు. ఇన్‌ఛార్జి వీసీ ధనుంజయరావు మాట్లాడుతూ మామిడి సాగులో రెండో స్థానం, ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఏపీ ఉందన్నారు. రైతులు పురుగుమందులు అధికంగా వినియోగిస్తుండటంతో తేనెటీగలు తగ్గి పలదీకరణం జరగటం లేదన్నారు. దీని వల్ల పూత పిందెగా మారడం లేదన్నారు. మామిడికాయలకు సంచులు తొడగటం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. ఈ సంచులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. విస్తరణ సంచాలకురాలు రుథ్, పరిశోధన సంచాలకుడు రామానందం, సీనియర్ శాస్త్రవేత్తలు వెంకట స్వామి, గోవిందరాజులు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు

కైకలూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీరు సంస్థ లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఏలూరులో జిల్లా స్థాయి హ్యాక్‌థాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో కోడింగ్, ఏఐ టూల్స్‌పై నిర్వహించిన శిక్షణలో 15 పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కైకలూరు మండలం జంగంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ్ము నాగసాయి, బొమ్మిడి ఏసురాజు, తిరుమాని శ్రీబాలాజీ, తమ్ము పవన్ తేజ ప్రతిభ కనబరిచారు. వరద ముంపు నష్టాన్ని తగ్గించే అంశాలపై విద్యార్థులు ప్రదర్శించి ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమగ్ర శిక్షా అదనపు కోఆర్డినేటర్ కురేళ్ల పంకజ్‌కుమార్, మానిటరింగ్ అధికారి ఆర్.రామారావు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే హ్యాక్‌థాన్ పోటీలకు జంగంపాడు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు పి.సురేశ్‌కుమార్ వర్మను మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కబళించిన ప్రమాదాలు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఇద్దరు వాహన ప్రమాదాల్లో మృత్యువాత పడగా.. ఓ యువకుడు జలపాతంలో మునిగి చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సతీశ్ (పాతచిత్రం)

ముదినేపల్లి, కాళ్ల, న్యూస్‌టుడే: ఉపాధి కోసం ఊరుగాని ఊరు వెళ్లి చెరువులో పని చేస్తుండగా ట్రాక్టరు బోల్తా పడిన ఘటనలో సింగరాయపాలేనికి చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. సింగరాయపాలేనికి చెందిన తూము జాన్ సతీశ్(25) గురువారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్లలో చెరువులో ట్రాక్టర్‌తో బ్లేడు లాగడానికి వెళ్లారు. పని చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. సతీశ్‌కు ఏడాది క్రితమే వివాహమైంది. అతడి భార్యకు బుధవారం సీమంతం వేడుక నిర్వహించారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరక్టర్ కొడాలి వినోద్, వైకాపా నాయకులు వినయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

పాఠశాల బస్సు ఢీకొని వృద్ధుడు..

సత్యనారాయణ (పాత చిత్రం)

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డుపై నడిచి వెళుతున్న ఓ వృద్ధుడిని పాఠశాల బస్సు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి ఇందిరానగర్‌కాలనీకి చెందిన మారం సత్యనారాయణ (65) తాపీ, పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అతడి భార్య చనిపోవడంతో గత కొన్నేళ్లుగా హైదరాబాదులో ఉంటూ పనులు చేసుకుంటున్నారు. గురువారం ఉదయం జంగారెడ్డిగూడెంలో ఇందిరానగర్ కాలనీలోని మేనల్లుడు వద్దకు వచ్చారు. అతడితో మాట్లాడి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆంజనేయస్వామి విగ్రహం సమీపాన పాఠశాల బస్సు సత్యనారాయణను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై వీరప్రసాద్, ఏఎంవీఐ సీహెచ్ ఎస్ఎన్ మూర్తి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బస్సు చోదకుడు పరారీ అవ్వగా.. విద్యార్థులను మరొక బస్సులో విద్యాసంస్థల యాజమాన్యం తరలించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జలపాతంలో స్నానానికి దిగి యువకుడు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం దండిపూడి సమీపాన జలపాతం వద్ద ఒక వ్యక్తి మృతదేహం ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ జి.కృష్ణంరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన బోగోలు సత్యనారాయణ(18) కనిపించడం లేదని తల్లి అంజలి రెండు రోజుల కిందట జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దండిపూడి జలపాతంలో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం తెలిసి తల్లి అక్కడికి వచ్చి చూశారు. మృతుడు తన కుమారుడు సత్యనారాయణగా గుర్తించారు. స్నానానికి దిగి ఈత రాక ప్రమాదవశాత్తు మునిగి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృష్ణంరాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట శివారు మంకెనపల్లి సమీపంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందారు. గురువారం ఉదయం రోడ్డు పక్కన ఉన్న పొలంలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తడికలపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలు కామవరపుకోట పంచాయతీ యానాదుల కాలనీకి చెందిన చేవూరి జ్యోతి (45)గా గుర్తించారు. సీఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతి, భర్త నాగరాజుతో కలిసి కొత్తగూడెం రోడ్డులో ఉన్న కోళ్లఫారంలో పని చేస్తుంటారు. కామవరపుకోట పంచాయతీ యానాదుల కాలనీలో ఉన్న వారి సమీప బంధువుకు అనారోగ్యంగా ఉండటంతో బుధవారం అక్కడికి వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ దారిలో వారిద్దరూ మద్యం తాగారు. జ్యోతి మద్యం మత్తులో చింతలపూడి రోడ్డులోని పశువుల ఆసుపత్రి సమీపంలో రోడ్డు పక్కన పడుకుంది. భర్త ఆమెను వదిలేసి వెళ్లి కొంత సమయం తర్వాత వచ్చి చూడగా కనిపించలేదు. గురువారం ఉదయం మంకెనపల్లి దారిలో మృతి చెంది ఉంది. అతిగా మద్యం తీసుకోవడంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీకొన్న ఆటో.. 8 మందికి గాయాలు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను, పత్తేపురం మధ్య గురువారం రాత్రి చోటుచేసుకున్న ఆటో ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. బాధితులు.. స్థానికుల కథనం ప్రకారం పెదనింద్రకొలను తూర్పుపేట, ఎస్సీపేటకు చెందిన 15 మంది మహిళా కూలీలు చేబ్రోలు లిక్కర్ పరిశ్రమలో పనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా వచ్చిన పామును తప్పించే ప్రయత్నంతో ఆటో డ్రైవరు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో అది ముక్కలైంది. ఈ ప్రమాదంలో 8 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో ముగ్గుర్ని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మిగిలిన అయిదుగురికి పెదనింద్రకొలను ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేశారు. విషయం తెలిసిన వెంటనే కూలీల కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. క్షతగాత్రుల్లో ఏసమ్మ, మేరీ, పద్మ, పూర్ణ, బంగారమ్మ, పద్మ, సాయి, సంధ్య ఉన్నారు. ఆటో స్తంభాన్ని ఢీకొట్టిన వెంటనే సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

తీవ్ర ఉద్రిక్తతల నడుమ దానేశ్వరి అమ్మవారి ఊరేగింపు

ఇరు వర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

తణుకు గ్రామీణం,న్యూస్‌టుడే: దువ్వ దానేశ్వరి అమ్మ వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో రెండో రోజు అమ్మవారి విగ్రహ ఊరేగింపులో దువ్వ, వరిఘేడు గ్రామస్థుల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నూతనంగా నిర్మించిన ఆలయంలో పునఃప్రతిష్ఠించే కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారిని తాత్కాలిక గుడి నుంచి ఊరేగింపు ప్రారంభించారు. ఈ క్రమంలో దువ్వ, వరిఘేడు గ్రామస్థులు అమ్మవారు తమ గ్రామ దేవత అంటే తమ గ్రామ దేవత అంటూ వాదులాడుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయం వద్దకు చేరుకొని బలగాలను మోహరించారు. పోలీసుల బందోబస్తు నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధిలో ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బాలిక (17) ఇంటర్మీడియట్ చదువుతోంది. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తరువాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు బాలిక ఉరితాడుకు వేలాడుతున్నట్లు గుర్తించి కిందకు దించి వెంటనే నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

TO LET

COMMERCIAL

భీమవరం బైపాస్ రోడ్‌లో SR కాలేజ్ ఎదురుగా ఉన్న బెంగళూరు బేకరి షాపు, గొడౌన్ మరియు ప్రక్క షాపు అద్దెకు కలవు. కాంటాక్ట్: 98495 34774.

JOBS

ఏలూరు జ్ఞాపికా TVS షోరూమ్ పాతబస్టాండ్, సత్రంపాడులో వర్క్‌చేయుటకు కావలెను. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ 10-14 వేలు, టెలీకాలర్స్ 14-18 వేలు, డేటా ఆపరేటర్స్ 9-14 వేలు, సేల్స్ ఆపరేటర్స్ 9-14 వేలు వర్క్‌షాపు మేనేజర్స్ 14-25 వేలు ట్రైనీ టెక్నీషియన్స్ 12-25 వేలు, హెల్పర్స్ 9-12 వేలు సంప్రదించండి. ✆ 70957 09292, 94922 25959.

భీమవరంలోని శ్రీరాంపురం ఏరియాలో ఇన్‌స్టామార్ట్‌లో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. శాలరీ 18000+ EPFO+ ESI. ✆9885295999, 9885287999.

FACULTY/ TEACHERS

Wanted faculty Urgently Required Maths Faculty for IPE & JEE Mains. Contact: 86390 45758.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. **5.15** పైॱ
తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

భీమవరం

● భీమవరం ● ఉండి

పిల్లలు.. పతకాల వీరులు

ఆదర్శం ఈ అన్నాచెల్లెళ్లు

శృంగవృక్షం (పాలకోడేరు), న్యూస్‌టుడే: నేర్చుకోవాలనే పట్టుదల, పోటీతత్వం ఉంటే ఏ రంగంలోనైనా పతకాల పంట పండించవచ్చని నిరూపిస్తున్నారు శృంగవృక్షం గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్లు వరతదేవ్, సహస్ర. అన్న అయిదో తరగతి, చెల్లెలు మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కందుల సంధ్య, పణీకుమార్ తమ పిల్లలు చదువుతో పాటు క్రీడలు, ఆధ్యాత్మికత, కళా రంగాల్లో రాణించాలనే ఆలోచనతో చిన్ననాటి నుంచి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. ఫలితంగా ఒకరికి దీటుగా ఒకరు పతకాల సాధనలో పోటీ పడుతూ ఇప్పటి వరకు 15కు పైగా కైవసం చేసుకుని ఔరా అనిపిస్తున్నారు.

4 బంగారు, 2 కాంస్య

వరతదేవ్ క్రీడలు, కళల్లో తొలి నుంచి పట్టు సాధించడంతో ఏ పోటీలో పాల్గొన్నా పతకం ఖాయం. జనవరి నాలెడ్జ్‌కి సంబంధించి 2023లో రాష్ట్రస్థాయిలో జరిగిన స్కెల్ టీ పోటీలో, 2025లో జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. 2025, 2026లో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వరుసగా విజయం సాధించి రెండు బంగారు పతకాలు అందుకున్నాడు. జిల్లాలో 2023లో ఈత, పరుగు పోటీల్లో రెండు కాంస్య పతకాలు తన ఖాతాలో వేసుకున్నాడు.

భగవద్గీత శ్లోకాల్లో దిట్ట

సహస్ర అన్నకు దీటుగా పతకాల సాధనలో పోటీ పడింది. ఆరు బంగారు, 3 రజతాలు సాధించింది. చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవడంతో భగవద్గీత శ్లోకాలను అతి సునాయాసంగా పఠనం చేయడం అలవాటు చేసుకుంది. దీంతో జిల్లాలో 2023, 2025లో శ్లోకాల పఠనం పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించింది. 2023లో నేషనల్ సైబర్ ఒలింపియాడ్ సైన్స్ పోటీల్లో, 2025లో కలరింగ్, హ్యాండ్ రైటింగ్, ఎమెచ్ ఒలింపియాడ్ మ్యాచ్‌లో, 2026లో ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో బంగారు పతకాలు కైవసం చేసుకుంది. క్రీడల దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన పోటీల్లో రెండు రజతాలు సాధించింది. స్కెల్ టీలో బంగారు పతకం కైవసం చేసుకుంది.

స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు

ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సమ్మిట్-2కే26ను రెండు రోజులు నిర్వహించారు. స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని వక్తలు సూచించారు. పరిశ్రమల నిపుణులు పి.సుబ్బరాజు, రాజ్ సమాల మాట్లాడుతూ డిజిటల్ మార్కెట్, స్టార్టప్ ఎకోసిస్టమ్, అగ్రిటెక్ ఆవిష్కరణలు, స్థిరమైన వ్యాపారం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ మంగం వేణు, కౌశిక్ పాల్గొన్నారు.

చెరువు తవ్వేస్తాం.. పక్కన ఆక్రమించేస్తాం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో సాగు, మురుగునీటి కాలువలు ఆక్రమణలకు గురై సాగునీటి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. దీంతో సకాలంలో సాగుకు నీరందక, తుపాను సమయంలో ముంపు తగ్గక రైతులు నష్టపోతున్నారు.

నిబంధనల మేరకు పంట కాలువకు మూడు మీటర్లకు పైగా వదిలి అక్వా చెరువు గట్టు వేసుకోవాలి. దానికి భిన్నంగా చాలా చోట్ల చేస్తున్నారు. కొన్నిచోట్ల చెరువు తవ్వినప్పుడు కొంతమేర నిబంధనలు పాటించినా అనంతరం మరమ్మతుల సమయంలో కాలువ గట్టు వరకు మార్చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని చెరువులో కలిపేస్తున్నారు.

ఆక్రమణలతో నిండిపోయిన ఉప్పుటేరు సమీపంలో సింగ డ్రెయిన్

గతంలో స్వాధీనం.. ప్రస్తుతం పరాధీనం

దుంపగడప గ్రామ పరిధిలో ఉప్పుటేరు సమీపంలో ఆక్రమణలకు గురైన సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని గతంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ భూమిని ఆక్రమించి చెరువు తవ్వి ప్రస్తుతం రొయ్యల సాగు చేస్తున్నారు. అదే ప్రాంతంలో సింగ మురుగు కాలువ గట్టును తవ్వి ఆ మట్టిని చెరువు గట్టుగా వేసుకుంటున్నారు. సుమారు 5 కిలోమీటర్ల మేర ఉన్న ఈ మురుగు కాలువ ద్వారా ఆకివీడు, అయిభీమవరం, దుంపగడప పరిధిలో సుమారు 1100 ఎకరాల్లో మురుగు ఉప్పుటేరులో కలుస్తుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆక్రమణలోని భూమిని స్వాధీనం చేసుకుంటామని, కాలువ గట్టును తవ్వి మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని మురుగునీటి పారుదల శాఖ జేఈ జయప్రకాశ్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం గ్రామీణ:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

కాళ్ల, న్యూస్‌టుడే ? స్థానిక పీహెచ్‌సీ పక్కన జాతీయ రహదారిపై చెత్త ఎక్కువగా పేరుకుపోయింది. - నర్సింహమూర్తి, స్థానికుడు

✔ ఆ ప్రాంతంలో చెత్త వేయకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం. - సతీష్, కార్యదర్శి, కాళ్ల

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడులోని గుమ్ములూరు కూడలి ప్రాంతంలో డ్రెయినేజీ పూడిపోవడంతో మురుగు సమస్య ఉంది. వెంటనే పరిష్కరించాలి. - సురేష్, స్థానికుడు

✔ డ్రెయినేజీలో పూడిక తీయించి, మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు

ఉండి, న్యూస్‌టుడే: ? ఎన్నార్పీఅగ్రహారంలోని ఎస్సీ, బీసీ కాలనీల పరిధిలో రక్షిసుకోడు డ్రెయిన్‌పై అంబేడ్కర్ కూడలి, చర్చి ప్రదేశాల్లో కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - మేడిద సాయి జగన్నాథ్, ఎన్నార్పీఅగ్రహారం

✔ కల్వర్టులను అభివృద్ధి చేయాలని స్థానిక సంస్థల అధికారులకు సూచిస్తాం. - జయప్రకాశ్, డ్రైనేజీ శాఖ, ఏఈ, భీమవరం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే ? బ్యాంకు కాలనీ పరిధి కరణ నగర్‌లోని పలు ప్రధాన రహదారుల్లో ఉన్న డ్రెయిన్లలో పూడికతీయడం లేదు. దీంతో దోమల బెడద, దుర్వాసన వెదజల్లుతోంది. - ఎంటెక్కలప్ప, స్థానికుడు

✔ ఆ ప్రాంతాలు పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - చంటి, పురపాలక పారిశుద్ధ్య అధికారి

పాలకోడేరు, న్యూస్‌టుడే ? వేండ్రలో వేంద్ర అగ్రహారం వెళ్లే మార్గంలో పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దానికి ఇరువైపులా రెయిలింగ్ దెబ్బతింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - పి.సత్యనారాయణమూర్తి, వేంద్ర అగ్రహారం

✔ రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - బి.గోపి, ఇన్‌ఛార్జి కార్యదర్శి, వేంద్ర

భీమవరం (గ్రామీణ, న్యూస్‌టుడే: ? లోసరి పంచాయతీ ప్రధాన రహదారి వద్ద చెత్త పేరుకుపోయింది. దీని వల్ల దుర్వాసన వస్తోంది. - ముత్యాలరావు

✔ చర్యలు తీసుకుంటాం. - పంచాయతీ కార్యదర్శి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? మహాశివరాత్రికి రెస్ట్‌హౌస్ రోడ్డులో రథం ఊరేగింపు కోసం గుంతల్లో వేసిన చక్రు, నల్లకంకర వల్ల దుమ్ము రావడంతో వ్యాపారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక డీఈ తాతబ్బాయి స్పందించి ట్యాంకరుతో తడిపించి దుమ్ము రాకుండా చేయిస్తున్నారు.

శివాలయంలో కేంద్ర మంత్రి పూజలు

దిర్సుమర్రు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: దిర్సుమర్రు శివాలయంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధరాజు సీతారామరాజు-నారాయణమ్మ దంపతులు ఆలయానికి రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యాగణపతికి పెన్నులతో అలంకరణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా గునుపూడి విద్యాగణపతి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేసి సుమారు 500 పెన్నులతో అలంకరించారు. స్వామి దర్శనానికి వచ్చే విద్యార్థులకు పెన్నులు అందజేస్తారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష అందజేత

ఈవో అరుణ్‌కుమార్‌కు విరాళం అందిస్తున్న భక్తులు

కాళ్లకూరు (కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవనానికి కలవపూడికి చెందిన మంతెన అచ్యుతరామరాజు, లక్ష్మీ దేవి కుమారుడు మంతెన కాశీవిశ్వనాథరాజు రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేసినట్లు ఆలయ ఛైర్మన్ అడ్డాల శివరామ రాజు, ఈవో అరుణ్‌కుమార్ తెలిపారు. దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

చెక్కులు పంపిణీ చేస్తున్న సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: సామాన్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరంలోని ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో 33 మందికి రూ.14.61 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు, ఏఎంసీ ఛైర్మన్ కోటిపల్లి సుజాత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల వైద్యానికి తోడ్పాటు అందిస్తున్నారని అన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు మాధవి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఏడో వార్డు మారుతీనగర్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కమిషనర్ కె.రామచంద్రారెడ్డి గురువారం పరిశీలించారు. గతంలో టెండరు ఆమోదం పొంది పనులు ఇంకా పూర్తి కాలేదని వెంటనే ప్రారంభించాలని గుత్తేదారును ఆదేశించారు. పార్కుతో పాటు రహదారులు, డ్రెయినేజీలను పరిశీలించారు. ఖాళీ స్థలాలను మెరక చేసుకోవాలని వాటి యజమానులకు నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. డీఈలు తాతబ్బాయి, రహీం, మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ భావితరాలకు స్ఫూర్తిదాయకం

ప్రదర్శనలో పాల్గొన్న డీఎస్పీ రఘువీర్‌విష్ణు, మరాఠీ ప్రతినిధులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ భావితరాలకు స్ఫూర్తిదాయకమని డీఎస్పీ రఘువీర్‌విష్ణు అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా మరాఠీ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ప్రదర్శన నిర్వహించారు. రెండో పట్టణ మరాఠీ సంఘం ఆధ్వర్యంలో ఆదర్శ నగర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. ముందుగా శివాజీ ప్రతిమకు రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, డాక్టర్ పీఆర్‌కే వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో పీజీఆర్ఎస్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు.

పెదకాపవరంలో పర్యటన

మంచినీటి చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పెదకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: పెదకాపవరంలో ఆరోడ బ్యాంక్‌ రాష్ట్ర సలహాదారు, విశ్రాంత ఇంజినీరింగ్ చీఫ్ తేజ ప్రభాకరరావు, పెదపూడి నియోజకవర్గ ఆరోడ బ్యాంక్ అధికారులు, బ్రోస్ సంస్థ సభ్యులు డాక్టర్ సుధాకర్, శ్రీధర్ పర్యటించారు. గ్రామంలో మంచినీటి చెరువు, ఫిల్టర్‌బెడ్లు, సంపులు, మైక్రో యూనిట్ల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యాబోధన తీరుపై అధ్యయనం చేశారు. రాత పుస్తకాలు అందజేశారు. తాగునీటి సరఫరా యూనిట్‌ను పరిశీలించారు. వారి వెంట డీఎల్‌డీవో దాసిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

మత్తుతో భవిత చిత్తు

పాలకోడేరు, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని మోగల్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు త్రినాథులు అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా గురువారం పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి బాబు, సంకురుడు పాల్గొన్నారు.

కాస్త దారివ్వండి.. బయటపడాలి

ఆకివీడులోని పొట్టి శ్రీరాముల విగ్రహం కూడలి సమీపంలోని పెద్దపల్లి వీధి ఇరుకుగా ఉంది. దీనికి తోడు దుకాణాల ముందు రోడ్డుపై ద్విచక్ర వాహనాలు ఉంచడంతో ఈ వీధి శివారు ఉన్న నివాసాల ప్రజలు నిత్యం రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ఆకివీడు

తూడు.. అల్లుకుపోయింది చూడు

బొండాడ మేజర్ డ్రెయిన్‌ను తూడు, గుర్రపుడెక్క దట్టంగా అల్లుకుపోయింది. వెంటనే తొలగించకపోతే ఏ మాత్రం వర్షం కురిసినా ఉండి, కాళ్ల, పాలకోడేరు, భీమవరం మండలాల్లోని పొలాలు మునిగిపోతాయి. డ్రెయినేజీ శాఖ ఏఈ జయప్రకాశ్ మాట్లాడుతూ ఓఅండ్‌ఎం నిధులతో బాగు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఉండి



హై'టెన్షన్' బాబోయ్

కాళ్ల మండలం ఎల్ఎన్‌పురంలో బొండాడ కాలువను ఆనుకుని దిగువకు హైటెన్షన్ విద్యుత్తు లైను వెళ్లింది. పక్కనే కాలువ ఉండటం వేసిన కొన్నిరోజులకే స్తంభాలు ఒరగడంతో ఒకదాని కోసం మరో మూడు దన్నుగా పెట్టారు. ఇవి ఏ క్షణంలో పడిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పురం (కాళ్ల)

మురుగు పోదు.. దోమలు వదలవు

మెంటేవారితోటకు వెళ్లే రైల్వే అండర్ పాస్ కూడలి ప్రారంభంలో చాలా కాలంగా పైపు లీకేజీతో పాటు రైల్వే ట్రాక్ వద్ద చెత్త, మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమల ఉద్ధృతి ఎక్కువైంది. పురపాలక నీటి సరఫరా విభాగం డీఈ కె.తాతయ్య మాట్లాడుతూ మరమ్మతులు చేయిస్తామని వివరించారు. - న్యూస్‌టుడే, భీమవరం గునుపూడి

రక్కీసుకోడు.. వినండి గోడు

ఎన్నార్పీఅగ్రహారంలో రక్కీసుకోడు ఆక్రమణలకు గురైంది. దీంతో మహదేవపట్నం, ఎన్నార్పీఅగ్రహారం, పెద అమిరంలో 500 ఎకరాల ఆయకట్టు పరిధిలోని వరిచేలు అధిక వర్షాలకు ముంపుబారిన పడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. డ్రెయినేజీ శాఖ అధికారులు స్పందిస్తూ ఓఅండ్‌ఎం నిధులతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఎన్నార్పీఅగ్రహారం (ఉండి)

ఎవరి కోసం.. మరుగుదొడ్లు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం బస్టాండ్ అభివృద్ధికి ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక తూర్పు చెరువు సెంటర్‌లో పంచాయతీ నిధులతో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన బస్టాండ్‌లో ఇప్పటి వరకు మరుగుదొడ్ల సదుపాయం లేదు. ఈ ప్రాంగణం యాచకులు, ఆటోలు నిలిపి ఉంచేందుకు, ప్రైవేటు వ్యక్తులు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆవాసంగా మారింది. దీంతో ప్రయాణికులు లోపలకు వెళ్లలేని పరిస్థితి. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి కె. లక్ష్మి శుభ్రం చేయించారు. దాతల సహాయంతో బస్టాండ్‌ను అభివృద్ధి చేసి బస్సులు నిలిపేలా సంబంధిత అధికారులకు లేఖ రాయాలని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆ మేరకు ఇటీవల పంచాయతీ నిధులతో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. తాగునీటి చెరువు గట్టుపై ఉన్న బస్టాండ్‌లో వీటిని నిర్మించడంపై సర్వత్రా విమర్శలు వస్తుండటంతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి వాటిని నిలిపివేసి ఇతర పనులు చేయాల్సిందిగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆ శాఖ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా పనులు చేస్తున్నారు. స్థానిక వ్యాపారుల కోసమే మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చెరువు గట్టు ఆలయాలు, ఇతర నిర్మాణాలతో నిండిపోయింది. వాటి వల్ల చెరువు కలుషితమవుతోంది. మరుగుదొడ్లు పూర్తయితే చెరువు నీరు కలుషితమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీరవాసరం బస్టాండ్ ఆవరణలో నిర్మాణం

ఆక్రమణల తొలగింపులో రాజీ పడొద్దు

పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న ఆక్రమణల తొలగింపు విషయంలో రాజీ పడొద్దని తెదేపా సీనియర్ నాయకుడు మోటుపల్లి రామ వరప్రసాద్ అధికారులకు సూచించారు. ఆకివీడులో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గంగానమ్మకోడు అభివృద్ధి పనులను గురువారం కమిషనర్ కృష్ణమోహన్, తహసీల్దార్ ఫరూక్, తెదేపా పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా, వైద్యుడు బిలాల పరిశీలించారు.

పని ఒత్తిడి తగ్గించాలి

ఉండిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉండి, న్యూస్‌టుడే: న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు సైలాడ చిన్నారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, సర్వే సిబ్బందితో కలిసి గురువారం భోజన విరామ సమయంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పని ఒత్తిడి తగ్గించాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ భోజనం విరామ సమయంలో ఆకివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీఆర్వోలు మన్నె శ్రీను, దానయ్య, సాల్మన్, ఏసుబాబు, దాసు, హనుమంతరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి.. వీరవాసరం, న్యూస్‌టుడే: వీఆర్ఏలు, వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలంటూ మండల రెవెన్యూ ఉద్యోగుల ఐకాస డిమాండ్ చేసింది. ఈ మేరకు వీరవాసరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఏవీ.రామాంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగులు పసుపులేటి సత్యనారాయణ, అలివేలు, అలేఖ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు

పొత్తూరిని సస్పెండ్ చేయాలని డిమాండు

పాలకోడేరు, న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుపై తప్పుడు ఆరోపణలు చేసిన పొత్తూరి వెంకటేశ్వరరాజును తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పాలకోడేరు తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కొత్తపల్లి సూర్యనారాయణరాజు అధ్యక్షతన గురువారం పాలకోడేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొత్తూరి ఆరోపణలను ఖండించారు. ఉండి ఏఎంసీ డైరెక్టర్ కమ్మిల రాంబాబు, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షుడు వంశీకృష్ణంరాజు, నాయకులు సంకురుడు, కమ్మిల రాంబాబు, కొత్తపల్లి బాబు, బలరామకృష్ణంరాజు, నడిపూడి అప్పారావు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు : జనసేన

కాళ్ల, న్యూస్‌టుడే: ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజుపై వెంకటేశ్వరరాజు చేసిన అసత్య ఆరోపణలు సరికావని మండల జనసేన నాయకులు ఖండించారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేయడం తగదని మండల జనసేన అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు, యూత్ అధ్యక్షుడు మేకా కాళీచరణ్, ఉపాధ్యక్షుడు ఓగిరాల రాజేష్ అన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో నూతన ఉప కేంద్రానికి లైన్లు ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రెవానిపేట, గరవల్లదిబ్బతో పాటు ఆక్వా చెరువులకు, ఇండస్ట్రియల్ లైనుకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను ఉపయోగించుకోవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు యాళ్ల మోహనరావు, కార్యదర్శి గుమ్మళ్ల జక్కరయ్య సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లవచ్చని అన్నారు.

23 వరకు అభ్యంతరాల స్వీకరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కాంట్రాక్టు పద్ధతిలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టులను భర్తీ చేయడానికి సవరించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితా వెబ్‌సైట్లలో ఉంచామని రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 23లోగా రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడి కార్యాలయంలో వ్యక్తిగతంగా తెలియజేయాలని కోరారు.

అవి ఇవి అన్నీ

13 నుంచి నాటిక పోటీలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం కళాపరిషత్ 12వ వార్షికోత్సవాన్ని మార్చి 13 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా 13 నుంచి నాలుగు రోజులు జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన జరగనుందని ఎంపీడీవో కేఎం. వైభవతి తెలిపారు. మండలస్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆమె కోరారు.

పేదలకు అన్నదానం

ఉండి, న్యూస్‌టుడే: పేదల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలనే తన మనువడు చింతలపాటి శ్రీ వెంకట సత్య సాయి సూర్య కోరిక నెరవేరిందని ఉండి ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి శ్రీనివాసరాజు అన్నారు. అన్న క్యాంటీన్ ప్రాంగణంలో 600 మంది పేదల సమక్షంలో సాయి సూర్య గురువారం కేకు కోసి మాంసాహార వంటకాలతో అన్నదానం చేశారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సతీష్‌రాజు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్‌బాబు వ్యాపారులకు సూచించారు. గురువారం ఆయన ఆకివీడులోని దుకాణాలను పరిశీలించారు. లైసెన్స్ లేని 10 దుకాణ నిర్వాహకులకు లైసెన్స్ అందజేశారు. ఈ నెలాఖరులోపు నవీకరణ రుసుము చెల్లించాలని సూచించారు.

కొనసాగిన సమ్మె

వీరవాసరం, భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సహకార ఉద్యోగుల సంఘం ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె వీరవాసరంలో కొనసాగింది. డీసీసీబీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. భీమవరంలో ఉద్యోగులకు తాడేరు సొసైటీ అధ్యక్షుడు కొట్టు సురేష్ మద్దతు తెలిపారు. నాయకులు సుబ్బారావు, నర్సింహరాజు, ప్రకాశ్ వర్మ, టి.గంగరాజు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

కాళ్లకూరు గ్రామం, కాళ్ల మండలం, ప.గో.జిల్లా, 08816-245341, Cell: 89852 44445

సీల్డ్ టెండరు ప్రకటన

ఆర్.సి.సంఖ్య: 16-1/2026 తేది: 19-02-2026

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాళ్లకూరు వార్కి. ఈ క్రింది తెల్పిన ఐటమ్స్‌నకు సీల్డ్ టెండర్లు ద్వారా కోరబడుచున్నవి.

వ. నెం.	వివరములు	టెండరు స్వభావం	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ.	టెండరు షెడ్యూల్ ఖరీదు రూ.	టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ	టెండరు దాఖలు చేయుటకు ఆఖరు తేదీ సమయం	టెండరు తెరచు తేదీ/సమయం
1	కళ్యాణోత్సవముల సందర్భంగా తాటి ఆకు పందిళ్ళు వేయుట	సీల్డ్	ది. 01-04-26 నుండి 30-06-26	2000/-	100/-	ది.19-02-26 నుండి ది. 01-03-26 సా.5 గం.ల వరకు	ది. 2-3-26 ఉదయం 10.00 గం.ల వరకు	2-3-26 ఉదయం 10.30 గం.లకు
2	కళ్యాణోత్సవముల సందర్భముగా చాందిని అలంకరణ చేయుట	-డిటో-	ది. 25-04-26 నుండి ది. 09-05-26	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-
3	కళ్యాణోత్సవముల సందర్భముగా లైటింగ్ ఏర్పాటు చేయుట	-డిటో-	ది. 25-04-26 నుండి ది. 09-05-26	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-
4	కళ్యాణోత్సవముల సందర్భముగా కళ్యాణం వద్ద విద్యుత్ మెరుపుల ప్రదర్శన	-డిటో-	ది. 27-04-26 తేది రాత్రి గం.7.00లకు	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-
5	కళ్యాణోత్సవముల సందర్భముగా రథోత్సవంలో విద్యుత్ మెరుపుల ప్రదర్శన	-డిటో-	ది. 01-05-26 తేది రాత్రి గం.7.00లకు	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-
6	కళ్యాణోత్సవముల సందర్భముగా అన్నదానము రోజు పెండాల్స్ మరియు షామియానా సామాన్లు ఏర్పాటు చేయుటకు	-డిటో-	ది. 9-05-26 అన్నదానము	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-	-డిటో-

ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పని వేళల యందు సంప్రదించగలరు.

కాళ్లకూరు, ది. 19-02-2026 శ్రీ స్వామి వారి సేవలో ఛైర్మన్ సం/- కార్యనిర్వహణాధికారి

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

కుంభమేళా తరహా ఏర్పాట్లు అవసరం

నాయకర్

నరసాపురం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన మహా కుంభమేళా స్థాయిలో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన గురువారం ఈ అంశంపై మాట్లాడారు. పుష్కరాల సమయంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలిస్తారన్నారు. ఈ నేపథ్యంలో రహదారుల నిర్మాణం, పుష్కరఘాట్ల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ, భక్తులు, పర్యాటకులకు తాత్కాలిక వసతి, వైద్యశిబిరాలు, పటిష్ఠ భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులను కోరారు.

తగు జాగ్రత్తలతో మలేరియా నివారణ

స్థానికులకు అవగాహన కల్పిస్తున్న నాగబాబు

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఇలపర్రులో ఉప ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సహాయ మలేరియా అధికారి యాతం నాగబాబు గురువారం సందర్శించారు. ఈ కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, దస్త్రాల నిర్వహణ, ఔషధాల నిల్వలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మలేరియా, డెంగీ, ఫైలేరియా, గన్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, ఇతర జాగ్రత్తలు పాటించడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: రంజాన్ ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పాలకొల్లులో సున్నీజామియా మసీదును విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని ముస్లిం మత పెద్దలు షేక్ సిలార్ సాహెబ్, మహ్మమద్ జానీ, నజీర్ తెలిపారు.

సాంస్కృతిక సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శనలు అలరించాయి.

దాతల చేయూత.. ఉజ్వల భవిత!

సర్కారు బడులకు అపూర్వ సాయం

వడలి జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు గణపతినీడి తిలక్ రూ.75 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ పాఠశాల ప్రాంగణంలో రూ.1.30 లక్షల విలువైన క్రికెట్ నెట్ ఐరాన్ బాక్స్, క్రికెట్ కిట్‌లను గ్రామానికి చెందిన అత్యం నాగవెంకట సత్యనారాయణమూర్తి, మల్లికార్జునరావు బహూకరించారు. ఈ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించే విద్యార్థికి నెక్కంటి సూర్యనారాయణ(సూరిబాబు) రూ.25 వేల నగదు బహుమతి ప్రకటించారు.

వడలి (వాసవీ పెనుగొండ), నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా మన ఊరు.. మన పాఠశాలను మనమే అభివృద్ధి చేసి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే యోచనతో దాతలు చేయూతనందిస్తున్నారు. వాసవీ పెనుగొండ మండలం వడలి జడ్పీ ఉన్నత పాఠశాల, సోమరాజు చెరువు ప్రాథమిక పాఠశాల, నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో దాతల చేయూతతో పలు వసతులు సమకూరాయి.

☛ వాసవీ పెనుగొండ మండలం సోమరాజుచెరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెచ్చెట్టి భాస్కరరావు సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. బొంతు సూర్యనారాయణ, దంపనబోయిన లక్ష్మణరావులు జెండా స్తంభం, వేదిక నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు.

నరసాపురం మండలం యర్రంశెట్టి వారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు కొలపర్తి శ్రీనివాస్ తన భార్య సుజాత జ్ఞాపకార్థం రూ.2 లక్షల వ్యయంతో కళావేదిక నిర్మించారు.

☛ నరసాపురం మండలం చిట్టవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో అంజనీపుత్ర చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో అభిమానులు రూ.2 లక్షల వ్యయంతో సైకిల్ షెడ్డును నిర్మించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట:	90631 44737
పాలకొల్లు	: 80085 74510	వాసవీ పెనుగొండ:	80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర:	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని రాయాజీ వారి వీధిలో డ్రెయిన్లలో పూడికను సక్రమంగా తొలగించడం లేదు. మురుగు నిలిచిపోవడంతో దోమల బెడద పెరిగిపోతోంది. - **మోహనరావు, నరసాపురం**

✔ చర్యలు తీసుకుంటాం. - **పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? మంగలగుంట పాలెంలో లేసు అల్లికల భవనం వద్ద విద్యుత్తు పరివర్తకానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - **సత్యనారాయణ, మంగలగుంటపాలెం**

✔ చర్యలు చేపడతాం. - **కొల్లి సుధాకర్, విద్యుత్తు ఏఈ**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? ప్రభుత్వ కాలనీలో పైపులైను వాల్వు నుంచి శుద్ధజలాలు లీకై వృథాగా పోతున్నాయి. నీరు రాక ఇబ్బందులు పడుతున్నాం. - **బాజ్జీ, కేపీపాలెం నార్తు**

✔ మరమ్మతులు చేయిస్తాం. - **లోకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ**

యలమంచిలి, న్యూస్‌టుడే: ? ఊటాడలో డ్రెయిన్లు లేక మురుగు రహదారులపై నిలిచిపోతోంది. - **ఆనందరావు**

✔ ప్రాధాన్య క్రమంలో డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. - **జేడీవీ ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో**

మానసిక స్వచ్ఛతతో దైవానుగ్రహం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: రామకృష్ణ పరమ హంస బోధించిన భక్తి, ప్రేమ, సమానత్వాలను అందరూ ఆచరించాలని వక్త ఎన్.జోత్స్న అన్నారు. నరసాపురం పట్టణంలో రామకృష్ణ పరమహంస సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానసిక స్వచ్ఛతతో దైవానుగ్రహం పొందవచ్చన్నారు. అనంతరం సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

చిలుకల గుంపు.. కనులకు ఇంపు!

పాలకొల్లు, న్యూస్‌టుడే: రెండు, మూడు రామచిలుకలు కనిపిస్తేనే చూసేందుకు ఆహ్లాదంగా ఉంటుంది. అలాంటిది రామచిలుకల దండు కనిపిస్తే చూసేవారికి నయనానందమే. పాలకొల్లు మండలం చందపర్రులో ధాన్యం మిల్లు ప్రాంగణంలో కనిపించిన దృశ్యమిది. ధాన్యం గింజలు తినడానికి గుంపుగా వాలిన రామచిలుకలతో ఆప్రాంతమంతా నిండుగా కనిపించగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది.

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

పోడూరు, న్యూస్‌టుడే: తూర్పుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద వ్యర్థాలు, మురుగు సమస్యలపై 'అంగన్‌వాడీ చెంత.. సమస్యల చింత' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి ఎంసీహెచ్ సత్యనారాయణ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో ఆ ప్రాంతంలో డ్రెయిన్లో పూడికతీత పనులు చేయించారు.

నరసాపురంలో శోభాయాత్ర

పాలకొల్లు: ద్విచక్ర వాహన ర్యాలీలో యువత

ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

పాలకొల్లు మార్కెట్, గ్రామీణ, న్యూస్‌టుడే: దేశ గౌరవాన్ని కాపాడేందుకు ఛత్రపతి శివాజీ చూపిన ధీరత్వం యువయువతులకు ప్రేరణగా నిలుస్తుందని సామాజిక వేత్త సంగినీడి వెంకట రంగారావు అన్నారు. పట్టణంలోని జీవీఎస్‌వీ ఆర్ఎం పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం చింతపర్రు శివాలయం వద్ద శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశభక్తికి, ధీరత్వానికి మారుపేరు అన్నారు. అనంతరం పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో మరాఠా మండల్, హిందూ సేవాదళ్ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ ఘాట్ వద్ద భవానీ, ఖడ్గ పూజలు చేశారు.

దారి లేక.. గుట్టలు కానరాక!

యలమంచిలి, న్యూస్‌టుడే: పాలకొల్లు- దొడ్డిపట్ల ప్రధాన రహదారి వెంబడి అడవిపాలెంలో పలు చోట్ల ఇలా ఇసుక, కంకరగుట్టలు అడ్డదిడ్డంగా వేశారు. రోజుల తరబడి వీటిని ఇలాగే వదిలేస్తుండటంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళ ఇవి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పంచాయతీ లెక్కల్లో లోపాలు: తెదేపా

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గరువు పంచాయతీకి సంబంధించి గత అయిదేళ్ల జమాఖర్చుల వివరాలను బహిర్గతం చేయాలని తెదేపా గ్రామ అధ్యక్షుడు, పెనుమంట్ర సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు సత్తి సత్యానందరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభను ఏర్పాటు చేయగా సర్పంచి ముదునూరి నాగరాజు హాజరు కాకపోవడంతో కార్యదర్శి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో సత్యానందరెడ్డి మాట్లాడుతూ గ్రామ సభ నిర్వహణపై 15 రోజుల క్రితమే సర్పంచికి సమాచారం ఇచ్చినా ఆయన గైర్హాజరు కావడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ కార్యకలాపాలు, లెక్కల్లో అనేక లోపాలు ఉన్నాయని.. వాటిని బయట పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగతాయారు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం: డీసీసీబీ శాఖ వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

కొనసాగిన సహకార ఉద్యోగుల ఆందోళన

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం నరసాపురం పట్టణం, మొగల్తూరులలోని డీసీసీబీ శాఖల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సీఐటీయూ, ఉద్యోగ సంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు శిబిరాలను సందర్శించి మద్దతు ప్రకటించారు.

ప్రవేశాలు పెరిగేలా కృషి చేద్దాం

విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలిస్తున్న ఎంఈవో

పోడూరు, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా సమష్టిగా కృషి చేయాలని ఎంఈవో విజయకుమార్ పేర్కొన్నారు. వద్దిపర్రు శివారు చింతలకోటి గరువు ప్రాథమిక పాఠశాలలో ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు న్యాయం చేయండి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి చేనేత కార్మికులకు న్యాయం చేయాలని, సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి. జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో గురువారం ఆయన చేనేత కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందన్నారు. ఈ నెల 22న మంగళగిరిలో జరిగే చేనేత గర్జనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఊరంతా.. ఊరేగింపుగా!

గ్రామ ప్రదక్షిణ చేస్తున్న భక్తజనం

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి గ్రామ దేవత మూలస్థానేశ్వరి దేవి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండోరోజైన గురువారం వాస్తుపూజ, హోమం, క్షీరాభిషేకం, దిగ్దేవతా బలిహరణ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. వందలాది మంది గ్రామస్థులు అమ్మవారి పతాకాలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. పలువురు భక్తులు నూతన గరగలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాయంత్రం శాంతిదీక్ష కళా హోమం, మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాస్ బుజ్జి, బొప్పన రాంబాబు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, బొల్లింపల్లి ఏసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూర్తి కాకుండానే శిథిలావస్థకు!

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నడిపూడి గ్రామంలో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణం చేపట్టగా ఇలా అసంపూర్తిగా నిలిచిపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోకపోవడంతో కాలక్రమేణా గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. ఈ అంశంపై వెలుగు ఏపీఎం టి.పుష్పవతి స్పందిస్తూ అసంపూర్తి భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

పాత చీరలే.. ప్రహరీ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కె.బేతపూడిలో అంగన్‌వాడీ భవనానికి పూర్తి స్థాయి ప్రహరీ లేక పోవడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రాంగణం చుట్టూ రక్షణగా పాత చీరలను అడ్డుగా కట్టారు. ఈ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధ్వానం.. ఈ మార్గం

బ్రాహ్మణచెరువు- వెలగలవారిపాలెం- జుత్తిగ ఆర్అండ్‌బీ రహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఈ మార్గంలో కొన్నేళ్లుగా తాత్కాలిక మరమ్మతులు చేసి సరిపెడుతున్నారు. దీంతో గుంతలు పెద్దవై.. కంకర తేలడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ స్పందిస్తూ ఈ రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**

సాయిబాబాకు అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని వలవల వారి వీధి, పార్కు వీధి, స్వరాజ్య రామం వీధిలో ఉన్న శిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది.

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక శిర్డీసాయి బాబా ఆలయంలో పూజలు, అభిషేకాలు చేసి పంచ హారతులు హారతులు ఇచ్చారు.

వృథా.. ఆగదా!

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో తాగునీటి పైపులైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పురపాలక కార్యాలయం సమీపాన జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రాంతంలో పైపులైను లీకేజీతో ఇలా తాగునీరు వృథాగా పోతోంది. పట్టణ పరిధిలో స్టీమర్ రోడ్డు, పార్కు రోడ్డు, సాయిబాబా గుడి, సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డు, దేవుని తోట ప్రాంతాల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాలను పరిశీలించి పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తామని పురపాలక ఏఈ కిశోర్ తెలిపారు.

వంతెనపై ప్రమాద ఘంటికలు

జిన్నూరు,(పోడూరు), న్యూస్‌టుడే: తూర్పుపాలెం - శేషమ్మచెరువు గ్రామాల మధ్య నక్కల డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అప్రోచ్ రహదారి గోడలు కాలువలోకి ఒరిగిపోయాయి. ఒకవైపు గోడ కూలిపోయింది. వాసవీ పెనుగొండ, ఆచంట మండలాల్లో పలు గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారి గొలుసు మార్గంగా ఉపయోగపడుతోంది. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ మూర్తిని సంప్రదించగా నియోజకవర్గంలో పలు వంతెనల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత

త్రివిక్రమరావును సత్కరిస్తున్న రామచంద్రరాజు తదితరులు

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ అధికారభాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ వైవీవీ అప్పారావు అధ్యక్షతన మాతృభాషా దినోత్సవాన్ని ముందస్తుగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టు సాధిస్తే ఏ భాషలోనైనా రాణించవచ్చన్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు ఎందరో మహానుభావులు కృషి చేశారన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, అప్పారావు తదితరులు త్రివిక్రమరావును ఘనంగా సత్కరించారు. వ్యాస చంద్రిక, ఆనందరావు పట్నాయక్ కథలు, పుస్తకాలు రాసిన తోట రామకృష్ణ, మౌనిక దంపతులను త్రివిక్రమరావు, అతిథులు ఘనంగా సత్కరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు రంకిరెడ్డి రామ్మోహనరావు, తెలుగు విభాగాధిపతి కర్రి సురేశ్‌బాబు, తెలుగు అధ్యాపకుడు కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

సీసీఈ శిబిరానికి 10 మంది ఎంపిక

విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: నూతన ఆవిష్కరణలపై గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీసీఈ బూట్ శిబిరానికి పాలకొల్లు ఏఎస్ఎన్ఎం కళాశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ శిబిరానికి 60 మంది డిగ్రీ విద్యార్థులు ఎంపిక కాగా వారిలో 10 మంది తమ కళాశాలకు చెందిన వారని చెప్పారు. బీఏ నుంచి ఎస్.రమాదేవి, ఎ.ప్రదీప్, వై.సంతోశ్, బీఎస్సీ నుంచి జి.విద్యా వాసంతి, ఎన్.మధులిక, ఎన్.జ్యోతిదుర్గ, వి.దీపిక, బీకామ్ నుంచి కె.ఆనంద్‌నాగు, ఎం.కిరణ్‌బాబు, కె.మధుబాబు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

కలుషిత జలాలతో కలవరం

వరి చేలపై ప్రభావం

ఎండుతున్న దుబ్బు చూపుతున్న రైతులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: శేరేపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాలు జిన్నూరు పంట కాలువకు శివారున ఉన్నాయి. ఈ కాలువ పరిధిలో పలుచోట్ల ఆక్వా చెరువుల్లో వ్యర్థ జలాలను పంట బోదెల్లోకి వదులుతున్నారు. శేరేపాలెం పంచాయతీ పరిధి నవుడూరువానిగరువులో లక్కరోజు కోడు పరిధిలో సుమారు 70 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ కాలువలోకి ఆక్వాచెరువుల నీటిని వదిలివేస్తున్నారు. దీంతో జలాలు కలుషితమై వంతుల్లోనూ చేలకు నీరు తోడుకునే పరిస్థితి లేదు. దీంతో వరిచేలు నెర్రలు తీసి దుబ్బులు ఎండిపోయే స్థితికి చేరాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు.. వరిచేలను ఆక్వా చెరువులుగా మార్పు చేసేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. చెరువుల్లో మురుగు పంట కాలువల్లోకి, వరిచేలలోకి వెళ్లకుండా నేరుగా డ్రెయిన్లలోకి బోదెలు ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల ఇలాంటి బోదెలు ఏర్పాటు చేయలేదు. నవుడూరువానిగరువు, పాలకమ్మచెరువు, కొప్పర్రు తదితర ప్రాంతాల్లో నిబంధనలు పాటించకుండా తవ్విన చెరువుల్లో మురుగును పంట బోదెల్లోకి వదులుతున్నారు.

చేలు ఎండిపోతున్నాయి.. 'పంట బోదెల్లోకి చెరువుల్లో ఉప్పునీటిని వదిలివేస్తున్నారు. దీంతో 15 రోజులుగా చేనుకు సాగునీరు తోడే అవకాశం లేకుండా పోయింది. చేలు క్రమంగా ఎండిపోతున్నాయి.' అని స్థానిక రైతు గణేశుల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆక్వా చెరువుల నుంచి వదిలే మురుగు ప్రభావంతో నాట్లు దెబ్బతింటున్నాయని కౌలు రైతు పాలా వెంకట నాగేశ్వరరావు చెప్పారు.

ఆందోళన వద్దు.. శివారు ప్రాంతాల్లో చేలకు కూడా పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేస్తాం. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆక్వా చెరువుల మురుగును పంటబోదెల్లోకి వదలకుండా మత్స్య శాఖ అధికారులకు తగు సూచనలు చేస్తాం.

- వెంకటనారాయణ, జలవనరుల శాఖ డీఈ

పశు పోషణతో అదనపు ఆదాయం

పోడూరు, న్యూస్‌టుడే: పశు పోషణతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సాగునీటి పంపిణీ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు అన్నారు. వద్దిపర్రులో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను పాడి రైతులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి మహేశ్‌కుమార్ పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచి వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచి లోహిదాసు, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను ఉపయోగించుకోవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహనరావు, కార్యదర్శి జక్కరయ్య సూచించారు. ఉద్యోగులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు.

23 వరకు అభ్యంతరాల స్వీకరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కాంట్రాక్టు పద్ధతిలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టులను భర్తీ చేయడానికి సవరించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితా వెబ్‌సైట్లలో ఉంచామని రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 23లోగా రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడి కార్యాలయంలో వ్యక్తిగతంగా తెలియజేయాలని కోరారు.

CHANGE OF NAME

I, **THUMMALAPALLI VEERA NAGA SATYANARAYANA MURTHY (New Name),** S/o SRI RAMA MURTHY, Previously Called **TUMMALAPALLI VEERA NAGA SATYANARAYANA MURTHY (Old Name),** Resident of D.No: 9-14/1, T P GUDEM ROAD, MARTERU Village, PENUMANTRA Mandal, W G.Dt., Pin:534122, Andhrapradesh. I have changed my name from **TUMMALAPALLI VEERA NAGA SATYANARAYANA MURTHY (Old Name)** To **THUMMALAPALLI VEERA NAGA SATYANARAYANA MURTHY (New Name)** for all practical purposes.

పాస్‌పోర్టు పడిపోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం మండలం, ఎల్.బి.చర్ల గ్రామానికి చెందిన వేమవరపు ఆదిలక్ష్మి, భర్త: నాగరాజు అను నేను పాస్‌పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు మా ఇంటి వద్ద నుండి మోటారు సైకిల్‌పై మొగల్తూరు సెంటర్ వెళ్ళుచుండగా మార్గమధ్యలో నా బ్యాగ్ పడిపోయినది. దానిలో ఉన్న E7396716 నెంబరుగల ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. దయచేసి దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

వేమవరపు ఆదిలక్ష్మి, భర్త: నాగరాజు, డోర్ నెం: 1-58, కొత్తపేట, ఎల్.బి.చర్ల గ్రామం, నర్సాపురం మండలం, ప.గో. జిల్లా

యలమంచిలి గ్రామదేవత
శ్రీశ్రీశ్రీ మూలస్థానేశ్వరి అమ్మవారి
నూతన ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవములు
ది. 18-02-2026 నుండి 20-02-2026 వరకు జరుగుచున్న
సందర్భంగా నేడు 20-2-2026 శుక్రవారం అమ్మవారి
విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవమునకు
విచ్చేయుచున్న అతిరథ మహారథులకు, భక్తజనవాళికి
స్వాగతం – సుస్వాగతం.
శ్రీశ్రీశ్రీ మూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ, యలమంచిలి

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
మేడపాడు బ్రాంచి - 7209, సచివాలయం దగ్గర, మేడపాడు, సెల్: 93901 46309

బంగారు నగల వేలము నోటీసు

యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా, మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారు నగలు ది.27-02-2026 శుక్రవారం 4:00 గంటలకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరుయున్న బకాయిలకు జమకట్టబడును. వేలములో పాల్గొనదలచినవారు ది.27-02-2026 మధ్యాహ్నం 2:00 గం॥ లలోపు తమ గుర్తింపు కార్డును చూపి రూ.10,000/- ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలమును వేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయిలు రద్దు కానియెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చుల కొరకు వారిపై చట్టరీత్యా చర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

వ.నెం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	స్థూల బరువు
1.	720930049121865	మేకా వీర్రాజు, S/o వెంకన్న, D.No.1-23, మేడపాడు, ఏలమంచిలి మండలం	52.3 gms

ది. 20-02-2026 సం/- **అధీకృత అధికారి,**
ప్రదేశం: మేడపాడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, మేడపాడు బ్రాంచి

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

తపాలా శాఖ లేఖా రచన పోటీలు

తణుకు, న్యూస్‌టుడే: యూనివర్సల్ పోస్టల్ యూనియన్ 2026 ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ ఫర్ యంగ్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా గురువారం తణుకు ప్రధాన తపాల కార్యాలయం ఆధ్వర్యంలో లేఖా రచన పోటీలు నిర్వహించారు. ఆదిత్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో 'డిజిటల్ ప్రపంచంలో మానవ సంబంధాలు' ఎందుకు ముఖ్యమో స్నేహితుడికి ఒక లేఖ రాయండి అనే అంశంపై లేఖా రచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా, అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పోస్ట్‌మాస్టర్ చిట్టా వెంకట సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఎం సూర్యప్రకాశ్, ఎన్.శ్రీనివాసరావు, కె.వరప్రసాద్, నరసింహమూర్తి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

ఏపీనిట్ (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలో అపుస్మా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడలను ఏపీనిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనడం అభినందనీయమన్నారు. కబడ్డీ, ఖోఖో, పరుగు, క్రికెట్‌తో పాటు అథ్లెటిక్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో కేవీఎస్ రామాంజనేయులు, పెంటపాడు ఎంఈవో-2 టీవీ రామకృష్ణ, అపుస్మా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, నాయకులు జంగా బాలాజీ, భోగేశ్వరరావు, చిరంజీవి, ఎమ్ఎల్ ఎస్ఎన్ రెడ్డి, అత్తంటి సుబ్బరాజు, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలతో ఆరిమిల్లి

చేనేత స్టాల్‌ను సందర్శించిన రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాల్‌ను రాష్ట్ర మంత్రులతో కలిసి గురువారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సందర్శించారు. బీసీ సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యేలు హరిరామ జోగయ్య, చింతమనేని ప్రభాకర్, నల్లమిల్లి రామకృష్ణ, దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు.

చలాకీగా ఆడేస్తాం.. పతకాలు పట్టేస్తాం

ఇరగవరం, న్యూస్‌టుడే: లక్ష్యం బలంగా ఉంటే పేదరికం అడ్డు కాదని చాటి చెబుతున్నారు తూర్పువిప్పర్రు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు. ఒక పక్క పదో తరగతి చదువుతూనే మరో పక్క వివిధ ఆటల్లో రాణిస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ చౌరవ, వ్యాయామోపాధ్యాయురాలు సుమలత శిక్షణలో క్రీడల్లో రాటుదేలుతున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు.

పోలీసు అవుతా..

నా పేరు పువ్వాల యశ్వంత్ కుమార్. పదో తరగతి చదువుతున్నా. తండ్రి రాంబాబు కూలి పనికి వెళతారు. కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించా. రాష్ట్రస్థాయి అండర్ -17 విభాగంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో పోలీసు కావాలన్నది నా లక్ష్యం.

పురావస్తు నిపుణుడు కావాలని..

నా పేరు గుండారపు సాయిదుర్గ. పదో తరగతి చదువుతున్నా. తండ్రి లోవరాజు కూలిపని చేస్తారు. రాష్ట్రస్థాయిలో అండర్ -17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఖో-ఖో, రన్నింగ్ పోటీల్లో రాణించా. భవిష్యత్తులో పురావస్తు నిపుణుడిగా అవ్వాలన్నదే నా ఆశయం.

క్రీడా కోటాలో..

నా పేరు ఖండవల్లి లక్ష్మీ ప్రసాద్. పదో తరగతి చదువుతున్నా. తండ్రి ఆదిమూర్తి, తల్లి జ్యోతి కూలి పనికి వెళతారు. అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయిలో షాట్‌పుట్, కబడ్డీ, ఫెన్సింగ్, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నా. బాగా చదువుకుని క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

జాతీయ స్థాయిలో..

నా పేరు వీధి అభిషేక్. పదో తరగతి చదువుతున్నా. తండ్రి లేకున్నా తల్లి దయామణి కూలి పనికి వెళ్తూ నన్ను చదివిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అండర్ -17 విభాగంలో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా రాణించాలన్నదే నా ఆశయం.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? సాయిబాబా ఆలయం రోడ్డులో డంపర్‌బిన్ రహదారిలోకి రావడంతో ప్రమాదకరంగా మారింది. - **రామారావు, స్థానికుడు**

✔ చర్యలు చేపడతాం. - **ఏసుబాబు, పురపాలక కమిషనర్**

? యాగర్లపల్లి బీసీ వసతిగృహం రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది. - **నరేంద్ర, స్థానికుడు**

✔ రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. - **సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ దృష్టికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తీసుకెళ్లారు. దీంతో రూ.4.80కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటితో అత్తిలి మండలంలోని అత్తిలి-అలంపురం రోడ్డుతో పాటు, యర్రాయచెరువు -పీ వేమవరం, రేలంగి మంటలాలు దేవాలయం నుంచి ఇందిరా నగర్ వరకు రోడ్డు నిర్మాణానికి గురువారం కూటమి నాయకులు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు పోలిశెట్టి చంద్ర, డీసీ ఛైర్మన్ నల్లూరి సీతారామరాజు, భాజపా మాజీ ఏఎంసీ ఛైర్మన్ దాసం బాబ్జీ, ఆనాల ఆదినారాయణ, ఆళ్ల అజయ్, మామిడిశెట్టి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి మండలంలో ఆలయం నుంచి కేతావారి పాలెం, లక్ష్మీనరసింహ స్వామి గుడి మీదుగా ఇందిరానగర్ ప్రాంతానికి నిర్మించనున్న రోడ్డు పనులకు కూటమి నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. 4కిలో మీటర్ల రహదారిని రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కోరుతూ గత నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన గురువారం ముగిసింది. రెవెన్యూ సిబ్బందిపై పనిభారం, ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ యూనియన్ నాయకులు ఎం.సుధీర్, సీహెచ్ అప్పారావు, ఎస్.గాయత్రి, లక్ష్మీప్రియ, ఉమ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ పూజలు

దండగర్ర(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని దండగర్రలోని కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం దేవతామూర్తులకు గ్రామస్థులు ధాన్యాధివాసం నిర్వహించారు. ఈ క్రతువులో సర్పంచి పిల్లా రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందుకున్న వారితో వలవల బాబ్జీ

పేదవాడికి అండగా కూటమి ప్రభుత్వం

భాగ్యలక్ష్మీపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పేదవాడికి అండగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని ఏపీ భవన ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. గురువారం భాగ్యలక్ష్మిపేటలోని తెదేపా విడిది కార్యాలయంలో నియోజకవర్గంలోని 48 మందికి రూ.25,90,651 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించి మాట్లాడారు. ఎవరికి ఆపద వచ్చినా ప్రభుత్వం పార్టీలకతీతంగా ఆదుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ అభివృద్ధి సహకార ఛైర్మన్ ఆకాశపు స్వామి, నాయకులు దాసరి అప్పన్న, మత్తాల సత్యనారాయణ, గండం నరేష్, పద్యాలపాటి మురళీ, సబ్బినీడి కృష్ణమోహన్, గురుజు సూరిబాబు, ఎస్‌కే బాజీ, శ్రీరాముల విజయలక్ష్మి, ములగాల బాబ్జీ, అచ్యుత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతలో భాగస్వాములు కండి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ తాడేపల్లిగూడెం కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం పురపాలక కమిషనర్ ఎం. ఏసుబాబు గురువారం స్థానిక తణుకు రోడ్డులో ఉన్న ఆటో డ్రైవర్లను కలిసి మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రతలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టడానికి ప్రతి ఒక్కరూ అధికారులతో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాల పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని కోరారు. బహిరంగ మూత్ర విసర్జన మానివేయాలన్నారు. దగ్గరలో ఉన్న శౌచాలయాలను ఉపయోగించుకోవాలని, అప్పుడే ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఆటో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ కమిషనర్‌కు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసుబాబు

వైభవంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఏపీనిట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ధీరుడు, ఓటమి ఎరుగని మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఏపీనిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్ రెడ్డి కొనియాడారు. ఏపీ నిట్ గ్రంథాలయ ఛైర్మన్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశ గర్వించదగ్గ రాజుల్లో శివాజీ ఒకరని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన యోధుడిగా ఆయన నిలిచారన్నారు. అన్ని మతాలను సమానంగా ఆదరిస్తు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆచార్యులు తేజావత్ రమేష్, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణవేణి, శరత్ ద్వివేది, సహాయ లైబ్రేరియన్ కమల మహంతి, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: నివాళులర్పిస్తున్న దినేష్ శంకర్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: హిందువుల కోసం పాటు పడిన గొప్ప వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని హనుమాన్ శక్తి జాగరణ సమితి సభ్యులు తెలిపారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం అత్తిలిలో శివాజీ స్ఫూర్తి యాత్రను గురువారం నిర్వహించారు. అత్తిలి సంతాన వేణు గోపాల స్వామి ఆలయ ప్రాంగణం నుంచి యాత్రను ప్రారంభించారు. అధిక సంఖ్యలో హిందువులు యాత్రలో పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం తణుకులో శివాజీ స్ఫూర్తి యాత్ర అత్యంత వైభవంగా జరిగింది. హిందూ సంఘాల ఐక్యవేదిక, ఏబీవీపీ, మరాఠీ యూత్, మహిళా సంఘాల సంయుక్తంగా తణుకు డిగ్రీ కళాశాల నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా కేశవస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ, మహిళలు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి లక్షల విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.1.12 లక్షల విరాళం సమకూరింది. తణుకు మండలం పైడిపర్రుకు చెందిన చీర్ల సందీప్ సాయి మణికంఠ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో గురువారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో దుర్గారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

దాతకు పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో దుర్గారావు

సమస్యలు పరిష్కరించండి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారుల నిరసన నాలుగో రోజుకి చేరింది. గురువారం వీఆర్వోలు అత్తిలి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా వర్క్ టు రూల్ అమలు చేస్తామని, అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అత్తిలి మండల వీఆర్వోలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త వీడదు.. మురుగు పారదు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పురపాలక సంఘ పరిధిలోని 16 వార్డులో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. ముఖ్యంగా అరుంధతీ పేట, మడుగు గట్టు ప్రాంతాల్లోని రోడ్ల అంచుల్లో, మురుగు కాలువల్లో చెత్త వేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇదిలా ఉంటే స్థానిక సచివాలయం పరిధిలో ఉన్న మంచి నీటి ట్యాంక్ వద్ద పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యింది. ఆయా ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడతామని ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

16వ వార్డు నివేదన

జనాభా: 2870

ప్రాంతాలు: వెంకట్రాయపురం, అరుంధతీ పేట, స్థానిక పురపాలక కార్యాలయం, హరిశ్చంద్ర టవర్స్ ప్రదేశం, ఆంధ్ర షుగర్స్ క్వార్టర్స్, మడుగుగట్టు.

రోడ్డు అంచుల్లో వ్యర్థాలు

ఇవీ ప్రధాన సమస్యలు..

వార్డులో మురుగు నీరు, దోమల సమస్య, కుక్కల స్వైరవిహారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ★ పూడిక తీత సక్రమంగా జరగకపోవడంతో మురుగు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. ★ మురుగు రోజుల తరబడి నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. ★ దోమలు విజృంభించి తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ★ మురుగు కాలువల్లో బ్లీచింగ్ చెల్లిన దాఖలాలు కనిపించడం లేదు. ★ ఫాగింగ్ అంతంత మాత్రంగా చేస్తున్నారు. ★ వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ఇటుక బట్టీ... నిబంధనలు పక్కన పెట్టి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలకు పొగ పెడుతున్నారు. జనావాసాల మధ్యలో ఇటుక బట్టీలు నెలకొల్పి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మట్టి తవ్వాలన్నా, బట్టీలు నిర్వహించాలంటే పలు శాఖల అనుమతులు కావాలి. అవేవీ తీసుకోకుండా నియోజకవర్గంలో పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నారు.

విపరీతంగా వెలువడుతున్న పొగ

రహదారుల పక్కనే..

బట్టీలు రహదారి పక్కనే ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో నివాసితులు, ప్రయాణికులు విపరీతమైన కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటుకలు కాల్చే సమయంలో వెలువడే పొగ, కాల్చిన తర్వాత రేగుతున్న బూడిదతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. బట్టీ ఏర్పాటుకు కనీసం అయిదెకరాల స్థలం ఉండాలి. కానీ అటువంటి నిబంధనలెక్కడా పాటించడం లేదు.

అనుమతులు లేకుండా

వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగించాలంటే రెవెన్యూ అధికారులకు నాలా రుసుం చెల్లించాలి. అనంతరం గ్రామ పంచాయతీ కాలుష్య మండలి అనుమతి పొందాలి. ఆ తర్వాతే ఇటుకల బట్టీని ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో ఏ ఒక్క నిబంధన పాటిస్తున్న దాఖలాలు లేవు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

తణుకు నియోజకవర్గంలో అత్తిలి మండలంలో అత్తిలి, మంచిలి, ఆరవల్లి, పాలూరు, కొమ్మర, బల్లిపాడు, తిరుపతిపురం, వరిఘేడు, తణుకు మండలంలో దువ్వ, ఇరగవరం మండలంలో కావలిపురం, తూర్పువిప్పర్రు తదితర ప్రాంతాలు.

మార్గదర్శకాలు ఇవీ..

ఇటుక బట్టీల నిర్వహణపై కేంద్ర పర్యావరణ శాఖ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. జనావాసాలు, పంటలు పండే తోటలకు 800 మీటర్ల దూరంలో ఉండాలి. రెండు బట్టీల మధ్య కచ్చితంగా కిలో మీటరు దూరం ఉండాలి. బట్టీలన్నీ ఒకే చోట ఏర్పాటు చేస్తే క్లస్టర్లుగా మారి ఆ ప్రాంతంలో వాయు కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందన్న కారణంతో ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని పేర్కొంది. నిబంధనలు పాటించని ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మాట్లాడుతున్న వర్మ

సామాజిక న్యాయ దినోత్సవం

తణుకు, న్యూస్‌టుడే: సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వికసిస్తుందని ప్రముఖ సామాజిక వేత్త డి.వి.వి.యస్.వర్మ, ప్రధానాధ్యాపకుడు సీహెచ్. ఏడుకొండలు పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం ఎదుర్కొంటున్న అసమానతలు, పేదరికం, ఆర్థిక అసమతుల్యత, సమాన అవకాశాలు, సమాన హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విష్ణువర్ధన్, ఇందిరా కుమారి, నారాయణ, కనక మహాలక్ష్మి, జీవన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

తణుకు, న్యూస్‌టుడే: చంద్రబాబు సర్కారు చేస్తున్న మోసాలు, అన్యాయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన నివాసంలో వైకాపా నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మంచి చేయకుండా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు దాడులు, విధ్వంసాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రజల్లో ఉంటూ చంద్రబాబు చేస్తున్న అరాచకాలు, దాడులు, విధ్వంస పాలనను ప్రజలకు తెలియజెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

పెంటపాడు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఉత్తమ సేవలకు గుర్తింపుగా పెంటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జి.శివయ్య భీమవరం జిల్లా రిజిస్ట్రార్(డీఆర్)గా పదోన్నతి పొందారని లేఖర్లు అన్నారు. గురువారం పెంటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖర్లు ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో లేఖర్లు డి.చంద్రయ్య, వెంకటేశ్వరరావు, ఆర్‌వీ సత్యనారాయణ, సంకు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారి.. బీటలు వారి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వేల్పూరు గ్రామంలో పాండురంగడు గుడి వీధిలో రోడ్డు బీటలు వారి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇటుగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురి అవుతున్నామని చోదకులు, స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, చోదకులు కోరుతున్నారు. దీనిపై వేల్పూర్ పంచాయితీ కార్యదర్శి రత్నమాలిక స్పందిస్తూ.. పరిశీలించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు, ఉద్యోగులు

హామీలు నెరవేర్చాలి

తణుకు, న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల న్యాయమైన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. తణుకులో సహకార సంఘ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు గురువారం సీఐటీయూ మద్దతు తెలిపింది. ప్రతాప్, యూనియన్ రాష్ట్ర నాయకుడు సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో సహకారం సంఘ ఉద్యోగుల పాత్రను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, నాగన్న, విష్ణు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకంపై అవగాహన

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మండపాక గ్రామంలో గురువారం పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఐఐఎల్ (ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తణుకు మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర ప్రసాద్ రైతులకు పురుగు మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఐఎల్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ శివ సత్యనారాయణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కార్యాలయం వద్ద అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షల ఫలితాల ఆధారంగా డా బి.రమేష్ కుమార్ వైద్య సలహాలు అందించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనం

ఇప్పటికి 80 శాతం పూర్తి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అమలు చేస్తోంది. ఆయా సేవలు రైతులకు పారదర్శకంగా అందించేందుకు ఈ-పంట విధానం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం రబీలో సాగు చేసిన పంటల నమోదు 80శాతం పూర్తయింది. మిగిలిన అన్నదాతలు వెంటనే ఈ పంట నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అత్తిలి మండలంలో 14300 ఎకరాలకు గానూ ఇప్పటి వరకు 12155 ఎకరాలు ఈ పంట నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి రాజేష్ తెలిపారు.

సాగు చేయని భూములు సైతం

ఈ పంట నమోదు కోసం వ్యవసాయ శాఖ, పంట రకం, సర్వే నంబరు, సాగు విస్తీర్ణం, సాగునీటి వనరులు వంటి వివరాలు ఏటా ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారు. ఈసారి పంట సాగు చేయని భూములను సైతం నమోదు చేయాల్సి ఉంది. ఎంపిక చేసిన సర్వే నంబరులోని పొలానికి వెళ్లి రైతుతో పాటు పంట చిత్రం, అలాగే సాగు చేస్తున్న చిత్రం తీసుకోవాలి. పూర్తి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

క్షేత్ర స్థాయిలో సమస్యలు

ఆధార్ నంబరు చరవాణి నంబరుకు అనుసంధానం చేసుకోవాలి. కొంతమంది రైతులు ఇంకా అనుసంధానం చేసుకోలేదు. దీంతో నమోదు ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈనెల 20 లోపు పూర్తి చేయాలని చెబుతున్నా ఆ సమయానికి పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు.

స్టార్టప్‌లను వివరిస్తున్న విద్యార్థులు

స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సమ్మిట్-2కె26ను రెండు రోజులు నిర్వహించారు. స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చు కోవాలని వక్తలు సూచించారు. పరిశ్రమల నిపుణులు పి.సుబ్బరాజు, రాజ్ సమాలా మాట్లాడుతూ డిజిటల్ మార్పిడి, స్టార్టప్ ఎకోసిస్టమ్, అగ్రిటెక్ ఆవిష్కరణలు, స్థిరమైన వ్యాపారం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ మంగం వేణు, కౌశిక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ కె.నరసింహమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

గణపవరం - చేబ్రోలు మధ్య ఆర్టీసీ బస్సులు నడపాలి

నిడమర్రు, న్యూస్‌టుడే: గణపవరం - చేబ్రోలు వయా పత్తేపురం మధ్య ఆర్టీసీ సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రూటులో బస్సులు లేక ఆరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ సర్వీసులు నడపడం వల్ల పెదనిండ్రకొలను, దేవరగోపవరం, పత్తేపురం, ఆముదాలపల్లి, బైనేపల్లి, తోకలపల్లి గ్రామాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. గతంలో సర్వీసులు నడిపేవారని.. అటు భీమవరం, తాడేపల్లిగూడెం వెళ్లడానికి అనుకూలంగా ఉండేదని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి సర్వీసులు నడపాలంటున్నారు.

పశు అక్రమ రవాణా అరికట్టాలి

తణుకు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పశు అక్రమ రవాణాను అరికట్టాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తణుకు మండలం తేతలిలో లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ సరైన పత్రాలు లేకుండానే పశువులను బాహాటంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో నివాసముంటున్న వాళ్లు పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసన కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన చేస్తే, సమస్య పరిష్కారానికి ఆలోచించకుండా అన్యాయంగా వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ గ్రాట్యుటీ, పింఛను సౌకర్యాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పండ్ల మార్కెట్ జట్టు కార్మికుల యూనియన్ వార్షికోత్సవం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన గురువారం జరిగింది. 2025 సంవత్సరానికి గాను కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు. హోల్‌సేల్ వ్యాపారాలు అంతగా లేకపోవడంతో హమాలీల ఆదాయం తగ్గిపోతోందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జవ్వా శ్రీను, సహాయ అధ్యక్షుడిగా తట్టాగొట్టి పెద్దిరాజు, కార్యదర్శిగా కాయల దుర్గాప్రసాద్, కోశాధికారిగా పుట్టా ఏసు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపురపు రంగారావు, పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీను, జిల్లా కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో నాగేశ్వరరావు , రంగారావు

జగన్‌ను కలిసిన రఘురామ్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిలోని వైకాపా పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు కలిసారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపైనా, ఆక్వా రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు రఘురామ్ తెలిపారు.

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప

నగుబాటన నాలుగో సింహం

కట్టు తప్పుతున్న పోలీసులు దందాలు.. సెటిల్‌మెంట్లలో తలమునకలు

● కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహించే ఓ ఎస్సై, కానిస్టేబుల్ రూ. కోట్లకు పడగలెత్తారు. ఇప్పటికే ఇంద్రభవనాలను తలపించే ఇళ్లు నిర్మించుకున్నారు. భూములూ కొనుగోలు చేశారు.

● డివిజన్ స్థాయి పోలీసు అధికారి ఒకరు ఓ కేసు నమోదు విషయంలో రూ. వేలల్లో నగదు తీసుకున్నారు.

● కడప రాజారెడ్డివీధిలో జూదమాడుతూ ముగ్గురు పోలీసులు ఇటీవల అడ్డంగా దొరికిపోయారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాల్సినోళ్లే అందులో మమేకమవ్వడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

● బద్వేలు ఠాణాలో పని చేసే ఓ కానిస్టేబుల్ కేసులో పట్టుకున్న కారును ఏకంగా తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నారు.

● కడప నగరంలో కోట్ల రూపాయల మోసం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సదరు ఘటనకు సంబంధించిన ఠాణాలో కాకుండా వారికి అనుకూలమైన ఠాణాకు బదలాయించారు. ఇందుకుగాను పోలీసు అధికారులు భారీగా ముడుపులు తీసుకున్నారు.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మారు పేరుగా చెప్పుకొనే పోలీసు శాఖలో కొందరు కట్టు తప్పుతున్నారు. చట్ట ప్రకారం ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వాళ్ల దారి తప్పుతున్నారు. ఠాణాల్లో సివిల్ దందాలు చేస్తున్నారు. సెటిల్‌మెంట్లు సాగిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో మునిగి దొరికిపోతున్నది కొందరైతే.. అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ దొరికిపోతే కేసులు లేకుండా చేసేందుకు చేతులు తడపాలంటూ హుకుం జారీ చేస్తున్నది ఇంకొందరు. ఈ క్రమంలో కొందరు దొరికిపోతుండగా.. మరికొందరు తెలివిగా తప్పించుకుంటున్నారు.

కాసులు.. సిఫార్సులకే కేసులు

ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు- పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఇందులో పలువురు సమస్యలు విన్నవిస్తున్నారు. అనంతరం అవి సంబంధిత ఠాణాలకు బదలాయిస్తున్నారు. బాధితులు అక్కడికి వెళ్తే సిబ్బంది ఎలాంటి న్యాయం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాసులిచ్చిన వాళ్ల వైపు మొగ్గు చూపుతూ అన్యాయం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ఠాణాల్లో చేయి తడపనిదే, ఏదో ఓ రాజకీయ నాయకుడి సిఫార్సు లేనిదే కేసు నమోదు చేయడం లేదు.

పాపా.. ప్రమాదమని చెప్పవా!

ఓ చిన్నారిని తన తండ్రి ఇలా ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తూ 'న్యూస్‌టుడే' కెమెరాకు ప్రొద్దుటూరు కోర్టు రోడ్డులో గురువారం కనిపించారు. తండ్రి మెడ ఆధారంగా నిల్చున్న ఆ చిన్నారి.. ఇతర వాహనదారులు పెద్దగా చేసే శబ్దానికి(హార్న్) భయపడి పట్టు వదిలేస్తే ఎంత ప్రమాదకరమనే విషయాన్ని విస్మరించారు. ఈ తరహా ప్రమాదకర ప్రయాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

మద్యం దుకాణాలకు 23న లాటరీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మిగిలిపోయిన 11 మద్యం దుకాణాలకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 22న పరిశీలన, 23న కలెక్టరేట్‌లో లాటరీ ఉంటుందని ఆయన వివరించారు.

● రాజంపేటలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం, మిత్రా మెగా టౌన్‌షిప్ ప్రాజెక్టు ప్రభుత్వ, పోరంబోకు భూములు, వాగులు, వంకల్ని ఆక్రమించారు.

- శాసనమండలిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్న.

● రాజంపేట, నందలూరు మండలాల్లో వైకాపా నేతలు భారీ ఎత్తున భూదందాలు సాగించారు. వేలాది ఎకరాలు కాజేశారు. వీటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటే బావుంటుంది.

- ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీలో తెదేపా నేత చమర్తి జగన్‌మోహన్ రాజు అభిప్రాయం.

● రాజంపేట మండలం తాళ్లపాక రెవెన్యూలోని సర్వే నంబర్లు 1076, 1080, 1082లో అన్నమాచార్య విశ్వవిద్యాలయం 5.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించింది. రాజంపేట పురపాలక సంఘ పరిధిలోని సర్వే నంబర్లు 1362/3, 1362/4, 1363/2 తదితర వాటిలో మిత్రా టౌన్‌షిప్ కూడా ప్రభుత్వ భూముల్ని భారీగా ఆక్రమించింది. తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

- సీఎం కార్యాలయం, శాసనమండలికి మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరణ.

భూచోళ్లు దోచింది నిజమే!

ఆక్రమణలపై తేల్చిన రెవెన్యూ మంత్రి

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

వైకాపా అధికారంలో ఉండగా రాజంపేట నియోజకవర్గంలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తమకు ఎదురేలేదన్నట్లు చట్టాలను తుంగలో తొక్కారు. భారీగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు విషయాలు వెలుగు చూస్తున్నాయి. చట్టసభలో ఈ విషయాలను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ప్రస్తావించడం. . సీఎం దృష్టికి ఆ నియోజకవర్గ బాధ్యుడు జగన్ మోహన్ రాజు తీసుకెళ్లడంతో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ అధికారులతో పాటు విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి దస్త్రాలు తెప్పించుకున్నారు. దీంతో ఆక్రమణలు వాస్తమేనంటూ అంగీకరించారు.

రాజంపేటలోని మిత్రా టౌన్‌షిప్ ప్రాజెక్ట్ ప్రాంతం

గతంలో బెదిరింపులు

వైకాపా హయాంలో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల్ని కాజేయడంతో పాటు అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మ్యుటేషన్లు సాగాయి. మిత్రా టౌన్‌షిప్‌కు ఎలాంటి అనుమతులు లేవని, ప్రభుత్వ భూముల ఆక్రమణలో లేఅవుట్ వేశారంటూ గతంలో పురపాలక కమిషనర్ కూడా నోటీసు జారీ చేశారు. సదరు అధికారిని బెదిరింపులకు గురి చేసి నోటీసు ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చారు. వీటన్నింటినీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ స్పందనతో రాజంపేట రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గత రెండు రోజులుగా కడపలో కలెక్టర్ కార్యాలయంలో తిష్ట వేసి సమాచారం అందిస్తున్నారు. భూ ఆక్రమణలపై నివేదిక తయారు చేసే పనిలో పడ్డారు.

అందిపుచ్చుకో.. భవితకు బాటలేసుకో!

నేటి నుంచి ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, కమలాపురం, న్యూస్‌టుడే: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు ఒకటో తరగతిలో ప్రవేశానికి సంబంధించి 2026-27 విద్యాసంవత్సరానికి గాను నోటిఫికేషన్ విడుదలైంది. ఉచిత సీట్లు పొందిన పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఇందుకుగాను ఆయా పాఠశాలలకు స్టార్ గ్రేడ్ ఆధారంగా ఫీజులు ఖరారు చేసింది.

నమోదు ఇలా..: పిల్లల తల్లిదండ్రులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి మార్చి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ● మార్చి 25న లాటరీ ద్వారా మొదటి విడత సీట్లు కేటాయిస్తారు. ● సందేహాలు, ఫిర్యాదులకు 1800 - 4258 - 599 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి.

● **ఎంపిక చేసేదిలా:** లాటరీ ద్వారా విద్యార్థుల్ని ఎంపిక చేస్తారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు 5, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనారిటీ, ఇతరులకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీలోగా జన్మించి ఉండాలి. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులు. చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సులో ఏదో ఒకటి సమర్పించవచ్చు. వయస్సు ధ్రువీకరణకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామ, వార్డు సచివాలయాలు, విద్యా వనరుల కేంద్రాలు, పాఠశాలల నుంచీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు.

విద్యా సంవత్సరం	ఎంపికైన చిన్నారులు
2022-23	59
2023-24	722
2024-25	504
2025-26	502

40 రోజుల్లో.. చేస్తారా రూ. 4.04 కోట్ల వసూళ్లు!

లక్ష్యాల సాధనకు దూరంగా మార్కెట్ కమిటీలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు అవస్థలు పడుతున్నాయి. అన్నదాతలు పండించిన పంట దిగుబడులు కొనుగోలు, రవాణా రుసుము వసూలు ద్వారా కమిషన్ రూపంలో ఆదాయాన్ని పెంచుకోవాల్సి ఉండగా.. అనుకున్న రీతిన సాధించలేకపోతున్నాయి. ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంతో ఏటా వెనుకబడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 40 రోజులే గడువు మిగిలి ఉండగా ఇంకా రూ. 4.04 కోట్లు లక్ష్యం చేరుకోవాల్సి ఉండటం అందుకు నిదర్శనం.

కడప యార్డుకు రైతులు తెచ్చిన పంట దిగుబడులు

● **ఆరు కమిటీల వెనుకబాటు:** గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే మొత్తం 11 కమిటీల్లో ఆరు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయి. ప్రొద్దుటూరు కమిటీ రూ. 5.54 లక్షలు, బద్వేలు రూ. 19.81 లక్షలు, జమ్మలమడుగు రూ. 12.18 లక్షలు, సిద్దవటం రూ. 5.63 లక్షలు, ఎర్రగుంట్ల రూ. 5.35 లక్షలు, రాజంపేట రూ. 5.62 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. లక్ష్యాన్ని చేరుకోలేని స్థితిలో ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, రాజంపేట కమిటీలున్నాయి.

మొత్తం కమిటీలు	వసూలు లక్ష్యం	జనవరి వరకు వసూలు	ఇంకా చేయాల్సింది	మిగిలిన రోజులు
11	రూ. 1,427.00 లక్షలు	రూ. 1,022.74 లక్షలు	రూ. 404.26 లక్షలు	40

తీగ దొరికింది డొంక కదిలిస్తారా!

చర్చనీయాంశమైన ఆస్తి మార్పు వ్యవహారం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరంలోని కొందరు సచివాలయ ఉద్యోగులు ప్రైవేట్ ఆస్తులను ఇతరుల పేరుతో మారుస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'ప్రైవేట్ ఆస్తులతో దోబూచులాట' శీర్షికన 'ఈనాడు'లో గురువారం కథనం ప్రచురితమైంది. ఈ విషయం ఇప్పుడు నగరవాసుల్లో ప్రకంపనలు రేపుతోంది. అనధికార మ్యుటేషన్లు (పేరు మార్పు)కు సంబంధించి ప్రాథమికంగా ఇద్దరిపై పోలీసు కేసు నమోదుకు అధికారులు నిర్ణయించారు. ఈ విషయాన్ని ఇద్దరితో సరిపుచ్చనున్నారా.. లేకుంటే తీగ లాగి డొంకంతా కదిలిస్తారా అనేది చూడాల్సి ఉంది.

● **ఆస్తి విలువ మేరకు వసూళ్లు:** ఆస్తి పన్ను పత్రాల్లో పేరు మార్పునకు సచివాలయాల్లోని అడ్మిన్‌కు లాగిన్ ఉంటుంది. తర్వాత ఆర్ఐ, ఈఈ, డిప్యూటీ కమిషనర్, అదనపు కమిషనర్లకు ఉంటుంది. అడ్మిన్ లాగిన్ ద్వారా పేరు మార్పు అనంతరం ఆ సమాచారాన్ని పై రికార్డుల్లోకి ఎక్కించడానికి కోడింగ్ అవసరం. ఇది తెలిసిన వారు నగరపాలకసంస్థలో చాలా తక్కువ మంది ఉన్నారు. వీరే అక్రమాలకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఇందుకు గాను ఆస్తి విలువను బట్టి రూ. 70 వేల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

● **అక్రమాలకు పాల్పడితే చర్యలు:** ఆస్తిపన్ను పత్రాల్లో అనుమతి లేకుండా పేరు మార్చినట్టు ఎవరైనా గుర్తిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. ఫిర్యాదు చేసిన వెంటనే సరిచేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇద్దరు ఉద్యోగులు, ఇద్దరు అక్రమ మ్యుటేషన్‌దారులను గుర్తించామని.. వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఇలాంటి అక్రమాలకు ఎవరు పాల్పడినా కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కల్యాణానికి 110 కిలోల ముత్యాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 1న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి 110 కిలోల ముత్యాలను కానుకగా ఇచ్చేందుకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే, తితిదే పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు లోక్‌సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు ముందుకొచ్చినట్లు డిప్యూటీ ఈవో ఎ.ప్రశాంతి గురువారం తెలిపారు. ఇందుకోసం రూ. 15 లక్షలకు పైగా అందించనున్నట్లు చెప్పారు. రాములోరి పెళ్లిని కనులారా వీక్షించడానికి తరలిరానున్న వారికి వేదిక ప్రాంగణంలోనే ముత్యాల తలంబ్రాలు ఇవ్వడానికి 1.75 లక్షల పొట్లాలు తయారు చేయనున్నారు.

యాత్ర శోభాయమానం

శివాజీ వేషధారణలో చిన్నారి

మారుతీనగర్(కడప), న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. కడప నగరం భవానీ నగర్ పోలేరమ్మ ఆలయంలోని శివాజీ మహారాజ్ ఆలయంలో తొలుత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన శివాజీ ప్రతిమతో శోభాయాత్ర చేపట్టారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పలు కూడళ్ల మీదుగా యాత్ర వైభవంగా సాగింది. యువత, భక్తులు, పలు సంఘాల నాయకులు, ప్రతినిధులు, కాషాయ జెండాలు చేతబట్టి జై భవానీ.. జై శివాజీ.. జైజై శివాజీ నినాదాలతో హోరెత్తించారు.

శివాజీ ప్రతిమతో కడపలో ప్రదర్శన

పవిత్ర మాసం ఆరంభం

ఈనాడు, కడప- జమ్మలమడుగు, న్యూస్‌టుడే : ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం గురువారంతో మొదలైంది. ఈ నెలలో అల్లాహ్‌పై నమ్మకంతో ఉపవాస దీక్ష పాటిస్తారు. రోజా ఉన్న వారు అయిదు పూటలా నమాజ్ చేస్తారు. మొదటి రోజు ఉపవాస దీక్ష పాటించిన ముస్లిం సోదరులకు మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

కడప: ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ముస్లిం సోదరులు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
కడప	6.27	5.21
ప్రొద్దుటూరు	6.28	5.25

WANTED
SUPER STOCKIST - KADAPA
M/s. RPR INDUSTRIES is inviting applications for a Super Stockist in Kadapa for our fast-moving products - Shri Ganesh Premium Agarbatti & Camphor.
Join a growing brand backed by a strong distribution network, consistent month-on-month growth, and attractive profit margins, mail id: info@rprcamphor.in
Contact: 9000488930, 8790051402

ఇటు డిగ్రీ పట్టా.. అటు ఉపాధి బాట

విద్యార్థులను తీర్చిదిద్దుతున్న జేకేసీలు

కడప విద్య, న్యూస్‌టుడే: ఒక చేతికి డిగ్రీ పట్టా.. మరో చేతికి ఉపాధి అవకాశాల బాట కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ)లు ముందుకు అడులేస్తున్నాయి. గత ప్రభుత్వంలో పూర్తిస్థాయి నిర్లక్ష్యానికి గురైన ఈ విభాగం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి జవసత్వాలు సంతరించుకుంది. విద్యార్థులు, యువతకు నైపుణ్యం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇదివరకే అమలులో ఉన్న జేకేసీని మరింత సమర్థంగా నిలిపేందుకు పలు కళాశాలలు కృషిచేస్తున్నాయి. కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఈ విషయంలో ముందు వరుసలో నిలుస్తోంది. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు శిక్షణ ఇస్తూ పట్టా దక్కే వేళకు కొలువుకు బాటలేస్తోంది.

ఓ విద్యార్థిని ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

విద్యా సంవత్సరం	ఉద్యోగాలకు ఎంపిక
2024 - 25	110 మంది విద్యార్థులు
2025 - 26	112 మంది (ఫిబ్రవరి వరకు)

చదువుతూనే ఎంపిక

మాది చక్రాయపేట మండలం కొండుగారిపల్లె. వ్యవసాయ ఆధారిత కుటుంబం. కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువు పూర్తిచేశాను. కళాశాలలో ఇచ్చిన శిక్షణ ఆధారంగా జాబ్‌మేళాలో ఉద్యోగ అవకాశం లభించింది. చదువు పూర్తవుతూనే కాగ్నిజెంట్, విప్రో, టీసీఎస్ వంటి సంస్థలు పాల్గొన్న జాబ్ మేళాలో కొలువు సాధించాను.

- ప్రియాంక

నెలకొక జాబ్‌మేళా



కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ఒక చేతితో డిగ్రీ పట్టా, మరో చేతితో ఉద్యోగ అవకాశంతో బయటికి వెళ్లాలన్నదే జేకేసీ లక్ష్యం. అందులో భాగంగా నెలకో జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న వారితో పాటు బయటి నుంచి పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులూ హాజరవుతున్నారు. టాటా విస్టన్, టెక్ మహేంద్ర వంటి కంపెనీలు వస్తుండటం శుభ పరిణామం.

- డాక్టర్ సలీంబాషా, ప్రిన్సిపల్, కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



పత్తి దిగుబడులపై ధరల కత్తి

రాజుపాళెం, న్యూస్‌టుడే: రైతులు ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా దాదాపు ఎనభై వేల ఎకరాల్లో పత్తి సాగు చేసేవారు. ప్రకృతి వైపరీత్యాలతో ఆశించిన దిగుబడులు లభించకపోవడం.. గులాబీ పురుగు ధాటికి ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలో పది వేల ఎకరాలకు పైగా మాత్రమే సాగవుతోంది. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర, పొద్దుతిరుగుడు, బరిగెలు, కొర్రలు సాగు చేస్తున్నారు. క్వింటా పత్తి పదిహేను రోజుల క్రితం రూ. 7,300 పలికింది. ఇదే సమయంలో వ్యాపారులు జట్టు కట్టి రూ. 6,500కే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు పది క్వింటాళ్లు కూడా దిగుబడులు దక్కడం లేదు. ఎకరాకు సాగు వ్యయం మాత్రం రూ. 60 వేల నుంచి రూ. 70 వేలు అవుతోంది. భూమి లేని రైతులకు కౌలు అదనం. ఈ పరిస్థితులతో క్వింటా రూ. 8,000 ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓ వైపు దిగుబడులు పడిపోవడం. . ఇంకోవైపు ధరలు దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజుపాళెంలో లారీకి పత్తి లోడ్ చేస్తున్న కూలీలు

అంత్యక్రియలు

జననం : 04.01.1945
మరణం : 19-02-2026

కీ॥శే॥ శ్రీమతి రెండెద్దుల వెంకటలక్ష్మమ్మ గారు
W/o కీ॥శే॥ రెండెద్దుల శ్రీరాములురెడ్డి గారు
తాళ్లప్రొద్దుటూరు, ఆర్.ఎస్.కొండాపురం (మం).

మా మాతృమూర్తి కీ॥శే॥ శ్రీమతి రెండెద్దుల వెంకటలక్ష్మమ్మ గారు 19.02.2026 గురువారం ఉదయం 10.18 ని॥లకు స్వర్గస్తులైనారు. ఆమె జీవిత కాలం చేసిన పుణ్యఫలం మాకు శ్రీరామరక్ష. మాకు అందించిన మధురస్మృతులు చిరకాలం స్మరిస్తూనే ఉంటాం. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుమార్తెలు : ఎ.రమాదేవి, టి.వి.మునెమ్మ, జి.మహేశ్వరి, సి.జయశ్రీ, కె.మంజుల
అల్లుళ్లు : ఎ.అంకిరెడ్డి, టి.వి.ప్రభాకర్‌రెడ్డి, జి.పుల్లారెడ్డి, M.D., సి.శివనారాయణరెడ్డి, కె.సుమంత్‌రెడ్డి
కుమారుడు : ఆర్.రామాంజినేయులురెడ్డి
కోడలు : ఆర్.రాజేశ్వరి
మనుమలు, మనుమరాండ్రు మరియు కుటుంబ సభ్యులు

GPR Infra Projects Pvt. Ltd., Bangalore.

అంత్యక్రియలు : 20.02.2026 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు
శ్రీ రెండెద్దుల శ్రీరాములురెడ్డి గారి ఘాట్, తాళ్లప్రొద్దుటూరు నందు అంత్యక్రియలు జరుగును.

(c) eenadu

ఆఖరి మజిలీకి అవస్థలెన్నో

మైదుకూరు, న్యూస్‌టుడే : శ్మశానవాటిక ఉన్నా రాకపోకలకు దారిలేదు. దీంతో బురద ఉన్నా పంట పొలాల మీదుగా అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన దుస్థితి మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని నానుబానుపల్లెలో నెలకొంది. గ్రామానికి చెందిన పేర్నపాటి గీత (28) ప్రసవ సమయంలో మృతి చెందగా గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు పంట పొలాల మీదుగా 700 మీటర్ల దూరం అష్టకష్టాలు పడుతూ మృతదేహాన్ని మోసుకుపోయారు. దారి సౌకర్యం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

పొలంలో మృతదేహాన్ని అంత్యక్రియలకు మోసుకెళ్తున్న బంధువులు

పశుగ్రాస పథకం.. పాడి రైతుకు ఊతం

మైలవరం, బి.మఠం, కొండాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పశువుల పెంపకం, గ్రాసం పెంచేందుకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోంది.

★ ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంది. జాబ్ కార్డు కలిగిన పశుపోషకులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. అయిదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు అర్హులు. జాబ్‌కార్డు, పన్‌బీ, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం తీసుకుని రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఇలా..

పశుగ్రాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఉపాధి ఏపీవో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత సాంకేతిక సహాయకుడు అంచనాలు తయారు చేస్తారు. దరఖాస్తుదారుడికి పశువులు ఉన్నదీ లేనిదీ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సచివాలయ ఉద్యోగి నిర్ధారణ చేశాకే నిధులు మంజూరు చేస్తారు.

విస్తీర్ణం (సెంట్లలో)	కూలీల వేతనం	సామగ్రి ధర	ఆర్థిక సాయం
50	15,000	17,992	32,992
40	12,000	14,394	26,394
30	10,000	10,785	20,795
20	6,000	7,197	13,197
10	3,000	3,559	6,559

పెరగనున్న పాల ఉత్పత్తి

పాడి పశువులకు తగిన పోషకాహారం సులభంగా అందడంతో పాటు పాల ఉత్పత్తి పెరగనుంది. పాల దిగుబడితో రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తోంది. రైతులకు వ్యవసాయ, విత్తన, ఎరువుల ఖర్చులకు ప్రభుత్వం పూర్తిగా రాయితీ ఇస్తోంది. పాడి పోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇద్దరే మిగిలారు..

● డిప్యుటేషన్‌పై అధికారులు

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేక కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పల్లెల్లో జరిగే ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రజల సమస్యలు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించే విషయంలో వీరిది కీలకపాత్ర ఉంటుంది. అయితే కింది స్థాయి అధికారులందరూ డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు డిప్యుటేషన్‌పై వెళ్లారు. డిప్యూటీ ఎంపీడీవో వేరే శాఖకు వెళ్లారు. ఇక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తప్పించగా, టైపిస్టు పదోన్నతిపై వెళ్లారు. కానీ వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదు. దీంతో అధికారుల కుర్చీలు నేడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఎంపీడీవో, సూపరింటెండెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు తయారు చేయడంలో జాప్యమవుతోంది. ఈ విషయంపై ఎంపీడీవో కృష్ణమూర్తితో ప్రస్తావించగా ఇది నిజమేనని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

స్నాతకోత్సవ నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత

కడప విద్య, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ (కాన్వకేషన్) నిర్వహణ విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. గురువారం యోవేవిలోని తన ఛాంబర్‌లో స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించి 14 కమిటీల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఒకేసారి 11, 12, 13, 14వ స్నాతకోత్సవాలు నిర్వహించాల్సి రావడం వల్ల జాగ్రత్తతో ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఇతర ప్రముఖులు రానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. కమిటీల వారీగా చేయాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాధ్యత కులసచివులు ఆచార్య పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ అధికారులతో సమావేశమైన ఉపకులపతి ఆచార్య రాజశేఖర్

ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి గురువారం అసెంబ్లీలో గళం వినిపించారు. జిల్లాలో కడప తర్వాత ప్రొద్దుటూరులో ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఇక్కడ 2008లో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేశారని ఈ చదువు పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కావాల్సిన స్థలం ఉందన్నారు. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ప్రొద్దుటూరుతో పాటు మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్లలోని మైనార్టీలకు ఉపయోగంగా ఉంటుందన్నారు.

యువత వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టభద్రులైన యువతీ, యువకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పశువైద్య కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీఎంఈజీపీ, ఎన్ఎల్ఎమ్, కేసీసీ పథకాలకు ద్వారా రుణ సదుపాయాలను అందిపుచ్చుకోవాలని కోరారు. నాబార్డు డీడీఎం విజయ్ విహారి, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దన్

కల్తీపై ఉపేక్షించే ప్రసక్తే లేదు

విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్పీ కరీముల్లా షరీఫ్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: హోటళ్ల నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని.. లేకుంటే ఉపేక్షించేది లేదని ఉమ్మడి కడప జిల్లా విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్పీ కరీముల్లా షరీఫ్ తెలిపారు. కడపలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు చేపడతామని చెప్పారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసినా, వస్తువులను అధిక ధరలకు విక్రయించినా, తయారీ తేదీ లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కల్తీలకు పాల్పడితే వదిలిపెట్టమని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే ఉపేక్షించబోమని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి: ఎస్పీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసులు సన్నద్ధం కావాలని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పరిస్థితులు కల్పించాలన్నారు. గురువారం కడపలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రొద్దుటూరు పోలీస్ సబ్ డివిజన్ అధికారులతో ఎస్పీ స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రౌడీషీటర్లు, గొడవలు సృష్టించే వారిపై నిఘా ఉంచాలన్నారు. రౌడీషీటర్ల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జరగకుండా చూడాలని తెలిపారు. తీవ్రమైన నేరాలు, దొంగతనాల కేసులను సమీక్షించి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చోరీలు జరగకుండా గస్తీ పెంచాలన్నారు. చోరీ కేసుల్లో రికవరీ చేయాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రహదారి భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాష్‌బాబు, ప్రొద్దుటూరు ఏఎస్పీ విబుకృష్ణతో పాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

యువకుల మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: ఈ నెల 5వ తేదీన జరిగిన దళిత యువకులు ఓబులేశ్, సతీశ్ మృతికి ప్రేమ వ్యవహారాలే కారణమని ఎమ్మెస్పీ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు సొట్ట నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బి.మఠంలో మాట్లాడుతూ.. యువకుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో హరినాథ్, జ్ఞానేశ్వర్, సుబాష్, గురయ్య, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి

చక్రాయపేట, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రానాయక్ రైతులకు సూచించారు. గురువారం చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ, యర్రబొమ్మనపల్లె, అద్దాలమర్రి గ్రామాలలో సాగులో ఉన్న వరి, పొద్దుతిరుగుడు పంటలను ఆయన పరిశీలించారు. ఈ నెల 25 లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన 'శక్తి యాప్' ఆపదలో తక్షణ రక్షణ కల్పిస్తుందని సీఐ నరసింహులు అన్నారు. గురువారం ఆయన వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఆటో మిషన్‌తో నీటి పొదుపు

మాట్లాడుతున్న ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లరెడ్డి, చిత్రంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : సూక్ష్మ సాగునీటి వ్యవస్థకు ఆటోమిషన్ అనుసంధానం చేస్తే నీటి పొదుపు చేసుకోవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లరెడ్డి అన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆటోమిషన్‌ను రాయితీతో ఇస్తుందన్నారు. బిందు, తుంపర పరికరాలకు ఆటోమిషన్ అనుసంధానం చేస్తే కావాల్సిన నీటిని మాత్రమే పంటలకు ఇస్తుండటంతో నీటి పొదుపు అవుతుందన్నారు. దీంతో పంటల దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. రైతులు పొలాలకు వెళ్లకుండానే స్మార్ట్‌ఫోన్‌ను రిమోట్‌గా వినియోగించి ఆన్, ఆఫ్ చేసుకోవచ్చన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు 55 శాతం రాయితీ ఇస్తారన్నారు. ఐదెకరాల నుంచి 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు 45 శాతం రాయితీ ఉంటుందన్నారు. రైతులు ఆటోమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని నిరసిస్తూ మహాధర్నా నేడు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఆర్టీసీ విద్యుత్తు బస్సుల ఒప్పందంలో పీపీపీ విధానాన్ని అమలు చేయడం సరి కాదని, తక్షణం దాన్ని రద్దు చేయాలని ఆర్టీసీ ఈయూ జిల్లా కార్యదర్శి రామమూర్తి డిమాండు చేశారు. ఆ విధానం రద్దు కోరుతూ శుక్రవారం కడప ఆర్టీసీ ప్రాంగణంలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం కడప బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. లేదంటే ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవరు, కండక్టరు, బస్సుల నిర్వహణ సిబ్బంది, విభాగాలు పూర్తిగా నిర్వీర్యమవుతాయని ఆవేదన వెలుబుచ్చారు. కావున పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వమే విద్యుత్తు బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందిచే నడపాలని డిమాండు చేశారు. బస్టాండు ప్రాంగణంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యమందినా మందులకు తిప్పలే

ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న తర్వాత మందులు ఇచ్చేందుకు మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అందులో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులకు ఏర్పాటు చేసిన కౌంటర్ మూసివేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి వచ్చిందని మూడింటిలో మందులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

22న పారా బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపికలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22న ఆదివారం ఉదయం 9 గంటలకు పారా బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపికలు చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు దామోదర్‌రెడ్డి, సుబ్బరాయుడు తెలిపారు. ఇతర వివరాలకు చరవాణి నం: 90006 72017, 99631 94010కు సంప్రదించాలన్నారు.

తేలు కాటుతో విద్యార్థికి అస్వస్థత

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆట స్థలంలో ఉన్న రాళ్లను తీస్తున్న విద్యార్థి తేలు కాటుకు గురైన ఘటన మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గురువారం చోటు చేసుకుంది. పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థికి విరామ సమయంలో ఆట స్థలంలో ఉన్న రాళ్లను తీసి వేయాలని ఉపాధ్యాయుడు చెప్పారు. రాళ్లను తొలగిస్తున్న విద్యార్థిని తేలు కాటేసింది. బాలుడిని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య అక్కడికి చేరుకుని విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మిద్దాం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : బాల్య వివాహాలను అరికట్టే వంద రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా పథక సంచాలకులు రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం కడప కలెక్టరేట్‌లో మహిళలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించి.. మాట్లాడారు. బాల్య వివాహం చేసుకున్న బాలికలకు ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని, తద్వారా సమాజానికి కూడా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నారు. దీనిపై ప్రచార రథం ద్వారా వంద రోజులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా బాలలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే నం:1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీవో సుభాష్‌యాదవ్, మిషన్ శక్తి కోఆర్డినేటరు శోభారాణి, వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కడప తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నారాయణరెడ్డి ప్రచార రథాన్ని ప్రారంభించారు.

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

అయిదుగురికి జైలు శిక్ష.. జరిమానా

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : మండలంలోని పాతగిరియంపల్లెలో నీటి ట్యాంకు వద్ద కంపచెట్లు, రాళ్లు అడ్డం వేసి దాడి చేసిన కేసులో అయిదుగురు నిందితులకు న్యాయమూర్తి జీసీ ఆసిఫా సుల్తానా జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ గురువారం తెలిపారు. 2017 డిసెంబరు 25న జరిగిన ఆ ఘటనపై పేర్ల రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు కడప అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిగిందన్నారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఏ1 పి.ఈశ్వర్‌రెడ్డి, ఏ8 వెన్నపూస సుబ్బరాయుడులకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.81 వేలు జరిమానా, ఏ3 పి.శివారెడ్డి, ఏ4 పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏ9 పి.మల్లేశ్వర్‌రెడ్డిలకు 1 సంవత్సరం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.60 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. మిగతా వారిపై నేరం రుజువు కాకపోవడంతో వారికి విముక్తి లభించిందన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారి తరపున వాదనలు వినిపించిన ఏపీపీ బి.శ్రీనివాసులును, సాక్షులను సక్రమంగా కోర్టులో హాజరుపరిచి ముద్దాయిలకు శిక్ష పడడానికి కారణమైన కోర్టు కానిస్టేబుళ్లు, ప్రస్తుత గ్రామీణ సీఐ చల్లని దొర, పెండ్లిమర్రి ఎస్ఐ తులసీ నాగప్రసాద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

భర్తను హతమార్చిన భార్య

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : భర్తను భార్య గొడ్డలితో దారుణంగా నరికి హతమార్చిన ఘటన పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లెలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నల్లయ్యగారిపల్లెకి చెందిన సిద్ధారెడ్డి సుహాసిని దంపతులు నివాసం ఉన్నారు. వీరికి ఇద్దరు సంతానం. భర్త రోజూ మద్యం తాగి వచ్చి అనుమానంతో వేధిస్తుండటంతో సహనం కోల్పోయి భార్య సుహాసిని గురువారం భర్త సిద్ధారెడ్డి (40)ని గొడ్డలితో నరికి హత్య చేసింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామీణ సీఐ చల్లని దొర, ఎస్ఐ తులసీ నాగప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'వీఐటీ' ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్‌లాండ్‌లోని రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ (ఆర్ఎంయూటీకే).. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చేసిన కృషికి గుర్తింపుగా 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' గౌరవ డిగ్రీని అందజేసింది. ఈ మేరకు వీఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రివీ కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకోర్న్ సువావ్రత్, రాజమంగళ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ క్రుంగ్‌థెప్ అధ్యక్షుడు డాక్టర్ పి.చాయ్ జాన్మనీ చేతుల మీదుగా శంకర్ విశ్వనాథన్ డిగ్రీ అందుకున్నారని తెలిపింది. కార్యక్రమంలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో శంకర్ విశ్వనాథన్, వీసీ జి.విశ్వనాథన్, పాలకోర్న్ సువావ్రత్, డాక్టర్ పి.చాయ్ జాన్మనీ తదితరులు

హరిణి.. కాలువలో పడి

దుప్పిని బయటకు తీస్తున్న స్థానికుడు

కలసపాడు, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతం నుంచి నీరు తాగేందుకు వచ్చిన దుప్పి పిల్ల మండలంలోని తెలుగుగంగ ప్రధాన ఎడమ కాలువలో గురువారం పడింది. నీటిలో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న దుప్పి పిల్లను బ్రాహ్మణపల్లెకు చెందిన పెద్దిరెడ్డి స్థానికుల సాయంతో బయటకి తీసి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

ఎంపీ పీఏనని బెదిరింపులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు(పీఏ) అంటూ బెదిరింపులకు దిగి నగదు డిమాండ్ చేసిన నకిలీ పీఏను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతికి చెందిన నదీమ్ ఎంపీ పీఏ అంటూ జమ్మలమడుగుకు చెందిన గొల్ల నరేష్‌కు పలుమార్లు ఫోన్ చేసి నగదు కోసం బెదిరించాడు. అప్రమత్తమైన ఆయన విషయాన్ని ఎంపీ కార్యాలయానికి తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది ఎం.విజయకుమార్ రెడ్డి గురువారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పోరుమామిళ్ల, బి.కోడూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మండలంలోని సగిలేరు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై హనుమంతురావు వివరాల మేరకు.. కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన నారాయణమ్మ, చెన్నకృష్ణారెడ్డి దంపతులు పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పోరుమామిళ్లకు వెళ్లారు. తిరిగి వస్తుండగా.. మరో ద్విచక్రవాహనంపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు హెల్మెట్ ధరించి వారిని అనుసరించారు. సగిలేరులోని గురుకుల పాఠశాల వద్దకు రాగానే నారాయణమ్మ మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 7382114647.

REAL ESTATE

HOUSE FOR SALE

ప్రొద్దుటూరు వసంతపేట, టెలిఫోన్ కాలనీలో ఉన్న 4.2 సెంట్లు స్థలంలో ఉన్న 2 ఇళ్ళు అమ్మకానికి కలవు. Cont: 8806514048, 9849824270.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

Wanted Sales Executive: Job Location Kadapa & Chittoor (Dist.). Qualy: Dip/B.Tech/Degree. Exp: Fresher/2-3 yrs. Salary: 20-30K + TA & DA. Cont: 83286 75684 or mail: jkmedicalsystems@gmail.com

మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. శ్రీ విజయ రాఘవేంద్ర ఎంటర్ ప్రైజస్ (Microtech Solar Distributor) కడప మరియు ప్రొద్దుటూరు. సెల్: 9032722205, 9121196955.

SECURITY GUARDS

Secur Security Services. టంగుటూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASO లు కావలెను. ✆9959598279

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో కడప, నెల్లూరు జట్ల విజయభేరి

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో కడప, నెల్లూరు జట్లు విజయభేరి మోగించాయి. వైఎస్ఆర్ఆర్ - ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం జరిగిన క్రికెట్ పోటీల వివరాలు ఇలా..!

● వైఎస్ఆర్ఆర్ - ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. జట్టులో మనీష్ సాయి 27, గౌరీష్ 26 పరుగులు చేశారు. కడప బౌలర్లలో భానువర్షిత్ రెడ్డి, వివాన్ష్‌రెడ్డి, సాయిచరిత్ తలా రెండేసి వికెట్లు తీసుకున్నారు. 142 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఆరంభించిన కడప జట్టు 24.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కడప జట్టులో గురుఈక్షిత్ అజేయంగా 36, హరిశ్రీయాన్ 23 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ గౌరీష్ 2 వికెట్లు తీసుకున్నాడు.

● కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. జట్టులో మహమ్మద్ నవాజ్ 88, శశిధర్ అజేయంగా 48 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో హితేష్‌భగత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం కర్నూలు జట్టు బ్యాటింగ్ చేసి 29.1 ఓవర్లలో 103 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. జట్టులో గౌతమ్‌రెడ్డి 49 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సుచిత్‌రెడ్డి 5, శశిధర్‌రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. 128 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది.

88 పరుగులు మహమ్మద్ నవాజ్ (నెల్లూరు)

5 వికెట్లు సుచిత్‌రెడ్డి (నెల్లూరు)

ధోబీఘాట్ మూసివేతపై రజకుల ఆందోళన

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కొత్తపల్లె పంచాయతీలోని ధోబీఘాట్ ప్రధాన ద్వారం మూసివేతపై ప్రొద్దుటూరు రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్టిపాడు బాబు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడంపల్లె రెవెన్యూ గ్రామంలో 1.36 ఎకరాల స్థలాన్ని ధోబీఘాట్‌కు కేటాయించినట్లు వివరించారు. ఇటీవల మున్సిపల్ కమిషనరు ఆమోదంతో కొత్తగా విద్యుత్తు మీటరు అమర్చినట్లు తెలిపారు. కానీ కొన్ని రోజుల నుంచి ధోబీఘాట్ ప్రధాన ద్వారానికి తాళాలు వేసి లోపలికి వెళ్లకుండా కొందరు అడ్డుకోవడంతో ఉపాధి కోల్పోతున్నట్లు స్పష్టం చేశారు. భాజపా పట్టణ అధ్యక్షుడు-2 పాళెం కిరణ్‌కుమార్, నాయకులు గౌరీశంకర్, విజయలక్ష్మి, గురుప్రసాదు, రాజేష్, తెదేపా శ్రేణులు రమణ, గంగాధర్, సీపీఎం సత్యనారాయణ, శేఖర్ తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, భాజపా అధ్యక్షుడు మాధవ్ దృష్టికి తీసుకెళ్లి రజకులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. దీనిపై తహసీల్దారు గంగయ్యకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో, సర్వేయర్లతో ధోబీఘాట్‌కు సర్వే ద్వారా హద్దులు గుర్తించిన తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ధర్నాలో పాల్గొన్న రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్టిపాడు బాబు చిత్రంలో తెదేపా, భాజపా, సీపీఎం నాయకులు

(c) eenadu

రాజంపేట

•రాజంపేట •బద్వేలు

గంగమ్మ తల్లికి బోనాలు

బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

రాచపల్లె(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలోని రాచపల్లెలో పెద్ద వంక గంగమ్మ తిరునాల గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలువురు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు.

మడితాడు(సుండుపల్లి) : కొలిమిమిట్ట సమీపంలోని మాతమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో ఎస్‌బీఐ అధికారులు

రాజంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులంతా వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ షేక్ ఫాతిమా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఎస్‌బీఐ అధికారులు గురువారం సైకిళ్లు అందజేశారు. రీజనల్ మేనేజర్ కోటిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే వీటిని అందించామన్నారు. అనంతరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యక్తిగత శుభ్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఫోలిక్ మాత్రలతో విద్యార్థుల్లో రక్తహీనతను నివారించవచ్చునని వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాలుర స్వస్తిక్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చొరవ తీసుకుని వారానికోసారి విద్యార్థులతో ఈ మాత్రలు మింగించి రక్తహీనతను నివారించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై విచారణ

కాశినాయన : గంగనపల్లెలో గతేడాది ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగాయని గ్రామస్థుడు మనోహర్‌రెడ్డి గతంలో కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏపీడీ మైథిలీ గురువారం విచారణ చేపట్టారు. అనంతరం సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేసి అంశాల వారిగా గ్రామస్థులతో విచారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆమె తెలిపారు.

అరటి.. భలే గిరాకీ

◆ ధర ఉండటంతో రైతుల కళ్లలో ఆనందం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులకు కొంత కాలంగా అరటి సాగు లాభసాటిగా మారింది. గతంలో వాతావరణ మార్పులు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలతో తీవ్రంగా నష్ట పోయారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉండటంతో పాటు మంచి ధర వస్తుండటంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

● రాజంపేట మండలంలో ప్రస్తుతం 5000 ఎకరాల్లో అరటి సాగు అవుతోంది. మూడేళ్లుగా వివిధ సమస్యలతో పెట్టుబడి కూడా రాక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం రెండో విడత పంట కోతకు వస్తోంది. మొదటి విడతలో కాయలు నాణ్యతగా ఉంటాయి. దాంతో వ్యాపారులు వాటికే ఆశక్తి చూపేవారు. రెండో విడతలో కాయల నాణ్యతలో కొంత మార్పు వస్తుంది. దాంతో మంచి ధర ఉండేది కాదు. కానీ, ఈ సంవత్సరం మొదటి విడతలో ఆశించిన దిగుబడి లేకపోవడం.. రంజాన్ పండగ వస్తుండటంతో రెండో విడత కాయలకు మంచి డిమాండ్ ఏర్పడింది. వ్యాపారులు టన్ను ధర రూ. 18 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

కవర్ల ఏర్పాటుతో లాభం

పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. గెలదశలో కవర్లు ఏర్పాటు చేసుకుంటే కాయ నాణ్యతగా పెరుగుతుంది. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు ఉపయోగించుకుని మరింత లాభం పొందాలి.

- జి. సతీష్, ఉద్యానశాఖ జిల్లా అధికారి, కడప

జిల్లాలో అరటి సాగు	సాగు చేస్తున్న మండలాలు	ప్రస్తుతం టన్ను ధర
13800 హెక్టార్లు	13	రూ. 18000

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493

?: మండలంలోని లక్కవారిపల్లెలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

✓: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - వీరశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: బ్రహ్మణపల్లెలోని కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు ముందుకు పారడం లేదు. దుర్వాసన వస్తోంది. - రామసుబ్బయ్య, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - మోసే, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, గోపవరం

వ్యవసాయ విద్యుత్తు సరఫరాలో మార్పు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల పనుల్లో భాగంగా పోరుమామిళ్ల 132-11 కేవీ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం పనులు చేపడుతున్నట్లు ఈఈ లక్ష్మీపతి, డీఈఈ రవిచంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని 33-11 కేవీ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా బద్వేలు, బి.మఠం 132-11 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ వినియోగదారులను ఏ, బీ, సీలుగా విభజించి విద్యుత్తును విడతల వారీగా ఒక్కరోజు అందిస్తామన్నారు. ఏ గ్రూపునకు తెల్లవారుజాము 4 నుంచి, బీ గ్రూపునకు ఉదయం 9 గంటల నుంచి, సీ గ్రూపునకు మధ్యాహనం 2 గంటల నుంచి ఇస్తామన్నారు. మిగిలిన విద్యుత్తును రాత్రి 10 గంటల నుంచి అన్ని గ్రూపులకు అందిస్తామని వివరించారు. రైతులు ఈ మార్పులను గమనించాలని కోరారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పోరుమామిళ్ల: శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు, పట్టణ వాసులు

కాశినాయన: కొండ్రాజుపల్లెలో శివాజీ చిత్ర పటం ఊరేగింపు

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గురువారం పోరుమామిళ్ల, కాశినాయన, సుండుపల్లి మండలాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల పట్టణంలో శివాజీ శోభాయాత్ర జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. కాశినాయన మండలం కొండ్రాజుపల్లెలో గ్రామ మరాఠా సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. సుండుపల్లి మండలం జి.కె రాచపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పోరుమామిళ్లలో బద్వేలు మార్కెట్ యార్డు ఛైర్మన్ సుప్రజ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్తు తదితర నాయకులు పాల్గొన్నారు. బద్వేలు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శివాజీ మహరాజ్ జయంతిని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కత్తి బ్రహ్మయ్య, గడి పుల్లంరాజు, రవీంద్రనాథ్ శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. - న్యూస్‌టుడే, పోరుమామిళ్ల, కాశినాయన, జి.కె.రాచపల్లి (సుండుపల్లి), బద్వేలు గ్రామీణ

బద్వేలు: శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

పారా సిట్టింగ్ వాలీబాల్ రాష్ట్ర జట్టులో స్థానం

పోరుమామిళ్ల : పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో వెంకటాపురానికి చెందిన మహబూబ్‌షరీఫ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 12 విశాఖపట్టణంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ నెల 25 నుంచి 28 వరకూ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరగనున్న జాతీయ స్థాయి పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నారు.

మురుగు పారదు.. దుర్వాసన వీడదు

బద్వేలు పురపాలకలోని దర్గా వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దీంతో మురుగు పారక సమీప పాఠశాల వద్ద నిలిచి దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై పురపాలక కమిషనర్ నరసింహారెడ్డిని వివరణ కోరగా.. మురుగు కాలువను పరిశీలించి త్వరలోనే కాలువ నిర్మాణం చేపడుతామన్నారు. - న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

పైపులైన్ ధ్వంసం.. తాగునీరు కలుషితం

మండలంలోని మాధవరం-1 పరిధి పార్వతీపురంలోని నాలుగో రోడ్డు శివారులో పైపులైన్ లీకేజీతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీరు సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిదు నెలలుగా సమస్య నెలకొన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. లీకేజీ ప్రాంతం బురదమయంగా మారి రాకపోకలకు కష్టంగా ఉందని వాహనదారులు తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సిద్దవటం

రోడ్డు అధ్వానం... రాకపోకలకు ప్రమాదం

మండలంలోని వీరబల్లి-రాయచోటి మార్గం ఎలకచెట్లుపల్లి, సంగంవారిపల్లి, మట్లి గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎలకచెట్టుపల్లి నుంచి సుమారు 5 కిలోమీటర్ల మేర ఇదే దుస్థితి నెలకొంది. ఇటుగా హరిజనవాడ, రెడ్డివారిపల్లి, తాటిగుంటపల్లి తదితర గ్రామాలకు అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఎంపీడీవో జవహర్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, వీరబల్లి

ఎవరెస్ట్ అధిరోహణ శిక్షణకు ఎంపిక

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించటానికి లడక్‌లో జరిగే శిక్షణకు బద్వేలు ప్రభుత్వ భవిత శిక్షణ కేంద్రం నుంచి వెంకి జిల్లా నుంచి ఎంపికయ్యారని బద్వేలు ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక భవిత కార్యాలయంలో విద్యార్థిని ఆమె అభినందించారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి ప్రభుత్వం వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఎంపిక చేస్తుందన్నారు. ఎంఈవో ప్రమీల, ఐఈఆర్టీ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఎంపీడీవో మల్లేశ్వరి, ఎంఈవో ప్రమీల

గోడపత్రాలు విడుదల చేస్తున్న వీసీ సాయిబాబారెడ్డి తదితరులు

విద్యార్థుల్లో సృజనాత్మకతకు హ్యాకథాన్

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు పెంపొందించడానికి ఏఎంపాథాస్-2026 హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అన్నమాచార్య కళాశాల వీసీ సాయిబాబారెడ్డి అన్నారు. కళాశాలలో గురువారం కార్యక్రమానికి చెందిన గోడ పత్రాలను విడుదల చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. విజేతలకు వరుసగా రూ. 25,000, రూ. 15,000, రూ. 10,000 బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ నారాయణ పాల్గొన్నారు.

లంకమల, మల్లెంకొండ క్షేత్రాలకు రూ. 33 లక్షల ఆదాయం

బద్వేలు, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా లంకమల, మల్లెంకొండ శైవక్షేత్రాలకు సుమారు రూ.33 లక్షలు ఆదాయం వచ్చిందని దేవదాయ శాఖ ఈవో రామలింగారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. గతేడాది కంటే ఈ ఏడు భక్తుల రద్దీ పెరిగిందన్నారు. దీంతో పాటు ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. గతేడాది లంకమల శైవక్షేత్రానికి రూ.7 లక్షలు రాగా.. ఈ ఏడు రూ.14 లక్షల వచ్చిందన్నారు. మల్లెం కొండకు గతేడాది రూ.17 లక్షల ఆదాయం రాగా.. ఈ ఏడు 19 లక్షల ఆదాయం వరకు సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

కలసపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో జరుగుతున్న ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికకు లింగాల మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువకుడికి వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు అందింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోరుమామిళ్ల సీడీపీవో జమీలాబి, మండల సూపర్‌వైజరు బాలిక ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను స్థానిక పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఎస్సై సుభాన్, ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

రూ.7.16 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ. 7.16 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ రామాంజనేయులు గురువారం తెలిపారు. భాకరాపేట- బెటాలియన్ మార్గంలో శిథిలావస్థలో ఉన్న కాజ్‌వే నిర్మాణానికి రూ. 7కోట్లు, సిద్దవటం దిగువపేటలోని ప్రధాన రహదారి వద్ద దెబ్బతిన్న కాజ్‌వే స్థానంలో నూతనంగా శ్లాబ్ నిర్మాణానికి రూ. 16 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే టెండర్లు నిర్వహించి తద్వారా నిర్మాణ పనులు నిర్వహిస్తామని వివరించారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు అవసరం

సిద్దవటం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులంతా సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని బద్వేలు డివిజన్ ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుమలోపల్లి, మాధవరం, సిద్దవటం, జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాల్లోని మామిడి, కళింగర పంటలను గురువారం ఆయన పరిశీలించారు. పంటలకు సోకే తెగుళ్లను అధికారుల సూచనలతో నివారించుకోవాలని రైతులకు సూచించారు.

వెంటాడి.. దోచేస్తున్నారు

పట్టణంలో గొలుసు దొంగల హల్‌చల్

● ఈ నెల 10వ తేదీన బద్వేలు పట్టణంలోని సురేంద్రగనగర్, చెన్నంపల్లె మిట్టలోని రెండు ఇళ్లలో పట్టపగలు పలువురు చొరబడి రూ. 8లక్షలు విలువ గల బంగారు వెండి ఆభరణాలను దోచుకెళ్లారు.

● ఈ నెల 17న పోరుమామిళ్ల నుంచి ద్విచక్రవాహనంలో నరసింహులు, జయలక్ష్మీ దంపతులు పాయలకుంట్లకు వస్తుండగా ఇద్దరు ద్విచక్రవాహనంలో వెంబడించి బంగారు గొలుసును లాక్కెళ్లారు.

● ఈ నెల 19న కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన దంపతులు చెన్న కృష్ణారెడ్డి, నారాయణమ్మ పోరుమామిళ్ల నుంచి వస్తుండగా నారాయణమ్మ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు లాక్కొని పరారయ్యారు.

సీసీ కెమెరాలో లభించిన అనుమానితుల చిత్రం

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. తలుపులు లేని ఇళ్లు, ద్విచ్రవాహనాలపై వెళ్లే మహిళలే లక్ష్యంగా చేసుకుంటూ బరితెగిస్తున్నాయి. దాంతో బద్వేలు పోరుమామిళ్ల పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే స్థానిక ప్రజలు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. చోరీలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిఘా పెంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

ఫీజు బకాయిల విడుదలకు డిమాండ్

కడప విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 6,400 కోట్లు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు శాపంగా మారిన జీవో నం:77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 4,200 పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నాయకులు వసుంధర, హర్షిణి, ఖ్యాతిని, రాణి, భార్గవి, అర్చన, జెస్సికా పాల్గొన్నారు.

వైకాపా మాటలను ప్రజలు నమ్మరు

రాజంపేట, న్యూస్‌టుడే: హెరిటేజ్, ఇందాపూర్ డెయిరీలపై వైకాపా చెప్పే అబద్దాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెదేపా లీగల్‌సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు చుక్క పాలు లేకుండా రసాయనాలతో ప్రసాదం తయారు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. అందుకే ఎన్నికల్లో ఆ పార్టీ 11 సీట్లకే పరిమితమయ్యిందని విమర్శించారు.

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం

గోపవరం న్యూస్‌టుడే: వయోజనులు వంద శాతం అక్షరాస్యత సాధించాలని జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏంపీడీవో కార్యాలయంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిని 2029 నాటికి అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం వారు గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీవో రమాదేవి, సూపరెండెంట్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో హసీనా

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-2 బ్రహ్మయ్య

ఆత్మవిశ్వాసంతోనే ఉత్తమ ఫలితాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని ఆత్మవిశ్వాసం ఉంటే మంచి ఫలితాలు సాధిస్తారని ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని చింతరాజుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో గురువారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలువైన సమయాన్ని వృథా చేయరాదని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మంటపంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అన్నం, కూరల నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం ఐజయ్య, బాధ్య హెచ్‌ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: చరవాణులు, టీవీలు చూడటం తగ్గించి విద్యార్థులంతా తమ కళ్లను కాపాడుకోవాలని నేత్ర వైద్యులు తేజస్విని, నవ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కడప పట్టణంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చూపు మసకబారిన పిల్లలను గుర్తించి కళ్లజోడు ఇచ్చారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. తక్కువ వెలుతురులో పుస్తకాలు, పత్రికలు చదవరాదన్నారు. ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య, సమన్వయకర్త ఎస్. మల్లికార్జునరెడ్డి, గీత, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

విద్యార్థినులతో దాతలు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పెండ్లిమర్రి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 249 మంది విద్యార్థినులకు గురువారం శాంతి ప్రేమ సేవా సమాజం ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు గీతా, తోమాస్ రెడ్డి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులు ఉన్నత విలువలతో చదువుల్లో రాణించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. సంస్థ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు దాతల సేవలను కొనియాడారు.

విశిష్ట గుర్తింపు నమోదుతో పథకాలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: రైతులంతా తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహబూబ్‌భాషా అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలో 10,154 మంది రైతులకు గాను.. 7,766 మంది నమోదు చేసుకున్నారన్నారు. దీని ద్వారా ప్రభుత్వ అందించే పీఎం కిసాన్, పంటల బీమా వంటి ప్రయోజనాలు అందుతాయని వివరించారు.

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని మాధవరం-1 పరిధి అలీనగర్‌లో దెబ్బతిన్న పైపులైనుకు గురువారం మరమ్మతులు చేశారు. ఈ విషయంపై ఈ నెల 18వ తేదీన 'ఈనాడు'లో 'తాగునీటి వృథా..ఎవరికీ పట్టదా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి జానకిరామయ్య పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల సత్తా

విద్యార్థులతో ఎంఈవో-2 అరుణ, పక్కన నలంద పాఠశాల ప్రతినిధులు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటంలోని నలంద పాఠశాల విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు పాఠశాల పరిపాలన అధికారి వెంకటేష్ శుక్రవారం తెలిపారు. జనవరి 24వ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగిన పరీక్షల్లో విద్యార్థులు యశ్వర్‌రెడ్డి, కీర్తి, శాన్విక, ప్రవీణ, పద్మజ ప్రతిభ చూపినట్లు వివరించారు. వీరికి ఈనెల 23న హైదరాబాదులో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారన్నారు. విద్యార్థులను ఎంఈవో-2 అరుణ, పాఠశాల ప్రతినిధి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ముమ్మరంగా కడప- రేణిగుంట జాతీయ రహదారి పనులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కడప-రేణిగుంట జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండే దారి. వివిధ ప్రాంతాల నుంచి తిరుమల వచ్చే వాహనాలు, చెన్నై, కృష్ణపట్నం ఓడరేవుకు వెళ్లే లారీలతో కిటకిటలాడుతూ ఉంటుంది. గతంలో రోడ్డు అధ్వానంగా మారడంతో నిత్యం ఎవరో ఒకరు ప్రమాదాల బారిన పడేవారు. రాత్రివేళల్లో కన్పించక చాలా మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అంతటి ప్రమాదకర రహదారిని గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యపై దృష్టి సారించి. రోడ్డు పనులకు మోక్షం కలిగించింది.

రహదారి పక్కన మట్టిని తొలగిస్తున్న యంత్రం

● కడప నుంచి రేణిగుంట వరకు నూతన రోడ్డు పనులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం రూ. 70 కోట్లు విడుదల చేసింది. మొదటి విడతగా కోడూరు నుంచి రేణిగుంట వరకు పనులు చేశారు. రెండో విడతగా రాజంపేట నుంచి కడప వరకు రోడ్డు అభివృద్ధి పనులు చేస్తున్నారు. దాంతో రాజంపేట పట్టణ పరిధిలో గత నాలుగు రోజులుగా పనులు చేస్తున్నారు. పనులు పూర్తి అయితే కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ప్రమాదాలు తగ్గుముఖం పడనున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

పశు సంపద సంరక్షణకు కృషి

శిబిరంలో పాల్గొన్న పశువైద్య కళాశాల విద్యార్థులు. చిత్రంలో అధ్యాపకులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాల విద్యార్థులు గురువారం దేవగుడిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని పశుసంవర్ధక సహాయక సంచాలకుడు డాక్టరు శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు పరీక్షలు నిర్వహించారు. పశుసంపద సంరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి ఇందిరా, అధ్యాపకులు సుధాకర్, జాన్ సుధాకర్, భార్గవి, వంశీ, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సోదరులకు ఇఫ్తార్ విందు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం గురువారం మొదలైంది. మొదటి రోజు ఉపవాస దీక్ష పాటించిన ముస్లింలకు మెయిన్ బజారులోని జామియా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని పీఠాధిపతి సయ్యద్ సాదిక్‌పాషా ఖాద్రి తెలిపారు. నయీమ్ పాషా ఖాద్రి, గౌస్‌పాషా ఖాద్రి, షామీర్‌బాషా, హఫీజ్, బాబుల్‌ఖాన్, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

వంతెన నిర్మించాలని వినతి

చాపాడు, న్యూస్‌టుడే: విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా కేతవరం పొలాల వద్ద రహదారి మూసివేయకుండా వంతెన నిర్మించాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టరు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైతులతో కలిసి తహసీల్దారు రమాకుమారికి వినతిపత్రం ఇచ్చారు. భాజపా మండలశాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తెదేపా నాయకుడు నారపురెడ్డి పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి.సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపుల్లయ్య ఆధ్వర్యంలో రహదారి నిర్మాణ పనుల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

తహసీల్దారు రమాకుమారికి వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, రైతులు

మహిళా శక్తి.. వ్యాపార యుక్తి

ముద్దనూరు, న్యూస్‌టుడే: అతివలు స్వయం ఉపాధితో ముందడుగు వేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నారు. ఇంటి వద్దే దుకాణాలు నిర్వహిస్తూ ఆదాయం పొందుతున్న ముద్దనూరు, ఓబులాపురం, బొందలకుంట గ్రామాలకు చెందిన మహిళలపై న్యూస్‌టుడే కథనం.

నెలకు రూ.25 వేలు ఆదాయం

ముద్దనూరు మండలం బొందలకుంటకు చెందిన ఆదిలక్ష్మి సాయిబాబా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. రూ.2 లక్షలు రుణం తీసుకుని ముద్దనూరులో హోటల్ నడుపుతున్నారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.25 వేల వరకు ఆదాయం వస్తోంది. మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు.

భర్త సహకారంతో..

ముద్దనూరులోని నాలుగు రోడ్ల సమీపంలో వివాహాది కార్యక్రమాలకు సంబంధించి కుర్చీలు, లైట్లు, వంట సామగ్రిని రోజువారీ అద్దెకు ఇస్తుంటారు. పీఎంఈజీపీ ద్వారా రూ.10 లక్షలు, డ్వాక్రా సంఘం ద్వారా రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. భర్త సహకారంతో వ్యాపారం నిర్వహిస్తూ సగటున నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు లేకుండా..

ముద్దనూరుకు చెందిన జ్యోతి రూ.రెండు లక్షలు సంఘం ద్వారా రుణం తీసుకున్నారు. దీంతో ఫ్యాన్సీస్టోర్, కుట్టు మిషన్ నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నారు. మరో ఇద్దరి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఖర్చులు పోనూ నెలకు రూ.30వేల వరకు ఆర్జిస్తున్నారు.

పిల్లల చదువుకు ఉపయుక్తం

ఓబులాపురానికి చెందిన లక్ష్మి ఎనిమిదేళ్లుగా డ్వాక్రా సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం రూ.2 లక్షలు తీసుకుని గ్రామంలోనే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఖర్చులు పోనూ నెలకు రూ.12 వేల వరకు వస్తోంది. దీంతో పిల్లలను చదివించడంతో పాటు కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు.

ట్యాంకులు శిథిలం.. నీటి సరఫరా ప్రశ్నార్థకం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక పరిధిలో ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. పట్టణంలో ప్రస్తుతం 13 ట్యాంకులున్నాయి. ఇందులో 50 ఏళ్ల కిందట నిర్మించిన 3 నీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో తాగునీటి సరఫరా ప్రశ్నార్థకమవుతోంది.

● వైఎంఆర్‌కాలనీలో ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంకు శుభ్రం చేసేందుకు కార్మికులు పైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన తాపలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల కిందట 15వ ఆర్థిక సంఘం నిధులతో టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రస్తుతం అర్ధ భాగం నీటిని నిల్వ చేసి సరఫరా చేస్తున్నారు. అధికంగా నిల్వ చేస్తే నీరంతా కారుతోంది.

● రామేశ్వరం, ఏబీఎంహెచ్ మైదానంలో ఉన్న ట్యాంకుల కడ్డీలు దర్శనమిస్తున్నాయి. వీటి స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాలని గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాగునీటి గొట్టాల మార్పుతో పాటు మూడు ట్యాంకుల నిర్మాణాలకు రూ.119 కోట్లు ప్రతిపాదనలు చేశారు. 20 శాతం పనులు జరగలేదని కూటమి ప్రభుత్వం వీటిని రద్దు చేసింది. ప్రస్తుతం రూ.149 కోట్లతో ప్రతిపాదనలను పురపాలక అధికారులు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి అందచేశారు. ఈ మూడు ట్యాంకుల నిర్మాణాలతో పాటు పట్టణ శివారులో ఉన్న గోకుల్‌నగర్ ప్రాంత వాసులకు నీటి పంపిణీ సమస్య లేకుండా ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.

● వచ్చే వేసవి కాలంలో ఓవర్ హెడ్‌ట్యాంకుల ద్వారా నీటిని నిల్వ చేసి సరఫరా చేస్తే పురపాలక పరిధిలో ఉన్న చివరి వీధుల్లోని గృహాలకు నీరు చేరుతుంది. ట్యాంకులు లేకపోతే ప్రజలకు నీరందించలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.

● పురపాలక తాగునీటి విభాగ ఏఈ సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ మూడు నీటి ట్యాంకులకు రూ.60 లక్షల నిధులతో మరమ్మతులకు ఆమోదం తెలిపేందుకు వచ్చే కౌన్సిల్ అజెండాలో ఈ అంశాన్ని చేర్చామన్నారు.

రామేశ్వరం ఓవర్ హెడ్ ట్యాంకు దెబ్బతినడంతో కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

ఇంటి పన్ను వసూలు వేగవంతం

ముద్దనూరు, న్యూస్‌టుడే: ఇంటి, నీటి పన్నుల వసూలును వేగవంతం చేయాలని డీఎల్‌పీవో నూర్జహాన్ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. గురువారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ నెల 28వ తేదీలోపు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

? : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు - నాయబ్ రసూల్, ఖాజీపేట

☑ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంతంలో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - విజయ రాణి, మండల వైద్య అధికారి

? : ఖాజీపేటలోని కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. - తేజకుమార్, స్థానికుడు

☑ : చెత్త నిల్వలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

? : కొర్రపాడురోడ్డులోని పురపాలకసంఘం పెట్రోల్ బంకులో గాలి మిషన్ మరమ్మతులకు గురైంది. - రవిశంకర్, ప్రొద్దుటూరు

☑ : గాలిమిషన్‌కు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - విజయ్‌బాబు, పురపాలక ఉద్యోగి

? : తితిదే కల్యాణమండపం సమీపంలో మురుగు కాలువ పూర్తిగా పూడికతో నిండింది. - వెంకటసుబ్బయ్య, వ్యాపారుడు

☑ : పూడికతీతకు చర్యలు తీసుకుంటాం.

? : పట్టణంలోని ఎస్‌బీఐ చర్చి ముందు ఉన్న మురుగు కాలువ పూడికతో నిండుకుంది. - సలీం, స్థానికుడు

☑ : కాలువలో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం.

(పై రెండు సమస్యలకు పారిశుద్ధ్య అధికారి జి.ప్రసాద్ సమాధానమిచ్చారు)

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

స్పందించారు.. పరిష్కరించారు

● ప్రొద్దుటూరు కోనేటి కాలువ వీధిలో చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఇక్కడి సమస్యపై ఈ నెల 19న 'చెత్త. . తొలగించక అవస్థ' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ఎల్ఈడీ లైట్ అమర్చితే జరిమానా: ప్రొద్దుటూరు వైద్యం: వాహనాలకు వచ్చిన హెడ్‌లైట్లను మార్చి ఎల్ఈడీ లైట్లు అమర్చితే జరిమానాలు విధిస్తామని ఆర్టీవో మనీష హెచ్చరించారు. ఈ మేరకు గురువారం మాట్లాడుతూ అధిక లైటింగ్‌తో ఎదురుగా వచ్చే వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో నిషేధం విధించినట్లు తెలిపారు.

కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ: ప్రొద్దుటూరు విద్య, మైదుకూరు: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రొద్దుటూరు పాలిటెక్నిక్, మైదుకూరు డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాళ్లు గురుమూర్తి, నారాయణరెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువత అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం: ప్రొద్దుటూరు పట్టణం: హనుమానగర్‌కు చెందిన చేనేత కార్మికురాలు చెన్నా లక్ష్మీశాంతి అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి తెదేపా 39వ వార్డు ఇన్‌ఛార్జి సిద్ధయ్య రూ.10 వేలు నగదును అందజేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు: మైలవరం, కొండాపురం: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కొండాపురం, ఎంఈవోలు ఓబులేసు, రామయ్య, మైలవరం ఎంఈవో-2 చిట్టిబాబు పేర్కొన్నారు. మార్చి 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉల్లాస్ ప్రచార సామగ్రి ఆవిష్కరణ: మైదుకూరు: వయోజనులను అక్షరాస్యులుగా మార్చడమే ఉల్లాస్ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. డిప్యూటీ డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి, ఎంపీడీవో నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి: కొండాపురం: ఏపీటీయూఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు గంగాసురేష్, రాంప్రసాద్ కోరారు. కడపలో 22వ తేదీ జరిగే బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.

సాహితీ సమావేశం 21న: ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అనిబిసెంటు పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలోని గ్రంథాలయంలో సామాజిక పోకడలు రచయిత పాత్ర అనే సాహితీ సదస్సు ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు సాహితీమిత్రులు తెలిపారు. సాహితీ అభిమానులు హాజరుకావాలన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ప్రొద్దుటూరులో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

ఎర్రగుంట్లలో అంజలి ఘటిస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు పట్టణం, విద్య, మైదుకూరు, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల వ్యాప్తంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకుని ధర్మం, దేశం కోసం ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాజపా, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, జనవిజ్ఞానవేదిక నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరులో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరులో శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాలిన చెట్టు.. కూలితే ముప్పు

మైదుకూరు పట్టణం బద్వేలురోడ్డులోని విలియమ్స్‌నగర్ వద్ద రహదారి పక్కన ఎండిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. చెట్టుకొమ్మలు విరిగినా.. కూలినా రహదారిపై ప్రయాణించేవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఎండిన చెట్టు తొలగించేందుకు రహదారి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

ప్లాస్టిక్ నిషేధం.. కాగితాలకే పరిమితం

జమ్మలమడుగులో కొన్ని కాలువలు చిన్నవిగా ఉండడంతో మురుగు సక్రమంగా పారడం లేదు. పలగాడి వీధిలో సాయిరాం థియేటర్ వద్ద కాలువ ప్లాస్టిక్‌తో నిండుకుంది. దుర్వాసన, దోమలతో భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించడంతో అవి కాలువల్లో ఇరుక్కుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

చోదకా.. రోడ్డు కుంగింది జాగ్రత్త

ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డు కుంగిపోయింది. గుంత ఏర్పడటంతో ముప్పు పొంచి ఉంది. గుంతను గుర్తించకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ తారుమిశ్రమంతో గుంత పూడ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

బోర్డులు సరే.. వివరాలేవీ

హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారిపై మైదుకూరు మండలం బసవాపురం టోల్‌గేట్ వద్ద వాహనాల టోల్ ధరకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేసినా అందులో వివరాలు నింపలేదు. ఏ వాహనానికి ఎంత వసూలు చేస్తారు? ఒకసారిపోవడానికి అయితే ఎంత? 24గంటల్లో తిరిగొస్తే ఎంత? నెలవారీ పాస్ సింగిల్ ట్రిప్ ఎంత అనే వివరాలను నింపాల్సి ఉన్నా బోర్డులోని గడులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. - న్యూస్‌టుడే, మైదుకూరు

ఈ ప్రయాణం ప్రమాదకరం

ప్రతి రోజూ ఏదొక చోట ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారులు, ప్రయాణికుల్లో మార్పు రాలేదు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు.. సామగ్రి తరలిస్తున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ముద్దనూరు-కడప రహదారిపై ట్రాక్టర్‌పై కూలీలు ప్రయాణిస్తున్న చిత్రాన్ని న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, ముద్దనూరు

సృజనకు పదును.. మెదడుకు మేత

జిరాఫీ చెస్‌లో శిక్షణకు బాలబాలికల ఆసక్తి

శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సాధారణంగా చదరంగంలో 64 గడులు ఉంటాయి. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేస్తుంటారు. ఇందులో గెలుపు, ఓటమి, డ్రా అయ్యే అవకాశం ఉంటుంది. కానీ జిరాఫీ చెస్‌లో క్రీడాకారులు గెలుపు లేదా ఓటమి చెందే అవకాశం మాత్రమే ఉంది. డ్రా అయ్యే అవకాశం లేదు. ఇందులో 68 గళ్లు ఉంటాయి. ● ప్రొద్దుటూరులో 2012 సంవత్సరంలో భాగ్యశ్రీ, సాయికిరణ్ రెడ్డి అనే చిన్నారులు జిరాఫీ చెస్‌ను ఆవిష్కరించారు. 2018లో ఇంటర్నేషనల్ జిరాఫీ చెస్ ఫెడరేషన్ (ఐజీసీఎఫ్) అకాడమీని శైలజ ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు గీతాశ్రమంలో ప్రతి ఆదివారం ఉచితంగా జిరాఫీ చెస్‌పై శిక్షణ, పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు పెద్దఎత్తున పిల్లలు హాజరవుతున్నారు. 25 పాయింట్లకు లిటిల్ స్కాలర్, 50 పాయింట్లకు యంగ్ స్కాలర్, 100 పాయింట్లు బెస్ట్ స్కాలర్, 500 పాయింట్లు సాధిస్తే సూపర్ స్కాలర్‌గా జ్ఞాపికలను అందజేసి పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

జ్ఞాపకశక్తి పెరుగుతోంది

గత మూడేళ్ల నుంచి జిరాఫీ చెస్‌లో శిక్షణ తీసుకోవడంతో చదువులో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతోంది. 550 పాయింట్లతో సూపర్ స్కాలర్ అందుకున్నాను. - జయభార్గవ్‌రెడ్డి

బెస్ట్ స్కాలర్ అందుకున్నా

ఖాదరాబాదు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. జిరాఫీ చెస్‌పై ఆసక్తితో శిక్షణ తీసుకుంటున్నాను. చదువులో జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెంచుకోవడానికి ఉపయోగకరంగా ఉంది. బెస్ట్ స్కాలర్ అందుకున్నాను. - గౌతమి ఈశ్వర్, ఖాదరాబాదు

ఏకాగ్రత అవసరం

జిరాఫీ చెస్‌లో పావులను చిత్తుచేయాలంటే మెదడుకు పదును పెట్టాలి. వివిధ రకాల పావులను తొలగించుకుంటూ విజేతగా రాణించాలి. ఏకాగ్రత ఉంటేనే సాధ్యపడుతుంది. - బివి సిరి, విజయనగరంవీధి

ఉత్సాహం నింపుతోంది

సమయ స్ఫూర్తి, తెలివితేటలతో జిరాఫీ చదరంగంలో విజయం సాధించడానికి కష్టపడాల్సి ఉంటుంది. పావులను చిత్తు చేసి గెలవడం ద్వారా ఉత్సాహం నింపుతోంది. - వీవీఎన్ గీతిక, గీతాశ్రమవీధి

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

దువ్వూరు: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడిన ఘటన గురువారం దువ్వూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో జరిగింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన హనుమంతు, శివపార్వతి, మధులు కడపకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆటో ఢీకొంది. వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మైదుకూరు : జీవీసత్రంలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రతాప్ అనే వ్యక్తి గాయపడ్డారు. ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సాయినాథపురం వాసి అదృశ్యంపై ఫిర్యాదు

మైదుకూరు: సాయినాథపురానికి చెందిన చలమచర్ల చంద్రశేఖర్ రెడ్డి అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త బుధవారం నుంచి కనిపించలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

మైదుకూరు, న్యూస్‌టుడే : దళిత యువకుల మృతిపై న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ తెలిపారు.

దువ్వూరు: యువకుల మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డి.రామకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దివ్యాంగ క్రీడాకారుడికి సత్కారం

ప్రొద్దుటూరు గ్రామీణ, విద్య, న్యూస్‌టుడే: వివిధ రకాల క్రీడా పోటీల్లో నైపుణ్యం, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న దివ్యాంగ క్రీడాకారులకు అండగా ఉంటామని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడు డాక్టరు వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నందలూరుకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు శివకోటి ఏపీ వాలీబాల్ జట్టుకు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక హోమస్‌పేటలోని ఆసుపత్రిలో శివకోటికి రూ.5 వేలు నగదు అందజేశారు. అనంతరం సత్కరించారు. నాయకులు చలపతిరావు, చంద్రబాబు, ఖాదర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

శివకోటిని సన్మానిస్తున్న నాయకులు

manipalhospitals
LIFE'S ON
మణిపాల్ హాస్పిటల్స్, మిల్లర్స్ రోడ్, బెంగుళూరు వారి ప్రముఖ న్యూరో సర్జన్ని ఇప్పుడు మన ప్రొద్దుటూరు పట్టణం నందు సంప్రదించగలరు.
మెదడు మరియు వెన్నముక క్లినిక్
Dr కార్తీక్‌రెడ్డి MNV
Associate Consultant - Neuro Surgery
DrNB-Manipal Hospitals, Bangalore | Fellow in Neuroendoscopy
Fellow in Endoscopic Spine Surgery - S Korea | Fellow in Pain Medicine (FIPM), MBBS - Kurnool Medical College, Kurnool
స్థలం: శ్రేయన్ హాస్పిటల్
3/1380-90, చౌడమ్మ దేవాలయం వీధి, హోమస్ పేట, ప్రొద్దుటూరు - 516361
తేది: 21-02-2026, శనివారము, సమయం: మధ్యాహ్నం 3 PM నుండి 8 PM వరకు
మీరు క్రింద పేర్కొన్న లక్షణాలతో బాధపడుతున్నారా?
• తీవ్రమైన మెడ మరియు వెన్నునొప్పి • చేతులు మరియు కాళ్ళకు వ్యాపించే నొప్పి
• చేతులు మరియు కాళ్ళలో బలహీనత • చేతులు లేదా కాళ్ళలో తిమ్మిరి
• నడకలో ఇబ్బంది లేదా అసమతుల్యత • తరచుగా మూత్ర విసర్జన • మూర్ఛ
• మెదడులో కణితులు • పక్షవాతం • స్ట్రోక్ • మెదడులో రక్తం గడ్డకట్టడం • మెదడు క్యాన్సర్
అపాయింట్‌మెంట్‌ల కోసం సంప్రదించండి : +91 9063501404
నృసింహ శేఖర్ ఎ.వి. - 9980527425
గమనిక: 22-02-2026 తేదీన ఆదివారం ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఆంధ్ర పాఠశాల ఎదురుగా, శంకరాపురం, కడపలో ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు అందుబాటులో ఉంటారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

50 ఏళ్ల తర్వాత సమావేశమైన పూర్వ విద్యార్థులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగులోని పీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గండికోటలో గురువారం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 40 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పీఆర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి గ్రంథాలయానికి రూ.30 వేల విలువైన బుక్ ర్యాక్, కుర్చీలు, టేబుల్‌ను హెచ్ఎం శశికళకు అందజేశారు. కార్యక్రమంలో పల్లా తిరుపతయ్య, సీవీ సుబ్బయ్య, దివాకర, దత్తు, నరహరి, అజయ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఫీజు బకాయిల విడుదలకు డిమాండ్

కడప విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.6,400 కోట్లు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు శాపంగా మారిన జీవో నం:77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 4,200 పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నాయకులు వసుంధర, హర్షిణి, ఖ్యాతిని, రాణి, భార్గవి, అర్చన, జెస్సికా, మనోజ్, మహేష్, అఖిల్, మన్సూర్, సలీం, భాస్కర్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కడప: 8008573428, 8074174832
పులివెందుల : 9885193208
కమలాపురం : 8008573475

?: పులివెందులలోని యర్రగుడిపల్లెలో వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.
- సురేష్‌బాబు, యర్రగడిపల్లె, పులివెందుల

✓: సిబ్బందిని పంపించి పరిష్కరిస్తాం.
- మునికుమార్, పురపాలక కమిషనర్

– న్యూస్‌టుడే, పులివెందుల

గుంత పూడ్చివేత

పులివెందుల, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో రింగ్‌రోడ్డు వద్ద ఏర్పడిన గుంతను అధికారులు గురువారం పూడ్చివేశారు. రహదారిలో గుంత..ప్రయాణికులకు చింత అన్న శీర్షికన 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రహదారులు, భవనాల శాఖ అధికారులు ఆ గుంతను పూడ్చివేశారు. దీంతో ప్రయాణికులు ఆ మార్గంలో సజావుగా ప్రయాణిస్తున్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

విద్యార్థులారా.. విజయోస్తు

పులివెందుల, న్యూస్‌టుడే: పది పరీక్షలు బాగా రాసి ప్రతిభ చాటాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీ పాటలకు, భక్తి గీతాలకు విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ఆక్రమణ.. రాకపోకలకు యాతన

కో ఆపరేటివ్ కాలనీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

రోడ్డును ఆక్రమించి నిర్మించిన ర్యాంపు

కడప నగరపాలక.. న్యూస్‌టుడే : కడప నగరంలో కోఆపరేటివ్ కాలనీ.. దశాబ్దాల క్రితమే అప్రూవ్డ్ లే అవుట్‌గా వెలిసింది. దాదాపు 50 ఏళ్ల క్రితమే ఇక్కడ మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రోడ్లు, కాలువలు, పార్కులు ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలకు స్థలం కేటాయించారు. దీని ప్రకారం ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. కానీ కొన్ని సంవత్సరాల నుంచి రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. నిర్మాణదారులు రోడ్డుకంటే నాలుగైదు అడుగుల ఎత్తులో నివాస, నివాసేతర భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రాకపోకలు సాగించడానికి నిర్మాణం నుంచి రోడ్డులో 5 నుంచి 8 అడుగుల వరకు ఆక్రమిస్తూ భారీ ర్యాంపులు కడుతున్నారు. దీంతో రోడ్డు వెడల్పు తగ్గిపోతూ వస్తోంది. రోడ్డు అంచుల వెంబడి వెలుస్తున్న దుకాణాల వల్ల కొంత మేర రోడ్డు ఆక్రమణలకు గురవుతోంది. ఈ నేపథ్యంలో కో ఆపరేటివ్ కాలనీ రోడ్డు నం:1లో సాయంత్రం, ఉదయం వేళల్లో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో కో ఆపరేటివ్ కాలనీ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డంగా కడతాం.. ఎవరికి ఇబ్బందైతే మాకేం!

కడప నగరంలో కొందరు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారుల నుంచి అనుమతులు పొందాం.. అడ్డంగా ఫ్లెక్సీలు కడతాం.. ఎవరికి ఇబ్బందైతే మాకేంటి అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బంది కలిగేలా ఇష్టానుసారంగా వాటిని ఏర్పాటు చేస్తున్నారు. కడప రాజీవ్‌పార్క్ ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌కు అడ్డంగా ఓ ఫ్లెక్సీని కట్టారు. ఫుట్‌పాత్ నడిచేందుకు ఆస్కారం లేకుండా ఏర్పాటు చేయడంపై పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అడ్డంగా వాటిని కట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. ఇబ్బందిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు

తెగిన తీగ.. చుట్టుకుంటే గాయాలే

కడప నగరంలోని ఏడు రోడ్ల వద్ద ఫైబర్ తీగలు తెగిరోడ్డుపై వేలాడుతున్నాయి. తీగలు నల్లరంగులో ఉండటంతో కనిపించక వాహన చోదకులకు తగులుతున్నాయి. ఈ మధ్య కాలంలోనే వాహనాల్లో వెళ్తున్న వారి మెడకు ఫైబర్ తీగ చుట్టుకుని మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కడ పనగరంలోను సైకిల్‌పై వెళ్తున్న యువకుడికి తీగలు తాకి షాక్‌తో మృత్యువాత పడ్డారు. అధికారులు మేలుకొని ఎప్పటికప్పుడు ఈ తీగలపై అప్రమత్తంగా ఉండి ఫైబర్ సంస్థలను హెచ్చరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. – ఈనాడు, కడప.

రోడ్డు మధ్య గొయ్యి.. అధికారులకు కనపడదోయి

కడప నగరంలోని పాత బస్టాండుకు సమీపాన రోడ్డు మధ్యలో గుంతలు పడ్డాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దాదాపు 500 వందల మీటర్ల వరకు రోడ్డు ధ్వంసమై చోదకులు రాకపోకలు సాగించలేని విధంగా రూపు మారింది. గుంతల కారణంగా పాత బస్టాండుకు చేరుకునే బస్సులు వేగ నియంత్రణతో వెళ్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి గోతులు పూడ్చించాలని చోదకులు కోరుతున్నారు. – ఈనాడు, కడప

పచ్చటి పార్క్‌ను ఇలా వదిలేశారేమిటి..?!

కడప నగరపాలక, న్యూస్‌టుడే : 'రూ.30 కోట్లు చెత్తలో పోసినట్లేనా..?' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి నగరపాలక యంత్రాంగం స్పందించింది. మేయర్ పాకా సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు ఎకో పార్క్‌ను పరిశీలించారు. డ్రోన్ కెమెరా ద్వారా 11 ఎకరాల విస్తీర్ణంలోని ప్రతి భాగాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో చిత్రీకరించిన పచ్చటి పార్క్ దాని పరిసరాల చిత్రాలు కనువిందు చేశాయి. మనకు తెలియకుండా మనకు దగ్గరలో ఇలాంటి ఉద్యానవనం ఉందా అని అధికారులు ఆశ్చర్యపోయారు. కంపోస్టుయార్డు - ఎకోపార్క్‌గా మారిన క్రమంలో దీనికి సంబంధించిన ఫైలు ఇప్పటికీ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో మేయర్ పాకా సురేష్ రెండు వారాల్లో ఎకో పార్క్‌ను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, వెలగని దీపాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ఉక్కాయపల్లి కంపోస్టుయార్డులో ఏర్పాటు చేసిన పార్క్ ఏరియల్ వ్యూ

ఘనంగా గంగమ్మ జాతర

అలంకరణలో గంగమ్మ

మారుతీనగర్, కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : చింతకొమ్మదిన్నె మండలంలోని కొత్తపేట గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం జాతర వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేశారు. జాతర సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఏఐతో మానవ విలువల సమన్వయం అవసరం

కడప విద్య : ఏఐ అభివృద్ధిలో సానుభూతి, బాధ్యత, న్యాయం, నైతికత వంటి మానవ విలువలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల (అటానమస్)లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధస్సు వర్సెస్ మానవ విలువలు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో వక్తలు మాట్లాడారు. ఏఐ వ్యవస్థలు వేగంగా డేటాను విశ్లేషించి కచ్చితమైన అంచనాలు ఇవ్వగలిగినా అవి మానవులకు ఉన్న భావోద్వేగ మేధస్సు, నైతిక నిర్ణయ సామర్థ్యం వంటి లక్షణాలు కలిగి ఉండవన్నారు. ఏఐ వినియోగంలో మానవ విలువలు, నైతికతను పరిగణనలోకి తీసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్, రిటైర్డ్ సీఎస్ఈ శ్వేతశ్రీ గురుమోహన్, వైవీయూ సీఎస్ఈ డీన్, హెచ్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ రమేష్, విభాగ ఇన్‌ఛార్జి అనిత, డీటీటీ స్టార్ కోఆర్డినేటర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితిలో కడప వాసికి చోటు

మారుతీనగర్, న్యూస్‌టుడే: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలిగా కడప వాసి విజయలక్ష్మిని ఎన్నుకున్నారు. గురువారం కాకినాడలో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో రాష్ట్ర సమితి సభ్యులను ఎన్నుకున్నారు. 15 ఏళ్లుగా ఉద్యమాల్లో పని చేసినందుకు గుర్తింపుగా రాష్ట్ర సమితిలో చోటు లభించిందన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించండి

వేముల: చేపడుతున్న కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో గురువారం గంగాదేవి కోరారు. సర్వే అధికారులు ఇంటివద్దకు వచ్చినప్పుడు వారికి కుటుంబ వివరాలను తెలియజేయాలని చెప్పారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే చేపడుతున్నామన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ

చక్రాయపేట (వేంపల్లె): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేంపల్లె ఉప సర్పంచి శ్రీనివాసులును గురువారం రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ తులసిరెడ్డి పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సుబ్రహ్మణ్యం, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, సుబ్బారెడ్డి ఉన్నారు.

సమాచారం ఇవ్వకుండానే బస్సు మార్చేస్తే ఎలా

కడప చిన్నచౌకు: కడప నుంచి బెంగళూరుకు ముందస్తుగా టికెట్టు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే బుధవారం రాత్రి 11 గంటల సమయంలో బస్సు మార్చేశారు. దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. ఎలా మార్చారంటూ వారు విచారణ కేంద్రం సిబ్బందిని ప్రశ్నించారు. డ్రైవర్ రాకపోవడంతో ఇంద్ర బస్సు స్థానంలో అమరావతి బస్సు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్, ఇతర సభ్యులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే హక్కులు రక్షించుకునే వెసులుబాటు ఉంటుందని వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబు స్పష్టం చేశారు. గురువారం కడపలోని జేఎంజే కళాశాలలో వినియోగదారుల చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మనం కొనే ప్రతి వస్తువుకు కచ్చితంగా రసీదు తీసుకున్నప్పుడే చట్టాలు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. తినే ప్రతి వస్తువుపైనా తయారీ, నిర్దేశించిన గడువు తేదీలు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ రోశ్రాని, ఆ కమిషన్ ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, సుబ్బారావు, రాధాకృష్ణ, చలపతి, బాబు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై ఉపకులపతికి ఫిర్యాదు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరుతూ గురువారం వైవీయూలో ఉపకులపతి రాజశేఖర్‌కు ఆల్ ఇండియా బంజారా విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని, బోధించేందుకు అధ్యాపకులు, విద్యార్థులు కూడా లేనివి ఉన్నాయని జిల్లా ఛైర్మన్ జగన్‌రాథోడ్ వివరించారు. కనీసం తరగతులు నిర్వహించకుండా వేలాది రూపాయలు తీసుకుని పరీక్షలు రాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నందకిశోర్, హుసేన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగాల నియంత్రణ అవసరం

కడప విద్య : విద్యార్థులు భావోద్వేగాలను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందని కడప కోటిరెడ్డి (ఎస్‌కేఆర్, ఎస్‌కేఆర్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, మానసిక వైద్యుడు వెంకట్రాముడు అన్నారు. గురువారం స్థానిక కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యం, సమస్యలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మనిషికి అవసరమన్నారు. యువత ఒత్తిడి మూలంగా అనేక వ్యసనాలకు బానిసవుతున్నారన్నారు. సమస్య చిన్నగా ఉన్నప్పుడే సరైన వైద్యం చేయించుకోవాలన్నారు.

మానసిక వైద్యుడు వెంకట్రాముడును సన్మానిస్తున్న అధ్యాపకులు

దాతల చేయూత

లింగాల : పార్నపల్లె ప్రభుత్వ పాఠశాలకు తెదేపా నాయకుడు జొన్నలగడ్డ ధనుంజయనాయుడు రూ.60 వేలు విలువైన టెన్నిస్ బోర్డును పాఠశాల పీఈటీ విక్టర్‌కు గురువారం అందజేశారు. దాతలను ఎంఈవోలు విశ్వనాథరెడ్డి, రామభ్రయ్య అభినందించారు.

పులివెందుల : స్థానిక బాలికోన్నత పాఠశాలకు దాతలు యశ్వంత్, దీపలు కంప్యూటర్‌కు సంబంధించిన రూ.13,000 విలువ చేసే ప్రింటర్‌ను వితరణగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఉపాధ్యాయులు రామాంజనేయులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పెంపునకు వినతి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో వేరుసెనగ కొనుగోలు కేంద్రాలు పెంచాలని ఏపీ రైతు సంఘం నాయకుడు దస్తగిరిరెడ్డి కోరారు. గురువారం మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి పరిమళజ్యోతికి ఆయన వినతి పత్రం అందచేశారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో పంట సాగు చేశారని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సూచించిన ఆరు కేంద్రాలు సరిపోవని, 15 కేంద్రాలైనా ఏర్పాటు చేయాలని కోరారు. బహిరంగ మార్కెట్‌కు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు వందల్లోనే తేడా ఉందన్నారు. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాళ్లకు రూ.5,850కు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బోనస్ రూ.2,250 కలిపి క్వింటాళ్లు రూ.8 వేలతో కొనుగోలు చేయాలని విన్నవించారు.

పంచాయతీలు అభివృద్ధి చేయండి

కమలాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఒక రోజు వర్చువల్ రివ్యూ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో ఉన్న వనరులను గుర్తించాలన్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో చెత్తను సేకరించి వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సకాలంలో ఇళ్లు, నీటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఎంపీడీవో కిజియా, డిప్యూటీ ఎంపీడీవోలు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ స్థలం చర్మ కార్మికులకు ఇప్పించాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరం బాలాజీనగర్‌లో చర్మ కార్మికుల కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని.. ఆ స్థలాన్ని తిరిగి చర్మ కార్మికులకే కేటాయించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు బాలాజీనగర్‌లో వారికి కేటాయించిన స్థలం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎన్.రాజా, దళిత భూసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓబులపతి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడారు. ఆ స్థలాన్ని అప్పగించకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు కనకరాజు, నరసయ్య, శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే: నేటి తరానికి ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు. గురువారం కళాశాలలో శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, మల్లీశ్వరమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

పులివెందుల : కేకు కోస్తున్న నాయకులు

పులివెందుల: విదేశీ దండయాత్రల నుంచి హిందూ ధర్మాన్ని, పరిరక్షించిన గొప్ప మహానుభావుడు ఛత్రపతి శివాజీ అని పులివెందుల హిందూ జేఏసీ నాయకులు అన్నారు. గురువారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హిందూ జేఏసీ నాయకులంతా కలిసి కేక్‌ను కోసి అందరికీ పంచిపెట్టారు. ఆయన భారత దేశం కోసం చేసిన పోరాటాలు, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, మురళీ, నాగచైతన్య, హిందూ జేఏసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..

స్థానిక దర్గా నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకు పోయి అధ్వానంగా మారింది. పరిసర ప్రాంతం అంతటా దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ ఉన్న వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించడం లేదు. ప్రధాన రహదారుల్లో చెత్త తొలగిస్తుండగా.. ఇలాంటి అంతర్గత ప్రదేశాల్లోకి సిబ్బంది రావడంలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రతి రోజూ చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కమలాపురం

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా.. బంగాళదుంప-40, క్యాబేజి-30, క్యారెట్-40, బీన్స్-60, బీట్‌రూట్-35, కీర-40, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-30, అల్లం-90, క్యాలీఫ్లవర్-25, క్యాప్సికం-60, టమాట-15, మిరపకాయలు 45, వంకాయలు-20, బెండకాయలు-35, బీర-40, కాకర-40, మటిక్కాయ-40, చిక్కుడు-35, అలసందకాయలు-30, అనపకాయలు-40, ఉల్లిపాయలు-25.

బాలిక అదృశ్యం

పులివెందుల, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బాలిక (17) అదృశ్యమైనట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. పోలీసుల వివరాలు.. ఉదయం బాలిక చెప్ప కుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించారు. కుమార్తె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన బాలుడు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో రెండో అంతస్తుపై నుంచి మూడేళ్ల బాలుడు కింద పడి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. కడప శంకరాపురానికి చెందిన గోపాలకృష్ణ, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరు రెండో అంతస్తులో ఉంటున్నారు. ఈ నెల 14న సిద్దార్థ్ (3) వరండాలో ఆటాడుకుంటుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. తీవ్రగాయాలైన సిద్దార్థ్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప తాలూకా ఠాణా పరిధిలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 60 ఏళ్లు ఉంటాయి. కడప అంబాభవానీ గుడి సమీపంలో యాచిస్తుండే వాడని పోలీసులు తెలిపారు. మృతుడు అనాథ కావడంతో మృతదేహాన్ని పరమాత్మసేవా సంస్థ వారికి అప్పగించడంతో వారు అంత్యక్రియలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని వారికి సూచించారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: KADAPA
I.A. No. 2211 of 2024 in Review Petition No. of 2023
in I.A. No. 426 of 2013 in O.S.No.30 of 2004

Between:
1. Porumamirlla Munamma having died
2. Porumamirlla Sudharsan, Son of P.S.Chandra Mohan, Hindu, aged 43 years, resident of D.No.10/812, Jangam Yerikalappa Street, Kadapa City.
3. Porumamirlla Suneel Kumar Son of P.S. Chandra Mohan, Hindu, aged 49 years, resident of D.No.10/812, Jangam Yerikalappa Street, Kadapa City.
... Petitioners/Petitioners/Plaintiffs
And
3. P.S. Sreenivasulu Son of Subbanachari, aged about 50 years, Hindu, Business, 10/962, Jangam Yerikalappa Street, Kadapa. ... 3rd Respondent / 3rd Respondents / 3rd defendant

NOTICE TO THE 3 rd RESPONDENT / 3rd RESPONDENTS / 3 rd DEFENDANT

Please take notice that the petitioners / plaintiffs have filed the above I.A. to re-open the Review Petition which was closed on 22.01.2024 in the above Review Petition, hear and dispose the same according to law, stands posted to 03.03.2026 at 10.30 AM, either personally or through advocate, before the said court. If you fail to appear, on the above date, matter will be decided exparte.

// BY ORDER OF THE COURT //
Sri. M.SURESH KUMAR, M.A., B.L.,
Advocate for the Petitioners-Plaintiffs
Kadapa City, A.P. Cell. No. 8500271919.

వార్షిక బడ్జెట్‌కు స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం

కడప నగరపాలక, న్యూస్‌టుడే : కడప నగరపాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను గురువారం మేయర్ పాకా సురేష్ అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం మిగులు నిధులు, రెవెన్యూ వసూళ్లు, మూలధన జమలన్నీ కలిపి రూ.573.88 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. బడ్జెట్‌లో రెవెన్యూ, మూలధన ఖర్చులకు రూ.460 కోట్లు వ్యయపరచాలని అంచనాలు వేశారు. రూ.113.48 కోట్లు మిగులు ఉంటుందని లెక్కలు వేశారు. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు -సవరణలను సభ్యులు ఆమోదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.514 కోట్లు వస్తుందని అంచనా వేయగా దాన్ని రూ.282 కోట్లకు సవరించారు. రూ.447 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించగా ఆ మొత్తం రూ.175.75 కోట్లకు తగ్గింది. స్టాండింగ్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని కూడా ఇదే రోజున నిర్వహించి పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. నగరంలో కుక్కల నియంత్రణ, గోశాల నిర్వహణ, నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రాన్ని కళాకారులు లేదా ఇంటాక్ వారికి నిర్వహణ అప్పగించడం, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల ఏర్పాటు, ప్రకటనల బోర్డుల ఏర్పాటు, విద్యావాలంటీర్లకు వేతనాల చెల్లింపు తదితర అంశాలపై చర్చించారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, సిటీ ప్లానర్ శైలజ, వైద్యాధికారి రమేశ్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు అజ్మతుల్లా, మల్లికార్జున, నాగరత్నమ్మ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ పాకా సురేష్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, అధికారులు

నిబంధనలు పాటించని ఫార్మసీ కళాశాలలపై చర్యలేవి ?

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో నిబంధనలు పాటించని ఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేశు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గురువారం స్థానిక ఆర్ఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఫార్మసీ కౌన్సిల్ ఏటా ఫార్మసీ కళాశాలలను తనిఖీ చేసి అనుమతులు మంజూరు చేయాలన్నారు. అయితే కొన్నేళ్లుగా తనిఖీలు నిర్వహించడం లేదన్నారు. అడ్డదారిలో అనుమతులు పొందిన కళాశాల యాజమాన్యాలు కనీస మౌలిక సౌకర్యాలు, అధ్యాపకులు, ప్రయోగశాల తదితర సదుపాయాలు కల్పించకుండా నిర్వహిస్తుండటంతో ఫార్మసీ విద్య నాసిరకంగా మారి.. చివరకు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నాయకులు నాయకులు నరసింహ, వంశీ, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu